లోయలో మత్స్యగెడ్డ హొయలు

ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో మత్స్యగెడ్డ పరుగులు తీస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. వరద నీటితో ఉరకలెత్తుతోంది. చుట్టూ పచ్చని అటవీ ప్రాంతంలో, లోయల్లో మలుపులు తిరుగుతూ ప్రయాణిస్తున్న మత్స్యగెడ్డ దృశ్యమిది. **- న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు గ్రామీణం**

నీకు నేను.. నాకు నువ్వు!

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వసతితో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తోంది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో గిరిజన విద్యార్థులకు ప్రతినెలా పాఠశాలల్లోనే క్షవరం చేయించేవారు. వైకాపా ప్రభుత్వం దీన్ని నిలిపేసింది. కాస్మెటిక్స్ పంపిణీకి మంగళం పాడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పిల్లలకు క్షవరం చేయించడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో డుంబ్రిగుడలోని బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఒకరికొకరు ఇలా జుట్టు కత్తిరించుకుంటున్నారు. **– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే**

నాణ్యత కట్టుతప్పింది.. గోడ పట్టుతప్పింది!

అరకు వెళ్లే వాహనదారులకు ఘాట్‌రోడ్డులోని మలుపులే పెద్దపరీక్ష. అనంతగిరి మండలం టైడా సమీపంలో ఉన్న మలుపుల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలు ఢీకొని దెబ్బతిన్న రక్షణ గోడలను అధికారులు ఈమధ్యనే బాగు చేయిస్తున్నారు. ఇలా కట్టిన కొద్ది రోజుల్లోనే మళ్లీ వాహనాలు ఢీకొట్టడంతో రక్షణ గోడలు విరిగిపోతున్నాయి. ఎలాగూ విరిగిపోతాయనో.. ఏంటో నిర్మాణంలో నాణ్యత గాలికొదిలేశారు. ఇటీవల విరిగిపోయిన రక్షణ గోడను పరిశీలిస్తే ఇసుక, రాళ్లు, ఇసుక మాత్రమే కన్పిస్తున్నాయి. సిమెంట్ ఎక్కడుందో వెతుకుదామన్నా కనిపించడం లేదు. ఇంత నాసిరకంగా నిర్మిస్తే ద్విచక్రవాహనం కొట్టేసినా కూలిపోతాయి. మరి భారీ వాహనాలు పడిపోకుండా ఈ రక్షణ గోడలు ఎంతవరకు కాపాడతాయో అధికారులకే తెలియాలి.

– ఈనాడు, అరకులోయ

కుప్పకూలిన రక్షణ గోడ

మలుపులో నిర్మాణ పనులు

నవోదయ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరంలో నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశపరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా కొమ్మాది, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకలో చేరే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సంకల్ప బలం... మారుతోంది సమాజం!

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే: ఒకప్పుడు గంజాయి సాగు, రవాణాకు అల్లూరి జిల్లా చిరునామా అని చెడ్డ పేరు మూటగట్టుకుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం, ఉదాసీన వైఖరి కారణంగా గంజాయి సాగు, రవాణాకు ఈ ప్రాంతం అడ్డాగా ఉండేది. ఏ మూలకు వెళ్లినా గంజా తోటలే దర్శనమిస్తూ ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న చర్యలతో పరిస్థితుల్లో, ప్రజల్లో మార్పులు వస్తోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అధికారులు, పోలీసులు తీసుకున్న ప్రయోగాత్మక నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఒకప్పుడు గంజాయి వనాలతో దర్శనమిచ్చే గ్రామాలన్నీ ఇప్పుడు కాఫీ, మిరియాలు, రాజ్‌మా, సిల్వర్‌ఓక్, సపోటా, మామిడి, జామ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుతో కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం చైతన్యం-2025 పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో ఈనెల 11న పాడేరులో ఈ కార్యక్రమం ప్రారంభించారు.

మా గ్రామాల్లో గంజాయి సాగు లేదంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గిరిజన మహిళలు

ప్రభుత్వం తీసుకున్న చర్యలు

★ రూ.1000 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధాన రోడ్లు ★ 2 కోట్ల ఉద్యాన మొక్కల పంపిణీ ★ గంజాయి వ్యాపారులకు సంబంధించి రూ.3.73 కోట్ల విలువైన ఆస్తుల జప్తు ★ 13 వేల ఎకరాల్లో పండ్ల తోటల పంపిణీ ★ 1631 గ్రామాల్లో అవగాహన సదస్సుల నిర్వహణ ★ 325 కుటుంబాలకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం ★ లక్ష ఎకరాల్లో కాఫీ తోటల విస్తరణే లక్ష్యం

గంజాయిపై ఉక్కుపాదం

గిరిజన ప్రాంతం ప్రకృతి రమణీయతకు మారు పేరు. ఇలాంటి ప్రదేశంలో అమాయక గిరిజనులతో గంజాయి సాగు చేయిస్తారని తెలిసి చలించిపోయా. గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఇటీవల జిల్లా కేంద్ర కారాగారం సందర్శనకు వెళ్లినప్పుడు.. అక్కడ 900 మంది గంజాయి నిందితులు ఉండగా.. ఇందులో 700 మంది వరకూ గిరిజన పిల్లలే ఉండడం ఆశ్చర్యం కలిగించింది. ఈ ప్రాంతంలో గంజాయి సాగును నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. గంజాయి రహిత ప్రాంతంగా ఏజెన్సీని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 'చైతన్యం-2025' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.– **హోంమంత్రి వంగలపూడి అనిత**

యథావిధిగా సాగుబడి ?

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానానికి అనుబంధంగా కొనసాగుతున్న సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను రద్దుచేస్తూ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై అన్ని వర్గాల నుంచి ఒత్తిడి వచ్చింది. తాజాగా కలెక్టర్ దినేష్‌కుమార్ దీనిపై ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి, రిజిస్ట్రార్‌లకు లేఖలు రాశారు. అల్లూరి జిల్లా మొత్తాన్ని పూర్తిగా సేంద్రియ వ్యవసాయ జిల్లాగా మారుస్తున్న తరుణంలో.. చింతపల్లిలో సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను రద్దు చేయవద్దని కోరారు. కళాశాల రద్దును వెనక్కు తీసుకుంటూ రెండు, మూడు రోజుల్లో అధికారికంగా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

దీనిపై చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామిని వివరణ కోరగా.. ఈ విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. అధికారికంగా రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నట్లు తెలిపారు.

వ్యవసాయ విద్యలో భాగంగా పొలంలో పనిచేస్తున్న విద్యార్థులు

అడ్డదారుల్లో సేకరణ.. అడ్డగోలుగా రవాణా

పేదల బియ్యం పక్కదారి

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు అందాల్సిన చౌకబియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ బియ్యం దుమారంగా కొందరు అక్రమార్కులు ఎప్పటికప్పుడు అడ్డదారులు వెతుక్కుంటూ రూ. కోట్ల సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. నెల ప్రారంభమవుతుందంటే సరికి లబ్ధిదారుల కన్నా దళారులు ముందే సిద్ధమవుతున్నారు. రేషన్ దుకాణాల్లో మకాంవేసి లబ్ధిదారుల నుంచి బియ్యం కొంటున్నారు. నగదు ఇస్తున్నారు. ఇక్కడ నుంచి బియ్యం బయట జిల్లాలకు తరలించేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చౌక ధరలకే బియ్యాన్ని ప్రతినెలా అందిస్తోంది. గతంలో వాహనాల్లో ఇళ్ల దగ్గరకు తీసుకువెళ్లి అందిస్తున్నామని చెప్పినా.. కొన్నిచోట్ల మార్గమధ్యలోనే దారి మళ్లిపోయేది. ఈ లోపాలు సరిదిద్దేందుకు ప్రభుత్వం తాజాగా పాత పద్ధతిలోనే డీలర్ల ద్వారా పంపిణీని ప్రారంభించింది. కానీ అక్రమార్కుల పని మాత్రం యథావిధిగా సాగిపోతోంది. అనకాపల్లిలో ఎలమంచిలి, చోడవరం ఏరియాల్లో దీనికి సిండికేట్ ఉంది. చోడవరం, నర్సీపట్నం, ఎలమంచిలి మండలాల్లో ఆయా ఏరియాల్లోని దళారులే కొనాలని నిబంధనలు సైతం విధించుకున్నారు. సేకరించిన సరకు నాణ్యత బట్టి వివిధ అవసరాలకు మళ్లిస్తున్నారు. కొంత రొయ్యలు, చేపల చెరువులు, పందుల మేతకు కేజీ రూ. 15 - 20 చొప్పున ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. వీటిని నానబెట్టి, ఉడకబెట్టి ఫీడ్‌గా ఉపయోగిస్తున్నారు. ఐరిశాండరీ రీసైక్లింగ్ చేసి.. మిల్లర్లకు విక్రయిస్తున్నారు. నాణ్యమైన సరకు మాత్రం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు సరిగ్గా లేకపోవడంతో ఎగుమతి సులభంగా జరుగుతోంది. ఈ అక్రమ రవాణాపై జిల్లా అధికారులు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. నామ మాత్రం కేసులు కట్టి మమ అనిపిస్తున్నట్లు తెలిసింది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా.. వ్యాపారులు ఏ మాత్రం తగ్గడం లేదు. దాడులు చేసి వాహనాలను పట్టుకుంటున్నా.. తర్వాత ఏం చర్యలు తీసుకుంటున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. తరలిపోతున్న సరుకుతో పోల్చితే.. పట్టుబడింది పిడికెడేనన్న వాదన వినిపిస్తోంది.

ఇటీవల ఎలమంచిలిలో లారీలో పట్టుబడిన రేషన్‌బియ్యం

ఈ ఏడాదిలో కేసులు	
నెల	కేసులు
జనవరి	-
ఫిబ్రవరి	22
మార్చి	20
ఏప్రిల్	19
మే	14
జూన్	05
జులై (ఇప్పటివరకు)	03
మొత్తం	83

నిఘా పెట్టాం..

రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ మేరకు అందరికీ అదే అంశాలు జారీ చేశాం. లబ్ధిదారులకు కచ్చితంగా సరకులు అందించాలని డీలర్లను ఆదేశించాం.

– కె.వి.ఎన్.మూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి అనకాపల్లి

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ

చిరువ్యాపారులకు నీడ కరవు

అనంతగిరి, న్యూస్‌టుడే

మన్యం పేరు చెప్పగానే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది పర్యాటకమే. విశాఖపట్నం నుంచి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఏటా లక్షలాది మంది వస్తుంటారు. రోడ్డు మార్గంలో వచ్చేవారిని [illegible] మొదలు అరకు వరకు పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారులు స్థానిక ఉత్పత్తులు విక్రయిస్తూ ఉపాధి పొందుతుంటారు. వీరంతా రహదారికి ఇరువైపులా కర్రలతో చిన్న షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తుంటారు. మన్యంలో వర్షాలు, గాలులు సర్వసాధారణం. దీంతో తరచూ ఈ దుకాణాలు పడిపోతున్నాయి. ఈ ఇబ్బందుల దృష్ట్యా పక్కా భవనాల్లో దుకాణ సముదాయాలు నిర్మించి అద్దెకు ఇవ్వాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినా ఆచరణలోకి రాలేదు. డముకు వ్యూపాయింట్, కాఫీ తోటలు, బొర్రాగుహలు, తాడిగుడ జలపాతం, గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట కాఫీతోటలు ఇలా ప్రకృతి అందాలు కొలువైన ప్రతిచోటా చిరు వ్యాపారుల దుకాణాలు కనిపిస్తుంటాయి. సుమారు 40 వరకు దుకాణాల్లో స్థానికంగా పండే కాఫీ పొడి చేసి విక్రయించడం, మసాలా దినుసులు, వెదురుతో చేసిన పలురకాల ఉత్పత్తులతోపాటు మొక్కజొన్న, బొంగులో బిర్యానీ, బొంగులో చికెన్ వంటివి విక్రయిస్తుంటారు. వీరిలో మహిళలే అధికం. చాలా ఏళ్లుగా వీరంతా తాత్కాలిక దుకాణాలతోనే నెట్టుకొస్తున్నారు. వర్షాలు పడే రోజుల్లో పర్యటకుల తాకిడి ఉన్నా వ్యాపారం సాగించలేని పరిస్థితి. శాశ్వత దుకాణాలు లేని కారణంగా రోజూ సామగ్రిని ఇళ్లకు తీసుకుని వెళ్లి తిరిగి తరవాత రోజు మోసుకొచ్చుకోవాల్సి వస్తోంది. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెబుతున్న అధికారులు తమను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, స్థానిక ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులకు వినతులు అందించినట్లు చెబుతున్నారు. అయినా శాశ్వత దుకాణాల కల నెరవేరని కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తే ఐటీడీఏకు సైతం ఆదాయం సమకూరే అవకాశం ఉందని చెబుతున్నారు.

★ జిల్లాలో అనంతగిరి మండలానికి బదిలీపై వచ్చాను. దుకాణాల నిర్మాణానికి సంబంధించి స్థానికుల వినతిని పరిశీలించి, దానిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీఓ ప్రభాకరరావు తెలిపారు.

కాఫీ తోటల వద్ద కర్రలతో వేసుకున్న షెడ్లు

సమస్యల పరిష్కారానికి చొరవ

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో గిరిజన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఏపీఓ రమణతో కలిసి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఏడు మండలాల నుంచి 94 వినతులు వచ్చాయి. రంపచోడవరం మండలం ఆకూరు నుంచి దేవీపట్నం మండలం మామిడివలసకు రోడ్డు మంజూరైందని, అటవీ శాఖ అభ్యంతరాలతో ఐదు కిలోమీటర్ల దూరం నిర్మాణం నిలిచిపోయిందని సర్పంచి విజయభాస్కరరెడ్డి, ఉప సర్పంచి పోసిరెడ్డి, గిరిజనులు శ్రీదేవి, కల్యాణి తదితరులు పీఓ దృష్టికి తీసుకువచ్చారు. మారేడుమిల్లి మండలం డి.వెలమలకోటలో సర్వే నంబరు 55/3, 55/1లో భూసమస్యలు ఉన్నాయని, పరిష్కరించి న్యాయం చేయాలని వెలుగూరి నరసింహారెడ్డి విన్నవించారు. గంగవరం మండలం ఏటిపల్లికి చెందిన దివ్యాంగుడు ముసలయ్య పింఛను మంజూరు కోరుతూ వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం మండలం ముసురుమిల్లి నుంచి పెదబారంగి, పాముగండి వరకు 15 కిలోమీటర్ల దూరం రహదారి మరమ్మతు చేయించాలని ఆదివాసీ నాయకుడు కోసు అచ్చిబాబు కోరారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రుక్మాంగదయ్య, కార్య నిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏడీఎంహెచ్‌ఓ శిరీష, పశుసంవర్ధక ఉప సంచాలకులు షరీఫ్, ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు, పంచాయతీరాజ్ డీఈ వెంకటరమణ, తహసీల్దారు బాలాజీ, డీడీ కార్యాలయ పర్యవేక్షకుడు కిషోర్ పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న పీవో సింహాచలం

శాకంబరిగా రాజరాజేశ్వరి

పాడేరు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా పాడేరులోని ఉమా నీలకంఠేశ్వర ఆలయంలో స్వామివారితోపాటు రాజరాజేశ్వరి అమ్మవారిని సోమవారం కూరగాయలతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నర్సింగరావు, రమాదేవి, టూరిజం డైరెక్టర్ రమేష్‌నాయుడు, జిల్లా పరిషత్తు మాజీ అధ్యక్షురాలు కాంతమ్మ, ఉప సర్పంచి బురెడ్డి రామానాయుడు, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఉపాధ్యక్షులు రామారావు, కొండలరావు, పోతురాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సుజల పథకాలకు చెదలు

అరకులోయ మండలం యండపల్లివలస గ్రామంలో మూలకు చేరిన సుజలపథకం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు కేవలం రూ. 2కే శుద్ధజలం అందించేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన సుజల పథకం ప్రస్తుతం అటకెక్కింది. 2019కు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం రూ. ఐదు లక్షల చొప్పున నిధులు వెచ్చించి అరకులోయ ఆర్‌అండ్‌బీ రోడ్డు, యండపల్లివలస గ్రామాల్లో ఈ పథకాలు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ గ్రామీణ తాగునీటి విభాగానికి అప్పగించింది. అరకులోయలో 2019లో ప్రభుత్వం మారక ముందు వరకు నిర్వహణ కొనసాగింది. కేవలం రూ. 2కే 20 లీటర్ల శుద్ధజలాన్ని అందించేవారు. యండపల్లివలస తాగునీటి ట్యాంకు సమీపంలోనే సుజలపథకం నిర్వహణకు గదిని నిర్మించి యంత్రాలు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఈ పథకాలు నిర్వహణ లేక మూలకు చేరాయి. ప్రస్తుతం అరకులోయ, యండపల్లివలస పరిధిలో శుద్ధజలం కోసం ప్రజలు ప్రైవేటు తాగునీటి ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. 20 లీటర్ల నీటికి రూ.20 నుంచి రూ50 వరకు వెచ్చిస్తున్నారు.

పిల్లలు బడి మానకుండా చర్యలు

జి.మాడుగుల, చింతపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు మధ్యలో బడి మానేయకుండా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. జి.మాడుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం డీఈఓ చింతపల్లి మండలంలో పర్యటించారు. చింతపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

చింతపల్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

వలజంగిలో జ్వరాలతో వణుకు

జ్వరంతో బాధపడుతున్న మహిళ

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల రంగబయలు పంచాయతీ పరిధిలోని వలజంగి గ్రామస్థులు జ్వరాలతో వణుకుతున్నారు. జ్వరాలు, శరీరంపై కురుపులతో ఎక్కువమంది బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన వంతాల తులసి(4) జ్వరంతో ఆదివారం మృతి చెందింది. ప్రస్తుతం వంతాల కసుమ, వంతాల రాధ, వంతాల మీనా, వంతాల సుశాంత్, మరో పది మంది అనారోగ్యంతో ఉన్నారు. చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏడాది పాలనలో ఇంటింటికీ సంక్షేమం

రంపచోడవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించిందని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎర్రంరెడ్డి నగరంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. రంపచోడవరం, అడ్డతీగల, ఎటపాక, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, చింతూరు మండలాలకు చెందిన 12 మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ. 5,76,471 మంజూరైంది. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబాలకు చెక్కు రూపేణా అందజేశారు. నాయకులు శ్రీనివాస యాదవ్, రమేష్, సురేష్, బాపిరాజు, నిరంజనీదేవి, అనంతమోహన్, జనార్దన్, బాబీ, బాపన్నదొర, పోసిబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

భూపతిపాలెం జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ఆయకట్టుకు నీటి విడుదల

రంపచోడవరం: గిరిజన రైతులకు సాగు నీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. భూపతిపాలెం జలాశయం నుంచి పంట కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. రంపచోడవరం, గంగవరం మండలాల్లో 11,525 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ రాజేశ్వరరావు, డివిజన్ ఇంజినీర్లు రాజకుమారి, నాగేంద్రప్రసాద్, ఏఈలు రవితేజ, నాయుడుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. పీ4 అమలుపై సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఆర్థిక సహాయం మాత్రమే కాదు.. విద్య, వైద్య రంగాల్లో సహకరించాలని చెప్పారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు బంగారు కుటుంబాల విద్యార్థులను దత్తత తీసుకోవాలని సూచించారు. పీ4 సర్వేకు మండలస్థాయి కమిటీలను నియమించాలన్నారు. సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు సింహాచలం, అపూర్వ భరత్, సీపీఓ పి.ప్రసాద్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వరరావునాయుడు, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో జేసీ అభిషేక్ గౌడ

నేటి నుంచి పీ4 సర్వే

ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా పీ4 సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కమిటీ సభ్యులు గ్రామ, వార్డు స్థాయిలో పర్యటించి మార్చి నెలలో జరిగిన పీ4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల జాబితాలను పునః పరిశీలించాలని పేర్కొన్నారు. అనంతరం జాబితాలను గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించాలని ఆదేశించారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం

హుకుంపేట, న్యూస్‌టుడే: పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చునేందుకు కూడా మత్స్యకొండ నిదర్శనమని కలెక్టర్ దినేష్‌కుమార్ కొనియాడారు. మలేషియాలో ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జావెలిన్‌త్రోలో బంగారు పతకం సాధించిన కూడా మత్స్యకొండను సోమవారం కలెక్టర్ సత్కరించి అభినందించారు. అంతకు ముందు ములియాపుట్టు గ్రామంలో సీడీఎం చర్చి సంఘస్థులు, రిమాలి జాన్ మాస్టర్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. మత్స్యకొండతో పాటు పదవీ విరమణ పొందిన ఆ గ్రామానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో జేసీ అభిషేక్ గౌడ, గ్రామస్థులు కూడా సత్యనారాయణ, చెండా వెంకటరమణ, బాలకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి మత్స్యకొండను అభినందిస్తున్న కలెక్టర్, జేసీ

నవంబర్‌నాటికి పనులు పూర్తి

పాడేరు, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ పనులను నవంబర్‌లోపు పూర్తి చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభునాయర్ సోమవారం దిల్లీ నుంచి కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎంజీఎస్ మొదటి దశలో 85 రోడ్లు మంజూరయ్యాయని, 43 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. 118 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయన్నారు. ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో అభిషేక్ గౌడ, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

అరకులోయ, న్యూస్‌టుడే: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలనగా సాగుతోందని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. అరకులోయ మండలం పద్మాపురం గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన అందరికీ ప్రభుత్వం పథకాలు అందిస్తోందన్నారు. తల్లికి వందనం పేరుతో గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఏడాదికి రూ. 13 వేలు చొప్పున అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అడవిబాట పేరుతో గ్రామాల్లో రహదారి సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలకాలం గుర్తుంచుకోవాలన్నారు. పెదలబుడు సర్పంచి దాసుబాబు, తెదేపా మండల అధ్యక్షుడు మహదేవ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పద్మాపురంలో పథకాలు వివరిస్తున్న జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, నేతలు

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సాగు పరికరాలతో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటునిచ్చుకోవాలని ఎంపీపీ ఈశ్వరి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సీపీఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ప్రోగ్రాం అధికారిణి ఆచార్య నాగమణి సహకారంతో గిరిజన రైతులకు సోమవారం వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సంస్థ ప్రతినిధులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, అధికారులు, సీపీఎఫ్ సంస్థ ప్రతినిధులు

రూ.40 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో రూ. 40 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవనం నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తెలిపారు. సోమవారం చింతపల్లిలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి వీధిదీపాలు పంపిణీ చేశారు. అనంతరం సంతబయలు దిగువన రూ.40 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. తరువాత నాయకులతో కలిసి చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ధర్నా చేశారు. కళాశాల రద్దు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచి పుష్పలత, మోరి రవి, జల్లి సుధాకర్, బూసరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో వ్యవసాయ విద్యను గిరిపుత్రులకు అందుబాటులో ఉంచాలని కరాటే కొఫోకాన్ క్లబ్ ముఖ్య శిక్షకుడు బాకురు పాండురాజు కోరారు. సోమవారం ఆయన చింతపల్లిలో మాట్లాడుతూ.. అధికారులు పునరాలోచించి ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు.

సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తదితరులు

భాజపా మండల అధ్యక్షుడిగా ముత్తయ్య

కరపత్రాలు ప్రదర్శిస్తున్న భాజపా నాయకులు

చింతూరు, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా ముత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతూరులో ఆ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం సోమవారం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా మల్లేశ్, సత్తిబాబు, బుజ్జమ్మ, 16 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకయ్య, నాయకులు రమణారెడ్డి, లక్ష్మణ్‌రావు, దేవయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ భూమిలో అక్రమ నిర్మాణం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: రాచపల్లి శివారు యరకన్నపాలెంలో సర్వే నంబరు 737లో ఉన్న భూములలో రెండురోజులుగా పలువురు రాత్రివేళల్లో రహదారి నిర్మిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు రహదారి నిర్మాణం కోసం ఉపయోగించే రెండు యంత్రాలను ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కోటవురట్ల సెక్షన్ అధికారి వివేకానంద మాట్లాడుతూ ఆదివారం ఉదయం రహదారి పనులు చేస్తున్న రెండు యంత్రాలు, రెండు వాహనాలతో పనులు చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఈ క్రమంలో పలువురు వచ్చి ఇవి రెవెన్యూ భూములంటూ వాగ్వాదానికి దిగినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో వాహనాలను అడ్డుకున్నామని, యంత్రాలను సీజ్ చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్‌డీఓ రమణ, తహసీల్దారు వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అటవీశాఖ అధికారులు సీజ్ చేసిన యంత్రాలు

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి బుధవారం తాళ్లపాలెం, అనకాపల్లి గురుకులాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల సమన్వయ అధికారి రామకృష్ణ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన బాలురకు ఉదయం 9 గంటలకు, బాలికలకు మధ్యాహ్నం 1 గంటకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలురకు దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురం.. బాలికలకు మేహాద్రిగెడ్డ సీఓఈ, నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి గురుకులాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. కౌన్సెలింగ్‌కు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చేవారు పదో తరగతి మార్కుల జాబితా తీసుకురావాలని కోరారు.

TO LET
WANTED
GENERAL
WANTED
Godown For Rent
Sree Murali Mohana
Boiled & Raw Rice Mill
Private Unlimited
(BELL BRAND RICE)
Location:
Visakhapatnam City
Facing: North, East,
North East Block
SIZE: 2000 SFT
Approximately
Contact :
9490564901

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ తప్పనిసరి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు ఆదేశించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సోమవారం ఆయన వర్సిటీ అధికారులు, ఎస్టీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎస్టీ ఉద్యోగుల నియామకంలో రిజర్వేషన్ల అమలు తీరును తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో బోధన, బోధనేతర, ఒప్పంద, పొరుగు ఉద్యోగుల నియామకాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు. ఏయూలో చదివే గిరిజన విద్యార్థులకు కంప్యూటర్, వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులతో సమావేశమయ్యారు. గతంతో పోలిస్తే ఉన్నతవిద్య చదివే ఎస్టీ విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎ. తెలుగు విద్యార్థి రవిరాజు మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలకు వెళ్లేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. బీటెక్ విద్యార్థి పవన్ మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు. దూరవిద్య కేంద్రం ప్రొఫెసర్ విద్యాధరం మాట్లాడుతూ పర్యాటకం పేరుతో గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారని, అక్కడి సంస్కృతి దెబ్బతింటుందని తెలిపారు. ఎస్టీ విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్యులు జర్రా అప్పారావు, కుంజా నాగేశ్వరరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు

జన్మదిన శుభాకాంక్షలు
అందరి మనిషి, సేవా తత్పరులు, దశ, దిశ మార్గనిర్దేశకులై మా వెన్నంటే ఉండి మా ఉన్నతికి కృషి చేస్తున్న మా హితులు, ఆత్మీయులు శ్రీ తమర్ల ఈశ్వరరాజు గారికి జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ తమర్ల ఈశ్వరరాజు గారు
AE, Housing సెక్షన్, పాడేరు
మీ కుటుంబ సభ్యులు, పాడేరు

Bank of Maharashtra
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోనల్ ఆఫీస్, [illegible] విజయవాడ-520007.

అద్దె ప్రాతిపదికన ఆవరణ కావలెను

క్ర.సం.	బ్రాంచ్ తరహా	ప్రాధాన్యతగల ప్రదేశం (పిన్‌కోడ్)	సుమారు కార్పెట్ ఏరియా (చ.అ.)
1	రెగ్యులర్ బ్రాంచ్ ATM తో	[illegible]-530047	1400-1500 చ.అ.
2	రెగ్యులర్ బ్రాంచ్ ATM తో	మల్కాపురం-530011	1400-1500 చ.అ.
3	రెగ్యులర్ బ్రాంచ్ ATM తో	కూర్మన్నపాలెం-530012	1400-1500 చ.అ.
4	రెగ్యులర్ బ్రాంచ్ ATM తో	పరవాడ-531021	1000-1200 చ.అ.

[illegible] www.bankofmaharashtra.in [illegible] 25.07.2025 [illegible]
gad_vjd@mahabank.co.in, ఫోన్: 08662480133, 7013388468 [illegible]

హత్య కేసులో నిందితుడి అరెస్టు

అడ్డతీగల: భార్య హత్య కేసులో నిందితుడైన భర్తను వేటమామిడి కూడలిలో సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ నరసింహమూర్తి చెప్పారు. వంగలమడుగు గ్రామంలో ఈనెల 9న మడకం జోగయ్య అనుమానంతో భార్య విజయకుమారిపై కత్తితో దాడి చేసి హతమార్చాడు. అప్పట్నుంచి పరారీలో ఉన్న అతన్ని అదుపులోకి తీసుకుని హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండుకు తరలించామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్సై అంకయ్య

మడుల్లో సేద్యం.. మెండుగా ఆదాయం

రైతేరాజు

న్యూస్‌టుడే, పాయకరావుపేట

ఆధునిక పద్ధతులకు అనుగుణంగా అన్నదాతలు సాగుబాట పడుతున్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండిస్తూ మెండుగా ఆదాయం పొందుతున్నారు. నిపుణుల సూచనలు పాటిస్తూ చిన్న చిన్న మడుల్లో పంటలు సాగు చేస్తున్నారు పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం రైతు **రమణ.**

కూరగాయ తోటల పెంపకం

★ 20 సెంట్లలో 60 శాతం భూమిలో 7 రకాల పంటలు, 35 శాతం భూమిలో ఆరు, 5 శాతం భూమిలో 10 రకాలకుపైగా పంటలు వేస్తున్నా. తద్వారా నిత్యం ఏదో ఒక పంట చేతికొస్తోంది. రోజుకు సగటున 20 కేజీల వరకు కూరగాయలు మార్కెట్‌కు తీసుకువెళ్తా. వీటితోపాటు ఆకుకూరలు విక్రయిస్తున్నా. నెలకు రూ. 15 వేల చొప్పున ఏడాది పొడవునా ఆదాయం ఉంటోంది. అన్ని పనులు స్వయంగా చేసుకోవడం వల్ల కూలీల ఖర్చు కలిసొస్తోంది. సేంద్రియ విధానంలో పండిస్తుండటం వల్ల కాయగూరలకు మంచి డిమాండ్ ఉంది.

టి.రమణ, పెదరామభద్రపురం

★ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రెండేళ్ల కిందట తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండించే విధానానికి మారా. ఏమాత్రం పెట్టుబడి లేకుండా క్రమం తప్పకుండా ఆదాయం పొందుతున్నా. 20 సెంట్ల భూమిలో ఏడాది పొడవునా ఏదో ఒక పంటతో ఆదాయం వచ్చేలా 20 రకాలు సాగు చేస్తున్నా. ★ నాలుగు అడుగుల వెడల్పుతో బెడ్లు తయారు చేశా. నీరు వచ్చేందుకు వీలుగా అడుగున్నర వెడల్పుతో కాలువ ఏర్పాటు చేశా. కషాయాలు కలిపేందుకు వీలుగా సిమెంట్ కుండీని ఏర్పాటు చేసుకున్నా. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, ఘన, ద్రవ జీవామృతాలనే చీడపీడల నివారణకు వాడుతున్నా.

★ ప్రధాన మడిలో వంగ, టమాటా, మిర్చి, గోరుచిక్కుడు, చెట్టు చిక్కుడు విత్తనాలు వేస్తున్నా. వాటి మధ్యలో మొక్కజొన్న, బరబాటి వేశా. ఖాళీలున్న చోట బీట్‌రూట్, ముల్లంగి, క్యారెట్ పండిస్తున్నా. మడి చుట్టూ బీర, ఆనప వేస్తున్నా. వీటితోపాటు గోంగూర, తోటకూర, పాలకూర, మెంతికూర పండిస్తున్నా. తెగుళ్లు ఆశించకుండా బంతి నారు నాటుతున్నా.

మధ్య, నాసి రకం బెల్లం ధరల్లో వృద్ధి

అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా మధ్య, నాసి రకం బెల్లం ధరలు పెరిగాయి. రంగులు ధరలు తగ్గాయి. రంగుల వంద కేజీలకు రూ. 130 తగ్గగా మధ్య రకం రూ. 700, నాసి రకాలు రూ. 450 ధరలు పెరిగాయి.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,750	4,620
మధ్య	3,450	4,150
నాసి	2,800	3,250

–న్యూస్‌టుడే, అనకాపల్లి

న్యూస్‌టుడే, అనకాపల్లి

విత్తన శుద్ధితో.. మేలైన దిగుబడులు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

? వ్యవసాయ శాఖ వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేశాం. విత్తన శుద్ధి చేయాలా. – దాడి వెంకట రమణ, సీతానగరం

✔: విత్తన శుద్ధి చేస్తే మంచిది. కేజీ విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి శుద్ధి చేసుకోవాలి. తద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చు.

? ఎకరా భూమిలో వరి సాగుకు ఎంత విత్తనం అవసరమవుతుంది. – జనపరెడ్డి నర్సింగరావు, పెదపాడు

✔: నారు పోసి నాటేందుకు 25 నుంచి 30 కేజీల విత్తనం అవసరం. పొలంలో నేరుగా వెదజల్లేట్లు అయితే 15 నుంచి 20 కేజీలు సరిపోతాయి. డ్రమ్‌సీడరుతో వేస్తే 10 నుంచి 12 కేజీలు, యంత్రంతో నాట్లు వేస్తే 8 నుంచి 10 కేజీల విత్తనం పడుతుంది.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త **డాక్టర్ పీవీకే జగన్నాథరావు** సమాధానాలు ఇచ్చారు.

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి సమాధానాలిస్తారు. సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 గంటల నుంచి సా. 4 గంటలకు వరకు **93905 80342** నంబరుకు ఫోన్ చేయవచ్చు.

పూల రైతులకు రాయితీలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: రైతులకు రాయితీలిచ్చి పూల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 500 ఎకరాల్లో వివిధ రకాల పూల సాగుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. బంతి, చామంతి, మల్లె, గులాబీ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు రూ. 16 వేల నుంచి రూ. 20 వేల వరకు రాయితీగా ఇస్తామని ఉద్యానాధికారి ఎంఏ రహీమ్ చెప్పారు. హైబ్రిడ్ బంతి, గులాబీ సాగుకు హెక్టారుకు రూ. 40 వేలు, చామంతికి రూ. 35 వేలు, మల్లెకు రూ. 20 వేలు పెట్టుబడి అవుతుందన్నారు. రాయితీలకు సంబంధించి వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు.

ఉపాధికి ఊతం.. జీవాల పోషణకు సాయం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: జాతీయ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం)లో భాగంగా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి ముందుకు వచ్చే వారికి కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేస్తోంది. ఈ పథకం 2021-22లో ప్రారంభమైంది. కేంద్రం ఆధ్వర్యంలోని ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్థక శాఖ ద్వారా సహకారం అందిస్తోంది. గతంలో ఆశించిన స్థాయిలో ఎవరూ సద్వినియోగం చేసుకోలేదు. జిల్లాలో 12 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా అధికారులు లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు.

శంకరం గ్రామంలో కొత్తగా ఏర్పాటైన గొర్రెల యూనిట్

1 ● యూనిట్ విలువ ఆధారంగా కనిష్ఠంగా రూ. 10 లక్షలు, గరిష్ఠంగా రూ. 50 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేస్తారు. 50 శాతం రాయితీ వర్తిస్తుంది. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో గొర్రెల పెంపకానికి అనువైన పరిస్థితులున్నాయి. శంకరం గ్రామంలో కొత్తగా యూనిట్ ప్రారంభమైంది.

2 ● అనకాపల్లి జిల్లాలో 1,50,424 గొర్రెలు, 1,79,479 మేకలు, 8 వేల పందులున్నాయి. యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు సమీపంలోని మీసేవ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు, ఆధార్, చిరునామా, ఫొటో, బ్యాంకు స్టేట్‌మెంట్ అప్‌లోడ్ చేయాలి.

3 ● లబ్ధిదారుకు కనీసం ఐదు ఎకరాల భూమి ఉండాలి. సొంతంగా భూమిలేని వారు ఇతరుల నుంచి లీజుకు తీసుకోవచ్చు. రుణం ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరిస్తే ఎంత మందికైనా యూనిట్లు మంజూరు చేస్తామని నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ ఏడీ **రాంబాబు** తెలిపారు.



గిరిజనుల ప్రాణాలతో చెలగాటమా?

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ డిమాండ్ చేశారు. సోమవారం పాడేరులో పర్యటించిన ఆయన స్థానిక జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. రోగులు, ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వామిత్రతో మాట్లాడారు. ఆసుపత్రిలో 420 పడకలున్నాయని, 600 పడకల ఆసుపత్రిగా కొనసాగుతోందన్నారు. 2025 జూన్ నాటికి వైద్య కళాశాల, ఆసుపత్రి విభాగాల నిర్మాణం పూర్తిచేసి అప్పగించాల్సి ఉండగా.. నేటికీ ఇది జరగలేదని పేర్కొన్నారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో మొత్తం 220 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. 78 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. సిబ్బంది పూర్తిగా లేరని, అంబులెన్సులు లేవన్నారు. అరకొర వైద్య సిబ్బందితో గిరిజన ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మనపడాల్, ప్రధాన కార్యదర్శి బాల్‌దేవ్, సీఐటీయూ నాయకులు సుందరరావు తదితరులు పాల్గొన్నారు

జిల్లా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ తదితరులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక చదువుకు దూరం

పాడేరు: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం పాడేరులో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. ఆశ్రమాల్లో ఆరోగ్య సహాయకులను నియమించాలని కోరారు. ఆశ్రమాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడేరులో ర్యాలీ

మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు అన్నారు. సోమవారం పల్లె ప్రగతి.. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరుణతో కలిసి లోతుగెడ్డ కూడలి, కడశిల్ప గ్రామాల్లో పర్యటించారు. జల్‌జీవన్‌మిషన్ పనులను పరిశీలించారు. గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ స్వర్ణలత, భాజపా మండల అధ్యక్షుడు బాలకృష్ణ, జనసేన మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, రాజబాబు, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

కడశిల్ప గ్రామస్థులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు బుజ్జిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరుణ

మాడుగులలో భారీ చోరీ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగులలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగుల గ్రామంలో రాజువీధిలో కోడూరు లక్ష్మి (68) తన కుమార్తెతో కలిసి ఈ నెల 1న బంధువుల ఇంటికి విశాఖ నగరంలోని మల్కాపురం వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తాళం తీసి ఉండటం ఇరుగుపొరుగు వారు గమనించి వారికి సమాచారం అందించారు. వెంటనే ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు, బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనలో సుమారుగా 19.5 తులాల బంగారు, రూ 1.90 లక్షల నగదు చోరీ జరిగినట్లు మాడుగుల ఎస్సైకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీంతోపాటు డీఎస్పీ శ్రావణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అక్రమ కట్టడాలు తొలగించాల్సిందే

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలులో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా నిర్మించుకున్న దుకాణాలు, ఇళ్లను వెంటనే తొలగించాలని ఎంపీపీ వరహాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు బొంజుబాబు, సర్పంచి మాధవరావు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా వారు నిరసన తెలిపారు. సీపీఐయం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయని చెప్పారు. 100 అడుగుల మేర రోడ్డును విస్తరించాలని కోరారు. వైస్ సర్పంచి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ, సర్పంచి మాధవరావు తదితరులు

కాఫీ సొమ్ములు చెల్లిస్తాం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కాఫీ పంట విక్రయించిన రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని జీసీసీ చింతపల్లి డివిజన్ మేనేజరు వెంకటేష్ తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతుల వేదనపై ఈనెల 12న 'ఈనాడు'లో 'కాఫీ సొమ్ములు ఇప్పించరూ..' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆయన జీకేవీధి, పెదవలసలోని జీసీసీ గోదాములలో నిల్వ ఉంచిన కాఫీ పంటను సోమవారం రాత్రి బ్రాంచి మేనేజరు విజయ్‌కుమార్‌తో కలసి పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన పంట, చెల్లింపుల వివరాలను క్షేత్ర సహాయకులు, సేల్స్‌మెన్‌ల నుంచి అడిగి తెలుసుకున్నారు. విచారణ పూర్తయిన వెంటనే.. రైతులకు సొమ్ములు చెల్లిస్తామన్నారు. సేల్స్‌మెన్‌లు నర్సింగరావు, నారాయణరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ గోదాములో విచారణ చేపడుతున్న డీఎం వెంకటేష్, సిబ్బంది

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	70
లైవ్	103	90
డ్రెస్డ్	149	150
స్కిన్‌లెస్	170	160

(c) eenadu

సంక్షేమంతోపాటు అభివృద్ధే లక్ష్యం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర అన్నారు. సోమవారం బరడ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. తల్లికి వందనం లబ్ధిదారులతో మాట్లాడారు. దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తెదేపా మండల అధ్యక్షులు బలరామ్, కార్యదర్శి జగన్నాథ్, సన్యాసమ్మ, బాబూజీ, సర్పంచులు లక్ష్మణ్, ధనియా, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బరడలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న దొన్నుదొర తదితరులు

శివాలయంలో చతుర్దశి పూజలు

సీలేరు, న్యూస్‌టుడే: సంకష్టహర చతుర్ధశి సందర్భంగా సీలేరు శివాలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. చతుర్ధశి ప్రాశస్త్యాన్ని అర్చకుడు దామోదర్ శర్మ వివరించారు. మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పూజల్లో మహిళలు

కాలమేదైనా.. కష్టం కామన్!

జి.మాడుగుల, న్యూస్‌టుడే

మన్యంలో వర్షాకాలంలోనూ తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. ఏ కాలం వచ్చినా ఇదే పరిస్థితి నెలకొంటోంది. గుక్కెడు నీటికి అర కిలోమీటరు దూరం వెళ్లాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లో కాదు.. మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా జి.మాడుగుల గాంధీనగర్‌లో తాగునీటి సమస్య ఉంది. స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ సమీపంలో పెట్రోల్ బంక్ పక్కనున్న బావి నుంచి వీరు నీరు తెచ్చుకుంటున్నారు. వర్షాకాలంలో జలం కలుషితమవుతోంది. ఆ నీటినే తాగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. గత ఏడాది ఇంటింటికీ తాగునీరు అందించేందుకు అధికారులు గ్రామ సమీపంలో బోరు తవ్వించి వదిలేశారు. ఆ పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఈ సమస్యను విన్నవించారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

అర కిలోమీటరు దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్న గాంధీనగర్ మహిళలు

మా మొర ఆలకించాలి

అధికారులు మా మొరను ఆలకించి తాగునీటి సదుపాయం కల్పించాలి. పాడేరు- చింతపల్లి ప్రధాన మార్గం గుండా.. గ్రామానికి అర కిలోమీటరు దూరం నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి. – కొర్ర దేవి, గాంధీనగర్

సమస్య పరిష్కరిస్తాం

గాంధీనగర్ గ్రామానికి తాగునీరు అందించేందుకు మోటారు ఏర్పాటు చేశాం. ఆపరేట్ చేసేందుకు కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామంలో పర్యటించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను.
– విజయ్‌కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, జి.మాడుగుల

రహదారి బాగుకు వినతి

గూడెంకొత్తవీధి, సీలేరు, న్యూస్‌టుడే: అధ్వానంగా ఉన్న ఆర్వీనగర్- పాలగెడ్డ రహదారి బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సోమవారం లేఖ రాశారు. గతేడాది కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా శిథిలమై ఈ ప్రాంతీయులతోపాటు పర్యాటకులు, పవర్ ప్రాజెక్టుల ఉద్యోగుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

న్యాయ సేవలపై అవగాహన ర్యాలీ

అడ్డతీగల, న్యూస్‌టుడే: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ సేవలపై అవగాహన ర్యాలీ జరిగింది. న్యాయవాది ఐ.వి.రమణ చట్టాలపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఆధార్ మేళా

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం డివిజన్ వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 18 వరకు ఆధార్ మేళా జరగనుందని డివిజనల్ పంచాయతీ అధికారి కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆధార్ కేంద్రాలున్న సచివాలయాల్లో కొత్తగా నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు.

అ వీ ఇ వీ

తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఆదినారాయణ

కూనవరం, న్యూస్‌టుడే: తెదేపా కూనవరం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జిగా కాచవరానికి చెందిన కొక్కిరేణి ఆదినారాయణ నియమితులయ్యారు. గతంలో సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఎన్నిక జరిగినా ఫలితం ప్రకటించరేం?

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మండల తెదేపా అధ్యక్షుడిగా కాకూరు చంద్రరావును వెంటనే ప్రకటించాలని పలువురు తెదేపా నేతలు డిమాండ్ చేశారు. సోమవారం వారంతా విలేకర్లతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, మండల పరిశీలకుడు ఎస్.బాబూరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈశ్వరి సమక్షంలో ఈనెల 12న ఎన్నిక జరిగిందన్నారు. చంద్రరావు గెలుపొందినా ఫలితాన్ని ప్రకటించకపోవడం తగదన్నారు. చంద్రరావును పార్టీ మండల అధ్యక్షుడిగా ప్రకటించనిపక్షంలో తామంతా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నేతలు వై.వరహాలబాబు, ఎస్‌కేబీ ఖాన్, పి.రాజుబాబు, కొయ్యూరు సర్పంచ్ బాలరాజు, నేతలు కె.శ్రీరాములు, భాస్కరరావు, ఎస్.చిన్ని పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంజా దూలయ్య, పల్లాల ఒగ్గిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా స్థానిక మార్క్స్ ఏంగెల్స్ భవనంలో సోమవారం సమావేశమయ్యారు. నాయకులు రమణ, బాలురెడ్డి, మంగిరెడ్డి, అనసూయ, ప్రసాద్‌దొర, రామారావు, ఆదిలక్ష్మి, చిలకమ్మ, జోగమ్మ పాల్గొన్నారు.

16న ఐటీడీఏ ఎదుట ధర్నా

చింతూరు, న్యూస్‌టుడే: తునికాకు సేకరించిన గిరిజనులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ఐటీడీఏ ఎదుట ధర్నా చేయనున్నట్లు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్ పేర్కొన్నారు. చింతూరులో సోమవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఏడాది మేలో తునికాకు సేకరించిన గిరిజనులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదన్నారు. అర్జున, దిలీప్, ప్రదీప్‌కుమార్, నగేశ్ పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు విద్యార్థి తరలింపు

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి మర్రిశెట్టి సత్తిబాబు తీవ్ర జ్వరంతోపాటు ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. బాలుడిని తల్లిదండ్రులు సోమవారం జీపులో రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాలుడు మంప ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. గత కొద్దిరోజులుగా పాఠశాలకు రావడం లేదని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేద్దామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం కళాశాలలో మోదమాంబ కళాజాత బృంద సభ్యులు శేఖర్, అప్పారావు, మోహన్‌బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు ఈశ్వరప్రసాద్, అప్పన్నబాబు, గోపాలకృష్ణ, శివప్రసాద్, పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

అరుదుగా.. ఆకట్టుకునేలా..

ప్రకృతి రమణీయతకు నిలయమైన ఏజెన్సీలోని అటవీ ప్రాంతాల్లో అరుదైన జాతులకు చెందిన చెట్లు, కీటకాలు ఉన్నాయి. మారేడుమిల్లి - చింతూరు రహదారిలో తెలుపు, నలుపు రంగుల్లో పైన వలలా, కింద కాండం సన్నగా, బొడిపెతో ఉన్న పుట్ట గొడుగు చూపరులను ఆకట్టుకుంటోంది. 'ఫాలస్ ఇండసియటస్' అనే రకానికి ఫంగస్ అని జంగిల్ స్టార్ నేచర్ క్యాంపు సమన్వయకర్త వీరబాబు పేర్కొన్నారు. దీనిని వెదురు పుట్టగొడుగు, వెదురు పిత్, బ్రైడల్ వీల్ అని పిలుస్తారన్నారు. పుట్టగొడుగు ఆకారంలో ఎక్కువగా బురద, తేమ ప్రదేశాల్లో కనిపిస్తుందని చెప్పారు.
– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

మారేడుమిల్లిలో కనిపించిన అరుదైన పుట్టగొడుగు

ఏడాదైనా పట్టదా?

ప్రభుత్వాలు.. పథకాల పేర్లు మారి ఏడాదవుతున్నా.. పలువురు అధికారులు ఇంకా వైకాపా మత్తులోనే ఉన్నారు. అరకులోయ అగ్రిల్యాబ్ బోర్డుపై వైఎస్ఆర్ పేరు ఇంకా కొనసాగుతోంది. ప్రభుత్వం అగ్రిల్యాబ్‌గా దీని పేరు మార్చినా స్థానిక అధికారులు చర్యలు చేపట్టలేదు. దీనిపై కూటమి నేతలు మండిపడుతున్నారు.
– అరకులోయ, న్యూస్‌టుడే

అరకులోయలో అగ్రిల్యాబ్‌కి కొనసాగుతున్న వైఎస్ఆర్ పేరు

రోడ్డు లేక బాధలు

పోతంగి పంచాయతీ పనసపుట్టు మోడల్ కాలనీలో వీధి రోడ్డు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుద్‌హుద్ తుపానుతో పనసపుట్టు గ్రామం తుడుచుకుపోయింది. నిరాశ్రయులైన గిరిజన కుటుంబాల కోసం అప్పటి తెదేపా ప్రభుత్వం మోడల్ కాలనీ నిర్మించింది. 56 మంది నిరాశ్రయులకు ఇక్కడ ఇళ్లు కేటాయించారు. విద్యుత్తు, తాగునీటి సదుపాయం కల్పించారు. వీధిరోడ్డు పనులు చేపట్టేలోగా ప్రభుత్వం మారింది. గత వైకాపా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

పనసపుట్టు మోడల్ కాలనీలో..

నిషేధంపై నిర్లక్ష్యం

డుంబ్రిగుడలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేస్తున్నాయి. ప్లాస్టిక్‌తో భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లుతోందని అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పర్యాటక కేంద్రాల్లో నిషేధం పక్కాగా అమలు కావడం లేదు. వీటి పరిసరాల్లో కుప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. డుంబ్రిగుడలో పంచాయతీ సిబ్బంది వీటిని సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

మొక్కలతో పర్యావరణ సమతుల్యత

చింతూరు, న్యూస్‌టుడే: పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా మొక్కలు దోహదపడతాయని సీఆర్పీఎఫ్ జీ141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రామకృష్ణవేణు చెప్పారు. అల్లిగూడెంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. సర్పంచి చంద్రయ్య, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మానే పాల్గొన్నారు.

మొక్కలతో విద్యార్థులు, సీఆర్పీఎఫ్ అధికారులు

హైడ్రో ప్రాజెక్టు వద్దు.. అడవులే ముద్దు!

అనంతగిరి, న్యూస్‌టుడే: హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గుమ్మకోట పంచాయతీ పరిధిలోని గిరిజనులు సర్పంచి పాగి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. గుమ్మకోట నుంచి భీమవరం వంతెన వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ర్యాలీ నిర్వహించారు. హైడ్రో వద్దు.. అడవులే ముద్దు.. అని నినదించారు. సర్పంచి మాట్లాడుతూ.. గిరిజనులకు హైడ్రో పవర్ ప్రాజెక్టులతో ఉపయోగం లేదని, పచ్చని పంట పొలాలే జీవనాధారమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కొండమ్మ, పెరుమళ్ల అప్పలస్వామి, పెరుమల మహేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ర్యాలీ

కలుషితాహారంతో కార్మికులకు అస్వస్థత

కాకినాడ, న్యూస్‌టుడే: కాకినాడ సీ పోర్టు ప్రాంతంలో ఓ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురవడంతో ఆదివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో చేరారు. ఒడిశాకు చెందిన ఆరుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ప్రాంతం నుంచి వచ్చిన ఎనిమిది మంది ఇక్కడ ఓ కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం భోజనం వండుకుని తిన్నారు. వారంతా రాత్రి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవడంతో తోటి కార్మికులు, సిబ్బంది జీజీహెచ్‌కు తరలించారు. వెంటనే వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం అందరూ కోలుకున్నారు. కలుషితాహారమే దీనికి కారణమని భావిస్తున్నారు. దీనిపై సర్పవరం పోలీసులు వివరాలు సేకరించారు.

కుమురం భీమ్ విగ్రహానికి మరమ్మతు

కూనవరం, న్యూస్‌టుడే: కోతులగుట్టలో కుమురం భీమ్ విగ్రహం చేతిని ఇటీవల దుండగులు ధ్వంసం చేయగా పోలీసులు సోమవారం మరమ్మతు చేపట్టారు. విగ్రహాల తయారీలో నైపుణ్యం వారితో విరిగిన చేతిని పునర్నిర్మించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన తెదేపా గ్రామ కమిటీ నాయకులు వెంకటేశ్వర్లు, రాంబాబు, వీరబాబు, జంపన్న, బాబ్జి డిమాండ్ చేశారు.

అప్రమత్తతతో క్షయ నివారణ

అడ్డతీగల, న్యూస్‌టుడే: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా క్షయను పూర్తిగా నివారించవచ్చని అడ్డతీగల సీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్ సూచించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌సీలో రోగులకు, వారి సహాయకులకు సోమవారం అవగాహన కలిగించారు. సిబ్బంది వాసు, ఊహ, సునీత, కళ్యాణ్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సతీష్

బొర్రాగుహలకు తగ్గిన పర్యాటకులు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలకు సందర్శకుల రాక తగ్గింది. సోమవారం ఈ ప్రాంతం వెలవెలబోయింది. చిరువ్యాపారులు నిరాశ వ్యక్తం చేశారు.

సర్వసభ్య సమావేశం 22న

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17న నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని 22కి వాయిదా వేశామని ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, ఎంపీపీలకు ఈ నెల 15 నుంచి 17 వరకు పెందుర్తిలో పీ4 సర్వేపై శిక్షణా తరగతులు ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేశామన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, తుప్పలను సత్యసాయి రక్షిత తాగునీటి పథకం కార్మికులు సోమవారం శ్రమదానంతో తొలగించారు. సున్నంపాడు - నూరుపూడి రహదారి వెంబడి తీగలను అడ్డుగా ఉండటం వల్ల గాలులు వీచిన ప్రతిసారీ విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది. తుప్పల తొలగింపుతో సమస్య పరిష్కారమవుతుందని కార్మికులు పేర్కొన్నారు. శ్రీను, వీరబాబు, గంగరాజు, చెల్లన్నదొర, కామిరెడ్డి, రమణ, త్రిత్వదాసు, వెంకటరెడ్డి శ్రమదానం చేసిన వారిలో ఉన్నారు

తుప్పలు తొలగిస్తున్న కార్మికులు

పాఠశాల భవనం నిర్మించాలని నిరసన

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలంటూ మండల పరిషత్తు కార్యాలయం ఎదుట గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.సూరిబాబు ఆధ్వర్యంలో కరుదేవపాలెం గిరిజనులు సోమవారం నిరసన చేపట్టారు. సూరిబాబు మాట్లాడుతూ.. పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుతుండగా భవనం శిథిలావస్థకు చేరి స్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయన్నారు. గోడలు బీటలు వారి కూలేలా ఉన్నాయన్నారు. వర్షం వస్తే నీరు గదిలోకి చేరడంతో విద్యార్థులకు ఇబ్బందులకు తప్పడం లేదన్నారు. వంచంగి పంచాయతీ కొత్తపల్లి జీపీఎస్ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 30 మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరిలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను వాతంగి ఆశ్రమ పాఠశాలకు తరలించినట్లు టీసీలు ఇచ్చారన్నారు. తమ పిల్లల్ని ఎక్కడికీ పంపమని, ఇదే పాఠశాలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంఈవో సత్యనారాయణదొరకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు శ్రీనివాస్, పీఎంసీ కమిటీ సభ్యులు దుర్గాదేవి, తల్లిదండ్రులు లోవకుమారి, రమణమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఆదమరిస్తే.. ప్రమాదమే!

దర్పణం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: వట్టిగెడ్డ జలాశయం ప్రధాన పంట కాలువకు రక్షణ గోడలు లేక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువలో అపరిశుభ్రంగా ఉంది. ఇటీవల ఒకరు ద్విచక్ర వాహనంతో కాలువలో పడి గాయపడ్డాడు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

రక్షణ గోడలు లేని పంట కాలువ

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాల్సిందే

పాడేరు, న్యూస్‌టుడే: షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి.. నూరుశాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు పలు ఆదివాసీ సంఘాలు, నిరుద్యోగులతో ఆదివాసీ గర్జన పేరిట సోమవారం ర్యాలీ నిర్వహించారు. రామారావుదొర మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఆందోళనలు చేపడుతున్నా.. ఉన్నతాధికారులు, మంత్రులకు విన్నవించినా కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆనంద్, ఆదివాసీ జేఏసీ నాయకులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ వద్ద నిరుద్యోగులు, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర తదితరుల ఆందోళన

చింతపల్లి ఆసుపత్రి పర్యవేక్షకురాలిగా నీలవేణి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణి (డీసీహెచ్ఎస్) డాక్టర్ నీలవేణి చింతపల్లి ఏరియా ఆసుపత్రి రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చిన్నపిల్లల వైద్యనిపుణులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు పర్యవేక్షకురాలిగా ఇందిర ప్రియాంక పనిచేశారు. నీలవేణి మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, వైద్యులు అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఆమెకు వైద్యులు వాసవి శ్రీలత, చందన, రుక్మిణి, భారతి, అనూషా, సిబ్బంది రాజారావు, అనిల్‌లు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

నీలవేణిని అభినందిస్తున్న వైద్యులు, సిబ్బంది

పంచాయతీ కార్యదర్శిగా ఖాజా మొయిద్దీన్

కూనవరం, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ కూనవరం కార్యదర్శిగా ఎండీ ఖాజా మొయిద్దీన్ సోమవారం విధుల్లో చేరారు. పిఠాపురంలో గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సురేశ్ బదిలీపై వెళ్లిపోయారు.

తహసీల్దార్‌గా త్రివేణి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ తహసీల్దార్‌గా త్రివేణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో చీడికాడ తహసీల్దార్‌గా పనిచేశారు. ఇక్కడ ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా పనిచేసిన ముజీబ్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. గిరిజన ప్రజలకు మెరుగైన సేవలు అందించి, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని త్రివేణి పేర్కొన్నారు. ఆర్ఐ రాము, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులు లేక.. చదువు సాగక!

రంపచోడవరం, న్యూస్‌టుడే

రంపచోడవరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రెండేళ్లుగా ఉపాధ్యాయుల కొరత పట్టిపీడిస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 285 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో 17 మంది ఉపాధ్యాయులకు కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. తెలుగు, హిందీ, లెక్కలు, ఫిజికల్ సైన్సు, బయాలజికల్ సైన్సు సబ్జెక్టులలో ఇద్దరేసి ఉపాధ్యాయులతో పాటు ఆంగ్ల ఉపాధ్యాయుడు లేరు. జూనియర్ అసిస్టెంటు ఒకటి, రికార్డు అసిసెంట్లు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాదిలో ఇదే పరిస్థితి ఉంటే అధికారులు డిప్యుటేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు విద్యాబోధన కానిచ్చారు. ఆ తర్వాత వారి యథాస్థానాల్లోకి వెళ్లిపోయారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కూడా ఉపాధ్యాయుల కొరత నెలకొంది.

రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాలకు గత విద్యా సంవత్సరంలో నలుగురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్ పద్ధతిలో నియమించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వారు యథాస్థానాలకు వెళ్లిపోయారు. ఉపాధ్యాయులను నియమించాలని ఇటీవల ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ దృష్టికి తీసుకెళ్లాం. – డి.సుందర్‌సింగ్, ఎస్ఎంసీ ఛైర్మన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి మండలం బలపం పంచాయతీలోని మారుమూల దిగజనబ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అయి నెలరోజులు దాటుతున్నా ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తికాలేదు. ఇటీవల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో చాలా పాఠశాలలకు గురువులు లేని పరిస్థితి ఎదురయ్యింది. మారుమూల పాఠశాలల్లో విధులు నిర్వహించేందుకు కొందరు ఉపాధ్యాయులు ముందుకు రావడం లేదు. ఎంటీఎస్ ఉపాధ్యాయులతో కొన్నిచోట్ల సర్దుబాటు చేశారు. గతంలో పనిచేసినవారు బదిలీపై వెళ్లడం.. ఆ స్థానంలో కొత్తవారు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై చింతపల్లి ఎంఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా.. ఉపాధ్యాయులు లేనిచోట్ల తాత్కాలికంగా సర్దుబాటు చేస్తున్నామన్నారు. కొత్త డీఎస్సీలో ఉపాధ్యాయులు వస్తే కొరత పూర్తిగా తీరుతుందని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే: ?: మండల పరిషత్తు కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలికి వెళ్లే రహదారిపై మూడు చోట్ల గోతులు పడ్డాయి. రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.
– పి.రామకృష్ణ, రంపచోడవరం
✔: గోతులను పరిశీలించి రోడ్డు మరమ్మతు చేయిస్తాం. – ప్రదీప్, ఏఈ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ?: విద్యానగర్ నుంచి అప్పలరాజుపేట రహదారికి వెళ్లే మార్గం గోతులమయంగా ఉంది. – రాజు, రాజవొమ్మంగి ✔: గోతులను పూడ్చిస్తాం.
– యాదగిరీశ్వరరావు, ఎంపీడీవో

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ?: మారేడుమిల్లి రహదారిపై పశువుల సంచారం అధికంగా ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. – గణేశ్, మారేడుమిల్లి
✔: పశువుల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. – శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

గంగవరం, న్యూస్‌టుడే: ?: చిన్నగార్లపాడులో చేతిపంపు పనిచేయడంలేదు నీటికి ఇబ్బందులు పడుతున్నాం. – లక్ష్మి, చిన్నగార్లపాడు. ✔: మరమ్మతులు చేయిస్తాం. – పండా చంద్రకళ, సర్పంచి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ?: గుంటగన్నెల పంచాయతీ డోమంగిలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది.
– హరి, డోమంగి
✔: ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరేచోటకు తరలిస్తాం.
– సత్యనారాయణ, ఏఈఈ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ?: ముంచంగిపుట్టు నుంచి కుమడ, బూసీపుట్టు వెళ్లే ప్రధాన రహదారిలో నందిమెట్ట సమీపంలో రోడ్డు మధ్యలో పడిన గుంత వరదనీటితో నిండి చెరువును తలపిస్తోంది.
– లక్ష్మణ్, స్థానికుడు
✔: మరమ్మతులు చేయిస్తాం. – రాముడు, ఏఈ, గి.సం.శాఖ, ముంచంగిపుట్టు



స్పందనకు వందనం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సున్నంపాడు - నూరుపూడి రహదారిలో అద్దరవీధి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలను సిబ్బంది సోమవారం సరిచేశారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు చింతచెట్టు కూలి తీగలపై పడింది. స్థానికులు చెట్టును నరికి పక్కకు తొలగించినప్పటికీ తెగిన తీగలను సిబ్బంది సరిచేయలేదు. 'తీగలను ఇలాగే వదిలేస్తారా?' శీర్షికన ఈ నెల 8న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

(c) eenadu

కార్లు తాకట్టు పెట్టి.. రూ.లక్షలతో ఉడాయించి..

తాడేపల్లి, న్యూస్‌టుడే: కార్లు అద్దెకు తీసుకుని వాటిని మరో చోట కుదవపెడుతూ రూ.లక్షల్లో కాజేస్తున్న ఘటనలపై హైదరాబాద్ పోలీసులు సోమవారం మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని ప్రాంతాల్లో విచారణ జరిపారు. కార్లను తాకట్టు పెట్టుకుంటున్న పలువురిని ఆరా తీశారు. వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఉండవల్లిలో ఓ వ్యక్తి నుంచి కారు అద్దెకు తీసుకుని చెన్నైలో తాకట్టు పెట్టాడు. అతను పోలకంపాడులో మరో కారును అద్దెకు తీసుకుని మంగళగిరిలో తాకట్టు పెట్టాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో హైదరాబాద్‌లోనూ ఫిర్యాదులు అందడంతో అక్కడి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో కారు తాకట్టుపెట్టి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలతో ఉడాయిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులు తమను సంప్రదించకుండానే కార్లు స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిసిందని, దీనిపై ఆరా తీస్తున్నామని తాడేపల్లి పోలీసులు చెబుతున్నారు.

అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు ఇబ్బందులున్నాయా?

ఈనాడు మిత్రుడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన విజయవాడ దుర్గగుడికి నిత్యం వేల సంఖ్యలో భక్తులొస్తుంటారు. ఏటా కనీసం కోటిన్నర మందికి పైగా భక్తులు దేశవిదేశాల నుంచి తరలివస్తున్నారు. తాజాగా ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వారి సమస్యలను దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ దృష్టికి తీసుకురావొచ్చు. ప్రధానంగా దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం, క్లోక్‌రూం, కేశఖండనశాల, చెప్పుల స్టాండ్లు, సెల్‌ఫోన్ కౌంటర్లు, స్నానఘాట్లు, ఆలయ ఉచిత బస్సులు సహా వేటికి సంబంధించిన సమస్యలున్నా ఈవో దృష్టికి తీసుకురావొచ్చు. దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేస్తే.. ఆలయ ఈవో పరిష్కారాన్ని చూపుతారు.

ఈ నెల 16న దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో 'ఈనాడు' ఫోన్‌ఇన్

73374 44081 | తేదీ: బుధవారం (16.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

కాళ్లరిగేలా తిరుగుతున్నా.. స్పందించని బ్యాంకర్లు

ప్లాట్లపై రుణాలు అందక రాజధాని రైతుల ఇక్కట్లు

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-తుళ్లూరు

రిటర్నబుల్ ప్లాట్లపై బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన విధంగానే ఇప్పుడూ మంజూరు చేయాలని కోరుతున్నా బ్యాంకర్ల నుంచి స్పందన లేదు. వివిధ అవసరాల కోసం ప్లాట్లను తాకట్టు పెట్టి రుణం తీసుకుందామన్నా చుక్కెదురవుతోంది. అటు సేద్యం లేక, ఇటు కుటుంబ అవసరాల కోసం చేతిలో డబ్బుల్లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ

రాజధాని నిర్మాణానికి 34,385 ఎకరాల భూమిని సీఆర్డీఏ సమీకరించింది. రైతులతో ఒప్పందం మేరకు వారికి నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించింది. భూములిచ్చిన వారిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువమంది ఉన్నారు. ఎకరాలోపు 20,490 మంది ఇచ్చారు. ఒకటి నుంచి రెండెకరాల్లోపు ఇచ్చిన వారు 5 వేల మందికి పైగా ఉన్నారు. పిల్లల చదువులు, వివాహాలు, ఆరోగ్య అవసరాలు, ఇళ్ల నిర్మాణాలకు ప్లాట్లను తాకట్టు పెట్టి రుణాలు పొందేందుకు అన్నదాతలు బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించడం లేదు. బిడ్డల ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు పంపాలన్నా చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని పరిస్థితి. పలువురు రైతులు వచ్చిన కాడికి ప్లాట్లను విక్రయించి పిల్లలను చదివిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం, చిరు వ్యాపారాలకూ డబ్బుకు కటకటలాడాల్సిన పరిస్థితులు.

☛ వెంకటపాలేనికి చెందిన సాంబశివరావు.. 81.6 సెంట్ల భూమిని ఇచ్చారు. సీఆర్డీఏ ఆయనకు 810 చదరపుగజాల నివాస, 360 చదరపు గజాల వాణిజ్య ప్లాట్లను కేటాయించింది. పెద్ద కుమార్తెకు వివాహం చేయగా.. మరో కుమార్తె, కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నారు. పిల్లల చదువులు, సొంతిల్లు నిర్మాణానికి రూ. 10 లక్షల అప్పు చేశారు. ప్రస్తుతం వ్యవసాయం లేక ఖాళీగా ఉంటున్నారు. ప్లాట్లు విక్రయిద్దామనుకున్నా మంచి ధర లేదు. సీఆర్డీఏ ఇచ్చిన ప్లాట్లపై బ్యాంకులో రుణం ఇవ్వకపోవటంతో అప్పులకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి.

☛ శాఖమూరుకు చెందిన రాజు.. స్థానికంగా వెల్డింగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఒక కుమార్తె 10వ తరగతి, మరొకరు 4వ తరగతిలో ఉన్నారు. పూలింగ్‌లో తండ్రి సుబ్బారావు, సోదరుడు శ్రీనివాసరావుతో కలిసి ఎకరా ఇచ్చారు. వెయ్యి చదరపు గజాల నివాస ప్లాట్‌ను గతంలో కుటుంబ అవసరాల కోసం తక్కువ ధరకు అమ్ముకున్నారు. ఇంకా 250 చదరపుగజాల వాణిజ్య ప్లాటు మిగిలింది. అప్పులు చేసి సొంతింటి నిర్మాణం చేపట్టారు. సమీప బంధువు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15 లక్షల అప్పు చేశారు. ఇంటి నిర్మాణం సగంలో నిలిచిపోయింది. ప్రస్తుతం భార్యతో పాటు కూలి పనులకు వెళ్తున్నారు. ప్లాట్‌పై రుణం ఇప్పిస్తే అప్పుల ఊబి నుంచి బయటపడతామంటున్నారు.

మార్గదర్శకాలు లేవంటూ...

వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మూడు రాజధానుల వైఖరితో అమరావతి నిర్మాణ పనులు నిలిపేసింది. అప్పట్నుంచి బ్యాంకులు రుణాలివ్వడం లేదు. సీఆర్డీఏ ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించినా బ్యాంకర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని చెబుతున్నా ఫలితం కనిపించడం లేదు. ప్లాట్లపై రుణాల మంజూరులో తమకు మార్గదర్శకాలు లేవంటూ బ్యాంకర్లు పట్టించుకోవడం లేదు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)లో సానుకూల నిర్ణయం తీసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మూడు నెలల క్రితం జరిగిన సమావేశంలో సీఆర్డీఏ వద్ద రిజిస్టర్ అయిన ప్లాట్లపై రుణాలివ్వాలని అధికారులు కోరినా ఇప్పటి వరకు కార్యాచరణ ప్రారంభం కాలేదు. మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు.

సచివాలయాలకు అద్దెల బకాయి

11 నెలలుగా నిలిచిన చెల్లింపులు

ఈనాడు - అమరావతి

వార్డు సచివాలయాలకు భవనాలను అద్దెకిచ్చిన యజమానులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతినెలా ఠంచనుగా అద్దె వచ్చేస్తుందన్న ఉద్దేశంతో భవనాలు ఇచ్చినా, ఇప్పుడు నెలల తరబడి బకాయిలు పేరుకుపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నారు. కొన్నిచోట్ల సిబ్బందితో సదరు యజమానులు వాగ్వాదానికి దిగుతున్నారు. మరికొన్నిచోట్ల ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం కనిపించక నిరుత్సాహపడుతున్నారు.

ఇదీ పరిస్థితి
జిల్లాలోని గ్రామ సచివాలయాలు: 232
వార్డు సచివాలయాలు: 336
జీఎంసీలోని సచివాలయాలు: 207
మొత్తం సిబ్బంది: 5,082
☛ జిల్లాలో సగానికిపైగా సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.
☛ గత 11 నెలలుగా అద్దె బకాయిలు పేరుకుపోయాయి.

జీఎంసీ పరిధిలోనే రూ.3 కోట్లు

గుంటూరు కార్పొరేషన్‌లోని 207 వార్డు సచివాలయాలకుగాను 164 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రతినెలా అద్దె కింద రూ.28.50 లక్షల చొప్పున చెల్లిస్తున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. గత 11 నెలలుగా నిధులు మంజూరు కావడం లేదు. ఒక్క కార్పొరేషన్ పరిధిలోనే సుమారు రూ.3 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక, గ్రామ సచివాలయాల లెక్క తీస్తే రెట్టింపు ఉంటుందన్నది సుస్పష్టం.

సాంకేతిక సమస్యతో ఆలస్యం

గత కొన్నేళ్లుగా సీఎఫ్ఎంఎస్ ద్వారానే ప్రభుత్వశాఖల బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం నిధి పోర్టల్ అందుబాటులోకి రావడంతో టీఓలు, సాంకేతిక పరిపాలన అనుమతులు, బిల్లింగ్, పేమెంట్.. ఇలా అన్నీ ఇందులోకే మార్చడం కీలకంగా మారింది. ఇలా మార్పులు చేయడం కూడా సచివాలయాల అద్దె సొమ్ముల ఆలస్యం కావడానికి ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల కార్యాలయాలకు తాళాలు వేసి యజమానులు నిరసన తెలిపిన ఉదంతాలు నమోదు కాగా.. బిల్లులను ప్రాసెస్ ప్రక్రియ ఇటీవలే పూర్తయిందని, త్వరలోనే చెల్లింపులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

విజి'లెన్స్'కు సహాయ నిరాకరణ

వర్సిటీలో అధికారుల తీరు

ఏఎన్‌యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అవకతవకలపై జరుగుతున్న విజిలెన్స్ విచారణకు కొంతమంది సహకరించడం లేదని తెలిసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అకడమిక్ ఎగ్జిబిషన్స్, యువజనోత్సవాల నిర్వహణపై వివరాలు అడిగి వారం రోజులైనా ఇచ్చేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. విజిలెన్స్ విచారణకు రాకముందే అక్రమాలపై ఆధారాలు లేకుండా చేసేందుకు యత్నించినట్లు సమాచారం. ఇందుకు వారికి కొంతమంది అధ్యాపకులు సహకరించినట్లు తెలిసింది. గతేడాది జులైలో బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు అక్రమార్కులపై ప్రేమ చూపిస్తున్నారు. ఇప్పటికీ ఓ అధికారి అప్పటి వీసీతో సత్సంబంధాలు కొనసాగిస్తుండడం, తరచుగా ఆయనతో రహస్య సమావేశాలు నిర్వహిస్తుండడంతో అక్రమాలు బయటకు రాకుండా కప్పిపెడుతున్నట్లు సమాచారం. వర్సిటీలో చోటు చేసుకున్న అక్రమాలపై గత పది రోజులుగా విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగం చేసిన పనులను పరిశీలించారు. ఫార్మసీ కళాశాల వద్ద డ్రైనేజీ పైపులైను ఎందుకు బయట నిర్మించారని ఆరా తీశారు. స్థలం లేక.. అలా నిర్మించాల్సి వచ్చిందని అధికారులు చెప్పినట్టు తెలిసింది. ఇంజినీరింగ్ పనుల్లో కొన్ని అక్రమాలు గుర్తించినట్టు చెబుతున్నారు.

చినుకు రాలక.. సాగు సాగక

వేసవిని తలపిస్తున్న వాతావరణం

ఈనాడు - అమరావతి

నడి వేసవి మే నెలలో మంచి వానలు పడ్డాయి. వర్షాకాలమైన జూన్ నుంచి పరిస్థితి తారుమారు అయింది. జూన్, జులై నెల్లో ఉమ్మడి జిల్లాలో 50శాతంపైగా లోటు వర్షపాతం కొనసాగుతోంది. గత 45 రోజులుగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సాధారణంగా జులై నెలలో 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డవుతుంటాయి. సోమవారం 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సగటున 0.5 నుంచి 0.6 డిగ్రీలు అధికంగా ఉంటోంది. వర్షాల్లేని కారణంగా సాగు ముందుకు సాగడం లేదు. బోరుబావుల కింద వేసిన పంటలు సైతం పొడిగాలులకు దెబ్బతింటున్నాయి. ఇటీవల కాలంలో ఇలాంటి పరిస్థితి చూడలేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా.

☛ ఉమ్మడి జిల్లాలో జూన్ నుంచి పంటల సాగు మొదలవుతుంది. మే నెలలో కురిసిన వర్షాలకు పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకున్నారు. పత్తి సాగు జులై 15 నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు నామమాత్రంగానే సాగు చేశారు. పల్నాడు జిల్లాలో పత్తి సాగు ఆశించిన స్థాయిలో లేకపోవడం, మిర్చిపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో కర్షకులు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. సాగర్ కాలువలకు నీటి విడుదలపై స్పష్టత వస్తే ఈసారి మొక్కజొన్న ఎక్కువగా సాగు చేసే అవకాశం ఉంది. కృష్ణా డెల్టా [illegible] ఉండటంతో వరి సాగు అంతంతమాత్రంగానే ఉంది. పక్షం రోజుల కిందట వెదపద్ధతిలో వరి విత్తనాలు వేశారు. భూమిలో తగినంత తేమ లేకపోవడం, మంచి వర్షం లేనందున ధాన్యం మొలకలు రాలేదు. మంచి వర్షం వస్తే సాగు ఊపందుకుంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వాన కురవడానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ఎత్తుగాలులు వీయడం వల్ల వర్షం పడటం లేదు. జులై నెలలో గాలి వేగం గంటకు 18 నుంచి 20 కిలోమీటర్లు ఉండాలి. 32 నుంచి 42 కిలోమీటర్ల వేగంతో వీయడం ప్రతికూలంగా మారింది. తేమతో కూడి గాలులు కాకుండా.. ఎత్తుగాలుల వేగం వల్ల వర్షం కురవడం లేదు. - లాంఫాం శాస్త్రవేత్త సునీల్‌కుమార్

సాగు లేక ఖాళీగా ఉన్న పొలం

మూడు జిల్లాల పరిధిలో పంటల సాగు ఇలా.... (అంకెలు హెక్టార్లలో)

జిల్లా	విస్తీర్ణం	సాగైంది
గుంటూరు	88,532	8,255
పల్నాడు	2,25,087	12,662
బాపట్ల	1,08,241	2,647

☛ గుంటూరు జిల్లాలో జూన్ నెలలో కురవాల్సిన వర్షం 97.1 మిల్లీమీటర్లు. కురిసింది మాత్రం 65.1 మిల్లీమీటర్లు. జులైలో 13 వరకు కురవాల్సింది 69.2 మిల్లీమీటర్లు కాగా కురిసింది కేవలం 10.1 మిల్లీమీటర్లు. అంటే 85 శాతం లోటు ఉంది.

కన్న కొడుకే.. కాలయముడై..

ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన వైనం

తాడికొండ, న్యూస్‌టుడే: ఆస్తి కోసం కన్న తండ్రినే హతమార్చాడు ఓ కర్కశ కుమారుడు. గుండెలపై ఎత్తుకు పెంచిన నాన్ననే కాలయముడై కడతేర్చాడు. తాడికొండ సీఐ వాసు తెలిపిన వివరాల మేరకు.. . గ్రామానికి చెందిన వేల్పూరి శివయ్య(57) పల్నాడు జిల్లా ఈపూరు మండలం పొనుగోటివారిపాలెంలోని ఓ కోళ్లఫారంలో పనిచేస్తుంటారు. ఆయనకు భార్య, కుమారుడు నరేంద్ర, ఓ కుమార్తె ఉన్నారు. కుమారుడికి వివాహమైంది. ఆస్తి గొడవల నేపథ్యంలో శివయ్య కుటుంబానికి దూరంగా ఉంటున్నారు. అప్పుడప్పుడూ గ్రామంలోని తల్లిని చూసేందుకు వస్తుంటారు. ఈ నెల 9న రాత్రి 8.30 సమయంలో గ్రామంలోనే వేరుగా ఉంటున్న భార్య, పిల్లల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన పేరుపై ఉన్న 1.40 ఎకరం భూమి విషయంలో నరేంద్ర గొడవకు దిగాడు. ఆస్తి తనకు రాయకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. అనంతరం నిద్రిస్తున్న తండ్రిని గొంతు నులిమి హతమార్చాడు. నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. కాగా శివయ్య అనుమానాస్పద మృతిపై తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు తాడికొండ పోలీసులు ఈ నెల 9న కేసు నమోదు చేశారు.

నివేదిక ఇవ్వరు.. నిగ్గు తేల్చరు..!

రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంపై మీనమేషాలు

ఈనాడు - అమరావతి

ఏపీఎస్ఐడీసీ స్థలాన్ని తిరిగి దక్కించుకోవడానికి జిల్లా యంత్రాంగం ఎందుకనో మౌనం దాలుస్తోంది. నెలలు గడుస్తున్నా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపకుండా అంతులేని జాప్యం చేస్తోంది.

గుంటూరు నగరంలో నరసరావుపేట మార్గంలో చుట్టగుంట వద్ద రూ. 10 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని గత వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయించారు. కృష్ణా జిల్లాకు చెందిన అప్పటి మంత్రి ఒకరు జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి పని కానిచ్చేశారు. ప్రైవేటు వ్యక్తులకు కేటాయించిన వెంటనే ఆ భూమి చేతులు మారడంపైనా పలు అనుమానాలున్నాయి. అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు.. నాటి మంత్రి ఒత్తిడితో మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సదరు స్థలం ఏపీఎస్ఐడీసీకి చెందినదని జలవనరులశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీనిపై జిల్లా యంత్రాంగాన్ని నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు కోరారు. ఈ విషయం 'ఈనాడు' వెలుగులోకి తీసుకురావడంతో అటు అధికారుల్లోనూ కదలిక మొదలైంది. నెలలు గడుస్తున్నా.. సమగ్ర నివేదిక పంపడం లేదు. నాడు ప్రైవేటు వ్యక్తులకు కేటాయించిన విషయాన్ని ఏపీఎస్ఐడీసీ అధికారులకు తెలియజేయకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటో తేల్చాల్సి ఉంది.

ప్రైవేటు వ్యక్తులకు చిక్కిన స్థలం

విలువైన 2,200 గజాల స్థలం.. 1991లో అప్పటి కలెక్టరు అంకిరెడ్డిపాలెం పరిధిలో సర్వే నంబరు 167-బీ2లో 2,200 గజాలను అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగం కింద ఏపీఎస్ఐడీసీకి కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వలేదు. ఆ స్థలంలో ఏపీఎస్ఐడీసీ భవనాలు నిర్మించుకుని కార్యకలాపాలు సాగించింది. శిథిలమైన భవనాన్ని 2015లో కూల్చేసి కొత్తది నిర్మించేందుకు జీఎంసీ నుంచి ప్లాన్ తీసుకుంది. ప్రభుత్వం నుంచి నిధుల రాక ఆలస్యమవడంతో 2019లో స్థలం చుట్టూ గోడ నిర్మించి రక్షణ చర్యలు చేపట్టింది. 2019లో వైకాపా అధికారంలోకొచ్చాక భవన నిర్మాణానికి నిధులివ్వలేదు. ఈ స్థలాన్ని ఖాళీగా ఉందని చూపించిన రెవెన్యూశాఖ.. ఏపీఎస్ఐడీసీకి కనీసం సమాచారం ఇవ్వకుండానే 2022లో ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టింది. ఆటోనగర్ సమీపంలో సదరు ప్రైవేటు వ్యక్తికి చెందిన స్థలం ఆక్రమణకు గురైతే తొలగించి స్థలాన్ని అప్పజెప్పకుండా అత్యంత విలువైన స్థలాన్ని ఇచ్చేసింది. ప్రణాళిక ప్రకారం నాటి మంత్రి అండగా వ్యవహారాన్ని చక్కబెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా దర్యాప్తు వేగవంతం కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మింగినోళ్లు కక్కేలా.. మునిగినోళ్లకు దక్కేలా..

అద్విక, యుపిక్స్ బాధితులకు త్వరలో న్యాయం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

ఇటీవల విజయవాడ కేంద్రంగా వెలుగుచూసిన ఆర్థిక మోసాల్లో బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. యుపిక్స్, అద్విక ట్రేడింగ్ మోసాలకు సంబంధించి లావాదేవీలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. రెండు సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన వారికి సాయం చేసేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. రావాల్సిన దాని కన్నా ఎక్కువ మొత్తం తీసుకున్న ఏజెంట్లు, కొందరు డిపాజిటర్లను గుర్తించి వారి నుంచి ఆ మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు సంస్థల బాధితుల కోసం వేర్వేరు ఖాతాల్లో జమ చేయనున్నారు. న్యాయ సలహా కూడా తీసుకున్నారు. పచ్చజెండా ఊపడంతో ఒకటి, రెండు రోజుల్లో ముగించనున్నారు. అగ్రిగోల్డ్ కుంభకోణంలా ఏళ్ల తరబడి సాగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అడుగులు పడుతున్నాయి. చివరలో పెట్టుబడులు పెట్టిన వారు ఎక్కువగా నష్టపోయారు.

25వేల లావాదేవీల పరిశీలన

అద్విక ట్రేడింగ్ కంపెనీ కుంభకోణంలో అన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. దాదాపు 16 ఖాతాలకు సంబంధించి మూడేళ్ల వ్యవధిలో 25 వేల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. వీటిని పోలీసులు వడపోస్తున్నారు. డిపాజిటర్ల నుంచి వచ్చింది ఎంత? ఏజెంట్లకు కమీషన్ రూపంలో చెల్లించింది ఎంత? అంతిమంగా ఎవరు లబ్ధి పొందారు? తదితర అంశాలను లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మొత్తం 43 మంది ఏజెంట్లు ఉన్నారు. వీరిలో 35 మంది రూ.100కోట్ల మేర లాభపడినట్లు తేల్చారు. విచారణకు రాకుండా పరారీలో ఉన్న ఏజెంట్ల ఖాతాలను కూడా చూస్తున్నారు. అనుచిత లబ్ధి పొందిన వారిని ఇప్పటికే గుర్తించారు. వారిని పిలిపించి ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని చెబుతున్నారు.

153 మందికి అనుచిత లబ్ధి

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో జరిగిన యుపిక్స్ కుంభకోణానికి సంబంధించి కూడా పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇప్పటికే దీనిపై విజయవాడలోని సత్యనారాయణపురం స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దాదాపు రూ. 400 కోట్ల మేర చెల్లింపులు చేయకుండా కిరణ్ బోర్డు తిప్పేశాడు. ఈ కేసులో కూడా పలువురు ఎక్కువగా లబ్ధి పొందినట్లు ఖాతాల పరిశీలనలో తేలింది. 153 మంది రూ.120 కోట్ల మేర ప్రయోజనం పొందారు. 196 మంది రూ. 195 కోట్ల మేర నష్టపోయారు. రూ.75 కోట్ల మేర ఏజెంట్లకు కమీషన్, నిందితుడు సొమ్మును దారి మళ్లించినట్లు అనుమానిస్తున్నారు.

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పక్కన రాష్ట్ర మంత్రి సవిత

గుంటూరు మిరపకు జాతీయ స్థాయిలో గుర్తింపు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఒక జిల్లా-ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కింద గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి దక్కడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. దేశ రాజధాని న్యూదిల్లీలోని భారత మండపం (ప్రగతి భవన్)లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా గుంటూరు మిరపకు వచ్చిన పురస్కారాన్ని కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మొదటి బహుమతి అందుకోవడం జిల్లా తరపున ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు.

చినలింగాయపాలెంలో రహదారిపై గ్రామస్థుల నిరసన

'ఆరేళ్లుగా గుంతల దారితో నరకం చూస్తున్నాం'

చినలింగాయపాలెం(కాకుమాను): నాడు వైకాపా పాలనలో రహదారి నిర్మాణం చేయలేదు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి అయింది. అయినప్పటికీ మా రహదారి నిర్మాణం చేపట్టలేదని కాకుమాను మండలంలోని చినలింగాయపాలెం సర్పంచితో పాటు గ్రామస్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పాండ్రపాడు నుంచి వట్టిచెరుకూరు వరకు సుమారు ఆరు కిలోమీటర్లు ప్రయాణానికి నరకం చూస్తున్నామని, వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురి అయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, కార్లు వచ్చే పరిస్థితి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారికి 2024-25 ఏడాదిలో రూ.2.70 కోట్లు నిధులు మంజూరు చేశారని, అధికారులు టెండర్లు పిలిచారన్నారు. గుత్తేదారులు మాత్రం పనులు ప్రారంభించలేదన్నారు. సమస్యను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వారు వాపోయారు. 5 గ్రామాల ప్రజలు గుంటూరు వెళ్లాలన్నా..రైతులు పంట ఉత్పత్తులు తరలించాలన్నా ఈ మార్గమే కీలకమని, నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

అవకరాలను తొలగించి.. చిరునవ్వులు కురిపించి..

జీజీహెచ్‌లో ఉచితంగా రూ.లక్షల విలువైన శస్త్రచికిత్సలు

నేడు ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం

ఈనాడు - అమరావతి

■ గతేడాది నవంబరులో మంగళగిరికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు సాకిర్‌కు టపాకాయల పేలుళ్లలో దాదాపు 80 శాతం కాలిన గాయాలయ్యాయి. జీజీహెచ్‌లోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆ బాలుడికి మెరుగైన రూపాన్ని తేవడానికి చేసిన కృషి ఫలించింది.

■ ఇటీవల గుంటూరుకు చెందిన మూడేళ్ల అయాన్ గ్రహణంమొర్రి (క్లెఫ్ట్ లిప్)తో రాగా.. ఉచితంగా శస్త్రచికిత్స చేసిన జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యబృందం చక్కని రూపాన్ని అందించింది.

ప్లాస్టిక్ సర్జరీ.. అందవిహీనంగా ఉన్నవారి జీవితాలు మార్చడానికి వైద్యశాస్త్రం అందించిన ఓ వరం. అవయవాలు, ముఖరూపం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచి.. భరోసా కల్పించే ఆయుధం. అలాంటి ప్రత్యేక వైద్యసేవల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల మంచి పనితీరు కనబరుస్తోంది. క్లిష్టమైన ప్లాస్టిక్, కాస్మెటిక్ సర్జరీలకు ఈ ఆసుపత్రి నెలవుగా ఉంది. ప్రైవేటులో రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన శస్త్రచికిత్సలను ఇక్కడ ఉచితంగా చేస్తున్నారు. కరెంటు షాక్ గురైన వారికి బోదకాలుతోపాటు.. ప్రమాదాల్లో వేళ్లు, చేతులు తెగిన వారికి మెరుగైన చికిత్స అందించి కొత్తరూపు ప్రసాదిస్తున్నారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే ముఖ లోపాలను సరిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

సంవత్సరం	శస్త్రచికిత్సలు	మేజర్	మైనర్
2022-23	650	300	350
2023-24	700	350	350
2024-25	400	250	150

గుంటూరు జీజీహెచ్‌లో ఇటీవల జరిగిన ప్లాస్టిక్ సర్జరీల తరవాత పరిస్థితి ఇలా..

ఇదీ ప్రస్థానం..

పుష్కరం క్రితం ఇక్కడ ప్లాస్టిక్ సర్జరీ సేవలు మొదలయ్యాయి. ఏటా 500 - 600 మంది వినియోగించుకుంటున్నారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితాశంకర్‌తోపాటు అసోసియేట్ ప్రొఫెసర్ కేవీఎన్ ప్రసాద్, ముగ్గురు సహాయక ప్రొఫెసర్లు, 8 మంది పీజీ వైద్య విద్యార్థులు సేవలందిస్తున్నారు.

సేవలివీ..

☛ అత్యవసర సేవల్లో భాగంగా అన్నిరకాల ప్రమాదాల కేసుల్లో చేతులు, కాళ్లు, తల గాయాలకు ఫ్లాప్ కవర్ చికిత్స. ముఖంలో విరిగిన ఎముకలకు శస్త్రచికిత్స. ☛ అక్యూట్ బర్న్ కేర్, పోస్ట్ బర్న్ సీక్వెలేలో కాలిన గాయాలకు శస్త్రచికిత్సలు ☛ క్యాన్సర్ వచ్చిన భాగాన్ని తొలగించి ఫ్లాప్ కవర్ సర్జరీల్లో భాగంగా రీకన్‌స్ట్రక్షన్ ఆపరేషన్లు ☛ గ్రహణంమొర్రి క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ ప్యాలెట్ ఆపరేషన్లు ☛ పుట్టుకతో కాలి, చేతివంకర్లు, అతుకున్న వేళ్లను సరిచేయడం. ☛ వంకర ముక్కు సరిచేయడం (రైనోప్లాస్టి), బ్రెస్ట్ రిడక్షన్, బ్రెస్ట్ ఆగ్‌మెంటేషన్, గైనెకోమేస్టియా, పొట్టకొవ్వు తగ్గించడం.

సద్వినియోగం చేసుకోండి

గుంటూరు జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ద్వారా మెరుగైన సేవలందిస్తున్నాం. మా బృంద కృషితో అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపడం ఆనందంగా ఉంది. ఆ సేవలను సద్వినియోగం చేసుకోండి. **- డాక్టర్ సుమితాశంకర్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి, జీజీహెచ్**

పత్రాల్లేని విత్తనాలు, పురుగు మందుల విక్రయం నిలిపివేత

దుకాణంలో తనిఖీలు

జిల్లా పరిషత్తు, పొన్నూరు, చేబ్రోలు: వ్యవసాయ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులు పురుగు మందులు, విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. గుంటూరులోని మూడు విత్తన దుకాణాల్లో రూ.60.17 లక్షల విలువైన మిరప, సోయాబీన్స్ విత్తనాల అమ్మకాలను రికార్డులు చూపని కారణంగా నిలిపేశారు. నాలుగు ఎరువుల దుకాణాల్లో రూ.1.66 లక్షల విలువైన 5.35 టన్నుల ఎరువులు, మూడు పురుగుమందుల దుకాణాల్లో రూ.14.13 లక్షల విలువైన 3,460 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. తనిఖీల్లో ఏడీఏలు పి.మురళీకృష్ణ, ఎం.సునీల్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్.రవిబాబు, ఏవోలు సునీల్, బి.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు. ☛ పొన్నూరులో రూ.22,55,810 పురుగు మందులకు అనుమతి పత్రాల్లేవని గుర్తించారు. నారాకోడూరు,చేబ్రోలులో రూ.1.11లక్షలవిలువైన 32.7 క్వింటాళ్ల విత్తనాలు, రూ.1.66 లక్షల విలువైన 53 టన్నుల ఎరువులను నిలిపేశారు.

KONERU LAKSHMAIAH EDUCATION FOUNDATION
(Deemed to be University u/s 3 of UGC Act 1956)
29-36-38, Museum Road, Governorpet, VIJAYAWADA, A.P - 520 002. Ph: 08645-350200

DEPARTMENT OF ARCHITECTURE
Applications are invited from the eligible candidates for faculty positions

S.No.	Name of the Posts	No. of Post
1	PRINCIPAL	1
2	PROFESSOR	1
3	ASSOCIATE PROFESSOR	3
4	ASSISTANT PROFESSOR	10

• Qualification, Experience and Pay scale as per Council of Architecture norms
• Applications with full particulars to reach careers@kluniversity.in on or before 31.07.2025
www.kluniversity.in REGISTRAR

'పరామర్శల పేరుతో ప్రజలపై జగన్ దండయాత్ర'

మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పట్టాభిపురం: 'అధికారం కోల్పోయిన దగ్గర నుంచి జగన్ పరామర్శల పేరుతో ప్రజలపై దండయాత్రలు చేస్తున్నారు. సింగయ్య మృతి కేసు ఛార్జిషీట్లో ప్రథమ ముద్దాయిగా జగన్‌ను పెట్టాలి'.. అని తెదేపా జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. గుంటూరులోని తెదేపా జిల్లా కార్యాలయంలో సోమవారం శ్రావణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. 'పరామర్శల పేరుతో సొంత పార్టీ కార్యకర్తని పొట్టన పెట్టుకోవడమే కాకుండా... కొంత మంది అల్లరి మూకల్ని పోగుచేసి పరామర్శ అర్థాన్నే మార్చేశారు. పేర్ని నాని నోటికొచ్చినట్లు మాట్లాడుతూ ప్రజల్లో భయాందోళనలు కలిగేలా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకుంటుంటే.. వైకాపా నాయకులకు ఏం చేయాలో అర్థంకాక పరామర్శ పేరుతో మామిడి పండ్లను రోడ్డుపై పారబోసి ట్రాక్టర్లతో తొక్కించారు. మద్యం స్కామ్‌లో రోజుకో విషయం వెలుగుచూస్తుంటే. . ప్రజల దృష్టి మళ్లించేందుకు పేర్ని నాని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎంత రెచ్చగొట్టినా ప్రభుత్వం చట్టప్రకారమే నడుచుకుంటుంది'.. అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ 'వైకాపా అయిదేళ్ల పాలనలో అకాల వర్షాలు, వరదలు వస్తే రైతుల ముఖం చూడని జగన్ అధికారం కోల్పోయాక కపట ప్రేమ కురిపిస్తున్నారు. సజ్జల రాసిస్తున్న స్క్రిప్టును రోజుకొక వైకాపా నాయకుడు మీడియా ముందు వల్లె వేస్తున్నాడు. జగన్ కారు కింద పడి సింగయ్య మరణిస్తే.. లాగి పక్కన పడేసి వెళ్లిపోయారు. దళితులకు న్యాయం జరగాలనుకునే సంఘాలుంటే తక్షణమే సింగయ్య మృతి కేసులో జగన్‌పై కేసు నమోదు చేయించాలి. సంబంధం లేని కేసులు నాపై పెట్టించి వైకాపా నేతలు ఆనందం పొందాలని చూస్తున్నారు'.. అని ధ్వజమెత్తారు. సమావేశంలో తెదేపా నాయకులు దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల పేరిట రూ.కోట్లు కుమ్మరించారు..

❖ నాడు ఇష్టారాజ్యంగా విద్యుత్తు సబ్‌స్టేషన్లు
❖ నేడు వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ

ఏటుకూరు కాలనీలో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన చోట రూ.కోట్లు వెచ్చించి 33/11 కేవీ విద్యుత్తు పంపిణీ కేంద్రాలు నిర్మించారు. ప్రస్తుతం ఆ కాలనీల్లో కొద్దిమంది మాత్రమే నివాసం ఉండడంతో ఆ పంపిణీ కేంద్రాలపై లోడ్ తక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో వాటిని గరిష్ఠంగా వినియోగించుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వందలాది ఎకరాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి అనుగుణంగా పంపిణీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.కోట్లు ఖర్చు చేశారు. సెంట్రల్ డిస్కం సీఎండీగా ఇటీవల పుల్లారెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం సమీక్షలు నిర్వహించి క్షేత్ర స్థాయి అధికారులతో మాట్లాడినపుడు నిరుపయోగ సబ్‌స్టేషన్ల విషయం వెలుగులోకి వచ్చింది.

కాగితాలపై అంకెల గారడీ

పేదలకు ఇళ్ల స్థలాల కోసం పేరేచర్ల, ఏటుకూరు, కొర్నెపాడు, పసుమర్రు వంటి చోట్ల ప్రతిపాదించిన కాలనీల్లో అధిక లోడ్ ఉంటుందని కాగితాలపై అంకెల గారడీ చేసి సుమారు రూ.35 కోట్లతో విద్యుత్తు సబ్ స్టేషన్లు నిర్మించారు. ప్రస్తుతం అక్కడ ఇళ్ల నిర్మాణం లేనందున లోడ్ చాలా తక్కువగా ఉంటోంది. అప్పులు తెచ్చి వాటిని నిర్మించారు. పైగా రాబడి లేదు. పసుమర్రులో పాతది ఉండగానే కాలనీలో మరొకటి నిర్మించారు. దీంతో వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు.

సెమీ ఇండోర్ సబ్ స్టేషన్లు

సాధారణంగా పట్టణాలు, నగరాల్లో స్థలం అందుబాటులో లేనిచోట సెమీ ఇండోర్ సబ్ స్టేషన్లు నిర్మిస్తారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన కాలనీల్లోనూ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్లు నిర్మించడం గమనార్హం. ఇందుకోసం ఒక్కొక్క పంపిణీ కేంద్రంపై సుమారు రూ.2 కోట్లు అదనంగా ఖర్చుచేశారు. గుత్తేదార్లకు మేలు జరిగేందుకే గత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పలువురు విమర్శిస్తుండడం గమనార్హం. కొత్త సబ్‌స్టేషన్లలో తొలుత పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి బిగిస్తారు. ఆ తర్వాత లోడ్ పెరుగుతుంటే రెండోది ఏర్పాటు చేస్తారు. ఈ కాలనీల్లో ఒకేసారి రెండు బిగించారు.

అధికారుల ఆలోచనతో సర్దుబాటు

కాలనీల్లో కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్లపై లోడ్ తక్కువగా ఉన్నందున అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ❖ ఏటుకూరు సబ్ స్టేషన్ నుంచి ఇప్పటికే ఏటుకూరు, ప్రత్తిపాడుకు కొత్త లైన్లు వేశారు. ఇంకా రెండు ఫీడర్లు ఖాళీగానే ఉన్నాయి. ❖ కొర్నెపాడు సబ్ స్టేషన్ నుంచి పక్కనే ఉన్న కోల్డ్ స్టోరేజీలకు ప్రత్యేక ఫీడరు ఇవ్వాలని ప్రతిపాదించారు. మరొకటి ఇంజినీరింగ్ కళాశాల వైపు ఏర్పాటు చేస్తున్నారు. ❖ పేరేచర్ల నుంచి చినపలకలూరు, దాసరిపాలెం, విశదల తదితర ప్రాంతాల్లో ఉన్న సర్వీసులను కలుపుతూ కొత్త ఫీడర్లు వేస్తున్నారు. ❖ పసుమర్రు నుంచి సమీప పారిశ్రామిక సర్వీసులకు ఫీడర్లు వేయనున్నారు. ఆయా సబ్ స్టేషన్లలో ఉన్న రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకదాన్ని ఇప్పటికే ఓవర్‌లోడ్ ఉన్న సబ్‌స్టేషన్లకు మార్చనున్నారు.

'అప్పుల్లో ఉన్నా.. హామీలన్నీ నెరవేరుస్తున్నాం..'

దుగ్గిరాల, న్యూస్‌టుడే: రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ 'తల్లి వందనం' అందేలా ప్రభుత్వం సంకల్పిస్తే.. ఆ సమయంలో రాష్ట్రానికి అప్పు ఇవ్వొద్దంటూ వైకాపా నాయకులు ఆర్బీఐకు లేఖలు రాసి దుర్మార్గంగా వ్యవహరించారని ఆరోపించారు. కానీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎక్కడా వెనుకడుగు వేయకుండా పథకాన్ని అమలు చేశారన్నారు. దుగ్గిరాల మండలం మంచికలపూడిలో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల నుంచి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని తదనుగుణంగా అభివృద్ధి కార్యాచరణ రచించేందుకు ఈ కార్యక్రమం తొలి అడుగు అని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని నిలబెట్టారన్నారు. తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీపీ షేక్ జబీన్, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు మరీదు రాము, నాయకుడు యేమినేని కోటేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మి తదితరులున్నారు.

స్థానిక మహిళకు కరపత్రం అందజేస్తున్న మంత్రి అనగాని, శ్రీఅనిత, జబీన్ తదితరులు

ఏడాది సర్వీసు పూర్తయితే పదోన్నతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో సహాచార్యులుగా ఏడాది సర్వీసు పూర్తయిన వారి వివరాలు వెంటనే పంపించాల్సిందిగా రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు సోమవారం కోరారు. దీంతో అర్హులైన వారంతా సంబంధిత పత్రాలను వెంటనే అందజేయాల్సిందిగా ప్రిన్సిపల్ సూచించారు. ఈ సమాచారాన్ని మంగళవారం డీఎంఈ కార్యాలయానికి పంపనున్నారు. ఇందులో కొందరికి ఆచార్యులుగా పదోన్నతి ఇవ్వనున్నారు. నిబంధనల ప్రకారం సహాచార్యులుగా మూడేళ్లు పూర్తయితేనే ఆచార్యులుగా పదోన్నతిస్తారు. ఆ నిబంధనను సడలించి ప్రస్తుతం ఏడాది పూర్తయినవారికీ ఉద్యోగోన్నతి ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా మాలిని

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రం (పురుష) ప్రిన్సిపల్‌గా మాలినిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం జీవో జారీ చేశారు. ఏలూరు డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న ఆమెను తొలుత గుంటూరు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసరుగా గత నెల 27న బదిలీ చేశారు. ఆమె ఆ పోస్టులో చేరకుండానే శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా సవరించిన ఉత్తర్వులు తెచ్చుకోవడం గమనార్హం.

బర్లీ పొగాకు కొనుగోలులో రైతులకు ఇబ్బంది రానీయొద్దు


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు-అమరావతి, గుంటూరు(జిల్లాపరిషత్): హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గోదాములు నిండిన నేపథ్యంలో.. ప్రైవేటు గోదాములను అద్దెకు తీసుకుని పొగాకు అక్కడికి తరలించాలని, అందుకయ్యే ఖర్చులను మార్క్‌ఫెడ్ భరిస్తుందని హామీ ఇచ్చారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. 2024-25 సంవత్సరంలో 80 మిలియన్ కిలోల ఉత్పత్తిని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 22 పొగాకు కంపెనీలు 36 మిలియన్ కిలోల పంట కొనుగోలు చేశాయని వివరించారు. ఈ నెల 21 నుంచి సన్న, చిన్నకారు రైతుల దగ్గరున్న మొత్తం పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 1,276 రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని అచ్చెన్నాయుడు వివరించారు. రానున్న సీజన్‌లో రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలు వేయాలని, అందుకనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఎక్స్-అఫీషియో ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు ఎస్.దిల్లీరావు, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కలెక్టర్లు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, లగ్జరీ విలేజ్ అపార్ట్‌మెంట్ Flat No. 107, మంగళగిరి తాడేపల్లి, నవులూరు గ్రామం కాపురస్తులు అత్మకూరి లక్ష్మీ నారాయణ, భార్య శివ పార్వతి గార్లు సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ముమ్మిడి జయరాం గారి నుండి క్రయము పొందుటకు ...

డాక్టర్ సుంకర నాగలక్ష్మి, అడ్వకేట్, 5-3-4/3, శ్రీ భవన్, రామయ్యపేట స్ట్రీట్, గుంటూరు. ఫోన్: 98855 85999
తేది: 15-07-2025

గుంటూరు వైద్యుడు హేమంత్‌కు రెండు ఫెలోషిప్‌లు

హేమంత్ ఉప్పుటూరి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరోసర్జన్ హేమంత్ ఉప్పుటూరి లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన జరిగిన సమారోహంలో ఫెలోషిప్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఎఫ్ఆర్‌సీఎస్), ఇంటర్నేషనల్ సర్జికల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఫెలోషిప్(ఐఎస్‌టీపీ)లను అందుకున్నారు. ఈమేరకు గుంటూరులో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హేమంత్ ఉప్పుటూరి ఆ వివరాలు వెల్లడించారు. ఎఫ్ఆర్‌సీఎస్, ఐఎస్‌టీపీ రెండింటినీ ఒకేసారి అందుకున్న తొలి వ్యక్తిగా తనకు గుర్తింపు దక్కిందన్నారు. లండన్‌లో శిక్షణ సమయంలో నేర్చుకున్న నైపుణ్యాలతో స్థానిక రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించగలనని చెప్పారు. గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, వెల్లూరు క్రిస్టియన్ వైద్య కళాశాలలో న్యూరోసర్జరీ పూర్తి చేసి గుంటూరులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అమృత హాస్పిటల్స్, యాంజియో కేర్ హాస్పిటల్, న్యూరో క్యూర్ హాస్పిటల్, స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్ యాజమాన్యాలు, సిబ్బంది హేమంత్‌ను అభినందించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయండి

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఐచ్ఛికాలు ఎంపిక చేసుకుని బదిలీ అయిన ఉపాధ్యాయులు... రిలీవర్లు లేక పాత స్థానాల్లోనే ఉండిపోయారని పల్నాడు జిల్లాకు చెందిన అనేకమంది ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సోమవారం డీఈవో రేణుకను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులను రిలీవర్లు అవసరమైన చోట్లకు పంపి రెగ్యులర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అంతకు ముందు కొద్దిసేపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు.

కొనసాగుతున్న ఇంజినీరింగ్ ఆప్షన్ల ఎంపిక

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం విద్యార్థుల ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు తాము కోరుకుంటున్న కళాశాలలకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 18వ తేదీ వరకు జరగనుంది. కళాశాల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యాక తరగతులు ప్రారంభమవుతాయి. ఆగస్టు 4 నుంచి మొదటి ఏడాది విద్యార్థులకు తరగతులు ఆరంభించనున్నారు.

ఖాతాదారులను ఆకట్టుకునేలా ఆభరణాలు

దేవిధామ్ సిల్వర్ షోరూం ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్, నిర్వాహకులు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ, గవర్నర్‌పేటలోని ఎఫ్ఎం ప్లాజాలో మంగళగిరికి చెందిన వ్యాపారవేత్త చల్లా నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవి ధామ్ సిల్వర్ షోరూమ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులతో కలిసి ఆయన జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖాతాదారులను ఆకట్టుకునేలా మంచి మోడళ్ల నగలు అందుబాటులో ఉంచి వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం దేవీ పవిత్ర గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను సందర్శించారు. నృత్య కళాకారిణులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తితిదే బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తేదారు అరెస్టు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కాలనీల్లో ఇళ్లు కట్టించి ఇస్తానని లబ్ధిదారుల వద్ద నగదు వసూలు చేసి కట్టకుండా మోసం చేసిన కేసులో బుర్రిపాలెం లేఅవుట్‌కు సంబంధించి తెనాలి పట్టణానికి చెందిన గుత్తేదారు పున్నారావును గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేశారు. నేలపాడు లేఅవుట్‌కు సంబంధించి అందిన ఫిర్యాదులతో అతనిని అరెస్టు చేసినట్లు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆనంద్ సోమవారం తెలిపారు. నరసరావుపేట సబ్ జైలులో ఉన్న అతనిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి ఈ కేసులో అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచి తిరిగి సబ్ జైలుకు తరలించినట్లు వివరించారు. పున్నారావుతో పాటు కోటేశ్వరరావు, నరేష్, బాలరాజు, అలీ, మోషే కొండ, మరి కొందరు గుత్తేదారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని, దర్యాప్తు పూర్తి చేసి త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామని ఎస్సై వివరించారు.

కులం నుంచి వెలివేస్తామంటున్నారు

★ రూ.5 లక్షలు కట్టాలంట ★ ఏఎస్పీకి బాధిత కుటుంబం ఫిర్యాదు

వివరాలు తెలుపుతున్న ఆదెమ్మ కుమారులు నాగరాజు, రమేష్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రూ. 5 లక్షలు కట్టకపోతే కులం నుంచి వెలేస్తామంటున్నారని, రక్షణ కల్పించాలని పెదకాకాని మండలం వెనిగండ్లకు చెందిన ఆదెమ్మ, ఆమె కుమారులు నాగరాజు, రమేష్ సోమవారం ఏఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. అనంతరం ఆదెమ్మ తదితరులు విలేకరులతో మాట్లాడారు. 'మేం కూలీ పనులు చేస్తుంటాం. మా గూడెంలోని నలుగురు వ్యక్తులు పెద్దమనుషులుగా చెలామణీ అవుతూ శాసిస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్లనీయకుండా ఏ విషయమైనా వారే పంచాయతీ చేస్తున్నారు. లేకపోతే కులం నుంచి వెలివేస్తామని బెదిరిస్తున్నారు. మళ్లీ కులంలోకి తీసుకోవాలంటే డబ్బులు కట్టాలంటున్నారు. మూడేళ్ల కిందట మమ్మల్ని కులం నుంచి వెలివేశామని బెదిరించి రూ. 3 లక్షలు కట్టించుకున్నారు. బీటెక్ చదివిన నా చిన్నకుమారుడు రమేష్ కులం కట్టుబాట్లు అనాగరికమని ఆ పెద్దలను ప్రశ్నించినందుకు కక్ష పెంచుకుని వేధిస్తున్నారు. కులం నుంచి ఆరు నెలలు వెలి వేస్తామని, తిరిగి చేర్చుకోవడానికి రూ.5 లక్షలు కట్టాలని హెచ్చరిస్తున్నారు. ఈ నెల 13న మాపై దాడి చేశారు. గర్భవతిగా ఉన్న మా కోడలిమీద ఎగబడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాల'ని కోరామని చెప్పారు.

ఇంటి పత్రాలు తీసుకుని మోసం చేశారు

మూడు చక్రాల బండిని 20 కి.మీ చేతితో నడుపుతూ పోలీసు కార్యాలయానికి వచ్చి వృద్ధుడి ఫిర్యాదు

వృద్ధుడి వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఇంటి పత్రాలు తీసుకుని మోసం చేశారని, తనకు న్యాయం చేయాలంటూ మంగళగిరికి చెందిన బోరియా అనే వ్యక్తి మూడు చక్రాల బండిని చేతితో 20 కిలోమీటర్లు నడుపుతూ సోమవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చిన తీరు అక్కడివారిని కలచివేసింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బయటకొచ్చి వృద్ధుడి ఫిర్యాదును స్వీకరించి వెంటనే అతడికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. మంగళగిరి బాప్టిస్టుకాలనీకి చెందిన అతడికి ఇద్దరబ్బాయిలు. భార్య 2017లో మృతి చెందారు. బోరియా ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురవడంతో రెండుకాళ్లు దెబ్బతిన్నాయి. ఎడమకాలు సగం విరిగిపోయింది. పిల్లలు అతడిని పట్టించుకోవడం లేదు. తన తండ్రి ద్వారా వచ్చిన 48 గజాల్లో ఉన్న ఇంట్లోనే ఉంటున్నారు. ఐదేళ్ల కిందట అతని బంధువు ఇళ్ల పత్రాలను దాచి పెడతానని చెప్పి తీసుకున్నాడు. కొద్దిరోజులుగా ఓ వ్యక్తి వచ్చి ఆ ఇంటిని తన వద్ద తాకట్టు పెట్టారని, వెంటనే ఖాళీ చేయాలని దౌర్జన్యం చేస్తున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తన ఇంటిపత్రాలు ఇప్పించాలని బోరియా కోరుతున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా ద్వారా విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి అధిక మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

నేషనల్ లైసెన్స్, ... Ph: 98491 61689.

HEALTH & CARE

మధుమేహం మానేయడం ...

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, ... ఫోన్: 82474 49042, 96404 96677.

స్వామి వివేకానంద ట్రస్ట్. VJA. ... 99590 21122, 99590 31122.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

JOBS

Wanted DTP Operators with Telugu and English Typing. Contact: Don Bosco Printing Press, Guntur. Ph: 98661 13331, 83309 60969.

డ్యూటీ డాక్టర్స్, రిసెప్షనిస్ట్స్, నర్సెస్ (MPHW), ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను. కొత్త వారికి కూడా ప్రాధాన్యత. అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 94941 31450.

ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ ... 98395 62228, 93819 82818.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలలో ... ఈనాడు యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదు. ...

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వడం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ఎమ్మెస్సీ ఫలితాలను సోమవారం సీఈ ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. ఎమ్మెస్సీ కంప్యూటేషనల్ డాటా సైన్స్ నాలుగో సెమిస్టర్‌లో 43, ఎమ్మెస్సీ జియాలజీ నాలుగో సెమిస్టర్‌లో పరీక్ష రాసిన 8 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ప్రశ్నాపత్రాల పునఃమూల్యాంకనం కోసం ఈనెల 24 లోపు ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించాలన్నారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

మంగళగిరి, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని జాస్తి అనురాధ తన ఇంటికి తాళాలు వేసి రెండు నెలల క్రితం అమెరికాలో ఉన్న తన కుమార్తె తేజస్వి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రతి రోజు మొక్కలకు నీళ్లు పోసేందుకు తమ ఇంటికి సమీపంలో ఉన్న వారికి తాళాలు ఇచ్చి వెళ్లారు. రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం మొక్కలకు నీళ్లు పోసేందుకు వెళ్లిన వారు.. ఇంట్లో సూట్ కేసు తెరచి ఉండడం, బీరువా పగలగొట్టి ఉండటాన్ని గమనించి అమెరికాలో ఉన్న అనురాధకు ఫోన్ వీడియో కాల్ ద్వారా చూపారు. దీంతో ఇంట్లో పోయిన వస్తువుల వివరాలను వెల్లడించారు. 100 గ్రాములకు పైగా బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలు, 50 వరకు పట్టు చీరలు, రూ.2 లక్షలు నగదు ఉండాలని అవేమీ లేకపోవడం గమనించి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. ఆమె సూచన మేరకు ఇంటి సమీపంలో ఉన్న శ్రీనివాసరావు అనే వ్యక్తి తమకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చినబస్తాలు:	56,583
అమ్మకాలు:	53,846
నిల్వలు:	5,945

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	9,500-13,000
నంబర్ 5	10,000-13,300
341	10,000-13,400

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-13,500
బాడిగ	10,000-12,400
దేవనూరు డీలక్స్	10,000-12,400
ఆర్మూర్	9,600-10,800

ఏసీ కామన్ వెరైటీ

334	9,500-12,600
నంబర్ 5	10,000-13,500
341	10,000-13,500

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-13,400
బాడిగ	10,000-12,600
తాలు	4,800-7,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

నేటి నుంచి గ్రామాల్లో సీఆర్డీఏ సమావేశాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణ సమయంలో స్థానికులకు ఇబ్బందులు లేకుండా పర్యావరణ, సామాజిక పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గుత్తేదారులు, ఇంజినీర్లు, సీఆర్డీఏ అధికారులు, సామాజిక, పర్యావరణ కన్సల్టెంట్‌లు, స్థానికులతో సీఆర్డీఏ ఈ నెల 15 నుంచి 17 వరకు సమావేశాలు నిర్వహించనుంది. ఒక గ్రామం పరిధిలో ఏయే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఏ కాంట్రాక్టరు ఆ పనులు చేస్తున్నారు. పర్యావరణ, సామాజిక, రక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు వస్తే గుత్తేదారు సంస్థలు, సీఆర్డీఏలో ఏ అధికారులను సంప్రదించాలో సమావేశంలో స్థానికులకు అధికారులు వివరిస్తారు. 15న మంగళగిరి మండలం నవులూరు, కురగల్లు, నిడమర్రు గ్రామాల వారికి, 16న మల్కాపురం, తుళ్లూరు, వెంకటపాలెం, రాయపూడి గ్రామాల వారికి, 17న వెలగపూడి, మందడం, మందడం, పెనుమాక, ఉండవల్లి, తుళ్లూరు గ్రామాల వారికి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశాలు జారీ చేశారు.

రైతుల అవసరాల మేరకు ఎరువులు

జిల్లాపరిషత్తు: జిల్లాలో టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల వద్ద మొత్తం 34,016 మెట్రిక్ టన్నుల ఎరువులు ఖరీఫ్ పంట కాలానికి సరిపడా అందుబాటులో ఉన్నాయని డీఏవో ఎ.నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువుల సరఫరాలో సమస్యలుంటే ఏడీఏలకు, కాల్ సెంటర్ 80749 94631 నంబర్‌కి ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, రిటైల్ ధర - 121, చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200.
కృష్ణా జిల్లా: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 94, రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
... బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 98, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎం కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

తెనాలి

• తెనాలి • పొన్నూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

స్పందనకు వందనం

★ తెనాలి పట్టణ నందులపేటలో ఇళ్ల ముందు నిర్మాణ సామగ్రి వల్ల గాలి వచ్చినప్పుడు ఇసుక కళ్లలో పడుతోందని స్థానికులు మేమున్నాం.... మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలియజేయగా వారు స్పందించి సామగ్రిని తొలగింప చేశారు. ★ తెనాలి పట్టణ ఇస్లాంపేటలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలియజేయగా.. ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

★ పొన్నూరు పట్టణ పరిధిలోని 14వ వార్డులో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకురాగా వారు స్పందించి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. 10వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు.

? పట్టణ పరిధిలోని 29వ వార్డులో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టలేదు. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించడం చాలా ఇబ్బందికరంగా ఉంది. **- షేక్ మస్తాన్, స్థానికుడు.** ✔ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం. **- అపర్ణ, సహాయ ఇంజినీరు**

? పట్టణ పరిధిలోని విద్యానగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- పి.శ్రీనివాసరావు. స్థానికుడు**
✔ వ్యర్థాలు తొలగిస్తాం. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి.** – న్యూస్‌టుడే, పొన్నూరు

మంత్రి పర్యటనపై సమాచారం ఇవ్వలేదని ఛైర్‌పర్సన్ అసంతృప్తి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శని, ఆదివారాల్లో పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన పర్యటన కార్యక్రమాల గురించి కనీసం సమాచారం కూడా తెలియజేయలేదేమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక.. మున్సిపల్ కమిషనర్ వల్లూరు మహాలక్ష్మీపతిరావును ప్రశ్నించారు. దీనిపై ఆమె సోమవారం కమిషనర్ వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు. మీరు సహాయ కమిషనర్ హోదాలో పట్టణంలో జరిగే కార్యక్రమాల సమాచారం చాలా చక్కగా అందించారని ఈ సందర్భంగా ఆమె ఆయనకు గుర్తు చేశారు.

అబాకస్ పోటీల్లో తెనాలి విద్యార్థుల సత్తా

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 13 ఆదివారం గుంటూరులో యూసీ మాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో తెనాలి సాయి అబాకస్ విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రతినిధులు, గురువులు మాధవ్, సుధ, రజని, మాధవి, బీబీ సోమవారం తెలిపారు. ముగ్గురు ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్, ఐదుగురు ఛాంపియన్స్, 19 మంది మెరిట్, 64 మంది రన్నరప్ ట్రోఫీలు అందుకున్నారని వివరించారు. విజేతలను అభినందించారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 2000
అత్యల్పం: 1200
సగటు: 1500

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

నిబంధనలకు తిలోదకాలు

మురుగు కాలువపై అద్దె దుకాణాలు ★ పనులపై పట్టణ వాసుల అభ్యంతరం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

మురుగు కాలువలపై నిర్మాణాలు చేపట్ట వద్దని పదే పదే చెబుతున్న మున్సిపల్ అధికారులు.. తమ వరకు వచ్చేసరికి మాత్రం నిబంధనలు పట్టించుకోవడం లేదు. సరికదా ఏకంగా కాలువలపై మున్సిపల్ అద్దె భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చేయడంతో కట్టడాలు ఊపందుకున్నాయి. మరోపక్క పట్టణ ప్రజల నుంచి వీటిపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా పనులు ఆగడం లేదు. ఇందుకు పట్టణ పరిధిలో రైతుబజార్ వద్ద బుర్రిపాలెం రోడ్డు ఆనుకొని రూ.3 లక్షలతో ప్రధాన కాలువపై చేపట్టిన మున్సిపల్ అద్దె దుకాణాల నిర్మాణ పనులే తార్కాణం.

వైకాపా పాలకవర్గంలో మురుగు కాలువపై చేపట్టిన నిర్మాణాలు

గత తెదేపా పాలకవర్గంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్మించారిలా..

ఇలా చేస్తే ప్రజల రాకపోకలకు ఇబ్బందే..

ఇలాంటి నిర్మాణాలను ప్రోత్సహిస్తే ఆ దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై కాకుండా ఆ దుకాణాలను పూర్తిగా గాంధీపార్కులో నిర్మించాలని సూచిస్తున్నారు.

పంచాయతీ విద్యుత్తు బిల్లులు మున్సిపల్ ఖజానా నుంచి చెల్లింపు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మున్సిపల్ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 లక్షలతో తెనాలి మండలం నేలపాడు పంచాయతీ పరిధి స్థలంలో బీటీ రోడ్డు వేసి ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. వీటి విద్యుత్తు బిల్లులు నెల నెలా మున్సిపల్ ఖజానా నుంచి చెల్లిస్తున్నారు. ఈ రోడ్డు పరిధిలోని ఆవాసాలు, కళాశాలల వారు తమ ఆస్తి పన్ను నేలపాడు పంచాయతీకి చెల్లిస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ రోడ్డు నిర్మాణాన్ని తప్పు పట్టారు. గత తెదేపా పాలకవర్గంలో బుర్రిపాలెం రోడ్డులో నిబంధనల ప్రకారం.. ప్రధాన కాలువలకు లోపల పక్క మున్సిపల్ అద్దె దుకాణాలు నిర్మించారని, దీనివల్ల ఎవరికీ ఇబ్బందిలేదని పలువురు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. కాలువపై అద్దె దుకాణాల నిర్మాణ విషయంపై పురపాలక అధికారులు పునః పరిశీలన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పవిత్రోత్సవాలకు సర్వం సిద్ధం

గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

పెదకాకాని, న్యూస్‌టుడే : పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ మూడు రోజులపాటు ఆర్జితసేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు భారీ అన్నదానం, సాయంత్రం విశేష పూల అలంకరణలో స్వామివారి గ్రామోత్సవం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పవిత్రోత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

ప్రజలకు మేలు చేకూర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు మేలు చేకూర్చడమే అంతిమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలి' అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన తెనాలి పట్టణంలోని 6వ వార్డు, సాయంత్రం మండలం సోమసుందరపాలెం గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర: చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికి వందనం సొమ్ము అందించామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చక్రాయపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. దీపం పథకంలో లబ్ధిపొందిన మహిళలతో ఆనందం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యుత్తు భారం ఉండదని భరోసా ఇచ్చారు. తెదేపా నాయకులు వంగాసాంబిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భీమవరపు కోటిరెడ్డి, చందుసాయిబాబు, సుధీర్‌బాబు, కంచర్ల అమృతరాజు, రోహిత్‌సాయి పాల్గొన్నారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా శ్రీకాంత్

చేబ్రోలు, న్యూస్‌టుడే: వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయం పాలక మండలి ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ సోమవారం ఉత్తర్వులను విడుదల చేసింది. ఛైర్మన్‌గా వడ్లమూడి గ్రామానికి చెందిన గోళ్ల శ్రీకాంత్‌తో పాటు మరో 14 మంది పాలక వర్గ సభ్యుల పేర్లను వెల్లడించింది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఆమె సోమవారం 31వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డు వాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చూపాలని కోరారు.

ఎన్‌సీసీ ధ్రువపత్రాల ప్రదానం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు సోమవారం బీ, సీ ధ్రువపత్రాలు అందించారు. లెఫ్టినెంట్ కల్నల్ మహేష్, సుబేదార్ మేజర్ గురుదీప్‌కుమార్, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మార్కెట్‌లో ఆకు కూరలు విక్రయించే వ్యాపారి తన వద్ద పని చేసే వ్యక్తిని రాడ్డుతో కొట్టడంతో అతను గాయపడి తెనాలి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు చేశారు.

బంగారం విడిపించుకు వస్తామని మోసం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించుకుని వచ్చి మీ బ్యాంకులో తాకట్టు పెడతామని మాయమాటలు చెప్పి నగదు తీసుకెళ్లిన వైనంపై తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు సోమవారం తెలిపిన సమాచారం మేరకు.. వేణుగోపాల్ అనే వ్యక్తి గుంటూరులోని ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తుంటారు. బ్యాంకుకు జాన్‌బ్రాన్ హమ్, అతని భార్య, జాన్ విలియమ్స్ అనే ముగ్గురు వస్తూ తమ వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టడం, కొన్ని నెలల తర్వాత విడిపించుకోవడం చేస్తూ ఉండేవారు. ఈ క్రమంలో వారు వేణుగోపాల్ వద్దకు వచ్చి తమ బంగారం తెనాలిలోని వ్యాపారి వద్ద తాకట్టులో ఉందని, విడిపించుకుని మీ బ్యాంకులో పెడతామని తక్కువ వడ్డీ కాబట్టి తమకు కలిసి వస్తుందని చెప్పడంతో గుంటూరు నుంచి రూ.4.5 లక్షలు తెనాలి తీసుకు వచ్చిన వేణుగోపాల్ మే నెల 9వ తేదీన పట్టణ గాంధీచౌక్‌లో వారికి అందించారు. వ్యాపారి వద్దకు వెళ్లి బంగారం విడిపించుకు వస్తామని వెళ్లిన వారు తిరిగి రాకపోవడం, మధ్యవర్తి వచ్చి త్వరలోనే నగదు ఇచ్చేస్తారని చెప్పిన గడువు కూడా ముగియడంతో వేణుగోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జాన్‌బ్రాన్ హమ్, అతని భార్య, జాన్ విలియమ్స్, మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి మొత్తం నలుగురిపై కేసు నమోదు చేశారు.

ఎన్‌సీసీ ఎంపికలు

తెనాలి టౌన్: పట్టణంలోని కోగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎన్‌సీసీ ఎంపికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి వివిధ పోటీలు నిర్వహించారు.

పేదలను ఆదుకుందాం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వివిధ విభాగాల్లో చేయూత అందించడం ద్వారా పేదలను ఆదుకుందామని ఎంపీడీవో ఎ.దీప్తి సూచించారు. మండలం నందివెలుగు గ్రామంలో సోమవారం ప్రముఖ వ్యాపారులు, మిల్లుల నిర్వాహకులను కలిసి పీ4 కార్యక్రమం గురించి ఆమె అవగాహన కలిగించారు.

మురుగులో తాగు నీటి పైపులు

తాగు నీటి పైపులన్నీ మురుగు కాలువల లోపల, వాటి మీదుగా, వాటి చెంతనే ఉండగా వాటి ల్లోనూ అనేక చోట్ల లీకులు కొనసాగుతున్నా ప్రమాదకర పరిస్థితి తెనాలి పట్టణ చినరావూరు 13వ వార్డులో కనిపిస్తోంది. దాదాపు ఏడాది కాలానికి పైగా తీవ్ర సమస్యతో స్థానికులు అల్లాడిపోతూ ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం శూన్యం. తాగు నీరు కలుషితమైతే డయేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వాన పడినప్పుడు కాలువల్లో మురుగు, రోడ్డు మీద నీరు కలిసిపోతే లీకులున్న చోట నీరు కలుషితం అవుతుంది. ఇప్పటికైనా సమస్య గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

మున్సిపల్ బీటీ రోడ్డుపై సీసీ రోడ్డు

ఓ ఇంటి యజమాని ఇష్టారాజ్యం

పట్టణ పరిధి అమరావతి కాలనీలో ఓ యజమాని తన ఇంటి ముందు బీటీ రోడ్డు నుంచి ఇంట్లోకి రాకపోకలు సాగించడానికి అప్రోచ్ నిర్మించారు. దీనికితోడు ఇంటి ముందు భాగంలో బీటీ రోడ్డుపై సిమెంటు రోడ్డు వేయించారు. అయినా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం మున్సిపల్ కమిషనర్ వల్లూరు లక్ష్మీపతిరావు, ఏసీపీ శివన్నారాయణను సంప్రదించగా.. సదరు యజమాని తమ అనుమతి తీసుకోకుండా సీసీ రోడ్డు వేశారని, సిబ్బందిని పంపించి తగుచర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.
- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

గంజాయి విక్రేతల అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే : ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు సోమవారం పెదకాకాని సీఐ నారాయణస్వామి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. వెనిగండ్లకు చెందిన ఇంటూరి కిరణ్ అలియాస్ గబ్బర్‌సింగ్, సునీర్ బాషా, గుంటూరు ఇజ్రాయిల్‌పేటకు చెందిన సయ్యద్ బాషా స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసై ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి అమ్మడం ప్రారంభించారు. నర్సీపట్నం శివారులోని చింతపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 1.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి 200 గ్రాములు వాడుకున్నారు. అనంతరం పెదకాకాని రాజరాజేశ్వరి ఆసుపత్రి శివారులో ఆదివారం రాత్రి గంజాయిని చిన్న పొట్లాల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని 1.3 కేజీల గంజాయిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: కూరగాయల పందిరి వేసేందుకు వినియోగించే వెదురు బొంగులు కాలిపోయిన వివాదంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా.. సర్ది చెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నారాకోడూరులో చోటు చేసుకుంది. ఎస్సై వెంకట కృష్ణ కథనం మేరకు నారాకోడూరుకు చెందిన సుమన్ వేజండ్ల గ్రామంలో కూరగాయల పందిర్లు సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం తన పొలంలో పందిరి వేసేందుకు తెచ్చిన వెదురు బొంగులు తగల పడుతున్నాయని తెలియడంతో చూసేందుకు వెళ్లి మంటలు అదుపు చేసి వచ్చాడు. ఇదే విషయమై స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద చర్చించుకుంటూ ఉండగా అదే ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ అక్కడికి వచ్చి మీ పొలంలో వెదురు బొంగులు కాలిపోవడానికి నేనే కారణం అని ప్రచారం చేస్తున్నావని సుమన్‌తో గొడవకు దిగాడు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ తనతో తెచ్చుకున్న కత్తితో సుమన్‌పై దాడి చేసి గాయపరిచాడు. అడ్డుగా వెళ్లిన పృథ్వీ అనే వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని చికిత్స నిమిత్తం వడ్లమూడిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారిపై లారీ బోల్తా

పొన్నూరు: జీబీసీ రహదారిలోని కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద సోమవారం గుంటూరు నుంచి బాపట్ల వెళ్తున్న శీతలపానీయాల లారీ ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శీతల పానీయాలు చెల్లా చెదురుగా పడిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొంత సేపు తర్వాత లారీని తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొల్లిపర: అప్పు విషయంలో జరిగిన వివాదంలో మనస్తాపానికి గురై మృతి చెందిన తూములూరుకు చెందిన దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను సోమవారం ఓఎస్‌డీ ఏసురత్నం, కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ పరామర్శించారు. మృతికి కారణాలను అడగి తెలుసుకున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తుందని భరోసా కల్పించారు.

నటి సరోజాదేవి మృతి విచారకరం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ నటి బి.సరోజదేవి అకాల మృతి విచారకరమని పలు సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. వీరు సోమవారం తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఆమె సంతాప సభలో మాట్లాడారు. చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ, ఫిలిం క్రిటిక్స్, అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి, ఇస్కఫ్, ఆంధ్రా ఆర్ట్ థియేటర్ల సాంస్కృతిక సంస్థల తరపున రావిపాటి వీరనారాయణ, బొల్లిముంత కృష్ణ, రావిపాటి రాము, తాడికొండ జగన్మోహనరావు, ఆరేటి రామారావు, బాలస్వామి సరోజదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పిల్లలు ఇబ్బంది పెడుతున్నారు

అధికారులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి. సబ్ కలెక్టర్ సంజనా సింహ అర్జీదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారాలకు హామీ ఇచ్చారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన ముగ్గురు పెద్దలు, తమను తమ పిల్లలు, కోడళ్లు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ అర్జీలు ఇచ్చారు. ఆక్రమణలు, పథకాలు అంద లేదని, వేతనం చెల్లించలేదని ఇలా విభిన్న అంశాలపై వచ్చిన అర్జీలను సంబంధిత విభాగాలకు పంపారు. తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ సర్వే, భూ సంబంధ, సంక్షేమ పథకాలు తదితరాలకు సంబంధించి 11 అర్జీలు అందుకున్నారు. తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో రాకపోకలకు రెండు గేట్లు ఉన్నప్పటికీ ఒక దానినే తెరిచి ఉంచుతున్నారని, దీని వల్ల విద్యార్థులు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని తల్లిదండ్రులు అర్జీ ఇచ్చారు.

అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి

పొన్నూరు: ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు కార్యక్రమంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ-5 సర్వే -4, రిజిస్ట్రేషన్-1 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఫిర్యాదులను ఆయా శాఖాధికారులకు పంపి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వినతులు పరిశీలిస్తున్న కమిషనర్ మహాలక్ష్మీపతిరావు

బీసీ కార్పొరేషన్ రుణం మంజూరు చేయించండి

తెనాలి(కొత్తపేట): బీసీ కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసి చాలా రోజులు అయ్యిందని మంజూరు చేయించాలని లబ్ధిదారు సీహెచ్ పార్వతి కమిషనర్ వల్లూరు మహాలక్ష్మీపతిరావును కోరారు. పురపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్‌లోని అర్హుల జాబితాలో మీ పేరు ఉందని కమిషనర్ ఆమెకు బదులిచ్చారు. బిల్డింగ్ ప్లాను ఇప్పించాలని, పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ బజార్లోని బడ్డీ కొట్లు తొలగించొద్దని అర్జీదారులు కోరారు.

ఇసుక అక్రమ తరలింపు, తవ్వకాలకు బ్రేక్

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

కొల్లిపర, న్యూస్‌టుడే: ఇసుక నిల్వలపై సమగ్ర తనిఖీలు నిర్వహించామని భూగర్భ గనుల శాఖ డీడీ ఎన్. చంద్రశేఖర్ అన్నారు. 'గుట్టమాటున దోపిడీ.. కొల్లిపర రీచ్‌లో ఇసుక అక్రమ రవాణా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం.. అధికారులు, రాజకీయనేతల్లో కదలిక తీసుకు వచ్చింది. పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలన అనంతరం ఇచ్చిన ఆదేశాలతో సోమవారం కొల్లిపర శివారు కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని ఇసుక డంప్‌ను అధికారులు పరిశీలించారు. ప్రారంభ, ప్రస్తుత నిల్వలను సరిపోల్చుకున్నారు. డంపింగ్ యార్డులో 1600 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలు, తరలింపులు జరగకుండా(గుంతల తవ్వకం) రక్షణ చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూ అధికారులకు నిఘా పెంచాలని సూచించామని తెలిపారు. వెలుగు సిబ్బంది నుంచి రికార్డులు సేకరించారు. తనిఖీల్లో తహసీల్దార్ సిద్ధార్థ, మైనింగ్ ఆర్ఐ ఆంజనేయులు, సర్వేయరు సీతమ్మ, సివిల్ సప్లయిస్ ఓఎస్‌డీ ఏసురత్నం, ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

అమెరికాలో మెరిసిన తెలుగు బిడ్డ

గణపతి సచ్చిదానందస్వామి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న రామ్ సుభాష్

కొల్లిపర, న్యూస్‌టుడే: అమెరికాలోని న్యూజెర్సీలో ఆదివారం జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో కొల్లిపరకు రెందిన పోగుల రామ్‌సుభాష్(9) అద్భుత ప్రతిభ కనబరిచాడు. గణపతి సచ్చిదానందస్వామి నుంచి ప్రశంసా పత్రం, బంగారు పతకం అందుకున్నాడు. చిన్నారి తాత రామలింగశర్మ, సుకన్యలను, తండ్రి సాయిసురేష్, చైతన్యల ప్రోత్సాహాన్ని అభినందించారు.

రావినూతల ఫౌండేషన్ సేవలు అభినందనీయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రావినూతల ఫౌండేషన్ విద్యారంగ సేవలు స్ఫూర్తిదాయకమని అతిథులు పేర్కొన్నారు. తెనాలి మండలం అంగలకుదురు జిల్లా పరిషత్తు ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో 65 మంది విద్యార్థినులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రూ.40 వేల విలువైన ఏకరూప దుస్తులు అందించారు. శ్రీమతి రావినూతల వెంకుబాయమ్మ, కామేశ్వరమ్మ మెమోరియల్, తెనాలి రోహిణి హాస్పిటల్స్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అనురాధ, డాక్టర్ చందోలు పృథ్వీలత, డాక్టర్ యామిని దివ్య, చందోలు శంకరరావు, డాక్టర్ మధుబాబు, డాక్టర్ వినీల్, శ్రీనివాస్‌లతో పాటు ఫౌండేషన్ సభ్యులు అన్నపూర్ణ, ప్రకాష్, సుబ్బలక్ష్మి, ఆరాధ్య పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

మొండి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

పొన్నూరు, న్యూస్‌టుడే

సాగునీటి ప్రధాన కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో భూములకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని నిడుబ్రోలులోని అలవల సాగునీటి కాలువ నుంచి మొండి కాలువకు సాగునీరు ప్రవహిస్తుంది. ఈ సాగునీరు నిడుబ్రోలు, మాచవరం గ్రామాల్లో ఉంది. సుమారు వెయ్యి ఎకరాల వరకు సాగునీరు సరఫరా అవుతుంది. నిడుబ్రోలులోని సుమారు 2 కి.మీ. మేర కాలువ ఉంది. ఆ కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువ పూడిపోవడంతో సాగునీరు ముందుకు కదలడం లేదు. దీనిలోకి 13, 14 వార్డులకు సంబంధించిన మురుగునీరు కూడా రావడంతో పంటలు సరిగ్గా పండడంతో లేదని రైతులు వాపోతున్నారు. ఆ ప్రాంతంలో తూములు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

★ శ్రీరంగపురం సాగునీటి కాలువ చింతలపూడి, వల్లభరావుపాలెం, ములుకుదురు గ్రామాల్లోని సాగు భూములకు సాగు నీరు సరఫరా కావాల్సి ఉంది. పట్టణ పరిధిలోని విద్యానగర్‌లో మురుగు నీరు సాగునీటి కాలువలోకి ప్రవహించే విధంగా గతంలోనే పురపాలక సంఘ అధికారులు ఏర్పాటు చేశారు. వ్యర్థాలతో నిండిపోవడంతో సాగు నీరు ముందుకు కదలడం లేదు. శ్రీరంగపురం సాగునీటి కాలువలో కొంత మంది మురుగు దొడ్ల పైపులైను ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. దిగువ ప్రాంతంలో రైతులకు సాగునీరు అందకపోవడంతో కొంత మంది రైతులు ఇంజిన్ల ఏర్పాటు చేసుకుని సాగు చేస్తున్నారు. కాలువలను శుభ్రపరిచే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ★ దీనిపై సాగునీటిశాఖ ఏఈ రవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆ కాలువ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

మొండి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

శ్రీరంగపురం సాగు నీటి కాలువలో మురుగు దొడ్డి పైపులైను

మౌలిక వసతుల కల్పనకు కృషి

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పురపాలక సంఘ కమిషనర్ ఎం.రమేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ముబారక్‌నగర్‌లో పర్యటించి స్థానిక మహిళలతో మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు చెత్తను మురుగు కాలువలో వేయవద్దని సూచించారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రజారోగ్యశాఖాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

మువ్వా వెంకట నరసయ్య S/o పెద్ద వెంకట సుబ్బయ్య, D.No: 2-96, మాదలవారిపాలెం, పెదరావూరు వారికి చెందిన సేల్‌డిడ్ ఆస్తి దస్తావేజులు (నెం: 3687/1988), తనఖా దస్తావేజులు (నెం: 1504/1993) పెదరావూరు నుండి తెనాలి వస్తుండగా మార్గమధ్యంలో పోయినవి. ఎవరికైనా దొరికినచో దయచేసి తెలుపగలరు.

✆:89850 14901

వేలం ప్రకటన

IN THE COURT OF THE II ADDL. CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR
E.P.No. : 146 /2024 in O.S.No. 1403/2022
BETWEEN :
Shaik. Gafar .....DHR
And
Shaik Usman ....JDR

పై నెంబరు ఇ.పి.లో యిస్తేహారు జారీ కాబడి జప్తు ఖాయమైన జె.డి.ఆర్.తాలుకు షెడ్యూలు ఆస్తిని వేలం వేయుటకు శ్రీ కోర్టు వారు ది.01-08-2025కి వాయిదావేసినారు. కావున వేలంపాటలో పాల్గొనదలచిన వారు ది.01-08-2025న ఉ.గం. 10-30ని.లకు పై కోర్టు వారి హాజరై వేలంలో పాల్గొని పాట పాడుకొనవచ్చును. వేలం షరతులు ఇతర వివరాలకు కోర్టు నాజర్ గారిని సంప్రదించగలరు.

Schedule: Guntur Dt., Pedakakani Sub Dt., Pedakakani(V),Panchayat area, Pedakakani(V),Door No. 617/2, for an extant of AC 0.56 cents, Plot no.14 an extent of 118.5sq.yards of vacant site is being bounded by,**East:**Plot No.16, belongs to Kanuru Srinivasa Rao,27ft, **South:**12feet width road,39.06ft, **West:**12 feet width road:27ft, **North:**Ambati Madhu Mohana Krishna & Others land,39.06ft, Within this boundaries an extant of 118.05 sq. yards or 99.08 sq.mtrs of vacant site.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
డి.హెచ్.ఆర్.విలువ:6,59,731/-
అమీనా విలువ:7,67,325/-
వేలం తేది:01-08-2025
ఫర్ ధర్ హియరింగ్:08-08-2025

పఠాన్ అబిద్ అలీఖాన్, డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్, గుంటూరు,సెల్: 63024 09986

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జేసీ భార్గవ్ తేజ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పెదనందిపాడు పొగాకు రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్‌తో కలిసి వచ్చి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. సుమారు 16 గ్రామాల్లో 8 వేల ఎకరాల్లో నల్ల బర్లీ పొగాకు సాగు చేస్తున్నామని, కొనుగోలు కేంద్రం అందుబాటులో ఏర్పాటు చేయాలని కోరారు. ★ దివ్యాంగురాలైన తమ కుమార్తె పింఛనుకు సంబంధించి వేలి ముద్రలు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన షేక్ షబానా కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

‘ఏపీఎల్’కు ఎంపిక కావడం అభినందనీయం

సాయి రాహుల్

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఏపీఎల్ (ఆంధ్రా ప్రీమియర్ లీగ్) సీజన్-4కు మంగళగిరికి చెందిన కేపీ సాయిరాహుల్ ఎంపిక కావడం ఆనందంగా ఉందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈమేరకు సోమవారం రాత్రి ఆయన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సాయిరాహుల్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? వడ్డమానులో రహదారుల వెంకట చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతుంది. **-శ్రీను, స్థానికుడు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి రహదారుల వెంట చెత్తను తొలగింప చేస్తాం. **-కె.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి.** ? ఐనవోలు గ్రామంలో రామాలయం సెంటర్‌లో సైడు కాలువలు నిండిపోయి దుర్వాసన వస్తుంది. **-సవరం వీరయ్య** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి గ్రామంలో కాలువలను శుభ్రం చేయిస్తాం. **-సాంబిరెడ్డి, గ్రామ కార్యదర్శి.** -తుళ్లూరు, న్యూస్‌టుడే **మంగళగిరి, న్యూస్‌టుడే:** ? ఎర్రబాలెం వద్ద ఉన్న అంబటి నగర్‌లో పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. నివారణకు చర్యలు తీసుకోండి. **-పి.నరసింహం** ✔ పరిశీలించి వాటి నివారణకు చర్యలు తీసుకుంటాం. **- అలీంబాషా, నగర కమిషనర్, మంగళగిరి.**

సారం తెలిసేదెప్పుడు.. సాగుకు కదిలేదెన్నడు

★ ఖరీఫ్‌కు సన్నద్ధమైన అన్నదాతలు ★ ఇప్పటికీ అందని భూసార పరీక్షల ఫలితాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

జులై నెల సగం గడిచిపోయినా రైతులకు భూసార పరీక్షల ఫలితాల కార్డులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మే నెలలో భూసార పరీక్షల కోసం నమూనాలను సేకరించిన అధికారులు 45రోజులు గడిచినా భూసార పరీక్షల ఫలితాలు వెల్లడించలేదు. కార్డులు పంపిణీ చేయలేదు. దీంతో వ్యవసాయాధికారుల తీరుతో పంటల పెట్టుబడులు అధికంగా పెట్టి నష్టపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు చెబుతున్నారు. తొలకరి జల్లులు పడటంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. జులై మొదటి వారంలో వర్షపు జల్లులు పడటంతో కొందరు రైతులు పత్తి విత్తనాలను విత్తారు. వర్షాలు కురిస్తే మిగిలిన భూములలోనూ పంటలు సాగు చేసేందుకు రైతులు సంసిద్ధంగా ఉన్నారు.

ప్రత్తిపాడు: మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు (పాత చిత్రం)

ఇలా పంటలు సాగు చేసిన తర్వాత భూసార పరీక్షల ఫలితాలు వెల్లడిస్తే ప్రయోజనం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఎందుకీ జాప్యం..

భూసార పరీక్షల కోసం నమూనాలు సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారులకు లక్ష్యాలను నిర్దేశిస్తూ మే, రెండవ వారంలో మండల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మండల వ్యవసాయాధికారులు గ్రామాలో తిరిగి లక్ష్యాల మేరకు నమూనాలను సేకరించారు. కానీ భూసార పరీక్షలు చేసే ల్యాబ్‌కు పంపలేదు. జూన్ నెలాఖరులో ల్యాబ్‌లకు పంపడంతో పరీక్షల ఫలితాలు వెల్లడించడంలో తీవ్ర జాప్యం జరిగింది.

నేల స్వభావమే కీలకం..

భూసార పరీక్షలతో నేల స్వభావం తెలుసుకోవచ్చు. ఆ నేలకు అనుకూలమైన పంటను వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నేలలో పోషక పదార్థాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఫలితాలతో ఎరువులను కావాల్సిన మేర వాడి ఖర్చు తగ్గించుకుని నికర ఆదాయం పొందవచ్చు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అవసరమైన మేరకే ఎరువులు వాడుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. భూసార పరీక్షలతో భూమిలోని పోషక పదార్థాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షల ఫలితాలు ఎంతో కీలకం అయ్యాయి.

మండలాల వారీగా నమూనాల సేకరణ ఇలా..

మండలం	లక్ష్యం
ప్రత్తిపాడు	840
పెదనందిపాడు	480
వట్టిచెరుకూరు	825
గ్రామీణ గుంటూరు	520
కాకుమాను	1150

త్వరలోనే కార్డులు ఇస్తాం

భూసార పరీక్షల కోసం నమూనాలను కొద్దిరోజుల క్రితం పంపారు. బదిలీల కారణంగా ఆలస్యం జరిగింది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయి. త్వరలోనే పరీక్షల ఫలితాల కార్డులను రైతులకు అందిస్తామని ప్రత్తిపాడు ఏవో షేక్ సుగుణ బేగం తెలిపారు.

‘విద్యుత్తు స్మార్ట్ మీటర్లు వద్దు’

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దంటూ తాడేపల్లిలోని పట్టాభిరామయ్య కాలనీలో ఉన్న ఉపకేంద్రం ఎదుట సీపీఎం ఆధ్వర్యాన సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసన తెలిపారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాల వర్తింపు తదితర అంశాలపై గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 16వ తేదీ నుంచి వారు సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు సోమవారం తెలిపారు. తాడేపల్లిలోని కృష్ణుడు గుడి, కృష్ణనగర్‌లోని మచ్చర పాయింట్లు వద్ద జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని ప్రకటించారు. ★ పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య కోరారు. మంగళగిరిలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మంత్రి లోకేశ్ చొరవతో రోడ్ల నిర్మాణం

భూమి పూజ చేసిన ఎంపీపీ జబీన్, శ్రీఅనిత, సర్పంచి మేరిమ్మ తదితరులు

రేవేంద్రపాడు (దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎంపీపీ షేక్ జబీన్, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. మంత్రి ఆదేశాలతో రేవేంద్రపాడు కాలనీలో మండల పరిషత్తు నిధులు రూ. 16 లక్షలతో చేపట్టిన నిర్మాణానికి సర్పంచి పలుకూరి మేరిమ్మతో కలిసి నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల మధుబాబు పాల్గొన్నారు.

ఎరువుల గోదాముల్లో తనిఖీలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండల, పట్టణ ప్రాంతాల్లోని ఎరువుల గోదాములు, వివిధ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో రంజిత్‌కుమార్, ఏవోలు తేజస్విని, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

నటుడు కోట మృతి తీరని లోటు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విలక్షణ నటన కనబర్చిన కోట శ్రీనివాసరావు మృతి సినీ, నాటక రంగానికి తీరని లోటని తాడేపల్లికి చెందిన కళాకారులు అన్నారు. ఈ మేరకు సోమవారం వారు సంతాపం వ్యక్తం చేశారు. కళాకారులు ఉండవల్లి పార్థసారథి, జొన్నా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తహసీల్దారు జె.కరుణ కుమార్ పర్యవేక్షణలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ నబిల్ శిక్షణ అందించారు. శిక్షణ పొందిన వారికి తహసీల్దారు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

పేదలకు అండగా నిరంతర పోరాటం

మాట్లాడుతున్న జయకుమార్, వేదికపై చిన్నితిరుపతయ్య, నాయకులు

మంగళగిరి, న్యూస్‌టుడే: పేదలకు అండగా వారి సమస్యలు పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మంగళగిరి మండలం ఆత్మకూరులో పార్టీ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని నాయకులు కళ్లం మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. మహాసభకు మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, శాఖ అధ్యక్షుడు జాలాది విజయ్‌చంద్రరావు అధ్యక్షత వహించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు. ✦ మంగళగిరి మండల సీపీఐ కార్యదర్శిగా జాలాది జాన్‌బాబును ఎంపిక చేశారు. సోమవారం నియోజకవర్గ కార్యదర్శి చిన్నితిరుపతయ్య కార్యవర్గాన్ని ప్రకటించారు. కౌన్సిల్ సభ్యులుగా 21 మందిని ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయం

తాడికొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని తెదేపా నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య పేర్కొన్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో సోమవారం తెదేపా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు బండ్ల కోటేశ్వరరావు, పాలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంతేరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వాసిరెడ్డి జయరామయ్య, తెదేపా నాయకులు

‘సానుభూతి వద్దు.. సమస్యలు పరిష్కరించండి’

మంగళగిరి, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై ప్రభుత్వం సానుభూతి చూపకుండా.. వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. తమ సమస్యలను పరిష్కారం కోరుతూ మంగళగిరి, తాడేపల్లి నగరపాలక కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న ఆందోళనలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి అనేకసార్లు తీసుకు వెళ్లామన్నారు. సమ్మె ప్రారంభం కాగానే పరిష్కరిస్తామని చెప్పడం కాదని వెంటనే స్పందించాలని కోరారు. తొలుత కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పాశం రామారావు, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్ఎస్ చెంగయ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఎన్ఆర్ఐ రోడ్డులో నలుగురు వ్యక్తుల నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మారయ్యబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళగిరి భద్రావతినగర్‌కు చెందిన సురేంద్ర, కొప్పురావుకాలనీకి చెందిన చిన్నాతో పాటు మరో ఇద్దరు బాలలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి మంగళగిరిలో పొట్లాలుగా కట్టి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నయనతార తమ సిబ్బందితో దాడిలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఎస్టీయూ జెండా ఆవిష్కరణ

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జెండాను సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఏపీఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ సుధీర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి మండల, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్మాన్ ప్రసాద్, ఎం.మోహన్‌కృష్ణ, శ్రీధర్, మరియదాసు తదితరులున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా నిర్వహించినట్లు నాయకులు చెప్పారు.

శునకానికి సంవత్సరీకం

ప్రేమగా పెంచుకున్న పెంపుడు కుక్క మృతి చెంది ఏడాది గడిచినా దానిపై ప్రేమ పోలేదు. అందుకే రాష్ట్రాలు దాటి వచ్చి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. పెనుమూలికి చెందిన సాయిలక్ష్మి బెంగళూరులో ఉంటారు. 14 ఏళ్లుగా ఆ కుటుంబం ఓ శునకాన్ని పెంచుకుంటోంది. గతేడాది ఆ శునకం మృతి చెందగా. . సాయిలక్ష్మి స్వగ్రామం తీసుకువచ్చి సొంత పొలంలో అంత్యక్రియలు నిర్వహించి.. ఓ సమాధి నిర్మించారు. ఈ నేపథ్యంలో సోమవారం బెంగళూరు నుంచి గ్రామానికి వచ్చి సంవత్సరీకం నిర్వహించారు. బంధువులకు భోజనాలు పెట్టారు. అంతేకాకుండా స్థానికంగా వీధి కుక్కలను సంరక్షిస్తుండే ఆరెమండ్ల సుధీర్‌కుమార్‌కు ఇతర కుక్కల పోషణకు రూ. 10 వేలు అందజేశారు. **-న్యూస్‌టుడే, పెనుమూలి(దుగ్గిరాల)**

వెలుగులు ఎప్పటికో..!

రాయపూడి, దొండపాడు మధ్య సీడ్ యాక్సెస్ రహదారిపై ఆరు నెలల క్రితం అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఆధ్వర్యంలో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించారు. డివైడర్‌లో రెండు వైపులా స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్తు దీపాలు అమర్చారు. కానీ కరెంటు సరఫరా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రాత్రి వేళ రోడ్డుపై అంధకారం నెలకొంటుంది. ఈ మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, త్వరితగతిన ఏడీసీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తుళ్లూరు**

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: చిరుధాన్యాలతో చపాతీలు, కొర్ర పాయసం, బిర్యానీ వంటి రుచికరమైన ఆహార పదార్థాలు తయారు చేసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారని రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన సదస్సులో సోమవారం ఆయన మాట్లాడారు. బెంగళూరుకు చెందిన హోమియో వైద్యులు సరళాఖాదర్ మాట్లాడుతూ ఒక మనిషి సంవత్సరం మొత్తం తినేందుకు ఉపయోగించే బియ్యం పండించేందుకు 17 లక్షల లీటర్ల సాగునీరు అవసరం అవుతోందని, ఇంతే పరిమాణంలో చిరుధాన్యాలకు కేవలం 50 వేల లీటర్ల నీరు సరిపోతాయన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, వేదికపై డాక్టర్ సరళా ఖాదర్

అవీ ఇవీ

కోయవారిపాలెంలో ఆధార్ శిబిరం

ప్రత్తిపాడు: కోయవారిపాలెం గ్రామ సచివాలయంలో ఈ నెల 15 నుంచి 18 వరకు, 22 నుంచి 25 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శివపార్వతి చెప్పారు. విద్యార్థుల వేలిముద్రల అప్డేట్, నూతన ఆధార్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: ఫిరంగిపురం పరిధిలో మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అల్లవారిపాలెం, వసంతనగర్, ఆరోగ్యనగర్, జగనన్న కాలనీలలో మరమ్మత్తుల నిమిత్తం ఉదయం11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెదనందిపాడు, న్యూస్‌టుడే: మండల విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా నందిపాటి భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోసూరి సుబ్బారాయుడు, కార్యదర్శి ఎం. పున్నారావు, కోశాధికారిగా ఆర్. నాగప్రసాద్‌లత, ఉపాధ్యక్షుడిగా కె.వాసు, కార్యదర్శిగా ఎం. పున్నారావు, విశ్వబ్రాహ్మణ సంఘ యూత్ అధ్యక్షుడిగా యలమర్తి సాంబశివరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చినహనుమయ్య సోమవారం తెలిపారు. అనంతరం సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏఎన్ఎం నిరసన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం వంగిపురం ఏఎన్ఎం భైఠాయించి నిరసన తెలిపారు. వంగిపురం నుంచి బదిలీ అయినా, రిలీవింగ్ ఆర్డరు ఇవ్వడం లేదంటూ సుమారు 10 నిమిషాల పాటు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో శివపార్వతి స్పందించి రిలీవింగ్ ఆర్డరు ఇచ్చి పంపడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆర్వో ప్లాంటు తెరుచుకోక ఇక్కట్లు

పాలపర్రు(పెదనందిపాడు), న్యూస్‌టుడే: పాలపర్రులో ఆర్వో ప్లాంట్ నిర్వహణ విషయంలో ఆదివారం ఇద్దరు నిర్వాహకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం వారి ఒకరైన మహేష్ మోటారు, పైపులు తీసుకువెళ్లడంతో ప్లాంట్ మూతబడింది. దీంతో గ్రామస్థులకు తాగు నీరు అందలేదు. ఎస్సీ కాలనీలో ఉన్న మరో వాటర్ ప్లాంట్ నిర్వహణకు సంబంధించి సోమవారం ఇరు వర్గాలకు చెందిన ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఎస్సై మధూవపన్ చొరవతో వివాదం సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో కొంత మంది తెదేపా నాయకులు సోమవారం సాయంత్రం వరగాని, గార్లపాడుల నుంచి తాగునీటి ట్యాంకర్‌లను తెప్పించి నీటిని సరఫరా చేశారు.

పీ-4లో భాగస్వాములు కండి

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పీ4 కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దారు క్షమారాణి, ఎంఈవో నిర్మలలు సోమవారం కోరారు. పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఫణికుమార్‌లతో వారు సమావేశం అయ్యారు. గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించారు.

హైకోర్టు న్యాయవాదిపై దాడి

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది మోహనరావుకు ఆయన మేనల్లుడు సహర్ధకు మధ్య దొండపాడు గ్రామంలో ఉన్న స్థలం విషయంలో విభేదాలు ఉన్నాయి. సోమవారం మేనల్లుడు తుళ్లూరులోని మోహనరావు ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. ఈ క్రమంలో మోహరావును కొట్టి గాయపరిచాడు. స్థానికులు అక్కడికి రావడంతో సహర్ధ పారిపోయాడు. ఈ ఘటనపై తుళ్లూరు సి.ఐ-2 అంజయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో కార్మెల్ మాత ఉత్సవాలు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఫిరంగిపురం కార్మెల్ మాత ఉత్సవాలు సోమవారం వైభవోపేతంగా జరిగాయి. విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం బాలయేసు కథెడ్రల్ దేవాలయం, కార్మెల్ కొండపై, కొండ మెట్ల వద్ద దివ్య బలిపూజ కార్యక్రమం జరిగింది. విచారణ గురువులు యనమాల ఆంతోని రాజు, పులిపాటి జోజిరాజు, సాగర్ వాక్యోపదేశం చేశారు. కార్మెల్ మాతను భక్తితో ప్రార్థిస్తే భక్తుల కోరికలు తీరుతాయని తెలిపారు. గ్రామంలోని ప్రయివేట్ పాఠశాలలు, చుట్టు పక్కల గ్రామాల నుంచి విశ్వాసులు తరలివచ్చారు. మెట్ల మార్గం ద్వారా కొండపైకి వెళ్లి మాతను దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు సమర్పించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట రవి సోమవారం తెలిపారు. మంగళగిరి మండలం బేతపూడికి చెందిన వాసా రాంబాబు, రేవేంద్రపాడుకు చెందిన రహీమ్‌లు ద్విచక్రవాహనాలు చోరీ చేసి తాకట్టు పెట్టి.. ఆ నగదుతో ఉడాయిస్తుంటారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారని, నరసరావుపేట సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు.

రైస్ మిల్లు యజమాని అరెస్ట్

అనంతవరప్పాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: అక్రమంగా చౌక బియ్యం నిల్వచేసిన కేసులో రైస్ మిల్లు యజమానిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. గుంటూరు నగరానికి చెందిన దివ్వెల హరీష్ అనంతవరప్పాడులో శ్రీవల్లి రైస్‌మిల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన అక్రమంగా రేషన్ బియ్యం మిల్లులో నిల్వ ఉన్నాయన్న సమాచారం అందుకున్న అధికారులు అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 160 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. నిందితుడిని అరెస్ట్ చేసి గుంటూరు కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

ప్రభుత్వ సంస్థ - ప్రాయోజిత బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పెనుమాక బ్రాంచ్, డి.నెం.1-157, పెనుమాక, తాడేపల్లి మండలం,గుంటూరు జిల్లా-522501. ఫోన్: 9100910431

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినసూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారునగలను **ది.24-07-2025, గురువారం మధ్యాహ్నం 3-00 గం॥లకు** మా బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమ కట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది.24-07-2025 మధ్యాహ్నం 2-00 గం॥లలోపు రూ.5,000/-** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాముల్లో
70113004928697 7	శ్రీమతి షేక్ హుస్సేన్ బీ, భర్త: పాములు, పెనుమాక	27.60
70113004929166 7	శ్రీ కలతోటి మనోజ్ జోసఫ్, తండ్రి: సుజన్ కుమార్, విజయవాడ.	6.90

1) పైన తెలిపిన ఋణగ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసులు (అవి ఏ కారణము చేతనైనను) తిరిగి వచ్చిన దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినది, 2) విజయవంతమైన పాటదారుడు వేలం తేది సాయంత్రం 4:00 గం॥లోగా ధరావత్తు పినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను, 3) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకొనవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు, 4) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికంగా దాఖలు చేయుట తప్పనిసరి. గమనిక: పైన ప్రచురించిన ప్రకటనలో పత్రికవారి అచ్చుతప్పులకు బ్యాంకువారు బాధ్యులు కాదు.

తేదీ : 14-07-2025, ప్రదేశం: పెనుమాక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, పెనుమాక బ్రాంచి, గుంటూరు జిల్లా.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ APGB పెదపరిమి శాఖ, తుళ్ళూరు మండలం, ✆ 08645-281028

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినసూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారు నగలను ది.31-07-2025 గురువారం మధ్యాహ్నం గం॥ 3-00 లకు ఈ దిగువ తెలిపిన ఆయా శాఖల ఆవరణములో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమ కట్టుకొనబడును. వేలములో పాల్గొన దలచినవారు ది.31-07-2025 మధ్యాహ్నం 2-00 గం॥లలోపు ధరావత్తుగా చెల్లించవలయును. వేలము యొక్క ఇతర నియమనిబంధనలను సంబంధిత శాఖాధికారి నుండి పొందగలరు. ఎట్టి కారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్య తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది. ధరావత్తు: 10,000

క్రమ సంఖ్య	అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు, చిరునామా	బంగారం గ్రాములలో
1	702530033197098	కూరపాటి శేషగిరిరావు, S/o రాఘవులు, R/o పెదపరిమి	11.8
2	702530033203058	గుర్రపుసాల రాములు, S/o గంగయ్య, R/o పెదపరిమి	20.05

ప్రదేశం : పెదపరిమి, తేది : 14-07-2025 బ్రాంచ్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(c) eenadu

గుంటూరు తూర్పు

మాకు రక్షణ కల్పించండి

గుంటూరు పశ్చిమ: స్థల వివాదం నేపథ్యంలో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఆయన అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని గుమ్మడి భారతి కలెక్టరేట్‌లో విన్నవించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రోశయ్య.. జీటీ రోడ్డులోని తమ స్థలంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి ద్వారా లీజు అగ్రిమెంట్ చేసుకున్న కిలారి రోశయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారు అక్రమ రిజిస్టర్ చేసుకున్న దొంగ డాక్యుమెంట్లు రద్దు చేయాలని, తనకు, తన చెల్లి కుమారుడైన ఉప్పలపాటి మునియ్యలకు రక్షణ కల్పించాలని కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 30, వంగ 28, బెండ 23, పచ్చిమిర్చి 68, కాకర 29, క్యారెట్ 45, క్యాబేజీ 23, బీర 25, దొండ 29, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 42, దోస 19, పొట్ల 24, చామదుంప 28, మునగ 7, గోంగూర 10, తోటకూర 10, చుక్కకూర 15, కొత్తిమీర 20, బీట్‌రూట్ 38, కీర 48, క్యాప్సికం 73, అల్లం 58, ఫ్రెంచి బీన్స్ 84, సొర 12, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

☛ వినోభనగర్ శివార్లలో పేరుకుపోయిన వ్యర్థాల్ని సోమవారం అధికారులు తొలగించారు. వ్యర్థాలతో ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ద్వారా అధికారులకు వివరించగా, వారు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లో వ్యర్థాలు వేయాలని సూచించారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

☛ మంగళదాస్‌నగర్ మున్సిపల్ స్కూల్ వద్ద చెత్తకుప్పలు తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా ఉంటోందని స్థానికుడు కిషోర్ 'మేమున్నాం.. మీకు తోడుగా' తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు. ☛ ఆదిత్యనగర్ మూడోలైన్ సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకాక సమస్యలు వస్తున్నాయని స్థానికుడు శ్యాం 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

కుక్కలు కరిచినప్పుడు స్పందిద్దాంలే!

● జీఎంసీ ప్రజారోగ్య విభాగం నిర్లక్ష్యం ● మూతబడిన ఏటుకూరురోడ్డులోని ఏబీసీ కేంద్రం

న్యూస్‌టుడే-నగరపాలక సంస్థ

కొద్ది నెలల క్రితం నగర శివారు స్వర్ణభారతినగర్‌లో వీధి కుక్క దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఏటీ అగ్రహారం ప్రాంతంలో పిచ్చికుక్క పదిమందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో వారంతా ఆసుపత్రులపాలయ్యారు.

ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. వాహనాలను నగరమంతటా తిప్పి.. కుక్కలను పట్టుకుని సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయకుండానే, వ్యాక్సిన్‌లు వేయకుండానే వదిలేశారు. వీధి కుక్కల సమస్యలపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా.. వారిలో స్పందన రావడం లేదు.

ఇటీవల సీఎంవోహెచ్ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లగా, ఎంహెచ్‌వో విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంతో సరెండర్‌కు గురయ్యారు. వెటర్నరీ వైద్యుడు కూడా ఇటీవల బదిలీల్లో సొంత శాఖకు వెళ్లారు. అంతకుముందే వీధి కుక్కల శస్త్రచికిత్సలు చేసే ఏటుకూరురోడ్డులోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రం మూతబడింది. వీధికుక్కలకు అపరిశుభ్ర వాతావరణంలో రూ.లక్షలు వెచ్చించి ఆపరేషన్లు చేస్తున్నా ఉపయోగం ఉండటం లేదని, అవి చాలావరకు మృతి చెందుతున్నాయని జంతుప్రేమికులు ఫిర్యాదులు చేయడంతో సెంట్రల్ యానిమల్ వెల్ఫేర్ బోర్డు అధికారులు ఏబీసీ కేంద్రం సందర్శించి వెంటనే శస్త్రచికిత్సలు నిలిపివేయించారు. దీంతో కొన్నాళ్లపాటు ఆపేసి ఇటీవల ప్రజాప్రతినిధులు ఒత్తిడితో తాత్కాలికంగా ప్రారంభించినా కొద్ది రోజులకే నిలిపేశారు.

గుంపులుగా ఉన్న వీధికుక్కలు

ఎమ్మెల్యేలు సూచనలిస్తున్నా..

కౌన్సిల్ సమావేశాలు, సమీక్షలు జరిగినప్పుడల్లా తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి వీధికుక్కల సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచనలిస్తున్నారు. వీటిని అధికారులు పట్టించుకున్న దాఖలా కనిపించడం లేదు. తక్కెళ్లపాడు వాటర్‌వర్క్స్ పక్కనున్న స్థలంలో ఏబీసీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని దీనికి రూ. 65 లక్షలు కేటాయించినట్లు ఇటీవల కౌన్సిల్ సమావేశంలో అధికారులు చెప్పారు. మరోవైపు అక్కడ ఏబీసీ కేంద్రం ఏర్పాటుపై పలు అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. ఇటీవల నగరానికి చెందిన ఓ సంస్థ వీధికుక్కల నియంత్రణకు పూర్తి ప్రణాళికతో వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. జీఎంసీ ఏటా వీధి కుక్కల నియంత్రణకు రూ.50 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నా ఉపయోగం ఉండటంలేదు.

బలహీనంగా ఉన్న బ్యారికేడ్లు నిలవడానికి రాళ్లు అడ్డం పెట్టి..

పనులు భద్రం... పడితే ప్రమాదం

గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానం చేసే శంకర్‌విలాస్ పైవంతెన పనులకు ఇరువైపులా పిల్లర్ల కోసం పెద్ద గుంతలు తవ్వారు. వాటిచుట్టూ బ్యారికేడ్‌లు ఏర్పాటు చేశారు. వాటి పక్కనే చిన్నగా దారి వదలడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు వెళ్తున్నాయి. ఈ సందర్భంగా కొన్ని ఎదురెదురుగా వస్తుండడం, జీజీహెచ్‌వైపు పిల్లర్ల కోసం తీసిన గుంత చుట్టూ పెట్టిన బ్యారికేడ్లు బలహీనంగా ఉండడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా, సరైన బ్యారికేడ్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- ఈనాడు, గుంటూరు; న్యూస్‌టుడే, నగరంపాలెం**

సుపరిపాలనలో ప్రతి ఇంటికీ వసంతం

పథకాలు, ప్రగతి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో ప్రతి ఇంటికీ వసంతం వచ్చిందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. 19వ డివిజన్‌లోని సంగడిగుంటలో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో సాధించిన ప్రగతి, చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యల్ని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మార్పునకు నాంది పలికారన్నారు. గతంలో గుంతలమయమైన రోడ్లు.. ఇప్పుడు లేవని, అన్నీ అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ-4 వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, తెదేపా నాయకులు దాసరి రాజామాస్టర్, రామచంద్ర, చినబుజ్జి, ఆంజనేయప్రసాద్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

... తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఆయన శానిటేషన్ అధికారులతో సమావేశమయ్యారు. శానిటేషన్ విధులకు ఆటంకం కలిగిస్తున్న అంశాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యుత్‌శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలు నరికి అక్కడే వదిలేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధికారులు తెలిపారు.

కళాశాలల వద్ద శక్తి పోలీసుల నిఘా

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ నిర్మూలనకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో సోమవారం శక్తి పోలీసు బృందాలు కళాశాలలు, విద్యాలయాల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాయి. డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాయి. ఆపద సమయంలో శక్తి యాప్ ఉపయోగించుకోవాలని పోలీసులు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐలు కృష్ణయ్య, నారాయణ, ఎస్సైలు తరంగిణి, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న శక్తి పోలీసులు

కాలుజారి.. పిల్లరు గుంతలో పడి..

పిల్లరు గుంతలో పడిన వ్యక్తిని బయటకు తీసుకొస్తున్న స్థానికులు

అరండల్‌పేట, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం శంకర్‌విలాస్ పైవంతెన పిల్లరు గుంతను చూసేందుకు వచ్చారు. పిల్లరు గుంత అంచు వద్ద నిలబడి తొంగి చూస్తుండగా.. కాలి కింద ఉన్న మట్టిపెళ్ల విరిగిపడడంతో ఒక్కసారిగా 20 అడుగుల గుంతలో పడిపోయారు. దీంతో స్థానికులు.. పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తర్వాత స్థానికుల సాయంతో స్ట్రెచర్‌పై పైకి తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు. పెద్దగా గాయాలవ్వకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పిల్లరు నిర్మాణం పూర్తయ్యే వరకు కాపలాదారు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

షోకాజ్ నోటీసులతో బెదిరిస్తారా?

గుంటూరు నేరవార్తలు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ డిమాండ్ చేశారు. తక్కెళ్లపాడు వాటర్‌ప్లాంట్ వద్ద నిరసన చేస్తున్న కార్మికులను కలిసి సీపీఎం మద్దతుగా ఉంటుందన్నారు. నగర కార్యదర్శి నళినీకాంత్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కార్మికులకు షోకాజ్ నోటీసులంటూ, పనిలోంచి తొలగిస్తామని బెదిరించడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, ముత్యాలరావు, శ్రీనివాసరావు, నరసింహారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతాజీ. పక్కన నళినీకాంత్, ముత్యాలరావు, నారాయణరెడ్డి

పర్యావరణహితంగా జీఎంసీ కార్యాలయం అభివృద్ధికి చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పర్యావరణ హితంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి కార్యాలయం ఆవరణలో సమస్యలు పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. మేయర్ మాట్లాడుతూ జీఎంసీ కార్యాలయం ఆవరణ లోతట్టుగా ఉండటం వల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు చేరి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వర్షం నీరు లోపలికి రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆవరణలో మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్కింగ్ ప్రాంతంలో నీడనిచ్చే చెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన గేట్ల మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యాలయంలో ఆధునీకరణ పనులకు సంబంధించి మోడల్స్ అంచనాలు తయారు చేయాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్తి, వరప్రసాద్, మీరా వలి, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ కార్యాలయం ఆవరణలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిషనర్ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర

ప్రమాదకరంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

నాజ్ సెంటర్‌లో అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దాదాపు పదేళ్ల కిందట అధికారులు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీని చుట్టూ సరైన ఫినిషింగ్ లేకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో సినిమా థియేటర్లు వస్త్ర దుకాణాలతోపాటు, గుంటగ్రౌండ్స్ ఉండటంతో నిత్యం ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. విద్యార్థులు ఇక్కడ చేరి ఆడుకొంటుంటారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

జీతాలు పెంచాలని మంత్రి నారాయణకు వినతి

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పురపాలక విభాగంలోని ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికుల జీతాల పెంపు విషయమై వెంటనే ప్రకటన చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం విజయవాడ గుణదలలోని మంత్రి నారాయణను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19లోగా ఒక ప్రకటన ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయమై కూడా నిర్ణయం వెలువడుతుందని తెలిపారన్నారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.మధుబాబు, రాష్ట్ర కోశాధికారి నాగిపోగు సుమన్, గుంటూరు నగర కమిటీ కార్యదర్శి రాయపూడి కోటిబాబు ఉన్నట్లు తెలిపారు.

మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

సమసమాజ స్థాపన సీపీఐ లక్ష్యం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సమసమాజ స్థాపన సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ నగర కార్యదర్శి మాల్యాద్రి అన్నారు. సోమవారం ఏటీ అగ్రహారం వద్ద ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు. మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వందేళ్లవుతున్న సందర్భంగా ఈ నెల 24న నగర మహాసభలు నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, హనుమంతురావు, అరుణ్‌కుమార్, అంజిబాబు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన మాల్యాద్రి, శ్రీనివాసరావు, హనుమంతురావు, అరుణ్‌కుమార్, అంజిబాబు

ఐలాండ్‌కు మోక్షం ఎప్పుడో?

హిందూ కాలేజీ సెంటర్లోని ఐలాండ్ అధ్వాన స్థితికి చేరింది. ఐలాండ్ చుట్టూ ఏర్పాటు చేసిన గోడలు పగుళ్లిచ్చి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. నగరాన్ని సుందరీకరణ చేస్తామని చెబుతున్న అధికారుల మాటలు ఆచరణకు నోచుకోవటం లేదు. నిత్యం మందుబాబులు మద్యం తాగి ఐలాండ్‌లో అటుగా వచ్చే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

నీరు ఆగదు.. వీరు మారరు!

న్యూస్‌టుడే - నెహ్రూనగర్

నగరంలోని అనేక ప్రాంతాలకు తాగునీటి సరఫరా లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని డివిజన్లలోనివారికి పూర్తిస్థాయిలో నీరందడం లేదు. మరోవైపు నెహ్రూనగర్, బుచ్చయ్యతోటలో సంవత్సరాలుగా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి తరచూ తాగునీరు మురుగుకాలువల ద్వారా వృథాగా పోతోంది. దీనికి అడ్డుకట్ట పడడం లేదు. నెహ్రూనగర్ 1వ వీధి నుంచి 6వ వీధి వరకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అటు జనం రాకపోకల సమయంలోనూ ఇబ్బంది పడుతున్నారు. పాదచారుల అవస్థలు వర్ణనాతీతం. బుచ్చయ్యతోట 2వ వీధిలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలున్నాయి. గతేడాది ఆ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు ఇలానే నీరు చేరి ఓటర్లు సైతం ఇబ్బందులు పడ్డారు. ఈనాటికీ ఆ వీధిలోని పాఠశాలలకు వెళ్లటానికి చిన్నపిల్లలు వారి తల్లిదండ్రులు మురుగునీటిలో అవస్థలు పడాల్సి వస్తోంది. తక్కెళ్లపాడు నుంచి ప్రధాన పైపులైను ద్వారా వచ్చిన నీటిని శుద్ధి చేసి రిజర్వాయర్‌పైకి పంపింగ్ చేసే క్రమంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగి నీరు వృథాగా పోతున్నట్లు అధికారులు చెబుతున్నా.. సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. గతంలో అప్పటి జీఎంసీ కమిషనర్ విద్యుత్తు సరఫరా నిలిచిపోయినప్పుడు ఉపయోగించుకోవటానికి రూ. లక్షలు వెచ్చించి జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. విచిత్రమేమిటంటే రిజర్వాయర్ ఉన్న ప్రాంగణంలోనే విద్యుత్తుశాఖ కార్యాలయం ఉంది. నగరపాలకసంస్థ, విద్యుత్తుశాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో సమస్యగా మారింది. మరమ్మతుల కోసం కరెంట్ సరఫరా నిలిపేయడానికి ముందుగా జీఎంసీ అధికారులకు సమాచారం ఇస్తే వారు అప్రమత్తం అయ్యేందుకు అవకాశం ఉంటుంది.

జులై 10న: కాలువలా తాగునీటి ప్రవాహం

మోసాలు.. బెదిరింపులు..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో బాధితులు తరలి వచ్చారు. ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీలు సుప్రజ, రమణమూర్తి, హనుమంతు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.

బంగారం ఆభరణం తీసుకువెళ్లాడు

కొత్తపేటలోని ఓ వాటర్‌ప్లాంట్‌కు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నా. ప్లాంట్ యజమాని మా ఇంటికి వచ్చినప్పుడు నా భార్యకు 81 గ్రాములతో చేయించిన బంగారు ఆభరణం చూపించా. అలాంటిది తాను చేయించుకుంటానని ఆ నగను ఇవ్వమని తీసుకెళ్లిన యజమాని తాకట్టు పెట్టుకున్నాడు. ఆభరణం తిరిగివ్వమని అడిగితే కత్తులతో చంపేస్తానని బెదిరిస్తున్నాడు. **- సోమశేఖర్**

తప్పుడు కేసు పెట్టారు

ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్నప్పుడు పరిచయమైన వ్యక్తి క్రెడిట్ కార్డు తీసుకొని నా సెల్ నంబర్ వాడుకున్నాడు. ఆ క్రెడిట్ కార్డుతో భారీగా ఆ షాపింగ్‌మాల్‌లో కొనుగోలు చేశాడు. నేను అతని క్రెడిట్ కార్డు ఉపయోగించుకున్నానని నాపై తప్పుడు కేసు పెట్టాడు. ఆ డబ్బులు నన్ను కట్టమని లేదా ఇల్లు అతని పేరుమీద రాయమని బెదిరిస్తున్నాడు. **- సత్యనారాయణ, ఏటీ అగ్రహారం**

కానిస్టేబుల్ మోసగించాడు

గ్రేహౌండ్స్ విభాగంలో పని చేసే ఓ కానిస్టేబుల్ పరిచయమై నన్ను ప్రేమిస్తున్నానని నా వెంట తిరిగాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. అతనిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలి. **- ఓ యువతి**

బాబును నా భర్త కిడ్నాప్ చేశాడు

నాకు పెదకాకానికి చెందిన ఓ యువకుడితో ఆరేళ్ల కిందట వివాహమైంది. మాకు ఒక బాబు. నా భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని నన్ను చంపటానికి యత్నిస్తున్నాడు. ఒకసారి గర్భం పోవటానికి అన్నంలో విషం కలిపాడు. మరోసారి బాదంపాలులో విషం కలిపి ఇస్తే అనుమానం వచ్చి తాగలేదు. మా పుట్టింటికి వెళ్లిపోతే అక్కడకు వచ్చి నా బాబును కిడ్నాప్ చేశాడు. నాకు రక్షణ కల్పించి బాబును ఇప్పించండి. **- ఓ గృహిణి, మంగళగిరి**

రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలు తొలగిస్తున్న పోలీసులు

రహదారిపై ఆక్రమణల తొలగింపు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆదేశాలతో సీఐలు, సిబ్బంది తూర్పు, పశ్చిమ పరిధిలో రహదారులపై ఆక్రమణలు తొలగించారు. రోడ్డుపై అడ్డంగా పెట్టిన వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. రోడ్డుపైకి వచ్చిన తోపుడుబండ్లను వెనక్కి పెట్టించారు.

జూదం కేసులో ఇద్దరి అరెస్టు

పట్నంబజారు: చిన్నెరుకుంట సమీపంలో జూదం ఆడుతున్న ఇద్దరి యువకుల్ని సోమవారం పాతగుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. రూ. 8 వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

సినీ కొరియోగ్రాఫర్ శ్రేష్ఠవర్మపై చర్యలు తీసుకోండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ, నెహ్రూపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేసిన సినీ కొరియోగ్రాఫర్ శ్రేష్ఠవర్మపై చర్యలు తీసుకోవాలని కరీం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కరీం మాట్లాడుతూ ఆమెపై ఇచ్చిన ఫిర్యాదుపై మే 9న నగరంపాలెం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసులు తాత్సారం చేయడాన్ని అలుసుగా చేసుకొని సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులు డిలీట్ చేసే అవకాశం ఉందన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన కరీం

జిల్లా క్రికెట్ సంఘం కొత్త కార్యవర్గం ఎన్నిక

గుంటూరు క్రీడలు: జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి రాకేష్ చౌదరి పేర్కొన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గుంటూరులో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి వెంకటరత్నం మాట్లాడుతూ ఎన్నికల్లో ఆఫీస్ బేరర్స్ పదవులకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా చుక్కపల్లి రాకేష్‌చౌదరి, ఉపాధ్యక్షులుగా తోట వెంకట శివరామకృష్ణ, కార్యదర్శిగా ఏనుముల శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా కొంగర రాహుల్‌చౌదరి, కోశాధికారిగా సింగరాజు లక్ష్మీకాంత్, కౌన్సిలర్‌గా నందిరాజు శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాకేష్ చౌదరి మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ క్రీడాకారులను అన్ని విభాగాల్లో అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. వెంకట శివరామకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారుల సమస్యలు పరిష్కరించడంలో, అవసరాలను తీర్చడంలో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో విజేతలకు అభినందన

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపిన గుంటూరు క్రీడాకారిణులు బొలినేని చంద్రిక, షేక్ సాధియా అల్మాస్, నాగం జ్ఞానదివ్య, మందిర షానూన్‌లను మేయర్ కోవెలమూడి రవీంద్ర సోమవారం తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. మేయర్ కోవెలమూడి మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో నిర్వహించిన జూనియర్, సీనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏపీ తరపున గుంటూరు నుంచి పాల్గొన్న బొలినేని చంద్రిక వెండి పతకం, షేక్ సాధియా అల్మాస్ జూనియర్ విభాగంలో బంగారు పతకం, నాగం జ్ఞానదివ్య, మందిర షానూన్‌లు జూనియర్ విభాగంలో పతకాలు సాధించారని తెలిపారు. వీరు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సాంధాని పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణులను అభినందిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ప్రజాఫిర్యాదులు, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం ఆయన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 22 ఫిర్యాదులురాగా వీటిని ఆయా విభాగాల అధికారులకు పంపి పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ ఆదేశాల మేరకు జనన, మరణ రిజిస్ట్రేషన్ విభాగం వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళికకు సంబంధించి 15, ఇంజినీరింగ్ 8, రెవెన్యూ 5, ప్రజారోగ్య 4, అకౌంట్స్ విభాగం 2, పరిపాలన 2, ఉపాసెల్ 1 చొప్పున ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీలు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఎంహెచ్‌వో(ఇన్‌ఛార్జి)లు రామారావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో పరిశీలన

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: అన్నక్యాంటీన్‌లలో ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అనుగుణంగా ఆహారం అందించాలని.. అవసరం మేరకు ఇండెంట్‌ను అక్షయపాత్ర సిబ్బంది తెలియజేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన ఆర్టీవో కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

అంబటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర

పట్టాభిపురం: మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబుకు జిల్లా పార్టీ అధ్యక్ష పదవితో పాటు గుంటూరు పశ్చిమ సమన్వయకర్త పదవి ఇచ్చినా రోజుకో వేషం కడుతున్నారని, ఆయన్ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే గల్లా మాధవి ఎద్దేవా చేశారు. 18వ డివిజన్‌లో 'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ అంబటి రాంబాబు మనుగడ కోసం వెంపర్లాడుతున్నారన్నారు. ఏదో ఒక కారణంతో మీడియాలో కనిపించాలనే యావ తప్ప ఆయన చేసే ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ కేవలం ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీల్లో 80 శాతం నెరవేర్చారన్నారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. మహిళలకు రక్షణ లేదని వైకాపా నేతలు ఆందోళన చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సింహాద్రి కనకాచారి, ఉల్లి గోపాలకృష్ణ, మల్లె ఈశ్వర్, ఉప్పునూతల సాంబశివరావు, కనుకుర్తి హనుమంతరావు, అడపా బాబు, నీలం ప్రసాద్, మల్లీశ్వరి, సత్యవాణి, శివలీల, జీవని పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

? గుండారావుపేటలోని చెక్కల బజార్‌లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వాహనదారులు ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. చెత్త, వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు**

✔ **పరిష్కారం:** వెంటనే స్పందించి శానిటరీ సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలు తొలగిస్తాం. **- అంగడి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

కాలువల్లో మురుగు తొలగింపు: సాంబశివపేట వీధుల్లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడడంతో సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. **-న్యూస్‌టుడే, నగరంపాలెం**

స్పందనకు వందనం

నిరుద్యోగుల ఉపాధికి ఉద్యోగ మేళాలు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అన్నారు. ఈనెల 22న బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో నిర్వహించనున్న ఉద్యోగ మేళా పోస్టర్‌ని కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జేసీ సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు టి.వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి జరుగుల బంగారు బాబు, శివకుమారి సౌజన్యంతో భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి జ్యోతి కుమారి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

డీసీహెచ్ఎస్‌కు వెళ్లాలంటే ఫీట్లు చేయాల్సిందే

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి(డీసీహెచ్ఎస్) కార్యాలయానికి వెళ్లాలంటే ఫీట్లు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పట్టాభిపురంలో ఏర్పాటు చేసిన కార్యాలయం వద్ద మురుగునీటి కాల్వపై తాత్కాలికంగా చెక్కతో వంతెన ఏర్పాటు చేశారు. అది ఎప్పుడు విరిగి పడిపోతుందోనని అక్కడి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలల నుంచి అది అలానే ఉంది. ఆ కార్యాలయం ఎదుట ఎప్పుడు చూసినా బురద నీరు నిల్వ ఉండి లోపలికి వెళ్లాలంటేనే ఇబ్బందిగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఆ కార్యాలయానికి సదరం ధ్రువపత్రాల విచారణ కోసం దివ్యాంగులు వస్తుంటారు. వైద్యాధికారులు ఇతర సిబ్బంది వస్తుంటారు. అయినప్పటికీ మురుగు కాలువపై శాశ్వతంగా నడకదారి కోసం ఏర్పాట్లు చేయలేకపోతున్నారు.

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 30, వంగ 34, బెండ 23, పచ్చిమిర్చి 68, కాకర 45, బీర 43, క్యాబేజి 23, క్యారెట్ 45, దొండ 29, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 42, దోస 19, సొర 22, పొట్లకాయ 24, అరటికాయ 7, చామదుంప 28, మునగ 10, బీట్‌రూట్ 38, కీరదోసకాయ 48, బీన్స్ 84, క్యాప్సికమ్ 89, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 26, అల్లం 55, వెల్లుల్లి 110. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**



స్నేహితులు కలిశారు.. సేవకు కదిలారు..

ఆదర్శం ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

ఒకనాడు ఉద్యోగ ప్రయత్నంలో వారికి విజ్ఞానాన్ని అందించింది గ్రంథాలయం. నాడు అక్కడ పొందిన విజ్ఞానం వారిని ప్రభుత్వ కొలువుల్లో నిలిపింది. అలా కొందరు ఉపాధ్యాయులుగా.. ఇంకొందరు ఉద్యోగులుగా చేరి ప్రజలకు సేవలందిస్తున్నారు. గ్రంథాలయ వేదికగా చదువుకుని ఉన్నతంగా నిలిచిన వారు.. నేడు అదే విజ్ఞాన భాండాగారానికి సహకారం అందించేందుకు సంఘంగా ఏర్పడ్డారు. స్నేహితులు ఒక్కొక్కరుగా కలుసుకుంటూ తమ వంతుగా ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న మరికొందరికి అవసరమైన సామగ్రిని గ్రంథాలయానికి అందిస్తున్నారు.

ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అందించిన ఫర్నిచర్‌ను ప్రారంభిస్తున్న గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ కోటేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గ్రంథాలయం వేదికగా చదువుకుని..

గ్రంథాలయం వేదికగా చదువుకుని ఉద్యోగాలు సాధించిన వారిని గుర్తించి 'ఈనాడు' కథనం ప్రచురించింది. ఆ కథనం ఆధారంగా విజ్ఞాన భాండాగారంలో చదువుకున్న మిత్రులు కొందరు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల ప్రాంతీయ గ్రంథాలయాన్ని సందర్శించిన కొందరు అక్కడ పుస్తకాల అవసరతను గుర్తించారు. ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ పేరుతో సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. తొలుతగా కొందరు తమ వంతుగా సమకూరిన నగదుతో సరస్వతీ నిలయానికి అవసరమైన సామగ్రి సమకూర్చారు. వీరికి సహకారంగా విశ్రాంత గ్రంథపాలకుడు అక్కినేని అచ్చుమాంబ కూడా చేయూతనిచ్చారు.

గ్రంథాలయ సంస్థకు పుస్తకాలు అందజేస్తూ...

వితరణ ఇలా.. ☛ పోటీ పరీక్షలకు అవసరమైన రూ.60 వేలతో పుస్తకాలు ☛ ప్రాంతీయ గ్రంథాలయానికి రూ.4 లక్షలతో కుర్చీలు 100, రీడింగ్ అట్టలు 100, వాటర్ ఫిల్టర్ 1, టేబుల్ ఫ్యాన్లు 8, ట్యూబ్‌లైట్‌లు 15)

మిత్రులందరం కలిసి మరింత సాయం

గ్రంథాలయం వేదికగా ఉదయం నుంచి రాత్రి వరకు చదవడం, కరెంట్ అఫైర్స్‌పై చర్చించుకోవడం.. మా అందరినీ ఒకటిగా చేర్చింది గ్రంథాలయం. అలా చదువుకుని నేడు ఉద్యోగాల్లో స్థిరపడ్డాం. గ్రంథాలయం పూర్వ స్నేహ బృందంగా ఏర్పడ్డాం. నిరుద్యోగులకు అవసరమైన చక్కని విజ్ఞానాన్ని పొందగలిగే చోటు ఇదే. అందుకే మున్ముందు ఇక్కడికి వచ్చే వారికి ఉపయోగపడేలా తమ వంతుగా సహకారం అందించేందుకు కృషి చేస్తాం. **- గుర్రం మురళీమోహన్, ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు**

దాశరథి రంగాచార్య పురస్కారానికి నసీర్ అహమ్మద్ ఎంపిక



గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత, సీనియర్ పాత్రికేయుడు సయ్యద్ నసీర్ అహమ్మద్.. డాక్టర్ దాశరథి రంగాచార్య జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. నిర్వాహకుల నుంచి ఈమేరకు వర్తమానం అందింది. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల సాహసోపేత, త్యాగమయ పాత్రను వివరిస్తూ, మూడు దశాబ్దాలుగా రచనా వ్యాసంగం సాగిస్తున్న నసీర్ అహమ్మద్ తెలుగులో 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి, వెలువరించారు. ఆయన వెలువరించిన పలు గ్రంథాలు ఆంగ్లం, ఉర్దూ, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతి భాషల్లోకి కూడా అనువాదమయ్యాయి. స్వాతంత్ర్య సమరయోధుల సాహసోపేత పాత్రను విద్యార్థులకు తెలియపరుస్తూ పలు వినూత్న ప్రచార కార్యక్రమాలను దేశ, విదేశాల్లో అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. ఈ గ్రంథాల పీడీఎఫ్ ఫైళ్లు ప్రత్యేకంగా తయారుచేయించి పాఠకులకు అంతర్జాలం ద్వారా ఉచితంగా అందజేస్తున్నారు. ఈ నెల 20న హిందూపురంలో జరగనున్న భారత ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణ సందర్భంగా ఏర్పాటు కానున్న భారీ బహిరంగ సభలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రధాని మోదీ కృషి

మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్, పక్కన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజ తదితరులు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం ఎస్సీల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జేసీ ఎ.భార్గవ్‌తేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టరు సంజనా సింహాతో కలిసి జిల్లాలో ఎస్సీల అభ్యున్నతిపై సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రామ్‌చందర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు, ఎస్సీల అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఆయా శాఖలపై సమీక్షించి సాధించిన ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. జేసీ ఎ.భార్గవ్‌తేజ, ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడారు. సమావేశంలో జాతీయ కమిషన్ డైరెక్టరు సునీల్‌కుమార్‌బాబు, డీఆర్వో ఖాజావలి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ★ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్ మీడియాతో మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు తీరు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై సమీక్షించామన్నారు. ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి బ్యాంకుల ద్వారా రూ.5 కోట్ల వరకు పూచీకత్తు లేని రుణాలు మంజూరుకు.. ప్రధాని మోదీ సీజీటీఎంఎస్‌ను ఏర్పాటు చేశారన్నారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీతో బ్యాంకులు రుణాలు అందించాలని ఆదేశించామన్నారు. ఎస్సీలపై దాడుల గురించి ముందు వైకాపా నాయకులు వినతిపత్రం అందజేశారు. తర్వాత తెదేపా ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసేందుకు రాగా పోలీసులు నిలువరించారు. తర్వాత ఇద్దరు నాయకులను లోపలికి అనుమతించారు.

కాలుజారి.. పిల్లరు గుంతలో పడి..

గుంతలో పడిన వ్యక్తిని బయటకు తీసుకొస్తున్న స్థానికులు

అరండల్‌పేట, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం శంకర్‌విలాస్ పైవంతెన పిల్లరు గుంతను చూసేందుకు వచ్చారు. పిల్లరు గుంత అంచు వద్ద నిలబడి తొంగి చూస్తుండగా.. కాలి కింద ఉన్న మట్టి పెళ్ల విరిగిపడడంతో ఒక్కసారిగా 20 అడుగుల గుంతలో పడిపోయారు. దీంతో స్థానికులు.. పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తర్వాత స్థానికుల సాయంతో స్ట్రెచర్‌పై పైకి తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు. పెద్దగా గాయాలవ్వకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పిల్లరు నిర్మాణం పూర్తయ్యే వరకు కాపలాదారు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాకు రక్షణ కల్పించండి

గుంటూరు పశ్చిమ: స్థల వివాదం నేపథ్యంలో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఆయన అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని గుమ్మడి భారతి కలెక్టరేట్‌లో విన్నవించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రోశయ్య.. జీటీ రోడ్డులోని తమ స్థలంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి ద్వారా లీజు అగ్రిమెంట్ చేసుకున్న కిలారి రోశయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారు అక్రమ రిజిస్టర్ చేసుకున్న దొంగ డాక్యుమెంట్లు రద్దు చేయాలని, తనకు, తన చెల్లి కుమారుడైన ఉప్పలపాటి మునియ్యలకు రక్షణ కల్పించాలని కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు: టౌన్-4 సబ్ డివిజన్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ ఖాన్ తెలిపారు. దీనివల్ల మంగళవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సీతారామనగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కలు కరిచినప్పుడు స్పందిద్దాంలే!

● జీఎంసీ ప్రజారోగ్య విభాగం నిర్లక్ష్యం ● మూతబడిన ఏటుకూరురోడ్డులోని ఏబీసీ కేంద్రం

న్యూస్‌టుడే-నగరపాలక సంస్థ

కొద్ది నెలల క్రితం నగర శివారు స్వర్ణభారతినగర్‌లో వీధి కుక్క దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఏటీ అగ్రహారం ప్రాంతంలో పిచ్చికుక్క పదిమందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో వారంతా ఆసుపత్రులపాలయ్యారు.

ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. వాహనాలను నగరమంతటా తిప్పి.. కుక్కలను పట్టుకుని సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయకుండానే, వ్యాక్సిన్‌లు వేయకుండానే వదిలేశారు. వీధి కుక్కల సమస్యలపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా.. వారిలో స్పందన రావడం లేదు.

ఇటీవల సీఎంవోహెచ్ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లగా, ఎంహెచ్‌వో విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంతో సరెండర్‌కు గురయ్యారు. వెటర్నరీ వైద్యుడు కూడా ఇటీవల బదిలీల్లో సొంత శాఖకు వెళ్లారు. అంతకుముందే వీధి కుక్కల శస్త్రచికిత్సలు చేసే ఏటుకూరురోడ్డులోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రం మూతబడింది. వీధికుక్కలకు అపరిశుభ్ర వాతావరణంలో రూ.లక్షలు వెచ్చించి ఆపరేషన్లు చేస్తున్నా ఉపయోగం ఉండటం లేదని, అవి చాలావరకు మృతి చెందుతున్నాయని జంతుప్రేమికులు ఫిర్యాదులు చేయడంతో సెంట్రల్ యానిమల్ వెల్ఫేర్ బోర్డు అధికారులు ఏబీసీ కేంద్రం సందర్శించి వెంటనే శస్త్రచికిత్సలు నిలిపివేయించారు. దీంతో కొన్నాళ్లపాటు ఆపేసి ఇటీవల ప్రజాప్రతినిధులు ఒత్తిడితో తాత్కాలికంగా ప్రారంభించినా కొద్ది రోజులకే నిలిపేశారు.

గుంపులుగా ఉన్న వీధికుక్కలు

ఎమ్మెల్యేలు సూచనలిస్తున్నా..

కౌన్సిల్ సమావేశాలు, సమీక్షలు జరిగినప్పుడల్లా తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, గల్లా మాధవి వీధికుక్కల సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచనలిస్తున్నారు. వీటిని అధికారులు పట్టించుకున్న దాఖలా కనిపించడం లేదు. తక్కెళ్లపాడు వాటర్‌వర్క్స్ పక్కనున్న స్థలంలో ఏబీసీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని దీనికి రూ. 65 లక్షలు కేటాయించినట్లు ఇటీవల కౌన్సిల్ సమావేశంలో అధికారులు చెప్పారు. మరోవైపు అక్కడ ఏబీసీ కేంద్రం ఏర్పాటుపై పలు అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. ఇటీవల నగరానికి చెందిన ఓ సంస్థ వీధికుక్కల నియంత్రణకు పూర్తి ప్రణాళికతో వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. జీఎంసీ ఏటా వీధి కుక్కల నియంత్రణకు రూ.50 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నా ఉపయోగం ఉండటంలేదు.

అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాల్సిందే

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: సమస్యలను క్షేత్ర స్థాయి అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో జిల్లా అధికారులకు అందించేందుకు వచ్చామని అర్జీదారులు పేర్కొన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జేసీ భార్గవ్ తేజ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలు నిశితంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు అందించారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పెదనందిపాడు పొగాకు రైతులు.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్‌తో కలిసి వచ్చి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. సుమారు 16 గ్రామాల్లో 8 వేల ఎకరాల్లో నల్ల బర్లీ పొగాకు సాగు చేస్తున్నామని, కొనుగోలు కేంద్రం అందుబాటులో ఏర్పాటు చేయాలని కోరారు.

వేలి ముద్రలు పడక.. ఇబ్బందులు

దివ్యాంగురాలైన తమ కుమార్తె పింఛనుకు సంబంధించి వేలి ముద్రలు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన షేక్ షబానా కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. కుమార్తెకు చిన్నతనం నుంచి పింఛను వస్తుందని, కొంతకాలంగా వేలి ముద్రలు పడక సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారన్నారు.

వేగ నిరోధకాలు లేక ప్రమాదాలు

నగరంలో ఏటీ అగ్రహారం నుంచి కంకరగుంట వైపు వెళ్లే రహదారిలో ఇందిరాగాంధీ బొమ్మ మలుపు వద్ద వేగనిరోధకాలు లేకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అన్నపూర్ణనగర్ మెయిన్‌రోడ్డులో వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి. ఏటీ అగ్రహారం జీరో లైన్‌లో ఫ్రీలెఫ్ట్ ఇవ్వకుండా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.
- సింగ్ నరసింహారావు, ఎం.రవీంద్రబాబు

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ, అధికారులు

సామాజిక భవనాలు నిర్మించండి

నగరంలోని 53, 54, 55 వార్డుల్లోని సంజీవయ్యనగర్, వెంగళరావునగర్, బొంగరాలబీడు, రాజీవ్‌గాంధీనగర్, శారదాకాలనీ తదితర ప్రాంతాల్లో సామాజిక భవనాలు, లైబ్రరీలు, క్రీడా ప్రాంగణాలు లేవు. శుభకార్యాలు రోడ్లపైనే చేసుకోవాల్సిన పరిస్థితి. క్రీడా ప్రాంగణం లేక యువత మద్యానికి, గంజాయికి బానిసలవుతున్నారు. తక్షణం ఆయా ప్రాంతాల్లో సామాజిక భవనాలు, గ్రంథాలయాలు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. **- గూడవల్లి మణికుమారి, బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జి, పార్టీ ప్రతినిధులు**

పర్యావరణహితంగా జీఎంసీ కార్యాలయం అభివృద్ధికి చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పర్యావరణ హితంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి కార్యాలయం ఆవరణలో సమస్యలు పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. మేయర్ మాట్లాడుతూ జీఎంసీ కార్యాలయం ఆవరణ లోతట్టుగా ఉండటం వల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు చేరి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వర్షంనీరు లోపలికి రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆవరణలో మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్కింగ్ ప్రాంతంలో నీడనిచ్చే చెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన గేట్ల మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యాలయంలో ఆధునీకరణ పనులకు సంబంధించి మోడల్స్, అంచనాలు తయారు చేయాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, వరప్రసాద్, మీరావలి, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల సహనాన్ని పరీక్షించొద్దు

నగరంపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వైకాపా నాయకులు.. జనసైనికుల సహనాన్ని పరీక్షించవద్దని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. అమరావతి రోడ్డులోని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అమరావతి నిర్మాణం, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించేలా ముందుకెళ్తుంటే.. వైకాపా నాయకులు ఓర్వలేక ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించేలా ప్రవర్తించడం దుర్మార్గం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు దారుణం. మంత్రిగా పని చేసిన హయాంలో పేర్ని నాని అవినీతికి పాల్పడ్డారు. గోడౌన్లలో రేషన్ బియ్యం పట్టివేత కేసులో పేర్ని నానితో పాటు కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారు. మహిళలను కేసుల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని సీఎం చంద్రబాబు చెప్పగా.. మీడియా సమావేశంలో చంద్రబాబును కీర్తించిన పేర్ని నాని ఇప్పుడు దుర్మార్గపు వ్యాఖ్యలు చేస్తున్నారు. పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. జనసైనికులు తగిన రీతిలో బుద్ధి చెబుతారు'.. అని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, జిల్లా సంయుక్త కార్యదర్శి కాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

44 ఈ టికెట్ల సీజ్

గుంటూరు రైల్వే: గుంటూరు రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) ఏఎస్సై నేతృత్వంలో మంగళగిరిలో నిర్వహించిన తనిఖీల్లో 44 ఈ టికెట్లను పట్టుకుని సీజ్ చేశారు. వీటి మొత్తం విలువ రూ. 76,715. అధికారికంగా అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా ఈ టికెట్లను జారీ చేస్తున్న ఏజెన్సీ యజమానిపై కేసు నమోదు చేశారు.

జిల్లా క్రికెట్ సంఘం కొత్త కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి రాకేష్ చౌదరి పేర్కొన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గుంటూరులో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి వెంకటరత్నం మాట్లాడుతూ ఎన్నికల్లో ఆఫీస్ బేరర్స్ పదవులకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా చుక్కపల్లి రాకేష్‌చౌదరి, ఉపాధ్యక్షులుగా తోట వెంకట శివరామకృష్ణ, కార్యదర్శిగా ఏనుముల శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా కొంగర రాహుల్‌చౌదరి, కోశాధికారిగా సింగరాజు లక్ష్మీకాంత్, కౌన్సిలర్‌గా నందిరాజు శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాకేష్ చౌదరి మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ క్రీడాకారులను అన్ని విభాగాల్లో అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. వెంకట శివరామకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారుల సమస్యలు పరిష్కరించడంలో, అవసరాలను తీర్చడంలో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో విజేతలకు అభినందన

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణులను అభినందిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపిన గుంటూరు క్రీడాకారిణులు బొలినేని చంద్రిక, షేక్ సాధియా అల్మాస్, నాగం జ్ఞానదివ్య, మందిర షానూన్‌లను మేయర్ కోవెలమూడి రవీంద్ర సోమవారం తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. మేయర్ కోవెలమూడి మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక రాష్ట్రం దావణగిరిలో నిర్వహించిన జూనియర్, సీనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏపీ తరపున గుంటూరు నుంచి పాల్గొన్న బొలినేని చంద్రిక వెండి పతకం, షేక్ సాధియా అల్మాస్ జూనియర్ విభాగంలో బంగారు పతకం, నాగం జ్ఞానదివ్య, మందిర షానూన్‌లు జూనియర్ విభాగంలో పతకాలు సాధించారని తెలిపారు. వీరు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సాంధాని పాల్గొన్నారు.

విద్యార్థులను ఆదుకున్న లోకేశ్

చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న అమృతరావు

పట్టాభిపురం: జగన పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని మంత్రి నారా లోకేశ్ విడుదల చేసి విద్యార్థులను ఆదుకున్నారని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపాటి అమృతరావు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బోధన రుసుములు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అమృతరావు మాట్లాడుతూ ఇప్పటికే రూ.1388 కోట్లు బోధన రుసుముల బకాయిలు విడుదల చేశారన్నారు. బకాయిలు విడుదల చేయకుండా జగన్ విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు ఘట్టమనేని ఉమ, షేక్ జనత్, గణేష్, మహేంద్ర, విజయ్, దాసు, అర్జున్, మోహిత్, దేవాన్ష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: 16 నెలలుగా వేతనాలు చెల్లించకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేయడంపై జిల్లాపరిషత్తుకు చెందిన పొరుగు సేవల సిబ్బంది సోమవారం ఆందోళన నిర్వహించారు. జడ్పీ ప్రధాన ద్వారం వద్ద ఆరుగురు ఉద్యోగులు బైఠాయించి వేతనాల బకాయిలు విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి పీజీఆర్ఎస్‌లో జేసీ భార్గవ్‌తేజని కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ.. జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసుని పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఉద్యోగులు జడ్పీ ఏవో శామ్యూల్‌పాల్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరుగురు ఉద్యోగుల్లో కొందరు ఛైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో, మరికొందరు జడ్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నా.. వీరికి నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం గమనార్హం.

నకిలీ టీటీఈ పట్టివేత

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైలులో టీటీఈగా తనిఖీలు చేస్తూ.. ప్రయాణికుల నుంచి నగదు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే రక్షక దళం(ఆర్‌పీఎఫ్) సభ్యులు పట్టుకున్నారు. మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు(17215)లో టీటీఈ వలే తెల్లటి దస్తులు ధరించి జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా.. అదే రైలులో విధులు నిర్వహిస్తున్న గుంటూరు టీటీఈ జాన్ వెస్లీ ఆయన్ను గుర్తింపు కార్డు చూపించమని అడగ్గా వాదనకు దిగాడు. ఈ రైలు నరసరావుపేటకు చేరగానే బండిలో నుంచి దూకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్‌పీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. విచారణలో అతని పేరు అవినాష్ గుప్తా, గుంటూరు అని తేలింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం అతను నకిలీ టీటీఈగా నిర్ధారించుకుని నరసరావుపేట ప్రభుత్వ రైల్వే పోలీసులకు ఆదివారం అప్పగించారు. జీఆర్‌పీ ఎస్సై కేసు నమోదు చేశారు.

(c) eenadu

అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు ఇబ్బందులున్నాయా?

ఈనాడు మీతోడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన విజయవాడ దుర్గగుడికి నిత్యం వేల సంఖ్యలో భక్తులొస్తుంటారు. ఏటా కనీసం కోటిన్నర మందికి పైగా భక్తులు దేశవిదేశాల నుంచి తరలివస్తున్నారు. తాజాగా ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వారి సమస్యలను దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ దృష్టికి తీసుకురావొచ్చు. ప్రధానంగా దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం, క్లోక్‌రూం, కేశఖండనశాల, చెప్పుల స్టాండ్లు, సెల్‌ఫోన్ కౌంటర్లు, స్నానఘాట్లు, ఆలయ ఉచిత బస్సులు సహా వేటికి సంబంధించిన సమస్యలున్నా ఈవో దృష్టికి తీసుకురావొచ్చు. దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేస్తే.. ఆలయ ఈవో పరిష్కారాన్ని చూపిస్తారు.

ఈ నెల 16న దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో 'ఈనాడు' ఫోన్‌ఇన్

73374 44081 | తేదీ: బుధవారం (16.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

స్పందించారు.. బండి ఇచ్చారు

ఈనాడు కథనానికి స్పందన

'అందిస్తే సాయం...నడిపించదా స్థైర్యం' శీర్షికన ఈ నెల 8న ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి స్పందించిన కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ దివ్యాంగుడు వక్కలగడ్డ శ్రీకాంత్‌కు బ్యాటరీ బండి అందించారు.

శ్రీకాంత్ గత నెల రోజులుగా కలెక్టరేట్‌కు బ్యాటరీ బండి కోసం వస్తున్నాడు. కలెక్టర్ హామీ ఇచ్చినా కిందిస్థాయి అధికారులు స్పందించలేదు. ఈనాడులో కథనం ప్రచురించడం, సోమవారం గ్రీవెన్స్‌లో వచ్చి కలెక్టర్‌ను మరోసారి కలవడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు వెంటనే బ్యాటరీ బండి ఇవ్వడంతో శ్రీకాంత్ ఇలా సంతోషంగా వెనుదిరిగాడు. **- ఈనాడు, కృష్ణా**

మేఘమా... వర్షించుమా!

మోపిదేవి, న్యూస్‌టుడే: వరుణ దేవుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. నైరుతి రుతు పవనాలు నిరాశపర్చడం, ఇపుడు కురవాల్సిన వర్షం ముందు వేసవిలో కురిసేయడంతో ఆకాశంలో మేఘాలు దట్టంగా ఉన్నా వర్షం జాడ కానరావడం లేదు. మేఘాలు గాలికి తేలిపోయి నిరాశ పరుస్తున్నాయి. సాగుకు సన్నద్ధ సమయంలో పట్టుమని ఓ మాదిరి వర్షం కూడా కురవకపోవటంతో రైతులు ఆకాశం వంక ఆశగా చూస్తున్నారు.

ఎదుగుదల లోపించిన నారుమడి

జిల్లాలోని 26 మండలాల్లో గడిచిన ఏప్రిల్, మే, జూన్ నెలల సగటు వర్షపాతం గణాంకాలు మిల్లీ మీటర్లలో...

నెల	కురవాల్సినది	కురిసినది
ఏప్రిల్	13.1	12.2
మే	57.0	191.4
జూన్	91.6	104.0

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న మచిలీపట్నంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆంధ్రా జాతీయ కళాశాలలో నిర్వహించే మేళాలో పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఏఎస్పీ సత్యనారాయణ, డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

కాటేసే కాలుష్యం.. కళ్లెం వేసేద్దాం

★ చైనా వాయు కాలుష్య నివారణలో అద్భుత ఫలితాలు రాబట్టింది. బీజింగ్ నగరంలో 2012 సమయంలో పీఎం10 తీవ్రత 200 పాయింట్లకు పైగా ఉండేది. ప్రజలు బయటికి రావాలంటే ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. దీంతో అక్కడి ప్రభుత్వం పదేళ్లలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించాలని లక్ష్యం పెట్టుకుంది. విద్యుత్తు వాహనాలు, సౌర విద్యుత్తు వినియోగాన్ని భారీగా ప్రోత్సహించింది. పెద్ద ఎత్తున మొక్కలు నాటించడం, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ వాయువులను శుద్ధి చేశాకే బయటికి వదలడం వంటి అనేక సంస్కరణలు, దిద్దుబాటు చర్యలు తీసుకుంది. దీంతో 2022 నాటికి పీఎం10 50 పాయింట్లకు తగ్గింది.

★ స్విట్జర్లాండ్‌లోని జూరిక్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్, న్యూజిల్యాండ్‌లోని బార్లిన్ వంటి నగరాల్లోనూ రెండు దశాబ్దాల కిందట వరకు విపరీతమైన వాయు కాలుష్యం ఉండేది. ఆయా దేశాల్లో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల పీఎం10 సమస్య కంటే పీఎం2.5 తీవ్రత ఎక్కువగా ఉండేది. శుద్ధ ఇంధనాల వినియోగం, పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ, పచ్చదనం పెంచడం, పర్యావరణ అనుకూల ప్రజా రవాణా నిర్వహించడం వంటి నిర్ణయాలతో 10-15 ఏళ్ల వ్యవధిలో 80 శాతం వాయు కాలుష్యాన్ని తగ్గించాయి.

ఈనాడు, అమరావతి

గత నాలుగేళ్లలో విజయవాడలో వాయు కాలుష్య తీవ్రత

ఏడాది	పీఎం10
2021–22	67
2022–23	72
2023–24	62
2024–25	64

విజృంభిస్తున్న వాయు కాలుష్యానికి చాలా దేశాలు కళ్లెం వేశాయి. అక్కడి ప్రభుత్వాలు నిర్దిష్ట లక్ష్యం..మెరుగైన నిర్ణయాలతో 10 నుంచి 15 ఏళ్లలోనే కాలుష్య నియంత్రణలో విజయం సాధించాయి. విజయవాడ కాలుష్య నగరాల్లో ఒకటిగా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర కేంద్రంగా ప్రగతి పథాన నడుస్తున్న తరుణంలో పారిశ్రామిక పురోగతి, వాహనాల రద్దీ వల్ల కాలుష్యం మరింత పెరగనుంది. ఈ కాలుష్య నియంత్రణకు చైనా, అమెరికా, స్విట్జర్లాండ్ వంటి దేశాలు అనుసరించిన మెరుగైన విధానాలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన తరుణమిది.

అందిపుచ్చుకోవాలి..

దేశంలో 131 అత్యంత కాలుష్య నగరాల్లో విజయవాడ ఉంది. దేశంలోని కాలుష్య నగరాల్లో సూక్ష్మ ధూళికణాల సాంద్రతను 2026 నాటికి 40శాతం తగ్గించాలని జాతీయ వాయుశుద్ధి కార్యక్రమం(ఎన్‌క్యాప్) లక్ష్యంగా పెట్టుకుంది. గత నాలుగేళ్లలో నగరానికి రూ.124.4 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో రూ.53.17కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన మొత్తం వైకాపా దారి మళ్లించింది. నగరంలో 100 విద్యుత్తు బస్సులు తీసుకొస్తామని చెబుతున్నా అది కార్యరూపం దాల్చలేదు. కాలుష్య కారకాలైన బీఎస్4 వాహనాల వినియోగం క్రమంగా తగ్గించి. బీఎస్6కి మారేలా చర్యలు చేపట్టాలి. సౌరశక్తి వినియోగం పెంచాలి. విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించడం, పచ్చదనం పెంపొందించడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. ప్రభుత్వాలతో పాటు ప్రజల బాధ్యతా కీలకమే..వ్యర్థాలను తగలపెట్టకూడదు. కాలం చెల్లిన వాహనాలు వినియోగించకూడదు. సౌర విద్యుత్తు కోసం ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలను అందిపుచ్చుకోవాలి.

ఇలా రిజిస్ట్రేషన్.. అలా దస్తావేజు

పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద క్రయ, విక్రయదారులు, సాక్షులు ఎక్కువ సమయం వెచ్చించేవారు. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ విధానంతో సూచించిన సమయానికి వచ్చి పని చేయించుకుంటున్నారు. ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా మారింది. అదే తరహాలో రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే దస్తావేజులు వెంటనే అందించే విధానాన్ని ప్రభుత్వం పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ పద్ధతి మంచి ఫలితాలు ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

★ వాస్తవానికి రిజిస్ట్రేషన్ చేయడానికే గంటల సమయం పట్టేది. సిబ్బంది కూడా సరిపడా ఉండేవారు కాదు. రిజిస్ట్రేషన్ అయ్యాక దస్తావేజులను స్కాన్ చేయాలి. తరువాత ఆస్తి కొనుగోలు చేసిన వారికి ఇవ్వాలి. సరిపడా సిబ్బంది లేకపోవడంతో కొనుగోలుదారులతో సంతకం చేయించుకుని మరుసటి రోజు దస్తావేజులు ఇచ్చేవాళ్లు. ఆస్తి కొనుగోలు చేసినవారు వాటని తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను ప్రభుత్వం గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంది. అందులో భాగంగా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం వచ్చే పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంపిక చేసింది. ఇద్దరు జూనియర్, ఒక సీనియర్ సహాయకుడిని నియమించింది. సోమవారం 52 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పత్రాలను సిబ్బంది స్కాన్ చేశారు. పది నిమిషాల వ్యవధిలోనే వినియోగదారులకు దస్తావేజులు ఇచ్చామని పటమట సబ్ రిజిస్ట్రార్ రేవంత్ తెలిపారు. దస్తావేజులు తీసుకోవడానికి కనీసం రెండ్రోజులు పట్టేదని, రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే తమకు పత్రాలు ఇవ్వడం ఆనందంగా ఉందని పలువురు కొనుగోలుదారులు తెలిపారు. కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రవేశపెట్టామని, రాష్ట్రంలో మరిన్ని కార్యాలయాలకు దీనిని విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్ తెలిపారు.

దస్తావేజు అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ రామారావు, పటమట సబ్‌రిజిస్ట్రార్ రేవంత్

మింగినోళ్లు కక్కేలా.. మునిగినోళ్లకు దక్కేలా..

అద్వీక, యుపిక్స్ బాధితులకు త్వరలో న్యాయం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

ఇటీవల విజయవాడ కేంద్రంగా వెలుగుచూసిన ఆర్థిక మోసాల్లో బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. యుపిక్స్, అద్వీక ట్రేడింగ్ మోసాలకు సంబంధించి లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే వీటిపై ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. రెండు సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన వారికి సాయం చేసేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. రావాల్సిన దాని కన్నా ఎక్కువ మొత్తం తీసుకున్న ఏజెంట్లు, కొందరు డిపాజిటర్లను గుర్తించి వారి నుంచి ఆ మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిని వీటి కోసం రెండు సంస్థల బాధితుల కోసం వేర్వేరు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి న్యాయ సలహా కూడా తీసుకున్నారు. పచ్చజెండా ఊపడంతో ఒకటి, రెండు రోజుల్లో ముగించనున్నారు. అగ్రిగోల్డ్ కుంభకోణంలా ఏళ్ల తరబడి సాగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అడుగులు పడుతున్నాయి. చివరలో పెట్టుబడులు పెట్టిన వారు ఎక్కువగా నష్టపోయారు.

25వేల లావాదేవీల పరిశీలన

అద్వీక ట్రేడింగ్ కంపెనీ కుంభకోణంలో అన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. దాదాపు 16 ఖాతాలకు సంబంధించి మూడేళ్ల వ్యవధిలో 25వేల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా వీటిని పోలీసులు వడపోస్తున్నారు. డిపాజిటర్ల నుంచి వచ్చింది ఎంత? ఏజెంట్లకు కమీషన్ రూపంలో చెల్లించింది ఎంత? అంతిమంగా ఎవరు లబ్ధి పొందారు? తదితర అంశాలను లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మొత్తం 43 మంది ఏజెంట్లు ఉన్నారు. వీరిలో 35 మంది రూ.100 కోట్ల మేర లాభపడినట్లు తేల్చారు. విచారణకు రాకుండా పరారీలో ఉన్న ఏజెంట్ల ఖాతాలను కూడా చూస్తున్నారు. అనుచిత లబ్ధి పొందిన వారిని ఇప్పటికే గుర్తించారు. వారిని పిలిపించి ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని చెబుతున్నారు.

153 మందికి అనుచిత లబ్ధి

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో జరిగిన యుపిక్స్ కుంభకోణానికి సంబంధించి కూడా పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇప్పటికే దీనిపై విజయవాడలోని సత్యనారాయణపురం స్టేషన్‌లో కేసు నమోదు అయింది. రూ.400 కోట్ల మేర చెల్లింపులు చేయకుండా కిరణ్ బోర్డు తిప్పేశాడు. ఈ కేసులో కూడా పలువురు ఎక్కువగా లబ్ధి పొందినట్లు ఖాతాల పరిశీలనలో తేలింది. 153 మంది రూ.120 కోట్ల మేర ప్రయోజనం పొందారు. 196 మంది రూ. 195 కోట్ల మేర నష్టపోయారు. రూ.75 కోట్ల మేర ఏజెంట్లకు కమీషన్, నిందితుడు సొమ్మును దారి మళ్లించినట్లు అనుమానిస్తున్నారు.

రాజకీయ పక్షాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ రాజకీయ పక్షాల ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వారితో సమావేశమైన ఆయన ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం గురించి మాట్లాడారు. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమే దీని ఉద్దేశమన్నారు. ఏఈఆర్వోలు, బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లకు ఈ నెల 15న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో 1200 మందికి మించి ఓటర్లు ఉన్నారన్నారు. ఈ నెల 20 నాటికి ఆయా కేంద్రాల ముసాయిదా జాబితా తయారవుతుందని, 21న అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు వాటిని అందజేస్తారన్నారు. అభ్యంతరాలను 30లోపు తెలిపాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించుకోవాలన్నారు.

★ జిల్లాలో షెడ్యూల్ తెగల అభివృద్ధికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం షెడ్యూల్ తెగల అభివృద్ధిపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. పాఠశాల బయట ఉన్న బాలలను గుర్తించి బడుల్లో చేర్పించాలని సూచించారు. ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీ-4లో ఎస్టీలను ప్రత్యేక భాగస్వాములుగా చేసి వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు.

18న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆయా స్థాయి సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన జరిగే సమావేశాలకు గౌరవ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులు వీటికి హాజరు కావాలని ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

పూడిక తీత.. కాసుల మోత

గ్రామ చెరువుల్లోని మట్టి తన్నుకుపోతున్న గద్దలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

జిల్లాలో మట్టి, ఇసుక, బుసక బకాసురులు రెచ్చిపోతున్నారు. చెరువుల్లో పూడిక తీత పేరుతో పరిమితికి మించి తవ్వేసి భారీగా మట్టి దందా సాగిస్తున్నా అడ్డుకునే అధికారులు కానరావట్లేదు. గ్రామ చెరువుల్లో పూడిక తీసి వచ్చిన మట్టిని గ్రామ అవసరాలు.. పాఠశాలలు.. శ్మశానవాటికలు.. దేవాలయాల్లో మెరకలకు ఉపయోగిస్తామని.. బయట అమ్మితే పంచాయతీకి సొమ్ములు జమ చేస్తామని ప్రజాప్రతినిధులు తీర్మానాలు చేస్తున్నారు. అందరూ ఒప్పుకొన్నాక గ్రామ అవసరాలు పట్టించుకోకుండా.. రాత్రి, పగలు యథేచ్ఛగా చెరువులోని మట్టి తవ్వేసి రూ.లక్షలు దండుకుంటున్నారు. పంచాయతీలకు సొమ్ములు జమ చేయకుండా జేబులో వేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన పంచాయతీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడట్లేదు. జిల్లాలో మైనింగ్‌శాఖ ఉందని ఎవరికీ తెలియట్లేదు. ఎన్ని ఫిర్యాదులు చేసినా ఆ శాఖ అధికారులు కనీసం స్పందించట్లేదు. ఫిర్యాదులకు సమాధానం చెప్పకుండా.. కనీసం విచారణ చేయకుండానే అర్జీలు మూసేస్తున్నారని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

బందరు: చినయాదర చెరువు నుంచి తరలిస్తున్న మట్టి

అదుపు తప్పుతున్న వాహనాలు

గాయాలపాలైన యువకుడు

బందరు మండలం పెద యాదర పంచాయతీ చిన యాదర గ్రామ చెరువులో మూడు నెలలుగా ఓ ప్రజా ప్రతినిధి భారీగా తవ్వకాలు చేసి రూ.లక్షలు దండుకున్నారు. స్థానికులు నిలదీయడంతో బందరులోని ప్రజాప్రతినిధికి చెందిన వాహనాల్లో ఆయనే తవ్వుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోని ఎకరం భూమిలో వందల ట్రాక్టర్లు నిల్వ చేసుకున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు పెద్దఎత్తున తిరగడంతో రోడ్డంతా మట్టిమయంగా మారింది. ఆదివారం అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చాలా మంది ఇలానే పడిపోయారని గ్రామస్థులు వాపోతున్నారు.

కోర్టుకెక్కినా మారరు..

పమిడిముక్కల మండలం వేల్పూరు పంచాయతీ పరిధిలో ఇటీవల రెండు పొక్లెయిన్లు.. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గ్రామ చెరువులో పూడిక పేరుతో మట్టి అమ్మేసుకుని రూ.10లక్షలపైగానే స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ తీర్మానం ప్రకారం మట్టిని గ్రామ అవసరాలకు వినియోగించాలని స్థానికులు కోరినా అక్కడి ప్రజాప్రతినిధి పట్టించుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన పలువురు సమస్యపై కోర్టుకెక్కారు. విచారించిన కోర్టు నాలుగు వారాల్లో విచారణ జరిపి పంచాయతీకి నిధులు చేర్చాలని ఆదేశించింది. కొద్దిరోజులు తవ్వకాలు నిలిపేసినా సోమవారం నుంచి రాత్రి పూట తవ్వకాలు చేసేందుకు వేరే గ్రామానికి చెందిన వాహనాల ద్వారా మట్టి తరలించేందుకు సిద్ధమయ్యారు.

ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి గోపి, వేదికపై న్యాయమూర్తులు

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని జిల్లా జడ్జి గుత్తాల గోపి అన్నారు. మచిలీపట్నంలోని న్యాయ సేవా సదన్‌లో సోమవారం వివిధ బీమా సంస్థలు, బ్యాంకుల అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సుప్రీం కోర్టు పరిధిలోని మీడియేషన్ అండ్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ ఆదేశాలతో 90 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్‌లతో పాటు వివిధ సమావేశాలు నిర్వహిస్తుంటే బీమా సంస్థలు, బ్యాంకులు తదితర సంస్థలు స్పందించడం లేదన్నారు. ఎవరికి వారు తమ పరిధిలోని కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య, న్యాయమూర్తులు ఎస్.సుజాత, బి.బాబూ నాయక్, కేవీఎల్ హిమబిందు, సీహెచ్ యుగంధర్, ప్రగడ సాయి సుధ, న్యాయవాద సంఘ నాయకులు శామ్యూల్ తదితరులు మాట్లాడారు. వివిధ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కాలువలకు 13,194 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు సోమవారం 13,194 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 10,187, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు 1,511, బందరు 2,152, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,507 క్యూసెక్కుల చొప్పున అందించారు.

ప్రజా అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన ఏఎస్పీ సత్యనారాయణ, డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించిన కలెక్టర్ గుడివాడ వాసి కొడాలి పోతురాజు, పెడనకు చెందిన పడమట పద్మకు త్రిచక్ర బ్యాటరీ వాహనాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. తోట్లవల్లూరుకు చెందిన దివ్యాంగురాలు అమ్మాజీ తన మేనకోడలు మోసం చేసి తన 25 సెంట్ల భూమిని రాయించుకుందని చెప్పడంతో న్యాయస్థానం ద్వారా సాయం పొందాలని సూచిస్తూ ఉచితంగా న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్యతో మాట్లాడారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన సుమారు 194 దరఖాస్తులను పరిశీలించిన ఆయన తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు బదలాయించారు.

★ నారుమళ్లు పోసుకునేందుకు నీరు అందడం లేదని, కాల్వల్లోకి నీరు విడుదల చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

★ **పమిడిముక్కల మండలం** గురజాడ గ్రామంలోని సర్వే నంబరు 124/1లో 200 ఎకరాల సాగుకు ఉపయోగపడేలా ఉండే రహదారిని ఎస్సీ శ్మశాన భూమి పేరుతో సిమెంట్ స్తంభాలు పాతడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, విచారించి న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసరావు, బాధిత రైతులు అర్జీ ఇచ్చారు.

★ **తోట్లవల్లూరు మండలం** కుమ్మకూరు పరిధిలో డ్రైయినేజీ కోడు పూర్తిగా పూడిపోవడంతో పాటు ఆక్రమణలకు గురైన కారణంగా గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని, తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు బొప్పన గోపాలకృష్ణ, తదితరులు విన్నవించారు.

★ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా చేపట్టిన సచివాలయ కార్యదర్శుల బదిలీ ప్రక్రియపై విచారణ జరిపించి రీకౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు.



(c) eenadu

‘రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా విద్వేషం’

కంకిపాడు గ్రామీణం, కంకిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైకాపా తీరు దారుణంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విమర్శించారు. సోమవారం కంకిపాడు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓర్వలేక విద్వేషాలు సృష్టిస్తున్నారని తెలిపారు. సైకోగా మారిన ఎవరో ఓ కార్యకర్త రప్పా.. రప్పా.. నరికేయాలని ఫ్లెక్సీ పెడితే.. దానికి వైకాపా జిల్లా నాయకులు సైతం వత్తాసుపలకడం సరికాదన్నారు. అలాగే చీకటిలో కన్నుకొడితే మెడ కాయలు తెగాలని మాజీ మంత్రి పేర్ని నాని.. తమ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. నాయకులంటే ప్రజలను బిడ్డల్లాగా చూడాలని, తమ బిడ్డలు పాడైపోవాలని ఏతల్లీ కోరుకోదని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కానీ వైకాపా అధినేత బిడ్డల్లాంటి కార్యకర్తలను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ప్రజాసేవ, పాలన అంటే చంపడం, నరకడం కాదని పదవిలో లేకపోయినా ప్రజాసంక్షేమం కోరుకునేవాడే నిజమైన నాయకుడన్నారు. సొంత పార్టీ కార్యకర్త ప్రాణం అంటే లెక్కలేనితనాన్ని ప్రదర్శించిన వారిని మరోసారి నాయకుడిగా ప్రజలు ఎన్నుకుంటారని ఏవిధంగా భావిస్తున్నారని ప్రశ్నించారు. ఇష్టం వచ్చిన రీతిలో నిరాధార ఆరోపణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, నియోకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి నోరు అదుపులో ఉంచుకోవాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ హెచ్చరించారు. తనకు సంబంధంలేని ‘కాల్‌మనీ.. సెక్స్‌రాకెట్’ ఆరోపణలపై తగిన విధంగా స్పందిస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి, సీహెచ్‌సీ ఛైర్‌పర్సన్ రోహిణీకుమారి, ఏఎంసీ ఉపాధ్యక్షురాలు ఎం.కల్యాణి, సర్పంచి బాకీ రమణ, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ‘కూటమి’ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, ముప్పా రాజా, బోయిన నాగరాజు, దీవి రోహిణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పేర్నీ.. చిల్లర వేషాలు మానుకో: బండ్రెడ్డి

పెడన, న్యూస్‌టుడే : రప్ప రప్ప అనొద్దు, చీకట్లో కన్ను కొడితే పనై పోవాలి అంటూ మాజీ మంత్రి పేర్ని నాని చేసిన ప్రసంగాలు చిల్లర చేష్టలుగా ఉన్నాయని జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. పెడనలో ఆ పార్టీ నేత వరుదు రామకృష్ణ నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలో హింసను ప్రేరేపించడం పేర్ని లక్ష్యమా? అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వైకాపా నేతల ప్రసంగాలు వినాలంటేనే ప్రజలు భయపడ్డారని, సార్వత్రిక ఎన్నికల్లో 11 సీట్లకు ఆ పార్టీని పరిమితం చేసినా ఇంకనూ పరివర్తన రాకపోవడం శోచనీయమన్నారు. పేర్ని రూ.కోట్ల విలువైన చౌక బియ్యాన్ని ఎలా బ్లాక్ మార్కెట్‌కు తరలించారో ముందు చెప్పాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్రపై ప్రతిరోజు విమర్శలు చేస్తున్న మాజీ మంత్రికి త్వరలో గుణపాఠం చెబుతామన్నారు. నాయకులు ఊచా వెంకయ్య, పుల్లేటి దుర్గారావు, ప్రత్తిపాటి జయకృష్ణ, జన్యావుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉప్పాల రామును అరెస్టు చేస్తే వదిలిపెట్టం

పోలీసులపై బెదిరింపులకు దిగిన పేర్ని నాని

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: కృష్ణా జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక భర్త రాముపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారని, అరెస్టు చేస్తే ప్రభుత్వాన్ని, పోలీసులను వదిలిపెట్టమని వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని హెచ్చరించారు. గుడివాడలో శనివారం హారిక, రాము ప్రయాణిస్తున్న కారు ఢీకొని గాయాలయ్యాయని తెలుగు మహిళ సునీత ఫిర్యాదుపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో సోమవారం మచిలీపట్నంలోని ఆయన కార్యాలయంలో పేర్ని నాని కొందరు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ‘ఫిర్యాదు చేసిన మహిళ కొడాలి నాని ఫ్లెక్సీ ఎక్కి చించే క్రమంలో మేకు తగిలి చేతికి దెబ్బతగిలింది. వెంటనే ఆమె కట్టుకట్టుకుంది. దీనికి సంబంధించిన దృశ్యాలు మా వద్ద ఉన్నాయి. కారు వెనక సీట్లో కూర్చున్న ఉప్పాల రాము.. తెదేపాకు చెందిన మహిళను ఎలా ఢీకొడతారు? ఒకవేళ రామును అరెస్టు చేస్తే కచ్చితంగా చట్టపరంగా ముందుకెళ్తా’మన్నారు. ‘అగ్రకులానికి చెందిన వేమిరెడ్డి ప్రశాంతి కుటుంబం క్వార్ట్జ్ మైనింగ్ చేస్తోంది. వారం వారం గనుల శాఖ మంత్రికి మూటలు అందుతున్నాయి కాబట్టే ఆయనకు ఆమె మహాతల్లి అయ్యింది. బీసీ మహిళ అయిన ఉప్పాల హారికను మహానటి అంటున్నార’ని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

తీపి పండు.. రైతుకు చేదయ్యే..

బొప్పాయి రైతు నష్టాల బాట

కోత కోయని కారణంగా చెట్టునే పండుతున్న బొప్పాయి పంట

మోపిదేవి, న్యూస్‌టుడే: బొప్పాయి పంట సాగు చేస్తున్న రైతుల కంట కన్నీరు వస్తోంది. ధర పతనం, ఎగుమతులు మందగించటం, మామిడిపళ్ల లభ్యత.. ఇలా మూడు కారణాలతో రైతులు నష్టాలబాట పయనిస్తున్నారు. కృష్ణా జిల్లాలో 250 హెక్టార్లలో పంట సాగు, కోత దశలో ఉంది. మోపిదేవి మండలంలో 72 హెక్టార్లలో పంట పండిస్తున్నారు. ఎగుమతులు లేకపోవటంతో కాయ కోత కోయడం లేదు. చెట్టునే ముగ్గి పంట చేలో వందలాది కాయలు నేలపాలవుతున్నాయి. స్థానిక మార్కెట్లలో మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయి. దేశ రాజధాని దిల్లీకి ఎగుమతులు జరిగేవి. కానీ ఈ ఏడాది అడపాదడపా మాత్రమే కొనుగోలుదారులు వస్తున్నారు. నిరంతరం రాకపోవటంతో ధర పతనానికి దారితీసింది. ఎకరాకు రూ.90వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. మూడు, నాలుగు నెలల అనంతరం దిగుబడి వస్తుంది. ఈ ఏడాది వేసవికాలంలో కురిసిన వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయి.

❖ గతంలో ఎగుమతులు ఉండేవి. ధర ఆశాజనకంగా ఉండేది. కానీ ఈ ఏడాది వారానికి ఒకసారి మాత్రమే వస్తున్నారు. కిలో ధర రూ.10పైబడే కొంటారు. ఎగుమతిదారులు రాకపోవడంతో కిలో 6 రూపాయల చొప్పున నష్టాలకు అమ్మాల్సి వస్తోంది. జల్లులు పడుతుండటంతో కాయలు పక్వానికి తొందరగా వస్తాయి. - కోసూరు రామకోటేశ్వరరావు(కోసూరుపాలెం)

❖ బొప్పాయి సాగును వాతావరణ ప్రతికూలత వెంటాడుతోంది. నేను 80 సెంట్లలో సాగుచేశా. దిగుబడి వచ్చే సమయంలో ధర నిరాశపర్చింది. ధర కల్పించి బొప్పాయి రైతులను ఆదుకోవాలి. - కోసూరు పద్మశ్రీ (కోసూరుపాలెం)

‘అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు’

పామర్రు, న్యూస్‌టుడే: తెదేపా అభివృద్ధిని చూసి ఓర్వలేక కులాలు, మనుషుల మధ్య చిచ్చు పెట్టడానికి వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి విమర్శించారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో గౌడ సంఘీయులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్ని నాని రప్పా రప్పా అంటూ మాట్లాడడం సరికాదన్నారు. రాత్రిపూట నరికి ఉదయం పరామర్శలకు వెళ్లాలని సూచించిన వ్యక్తి నాయకుడు ఎలా అవుతాడని విమర్శించారు. గుడివాడలో బీసీ మహిళపై దాడి అంటూ కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయాలన్నీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు బీసీలకు రిజర్వేషన్లు పెంచి వారి అభ్యున్నతికి కృషిచేస్తున్నారని చెప్పారు. వైకాపా ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని.. యువతకు ఉద్యోగ కల్పన కూడా చేయలేదన్నారు. బీసీ నాయకులు లుక్కా రేణుకారావు, వీరంకి పరశురామ్, శివశంకర్, పరసా సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, తులసీదాస్, వీరంకి మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గురుమూర్తి

సర్పంచి కుటుంబానికి పరామర్శ

పామర్రు(గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి నిమ్మకూరు గ్రామ సర్పంచి దుర్గా శ్రీనివాసరావు కుమారుడు నిదీష్(7) తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో తప్పిపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోమవారం పార్టీ నేతలతో కలిసి సర్పంచి కుటుంబీకులను పరామర్శించారు. సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్‌చేసి త్వరగా బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలని కోరారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, వీరపనేని శివరాం, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

బాలుడి ఆచూకీ కోసం గాలింపు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధి రొయ్యూరులో అదృశ్యమైన నిదీష్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు సోమవారం తెలిపారు. ఎన్‌డీఆర్ఎస్ సిబ్బందిని పిలిపించి కేఈబీ కాలువలో రొయ్యూరు నుంచి పులిగడ్డ వారధి వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదన్నారు. కరకట్ట వెంబడి ఉండే లస్కర్లు, పలు గ్రామాల వారికి వివరాలు చెప్పి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించామన్నారు. కేఈబీ కాలువలోనే కాకుండా పలు కోణాల్లో విచారణ చేపట్టామని పేర్కొన్నారు.

కేఈబీ కాలువలో గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

17 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పట్టు పవిత్రోత్సవాలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోహినీపురంలో స్వయంభుగా వెలసిన శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో 17వ తేదీ నుంచి 20 వరకు పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక (ఆడికృత్తిక) మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవర ప్రసాదరావు సోమవారం తెలిపారు. 17 నుంచి 19 వరకు పట్టు పవిత్రోత్సవాలు, 20న స్వామివారి జన్మనక్షత్రం ఆషాఢ ఆడికృత్తికగా జరుగుతుందన్నారు. రుద్రాభిషేకాలు, అష్టోత్తర కలశాభిషేకం, లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణంలో పాల్గొనే ఆసక్తిగల భక్తులు రుసుము 19వ తేదీ లోగా చెల్లించవచ్చునని తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలు లేకపోవడం సరికాదు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. సోమవారం ఆయన జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. జూన్ నెల అయిపోయిందిలే ఇక బడుల్లో ప్రవేశాల గురించి పట్టించుకోరులే అనుకుంటున్నారేమో...వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 141 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు లేకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, రిసోర్సుపర్సన్‌లతో సమావేశం నిర్వహించి క్లస్టర్ల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. డీఈవో పీవీజే రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన డీఈవో రామారావు

ఖాతాదారులను ఆకట్టుకునేలా ఆభరణాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ, గవర్నర్‌పేటలోని ఎఫ్ఎం ప్లాజాలో మంగళగిరికి చెందిన వ్యాపారవేత్త చల్లా నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవిధామ్ సిల్వర్ షోరూమ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులతో కలిసి ఆయన జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖాతాదారులను ఆకట్టుకునేలా మంచి మోడళ్ల నగలు అందుబాటులో ఉంచి వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం దేవీ పవిత్ర గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను సందర్శించారు. నృత్య కళాకారిణులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తితిదే బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షోరూం ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్, నిర్వాహకులు తదితరులు

రొయ్యల చెరువుల తవ్వకం పనులు అడ్డుకోవాలని వినతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ చింతలమడలో చెన్నకేశవకోడు వద్ద రొయ్యల చెరువుల తవ్వకం పనులను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీకి మాజీ డీసీ ఛైర్మన్ వీరమాచనేని భవానీప్రసాద్‌తోపాటు రైతులు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. చెన్నకేశవకోడు పక్కనే డ్రెయినేజీ పోరంబోకు భూముల్లో రొయ్యల చెరువు తవ్వి కట్టలు పోస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రొయ్యల చెరువు సాగు చేసి ఆ మురుగు నీటిని డ్రెయిన్‌లోకి వదిలితే ఆ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేసే భూములు బీళ్లుగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. రొయ్యల చెరువులు సాగు చేస్తే చుట్టుపక్కల ఉన్న భూముల్లో ఉప్పునీరు చేరి చౌడు భూములుగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ డ్రెయిన్ పరిధిలో 300 ఎకరాలలో వరిసాగును రైతులు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల సమస్యలను విన్న కలెక్టర్ వారి ఎదుటే రెవెన్యూ, డ్రెయినేజీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే రైతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

రైతుల సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ

హారికపై దాడి వైకాపా హైడ్రామా

పెడన, న్యూస్‌టుడే : జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రాముపై గుడివాడలో దాడి జరిగిందంటూ వైకాపా విష ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మండిపడ్డారు. పెడన మండలంలోని మడకలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని సమావేశానికి వెళ్లొద్దని పోలీసు అధికారులు వీరికి స్పష్టం చేసినా ఎందుకు వెళ్లారన్నారు. వైకాపా అధిష్ఠానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు హారిక దంపతులు ఉద్రిక్తతను పెంచే రీతిలో వ్యవహరించారన్నారు. రాద్ధాంతం చేసి ఆ తర్వాత బీసీ మహిళపై దాడి అంటూ ప్రచారం చేసుకుంటున్నారని, ఈ తరహా సంస్కృతి ఆ పార్టీకి కొత్తేమీ కాదన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని ప్రసంగాలు సమాజంలో ఉద్రిక్తతలు పెంచే రీతిలో ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను విమర్శించే స్థాయి పేర్నిది కాదన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేశ్, పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, పక్కన పార్టీ నేతలు

అయిదు నిమిషాలైతే ఇంటికి.. అంతలోనే ప్రమాదం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: ‘అయిదు నిమిషాలైతే ఇంటికి చేరుకునే వారు.. అంతలోనే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. అతని భార్యకు గాయాలయ్యాయి. ఈ వార్త విన్న అతని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు’. సేకరించిన వివరాల ప్రకారం.. పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చెందిన కూనపరెడ్డి రాంబాబు (48), భార్య నాగమణి.. సోమవారం విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనుమరాలిని చూసి ఇంటికి బయలుదేరారు. విజయవాడ-గుడివాడ రోడ్డులోని వెంట్రప్రగడ పొలిమేర జేపీకేపీ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద గుర్తు తెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయాలపాలైన భార్యాభర్తలను గుడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాంబాబు మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంబాబు గ్రామంలో ఉప్పు, ముగ్గు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు.

రాంబాబు (పాతచిత్రం)

భర్త నుంచి రక్షణ కల్పించండి

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే : జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్త పరస్త్రీ వ్యామోహంలో పడి తనను, కన్నబిడ్డలను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించాలంటూ ఓ వివాహిత ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు ఎస్పీ గంగాధరరావుకు అర్జీలు సమర్పించారు. పెదపట్నానికి చెందిన మోహనరావు తన చెరువులోని చేపలను కాకినాడకు చెందిన వ్యక్తి కొనుగోలు చేశాడని, నెలలు గడుస్తున్నా నగదు ఇవ్వక పోవడంతో అడగ్గా చేతనైంది చేసుకోమంటూ బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని కోరారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లికి చెందిన వనజ తన భర్త, అత్తమామలు అధిక కట్నం కోసం వేధిస్తున్నారని, దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలు వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన 38 ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించారు. వీటిపై విచారించి తగు చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఫిర్యాది సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ గంగాధరరావు

కోర్టుకు వైకాపా నేత వంశీమోహన్

గన్నవరం గ్రామీణం, ఉయ్యూరు, న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సోమవారం గన్నవరంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు. ఆత్కూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో కోర్టు బెయిల్ షరతుల మేరకు సంతకం చేసేందుకు ఆయన ఉదయం వచ్చారు. స్థానిక కోర్టు జడ్జి ఎన్.గాయత్రి సెలవులో ఉండడంతో వంశీ.. ఉయ్యూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు.

అనుచరులతో మాజీ ఎమ్మెల్యే వంశీ

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

3 పీఏసీఎస్‌లకు నూతన ఛైర్మన్లు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: జిల్లాలోని మూడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)కు ఛైర్‌పర్సన్లు.. సభ్యులను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెలకుర్రు పీఏసీఎస్‌కు వకపట్ల శ్రీనివాసరావును ఛైర్మన్‌గా.. జగ్గు జగ్గారావు, గోపిశెట్టి వెంకటసుబ్బారావును సభ్యులుగా నియమించారు. చినముత్తేవి సంఘానికి ఛైర్పర్సన్ కొసరాజు ప్రకాశ్ మధూర్.. సభ్యులుగా ముద్రై శివనాగరాజు, సుంకర వెంకటేశ్వరరావుకు అవకాశం దక్కింది. నందివాడ సొసైటీకి కోనేరు వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా.. చొక్కా సుబ్బారావు, జి.వెంకటసత్యనారాయణ సభ్యులుగా నియమితులయ్యారు.

ఆక్రమణ తొలగించండి

కూచిపూడి: ఆయకట్టులోని 60 ఎకరాల మురుగునీరు పోయే బోదెను భట్లపెనుమర్రుకు చెందిన ఓ రైతు ఆక్రమించాడని, తమ పొలాల్లోని మురుగు పోవు మార్గంలేక తీవ్రంగా నష్టపోతున్నామని కూచిపూడికి చెందిన రైతులు, కౌలురైతులు సోమవారం మొవ్వ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పలువురు సంతకాలు చేశారు.

ఆర్డీవోకు ఫిర్యాదు అందిస్తున్న రైతులు

ఆర్టీసీ బస్సులో విద్యార్థుల అసభ్య ప్రవర్తన

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బస్సులో కొంతమంది విద్యార్థులు అసభ్యంగా ప్రవర్తించి విద్యార్థినులను ఇబ్బంది పెట్టడంతో ఆర్టీసీ సిబ్బంది బస్‌ను సోమవారం ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉయ్యూరు నుంచి గుడివాడ వెళుతున్న బస్సులో ఎక్కిన విద్యార్థులు అల్లరి చేస్తూ విద్యార్థినులను ఉద్దేశిస్తూ వెకిలి చేష్టలు చేస్తున్నారు. అలా ప్రవర్తించవద్దని కండక్టర్ వారించినప్పటికీ వారు వినలేదు. దీంతో కడవకొల్లు వరకు వెళ్లిన బస్సును వెనక్కి తిప్పి ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కొచ్చారు. బస్సులో విద్యార్థుల చేష్టలను ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు వివరించారు. దీంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించేశారు.

వృద్ధురాలి హత్యపై దర్యాప్తు వేగవంతం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మంతెనలో ఆదివారం జరిగిన వృద్ధురాలి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు నేతృత్వంలో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేస్తున్నారు. మృతురాలి సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో ఆధునిక సాంకేతికత వినియోగించిన పోలీసులు.. ఆ ఫోను ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఆ వ్యక్తి ఆ ఫోన్ తనకు ఉప్పులూరు రోడ్డులో దొరికిందని చెబుతున్నాడని తెలిసింది. ఓ వైపు హత్య సమయంలో ఆ ప్రాంతంలో వినియోగించిన సెల్‌ఫోన్‌లు, సీసీ కెమెరాలు, అనుమానిత వ్యక్తుల వివరాలు, గ్రామస్థులు, బంధువులు, ఆ ఇంటిలో పనిచేసిన వారి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వైకాపా నేతలపై కేసు నమోదు

గుడివాడ, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడు వంతెన వద్ద తనను వైకాపా నేతలు ఉప్పాల రాము, కందుల నాగరాజు అసభ్యకర పదజాలంతో దూషించి కారుతో ఢీకొన్నారని తెలుగు మహిళా నేత మాదల సునీత గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని రాజేంద్రనగర్ 8వ లైనుకు చెందిన మాదల సునీత, మరికొందరు తెలుగు మహిళలు లింగవరం గ్రామంలో ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 12వ తేదీన సాయంత్రం గుడివాడ నుంచి వెళ్తుండగా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఉప్పాల రాము, కందుల నాగరాజు, మరో ఇద్దరు కారులో వెళ్తున్నారు. అక్కడ సెంటర్లో నిల్చొని ఉన్న తమను ‘మీరు లింగవరం వెళ్లి ఏమి చేస్తారు’ అంటూ అసభ్య పదజాలంతో తీవ్రంగా దుర్భాషలాడి కారుతో తొక్కుకుని వెళ్లారని తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. చేతులు, కాలికి గాయాలపాలైన తాను రక్తపోటుతో కళ్లు తిరిగి పడిపోగా తనకు కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స చేయించి ఇంటికి తీసుకుని వెళ్లారని మాదల సునీత పేర్కొన్నారు. దీంతో సోమవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు 129(ఏ), 79, రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: 81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. విజయవాడ: శ్రీశరణం లాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

PERSONAL CLASSIFIEDS

LOST

పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ No. N7843624, చిరుమామిళ్ళ మురళీకృష్ణ S/o. జనార్ధనరావు, Vijayawada అనుపేరు మీద గల పాస్‌పోర్ట్ ది. 8/7/25న M.G. రోడ్, VJA, రమేష్ హాస్పిటల్ దగ్గర పోయినది. దొరికినవారు సంప్ర. ✆ 88970 26666

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

REAL ESTATE

LAND FOR SALE

మెగా ★అవకాడో ★ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్ 9133574455.

JOBS

ప్రముఖ E-Kart's, వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత: 10th, డిగ్రీ. జీతం: 18000 నుంచి కలదు. 80881 48667.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

సుజన ఏజెన్సీ నందు పని చేయుటకు అపీ ఆటోడ్రైవర్స్, హెల్పర్స్ కావలెను. గిరి స్ట్రీట్, సత్యనారాయణ పురం, విజయవాడ. ✆ 98483 61888.

గవర్నమెంట్ సంస్థలో పని చేయుటకు రిటైర్డ్ VRS, Teachers, Housewives కావలెను. అర్హత: SSC to P.G. ఫిక్స్‌డ్ శాలరీ. 30k+ PF- ESI+ MB. ✆ 94935 75370

విజయవాడ పటమట J.D నగర్‌లోని ప్రముఖ ఎడ్యుకేషన్ కన్సల్టేషన్ సంస్థ నందు పనిచేయుటకు Female ఆఫీస్ ఇన్‌ఛార్జ్, Female టెలీకాలర్ కావలెను. జీతం: 12000 to 15000/-. ✆ 95334 41119.

సేల్స్ రిప్రజెంటేటివ్స్ కావలెను. ITC కంపెనీ నందు పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసినటువంటి ఉత్సాహవంతులైన యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. ఇంటర్వ్యూ తేది: 17-07-2025 (గురువారం). ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం : Sri Srinivasa Nilayam, 29-3-10, Venkateswararao Street, Governorpet, Vijayawada - 520 002. Ph.No. 91824 88890. ఉద్యోగ అర్హతలు : వయస్సు : 25 to 30, చదువు : డిగ్రీ.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్ట్‌లో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

అశోక్ గజపతిరాజుకు అభినందన

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దం పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు సోమవారం అభినందనలు తెలిపారు. తెదేపా విధేయునిగా, పార్లమెంట్‌లో ఒకప్పటి సహచర ఎంపీగా పని చేసిన అశోక్ గజపతిరాజును గవర్నర్ పదవి వరించడం సముచితమే అన్నారు. పార్టీలో ముఖ్య నేతలకు హోదా గల పదవి కట్టబెట్టిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ధర వరలు

టమాట 33, వంగ 28, బెండ 20, పచ్చిమిర్చి 70, కాకర 40, క్యాబేజీ 22, క్యారెట్ 44, దొండ 25, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 26, గోరుచిక్కుడు 34, దోస 16, సొర 10/8, అరటికాయ 8/7, చిక్కుడు 44, బీర 35, చామదుంప 30, మునగ 07/08, కంద 50, బీట్‌రూట్ 30, కీరదోస 50, బీన్స్ 95, క్యాప్సికం 90, అలసందలు 30, పిలకదుంప 36, కొత్తిమీర 17/8, పుదీనా 15/5 మంగళవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఏమైనా సమస్యలు ఉంటే ఎస్టేట్ అధికారి జలి చక్రవర్తిని ఫోన్ 91823 61295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి : ఓ భామ అయ్యోరామ
మినీ రేవతి : కుబేర
సిరికృష్ణ : సూపర్ మ్యాన్
సిరివెంకట్ : ది 100

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

◆ బందరులోని బ్రహ్మపురం సాయి గణేష్ ఆలయ సమీపంలోని రోడ్డు పక్కనున్న వ్యర్థాలు తొలగించడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలో శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

◆ నగరంలోని ఇంగ్లీషుపాలెం నుంచి రామానాయుడుపేట వెళ్లే రోడ్డు పక్కన చెత్త తొలగించడం లేదని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. వారు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. *నగరంలోని వలంద పాలెంలో ప్రధాన రహదారి పక్కనున్న డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకున్నాయని ఆ ప్రాంతవాసులు అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన వారు పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించారు. సమస్యను పరిష్కరించారు. - మచిలీపట్నం కార్పొరేషన్

? పెడన 4వ వార్డు జక్కుల వారి వీధిలో ఇంటి వ్యర్థాలు డ్రెయిన్‌లో పడి మురుగు పారడం లేదు. - కె. లోకనాథం, పెడన ✓ సిబ్బందిని పంపి డ్రెయిన్‌లోని వ్యర్థాలను తొలగింపజేస్తాం. - సునీత, శానిటరీ కార్యదర్శి - న్యూస్‌టుడే, పెడన

సచివాలయ ఉద్యోగుల బదిలీలు

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : పెడన మండలంలోని 17 గ్రామ సచివాలయ ఉద్యోగులు బదిలీపై ఇతర మండలాలకు వెళ్తున్నారు. అలాగే ఇతర మండలాల నుంచి పెడనకు వస్తున్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు రిలీవింగ్ ఆర్డర్లను కార్యాలయ ఏవో శివ ప్రసాద్ నుంచి తీసుకుంటున్నారు. అలాగే ఇతర మండలాల నుంచి బదిలీపై వస్తున్న ఉద్యోగులు మండల పరిషత్తులో రిపోర్ట్ చేస్తున్నారు. దీంతో కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది.

అరటి పండ్లు.. మజ్జిగ పంపిణీ

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : మచిలీపట్నం ఉత్తర మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తుమ్మూరు శేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, రాజుపేట ఎన్‌ఎస్‌డీ పాఠశాలలో అరటి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆ స్టేషన్‌లో అన్నీ సమస్యలేనండి..!

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

బందరు రైల్వే స్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని ప్రజలు ఆశించారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించినా ఇంకా అనేక వసతులు కల్పించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇటీవల స్టేషన్‌లో తరచూ దొంగతనాలు జరగడంతో ఆందోళన చెందుతున్నారు.

నత్తనడకన పుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

ప్లాట్‌ఫాంపై దిగి రావాలంటే..

మచిలీపట్నంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రయాణికులు వివిధ రైళ్లలో రాకపోకలు సాగిస్తారు. ఈ స్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్, బీదర్, తిరుపతి, ధర్మవరం, విశాఖపట్నం, కర్నూలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు పెడన, గుడివాడ మీదుగా విజయవాడకు మరో 8 ప్యాసింజర్ రైళ్లు ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో మూడో ప్లాట్‌ఫాంలో రైలు దిగి రావాలంటే ఎత్తుగా ఉన్న మెట్లు ఎక్కడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వృద్ధులను తీసుకురావడానికి వీల్‌ఛైర్లు లేకపోవడంతో కుటుంబ సభ్యులు వారిని ప్రహరీ ద్వారా వద్దకు ఎత్తుక తీసుకురావాల్సి వస్తుంది.

వరుస చోరీలతో బెంబేలు

కొంత కాలంగా స్టేషన్‌లో వరుస దొంగతనాలతో ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. ఇటీవల ఓ వృద్ధురాలు పక్కన బ్యాగు పెట్టి రైలు కోసం నిరీక్షిస్తుండగా బ్యాగు చోరీ గురైంది. మరో యువకుడు చరవాణికి ఛార్జింగ్ పెట్టి అక్కడే కూర్చున్నాడు. ఎవరో వ్యక్తి వచ్చి దాన్ని తస్కరించారు. పలువురు ప్రయాణికులకు చెందిన ద్విచక్ర వాహనాలు పోయాయి. స్టేషన్ మేనేజర్‌కు చెందిన బైక్ పోవడంతో క్షేత్ర స్థాయిలో సమస్య అర్థమవుతుంది. మొత్తంగా 30 వరకు చోరీలు జరిగాయని స్టేషన్ సిబ్బందే చెప్పడం గమనార్హం. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వస్తువులు పోయిన వారు ఆవేదన చెందారు. అదే సీసీ కెమెరాలు ఉంటే దొంగలను పట్టుకునే అవకాశం ఉండేదని చెబుతున్నారు.

38 చోట్ల నిఘా నేత్రాలు

ద్విచక్ర వాహనాలు చోరీకి గురైన మాట వాస్తవమే. ఇటీవల నా బైక్ కూడా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఈ క్రమంలో స్టేషన్‌లో 38 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గుర్తించాం. సంబంధిత విభాగ అధికారులతో మాట్లాడాం. స్టేషన్‌కు ఇప్పటికే లిఫ్ట్ మంజూరు చేయడం జరిగింది. కొత్తగా పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి. - ఎస్.పోతురాజు, బందరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్

ఎంఎంసీ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

ప్రమాణ స్వీకారం చేస్తున్న నాని, పిచ్చేశ్వరరావు

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : మచిలీపట్నం మార్కెట్ కమిటీ(ఎంఎంసీ) ఛైర్మన్‌గా కుంచె దుర్గా ప్రసాద్(నాని) బాధ్యతలు స్వీకరించారు. ఎంఎంసీ కార్యాలయంలో సోమవారం ఆయనతో పాటు వైస్ ఛైర్మన్‌గా చిలంకుర్తి పిచ్చేశ్వరరావు, పాలకవర్గ సభ్యులతో కార్యదర్శి బాబ్జిరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, పలువురు కూటమి నాయకులు నూతన పాలక వర్గాన్ని సత్కరించి అభినందనలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే : కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములకు వేసిన సీళ్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరుపై ఆరా తీశారు. విధుల్లో ఉండే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎన్నికల విభాగ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రికార్డు తనిఖీ చేస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రజలకు సోమవారం కలెక్టర్ బాలాజీ, డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులు మజ్జిగ పంపిణీ చేశారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు వివరించేందుకు కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు మజ్జిగ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు.

సంక్షేమ పథకాలు.. ప్రగతికి బాటలు

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రగతికి బాటలుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం మడక గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేశ్, తెదేపా నేతలు శీరం ప్రసాద్, జోగి సుబ్బారావు, మన్నెం శ్రీనివాసరావు, నెక్కంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

'పేర్ని తరహా వ్యక్తులు సమాజానికి హానికరం'

మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : నిత్యం అసత్యాలు వల్లెవేస్తూ హింసను ప్రేరేపించేలా వ్యవహరించే మాజీ మంత్రి పేర్ని నాని తరహా వ్యక్తులు సమాజానికి హానికరమని తెదేపా నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో దిలీప్ కుమార్, సయ్యద్ ఖాజా, మాదివాడ రాము మాట్లాడారు. పామర్రు, పెడనలో నిర్వహించిన వైకాపా సమావేశాల్లో హింసను ప్రేరేపించేలా నాని చేసిన వ్యాఖ్యలు తగవన్నారు. పేర్ని కుటుంబాన్ని నమ్ముకొని బాగుపడిన వ్యక్తులే లేరన్నారు. నాని పుట్టక ముందే ఇన్‌కం టాక్స్ చెల్లించే స్థితిలో ఉన్న మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబం గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. పేర్ని అక్రమాలను నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, తమ ఆరోపణలకు సమాధానాలు చెప్పాలంటూ సవాల్ విసిరారు.

మాట్లాడుతున్న దిలీప్ కుమార్, రాము, సయ్యద్ ఖాజా తదితరులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలను తెదేపా మండల నాయకులు ఖండించారు. ఆ పార్టీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ కూనపురెడ్డి వీరబాబు అధ్యక్షతన వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో బంటుమిల్లి డీసీ ఛైర్మన్ బొర్రా కాశీ, ఆకునూరి రత్నం, నూర్‌బాషా, నజీర్, కొండలరావు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోవాలి

గూడూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో టి.అనూహ్య ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 15 నుంచి 18 వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. 15, 16 తేదీల్లో మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, 17, 18 తేదీల్లో తరకటూరు, రాయవరంలోని సచివాలయాల్లో శిబిరాలు జరుగుతాయని చెప్పారు. ప్రధానంగా పుట్టిన తేదీ ధ్రువపత్రం కలిగి ఆధార్ నమోదు కాని చిన్నారుల కోసం వీటిని నిర్వహించడం జరుగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పైపెడ్ న్యాచురల్ గ్యాస్‌తో ఉపయోగాలు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : పైపెడ్ న్యాచురల్ గ్యాస్‌తో పలు ప్రయోజనాలున్నాయని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. మేఘా కంపెనీ గ్యాస్ పైప్‌లైన్‌కు సోమవారం బైపాస్ రోడ్డు రింగ్ సెంటర్‌లో రామకృష్ణ, గోపిచంద్ శంకుస్థాపన చేశారు. మేఘా గ్యాస్ ప్రాజెక్టు మేనేజరు రవికిరణ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె నాని తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో రామకృష్ణ, గోపిచంద్

అభినందనీయం

పెదపారుపూడి: దాతల సహకారం అభినందనీయమని యలమర్రు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధుమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని యలమర్రు గ్రామానికి చెందిన అట్లూరి రామారావు, సరోజిని దంపతుల జ్ఞాపకార్థం వారి మనుమరాళ్లు అట్లూరి ఐశ్వర్య, అనన్య (యూఎస్‌ఏ)లు 6వ తరగతి నుంచి 9వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలు అందించారు.

నడిచేందుకు దారేది?

పోతేపల్లి జ్యూయలరీ ఉద్యానవనంలో తిష్ట వేసిన సమస్యలతో పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెదేపా హయాంలో వివిధ వసతుల కల్పనలో భాగంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్ పిచ్చిమొక్కలతో నిండింది. దాని పొడవునా అధ్వానంగా మారడంతో ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

పర్యవేక్షణ లేక.. పట్టించుకోక

మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి వెంబడి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు అలంకారంగా మారుతున్నాయి. వీటిని ఎవరూ పట్టించుకోక పోవడంతో చాలా చోట్లా పాడైపోయాయి. గూడూరు మండలంలోని చిట్టిగూడూరుతో పాటు పలు చోట్ల ఉన్నా ఉపయోగం లేకుండా తయారయ్యాయి. అధ్వానంగా ఉండటంతో అక్కడ ప్రయాణికులు నిరీక్షించేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు

పూడిక తొలగించక.. మురుగు పారక

బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంతం నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి పక్కనున్న డ్రెయిన్‌లో వ్యర్థాలు మేట వేసుకుపోయాయి. ఎప్పటి నుంచో అలాగే వదిలేయడంతో చెత్తతో పాటు పిచ్చిమొక్కలు అల్లుకుపోయి డ్రెయిన్ కనిపించని విధంగా తయారైంది. సమస్య తీవ్రంగా ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

ప్రజలను భయభ్రాంతులకు గురి చేయొద్దు

మాట్లాడుతున్న నరసింహారావు, పార్టీ నాయకులు

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : అధికార, ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం శోచనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు నాయకులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తుండటం గర్హనీయమన్నారు. పలు సమస్యలతో బాధ పడుతున్న ప్రజానీకం గోడు పట్టించుకోకుండా అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. నాయకులు బూర సుబ్రమణ్యం, కొడాలి శర్మ, ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ గణపతి హోమం

పూజలు అందుకున్న గణనాథుడు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : నగరంలోని పలు ఆలయాల్లో సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. బుట్టాయిపేట చిట్టి పిల్లారయ్య ఆలయం, బ్రహ్మపురం సాయి గణేష్ దేవాలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమాలు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిజాంపేట శ్రీకల్యాణ సుందరేశ్వర సమేత విజయ వనవలమ్మ ఆలయంలో గణనాథునికి పూజా క్రతువులు జరిపించారు. ఆయా పూజల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

గుడివాడ, న్యూస్‌టుడే: రహదారి భద్రత అందరి బాధ్యత అని విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని గుడివాడ ట్రాఫిక్ ఎస్.ఐ పూడి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక గౌతమ్ పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట వ్యతిరేకం అని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించరాదని, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడుపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : నిబంధనల మేరకు ఎరువులు, పురుగు మందుల విక్రయాలు చేయాలని, వాటిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తనిఖీ బృంద సభ్యులు హెచ్చరించారు. సోమవారం నగరంలోని పలు ఎరువుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. రాజమహేంద్రవరానికి చెందిన విజిలెన్స్ విభాగ డీఎస్పీ బంగార్రాజు, వ్యవసాయ శాఖ ఏడీఏ పి. చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ శ్రీనివాసరావు, బందరు మండల ఏవో ఎం.రామ్ కుమార్‌లతో కూడిన బృందం దుకాణాల్లోని రికార్డులు తనిఖీ చేశారు. అందరూ ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు.

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

జాబ్‌మేళాపై ప్రజలకు అవగాహన

కరపత్రాలు ప్రదర్శిస్తున్న సత్యనారాయణ, అధికారులు, మహిళలు

ఒన్నార్ కానూరు(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : బందరులో ఈ నెల 16న ఆంధ్ర జాతీయ కళాశాలలో జరిగే జాబ్‌మేళాపై అవగాహన కల్పించేందుకు సోమవారం కానూరు సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ దీనికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, పీత రాము, బొమ్మిడి పెద ఏడుకొండలు పాల్గొన్నారు.

దారంతా గుంతలు..ప్రమాదాలకు ఆనవాళ్లు

బందరు మండలం సుల్తానగరంలోని ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. గ్రామస్థులతో పాటు గూడూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఇదే రోడ్డు వెంబడి రాకపోకలు సాగిస్తారు. అలాంటి మార్గంలో పడిన గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని పూడ్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం. జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి విద్యా కోర్సుకు సంబంధించి షార్ట్ హ్యాండ్, టైప్ రైటింగ్, కామర్స్ పోస్టు, ఇతర కోర్సులకు ఇంగ్లీష్, లెక్కలు, చరిత్ర, సివిక్స్ పోస్టు ఖాళీగా ఉందని చెప్పారు. వీటికి దరఖాస్తులు చేసుకునే వారు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 50 శాతం మార్కులతో పట్టభద్రులై ఉండాలన్నారు. ఈ నెల 16వ తేది సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

22 వరకు ప్రవేశాలకు అవకాశం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : మచిలీపట్నం చిలకలపూడిలో ఉన్న మైనార్టీ గురుకులంలో చేరడానికి ఈ నెల 22 వరకు అవకాశం ఉందని ప్రిన్సిపల్ బి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 8 తరగతి వరకు మైనార్టీ విద్యార్థులు చేరడానికి ఖాళీలు ఉన్నాయని చెప్పారు. మొదటి భాష ఉర్దూ లేదా తెలుగు, రెండో భాష హిందీ లేదా తెలుగు తీసుకోవచ్చన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 87126 25035 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

పన్ను వసూళ్లు నమోదు చేయాలి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ కార్యదర్శులు పన్ను వసూళ్ల నమోదు ప్రక్రియను కచ్చితంగా చేయాలని డీపీవో అరుణ తెలిపారు. సోమవారం కార్యదర్శులతో వీసీలో ఆమె మాట్లాడారు. పన్ను, పన్నేతర ఆదాయాల్ని స్వర్ణ పంచాయతీ యాప్‌లో లోప రహితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఈ విషయంపై బృందాలు తనిఖీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరిని అదుపులోకి తీసుకోలేదు

పెడన, న్యూస్‌టుడే : జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికను రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ సోమవారం పరామర్శించారు. మండల పరిధిలోని కృష్ణాపురంలో ఛైర్‌పర్సన్ నివాసానికి వెళ్లిన ఆయన గుడివాడలో ఉద్రిక్తతలకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ. జడ్పీ ఛైర్‌పర్సన్ వాహనంపై దాడి జరిగి మూడ్రోజులు కావస్తున్న ఇప్పటి వరకు ఒక్కరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోలేదని విమర్శించారు. పేర్ని కిట్టు, వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, మట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెడన, న్యూస్‌టుడే : గత నెల 28న ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పిట్టు వెంకమ్మ(87) ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై లక్ష్మణరావు తెలిపారు. స్థానిక దక్షిణ తెలుగుపాలెంలోని కుమార్తె ముచ్చు రాజమ్మ ఇంట్లో నివాసముంటున్న ఈమె ఇంట్లో నిద్రిస్తుండగా దోమల చక్రం నుంచి నిప్పు చీరకు అంటుకొని తీవ్రగాయాలయ్యాయి. మృతదేహానికి సోమవారం బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

జూద శిబిరంపై దాడి

పెడన, న్యూస్‌టుడే : నందమూరులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మచిలీపట్నం నుంచి వచ్చిన స్పెషల్ పార్టీ పోలీసులు ఈ దాడులు జరిపారు.

విచ్చలవిడిగా సంచారం

మండల కేంద్రం బంటుమిల్లిలో విచ్చలవిడిగా పందులు సంచరిస్తున్నాయి. ప్రధాన రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల సమీపంలో వాటిని పెంపకం దారులు విడిచి వెళ్తున్నారు. వీటి వల్ల రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి పెంపకం దారులకు అవగాహన కల్పించి వాటిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామ కాపురస్తులు అయిన సమ్మెట వెంకట సుబ్బారావు S/o. దామోదరరావు గారి సంజాయిషీ మేర యిచ్చు ప్రకటన ఏమనగా.. నా క్లయింటు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మచిలీపట్నం మండలం మండలం, పోతేపల్లి శివారు ఉల్లిపాలెం గ్రామము, డోర్ నెం.1/65రు కాపురస్తులు చలిమలశెట్టి శ్రీనివాసరావు S/o. దైవాదీనం గారి వద్ద నుండి కొనుగోలు చేయు నిమిత్తమై ఎగ్రిమెంటు పొందియున్నారు. కావున సదరు యీ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏ విధమైన వారసత్వపు హక్కులు గానీ, ఇతరత్రా ఏ విధమైన అభ్యంతరములు గానీ ఉన్న యెడల 10 రోజులలోపు వ్రాతపూర్వక ఆధారములతో తెలుపగలరు. దర్మిలా వచ్చు అభ్యంతరములు చెల్లనేరవు మరియు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం స॥ రి॥ వారి యిలాకా మచిలీపట్నం మండలం, చిన్నాపురం గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన చిన్నాపురం గ్రామ రీసర్వే నెం. 61డి1రులో గల య॥ 0.34 సెంట్లు, రీసర్వే నెం. 61ఇ1రులో గల య॥ 0.41 సెంట్లు మరియు రీసర్వే నెం. 61ఎఫ్1రులో గల య॥ 0.45 సెంట్లు వెరశి ఏకప్రతిగా గల య॥ 1-20 సెంట్లు శేరీపల్లం భూమికి హద్దులు: తూర్పు: పి.డబ్ల్యు.డి బోదె, దక్షిణం: చలమలశెట్టి దామోదరరావు గారి కుమార్తెల భూమి, పడమర: నరహరిశెట్టి సహరి గారి భూమి, ఉత్తరం: కొండిశెట్టి రామబ్రహ్మయ్య, శిరీషనాయుడు గార్ల భూమి.

V.J.M. లోహియా (జితేంద్ర)
అడ్వకేట్ & నోటరీ
మచిలీపట్నం. ✆ 89191 30246

(c) eenadu

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

✦ నున్న పంచాయతీ పరిధి 6వ వార్డులో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా.. ద్వారా కార్యదర్శి కోట సురేష్‌బాబు దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి సిబ్బందిని పంపి పైపులైన్ల లీకేజీకి అడ్డుకట్ట వేయించారు. ✦ అంబాపురం 2వ వార్డులో కాలువ పూడిపోయి దుర్గంధం వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేయగా.. కార్యదర్శి శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, నున్న

విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వినతి

ఉయ్యూరు: ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో 133-33కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ రాష్ట్ర కో-కన్వీనర్ జె. శ్రీనివాస్‌గౌడ్ సోమవారం కలెక్టర్ బాలాజీకి వినతి పత్రం అందించారు.

గన్నవరం-ముదిరాజుపాలెంకు బస్సు సౌకర్యం

గన్నవరం గ్రామీణం: విద్యార్థుల సౌకర్యార్థం గన్నవరం నుంచి ముదిరాజుపాలెంకు ఆర్టీసీ సర్వీసు ప్రారంభించినట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఉదయం, సాయంత్రం 112ఎం సర్వీసు పేరుతో ప్రత్యేక బస్సు నడుస్తుందన్నారు. ఉదయం 7.30 గంటలకు బస్సు గన్నవరంలో బయలుదేరి 8కి ముదిరాజుపాలెం.. తిరిగి అక్కడ 8.10కి బయలుదేరి 8.40కి గన్నవరం చేరుకుంటుందన్నారు. సాయంత్రం 5.30కు గన్నవరం నుంచి బయలుదేరి 6 గంటలకు ముదిరాజుపాలెం.. తిరిగి 6.10 గంటలకు బయలుదేరి 6.40 గంటలకు సర్వీసు డిపోకు చేరుతుందన్నారు. వీఎన్‌పురం కాలనీ, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం పరిసరాల్లో విద్యార్థులు, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతులు

పెరికీడు-కానుమోలు మలుపులో గుంత పూడ్చిన తరువాత ఇలా..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెదనవిస్సన్నపేట జాతీయ రహదారి మరమ్మతులు ఎట్టకేలకు కార్యరూపం దాల్చాయి. బాపులపాడు మండల పరిధిలో పెరికీడు నుంచి కానుమోలు వరకు ఈ రోడ్డు పలుచోట్ల దారుణంగా తయారైంది. కొన్ని కీలక మలుపుల వద్ద రహదారి ఛిద్రమైపోయింది. మూడు నెలల కిందట మరమ్మతులకు వీలుగా కార్యాచరణ చేపట్టిన అధికారులు, గుత్తేదారు ఉన్న గుంతలను మరింత లోతుగా తవ్వేసి వదిలేశారు. దీనిపై 'ఈనాడు' పలుమార్లు వార్తలు ప్రచురించింది. స్పందించిన అధికారులు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆదేశాలు ధిక్కరిస్తూ.. అడిగితే అడ్డు తిరుగుతూ..

జాతీయ రహదారిపై యువత ద్విచక్ర వాహనాలతో హల్‌చల్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

హనుమాన్‌జంక్షన్‌లో కొందరు యువకులు ఇష్టారీతిన రెచ్చిపోతున్నారు. నిబంధనలు బేఖాతరు చేస్తూ పోలీసుల్ని సైతం ధిక్కరిస్తున్నారు. ఓ పక్క ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో దూసుకుపోతూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తుండగా.. మరోపక్క అడ్డుకోబోయిన పోలీసులపైనే దౌర్జన్యానికి దిగేందుకు సైతం వెనుకాడట్లేదు. ఇటీవల కాలంలో హనుమాన్‌జంక్షన్ కూడలిలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనం. పోలీసులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలీసులకు పట్టుబడిన ఆకతాయిలు

ఇవిగో ఘటనలు

★ రెండ్రోజుల కిందట ఒకే వాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులు జంక్షన్ కూడలిలో రాకపోకలకు అడ్డంగా వాహనాన్ని నిలిపివేశారు. పక్కకు తీయమని స్థానికులు సూచిస్తే వారిపై దుర్భాషలతో దాడికి దిగారు. అక్కడే విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ వీరిని వారించే ప్రయత్నం చేయగా, అతనిపై చిందులు తొక్కాడు. ఆ ఖరికి నలుగురు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వీరిని అదుపులోకి తీసుకునేందుకు నానా ప్రయాసలు పడాల్సి వచ్చింది.

★ మూడు రోజుల కిందట మద్యం మత్తులో ఓ ద్విచక్ర వాహనదారుడు మేడేపూడి సుబ్బారావునగర్ రోడ్డులో కార్లు, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టుకుంటూ దూసుకుపోయాడు. ఓ కారు అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. స్థానికులు ఇతడ్ని నిలువరించారు.

మైనర్లే అధికం : ప్రధాన రహదారులతో పాటు, అంతర్గత రహదారుల్లో సైతం కొందరు యువకులు దూకుడు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా విజయవాడ రోడ్డు, గుడివాడ రోడ్డు, సిద్ధార్థ పాఠశాల వీధి, ఐటిఐ రోడ్డు, పోలీస్‌స్టేషన్ ఎదురు వీధి, వేలేరు రోడ్డు, బస్టాండ్ లోపలి, బయటి ద్వారాలకు ఎదురుగా ఉన్న వీధుల్లో ఇవి నిత్యం కళ్లకు కడుతున్నాయి. రెప్పపాటు వ్యవధిలో ద్విచక్ర వాహనాలపై ముందూ వెనకా ఆలోచించకుండా దూసుకుపోతున్న కొందరు యువకుల తీరు స్థానికుల్ని హడలెత్తిస్తోంది. ఇలా వాహనాలు నడుపుతున్న వారిలో మైనర్లే అధికంగా ఉండడం గమనార్హం.

మా దారి అడ్డదారి : మరోవైపు అపసవ్య(వ్యతిరేక) మార్గంలో వాహనాలు నడపడం హనుమాన్‌జంక్షన్‌లో సర్వసాధారణమైపోయింది. హైవేలపై వెళుతున్నామనే కనీస స్పృహ కూడా లేకుండా దూసుకుపోతున్నారు. నిబంధనలు లెక్కచేయకుండా, పోలీసుల్ని ఖాతరు చేయని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

యువత ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి

ఉయ్యూరు: యువత భవిష్యత్తులో ఉద్యోగాన్వేషణ కాకుండా పది మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థలో క్రీడల సన్నద్ధ కార్యక్రమాన్ని కలెక్టర్.. జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాల్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా అడుగులేయాలన్నారు. అందుడైన ప్రభాకర్ రచించిన అడ్వాన్సింగ్ ఇండియా వర్సెస్ ప్రభాకర్స్ విజన్ అనే పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యా సంస్థ ఛైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్లు ఎం.సూర్యశేఖర్, సుష్మ, ప్రిన్సిపల్ పద్మజారాణి, వైస్‌ప్రిన్సిపల్ రుద్రకుమారి పాల్గొన్నారు.

తెదేపా నాయకుడి నేత్ర దానం

వేల్పూరు(కంకిపాడు): మండలంలోని వేల్పూరుకు చెందిన స్థానిక తెదేపా నాయకుడు అడుసుమల్లి నారాయణరావు మృతి చెందగా ఆయన వాంగ్మూలం మేరకు కుటుంబ సభ్యులు సోమవారం నేత్రాలను దానం చేశారు. నారాయణరావు భౌతికకాయానికి ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తెదేపా నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ నివాళులర్పించారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

ఆకునూరు(ఉయ్యూరు గ్రామీణం): ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం(బోటనీ) బోధనకు అతిథి అధ్యాపకులను నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ రామలక్ష్మి తెలిపారు. ఎమ్మెస్సీ(వృక్షశాస్త్రం)లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం నుంచి దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ నెల 21న కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకుంటే మేలు

కానూరు: న్యాయ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు తగిన నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. సోమవారం వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాలలో చట్టపరమైన, న్యాయపరమైన వృత్తిపై స్వీయపరిశీలన అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాతలు నాగేశ్వరరావు, నవీన్‌కుమార్‌లకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ. 2,21,116 విరాళాలను సోమవారం అందజేశారు. కానూరుకు చెందిన ఘట్టమనేని నవీన్‌కుమార్ రూ. 1,20,000, కరిపినేని నాగేశ్వరరావు రూ. 1,01,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి విరాళం రశీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

మాట్లాడుతున్న డాక్టర్ వర్ధన్, పక్కన డాక్టర్ సునీల్‌కుమార్, రమణారావు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : అత్యంత అరుదైన ఈఎన్‌టీ శస్త్ర చికిత్సను కామినేని హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించామని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఆర్.ఎస్. వర్ధన్ అన్నారు. విజయవాడ పాలిక్లినిక్ రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాధారణంగా ఈ తరహా కేసుల్లో శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకోవడానికి కనీసం ఆరు నెలలు పడుతుందని, ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పి.సునీల్‌కుమార్ నైపుణ్యం వల్ల కేవలం 21 రోజుల్లోనే రోగి సాధారణ స్థితికి వచ్చారని తెలిపారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. 'రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స కోసం న్యూరాలజీ విభాగంలో చేరారు. మూడ్రోజుల తర్వాత అతని ముఖం వంకర పోవడం, కనురెప్పల్లో కదలిక లేకపోవడాన్ని గుర్తించాం. ప్రమాదానికి గురైనప్పుడు చెవి వెనుక భాగంలో టెంపోరల్ బోన్ దెబ్బతినడం, ముఖ భాగానికి సంబంధించిన కీలక నరాన్ని నొక్కివేయడంతో సమస్యలు వచ్చాయని నిర్ధారించుకున్నాం. దీనిని ట్రామాటిక్ ఫేషియల్ నెర్వ్ పాల్సీగా వ్యవహరిస్తాం. సుమారు నాలుగు గంటలు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశాం' అని వివరించారు. రోగి మాట్లాడుతూ.. డాక్టర్ సునీల్‌కుమార్ తనకు మరో జీవితాన్ని ప్రసాదించారని తెలిపారు. ఆస్పత్రి మార్కెటింగ్ హెడ్ కె.ఆర్.రమణారావు పాల్గొన్నారు.

కానుమోలు: కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రొద్దుటూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

ఉయ్యూరు: సుందరమ్మపేటలో వైవీబీ రాజేంద్రప్రసాద్

ప్రజా సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కానుమోలు, ఆరుగొలను, రంగయ్యప్పారావుపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యార్లగడ్డ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే బాధ్యత తీసుకున్నానన్నారు. ఆరుగొలనులో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డుని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు దయాల రాజేశ్వరరావు, చింతల వెంకట శివఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు గ్రామీణం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రొద్దుటూరులో జరిగిన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, సర్పంచి శివనాగలక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటకృష్ణారావు, ఎంపీడీవో అనూష, ఏవో ఉషారాణి, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు (కానూరు): యనమలకుదురులో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్, పార్టీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస్, బలగం నాగరాజు, సురేష్, బూసిలు ప్రజలకు కరపత్రాలు పంచి పెట్టారు. కానూరులో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో తెదేపా రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పార్టీ పరిశీలకుడు జువ్వా రాంబాబు, దోనేపూడి రవికిరణ్, బాలాజీ, పాల్గొన్నారు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు 13వ వార్డులోని సుందరమ్మపేటలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. నగర పంచాయతీ మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, కౌన్సిలర్ వెంకటలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

యనమలకుదురు (కానూరు): యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అర్చకుడు జీఆర్‌వీ సాగర్ నేతృత్వంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.భవానీ తదితరులు పాల్గొన్నారు.

IN THE HIGH COURT OF JUDICATURE FOR THE STATE OF ANDHRA PRADESH AT AMARAVATI
C.M.A. No. 126 OF 2025

Between:
Vallabhaneni Venkata Raju ... Appellant
And
Yarlagadda Subhashini & 6 others ... Respondents
To, **Vallbhaneni Premila Rani**
W/o. Late Vallabhaneni Venkateswara Rao
Aged about 62 years, R/o. D.No.5-208
Karmikanagar Katta, Tadigadapa, Vijayawada
NTR District- 521 137
... Proposed Respondent No. 6

This is to inform you that my client Vallabhaneni Venkata Raju got filed Civil Miscellaneous Appeal No.126 of 2025 on the file of the Hon'ble High court of Andhra Pradesh at Amaravati against the order dated 02.12.2024 in I.A No. 855 of 2018 in A.S.No.38 of 2013 on the file of the XI Addl. District Judge Krishna at Gudivada.

When the matter came up for hearing on 08.07.2025, the Hon'ble Court permitted to substitute service on you by way of paper publication as the notices sent to you through registered post got returned twice. The matter is posted for hearing on 25.07.2025 and therefore you are requested to be present before the Hon'ble Court in person or through your counsel, failing which the matter will be decided in your absence.

By the order of the Court
On this the 13th day of July, 2025, At Vijayawada.
Sd/- **BOPPUDI ALEKHYA,** Counsel for the Appellant
A3, Block-A, Annapurna Estates, 2nd Lane, Girls High School Road, Patamata Lanka, Vijayawada-520 010.
Contact No: +91 99519 98171

పీ-4కు రూ.2.25 లక్షల విరాళం

జేడీ దామోదరనాయుడుకు చెక్కు అందజేస్తున్న దాత

కోలవెన్ను (కంకిపాడు), న్యూస్‌టుడే: కోలవెన్ను గ్రామ తెదేపా అధ్యక్షుడు బొబ్బా శ్రీనివాసరావు, స్థానిక రైతు జాస్తి కిషోర్ సంయుక్తగా పాడి రైతుల సంక్షేమానికి రూ. 2.25 లక్షల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని పీ-4కు వినియోగించడానికి దాతలు అంగీకరించినట్లు జేడీ దామోదరనాయుడు తెలిపారు. 'మార్గదర్శకుల'ను పాడి రైతులు, గ్రామస్థులు అభినందించారు. సర్పంచి చోరగుడి సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు టి.ఉమ, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన నరసింహులు, జిల్లా పశుగణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పశువైద్యాధికారి జి.రవికుమార్, కోలవెన్ను జేవీవో కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ✦ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన పీ-4లో భాగస్వాములు కావాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ టి.దామోదరనాయుడు సూచించారు. పశుగ్రాస వారోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం కోలవెన్ను పశువైద్యశాలలో పాడి రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు.

యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివనాగేంద్రం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కె.శివనాగేంద్రం డిమాండ్ చేశారు. స్థానిక శ్రామిక భవన్‌లో సోమవారం ఏర్పాటైన జిల్లా కౌలు రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం యూరియాకు కోత విధించినట్లు ప్రకటిస్తూ వినియోగాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హుకుం జారీ చేయడం సమంజసం కాదని శివనాగేంద్రం అన్నారు. సొసైటీల ద్వారా యూరియా బస్తా రూ.266కు ఇస్తుంటే.. బయట మార్కెట్లో రైతులు రూ.350 వరకు వెచ్చించి కొనాల్సి వస్తోందన్నారు. జిల్లా కౌలు రైతుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణస్వామి, పంచకర్ల రంగారావు, సహాయ కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు వి.మరియదాసు తదితరులు మాట్లాడారు.

పథకాల అమలుపై పరిశీలన

కర్రీ పాయింట్ వద్ద ప్రభాత్ శర్మ తదితరులు

పెదఓగిరాల (ఉయ్యూరు గ్రామీణం): పేద వర్గాల సంక్షేమం, ఉపాధి, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తోందని కేంద్ర బృంద నాయకుడు ప్రభాత్‌శర్మ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, కేంద్ర ప్రభుత్వ నిధులతో జరిగిన వివిధ అభివృద్ధి పనుల పరిశీలనకు ప్రభాత్‌శర్మ నేతృత్వంలో కేంద్ర బృందం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తోంది. సోమవారం పెద ఓగిరాలలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. అనంతరం బృంద సభ్యులు డ్వాక్రా సంఘ సభ్యురాలు నిర్వహిస్తున్న కర్రీ పాయింట్ పరిశీలించారు.

మయోపియా కంటి వ్యాధిపై అప్రమత్తత

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే: పిల్లలలో మయోపియా కంటి వ్యాధిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ నేత్ర వైద్యులు సౌభిక్‌చెల్ అన్నారు. సోమవారం తాడిగడప ఆస్పత్రి ప్రాంగణంలో ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దూరంగా ఉన్న వస్తువులను చూడలేకపోవడం, దగ్గర వస్తువులు చూడగలగడం ఈ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. విద్యార్థులు బ్లాక్‌బోర్డు మీద అక్షరాలు కనపడక పక్కన విద్యార్థుల పుస్తకాల్లో చూసి రాసుకుంటారని, అటువంటి వారిని గుర్తించాలన్నారు. ఈ వ్యాధికి జన్యుపరమైన కారణం, జీవనశైలి రెండూ కారణాలన్నారు. ఇటువంటివారు చికిత్స చేయించుకోవాలన్నారు.

ప్రకటన

విజయవాడ కాపురస్థులు, పోలవరపు శివప్రసాద్ గారి భార్య, కృష్ణకుమారి గారు ది. 25-07-1980న గన్నవరం కాపురస్థులు కలగర సూర్యనారాయణ గారి భార్య రుక్మిణమ్మ మరియు కలగర సూర్యనారాయణ గారి కుమారుడు సత్యనారాయణ గారల వద్దనుండి షెడ్యూలు ఆస్తిని విజయవాడ సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసు- దస్తావేజు నెం. 4291/1980 రీత్యా క్రయం పొందియున్నారు. దరిమిలా సదరు ఆస్తిలో కొంత భాగమును వారి పెద్ద కుమార్తె అయిన తిరుపతి కాపురస్థులు వేమూరి జయరాం ప్రసాద్ గారి భార్య పోలవరపు శ్రీలక్ష్మి గారికి దఖలు దస్తావేజు నెం. 496/1998 రీత్యాన్నూ, మరికొంత భాగమును వారి ద్వితీయ కుమార్తె అయిన గుంతకల్లు కాపురస్థులు నల్లూరి యోగానంద్ గారి భార్య పోలవరపు శ్రీలత గారికి దఖలు దస్తావేజు నెం. 2489/2001 రీత్యాన్నూ దఖలుపరచి, మిగిలిన ఆస్తిని సదరు పోలవరపు కృష్ణకుమారి గారు సంపూర్ణ హక్కుభుక్తములతో అనుభవించుచూ ది. 02-06-2021న ఇంటెస్టేట్‌గా చనిపోయినారు. వారికంటే ముందుగా వారి కుమారుడు పోలవరపు శ్రీధర్ గారు ది. 05-07-2004న చనిపోయినారు. సదరు కృష్ణకుమారి ఆస్తి వారి వారసులైన, భర్త పోలవరపు శివప్రసాద్, కోడలు పోలవరపు మాధవి, మనవడు పోలవరపు వినయ్, మనవరాలు పోలవరపు సమీర, కుమార్తెలు పోలవరపు శ్రీలక్ష్మి మరియు పోలవరపు శ్రీలత గారలకు సంక్రమించియున్నది. సదరు ఆస్తి అంతయున్నూ ఏకఖండముగా యుండియున్నది. కావున, షెడ్యూలు ఆస్తిని మా క్లయింటు క్రయం పొంది, రిజిష్టర్డు విక్రయ దస్తావేజును పొందుటలో ఎవర్కికైననూ ఏవిధమైన అభ్యంతరములు కాని, హక్కులు కాని, క్లెయిములు కాని, ఇతరత్రా ఆక్షేపణలు కాని యున్నయెడల పది రోజులలో లిఖితపూర్వకముగా తెలియపరచవలసినదిగా కోరడమైనది. తదుపరి వచ్చు క్లెయిములు మా క్లయింటుని బైండ్ చేయజాలవు.

షెడ్యూలు: విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ, ప్రసాదంపాడు గ్రామ రీ సర్వే నెం. 69/7 దాఖలా సుమారు 1100 చ॥గ॥ల ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు, దక్షిణం, పడమర:** కానుమిల్లి పట్టాభిరామయ్య వగైరాల ఆస్తి, **ఉత్తరం:** సర్కార్ జనరల్ రోడ్డు.

తుర్లపాటి భైర్రాజు, పి.వి.వి. హరినాథ్‌బాబు
అడ్వకేట్స్, సత్యనారాయణపురం, విజయవాడ-520 011, ఫోన్: 97053 53284

అంతిమయాత్ర

శ్రీ VRN చిట్టికాసులు గారు
ది. 14-07-2025 సోమవారం మధ్యాహ్నం 1-00 గంటలకు స్వర్గస్థులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

అంతిమయాత్ర
ది. 15-07-2025 మంగళవారం ఉదయం 10.00 గంటలకు కానూరు వృద్ధుల ఆశ్రమం రోడ్డులోని మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియపరచడమైనది.

శ్రీ VRN చిట్టికాసులు గారు
Rtd. డ్రాయింగ్ మాస్టారు
కానూరు, విజయవాడ

ఇట్లు:
కుటుంబ సభ్యులు
89787 77742, 99890 38143

పీఏసీఎస్ ఛైర్మన్ శివను సన్మానిస్తున్న 'కూటమి' నాయకులు

రైతు ప్రయోజనాలకే పెద్దపీట

కంకిపాడు, న్యూస్‌టుడే : రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేసి కంకిపాడు పీఏసీఎస్‌ను ఆదర్శవంతంగా నిర్వహిస్తామని ఛైర్మన్ సుంకర శివరంగారావు(శివ), డైరెక్టర్లు గోళ్ల జయరాం, దోడసుల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణం చేసింది. వారు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రుణాల మంజూరు, ప్రభుత్వ పథకాల అమలు, అనవసర ఖర్చులు తగ్గించి సంఘాన్ని లాభాలబాటలో పెడతామన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించినవారిని సన్మానించారు. 'కూటమి' ప్రతినిధులు వణుకూరు విక్రమ్, యేనుగ జయప్రకాష్, బొర్రా వెంకట్, పచ్చిపాల శేఖర్, పిచ్చుక రవి, గుర్రాల నాగశ్రీ, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ తరగతులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: బీఎల్వోలు ఎన్నికల విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, తర్వాత నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించుకోవాలని ఆర్డీవో హేల షారోన్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బూత్ లెవెల్ అధికారులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్డీవో హేల షారోన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేసి చిన్న కుటుంబంలో ఓటర్లందర్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. తహసీల్దారు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో హేల షారోన్

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవడం మేలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: రాజీపడదగ్గ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా అదాలత్‌లో పరిష్కరించుకోవడం మేలని సీనియర్ సివిల్ జడ్జి కె. అరుణ చెప్పారు. సోమవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేశంలో పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి జాతీయ న్యాయసేవాధికార సంస్థ 'మధ్యవర్తిత్వం దేశం కోసం' అనే నినాదంతో ముందుకు సాగుతోందని ఆమె చెప్పారు. స్థానిక కోర్టు ప్రాంగణం వద్ద కక్షిదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రచార ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.స్వర్ణలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్‌ప్రసాద్, ఏజీపీ ఎన్.ఈశ్వర్‌రావు, మధ్యవర్తిత్వం కమిటీ సభ్యులు కొండవీటి ఈశ్వర్‌రావు, తోట వీరబాబు, న్యాయవాదులు, న్యాయస్థానం సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రచార ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు అరుణ, స్వర్ణలత

ఉచిత నేత్రవైద్య శిబిరం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక ఏఏఎన్ఎం, వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్, ఎస్ఆర్ జీఈసీలలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని సంస్థ సహ కార్యదర్శి వి.రామకృష్ణ ప్రారంభించారు. బొప్పన శరత్‌గోపాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ నేత్ర వైద్యాలయం వైద్యసిబ్బంది పాల్గొని అధ్యాపక సిబ్బంది, విద్యార్థులకు నేత్రవైద్యపరీక్షలు నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు బొప్పన తారాచంద్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చక్రి, మేడసాని రవీంద్ర, ప్రిన్సిపల్ బి.కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్రవైద్య పరీక్షలు

పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లిలో వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని దిష్టిబొమ్మకు శవయాత్ర చేసి దహనం చేశారు. బియ్యం దొంగ పేర్ని నాని అంటూ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ పేర్ని నాని ప్రతిరోజూ రెచ్చగొట్టే మాటలతో విద్వేషాలకు పురిగొల్పుతున్నారని పేర్కొన్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, అతడి వ్యాఖ్యలపై పోలీసులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై, మంత్రి లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, తాడికొండ చిన్నా, నాదెళ్ల వెంకటనరసయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ తగులబెట్టి నిరసన తెలుపుతున్న తెదేపా నేతలు

తులసీరత్నం సేవలు చిరస్మరణీయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి 80సెంట్లు స్థలాన్ని ఉచితంగా అందచేయడంతోపాటు ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యేవరకు తన సొంత ఇంటిని పీహెచ్‌సీ నిర్వహణకు అందించి ప్రజలకు ఎంతో మేలు చేసిన తులసీరత్నం సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తులసీరత్నం ఇటీవల పురిటిగడ్డలో కన్నుమూయగా, ఆమె కుమారుడైన విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణను సోమవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరామర్శించారు. తొలుత తులసీరత్నం చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, ఏఎంసీ డైరెక్టర్ నాదెళ్ల వెంకటనరసయ్య, తెదేపా నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, పరుచూరి సురేష్, దేవాభక్తుని గోపాలకృష్ణ, కైతేపల్లి శ్రీనివాసరావు, నాదెళ్ల పిచ్చియ్య పాల్గొన్నారు.

★ **తెదేపా నేతకు పరామర్శ:** వక్కలగడ్డలో తెలుగుదేశం పార్టీ నేత తాతినేని సాయిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరామర్శించారు. అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సాయి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు.

చల్లపల్లిలో విశ్రాంత ఆర్డీవో శివరామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రహదారి భద్రత అందరి బాధ్యత

గుడివాడ: రహదారి భద్రత అందరి బాధ్యత అని విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని గుడివాడ ట్రాఫిక్ ఎస్.ఐ పూడి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక గౌతమ్ పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట వ్యతిరేకం అని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించరాదని, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడుపరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, గౌతమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ పూడి నాగరాజు

పక్షం రోజుల ముందే నీటి విడుదల

✤ రైతుల ఆనందోత్సాహాలు

అడపావారి పాలెం (మోపిదేవి), న్యూస్‌టుడే

పదకొండో నెంబరు ఆయకట్టు చివరి భూములకు మునుపెన్నడూ లేని విధంగా సాగునీరు పూర్తి స్థాయిలో అందుతోంది. 11/3, 3ఏ, 4 బ్రాంచి కాల్వల ద్వారా దాదాపు 2వేల ఎకరాల చివరి భూముల ఆయకట్టు ఉంది. గతంలో సాగునీరు అందని పరిస్థితి. కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క, ఇంగ్లీషు గడ్డి చెత్తాచెదారాలతో కాలువ నీటి ప్రవాహాన్ని నిరోధించేలా అడ్డుగోడలుగా ఉండేవి. ఈ ఏడాది గత ప్రభుత్వం కంటే మిన్నగా కాల్వల్ని కూటమి ప్రభుత్వం ముందుగా బాగు చేసేలా ప్రణాళికాయుతంగా వ్యవహరించింది. ఆగస్టు 10 తర్వాత నారుమడులు పోసేవారమని, సెప్టెంబరులో నాట్లు, ఆపైన జనవరిలో కోతలు జరిగేవని గతం తాలూకా విషయాల్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. మినుము పంటపై ఆశ ఉండేది కాదని చెబుతున్నారు.

✤ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటి సమస్యకు చెక్‌పెట్టేలా ముందుగా నీటి సంఘాలను కొలువుదీర్చారు. వారు బాధ్యతాయుతంగా పనిచేయటం, నిధుల కేటాయింపులు సీజన్‌కు ముందే తీసుకురావటం వెరసి పర్యవేక్షణ చేయటంతో కాల్వ ప్రారంభంలో వదిలిన సాగునీరు ఎక్కడా ఆగకుండా ఆయకట్టు చివరి భూములకు చేరటం గత 30 సంవత్సరాల్లో చూడలేదంటున్నారు రైతులు. దీంతో రైతుల మోములో ఆనందం తాండవిస్తోంది. రెండో పంట కూడా సకాలంలో వేస్తామన్న నమ్మకం ఏర్పడిందని ఢంకా బజాయించి చెబుతున్నారు.

అడపావారిపాలేనికి ప్రవహిస్తున్న 11వ నెంబరు కాల్వ

ఆయకట్టు చివరి ప్రాంతమైన అయోధ్య వద్ద నారుమడిని పూర్తిగా సాగునీరుతో నింపిన రైతు

రైతు శ్రేయస్సే ముఖ్యం

రైతులను అష్టకష్టాలు పెట్టిన వైకాపా ప్రభుత్వతీరు చవిచూశారు. భిన్నంగా చేయాలని ముందస్తుగానే కాల్వ పనులు సాగునీటి విడుదలకు ముందే పూర్తిచేశాం. ఫలితంగా అడ్డంకులు లేకుండా సాఫీ జలప్రవాహం వస్తోంది. రైతులు పడే ఆనందం వర్ణించలేం. కోతలు అయ్యేంత వరకు ఇబ్బందులు ఉండవు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. - **గొర్రెపాటి నాగేశ్వర రావు, పెదకళ్లేపల్లి నీటిసంఘ అధ్యక్షులు**

దాతల సహకారం అభినందనీయం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: దాతల సహకారం అభినందనీయమని యలమర్రు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధుమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని యలమర్రు గ్రామానికి చెందిన అట్లూరి రామారావు, సరోజిని దంపతుల జ్ఞాపకార్థం వారి మనుమరాళ్లు అట్లూరి ఐశ్వర్య, అనన్య (యూఎస్ఏ)లు 6వ తరగతి నుంచి 9వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలు, విద్యార్థులందరికీ రాత పుస్తకాలు పంపిణీ చేశారు

మండల వనరుల కేంద్రాలకు నిధులు విడుదల

మోపిదేవి-అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్‌డీఏ కూటమి విద్యావనరుల కేంద్రాల నిర్వహణకు విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజుల్లోనే నిధులు మంజూరు చేసింది. కృష్ణాజిల్లాలో 25, ఎన్టీఆర్ జిల్లాలో 20 మండల వనరుల కేంద్రాలున్నాయి. ఒక్కొక్క ఎంఆర్‌సీకి రూ.70వేల చొప్పున మొత్తం రూ.31.5 లక్షలను తాజాగా విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఘనంగా శ్రీ లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మెయిన్ రోడ్‌లోని శ్రీవిఘ్నేశ్వరుని దేవస్థానం కాంక్షేప మండపంలో సోమవారం శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. 105 మంది జజమానులు దాతలు పాల్గొని పూజలు జరిపించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ శయన రాజేష్, సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, విష్ణుభొట్ల రాజా, వీరమాచనేని తేజ, శలంకయల శీలామాలిని, సుశీల, దేవస్థానం ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోమ గుండం వద్ద భక్తులు

విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కొమరవోలు శివారు గాంధీ ఆశ్రమంలో వెలసిన విజయ గణపతి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అయ్యంకి గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు పామర్తి వెంకట జయరామకృష్ణ, రజని దంపతులు అన్నసమారాధన చేశారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారి

భద్రిరాజుపాలెంలోని రాజరాజేశ్వరిదేవికి సారె సమర్పిస్తున్న మహిళలు - న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

మహాలక్ష్మీ అమ్మవారికి ఆషాఢ సారె

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్థానిక భద్రావతి సమేత భావనా ఋషి స్వామి, లక్ష్మీగణపతి దేవాలయంలో సోమవారం ఆషాఢమాసం సందర్భంగా మహిళా భక్తబృందం, మహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: పెన్నేరమ్మ ఆలయంలో భక్తులు విశేష పూజలు జరిపారు. సోమవారం ఘంటసాలలో నందంబజారు, బోయినపల్లి రామాలయం భక్తులు గ్రామదేవత పెన్నేరమ్మ అమ్మవారికి సారెను అందజేశారు. భద్రావతి అమ్మవారికి, జలధీశ్వరాలయంలో బాలపార్వతీ అమ్మవారికి, వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణమ్మ అమ్మవారికి సారెను సమర్పించారు.

16న మండల పరిషత్తు నూతన ఉపాధ్యక్షుడి ఎన్నిక

నాగాయలంక, న్యూస్‌టుడే: భావదేవరపల్లి ఎంపీటీసీ, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడిగా ఉన్న పరిశే అమ్మన్న కొద్ది నెలల కిందట మృతి చెందారు. ఈయన స్థానంలో నూతన ఉపాధ్యక్షుని ఎన్నుకునేందుకు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాప్రవీణ్ తెలిపారు. పరిశీలకులుగా డీఆర్వో కె.చంద్రశేఖర్, ఎన్నిక ప్రిసైడింగ్ అధికారిగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఏ.నాగరాజును జిల్లా ఎన్నికల అధికారి నియమించినట్లు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గురజాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిపై ఉయ్యూరు నుంచి పామర్రు వరకు సర్వీసు రోడ్లపై విద్యుద్దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గురజాడ మాజీ సర్పంచి జంపాన శ్రీనివాసగౌడ్ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఫ్లైఓవర్‌ల మీద గురజాడ, గోపువానిపాలెం మధ్యలో గతేడాది నుంచి రాత్రిళ్లు దీపాలు వెలగడం లేదని, సర్వీసు రోడ్ల మార్జిన్లు సక్రమంగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిబ్బన్ కత్తిరించి రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

నూతన సీసీ రోడ్ల ప్రారంభం

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సోమవారం మండలంలోని కనుమూరులో నూతన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ప్రజావసరాలను తీర్చిందన్నారు. ఈ గ్రామంలో సరైన రోడ్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ ఉండగా రూ.25 లక్షలతో 420 మీటర్ల పొడవున 5 రోడ్లు నిర్మించామన్నారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు తాడిశెట్టి నరేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాస్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మండవ శంకరబాబు, గ్రామ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా వ్యాపారస్థుల దినోత్సవం

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో వ్యాపారస్థుల దినోత్సవాన్ని వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ జాగృతి ఆదేశాల మేరకు ఆ సంఘ ప్రతినిధి బొగ్గవరపు సాయిబాబు ఇద్దరు వ్యాపారస్తులను సన్మానించారు. హోటల్ యజమాని తడికమళ్ల సుబ్బారాయుడు, కిరాణా మర్చంట్ అప్పల రామారావును ఘనంగా సన్మానించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్, వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సభ్యులు పాల్గొన్నారు.

హోటల్ యజమాని సుబ్బారాయుడును సన్మానిస్తున్న సాయిబాబు

మాజీ సర్పంచి మృతికి సంతాపం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: పోటుమీద గ్రామ మాజీ సర్పంచ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కడవకొల్లు నాగేశ్వరరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోడూరు మండల తెదేపా అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

క్యాన్సర్ బాధితునికి సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థి చికిత్స నిమిత్తం ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు రూ.50వేలు సాయాన్ని సోమవారం అందించారు. మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శశాంక్‌బాబు(15) హాడ్జికిన్స్ లింఫోమా అనే బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గత ఏడాది తండ్రి మరణంతో ప్రస్తుతం చల్లపల్లి మండలం పాగోలులో తల్లితో కలసి అమ్మమ్మ ఇంటివద్ద నివసిస్తున్నారు. శశాంక్‌బాబు చల్లపల్లిలోని మదర్‌థెరిస్సా కాన్వెంట్‌లో 10వ తరగతి విద్యాభ్యాసం చేస్తుండగా, ఐవీఎం డైరెక్టర్ సురేష్-రోజా దంపతులు విద్యాభ్యాస సాయాన్ని అందిస్తున్నారు.

శశాంక్‌బాబుకు చెక్కును అందచేస్తున్న ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు

కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చుతూ ప్రజల నుంచి అభిమానం పొందుతోందని మండల తెదేపా అధ్యక్షుడు యాసం చిట్టిబాబు చెప్పారు. సోమవారం స్థానిక ఆరో వార్డు నాగాయత్రమ్మ కాలనీలో ఆయన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలును వివరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అడపా వెంకటేశ్వరరావు, డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ్, అవనిగడ్డ బ్రహ్మయ్య, మోపిదేవి కోటేశ్వరరావు, తదితరులు పలువురు పాల్గొన్నారు.

ప్రచార పత్రాలు పంపిణీ చేస్తున్న యాసం చిట్టిబాబు తదితరులు

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం

చాగంటిపాడు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తోందని నియోజకవర్గ పరిశీలకుడు కోట వీరబాబు అన్నారు. మండలంలోని చాగంటిపాడు గ్రామంలో మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. తెదేపా నాయకులు కళ్లం వంశీకృష్ణారెడ్డి, మధుసూదనరెడ్డి, మట్టా అమ్మతరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోట వీరబాబు తదితరులు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి తెదేపా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌరీశంకరపురం గుంతలమయం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ గౌరీశంకరపురం అనగానే.. పట్టణంలో చాలా ప్రశాంతంగా చిన్నారులు విద్యాసంస్థలకు వచ్చి పోతూ ఉండే ప్రాంతంగా అందరికీ సుపరిచితం. ఇక్కడ దేవాలయాలు, విద్యాసంస్థలు ఉంటాయి. అయితే, ఈ ప్రాంతంలో చాలా రహదారులు పూర్తిగా గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. మాజీ ఎమ్మెల్యే రావి శోభనాద్రి చౌదరి ఇంటి ఎదురుగా ఉండే రోడ్ పూర్తిగా పెద్ద పెద్ద గుంతలు పడి నాశనం అయ్యింది. వర్షం వస్తే రహదారిలో పడిన గుంతలలో మురుగు నీరు వచ్చి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. పలుచోట్ల రహదారిపై రాళ్లు లేచి చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. పాఠశాలలకు సైకిళ్లపై వెళ్లి వచ్చే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. చాలా ప్రాంతాలలో మురుగు కాలువలు పూడిక తీతకు నోచక మట్టితో పూడుకుపోయి రహదారిపైకి మురుగు చేరుతోంది. తితిదే కల్యాణ మండపం రహదారి అయితే వర్షం వస్తే పూర్తిగా జలమయం అవుతుంది. ఎక్కడ ఏ గుంత ఉందో తెలీయక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండపం నుంచి పుల్లలపాడుకు వెళ్లే రోడ్డులో తాగునీటి పైపులైన్లు లీకై రహదారిపై నీరు చేరుతోంది. దీనివలన కూడా గుంతలు మరింత పెద్దవి అవుతున్నాయి. వైకాపా పాలనలో వివక్షతకు గురైన గౌరీశంకరపురాన్ని కూటమి నేతలన్నా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రావి వారి ఇంటి ముందు రోడ్డులో ఏర్పడిన గుంతలు

తితిదే కల్యాణ మండపం రోడ్డు దుస్థితి

పోలింగ్ స్టేషన్ల మార్పుపై సమావేశం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన పోలింగ్ స్టేషన్ల మార్పుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని తహసీల్దారు శ్రీనునాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. శ్రీనునాయక్ మాట్లాడుతూ.. మండలంలోని యలమర్రులో నిర్వహిస్తున్న పోలింగ్ స్టేషన్లు 100, 101 భవనాలు శిథిలావస్థలో ఉండడంతో వాటి స్థానంలో.. అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు, నాగాపురం శివారు సోమవరప్పాడు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 116 శిథిలావస్థలో ఉన్నందున అదే స్కూల్‌లో వేరే గదిలోకి మార్పు చేశామన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఉన్నతి సాధ్యం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే బంగారు కుటుంబాలకు ఉన్నతి లభిస్తుందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు చెప్పారు. గ్రామంలోని పెద్దలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపు ఇచ్చారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ గ్రామాల ప్రముఖుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పందించిన మాచవరం గ్రామానికి చెందిన కృష్ణబాబు గ్రామంలోని మొత్తం బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని చెప్పారు. విశ్వనాధపల్లి గ్రామంలోని మొత్తం బంగారు కుటుంబాలను గ్రీన్‌స్టోన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేత, ఆయన సోదరులు నాగవీరాంజనేయులు దత్తత తీసుకుంటామని ప్రకటించారు. ముందుకు వచ్చిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాప్రవీణ్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, ఎంఈవో రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ప్రత్యేకాధికారి పి.సాయిబాబు

బీసీ బాలికల వసతి గృహం సందర్శన

కూచిపూడి, న్యూస్‌టుడే: స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని సోమవారం మొవ్వ వైద్య సిబ్బంది సందర్శించి విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. మలేరియా డెంగీకి కారకాలైన దోమలు రాకుండా కిటికీలకు మెష్ వాడాలన్నారు. ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు హెల్త్ అసిస్టెంట్ కె.రామాంజనేయులు వివరించారు.. ఏఎన్ఎం సమిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో వైద్యసిబ్బంది

ఎంపికైన కార్యవర్గ సభ్యులు

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఇదే

గుడివాడ, న్యూస్‌టుడే: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక మండల మహాసభ స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ మండల మహాసభలో నూతన అధ్యక్షుడిగా ఏ.జగన్, మండల కార్యదర్శిగా నాగేంద్రబాబులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 78 రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రతీ విద్యార్థికి అందించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, జిల్లా సహాయ కార్యదర్శి హారిక తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యం కాపాడాలి

గుడివాడ, న్యూస్‌టుడే: నేటి సమాజంలో కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యం దెబ్బతిందని, దాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని గుడివాడ తాలూకా ఎస్.ఐ ఎన్.చంటిబాబు కోరారు. స్థానిక తాలూకా పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు అందరూ కాలుష్య నివారణకు సహకరించి ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న తాలూకా ఎస్.ఐ ఎన్.చంటిబాబు

ఐటీఐ ప్రవేశాలకు గడువు పెంపు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కనకారావు తెలిపారు. 10, 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్'లో దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన తరువాత 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు. రెండో విడత కౌన్సెలింగ్ జులై 23 నుంచి 25వ తేదీ మధ్య ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906-39639, 77804-29468 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు ఇబ్బందులున్నాయా?

ఈనాడు మిత్రుడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన విజయవాడ దుర్గగుడికి నిత్యం వేల సంఖ్యలో భక్తులొస్తుంటారు. ఏటా కనీసం కోటిన్నర మందికి పైగా భక్తులు దేశవిదేశాల నుంచి తరలివస్తున్నారు. తాజాగా ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వారి సమస్యలను దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ దృష్టికి తీసుకురావొచ్చు. ప్రధానంగా దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం, క్లోక్‌రూం, కేశఖండనశాల, చెప్పుల స్టాండ్స్, సెల్‌ఫోన్ కౌంటర్లు, స్నానఘాట్లు, ఆలయ ఉచిత బస్సులు సహా వేటికి సంబంధించిన సమస్యలున్నా ఈవో దృష్టికి తీసుకురావొచ్చు. దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేస్తే.. ఆలయ ఈవో పరిష్కారాన్ని చూపిస్తారు.

ఈ నెల 16న దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో 'ఈనాడు' ఫోన్‌ఇన్

73374 44081 | తేదీ: బుధవారం (16.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

కాటేసే కాలుష్యం.. కళ్లెం వేసేద్దాం

★ **చైనా వాయు కాలుష్య నివారణలో** అద్భుత ఫలితాలు రాబట్టింది. బీజింగ్ నగరంలో 2012 సమయంలో పీఎం10 తీవ్రత 200 పాయింట్లకు పైగా ఉండేది. ప్రజలు బయటకి రావాలంటే ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. దీంతో అక్కడి ప్రభుత్వం పెద్దఎత్తున కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించాలని లక్ష్యం పెట్టుకుంది. విద్యుత్తు వాహనాలు, సౌర విద్యుత్తు వినియోగాన్ని భారీగా ప్రోత్సహించింది. పెద్దఎత్తున మొక్కలు నాటించడం, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ వాయువులను శుద్ధి చేశాకే బయటికి వదలడం వంటి అనేక సంస్కరణలు, దిద్దుబాటు చర్యలు తీసుకుంది. దీంతో 2022 నాటికి పీఎం10 50 పాయింట్లకు తగ్గింది.

★ **స్విట్జర్లాండ్‌లోని** జురిక్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్, న్యూజిల్యాండ్‌లోని ఆక్లాండ్ వంటి నగరాల్లోనూ రెండు దశాబ్దాల కిందట వరకు విపరీతమైన వాయు కాలుష్యం ఉండేది. ఆయా దేశాల్లో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల పీఎం10 సమస్య కంటే పీఎం2.5 తీవ్రత ఎక్కువగా ఉండేది. శుద్ధ ఇంధనాల వినియోగం, పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ, పచ్చదనం పెంచడం, పర్యావరణ అనుకూల ప్రజా రవాణా నిర్మాణించడం వంటి నిర్ణయాలతో 10-15 ఏళ్ల వ్యవధిలో 80 శాతం వాయు కాలుష్యాన్ని తగ్గించాయి.

ఈనాడు, అమరావతి

గత నాలుగేళ్లలో విజయవాడలో వాయు కాలుష్య తీవ్రత

ఏడాది	పీఎం10
2021–22	67
2022–23	72
2023–24	62
2024–25	64

విజృంభిస్తున్న వాయు కాలుష్యానికి చాలా దేశాలు కళ్లెం వేశాయి. అక్కడి ప్రభుత్వాలు నిర్దిష్ట లక్ష్యం..మెరుగైన నిర్ణయాలతో 10 నుంచి 15 ఏళ్లలోనే కాలుష్య నియంత్రణలో విజయం సాధించాయి. విజయవాడ కాలుష్య నగరాల్లో ఒకటిగా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర కేంద్రంగా ప్రగతి పథాన నడుస్తున్న తరుణంలో పారిశ్రామిక పురోగతి, వాహనాల రద్దీ వల్ల కాలుష్యం మరింత పెరగనుంది. ఈ కాలుష్య నియంత్రణకు చైనా, అమెరికా, స్విట్జర్లాండ్ వంటి దేశాలు అనుసరించిన మెరుగైన విధానాలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన తరుణమిది.

అందిపుచ్చుకోవాలి..

దేశంలో 131 అత్యంత కాలుష్య నగరాల్లో విజయవాడ ఉంది. దేశంలోని కాలుష్య నగరాల్లో సూక్ష్మ ధూళికణాల సాంద్రతను 2026 నాటికి 40శాతం తగ్గించాలని జాతీయ వాయుశుద్ధి కార్యక్రమం(ఎన్‌క్యాప్) లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నాలుగేళ్లలో నగరానికి రూ. 124.4 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో రూ.53.17కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన మొత్తం వైకాపా దారి మళ్లించింది. నగరంలో 100 విద్యుత్తు బస్సులు తీసుకొస్తామని చెబుతున్నా అది కార్యరూపం దాల్చలేదు. కాలుష్య కారకాలైన బీఎస్4 వాహనాల వినియోగం క్రమంగా తగ్గింది. బీఎస్6 మారేలా చర్యలు తీసుకోవాలి. సౌర విద్యుత్తు ఎక్కువగా వినియోగించడం, విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించడం, పచ్చదనం పెంపొందించడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. ప్రభుత్వాలతో పాటు ప్రజల బాధ్యతా కీలకమే..వ్యర్థాలను తగలపెట్టకూడదు. కాలం చెల్లిన వాహనాలను వినియోగించకూడదు. సౌర విద్యుత్తు కోసం ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలను అందిపుచ్చుకోవాలి.

అనర్హులకు పట్టాభిషేకం

వైకాపా నాయకులు, కార్యకర్తలు కావడమే అర్హత

పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలు, నవాబుపేట అనిగళ్లపాడు, ముచ్చింతాల, శివాపురం తదితర 15 గ్రామాల్లో 1,647 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. ఇందులో ప్రతి లేఔట్లో అనర్హులకు పట్టాలు కట్టబెట్టేశారు. చాలా మంది వైకాపా నాయకులు, కార్యకర్తలకు పొలాలు, ఇళ్లు, స్థలాలు ఉన్నా వారిని అర్హుల జాబితాలో చేర్చేశారు. తాజాగా అధికారులు చేపట్టిన తనిఖీల్లో 81 మంది అనర్హులని తేల్చారు.

జగ్గయ్యపేట మండలంలోని ఐదు లేఔట్లలో 155 మందికి అక్రమంగా పట్టాలిచ్చారు. గౌరవరం, షేర్ మహ్మద్‌పేట, హనుమంచిపల్లి, గండ్రాయి, జగ్గయ్యపేటలో లేఔట్లు ఏర్పాటు చేయగా వైకాపా నాయకులు, కార్యకర్తలు కావడమే అర్హత అన్నట్లు కట్టబెట్టేశారు. అధికారులు సైతం నాయకులు చెప్పిన వారికి స్థలాలు కేటాయించారు.

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో పేదలకు ఇళ్ల స్థలాల ముసుగులో అనర్హులకు పట్టాలు కట్టబెట్టేశారు. గూడు లేక అల్లాడుతున్న చాలా మంది పేదలను వదిలి అన్ని హంగులతో ఇళ్లున్న వారికి స్థలాలిచ్చేశారు. వైకాపా ఎమ్మెల్యేల సిఫార్సు ఉంటే చాలు అధికారులు కళ్లుమూసుకుని పట్టాలిచ్చేశారు. ఈ అక్రమాల నిగ్గు తేల్చేందుకు కూటమి సర్కారు చేపట్టిన సర్వే దాదాపు కొలిక్కి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 2,115 మంది అనర్హులకు పట్టాలిచ్చినట్లు తేలింది. సర్వే నివేదిక ప్రకారం ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పేదల కాలనీ

డివిజన్	మంజూరైనవి	అర్హులు	అనర్హులు	పరిశీలించాల్సినవి
విజయవాడ	84,723	82,592	1,801	330
నందిగామ	21,879	21,585	293	1
తిరువూరు	8,367	8,346	21	0
మొత్తం	1,14,969	1,12,523	2,115	331

ఖరీదైన స్థలాలు కొట్టేశారు.. అధికారులు చేపట్టిన సర్వే నివేదిక ప్రకారం అత్యధికంగా అనర్హులు విజయవాడ డివిజన్ పరిధిలోనే ఉన్నారు. అందులోనూ విజయవాడ అర్బన్ పరిధిలో ఏకంగా 1685 మంది అనర్హులకు స్థలాలిచ్చేశారు. విజయవాడ వారికి నగరంలో స్థలాలు లేక ఇబ్రహీంపట్నం మండలంలో ఇచ్చారు. ఇక్కడ సెంటు రేటు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఉంది. రూ.5లక్షల చొప్పున చూసుకున్నా ఈ ఒక్క ప్రాంతంలోనే రూ.84 కోట్ల విలువైన స్థలం అనర్హుల చేతిలోకి వెళ్లిపోయింది. ఇలా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ పరిధిలోనూ రూ.కోట్ల విలువైన స్థలాలు అనర్హులకు, వైకాపా నాయకులకు కట్టబెట్టారు. విజయవాడ, నందిగామ డివిజన్లలో 331 స్థలాల్లో సర్వే చేస్తే పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుంది.

జిల్లాలో అత్యధికంగా అనర్హులను గుర్తించిన మండలాలు

మండలం	కేటాయించిన పట్టాలు	అనర్హులు
విజయవాడ(అర్బన్)	63,459	1,685
జగ్గయ్యపేట	2,584	155
పెనుగంచిప్రోలు	1,647	81
ఇబ్రహీంపట్నం	4,634	76
విజయవాడ రూరల్	10,662	37

ఇలా రిజిస్ట్రేషన్.. అలా దస్తావేజు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలు

రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద క్రయ, విక్రయదారులు, సాక్షులు ఎక్కువ సమయం వెచ్చించేవారు. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ విధానంతో సూచించిన సమయానికి వచ్చి పని చేయించుకుంటున్నారు. ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా మారింది. అదే తరహాలో రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే దస్తావేజులు వెంటనే అందించే విధానాన్ని ప్రభుత్వం పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ పద్ధతి మంచి ఫలితాలు ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

★ వాస్తవానికి రిజిస్ట్రేషన్ చేయడానికే గంటల సమయం పట్టేది. సిబ్బంది కూడా సరిపడా ఉండేవారు కాదు. రిజిస్ట్రేషన్ అయ్యాక దస్తావేజులను స్కాన్ చేయాలి. తరువాత ఆస్తి కొనుగోలు చేసిన వారికి ఇవ్వాలి. సరిపడా సిబ్బంది లేకపోవడంతో కొనుగోలుదారులతో సంతకం చేయించుకుని మరుసటి రోజు దస్తావేజులు ఇచ్చే వాళ్లు. ఆస్తి కొనుగోలు చేసినవారు వాటని తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను ప్రభుత్వం గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంది. అందులో భాగంగా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం వచ్చే పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంపిక చేసింది. ఇద్దరు జూనియర్, ఒక సీనియర్ సహాయకుడిని నియమించింది. సోమవారం 52 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పత్రాలను సిబ్బంది స్కాన్ చేశారు. పది నిమిషాల వ్యవధిలోనే వినియోగదారులకు దస్తావేజులు ఇచ్చామని పటమట సబ్ రిజిస్ట్రార్ రేవంత్ తెలిపారు. దస్తావేజులు తీసుకోవడానికి కనీసం రెండ్రోజులు పట్టేదని, రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే తమకు పత్రాలు ఇవ్వడం ఆనందంగా ఉందని పలువురు కొనుగోలుదారులు తెలిపారు. కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రవేశపెట్టామని, రాష్ట్రంలో మరిన్ని కార్యాలయాలకు దీనిని విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్ తెలిపారు.

స్థిరాస్తి కొనుగోలుదారులకు పత్రాలను అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ రామారావు, పటమట సబ్‌రిజిస్ట్రార్ రేవంత్

ఈఎస్‌ఐసీలో నమోదుకు నూతన పథకం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సామాజిక భద్రతా కవరేజీని విస్తరించాలనే లక్ష్యంతో కార్మిక రాజ్య బీమా సంస్థ ఉద్యోగులు, యాజమాన్యాల నమోదు ప్రక్రియకు నూతన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఈఎస్ఐ కార్పొరేషన్ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ మళ్ల రామారావు తెలిపారు. ఇప్పటివరకు ఈఎస్ఐలో నమోదు కాని సంస్థల యాజమాన్యాలు, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగులు, పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (ఎస్.పి.ఆర్.ఇ.ఇ) అనే పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఉద్యోగులు, సంస్థ యాజమాన్యాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పాత బకాయిలకు మినహాయింపునిస్తూ, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళతరం చేసినట్లు తెలిపారు. పథకం డిసెంబర్ 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఉద్యోగులు, సంస్థల యాజమాన్యాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దారిలో కుప్ప.. ఇదేందప్పా..

పటమట పంట కాలువ రోడ్డులో దాదాపు నెల రోజుల కిందట రహదారి మధ్యలో పైపులైను మరమ్మతు కోసం తవ్విన మట్టిని మరమ్మతుల అనంతరం అక్కడే కుప్పగా పోసి వదిలేశారు. అప్పటి నుంచి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రివేళల్లో ఈ మట్టి కుప్ప కనపడక ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. దీనిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - చిత్రం: ఈనాడు,అమరావతి

మింగినోళ్లు కక్కేలా.. మునిగినోళ్లకు దక్కేలా..

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

అద్విక, యుపిక్స్ బాధితులకు త్వరలో న్యాయం

ఇటీవల విజయవాడ కేంద్రంగా వెలుగుచూసిన ఆర్థిక మోసాల్లో బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. యుపిక్స్, అద్విక ట్రేడింగ్ మోసాలకు సంబంధించి లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే వీటిపై ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. రెండు సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన వారికి సాయం చేసేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. రావాల్సిన దాని కన్నా ఎక్కువ మొత్తం తీసుకున్న ఏజెంట్లు, కొందరు డిపాజిటర్లను గుర్తించి వారి నుంచి ఆ మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిని వీటి కోసం రెండు సంస్థల బాధితుల కోసం వేర్వేరు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి న్యాయ సలహా కూడా తీసుకున్నారు. పచ్చజెండా ఊపడంతో ఒకటి, రెండు రోజుల్లో ముగించనున్నారు. అగ్రిగోల్డ్ కుంభకోణంలా ఏళ్ల తరబడి సాగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అడుగులు పడుతున్నాయి. చివరలో పెట్టుబడులు పెట్టిన వారు ఎక్కువగా నష్టపోయారు.

25వేల లావాదేవీల పరిశీలన

అద్విక ట్రేడింగ్ కంపెనీ కుంభకోణంలో అన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. దాదాపు 16 ఖాతాలకు సంబంధించి మూడేళ్ల వ్యవధిలో 25 వేల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా వీటిని పోలీసులు వడపోస్తున్నారు. డిపాజిటర్ల నుంచి వచ్చింది ఎంత? ఏజెంట్లకు కమీషన్ రూపంలో చెల్లించింది ఎంత? అంతిమంగా ఎవరు లబ్ధి పొందారు? తదితర అంశాలను లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మొత్తం 43 మంది ఏజెంట్లు ఉన్నారు. వీరిలో 35 మంది రూ.100కోట్ల మేర లాభపడినట్లు తేల్చారు. విచారణకు రాకుండా పరారీలో ఉన్న ఏజెంట్ల ఖాతాలను కూడా చూస్తున్నారు. అనుచిత లబ్ధి పొందిన వారిని ఇప్పటికే గుర్తించారు. వారిని పిలిపించి ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని చెబుతున్నారు.

153 మందికి అనుచిత లబ్ధి

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో జరిగిన యుపిక్స్ కుంభకోణానికి సంబంధించి కూడా పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇప్పటికే దీనిపై విజయవాడలోని సత్యనారాయణపురం స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దాదాపు రూ.400 కోట్ల మేర చెల్లింపులు చేయకుండా కిరణ్ బోర్డు తిప్పేశాడు. ఈ కేసులో కూడా పలువురు ఎక్కువగా లబ్ధి పొందినట్లు ఖాతాల పరిశీలనలో తేలింది. 153 మంది రూ.120 కోట్ల మేర ప్రయోజనం పొందారు. 196 మంది రూ. 195 కోట్ల మేర నష్టపోయారు. రూ.75 కోట్ల మేర ఏజెంట్లకు కమీషన్, నిందితుడు సొమ్మును దారి మళ్లించినట్లు అనుమానిస్తున్నారు.

దుర్గాఘాట్‌లో సమాచార కేంద్రం

ఈనాడు కథనాలకు స్పందన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గాఘాట్‌లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుతోపాటు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమాచార కేంద్రం ఏర్పాటుకు సోమవారం కొలతలు వేశారు. దుర్గాఘాట్‌లో భక్తులు పడుతున్న అవస్థలపై 'ఈనాడు'లో వచ్చిన కథనాలపై దుర్గగుడి ఈవో శీనానాయక్ స్పందించారు. మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గతంలో కేశఖండన శాల దుర్గాఘాట్‌లో ఉండేదని భక్తులు ఈవో దృష్టికి తీసుకు వచ్చారు. ఘాట్‌లో సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

KONERU LAKSHMAIAH EDUCATION FOUNDATION
(Deemed to be University u/s 3 of UGC Act 1956)
29-36-38, Museum Road, Governorpet, VIJAYAWADA, A.P - 520 002. Ph: 08645-350200
DEPARTMENT OF ARCHITECTURE
Applications are invited from the eligible candidates for faculty positions

S.No.	Name of the Posts	No. of Post
1	PRINCIPAL	1
2	PROFESSOR	1
3	ASSOCIATE PROFESSOR	3
4	ASSISTANT PROFESSOR	10

• Qualification, Experience and Pay scale as per Council of Architecture norms
• Applications with full particulars to reach careers@kluniversity.in on or before 31.07.2025
www.kluniversity.in REGISTRAR

18న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆయా స్థాయి సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన జరిగే సమావేశాలకు గౌరవ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులు వీటికి హాజరు కావాలని ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

కాలువలకు 13,194 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు సోమవారం 13,194 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 10,187, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు 1,511, బందరు 2,152, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,507 క్యూసెక్కుల చొప్పున అందించారు.

ఏపీ విద్యార్థులం... నాన్ లోకల్ అయిపోయాం

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఏపీలో పది వరకు చదివి, ఇంటర్ బయట రాష్ట్రాల్లో చదవడంతో ప్రస్తుతం తమను నాన్ లోకల్ కేటగిరిలో చేర్చారంటూ స్థానిక విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పుట్టింది... పది వరకు చదువుకున్నది ఆంధ్రప్రదేశ్‌లోనే అయినా.. ఇంటర్ విద్యను పరిగణనలోకి తీసుకొని తమను నాన్ లోకల్ కింద పెట్టేశారంటూ తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివిన ఏపీ విద్యార్థులు.. విజయవాడలోని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయానికి సోమవారం వచ్చి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్‌షిబ్లీని కలిసి ఆవేదన తెలియజేశారు. విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. షిబ్లీ మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణలో ఇంటర్ అభ్యసించిన ఏపీ విద్యార్థులను నాన్ లోకల్‌గా పరిగణించడంతో నష్టం జరుగుతోందని అన్నారు. సొంత రాష్ట్రంలో వారిని నాన్ లోకల్‌గా పరిగణించడం వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదన్నారు. పైగా సాధారణ కోటాలో వచ్చే సీట్లు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. నాన్ లోకల్ కోటా కింద ఇచ్చే తక్కువ సీట్లకు పోటీ పడాలని, న్యాయబద్ధంగా రావాల్సిన అవకాశాలు కోల్పోయినట్లేనని పేర్కొన్నారు. ఇలాంటి వారు రాష్ట్రంలో దాదాపు 7 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిసిందన్నారు. మంత్రి లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి నష్టం జరగకుండా చూడాలని కోరుతానని అన్నారు.

ఫరూఖ్ షిబ్లీకి సమస్య తెలియజేస్తున్న విద్యార్థులు

ఇంజినీరింగ్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 645 మంది

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌లో సోమవారం 645 మంది అభ్యర్థులు వచ్చి తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగాల్లో 1,00,001 నుంచి 1,50,000 ర్యాంకుల వారికి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. ఎన్‌సీసీ విభాగంలో 245, క్రీడా విభాగంలో 183 మంది వచ్చారు. ఆర్మీ సంతతి విభాగంలో 50,001 నుంచి 1,00,000 ర్యాంకు వరకు పిలవగా.. 217 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. మంగళవారం ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో 1,50,001 నుంచి ఆఖరి ర్యాంకు వరకు, ఆర్మీ విభాగంలో 1,00,001 నుంచి 1,50,000 ర్యాంకు వరకు అభ్యర్థులు వచ్చి ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయించుకోవాలని ఆయన సూచించారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో అభ్యర్థులు

(c) eenadu

పేటలో అక్రమాలపై విజిలెన్స్ తనిఖీలు

ప్రభుత్వ ఖజానా పక్కదారిపై విచారణ

పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరుగుతున్న పలు రకాల అక్రమాలపై జిల్లా విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. రెండు రోజులుగా విజిలెన్స్ అధికారుల బృందం పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో ఆయా శాఖల అధికారులు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్న గ్రావెల్ తవ్వకాలు, చిల్లకల్లు జీవాల సంతపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

జోరుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు

గత వైకాపా పాలనలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు జగ్గయ్యపేట నియోజకవర్గం కేంద్రంగా మారింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న కొనగిరి మల్లికార్జునస్వామి కొండను సగం మేర కొల్లగొట్టిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నాళ్ల పాటు గ్రావెల్ రవాణా సాగినా తర్వాత నిలిచింది. వేదాద్రి, జయంతిపురం, తక్కెళ్లపాడు ప్రాంతాల్లో కొంతకాలంగా తవ్వకాలు చేస్తున్నారు. వీటిలో కొన్నింటికి అనుమతులు ఉన్నాయని, వాటిని అడ్డుపెట్టుకొని ఇతర ప్రాంతాల్లో జోరుగా గ్రావెల్ తవ్వేస్తున్నారు. వాటాలు పంచుకునే విషయంలో తేడాలు రావడంతో వారిలోనే కొందరు విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రామచంద్రునిపేట సమీపంలో అనుమతులు తీసుకొని పక్కనే ఉన్న తక్కెళ్లపాడులో తవ్వుతున్నారు. వేదాద్రి, జయంతిపురం గ్రామాల సమీపంలో అత్యధికంగా ఉన్న ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక పరిశ్రమకు ఏడాది కాలంగా గ్రావెల్ రవాణా చేస్తున్నారు. వీటన్నింటిని విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

చిల్లకల్లు సంతలో సగం డబ్బులు స్వాహా..

చిల్లకల్లు జీవాల సంతలో ప్రతి శనివారం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు చెన్నై నుంచి వచ్చి జీవాల కొనుగోలు చేస్తుంటారు. జగ్గయ్యపేట మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ సంత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు కల్పతరువుగా మారింది. క్రయ, విక్రయాలు జరిగితే సంతకు రావాల్సిన నిధులు సగం మేర పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంతలో వ్యాపారులకు సరైన వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. సంతలో ప్రైవేటు సిబ్బందిని ఏర్పాటు చేసుకొని ఆదాయాన్ని జేబుల్లో వేసుకుంటున్నారు. ఈ విషయాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. ఈ విషయాలపై విజిలెన్స్ అధికారులను సంప్రదించగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ ఆగిందా.. డ్రోనొస్తది..!

కృష్ణలంక జాతీయ రహదారిపై బారులుగా నిలిచిపోయిన వాహనాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

మరో ప్రయోగానికి ఏర్పాట్లు

కనక దుర్గమ్మ వారధిపై ప్రమాదం. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాద స్థలానికి వెళ్లేందుకు అవకాశమే లేనంతగా వాహనాలు ఆగిపోయాయి. ప్రమాద తీవ్రతను అంచనా వేసి కారణాలు తెలుసుకుని ట్రాఫిక్ క్లియర్ చేయాలంటే... ట్రాఫిక్ పోలీసులకు తలకు మించిన భారమే. అదే డ్రోన్‌ను పంపి అక్కడి పరిస్థితిని తెలుసుకుని.. దానికి తగినట్లు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌కు సరిదిద్దితే... ఇది సాధ్యమే అంటున్నారు విజయవాడ ట్రాఫిక్ పోలీసులు. గతంలో ప్రయోగాత్మంగా అమలు చేసిన ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తున్నారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్‌ను సరిదిద్దేందుకు, ఉల్లంఘనదారుల కట్టడికి డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి రంగం సిద్ధమైంది.

ఆరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు కేటాయింపు

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 6 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటికి మొత్తం 11 మంది సీఐలు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి ఒక్కో డ్రోన్ ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు నిర్ణయించారు. ముందుగా డ్రోన్ సాంకేతికతను ట్రాఫిక్ జామ్‌ల నియంత్రణకు వినియోగిస్తారు. వాటి ద్వారా ట్రాఫిక్ జామ్‌కు కారణం కనుక్కుంటారు. రోడ్డు ప్రమాదం జరిగితే.. పరిస్థితిని అంచనా వేసి.. అవసరమైతే క్రేన్‌ను పంపుతారు. రోడ్డుపై అడ్డుగా పడి ఉన్న వాహనాలను తొలగిస్తారు.

అస్త్రం యాప్ ద్వారా...

విజయవాడ నగరంలో ట్రాఫిక్‌ని పరిశీలించేందుకు 'అస్త్రం' యాప్ అందుబాటులో ఉంది. ట్రాఫిక్ సిబ్బంది, అధికారుల చరవాణుల్లో ఇప్పటికే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఏఐతో పనిచేసే ఈ యాప్.. ఎక్కడైనా వాహనాలు వరుసగా ఆగిపోతే యాప్‌లో అలర్ట్ మేసెజ్ పంపుతుంది. ఎన్ని మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయో కూడా హెచ్చరిస్తుంది. ఒక వేళ పరిస్థితి తీవ్రమైతే.. ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తుంది. కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిలిచిపోయిన వివరాలు కనిపిస్తాయి. వెంటనే పోలీసు అధికారులు అప్రమత్తమై.. ఘటనా స్థలానికి చేరుకుంటారు. కారణాలు గుర్తించి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తారు. తాజాగా అస్త్రం యాప్‌ను డ్రోన్ సాంకేతికతకు అనుసంధానం చేసి ట్రాఫిక్ కష్టాలను ఎప్పటికప్పుడు గుర్తించి నియంత్రించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ట్రాఫిక్ వివరాలు ఇలా వస్తాయి...

ఉల్లంఘనల కట్టడికీ వినియోగం

ట్రాఫిక్ జామ్‌లతో పాటు ఉల్లంఘనల కట్టడికి వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలు సర్వసాధారణం. రాంగ్ పార్కింగ్, వన్‌వే ఉల్లంఘనలు, స్పీడ్ రేస్‌లు విచ్చలవిడిగా జరుగుతాయి. సాయంత్రం వేళలో వాహనాల రద్దీతో పలు ప్రాంతాలు పద్మవ్యూహాన్ని తలపిస్తాయి. అన్ని ప్రాంతాలకు పోలీసులు వెళ్లి ఉల్లంఘనదారులను గుర్తించలేరు. అలాంటి చోట్లకు డ్రోన్లను పంపి, చలానాలు వేస్తారు. ఇప్పటికే శాంతిభద్రతల విభాగం పోలీసులు నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరేసి జూదం, బహిరంగ మద్యపానం, గంజాయి విక్రయం వంటి వాటిని కట్టడి చేశారు. ఈవ్‌టీజర్లకు గుణపాఠం నేర్పారు. తాజాగా ఇదే తరహాలో ట్రాఫిక్ అధికారులు కూడా డ్రోన్ సాంకేతికతను వినియోగించాలని సీపీ నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తలరాత మార్చేది బాబు.. తలలు తొక్కించేది జగన్

మంత్రి రామానాయుడు

ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పొందిన అమీద్ జానీతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే గద్దె

పటమట, న్యూస్‌టుడే: పీ4 విధానంతో రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని, ప్రజల తలరాత మార్చాలని సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తుంటే.. జగన్ మాత్రం ప్రజల తలలను తొక్కిస్తూ.. రాక్షస నేతగా మారారని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. తన ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం కింద రూ.65 వేలు వచ్చిన అమీద్ జానీ, దివ్యాంగుల పింఛను కింద ఏడాదికి రూ.72 వేలు, తల్లికి వందనం కింద తన ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు, మొత్తం రూ.లక్షా 11 వేలు లబ్ధి పొందిన అబ్దుల్ మునీర్‌తో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జగన్ అరాచక, హింసావాదాన్ని ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని [illegible] తీవ్రంగా ఖండించారు. వైకాపాను రప్పా రప్పా పార్టీగా పేరు మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాని జగన్.. ప్రస్తుతం గంజాయి బ్యాచ్, బెట్టింగ్ మాఫియాను పరామర్శించేందుకు, వాళ్లకి విగ్రహాలు పెట్టేందుకు వెళ్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి పేర్ని నాని నోరు డ్రైనేజ్ లాంటిదని, 100 లీటర్ల పెట్రోల్ పోసి కడిగినా ఆయన నోటి వెంట మంచి మాటలే వస్తాయని అన్నారు. వైకాపా నేతల నోటి దురుసు, బూతుల వల్లే 11 సీట్లకు దిగజారారని, అయినా బుద్ధి రాకపోతే ఒక సీటు మాత్రమే మిగులుతుందని పేర్కొన్నారు. 2027, డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. గద్దె మాట్లాడుతూ.. వైకాపా నేతలు రౌడీయిజాన్ని నమ్ముకున్నారని, ప్రజా ఉద్యమం ముందు రౌడీయిజం నిలవదని అన్నారు. నాయకులు పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, అబ్దుల్ కరీం, అబ్దుల్ ఖాలిక్, గన్నే నారాయణ ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, ఫిరోజ్, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు



వంకాయలు-28, టమాటా-32, బెండ-20, పచ్చిమిర్చి-70, కాకర-40, బీర-24/34, క్యాబేజి-22, క్యారెట్-32/44, దొండ-24, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-34, దోస-16, సొర-12/15, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-30, అల్లం-60, మునగ-7/8, ఆకుకూరలు (కట్ట)-3, కంద-54, బీట్‌రూట్-30, కీర దోస-50, బీన్స్-95, క్యాప్సికమ్-90, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/15, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10 (సన్నవి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జేసీ ఎస్.ఇలక్కియా నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. మొత్తం 176 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 55, విద్య 27, పోలీస్ 25, మున్సిపల్ 12, డీఆర్డీఏ 10, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్, ఆరోగ్యం, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌ఆర్టీసీ, ఆర్.ఐ.ఎస్ శాఖలకు నాలుగేసి, ఇంటర్మీడియట్ విద్య 3, ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి, వివిధ ప్రభుత్వ శాఖలు, జీఎస్‌డబ్ల్యూఎస్, సర్వే, జాతీయ రహదారుల విభాగాలకు రెండేసి వచ్చాయి. వివిధ శాఖలకు ఒక్కటి చొప్పున అందాయి. అర్జీల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారి జె.జ్యోతి, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో ఆసాములు.. అందని తల్లికి వందనం..

తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన తాళ్ల ఏసుకు సుమారు 70 సెంట్ల భూమి ఉంది. ఆధార్ సీడింగ్‌లో మాత్రం ఇతనో పెద్ద భూస్వామి. పెద్ద ఎత్తున భూములు కలిగి ఉన్నావంటూ.. తల్లికి వందనం సొమ్ము జమ కాని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేదంటూ కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ముష్టికుంట్ల గ్రామానికి చెందిన వారాల పుల్లయ్య దుర్గారావు 25 సెంట్ల భూమి ఉంది. ఇతనికి అదే పరిస్థితి. ఆధార్ సీడింగ్‌లో భూములు కలిగి ఉన్నట్లు ఉండి, దీంతో అతని కుటుంబానికి తల్లికి వందనం సొమ్ము జమకాలేదు. సమస్యను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు.

☛ వీటీపీఎస్ బూడిదతో పొలాలు మేట వేసుకుపోయాయని, సాగుకు అవకాశం లేకుండా పోయిందని, మేట తొలగించి ఆదుకోవాలని ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన చెరుకూరి సుబ్బారావు, వెంకటేశ్వరరావులు విన్నవించారు.

ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్. పక్కనే కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదులపై పోలీసు శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్.ఐ.ఆర్.నమోదు చేసి, నిందితులను అరెస్టు చేయాలని పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఎ.పి.ఎస్.రెడ్డి సమావేశ మందిరంలో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్స్ (ఎన్‌సీఎస్‌సీ) డైరెక్టర్ జి.సునీల్ కుమార్‌బాబుతో కలిసి సోమవారం జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం అజయ్ యోజన ద్వారా పేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహకారంతో పాటు, బ్యాంకుల రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎస్సీల స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసే జాబితా తయారీకి పేర్కొన్నారు. దళిత రైతులను ఉద్యాన పంటల సాగు దిశగా ప్రోత్సహించి, మెరుగైన ఆదాయం పొందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానంలో [illegible] అవకాశం ఉందని చెప్పారు. ఎస్సీలకు ఆర్థికసాయం, వివిధ పథకాల అమలు, ఆరోగ్యం, పోషణ, భూ పంపిణీ, నవోదయ తదితర అంశాలను కలెక్టర్ జి.లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉపాధి కల్పన, ప్రభుత్వ పర్యవేక్షణ, సాంఘిక సంక్షేమం, పాఠశాల విద్య, గ్రామీణ తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ తదితర శాఖల పరిధిలో ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. [illegible] కుటుంబాల అభివృద్ధికి ప్రణాళికలు ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి జి.మహేశ్వరరావు, డీసీపీ జి.ఎస్.వి.సరిత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే వినూత్న ప్రయోగాలు



సీపీ రాజశేఖరబాబుతో పోలీసు అధికారులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా ఎస్.వి.రాజశేఖరబాబు బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం పోలీసు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఏడాదిలోనే ప్రజల భద్రతను బలోపేతం చేయడం, ప్రజల్లో విశ్వాసం కలిగించడం, శాంతిభద్రతల పరిరక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ట్రాఫిక్, సైబర్ భద్రత తదితర కార్యక్రమాల్లో వినూత్న చర్యలు తీసుకున్నారంటూ కొనియాడారు. సిబ్బంది ఆరోగ్యానికి, వారి సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. పోలీసింగ్‌లో ప్రజలను భాగస్వాములను చేయడం వంటి వినూత్న కార్యక్రమాలతో తనదైన ముద్రవేశారని ప్రశంసించారు.

'భాజపాకు ఎన్నికల సంఘం అనుకూలం'



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక): బిహార్‌లో ఓటర్ల నమోదు పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం దొడ్డిదారిన పౌరసత్వ నమోదు ప్రక్రియ చేపడుతూ భాజపాకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. సోమవారం ఆయన విజయవాడలో మాట్లాడారు. బిహార్ అనుభవాన్ని సమీక్షించకుండా.. సుప్రీం కోర్టు తీర్పు వెలువడకుండానే ఎన్నికల సంఘం హడావుడి చేస్తోందని పేర్కొన్నారు. భారత్‌పై ఒత్తిడి తెచ్చి, తమకు అనువుగా మార్చుకునేందుకు అమెరికా యత్నిస్తోందన్నారు. గోధుమలు, మొక్కజొన్నలు, సోయాబీన్స్, జీఎం పంటలను దిగుమతి చేసుకోవాలని అమెరికా ఒత్తిడి తెస్తోందని పేర్కొన్నారు. డెయిరీ ఉత్పత్తులను దిగుమతి చేసుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల 8 కోట్ల మంది పాల ఉత్పత్తిదారులు దెబ్బతింటారని వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ భాజపాకు లొంగిపోయి.. భాషలను చిన్నమ్మ, పెద్దమ్మలుగా వర్ణించారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాలు చేపట్టలేదని విమర్శించారు. ప్రైవేటు కళాశాలలను ప్రోత్సహించేలా ప్రభుత్వం తీరు ఉందన్నారు. రాజధాని భూ సమీకరణ విషయంలో గతంలో భూములిచ్చిన రైతులకు ఇప్పటి వరకు ప్లాట్లు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు.

'వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలి'

గొల్లపూడి, న్యూస్‌టుడే: పిచ్చి కూతలు కూస్తున్న వైకాపా నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..వైకాపా నాయకులకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేక పార్టీ సమావేశాలు, విలేకరుల సమావేశాలు పెట్టి పిచ్చి కూతలు కూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. పల్నాడు, బంగారుపాళ్యం, గుడివాడ ఘటనలు జగన్ కుతంత్రాల్లో భాగమని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు.

ఖాతాదారులను ఆకట్టుకునేలా ఆభరణాలు

ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్, నిర్వాహకులు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ, గవర్నర్‌పేటలోని ఎఫ్‌ఎం ప్లాజాలో మంగళగిరికి చెందిన వ్యాపారవేత్త చల్లా నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవిధామ్ సిల్వర్ షోరూమ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులతో కలిసి ఆయన జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖాతాదారులను ఆకట్టుకునేలా మంచి మోడళ్ల నగలు అందుబాటులో ఉంచి వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం దేవీ పవిత్ర గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను సందర్శించారు. నృత్య కళాకారిణులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తితిదే బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అగ్నిప్రమాద నివారణకు చర్యలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో అగ్నిప్రమాద నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఈవో శీనానాయక్ వెల్లడించారు. మల్లికార్జున మహా మండపంలో అగ్నిమాపక, ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. మహా మండపం, ప్రసాదాల పోటు, అన్నప్రసాద పంపిణీ, వంటశాల, నివేదన శాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను ఇవ్వాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఈవో కోరారు. దసరా, భవానీ దీక్షలను పురస్కరించుకుని శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఎక్మో సాంకేతికతతో క్లిష్టతర శస్త్రచికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్ పూబోణి, పక్కన వీసీ చంద్రశేఖర్, డాక్టర్ సుధ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: గుండె, ఊపిరితిత్తులకు క్లిష్టతర శస్త్రచికిత్సలు నిర్వహించే సమయంలో 'ఎక్మో' సాంకేతికతతో ప్రాణాలు కాపాడవచ్చని పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ వైద్యుడు సునీల్ పూబోణి అన్నారు. విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'గుండె విఫలమైన సమయంలో ఎక్మో సాంకేతికత వినియోగం' అనే అంశంపై ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల వైద్యులతో వర్చువల్ అవగాహన కార్యక్రమం సోమవారం వర్సిటీ నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఊపిరితిత్తులకు న్యూమోనియా సమస్య తీవ్రమైనప్పుడు వెంటిలేటర్ చికిత్స విఫలమైతే ఎక్మో అవసరం ఉంటుందని అన్నారు. అలాంటి సందర్భాల్లో గుండె బలహీనంగా మారి శరీరానికి తగినంత రక్త సరఫరా అందించలేని పరిస్థితులు తలెత్తితే ఎక్మో పద్ధతితో గుండెను నియంత్రించవచ్చని వివరించారు. పాశ్చాత్య దేశాల్లో ఈ విధానాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఇక్కడా కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ఎక్మో సాంకేతికత వాడినప్పుడు దుష్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని, అటువంటివి చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హార్ట్, లంగ్‌లకు బైపాస్ చేస్తున్నప్పుడు రోగి ప్రాణాలు కాపాడడానికి ప్రత్యేక యూనిట్, సౌకర్యాలు, నైపుణ్యం గల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అవసరమని అన్నారు. ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అన్ని బోధనాస్పత్రుల్లో నూతన సాంకేతిక సౌకర్యాలను మెరుగుపరుచుకోవాలని, పరిశోధనలపై దృష్టి పెట్టాలని సూచించారు. రిజిస్ట్రార్ రాధికారెడ్డి, పబ్లికేషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సుధ, వైద్య కళాశాలల ప్రిన్సిపళ్లు, సూపరింటెండెంట్లు, విభాగాధిపతులు, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం

వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 83 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. నడవలేని వారి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన మొత్తం 83 ఫిర్యాదుల్లో భూ, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలపై 51 ఫిర్యాదులు వచ్చాయి. మహిళా సంబంధ నేరాలు 6, కొట్లాట 5, దొంగతనాలు 4, కుటుంబ కలహాలు 3, సైబర్ నేరం 1, ఇతర వివాదాలు 11 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి.. సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

జగన్మాత సేవలో చాగంటి దంపతులు

కోటేశ్వరరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజ చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ' నేడు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు తెలిపారు. సోమవారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జీవో నంబరు 36 మేరకు ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగాల కార్మికుల వేతనాలు పెంచాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నట్లు ప్రకటనలకే పరిమితం అవుతున్నారని వాపోయారు. కానీ ఆచరణలో జరగడం లేదన్నారు. గత బడ్జెట్ సమావేశాల్లో చలో విజయవాడ ప్రకటించినప్పుడు రూ.5వేల కోట్లు విడుదల చేశారని గుర్తు చేశారు. కానీ కార్మికులకు డీఏ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ చెల్లింపులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ఈ నెల 3వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళనలు చేపట్టి.. చివరికి చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ఏలూరు లాకుల సెంటరు నుంచి ర్యాలీగా బయలుదేరి ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, కె.ఆర్.ఆంజనేయులు, బి.రాజా, చలం, జేమ్స్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం
పెనుగంచిప్రోలు (గ్రా & మం), NTR జిల్లా

E-Procurement ద్వారా టెండర్ ప్రకటన

NIT No: Computer No: 91899, Date: 14-7-2025

వరుస సంఖ్య	పని వివరములు	పనుల సంఖ్య
1	దేవస్థానమునకు అవసరమైన CC Camera surveillance material సంవత్సరము కాలమునకు (25-26) సప్లై చేయుట	1

ఇతర వివరములకు www.tender.eprocurement.gov.in సైట్ నందు చూడగలరు.

శ్రీ అమ్మవారి సేవలో

శ్రీ జంగాల శ్రీనివాసరావు
ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

శ్రీ బిహెచ్.వి.యస్.యన్.కిషోర్ కుమార్
డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: 81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు. జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. విజయవాడ: శ్రీశరణం లాడ్జి పాతబస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

PERSONAL CLASSIFIEDS

LOST

పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ No. N7843624, చిరుమామిళ్ళ మురళీకృష్ణ, S/o. జనార్ధనరావు, Vijayawada అనుపేరు మీద గల పాస్‌పోర్ట్ ది. 8/7/25న M.G. రోడ్, VJA, రమేష్ హాస్పిటల్ దగ్గర పోయినది. దొరికినవారు సంప్ర. ✆ 88970 26666

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

REAL ESTATE

LAND FOR SALE

మెగా ★అవకాడో ★ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్ 9133574455.

JOBS

ప్రముఖ E-Kart's, వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత: 10th, డిగ్రీ. జీతం: 18000 నుంచి కలదు. 80881 48667.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

సుజన ఏజెన్సీ నందు పని చేయుటకు ఆపి ఆటోడ్రైవర్స్, హెల్పర్స్ కావలెను. గిరి స్ట్రీట్, సత్యనారాయణ పురం, విజయవాడ. ✆ 98483 61888.

గవర్నమెంట్ సంస్థలో పని చేయుటకు రిటైర్డ్ VRS, Teachers, Housewives కావలెను. అర్హత: SSC to P.G, ఫిక్స్‌డ్ శాలరీ. 30k+ PF+ ESI+ MB. ✆ 94935 75370

విజయవాడ పటమట J.D నగర్‌లోని ప్రముఖ ఎడ్యుకేషన్ కన్సల్టేషన్ సంస్థ నందు పనిచేయుటకు Female ఆఫీస్ ఇన్‌చార్జ్, Female టెలీకాలర్ కావలెను. జీతం: 12000 to 15000/-. ✆ 95334 41119.

సేల్స్ రిప్రజెంటేటివ్స్ కావలెను. ITC కంపెనీ నందు పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసినటువంటి ఉత్సాహవంతులైన యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. ఇంటర్వ్యూ తేదీ: 17-07-2025 (గురువారం). ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం : Sri Srinivasa Nilayam, 29-3-10, Venkateswararao Street, Governorpet, Vijayawada - 520 002. Ph.No. 91824 88890. ఉద్యోగ అర్హతలు : వయస్సు : 25 to 30, చదువు : డిగ్రీ.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 8వ తేదీన ప్రచురించగా కార్యదర్శి స్పందించి సిబ్బందిని పంపి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

★ పట్టణంలోని 12వ వార్డు దేవసముద్రం చెరువు వద్ద చెత్త వేస్తుండడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో చెరువు వద్ద శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 18వ వార్డులో వివేకానందా విద్యాలయం రోడ్డులో డ్రెయినేజీ పూడికతో నిండిపోయిందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలుపగా ఆయన స్పందించి కార్మికులతో పూడికను తొలగింపజేశారు. ★ 14వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల వీధిలో మురుగు పారుదల కాల్వలో పూడిక ఉందని, పిచ్చి చెట్లు పెరిగాయన్న స్థానికుల సమస్యపై పారిశుద్ధ్య అధికారులు స్పందించి శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, తిరువూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సూరాయిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రెండున్నర గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. సూరాయిపాలెం, సిరి అపార్టుమెంటు ప్రాంతం, పెయింట్స్ గోదాము ప్రాంతం, కరకట్ట, ఫిల్టర్‌బెడ్, పోస్ట్‌ఫీసురోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10:30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాగునీటి వనరులకు క్లోరినేషన్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని కుమ్మర్ల బజార్‌లో ప్రజలు వాడుతున్న బావి నీటిలో సోమవారం క్లోరినేషన్ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు తెలిపారు. ముదిరాజ్ కాలనీలోని రక్షితనీటి పథకం ట్యాంకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించామన్నారు. ట్యాంకు పరిసరాల్లో దట్టంగా పెరిగిన పొదలు తొలగించినట్లు చెప్పారు.

రేపటి నుంచి యోగా తరగతులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేపటి నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎల్.జనార్దన్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎస్‌వీసీటీ ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం సూక్ష్మ వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు, శరీరానికి కావాల్సిన అన్ని ప్రక్రియలు నేర్పిస్తామని చెప్పారు. యోగ నిద్ర తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

నాగ కనకదుర్గమ్మకు బోనాలు

కొణిజెర్ల(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొణిజెర్ల బీసీ కాలనీ గుడిలోని నాగ కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం స్థానికులు బోనాలు సమర్పించారు. పాలపొంగళ్లతో బోనాలు తీసుకువచ్చిన మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులు, చీరలు, పిండివంటలతో సారె అందించి మొక్కులు చెల్లించారు.

ఆలయంలో మహిళలు

కలగా వారధి.. కలవరం వీరిది

దశాబ్దాలుగా లోలెవెల్ వంతెనల నిర్మాణానికి ప్రజల వినతులు

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

అనుసంధాన రహదారులపై వంతెనల నిర్మాణం దశాబ్దాల తరబడి కలగా మిగులుతోంది. వర్షాకాలం మొదలవడంతోనే ఆయా రహదారులపై ప్రయాణించాల్సిన ప్రజలు, ఇబ్బందులు తలచుకుని కలవరానికి గురవుతున్నారు. భారీగా వరదలొస్తే రోజుల తరబడి గట్టుదాటాలంటే గడగడలాడాల్సిన పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో కనీస అంచనాలకు నోచడంలేదు.

ప్రతిపాదనలు కూడా లేవ్

నియోజకవర్గంలోని పలు మారుమూల గ్రామాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రహదారుల మధ్యలో రాకపోకలకు వీలుగా దశాబ్దాల కిందట లోలెవెల్ వంతెనలు, చప్టాలను నిర్మించారు. క్రమేపీ ఆయా మార్గాల్లో రవాణా పెరగడంతో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఈ క్రమంలో వాగులు ఆక్రమణలకు గురవడం నీటి ప్రవాహం ఆయా వంతెనలపైకి వస్తుండడంతో రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నారు. ఈ అవస్థలను ప్రజలు ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకోవడం, కాలయాపనతో కాలం గడిచిపోవడం షరామామూలుగా మారిపోయింది. కనీస ప్రతిపాదనలకు ఆమోదం తీసుకున్నా ఎప్పటికైనా వంతెన నిర్మించే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా ప్రజాప్రతినిధులకు పట్టకపోవడంతో కలగానే మారుతోంది.

రెడ్డిగూడెం: నరుకుళ్లపాడు వద్ద లోలెవెల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద (పాతచిత్రం)

పాఠశాలకు వెళ్లడం కష్టమే..

మైలవరం మండలం కనిమెర్ల, పోరాటనగర్ మధ్య గల వాగుపై నిర్మించిన లోలెవెల్ చప్టా పై నుంచి ప్రతి వర్షాకాలంలో వరద పొంగడం, రోజుల తరబడి రాకపోకలకు ఇబ్బందులు కలగడం పరిపాటిగా మారింది. దాంతో పోరాటనగర్‌లో గల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదు. పైగా రక్షణ లేని చప్టాపై వరదల సమయంలో మనుషులు కొట్టుకుపోయిన ఉదంతాలున్నాయి.

నారాయణనగర్ వద్ద బుడమేరుపై గ్రావెల్‌తో ఏర్పాటు చేసిన తాత్కాలిక దారి

సమస్యలిక్కడే ఎక్కువ

☛ మైలవరంలోని నారాయణనగర్ మీదుగా ప్రవహించే బుడమేరు వాగుపై వంతెన కోసం మూడు దశాబ్దాలుగా ఆయకట్టు రైతులు విజ్ఞప్తులు చేస్తున్నా నేటికీ కనీస ప్రతిపాదనలు లేవు. ☛ రెడ్డిగూడెం మండలం నరుకుళ్లపాడు వద్ద నాగసానిపాటిచెరువు వద్ద రహదారి దాటడానికి ప్రతి ఏడాది ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైలెవల్ వంతెన కావాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరని రైతులు చెబుతున్నారు. ☛ రుద్రవరం కొత్తచెరువు వద్ద పొంగే నీటితో వర్షాకాలంలో ప్రధాన రహదారిపై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ☛ అన్నేరావుపేట నుంచి నూజివీడు మార్గంలోని వంతెన శిథిలమై ఏళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులు లేవు.

ఉమాగౌరీశంకరుడికి విశేష పూజలు

కొత్తపల్లి(గంపలగూడెం): మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో సోమవారం అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

స్పందించి సమస్య తీర్చండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం పంచాయతీ శివారు తాడిగూడెం నుంచి నరుకుళ్లపాడు వెళ్లే తారురోడ్డు కోతకు గురై ప్రమాద భరితంగా ఉన్న చోట మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు ఎం.మాధవరెడ్డి, టి.వీరాస్వామిలు డిమాండ్ చేశారు. సోమవారం రహదారి దెబ్బతిన్న ప్రాంతాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత ఏడాది వచ్చిన వరదల కారణంగా ఈ మార్గం దెబ్బతినడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. తాడిగూడెం, వెలగలగూడెం గ్రామాల రైతులు పంట పొలాలకు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారని..ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు మరమ్మతులు చేయించి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని కోరారు.

చెత్త తొలగించారు

పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

స్పందనకు వందనం

కూనపరాజుపర్వ గ్రామంలోని దక్షిణ బజారు నుంచి కుదప వెళ్లే తారు రోడ్డు మార్జిన్‌లో వేస్తున్న చెత్త, వ్యర్థాల సమస్యపై 'ఈనాడు'లో సోమవారం 'ఇది డంపింగ్ యార్డు కాదు'.. శీర్షికతో చిత్రవార్త ప్రచురించగా అధికారులు స్పందించారు. కార్మికులతో ఆ ప్రాంతంలోని చెత్త, వ్యర్థాలను తొలగించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, సచివాలయం సిబ్బంది సురేష్ పనులు పర్యవేక్షించారు. ఈ ప్రదేశంలో చెత్త వేయకుండా ఉండేలా బోర్డు ఏర్పాటు చేయించాలని ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

'మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి'

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లి పరిధిలోని పోలవరం కాలువలో మట్టి అక్రమ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మెండెం జమలయ్య సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో జేసీ ఎస్.ఇలక్కియాకు ఫిర్యాదు చేశారు. వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తాడేపల్లి మామిడి తోటలో నిల్వ చేశారని పేర్కొన్నారు. తవ్వకాలు చేసిన వాహనాలను సీజ్ చేసి, కోర్టుకు అప్పగించాలని, సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

రూ. 8 లక్షల విలువైన అమ్మకాలు నిలుపుదల

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీ సీడ్స్, పెస్టిసైడ్స్ దుకాణంలో రూ. 8.08 లక్షల విలువైన అమ్మకాలను నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి తెలిపారు. సోమవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాలతో విజిలెన్స్ అధికారుల బృందం పలు దుకాణాల్లో రికార్డులు, నిల్వలను పరిశీలించారు. బాలాజీ సీడ్స్‌లో ముఖ్య ధ్రువీకరణ పత్రాలను చూపకపోవడంతో విక్రయాలను నిలిపివేస్తూ ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ప్రతి ఎరువులు, పురుగు మందుల వ్యాపారి తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, సరైన ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ క్రోసూరు వి.హనుమంతరావు, డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ కె. వెంకటేశ్వరరావు, టెక్నికల్ ఏఓ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు విక్రయించాలని విజిలెన్స్ డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం జి.కొండూరులోని ధీరజ్ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (గ్రోమోర్) తదితర దుకాణాలలో ఆయన తనిఖీలు చేపట్టారు. గ్రోమోర్‌లో రెండు రకాల పత్తి విత్తనాలకు సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ చూపకపోవడంతో రూ. 45,050 విలువ చేసే ఆ విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎంఏవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాల్సిందే

కొండపల్లి, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. కొండపల్లి చెత్త సంపద కేంద్రం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల రెండో రోజు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు వేతనాలు చాలక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి వర్తింపజేయకపోవడంతో పిల్లలు మంచి చదువులు చదవలేక పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ కార్మికులకు చేసిన హామీలు నెరవేర్చాలని కోరారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు.

కొండపల్లి: రెండో రోజు సమ్మెలో మున్సిపల్ కార్మికులు

తిరువూరు: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె రెండో రోజైన సోమవారం కొనసాగింది. పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు తమ పార్టీ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులను మోసం చేసిందన్నారు. కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సంఘం నాయకులు ఎస్‌కే.బాజీ, కె.శ్రీనివాసరావు, వాసు, ఎస్‌కే.అబ్దుల్‌రఫీ, పి.నారాయణ, పావని, సుజాత, బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి పాల్గొన్నారు.

తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద..

మీ అవసరానికి ఇలా తొలగిస్తే ఎలా..?

ఇబ్రహీంపట్నం రైతుబజారు ఎదుట డివైడరుపై రెయిలింగ్ తీసేశారిలా..

ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌ఘడ్ జాతీయరహదారి పరిధిలో ఇబ్రహీంపట్నం కొండపల్లి గ్రామాల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద డివైడర్లపై ఏర్పాటు చేసిన ఐరన్ రెయిలింగ్‌ను పలువురు తమ అవసరాలకు తొలగించి ఏర్పాటు చేసుకున్న అనధికార దారులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గ్రామస్థులు, పాదచారులు వాటి నుంచి దాటే క్రమంలో వేగంగా వస్తున్న వాహనాలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం శక్తినగర్, ఏకాలనీ, రైతుబజారు, కొండపల్లి శ్రామికనగర్, బీ కాలనీ, సాయిబాబ గుడి సెంటర్‌లలో అనధికార దారులు వెలిశాయి. అధికారులు వీటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పట్టుజారితే ప్రాణాలు గల్లంతే..!

వ్యవసాయ పనులకు వెళ్లే మహిళా కూలీలు వాహనాలపై ప్రమాదకరమైన ప్రయాణం చేస్తున్నారు. మిరప కోతలు, పత్తి తీతలు, మామిడికాయ కోతలు, వరినాట్లకు వెళ్లేందుకు ఐదారుగురు ప్రయాణించాల్సిన ఆటోలో ఇరవై మందికి పైగా వెళుతున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక ఊరు నుంచి మరో ఊరికి పొలాలు దూరంగా ఉన్నప్పుడు అక్కడకు చేరుకునేందుకు దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్ల వెనుక బిగించే ఇనుప గొర్రుపైన నిలబడి ప్రయాణిస్తున్నారు. ట్రాక్టర్ల వేగానికి ఏమాత్రం జారి పడినా ప్రాణాపాయం తప్పదు. ఇటువంటి ప్రమాదకరమైన ప్రయాణాలకు కూలీలు దూరంగా ఉండాలి. -న్యూస్‌టుడే, తిరువూరు, గంపలగూడెం

హైవే పక్కనా మురుగు నిల్వలే

గ్రామాల్లోని వీధుల్లో నిలిచినట్లు హైవే మార్జిన్లలో కూడా మురుగు నీరు తిష్టవేస్తోంది. ఇళ్లలోని వాడుక నీరు పోయే దారిలేదు. ఇటు హైవే అథారిటీ పంచాయతీ యంత్రాంగానికి సమన్వయం కుదరక జూపూడి పంచాయతీ పరిధిలో విజయవాడ -హైదరాబాద్ హైవేపై సమస్య ఎదురవుతోంది. కొండలపై, ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు జాతీయరహదారి ప్రధాన మురుగు కాలువ ద్వారా పోవాల్సి ఉన్నా అది కాస్తా పూడికలతో నిండి పోవడంతో సమస్య వచ్చిందని ప్రజలు చెబుతున్నారు. ఇది బాగుచేయమంటే తమ పరిధి కాదంటూ ఎవరికి వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పడే వరకు పట్టించుకోరా..?

రోలుపడిలోని పలు వీధుల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. దానికితోడు స్తంభాలకు పిచ్చి తీగలు అల్లుకుని మరింత ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆ శాఖ ఉద్యోగులు దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించేందుకు చొరవచూపడం లేదంటున్నారు. గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి వెళ్లే దారిలో పానెం సామేలు ఇంటి వద్ద స్తంభం పూర్తిగా ఒరిగి కూలిపోయేలా ఉందని, విద్యుత్తు శాఖ ఉద్యోగులు వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదం జరగకుండా పరిష్కరించాలని అక్కడి నివాసితులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రోలుపడి(తిరువూరు)

కోట శ్రీనివాసరావుకు నివాళి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు వెలగలేరు గ్రామంలో ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెయిన్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరనిలోటని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మందాడి శ్రీనివాసరావు, పోలుదాసు రంగనాయకులు, వెంకట్రావు, సంపత్‌కుమార్, పద్మనాభం, తిరుపతయ్య, సాంబశివరావు, శివయ్య, గోపి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.



కోట చిత్రపటానికి పూలమాల వేసిన సభ్యులు

గుంతలోకి దూసుకెళ్లిన కంకర లారీ

కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ గుంతలో పడిపోయిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. దొనబండ పరిసరాల క్రషర్ నుంచి భారీ లోడుతో బయలు దేరిన కంకర లారీ పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్దకు చేరుకునే సరికి అదుపు తప్పి సెవంత్ డే అడ్వంటెస్ట్ పాఠశాల ఎదురుగా ఉన్న గుంతలో పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, డ్రైవర్‌కు గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించారు

తిరువూరు, న్యూస్‌టుడే: శ్మశాన స్థలం ఆక్రమించి అంత్యక్రియలు జరగకుండా అడ్డుకుంటున్నారని గంపలగూడెం మండలం చిన్నకొమిరకు చెందిన వడ్డెర సంఘీయులు సోమవారం తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్‌ఎస్ నంబరు 149లో కొంత శ్మశాన స్థలాన్ని వడ్డెర సంఘీయులకు దశాబ్దాల నాడు కేటాయించారని తెలిపారు. ఇటీవల కాలంలో దాన్ని గ్రామస్థులు కొందరు ఆక్రమించి తమను రాకుండా అడ్డుకున్నారని, శ్మశాన వాటిక చుట్టూ ఏర్పాటు చేసుకున్న కంచెను తొలగించి కొంత స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన గ్రామస్థులు

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెం గ్రామ శివారు ఎన్‌సీఎల్ లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీ ఎదుట సోమవారం కవులూరు రైతులు తమ ద్విచక్ర వాహనాలు నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ కట్టుబడివారిపాలెం నుంచి కవులూరు రహదారి మధ్యలో ఉన్న కంపెనీ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇప్పటికే భారీ వాహనాల రాకపోకలతో రహదారి అధ్వానంగా తయారై తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. కంపెనీ నుంచి వచ్చే బూడిద పక్కనే ఉన్న పంట పొలాలపై పడి పంట నాణ్యత, దిగుబడి తగ్గిపోతోందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా రహదారి అభివృద్ధి చేపట్టి, బూడిద రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. కంపెనీ వారు సుముఖత వ్యక్తం చేయడంతో రైతులు నిరసన విరమించారు.

ఎన్‌సీఎల్ కంపెనీ ఎదుట రైతుల నిరసన

సమస్యలు పరిష్కరించాలని వినతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో దోమలు, కోతులు, కుక్కల సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు సోమవారం ఎంపీడీవో చిన్నరాట్నాలకు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో విస్సన్నపేట ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. పారిశుద్ధ్య సమస్యతో వృద్ధి చెందిన దోమ కాటుతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వీధుల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై కోతులు, కుక్కలు దాడి చేస్తున్నాయని వాపోయారు.. వానరాలు ఇళ్లలో చొరబడి వస్తువులు తీసుకెళ్తున్నాయని..అడ్డుకుంటే మీదకు గుంపులుగా వస్తున్నాయని తెలిపారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించి రక్షణ కల్పించాలని కోరారు.

ఎంపీడీవో చిన్నరాట్నాలకు అర్జీ అందజేస్తున్న సీపీఎం నాయకులు

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: లయన్స్ క్లబ్ అనుబంధ సమత క్లబ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కంచెర్ల శశికళ, ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సహజ, కోశాధికారిగా పసుమర్తి వెంకటరమణకుమారి ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కె.ముత్యప్రసాద్, ఎస్.జనార్దనరావు, బి.ప్రకాశరావు, కె.రాజేశ్‌ఖన్నా, రాఘవరావు, పీవీ.రావు తదితరులు పాల్గొని ఎన్నిక నిర్వహించారు.

మైలవరంలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

కొండపల్లి ఇందిరానగర్‌లో...

కూటమితోనే సుపరిపాలన

కొండపల్లి, న్యూస్‌టుడే: సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు ఏడాది పూర్తి చేసుకున్నారని మైలవరం నియోజకవర్గ పరిశీలకులు ధారూనాయక్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొండపల్లి ఇందిరానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు చిట్టిబాబు, సీహెచ్ శ్రీను, తెదేపా నాయకులు అజయ్, రాము, శ్రీను, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని 99, 100వ పోలింగ్‌బూత్ పరిధిలో నాయకులు లితీష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఎ.కొండూరులో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో నాయకులు ఇంటింటా పంపిణీ చేశారు.

గంపలగూడెం: వినగడపలో..

విస్సన్నపేట: చంద్రుపట్లలో..

భవిత కేంద్రంలో అన్నవితరణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యదర్శి శీలం రామిరెడ్డి, ప్రసన్న కుమారుడు సాయివెంకట నాగయశ్విన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం అన్నవితరణ చేశారు. క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాల నిర్వహణకు రూ.5 వేలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు వై.గాంధీ, జాస్తి వెంకటేశ్వరరావు, నాగభూషణం, శ్రీధర్, హరీష్, ఐఈటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పొందుగల (మైలవరం), న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, మండలంలోని అనంతవరానికి చెందిన బొందలపాటి సుధాకర్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం పొందుగల హైస్కూల్లో విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

❖ మూడో డివిజన్ గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి ప్రణీత్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన దోమల పొగ పెట్టించారు.
❖ రెండో డివిజన్ మాచవరం కార్మికనగర్ ప్రాంతంలో తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి మురళి మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.
❖ 12వ డివిజన్ చౌదరి పేట హనుమాన్ వీధి 12-52/25 విద్యుత్ స్తంభానికున్న దీపం గత కొంత కాలంగా వెలగడం లేదని స్థానిక నివాసి జ్యోతిర్మయి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

స్పందనకు వందనం

విద్యార్థులకు ఆర్థిక సాయం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా అంద్రాజు శివకుమారి విధులు నిర్వహిస్తూ.. గతేడాది అనారోగ్య కారణాలతో మృతి చెందారు. శివకుమారి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె వల్లభనేని అక్షర సోమవారం ఐదుగురు విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున రూ.10 వేల నగదు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, శ్రావణి, వల్లభనేని సత్యనారాయణ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ హామీ మేరకు వెంటనే వేతనాలు పెంచాలని, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు మంత్రి నారాయణను కోరారు. యూనియన్ నాయకులతో పాటు వెళ్లి మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇటీవల ప్రకటన విడుదల చేసినందునే కార్మికులు సమ్మె విరమించారని తెలిపారు. అయినప్పటికీ వేతనాలు పెంచడం కానీ, పథకాల అమలుకు చర్యలు తీసుకోవడం కానీ చేయలేదని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ప్రకటన రాలేదని తెలిపారు. కార్మికుల సమస్యలపై ఈనెల 19వ తేదీలోపు ప్రభుత్వపరంగా ప్రకటన విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్మిక నాయకులు సుమన్, కోటిబాబు, యేసుబాబు, రమాదేవి, కోటేశ్వరమ్మ, ఎస్తేరు, కుమారి పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

సమస్యలపై 17 వినతులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వివిధ సమస్యలపై నగర ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరించే బాధ్యత ఆయా విభాగాల అధికారులు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలపై 17 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని తెలిపారు. అనేక సమస్యలను తాత్కాలికంగా పరిష్కరిస్తున్నందున అవే సమస్యలు తిరిగి ఉత్పన్నం అవుతున్నాయని, అది సరైన విధానం కాదని అన్నారు. ఇకపై శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, శ్రీనాథ్‌రెడ్డి, అర్జునరావు, పి.సృజన, లత, పి.సత్యకుమారి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పర్యవేక్షణ లేక.. పచ్చదనం పడక

ఎండిపోతున్న డివైడర్ల వెంట మొక్కలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. నగర పాలకులు, అధికారుల తీరుతో ఆ ప్రక్రియ పడకేస్తోంది. నగరంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని చెబుతున్నా.. బాధ్యులు లక్ష్య పెట్టడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఏటా 20 నుంచి 50 వేల మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా, కనీసం 5 నుంచి 10 వేల మొక్కలు కూడా నాటడం లేదు. వాటినవి సంరక్షించడంలో కూడా విఫలం అవుతున్నారు. ✤ ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం సందర్భంగా మూడు నియోజకవర్గాల్లో 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం విధించగా, వెయ్యి మొక్కలు కూడా నాటలేదు. అంతర్గత రహదార్ల వెంట మొక్కలు నాటి గార్డులు అమర్చి, సంరక్షణ బాధ్యత స్థానికులకు అప్పగించే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా మొక్కలు నాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఉద్యాన విభాగం శ్రద్ధ పెట్టడం లేదు. పెరిగిన చెట్లను తీగలకు తగులుతున్నాయని విద్యుత్తు శాఖ అధికారులు నరికేయడంతో మోడువారుతున్నాయి.

నిర్వహణ ఖర్చు (రూ.కోట్లలో)	
ఏడాది	సొమ్ము
2022	1.25
2023	1.40
2024	1.50
2025	1.80

కొత్తవి నాటడంలో విఫలం

✤ నగరంలోని డివైడర్లు, గ్రీన్‌బెల్ట్‌ల వెంట నాటిన మొక్కలు, గ్రీన్‌గ్రాస్ ఎండిపోతోంది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులోని కొంత భాగంలో డివైడర్లపై పచ్చదనం కళావిహీనంగా ఉంది. పైపుల రోడ్డు, ఆంధ్రప్రభ కాలనీ, అయోధ్య నగర్, రైల్వే స్టేషన్, కేదారేశ్వరపేట, లోటస్ ల్యాండ్ మార్కు, గుణదల, అంబేడ్కర్ రోడ్డు, కేటీ రోడ్డు, బైపాస్ రోడ్డు, క్రాంబే రోడ్డు, సింగ్‌నగర్, పటమట ప్రాంతాల్లోని డివైడర్లపై పచ్చదనం చాలావరకు పాడైపోయింది. ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడం లేదు. ✤ కార్పొరేషన్ పరిధిలోని నర్సరీల నిర్వహణకు రూ. లక్షలు కేటాయిస్తున్నా.. ఫలితం లేదు. ఈ ఏడాది నర్సరీల కోసం రూ.23.50 లక్షలు కేటాయించగా.. అధికారులు శ్రద్ధ చూపడం లేదు. నగరంలోని నర్సరీలు అలంకారప్రాయంగా మారాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పార్కుల నిర్వహణకు రూ.38 లక్షలు, నీరు-చెట్టు ఎవెన్యూ ప్లాంటేషన్‌కు రూ.8 లక్షలు, ఎకో పార్కుల అభివృద్ధికి రూ.19 లక్షలు, పచ్చదనం నిర్వహణకు రూ.8 లక్షలు, ట్రీగార్డులకు రూ.15.50 లక్షలు కేటాయించినా... ఆ మేరకు ఫలితం కనిపించ లేదు. కొన్నాళ్లుగా 2.50 లక్షల మొక్కలు నాటినట్లు చెబుతున్నా.. 1.40 లక్షలు మాత్రమే బతికినట్లు ఇటీవల గుర్తించారు. వర్షాకాలంలో మొక్కలు నాటే ప్రణాళిక ఉన్నా.. అధికారులు ఇంకా చర్యలు తీసుకోవడం లేదు.

లోపాలు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు, ఆటంకాలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. బందరురోడ్డు, బెంజిసర్కిల్, జాతీయ రహదారి, పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డు, కరెన్సీనగర్, గుణదల, బీఆర్టీఎస్‌రోడ్డు, గులాబీతోట, నూజివీడురోడ్డు, పాత బస్తీ, గణపతిరావురోడ్డు, సీవీఆర్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయిన్లలో వ్యర్థాలు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, రహదార్లపై పోగైన చెత్తను వెంటనే తొలగించి తరలించాలని ఆదేశించారు. అనధికారిక ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. సక్రమంగా నిర్వహించాలని అన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ. 2,21,116 విరాళాలను సోమవారం అందజేశారు. కానూరుకు చెందిన ఘట్టమనేని నవీన్‌కుమార్ రూ.1,20,000, కరిపినేని నాగేశ్వరరావు రూ.1,01,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి విరాళం రశీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ❖ ఇంద్రకీలాద్రిపై సంకటహర చతుర్థిని పురస్కరించుకొని యాగశాలలో ప్రత్యేక హోమాలను రుత్వికులు సోమవారం నిర్వహించారు. లోక కల్యాణం కోసం లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో దేవస్థానం ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ పాల్గొన్నారు.

డబుల్ సెంచరీతో విజృంభించిన నాగూర్ బాషా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుంటూరు జట్టుకు చెందిన షేక్ నాగూర్ బాషా డబుల్ సెంచరీతో విజృంభించి స్కోర్ బోర్డును పరుగులు తీయించాడు. పేరేచర్లలోని ఏసీఏ మైదానంలో గుంటూరు, పశ్చిమ గోదావరి జట్ల మధ్య సోమవారం ప్రారంభమైన ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు తొలి రోజు ఆట నిలిపే సమయానికి 94 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 454 పరుగులతో కొనసాగుతోంది. ఎన్వీ గోపీచంద్ (71) క్రీజులో నిలవగా.. ఎస్కే నాగూర్ బాషా డబుల్ సెంచరీ(246) జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ కేవీ నారాయణ (2/90)మెరిశాడు. మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య ప్రారంభమైన మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 73.2 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌటైంది. హేమంత్‌రాయ్ (82)రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ టీఎల్ఏ వర్మ (4/44) మెరిశాడు. తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు ఆట నిలిపే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 43 పరుగులతో కొనసాగుతోంది.

నాగూర్ బాషా (246)

టీఎల్ఏ వర్మ (4/44)

అతిథుల నుంచి ట్రోఫీ, వ్యక్తిగత పతకాలు అందుకున్న క్రీడాకారులు

ఎన్టీఆర్ లేజర్ రన్ జట్టుకు ఓవరాల్ రన్నరప్ ట్రోఫీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 12, 13వ తేదీల్లో జరిగిన 8వ రాష్ట్ర స్థాయి మోడరన్ పెంటాథ్లాన్ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుందని సంఘం జిల్లా కార్యదర్శి తెలిపారు. పురుషుల 50+ కేటగిరీలో జి.శ్రీనివాస నాయక్ పసిడి, సీనియర్ మిక్స్‌డ్ రిలేలో సాయితేజ్, జీవీఎస్ మాలతి, ఎస్.దుర్గా హేమంత్ రజతం, డి.రూపశ్రీ పాపని రజతం, జూనియర్ మిక్స్‌డ్ రిలేలో చింతా దీపక్, వి.జాన్సీరెడ్డి కాంస్యం, అండర్-17 మిక్స్‌డ్ రిలేలో బి.భవానీ కిషోర్, ఎ.లీలా సాగర్ పసిడి, అండర్-15 మిక్స్‌డ్ రిలేలో జి.దీపక్, జి.సాయిలక్ష్మి పసిడి, జి.ప్రణతి, వి.జాన్సీరెడ్డి పసిడి, టి.వివేక్ వ్యక్తిగత రజతం, ఎస్.కోటేశ్వర్, ప్రియతమ్ అంజన్ జోడీ పసిడి, అండర్-13 మిక్స్‌డ్‌లో మోక్షశ్రీ మహాలక్ష్మి, పి.భవ్యాన్ష్ జోడీ పసిడి, ఎం.సతీష్‌కుమార్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం, అండర్-11 మిక్స్‌డ్‌లో ఎం.కౌశిక్, ఎస్.గౌతమ్ జోడీ పసిడి, వ్యక్తిగత విభాగంలో పి.యశ్వంత్ రజతం, పి.రితీష, పి.యశ్వంత్ జోడీ పసిడి, అండర్-9 వ్యక్తిగత విభాగంలో ఎస్కే ఆలియా రజతం, మిక్స్‌డ్‌లో చేతన్ కృష్ణ రజతం, టి.ఆర్య నికీ, ఎం.తమోజ్ఞ బాలికల రిలేలో పసిడి, ఎం.సాయి ఆశ్రిత మిక్స్‌డ్ రిలేలో పసిడి పతకాలు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

ఫుట్‌బాల్‌లో కృష్ణా బృందానికి ద్వితీయ స్థానం

పతకాలతో క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈ నెల 12, 13వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ (అండర్-14) ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుందని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.అనిల్‌కుమార్, రాయన సురేష్‌బాబు తెలిపారు. బద్రీనాథ్ మిశ్రా, ప్రేమ్‌కుమార్, సాయిచంద్, ఆస్నిత్, హర్ష కార్తీక్, అనయత్, రిద్విక్ మెరుగైన ఆట తీరు ప్రదర్శించారని వివరించారు.

దారి అధ్వానం.. రాకపోకలకు ఇబ్బంది

నవోదయ కాలనీలోని సున్నపు బట్టీల సమీపంలో ఓ అంతర్గత రహదారి అధ్వానంగా మారింది. కొంత మేర పగుళ్లు ఇవ్వడం, గోతులు పడడంతో వాహనదారుల రాకపోకలకు అసౌకర్యం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు నిర్వహించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మొగల్రాజపురం (విజయవాడ సిటీ),

కొమ్మలు నరికేసి.. మోడుగా మిగిల్చి..

మొక్కలు పెంచండి... పర్యావరణాన్ని పరిరక్షించండి అని పాలకులు చెబుతుంటే.. కాలనీ వాసులు ఎంతో ఆసక్తితో సంరక్షిస్తున్నారు. ఎనిమిదో డివిజన్ రెవెన్యూ కాలనీ పార్క్ పక్క రహదారిలో విద్యుత్తు లైన్లకు అడ్డు వస్తున్నాయని చెట్ల కొమ్మలను సిబ్బంది నరికేశారు. మోడుగా మిగల్చడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మొగల్రాజపురం (విజయవాడ సిటీ)

రహదారిపైకి మురుగు... దుర్వాసనతో అవస్థ

సున్నపు బట్టీల నుంచి సిద్ధార్థ సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ నుంచి పాత అయిదో నంబరుకు వెళ్లే రహదారిపైకి మురుగు ప్రవహిస్తోంది. రాకపోకలకు అసౌకర్యంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఎంతో మంది రాకపోకలు కొనసాగించే రద్దీ రహదారుల్లో మురుగు పారుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మొగల్రాజపురం (విజయవాడ సిటీ),

రహదారి దెబ్బతిని.. ప్రమాదకరంగా మారి..

ఎనిమిదో డివిజన్ జమ్మి చెట్టు రోడ్డులో ఆర్ఆర్ జాయింట్స్ ఎదురుగా రహదారి కొంత దెబ్బతింది. పెచ్చులు పైకి లేచాయి. వాహనదారులు పడిపోతున్నారని కొద్ది రోజుల కిందట ప్రమాద సూచికగా బారికేడ్ ఏర్పాటు చేశారు. అది కూడా పడిపోయింది. ప్రధాన కూడలి కావడంతో నిత్యం వాహనాల రద్దీగా ఉంటోంది. మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

మాట్లాడుతున్న డాక్టర్ వర్ధన్, పక్కన డాక్టర్ సునీల్‌కుమార్, రమణారావు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : అత్యంత అరుదైన ఈఎన్‌టీ శస్త్రచికిత్సను కామినేని హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించామని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఆర్.ఎస్. వర్ధన్ అన్నారు. విజయవాడ పాలిక్లినిక్ రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాధారణంగా ఈ తరహా కేసుల్లో శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకోవడానికి కనీసం ఆరు నెలలు పడుతుందని, ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పి.సునీల్‌కుమార్ నైపుణ్యం వల్ల కేవలం 21 రోజుల్లోనే రోగి సాధారణ స్థితికి వచ్చారని తెలిపారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ. . 'రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స కోసం న్యూరాలజీ విభాగంలో చేరారు. మూడ్రోజుల తర్వాత అతని ముఖం వంకర పోవడం, కనురెప్పల్లో కదలిక లేకపోవడాన్ని గుర్తించాం. ప్రమాదానికి గురైనప్పుడు చెవి వెనుక భాగంలో టెంపోరల్ బోన్ దెబ్బతినడం, ముఖ భాగానికి సంబంధించిన కీలక నరాన్ని నొక్కివేయడంతో సమస్యలు వచ్చాయని నిర్ధారించుకున్నాం. దీనిని ట్రామాటిక్ ఫేషియల్ నెర్వ్ పాల్సీగా వ్యవహరిస్తాం. సుమారు నాలుగు గంటలు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశాం' అని వివరించారు. రోగి మాట్లాడుతూ.. డాక్టర్ సునీల్‌కుమార్ తనకు మరో జీవితాన్ని ప్రసాదించారని తెలిపారు. ఆస్పత్రి మార్కెటింగ్ హెడ్ కె.ఆర్.రమణారావు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కుమార్ స్మారక స్వర్ణ పతకం ప్రదానం



ప్రీతమ్‌రెడ్డికి ప్రశంసాపత్రం, స్వర్ణ పతకాన్ని అందజేస్తున్న రాధికారెడ్డి, ఏడుకొండలరావు తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: డా.కనకమేడల శ్రీనివాస్ కుమార్ స్మారక స్వర్ణ పతకం ప్రదానోత్సవం సోమవారం సిద్ధార్థ వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది స్వర్ణ పతకాన్ని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వైద్యుల్లో ఒకరికి ఇస్తారు. ఈ ఏడాది ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంఎస్ జనరల్ సర్జరీ పరీక్షల్లో విశ్వవిద్యాలయం టాపర్‌గా డా.ప్రీతమ్‌రెడ్డి నిలిచారు. ఆయనకు డా.కనకమేడల శ్రీనివాస్ కుమార్ స్మారక స్వర్ణ పతకాన్ని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.రాధికారెడ్డి అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.ఏడుకొండల రావు, రేడియాలజిస్టు డా.వరప్రసాద్, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు, జనరల్ సర్జరీ విభాగాధిపతి డా. రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి పురస్కారం

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న హరి శ్రీనివాస్‌కు విద్యారంగంలో అందించిన సేవలకుగాను తెలుగు వెలుగు సాహితీ వేదిక పురస్కారాన్ని ప్రదానం చేసింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సాహితీ వేదిక సభ్యుడు డాక్టర్ నందమూరి తారక రామారావు జాతీయ గౌరవ పురస్కారాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, సాహితీ వేదిక సభ్యులు పాల్గొన్నారు. శ్రీనివాస్‌ను కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, ప్రిన్సిపల్ సోమవారం అభినందించారు.

CHANGE OF NAME
I, Kona Anjali Devi, Wife of late Kona Mohana Rao, resident of Door No.32-11-26/B, Church Street, Mogalrajpuram, area Near Sree Ramulu Kottu, Venkateswara puram, Vijayawada, A.P. I declare that I am holder of INDIAN passport number No.1861244 in which my name was mentioned in the said pass port as Kona Anjalee Devi which is wrongly noted the spelling. As my correct name is Kona Anjali Devi is correct.

సైకాలజీలో విస్తృత ఉద్యోగావకాశాలు

రమేష్‌ను సత్కరిస్తున్న సైకాలజిస్టులు

పటమట, న్యూస్‌టుడే: సైకాలజీలో విస్తృతంగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని, గణితం, ఆంగ్లం ఇతర సబ్జెక్టులతో పాటు సైకాలజీపై కూడా ఆసక్తి పెంచుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ బావిశెట్టి రమేష్ అన్నారు. సోమవారం పటమటలోని స్పార్క్ కౌన్సెలింగ్ సెంటర్‌లో జాతీయ సైకాలజిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం బావిశెట్టి రమేష్‌ను సత్కరించారు. సైకాలజిస్టులు రాజేశ్వరరావు, జానకీరామ్, రవి భార్గవ్, దుర్గాప్రసాద్, ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, గణేష్, మూర్తి, మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

'హామీలపై జీవోలు విడుదల చేయాలి'

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలపై రాతపూర్వక ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేయాల్సిందిగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాణిగారితోటలోని జిల్లా సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సంఘం తూర్పు సిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఆశ వర్కర్లకు ఇచ్చిన రాతపూర్వక హామీలను ప్రభుత్వం ఇప్పటి వరకు నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆశ వర్కర్లకు వయో పరిమితి పెంచి గ్రాట్యుటీ చెల్లిస్తామని ప్రకటన చేసినప్పటికీ జీవోలు విడుదల కాకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో తల్లికి వందనం, వితంతు, ఒంటరి పింఛన్లను ప్రభుత్వం నిలిపివేసిందని, ఇప్పటికైనా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎస్.జ్యోత్స్న, పి.శ్రీలక్ష్మి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా 19 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. తూర్పు సిటీ సీఐటీయూ అధ్యక్షుడు ఎల్.రాజు, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కౌశల్ వికాస్ పథకంపై అవగాహన

చిట్టినగర్, న్యూస్‌టుడే: యువతలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపు వంటి కార్యక్రమాలను భారత ప్రభుత్వం నిర్వహిస్తుందని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి పేర్కొన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల ఎన్‌సీసీ, కంప్యూటర్ విభాగాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం, కౌశల్ వికాస్ రోజ్‌గార్ యోజనపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పథకాల పట్ల ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.

ఖాళీ స్థలాలతో ఇక్కట్లు

అశోక్‌నగర్ పండరీపురం రోడ్డులోని ఖాళీ స్థలంలో ముళ్ల పొదలు

అశోక్‌నగర్(పటమట), న్యూస్‌టుడే

నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ అశోక్‌నగర్‌లో పలు సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని రోడ్లలో మ్యాన్‌హోల్స్ ధ్వంసం అయ్యాయి. ఎగుడుదిగుడుగా ఉండడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్డుపై సైతం మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. ఖాళీ స్థలాల నిర్వహణను యజమానులతో పాటు వీఎంసీ అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కొన్ని ఖాళీ స్థలాల్లో గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల రాత్రి సమయంలో విష పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయి. పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి పూట గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. రాకపోకలు సాగించే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కాకతీయ రోడ్డులో ధ్వంసమైన మ్యాన్‌హోల్స్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

Dr. VIJAY
PLASTIC & COSMETIC SURGERY
H.No.59A-9-2A, 3rd Floor, AH Arcade, Saibaba Temple Street, Opp. Funtimes Club, Teacher's Colony, Patamata, Vijayawada-10
FREE HAIR LOSS & SCAR REVISION CAMP
FREE CONSULTATIONS in the event of World Plastic Surgery Day
From 15th to 31st July, 2025 Only for PRIOR BOOKED APPOINTMENT
7075852323
SERVICES
Hair Transplantation
Liposuction & Body Contouring
Gynecomastia Surgery
Facial Cosmetic Surgery
Scar Revision & Skin Tratments
Botox & Fillers
PRP & GFC Hair Therapy
Non-Surgical Skin Tightening
Intimate Aesthetic Procedures
DR. VIJAY B
MCh Plastic & Cosmetic Surgeon
MBBS, DNB (General Surgery), MCh (Plastic Surgery)
Fellowship in Aesthetic Surgery (Vienna, Austria)

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

◆ వర్షాకాలం నేపథ్యంలో పెనుగంచిప్రోలులో తాగు నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి జి.శ్యాంకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సోమవారం సిబ్బందితో ట్యాంకులను శుభ్రం చేయించారు. పనులను డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు పర్యవేక్షించారు. ◆ పెనుగంచిప్రోలు తూర్పుబజార్‌లో డ్రెయిన్లు శుభ్రం చేయాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి జి.శ్యాంకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ◆ పెనుగంచిప్రోలు తుపానీకాలనీలో వీధి దీపాలు వెలగని విషయాన్ని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి జి.శ్యాంకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే ఎలక్ట్రీషియన్లను పంపించి మరమ్మతులు చేయించారు. - పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

సాగులో సాంకేతికతతో ప్రయోజనాలు

సోమవరం(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: రైతులు సాగులో డ్రోన్ సాంకేతికతను వినియోగించుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. సోమవరం గ్రామంలో సోమవారం రాత్రి సోమవరం గ్రామంలో వ్యవసాయశాఖ 80 శాతం రాయితీపై మంజూరు చేసిన డ్రోన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులు, నానో యూరియా, డీఏపీ ద్రావణాలను పిచికారీ చేయించడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట పొలాలకు మందు పిచికారీ చేయవచ్చని అన్నారు. రైతు సంఘాలు రాయితీలను వినియోగించుకోవాలని కోరారు. ఏడీఏ ఎకే శ్రీనివాస్, ఏవో గింజుపల్లి నాగేశ్వరరావు, నాయకులు కలకొండ విజయబాబు, వీరంకి వీరాస్వామి, తోట నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది : సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఓ ప్రకటనలో హెచ్చరించారు. అధికారంలోకి రాగానే తెదేపా నాయకులను 'రప్పా రప్పా చేస్తా' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెదేపా శ్రేణులు ఎమ్మెల్సీ ఉడత ఊపులకు భయపడబోరని అన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చివరికి ఖమ్మంకు కూడా పరిమితం కాకుండా పోతారని అన్నారు. తమకు సీఎం చంద్రబాబు నేర్పిన సంస్కారం వల్ల సహనంతో ఉన్నామన్నారు. నందిగామ నియోజకవర్గంలో గత ఐదేళ్ల మొండితోక సోదరులు నాశనం చేయడం వల్లే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని తెలిపారు.

నిధుల్లేక.. నీరు రాక

పాడైన వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం

పనిచేయని మోటార్లు, పంపులు

నందిగామ, న్యూస్‌టుడే

వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం మోటార్ల మరమ్మతులకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయిస్తేనే ఆయకట్టుకు సాగు నీరందుతుంది. గత పాలకుల నిర్లక్ష్యంతో పథకం ఆరేళ్లుగా మూలన పడింది. నిధుల లేమితో మోటార్లకు మరమ్మతులు చేయలేదు. విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించలేదు. ఫలితంగా 17 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

◆ నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన ఎన్టీఆర్ చివరి ఆయకట్టులో ఉన్న 36 గ్రామాలకు చెందిన 17 వేల ఎకరాలకు సాగు నీరందించాలని ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. గత తెదేపా ప్రభుత్వంలో మరమ్మతులకు రూ.5.95 కోట్లు కేటాయించడంతో కొన్నాళ్లు పని చేసింది. వైకాపా ప్రభుత్వంలో నిధులివ్వకపోవడం వల్ల మూలన పడింది.

సీఎం హామీతో భరోసా

పీ-4 కార్యక్రమానికి చందర్లపాడు మండలం ముప్పాళ్లకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు వేదాద్రి పథకం దుస్థితిని తీసుకెళ్లారు. రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఏపీఐడీసీ అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. కానీ కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లు వచ్చిన నేపథ్యంలో మళ్లీ అంచనాలు తయారు చేయాల్సి ఉంది. కొత్త అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. పంపిన వెంటనే ఆమోదం తెలపాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్తు బకాయిలు రూ.21 కోట్లు

ఇటీవల వేదాద్రి పథకాన్ని రైతులతో కలిసి మాజీ మంత్రి దేవినేని ఉమా పరిశీలించారు. అనంతరం డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు కలిసి పథకాన్ని శుభ్రం చేయించారు. టెక్నీషియన్లు వచ్చి మోటార్లు, పంపులు పరిశీలించారు. విద్యుత్తు బకాయిలు రూ.21 కోట్లు ఉండడంతో అధికారులు సరఫరా నిలిపివేశారు. సరఫరా ఉంటేనే మోటార్ల పనితీరు పరిశీలించడానికి వీలవుతుంది. బకాయిలను ప్రభుత్వం రద్దు చేసి సరఫరా పునరుద్ధరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఇప్పుడు మరమ్మతులు చేస్తేనే..

పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలి. గత ప్రభుత్వంలో ఉన్న విద్యుత్తు బకాయిలు మాఫీ చేసి సరఫరా పునరుద్ధరించాలి. ఇప్పటినుంచి మరమ్మతులు ప్రారంభిస్తేనే ఈ సీజన్‌లో రైతులకు నీరు అందించేందుకు వీలు పడుతుంది. - **రాటకొండ చంద్రశేఖర్, డీసీ ఛైర్మన్, నందిగామ**

ఆరేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం

ఆరేళ్లుగా పథకం నుంచి సాగునీరు అందక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. అధికారుల ప్రతిపాదనలు పంపిన వెంటనే నిధులు విడుదల చేసి మరమ్మతులు చేయించాలి. - **బండి సైదేశ్వరరావు, ఉపాధ్యక్షుడు, నీటి సంఘం, బండిపాలెం**

'ఊహల్లోనే బతుకుతున్న వైకాపా నాయకులు'

కంచికచర్ల, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు ఇప్పటికీ ఊహల్లోనే బతుకుతున్నారని తెదేపా మండల అధ్యక్షుడు కోగంటి బాబు అన్నారు. ఎమ్మెల్సీ రప్పా రప్పా వ్యాఖ్యలను ఖండిస్తూ కంచికచర్ల తెదేపా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైకాపా ఓడిపోయినా, నందిగామలో తన సోదరుడు ఓడిపోయినా.. తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన అరుణ్‌కుమార్ గతం మరిచిపోయినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. వైకాపా నాయకులు అనవసర ప్రేలాపనలు మానుకోవాలని సూచించారు. మొండితోక బ్రదర్స్ పాలన ముగిసిపోయిందనే విషయం వైకాపా నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగేలా మాట్లాడిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు వేమా వెంకట్రావు, గుత్తా రత్నం, గుర్రం రామకృష్ణ, లక్ష్మణరావు, గుత్తా ఓంకార్, బుడ్డి సూర్యప్రకాష్, వేమా కిశోర్, శేషం కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు బాబు కృషి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. సోమవారం రాత్రి రామిరెడ్డి నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూపర్-6 పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజక వర్గ పరిశీలకులు కలకొండ విజయబాబు, డీసీ జిల్లా కమిటీ సభ్యులు మన్నె కళావతి, తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు బత్తిన రవి, సజ్జా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు హారతి ఇస్తున్న మహిళలు

హామీలు వెంటనే అమలు చేయాలి

కంచికచర్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన ఆర్థిక పరమైన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య డిమాండ్ చేశారు. కంచికచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వ నమోదును సోమవారం ప్రారంభించారు. గొట్టుముక్కల, కంచికచర్ల, పరిటాల, కొత్తపేట, గని ఆత్కూరు, చెవిటికల్లు, బత్తినపాడు, మోగులూరు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గోపాలరావు, మండల శాఖ అధ్యక్షుడు ఎన్.సురేష్ బాబు, జిల్లా మైనార్టీ కన్వీనర్ ఎస్కే ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ఎస్టీయూ నాయకులు

పశుగ్రాసం పెంపకానికి 'ఉపాధి' నిధులు

నందిగామ, న్యూస్‌టుడే: పశుగ్రాసం ఉత్పత్తితో గేదెల పోషణ పెట్టుబడి తగ్గుతుందని నందిగామ డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోజెస్ వెస్లీ తెలిపారు. స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో సోమవారం పశుగ్రాస వారోత్సవాల ముగింపు సందర్భంగా సిబ్బంది, రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పశుగ్రాసం పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు ఇస్తున్నట్టు చెప్పారు. అర ఎకరానికి రూ.33 వేలు పొందవచ్చని తెలిపారు. 75 శాతం రాయితీతో జొన్న విత్తనాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పశుగ్రాసం ఎక్కువగా ఉత్పత్తి అయినప్పుడు దాన్ని సైలేజ్ ఎండు గడ్డిగా నిల్వచేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వెంకట్రావు, పశు వైద్యాధికారి శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ మోజెస్ వెస్లీ

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా నాయకులు నిర్వహించారు. మండల తెదేపా అధ్యక్షుడు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్ బాబు, నల్లపనేని కొండ తదితరులు పాల్గొన్నారు.

బహు జనగణమన పుస్తకావిష్కరణ

జగ్గయ్యపేట గ్రామీణం: ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్ రాసిన బహు జనగణమన అనే దీర్ఘ కవితల పుస్తకాన్ని జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మంచి కవితలు రాసినందున ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

సమస్యలు పరిష్కరించండి

నందిగామ, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఇంజినీరింగ్ కార్మికులు భిక్షాటన చేశారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల వెంట దుకాణాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. కనీస వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ.. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు గోపీనాయక్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, దారెల్లి అశోక్, దాసు, బ్రహ్మం పాల్గొన్నారు.

'విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు'

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ 'రప్పా రప్పా' వ్యాఖ్యలు విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు చీదిరాల భారత రెడ్డి అన్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండించారు. జుజ్జూరులోని తెదేపా మండల కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. జగన్ పరామర్శల పేరిట ప్రజలపై దండయాత్రకు పోతున్నారని ఎద్దేవా చేశారు. నాయకులు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్, కాపా రాంబాబు, గువ్వల సత్యనారాయణ, యర్రగుంట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌పై ఫిర్యాదు

నందిగామ, చందర్లపాడు, న్యూస్‌టుడే: వైకాపా అధికారంలోకి రాగానే తెదేపా కార్యకర్తలను ఉద్దేశించి రప్పా రప్పా చేస్తామంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని నందిగామ పోలీస్‌స్టేషన్‌లో మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, తెదేపా నాయకులు సోమవారం ఫిర్యాదు అందజేశారు. అనంతరం ప్రభుత్వ విప్ సౌమ్య కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తన ఉనికిని కాపాడుకోవడం కోసమే రెచ్చిపోయి మాట్లాడుతున్నారని అన్నారు. నందిగామలో మొండితోక సోదరుల అరాచకాలను గత ఐదేళ్లు అందరూ గ్రహించే ఎన్నికల్లో ఘోరంగా ఓడించారని గుర్తుచేశారు. తెదేపా అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని చెప్పిన అరుణ్ కుమార్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. నాయకులు ఏచూరి రామకృష్ణ, వీరంకి వీరాస్వామి, వడ్డెల్లి సాంబశివరావు, సజ్జ అజయ్, షేక్ కాజా, దారెల్లి బుజ్జి, దాసరి సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై అభిమన్యుకు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు

• ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడారని చందర్లపాడు తెదేపా నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో తెదేపా నాయకులు, కార్యకర్తల ఇళ్ల మీదకు వచ్చి అంతుచూస్తామని మాట్లాడారని పేర్కొన్నారు. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు మేకల సుధాకర్, నాయకులు ఫిర్యాదు అందజేశారు.

వీరులపాడు: ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, అతనిపై చర్యలు తీసుకోవాలని వీరులపాడు ఎస్సై జి.అనిల్‌కు ఐటీడీపీ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారు. పార్టీ వీరులపాడు అధ్యక్షుడు నలమల ఉమామహేశ్వరరావు, ఐటీడీపీ నందిగామ నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్మూరి శేషు, మండల అధ్యక్షుడు శేషు తదితరులున్నారు.

దాడులను ఎదుర్కోవడంపై అవగాహన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ముండ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. సమాజంలో విద్యార్థులపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ సందర్భంగా శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తిటీం ఏఎస్సై బి.హనుమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాత గొడవలు.. ఇద్దరిపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలులో పాత గొడవల నేపథ్యంలో గింజుపల్లి రాజేష్‌పై దాడికి పాల్పడిన సముద్రాల వెంకటేశ్వరరావు, బుజ్జిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అర్జున్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దుర్వాసన భరించలేం.. దోమలతో సతమతం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త వెంటేశ్వరస్వామి దేవాలయం రోడ్డులోని శ్రీలక్ష్మీ బాయి నిలయం వద్ద డ్రెయిన్‌లో పూడిక సరిగా తీయక మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు, దోమల విపరీతంగా పెరిగిపోతున్నాయి. సమస్యను మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షం వచ్చిన సమయంలో డ్రెయిన్‌లో మురుగునీరు ప్రవహించకుండా రోడ్డుపై నిల్వ ఉండి వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇదే ప్రాంతంలో వీధిలైట్లు వెలగక నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. స్తంభానికి ఉన్న వీధిలైటు మరమ్మతుల కోసం తీసుకెళ్లి ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడిక తీసి, స్తంభానికి వీధిలైటు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రెయిన్‌లో మురుగు నీరు నిలిచిపోయిందిలా...

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు

జగ్గయ్యపేట, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ని ఆర్ఎస్ఎస్ సేవావిభాగం ప్రతినిధి నీలిశెట్టి సత్యనారాయణ సోమవారం అందజేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతికత, సంస్కృతి, విలువల బోధన కూడా చేయడం సంతోషదాయకమని సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కె.హేమామాధవి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో కె.బాలకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 9, సర్వే శాఖకు 3, మున్సిపల్, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖకు రెండు చొప్పున మొత్తం 20 అర్జీలు అందాయి. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలేరు ఒడ్డున పునర్నిర్మాణంలో ఉన్న మఠం శివాలయానికి సోమవారం దాతలు విరాళం అందించారు. పట్టణానికి చెందిన మారం శ్రీనివాసరావు-సుభద్ర దంపతులు రూ.11 వేలు, నోముల వెంకటరామకృష్ణ, కుటుంబ సభ్యులు రూ.25 వేలు విరాళం అందించినట్లు మఠం శివాలయం కమిటీ సభ్యులు తెలియజేశారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అరుంధతి సేవా సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రెసిడెంట్ ఎన్.ప్రసాద్ అన్నారు. స్థానిక అరుంధతి నగర్‌కు చెందిన విద్యార్థి జల్లి రాకేష్‌కు సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ల్యాప్‌టాప్ అందజేశారు. సేవా సమితి సభ్యులు ఎం.పోతురాజు, ఐ.నాగేశ్వరావు, వి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ ముక్కోటి మండపంలో సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి వేద పండితులు కల్యాణం చేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



కల్యాణ క్రతువు నిర్వహించిన వేదపండితులు

• ఉదయం సీతారాముల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. తొమ్మిది రోజులుగా వాల్మీకి రామాయణం గురించి మల్లాది వెంకటరామనాథశర్మ (హైదరాబాద్) ప్రవచనం చెప్పారు. కాసుల రాధాకృష్ణశర్మ రామాయణ పారాయణం చేశారు. వేద పండితులు దీవి వెంకటరత్నమాచార్యులు, అధోక్షజా అయ్యంగార్, ధన్వంతరి బృందం స్వామివారిని చందనంతో అలంకరించి స్నపన తిరుమంజనం నిర్వహించారు. పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగానికి భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు.

• నందిగామ సాయిఅయ్యప్ప దేవాలయంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని లక్ష్మీగణపతికి పంచామృతాభిషేకం చేశారు. గరికతో సహస్రనామార్చన చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ శాఖమూరు వంశీధర్, సభ్యులు పాల్గొన్నారు.

• నందిగామ రైతుపేట భగవాన్ సత్యసాయి మందిరంలో ఆదివారం రాత్రి మహిళలు అష్టోత్తర భజనలు నిర్వహించారు. భగవాన్ సత్యసాయి సేవాదళ్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. స్థానిక సేవా సమితి కన్వీనర్ యు.వాసుదేవరావు, చంద్రిక దంపతులు జ్యోతి వెలిగించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, వాసవీ మాత మందిర నూతన పాలకవర్గ సభ్యులను సన్మానించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరాం అమ్మాణి కళాశాల సమీపంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూటై ఆదివారం రాత్రి స్మార్ట్ మీటర్‌తో పాటు విద్యుత్తు తీగలు కూడా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. దీని వల్ల ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని ఇళ్లలో రాత్రి విద్యుత్తు సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వెంటనే అక్కడికి చేరుకొని అధికారులకు సమాచారం అందించి సమస్య పరిష్కరించాలన్నారు. అధికారులు మరమ్మతులు చేసి సోమవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. సమస్యలపై విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేసినా సరిగా స్పందించడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

కాలిపోతున్న స్మార్ట్ మీటర్, తీగలు

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని ఆందోళన

కంచికచర్ల, న్యూస్‌టుడే: సామాన్యుడికి భారంగా మారిన విద్యుత్తు ఛార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మందా వజ్రయ్య డిమాండ్ చేశారు. విద్యుత్తు ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ కంచికచర్ల విద్యుత్తు ఉపకేంద్రం వద్ద సోమవారం ఆందోళన చేశారు. గత ప్రభుత్వం ట్రూఅప్ పేరుతో విద్యుత్తు ఛార్జీలను పెంచి ప్రజలను దోచుకుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించడమే కాకుండా, సామాన్యులు మోయలేని భారం మోపడం తగదన్నారు. నాయకులు పీటర్ జోసెఫ్, అబ్దుల్ అన్సారీ, కొఠారు రవి బాబు, తోట గోపాలరావు, సూదుల పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు మృతికి నివాళి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు గన్నవరపు అప్పారావు(82) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన స్థానిక శివాలయానికి 12 సెంట్లు, వాణిజ్యమండలికి ఆరున్నర సెంట్లు విరాళంగా అందజేశారు. హిందూ శ్మశాన వాటికలో కర్మల సత్రం నిర్మించారు. ఉన్నత పాఠశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే జగన్మోహన్‌రావు, మాజీ సర్పంచి శాఖమూరు స్వర్ణలత, తెదేపా, వైకాపా నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయిని..

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయిని పి.వెంకటసత్యవతి (72) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమెకు వివాహం కాలేదు. నందిగామ, వీరులపాడు మండలం జమ్మవరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వర్తించారు. ఆమె మృతికి మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, తెదేపా, వైకాపా నాయకులు నాయకులు సంతాపం తెలిపారు.

తిరుపతమ్మకు ఆషాఢ సారె సమర్పణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారికి సోమవారం పలు గ్రామాలకు చెందిన భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అనిగండ్లపాడుకు చెందిన శివసాయి సేవా సమితి భక్త బృంద సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. నందిగామ మండలంలోని చెర్వుకొమ్ముపాలెం, హనుమంతుపాలెం, మునగచర్ల, జగ్గయ్యపేట మండలం గౌరవరానికి చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాస్, సర్పంచి వేల్పుల పద్మకుమారి, శివసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, దేవస్థానం మాజీ పాలకవర్గ సభ్యుడు కోలా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సారెతో అనిగండ్లపాడు భక్తులు

ఎన్నికల మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వేదాద్రి పావన కృష్ణానది తీరంలో వేంచేసియున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య.. పట్టణానికి చెందిన గణేష్ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకొని మొక్కు తీర్చుకున్నారు. 2024 ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, శ్రీరాంతాతయ్య ఎమ్మెల్యే అవ్వాలని సభ్యులు స్వామికి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు, శ్రీరాంతాతయ్య స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• పట్టణంలోని 24వ వార్డు మిట్టగూడెంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించి స్థానికులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందిస్తున్న శాసనసభ్యుడు తాతయ్య, నాయకులు

(c) eenadu

విజయవాడ పశ్చిమ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్: 90320 99986

స్పందనకు వందనం

★ చిట్టినగర్ లంబాడీపేట మురుగు కాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. సమస్య ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.
★ కేఎల్‌రావు పార్కుకు వెళ్లే రహదారి మార్గంలో గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన సర్కిల్-1 ఇంజినీరింగ్ అధికారులు కార్మికులతో గుంతలు పూడ్చారు. ★ సొరంగ మార్గం గంగానమ్మ ఆలయం నుంచి మస్తానయ్య వీధికి వెళ్లే మార్గంలో మురుగు కాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. ★ గొల్లపూడి డీమార్ట్ ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ ఆవరణలో పూడిక పేరుకుపోయి మురుగు రోడ్డుపై పొంగి పొర్లుతుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.
★ చిట్టినగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న వీధిలో రామాలయం మురుగు కాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, వన్‌టౌన్

? చెరువు సెంటర్ నారింజవారి వీధిలో చెత్త డబ్బాలలోని చెత్త తరలించడం లేదు. - తేజస్విని, స్థానికురాలు ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - డి.రాజు, శానిటరీ అధికారి
? సీవీఆర్ పైవంతెన పక్కనే ఉన్న కాళేశ్వర భగవాన్ ఆశ్రమం రోడ్డు మార్గం బురదమయంగా ఉంది. - కుమార్, స్థానికుడు
✔ పరిశీలిస్తాం. - సురేఖ, సర్కిల్-1, ఈఈ
? విద్యాధరపురం నాలుగు స్తంభాల కూడలిలో కళ్ళలు విపరీతంగా ఉన్నాయి. - సుజాత, స్థానికురాలు
✔ చర్యలు తీసుకుంటాం. - సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి ? భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో పలువురు ఆకతాయిలు బైక్ రేసులు నిర్వహిస్తున్నారు. - వేణు, స్థానికుడు
✔ సమస్య మా దృష్టికి వచ్చింది. చర్యలు తీసుకుంటాం. - ఉమామహేశ్వరావు, సీఐ, భవానీపురం ? రథంసెంటర్ ప్రధాన రహదారి మార్గంలో రథం స్టాండ్ వద్ద చెత్త తరలించడం లేదు. - వాసవి, స్థానికుడు ✔ చెత్త తరలిస్తాం. - యోగేంద్ర, శానిటరీ అధికారి - న్యూస్‌టుడే, వన్‌టౌన్

గవర్నర్‌గా నియామకంపై ఎమ్మెల్యే అభినందనలు

భవానీపురం, న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి అభినందనలు తెలిపారు. గోవా అభివృద్ధిలో గజపతిరాజు భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. అంకితభావం, కృషి ద్వారా విజయాలను సాధించాలన్నారు.
వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ కేంద్రమంత్రి అశోకగజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడంపై గొల్లపూడి మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ మైలవరపు రాజు హర్షం వ్యక్తం చేశారు. పాతబస్తీ వించిపేట లోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... మాన్సాస్ ట్రస్టు ద్వారా వేల మంది పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

లోపాలు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు, ఆటంకాలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. బందరు రోడ్డు, బెంజిసర్కిల్, జాతీయ రహదారి, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, కరెన్సీనగర్, గుణదల, బీఆర్టీఎస్ రోడ్డు, గులాబీతోట, నాజీవీధిరోడ్డు, పాతబస్తీ, గణపతిరావు రోడ్డు, సీవీఆర్ పైవంతెన ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ హామీ మేరకు వెంటనే వేతనాలు పెంచాలని, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుమూడి మధుబాబు మంత్రి నారాయణను కోరారు. యూనియన్ నాయకులతో పాటు వెళ్లి మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జీవిత ప్రకటన విడుదల చేసేందుకు కార్మికుల సమ్మె విరమించారని తెలిపారు. అయినప్పటికీ వేతనాలు పెంచడం కానీ, పథకాల అమలుకు చర్యలు తీసుకోవడం కానీ చేయలేదని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ప్రకటన రాలేదని తెలిపారు. కార్మికుల సమస్యలపై ఈనెల 19వ తేదీలోపు ప్రభుత్వపరంగా ప్రకటన విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్మిక సంఘం నాయకులు సుమన్, కోటిబాబు, యేసుబాబు, రమాదేవి, కోటేశ్వరమ్మ, ఎస్తేరు, కుమారి పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

క్రీడల్లో రాణిస్తూ.. విజయాలు సాధిస్తూ..

చిట్టినగర్, న్యూస్‌టుడే

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడాంశాల్లో కూడా ప్రావీణ్యం అవసరమని గుర్తించారు. ఒక పక్క ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తూనే మరొక పక్క క్రీడలను వదలకుండా ముందుకు సాగుతున్నారు. కళాశాల యాజమాన్యం, క్రీడావిభాగాధిపతి విక్టర్ జాన్సన్ ప్రోత్సాహంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ తమ ప్రతిభను ప్రదర్శిస్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్న పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు 'న్యూస్‌టుడే'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

భవిష్యత్తుకు ఉపయోగం

నేను గుంటూరు జిల్లా మంగళగిరిలో తల్లిదండ్రులు సుందరమూర్తి, అన్నపూర్ణలతో కలిసి ఉంటున్నాను. 18 ఏళ్లగా ఈతలో బ్రెస్ట్‌స్ట్రైల్, ఫ్రీస్టైల్ విభాగాల్లో సాధన చేస్తున్నాను. ఇంజినీరింగ్‌లో చేరినప్పుడు క్రీడావిభాగాధిపతి విక్టర్ జాన్సన్ తల్లిదండ్రులతో మాట్లాడి పూర్తి సహకారం అందించడంతో మళ్లీ ఈతలో సాధన ప్రారంభించాను. రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు-12, రజతం-6, కాంస్యం-4 సాధించాను. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడాలనేది భవిష్యత్తు లక్ష్యం. - సుందరమూర్తి వర్ష, బీటెక్ ఫైనలియర్

ఒలింపిక్స్‌లో పతకం లక్ష్యం

నేను అమ్మానాన్నలు వెంకటరత్నం, రాజేశ్వరిలతో కలిసి గుంటూరు జిల్లా, మంగళగిరిలో ఉంటున్నాను. కరాటే అంటే ఆసక్తితో 5వ తరగతి చదువుతున్న సమయంలోనే శిక్షణకు చేరాను. పదేళ్లుగా సాధన చేస్తున్నాను. పలు పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో బంగారు పతకాలు-13, రజతం-8, కాంస్యం-4 సాధించాను. 2017, 2022లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కుమితే, కటా విభాగాల్లో బంగారు పతకాలు-2, రజతం-1 కైవసం చేసుకున్నాను. ప్రస్తుతం బ్లాక్ బెల్టు-2 స్థాయిలో ఉన్నాను. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించాలనే లక్ష్యం. - జొన్నాదుల మోహనసాయి, బీటెక్ సెకండియర్

గ్రాండ్ మాస్టర్ కావాలి

నేను పటమటలో ఉంటున్నాను. చదరంగంపై మక్కువ చూపడంతో అమ్మానాన్నలు సుబ్రహ్మణ్యం, దుర్గా మల్లేశ్వరి గుర్తించి శిక్షణలో చేర్పించారు. మంచి రేటింగ్ పాయింట్లతో పాటుగా పలు మెడల్స్ సాధించాను. జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం చెస్ జట్టు తరఫున 2024-25లో చెన్నై వెల్‌టెక్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సౌత్ జోన్ చెస్ పోటీల్లో పాల్గొని నగదు బహుమతి అందుకున్నా. భవిష్యత్తులో గ్రాండ్‌మాస్టర్ కావాలనేది లక్ష్యం.
- కనగట్ల గుణశేఖర్ సాయికృష్ణ, బీటెక్ సెకండియర్

ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ అవసరం

ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల ప్రదర్శన

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగంపై స్వచ్ఛంద నియంత్రణ పాటించాలని కోరుతూ జెబావర రాజారావు హైస్కూల్ విద్యార్థులు విద్యాధరపురంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లకార్డులతో 'ప్లాస్టిక్ వద్దు.. కాగితం సంచులు ముద్దు' అంటూ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో 17(ఎ) బీఎన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ పాండే హవల్దార్ ధనవీర్, పాఠశాల కార్యదర్శి శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపల్ ప్రసన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ. 2,21,116 విరాళాలను సోమవారం అందజేశారు. కానూరుకు చెందిన పుట్టమనేని నవీన్‌కుమార్ రూ. 1,20,000, కొసినేని నాగేశ్వరరావు రూ. 1,01,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి విరాళం రశీదులతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాత నాగేశ్వరరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దాత నవీన్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

భక్తిశ్రద్ధలతో హోమాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై సంకట హర చతుర్థిని పురస్కరించుకొని యాగశాలలో ప్రత్యేక హోమాలను రుత్విక్కులు సోమవారం నిర్వహించారు. లోక కల్యాణం కోసం లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో దేవస్థానం ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

ఎల్ఓసీ పత్రాన్ని ఇస్తున్న శ్రీధర్

భవానీపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి భవానీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రసాద్ శ్రీధర్ సోమవారం అందజేశారు. 37వ డివిజన్‌కు చెందిన లలితాదేవికి రూ. 2.25 లక్షలు, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పాతరాజరాజేశ్వరీపేటకు చెందిన రామకృష్ణకు రూ.1.8 లక్షలు, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ 51వ డివిజన్ వాగు సెంటర్‌కు చెందిన కె.చెంగింహకుమార్‌కు రూ.8 లక్షల ఎల్ఓసీ పత్రాలను అందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి 17 వినతులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వివిధ సమస్యలపై నగర ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలపై 17 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని తెలిపారు. అనేక సమస్యలను తాత్కాలికంగా పరిష్కరిస్తున్నందున అవే సమస్యలు తిరిగి ఉత్పన్నం అవుతున్నాయని, అది విధానం కాదని అన్నారు. ఇకపై శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, శ్రీనాథ్‌రెడ్డి, అర్జునరావు, పి.సృజన, లత, పి.సత్యకుమారి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పీఎం కౌశల్ వికాస్ పథకంపై అవగాహన

చిట్టినగర్, న్యూస్‌టుడే: యువతలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపు వంటి కార్యక్రమాలను భారత ప్రభుత్వం నిర్వహిస్తుందని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి పేర్కొన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల ఎన్‌సీసీ, కంప్యూటర్ విభాగాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం, కౌశల్ వికాస్ రోజ్‌గార్ యోజనపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పథకాల పట్ల ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 17వ ఆంధ్రా బెటాలియన్ ట్రైనింగ్ జేసీవో సుబేదారు భూపాల్ రెడ్డి, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ కృష్ణవేణి

దుర్గంధ భరితం

❑ బస్‌స్టేషన్‌లో ఉచిత మూత్రశాలల నిర్వహణ ఇలా

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే

పండిట్ నెహ్రూ బస్ స్టేషన్(పీఎన్‌బీఎస్)లో ఉచిత మూత్రశాలలు నామమాత్రంగా తయారయ్యాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే బస్ స్టేషన్‌లో ఉచిత మూత్రశాలలు ఉన్నాయని ఇక్కడ కనీసం సింక్‌లు, నీటి సౌకర్యం ఏమాత్రం లేవని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆసియాలోనే అతి పెద్ద బస్‌స్టేషన్.. రాజధాని ప్రాంతానికి దగ్గర కావడంతో నిత్యం సుమారు మూడువేల బస్సులు, లక్షన్నర మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పండగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. ఇంత రద్దీగా ఉండే పీఎన్‌బీఎస్‌లో గతంలో నాలుగు ప్రదేశాల్లో ఉచిత మూత్రశాలలు ఉండేవి. ప్రస్తుతం రెండు చోట్ల మాత్రమే ఉచిత మూత్రశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణను బస్ స్టేషన్‌లోని పెయిడ్ మూత్రశాలల నిర్వహించే వారు చూడాలి. వీటిల్లో నీటి సౌకర్యం లేదు. సింక్‌లకు కుళాయి కనెక్షన్‌లు.. వాటికి అమర్చిన పైపులు లేవు. సింక్‌లు పగిలిపోయి అధ్వానంగా ఉన్నాయి. తీవ్ర దుర్వాసన వస్తుండడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుళాయి లేకుండా ఇలా..

సింక్‌లు పగిలిపోయి

మురుగు నీటితో జనం బెంబేలు

పాతబస్తీ వించిపేట, ఎర్రకట్ట పైవంతెన, పూలబావి వీధి, కొత్తపేట నెహ్రూబొమ్మ కూడలి ప్రాంతాల్లో సోమవారం రంగుమారిన, దుర్వాసనతో కూడిన మంచి నీరు సరఫరా అయింది. ఉదయం-సాయంత్రం వేళల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు వాపోతున్నారు. మంచినీటి విభాగం అధికారులకు పలుమార్లు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా స్పందన లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వన్‌టౌన్

నాటేందుకు 5 వేల మొక్కలు సిద్ధం

కేఎల్‌రావుపార్కు పచ్చదనంతో పరిఢవిల్లనుంది. నగరంలో రాజీవ్‌గాంధీ పార్కు అనంతరం కేఎల్‌రావునగర్ పార్కు పెద్దది. దీనిలో సుమారు రూ. 6 లక్షలతో 5 వేల మొక్కలు పార్కులో నాటనున్నారు. ప్రధానంగా పార్కు ప్రవేశ ద్వారం వద్ద కేఎల్‌రావు విగ్రహం, తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేశారు. వాటి ముందు ఒక వనం మాదిరిగా ఈ మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క మొక్క రూ.8 వేలు ఖరీదు చేసేవి కూడా ఈ పార్కులో నాటుతున్నారు. ఫైకస్ 8 బాల్స్, పాంగ్ పాంగ్, ఫైరాబాక్, డ్రసీనా, గాల్ ఫీమియా, లెమన్‌గ్రాస్, అరేలియా, ఈఫోర్‌బీ, సాంగ్ ఆఫ్ ఇండియా (గోల్డు), గన్నేరు ఇలా అనేక రకాల మొక్కలు ఇప్పటికే చేరుకున్నాయి. పార్కు అన్ని చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

పార్కులో నాటే పూల మొక్కలు

రోటరాక్ట్ సేవలు అభినందనీయం

చిట్టినగర్, న్యూస్‌టుడే: సమాజ సేవలో రోటరాక్ట్ క్లబ్ ముందు వరసలో ఉందని, ఆ క్లబ్ అందించే సేవలు అభినందనీయమని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల మాజీ కార్యదర్శి రావూరి సుబ్బారావు అన్నారు. ఆ కళాశాల 16వ రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీఎస్‌సీఎంఆర్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న క్లబ్ అధ్యక్షుడు ఎన్.డి.శశాంక్, కార్యదర్శి చల్లా హరి, కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అమర్‌సుధీర్, సహాయ కార్యదర్శి పవన్‌కుమార్, ప్రిన్సిపల్ శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఓ భామ అయ్యో రామ, కుబేరా, తమ్ముడు: జయరామ్, జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), **తమ్ముడు:** శైలజ, **ఓ భామ అయ్యో రామ:** జయరామ్, **కుబేరా:** అలంకార్, **ది 100:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), **వర్జిన్ బాయ్స్:** స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), పీవీపీ మాల్(బందరు రోడ్డు), సాయిరామ్(వన్‌టౌన్), **దీర్ఘాయుష్మాన్‌భవ:** పీవీఆర్ మాల్(బందరురోడ్డు), **మార్గన్, కన్నప్ప, 3బీహెచ్‌కే:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), సాయిరామ్, స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) - న్యూస్‌టుడే, వన్‌టౌన్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెదేపా 55, 56వ డివిజన్‌ల క్లస్టర్ ఇన్‌ఛార్జి ధనేకుల వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. పాతబస్తీ పాతరాజరాజేశ్వరీపేటలో సోమవారం నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 60 కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనేకుల వెంకటహరికృష్ణ, కొప్పిరెడ్డి, కె.బడేషా, తడిసం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

ఫొటోగ్రఫీపై విద్యార్థులకు కార్యశాల

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఒక విషయం గురించి వ్యక్త పరచలేని అంశాన్ని ఓ చిత్రం ద్వారా చూపించవచ్చని హిందూ హైస్కూల్స్ పరిపాలనా అధికారి వి.నారాయణరావు సూచించారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో డ్రమెటిక్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్, కేఎంటీ అకాడమీ ఆఫ్ విజన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించే కార్యశాల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్లు కనిపెట్టలేని సున్నిత దృశ్యాలను కెమెరా కన్ను పసిగడుతుందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు ఫొటోగ్రఫీ నైపుణ్యం తోడైతే అద్భుతమైన చిత్రాలు తీయడం సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, రిసోర్స్ పర్సన్, ధీనారాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏవో నారాయణరావు, వేదికపై ప్రిన్సిపల్ తదితరులు

విద్యుత్తు భారాలపై పోరుబాట

కేఎల్‌రావునగర్ విద్యుత్తు ఉపకేంద్రం వద్ద సీపీఎం ఆందోళన

చిట్టినగర్, న్యూస్‌టుడే: డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రజలపై మోయలేని విధంగా విద్యుత్తు భారాల మోత మోగిస్తుందని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు అన్నారు. విద్యుత్తు భారాలపై కేఎల్‌రావునగర్ విద్యుత్తు ఉపకేంద్రం వద్ద సీపీఎం పోరుబాట కార్యక్రమం సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో అదానీకి వరంగా మారిందని అన్నారు. విద్యుత్తు రంగం పరిరక్షణకు, ప్రజలపై భారాలకు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమ పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రజలు ఇచ్చిన అభ్యంతరాలను ఏఈకి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సూరిబాబు, గురప్ప, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అత్తయ్య అదృశ్యంపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: అత్తయ్య కనిపించడం లేదని కోడలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డులో కోడలు భాగ్యలక్ష్మి, అత్త మేకల రత్తమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈనెల 6న రత్తమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి కనిపించడం లేదని..

భవానీపురం, న్యూస్‌టుడే: తండ్రి కనిపించడం లేదని కుమారుడు భవానీపురం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... గొల్లపూడి గాంధీబొమ్మ సెంటర్ వద్ద కొండవీటి నాగభూషణం, కుమారుడు రవితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈనెల 5న నాగభూషణం వ్యక్తిగత పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుమారుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

స్నేహితుడి కుమారుడు దాడి చేశాడని..

భవానీపురం, న్యూస్‌టుడే: స్నేహితుడి కుమారుడు కొట్టాడంటూ ఒక వ్యక్తి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... భవానీపురం స్వాతిరోడ్డులో వెంకట దుర్గాప్రసాద్(55) లారీ క్లీనర్.. కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతనికి దివాకర్ అనే స్నేహితుడు ఉన్నాడు. దివాకర్ కుమారుడు తరుణ్‌గాంధీ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆటోను టూటౌన్ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. ఆటో విడిపించేందుకు ష్యూరిటీగా పత్రాలు ఇవ్వాలని వెంకట దుర్గాప్రసాద్‌ను కోరాడు. దీనికి ఆయన నిరాకరించాడు. ఈనెల 12న దుర్గాప్రసాద్ హెచ్‌బీకాలనీ అప్పాబజారు వద్ద ఉండగా కింద పడేసి ముఖంపై తరుణ్‌గాంధీ కొట్టాడు. దీంతో దుర్గాప్రసాద్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యవేక్షణ లేక.. పచ్చదనం పడక

నగరపాలక సంస్థ, భవానీపురం, న్యూస్‌టుడే

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. నగర పాలకులు, అధికారుల తీరుతో ఆ ప్రక్రియ పడకేస్తోంది. నగరంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని చెబుతున్నా.. బాధ్యులు లక్ష్య పెట్టడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఏటా 20 నుంచి 50 వేల మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా, కనీసం 5 నుంచి 10 వేల మొక్కలు కూడా నాటడం లేదు. వాటినవి సంరక్షించడంలో కూడా విఫలం అవుతున్నారు.

✤ ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం సందర్భంగా మూడు నియోజకవర్గాల్లో 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం విధించగా, వెయ్యి మొక్కలు కూడా నాటలేదు.

ఎండిపోతున్న డివైడర్ల వెంట మొక్కలు

అంతర్గత రహదార్ల వెంట మొక్కలు నాటి గార్డులు అమర్చి, సంరక్షణ బాధ్యత స్థానికులకు అప్పగించే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా మొక్కలు నాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఉద్యాన విభాగం శ్రద్ధ పెట్టడం లేదు. పెరిగిన చెట్లను తీగలకు తగులుతున్నాయని విద్యుత్తు శాఖ అధికారులు నరికేయడంతో మోడువారుతున్నాయి.

నిర్వహణ ఖర్చు (రూ.కోట్లలో)	
ఏడాది	సొమ్ము
2022	1.25
2023	1.40
2024	1.50
2025	1.80

కొత్తవి నాటడంలో విఫలం

✤ నగరంలోని డివైడర్లు, గ్రీన్‌బెల్ట్‌ల వెంట నాటిన మొక్కలు, గ్రీన్‌గ్రాస్ ఎండిపోతోంది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులోని కొంత భాగంలో డివైడర్లపై పచ్చదనం కళావిహీనంగా ఉంది. పైపుల రోడ్డు, ఆంధ్రప్రభ కాలనీ, అయోధ్య నగర్, రైల్వే స్టేషన్, కేదారేశ్వరపేట, లోటస్ ల్యాండ్ మార్కు, గుణదల, అంబేడ్కర్ రోడ్డు, కేటీ రోడ్డు, బైపాస్ రోడ్డు, క్రాంబే రోడ్డు, సింగ్‌నగర్, పటమట ప్రాంతాల్లోని డివైడర్లపై పచ్చదనం చాలావరకు పాడైపోయింది.

✤ కార్పొరేషన్ పరిధిలోని నర్సరీల నిర్వహణకు రూ. లక్షలు కేటాయిస్తున్నా.. ఫలితం లేదు. ఈ ఏడాది నర్సరీల కోసం రూ. 23.50 లక్షలు కేటాయించగా.. అధికారులు శ్రద్ధ చూపడం లేదు. నగరంలోని నర్సరీలు అలంకార ప్రాయంగా మారాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పార్కుల నిర్వహణకు రూ. 38 లక్షలు, నీరు-చెట్టు ఎవెన్యూ ప్లాంటేషన్‌కు రూ. 8 లక్షలు, ఎకో పార్కుల అభివృద్ధికి రూ. 19 లక్షలు, పచ్చదనం నిర్వహణకు రూ. 8 లక్షలు, ట్రీగార్డులకు రూ. 15.50 లక్షలు కేటాయించినా... ఆ మేరకు ఫలితం కనిపించలేదు. కొన్నాళ్లుగా 2.50 లక్షల మొక్కలు నాటినట్లు చెబుతున్నా.. 1.40 లక్షలు మాత్రమే బతికినట్లు ఇటీవల గుర్తించారు. వర్షాకాలంలో మొక్కలు నాటే ప్రణాళిక ఉన్నా.. అధికారులు ఇంకా చర్యలు తీసుకోవడం లేదు.

విజయవాడ మధ్య

‘మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి’

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లి పరిధిలోని పోలవరం కాలువలో మట్టి అక్రమ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మెండెం జమలయ్య సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.ఇలక్కియాకు ఫిర్యాదు చేశారు. వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తాడేపల్లి మామిడి తోటలో నిల్వ చేశారని పేర్కొన్నారు. తవ్వకాలు చేసిన వాహనాలను సీజ్ చేసి, కోర్టుకు అప్పగించాలని, సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

63036 11232

? అరండల్‌పేట మహబూబ్ సుభాని కాలనీలోని విద్యుత్తు పోల్ (నం: 25/96/164)కు దీపం సరిగా వెలగడం లేదు. చెట్టు కొమ్మలు అడ్డుగా ఉండడంతో వెలుతురు రావడం లేదు. **- స్థానికులు**

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
- ఎం.బాలసుబ్రహ్మణ్యం, ఏఈ, వీఎంసీ

– న్యూస్‌టుడే, సీతారాంపురం

గ్రంథాలయానికి బీరువా వితరణ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆర్అండ్‌బీలో ఇంజినీర్లుగా పనిచేస్తున్న ముక్కొల్లు హరిబాబు, శశిరేఖ దంపతులు ఠాగూర్ గ్రంథాలయానికి రూ.20వేల విలువైన గ్లాస్ డోర్ ఇనుప బీరువాను వితరణగా అందించారు. సోమవారం గ్రంథాలయాధికారిణి కె.రమాదేవికి అందించారు. అలాగే వారు సేకరించిన పుస్తకాలు అందజేశారు. దాతలను రమాదేవి శాలువా కప్పి సత్కరించారు.

మధ్యవర్తిత్వ కేంద్రాలతో వివాదాల పరిష్కారం

స్వరాజ్యమైదానం వద్ద అవగాహన ప్రదర్శన

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఇద్దరి మధ్య ఉన్న వివాదాన్ని తటస్థ వ్యక్తుల సమక్షంలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ పేర్కొన్నారు. దీనిపై సోమవారం విజయవాడ న్యాయస్థానాల సముదాయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉందని, వాటి పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో మధ్యవర్తిత్వం ద్వారా ఇద్దరికీ ఆమోదయోగ్యమైన రీతిలో కేసులు పరిష్కరించేందుకు సుప్రీం కోర్టు, మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. వీటిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని వివరించారు. ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించడంతో ఒకరు గెలిచి నట్లు మరొకరు ఓడినట్లు కాదని.. ఇద్దరూ గెలిచినట్లేనన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కృష్ణా జిల్లా మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. సెక్షన్ 89 సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం వ్యాజ్యాలను మధ్యవర్తిత్వ కేంద్రాలకు పంపుతారని.. అక్కడ వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. స్వరాజ్య మైదానంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, బీబీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కె.బాషా, కె.వి.రంగారావు, ఉపాధ్యక్షుడు పిల్లా శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం బాధ్యత అధికారులదే

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వివిధ సమస్యలపై నగర ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరించే బాధ్యత ఆయా విభాగాల అధికారులు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలపై 17 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని తెలిపారు. అనేక సమస్యలను తాత్కాలికంగా పరిష్కరిస్తుండడం వల్ల సమస్యలు తిరిగి ఉత్పన్నం అవుతున్నాయని, అవి సరైన విధానం కాదని అన్నారు. జవాబు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, శ్రీనాథ్‌రెడ్డి, అర్జునరావు, పి.సృజన, లత, పి.సత్యకుమారి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ హామీ మేరకు వెంటనే వేతనాలు పెంచాలని, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదు లమూడి మధుబాబు మంత్రి నారాయణను కోరారు. యూనియన్ నాయకులతో పాటు వెళ్లి మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇటీవల ప్రకటన విడుదల చేసినందుకు కార్మికులు సమ్మె విరమించారని తెలిపారు. అయినప్పటికీ వేతనాలు పెంచడం కానీ, పథకాల అమలుకు చర్యలు తీసుకోవడం కానీ చేయలేదని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ప్రకటన రాలేదని తెలిపారు.

సుందరీకరణకు ఎదురుచూపులు..!

మధురానగర్, న్యూస్‌టుడే

ఆహ్లాదానికి దూరంగా కాలువగట్లు

మధురానగర్ కాలువ గట్టును ఖాళీ చేయించి వదిలేశారిలా...

నగరంలో ప్రభుత్వ స్థలాలకు కొరత ఎక్కువ. ఏదైనా అభివృద్ధి పని చేయాలన్నా.. గజం స్థలం దొరకడం లేదు. కాలువ గట్లే దిక్కు. బందరు, ఏలూరు, రైవస్, బుడమేరు కాలువల వెంబడి రూ.కోట్ల విలువైన స్థలాలు ఉన్నాయి. ఇవి నిర్లక్ష్యానికి గురై.. చెత్తా చెదారాలకు నిలయంగా మారాయి. వీటిని సుందరీకరిస్తే.. ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

కబ్జాదారుల నుంచి కాపాడినా...

విజయవాడ నగరంలో కాలువగట్లు స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. పలు ప్రాంతాల్లో ఆక్రమణలపై ‘ఈనాడు’లో కథనాలు వెలువడంతో అధికారులు స్పందించారు. దేవీనగర్, మధురానగర్‌లో ఏళ్ల తరబడి ఉన్న ఆక్రమణలను ఎట్టకేలకు తొలగించారు. కబ్జాదారుల కోరల నుంచి విలువైన స్థలాలను కాపాడారు. వాటికి ఫెన్సింగ్ వేశారు. కానీ అభివృద్ధి చేయకుండా అలాగే వదిలేశారు.

: సీతారాంపురంలో ఇలా..

నిర్లక్ష్యానికి నిదర్శనం..

సీతారాంపురంలో దాదాపు 2 కిలోమీటర్ల మేర కాలువగట్టుపై వాకింగ్ ట్రాక్ పనులు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. తర్వాత వాటిని అర్ధంతరంగా నిలిపివేశారు. ఆ స్థలాలను స్థానికులు డంపింగ్ యార్డ్‌గా, దుస్తులు ఆరేసుకునేందుకు, పార్కింగ్ స్థలాలుగాను వాడుకుంటున్నారు. మధురానగర్‌లో ఏలూరు కాలువగట్టు పరిస్థితి ఇలాగే ఉంది. ఆక్రమణదారుల బారి నుంచి గత ఏడాది కాపాడినా.. దాని అభివృద్ధికి చొరవ చూపడం లేదు. తుక్కు వ్యాపారులు మరలా అక్కడ చెత్త వేసి మురికి కూపంగా మారుస్తున్నారు. దేవీనగర్‌లో బుడమేరు గట్టుపై పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది.

వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తే మేలు

నగరంలో వాకింగ్ చేసేందుకు నగరవాసులకు స్థలాలు లేవు. వారికి కాలువగట్లే దిక్కు. చాలా ప్రాంతాల్లో కాలువగట్లను అభివృద్ధి చేశారు. పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. కానీ దేవీనగర్, మధురానగర్, సీతారాంపురంలో పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతాలపై శీతకన్నేశారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి.. యుద్ధప్రాతిపదికన వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మధురానగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు మంగళవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు నేతాజీకాలనీ, రమాదేవి స్కూలు రోడ్డు, బావి రోడ్డు, తుంగం కోటేశ్వరరావు వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు.

శుభ్రతలో బెజవాడ ఆదర్శం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ‘స్వచ్ఛ సర్వేక్షణ్-2025’ సర్వేలో విజయవాడ నగరం దేశంలోనే అత్యంత శుభ్రత కలిగిన నగరాల్లో నాలుగో స్థానంలో నిలిచి రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండోర్, ముంబయి వంటి నగరాలతోపాటు ప్రతిష్ఠాత్మక ర్యాంకింగ్‌లో చోటు దక్కించుకోవడం విశేషమన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీ(జీఎఫ్‌సీ)లో విజయవాడకు 7 స్టార్ రేటింగ్ లభించిందన్నారు. రాష్ట్రంలో ఏ నగరానికీ ఇంతవరకూ లభించని ఈ గౌరవం విజయవాడకు దక్కిందని పేర్కొన్నారు. ప్రజల సహకారం, అధికారుల కృషి ఫలితమని అభినందించారు. ఇప్పటికే నగర పాలక సంస్థ తడి, పొడి చెత్తను విడిగా సేకరించడమే కాకుండా, అజిత్‌సింగ్‌నగర్ డంప్ యార్డులో చెత్తను శుద్ధిచేసి విద్యుత్తు ఉత్పత్తికి గుంటూరు జిందాల్ సంస్థకు పంపుతున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో రెండు లక్షల టన్నుల చెత్తను బయో మైనింగ్ ద్వారా ప్రాసెస్ చేసి తరలించామన్నారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు అభినందనలు తెలిపారు.

పేదలకు కూటమి ప్రభుత్వం అండ

తోపుడు బండ్లు అందిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : పేదల అభ్యున్నతే లక్ష్యంగా.. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన పేద, చిరు వ్యాపారులకు 36 తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక, గాంధీనగర్, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేస్తున్నవారి ఆర్థిక స్థిరత్వం కోసం పీ4 కార్యక్రమంలో భాగంగా తమ సొంత నిధులతో తోపుడు బండ్లు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గంటా కృష్ణమోహన్, డివిజన్ అధ్యక్షుడు కాకొల్లు రవికుమార్, లబ్బా వైకుంఠం, ప్రధాన కార్యదర్శి కోలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : వ్యాపారులు తమ దుకాణాల ముందు.. రోడ్డుపై సామగ్రి పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మూడో ట్రాఫిక్ సీఐ కొత్తూరు కిశోర్‌బాబు హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సోమవారం వర్తక సంఘం సభ్యులు, వ్యాపారులు, వీధి వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారి బయట కాకుండా దుకాణాల్లో మాత్రమే సరకు ఉంచాలని సూచించారు. వీధుల్లో తోపుడు బండ్ల తొలగింపు బుట్టల విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. శారద జంక్షన్ నుంచి శివాజీ కేఫ్ వరకు వాహనాల రాకపోకలపై వన్ వే కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆటోలు, ఇతర త్రీ వీలర్స్.. గిరి వీధి, పార్కు వీధి లేదా భగత్‌సింగ్ వీధి నుంచి మాత్రమే లోపలికి రావాలని సూచించారు. బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు తమ వినియోగదారుల వాహనాల నియంత్రణకు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని.. సొంత పార్కింగ్ ప్రవేశాల్లో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జీవీఎస్ కుమార్, ఖలీల్, కిశోర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి వినతులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌కు సోమవారం విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్‌ను పలువురు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వినతి పత్రాలు సమర్పించారు. భాజపా ఎస్సీ మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు బొడ్డు నాగలక్ష్మి నేతృత్వంలో పలు సమస్యలు తెలియజేశారు. ఎస్సీల విద్యా, ఉపాధి తదితరాలకు

రామ్‌చందర్‌ను సన్మానించిన నాగలక్ష్మి తదితరులు

రుణాల మంజూరులో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రంశెట్టి విశ్వేశ్వరరావు, పగిడిపల్లి రాజేశ్వరి, సుధీరరాజు, ఎం.ప్రకాశరావు, లక్ష్మణ్, మాగులూరి బాబు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీల అభ్యున్నతికి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఎన్ఎస్ఎఫ్‌డీఎస్, ఎన్ఎస్‌టీఎఫ్‌డీఎస్, ఉపకార వేతనాలతో పాటు అత్యాచార నిరోధక చట్టం కింద ఆర్థిక సాయం తదితరాలు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి వినతి పత్రం సమర్పించారు. అన్ని స్థాయిల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన కోరారు.

కొత్త బోరుకు శ్రీకారం

ప్రస్తుతం కృష్ణానదికి గోదావరి నీరు వచ్చింది. మట్టితో కలిసి ఎరుపు రంగులో నీరు ఉంది. వీటిని శుభ్రం చేసి సరఫరా చేసినా.. పైపుల ద్వారా ఎర్రగా వస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయంగా, అత్యవసర సమయంలో ప్రజలకు నీటిని అందించేందుకు పలు ప్రాంతాల్లో బోర్లు వేస్తున్నారు. ఇందులో భాగంగా మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో వేశారు. నాలుగైదు రోజుల పాటు నీటిని బయటకు వదిలేస్తారు. తర్వాత నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షిస్తారు. అంతా సవ్యంగా ఉంటే ఈ నీటిని ప్రజలకు పంపింగ్ చేస్తారు. **- న్యూస్‌టుడే, మధురానగర్**

చివరిలో.. మనసు దోచేలా..!

మహాత్మా గాంధీ రోడ్డులోని బాపు మ్యూజియం ఎదురుగా సైకిళ్లపై బుట్టల్లో పెట్టి మామిడి పండ్లు విక్రయిస్తున్నారు. సీజన్ చివరి దశకు చేరుకున్న సమయంలో.. చిరువ్యాపారులు వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. చక్కని పసుపు రంగులో మిలమిలలాడుతూ నోరూరిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, సూర్యారావుపేట**

బాగు చేస్తే ప్రయోజనం..

పాయకాపురం, సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న బోరు పంపు గత అయిదు నెలలుగా పని చేయడం లేదు. అత్యవసర సమయంలో చుట్టుపక్కల ప్రజలంతా ఇక్కడే నీటిని పట్టుకుని అవసరాలకు వినియోగించుకునేవారు. సాయిబాబా, నాగమ్మ పుట్ట ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతగానో ఉపయోగపడేది. ఇది పాడైపోయిన విషయాన్ని మంచినీటి విభాగం అధికారులకు తెలియజేసినా.. స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

‘మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి’

మాచవరం, న్యూస్‌టుడే : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని విజయవాడ ఫిక్కీ ఫ్లో సీనియర్ వైస్ ఛైర్మన్ మల్లినేని సుప్రియ పేర్కొన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళల)లో ‘సాంకేతిక ప్రపంచంలో మహిళా సాధికారత’పై అయిదు రోజుల పాటు నిర్వహించే కార్యశాలకు సోమవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల పూర్వ సంచాలకులు టి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తిచేసి, ఉన్నత విద్యనభ్యసించాలని, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపల్ వల్లూరు నీరజ మాట్లాడుతూ.. సమకాలీన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరమని చెప్పారు. కళాశాల వాణిజ్య విభాగం, నవకల్పనల మండలి, మహిళా సాధికారత విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధారాణి, లావణ్య, నాగలక్ష్మి, సుమిత్ర, సత్యవాణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : విద్యే వ్యక్తిత్వ వికాసానికి మార్గం అని, విద్యా రంగంలో మాజీ ఎంపీ, శ్రీరామకృష్ణ విద్యా సంస్థల అధ్యక్షుడు గోకరాజు గంగరాజు సేవలు ఆదర్శనీయం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ పాఠశాలలో గంగరాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఉమా మాట్లాడుతూ రాజకీయ నాయకుడిగా విలువైన సేవలు అందించారని పేర్కొన్నారు. గతేడాది పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను గోకరాజు ప్రోత్సాహక బహుమతులతో సత్కరించారు. కార్మికులకు దుస్తులు, వేద పండితులకు కూరగాయలు, దివ్యాంగులకు అల్పాహారం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ పి.త్రిమూర్తిరాజు, వలివేటి దుర్గాప్రసాద్, అప్పలరాజు, ఎస్.ఎల్.వి.శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు, ఆటంకాలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. బందరురోడ్డు, బెంజిసర్కిల్, జాతీయ రహదారి, పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డు, కరెన్సీనగర్, గుణదల, బీఆర్టీఎస్‌రోడ్డు, గులాబీతోట, నూజివీడురోడ్డు, పాతబస్తీ, గణపతిరావురోడ్డు, సీవీఆర్ ఫ్లైవంతెన ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయిన్లలో వ్యర్థాలు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, రహదార్లపై పోగైన చెత్తను వెంటనే తొలగించి తరలించాలని ఆదేశించారు. అనధికారిక ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. సక్రమంగా నిర్వహించాలని అన్నారు.

బూత్ పరిధిలో సమీక్ష

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : న్యూరాజరాజేశ్వరి పేటలో ‘సుపరి పాలనలో తొలి అడుగు’ కార్యక్రమాన్ని 8వ బూత్ వేగంగా పూర్తి చేయడంతో సోమవారం బూత్ ఇన్‌ఛార్జి కట్ల వేణుగోపాల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా 57, 58వ డివిజన్ ఇన్‌ఛార్జి ఆలా తారక రామారావు మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తున్నామని చెప్పారు. సమస్యలను ఎమ్మెల్యే బొండా ఉమా దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కబీర్, మహిళా అధ్యక్షురాలు శ్రుతి, మైనార్టీ అధ్యక్షుడు బుజ్జి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు, బూత్ ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

‘వీవోఏల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి’

సచివాలయాల జిల్లా అధికారిణి జ్యోతికి వినతి పత్రం అందజేస్తున్న కమల తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వెలుగు యానిమేటర్ల (వీవోఏల) మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని.. ఇతర సమస్యలపైనా ఏపీ వెలుగు యానిమేటర్ల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎ.కమల నేతృత్వంలో కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ.. 5జీ చరవాణిలు, సిమ్ కార్డులు, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని, గౌరవ వేతనం వీవోఏల ఖాతాల్లోనే జమ చేయాలని కోరారు. అర్హులైన వారికి సీసీలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి, టి.విజయలక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎం కౌశల్ వికాస్ పథకంపై అవగాహన

చిట్టినగర్, న్యూస్‌టుడే: యువతలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపు వంటి కార్యక్రమాలను భారత ప్రభుత్వం నిర్వహిస్తుందని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి పేర్కొన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల ఎన్‌సీసీ, కంప్యూటర్ విభాగాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం, కౌశల్ వికాస్ రోజ్‌గార్ యోజనపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. పథకాల పట్ల ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ. 2,21,116 విరాళాలను సోమవారం అందజేశారు. కానూరుకు చెందిన ఘట్టమనేని నవీన్‌కుమార్ రూ.1,20,000, కరిపినేని నాగేశ్వరరావు రూ.1,01,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి విరాళం రశీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కుమారుడితో గొడవ పడ్డాడని దాడి

మధురానగర్, న్యూస్‌టుడే : తమ కుమారుడితో గొడవ పడ్డాడన్న కోపంతో ఓ వ్యక్తిని కొట్టిన తండ్రిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన దాసరి శామ్యూల్ కూలి పనులు చేస్తుంటారు. ఈ నెల 12వ తేదీ రాత్రి పేతురు అనే యువకుడు శామ్యూల్ బావమరిదితో గొడవ పడ్డారు. శామ్యూల్ జోక్యం చేసుకుని పేతురును మందలించారు. దీన్ని మనసులో పెట్టుకున్న పేతురు తండ్రి వసంతరావు.. అదే రోజు రాత్రి శామ్యూల్‌పై కర్రతో దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు వసంతరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలగిన కొమ్మలు.. వెలిగిన దీపం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీ ‘ఎ’ బ్లాక్ సమీపంలో విద్యుత్తు స్తంభం చుట్టూ చెట్ల కొమ్మలు అలముకున్నాయి. దీనిపై ఈ నెల 13న ‘నమ్మండి.. ఇక్కడ స్తంభం ఉంది..!’ శీర్షికతో ‘ఈనాడు’లో వార్త ప్రచురితమైంది. పార్కుల ఏఈ చైతన్య తమ సిబ్బందితో చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. విద్యుత్తు దీపం వెలుగులు ప్రసరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఊపిరి పీల్చుకున్నారు..

స్పందనకు వందనం

పూడిక తీస్తున్న సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్ సమీప వీధిలోని సైడు కాల్వలో గత వారం రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనిపై ఈ నెల 14న ‘పూడిక తీయరూ..!’ శీర్షికతో ‘ఈనాడు’లో వార్త ప్రచురితమైంది. పారిశుద్ధ్య అధికారి శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందితో డ్రైనేజీలోని పూడిక తీయించారు. సమీప నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

పుస్తకాల పేరిట వసూళ్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బ్రాండెడ్ పుస్తకాలు విక్రయిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపీ తదితరులు పేర్కొన్నారు. అలాగే సమ దుస్తుల (యూనిఫామ్) పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

బస్ షెల్టరు వద్ద సమస్యల తిష్ఠ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణలంక కరకట్టపై పాత అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) బస్ షెల్టరు సమస్యాత్మకంగా మారింది. దీనిపై నగరంలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతి పత్రం అందింది. పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి గుంటూరు, తెనాలి, రేపల్లె తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆగడం లేదు. బస్టాండు నుంచి బయల్దేరిన డ్రైవర్లు వేగంగా వెళ్లిపోతున్నారు. ఫైర్ స్టేషన్ బస్ షెల్టరు వద్ద ఆగడం లేదు. ఒక వేళ ఆకస్మికంగా ఎడమ వైపు రావాలన్నా.. బందరు రోడ్డు నుంచి వంగవీటి రంగా విగ్రహం కూడలి, బందరు కాలువ వంతెన మీదుగా సర్వీసు రోడ్డులో నుంచి కృష్ణలంక కరకట్ట రోడ్డుపైకి వెళ్లే వాహనాలు అడ్డంకిగా మారాయి. ప్రధాన రహదారి, సర్వీసు రోడ్డు కలిసే చోట వేగ నిరోధకం లేకపోవడంతో ప్రమాద భరితంగా మారింది. విజయవాడ డిపోలకు చెందిన 47వీ సిటీ బస్సులు మాత్రం ఆగుతున్నాయి. గుంటూరు, తెనాలి, రేపల్లెకు చెందిన పల్లె వెలుగు బస్సులు ఆగడం లేదు. ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవడం, డ్రైవర్లకు అవగాహన కల్పించి, ముందస్తు సూచనలు ఇవ్వక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కృష్ణలంక కరకట్ట రోడ్డుకు ఫ్లైవంతెన నిర్మించిన అధికారులు సర్వీసు రోడ్లు కలిసే చోట వేగ నిరోధకాలు లేవు.

ఎంజీ రోడ్డులో బస్టాపులు ఎక్కడ?

నగరం రోజు రోజుకు మారిపోతోంది. ముఖ్యంగా ఎంజీ (బందరు) రోడ్డులో బస్టాపులు ఎక్కడ ఉన్నాయో కొత్తగా వచ్చిన వారికి తెలియని పరిస్థితి. గతంలో స్వరాజ్యమైదానం వద్ద బస్ షెల్టరు ఉండేది. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు నేపథ్యంలో గత వైకాపా సర్కారు బస్ షెల్టరును నేలమట్టం చేసింది. నేటికీ అక్కడ బస్ షెల్టరు ఏర్పాటు కాలేదు. బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియదు. ఇలా బందరు రోడ్డులో పలు చోట్ల బస్ షెల్టర్ ఆనవాళ్లు తెలియడం లేదు. ఫలితంగా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. సబ్ కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ కార్యాలయంగా మారినా.. మెట్రో బస్సులు ఇక్కడ ఆగవు. ఆర్టీసీ, వీఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాల్సి ఉంది.

హృద్యంగా సంగీత విభావరి

కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు, సంస్థ నిర్వాహకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : దక్షిణ భారత సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న ఏపీ ఫిల్మ్ ఛాంబర్ మాజీ కార్యదర్శి, శక్తి పిక్చర్స్ అధినేత ముత్యాల రమేష్‌కు గాయకులు సినీ స్వర నీరాజనాలు అర్పించారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఆశిష్ స్టూడియోలో నిర్వహించిన సంగీత విభావరి హృద్యంగా సాగింది. రమేష్ మృతి చిత్ర పరిశ్రమ, పంపిణీదారులకు తీరని లోటని సంస్థ అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. గాయకులు పలు చిత్రాల్లోని పాటలను రసరమ్యంగా ఆలపించారు. నిడుమోలు రమా సత్యనారాయణ, ప్రసూనరామన్, అశోక్‌ఆనంద్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఏటికొప్పాక.. కీర్తిపతాక

వరించిన జాతీయ పురస్కారం

ఎలమంచిలి, కలెక్టరేట్ న్యూస్‌టుడే

అందానికి, కళాకారుల నైపుణ్యానికి పేరొందిన ఏటికొప్పాక లక్కబొమ్మలకు మరో గుర్తింపు దక్కింది. ప్రధాని మోదీని సైతం మెప్పించిన ఇక్కడి బొమ్మలు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఈ కళకు మరింత మెరుగులద్దుతూ స్థానిక కళాకారులు బొమ్మలు తయారు చేసి జాతీయ స్థాయి అవార్డులు సైతం దక్కించుకున్నారు. ఈ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తూ ఏటికొప్పాక లక్కబొమ్మలకు జాతీయ స్థాయి పురస్కారం అవార్డు దక్కింది. తాజాగా 'ఒకజిల్లా.. ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో ఏటికొప్పాక లక్కబొమ్మలకు అవార్డు లభించింది. దిల్లీలోని ప్రగతి మైదానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా కలెక్టర్ విజయకృష్ణన్ ఈ అవార్డు అందుకున్నారు.

కేంద్ర మంత్రి పియూష్ గోయల్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రతి జిల్లాకు తలమానికంగా నిలిచే ప్రత్యేక ఉత్పత్తులను గుర్తించి వాటిని ప్రోత్సహించడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానికంగా తయారీని, ఎగుమతులను పెంచి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని నిర్ణయించింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో స్థానిక ఉత్పత్తులు పోటీపడేలా అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తుంది. ఇందులో భాగంగా కళారంగంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఏటికొప్పాక హస్తకళకు అవకాశం లభించింది. 28 దేశీయ వేదికలతోపాటు అంతర్జాతీయంగానూ ఇక్కడి కళాకారులు తయారుచేసిన లక్కబొమ్మలను ప్రదర్శించి వీటి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి'లో మంచి ఫలితాలు సాధించడంతో ఇప్పుడు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. అవార్డుతో ఏటికొప్పాక బొమ్మల ఖ్యాతి మరింత పెరుగుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు.

గతంలోనూ రెండు జాతీయ అవార్డులు.. ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో అత్యంత నైపుణ్యంగల కళాకారులు ఎంతోమంది ఉన్నారు. మారుతున్న కాలానికి తగ్గట్టు ప్రజల అభిరుచులకు అనుగుణంగా వీరు కొత్త తరహా బొమ్మలు తయారు చేస్తున్నారు. గ్రామంలో 150 వరకూ ఉండే హస్త కళాకారుల కుటుంబాలు ఇప్పుడు 300కు పెరిగాయి. వీరిలో కొందరు బొమ్మలు విదేశాలకు ఎగుమతులు సైతం చేస్తున్నారు. అంతరించిపోతున్న లక్కబొమ్మల తయారీని బతికించడానికి విశేషంగా కృషి చేసి, ప్రకృతిసిద్ధమైన రంగులను ప్రపంచానికి పరిచయం చేసిన ఏటికొప్పాక వాసి చింతలపాటి ప్రసాద్‌రాజుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఈయన శిష్యుడు శ్రీశైలపు చిన్నయాచారి కోడిగుడ్డు సైజు బొమ్మలో 56 గుడ్లు ఇమిడేలా చేసిన బొమ్మలకు జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. ఇతర కళాకారులు వీరి బాటలో నడిచి పలు అవార్డులు సంపాదించారు. ఇటీవల దిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏటికొప్పాక లక్కబొమ్మల శకటాన్ని ప్రదర్శించారు. దీనికి రూపకల్పన చేసింది హస్తకళాకారుడు గోర్సా సంతోష్‌కుమార్. రాష్ట్రపతి భవన్‌లో స్టాల్ ఏర్పాటు చేసి మన లక్కబొమ్మల గొప్పతనాన్ని అందరికీ పరిచయం చేశారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారి వినోద్‌బాబు చెప్పారు. మాడుగుల, దేవరపల్లి, కోటవురట్ల, చోడవరం, సబ్బవరం కళాశాలల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16వ తేదీ లోగా సంబంధిత కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 17న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదవీ విరమణ చేసిన అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాలకు సంబంధిత కళాశాలల్లో సంప్రదించవచ్చని కోరారు.

అడ్డదారుల్లో సేకరణ.. అడ్డగోలుగా రవాణా

పేదల బియ్యం పక్కదారి

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు అందాల్సిన చౌకబియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ బియ్యం దందాకు కొందరు అక్రమార్కులు ఎప్పటికప్పుడు అడ్డదారులు వెతుక్కుంటూ రూ. కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. నెల ప్రారంభమయ్యే సరికి లబ్ధిదారుల కన్నా దళారులు ముందే సిద్ధమవుతున్నారు. రేషన్ దుకాణాల్లో మకాంవేసి లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని.. నగదు ఇస్తున్నారు. ఇక్కడ నుంచి బియ్యం బయట జిల్లాలకు తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు.

పేదలకు పట్టెడన్నం పెట్టాలని ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా చౌక ధరలకే బియ్యాన్ని ప్రతినెలా అందిస్తోంది. గతంలో వాహనాల్లో ఇళ్ల దగ్గరకు తీసుకువెళ్లి అందిస్తున్నామని చెప్పినా.. కొన్నిచోట్ల మార్గమధ్యలోనే దారి మళ్లిపోయేది. ఈ లోపాలు సరిదిద్దేందుకు ప్రభుత్వం తాజాగా పాత పద్ధతిలోనే డీలర్ల ద్వారా పంపిణీని ప్రారంభించింది. కానీ అక్రమార్కుల పని మాత్రం యథావిధిగా సాగిపోతోంది. అనకాపల్లిలో ఎలమంచిలి, చోడవరం ఏరియాల్లో దీనికి సిండికేట్ ఉంది. చోడవరం, నర్సీపట్నం, ఎలమంచిలి మండలాల్లో ఆయా ఏరియాల్లోని దళారులే కొనాలని నిబంధనలు సైతం విధించుకున్నారు. సేకరించిన సరుకు నాణ్యత బట్టి వివిధ అవసరాలకు మళ్లిస్తున్నారు. కొందరు రొయ్యలు, చేపల చెరువులు, పందుల మేతకు కేజీ రూ. 15 - 20 చొప్పున ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. వీటిని నానబెట్టి, ఉడకబెట్టి ఫీడ్‌గా ఉపయోగిస్తున్నారు. ఇంకొందరు రీసైక్లింగ్ చేసి.. మిల్లర్లకు విక్రయిస్తున్నారు. నాణ్యమైన సరుకు మాత్రం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు సరిగ్గా లేకపోవడంతో ఎగుమతి సులభంగా జరుగుతోంది. ఈ అక్రమ రవాణాపై జిల్లా అధికారులు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. నామమాత్రం కేసులు కట్టి మమ అనిపిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా.. వ్యాపారులు ఏ మాత్రం తగ్గడం లేదు. అధికారులు దాడులు చేసి వాహనాలను పట్టుకుంటున్నా.. తర్వాత ఏం చర్యలు తీసుకుంటున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. తరలిపోతున్న సరుకుతో పోల్చితే.. పట్టుబడినవి పిడికెడేనన్న వాదన వినిపిస్తోంది.

ఇటీవల ఎలమంచిలిలో లారీలో పట్టుబడిన రేషన్‌బియ్యం

ఈ ఏడాదిలో కేసులు

నెల	కేసులు
జనవరి	-
ఫిబ్రవరి	22
మార్చి	20
ఏప్రిల్	19
మే	14
జూన్	05
జులై (ఇప్పటివరకు)	03
మొత్తం	83

నిఘా పెట్టాం.. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ మేరకు అందరికీ అదే అంశాలు జారీ చేశాం. లబ్ధిదారులకు కచ్చితంగా సరకులు అందించాలని డీలర్లను ఆదేశించాం. - కె.వి. ఎస్.మూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి అనకాపల్లి

అందరి ఆరోగ్యాలకు అభయం

✦ పథకాల లక్ష్య సాధనకు పరుగులు
✦ చురుగ్గా అర్హులందరికీ ఈ-కేవైసీ

నర్సీపట్నం, న్యూస్‌టుడే

వైద్య అధికారులు ఇప్పుడు అందరితో ఆరోగ్య పరిరక్షణ జపం చేయిస్తున్నారు. లక్ష్యం మేరకు కేంద్రం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల వర్తింపునకు పరుగులు తీస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో వీటి ప్రగతి ఆశాజనకంగా లేని పరిస్థితిపై ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో వీరందరిలోనూ కదలిక వచ్చింది. పీఎంజేఏవై, వయో వందనం కార్డులు జారీకి వీలుగా ఈ-కేవైసీ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

✦ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని కుటుంబ సంక్షేమం, ఆరోగ్య మంత్రిత్వ శాఖ వీటిని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారంతా ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎం జేఏవై)కు అర్హులే. ఆరోగ్య శ్రీ రాష్ట్రంలోని వైద్య సేవలకే పరిమితం. పీఎంజేఏవైతో దేశంలో ఎక్కడైనా ఏడాదికి రూ.5 లక్షల చొప్పున విలువైన చికిత్సలు పొందవచ్చు. ఆదాయంతో నిమిత్తం లేకుండా వయో వందనం కింద 70 ఏళ్లు పైబడిన భారత్‌లోని వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్డులు సైతం జారీ అవుతున్నాయి. ఇటీవల వీటి పనులు నెమ్మదించాయి. జిల్లాల్లో ఏఎన్ఎం తదితర వైద్య సిబ్బంది బదిలీల హడావుడిలో ఉండడం దీనికి కొంత కారణమైంది. కుటుంబ సంక్షేమ ఆరోగ్య శాఖ కమిషనర్ దీనిపై చేపట్టిన సమీక్షలో లక్ష్యాల పూర్తికి తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సైతం రోజూ వీటిపై ప్రగతి వివరాలు పరిశీలిస్తున్నారు.

వృద్ధురాలితో బయోమెట్రిక్ నమోదు చేయిస్తున్న వైద్య సిబ్బంది

మళ్లీ ఇంటింటి సర్వే... జిల్లాలో పీఎంజేఏవైలో ప్రగతి సంతృప్తిగా ఉన్నా వయో వందనం మాత్రం బాగా వెనుకబడి ఉంది. దీంతో ఈ పథకాల వర్తింపునకు మళ్లీ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే కింద ఈ కేవైసీ పనులు వేగవంతం చేశారు. ఏఎన్ఎం, ఆశా, ఎంఎల్‌హెచ్‌పీలు ఇప్పుడు వీటికే నిమగ్నమయ్యారు. నర్సీపట్నం డివిజన్‌లో ఇవి త్వరితగతిన పూర్తయ్యేలా జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి వీరజ్యోతి సిబ్బందిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని పీఎంజేఏవై లక్ష్యం 9,03,453 మందిలో ఇప్పటివరకు 7,47,547 మందికి కార్డులు జారీ అయ్యేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సమన్వయకర్త డాక్టర్ రంజిత్ తెలిపారు. వయో వందన కింద 1,43,990 మంది లో 838 మందికే కార్డులు అందించామన్నారు. వీటిని ఇప్పుడు అతి వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి బుధవారం తాళ్లపాలెం, అనకాపల్లి గురుకులాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల సమన్వయ అధికారి రామకృష్ణ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన బాలురకు ఉదయం 9 గంటలకు, బాలికలకు మధ్యాహ్నం 1 గంటకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలురకు దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురం.. బాలికలకు మేఘాద్రిగెడ్డ సీటీఈ, నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి గురుకులాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. కౌన్సెలింగ్‌కు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చేవారు పదో తరగతి మార్కుల జాబితా తీసుకురావాలని కోరారు.

మర్లగుమ్మి కాలువకు మోక్షం

తుప్పలు, పూడిక తొలగింపు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం కోనాం జలాశయం ఆయకట్టు పరిధిలోని మర్లగుమ్మి సాగునీటి కాలువలోని పూడిక, తుప్పల తొలగింపునకు మోక్షం లభించింది. కాలువలో పూడిక తొలగింపునకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టారు. కోనాం జలాశయం పరిధిలోని ఐదు వేల ఎకరాలకు పైగా అధిక విస్తీర్ణం కలిగిన కలిగిన మర్లగుమ్మి సాగునీటి కాలువలో కొన్నాళ్లగా దట్టంగా తుప్పలు, పూడిక పేరుకుపోయాయి. దీనిపై స్పందించిన అధికారులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మర్లగుమ్మి సాగునీటి కాలువలో శ్రామికులతో పూడిక, తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. కాలువ పరిధిలోని జైతవరం, బైలపూడి, దిబ్బపాలెం, జి.కొత్తపల్లి గ్రామాలకు చెందిన శ్రామికులు ఉపాధి హామీలో పనులు చేస్తున్నారు. జైతవరం పరిధిలోని చలిభద్రం చెరువుల నుంచి మర్లగుమ్మి కట్టవరకు 15 వందల మీటర్ల మేరకు రూ. 3.58 లక్షలతో రెండు వారాల నుంచి పనులు చేస్తున్నట్లు జైతవరం వీఆర్‌పీ లక్ష్మణనాయుడు 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఎన్నో ఏళ్ల తర్వాత మర్లగుమ్మి సాగునీటి కాలువ బాగు పడటంతో ఆయకట్టు పరిధిలోని జైతవరం, బైలపూడి, దిబ్బపాలెం, జి.కొత్తపల్లి, అడవి అగ్రహారం తదితర గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూడిక తీసిన తర్వాత సాగునీటి కాలువ

ఎలమంచిలి విద్యార్థుల పరిశోధనకు గుర్తింపు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా రైతుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, గ్రామీణ సాధికారిత సాధనలో పశుపోషణ ప్రభావం అంశంపై విద్యార్థులు చేపట్టిన సమగ్ర శాస్త్రీయ పరిశోధన అంతర్జాతీయ గుర్తింపు పొందింది. అనకాపల్లి గ్రామీణ ప్రాంతాల్లో ఆవులు, గేదెల పాలలో వెన్న శాతం కాలానుగుణంగా మారడంపై పరిశోధన చేశారు. పశుపోషణ గ్రామీణ కుటుంబాల ఆర్థిక, సామాజిక మార్పులకు కారణమవుతోందని అధ్యయనంలో తేలింది. విలువైన పరిశోధన ఫలితాలు అంతర్జాతీయ శాస్త్రీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఇది కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇటువంటి అధ్యయనాలు విద్యార్థుల సామాజిక దృష్టి కోణాన్ని మెరుగుపరుస్తాయని, భవిష్యత్తులో దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయం వ్యక్తంచేశారు.

విద్యార్థులతో అధ్యాపక బృందం

దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసేందుకు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు సోమవారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, అమరావతి నుంచి ఆహ్వానం మేరకు అర్హులైన ఉపాధ్యాయులు http:/// nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మనసారా నమ్మారు.. మానేశారు!

ఫలితాలిచ్చిన నవోదయం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

జిల్లాను నాటుసారా రహితంగా తీర్చిదిద్దడంలో అధికారులు దాదాపు సఫలీకృతమయ్యారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించడంతో పాటు దీనిని తయారుచేయడం, అమ్మకాలు చేస్తున్న వారిని గుర్తించి వారితో పనులు మాన్పించేలా చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకం చేస్తున్న 151 గ్రామాలను గుర్తించారు. వీటిలో 21 గ్రామాలను 'ఎ' కేటగిరీలో చేర్చారు. సారా తయారీతోపాటు అమ్మకం చేస్తున్న 45 గ్రామాలను 'బి' కేటగిరీలో, అమ్మకం మాత్రమే చేస్తున్న 65 గ్రామాలకు 'సి' కేటగిరీలో చేర్చారు. ఆ గ్రామాల్లో ప్రచారరథం ద్వారా ఈ దురలవాటువల్ల కలిగే అనర్థాలను వివరించారు. తయారీ, అమ్మకందారులతో ఈ పని మాన్పించేలా చర్యలు చేపట్టారు. గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించడం తోపాటు ఈ పని మానేసిన వారికి స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టారు. తొలివిడతలో అవగాహన, రెండో దశలో శాఖాపరంగా చర్యలు చేపట్టారు. మరోవైపు దాడులు చేసి బైండోవర్ చేస్తూ నాటుసారా అరికట్టేలా చొరవ తీసుకున్నారు. ఇలా చేయడం వల్ల జిల్లాలో చాలా వరకు మార్పు వచ్చింది. మొత్తంగా జిల్లాలో గుర్తించిన 151 గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు జరగడం లేదంటూ ధ్రువీకరణ పత్రాలను ఎక్సైజ్ అధికారులు తీసుకుటున్నారు. ఈ నెలాఖరుకల్లా ఇది పూర్తవుతుంది. గ్రామసభల్లో గ్రామ, మండల కమిటీల ద్వారా పర్యవేక్షించి అనంతరం నాటుసారా రహిత జిల్లాగా ప్రకటిస్తారు.

నానాజీని అభినందిస్తున్న తల్లి జయమ్మ, గ్రామస్థులు

సారా తయారీ, అమ్మకం నిలిపేసిన వారిని స్వయం ఉపాధి అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా జిల్లాలో 106 మందిని గుర్తించి వీరికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి పొందేలా కలెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు.

త్వరలో ప్రకటిస్తాం... అనకాపల్లి జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా త్వరలోనే ప్రకటిస్తాం. నవోదయం 2.0 కార్యక్రమంలో చాలావరకు మార్పు వచ్చింది. జిల్లాలోని అందరి అధికారుల సహకారంతో తయారీ, అమ్మకాలను నివారించేలా చర్యలు చేపట్టాం. ఈ పని మానేసిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధిని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. చాలా మంది నాటు సారా తయారీ, అమ్మకాలు మానేయడానికి ముందుకు వచ్చారు. దీనివల్ల నిర్మూలన సాధ్యమైంది. – వి.సుధీర్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

నవోదయం 2.0లో కేసులు ఫిబ్రవరి నుంచి

కేసులు	: 203
అరెస్టు	: 210మంది
పట్టుకున్న సరకు	: 1362 లీటర్లు
బైండోవర్	: 892
పీడీ చట్టం	: ఒకరిపై

కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలో ప్రతిభ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఏపీ కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలో అచ్యుతాపురం మండలంలోని దొప్పెర్లకు చెందిన గండి నానాజీ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాడు. తల్లి అయ్యబాబు, తల్లి జయమ్మ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కుమారుడిని చదివించారు. నానాజీ 200 మార్కులకు 168 సాధించాడు. కరెంట్ కోతల మధ్య నిద్రను త్యాగం చేస్తూ పుస్తకాలతో కుస్తీ పట్టి విజయం సాధించాడని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు నడిపింటి శేఖర్, బండారు రమణ, గంగూళీ సోమవారం అభినందించారు.

నానాజీని అభినందిస్తున్న తల్లి జయమ్మ, గ్రామస్థులు

చంకలో బిడ్డతో తల్లి ఆత్మహత్య

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రెండేళ్ల చిన్నారిని చంకలో పెట్టుకొని తల్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని దిమిలిరోడ్డు సమీపంలో పాతవీధికి చెందిన రాజు కాయగూరల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య జి.రూప (22), మూడున్నరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. సోమవారం రాత్రి మేడపై గదిలోకి వెళ్లిన రూప కుమార్తెను చంకలో పెట్టుకొని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉరి మెడకు బిగుసుకున్నాక రూప చేతిలోంచి బిడ్డ జారి కాళ్లవద్ద పడి ఏడవడం ప్రారంభించింది. ఈ ఏడుపు విని స్థానికులు మేడపైకి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందింది. దీంతో వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరవాడ డీఎస్పీ, స్థానిక పోలీసులతో కలసి ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పెళ్లి ఇష్టం లేదని తన కుమార్తె చెబుతుండేదని రూప తల్లి సలాది నూకరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అటవీశాఖ భూమిలో అక్రమ నిర్మాణం

మాకవరపాలెం, న్యూస్‌టుడే : రాచపల్లి శివారు యరకన్నపాలెం సర్వే నంబరు 737లో ఉన్న భూముల్లో రెండురోజులుగా పలువురు వ్యక్తులు రాత్రివేళల్లో రహదారి నిర్మిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు రహదారి నిర్మాణం కోసం ఉపయోగించే రెండు యంత్రాలను ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కోటవురట్ల సెక్షన్ అధికారి వివేకానంద మాట్లాడుతూ ఆదివారం ఉదయం రహదారి పనులు చేస్తున్న రెండు యంత్రాలు, రెండు వాహనాలతో పనులు చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఈ క్రమంలో పలువురు వచ్చి ఇవి రెవెన్యూ భూములంటూ వాగ్వాదానికి దిగినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో వాహనాలను అడ్డుకుని, యంత్రాలను సీజ్ చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్‌డీఓ రమణ, తహసీల్దారు వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అటవీశాఖ అధికారులు సీజ్ చేసిన యంత్రాలు

నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కు సరిహద్దుల సవరణ

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్కు సరిహద్దులను సవరించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్కు కోసం అదనంగా 790 ఎకరాలను సేకరించే ప్రతిపాదనను ఆమోదించింది. గతంలో పార్కు కోసం సేకరించిన భూముల్లో కొంత మొత్తాన్ని ఆర్సెలార్ మిత్తల్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటు కోసం కేటాయించడంతో.. అదనపు భూములను సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. మరోవైపు బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు అవసరమైన 2001.80 ఎకరాలను 'ఏపీ బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్'కు బదిలీ చేసేందుకు చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, లే అవుట్ అనుమతులకు ఛార్జీలు, స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన ఛార్జీలు, ఏపీఐఐసీకి చెల్లించాల్సిన లీజు, ఇతర ఛార్జీలు 10 ఏళ్ల పాటు మినహాయింపునకు, ప్రోత్సాహకాల చెల్లింపునకు సంబంధించిన విధివిధానాలనూ ఖరారు చేసింది.

'970' ఓపీ.. విమ్స్ చరిత్రలో రికార్డు..!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విమ్స్ ఆసుపత్రికి సోమవారం రికార్డు స్థాయిలో రోగులు వచ్చారని డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ విభాగాలైన గుండె, వినాళగ్రంధులు, నరాల వ్యాధులు, జీర్ణకోశ వ్యాధులు, ప్లాస్టిక్ సర్జరీ, క్యాన్సర్ విభాగాలకు 317 మంది వచ్చారన్నారు. సాధారణ విభాగాలైన జనరల్ మెడిసిన్, శ్వాసకోశ వ్యాధులు, చిన్నపిల్లల విభాగం, జనరల్ సర్జరీ, ఎముకల విభాగం, చెవి ముక్కు గొంతు, దంత, కంటి, వెన్నెముక వైద్య విభాగాలకు 653 మంది వచ్చారన్నారు. అన్ని విభాగాల నుంచి 970 ఓపీ నమోదైందని, విమ్స్ ప్రారంభించినప్పటి నుంచి ఇదే అత్యధికమన్నారు. అందులో క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసిన రోగులు 575 మంది ఉన్నారన్నారు. ఈ స్థాయిలో ఓపీ నమోదు కావడం ఆనందంగా ఉందని, మరింత మంది వచ్చినా వైద్యులు, సిబ్బంది సహకారంతో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

గడువులోగా వినతులకు పరిష్కారం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిర్ణీత సమయంలోగా వినతులకు పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 310 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 163, పంచాయతీరాజ్ 38, సర్వేకు సంబంధించి 21 ఉన్నాయి. డీఆర్వోతోపాటు ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మి, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు.

★ కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీ శివారు అయిన గ్రామంలో పాఠశాల ఏర్పాటు కోరుతూ పీవీటీజీ తెగకు చెందిన గిరిజనులు, విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఆరు కి.మీ. దూరంలో ఉన్న గొట్టివాడ పాఠశాలకు కాలినడకన వెళ్లాల్సి వస్తోందని గిరిజన సంఘ నాయకుడు మరి సూరిబాబు పేర్కొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అటుకు గిరిజన విద్యార్థులు, గ్రామస్థులు

★ మద్యం గొలుసు దుకాణాలను తొలగించాలని గీత కార్మిక సంఘ నాయకులు ధర్నా చేశారు. ఒక్కో మద్యం దుకాణం పరిధిలో 15కుపైగా గొలుసు దుకాణాలున్నాయని పేర్కొన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేమన, శ్రీరామ్ తదితరులు డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

★ వీవోఏల మూడేళ్ల కాలపరిమితి జీవోను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు వీవోఏలు ఆందోళన చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రూపాదేవి కోరారు. ★ బుచ్చియ్యపేట మండలం వడ్డాదిలో ఉపాధి హామీ పథకంలో పనులు చేసినా బిల్లులు చెల్లించలేదని ఆందోళన చేపట్టారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణ

★ సబ్బవరం మండలం నల్లరేగులపాలెంలో సుజల స్రవంతి పథకంలో భూసేకరణ సంబంధించి అలైన్‌మెంట్ సరిచేయాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ★ అనకాపల్లి మండలం కుంచంగిలో 170 మంది రైతులకు సంబంధించిన భూ వివరాలను ఆన్‌లైన్‌లో తొలగించడం వల్ల అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యామని బాధితులు వినతిపత్రం ఇచ్చారు. ★ జీవీఎంసీ, మున్సిపాలిటీల్లో ఒప్పంద, పొరుగు సేవల విభాగాల్లో పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని వినతిపత్రం ఇచ్చారు.

ప్రధాన కూడలి అభివృద్ధికి పచ్చజెండా

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి పట్టణంలోకి ప్రవేశించే ప్రధాన కూడలి అభివృద్ధికి జీవీఎంసీ అధికారులు పచ్చజెండా ఊపారు. జోనల్ కార్యాలయంలో కమిషనర్ చక్రవర్తి ఆయా శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి మీదుగా విశాఖ, సబ్బవరం వైపు నుంచి వచ్చే ప్రధాన కూడలి కావడంతో ప్రముఖుల విగ్రహాలతో పాటు పచ్చదనం కోసం పూల మొక్కలు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కాలువల్లో తొలగించిన పూడికమట్టిని రహదారిపై వదిలేయకుండా వెంటనే తరలించాలని ఆదేశించారు. నూకాలమ్మ ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిడమ్మ గుడి మీదుగా జాతీయ రహదారి వరకు తాత్కాలికంగా నిర్మించిన రహదారిని అభివృద్ధి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. లక్ష్మీనారాయణ నగర్‌లోని స్కేటింగ్ రింకును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ఈఈ శేఖర్, డీఈ గోపాలకృష్ణ, సూపరింటెండెంట్ రమణ, ఏపీడీ సంతోష్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

చట్ట పరిధిలో సత్వర పరిష్కారానికి చొరవ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సమస్యలను పరిశీలించి చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 40 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలకు సంబంధించి ఎక్కువగా ఉన్నాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడారు. అదనపు ఎస్పీ దేవప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

మడుల్లో సేద్యం.. మెండుగా ఆదాయం

రైతేరాజు

న్యూస్‌టుడే, పాయకరావుపేట

ఆధునిక పద్ధతులను అనుసరించి అన్నదాతలు సాగుబాట పడుతున్నారు. ఆర్గానిక్ విధానంలో పంటలు పండిస్తూ మెరుగైన ఆదాయం పొందుతున్నారు. నిపుణుల సూచనలు పాటిస్తూ చిన్న చిన్న మడుల్లో పంటలు సాగు చేస్తున్నారు పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం రైతు రమణ.

కూరగాయ తోటల పెంపకం

★ 20 సెంట్లలో 60 శాతం భూమిలో 7 రకాల పండ్లు, 35 శాతం భూమిలో ఆరు, 5 శాతం భూమిలో 10 రకాలకుపైగా పంటలు వేస్తున్నా. తద్వారా నిత్యం ఏదో ఒక పంట చేతికొస్తోంది. రోజుకు సగటున 20 కేజీల వరకు కూరగాయలు విక్రయిస్తున్నా. నెలకు రూ. 15 వేల చొప్పున ఏడాది పొడవునా ఆదాయం ఉంటోంది. వీటితోపాటు ఆకుకూరలు విక్రయిస్తున్నా. అన్ని పనులు స్వయంగా చేసుకోవడం వల్ల కూలీల ఖర్చు కలిసొస్తోంది. సేంద్రియ విధానంలో పండిస్తుండటం వల్ల కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది.

టి.రమణ, పెదరామభద్రపురం

★ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రెండేళ్ల కిందట తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండించే విధానాన్ని మొదలుపెట్టా. ఎకరా భూమిలో వచ్చే ఆదాయం 20 సెంట్ల భూమిలో పొందుతున్నా. ఏడాది పొడవునా ఏదో ఒక పంట ద్వారా ఆదాయం వచ్చేలా 20 రకాలు సాగు చేస్తున్నా. ★ నాలుగు అడుగుల వెడల్పుతో బెడ్లు తయారు చేశా. నీరు వచ్చేందుకు వీలుగా అడుగున్నర వెడల్పుతో కాలువ ఏర్పాటు చేశా. కషాయాలు కలిపేందుకు వీలుగా సిమెంట్ కుండీని ఏర్పాటు చేసుకున్నా. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, ఘన, ద్రవ జీవామృతాలనే చీడపీడల నివారణకు వాడుతున్నా.

★ ప్రధాన మడిలో వంగ, టమాటా, మిర్చి, గోరుచిక్కుడు, బెట్ట చిక్కుడు విత్తనాలు వేస్తున్నా. వాటి మధ్యలో మొక్కజొన్న, బొప్పాయి, అరటి వేశా. కొంత చోట బీట్‌రూట్, ముల్లంగి, క్యారెట్ పండిస్తున్నా. మడి చుట్టూ బీర, ఆనప వేస్తున్నా. వీటితోపాటు గోంగూర, తోటకూర, పాలకూర, మెంతికూర పండిస్తున్నా. తెగుళ్లు ఆశించకుండా బంతి నారు నాటుతున్నా.

మధ్య, నాసి రకం బెల్లం ధరల్లో వృద్ధి



రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,750	4,620
మధ్య	3,450	4,150
నాసి	2,800	3,250

అనకాపల్లి మార్కెట్లో గత వారం రోజులుగా మధ్య, నాసి రకం బెల్లం ధరలు పెరిగాయి. రంగులు ధరలు తగ్గాయి. రంగుల వంద కేజీలకు రూ.130 తగ్గగా మధ్య రకం రూ.700, నాసి రకాలు రూ.450 ధరలు పెరిగాయి.
–న్యూస్‌టుడే, అనకాపల్లి

న్యూస్‌టుడే, అనకాపల్లి

విత్తన శుద్ధితో.. మేలైన దిగుబడులు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

? వ్యవసాయ శాఖ వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేశాం. విత్తన శుద్ధి చేయాలా. – దాడి వెంకట రమణ, సీతానగరం

✔: విత్తన శుద్ధి చేస్తే మంచిది. కేజీ విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి శుద్ధి చేసుకోవాలి. తద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చు.

? ఎకరా భూమిలో వరి సాగుకు ఎంత విత్తనం అవసరమవుతుంది.
– జనపరెడ్డి నర్సింగరావు, పెదపాడు

✔: నారు పోసి నాటేందుకు 25 నుంచి 30 కేజీల విత్తనం అవసరం. పొలంలో నేరుగా వెదజల్లేట్లు అయితే 15 నుంచి 20 కేజీలు సరిపోతాయి. డ్రమ్‌సీడరుతో వేస్తే 10 నుంచి 12 కేజీలు, యంత్రంతో నాట్లు వేస్తే 8 నుంచి 10 కేజీల విత్తనం పడుతుంది.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీకే జగన్నాథరావు సమాధానాలు ఇచ్చారు.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి సమాధానాలిస్తారు. సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 గంటల నుంచి సా. 4 గంటలకు వరకు 93905 80342 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

పూల రైతులకు రాయితీలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: రైతులకు రాయితీలిచ్చి పూల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 500 ఎకరాల్లో వివిధ రకాల పూల సాగుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. బంతి, చామంతి, మల్లె, గులాబీ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు రాయితీగా ఇస్తామని ఉద్యానాధికారి ఎంఏ రహీమ్ చెప్పారు. హైబ్రీడ్ బంతి, గులాబీ సాగుకు హెక్టారుకు రూ.40 వేలు, చామంతికి రూ.35 వేలు, మల్లెకు రూ.20 వేలు పెట్టుబడి అవుతుందన్నారు. రాయితీలకు సంబంధించి వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు.

ఉపాధికి ఊతం.. జీవాల పోషణకు సాయం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: జాతీయ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం)లో భాగంగా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి ముందుకు వచ్చే వారికి కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేస్తోంది. ఈ పథకం 2021-22లో ప్రారంభమైంది. కేంద్రం ఆధ్వర్యంలోని ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా సహకారం అందిస్తోంది. గతంలో ఆశించిన స్థాయిలో ఎవరూ సద్వినియోగం చేసుకోలేదు. జిల్లాలో 12 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా అధికారులు లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు.

శంకరం గ్రామంలో కొత్తగా ఏర్పాటైన గొర్రెల యూనిట్

1 ● యూనిట్ విలువ ఆధారంగా కనిష్ఠంగా రూ.10 లక్షలు, గరిష్ఠంగా రూ.50 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేస్తారు. 50 శాతం రాయితీ వర్తిస్తుంది. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో గొర్రెల పెంపకానికి అనువైన పరిస్థితులున్నాయి. శంకరం గ్రామంలో కొత్తగా యూనిట్ ప్రారంభమైంది.

2 ● అనకాపల్లి జిల్లాలో 1,50,424 గొర్రెలు, 1,79,479 మేకలు, 8 వేల పందులున్నాయి. యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు సమీపంలోని మీసేవ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు, ఆధార్, చిరునామా, ఫొటో, బ్యాంకు స్టేట్‌మెంట్ అప్‌లోడ్ చేయాలి.

3 ● లబ్ధిదారుకు కనీసం ఐదు ఎకరాల భూమి ఉండాలి. సొంతంగా భూమిలేని వారు ఇతరుల నుంచి లీజుకు తీసుకోవచ్చు. రుణం ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరిస్తే ఎంత మందికైనా యూనిట్లు మంజూరు చేస్తామని నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు తెలిపారు.

మహారాజశ్రీ అనకాపల్లి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం 25/2022 ఇన్ ఓ.యస్ నెం.38/2016

బిట్వీన్:
సబ్బవరపు ఉమాశంకర మహేశ్వరరావు ....డి.హెచ్.ఆర్.
అండ్
బోజంకి సత్యనారాయణ ...జె.డి.ఆర్

వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ రాబట్టే నిమిత్తం ప్రతివాది-జె.డి.ఆర్‌కు హక్కు అనుభవములు గల ఈదిగువ సుదహరించిన షెడ్యూల్ ఆస్తిని శ్రీకోర్టువారు తే. 04-08-2025దిని పగలు 10.30గం॥లకు లగాయితూ సైకోర్టులో బహిరంగంగా వేలం వేయుదురు. గావున కావలసినవారు వేలం రోజున పై కోర్టుకు హాజరై వేలంపాట పాడుకొనవచ్చునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE PROPERTY

Ac.0-42cts consisting six bits i.e.c.0-12cts in S.No:210/4, Ac.0-05cts in S.No:210/36, Ac.0-01cts in S.No.210/35, Ac.0-09cts in S.No.209/4 Ac.0-08cts in S.No.126 and Ac.0-07cts in S.No:145/3 covered by Patta no.489 and passbook No: 483365 of Bata Jangalapalem Village and within the limits of Bata Jangalapalem Gram Panchayat, Sabbavaram Mandal in Sabbavaram Sub Registration District of Anakapalli District bounded as follows:
East : Jeroyithi land of Vanam Pentayya, **South:** Jeroyithi land of Vanam Atchimnaidu, **West:** Jeroyithi land of Bojanki Appalanaidu, **North:** Jeroyithi land of Bojanki Appalanaidu
డిహెచ్ఆర్ వారి విలువ: రూ.4,00,000/–, ఫీల్డ్ అసిస్టెంట్ వారి విలువ: రూ.11,85,000/–, మార్కెట్టు విలువ: రూ.11,88,000/–

Survey no	Acres	Field Asst. Value	M.V. Value
210/24	0-12	Rs.3,60,000/-	Rs. 3,60,000/-
210/36	0-05	Rs.1,50,000/-	Rs. 1,50,000/-
210/35	0-01	Rs. 30,000/-	Rs.30,000/-
209/4	0-09	Rs. 2,70,000/-	Rs. 2,43,000/-
126	0-08	Rs.2,00,000/-	Rs. 2,16,000/-
145/3	0-07	Rs.1,75,000/-	Rs. 1,89,000/-

అనకాపల్లి
తేది 14-7-2025
యస్.డి.జగన్నాథరాజు, వై.సాయిరామ్, వై.నూకరాము, అడ్వకేట్స్
నరశింగరావు పేట, అనకాపల్లి-531001. మొబైల్ నెం. 9290008444.

సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన తప్పనిసరి

సబ్బవరం, న్యూస్‌టుడే: నేటి తరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ముందుకు సాగాలని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వెంకట్రావు సూచించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ)లో చేరే 3, 5 ఏళ్ల లా కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ముగ్గురు తల్లులను గుర్తు పెట్టుకోవాలని.. ఇందులో మొదటిది జన్మనిచ్చిన తల్లి, రెండోది చదువుకున్న విశ్వ విద్యాలయం, మూడోది భారత మాత అని పేర్కొన్నారు. ఈ మూడింటిని గౌరవించినప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలమని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిలా ఉంటూ అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూలో మంచి సౌకర్యాలు, పచ్చదనాన్ని అందిస్తున్న అధికారులను అభినందించారు. తొలుత డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒక న్యాయ విద్యార్థికి సమాజం మీద పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టాలను సులభంగా అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు. లాయర్‌గా ప్రతి విద్యార్థి సామాజిక, ఆర్థిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ (ఇన్‌ఛార్జి) డాక్టర్ మాదాసు విశ్వ చంద్రనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు, గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ వెంకట్రావు

बैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra
भारत सरकार का उद्यम
एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోనల్ ఆఫీస్, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007.

అద్దె ప్రాతిపదికన ఆవరణ కావలెను

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విశాఖపట్నం & అనకాపల్లి జిల్లాలో తమ నూతన శాఖల కోసం అద్దె ప్రాతిపదికన స్థానిక / మున్సిపల్ అధికారుల నుండి ఖచ్చితంగా వాణిజ్య అనుమతులు కలిగి ఉన్న ప్రాంగణానికై బిడ్‌లను ఆహ్వానిస్తుంది.

వ.నెం.	బ్రాంచ్ తరహా	ప్రాధాన్యతగల ప్రదేశం (పిన్‌కోడ్)	సుమారు కార్పెట్ ఏరియా (చ.అ.)
1	రెగ్యులర్ బ్రాంచి ATMతో	వేపగుంట జంక్షన్-530047	1400-1500 చ.అ.
2	రెగ్యులర్ బ్రాంచి ATMతో	మల్కాపురం-530011	1400-1500 చ.అ.
3	రెగ్యులర్ బ్రాంచి ATMతో	కూర్మానపాలెం-530012	1400-1500 చ.అ.
4	రెగ్యులర్ బ్రాంచి ATMతో	పరవాడ-531021	1000-1200 చ.అ.

ప్రతిపాదిత ఆవరణము ఏటియమ్ గదితో విడివిడిగా ప్రవేశం కలిగి ఉండి క్రింద అంతస్థులో (తగినంత పార్కింగ్ స్థలముతో) అద్దె ప్రాతిపదికపై నూతన శాఖను ఏర్పాటు చేయుటకు వీలుగా ఉండవలెను. ఈ ఆవరణము చాలినంత విద్యుత్ సామర్థ్యము, బ్యాంక్ వారి యొక్క అవసరములు మరియు ప్రమాణములు అనుసరించి ఇతర మౌలిక సదుపాయములు కూడా కలిగి ఉండవలెను. ఆవరణము వెంటనే స్వాధీనం చేసేకొనుటకు సిద్ధముగానూ లేదా బ్యాంక్ యొక్క అవసరములకు లోబడి 10 నుండి 15 రోజులలోగా సిద్ధముగా ఉండవలెను. కావున ఆసక్తి కలిగియున్న పార్టీలు / వ్యక్తులు బ్యాంక్ యొక్క సంబంధిత నమూన దరఖాస్తు ద్వారా వారి ఆఫర్లను "టెక్నికల్ బిడ్" మరియు "కమర్షియల్ బిడ్"గా తెలియజేసి రెండు విడివిడిగా కనెసీల్డ్ కవర్ల యందు ఉంచి, కవరుపై "టెక్నికల్ బిడ్" / కమర్షియల్ బిడ్‌గా పేర్కొని, జోనల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, 1వ అంతస్థు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం. 59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007 వారి కార్యాలయము నందు తేది.25.07.2025, సాయంత్రం గం. 5.00 లోగా సమర్పించవలసినదిగా కోరుచున్నాము.
ఈ సంబంధిత దరఖాస్తులు పై చిరునామా వద్ద కార్యాలయము పనివేళలయందు వ్యక్తిగతముగా పొందవచ్చును. మరియు మా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: www.bankofmaharashtra.in లో "టెండరు" విభాగము క్రింద ఈ టెండరు ప్రకటనతో పాటుగా డౌన్‌లోడ్ చేసుకొనగలరు. కారణం ఏదైనప్పటికీ తెలియచేయు అవసరం లేకుండా ఏ ఆఫరునైనా రద్దు/ తిరస్కరించు పూర్తి అధికారము / హక్కు బ్యాంక్ వారు కలిగియున్నారు. ఏవిధమైన బ్రోకరేజీ చెల్లించబడదు. అసంపూర్తిగా ఉన్న మరియు ఆలస్యముగా అందిన అనగా తేది.25.07.2025, సాయంత్రం గం. 5.00 ల తరువాత వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించబడవు. అదనపు వివరముల కొరకు pln_vjd@mahabank.co.in, gad_vjd@mahabank.co.in, ఫోన్: 08662480133, 7013388468 సంప్రదించగలరు.

బల్క్‌డ్రగ్‌కు భూములిచ్చేది లేదు

ఎన్.రాయవరం, న్యూస్‌టుడే: బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని గుర్రాజుపేటకు చెందిన రైతులు స్పష్టం చేశారు. గుడివాడ రెవెన్యూ పరిధిలో బల్క్‌డ్రగ్ ఏర్పాటుకు 172 ఎకరాల భూ భూసేకరణ నిమిత్తం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ ఏర్పాటైంది. ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ అనిత మాట్లాడుతూ నిబంధనల ప్రకారం భూసేకరణ జరుగుతుందని, అందరూ సహకరించాలని కోరారు. ఎక్కువ భూమి కోల్పోతున్న రైతు నరసింహమూర్తిరాజు మాట్లాడుతూ వ్యవసాయ భూములను నమ్ముకుని తరతరాలుగా జీవనం సాగిస్తున్నామని, మా అబ్బాయి వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగం వదిలి పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. పరిశ్రమ కోసం సాగు భూములు ఇవ్వమంటే ఎలా అని ప్రశ్నించారు. భూములిచ్చేది లేదంటూ రైతులంతా నినదించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ రమేష్‌బాబు, సర్పంచి రత్నం, ఉప సర్పంచి రాజన్‌రాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక ఉప కలెక్టర్ అనితకు వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు, రైతులు

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ తప్పనిసరి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు ఆదేశించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సోమవారం ఆయన వర్సిటీ అధికారులు, ఎస్టీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎస్టీ ఉద్యోగుల నియామకంలో రిజర్వేషన్ల అమలు తీరును తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో బోధన, బోధనేతర, ఒప్పంద, పొరుగు ఉద్యోగుల నియామకాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు. ఏయూలో చదివే గిరిజన విద్యార్థులకు కంప్యూటర్, వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులతో సమావేశమయ్యారు. గతంతో పోలిస్తే ఉన్నత విద్య చదివే ఎస్టీ విద్యార్థినుల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎ. తెలుగు విద్యార్థిని సరోజ మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలకు వెళ్లేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. బీటెక్ విద్యార్థి పవన్ మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు విదేశాలలో చదువుకొనేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు. దూరవిద్యా కేంద్రం ఫ్యాకల్టీ విద్యారత్నం మాట్లాడుతూ పర్యాటకం పేరుతో గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారని, అక్కడి కూడా సంస్కృతి దెబ్బతింటోందని తెలిపారు. ఎస్టీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్యులు జర్రా అప్పారావు, కుంజా నాగేశ్వరరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు

సంఘటితంతో రాజ్యాధికారం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: యువత రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, జైభీమ్ సేన సేవా సంఘం జిల్లా అధ్యక్షులు రేబాక మధుబాబు పిలుపునిచ్చారు. కొండకర్లలో దళిత సంఘాల సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు సంఘటితమై రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఐక్యతను దెబ్బతియ్యడానికి కొందరు ప్రయత్నిస్తుంటారన్నారు. దళిత సంఘాల నాయకులు గుబ్బల అప్పారావు, ఈశ్వరరావు, సబ్బవరపు ఈశ్వరరావు, ఈరుగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశమైన దళితసంఘాల నాయకులు రేబాక మధుబాబు తదితరులు

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును. అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

PERSONAL CLASSIFIEDS

LOST

Lost my Original Sale Deed (Document No.8346/94) while travelling from Peda Waltair to Siripuram by Auto on 09.07.2025. If found, please contact my mobile no: 9912960936

REAL ESTATE

FLAT FOR SALE

SUJATHANAGAR

2 BHK Dream Home Sapthagiri Nagar, Chinamushidiwada (Beside Maseed) East Facing 1090 Sq. Ft. Spacious, well-lit, and perfect for families ✆ Call now: 8886702221.

PLOT FOR SALE

GENERAL

VUDA Plot 340 Sq.yds. North and East Corner in Vizag City. ✆ 9490436614.

TO LET

COMMERCIAL

GENERAL

Commercial Warehouse (3500 Sq.Ft) for rent in Thalavalsa, Visakhapatnam all amenities. Ph: 9440878300/ 7981741475

WANTED

GENERAL

WANTED Godown For Rent
Sree Murali Mohana Boiled & Raw Rice Mill Private Unlimited (BELL BRAND RICE)
Location: Visakhapatnam City
Facing: North, East, North East Block
SIZE: 2000 SFT Approximately
Contact : 9490564901

JOBS

Wanted Courier Pick up Boys for International Couriers, Vizag (Salary + Petrol) Ph: 9966052040, 9703989808

Wanted Chief Managers for a reputed long standing company Vizag. Any qualification, Full / Part Time working, Rtd. M/F, Age: 30+, Yearly Package decide at the time of Interview. Con: B. Chandrasekhar - GM. ✆ 9246674326

Wanted for Vizag 1) B.Tech Civil with 1Yr. Exp. 2) DCE with 2Yrs Exp. Firm: Sir MVITS IND Pvt Ltd. ✆ 9849957401, 9177598545.

WANTED STAFF
SALES GIRLS AND BOYS
well experienced in silver counter sales
Age: 25 to 40 years
Salary: 15,000 to 25,000/-
ANNAPURNA SILVER PALACE
B.C. ROAD, NEW GAJUWAKA
Ph: 9391919251

Saradhi Pvt. Ltd.లో బ్రాంచ్ ఆఫీసర్‌గా పనిచేయుటకు యువకులు కావలెను. Qlf : Any డిగ్రీ. జీ॥ 15K to 18K వ॥ 21 to 35 సం॥ ఆఫీసు అడ్రస్ 3rd లైన్ ద్వారకానగర్ వైజాగ్. ✆ 9063475816.

ద్వారకానగర్ కళ్యాణి మెస్‌లో పనిచేయుటకు *వెజ్ అసిస్టెంట్ కుక్స్ *వెజ్ చైనీస్ అసిస్టెంట్ కుక్స్ * పుల్కా తయారు చేయువారు కావలెను. జీతం+వసతి. Ct: 9912462673.

2021 మోడల్, 50 HP Johndeere Front Bucket 5310 4WD ట్రాక్టర్, సింగిల్ ఓనర్, మంచి రన్నింగ్ కండీషన్, హెవీ డ్యూటీ ఆపరేషన్, V16 ఇంజిన్ ట్రాక్టర్ అమ్మకానికి. 8341695672, 9550750150.

ప్రముఖ కంపెనీలో ఫుల్/ పార్ట్ టైం చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), Retd. పర్సన్స్, ఈవెంట్స్ కండక్ట్ చేయుటకు (F) కావలెను. జీతం+ ఇన్‌సెంటివ్స్. ✆ 9985209038.

FACULTY/ TEACHERS

Wanted CBSE Accountancy teacher for a reputed residential school in Anandapuram-Visakhapatnam. Contact: 9493887644

ACCOUNTING

Wanted Tally operator, Qualif: Tally certificate, Salary 14000/-, Exp: 0-2 years. Call: 9866048888.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మాడుగులలో భారీ చోరీ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగులలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. స్థానిక రాజువీధిలో కోడూరు లక్ష్మి (68) తన కుమార్తెతో కలిసి ఈ నెల 1న విశాఖ నగరం మల్కాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి తాళం తీసి ఉండటం ఇరుగుపొరుగు వారు గమనించి సమాచారం అందించారు. వెంటనే విశాఖపట్నం నుంచి ఇంటికి వచ్చారు. తలుపులు, బీరువా తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 19.5 తులాల బంగారు, రూ 1.9 లక్షల నగదు చోరీ జరిగినట్లు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీంతోపాటు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు..

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: బలిఘట్టంలోని ఉప్పల జానకీదేవి అనే మహిళ మెడలో రెండు తులాల బంగారం గొలుసు, ఫ్యాన్సీ దుకాణంలోని రూ. 23వేలు నగదు అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న రాత్రి రెండున్నర గంటల సమయంలో పెంపుడు కుక్క అరుస్తుండటంతో జానకీదేవి బయటకు వచ్చారు. అక్కడే స్పృహ కోల్పోయి పడిపోయి ఉండటంతో ఉదయం కుటుంబ సభ్యులు గమనించి ఆమెకు సపర్యలు చేయడంతో కోలుకుందని తెలిపారు. ఘటనలో గొలుసు, నగదు మాయమైనట్లు గుర్తించి ఈ నెల 13న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరావు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో చెట్టుపల్లి వాసి మృతి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతేశ్వరస్వామి (శివుడు) దేవాలయానికి ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో చెట్టుపల్లికి చెందిన వ్యవసాయ కూలీ **కలిమి శ్రీను** (46)ను ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై రాజారావు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున స్థానిక శివాలయానికి వచ్చిన శ్రీను అక్కడ కొబ్బరి కాయలు విక్రయించేవారు లేక పోవడంతో తిరిగి ఊళ్లోకి వచ్చారు. కొబ్బరికాయ కొనుక్కొని తిరిగి వెళుతుండగా రోలుగుంట నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఉదయం 4.40 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, సోదరుడు గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు. శ్రీనుకు భార్య నూకరత్నం, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

మునగపాక, న్యూస్‌టుడే: పల్లపు ఆనందపురంలో మహిళ అనుమానాస్పదంగా మృతిచెందింది. ఎస్సై ప్రసాదరావు, మృతురాలి బంధువుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కర్రి జోగమ్మ (60) ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆరు నెలల క్రితం భర్త సత్తిబాబు మృతిచెందాడు. పిల్లలు లేరు. కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తోంది. ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఉన్నవారితో గొడవపడింది. సోమవారం ఉదయం ఇంట్లో ద్వారం సమీపంలో నేలపై పడి ఉంది. స్థానికులు గమనించి జోగమ్మ సోదరులకు సమాచారం ఇచ్చారు. తన సోదరిని ఎవరో హతమార్చారని రావిపాలెంకు చెందిన రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. జోగమ్మ శరీరంపై ఎలాంటి గాయాల్లేవని నిర్ధారించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

తీరంలో ఇద్దర్ని రక్షించిన మత్స్యకారులు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రేవుపోలవరం తీరంలో సముద్ర స్నానానికి దిగి మునిగిపోతున్న ఇద్దరు మహిళలను మత్స్యకారులు, మెరైన్ పోలీసులు రక్షించారు. ఎలమంచిలి మండలం పురుషోత్తపురానికి చెందిన రాజాన రమణి, మేనకోడలు పోలిశెట్టి ప్రవల్లికతో సోమవారం ఉదయం సముద్ర స్నానానికి వచ్చారు. తీరంలో అలల ధాటికి నీటిలో మునిగిపోయారు. అక్కడున్న మత్స్యకారులు వెంటనే సముద్రంలోకి దూకి ఇద్దరిని బయటకు తీసుకువచ్చారు. మెరైన్ పోలీసుల సాయంతో నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు. వీరిలో రమణిని ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పంపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	70
లైవ్	103	90
డ్రెస్డ్	149	150
స్కిన్‌లెస్	170	160

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

దశల వారీగా సూపర్ సిక్స్ పథకాలు

మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

కశింకోట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం దశల వారీగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా నర్సింగబిల్లి, దానోడు కాలనీలో సోమవారం ఇంటింటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంచారు. నూకునాయుడు, చిరంజీవి, అప్పారావు, సంతోష్, హరి పాల్గొన్నారు.

84వ వార్డు తెదేపా అధ్యక్షునిగా తలారి

అనకాపల్లి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 84వ వార్డు తెదేపా అధ్యక్షునిగా తలారి లక్ష్మీప్రసాద్ ఎన్నికయ్యారు. స్థానిక కోట్నివీధిలో పార్టీ వార్డు సమావేశం సోమవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, ఎన్నికల పరిశీలకులు అచ్చులనాయుడు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికైంది. ఉపాధ్యక్షునిగా పిల్లా తారకేష్, ప్రధాన కార్యదర్శిగా సాలాపు మోహన్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా కసిరెడ్డి అప్పలకొండ, సురాపు వెంకటగిరి, రేబాక ఈశ్వరఅప్పారావు, కోశాధికారిగా గవర సురేష్, కార్యదర్శులుగా నమ్మి రామారావు, గ్రంధి వినయ్, మహిళా అధ్యక్షురాలిగా నాగమణిని ఎన్నుకున్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, వార్డు ఇన్‌ఛార్జి నీలిబాబు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుకు పదవిపై హర్షం

అనకాపల్లి పట్టణం: తెదేపా సీనియరు నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు గోవా గవర్నర్‌గా నియామకం కావడంపై అనకాపల్లిలో తెదేపా నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు గవర్నర్ పదవి రావడం రాష్ట్రానికే గర్వకారణమని గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పేర్కొన్నారు.

ఎలమంచిలి గ్రామీణం: తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు సన్యాసినాయుడు, శ్రీను పులపర్తిలో ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించారు. పులి దేముళ్లు, గంజి శంకర్ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. 90/2024

వాది: ప్రత్తిపాటి సూర్యనారాయణ

ప్రతివాది: కుసుమంచి సతీష్

పై నెంబరు ప్రతివాదికి దావా సమను [illegible]

హాజరై మీకు గల అభ్యంతరాలు తెలియజేయగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానం కాబడునని తెలియజేయడమైనది.

D. RAVI SHANKAR
D. UMA SHANKAR
Advocates
Yellamanchili -531055
Cell : 9848693828

యలమంచిలి
తేదీ: 9-07-2025

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జీవీ కోటేశ్వరరావు వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. – సాంబశివరావు, ✓: సిబ్బందిని పంపి దీపాలు వెలిగేలా చూస్తాం. – శివ ప్రభాజీ, జీవీఎంసీ విద్యుత్తు విభాగం ఏఈ

అనకాపల్లి, న్యూస్‌టుడే: సతకంపట్టు వద్ద బోరు పనిచేయడం లేదు. – కే.ఎం.నాయుడు, ✓: పరిశీలించి వెంటనే బాగు చేయిస్తాం. – చక్రవర్తి, జోనల్ కమిషనర్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సాయి ఆదర్శనగర్‌లో సాయిబాబా ఆలయం వద్ద కాలువలో మురుగు పేరుకుపోయింది. – జి.రాజు, ✓: సిబ్బందితో కాలువలు శుభ్రం చేయిస్తాం. – ఉపరాజు, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వెంకటనగరం నుంచి పాల్మన్‌పేట వెళ్లే దారిలో గోతులు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – రవి, వాహన చోదకుడు, ✓: రోడ్డు మరమ్మతు చేపడతాం. – జయప్రకాశరావు, ఎంపీడీవో

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి పట్టణంలోని కాలువల్లో తీసిన పూడిక ఎప్పటికప్పుడు తరలించకుండా అలా వదిలేస్తున్నారు. దోమలు పెరిగి రోగాలబారిన పడుతున్నాం. – వి. ఉమ, ఎలమంచిలి, ✓: ఎప్పటికప్పుడు పూడిక తరలిస్తాం. – పల్లా శ్రీనివాసరావు శానిటరీ ఇన్‌స్పెక్టర్

నేడు మెగా జాబ్‌మేళా

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో మంగళవారం మెగా జాబ్‌మేళా జరగనుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేట ఎంపీడీవో జయప్రకాశరావు చెప్పారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఏడు గ్రామాలకు బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రాజశేఖర్ చెప్పారు. అరట్లకోట, మంగవరం, సత్యవరం, మాసాహెబ్‌పేట, కుమారపురం, రాజగోపాలపురం, కందిపూడి గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వెదురువాడ, గొర్లెధర్మవరం, లంకధర్మవరం, మెట్టధర్మవరం, మార్టూరు రోడ్డు, దిబ్బపాలెం సెజ్‌కాలనీ, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్డు, ఆవసోమవరం, ఆవరాజాం గ్రామాలకు ఈనెల 16న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కిడ్నీ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారా?

నేడు, రేపు ॥ గ్రామాల్లో స్క్రీనింగ్ పరీక్షలు

డయాలసిస్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో క్వారీల నుంచి వెలువడే దుమ్ము, కాలుష్యంతో కిడ్నీ సంబంధ సమస్యలు పెరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టరేట్, ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుల్లో క్వారీల కాలుష్యానికి సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచన మేరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బాధితులను గుర్తించేందుకు మంగళ, బుధ వారాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

■ క్వారీల ప్రభావం అధికంగా ఉన్న మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, ఊడేరు, బవులవాడ, సీహెచ్ఎన్ అగ్రహారం, వేటజంగాలపాలెం, సంపతిపురం, కుంచంగి, రొంగనివానిపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో ఈ నెల 15, 16 తేదీల్లో గ్రామస్థులకు వైద్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు.

■ గతంలో మామిడిపాలెంలో ఈ సమస్య అధికంగా ఉండటంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్థులందరికీ పరీక్షలు చేశారు. నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. 46 మంది బాధితులను గుర్తించి వైద్యం అందించారు. మిగిలిన గ్రామాల్లోనూ ఈ సమస్య ఉందన్న ఫిర్యాదుల నేపథ్యంలో మరోసారి పరీక్షలు నిర్వహించనున్నారు.

■ ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో రోజుకు పది మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఈ కేంద్రంలో 35 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. పీపీపీ విధానంలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రోగులకు వారంలో రెండు నుంచి మూడుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తోంది. గతంలో డయాలసిస్ కోసం విశాఖపట్నం, నర్సీపట్నం ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అనకాపల్లి ఆసుపత్రిలో ఏర్పాటు చేయడంతో కిడ్నీ రోగులకు ఉపయుక్తంగా ఉంది.

పరీక్షలు చేయించుకోండి: గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న శిబిరాల్లో అనుమానం ఉన్న వారంతా పరీక్షలు చేయించుకోవాలి. ఆయా గ్రామాల్లో ముందుగానే ప్రచారం చేశాం. పరీక్షల అనంతరం వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్య సేవలు అందిస్తాం. – హైమావతి, డీఎంహెచ్‌వో, అనకాపల్లి

ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఈవో నరేశ్ సోమవారం చెప్పారు. [illegible] పాఠశాల విద్యార్థిని మనబాల దుర్గా వారాహిమణి, వేంపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి ముల్లి రాజేష్ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారన్నారు. వారిని హెచ్ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

రామారావు మాస్టారికి ఘన నివాళి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏఎంఎల్ పీజీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు రామారావుకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ గెల్లా జయబాబు అధ్యక్షతన కళాశాలలో సంతాప సభ ఏర్పాటైంది. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఆర్‌వివోకు సత్కారం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఇంటర్ బోర్డు అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినోద్‌బాబును జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘ సభ్యులు సత్కరించారు. జనార్దన్, సన్యాసినాయుడు, నాగేశ్వరరావు, నాని, శేషగిరిరావు పాల్గొన్నారు.

వైద్యసేవలకు మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

కశింకోట, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో వైద్య సేవలందించిన ఆరోగ్య సహాయకుడు షేక్ అమీర్ పాషాకు న్యూఢిల్లీ మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ప్రదానం చేసింది. కొంకిటి మండలం తాళ్లపాలెం, పెనుగొల్లు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆయన్ను వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ బీసీ బాలుర వసతిగృహాలను ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో నరేశ్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టళ్లను తనిఖీ చేయాలన్న జిల్లా అధికారుల ఆదేశాలతో వీరిద్దరూ ఇక్కడికి వచ్చారు. ఆవరణ, గదులు, మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించారు. ఆవరణను మరింత శుభ్రంగా ఉంచాలని ఇన్‌ఛార్జి వార్డెన్ రాజుకు సూచించారు. ప్రస్తుతం మరమ్మతులు జరుగుతుండటంతో కొన్ని గదులనే విద్యార్థులకు కేటాయించారు. త్వరలోనే పనులు పూర్తవుతాయని వార్డెన్ చెప్పారు. వసతిగృహాల్లో మరమ్మతు పనులను త్వరితంగా పూర్తి చేయాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నక్కపల్లిలో వసతిగృహాన్ని సోమవారం పరిశీలించారు. ఫోన్ చేసి పనులను వేగంగా పూర్తి చేయించాలన్నారు. ఎంపీడీవో సీతారామరాజు వెంట ఉన్నారు.

వార్డెన్‌కు సూచనలు చేస్తున్న అధికారులు

ఆధ్యాత్మిక ప్రచారంపై వివాదం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దొసూరు శివారు కొల్లివానిపాలెంలో ఆధ్యాత్మిక ప్రచారంపై వివాదం నెలకొంది. గ్రామానికి రెండు ఆటోల్లో సోమవారం కొందరు మతబోధనల నిమిత్తం రాగా గ్రామస్థులు అభ్యంతరం చెప్పడంతో వాగ్వాదం జరిగింది. ఓ బాలుడు రాయితో దాడి చేయడంతో అతడిని గ్రామస్థులు నిర్బంధించి అనంతరం వదిలేయడం వివాదం సద్దుమణిగింది.

జెట్టీ నిర్మాణానికి వినతి

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేట తీరంలో మంజూరైన జెట్టీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని మత్స్యకార నాయకులు వాసుపల్లి శివాజీ, సిరిపల్లి అప్పలరాజు కోరారు. అనకాపల్లిలోని కార్యాలయంలో మత్స్య శాఖ జిల్లా అధికారి విజయను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని..

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: బీఆర్టీ కాలనీ, రామభద్రపురం కాలనీలను ప్రత్యేకంగా పంచాయతీగా ప్రకటించాలని కోరుతూ స్థానికులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రెండు ప్రాంతాల్లో 2,350 మందికిపైగా ఓటర్లు, 3,500 మంది జనాభా ఉన్నారని పేర్కొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో బీఎల్వోలకు రెండు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈఆర్వో గీతాంజలి, శిక్షకుడు అశోక్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. తప్పుల్లేకుండా ఓటరు జాబితాల రూపకల్పనే శిక్షణ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దారు నరసింహమూర్తి, డీటీ వీరవాణి, సీనియర్ సహాయకులు సింహాచలం పాల్గొన్నారు.

డొంకాడ ఎస్సీలకు న్యాయం చేయాలి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: డొంకాడ ఎస్సీలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం, హోంమంత్రి అనిత చర్యలు చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వి. శివప్రకాష్ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి సోమవారం మాట్లాడారు. అర్జునరావు, అప్పారావు, బాబ్జీ, కృష్ణ, స్వర్ణరాజు, జ్యోతి, జయసాగర్ పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ మృతికి సంతాపం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: సీనియర్ ఫొటోగ్రాఫర్ పెదపాటి నారాయణరావు (73) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన స్వగ్రామం రాంబిల్లి మండలం లాలం కోడూరు. వృత్తిరీత్యా ఎలమంచిలిలో స్థిరపడ్డారు. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియల్లో ఫొటోగ్రాఫర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు అధికధరలకు విక్రయిస్తే చర్యలు

మునగపాక, న్యూస్‌టుడే: కల్తీ క్రిమిసంహారక మందులు, అధిక ధరలకు ఎరువులు విక్రయించే వ్యాపారులపై చర్యలు తప్పవని విజయనగరం ఐటీపీ ఇంటర్నల్ స్క్వాడ్ మహారాజన్ హెచ్చరించారు. మునగపాకలో ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాన్ని సోమవారం తనిఖీ చేశారు. నిల్వలు, రికార్డులను పరిశీలించారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గవరపాలెంలో సోమవారం సంఘ సమావేశంలో రైతు సంఘ నాయకులు తేలయ్యబాబు, రామకృష్ణ మాట్లాడారు. శివరామ, నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్స్‌తో ఆరోగ్య సమస్యలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల జడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కన్సల్టెంట్ వైద్యులు ఎ. విశ్వనాథ్ మాట్లాడుతూ.. జంక్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. పిల్లలకు దంత పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీనివాస్, అరుణజ్యోతి, ప్రోత్సాహిని, షాన్వాజ్, మంగ, లక్ష్మి, శ్రీదేవి, శేషారత్నం పాల్గొన్నారు.

పాడిరైతులకు బోనస్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మడుతూరులో హెరిటేజ్ సభ్య రైతులకు సోమవారం ఏరువాక నగదు బోనస్ పంపిణీ చేశారు. హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేష గ్రామానికి చెందిన 23 మంది పాడిరైతులకు రూ.2.10 లక్షల బోనస్ అందించారు. పాడి రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ 2 గంటలు ఆపేయాలి

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: నెహ్రూచౌక్ కూడలిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను నిలిపివేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ హరనాథ్‌బాబు డీఎస్పీ శ్రావణికి వినతిపత్రం అందజేశారు. సిగ్నల్స్ వల్ల ఎండలో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం

నగదు అందజేస్తున్న స్నేహితులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న స్నేహితురాలిని ఆదుకోవడానికి పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. చోడపల్లికి చెందిన మైలపల్లి ఉషారాణి 2002-03లో అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండుకాళ్లు పోగొట్టుకున్న ఆమెకు స్నేహితులు సోమవారం రూ.60 వేలు అందించారు. రవితేజ, పవన్‌విజయ్, ఉమా, లక్ష్మి, లోవలక్ష్మి, సోమునాయుడు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మునగపాకకు చెందిన ఆడారి అప్పలనాయుడు, యశోద దంపతులు వారి కుమారుడు దినేష్ రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో కమిటీసభ్యులకు సోమవారం ఈ మొత్తం అందజేశారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూముల రీసర్వే

మునగపాక, న్యూస్‌టుడే: పాటిపల్లి రెవెన్యూ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. పారిశ్రామిక అవసరాలకు భూసేకరణ చేపట్టనున్నామన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో పారిశ్రామిక అవసరాలకు భూసర్వేపై సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ.. భూముల సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు ఆడారి త్రిమూర్తులు, రాంబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ సత్యనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై వెదుళ్లపాలెం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. న్యాయంపూడికి చెందిన చెవ్వేటి నాగేశ్వరరావు వెదుళ్లపాలెం కూడలి సమీపంలోని హోటల్‌కు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నక్కపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు నక్కపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో తోడపెద్దు మృతి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఎస్. నర్సాపురం జగనన్న కాలనీ సమీపంలో విద్యుదాఘాతంతో తోడపెద్దు మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. ఇటీవల కొనుగోలు చేసి తీసుకువచ్చామని మంచాల గోపి తదితరులు పేర్కొన్నారు.



(c) eenadu

ముగ్గురు కానిస్టేబుళ్ల బదిలీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గురు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. హెడ్‌కానిస్టేబుళ్లు అర్జున్, సురేష్, కానిస్టేబుల్ సురేష్‌ను సోమవారం స్టేషన్ అధికారులు, సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు. వారి సేవలను కొనియాడారు. కీలకమైన కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఎస్సై శ్రీనివాసరావు, ఏఎస్సై భాస్కరరావు, సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు: వచ్చే విద్యా సంవత్సరంలో నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా కొమ్మాది, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకలో చేరే అవకాశం ఉందన్నారు. ఈనెల 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

పంటలకు నీరందించండి సారూ..

నర్సీపట్నం, న్యూస్‌టుడే: బలిఘట్టం ప్రాంతం పంటలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు స్థానిక ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతుల తరఫున జన విజ్ఞాన వేదిక ప్రతినిధి కురుచ జోగినాయుడు ఆర్డీవోను కోరారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్డీవో నీటి పారుదలశాఖ అధికారులకు సూచించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి1: కుమార 21 ఎఫ్, మిరపకాయ, కుబేర, ఓ భామ అయ్యో రామ, ఆడి2: కుబేర, మార్గన్, ఆడి3: సూపర్ మ్యాన్, ఆడి4: జురాసిక్ వరల్డ్, ఎవి1 మూవీ, బంగారాజు: వర్జిన్ బాయ్స్, రాజు: 3బీహెచ్‌కే, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: సూపర్ మేన్, సాయిలక్ష్మి: వర్జిన్ బాయ్స్, పూర్ణ: 3బీహెచ్‌కే.

ఈ ఏడాదైనా నీరందేనా ?

అధ్వానంగా ఆర్‌ఎంసీ కాలువ

రావికమతం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయం కుడి ప్రధాన కాలువ (ఆర్‌ఎంసీ) నిండా పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కతో పూడిక పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. కాలువలను బాగు చేయించకపోవడంతో ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి కనిపించడంలేదు. ఆర్‌ఎంసీ కాలువ పొడవు పెద్దేరు జలాశయం నుంచి మేడివాడ పెద్ద చెరువు (బ్యాలెన్సింగ్ రిజర్వాయరు) వరకూ 19.225 కి.మీ. ఉంటుంది. మేడివాడ పెద్ద చెరువు నుంచి బుచ్చెయ్యపేట మండలం కె.పి.అగ్రహారం వరకు మరో 7కి.మీ. ఉంటుంది.

★ ఈ రెండు మండలాల పరిధిలో 25కిపైగా గ్రామాలు ఉంటాయి. 7వేల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్‌లో సాగునీరు అందించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఎర్రవాయి ప్రాంతమైన బుచ్చెయ్యపేట మండలంలోని మెట్టు భూములకు ఈ కాలువ ద్వారా నీరందించాలన్నది ప్రధాన లక్ష్యం. 2008లో మట్టి కాలువతో ఆర్‌ఎంసీ కాలువను ఏర్పాటు చేసినప్పటికీ కొంతకాలమే చివరి వరకు సాగునీరు పారింది. ఆ తర్వాత నుంచి కాలువ నిర్వహణ పట్టించుకోకపోవడంతో రెండు నుంచి మూడు అడుగుల మేర పూడిక పేరుకుపోయి ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందట్లేదని రైతులు చెబుతున్నారు.

★ చినపాచిల, బుడ్డిబంద, కొమిర, కవగుంట రైతులు శ్రమదానం చేసి కాలువను మెరుగు పరచుకున్న సందర్భాల్లోనే అది కూడా చినపాచిల వరకు కాలువ ద్వారా నీరు వచ్చేది. చినపాచిల దాటి మేడివాడ వరకు, అక్కడి నుంచి కె.పి.అగ్రహారం వరకు నీరు పారిన దాఖలాలు ఈ మధ్య కాలంలో కనిపించలేదు. పూడిక తొలగించకపోవడంతో ఈ ఏడాది కూడా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం కనిపించట్లేదని రైతులు వాపోతున్నారు. సిమెంట్ లైనింగ్ చేయించాలని రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారు.

మరుపాక వద్ద చిట్టడవిని తలపిస్తూ..

యర్రబంద సమీపంలో ఆర్‌ఎంసీ కాలువ ఇలా..

అభివృద్ధి చేస్తాం..

గత వైకాపా ప్రభుత్వంలో ఆర్‌ఎంసీ కాలువ అభివృద్ధికి స్పెషల్ గ్రాంట్ కింద రూ.30 కోట్లు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం జరగలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతాం. ఆర్‌ఎంసీ కాలువను జలాశయం నుంచి మేడివాడ వరకు, అక్కడి నుంచి కేపీ అగ్రహారం వరకు రెండు దశల్లో అభివృద్ధి పనులు చేస్తాం.
– పైడితల్లి బాబు, జేఈ, జల వనరులశాఖ

విద్యుత్తు స్మార్ట్‌మీటర్లు.. వినియోగదారులకు చిక్కులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. బిల్లులు చెల్లించకపోతే అర్ధాంతరంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. తర్వాత చెల్లించినా పునరుద్ధరణలో జాప్యం జరుగుతుంది. రెండు, మూడు రోజులైనా సరఫరా రాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇవేం మీటర్లు బాబోయ్ అంటూ గగ్గోలు పెడుతున్నారు.

★ మొదటి విడతగా కేటగిరి-2 కనెక్షన్లన్నింటికీ స్మార్ట్ మీటర్లు అమర్చారు. పాత మీటర్లు ఉన్నప్పుడు నెలనెలా సిబ్బంది వచ్చి మీటరు రీడింగ్ తీసి బిల్లు ఇచ్చేవారు.

విద్యుత్తు స్మార్ట్ మీటరు

గడువు దాటి ఓ పది రోజులు అటూ ఇటూ అయినా బిల్లు చెల్లించడానికి అవకాశం ఉండేది. స్మార్ట్ మీటర్లు అమర్చిన తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారింది. రీడింగ్ తీసే సిబ్బంది ఎవరూ రావడం లేదు. నెల పూర్తి కాగానే మొబైల్ నంబరుకు సమాచారం వస్తుంది. గడువులోగా బిల్లు చెల్లించకపోతే సరఫరా రావడం లేదు. దీనికి తోడు అధికంగా బిల్లులు వస్తున్నాయంటూ వినియోగదారులు వాపోతున్నారు. తొలివిడతలో కేటగిరి-2 కనెక్షన్లన్నింటికీ మీటర్లను బిగించారు. తర్వాత నివాసిత గృహాలకు స్మార్ట్ అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం

రెండు రోజులు సరఫరా లేదు

వడ్రంగి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు అంతా యంత్రాలపైనే పని. విద్యుత్తు సరఫరా లేకపోతే పని లేక ఖాళీగా ఉండాల్సిందే. మాకు నెల రోజుల కిందట పాత మీటరు తొలగించి స్మార్ట్ మీటరు బిగించారు. ఇటీవల బిల్లు కట్టలేదని అర్ధాంతరంగా సరఫరా నిలిపివేశారు. వెంటనే మీసేవ కేంద్రానికి వెళ్లి బిల్లు కట్టినప్పటికీ విద్యుత్తు సరఫరా రాలేదు. రెండు రోజుల తర్వాత సరఫరా వచ్చింది. – గోపాలన ముత్యాలు, వడ్డాది కొత్తూరు

బకాయిలు ఉంటే కరెంటు రాదు

సకాలంలో బిల్లు కట్టకపోయినా, బకాయిలు పెండింగ్‌లో ఉన్నా కరెంటు సరఫరా నిలిచిపోతుంది. మా చేతుల్లో ఏమీ ఉండదు. ముందుగానే మెసేజ్‌లు చూసుకుని బిల్లు చెల్లించాలని చెబుతున్నాం. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల ఇబ్బందులు వస్తే సరి చేస్తున్నాం. ఇటీవల వడ్డాదిలో రెండు మీటర్లకు బిల్లు కట్టినా వెంటనే సరఫరా రాలేదని ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించాం.
– రాజు, ఏఈ, వడ్డాది సెక్షన్

అ వీ ఇ వీ

బుచ్చెంపేట విద్యార్థుల ప్రతిభ

రోలుగుంట, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఆదేశాల మేరకు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బీమిలిలోని జిల్లా విద్యాశిక్షణా సంస్థల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో మండలంలోని బుచ్చెంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సత్తాచాటారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లోని వేర్వేరు విభాగాల్లో నడిపింటి భాగ్యశ్రీ, ఇటంశెట్టి లలిత ఇద్దరూ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని 'డైట్' యాజమాన్యం సత్కరించి నగదుతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. హెచ్‌ఎం వరలక్ష్మి, విద్యాకమిటీ ఛైర్మన్ చిటికెల వెంకట రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ రైతులకు న్యాయం చేయండి

మాకవరపాలెం, న్యూస్‌టుడే : జి.కోడూరు రెవెన్యూలో నల్లరాయి క్వారీ నిర్వాహణకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలంటూ పలు ప్రజా సంఘాలు సోమవారం ఆందోళనకు దిగాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సర్వే నంబరు 332లో నల్లరాయి క్వారీని ఆనుకుని దళితుల డి.పట్టా భూములు ఉన్నాయన్నారు. క్వారీలో జరిగే పేలుళ్ల కారణంగా రాళ్లు జీడి మామిడి చెట్ల పడి పాడవుతున్నాయని వాపోయారు. క్వారీ అనుమతులు రద్దు చేయాలంటూ తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం నర్సీపట్నం ఆర్డీవో రమణకు వినతి పత్రం అందించారు.

పింఛనుదారుల ధర్నా

చోడవరం, న్యూస్‌టుడే: పింఛనుదారుల రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఉదయం పది గంటలకు అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద ధర్నా జరుగుతుందని ఆ సంఘం చోడవరం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు వి.చినబాబు, బి.దక్షిణామూర్తి ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. చోడవరం ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పింఛనుదారులంతా పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల ర్యాలీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలను నిర్మించాలని, విద్యార్థులకు ఇచ్చే మెస్ ఛార్జీలను పెంచాలని డిమాండు చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు సోమవారం నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ మాట్లాడుతూ అద్దె భవనాల్లో సదుపాయాల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలన్నారు.

రూ.40 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో రూ. 40 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవనం నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తెలిపారు. సోమవారం చింతపల్లిలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి వీధిదీపాలు పంపిణీ చేశారు. అనంతరం సంతబయలు దిగువన రూ.40 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

జ్వరాలు ప్రబలుతున్నాయ్

నాతవరం, న్యూస్‌టుడే: నాతవరం ప్రాంతంలో జ్వరాలు ప్రబలుతూనే ఉన్నాయి. సరిగా మూడు నెలల నుంచి వందలాది మంది జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం సోకినవారు. దాదాపు 15 రోజుల్లోనే మంచాన పడుతున్నారు. వీరిలో అధిక శాతం కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నారు. మే నెల నుంచి ఇక్కడ ఈ ప్రభావం ఎక్కువ కనిపిస్తోంది. తాజాగా నాతవరంలోనే 200కు పైగా జ్వర పీడితులున్నట్లు అంచనా. ఈ విషయమై పలువురికి వైద్య పరీక్షలు చేయగా చికిన్‌గన్యాగా ఫలితాలు వస్తున్నట్లు చెబుతున్నారు. తాజాగా నాతవరం, గునుపూడి ఆరోగ్యకేంద్రాల పరిధిలో 30 గ్రామాల్లో వందలాది మంది జ్వరాల బారిన పడ్డారు. అధికంగా నర్సీపట్నం, తుని ఆసుపత్రుకు తరలి వెళుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటికొకరు ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి ఇంత క్లిష్టంగా ఉన్న సమయంలో ప్రభుత్వ వైద్యులు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో వచ్చిన వారు రెండు రోజులు వ్యవధిలోనే వెనుదిరిగారు. రెండు ఆరోగ్య కేంద్రాల్లోనూ సిబ్బంది కొరత కారణంగా వైద్య సేవలు సరిగా అందడం రోగులు వాపోతున్నారు.

రోగిని నడిపించుకొని తీసుకొస్తున్న కుటుంబసభ్యులు

రూ.50 లక్షలతో మోదకొండమ్మ ఆలయం అభివృద్ధి

మాడుగుల, న్యూస్‌టుడే : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేలుపు మాడుగుల మోదకొండమ్మ దేవత ఆలయానికి ఇటీవల అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్ రూ. 50లక్షలు అభివృద్ధికి ప్రకటించారు. ఈ నిధులతో ఆలయంలో ఏసీ హాలు నిర్మాణంతో పాటు ప్రధానంగా అమ్మ వారి ఆలయానికి ఈశాన్య దిశలో ఉన్న పాండవుల చెరువును అభివృద్ధి చేస్తామని ఆలయం ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. స్నానఘట్టాలు అభివృద్ధి చేసి నీరు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. చెరువులో పారిశుద్ధ్యం మెరుగు పరచడం ద్వారా ఆలయానికి వచ్చిన భక్తులు స్నానాలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

పాండవుల చెరువు

మార్కెట్ కమిటీ ఛైర్మన్, సభ్యుల నియామకం

పుప్పాల అప్పల రాజు (ఛైర్మన్)

మాడుగుల, న్యూస్‌టుడే : మాడుగుల నియోజకవర్గం మార్కెట్ కమిటీ గౌరవ ఛైర్మన్‌గా శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి, ఛైర్మన్‌గా పుప్పాల అప్పల రాజు, ఉపాధ్యక్షుడు దాలిబోయిన రామగోవింద నియమితులయ్యారు. వీరితో పాటుగా నియోజకవర్గం నుంచి మరో 16 మందిని సభ్యులుగా ప్రకటించారు. అసిస్టెంట్ డైరెక్టరు నర్సీపట్నం, గ్రామ పంచాయతీ సర్పంచి కళావతి,(మాడుగుల), జిల్లా అగ్రికల్చర్‌ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారు. ఇందుకు సంబంధించి సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

దేవరాపల్లి : మాడుగుల మార్కెటు కమిటీలో దేవరాపల్లి మండలానికి చెందిన ముగ్గురు తెదేపా నాయకులకు చోటు దక్కింది. ఇందులో దేవరాపల్లికి చెందిన బంధం అప్పలరాజుతో పాటు అల్లం కుమారి, చౌడువాడ వెంకట సత్యవతి మార్కెటు కమిటీ సభ్యులుగా అవకాశం లభించింది.

రాష్ట్ర వైకాపా బీసీసెల్ ఉపాధ్యక్షుడిగా రామన్న

రావికమతం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైకాపా బీసీసెల్ ఉపాధ్యక్షుడిగా రావికమతం మండలం మర్రివలసకు చెందిన కంట్రెడ్డి రామన్న పాత్రుడు నియమితులయ్యారు. ఈయన గతంలోనూ ఆ పార్టీ అభివృద్ధికి వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ముఖ్యనేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

శృంగవరం సచివాలయంలో సిబ్బంది కొరత

నాతవరం, న్యూస్‌టుడే: ప్రజలకు ప్రభుత్వ సేవలందించడంలో కీలకంగా ఉన్న సచివాలయాల్లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఇటీవల బదిలీల్లో నాతవరం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు అనేక మంది వెళ్లి పోయారు. వీరి స్థానంలో కొత్తవారు ఇక్కడికి వచ్చి చేరకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఫలితంగా వివిధ పనులపై సచివాలయానికి వచ్చే వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. శృంగవరం సచివాలయంలో కార్యదర్శి ఒక్కరే మిగిలారు. ఈ సచివాలయం పరిధిలోని ఎపి.పురం పంచాయతీ నుంచి నిత్యం అనేక పనులపై వచ్చి సిబ్బంది లేరని తెలుసుకుని ఇబ్బంది పడుతున్నారు. సరుగుడు, గుమ్మడుగొండ, ములగపూడితో బాటు మండల కేంద్రం నాతవరంలోనూ ఇదే పరిస్థితి ఉంది. మండలంలో 17 సచివాలయాలకు సంబంధించి కేవలం ముగ్గురు డిజిటల్ సహాయకులు మాత్రమే ఉన్నట్టు ఎంపీడీవో కార్యాలయం అధికారులు వెల్లడించారు.

సచివాలయం వద్ద ఒక్కరే విధుల నిర్వహణ

చురుగ్గా తహసీల్దార్ భవన నిర్మాణం

చోడవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో అసంపూర్తిగా ఉన్న తహసీల్దారు భవన సముదాయం నిర్మాణ పనులు వేగవంతం చేశారు. సాధ్యమైనంత తొందరలో నిర్మాణ పనులు పూర్తి చేయించాలన్న కృతనిశ్చయంతో ఎమ్మెల్యే రాజు ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పై సమీక్ష చేస్తున్నారు. రూ.1.25 కోట్లు పనులకు శ్రీకారం చుట్టారు. ఏడేళ్ల కిందట ప్రారంభించిన పనులను గత అయిదేళ్ల వైకాపా హయాంలో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో తహసీల్దారు కార్యాలయం స్త్రీశక్తి భవనంలో నడుస్తోంది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అసంపూర్తి భవన నిర్మాణ పనులు ఈ ఏడాది ప్రారంభంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా నిర్మాణ పనులు ప్రారంభింప జేసిన విషయం విదితమే.

భవనానికి గోడలు కడుతున్న తాపీమేస్త్రీలు

బిల్లు కలెక్టర్ల పై డీపీవోకి ఫిర్యాదు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పంచాయతీలో ఇంటి పన్నుల నగదు పక్కదారి పట్టించిన ముగ్గురు బిల్లు కలెక్టర్ల విషయమై జిల్లా పంచాయతీ అధికారికి లిఖిత పూర్వకంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఫిర్యాదు కాపీని పంపించారు. వారా రమణ, మామిడి వెంకటరమణ, సరోజల నుంచి ఇంటి పన్నుల నగదు రూ.15.38 లక్షల వసూలు చేయాల్సి ఉంది. గతంలో ఈనాడు వార్త కథనం పై అప్పటి ఈవోఆర్డీ చైతన్య విచారణ జరిపి నగదు కొంత మేర బ్యాంకుకు జమ చేయలేదని పేర్కొన్నారు. రెండేళ్లవుతున్నా జమ చేయలేదు. * పారిశుద్ధ్య సిబ్బంది తమ వేతనాలు చెల్లించాలంటూ కార్యదర్శికి మొర పెట్టుకున్నారు. వేతనాలు చెల్లింపు విషయమై ఎమ్మెల్యే రాజుకు ఫిర్యాదు చేసే సిబ్బంది సమాయత్తమయ్యారు.

లోపూడికి నీరొచ్చింది

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: లోపూడి గ్రామంలో తాగు నీటి సరఫరాను సోమవారం పునరుద్ధరించారు. మోటారు కాలిపోవడంతో నీటిసరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. వారం రోజులుగా తాగునీటి కోసం గ్రామస్థులందరూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు పంచాయతీ నాయకులు మేరుగు కుమారి, కార్యదర్శి రామిరెడ్డి, యల్లపు జగ్గారావు తదితరులు స్పందించారు. కొత్తమోటారు ఏర్పాటు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామస్థులకు నీటి కష్టాలు తీరడంతో ఆనందం వ్యక్తం చేశారు.

లోపూడిలో కొత్త మోటారు ఏర్పాటు పనులు

రావికమతం చెత్త నర్సీపట్నానికి తరలింపు

రావికమతం, న్యూస్‌టుడే: మండల కేంద్రం రావికమతం సహా పది గ్రామ పంచాయతీల్లోని చెత్తను నర్సీపట్నం మున్సిపాలిటీకి తరలించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి చెప్పారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు రావికమతం, కొత్తకోట, తట్టబంద, మేడివాడ తదితర పది గ్రామ పంచాయతీల్లోని చెత్తను సేకరించి నర్సీపట్నం మున్సిపాలిటీ ఆధీనంలో నడుస్తున్న చెత్త నుంచి విద్యుత్ తయారీ కేంద్రానికి తరలించే ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రావికమతంలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామ స్వామి పరిశీలించారు.

నేరాల కట్టడిపై అవగాహన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఆకతాయిల ఆటకట్టించేందుకు కె.కోటపాడులో సోమవారం అంతటాతిరిగింది శక్తిటీమ్. బస్‌షెల్డరు వద్ద ప్రయాణీకులకు, జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల వద్ద విద్యార్థులు, గ్రామస్థులను స్వయంగా కలిసి గృహహింస, ఈవ్‌టీజింగ్, వరకట్నం వేదింపులు తదితర నేరాలపై అవగాహన కల్పించారు. సమస్య ఉంటే 112, 181, 1930,1098 కాల్‌సెంటరు నంబర్లకు సమాచారం ఇవ్వాలని టీమ్ సభ్యులు కనకం, ద్రాక్షయినిలు తెలిపారు.

కె.కోటపాడులో జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న శక్తిటీమ్ సభ్యులు

ఘనంగా బహుళ చవితి హోమం

హోమంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో సోమవారం ఆషాఢ బహుళ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా సామూహిక లక్ష్మీగణపతి హోమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి, దేవస్థానం ఈఓ ఎస్.వి.వి.సత్యనారాయణ, నిర్వాహకులు భక్తులకు పాల్గొన్నారు.

రావికమతం, న్యూస్‌టుడే: టి.అర్జాపురంలోని బాల వరసిద్ధి వినాయక ఆలయంలో సోమవారం సంకష్టహర చతుర్థి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు లక్ష్మణరావు లక్ష్మీ గణపతి హోమం జరిపించారు.

జవాబుదారీగా పనిచేయండి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: వ్యక్తిగతంగా గ్రామాల అభివృద్ధి పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా జవాబుదారీగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం ఆయన గుల్లిపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమకార్పోరేషన్ డైరెక్టరు రొంగలి మహేశ్, కశిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుల్లిపల్లిలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

గిరిజన బాలింతకు ఎమ్మెల్యే పరామర్శ

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని అర్ల శివారు కొండశిఖర గ్రామమైన లోసంగి పీవీటి తెగకు చెందిన పాంగి సాయి అనే బాలింతను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు సోమవారం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో పరామర్శించారు. పాంగి సుందరరావు భార్యకు ఈనెల 13న పురిటి నొప్పులు రావడంతో డోలీమోతతో సుమారు 4.కి.మీ దూరం ప్రయాణించారు. అంబులెన్స్ రావడం ఆలస్యమవడంతో మార్గమధ్యంలోనే చెట్టు కింద ఆమె ప్రసవించారు. తల్లీబిడ్డలకు ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో చికిత్స అందించి మరింత మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వీరజ్యోతి పరామర్శించారు.

బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

చోడవరం, రావికమతం : పట్టణంలో పలు నివాసిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాజు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు కొట్టాపు రూపాదేవి పాల్గొన్నారు. ★ మేడివాడ నుంచి గర్నికం వరకు రెండు కి.మీల మేర భారీ గుంతలతో అధ్వానంగా తయారైంది. దీంతో ఎమ్మెల్యే సూచన మేరకు ఈనెల 7న పూడ్చివేత పనులు మొదలు పెట్టారు. సోమవారం తెదేపా నాయకులతో కలిసి పనులను పరిశీలించారు.

నాతవరం : ఏడాది సుపరిపాలన కార్యక్రమం నాతవరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వి.రమణ ఆధ్వర్యంలో స్థానిక నేతలు పి.కొండబాబు, ఎ.మాణిక్యం పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

చీడికాడ, న్యూస్‌టుడే: ముద్దచర్మ వాధి నివారణకు పశువులకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని, ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 25 వరకు జరుగుతుందని రైతుల సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు చిట్టినాయుడు సూచించారు. చీడికాడ మండలం ఖండివరంలో సోమవారం నిర్వహించిన ముద్దచర్మ వాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,240 పశువులకు టీకాలను వేశామని పెదగోగాడ పశువైద్యాధికారి మణిలక్ష్మణ్ చెప్పారు. అనంతరం చిట్టినాయుడు బైలపూడి పశు గణ కేంద్రం, జేబీపురం రైతు సేవా కేంద్రంలో దస్త్రాలు తనిఖీ చేశారు.

ఖండివరంలో టీకా శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు చిట్టినాయుడు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

నర్సీపటం, న్యూస్‌టుడే: ఇక్కడి డాన్‌బాస్కోస్ పాఠశాల వెనుక కల్వర్టు మధ్యలో శిథిలమై ప్రమాదకరంగా మారింది. తక్షణం దీనికి మరమ్మతులు చేపట్టాలి.– ఎం.నాగరాజు, నర్సీపట్నం, ✔: వెంటనే దీనిని పునర్నిర్మించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. – ఎం.రవి, మున్సిపల్ ఏఈ, నర్సీపట్నం

సమస్య: చోద్యం దరి ఆయిల్‌పామ్ తోటలో వేలాడుతున్న విద్యుత్తు తీగలు ఆందోళన కలిగిస్తున్నాయి. చేతికి అందే ఎత్తులో ఉన్న వీటితో ఆయిల్ పామ్ గెలలు కోసేందుకు వచ్చిన కూలీలకు ప్రమాదం కలిగించేలా ఉన్నాయి.– భాస్కర్‌రావు, రైతు, ✔: రైతు ఫిర్యాదు మేరకు అక్కడ పరిస్థితిని పరిశీలించాం. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం దిశగా చర్యలు చేపడతాం.
– రాజుబాబు, లైన్ పర్యవేక్షకులు

గోతులు పూడ్చించారు

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: చోద్యం వద్ద మూడు రోడ్ల కూడలిలో గోతులు ప్రమాదకరంగా మారడంతో నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 5న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గోతులను పూడ్చించి ఇబ్బందులు తొలగించారు.

'ఉపాధ్యాయుడిని బదిలీ చేయాలి'

రోలుగుంట, న్యూస్‌టుడే: పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బోనెల రామును తక్షణమే బదిలీ చేయాలని లేకుంటే తమ పిల్లలను పాఠశాలకు పంపించలేమని మండలంలోని గిరిజన పంచాయతీ అయిన అర్ల గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. హెచ్‌ఎం.రాము పిల్లలకు సరిగా చదువు చెప్పడం లేదని, తల్లిదండ్రుల సమావేశాల్లో అడుగుతున్న ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా గొడవలకు దిగుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోలుగుంట పోలీసులకు ఈనెల 12న ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా పాఠశాల తన విధులకు పలువురు ఆటంకం కలిగిస్తున్నారని ఉపాధ్యాయుడు అన్నారు. వేరే ప్రాంతానికి బదిలీచేయాలని ఎంఈవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయమై గ్రామస్థులు, ఉపాధ్యాయుడికి మధ్య సోమవారం ఎంఈఓ రాజీకి యత్నించినా ఫలితం లేకపోయింది. పరిస్థితిని జిల్లా అధికారులకు దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు. చర్చల్లో సర్పంచి వి.వాణి, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ పాడి లక్ష్మి, వైస్‌ఛైర్మన్ పాడి శ్రీను మూకుమ్మడిగా డిమాండ్ చేశారు.

హెచ్‌ఎం, గ్రామస్థులతో చర్చిస్తున్న ఎంఈఓ జాన్‌ప్రసాద్

రహదారుల అభివృద్ధి చేపట్టండి

చోడవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లాలో రహదారులు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయని ప్రధానం బీ-ఎన్ రహదారి దుస్థితి మరి ఘోరంగా తయారైందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా వాసులు సోమవారం కోరారు. అక్కుమహంతి నాగేశ్వరరావు సారథ్యంలో పది మంది జిల్లా వాసులు మచిలీపట్నం వెళ్లారు. అక్కడ మంత్రికి రహదారుల దుస్థితిని వివరించామని ఆర్క్ సీఈవో డి.ఎస్.ప్రసాదు తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో మంగళవారం మెగా జాబ్‌మేళా జరగనుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేట ఎంపీడీవో జయప్రకాశరావు చెప్పారు. నిరుద్యోగ యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పెందుర్తి

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - **సూపర్ మ్యాన్ (2డీ తెలుగు)**

స్క్రీన్-2 - **ఓ భామ.. అయ్యో రామ**

బిల్లులు చెల్లించాలని నిరసన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మా కంపెనీ ఎదుట సోమవారం మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టుకు చెందిన ప్రతినిధులు నిరసన చేపట్టారు. ప్రధానద్వారం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. కంపెనీలో చేసిన ఫ్యాబ్రికేషన్ పనులకు చెందిన బిల్లులను కంపెనీ యాజమాన్యం చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రతిభా పురస్కారాలకు యాదవ సామాజికవర్గ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి డొక్కిరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులకంటే ఎక్కువ సాధించిన, జేఈఈ, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాలులో పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఇతర వివరాలకు 81434 46565 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 94వ వార్డు రవినగర్‌లో 6బి/8/2, 6బి/8/3 వీధి దీపాలు నెల రోజులుగా వెలగడం లేదు. - శ్రీలక్ష్మి, రవినగర్ ✓: వీధి దీపాలను మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. - హరి బహదూర్, వీధి దీపాల నిర్వహణ అధికారి

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్ఆర్ఎం కాలనీలోని వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు ✓: కాలనీలో పరిశుభ్రత పనులు చేపట్టడానికి చర్యలు చేపడతాం. - ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం మెయిన్ రోడ్డులో దీపాలు వెలగడం లేదు. ఫలితంగా రాత్రుళ్లు రోడ్డుకు మీద వెళ్లాలంటే భయమేస్తోంది. వెంటనే దీపాలు వెలిగించాలి. - సబ్బవరం, గ్రామస్థులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - అశోక్‌కుమార్, ఏఈ

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాహనాలను వెంబడిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. వెంటనే వాటిని పట్టి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాలి. - వై.రామునాయుడు, సబ్బవరం ✓: కుక్కలను పట్టుకునే ఏర్పాటు చేస్తాం. - వై.రాజేశ్వరరావు, కార్యదర్శి, సబ్బవరం

నిర్వహణ కొరవడి.. నిరుపయోగంగా మారి.. గ్రామాల్లో పడకేసిన ఆర్వో ప్లాంట్లు

దేవాడలోని ప్లాంటు చుట్టూ పెరిగిన ముళ్ల చెట్లు

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే అందించాలనే ఉద్దేశంతో కొన్నాళ్ల క్రితం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో పరిసర గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లను నిర్మించింది. ఒక్కో దానికి సుమారు రూ.10 లక్షల పైనే ఖర్చు చేసింది. వీటిని ప్రారంభించిన తర్వాత జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. కొన్నాళ్లు బాగా పనిచేసినా జీవీఎంసీ సిబ్బంది నిర్వహణను గాలికొదిలేయడంతో పడకేశాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెం, దేవాడ, చినపాలెం గ్రామాలతో పాటు 79వ వార్డులోని దేశపాత్రునిపాలెంలోని శుద్ధినీటి ప్లాంటు గతకొన్నాళ్లుగా నిరుపయోగంగా మారి దిక్కులు చూస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. వీటిని మంచి లక్ష్యంతో నిర్మించినప్పటికీ మూతపడటంతో సీఎస్ఆర్ నిధులు వృథా అవుతున్నాయని వాపోతున్నారు.

శుద్ధి నీటికి ఇక్కట్లు పడుతున్న ప్రజలు: ★ పిట్టవానిపాలెంలో బోరు మూలకు చేరడంతో ప్లాంటును మూసివేశారు. ఇక్కడ సుమారు 1500లకు పైగా జనాభా నివసిస్తున్నారు. పరిశ్రమల కారణంగా భూగర్భజలాలు కలుషితం కావడంతో శుద్ధి నీటికి అవస్థలు పడుతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

★ దేవాడ, చినపాలెంలోని ప్లాంట్లు పడకేయడంతో వీటిచుట్టూ ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. ఆర్వో యంత్ర సామగ్రి తుప్పుపట్టాయి. గతంలో రెండు గ్రామాల్లో 2 వేలకు పైగా జనాభా వీటిని వినియోగించుకునేవారు. వ్యయప్రయాసలు పడుతూ సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. చినపాలెంలో విద్యుత్తు కనెక్షన్ లేదు.

★ దేశపాత్రునిపాలెంలో భూగర్భ జలాలు అడుగంటాయనే కారణంతో ప్లాంటును మూసివేశారు. బోరులోని విద్యుత్తు మోటారును అధికారులు బయటకు తీసి వదిలేశారు. ప్రస్తుతం ఆ మోటారు ఎక్కడుందో తెలియని పరిస్థితి. గ్రామంలోని సుమారు 5 వేల మంది వినియోగించే ఈ ప్లాంటు మూతపడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, పాలకులు స్పందించి ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చినపాలెంలో నిరుపయోగంగా ఆర్వో యంత్ర సామగ్రి

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ నుంచి విజయరాంపురం మధ్య సుమారు 2 కిలోమీటర్ల పొడవు గల గుంతల రహదారి కూటమి ప్రభుత్వంలో అద్దంలా రూపుదిద్దుకుంది. గత వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పట్టించుకోకపోవడంతో రహదారి పొడుగునా పెద్దపెద్ద ప్రమాదకర గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. వర్షం పడితే గుంతలు నీటి కుంటలను తలపించడంతో పాటు రహదారి మొత్తం చిత్తడిగా మారడంతో అటుగా రాకపోకలు సాగించడానికి వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రోడ్డును నూతనంగా నిర్మించడంతో పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన చోదకులకు న్యాయస్థానం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై నరసింగరాజు తెలిపారు. సోమవారం 8 మందిని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.80 వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

16 నుంచి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 16 నుంచి 19 వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 16న రాత్రి 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో విశాఖ చేరుకుని, హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. 17న ఉదయం 10 గంటలకు మిందిలోని బీహెచ్‌పీవీ ప్లాంట్‌ను సందర్శించి, అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో సమావేశమవుతారు. 18న ఉదయం హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంట్‌ను సందర్శించి, వివిధ అంశాలపై అధికారులతో మాట్లాడతారు. సాయంత్రం విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్, సీపీ, ఇతర అధికారులతో సమావేశమై వివిధ పథకాల అమలుపై చర్చిస్తారు. 19న రాత్రి బయలుదేరి దిల్లీ వెళ్తారు.

గణనాథుడి సన్నిధిలో సంకష్టహర చతుర్థి పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే: సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని పెందుర్తి మండలంలోని పలు వినాయక ఆలయాల్లో సోమవారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. పెదగాడి గ్రామంలోని స్వర్ణాక్ష కాలభైరవ ఆలయ ప్రాంగణంలో కొలువైన సంకటహర గణపతికి విశ్వనాథ గురుజీ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు జరిపారు. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని సంపత్ వినాయక ఆలయంలో గణనాథుడికి అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వేంపరాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పండితులు వైదిక కార్యక్రమాలు జరిపారు.

పెదగాడిలో పూజలందుకున్న వినాయకుడు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

వేపగుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, నియోజకవర్గ పరిశీలకుడు కోరాడ రాజబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేపగుంట ముత్యమాంబ కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. టిడ్కో ఇళ్లకు డీడీలు కట్టినా ఇళ్లు రాలేదని, సెంటు స్థలాలు గత ప్రభుత్వం ఇస్తానని చెప్పి ఇవ్వలేదని వాపోయారు. ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని నేతలు చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ

పీజీఆర్ఎస్‌కు 11 అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు స్వీకరించారు. లక్ష్మీపురంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని, జనచైతన్య లేఅవుట్, జ్యోతినగర్, గొల్లవిల్లిపాలెంలో యూజీడీ, రోడ్డు కాలువలు నిర్మించాలని, చీమలపల్లిలో పందులు, శేషాద్రినగర్‌లో పిచ్చిమొక్కల సమస్యలను పరిష్కరించాలని, బుచ్చిరాజుపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలని, నరసింహనగర్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పరవాడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ మల్లికార్జునరావు సూచించారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోకి అనుమానితులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తు పదార్థాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అతివేగంతో వాహనాలు నడపరాదని, శిరస్త్రాణాలు తప్పకుండా ధరించాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదన్నారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పచ్చదనం, పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పెందుర్తి శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ తారకేశ్వరరావు సూచించారు. 'గ్రీన్ ఇండియా - క్లీన్ ఇండియా' పేరుతో సోమవారం పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముగిసిన ఓటరు నమోదు శిక్షణ శిబిరం

పెందుర్తి, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు చేపట్టిన ఓటరు నమోదు శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. నియోజకవర్గంలోని 299 మంది బీఎల్‌వోలకు ఈ నెల 7వ తేదీ నుంచి బ్యాచ్‌ల వారీగా పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. చివరి బ్యాచ్‌కు శిక్షణ పూర్తవడంతో ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ అర్జునరావు బీఎల్‌వోలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

బీఎల్‌వోలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎన్నికల విభాగం డీటీ అర్జునరావు

సయాంక్ ఫార్మాకు టెక్ ట్రాన్స్‌ఫార్మర్ పురస్కారం

పరవాడ, న్యూస్‌టుడే: ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు నిర్వహించిన పోటీల్లో పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని సయాంక్ ఫార్మా సంస్థకు టెక్ ట్రాన్స్‌ఫార్మర్-2025 పురస్కారం వరించిందని కంపెనీ డైరెక్టర్లు జెట్టి సుబ్బారావు, డి.శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ ఉన్నతాధికారుల చేతులమీదుగా పురస్కారం అందుకున్నామన్నారు. ఈ మేరకు సయాంక్ ఫార్మాలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం రావడానికి కృషి చేసిన కంపెనీ సిబ్బందిని అభినందించారు.

అవార్డులను చూపుతున్న కంపెనీ డైరెక్టర్లు సుబ్బారావు, శ్రీకాంత్, చిత్రంలో ఉద్యోగులు

త్వరితగతిన 'పీ-4' మార్గదర్శకుల గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీ-4'కు సంబంధించి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'పీ-4' అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కనీసం పది వేల మంది ఔత్సాహికుల్ని గుర్తించి, బంగారు కుటుంబాలను అనుసంధానం చేయాలన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. గెజిటెడ్ ర్యాంకు కలిగిన ప్రతి అధికారి కనీసం ఓ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. దత్తత తీసుకోలేని వారు ఆర్థికంగా సాయం చేయాలన్నారు. 'పీ-4'లో చేరినా, తోడ్పాటు అందించిన వారికి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో భవానీశంకర్, సీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో జేసీ

నేడు రాష్ట్రమంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం విశాఖ రానున్నారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనం, 11.15 గంటలకు పెదవాల్తేర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మధ్యాహ్నం 12.30 గంటకు గీతం వైద్య కళాశాలలో పలు పథకాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. రాత్రికి రైల్లో బయలుదేరి విజయవాడ వెళ్తారు.

పార్కు స్థలం ఆక్రమణకు యత్నం

వేపగుంట, న్యూస్‌టుడే: కాలనీల్లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. సచివాలయాలకు కూతవేటు దూరంలో ఉన్నా కార్యదర్శులు ఏమీ పట్టనట్లు ఉండిపోతున్నారు. స్థానికులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేసినా సరైన సమాధానాలు చెప్పడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో 23 సెంట్ల పార్కు స్థలంలో కొందరు రేకుల షెడ్లు వేశారు. పార్కు స్థలంలో ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ నిధులను కాలనీలో గుడికి, బడికి కేటాయించిన స్థలాన్ని పార్కుగా చూపించేసి అందులో ఈ నిధులతో ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎల్‌జీనగర్‌లోని పార్కు

ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

సబ్బవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నాయకత్వ శిక్షణ కార్యక్రమం సోమవారం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని.. తద్వారా తమ పాఠశాలల్లో ఉత్తమ ప్రమాణాలు కలిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి బి.అప్పారావునాయుడు పేర్కొన్నారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర పర్యవేక్షకులు డాక్టర్ శేషగిరి, ఎంఈవో ఎం.జె రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డా.జయప్రకాష్, అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ కజియా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

పార్కులు, ఖాళీ స్థలాల పరిరక్షణపై దృష్టి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థకు చెందిన పార్కులు, ఖాళీ స్థలాలను పరిరక్షించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రణాళికాధికారులతో సమావేశమయ్యారు. పార్కులు, ఖాళీ స్థలాలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నట్టు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉంటూ జీవీఎంసీ ఆస్తులు పరిరక్షణ కోసం పని చేయాలన్నారు. జీవీఎంసీ పార్కులపై ప్రణాళిక అధికారులు అరకొర సమాచారం ఇచ్చారని, మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి వివరాలు సమర్పించాలని మేయర్ సూచించారు. ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

'సమన్వయంతో పని చేయండి'

విభాగాధిపతులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. సోమవారం ఆయన ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగే సమయంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, ఆయా చోట్ల భవిష్యత్తులో చేపట్టబోయే పనులపై ఆరా తీయాలన్నారు. ప్రజలకు అవసరమైన నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీసీలు డీవీ.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, సీసీపీ ప్రభాకర్, వ్యయ పరిశీలకులు వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

ఇంటర్ కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: గాజువాక ఆర్కే ఆసుపత్రి వెనుక ఉన్న ఓ ఇంటర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురంకాలనీలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేశారు. 'ప్రథమ సంవత్సరం విద్యార్థులు రూ.10వేలు చెల్లించి కళాశాలలోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. కొంతమంది ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వద్ద ఆ పుస్తకాలు తీసుకుంటే అదనంగా ఫీజు వసూలు చేస్తామని బెదిరిస్తున్నార'ని విద్యార్థులు వాపోయారు. దీనిపై ఇంటర్ బోర్డు ఆర్.ఐ.ఒ. మురళీధర్ మాట్లాడుతూ తక్షణమే కళాశాలను సందర్శించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా విశాఖ వాసి విక్రమ్

రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీల్లో విజేత, రన్నరప్‌లతో బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని శ్రీసాయి శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి 185 మంది బాడీబిల్డర్లు పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విశాఖకు చెందిన విక్రమ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా నిలువగా.. రన్నరప్‌గా తణుకుకు చెందిన నాగేంద్ర నిలిచారు. విక్రమ్‌కు రూ.40,000, నాగేంద్రకు రూ.20,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ధ్రువపత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచిన బాడీబిల్డర్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందించారు.

పాఠశాల భవనంలోనే వసతి గృహం

ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు అష్టకష్టాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థుల సంఖ్య ఏటా పెరగడం, ఉన్న గదులు చాలకపోవడంతో పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించారు. అయితే దీన్ని చదువు కోసం కాకుండా బీసీ వసతి గృహంగా వినియోగించడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. తాత్కాలిక వసతి కోసం కేటాయించిన ఈ భవనంలో ఎనిమిదేళ్లుగా విద్యార్థులు ఉంటున్నారు. వీరికి శాశ్వత భవనం సమకూరకపోవడంతో సరైన సౌకర్యాలు లేక వసతి గృహం విద్యార్థులు.. గదులు సరిపోక పాఠశాల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం కథ ఇది.

● **తాత్కాలికంగా వచ్చి.. శాశ్వతంగా తిష్ఠ..:** 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.42 లక్షలతో రెండు అంతస్తుల్లో అదనపు తరగతి గదులను నిర్మించింది. అదే సమయంలో బీసీ వసతి గృహం నిర్మాణాన్ని ప్రారంభించడంతో అక్కడి విద్యార్థులను తాత్కాలికంగా పాఠశాలలో నిర్మించిన భవనంలోకి తీసుకొచ్చారు. అనంతరం నూతనంగా నిర్మించిన వసతి గృహాన్ని పోస్టుమెట్రిక్ విద్యార్థులకు కేటాయించడంతో ప్రీమెట్రిక్ వారికి భవనం లేకుండా పోయింది. అప్పటినుంచి ఈ రెండు అంతస్తులను బీసీ వసతి గృహంగానే వినియోగిస్తున్నారు. ఇందులో ప్రస్తుతం 120 మంది విద్యార్థులున్నారు. ఇరుకైన గదుల్లో మంచాలు ఉండడంతో గాలి సక్రమంగా రాక ఒక్కోసారి ఊపిరాడని పరిస్థితి నెలకొంటోందని పిల్లలు చెబుతున్నారు. మరుగుదొడ్లు సరిపడినన్ని లేకపోవడంతో పాటు డైనింగ్ హాల్ లేక ఆరు బయటే భోజనం చేయాల్సిన దుస్థితి.

వసతి గృహంగా కొనసాగుతున్న పాఠశాల భవనం

ఇరుకు గదిలో ఉంచిన మంచాలు

● **సుమారు 1300 మంది పిల్లలు..:** పాఠశాల భవనాన్ని బీసీ వసతి గృహంగా వినియోగించడంతో సాధారణ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాల పీఎంశ్రీ పథకం కింద ఎంపికైంది. ఇందులో భాగంగా సబ్జెక్టుల వారీగా ల్యాబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేగాకుండా జిల్లాలోనే సుమారు 1300 మంది విద్యార్థులు రెండో అతిపెద్ద పాఠశాలగా ఉంది. ఈ నేపథ్యంలో తరగతుల నిర్వహణ, ల్యాబ్‌ల ఏర్పాటుకు గదులు చాలడం లేదు. అంతేగాకుండా వసతి గృహం భవనం నిర్వహణ భారం కూడా పాఠశాలపైనే పడింది. ప్రత్యేక వసతి గృహం కాకపోవడంతో రాత్రివేళ ఇతరులు లోనికి ప్రవేశిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టిసారించి వసతి గృహానికి నూతన భవనం సమకూర్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

(c) eenadu

పావని.. కుటుంబాన్ని బాగా చూసుకో..

భార్య, పిల్లలతో మురళి

- ఫోన్‌లో భార్యతో మాట్లాడుతూ తుపాకీతో కాల్చుకున్న జవాన్
- ఛత్తీస్‌గఢ్‌లో జిల్లా వాసి బలవన్మరణం

"పావని ఏమి చేస్తున్నారు.. భోజనం చేశారా.. పిల్లలు తిన్నారా.. నాన్న ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. బాగా చూసుకోవాలి.. చెల్లికి మంచి సంబంధం చూసి పెళ్లి చేయాలి. అందమైన ఇల్లు కట్టుకుందాం.. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేద్దాం.. ఇప్పటికే రూ.34 లక్షలు అప్పు చేశా.. నువ్వు మన కుటుంబానికి అండగా ఉండి బాగా చూసుకోవాలి.."

అంటూ సీఆర్‌పీఎఫ్ జవాన్ కంచుకుంట మురళి.. తన భార్యకు ఆదివారం రాత్రి 10 గంటలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈక్రమంలో కాసేపటికే ఇక సెలవు అంటూ తన చేతిలోని తుపాకీతో కాల్చుకున్నాడు. భార్య హలో.. హలో ఏమండీ అంటున్నా స్పందనలేదు. అక్కడ సమీపాన ఉన్న తోటి జవాన్ శబ్దం విని వచ్చి చూడగా అప్పటికే నేలకొరిగాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్- రాయ్‌పూర్‌లోని 65వ బెటాలియన్‌లో చోటుచేసుకుంది.

కనగానపల్లి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం శివపురంకొట్టాలకు చెందిన ముత్యాలన్న, నాగలక్ష్మీ దంపతులకు కుమారుడు కంచుకుంట మురళి (30) సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా 2017లో ఎంపికయ్యారు. ఆయన అనంతపురం నగరానికి చెందిన లోకపావనిని ఐదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల కుమారుడు తారక్‌రామ్, రెండేళ్ల కుమార్తె మహి ఉన్నారు.

తండ్రి వైద్యానికి అప్పు చేసి..

మురళి తండ్రి ముత్యాలన్నకు చర్మసంబంధ క్యాన్సర్ సోకడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇందుకు సుమారు రూ.30 లక్షల వరకు అప్పు చేశారు. తన సోదరికి పెళ్లి చేయాల్సి ఉంది. మరోవైపు నాలుగు నెలల కిందట మురళి కారును మిత్రుడు తీసుకెళ్తుండగా పెనుకొండ సమీపంలో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారు. కారు నంబరు ఆధారంగా మురళిని.. కేసు రాజీ అయ్యేందుకు మృతుడి కుటుంబసభ్యులు రూ.15 లక్షలు డిమాండ్ చేశారు. తండ్రి వైద్యం కోసం దాచుకున్న రూ.4 లక్షలను ముట్టజెప్పారు. ఇలా.. మొత్తం రూ.34 లక్షల దాకా అప్పు చేశారు. తండ్రి ఆరోగ్యం క్షీణిస్తుండటంతో 15 రోజుల కిందట బెంగళూరుకు వచ్చిన మురళి.. తిరిగి బెటాలియన్‌కు వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి ఆత్మహత్యకు ఒడిగట్టారు. ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసుల వర్గాలు పేర్కొన్నాయి. నేడు శివపురంకొట్టాలలో జవాన్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

అరవిందనగర్ (అనంతపురం): పచ్చిమిర్చి ధర ఘాటెక్కింది. అనంతపురం పాతూరు కూరగాయల మార్కెట్లో కిలో మిర్చి రూ.80 పలుకుతోంది. వారం కిందట రూ.25 ధర పలికింది. కొన్ని నెలల కిందట పచ్చిమిరపను సాగు చేసిన రైతులు వాటిని ఎండబెట్టి మార్కెట్‌కు తీసుకెళ్లారు. అక్కడ ధర లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో మిరప సాగుకు రైతులు ముందుకు రాకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో అనంతపురం మార్కెట్‌కు రోజుకు వెయ్యి క్వింటాళ్ల పచ్చిమిరప కాయలు సరఫరా కాగా ప్రస్తుతం 250 క్వింటాళ్లకు మించి రావడం లేదు. చిత్రదుర్గం, హోసూరు నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతున్నామని, అవసరాలకు తగిన సరకు లేదని టోకు డీలర్లు చెబుతున్నారు.

మిరప వేయాలా.. వద్దా?

- హెచ్చెల్సీకి నవంబరు వరకే తుంగభద్ర జలాలు
- ఆయకట్టులో ప్రశ్నార్థకంగా మారిన సాగు

జిల్లా సరిహద్దుకు చేరుకున్న తుంగభద్ర జలాలు

ఈనాడు, అనంతపురం -న్యూస్‌టుడే, ఉరవకొండ, బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో గేట్ల మరమ్మతు కారణంగా 105 టీఎంసీలకు గాను 80 టీఎంసీలే నిల్వ ఉంచనున్నారు. దీంతో హెచ్చెల్సీ వాటా 32 టీఎంసీల నుంచి 18 టీఎంసీలకు కుదించారు. నవంబరు చివరి వరకు మాత్రమే కాలువకు నీరందిస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు పరిధిలో మిరప రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మిరప సాగు చేయాలా? ప్రత్యామ్నాయం చూసుకోవాలా? అనే సందిగ్ధంలోకి వెళ్లిపోయారు.

40 వేల ఎకరాల్లో...

హెచ్చెల్సీ ప్రధాన కాలువ కింద రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు బ్రాంచి కెనాల్ కింద ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు. ఇప్పటికే నారు సిద్ధం చేసుకుంటున్నారు. ఆగస్టు మధ్య నుంచి నాటుకుంటే ఫిబ్రవరిలో కోతకు వస్తుంది. తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి నవంబరు వరకే నీరు ఇస్తే మిరప రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. చివరి దశలో తడులు అందకపోతే దిగుబడి చేతికందదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల చొప్పున రైతులు రూ.800 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ లెక్కన రూ.1400 కోట్లు విలువైన దిగుబడి నష్టపోయే ప్రమాదం ఉంది.

గత అనుభవం పట్టదా?

2023లోనూ మిరప రైతులకు ఇదే పరిస్థితి ఎదురైంది. ఆ ఏడాది నవంబరు 25నే నీటిని నిలిపేశారు. దీంతో పంటను కాపాడుకోవడానికి ఎన్నో అవస్థలు పడ్డారు. కొందరు అప్పటికప్పుడు బోర్లు వేయించుకున్నారు. మరికొందరు రైతులు రూ. వేలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీరందించారు. అయినా 50 శాతానికి పైగా దిగుబడి కోల్పోయారు. గత అనుభవం ఉన్నా హెచ్చెల్సీ అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందుగానే మేల్కోకపోతే ఈ ఏడాది రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

జనవరి వరకు నీరివ్వాలి

- వన్నూరుస్వామి, ఛాయాపురం

జీబీసీ కింద మూడు ఎకరాల్లో మిరప సాగు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నా. పెట్టుబడికి రూ.5 నుంచి రూ.6 లక్షలు ఖర్చవుతుంది. కాలువకు నవంబరు వరకే నీరు ఇస్తే పంట చేతికి రాదు. ప్రభుత్వం స్పందించి జనవరి నెలాఖరు వరకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే మిరప పంట వేయవద్దని అధికారికంగా చెప్పాలి.

సమస్యలు వింటున్న కలెక్టరు వినోద్‌కుమార్

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం

800 వినతుల స్వీకరణ

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించబోమని కలెక్టరు వినోద్ కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అర్జీదారులతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 800 అర్జీలు వచ్చాయి. అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టరు మాట్లాడుతూ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించే విధంగా చూడాలన్నారు. జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, డీఆర్‌ఓ మాలోల, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

భూసమస్యకు పరిష్కారం

గుంతకల్లులో మాజీ సైనికుడు మహమూద్‌కు చెందిన ఐదు ఎకరాల భూమి ఆరేళ్లుగా కబ్జాదారుల చేతిలో ఉండగా పరిష్కారం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. బాధితులు వరుసలో వచ్చి కలెక్టరు వినోద్‌కుమార్‌కు కృతజ్ఞత పూర్వకంగా శాలువా, పూలమాలతో సత్కరించారు. చుక్కల భూమి రికార్డుల్లో తొలగించి ఎన్‌ఓసీ జారీ చేసి తమ అర్జీకి సత్వరమే పరిష్కారం చూపారని బాధితులు పేర్కొన్నారు.

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు రూ.3.83 కోట్లు విడుదల

వెంటనే విధుల్లోకి చేరకుంటే ఎస్మా

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల వేతనాల కోసం రూ.3.83 కోట్లు విడుదల అయ్యాయని కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వేతనాలు రాలేదని ఏప్రిల్ 6 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లారని, సోమవారం ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్ ఖాతాలోకి సొమ్ము జమ అయిందన్నారు. కార్మికులు మంగళవారం నుంచి విధుల్లోకి హాజరు కావాలని, లేనిపక్షంలో ఎస్మా చట్టం ప్రయోగించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శిరీష పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు రూ.8.88 కోట్లు విడుదల

అనంతపురం(వ్యవసాయం): పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రబీలో పండించిన ధాన్యం, జొన్నలను కొనుగోలు చేశారు. గత రెండు నెలలుగా రైతులకు సొమ్ము చెల్లించలేదు. ఎట్టకేలకు ఈ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 363 మంది రైతులతో 3,868 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అందుకు రూ.8.88 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రైతుల బ్యాంకు ఖాతాలకు అనుసంధానమైన ఆధార్ నంబరు ఆధారంగా సొమ్ము ఆన్‌లైన్‌లో ఖాతాలకు జమవుతున్నాయని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి తెలిపారు.

జొన్నలకు రూ.14.89 కోట్లు : గత రబీలో పండించిన జొన్నలు రైతుల నుంచి కొనుగోలు చేసి, చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మొత్తం 4,567 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేయగా రూ.14.89 కోట్లు మంజూరయ్యాయి.

ధర్మవరం చేనేత పట్టు చీరకు జాతీయ గుర్తింపు

కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ధర్మవరం చేనేత పట్టు చీర 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డుకు ఎంపికైంది. సోమవారం దిల్లీ భారత్ మండపంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్‌చేతన్ అవార్డును అందుకున్నారు. ధర్మవరం చేనేత పట్టు చీరలకు ఈ గౌరవం దక్కినందుకు జిల్లా ప్రజలకు, మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

చనిపోయానని నమ్మించి భూమి కాజేశారు..

ఈ వృద్ధురాలు నక్కలోళ్ల లక్ష్మీదేవి. వయసు 85 ఏళ్లు. తాడిపత్రి నందలపాడులో నివాసం ఉంటుంది. ఆమెకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు ఓబులేశు మృతి చెందారు. ఆయనకు ఒక కుమార్తె, కొడుకు ఉన్నారు. లక్ష్మీదేవి ప్రస్తుతం మనవడి వద్ద ఉంటోంది. ఆమెకు పది సెంట్లు భూమి ఉంది. అయితే తన అత్త చనిపోయిందని అబద్ధం చెప్పి ఐదు సెంట్ల భూమిని కోడలు తన కుమార్తె పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించింది. వృద్ధురాలు సోమవారం తన మనవడి సాయంతో అనంతపురంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుకు అర్జీ ఇచ్చింది. తన భూమి తిరిగి ఇప్పించాలని వేడుకుంది. ఈ కుట్రలో భాగస్వామ్యులైన అధికారులను శిక్షించాలని కోరింది. **- ఈనాడు, అనంతపురం**

దీపం-2.. రూ.70.27 కోట్ల చెల్లింపు

అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తోంది. ఎన్నికల తర్వాత గతేడాది చివర్లో ఒక సిలిండరుకు సంబంధించి లబ్ధిదారులకు రాయితీ సొమ్ము జమ చేశారు. ఈ ఏడాది మూడు సిలిండర్లను నాలుగు నెలలకొకటి చొప్పున పంపిణీ చేయనున్నారు. అందులో భాగంగా ఇప్పటికే తొలి సిలిండరు బుకింగ్ ప్రారంభమైంది. ఇప్పటివరకు మొత్తం 7,86,792 సిలిండర్లకు రూ.70.27 కోట్ల సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 3,71,818 సిలిండర్లు పంపిణీ చేయగా ఖాతాలకు సొమ్ము ఆలస్యంగా జమ చేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

ఈ ఏడాది తొలి సిలిండరు ఏప్రిల్ నుంచి బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు మొత్తం 3,71,813 మంది లబ్ధిదారులకు రూ.34.19 కోట్లు జమ చేశారు. ఇంకా 1,34,018 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ నెలాఖరుతో బుకింగ్ గడువు ముగియనుంది.

జేఎన్‌టీయూలో కొత్త కోర్సు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో 2025-26 సంవత్సరానికి నూతన కోర్సు మంజూరైందని ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు తెలిపారు. బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సు మంజూరైందన్నారు. ఇందులో 66 సీట్లు ఉంటాయన్నారు. దీంతోపాటు కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో అదనంగా 66 సీట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాదని పేర్కొన్నారు.

విద్యుత్తు అక్రమ వినియోగదారులకు షాక్!

అపరాధ రుసుం విధింపు, కేసుల నమోదు

పిండిమిషన్‌కు తీసుకున్న సర్వీసు మీటర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ విభాగం అధికారులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: అక్రమంగా విద్యుత్తు వినియోగంపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. కొందరు అనుమతి లేకుండా పెద్దఎత్తున నష్టం కలిగిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేయటంతో పాటు అపరాధ రుసుం విధిస్తున్నారు. మీటర్ తీసుకోకుండా నేరుగా స్తంభం నుంచి వాడుకోవటం... స్తంభం నుంచి మీటర్‌కు వేసుకున్న తీగకు మధ్యలో మరో తీగ ఏర్పాటు చేసుకుని వినియోగించడం ద్వారా యూనిట్లు తగ్గించుకుంటున్నారు. సర్వీసు తీగలను మధ్యలో ట్యాప్ చేసి త్రీఫోర్ స్విచ్‌ను ఏర్పాటు చేసుకుని వాడుకుంటున్న తీరు అధికారుల తనిఖీల్లో వెలుగుచూశాయి. అనుమతి పొందిన దానికంటే అధికలోడు వినియోగిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు.

- రాయదుర్గంలోని ఓ శుద్ధజల కేంద్రం నిర్వాహకుడు విద్యుత్తు సర్వీసు ఉన్నా అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్నాడు. గత నెల 13న విజిలెన్స్ అధికారులు గుర్తించి రూ.1.99 లక్షలు అపరాధ రుసుం విధించారు.
- ఇటీవల రాప్తాడులో ఓ చిన్న పరిశ్రమను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కేటగిరీ-3 కింద సర్వీసు తీసుకుని కేటగిరీ-2 కింద విద్యుత్తు వాడుతున్నట్లు గుర్తించారు. రూ.71 వేలు జరిమానా విధించారు.

గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈఏడాది జూన్ 30 వరకు కేసుల వివరాలు

మీటరు లేకుండా విద్యుత్తు వినియోగించిన వారు : 1,905
విధించిన అపరాధ రుసుం: రూ.61.76లక్షలు
మీటర్ ఉన్నా అక్రమంగా వాడకం: 2,295
అపరాధ రుసుం: రూ.1.41 కోట్లు
అధికలోడు వినియోగం: 2631
రుసుం: రూ.1.34కోట్లు

నిబంధనలు పాటించాల్సిందే..

- శేషాద్రిశేఖర్, ఎస్ఈ, అనంతపురం

అక్రమ విద్యుత్తు వినియోగదారులపై చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారం విద్యుత్తు సర్వీసు తీసుకోవాలి. లోడు అధికమైతే పలు సమస్యలు తలెత్తుతాయి. నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నాం.

ఇసుక తరలింపు.. ప్రమాదముప్పు!

- మితిమీరిన వేగంతో వెళ్తున్న ట్రాక్టర్లు
- నిర్లక్ష్యంగా అధికారులు

యల్లనూరు రోడ్డులో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పరిసరాల్లోని పెన్నానది నుంచి గుట్టుగా రాత్రి,పగలు అన్న తేడా లేకుండా ట్రాక్టర్ల కొద్ది ఇసుక తరలిపోతోంది. ఈక్రమంలో ప్రధాన రహదారుల్లో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారు. ఆమార్గాల్లో వెళ్లే జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

- తాడిపత్రి పరిసరాల్లో సుమారు 12 కిలోమీటర్ల మేర పెన్నానది ప్రవహిస్తోంది. నందలపాడు, వరాలు తోట, కొత్త, పాత పెన్నా వంతెనల వద్ద నుంచి రోజూ 60 ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరును రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు ఒక్కో ట్రాక్టర్ 4 ట్రిప్పులు పైగానే ఇసుకను నదిలో నుంచి అక్రమంగా తరలిస్తున్నారు.
- అక్రమార్కులు రాత్రి వేళల్లో పెన్నానది నుంచి ఇసుకను తెచ్చుకుని ఉదయం పూట ఆయా నిర్మాణాల వద్దకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఎవరైనా అధికారులు చూస్తారని అతివేగంతో ప్రధాన దారుల గుండా వెళ్తున్నారు. దీంతో పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. రెండు వారాల క్రితం మున్సిపల్ షాదీఖానా వద్ద అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొనడంతో డ్రైవర్‌కు కాలు విరిగింది.
- నంద్యాల రోడ్డులో ఇటీవల అక్రమంగా ఇసుకను పట్టణంలోకి తీసుకొస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం

-సాయిప్రసాద్, సీఐ, తాడిపత్రి సీఐ

తాడిపత్రిలోని పెన్నానది, యల్లనూరు మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తాడిపత్రిలోకి తీసుకొచ్చే వారిపై ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణా, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

పెనుకొండ మీద నగరవనం

- రూ. కోట్లతో పనులు ప్రారంభించిన అటవీశాఖ
- పర్యాటక అభివృద్ధికి శ్రీకారం

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ పర్యాటక అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రభుత్వం గతేడాది అటవీశాఖ ఆధ్వర్యంలో కొండ మీద నగరవనం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసింది. అక్కడ నీటి సౌకర్యం లేకపోవడంతో పనుల ప్రారంభానికి ఆలస్యమైంది. ప్రస్తుతం నగరవనంలో భాగంగా కొండమీద పర్యావరణ విద్యా కేంద్రం, ఫుడ్‌కోర్ట్ భవనాల నిర్మాణం ఇటీవల ప్రారంభించారు. వారాంతంలో పెనుకొండకు పర్యటనకు వచ్చే బైకర్లు కొండమీద కనీసం తాగునీరు, తేనీరు, అల్పాహారం లభించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోటను చూసేందుకు బెంగళూరు నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే యాత్రికులకు ఇక్కడ ఏమీ సౌకర్యాలు లేకపోవడం శోచనీయం. నగరవనం పూర్తవ్వగానే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు, అల్పాహారం, వసతి అందుబాటులోకి వస్తాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారులు పాలకులు ప్రత్యేక చొరవచూపి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

కొండమీద శ్రీఘనగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు 8 కిలోమీటర్ల మేరకు ఘాట్‌రోడ్డులో తిరుపతి మలుపులను తలపించేలా రెండు వరుసల రహదారి నిర్మించడంతో వారాంతంలో కర్ణాటకలోని బెంగళూరు, చిక్కబళ్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఇప్పటికే ఇస్కాన్ మందిరానికి ప్రభుత్వం దాదపు 5 హెక్టార్ల భూమి కేటాయించింది. 108 అడుగుల శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహం నిర్మించడం కోసం కొంతకాలంగా భూమి చదును పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగర సామ్రాజ్యం వేసవి విడిది, రెండోరాజధాని పెనుకొండలోని అలనాటి రాచరికపు పాలనను అద్దం పట్టే పురాతన కట్టడాలకు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మెరుగులు దిద్దితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. గతంలో కొండ మీదికి రోప్‌వే మంజూరైనప్పటికీ గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిధులు సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పర్యాటక అభివృద్ధితో ఈప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. రోప్‌వే నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కొండ మీదకు వెళ్లేందుకు నిర్మించిన ఘాట్‌రోడ్డు

కొండమీద నిర్మాణంలో ఉన్న పర్యావరణ విద్యా కేంద్రం

త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తాం

-శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఆర్వో, అటవీశాఖ, పెనుకొండ

గతంలో కొండమీద నీటి సౌకర్యం లేకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం కొండమీద ఉన్న కోనేరులోని నీటిని భవనాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయించి, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.

తెప్పించారు.. మూలకు చేర్చారు!

కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.19 లక్షల విలువైన చరవాణి సాయంతో ఎక్స్‌రే తీసే ఆధునిక సాంకేతికతతో కూడిన యంత్రం నెల కిందట వచ్చినా.. అది పెట్టెలోనే మగ్గుతోంది. ప్రమాద ఘటనల్లో, ఇతరత్రా కారణాల వల్ల కదలలేని స్థితిలో ఉన్న వారి వద్దకే వెళ్లి ఈ యంత్రం సాయంతో ఎక్స్‌రే తీసుకునే వీలుంటుంది. ఈ విషయంపై 'న్యూస్‌టుడే'తో వైద్యాధికారిణి ప్రసన్న భారతిని మాట్లాడుతూ 'ఎక్స్‌రే' యంత్రానికి సంబంధించి కంపెనీ ఇంజినీరు వచ్చి అవగాహన కల్పించాల్సి ఉందని.. ఈప్రక్రియ పూర్తయ్యాక వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

ప్యాకింగ్ తీయని ఆధునిక ఎక్స్‌రే యంత్రం

(c) eenadu

మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి

మధ్యవర్తిత్వంతోనే సులభంగా న్యాయం

అనంతపురం(మూడోరోడ్డు), న్యూస్‌టుడే: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంతో సులభంగా న్యాయం లభిస్తుందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి అన్నారు. బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సోమవారం 'దేశం కోసం మధ్యవర్తిత్వం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యవాణి మాట్లాడుతూ అన్ని కోర్టుల నుంచి మధ్యవర్తిత్వానికి కేసులను పంపుతున్నారన్నారు. వాటి విచారణకు ముందే ఏదైనా మధ్యవర్తిత్వంలోనే ఇరువర్గాలు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. దీంతో కక్షిదారులకు సులభంగా, సత్వర న్యాయం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్లుగా వానర సేవలో..!

నీటిని నింపుతున్న కృష్ణ.. దాహం తీర్చుకుంటున్న కోతులు

తొట్టిలో నీళ్లు పోస్తున్న ఈయన కృష్ణ. నార్పల మండలం నాయినిపల్లి క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. గతంలో ఆటో నడిపేవారు. ప్రస్తుతం చిన్న వ్యాపారం చేసుకుంటున్నారు. గతంలో ముచ్చుకోట అటవీ ప్రాంతం మీదుగా ఆటోలో వెళ్తున్నప్పుడు నీళ్ల కోసం కోతులు ఇబ్బందులు పడటం చూశారు. వాటి దాహం తీర్చేందుకు ప్లాస్టిక్ డబ్బాల్లో నీటిని తీసుకెళ్లి రోడ్డు పక్కన ఉంచేవారు. ఆ తర్వాత సొంత డబ్బులతో ఒక్కో నీళ్ల తొట్టిని రూ.700 చొప్పున 14 తొట్టిలు (ఒక్కో దాంట్లో 30 లీటర్ల నీరు పడుతుంది.) కొనుగోలు చేసి అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన అక్కడక్కడ ఏర్పాటు చేశారు. ఆటోలో రోజూ 300 లీటర్ల నీళ్లు తీసుకెళ్లి ఎనిమిది కి.మీ. దూరంలో ఉన్న తొట్టిల్లో నింపుతున్నారు. ఆ నీటిని కోతులు తాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి. గత ఇరవై సంవత్సరాలుగా కృష్ణ కోతుల దాహం తీరుస్తుండటం విశేషం. **- ఈనాడు, అనంతపురం**

దానిమ్మకు తొడుగు.. రాబడికి అడుగు

■ ఆశాజనకంగా దిగుబడి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : సాగు చేసిన దానిమ్మ పంట చుట్టూ ప్రత్యేకంగా వేసే నెట్ రక్షణగా ఉంటోంది. ఫలితంగా కీటకాల బెడద తప్పి అధిక దిగుబడులు, లాభాలు గడిస్తున్నారు కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన మహిళా రైతు గోవిందమ్మ. ఎవరైనా చెట్టుచెట్టుకు రక్షణ తొడుగులు వేస్తే ఈమె మాత్రం పంటకు మొత్తం రక్షణ ఏర్పాట్లు చేసి సత్ఫలితాలు సాధిస్తున్నారు.

పంట చుట్టూ ఏర్పాటు చేసిన నెట్

రూ.10 లక్షలతో పెట్టుబడి

★ రెండున్నర ఎకరాల్లో భగవాన్ రకం దానిమ్మ పంటను నాలుగేళ్ల కిందట సాగు చేశారు. విజయవాడ నుంచి ఒక్కో మొక్క రూ.43 చొప్పున 1,050 మొక్కలకు రూ.45,150 వెచ్చించి తీసుకొచ్చారు. డ్రిప్ పైపులకు, కర్ణాటక చిక్‌బల్లాపురం నుంచి 35 కిలోల నెట్ రూ.1.10లక్షతో పాటు కూలీలకు, పురుగు మందులకు దాదాపుగా రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కంటికి రెప్పలా పంట కాపాడుకొంటూ వచ్చారు.

★ పంట మొదటి కోతలో 10 టన్నులు, రెండో కోతలో 15 టన్నుల దిగుబడి రాగా విక్రయిస్తే రూ.25 లక్షలు లాభం వచ్చింది. మూడో కోత రెండు నెలల్లో రానుంది. 25 టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనా. మార్కెట్ ధర బట్టి రూ.20 లక్షల - రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుందని మహిళా రైతు చెబుతున్నారు. బెంగళూరు మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

నెట్ ప్రయోజనాలివిగో!

పంట రక్షణతో పాటు వివిధ రకాల పక్షుల నుంచి రక్షణగా ఉంటుంది. పంటకు వైరస్ నుంచి రక్షణ ఉంటుంది. దీంతో దానిమ్మ కాయల పరిమాణం ఎక్కువగా ఉంటుంది. ఎరువుల వాడకం తగ్గుతుంది. పంట చేతికొచ్చే సమయంలో కాయలు ఒకేసారి పక్వానికి వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఒక్కో కాయ 15- 20 ఎంఎం వరకు ఉండటంతో పాటు రుచికరంగా ఉంటాయి. ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు పంట కాలం ఉంటుంది. తెలుపు, ఆకుపచ్చ రంగులో ఉన్న నెట్ పంటను రక్షణగా వేసుకొంటే మంచి దిగుబడులు, అధిక ఆదాయాన్ని పొందేందుకు అనుకూలంగా మారుతుంది.

దిగుబడికి సులువైన మార్గం

- గోవిందమ్మ, మహిళా రైతు, దొడగట్ట గ్రామం

పంటకు రక్షణ తొడుగు వల్ల మొదటి, రెండో కోతల్లో మంచి దిగుబడులతోపాటు లాభాలు వచ్చాయి. పంటను రక్షించుకోవడంతో పాటు పక్షుల బెడద ఉండదు. పంట విషయంలో ఎలాంటి భయం ఉండదు. అనుకున్న దానికంటే ఎక్కువ స్థాయిలో దిగుబడులు ఉంటాయి.

రాష్ట్ర జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా అనంత

జట్టును అభినందిస్తున్న ఫుట్‌బాల్ సంఘం సభ్యులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను అనంతపురం కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో అనంతపురం జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 5-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అనంతపురం ఆటగాళ్లు అద్భుతంగా ఆడి ప్రత్యర్థిని చిత్తుచేశారు. విజయంతో తిరిగొచ్చిన జిల్లా జట్టును సోమవారం ఓటీఆర్ఐలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి క్రీడాకారులను అభినందించారు. ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మల్లేశ్, సీఐ విశ్వనాథచౌదరి, మైభారత్ ప్రోగ్రాం అధికారి జి.శ్రీనివాస్, సభ్యులు రుద్ర, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రత్నమయ్య తదితరులు హాజరై క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయిలో కూడా ఇదే ప్రతిభ చాటి రాష్ట్ర జట్టును గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

17న హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయండి : కాలవ

హెచ్చెల్సీ ఇంజినీర్లతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : తుంగభద్ర ప్రాజెక్టు నుంచి ఈనెల 17న తుంగభద్ర ఎగువ కాలువకు నీటిని విడుదల చేసేలా తుంగభద్ర బోర్డుకు లేఖ రాయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో హెచ్చెల్సీ లోకలైజేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టిన కాలువ మరమ్మతులు, నీటి విడుదల, తదితర అంశాలపై చర్చించారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తొలుత 500 క్యూసెక్కులతో ప్రారంభించి క్రమంగా నీటి సామర్థ్యం పెంచాలన్నారు. 17న నీటిని విడుదల చేస్తే ఆంధ్రా సరిహద్దుకు 18న చేరుతుందని, ఆలోగా నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం లేకుండా కాలువను సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమీక్షలో లోకలైజేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పార్థసారథి, డీఈ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో సోమవారం రాత్రి ఓ యువకుడి వేటకొడవళ్లతో దాడి చేసి దారుణ హత్య చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రెడ్డివారిపాళెంలో చెందిన పుష్పరాజ్ కుమారుడు హర్షవర్ధన్ రాజు (28) జులాయిగా తిరిగేవాడు. సోమవారం రాత్రి 10.40 గంటల సమయంలో పుట్లూరు రోడ్డులో ఉండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో వెంబడించారు. సదరు యువకుడు ఓ ఇంటిలోకి గేటు దూకి వెళ్లేందుకు ప్రయత్నించగా దుండగులు కొడవళ్లతో విచక్షణ రహితంగా నరికారు. కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హర్షవర్ధన్ రాజు, వడ్డె నాగరాజుతో గత కొద్ది కాలంగా మనస్పర్థలు ఉన్నాయని, సోమవారం సాయంత్రం ఓ బార్ వద్ద మద్యంమత్తులో ఇరువురు ఘర్షణ పడ్డారని తెలిసింది. ఈక్రమంలోనే హత్య జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

మిరప సాగుతో.. కష్టాలు గట్టెక్కి!

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : వాణిజ్య పంటలతో తీవ్రంగా నష్టపోయి కూరగాయల సాగుతో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. ముదిగుబ్బ మండలంలోని దామానుపల్లి గ్రామానికి చెందిన రైతు **రాజారెడ్డికి** 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో ఏప్రిల్‌లో మిరప పంట సాగు చేశారు. అంతకు ముందు భూమిని ఐదు మడకలతో బాగా దుక్కిచేయించారు. సూపర్, యూరియా, పొటాషియం మందులు దుక్కిలో కలిపారు. ఇలా చేయడం ద్వారా భూమి మరింత సారవంతంగా ఉంటుంది. తర్వాత రెండుసార్లు రోటావేటర్‌తో, ఒకసారి టిల్లరుతో భూమిని కలియదున్నించి బోదులు ఏర్పాటు చేయించారు.

★ డ్రిప్పు పద్ధతిలో ఎకరాకు రూ.40 వేల చొప్పున మొత్తం 80 వేలు మొక్క నాటించారు. ఒక మొక్క రూ.60 పైసలతో ముదిగుబ్బలోని నర్సరీలో కొనుగోలు చేశారు.

గుంటూరు మార్కెట్‌లో విక్రయాలు

మిరపలో ప్రధానంగా బ్లాక్ థ్రిప్స్, బింగి వంటి వైరస్‌లు వ్యాపించాయి. వీటి నివారణకు ప్రొఫిన్ క్విన్‌జోన్, స్పైనోసాడ్ మందును నిర్దేశిత కొలతతో నీటిలో కలిపి పిచికారీ చేశారు. మొక్క కొనుగోలు నుంచి సేద్యం, ఇతర ఖర్చులన్నీ కలిపి పెట్టుబడికే రూ.3 లక్షలు పెట్టారు. సాగు చేసిన 75 రోజులకు పంట కోతకొచ్చింది. మొదటి కోతలో 50 కిలోల బస్తాలు 215 దిగుబడి రాగా బస్తా రూ.850తో విక్రయించారు. రెండో కోతలో 235 బస్తాల దిగుబడి రాగా బస్తా రూ.1400తో విక్రయించారు. అనంతపురం జిల్లాలో తక్కువ ధరలు పలకడంతో తెలిసిన వ్యక్తుల ద్వారా గుంటూరు మార్కెట్‌కు తరలించి విక్రయించారు. మొత్తం 450 బస్తాలు (22,500 కిలోలు) విక్రయించగా రూ.4.70లక్షలు రాబడి వచ్చింది. పెట్టుబడి పోయి రూ.1.70 లక్షలు లాభం మిగిలింది. ఇంకా రెండు నుంచి మూడు కోతల దిగుబడి వస్తుందని, ధరలు ఇలానే కొనసాగితే మరో రూ.2లక్షలకుపైగా ఆదాయం వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగులో ఉన్న మిరప పంట

రైతేరాజు

సమస్య - సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటల సాగులో రైతుల సందేహాలకు రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త **నారాయణస్వామి** చరవాణి : 62812 84235 నంబరుకు ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆముదం సాగు చేయాలనుకుంటున్నాం. అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు తెలపండి. **-నరసింహులు, గొల్లపల్లి.**

సమాధానం. ఆముదం సాగుచేసుకోవాలనుకునే రైతులకు జులై 30వ తేదీ వరకు అవకాశం ఉంది. డీసీహెచ్-519, ఐసీహెచ్-5, జీసీహెచ్-4 రకం విత్తనాలతో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

సమస్య : బొప్పాయి తోటలో ఆకుముడత తెగులు వ్యాపించింది. ఈ తెగులు నివారణకు మార్గం తెలపండి. **-సత్యనారాయణ, బి.పప్పూరు**

సమాధానం. అసిఫేట్ 1.5 గ్రాములు, ఒబెరాన్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

టమాటాలో యాజమాన్య పద్ధతులు భేష్

చిట్కా

నార్పల, న్యూస్‌టుడే : జిల్లాలో టమాటా పంట సాగు చేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పంటకు ఆశించే పచ్చపురుగులు, కాయ తొలుచు పురుగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు రైతులు పైరాక్లోస్ట్రోబిన్ ఒక గ్రాము, ప్రొఫెనోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగుళ్ల ఉధృతి తగ్గించవచ్చన్నారు.

బుక్కరాయసముద్రం వద్ద సాగవుతున్న టమాటా పంట

త్వరలో సరఫరాదారులకు సొమ్ము జమ చేస్తాం

ఏపీసీడ్స్ గోదాములో వేరుసెనగ నిల్వలను పరిశీలిస్తున్న ఛైర్మన్ సుబ్బారెడ్డి, డీఎం సుబ్బయ్య తదితరులు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత రబీలో పప్పుసెనగ, ప్రస్తుత ఖరీఫ్‌లో వేరుసెనగ విత్తన బకాయిలు సరఫరాదారులకు (ఏజెన్సీ) త్వరలో చెల్లించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం మన్నెం సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఏపీసీడ్స్ సంస్థ కార్యాలయం, గోదాములను ఆయన తనిఖీ చేశారు. ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్యతో కలిసి గోదాములోని వేరుసెనగ విత్తనకాయలు, కంది విత్తనాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ భవనంలో సరఫరాదారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా ప్రధానం. జిల్లా నుంచే ఏటా రూ.200 కోట్లు టర్నోవర్ జరగ్గా.. అందులో 46 శాతం ఒక్క అనంతపురం నుంచే వస్తోందని, నాణ్యమైన విత్తనం సకాలంలో రైతులకు అందాలంటే అధికారులు సమస్యను పరిష్కరించాలని డీఎం సుబ్బయ్య కోరారు. అనంతరం రాష్ట్ర ఛైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏమి జరిగిందో తెలియదు. అప్పట్లో విత్తన పంపిణీలో ఆర్థిక సమస్య వెంటాడుతోందని, సరఫరాదారులకు బకాయిలు చెల్లించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో గత రబీలో పప్పుసెనగ విత్తనాలకు రూ.30 కోట్లు, ప్రస్తుత ఖరీఫ్‌లో వేరుసెనగ విత్తనకాయలకు రూ.53 కోట్లు సరఫరాదారులకు చెల్లించాల్సి ఉందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బకాయిల విడుదలకు సత్వరమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కొమ్మ విరిగి.. భార్యాభర్తలపై పడి

ద్విచక్రవాహనంపై వెళ్తూ గాయపడిన వైనం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పాపంపల్లి- చిన్నంపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకొమ్మ విరిగి ద్విచక్రవాహనంపై వెళ్తున్న శెట్టూరు మండలం బచ్చేహళ్లికి చెందిన భార్యాభర్తలు రాములింగా-మహాలక్ష్మిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరి వాహనం దెబ్బతింది. స్థానికులు వీరిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు గంటకు పైగానే ఆగిపోయాయి. పలువురు స్వచ్ఛందంగా చెట్టుకొమ్మలు తొలగించడంతో వాహనాలు ముందుకెళ్లాయి.

130 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఏడీఏ సాల్ రెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్రభూపతి స్థానిక అధికారులతో కలిసి సోమవారం అనంతపురంలోని రసాయన ఎరువుల గోదాములను తనిఖీ చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర, ఎన్‌డీఆర్, సిరిగుప్ప ఆగ్రోస్ ఏజెన్సీ గోదాముల్లో తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో సుమారు రూ.35 లక్షల విలువ చేసే 130 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామని ఏడీఏ తెలిపారు. తనిఖీలు ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం గ్రామీణం ఏవో వెంకట్‌కుమార్, జేడీఏ కార్యాలయ సాంకేతిక వ్యవసాయాధికారి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి దుర్మరణం

గుత్తి: గుత్తి-గుత్తిఆర్.ఎస్ మధ్య సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో ఐదుగురు గాయపడ్డారు. పామిడి మండలం కొండూరుకు చెందిన ఎరుకలప్ప(70) తన కుటుంబీకులతో కర్ణాటకలోని హొసపేటెలో నివాసం ఉంటున్నారు. తన కుటుంబీకులతో కలిసి తిరుమలకు దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుత్తి వరకు రైల్లో వచ్చి కొండూరుకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో ఆటోకు కుక్కలు అడ్డొచ్చాయి. ఈక్రమంలో డ్రైవర్ ఆటోను అదుపు చేయలేపోయాడు. దీంతో ఆటో బోల్తా పడి ఎరుకలప్ప తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇదే ఘటనలో గాయపడిన విజయలక్ష్మి, వీరభద్రప్ప, రాజు, తిమ్మప్పతోపాటు ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్‌లను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆగమేఘాలపై తాడిపత్రికి జేసీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: సింగపూర్‌కు విహారయాత్ర నిమిత్తం వెళ్లిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఆగమేఘాలపై తాడిపత్రికి చేరుకున్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి నాలుగు రోజుల కిందటే వెళ్లారు. మంగళవారం వైకాపా చేపట్టిన 'చంద్రబాబు రీకాల్ మ్యానిఫెస్టో' కార్యక్రమానికి పెద్దారెడ్డి వస్తున్నాడని సమాచారం అందడంతో జేసీ ప్రత్యేక ఛార్టెడ్ ఫ్లైట్‌లో హైదరాబాద్‌లో దిగారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తాడిపత్రికి చేరుకున్నారు. ఇప్పటికే పెద్దారెడ్డిని తాడిపత్రికిలోకి రానివ్వమని మున్సిపల్ కౌన్సిలర్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. జేసీ సైతం అడ్డుకుంటానని సామాజిక మాధ్యమాల్లో పలుమార్లు ప్రకటించారు. ఈనేపథ్యంలో తాడిపత్రిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, పెద్దారెడ్డి నివాసం వద్ద పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దారెడ్డి రాకకు పోలీసుల అనుమతి నిరాకరణ

తాడిపత్రి, అనంత నేరవార్తలు: తాడిపత్రిలో నిర్వహించనున్న 'చంద్రబాబు రీకాలింగ్ మ్యానిఫెస్టో' కార్యక్రమానికి హాజరు కావడానికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తాడిపత్రి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ మేరకు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి వైకాపా జిల్లా పార్టీ అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డికి లేఖ రాశారు. ఇదే రోజు వీరాపురంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటున్నారు. రెండు పార్టీలు భారీగా సభలు నిర్వహిస్తే శాంతి భద్రతలకు ఆటంకం కలగవచ్చని వైకాపా కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని నోటీసులో పేర్కొన్నారు.

నగదుతో బంగారం వ్యాపారి పరారీ

లబోదిబోమంటున్న బాధితులు

నూరుల్లా దుకాణం వద్ద బాధితులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని 17వ వార్డు చౌడమ్మ గుడి ప్రాంతంలో అందరూ కూలీ పనులు చేసుకొనేవారే. పైసా పైసా కూడబెట్టి ఒక్కొక్కరు మూడు, నాలుగు తులాల వరకు బంగారు కోసం వ్యాపారి నూరుల్లాకు డబ్బులు ఇచ్చారు. ఆ నగదు తీసుకొని నూరుల్లా కనిపించకుండా పోయాడని బాధితులు సోమవారం సాయంత్రం అతని దుకాణం వద్ద నిరసన తెలిపారు. దీనికి తోడు మరికొందరితో చీటీ వేయించుకున్నాడని బాధితులు తెలిపారు. సోమవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అక్కడ సీఐ మస్తాన్ సెలవుల్లో ఉండటంతో ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. రెండు నెలల కిందటే పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

స్కూటీలో దాచిన రూ.6 లక్షల నగదు చోరీకి యత్నం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: బెళుగుప్ప మండలం విరూపాపల్లి చెందిన ఓ రైతు నుంచి గుర్తుతెలియని వ్యక్తి నగదు కాజేసేందుకు యత్నించిన ఘటన సోమవారం కళ్యాణదుర్గం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. ముగ్గురు రైతులు కలిసి కళ్యాణదుర్గం యూనియన్ బ్యాంకులో రూ.6 లక్షల పంట రుణాలు తీసుకున్నారు. నగదు సంచిని గోవిందప్ప అనే రైతు తన ద్విచక్రవాహనం (స్కూటీ)లో దాచి మధ్యాహ్నం భోజనం నిమిత్తం విద్యుత్తుశాఖ కార్యాలయ సమీపంలోని ఓ హోటల్‌కు వెళ్లారు. అదే సమయంలో బయట నిలిపిన స్కూటీలో దాచిన నగదు సంచిని ఓ వ్యక్తి తీసుకోవడానికి ప్రయత్నించాడు. దీనిని హోటల్‌లో ముద్ద తింటున్న రైతు గోవిందప్ప గుర్తించి పరుగున బయటకు వచ్చి కేకలు వేశాడు. అంతలోనే చోరుడు నగదు సంచి అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఏం జరగకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

బెంగళూరువాసి అనుమానాస్పద మృతి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గోవిందపల్లి పంచాయతీ రాఘవేంద్ర కాలనీ శివారులో తడకలేరు వాగులో దేవరాజు(56) అనే వ్యక్తి మృతదేహాన్ని బుక్కరాయసముద్రం పోలీసులు గుర్తించారు. తడకలేరు వంతెన కింద కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం లభించిన ప్రదేశం అనంతపురం వన్‌టౌన్, త్రీటౌన్, బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ సరిహద్దు ప్రాంతం కావడంతో మూడు పోలీస్‌స్టేషన్ల అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చివరకు బుక్కరాయసముద్రం పరిధిలోకి వస్తుందని తేల్చారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు వివరాల ప్రకారం మృతుడి పేరు దేవరాజుగా గుర్తించారు. దేవరాజు బెంగళూరులోని నాగసంద్ర ప్రాంతానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడా? లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చామని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని సీఐ పుల్లయ్య తెలిపారు.

ప్రేమ పేరుతో నమ్మించి.. మోసం చేసిన వీఆర్వో

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: అతను వీఆర్వో మహమ్మద్‌వలి. ఇది వరకే పెళ్లైంది. తన మాయమాటలతో మరో అమ్మాయిని నమ్మించి రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెను గర్భిణి చేసి ఇప్పుడు తనకొద్దంటున్నాడు. తనకు న్యాయం చేయాలని సోమవారం బాధితురాలు గుంతకల్లులోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లులోని ఓ వీధికి చెందిన బాధితురాలికి ఇది వరకే పెళ్లి కాగా 2023లో భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈమెకు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. కుమారుడి పేరును రేషన్‌కార్డులో ఎక్కించాలని భాగ్యనగర్‌లోని 24వ సచివాలయం వీఆర్వో మహమ్మద్‌వలి దగ్గరకు వెళ్లింది. అలా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. వీఆర్వో ఒక రోజు ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటాను నమ్మించాడు. అనంతపురానికి తీసుకెళ్లి ఓ దర్గాలో ఆమెను వివాహమాడాడు. తర్వాత గుంతకల్లులోనే ఓ కాలనీలో కాపురం పెట్టాడు. 7 నెలల తరువాత వీఆర్వో పెద్ద భార్య, కుటుంబ సభ్యులు వచ్చి యువతిని కొట్టారు. కాపురం చేస్తే చంపేస్తామంటూ వీఆర్వో అన్న, వదినలు బెదిరించారని బాధితరాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదుసార్లు పంచాయితీ పెట్టినా బాధితురాలికి న్యాయం జరగలేదు. తను ఏడు నెలల గర్భిణి అని, న్యాయం చేయాలని ఆమె పోలీసులను వేడుకుంటున్నారు. వీఆర్వోపై కేసు నమోదు చేశామని సీఐ మనోహర్ తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయాలని మద్దతు తెలుపుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి పార్టీ డివిజన్ కార్యదర్శి సురేశ్ నిరసన తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలం ఇరువెందుల గ్రామంలో ఈనెల 3వ తేదీన జరిగిన హత్య కేసులోని నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడించారు. దాసరి ప్రభాకర్, శంకరయ్య కుటుంబాల మధ్య చెత్త విషయంలో ఘర్షణ జరిగింది. మహిళలు ఇంటి వద్ద గొడవ పడ్డారు. ఇదే సమయంలో రెండు కుటుంబాలకు చెందిన వారు ఘర్షణ పడ్డారు. రాళ్లు, కట్టెలతో దాడి చేసుకొన్నారు. ఈ ఘర్షణలో శంకరయ్య(55) తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ఇరువర్గాల వారు ఇప్పటి వరకు ఆసుపత్రిలో చికిత్స పొందారు. శంకరయ్య మృతికి కారణమైన ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు. ఈసమావేశంలో సీఐ కౌలుట్లయ్య, ఎస్సై విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ళు, పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ. నేషనల్, హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

EDUCATION

GNM అడ్మిషన్స్: ఇంటర్మీడియట్‌లో Any Group పాస్ స్టూడెంట్స్‌కి G.N.M (Nursing)కి గవర్నమెంట్ సీట్స్ కలవు. అనంతపురం నందు గల గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. G.మురళి Cell: 9030661651, ATP.

అడ్మిషన్స్: APNCET (నర్సింగ్ సెట్)లో క్వాలిఫై కానీ స్టూడెంట్స్‌కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ)కి గవర్నమెంట్ సీట్స్‌కు అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont: G.Murali, 9030661651. అనంతపురం.

REAL ESTATE

PLOT FOR SALE

ATP నుండి తాడిపత్రి - NH 544D South, North Corner 3, 4 AHUDA approval Layout 66x106= 16 Cents Main Road Plots అమ్మకానికి కలవు. సెల్: 6303444456/ 9866782918.

JOBS

Bhagya Lakshmi Agencies Ceat Tyres కంపెనీ గోడౌన్‌లో పనిచేయడానికి హెల్పర్లు మరియు డ్రైవర్ కావాలి. సంప్రదించండి: 9390088099.

Wanted APTITUDE Trainer: Required Aptitude Trainer to Train Engineering Graduates, Experienced Candidates Preferred. Salary Negotiable for Deserving Candidates. Contact: Corporate Training (&) Placement Officer. 7799797555.

ప్రముఖ రిటైల్ [illegible] ATP. Cell: 9989152441.

ప్రముఖ E-Kart's, [illegible] 10th, డిగ్రీ, జీతం: 18000 [illegible] 81976 59359.

గమనిక

[illegible]

eenadu classifieds 6 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

[illegible]

వివరాలకు: 8008709784

WALK IN INTERVIEW

20 MICRONS® LIMITED

WALK IN WITH YOUR CV & WALK OUT WITH AN OFFER!

20 Microns Limited a Leading Company in Industrial Minerals & Specialty Chemicals is hiring for multiple positions!

Open Position: Location: Anantapur

Purchase and Sourcing Executive
- Any Graduate
- Good Experience in Sourcing or Procurement of minerals.

Walk-In Details:

Date : 17 & 18th July 2025 Time: 12:00 PM - 4:00 PM

Venue: Sy. No. 43/1, Near Tractor Nagar, Garladinne, Obulapuram Village, Anantapur, Andhra Pradesh, India - 515731. Contact: 9036774857

Can't attend? No worries! Send your CV to Talent@20microns.com

JOIN US AND BE PART OF A GROWING TEAM!

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

'మధ్యవర్తిత్వం'తోనే కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జడ్జి దుర్గాకల్యాణి

ఉరవకొండ, న్యూస్‌టుడే: అధికారులు మధ్యవర్తిత్వం వహిస్తే కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని ఉరవకొండ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆమె 'మధ్యవర్తిత్వం' అంశంపై పోలీసు, ఆబ్కారీ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చొరవ చూపాలన్నారు. సమావేశంలో సీఐ మహానంది, ఎస్సైలు నాగస్వామి, ఖాజాహుసేన్, ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం తగదు

కళ్యాణదుర్గం: సమస్యలపై నిర్లక్ష్యం తగదని ఆర్డీవో వసంతబాబు తసీల్దార్లకు సూచించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి ఆర్డీవో వినతులు స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. మండలాల నుంచి ఏడు దరఖాస్తులు వచ్చాయని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మురడి ఆలయంలో టెంకాయల వేలం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మురడి శ్రీఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి దేవదాసు ఆధ్వర్యంలో సోమవారం టెంకాయలు, కొబ్బరి చిప్పలు వేలం పాట నిర్వహించారు. రామాంజనేయులు టెంకాయల వేలం ద్వారా రూ.3.99 లక్షలు, కొబ్బరి చిప్పల వేలం రూ. లక్ష పదకొండు వేలకు దక్కించుకున్నట్లు ఈవో నరసింహారెడ్డి పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: బళ్లారి మిట్టమీది కూరగాయల మండి నుంచి గరీబ్‌నగర్‌లోకి వెళ్లే దారిలో మురుగు నిలుస్తోంది. దీనిని తొక్కుకొంటూ కాలనీలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. - **సాబ్‌జాన్, గరీబ్‌నగర్.**

సమాధానం: కాలువకు చెత్త అడ్డు పడినపుడు సమస్య ఏర్పడుతుంది. పరిశీలించి మురుగు నిలువకుండా చర్యలు తీసుకుంటాం. **- అలీఖాన్, మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి.**

సమస్య: కణేకల్‌కు వెళ్లే రహదారిలో ఉరవకొండ మండలం రేణుమాకులపల్లి వద్ద కల్వర్టుపై రంధ్రం ఏర్పడింది. దానికి మరమ్మతులు చేయించండి. **-గోపాల్, స్థానికుడు.**

సమాధానం: పరిశీలించి దానికి మరమ్మతులు చేయిస్తాం. - **నాగభూషణ, ఆర్ అండ్‌బీ ఏఈఈ, ఉరవకొండ**

–న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం, ఉరవకొండ

ఉపాధి పథకంలో.. తోటల పెంపకానికి ప్రోత్సాహం

మెట్ట భూముల్లో సేద్యానికి ప్రాధాన్యం

వెలిగొండలో డ్రాగన్ మొక్కను నాటుతున్న అధికారులు

న్యూస్‌టుడే, ఉరవకొండ

ఉపాధి హామీ పథకాన్ని రైతులకు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకం(డ్రైలాండ్ హార్టికల్చర్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా రైతుల భూముల్లో మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, మునగ, కొబ్బరి తోపాటు 26 రకాల పండ్ల మొక్కలు పెంచుకోవడానికి

డివిజన్‌లోని మండలాలు	లక్ష్యం (ఎకరాల్లో)	నాటిన మొక్కలు
బెళుగుప్ప	180	700
కూడేరు	250	180
ఉరవకొండ	100	140
వజ్రకరూరు	260	150
విడపనకల్లు	10	460

వీలుంది. ఈ పంటలకు మూడేళ్లపాటు ఎకరాకు సగటున రూ. లక్ష చొప్పున ప్రోత్సాహం అందిస్తారు. ఏటా ఈ నగదును రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

డివిజన్‌లో 800 ఎకరాల్లో..

ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 800 ఎకరాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఇప్పటికే 60 మంది రైతులకు సంబంధించి 195 ఎకరాల్లో సాగుకు మంజూరు ఇచ్చేశారు. ప్రస్తుతం 84 ఎకరాల్లో 4390 గుంతలు తవ్వించి 1630 పండ్ల మొక్కలు నాటారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసే దిశగా ఉపాధి హామీ సిబ్బంది రైతుల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

ప్రయత్నిస్తే ప్రయోజనమే

ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు 'డ్రైలాండ్ హార్టికల్చర్' పథకానికి అర్హులు. మెట్ట భూములున్న రైతులు పండ్ల తోటల పెంపకం ద్వారా ప్రయోజనం పొందే వీలుంది. మొక్కలను మూడేళ్లపాటు సంరక్షిస్తే ఏపుగా ఎదుగుతాయి. ఆ తరువాత ఆదాయం పొందే వీలుటుంది. పండ్ల మొక్కలు ఎదిగేంత వరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చు.

అవకాశాన్ని ఉపయోగించుకోవాలి

పండ్ల తోటలు వేసుకునే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా సాయం చేస్తాం. సేద్యంలో మెళకువలతో ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయి. ఆసక్తి ఉన్న రైతులు గ్రామాల్లోని క్షేత్ర సహాయకులకు దరఖాస్తులు ఇస్తే మంజూరు ప్రక్రియను పూర్తిచేస్తాం. **- రవిప్రసాద్, ఎంపీడీవో, ఉరవకొండ**

బసాపురం సచివాలయం వద్ద ఎదుట బైఠాయించిన మహిళలు

తాగునీటికి ఆందోళనాపథం

కుందుర్పి, రాయదుర్గం గ్రామీణం: న్యూస్‌టుడే: కుందుర్పి మండలం బసాపురంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు తాగునీరు అందడం లేదని సోమవారం ఆందోళన చేపట్టారు. నీరందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ సచివాలయ సిబ్బందిని లోపలే పెట్టి కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. నిత్యం పనులు మానుకుని తాగునీటికి పొలాల వద్దకు పరుగెత్తాల్సి వస్తోందని వాపోయారు. నీటిని సరఫరా చేసేంతవరకూ సచివాలయం తాళం తీయమని అక్కడే బైఠాయించారు. ఇన్‌ఛార్జి కార్యదర్శి అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వచ్చి మహిళలతో చర్చించి రెండు రోజుల్లో తాగునీరందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించి తాళాలు తీశారు.

● తాగునీరు సరఫరా చేసి దాహం తీర్చాలని వడ్రవన్నూరు ఎస్సీ, బీసీ కాలనీల ప్రజలు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు శాంతమ్మ, రుద్రమ్మ, మల్లమ్మ, కొల్లమ్మ, కమలాక్షమ్మలు వాపోయారు. వెంటనే సంబంధిత అధికారులు తాగునీరు సరఫరా చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరారు.

వడ్రవన్నూరులో...

అధిక ఫీజులు తగవని ఆందోళన

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలపై ఐటీ అధికారులు దాడులు చేయాలని విద్యార్థి సంఘాల ఐకాస నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాల్లో అధిక రుసుములు నియంత్రించాలని ఓ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐకాస అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, మధు, ప్రతినిధులు హిరణ్య, పృథ్వీరాజ్, భీమేశ్, చిరంజీవి పాల్గొన్నారు.

విద్యుత్తు జేఎల్ఎంల సమస్యలు పరిష్కరించండి

కణేకల్లు, న్యూస్‌టుడే: విద్యుత్తు జేఎల్ఎం జీఆర్-2ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిస్కం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట నిరసన తెలిపారు. తదుపరి ఏఈ శంకర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ డిస్కం అదనపు ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, కార్యదర్శులు గోవిందరెడ్డి, జిలాన్, రమేష్, చిన్నికృష్ణ, నాగరాజు, వన్నూరుస్వామి, అశోక్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తోందని రాయదుర్గం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హనుమంతరెడ్డి, తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం లింగంపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో వారు పథకాల కరపత్రాలను అందించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీరాములు, మాజీ సర్పంచి హనుమంతు పాల్గొన్నారు.

పత్రాలు పంపిణీ చేస్తున్న హనుమంతరెడ్డి, నాయకులు

'వైకాపా నేతలు అభివృద్ధిని చూసి మాట్లాడాలి'

కంబదూరు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు మాట్లాడే ముందు అభివృద్ధిని చూసి కళ్లు తెరవాలని తెదేపా సీనియర్ నాయకుడు ఎర్రిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. వైకాపా నేతలు ప్రజల పక్షాన విమర్శలు చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేసిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ఇండెంట్ ఇవ్వగానే నీటి విడుదల: ఎస్ఈ

ఆంధ్రా సరిహద్దు హెచ్చెల్సీలో ఆగిన నీటిని పరిశీలిస్తున్న ఎస్ఈ నారాయణ నాయక్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: అనంతపురం హెచ్చెల్సీ అధికారులు ఇండెంట్ ఇవ్వగానే ఆంధ్రావాటా నీటిని హెచ్చెల్సీకి విడుదల చేస్తామని తుంగభద్ర జలాశయ ఎస్ఈ నారాయణ నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రా సరిహద్దులో నీటిని, గేట్లు, గేజింగ్ రూం, కాలువ పరిస్థితిని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జలాశయం 19వ గేట్ గతేడాది వరద ఉద్ధృతికి కొట్టుకుపోవడంతో అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేశామన్నారు. నేటికీ భద్రత లేనందువల్ల ఈసారి జలాయంలో 105 టీఎంసీల నీటి నిల్వకు బదులు 80 టీఎంసీలకే పరిమితం చేశామన్నారు. నీటి నిల్వ తగ్గినందున ఆంధ్రా నీటి వాటా హెచ్చెల్సీకి 32.5 టీఎంసీల నుంచి 23 టీఎంసీలకు తగ్గించినట్లు పేర్కొన్నారు. నవంబర్‌లో జరిగే తుంగభద్ర బోర్డు సమావేశంలో నీటి నిల్వల ప్రకారం మళ్లీ కేటాయింపులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న వరద నీటిని తుంగభద్ర గేట్లను ఎత్తి దిగువకు వదులుతున్నామన్నారు. జలాశయం నుంచి హెచ్చెల్సీకి 700 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని తెలిపారు. ఈ నీటిని కర్ణాటక పరిధిలోని ఆయకట్టు భూములకు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈఈ రంజిత్‌కుమార్, తుంగభద్ర బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు కనెక్షన్లు పునరుద్ధరించాలని రాస్తారోకో

విడపనకల్లు(ఉరవకొండ): తమకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వినియోగానికి అవకాశం ఉండగా అధికారులు బిల్లులు సరఫరా విడపనకల్లు ఎస్సీ కాలనీ వాసులు వాపోయారు. బిల్లులు చెల్లించని వారి విద్యుత్తు కనెక్షన్లను తొలగించారని సోమవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. విద్యుత్తు అధికారులకు వ్యతిరేకంగా నినదించారు. ఎస్సై ఖాజా హుస్సేన్ వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కందుల పంపిణీలో గోల్‌మాల్‌పై విచారణ

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఉచిత కందుల పంపిణీలో జరిగిన అక్రమాలపై సోమవారం 'ఈనాడు'లో 'కందుల పంపిణీలో గోల్‌మాల్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు రోజా పుష్పలత ములకలేడు సచివాలయానికి చేరుకుని బాధిత రైతు గోపాల్‌ను, ఇతరులను కలిసి విచారించారు. తదుపరి బాధిత రైతులకు కందులు అందజేశారు. ఏవో వాసుకీరాణి పాల్గొన్నారు.

రైతులకు కందులు అందజేస్తున్న అధికారులు

మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటావార్పు

రాయదుర్గం న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె రెండోరోజుకు చేరింది. సోమవారం కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 17న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు మైలారి, ఇస్మాయిల్, సీనా, బసప్ప, ఓబన్న, శివమ్మ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

కేసు నమోదు చేయాలని ధర్నా

శెట్టూరు, అనంత నేరవార్తలు: మాకోడికల్ పేర్లదొడ్డి వద్ద దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పలువురు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. దళిత సంఘాల నాయకుడు వన్నూరుస్వామి, బాధితులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై రామ్‌భూపాల్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామన్నారు. **ఎస్పీకి ఫిర్యాదు:** వజ్రకరూరు మండలం చాబాల కు చెందిన దళితులను మొహర్రం సందర్భంగా ఆలయ తొక్కకుండా కొందరు అడ్డుకున్నారని, దీనిపై ఎస్సైకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు వాపోయారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో సోమవారం పలువురు ఎస్పీ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు.

మురుగు తొలగించరూ...!

రాయదుర్గం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో పడమర వైపున రోడ్డుపై మురుగు అస్తవ్యస్తంగా ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వల్ల ఇళ్లకు సరకులు తీసుకొచ్చే ఆటోలు కూడా లోపలికి రావడం లేదని పలువురు వాపోతున్నారు. మురుగును తొలగించి దారి పక్కన నీళ్లు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం.**

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన గోనుగుంట్ల మలరాయుడు(55) అనంతపురంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ మహానంది తెలిపారు. ఆయన జూన్ 24న వారి కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు.

మొక్కజొన్నలు కొనుగోలు చేసి.. మోసం!

కూడేరు(ఉరవకొండ): న్యూస్‌టుడే: మొక్కజొన్న పంట ఉత్పత్తులను కణేకల్ మండలం తుంబిగనూరుకు చెందిన నగేశ్, బొమ్మనహాల్ మండల గోవిందవాడకు చెందిన వన్నూరుస్వామిలు కొనుగోలు చేసి మూడు నెలలుగా డబ్బులు ఇవ్వడం లేదని కూడేరు మండలం కడదరకుంటకు చెందిన గుండారపు నాగేంద్రప్రసాద్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మొక్కలెక్కడా.. చెత్తాచెదారమే ఇక్కడ!

కళ్యాణదుర్గం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రోడ్డు మధ్యన డివైడర్లపై మొక్కలకు బదులు చెత్తాచెదారం, మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో దారంతా అపరిశుభ్రంగా, దుర్వాసనగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డివైడర్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం, మద్యం బాటిళ్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం.

తీరు మార్చుకోని చోదకుడు.. విద్యార్థుల ఇక్కట్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పొబ్బర్లపల్లి రూట్‌లో పలు గ్రామాలకు చెందిన విద్యార్థులను పట్టణంలోని పాత బస్టాండులో దింపాల్సిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ గోవిందప్ప పోలీస్‌స్టేషన్ సమీపంలో దింపడంతో విద్యార్థులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండులో బస్సు ఆపాలని కోరినా ఆయన పట్టించుకోలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఒకరిని ఫుట్‌బోర్డు నుంచి కిందకు తోసేశాడని పలువురు ఆరోపించారు. రెండు రోజుల కిందట ఇదే డ్రైవర్ విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించడంతో పిల్లలంతా ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేసిన విషయం విదితమే. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ ఈ విషయాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. తక్షణం డీఎం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉమాపతిని పంపి ఈ ఘటనపై విచారణ చేయించారు. సదరు డ్రైవర్‌ను ఇతర రూట్‌కు మార్చుతున్నామని, విచారణ నివేదిక అనంతరం డ్రైవర్‌పై చర్యలు తీసుకోనున్నట్లు డీఎం విద్యార్థులకు హామీ ఇచ్చారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉమాపతి

వృద్ధులను కాపాడండి

అనంత నగరపాలక: తమను కాపాడాలంటూ కూడేరు మండలం గొట్కూరు వద్ద ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులు, నిర్వాహకులు సోమవారం కలెక్టరుకు విన్నవించారు. కొందరు వృద్ధులు మంచాలపై నుంచే తమ సమస్యను వివరించేందుకు వచ్చారు. మా ఆశ్రమం.. మాకు కావాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆశ్రమ నిర్వాహకులు కలెక్టరు వినోద్‌కుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా వాస్తవ స్థితిగతులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వృద్ధులు

మొక్కలు నాటిన కల్కి భగవాన్ భక్తులు

రాయదుర్గం గ్రామీణం: రాయదుర్గం పట్టణంలోని కల్కి భగవాన్ మానవ సేవా సమితి ప్రతినిధులు ఆవులదట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రూ.20 వేలు విలువ చేసే మొక్కలు నాటి నీరు పోసినట్లు హెచ్ఎం విజయభారతి తెలిపారు. రాయదుర్గం కల్కి మానవ సమితి సభ్యులు జయంతి రమేష్ బాబు, సతీమణి మణి, లత, లలిత, సృజన్, వినోద్, ఆవులదట్ల పీడీ శివశరణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కంబదూరు, న్యూస్‌టుడే: చెన్నంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాల మేరకు.. కదిరిదేవరపల్లికి చెందిన గణేష్, చైతన్య, కోటగుడ్డకు చెందిన వంశీ కియా కంపెనీలో విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో పేరూరు మీదుగా వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంబదూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి కళ్యాణదుర్గం తీసుకెళ్లారు. ఎవరికి ప్రాణాపాయం లేదని వైద్యులు పేర్కొన్నారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

డి.హీరేహాళ్: చెర్లోపల్లికి చెందిన ఎర్రిస్వామి పొలానికి కంచె వేసుకోవడానికి రాళ్లు పాతుకోగా.. పక్కన పొలం గట్టు కలిసి ఉన్న అదే గ్రామానికి చెందిన సోమనాథ్ తొలగించాడు. ఈ క్రమంలో ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ విషయంపై ఎర్రిస్వామి తనపై దాడి చేశాడని సోమనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం రేణుమాకులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గాయత్రి, మురళీ, ఉషారాణి, ఆదిలక్ష్మి, విశ్రాంత హెచ్ఎం సంజప్పలను సోమవారం ఘనంగా సత్కరించారు.

హెచ్చెల్సీ నీటి పంపింగ్‌కు వేళాయె..

న్యూస్‌టుడే, రాయదుర్గం

రాయదుర్గం పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే కణేకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు(ఎస్ఎస్ ట్యాంకు)కు తుంగభద్ర ఎగువ కాలువ హెచ్చెల్సీ నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు మున్సిపల్ ఇంజినీర్లు ఏర్పాట్లు పూర్తిచేశారు. బురద నీరు తగ్గిన తర్వాత గంగపూజ చేసి పంపింగ్ చేసే అవకాశం ఉంది. ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటిమట్టం 3050 మిలియన్ లీటర్లు(ఎం.ఎల్) కాగా ప్రస్తుతం 1258 ఎం.ఎల్ నీరుంది. ఇందులో డెడ్ స్టోరేజీ 323 ఎం.ఎల్ పోగా.. మిగిలిన 935 ఎం.ఎల్ నీటిని రోజుకు 10 ఎం.ఎల్ చొప్పున పట్టణ ప్రజలకు మూడు నెలల వరకు సరఫరా చేసే అవకాశం ఉంది.

లీకుల సంగతేంటీ?

తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లకు సుమారు 10 వరకు లీకేజీలు ఉన్నట్లుగా మున్సిపల్ ఇంజినీర్లు గుర్తించారు. వీటి మరమ్మతులకు వేసవిలో చర్యలు తీసుకోలేదు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి కణేకల్లు రోడ్డులోని ఫిల్టరేషన్ పాయింట్ వరకు మొత్తం 30 కిలో మీటర్ల మేర పైపులైన్లు ఉన్నాయి. ఇవి దశాబ్దాల కిందట వేసినవి కావడంతో పలుచోట్ల అస్తవ్యస్తంగా మారాయి. కణేకల్లు క్రాస్ నుంచి టి.వీరాపురం అటవీ ప్రాంతం వరకు సుమారు 10 కిలోమీటర్ల పైపులైన్ అధ్వానంగా మారింది. అమృత్-2 కార్యక్రమంలో భాగంగా శిథిలావస్థకు చేరిన పైప్‌లైన్ల పక్కన కొత్తవి వేస్తామని చెప్పినా.. నేటికీ ఆచరణ లేకపోవడం గమనార్హం.

కణేకల్లు సమ్మయర్ స్టోరేజీ ట్యాంకు

తాత్కాలికంగా ఏర్పాట్లు పూర్తి

ట్యాంకు, పైపుల మరమ్మతుకు రూ.40 లక్షల అవసరం అవుతాయి. డి.ఎం.ఎఫ్ నిధులు మంజూరు చేయాలని ఇటీవల కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. ఇవి రాగానే పనులు చేయిస్తాం. తాత్కాలికంగా నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు 60 హెచ్‌పీ విద్యుత్తు మోటార్ల ద్వారా నిత్యం 48 ఎం.ఎల్ లీటర్లను ఎస్ఎస్ ట్యాంకుకు పంపింగ్ చేయనున్నాం. ఇలాచేస్తే రెండు నెలల్లోనే ఎస్ఎస్ ట్యాంకు నిండుతుంది. **- సురేష్, డీఈ**

సామర్థ్యం లేని బస్సులపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: జిల్లాలోని పలు ప్రైవేటు విద్యాలయాల యాజమాన్యాలు కండీషన్ లేని బస్సులను నడుపుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగ్గుపర్తి చందు పేర్కొన్నారు. అలాంటి యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఆయన సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

విత్తనాలు ఇవ్వాలని రైతు హంగామా

కళ్యాణదుర్గం గ్రామీణం, కుందుర్పి: కుందుర్పి వ్యవసాయ కార్యాలయానికి సోమవారం రైతు గోపాల్ మద్యం మత్తులో వచ్చి తనకు ఉచిత కందుల ప్యాకెట్ ఇవ్వాలని ఏఈవో కులశేఖర్ కాళ్లను టవాలుతో కట్టివేసి ప్రాదేయపడ్డాడు. ఏఈవో సర్ది చెప్పినా వినలేదు. దీనిపై ఏఈవో ఉన్నతాధికారుల సాయంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి రైతునుంచి ఏఈవోను విడిపించారు.

ఏఈవో కాళ్లను టవాలుతో కట్టి కదలకుండా పట్టుకున్న రైతు

అర్హులైన రైతులు కందులు తీసుకెళ్లండి

వజ్రకరూరు: వివిధ గ్రామాల్లోని రైతులకు కంది విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, దీనిని అన్నదాతలు వినియోగించుకోవాలని వజ్రకరూరు ఏవో మధుకర్ పేర్కొన్నారు.

ప్రకటన

Fayaz S/o Shaik Rahimtulla. D.No: 3-147A, Perur, Ramagiri. Doc No: 693/2025, Survey No: 355-2B2, Site: Perur.

Boundaries: తూర్పు: రస్తా, **దక్షిణం:** ఇదే సర్వే నెంబరులో నాకు హక్కు గల మూడు సెంట్లు బయలు స్థలం, **పడమర:** గౌని తిమ్మారెడ్డి మరియు గౌని శివారెడ్డి గారి జమీను, **ఉత్తరం:** ఇదే సర్వే నెంబరులో షేక్ అమానుల్లా గారి జమీను.

పై తెలిపిన వివరాలు గల ప్లాటును కళ్యాణదుర్గం, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కళ్యాణదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజుల లోపల కళ్యాణదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం.

ప్రకటన

Boya Chennarayappa S/o Boya Bomayya. D.No: 2-106, Tenagal, Kalyanadurgam. Doc No: 2344/2025, Survey No: 150-1B/2B, Site: Tenagal.

Boundaries: ఉత్తరం: వంక, **దక్షిణం:** రస్తా, **తూర్పు:** ఇదే స.నెం.లలో ఈ దినం నేను బాషాకు విక్రయించిన బయలు స్థలం. **పడమర:** దేవరగొండ మంజునాథ స్థలం.

పై తెలిపిన వివరాలు గల ప్లాటును కళ్యాణదుర్గం, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కళ్యాణదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజుల లోపల కళ్యాణదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం.

(c) eenadu

గుంతకల్లు

● గుంతకల్లు ● శింగనమల ● తాడిపత్రి

శాకంబరిగా పార్వతీదేవీ

పామిడి : ఆషాఢ మాసం మూడో సోమవారం సందర్భంగా పామిడి పట్టణంలో పురాతన ప్రసిద్ధి గాంచిన భోగేశ్వర ఆలయంలో ప్రసన్న పార్వతీ అమ్మవారు, భోగేశ్వర స్వామి శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివార్లు వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు, పూల అలంకరణలో కనువిందు చేశారు. విశేష పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయానికి స్వాములను దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు.

పేదల అభ్యున్నతే భాజపా లక్ష్యం

తాడిపత్రి, న్యూస్‌టుడే : పేదల సంక్షేమమే భాజపా ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు అంకాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, జయనగర్ కాలనీలకు చెందిన 20 కుటుంబాలు అంజనేయులు ఆధ్వర్యంలో భాజపాలోకి చేరారు. భాజపా బలోపేతానికి అందరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు భాజపా నాయకులు పాల్గొన్నారు.

భాజపాలో చేరిన వారితో అంకాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి

రైతులకు నష్టం జరగకుండా చూడండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైల్వే అధికారులు గుంతకల్లు పట్టణ శివారులో వివిధ గ్రామాల మీదుగా ఏర్పాటు చేయనున్న రైల్వేలైన్ నిర్మాణం వల్ల రైతులకు నష్టం జరగకుండా లైన్ నిర్మాణంలో మార్పులు చేయాలని అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ రైల్వే అధికారులను కోరుతూ రాసిన లేఖను రైతులు సోమవారం ఏడీఆర్‌ఎం సుధాకర్‌కు అందజేశారు. రైల్వే అధికారులకు వినతిపత్రాన్ని అందజేసిన తరువాత డీఆర్‌ఎం కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రైతు నాయకులు చంద్రశేఖర్, రమేశ్, సర్పంచి శ్రీరాములు, మాజీ సర్పంచి రామాంజనేయులు మాట్లాడారు. రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, మురారీ, జగదీశ్వర్‌రెడ్డి, ఓబులేశు, తిమ్మప్ప, పెన్నయ్య, మస్తాన్, నెట్టికంటయ్య, నారాయణస్వామి పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పామిడి, న్యూస్‌టుడే : పామిడి పట్టణంలో ప్రసిద్ధి గాంచిన భోగేశ్వర, చెన్నకేశవ దేవస్థానం, భగవాన్ దాస్ విఠోబ స్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ నుంచి ఉత్తర్వులు అందాయని ఆలయాల కార్యనిర్వహణాధికారి కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మకర్త మండలికి నమోదు చేసుకునేందుకు 20 రోజుల కాలవ్యవధి ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫారం-2లో చిరునామా జత చేసి కమిషనర్ దేవాదాయ శాఖ అనంతపురం కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

చదరంగం.. ప్రతిభతో విజయదరహాసం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లుకు రాఘవ, కార్తిక్ చదరంగంలో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రత్యర్థులను చిత్తు చేసి పాయింట్లు సాధించి పతకాలను కైవసం చేసుకుంటున్నారు. వీరిద్దరూ ప్రైవేట్ పాఠశాలల్లో తొమ్మిది, ఆరో తరగతి చదువుతున్నారు. చెస్ అకాడమీలో చేరి శిక్షకులు అనిల్ దగ్గర శిక్షణ పొంది అంతర్జాతీయ చదరంగంలో టోర్నీల్లో పాల్గొని విజయాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం ఆగస్టులో 2,3వ తేదీల్లో మచిలీపట్నంలో జరిగే జాతీయ స్థాయి చదరంగం ఎంపిక పోటీలకు ఇద్దరూ సాధన చేస్తున్నారు.

రాఘవ వీరవిహారం

● 2024 మేలో గోవాలో అంతర్జాతీయ చదరంగం ర్యాపిడ్ పోటీల్లో పాల్గొని 9 పాయింట్లకు గాను నాలుగు పాయింట్లు సాధించి విజయం సాధించాడు.

● 2024 జూన్‌లో బెంగళూరులో జరిగిన ర్యాపిడ్ టోర్నీలో 4 పాయింట్లు సాధించాడు.

● 2025 మేలో కర్ణాటకలోని బెలగావిలో జరిగిన చెస్ క్లాసిక్ టోర్నీలో ప్రతిభ కనబరిచి 1478 అంతర్జాతీయ రేటింగ్ సాధించాడు.

సాధన చేస్తున్న రాఘవ

కార్తిక్ బరిలో పాదరసం

2025 ఏప్రిల్‌లో జరిగిన అంతర్జాతీయ బిడ్జ్ టోర్నీలో 3 పాయింట్లు సాధించి 1497 రేటింగ్ సాధించాడు.

● 2025 మేలో కర్ణాటకలోని బెలగావిలో జరిగిన అంతర్జాతీయ క్లాసిక్ చదరంగం టోర్నీలో సత్తా చాటాడు.

● 2025 జూన్‌లో మైసూరులో జరిగిన ర్యాపిడ్ టోర్నీలో 5 పాయింట్లతో సత్తా చాటి 1493 అంతర్జాతీయ రేటింగ్ సాధించాడు.

● 2025 జూన్‌లో కర్ణాటకలోని గదగలో జరిగిన చదరంగం ర్యాపిడ్ టోర్నీలో గెలిచి రన్నరప్‌గా నిలిచాడు.

● ఈఏడాది కర్ణాటక బళ్లారిలో ఈఏడాదిలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో 6 పాయింట్లకు 6 సాధించి మొదటి స్థానంలో నిలిచాడు.

కప్పు, ప్రశంసా పత్రంతో కార్తిక్

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 98897 94244

సమస్య: నార్పల మేజర్ పంచాయతీలో కొత్త బస్టాండు వద్ద ప్రహరీ గోడలు పడి రాకపోకలు సాగించడానికి అనువుగా లేదు. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలి. -శ్రీనివాసులు, నార్పల

సమాధానం: కొత్తబస్టాండ్‌కు వెళ్లే దారిలో సీసీ రహదారి నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. -శైలజా రాణి, ఈవోఆర్డీ, నార్పల

- న్యూస్‌టుడే నార్పల

సమస్య: యర్రగుంట్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు, విషపురుగులు సంచరిస్తున్నాయి. - విద్యార్థులు

సమాధానం: పాఠశాలలకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. - తారా చంద్రానాయక్, ఎంఈవో, గార్లదిన్నె

సమస్య: కల్లూరు గ్రామంలోని కొన్ని వీధుల్లో నిత్యం వీధి దీపాలు వెలుగుతూనే ఉంటాయి. - గ్రామస్థులు, కల్లూరు

సమాధానం: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - ప్రశాంతి, సర్పంచి, కల్లూరు

- న్యూస్‌టుడే గార్లదిన్నె గ్రామీణం

కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమపాలన

గుంతకల్లు, న్యూస్‌టుడే : దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చేయని సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే జయరాం అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం సోమవారం పట్టణంలోని సత్యనారాయణపేట, అంజలినగర్, సిద్ధేశ్వర్‌నగర్, హనుమాన్‌నగర్ తదితర కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. తెదేపా ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాల్లో ఇప్పటికే కొన్ని అమలు అవుతున్నాయన్నారు. సంక్షేమానికి మారుపేరుగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కూటమికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. తెదేపా జిల్లా నాయకుడు కె.సి. హరి సంక్షేమ పథకాలను అన్నివర్గాల ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, నాయకులు ప్రతాప్ నాయుడు, మస్తాన్‌యాదవ్, ఫజులు, అంజి, శివకుమార్, మస్తానప్ప, సాయి, మల్లయ్య, శివన్న, చంద్రశేఖర్, రామాంజనేయులు, నారాలోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, భాజపా నాయకులు హరిహరనాథ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు గ్రామీణం : తెదేపాతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని దోసలుడికి, సంగాల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గుంతకల్లు ఇన్‌ఛార్జి నారాయణ స్వామి, మండల అధ్యక్షుడు రామన్న చౌదరి పాల్గొన్నారు.

అందర్నీ గౌరవిద్దాం

గుత్తి, న్యూస్‌టుడే : ఆయాలను చిన్న చూపు చూడరాదని గుత్తి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్.ఎం.సుంకన్న పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఆయాలుగా పనిచేస్తున్న శివమ్మ, జయమ్మ, సుభాషిణి, నారాయణమ్మలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సమాజంలో ప్రతి ఒక్కరినీ గౌరవభావంతో చూడాలని హెచ్.ఎం సుంకన్న సూచించారు.

సన్మానం అందుకున్న ఆయాలతో ఉపాధ్యాయులు

డిగ్రీ కళాశాల, వసతిగృహం ఏర్పాటు చేయాలి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు వసతిగృహం ఏర్పాటు చేయాలని హరిత దివ్యాంగుల సేవాసమితి అధ్యక్షుడు మోహన్‌నాయక్ డిమాండు చేశారు. పట్టణంలో డిగ్రీ కళాశాల లేక పోవడంతో ఇక్కడి విద్యార్థులు అనంతపురం, గుంతకల్లుకు వెళ్లి చదువుకోవాల్సి ఉందన్నారు. అనంతరం తహసీల్దారు పుణ్యవతికి వినతిపత్రం ఇచ్చారు.

గొడవలకు దూరంగా ఉండండి

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా మొహర్రంను జరుపుకోవాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కోమలి గ్రామంలో పీర్ల చావిడిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చాలా ఏళ్ల తరువాత గ్రామంలో మొహర్రం జరుపుకొంటున్నారని, ఎవరూ గొడవలకు పాల్పడకుండా చేసుకోవాలని ఆయన సూచించారు. ● తాడిపత్రిలోని నంద్యాల రోడ్డు, సీపీఐ కాలనీల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్దపప్పూరులో విద్యార్థినితో మాట్లాడుతున్న జేసీ

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో సాగాలి

పెద్దపప్పూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో శకుంతల, ఎంఈవో ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని కోటలో నివాసం ఉంటున్న ఓ యువతి అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఆమె ఓ దుకాణంలో పనిచేస్తోందని, ఉదయాన్నే ఆమె కనిపించకుండా పోయిందని పోలీసులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గార్లదిన్నె: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వాహనదారులకు చర్యలు తప్పవని సీఐ కొలుకుర్తయ్య తెలిపారు. జాతీయ రహదారిపై తలగాసిపల్లి సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ చేశారు. ఎస్సై గౌస్‌బాషాతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు మహిళలు గాయపడిన విషయం విదితమే. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉమాదేవి(35) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉమాదేవి ఆదివారం అనంతపురం నుంచి మొక్కజొన్న కంకులను లాగేజీ ఆటోలో తీసుకెళ్తుండగా కల్లూరు వద్ద బెంగుళూరు నుంచి మంత్రాలయం కర్ణాటక ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

చికిత్స పొందుతూ బాలిక..

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శివప్రియ(14) చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన భువనేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె శివప్రియ ఆదివారం ఇంట్లో ఎరువులు నిల్వ చేసే గదిని ఒక్కసారిగా తెరవడంతో కళ్లుతిరిగి పడిపోయింది. అనంతపురంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ సోమవారం తెలిపారు. కాలనీకి చెందిన వంశీ ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తాడిపత్రి నుంచి తీసుకెళ్లాడని తెలిపారు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

భూకబ్జాదారుల నుంచి కాపాడండి

అనంతనగరపాలక, న్యూస్‌టుడే : తాడిపత్రి మండలం గన్నెవారిపల్లిలో సర్వే నంబరు 756డి, ఈ పొలాన్ని భూ కబ్జాదారుల నుంచి కాపాడాలని బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చారు. తాడిపత్రి పట్టణానికి చెందిన కూనయ్యగారి నారాయణరెడ్డి ప్లాట్లుగా విభజించి 1986 సంవత్సరంలో రిజిస్టర్ చేయించారన్నారు. ఒక్కొక్కరు 3 సెంట్ల ప్రకారం కొనుగోలు చేశామన్నారు. ఆయన మరణాంతరం లేని ప్లాట్లు సృష్టించుకొని కొందరు తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. 3 సెంట్ల స్థలాన్ని రెండు సెంట్లుగా సవరణ చేయించి తాడిపత్రి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్చాలని ప్రయత్నిస్తున్నారని, దీన్ని ఆపాలని కలెక్టర్‌కు బాధితులు విన్నవించారు.

అక్కరకురాని నీటి ట్యాంక్

పామిడి ప్రభుత్వాసుపత్రిలోని పిల్లల వార్డు పక్కన ఉన్న మినీ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. మినీ ట్యాంకుకు నీటి సరఫరా లేదు. ట్యాంకును ఆసుపత్రి అవసరాల నిమిత్తం వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి కమిటీ సభ్యుడు రాజగోపాల్ దృష్టికి తీసుకెళ్లగా మినీ ట్యాంకును పరిశీలించి వెంటనే వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే పామిడి

ఈ బాధలు ఇంకెన్ని రోజులు!

గుంతకల్లు నుంచి దోనిముక్కల మీదుగా పామిడికి వెళ్లే రోడ్డు నిత్యం మురుగు నీటితో దర్శనమిస్తోంది. ప్రధానంగా పాతగుంతకల్లులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కుళాయిలకు నీరు వదిలే సమయంలో, ఇళ్ల నుంచి వెలువడే వృథా నీటితో వీధులు చిత్తడిగా మారుతున్నాయి. ఇక్కడ కాలువల నిర్మాణం లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్‌ను వివరణ కోరగా సిమెంటు రోడ్డు నిర్మించే సమయంలోనే మురుగు కాలువను నిర్మించి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదు. త్వరలో కాలువల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే గుంతకల్లు

ధ్యానంపై ఏకాగ్రత అవసరం

ఆదర్శ పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ ధ్యానంపై ఏకాగ్రత పెంచుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని క్రిష్టిపాడు పిరమిడ్ ధ్యానకేంద్రం కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. పెద్దవడుగూరులోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ధ్యానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకంలో భాగంగా రైతులకు బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దవడుగూరులోని తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు వెంకటరాముడుయాదవ్, సీనియర్ నాయకుడు నారాయణ, నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, సుధాకర తదితరులు పాల్గొని మాట్లాడారు. రైతులు పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడులు లేక అవస్థలు పడుతున్న తరుణంలో తిరిగి ఎకరాకు రూ.1140 బీమా కట్టాలని చెప్పడం అన్యాయమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు ఉషారాణికి నాయకులు అందజేశారు.

ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

అనాథ ఆశ్రమానికి చేయూత

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని ఆవుల తిప్పాయపల్లి గ్రామంలో ఉన్న రమణ మహర్షి అనాథ ఆశ్రమ విద్యార్థులకు కాకర్ల రంగనాథ్, ఆయన సోదరులు జగన్నాథ్, రంగనాయకులు చేయూతనందించారు. విద్యార్థులకు సుమారు రూ.లక్ష విలువ చేసే విద్యా ఉపకరణాలను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు హాజీవలి తెలిపారు. దీంతోపాటు ఆడుకునేందుకు క్రికెట్ కిట్లు, వాలీబాల్, తదితర ఆట వస్తువులు అందజేశారన్నారు. తల్లిదండ్రులు లేని ఏడు గురు చిన్నారులను దత్తత తీసుకుని చదువులకు అయ్యే ఖర్చు భరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలకు ఆర్వోప్లాంట్, ప్రొజెక్టర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు దాత కాకర్ల రంగనాథ్ వెల్లడించారు.

విద్యా ఉపకరణాలు అందజేస్తున్న కాకర్ల రంగనాథ్, సోదరులు

చెత్తతో సంపద సృష్టిద్దాం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పంచాయతీలోని పలు కాలనీల నుంచి పోగయ్యే తడిపొడి చెత్త ద్వారా సంపదను సృష్టించి పంచాయతీ ఆదాయం పెంచేవిధంగా చూడాలని సిబ్బందికి జడ్పీ సీఈవో శివశంకర సూచించారు. పెద్దవడుగూరులోని చెత్తనిల్వ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన చెత్తనిల్వ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు దస్త్రాలు పరిశీలించారు. ఆయనతోపాటు ఎంపీడీవో బారన్‌సాహెబ్, ఈవోఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ప్రభాకర తదితరులు ఉన్నారు.

చెత్తనిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈవో శివశంకర తదితరులు

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించరూ!

పామిడి, న్యూస్‌టుడే : ఆర్డీటీని కాపాడాలని ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో 100 గంటల రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సంకల్పంతో పేదల పాలిట కల్పతరువుగా కొనసాగిన ఆర్డీటీ సేవలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాకే ఓబులేసు, రామాంజనేయులు డిమాండ్ చేశారు.

పామిడి: దీక్షలో పాల్గొన్న వెంకటేశ్, సాకే ఓబులేసు తదితరులు

శింగనమల: పేదల కల్పతరువుగా నిలిచిన ఆర్డీటీని రక్షించుకుందామని ఆర్డీటీ పరిరక్షణ కమిటీ ఐకాస కన్వీనర్ సాకే హరి పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శేషారెడ్డికి వినతి పత్రం అందించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : వచ్చే ఏడాది జరిగే సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తెదేపా నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జంతులూరు, నీలంపల్లి, చెదుళ్ల, రోటరీపురం, నీలారెడ్డిపల్లి, కొర్రపాడు గ్రామాల్లో తెదేపా గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. తెదేపా నాయకులు శ్రీధర్ బాబు, అశోక్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, రవీంద్ర, సోము, కేశన్న, సోము పాల్గొన్నారు.

వేలూరి రామాంజనేయులు సేవలు ఎనలేనివి

రామాంజనేయులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రికి చెందిన వేలూరి రామాంజనేయులు ఏళ్ల తరబడి తెదేపాకు అనేక సేవలందించారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం వేలూరి రామాంజనేయులు మృతిచెంది తొమ్మిదిరోజులు అయిన సందర్భంగా తాడిపత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, రాప్తాడు మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళీ, కుటుంబ సభ్యులు వేలూరి మురళీకృష్ణ, అడుసపల్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు డిమాండ్

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఆందోళన చేశారు. ఇప్పటికే విద్యుత్తు ఛార్జీలను పెంచిన ప్రభుత్వం తాజాగా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలని పూనుకోవడం అన్యాయమన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

కొత్త కాలనీలు.. చుక్కనీరు కరవు

● పడకేసిన పథకాలు
● వృథా అయిన రూ.2 కోట్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లోని ప్రజలకు నీటిని అందించడానికి ప్రభుత్వం రూ.2 కోట్లతో నీటి పథకాలు ఏర్పాటు చేసినా పథకాలు పనిచేయక ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు - దోనిముక్కల రహదారికి ఇరువైపులా జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. ఇళ్లను నిర్మించుకోవడానికి అవసరమైన నీటితో పాటు తాగునీటిని అందించడానికి అధికారులు 40 దాకా బోర్లు తవ్వించారు. వీటికి కరెంటు మోటార్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మోటార్లు పనిచేయక, కొన్ని బోర్లు ఎండిపోవడంతో నీటి పథకాలు మూలకు చేరాయి. ఇళ్లను నిర్మించుకున్న వారు తాగునీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పథకాల పనులు కూడా ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం వారు సక్రమంగా చేయించలేక పోవడంతో కొన్ని చోట్ల పథకాల పనులు పూర్తి చేయలేదు.

దిష్టిబొమ్మలుగా సిమెంటు ట్యాంకులు

జగనన్న కాలనీల్లో నీటిని అందించడానికి ఏర్పాటు చేసిన ట్యాంకులు నీటిని అందించలేక పోతుండటంతో దిష్టి బొమ్మలుగా మారాయి. కొన్ని చోట్ల ట్యాంకులు ఏర్పాటు చేయగా ఇంకొన్ని చోట్ల సిమెంటు దిమ్మెలు నిర్మించి ట్యాంకులు ఏర్పాటు చేయలేదు. వాటికి కుళాయిలను బిగించలేదు. కొన్ని ట్యాంకులకు చెందిన పైపులు, కుళాయిలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. విద్యుత్తు మోటార్లు పనిచేయకుండా పోయాయి. ఫలితంగా ప్రభుత్వం వ్యయం చేసిన నిధులకు సార్థకత లేకుండా పోతోంది. కొందరు గుత్తేదారులు పూర్తిగా పనులు చేయకున్నా అధికారులు బిల్లులను చెల్లించారు. పథకాలు పని చేయకపోయినా ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం అధికారులు నీటి పథకాలను మున్సిపాలిటీకి స్వాధీనం చేశారు. మున్సిపల్ అధికారులు పథకాలను పునరుద్ధరించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పథకాలను వినియోగంలోకి తెచ్చి తమకు నీటిని అందించి ఆదుకోవాలని కాలనీల వాసులు వేడుకుంటున్నారు.

కాలనీలో నీటిని అందించని సిమెంటు ట్యాంకు

పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం

జగనన్న కాలనీల్లోని పనిచేయని తాగునీటి పథకాలను పరిశీలిస్తాం. వాటిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజారోగ్య విభాగం వారు పథకాలను మున్సిపాలిటీకి స్వాధీనం చేసిన విషయం వాస్తవమే. కాలనీలకు అవసరమైన తాగునీటిని అందించడానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటాం.

- ఇంతియాజ్, కార్యనిర్వాహక ఇంజినీరు, గుంతకల్లు

బావాబామ్మర్దులు.. బైకు చోరీల్లో ఆరితేరారు

కర్నూలు నేరవిభాగం: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను కర్నూలు పోలీసులు పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్, పెద్దమండెం మండలం గుడిసెలచెరువుకు చెందిన షేక్ దాదాపీరా (37), కడప నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన చౌడగుండ్ల అనీష్ (22)లను కర్నూలు నగర శివారులో అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సోమవారం తెలిపారు. షేక్ దాదాపీరా చెల్లెలిని ఆటోడ్రైవర్ షేక్ బాబాఫక్రుద్దీన్ వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు జల్సాల కోసం బైకు చోరీలకు అలవాటుపడ్డారు. వీరితో చౌడగుండ్ల అనీష్ జతకట్టాడు. బావాబామ్మర్దులు కుటుంబాలతో సహా అనంతపురం జిల్లాలోని గుంతకల్లుకు మకాం మార్చి నేరాలు ముమ్మరం చేశారు. వీరికి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు తయారు చేసే నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాలతో పరిచయమైంది. తస్కరించిన వాహనాలకు వారితో నకిలీ ఆర్‌సీ పత్రాలు తయారు చేయించి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయించేవారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, గుంతకల్లు, హైదరాబాద్, సైబరాబాద్, నార్పల ప్రాంతాల్లో పలు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. ఈ ఏడాది మే 22న గూడూరుకు చెందిన తెలుగు చంద్రకుమార్ పల్సర్ వాహనంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. బావాబామ్మర్దులు అపహరించారు. కడపకు తీసుకెళ్లి ఓ వ్యక్తికి విక్రయించారు. అతను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి కడప పోలీసులకు పట్టుపడటంతో చోరీల బాగోతం బయటపడింది. కర్నూలు శివారులోని అరుంధతీనగర్‌లో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి 24 బైకులు స్వాధీనం చేసుకున్నారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

తక్కువ పరుగులకే నెల్లూరు, కర్నూలు జట్లు ఆలౌట్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా సీనియర్ క్రికెట్ మూడు రోజుల పోటీల్లో నెల్లూరు, కర్నూలు జట్లు మొదటి ఇన్నింగ్స్‌లో తక్కువ పరుగులకే కుప్పకూలాయి. నెల్లూరు జట్టు అనంతపురం జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 237 పరుగులకే కుప్పకూలగా.. కర్నూలు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకే ఆలౌటైంది. సోమవారం అనంత క్రికెట్ మైదానంలో జరిగిన ఈ రెండు పోటీల్లో తొలిరోజు బౌలర్ల హవా సాగింది. అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో వైభవ్‌రాజ్ (55) చక్కటి బ్యాటింగ్‌తో 2 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. కడప జట్టు 23 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 117 పరుగులు చేసి ఆధిక్యత దిశగా పయనిస్తోంది. కడప బ్యాటరు వంశీకృష్ణ (68) క్రీజులో ఉన్నారు.

'స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి కృష్ణను తొలగించాం'

తపోవనం (అనంత గ్రామీణం): హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చౌడికిక్రిష్ణకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర సంఘం ముఖ్య కమిషనర్ మురళీనాయుడు, రాష్ట్ర నోడల్ అధికారి హబీబ్ బాషా స్పష్టం చేశారు. ఈ సంఘం పేరు చెప్పి ఉద్యోగాలిప్పిస్తామని చౌడికిక్రిష్ణ అక్రమంగా వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రులు తనకు తెలుసని, నిరుద్యోగులను నమ్మిస్తూ డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. గతంలో జిల్లా కార్యదర్శిగా పనిచేసిన అతన్ని ఎప్పుడో తొలగించామని, ప్రజలను మోసం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. చౌడికిక్రిష్ణ మాటలు ఎవరూ నమ్మవద్దని, మోసానికి గురైన వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం, విద్య, న్యూస్‌టుడే: ఆర్ట్స్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. చరిత్ర, ఆర్కియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో అతిథి అధ్యాపకులను తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తున్నామన్నారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు అభ్యర్థులు హాజరుకావాలన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనులు కల్పించే అంశంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతూ 83 పంచాయతీల్లో పనులు చేపట్టడం లేదన్నారు. లేబర్ బడ్జెట్‌కు విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో పురోగతి తక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, హౌసింగ్ పీడీ శైలజ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

రుద్రంపేట, న్యూస్‌టుడే: జిల్లా రైతులను ఆదుకోవాలని, నిధుల విడుదలకు చొరవ చూపాలని సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. జిల్లా రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని, సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి రాయలసీమకు మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకులు రామాంజులురెడ్డి, రామ్‌రెడ్డి, కసీం, సయ్యద్ వలి పాల్గొన్నారు.

అధ్యాపకుల నివాస సముదాయ నిర్మాణానికి గ్రహణం

✦ తొలి గురుకులంలో సమస్యల వెల్లువ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కురుగుంట అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. అనంతపురానికి 8 కి.మీ దూరం ఉన్న ఈ విద్యాలయం జిల్లాకే తలమానికంగా ఉంది. రాత్రిపూట పర్యవేక్షణ, విద్యార్థులకు సందేహాలు తీర్చడానికి అధ్యాపకులు అక్కడే ఉండాలి. కానీ శిథిలావస్థకు చేరిన 18 భవనాలను కూల్చేశారు. వాటిస్థానంలో నూతన భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదు.

శిథిలావస్థకు చేరిన భవనం

ప్రభుత్వం ఆదేశిస్తే అంచనాలు సిద్ధం చేస్తాం

ఇక్కడ విధులు నిర్వహించే అధ్యాపకులు, ఉపాధ్యాయులకు వసతి గృహాలు లేవు. ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరడంతో పడగొట్టాం. కొత్తవాటిని నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. బాలికలకు కూడా డార్మెటరీ నిర్మించాలని ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అంచనాలు సిద్ధం చేసి నిధుల విడుదలకు ప్రతిపాదిస్తాం.

- కె.జయలక్ష్మి, డీసీఓ

30 మందికి నివాస సదుపాయం అవసరం

కురుగుంటలో జూనియర్ కళాశాల, పాఠశాల వేరువేరుగా ఉన్నాయి. అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. బోధన, బోధనేతర సిబ్బంది దాదాపు 25 మంది వరకు పని చేస్తున్నారు. వీరికి నివాస సదుపాయం లేకపోవడంతో నగరం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రివేళల్లో విధులు నిర్వర్తించే మహిళా అధ్యాపకులు ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ప్రిన్సిపల్, అధ్యాపకులకు నివాస సముదాయం ఉండేది. వారు నిత్యం బాలికలకు అందుబాటులో ఉంటూ బాగా చదివించేవారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు నివాసాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం ప్రిన్సిపల్ కూడా అక్కడ నివాసం లేదు. దీంతో రాత్రివేళల్లో పర్యవేక్షణ కరవైంది. అధ్యాపకుల పనితీరును పర్యవేక్షించడానికి అవకాశమే లేకుండా పోయింది. పాఠశాలలో 560 మంది వరకు ఉన్నారు. ఇక్కడ 30 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అందరికి నివాస సముదాయం కల్పిస్తేనే అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుంది. నిత్యం పర్యవేక్షణ ఉంటే బాలికల్లో క్రమశిక్షణ మెరుగవుతుంది. ప్రస్తుతం నివాస సముదాయం లేకపోవడంతో బాలికలకు సాయంత్రం వేళ ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. గతంలో ఉన్న నివాసాలకు మరమ్మతులు చేయించకుండా కూల్చేశారు. వాటిస్థానంలో కొత్తవాటిని కట్టించడంలో జాప్యం జరుగుతోంది. కనీసం ప్రిన్సిపాళ్లు, ముఖ్య పాఠ్యాంశాలు బోధించే అధ్యాపకులకైనా నివాసాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం ఒకే ఒక నివాస సముదాయం మాత్రమే ఉంది. అది కూడా అసౌకర్యంగా మారింది.

ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నగరపాలక కార్యాలయం ముందు రోడ్డు మీద వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడే కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపారు. సమ్మె రెండో రోజుకు చేరుకుంది. కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. రూ.13 వేలు వేతనంతో ఎలా కుటుంబాన్ని పోషించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు రామిరెడ్డి, వెంకటనారాయణ, ముర్తుజా, గోపాల్, మల్లికార్జున, ఓబుళపతి పాల్గొన్నారు.

శిబిరంలో భోజనం తింటున్న కార్మికులు

మధ్యాహ్న భోజనం అమలుకు డిమాండ్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలతో సహా ఎయిడెడ్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు పంపిణీ అమలు చేయాలన్నారు. రజిత, తరిమెల గిరి, విజయ్, సాయి, కిరణ్, జస్వంత్, వరుణ్, బన్నీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని సమగ్రశిక్షా ఏపీసీ శైలజ పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ తరగతులు సోమవారం ఆరంభించారు. జిల్లా వ్యాప్తంగా 235 మందికి నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణపై అవగాహన కల్పించుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ, ఉపాధ్యాయులతో ఎలా వ్యవహరించాలో శిక్షణలో నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పరిశీలకులు సురేష్, ఎంఈవోలు గురుప్రసాద్, లింగానాయక్, ఏఎంఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో గణపయ్యకు పూజలు

అనంత సాంస్కృతికం: నగరంలోని విఘ్నేశ్వరాలయాలు సోమవారం రాత్రి భక్తులతో కిటకిటలాడాయి. పౌర్ణమి అనంతరం వచ్చే చవితి రోజున ఉదయం నుంచి ఉపవాసం చేసి సాయంత్రం గణనాథుడిని పూజిస్తే మంచిదని భక్తుల విశ్వాసం. అర్చకులు భక్తులతో వినాయకుడికి క్షీరాభిషేకం చేయించారు. పీటీసీలోని కామితార్థ గణపతి ఆలయం, శివబాలయోగి ఆశ్రమం, హెచ్ఎల్‌సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం, హౌసింగ్ బోర్డులోని వెంకటేశ్వరాలయం, గీతామందిరంలోని వరసిద్ధి వినాయకస్వామి గుడి, అశోక్‌నగర్ సత్య దేవాలయం, పాతూరు దత్తమందిరం, అశోక్‌నగర్ హరిహర దేవాలయం, గణపతి సచ్చిదానంద వినాయక ఆలయం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వ్రతం చేసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు.

క్షీరాభిషేకంలో పాల్గొన్న భక్తులు

'జీఓలు చూపమంటే భయమెందుకు?'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో రూ.118 కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే చెబుతున్నారని, అందుకు సంబంధించి నిధుల కేటాయింపు జీఓలు చూపమంటే ఎందుకు భయపడుతున్నారని మేయర్ వసీం ప్రశ్నించారు. సోమవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. జంగా అభివృద్ధి చేసి ఉంటే ఎందుకు జీవోలు చూపడం లేదన్నారు. ఆయన చెబుతున్నవి అన్నీ అబద్ధాలు అని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, రహంతుల్లా, కమల్ భూషణ్, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఇషాక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం అనంతపురంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం నివాసంలో మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం ప్రతినిధులకు గడ్డం సుబ్రహ్మణ్యం రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సైనికులకు ఇంటి స్థలాలు మంజూరుతో పాటు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

మాజీ సైనికులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్, గడ్డం సుబ్రహ్మణ్యం తదితరులు

పోష్ పకడ్బందీగా అమలు చేయాలి

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత చట్టంపై పోస్టర్లు ఆవిష్కరించారు. అంతర్గతంగా ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించాలన్నారు. లైంగిక వేధింపులపై ఆన్‌లైన్లో ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, ఐసీడీఎస్ పీడీ నాగమణి పాల్గొన్నారు.

✦ సేవ్‌వాటర్-యూజ్ వాటర్ కార్యక్రమం ద్వారా కుళాయిలు, బోర్ల వద్ద వృథా నీటిని భూమిలోకి ఇంకింప చేయడానికి ఉపాధి హామీ పథకం ద్వారా పారం పాండ్లు పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు.

✦ ప్రభుత్వ సేవల గురించి అర్జీదారులకు అర్థమయ్యే భాషలో బొమ్మలు, వీడియోలు రూపొందించాలని కలెక్టరు ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూకు సంబంధించిన అన్ని వివరాలు అర్థమయ్యే విధంగా వివరాలు ఏర్పాటు చేయాలన్నారు.

✦ భారీ పరిశ్రమల యాజమాన్యాలు కార్పొరేట్ సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టరు వినోద్‌కుమార్ కోరారు. జిల్లాలో సీఎస్ఆర్ సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశ్రామిక వేత్తలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు శ్రీనివాసయాదవ్, సీపీఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

1,25,578 మంది నిరక్షరాస్యులు...

అనంతపురం జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అక్షర ఆంధ్ర కార్యక్రమంపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లాలో 1,25,578 మంది నిరక్షరాస్యులు ఉన్నారని వారందరినీ అక్షరాస్యులుగా చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. ఆగస్టు 7వ తేదీన అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించి మార్చి చివరి నాటికి లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఆందోళన

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంతోశ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సంతోశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు కార్యాచరణకు నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ సంస్థల్లో ఉన్న ఖాళీలు అన్నింటిని భర్తీ చేయాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ, నగర అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

ఏడీ దృష్టికి నేతన్నల సమస్యలు

కమలానగర్: నేతన్నల సమస్యలు పరిష్కరించాలని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప డిమాండ్ చేశారు. సోమవారం చేనేత సంఘాల నాయకులతో కలిసి ఆయన, చేనేతజౌళీశాఖ ఏడీ వరప్రసాద్ సమస్యలు విన్నవించారు. నేతన్నలకు ముద్ర రుణాలు, పింఛన్లు, పట్టురాయితీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. నాయకులు ప్రసాద్, వెంకటరమణ, సూర్యనారాయణ, కుమార్, నారాయణస్వామి, కేశవ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణయ్య

అరవిందనగర్(అనంతపురం): గ్రామీణ తపాలా ఉద్యోగుల నూతన రాష్ట్ర కార్యవర్గంలో అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్యయాదవ్‌కు అధ్యక్షుడి పదవి దక్కింది. నెల్లూరులో సోమవారం జరిగిన 14వ రాష్ట్ర ద్వైవార్షిక మహాసభలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణయ్యయాదవ్‌కు సంఘం రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పార్వతమ్మ మృతికి ఎమ్మెల్యే సంతాపం

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి పార్వతమ్మ ఆదివారం మృతి చెందారు. ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ ఇతర నాయకులతో కలిసి సోమవారం పార్వతమ్మ పార్థివదేహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.

వడ్డీ వ్యాపారిపై మహిళ ఫిర్యాదు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన రేణుక అనే మహిళ అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారిపై సోమవారం ఎస్పీ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. తన కుమారుడు అభిషేక్‌రెడ్డికి ఎరుకుల రవికుమార్ తమకు తెలియకుండా విడతల వారీగా రూ.3.30 లక్షలు ఇచ్చాడు. అందుకు తమ కుమారుడి నుంచి ఖాళీ బ్యాంకు చెక్కులు తీసుకున్నాడు. ఇందుకు వడ్డీ వారానికి రూ.33 వేలు ప్రకారం మూడు నెలల వరకు చెల్లించామన్నారు. ఇంటి వద్దకు వచ్చి గొడవ చేస్తుంటే గత నెల 16న రూ.2 లక్షలు రవికుమార్ ఖాతాకు బదిలీ చేశామన్నారు. ఇప్పటి వరకు పలు దఫాలుగా రూ.5.60 లక్షలు చెల్లించామన్నారు. ఇంకా డబ్బులు ఇవ్వాలంటూ తమను వడ్డీ వ్యాపారి వేధిస్తున్నాడన్నారు. వ్యాపారితోపాటు అనుచరులు భరత్‌సాయి, హుస్సేన్, రవి, హరీశ్, మహేశ్, రాములు ఇంటి వద్దకు, తాము నిర్వహిస్తున్న హోటల్ వద్దకు వచ్చి నానా దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారున్ని చంపుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

'అనంత'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

రాంనగర్(అనంతపురం): అనంతపురాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్ది, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 26వ డివిజన్‌లోని హమాలీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కాలనీవాసులు అక్కడి సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్యలు: నగరపాలక సంస్థ పరిధిలోని స్థలాల ఆక్రమణపై తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. సోమవారం అనంతపురం అర్బన్ క్యాంపు కార్యాలయంలో నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 2 నాటికి డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చూడాలన్నారు. కమిషనర్ బాలస్వామి, అదనపు కమిషనర్ పావని, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ సాకీర్, డీఈ నరసింహులు, పట్టణ ప్లానింగ్ శిరీష, పబ్లిక్ హెల్త్ ఆదినారాయణ పాల్గొన్నారు.

వేలూరి రామాంజనేయులు సేవలు ఎనలేనివి

తాడిపత్రి: తాడిపత్రికి చెందిన వేలూరి రామాంజనేయులు ఏళ్ల తరబడి తెదేపాకు అనేక సేవలందించారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం వేలూరి రామాంజనేయులు మృతిచెంది తొమ్మిదిరోజులు అయిన సందర్భంగా తాడిపత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, రాప్తాడు మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళీ, కుటుంబ సభ్యులు వేలూరి మురళీకృష్ణ, అడుసపల్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఏడాదిలోనే సుపరిపాలన అందించాం: ఎమ్మెల్యే సునీత

రుద్రంపేట: సుపరిపాలన అంటే ఏమిటో ఏడాదిలోనే చూపించామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం ఆలమూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానిక తెదేపా నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి ఏడాదిలో ఇచ్చిన హామీల్లో 90 శాతం నెరవేర్చామని, త్వరలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామన్నారు.

కూరగాయల ధరలు

అనంతపురం(అరవిందనగర్), న్యూస్‌టుడే: (అనంతపురం పాతూరు మార్కెట్లో, ధరలు కిలో రూ..లలో) టమాటా 20, రెండోరకం 10, ఉల్లిగడ్డలు 25, రెండోరకం 15, బంగాళాదుంపలు 35, బెండకాయలు 40, వంకాయలు 20, ముల్లంగి 40, బీట్‌రూట్ 35, బీరకాయలు 35, కాకరకాయలు 40, చౌళేకాయలు 25, క్యాప్సికమ్ 30, చిక్కుడుకాయలు 30, క్యారెట్ 50, బీన్స్ 60, క్యాబేజీ 35, మునగకాయలు 40.

దూదేకుల సమస్యలు పరిష్కరించండి

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో దూదేకుల కులస్థుల సమస్యలను పరిష్కరించాలని చమన్‌సాబ్ ఫౌండేషన్ ఛైర్మన్ ఉమర్‌ముక్తార్, చమన్‌సాబ్ సతీమణి, రామగిరి మాజీ ఎంపీపీ రమిజాబేగం కోరారు. సోమవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రి లోకేశ్‌తో ఉమర్‌ముక్తార్, రమీజా బేగం

బావాబామ్మర్దులు.. బైకు చోరీల్లో ఆరితేరారు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను కర్నూలు మూడో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లికి చెందిన షేక్ బాబా ఫకృద్దీన్, పెద్దమండెం మండలం గుడిసెలచెరువుకు చెందిన షేక్ దాదాపీరా (37), కడప నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన చౌడగుండ్ల అనీష్ (22)లను కర్నూలు నగర శివారులో అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సోమవారం తెలిపారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. జులాయిగా తిరిగే షేక్ దాదాపీరా చెల్లెలిని ఆటోడ్రైవర్ షేక్ బాబాఫకృద్దీన్ వివాహం చేసుకున్నాడు. బావా బామ్మర్దులైన వీరిద్దరు జల్సాల కోసం బైకు చోరీలకు అలవాటుపడ్డారు. వీరితో చౌడగుండ్ల అనీష్ జతకట్టాడు. తర్వాత పోలీసుల దృష్టి మరల్చేందుకు బావాబామ్మర్దులు కుటుంబంతో సహా అనంతపురం జిల్లాలోని గుంతకల్లుకు మకాం మార్చి నేరాలు ముమ్మరం చేశారు. వీరికి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు తయారు చేసే నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాలతో పరిచయమైంది. తస్కరించిన వాహనాలకు వారితో నకిలీ పత్రాలు తయారు చేయించి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయించేవారు. ఉమ్మడి రాష్ట్రాల్లోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, గుంతకల్లు, హైదరాబాద్, సైబరాబాద్, నార్పల ప్రాంతాల్లో పలు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. ఈ ఏడాది మే 22న గూడూరుకు చెందిన తెలుగు చంద్రకుమార్ పల్సర్ వాహనంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆ వాహనాన్ని బావాబామ్మర్దులు అపహరించారు. కడపకు చెందిన వ్యక్తికి విక్రయించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి రూ.24 లక్షల విలువైన 24 బైకులను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాల కోసం గాలింపు చేపట్టారు.

గోతులు తవ్వారు.. వదిలేశారు

● ప్రమాదాల బారిన వాహనదారులు

నగరంలోని గుత్తి రోడ్డులో నెల రోజుల క్రితం ప్రధాన రహదారిలో 10 అడుగుల మేర గుంత తీశారు. వేణుగోపాల్ నగర్, ఎన్టీఆర్ మార్గ్ కూడలి వద్ద గోతి తవ్వి వదిలేశారు. ఇక్కడే కర్నూలు వైపు వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులు నిలబడుతుంటారు. మురుగంతా ఆ గుంతలోకి చేరుతోంది. దాన్ని తవ్వింది తాగునీటి పైపులైను కోసమా అన్నది స్పష్టత లేదు.

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలో ఎక్కడపడితే అక్కడ గోతులు తవ్వుతున్నా నగరపాలక పట్టించుకోవడం లేదు. పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు వాటి అవసరాలకు గుంతలు తీసి పూడ్చకుండా నెలల తరబడి అలాగే వదిలేస్తే ప్రజల్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. కూడళ్లలో, ప్రధాన రహదారుల్లో గుంతల కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాటి వల్ల ప్రమాదాల బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నకు సమాధానం కనిపించడం లేదు. గతంలో పలు ప్రాంతాల్లో పైపులైను పనులు చేయడానికి తవ్వి ఇప్పటికీ మరమ్మతులు చేయకుండా వదిలేశారు.

విద్యుత్తు నగర్ కూడలిలో కేబుల్ వైర్ల కోసం గుంత తవ్వారు. హౌసింగ్ బోర్డు, సప్తగిరి కూడలి వైపు నుంచి వచ్చే వారికి నాయక్‌నగర్ వైపు వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. పది రోజులుగా ఈ గుంతను పూడ్చలేదు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయరూ..

వీరంతా అంధులు.. ఒకరి చేయి ఒకరు పట్టుకుని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చారు. తమకు ఇంటి స్థలం ఇప్పించాలని కలెక్టరు వినోద్‌కుమార్‌కు అర్జీ ఇచ్చి వేడుకున్నారు. వీరు అనంతపురం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివసిస్తున్నారు.

- ఈనాడు, అనంతపురం

DOCUMENT MISSING

నేను గుత్తా శ్రీనాథ్, S/o గుత్తా వెంకట నాయుడు, వయస్సు 43 సంవత్సరాలు, మేనేజింగ్ పార్ట్‌నర్, M/s. GVN STAR INFRA SERVICES, ... NSIC GP రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ నెం: NSIC/GP/HYD/2020/0043546 ... 28.06.2023, ... 30.12.2022 నుండి 29.12.2024 వరకు ...

9701403391

ఇంటి దొంగలపై వేటు

◆ అన్నమయ్య, చిత్తూరు పీడీల అవినీతి వ్యవహారం
◆ ఇప్పటికి పండిన వైకాపా హయాంలోని పాపం

ఈనాడు, కడప: 'జగనన్న కాలనీ'ల పేరిట వైకాపా నేతాగణాలే కాదు.. అప్పట్లో అధికారులు సాగించిన అక్రమాలూ అనేకం. కాలనీల కోసం రూ. కోట్లు పెట్టి ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేశారు. చాలాచోట్ల ధరలు పెంచి కమీషన్లు కొట్టేశారు. లబ్ధిదారుల దరికి చేర్చకుండానే సిమెంట్‌ను పక్కదారి పట్టించారు. ఇటువంటి కొందరి పాపం ఇప్పుడు పండుతోంది. అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం వేటు వేస్తోంది.

● **సిమెంట్, ఇసుక స్వాహా:** గృహ నిర్మాణ సంస్థ అన్నమయ్య, చిత్తూరు జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లు వి.సాంబశివయ్య, గోపాల్ నాయక్‌లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా హయాంలో అన్నమయ్య జిల్లా నారాయణరెడ్డిపల్లె జగనన్న లేఅవుట్‌లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇళ్ల నిర్మాణం చేపట్టకనే, లబ్ధిదారులకు తెలియకనే సిమెంట్, స్టీలు, ఇసుక, నిర్మాణ సామగ్రిని అప్పట్లో స్వాహా చేశారు.

● **జిల్లా వీడి వెళ్లొద్దు:** స్వాహా పర్వంలో పొరుగు సేవల కింద పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ అనంత శ్రీహరిని బాధ్యుడిగా గుర్తిస్తూ ఇప్పటికే విధుల నుంచి తొలగించారు. ఈ వ్యవహారంలో ఇంకా పలువురిపై వివిధ రకాల చర్యలు తీసుకున్నారు. అప్పట్లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పీడీ సాంబశివయ్య, అప్పట్లో రాయచోటి డీఈఈగా పని చేసిన, ప్రస్తుత చిత్తూరు జిల్లా పీడీ గోపాల్ నాయక్‌లపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సస్పెన్షన్ కాలంలో ఇద్దరు అధికారులు అనుమతి లేకుండా జిల్లా కేంద్రాన్ని వదిలి వెళ్లరాదంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇద్దరు అధికారులు ఈఈలుగా పని చేస్తూ జిల్లా ఇన్‌ఛార్జి పీడీ(జిల్లా హెడ్ హౌసింగ్)లుగా వ్యవహరిస్తున్నారు.

రైతేరాజు 8లో

యాగ క్రతువును తిలకిస్తున్న భక్తులు .. అర్చన చేస్తున్న వేద పండితులు

సౌమ్యనాథునికి విరుల సోయగం

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి పుష్పయాగ మహోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మొత్తం పన్నెండు రకాల పుష్పాలు, తులసి, మరువం, దవనం వంటి నాలుగు రకాల ఆకులతో స్వామి, అమ్మవార్లకు యాగం చేశారు. అద్భుతం శోభాయమానంగా సాగిన ఈ క్రతువును భక్తులు తిలకించి తన్మయత్వం చెందారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడాలని స్వామివారిని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు యాగం చేపట్టినట్లు వేద పండితులు తెలిపారు.

అయ్యో దేవా.. ఇంకేం మిగిలిందయ్యా

◆ కూలీల జీవితాలతో క్రూర ఆట ◆ కన్నీటితో తడిసి ముద్దైన శెట్టిగుంట

రైల్వేకోడూరు, రాజంపేట గ్రామీణ, పుల్లంపేట, న్యూస్‌టుడే: విధి.. కూలీల జీవితాలతో క్రూరంగా ఆట ఆడింది. జీవనాధారం కోసం రెక్కాడితే డొక్కాడని బతుకుల్లో కల్లోలం నింపింది. తామే లోకంగా జీవిస్తున్న చిన్నారులకు తమ కన్నవారిని కానరాకుండా చేసింది. తమనే నమ్ముకుని బతుకులీడుస్తున్న తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. అజాగ్రత్తలకు జీవిత కాల శిక్ష విధించింది. ఎన్నటికీ మానని గాయాన్ని చేసింది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్టపై ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం రూపంలో విషాదం చోటుచేసుకుంది. అప్పటి వరకు మామిడి కాయలు కోసి.. లారీకి లోడ్ ఎత్తి.. అదే వాహనంపై స్వగ్రామానికి తిరుగుపయనం పట్టిన తొమ్మిది మంది ప్రాణాలను డ్రైవర్ నిర్లక్ష్యం బలిగొంది.

● **మృతుల్లో రెండు జిల్లాల వాసులు:** రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట గిరిజన కాలనీ, తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన కూలీలు మామిడి కాయల కోతకు రాజంపేట మండలం ఇసుకపల్లె గ్రామ పరిసరాలకు ఆదివారం వచ్చారు. మామిడి కాయలు కోసిన తర్వాత తిరిగి ఐషర్ వేయడానికి లారీ క్యాబిన్‌తో పాటు వెనుక మొత్తం 21 మంది కూలీలు రైల్వేకోడూరుకు ప్రయాణమయ్యారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్టపై వాహనం అదుపు తప్పి పడిపోవడంతో శెట్టిగుంట యానాది కాలనీకి చెందిన గజ్జల సుబ్బరత్నమ్మ(28), వెంకటేశు(40) దంపతులు, వెంకటేశు తల్లి లక్ష్మీదేవి(60), గజ్జల దుర్గయ్య(35), గంగమ్మ(33) దంపతులు చనిపోయారు. సుబ్బరత్నమ్మ, వెంకటేశు దంపతులకు గౌతమ్, శ్రీను అనే పిల్లలున్నారు. వీరి మూడో బిడ్డ అమ్మమ్మగారి వెంకటగిరిలో ఉంటున్నారు. దుర్గయ్య, గంగమ్మ దంపతులకు గంగయ్య, సునీత, రాజేశ్వరి అనే పిల్లలున్నారు. తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ బిడ్డలు అనాథలుగా మారారు.

మృతదేహాల వద్ద మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు

గజ్జల దుర్గయ్య, గంగమ్మ దంపతులు (పాత చిత్రాలు)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం కలవగుంట ఎస్సీ కాలనీకి చెందిన చిట్టెమ్మ(35), అదే మండలం చుక్కలనిడిగల్లుకు చెందిన రాధ(35), ఆమె కుమారుడు జాని(18) మృతిచెందారు. ఇదే ప్రమాదంలో రాధ భర్త రమణయ్య గాయపడ్డారు. తిరుపతి మండలం పల్లెపాడుకు చెందిన మునిచంద్ర(19) విగతజీవిగా మారారు.

● **తెల్లవార్లూ ఎదురుచూపులు:** ప్రమాదంలో తమవారు మృతిచెందారనే విషయం తెలుసుకున్న శెట్టిగుంట గిరిజన కాలనీ వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉదయం వరకు తమతో ఉన్నవారు ఇక ఎన్నటికీ తిరిగి రారనే విషయం తెలుసుకుని గుండెలవిసేలా రోదించారు. ప్రమాదం అనంతరం మృతదేహాలను రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఆదివారం రాత్రి నుంచి అప్పటి వరకు విగతజీవులుగా మారిన తమవారి కోసం గ్రామస్థులు ఎదురు చూస్తూనే ఉన్నారు. వాహనం నుంచి దింపుతున్న మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యుల రోదనలు ఆ ఊరిలో మిన్నంటాయి.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

● **ప్రముఖుల పరామర్శ:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబ సభ్యులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. గాయపడిన వారి కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్, నియోజకవర్గ తెదేపా బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి పరామర్శించారు. పిల్లలు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ సాయం కింద రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 50 వేల చొప్పున అందజేశారు. ప్రభుత్వం తరపున రావాల్సిన సహాయం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సోదరుడు గంగయ్య గుండెలపై వాలి రోదిస్తున్న సునీత, రాజేశ్వరి

కళ్లెదుటే ప్రాణాలొదిలారు

లారీపై తిరుగు ప్రయాణమయ్యాక దాదాపు గంట సమయం తర్వాత ప్రమాదం జరిగింది. ఉన్నట్టుండి లారీ నుంచి దిగడం అనుకున్నాం. అంతలోనే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. చూస్తేనే నా భార్య చిట్టెమ్మ, మా అక్క, బావ ముగ్గురూ విగత జీవులుగా కనిపించారు. నా కళ్లెదుటే వారంతా మృతి చెందారు. నాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మా అక్క, బావలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వారిని దేవుడే ఆదుకోవాలి.

శివ

నాకు, పిల్లలకు ఇక దిక్కెవరు

'రోడ్డు ప్రమాదంలో నా భర్త శ్రీనివాసులు(34) మృతి చెందారు. నా భర్త లేని జీవితం నాకు వద్దు. నాకు ఇద్దరు ఆడ బిడ్డలు. మేము కూలి పనులు చేస్తేనే పూట గడవదు. మేము ఏ తప్పు చేశాం దేవుడా.. ఇంతటి అన్యాయం చేశావు. ఇప్పుడు నాకు, నా బిడ్డలకు దిక్కెవరు.. ఎలా జీవించాలి.' అంటూ ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన విజల గుండెలవిసేలా రోదిస్తోంది. ఆమె ఆవేదన అందరి కళ్లు చెమర్చాయి.

పిల్లలతో కలసి విలపిస్తున్న విజల

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఏఎస్పీ రామనాథ్ హెగ్డే, అదనపు ఎస్పీ వెంకటాద్రి తదితరులు

పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు వద్ద ప్రమాద స్థలాన్ని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, అదనపు ఎస్పీ వెంకటాద్రి, సీఐ రాజా, ఎస్సై శివశంకర్ తదితరులు సోమవారం పరిశీలించారు. సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని, మరోమారు ఇలా ప్రమాదాలకు తావులేకుండా పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ప్రమాదంలో వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కనిపిస్తోందని తెలిపారు. పోలీసులు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఆలోచనే ఆదాయ వనరు

◆ ప్రకృతి వ్యవసాయంలో కాంతలు
◆ మెరుగైన జీవనం దిశగా అడుగులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: మహిళలం మేము.. పొదుపు సంఘాలను నడిపిస్తాం.. వ్యవసాయమూ చేసేస్తాం.. ఏ రంగమైనా సరే లాభాల బాట నడుస్తాం... అంటున్నారు ప్రకృతి వ్యవసాయ సాగు మహిళా రైతులు. వినూత్నంగా ఆలోచించి తామే విక్రయాలు చేపడుతున్నారు. నాణ్యమైన పదార్థాల తయారీతో ఆదాయమూ ఆర్జిస్తున్నారు.

● **చిరు ధాన్యాలతో తినుబండారాలు:** అయ్యవారిపల్లె క్లస్టర్ ప్రకృతి వ్యవసాయ సాగు పరిధిలోని అయ్యవారిపల్లె, చింతపర్తి, నగిరి మడుగు, బూడిదవేడు, చింతలవారిపల్లె తదితర గ్రామాలకు చెందిన 15 మంది ఓ సంఘంగా ఏర్పడి ప్రకృతి సాగు చేపట్టారు. తక్కువ విస్తీర్ణంలో ఏడు రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వీటిలోని చిరుధాన్యాలతో కొర్రపాయసం, సద్దమురుకులు, రాగిలడ్డూలు వంటి తినుబండారాలనూ తయారు చేస్తున్నారు.

కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

● **ప్రతి సోమవారం అమ్మకాలు:** పండించిన దిగుబడులతో పాటు, తయారు చేసిన తినుబండారాలను మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల వద్ద ప్రతి సోమవారం విక్రయిస్తున్నారు. ప్రతి సోమవారం 4 నుంచి 5 క్వింటాళ్ల ఉత్పత్తులను అమ్ముతూ ఆ ఒక్క రోజే రూ. 14 వేల నుంచి రూ. 20 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఏడాది పాటు దిగబడులు వస్తుంటాయని మహిళా రైతులు చెబుతున్నారు. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

● **ఈ విధానం ఉత్తమం:** వారానికి ఒక రోజు స్టాల్స్ ద్వారా అమ్మకాలు సాగించడం ద్వారా మంచి ఆదాయం వస్తోంది. దీంతో మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్తున్నారు. ఈ విధానం అనుసరించడం ఇతరులకూ ఎంతో ఉత్తమం.
- సుబ్బరామయ్య, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయ శాఖ

● **ఏటా రూ.లక్ష వరకు ఆదాయం:** పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. సదరు ఉత్పత్తులతో తామే మార్కెటింగ్ చేసుకుంటున్నాం. ప్రకృతి ఉత్పత్తుల కొనుగోలుకు ప్రజలు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు. తద్వారా ఏటా రూ. లక్షకు తగ్గకుండా ఆదాయం పొందుతున్నాను.
- స్వాతి, ప్రకృతి సాగు మహిళా రైతు, అయ్యవారిపల్లె

● **కుటుంబాలకు ఉపకారిగా ఉంటున్నారు:** ప్రకృతి విధానంలో వ్యవసాయం చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. వాటితో నాణ్యమైన ఆహార ఉత్పత్తులను తయారు చేసి స్వయంగా విక్రయిస్తున్నారు. దీంతో ఆర్థికంగా మహిళలు ఎదుగుతున్నారు. పొందిన ఆదాయాన్ని పిల్లల చదువుతో పాటు కుటుంబ పోషణకు వినియోగించుకుంటూ శెభాష్ అనిపించుకుంటున్నారు.
- సావిత్రి, మాజీ సర్పంచి, అయ్యవారిపల్లె

● **సమష్టి కృషితో సత్ఫలితాలు:** కలిసికట్టుగా వ్యవసాయం చేస్తున్నాం. తినుబండారాల తయారీ, అమ్మకాలు సాగిస్తున్నాం. తద్వారా మంచి ఆదాయం పొందుతున్నాం. భవిష్యత్తులో మరింత విస్తీర్ణంలో ప్రకృతి విధానంలో పంటలు పండిస్తాం. పెద్ద స్థాయిలో అమ్మకాలు సాగించాలన్న ఆలోచనతో ముందుకెళ్తున్నాం.
- కాంతమ్మ, ప్రకృతి సాగు మహిళా రైతు, చింతపర్తి

తాళ్లపాక చెరువులో శివలింగం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం మండలం తాళ్లపాకలోని చెరువును చదును చేసి అక్కడ అన్నమయ్య సంకీర్తనలు రచించే విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తితిదే అధికారులు చెరువులో పెరిగిన కంపచెట్లను చదును చేసే పనులు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పెద్ద శివలింగం బయట పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

శివలింగానికి పూజలు చేస్తున్న పండితులు, గ్రామస్థులు

బాహుదా.. భద్రమేనా!

◆ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం ◆ ప్రస్తుతం మరమ్మతులు ఆవశ్యం

◆ పేరు: బాహుదా రివర్ ప్రాజెక్ట్
◆ నిర్మాణం ప్రారంభం: 1966- 67
◆ నిర్మాణం పూర్తి: 1974
◆ నిర్మాణ వ్యయం: రూ.63.55 లక్షలు
◆ లబ్ధి చేకూరనున్న గ్రామాలు: 10
◆ మొత్తం ఆయకట్టు: 2,888 ఎకరాలు
◆ క్యాచ్‌మెంటు ఏరియా: 168 చదరపు మైళ్లు
◆ నీటి నిల్వ సామర్థ్యం: 398 ఎంసీఎఫ్‌టీ
◆ డెడ్ స్టోరేజ్: 20 ఎంసీఎఫ్‌టీ
◆ ప్రధాన ఎడమ కాలువ పొడవు: 7.60 కి.మీ
◆ ప్రధాన కుడి కాలువ పొడవు: 1.కి.మీ

మదనపల్లె పట్టణం, గ్రామీణ, నిమ్మనపల్లె: 'జల వనరులు దేవాలయాలతో సమానం. ఇలాంటి వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది' ఇవీ ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు. వైకాపా ఐదేళ్ల పాలనలో జల వనరులపై నిర్లక్ష్యం వహించింది. జలయజ్ఞమంటూ విధ్వంసానికి పాల్పడింది. చెరువుల్లో పూడికతీత, ప్రాజెక్టుల నిర్వహణకు రూపాయి విదిల్చలేదు. దీంతో జల వనరులు దుస్థితికి చేరుకున్నాయి. ఈ కోవలోకే వస్తుంది నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టు. దీంతో కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణపై దృష్టిపెట్టింది. ఆ మేరకు అధికారులు అంచనా వ్యయం నివేదికను తయారు చేసి అందించారు.

నిమ్మనపల్లె మండలంలోని బాహుదా ప్రాజెక్ట్

◆ **10 గ్రామాలు.. 2,888 ఎకరాల ఆయకట్టు:** మదనపల్లె రెవెన్యూ డివిజన్ తంబళ్లపల్లె మండలంలో పెద్దేరు ప్రాజెక్టు, నిమ్మనపల్లె మండలంలోని బాహుదా ప్రాజెక్టు నీటి వనరులు. నిమ్మనపల్లె మండలంలో నిర్మించిన బాహుదా ప్రాజెక్ట్‌కు కర్ణాటక రాష్ట్రం చెయ్యేరు నుంచి నీరు వచ్చి చేరుతుంది. దీనిపై పది గ్రామాల్లో 2,888 ఎకరాల ఆయకట్టు ఉంది. వేల మంది ఆధార పడి జీవిస్తున్నారు. ఇటువంటి జలాశయాన్ని వైకాపా పూర్తిగా విస్మరించింది.

జలాశయం సమీపంలోనే దెబ్బతిన్న ఎడమ కాలువ

◆ **పాక్షికంగా దెబ్బతిన్న ప్రధాన కాలువలు:** ప్రస్తుతం జలాశయంలో నీరు డెడ్ స్టోరేజ్‌లో ఉంది. సంవత్సరాలుగా నిర్వహణ లేకపోవడంతో అధికారులు ఆలోచనలో పడ్డారు. ఈసారి నవంబర్, డిసెంబరు నెలలో భారీ వర్షాలు కురిసి వరద నీరు చేరితే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. గేట్లు పైభాగాన యంత్రాలపై ఏర్పాటుచేసిన రేకులు పైకిలేచి పోయాయి. ఎడమ కాలువ పొడవునా నిర్మించిన సిమెంట్ గోడ పాక్షికంగా దెబ్బతింది. ఈ పరిస్థితులు కలవర పరుస్తున్నాయి. ఈ విషయమై జల వనరుల శాఖ మదనపల్లె ఈఈ సురేష్ బాబు మాట్లాడుతూ.. బాహుదా ప్రాజెక్ట్ నిర్వహణ కోసం ఓఎన్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కింద రూ.40 లక్షలతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరవ్వగానే నిర్వహణ పనులు చేపడుతామని తెలిపారు.

విజేతలు నాగేంద్ర, విక్రమ్

కండరగండులు

సందడిగా రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి 185 మంది పాల్గొన్నారు. విశాఖపట్నంకు చెందిన విక్రమ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా.. తణుకు పట్టణానికి చెందిన నాగేంద్ర రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బాడీ బిల్డింగ్ ఛైర్మన్ సింగయ్య, నగర ప్రముఖులు షఫీ, ఆదిత్య, నాగేంద్రలతో పాటు వివిధ జిమ్ యాజమాన్య ప్రతినిధులు, బాడీ బిల్డర్స్, బాడీ బిల్డింగ్ అభిమానులు పాల్గొన్నారు.

చెయ్యేరు.. చూస్తే ఆగదు కన్నీరు

జలంతో పరవళ్లు తొక్కాల్సిన నది ఎడారిలా మారింది. కనుచూపు మేర ఇసుకతో నిండి.. నీటి చుక్క జాడన్నదే లేకుండా పోయింది. రాజంపేటకు జీవనాడిగా అన్నమయ్య జలాశయానికి పేరు. గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన నిర్లక్ష్యంతో 2021లో వచ్చిన భారీ వరదలకు ఆ ప్రాజెక్ట్ మట్టి కట్ట తెగి కొట్టుకుపోయింది. తిరిగి నిర్మించాలనే విషయాన్ని వైకాపా పాలకులు విస్మరించారు. ఆ పాపం చెయ్యేరును ఇప్పుడు వెంటాడుతోంది. నదంతా చుక్క నీరు లేక పరివాహక ప్రాంతమంతా ఎడారిలా దర్శనమిస్తోంది. ఈ ప్రభావం రాజంపేట, నందలూరు, పెనగలూరు వంటి ప్రాంతాలపై పడుతోంది. నీరు పారుతూ కళకళలాడాల్సిని చెయ్యేరు.. ఆ ఊసే లేకపోవడాన్ని చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

ఆరోగ్యకర బాల్యానికి భరోసా!

నేటి నుంచి విద్యార్థులకు వైద్య పరీక్షలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఆటపాటలతో ఆరోగ్యకరంగా ఎదగాల్సిన బాల్యం.. అనారోగ్యం బారిన పడుతోంది. ఆటలకు దూరంగా ఉండడం, అతిగా చరవాణుల వినియోగం, ఆహారం సక్రమంగా తీసుకోకపోవడంతో రేపటి పౌరులు రుగ్మతలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యాన్ని అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలిచాయి. బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష(రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం) కార్యక్రమానికి సంయుక్తంగా శ్రీకారం చుట్టాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తాయి. ఎవరికైనా శస్త్రచికిత్సలు అవసరమైతే ప్రభుత్వాసుపత్రులకు పంపి ఉచితంగా చేయిస్తాయి.

● **ముందుగానే గుర్తించి చికిత్సలు:** ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు కంటి చూపు లోపం, తలనొప్పి, రక్తహీనత, ఆయాసం, చర్మ సంబంధిత వ్యాధులు, పోషకాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటి తీవ్రత పెరిగే వరకు సమస్య తెలియకపోవడం వల్ల ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వ్యాధి తీవ్రత పెరిగి ఆసుపత్రులకు వెళ్లేకంటే ముందుగానే గుర్తించి తొలి దశలోనే సరైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. బాలల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా చేపట్టిన ఈ కార్యక్రమం మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రారంభం కానుంది.

చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డీఈఐసీ వైద్యులు, సిబ్బంది

జిల్లాలో ఉన్న పాఠశాలలు, విద్యార్థులు

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ పాఠశాలలు	2,177	1,35,778
కేజీబీవీ, మోడల్	39	11204
గిరిజన, సాంఘీక సంక్షేమ	29	9361
అంగన్‌వాడి కేంద్రాలు	2,275	96,053
జూనియర్ కళాశాలలు	24	30,183

● జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో 30 మండలాలున్నాయి. ఇందులో 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 11 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 03 ప్రాంతీయ వైద్యశాలలు, జిల్లా ప్రభుత్వాసుపత్రి అందుబాటులో ఉన్నాయి. ఇందులో పనిచేస్తున్న వైద్యసిబ్బందికి అధికారులు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు చేయాల్సిన వైద్యపరీక్షలపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన సిబ్బంది తమ పరిధిలోని విద్యాలయాల్లో ప్రతి విద్యార్థిని పరీక్షించి ఆరోగ్య సమస్యలను గుర్తించాల్సి ఉంటుంది. అవసరం మేరకు పీహెచ్‌సీ, ప్రాంతీయ వైద్యశాల, జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలిస్తారు. అక్కడ సమస్య నమోదు చేసి అవసరాన్ని బట్టి పెద్ద ఆసుపత్రులకు తరలించి చికిత్సలు చేయించడంతో పాటు పర్యవేక్షిస్తారు. కార్యక్రమంపై ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివప్రతాప్ మాట్లాడుతూ.. జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో విద్యార్థులకు మంగళవారం నుంచి ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఎవరికైనా శస్త్రచికిత్సలు అవసరం ఉన్నట్లు గుర్తిస్తే వాహనంలో ఆసుపత్రికి తీసుకొచ్చి పరీక్షలు చేయిస్తామని తెలిపారు.

(c) eenadu

నాము గడ్డి బారి నుంచి కాపాడేదిలా!

చిట్కా

పశువులు పచ్చిక బైళ్లలో మేస్తూ అపరిపక్వత దశలో పెరుగుతున్న జొన్న పైరు (లేతదశ)ను మేయడం ద్వారా హెచ్‌సీఎన్ (హైడ్రో సైనిక్ యాసిడ్) అనే విష పదార్థం శరీరంలోకి ప్రవేశించి పశువులను అస్వస్థతకు గురి చేయడమే కాకుండా ఒక్కోసారి కొన్ని గంటల వ్యవధిలోనే మరణం సంభవించే అవకాశం ఉంది. దీనినే రైతుల పరిభాషలో 'నాము' ఎక్కింది అని కూడా అంటుంటారు. దీనికి విరుగుడుగా సోడియం థయోసల్ఫేట్ 10 గ్రాముల స్ఫటికాలను 50-100 ఎంఎల్ డిస్టిల్ వాటర్‌లో కరిగించి ఇంజెక్షన్ ద్వారా పశువు నరంలోకి ఎక్కించడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చు. మేసిన జొన్న కర్రల పరిమాణాన్ని బట్టి రెండు, మూడు ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. ఈ తరహా స్ఫటికాలను ముందు జాగ్రత్తగా పాడి రైతులు తమ వద్ద ఉంచుకుంటే అత్యవసర సమయాల్లో ఫైసలహాను పాటించి పశువులను కాపాడుకోవచ్చు. అపరిపక్వత దశలో ఉన్న జొన్న పైరును మేపకుండా ఉండడం అన్ని విధాలా శ్రేయోస్కరమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై వివరించారు. **- న్యూస్‌టుడే, రాయచోటి**

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న : జామలో పండు ఈగ సమస్య అధికంగా ఉంది. నివారణ తెలపండి?
- లోహిత్, మూరేవాండ్లపల్లె, కలికిరి

సమాధానం : కాయలు పక్వ దశలో ఉన్నప్పుడు పండుఈగ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఆడ రెక్కల పురుగులు కాయ చర్మం లోపల గుడ్లు పెట్టి వాటినుంచి వచ్చే లార్వాలు గుజ్జును తిని కుళ్లిపోయి, రాలిపోయేలా చేస్తాయి. నివారణగా రాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. చెట్ల మధ్యలో దున్నడం ద్వారా కోశస్థ దశలు బయటపడేలా చేసి చంపొచ్చు. మిథైల్ యుజినాల్ ఎర బుట్టలను ఎకరాకు 6-8 చొప్పున 5-6 అడుగుల ఎత్తులో ఉంచడం ద్వారా బుట్టల్లో రెక్కల దశ పురుగులు పడి చనిపోతాయి.
- పీరూసాహెబ్, సస్యరక్షణ శాస్త్రవేత్త, కలికిరి కేవీకే
- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

▼ గ్రీవెన్స్‌లో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోందన్నారు. అధికారులు బాధితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకొంటే చర్యలు తప్పవన్నారు.

తాగునీటి వసతి కల్పించాలని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ కాలనీ మహిళలు

వినతులివి

★ వాల్మీకిపురం మండలానికి చెందిన అంజప్ప తనకు అనారోగ్యం కారణంగా కుడి కాలు పూర్తిగా తొలగించారని ట్రైసైకిల్ మంజూరు చేయాలని విన్నవించారు. ★ నందలూరుకు చెందిన సాంబశివనాయుడు తన కుమార్తెకు వివాహమైందని ఆమె పేరును తమ రేషన్ కార్డు నుంచి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నుంచి వేరు చేయాలని అర్జీ సమర్పించారు. ★ రాయచోటికి చెందిన చాంద్‌బాషా తనకు 75 ఏళ్ల వయసు ఉందని ఎలాంటి ఆధారం లేని తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ★ రాయచోటిలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య నెలకొందని తాగునీటి సమస్య పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కోకన్వీనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో మహిళలు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కాలం.. విత్తన ఎంపికే కీలకం

నకిలీ ఉత్పత్తులతో అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



సాగు చేసిన టమాట పంట

కలకడ, న్యూస్‌టుడే : ఖరీఫ్ పంటల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. నాణ్యమైన విత్తనం వేసి అధిక దిగుబడి సాధించాలనే తపనతో ముందుకు వెళుతున్నారు. పంట సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకం. వ్యాపారులు అన్నదాతలను మోసం చేసేందుకు కల్తీ, నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తారు. విత్తన ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పెట్టుబడి, సమయం, శ్రమ వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో విత్తనాన్ని సరి చూసుకొని కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. ● అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో ప్రధానంగా ఖరీఫ్ పంటగా వేరుశనగ, వరి, కంది, మొక్కజొన్న, శనగతో పాటు టమాట, వంగ, మిరప, కాకర, చిక్కుడు, బీన్స్ పంటలను సాగు చేస్తారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలను ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తారు. రైతులు దుకాణాల వద్దకు వెళ్లి పంట రకం పేరు చెప్పి విత్తనాలు కొనుగోలు చేస్తారు. విత్తన నాణ్యతను, రసీదులు, విత్తన రకం సైతం పరిశీలించకుండానే కొంటారు. వ్యాపారులు రైతులను మోసం చేసేందుకు వివిధ రకాల పేర్లతో అనేక కంపెనీల విత్తనాలు విక్రయిస్తున్నారు.

రాయితీ విత్తనాలే సురక్షితం : ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న విత్తనాలను కొనుగోలు చేస్తే ఎలాంటి నష్టం ఉండదు. విత్తనం రాయితీతో పాటు పంటకు నష్టం కలిగితే పరిహారం లభిస్తుంది. ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి ఉంటే రసీదులు, సంచులు భద్రపరిచి నకిలీవని తేలిన వెంటనే ఫిర్యాదు చేసి పరిహారం పొందవచ్చు.
- శివనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి

ఈ విషయాలు పాటిద్దాం

● అన్నదాత మొదట విత్తన రకం ఎంపిక చేసుకోవాలి ● విత్తన కొనుగోలుకు వెళ్లిన దుకాణం వద్ద విత్తన రకం చెప్పి తీసుకోవాలి ● ప్రతి రైతు కచ్చితంగా రసీదుతో పాటు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ● ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. ● రసీదు సంచులను భద్రపరచుకోవాలి ● విత్తనం మొలక శాతం పరిశీలించాలంటే వంద విత్తనాలు నానబెట్టి విత్తాలి. వాటిలో 80 శాతం విత్తనాలు మొలక బాగా వస్తే ఆ విత్తనం వినియోగించుకోవచ్చు. విత్తన సంచిపై ఉన్న నంబరు, ప్యాకింగ్ చేసిన తేదీని సరి చూసుకోవాలి.

దానిమ్మ సాగు... లాభాలు బాగు

రైతేరాజు **స్ఫూర్తి**

దానిమ్మ తోటను చూపుతున్న రైతు అర్లప్ప

రామసముద్రం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ తాలుకా గూకుంట గ్రామానికి చెందిన రైతు అర్లప్ప అయిదెకరాల్లో దానిమ్మ సాగు చేపట్టారు. భూమిని బాగా దుక్కి చేసి 20 ట్రాక్టర్ లోడ్ల పశువుల ఎరువును కలిపారు. నెల రోజుల పాటు మగ్గిన తరువాత 8x6 వెడల్పుతో బెడ్లను ఏర్పాటు చేసి మల్చింగ్ పేపరు, బిందుసేద్యం అమర్చారు. మొక్కల మధ్య దూరం ఆరు అడుగులు ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. అందులో 1,250 మొక్కలను నాటారు. ఏడాది కాలంగా మొక్కలు బాగా ఎదిగిన తరువాత దిగుబడికి వదిలారు. ప్రస్తుతం మొక్కకు 20 కిలోల వరకు దిగుబడి వచ్చింది. కాయల బరువుకు కొమ్మలు విరగకుండా కట్టెలను ఊతంగా ఇచ్చారు. తోటపై క్రిమి కీటకాల నివారణకు మెష్ ఏర్పాటు చేశారు. సాగుకు రూ.20 లక్షల వరకు వ్యయం చేశారు. దిగుబడి అమ్మకానికి సిద్ధంగా ఉంది. మార్కెట్‌లో కిలో దానిమ్మ ధర రూ.200 వరకు పలుతోంది. తోట వద్దకే వ్యాపారులు దిగుబడి కొనుగోలుకు వస్తున్నారు. మొదటి దిగుబడిలోనే రైతుకు రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఏటా రెండుసార్లు దిగుబడి అందనుంది. సాగులో మంచి నిర్వహణ ఉంటే అయిదేళ్ల పాటు దిగుబడులు అందనుందని రైతు తెలిపారు.

'జగన్ పాలనలో పంచాయతీ వ్యవస్థ నాశనం'

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే : పంచాయతీ వ్యవస్థను నాశనం చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు తంబళ్లపల్లె నియోజకవర్గంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత వైకాపా పాలనలో రాజధాని అమరావతిని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. గతంలో వెనక్కి వెళ్లిన పరిశ్రమలు ప్రస్తుతం రూ.కోట్లు పెట్టుబడులు పెడుతూ రాష్ట్రానికి వస్తున్నాయని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలపై వైకాపాకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ సమావేశాలకు వచ్చి చర్చించాలని సూచించారు. అధికారం కోల్పోయిన వైకాపా నాయకుల తీరు మారలేదన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మామిడి రైతులపై వైకాపా కపట ప్రేమ'

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మామిడి రైతులపై వైకాపా కపట ప్రేమ చూపుతోందని, ఆ పార్టీ నాయకులు చెప్పే మాటలు అన్నదాతలు వినే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విమర్శించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్‌కు ఒక్కసారిగా మామిడి రైతులపై ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. ఇటీవల బంగారుపాళ్యం మామిడి మార్కెట్‌కు వచ్చిన మాజీ సీఎం కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు మామిడిరైతుల ఇబ్బందులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బంగారుపాళ్యంలో మామిడి రైతులు, పుంగనూరులో పాలరైతులకు ఎలా మోసం చేశారో ప్రజలకు బాగా తెలుసునని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు నాయుడు మామిడి రైతులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టారన్నారు. సమావేశంలో తెదేపా నాయకులు ఎస్.విద్యాసాగర్, బాలస్వామి, సుదాకర్, రైస్‌మిల్లు శశికుమార్, విజయ, కత్తి లక్ష్మన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ తీరుపై మండిపడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మంత్రిపై అభ్యంతరకర పోస్టులు... ఒకరి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ చలపతి

రాయచోటి, న్యూస్‌టుడే: రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రసంగించిన వీడియోపై ఈ నెల 12వ తేదీన ముఖ పుస్తకంలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి పీఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన నిందితుడు అన్వేష్‌రెడ్డిని అరెస్టు చేసి రాయచోటి కోర్టుకు హాజరు పరిచామని పట్టణ సీఐ చలపతి పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలల్లో ఎవరైన అసభ్యకర వ్యాఖ్యలు చేసినా.. పోస్టులు పెట్టిన చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రైవేట్ పాఠశాలలు జీఓ. నం: 1 (1994 జనవరి 1) మేరకు పనిదినాలు, సమయపాలనలో జరపాలని డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలవు దినాల్లో ఎటువంటి ప్రైవేట్ తరగతులు, రెండో శనివారం, ఆదివారాలు, సాయంత్రం 5 గంటల తరువాత పాఠశాలలు నిర్వహించరాదన్నారు. కడప డీసీఈబీ ఇచ్చిన క్యాలెండర్ ప్రకారమే పని దినాలు జరగాలన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే అనుమతుల రద్దు

▼ ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల దాడులు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చస్రఅఆరు. దుకాణాల్లోని స్టాక్ నిల్వల రిజిస్టర్లు పరిశీలించారు. డీలర్లు అమ్మకపు రసీదులు తప్పనిసరిగా రైతులకు అందజేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలను పట్టికలలో నమోదు చేసి దుకాణాలలో పారదర్శకంగా ఉంచాలని విజిలెన్స్ ఏడీఏ ఎస్.పి.యల్లప్ప, సీఐ చంద్రశేఖర్‌లు సూచించారు. అనుమతి లేని ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్స్‌ల రద్దుకు వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో ఏవో రాజేంద్రప్రసాద్, డీఏవో కార్యాలయ అధికారి పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ రోడ్డులోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అందరి సహకారంతోనే బీటీ కళాశాల అభివృద్ధి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : అందరి సహకారంతోనే బీటీ కళాశాల అభివృద్ధి సాధ్యమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బీటీ కళాశాల అభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కళాశాల నుంచి కొంత మంది విద్యార్థులు వచ్చి డిగ్రీలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బీటీ కళాశాల ఏర్పాటు చేసి 110 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థులు, పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించి, మంత్రిని ఆహ్వానించి కళాశాల అభివృద్ధి జరిగేలా చూస్తామన్నారు. నిమ్మనపల్లె, రామసముద్రం, పుంగనూరు, తంబళ్లపల్లె ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలలో చేరేందుకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బీటీ కళాశాలలో నిలిపేసిన ఇంటర్, పీజీ కోర్సులను వెంటనే ప్రారంభించాలన్నారు. బీటీ కళాశాలను పూర్తిస్థాయిలో ప్రభుత్వపరం చేసుకోవాలని సూచించారు. అర్హతలేని సిబ్బందిని తొలగించి నైపుణ్యం కలిగిన ప్రభుత్వ అధ్యాపకులను నియమించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మునిరత్నం, విజయభారతి విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, విశ్రాంత అధ్యాపకుడు ఫణికర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు నాగభూషణరెడ్డి, కరిముల్లా, కిరణ్, పునిత్, శ్రీచందు, మాదవ్, శ్రీనివాసులునాయుడు, మునిగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీటీ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు

వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగినేని గోవిందు అన్నారు. మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు ఉద్యమాలు చేసేందుకు అన్ని వాల్మీకి సంఘాల నాయకులు కలిసి రావాలని కోరారు. గత పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలతో మోసం చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. త్వరలో విజయవాడలో లక్ష మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా చిన్నరెడ్డెప్ప, రాష్ట్ర ఉద్యోగ సంఘం గౌరవాధ్యక్షుడిగా బి.ఈశ్వరయ్య, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా భాగ్యలక్ష్మీ, అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలిగా నల్లబోతుల అనసూయ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూమిక, మదనపల్లె అధ్యక్షుడిగా పిల్లి చంద్ర ఎన్నికయ్యారు. వీరికి కర్నూలు జిల్లా అధ్యక్షుడు యల్లార్తి అర్జున్ నియామకపత్రాలు అందజేశారు.



నూతన కార్యవర్గంతో వాల్మీకి సంఘం నాయకులు

బావాబామ్మర్దులు.. వాహన దొంగలు

▼ పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను కర్నూలు మూడో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్, పెద్దమండెం మండలం గుడిసెలచెరువుకు చెందిన షేక్ దాదాపీరా (37), కడప నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన చౌడగుండ్ల అనీష్ (22)లను కర్నూలు నగర శివారులో అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సోమవారం తెలిపారు. మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శేషయ్య, ఎస్సై చంద్రలతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశం డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. జులాయిగా తిరిగే షేక్ దాదాపీరా చెల్లెలిని ఆటోడ్రైవర్ షేక్ బాబాఫక్రుద్దీన్ వివాహం చేసుకున్నాడు. బావాబామ్మర్దులైన వీరిద్దరు జల్సాల కోసం బైకు చోరీలకు అలవాటుపడ్డారు. వీరితో చౌడగుండ్ల అనీష్ జతకట్టాడు. తర్వాత పోలీసుల దృష్టి మరల్చేందుకు బావాబామ్మర్దులు కుటుంబాలతో సహా అనంతపురం జిల్లాలోని గుంతకల్లుకు మకాం మార్చి నేరాలు ముమ్మరం చేశారు. వీరికి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు తయారు చేసే నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాలతో పరిచయమైంది. తస్కరించిన వాహనాలకు వారితో నకిలీ ఆర్‌సీ పత్రాలు తయారు చేయించి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయించేవారు. ఉమ్మడి రాష్ట్రాల్లోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, గుంతకల్లు, హైదరాబాద్, సైబరాబాద్, నార్పల ప్రాంతాల్లో పలు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. ఈ ఏడాది మే 22న గూడూరుకు చెందిన తెలుగు చంద్రకుమార్ పల్సర్ వాహనంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆ వాహనాన్ని బావాబామ్మర్దులు అపహరించారు. కడపకు తీసుకెళ్లి ఓ వ్యక్తికి విక్రయించారు. అతను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి కడప పోలీసులకు పట్టుపడటంతో చోరీల బాగోతం బయటపడింది. సమాచారం అందుకున్న కర్నూలు పోలీసులు అప్రమత్తమై కర్నూలు శివారులోని అరుంధతీనగర్‌లో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 24 బైకులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఎనిమిది పల్సర్ వాహనాలున్నాయి. పరారీలో ఉన్న నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాల కోసం గాలింపు చేపట్టారు. దొంగల్ని పట్టుకుని వాహనాలు స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ జాతర

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి ఎల్లమ్మ ఆలయ జాతరలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై రథాన్ని లాగారు. అమ్మవారిని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు యోగేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో ఊరేగుతున్న అమ్మవారు

ఆగస్టు నుంచి ఒంటిమిట్టలో అన్నప్రసాద వితరణకు చర్యలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి ఆలయంలో భక్తులకు పూర్తిసాయిలో అన్నప్రసాద వితరణకు చర్యలు చేపట్టాలని తితిదే ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. సానిక తితిదే పరిపాలనా భవనంలో జేఈవో వీరబ్రహ్మంతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల తరహాలో ఒంటిమిట్టలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేయాలని ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. ఆలయం వద్ద తాత్కాలికంగా జర్మన్ షెడ్లు ఏర్పాటుచేసి ఆగస్టు నుంచి అన్నప్రసాదాలు పూర్తిసాయిలో ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్, అన్నప్రసాదాల విభాగం అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

బి.కొత్తకోటలో మహిళ నిరసన

బి.కొత్తకోట,న్యూస్‌టుడే: తనకు న్యాయం చేయాలని కోరుతూ బి.కొత్తకోట బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో సోమవారం రాత్రి ఓ మహిళ నిరసనకు దిగింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ప్రాంతానికి చెందిన ధనలక్ష్మీ బి.కొత్తకోటకు చెందిన శివను ప్రేమించి 2020లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్నాళ్లుగా భార్యకు దూరంగా భర్త ఉంటున్నాడు. మరొక మహిళతో అక్రమ సంబంధం ఉన్నట్లు అనుమానిస్తూ ధనలక్ష్మీ గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో నిరసనకు దిగారు. స్థానిక సీఐ జీవన్ గంగానాథ్‌బాబు నిరసనకు దిగిన మహిళతో చర్చలు జరిపారు. రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో మహిళ నిరసనను విరమించింది.

ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ ఇంటర్మీడియట్ 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైనట్లు కోఆర్డినేటర్ రాజారావు ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సు ఒకే ఏడాదిలో పూర్తయ్యేలా ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్‌లో చేరాలనుకునే వారు పదో తరగతి పాస్ అయి ఉండాలని, పదో తరగతి మార్కులిస్ట్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల ధ్రువీకరణ, ఒక ఫొటోతో కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద సంప్రదించాలని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ ఇంగ్లిష్, తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని బహుజన సేన వ్యవస్థాపకులు చందు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సంఘాల నాయకులు మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీ సమర్పించారు. అంకిశెట్టిపల్లెలో బుద్ధుని విగ్రహాన్ని, సీసీ కెమెరాలను, నీటి పైపులైన్లు ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులపై అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని, తదితర డిమాండ్‌లకు సంబంధించి వినతిపత్రం అందించారు.

సబ్‌కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కంటి విభాగం మూత.. రోగులకు వెత

కంటి విభాగం వద్ద వేచి ఉన్న రోగులు

మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కంటి పరీక్షలు చేసే అసిస్టెంట్ అనారోగ్యంతో సెలవుపై వెళ్లడంతో చికిత్స కోసం వస్తున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాల అందుబాటులో ఉన్నా యంత్రాల ద్వారా పరీక్షలు చేసే సిబ్బంది లేకపోవడంతో వైద్యం అందడం లేదు. గత నాలుగు రోజులుగా ఈ సమస్య ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రోగులు వాపోతున్నారు. అలాగే సదరం శిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారిని మరో వారం రావాలని పంపేస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ప్రస్తుతం డీఎంఈ పరిధిలో ఉంటే సిబ్బంది సెలవులో ఉండటంతో సమస్య వచ్చిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె విద్య**

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

JOBS

ప్రొద్దుటూరు HGN ఏజెన్సీ నందు పనిచేయుటకు అవుట్‌డోర్/షాపు సేల్స్‌మెన్స్, టూల్స్ మెకానిక్స్, ఆఫీస్ బాయ్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Cell: 9100463787, 9515089758.

హాస్టల్ వార్డన్ కావలెను (లేడీ) ఆచార్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, D.అగ్రహారం, B. మఠం (మం). Cell: 8341847444, 9052208001.

పల్లా హాస్పిటల్, 7రోడ్స్ సర్కిల్, కడప నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & CARM టెక్నీషియన్స్ కావలెను. Cont: 9849040153.

FACULTY/ TEACHERS

Wanted Teachers Spoken English-1, Receptionist-1, Kadapa Contact No: 9154944970, 9154944955.

SECURITY GUARDS

కడప అరవింద నగర్ సమీపాన మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ, 13000/- జీతం – ESI, PF, చదువు 10 పాస్, వయస్సు 22 నుండి 40 ఏళ్లు. సంప్ర: 72879 17477.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నిబంధనలు పట్టక... కళ్లలోకి ఇసుక

పీలేరు పట్టణానికి కలికిరి మండలం మహల్, కంభంవారిపల్లె పింఛా నది రీచ్‌ల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుంటారు. అయితే వీటిపై పట్ట ఏర్పాటు చేసుకోవాల్సింది. నిబంధనలు పాటించకపోవడంతో వెనుక వస్తున్న వాహనదారుల కళ్లల్లో ఇసుక పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వెళ్తున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

క్షేత్రస్థాయిలో తనిఖీ చేయండి

అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు కిశోర్‌కుమార్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని వీఆర్వోలను తహసీల్దారు కిశోర్‌కుమార్ ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి వీఆర్వోలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై వస్తున్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574955
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

?: వలసపల్లె పంచాయతీ పుంగనూరు రోడ్డులోని కృష్ణాపురంలో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. దోమలకు నిలయంగా మారింది. - **రమణ, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - **తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**

?: కొండామర్రిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లెలో కాలువలు పూడిపోవడంతో మురుగు పారడం లేదు. దుర్వాసన వస్తోంది. - **బాబు, కొండామర్రిపల్లె**

✓: పూడిక తీసి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. - **అబ్దుల్‌షుకూర్, ఈవోపీఆర్డీ, మదనపల్లె**

?: చీకలబైలు పంచాయతీ జమ్ముకుంటవారిపల్లె కాలనీలో ఇళ్ల మధ్య మురుగు పారుతూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. - **శంకర, చీకలబైలు**

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - **ప్రభాకర్, సర్పంచి, చీకలబైలు**

?: పట్టణంలోని కరెంటు ఆఫీస్ రోడ్డులోని మలుపులో మురుగు కాలువ పూడిపోయింది. ఇళ్ల నుంచి వెలువడే మురుగు పారడం లేదు. - **నాగరాజు, మదనపల్లె**

✓: పూడిక తీయించి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. - **ప్రమీల, పురపాలక సంఘం కమిషనర్, మదనపల్లె** - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: పీటీఎంలోని దేవాలయంపేట వీధిలో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. - **మున్నా, స్థానికుడు**

✓: పైపులైను ఏర్పాటు చేసి కొళాయిల ద్వారా నీటిని అందిస్తాం. - **బాలచంద్రాచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

?: దొంతి కృష్ణప్ప వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయలేదు. - **రమణ, దొంతి కృష్ణప్ప వీధి**

✓: కాలువలన్నీ శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - **విద్యావతి, పంచాయతీ కార్యదర్శి, పీటీఎం**

?: పీటీఎం కోట వీధిలో మురుగు కాలువ శుభ్రం చేయడం లేదు. - **ఉషారాణి, పీటీఎం**

✓: కాలువలను శుభ్రం చేయిస్తాం. - **విద్యావతి, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, పెద్దతిప్పసముద్రం

?: కలకడలోని చెరువుబండవీధిలో మురుగు కాలువను శుభ్రం చేయించాలి. కాలువలో చెత్తచెదారం చేరి దుర్వాసన వస్తోంది. -**సయ్యద్‌సాబ్, స్థానికుడు**

✓: మురుగు కాలువను శుభ్రం చేయిసాం. -**దేవేంద్ర, ఇన్‌ఛార్జి కార్యదర్శి**, - న్యూస్‌టుడే, కలకడ

నడక దారి ఆక్రమణ.. పాదచారులకు ఇక్కట్లు

❖ పీలేరులో దుస్థితి ఇదీ

రేగళ్లు ఆరోగ్య ఉపకేంద్రం వద్ద నడకదారిపై తోపుడు బండ్లు

ఎక్కడెక్కడంటే..

పీలేరు పట్టణంలోని తిరుపతి మార్గంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి వివేకానంద కూడలి వరకు నడకదారులు ఆక్రమణల చెరల్లో ఉన్నాయి. చిత్తూరు మార్గం, మదనపల్లె మార్గంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి పంచాయతీ మిట్ట వరకు ఇదే సమస్య నెలకొంది. ప్రధానంగా అత్యంత రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండు, రేగళ్లు ఆరోగ్య ఉపకేంద్రం, ఎస్వీమహల్, సత్యప్రియ లాడ్జి వద్ద నడకదారులు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

పట్టణంలో నడకదారులు ఆక్రమణలకు గురికావడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కేసులకు భయపడి చికిత్స చేయించుకుని వెళ్లిపోతున్నారు. పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయమై సీఐ యుగంధర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం పీలేరు విద్య, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. పిల్లల చదువులు, వ్యాపారాలు, వృత్తి రీత్యా చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు పీలేరుకు వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం పీలేరు పంచాయతీ పరిధిలో జనాభా 60 వేలు. విద్యార్థులు, ఇతర అవసరాల నిమిత్తం పీలేరుకు వస్తున్న వారు రోడ్డుపై నడవాలంటే భయాందోళన చెందుతున్నారు.

❖ ప్రధాన రహదారుల వెంట కాలినడక బాటలను వ్యాపారులు ఆక్రమించుకుని రోడ్డుపై నిర్మాణాలు చేపట్టారు. దీంతో పాదచారులు రోడ్డుపై నడవాలంటే ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో జనాలు నడవడానికి వీల్లేకుండా ఉంది. ఒకవైపు ఆర్వోబీ పనులు జరుగుతుండగా వాహనాలు, పాదచారులు రోడ్డుపైనే నడవాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు, బస్సులు, ఇతర వాహనాల తాకిడికి రోడ్డుపై నడవాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆక్రమణలతో చెత్తాచెదారం, వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోయి పారిశుద్ధ్య పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో మురుగు ముందుకు పారే అవకాశం లేక రోడ్డుపై ప్రవహిస్తోంది.

ఎస్వీ మహల్‌కు ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

నోటీసులిచ్చి తొలగిస్తాం

పీలేరు పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లోని నడకదారుల్లో ఆక్రమణలను తొలగించాం. మిగతా వారికి కూడా నోటీసులిచ్చి ఆక్రమణలు తొలగింపు చర్యలు తీసుకుంటాం. ఎవరైనా నడకదారులను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. - **లతీఫ్‌ఖాన్, ఇన్‌ఛార్జి ఈవో, పీలేరు**

వైభవంగా దుర్గాదేవి ఊరేగింపు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రంలో జరుగుతున్న దుర్గాదేవి మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. అమ్మవారితో పాటు ధర్మరాజు, ద్రౌపతిని వేర్వేరుగా ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

బి.కొత్తకోట : బి.కొత్తకోటలోని బాబా మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న గణేష్ మహరాజ్‌కు భక్తులు పూజలు చేశారు.

తల్లిదండ్రుల సంరక్షణ బిడ్డలదే

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల సంరక్షణ కన్నబిడ్డలదేనని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సీనియర్ సిటిజన్స్ కేసులను ఆయన విచారించారు. వృద్ధులకు ఏవైనా సమస్యలుంటే సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేస్తే విచారించి న్యాయం చేస్తామన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఉమ్మడి ఏపీకి తలమానికమైన నాగార్జునసాగర్‌ను నిర్మించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మదనపల్లెలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్లు జాకీర్, మహేంద్ర, నాగరాజు, బాబాజీ, సురేష్, రవీంద్రబాబు, చిన్నారెడ్డి, ప్రభాకర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

కురబలకోట: సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి

ములకలచెరువు, బి.కొత్తకోట, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు మండలాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తెదేపా ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డితో కలిసి చేశారు. కురబలకోట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.255.50 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. బి.కొత్తకోట మండలం గొల్లపల్లె, ములకలచెరువు మండలంలోని బురకాయలకోట సమీపంలో అగ్నిమాపక కేంద్రం ప్రారంభానికి భూమిపూజ చేశారు. ముదివేడు క్రాస్, గొల్లపల్లె, అంగళ్లు, వేపూరికోట గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. రూ.5.51 కోట్ల నిధులతో బి.కొత్తకోట మండలంలోని ఉలవలవారిపల్లె-కనిగలతోపు రహదారి విస్తరణ పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్‌తాజ్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, జనసేన ఇన్‌ఛార్జి సాయినాథ్, గుత్తికొండ త్యాగరాజు, మూగి రవిచంద్ర, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం: రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. రామసముద్రం మండలంలోని చెంబకూరులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో ఇంటింటా తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని తెలిపారు. ఓ హోటల్‌లో దోసెలు పోస్తూ నిర్వాహకులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెంబకూరులో దోసెలు వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మురళీ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 23న ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION): MADANAPALLE
O.S.No.439 OF 2023

Plaintiff: K.V.Ramanaa Rao
Defendant: Sure Sri Harsha, S/o Late Venkatramayya, aged 57 years, Hindu, Business, R/a D.No.14-484-A, Gandhi Road, Madanapalle Municipality, Annamayya DT - 517325. Ph: 9440272527

ప్రకటన

పై దావాలో ప్రతివాదులకి దావా సమను పత్రికలో ప్రకటన మూలముగా జారీ చేయుటకు కోర్టువారి అనుమతి తీసుకొని ఈ ప్రకటన ఇవ్వడమైనది. ఈ దావాలో ప్రతివాదులకి సంజాయిషీ చెప్పు రిటెన్ స్టేట్మెంటు ఈ సమను ముట్టిన 90 రోజులలోగా దాఖలు చేయుటకు మరియు మీరు ఆధారపడదలుచుకుంటే మీ ఆధీనములో ఉన్నటువంటి, మీ ప్రతివాదనకు గాను కౌంటర్ క్లైముగాను అవసరమైన సమస్త దస్తావేజులు దాఖలు చేయుటకున్నూ, మీ రిటెన్ స్టేట్మెంటుకు అనుబంధముగా చేర్చుటకున్నూ ఆదేశించడమైనది. సదరు దావాలో మీకు ఏదైనా ఆక్షేపణ ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట నేరుగా గానీ వకీలు ద్వారా గాని లేక వివరములు తెలుపు మనిషి ద్వారా గాని 01-08-2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలుపుకొనవలయును. పై చెప్పబడిన దినము నందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు దావాను విమర్శ చేసి పరోక్షముగా తీర్మానించబడును.

Sd/- SRI S.V.BHARATHWAAZ
SMT. M.N.NAGALAKSHMI
Kumari S.Banu
Advocates: Society Colony
Madanapalle: Ph: 9440583579

రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా రమేష్

కలకడ, న్యూస్‌టుడే : రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా కలకడ మండలం నడిమిచెర్ల పంచాయతీకి చెందిన రమేష్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు వ్యవస్థాపకులు నాగరాజు నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. రిజర్వేషన్ వర్గాల ఐక్యతకు, వారి హక్కుల సాధన కోసం, చట్టసభలలో బీసీలకు 44శాతం రిజర్వేషన్ల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న రమేష్

బంగారు కుటుంబాల అభివృద్ధికి సహకరించండి

కలికిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4ను సమన్వయంతో అమలు చేద్దామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలికిరిలో సోమవారం పీలేరు నియోజకవర్గ స్థాయి సమావేశం బీసీ భవనంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గుర్తించిన 11,005 బంగారు కుటుంబాలకు మార్గదర్శులు సహాయ సహకారాలు అందించి వారి సంక్షేమాభివృద్ధికి పాటుపడాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలాల్లో వచ్చే సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ.. బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి సంక్షేమాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని మార్గదర్శి కుటుంబాలను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తెదేపా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండలంలో పంచాయతీ కార్యదర్శులకు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మండల కమిటీ అధ్యక్షురాలిగా శ్వేత ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలుగా నాగరాణి, మనోహర్, కోశాధికారులుగా విద్యావతి, ప్రమీలలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శులు మహబూబ్‌బాషా, సురేఖ, నరసింహారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : కలికిరి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో మురళీ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా జి.అశోక్, ఉపాధ్యక్షులుగా నవాజుల్లా, గంగాదేవి, కోశాధికారిగా గిరి, ప్రధాన కార్యదర్శిగా అశోక్ తదితరులు ఎన్నికయ్యారు.

దాడి ఘటనపై కేసు నమోదు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రంలో ఆదివారం రాత్రి జరిగిన దుర్గాదేవి అమ్మవారి జాతరలో నృత్యం చేసే విషయంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ధనుష్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు జగన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

మంచినీటి కాలువ మురుగుమయం

ఒకప్పుడు స్వచ్ఛమైన నీరు పారే కాలువను అభివృద్ధి చేయక పోవడంతో మురుగు కాలువగా మారింది. ఈ పరిస్థితి గుర్రంకొండలో ఉంది. పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న గంజి కాలవ ప్రస్తుతం మురుగు నీటి కుంటలా తయారైంది. వర్షాలు సక్రమంగా కురవకపోవడతో పై నుంచి వచ్చే నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో ఈ కాలువలో మురుగు పారుతోంది. కాలువను అభివృద్ధి చేయకపోవడంతో అపరిశుభ్రంగా మారింది. అధికారులు చొరవతీసుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, గుర్రంకొండ**

నిధులు మంజూరైనా మరమ్మతులేవి?

పీలేరు మండలం తలపుల ఎస్సీ విద్యార్థుల వసతిగృహం మరమ్మతులకు రూ.38లక్షలు మంజూరైనా పనులు జరగలేదు. స్థానిక నాయకుల మధ్య వివాదంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు వసతుల్లేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయమై ఏఈ రమేష్‌ను వివరణ కోరగా పనులు దక్కించుకున్న గుత్తేదారుడు పనులు చేయకుండా ఆలస్యం చేయడంతో నోటీసులిచ్చామన్నారు. పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, పీలేరు**



కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలో ఈ నెల 11న ఎస్టేట్ వద్ద ఉన్న పార్కు వద్ద ఒంటరిగా ఉన్న వృద్ధురాలు జయమ్మను రెండో పట్టణ పోలీసులు స్థానిక చైతన్య ఆశ్రమంలో చేర్పించిన విషయం విదితమే. మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన వృద్ధురాలి అల్లుడు శ్రీనివాసులు సోమవారం ఆశ్రమానికి వచ్చి ఆమెను గుర్తించారు. ఆమెకు కొద్దికాలంగా మానసిక స్థితి సక్రమంగా లేదని అందుకే ఇంట్లో నుంచి వచ్చినట్లు తెలిపారు. ఆమెకు ఆశ్రయం కల్పించిన చైతన్య ఆశ్రమ నిర్వాహకులు ఆనంద్, జీవీఎస్ బాబు, కవితారాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), PILER
S.O.P. NO. 03 OF 2025

Petitioners: Punuganti Nagesh Kumar and another
Respondent: Bank of Baroda, Kalikiri Branch, rep by its Branch Manager.

జనరల్ నోటీసు

అయ్యా!

అన్నమయ్య జిల్లా కలికిరి మండలం కలికిరి గ్రామ కాపురస్తులైన లేట్ పి.సీతాలక్ష్మమ్మ పేరున కలికిరి బ్యాంక్ ఆఫ్ బరోడా నందు ఉన్న FD మరియు SB అకౌంట్లలో ఉన్న సొమ్ము విషయమై సదరు లేట్ పి.సీతాలక్ష్మమ్మ గారి కుమారులైన 1) పునుగంటి నగేష్ కుమార్, 2) పునుగంటి ఫణేష్ కుమార్‌లు లేట్ పి.సత్యనారాయణ శెట్టి అనువార్లు సదరు సొమ్ము విషయమై వారసత్వ సర్టిఫికేట్ కోరి పై కోర్టు నందు పై దావా దాఖలు చేసినారు. సదరు 1) పునుగంటి నగేష్ కుమార్, 2) పునుగంటి ఫణేష్ కుమార్‌లకు వారసత్వ సర్టిఫికెట్ మంజూరు చేయుటకు ఎవరికైననూ అభ్యంతరము ఉన్నచో తేదీ: 05-08-2025 ఉదయం గం॥ 10.30 ని॥ హాజరు అయి వారి యొక్క అభ్యంతరాలు తెలుపుకొనవచ్చును. అలా లేనిచో సదరు 1) పునుగంటి నగేష్ కుమార్, 2) పునుగంటి ఫణేష్ కుమార్‌లకు క్రింద కనబరిచిన షెడ్యూలు దాఖలా సొమ్ముకు వారసత్వ సర్టిఫికేట్‌ను జారీచేయబడును.

SCHEDULE

Annamayya District, Kalikiri SubnDistrict, Kalikiri Mandal, Situated at Bank of Baroda in the name of P.Seethalakshmamma detailed here under:

SL. No.	Date	Receipt Number	Deposit amount	Approximate Maturity Value
1.	19-11-2009	TDR/2007/KA 149265, FDR 03/4962	Rs.10,000/-	Rs.25,059/-
2.	24-11-2009	TDR/2007/KA 149286, FDR 03/4963	Rs.30,000/-	Rs.86,344/-
3.	15-03-2011	TDR/2007/KA 150120, FDR 03/4939	Rs.10,000/-	Rs.22,885/-
4.	15-07-2011	TDR/2007/KA 150341, FDR 03/5245	Rs.50,000/-	Rs.1,35,543/-
5.	10-07-2012	TDR/2007/KA 150888, FDR 03/5899	Rs.50,000/-	Rs.1,18,482/-
6.	04-06-2012	TDR/2007/KA 151367, FDR 03/6541	Rs.10,000/-	Rs.21,999/-
7.	04-06-2013	TDR/2007/KA 151368, FDR 03/6540	Rs.1,60,000/-	Rs.3,44,006/-
8.	21-11-2013	TDR/2007/KA 151629, FDR 03/7005	Rs.10,000/-	Rs.21,999/-
9.	15-10-2013	TDR/2007/KA 151540, FDR 03/6907	Rs.50,000/-	Rs.1,06,149/-
10.	02-03-2012	TDR/2014/HH 150648, FDR 03/5634	Rs.50,000/-	Rs.1,20,482/-
11.		Savings Bank account amount		Rs.1,59,191/-
			Total	Rs.11,61,374/-

accrued Interest thereon up to date.

P.V.Ramana Reddy, Advocate, Piler.

తాగునీరు కోరుతూ మహిళల నిరసన

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారుల వైఫల్యాన్ని నిరసిస్తూ సోమవారం బి.కొత్తకోట ఎంపీడీవో కార్యాలయం ఎదుట బడికాయలపల్లె పంచాయతీ బండమీదపల్లెకు చెందిన మహిళలు ఆందోళన తెలిపారు. తమ గ్రామంలో రెండు నెలలుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో బోరులో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమకుమార్, గ్రామ కార్యదర్శి సునీలకు వినతిపత్రాన్ని అందజేశారు. అదనంగా మరో బోరును వేయించి నీటి సమస్యను తీర్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఎంపీడీవో కృష్ణవేణి మహిళలకు హామీ ఇచ్చారు.

ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బండమీదపల్లె గ్రామస్థులు

విద్యార్థులకు కౌన్సెలింగ్

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కళాశాల సమయంలో విద్యార్థులు అనవసరంగా రోడ్లపై తిరిగితే చర్యలు తీసుకుంటామని మదనపల్లె శక్తి బృందం సభ్యులు అన్నారు. ఈ మేరకు సోమవారం పలువురు విద్యార్థులు కళాశాలలకు వెళ్లకుండా రోడ్లపై గుంపులుగా ఉండటంతో శక్తి టీం వారిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారు, ఎందుకు బయట తిరుగుతున్నారనే అంశాలపై ఆరా తీశారు. తల్లిదండ్రుల వివరాలు సేకరించారు. ఇకపై తరగతులు జరిగే సమయంలో విద్యార్థులు ఎవరైనా అనవసరంగా రోడ్లపై తిరిగితే వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శక్తి బృందం సభ్యులు శశికళ, వీణాకుమారి, మునికుమార్‌నాయక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

సమస్యలివి.. పరిష్కరించండి

✧ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ

అర్జీదారులను విచారిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన బాధితులు మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 87 మంది అర్జీదారులు తమ సమస్యలను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వివరించారు. విచారించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

◆ మదనపల్లె మండలంలోని ఇసుకనూతిపల్లె చంద్రారెడ్డికాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు అర్జీ సమర్పించారు. ◆ మదనపల్లె మండలం ఎర్రగానిమిట్ట వద్ద ప్రభుత్వం నిర్మించిన టిడ్కో సముదాయంలో మురుగు ప్రవహించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లు సక్రమంగా లేవని, నీరు ఇళ్లలోకి వస్తున్నాయని, అలాగే రేషన్ దుకాణం ఏర్పాటు చేసి సరకులు పంపిణీకి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు వినతిపత్రం సమర్పించారు.

◆ కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మకాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

పాసుపుస్తకం కోసం తిరుగుతున్నా

రామసముద్రం మండలం నారిగానిపల్లె గ్రామ పరిధిలో 1.50 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాను. సాగులో ఉన్నాను, పట్టా, పాసుపుస్తకం, వన్‌బీ ఇవ్వాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నాను. దీనిపై విచారించి న్యాయం చేయాలని విన్నవించాను, - **బయ్యన్న, కొత్తిండ్లు**

పింఛను క్రమబద్ధీకరణకు ఇక్కట్లు

అనంతపురం జిల్లాలో రెండేళ్ల కిందట వరకు దివ్యాంగుల కోటాలో పింఛను వచ్చేది. తర్వాత పెద్దతిప్పసముద్రానికి మార్చుకున్నాను. కంటి ఆపరేషన్ కోసం రెండు నెలలుగా తీసుకోకపోవడంతో పింఛను తీసేశారు. రెండేళ్లుగా పింఛను క్రమబద్ధీకరించాలని అర్జీలు సమర్పిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. - **రాములమ్మ, పెద్దతిప్పసముద్రం**

వన్‌బీలో నమోదు కాని భూమి

వెంకప్పకోట రెవెన్యూ గ్రామంలో మూడు వేర్వేరు సర్వే నెంబర్లల్లో నాలుగు ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి నా పేరుతో ఉంది. ఒక నెంబరులో వన్‌బీలో పేరు ఎక్కించారు. మరో రెండు సర్వేనెంబర్లకు సంబంధించి మూడు ఎకరాలకుపైగా వ్యవసాయభూమి వన్‌బీలో నమోదు చేయలేదు. - **చలపతి, దేవతానగర్**

పరిహారానికి ప్రదక్షిణలు

తంబళ్లపల్లె మండలం దబ్బలగుట్ట ప్రాజెక్టు నిర్మాణానికి 1.37 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. దస్త్రాలను పరిశీలించి న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించాను.
- **వెంకటరమణారెడ్డి, జొన్నచేనుపల్లె**

(c) eenadu

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

ప్రైవేటు వసతి గృహాలను తనిఖీ చేస్తున్న సీఐ కుళ్లాయప్ప, పోలీసు సిబ్బంది

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఉన్నత విద్య అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులు కేవలం చదువుపైనే శ్రద్ధ చూపాలని మన్నూరు సీఐ కుళ్లాయప్ప అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని విద్యార్థులను హెచ్చరించారు. బోయనపల్లిలోని ప్రైవేటు వసతి గృహ సముదాయాలను సోమవారం ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రతి వసతి గృహం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

రైల్వే అభివృద్ధి పనులపై చర్చ

రాజంపేట రైల్వేస్టేషన్‌లో సమావేశమైన కమిటీ సభ్యులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు చర్చించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సీసీఐ జనార్దన్ ఆధ్వర్యంలో సోమవారం కమిటీ సమావేశం నిర్వహించారు. రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమిటీ సభ్యులు రామయ్య, నాగరాజు, హరిప్రసాద్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు కోరారు. అభివృద్ధి పనుల కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని.. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

సుండుపల్లి, న్యూస్‌టుడే: చెరువుకిందపల్లెకు చెందిన వై.రవింద్రారెడ్డికి చెందిన వ్యవసాయ విద్యుత్తు నియంత్రిక కాలిపోయిన దాని స్థానంలో మరో నియంత్రిక అమర్చారు. రైతు సమస్యను మేమున్నాం మీకుతోడుగా శీర్షికన ఈనాడులో ఆదివారం ప్రచురితం కావడంతో స్పందించిన ఏఈ రమేష్ విద్యుత్తు నియంత్రికను అమర్చారు. దీంతో పంటకు నీరందించే అవకాశం ఏర్పడిందని రైతు ఆనందం వ్యక్తం చేశారు.

?: రక్షిత నీటి పథకం నీరు విద్యుత్తు ఉన్నప్పుడు మాత్రమే వస్తోంది. పనులకు వెళ్లిన వారు నీరు వచ్చే సమయంలో అందుబాటులో ఉండట్లేదు. దీంతో ఇబ్బందిగా మారింది. - స్థానికులు, దేవాండ్లపల్లి, రాయవరం

✓: చేతిపంపు మరమ్మతుకు అవసరమైన చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాం. - సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లి - న్యూస్‌టుడే, సుండుపల్లి

?: మండల కేంద్రంలోని రాయచోటి బస్టాండు కూడలి సమీపంలోని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేయించాలి. బస్టాండ్ నుంచి రాయచోటి మార్గంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికులు, సుండుపల్లి

✓: వీధి దీపాల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. - సురేష్‌బాబు, ప్రత్యేక అధికారి, సుండుపల్లి పంచాయతీ - న్యూస్‌టుడే, సుండుపల్లి

?: మండల కేంద్రమైన వీరబల్లిలో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. వీధుల్లో చెత్త పేరుకు పోయి వ్యాధులు జ్వరాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మురుగు పారేలా చర్యలు తీసుకోవాలి. - వీరబల్లి వాసులు

✓: ప్రతి రోజూ చెత్త సేకరణ చేయిస్తున్నాం. వారు రాకుండా ఉంటే తక్షణం చెత్త ఎత్తించేందుకు చర్యలు తీసుకుంటా. మురుగు కాలువలు శుభ్రం చేయిస్తా. - వరప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీరబల్లి - న్యూస్‌టుడే, వీరబల్లి

ట్యాంకరు వస్తేనే గొంతు తడిచేది!

✧ వీరబల్లిలో తాగునీటికి అవస్థలు
✧ పట్టించుకోని పాలకులు, అధికారులు

వీరబల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వీరబల్లికి తాగునీటి ఎద్దడి తీర్చే వారే లేరా అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యతో ట్యాంకరు ద్వారా నీటిని కొనుగోలు చేసి కాలం వెళ్లదీస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న వారే లేరన్నారు. ఒకవైపు మాండవ్య నదిలో ఇసుక దోపిడీ జరుగుతున్న

ఉచిత శుద్ధి నీటి కేంద్రం వద్ద తాగునీటి కోసం బారులు తీరిన స్థానికులు

నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తుతుందని అడ్డుకుని తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా ఫలితం ఏ మాత్రం కనిపించడం లేదని మండల కేంద్ర వాసులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా అరకొర సరఫరా చేసే తాగునీటి పథకాలలో నీరు అడుగంటి రావడం లేదని వాపోతున్నారు. ఒక్కో ట్యాంకరు నీటికి రూ.600 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు.

■ మండల కేంద్రానికి సరఫరా చేసే నీటి పథకం ఒక్కటే కావడం, నీరు అడుగంటడంతో ఒక్క వీధికి నీరు అందించలేని పరిస్థితి నెలకొందని నీరు వదిలే సిబ్బంది పేర్కొంటున్నారు.

■ జిల్లా ప్రత్యేక నిధులతో తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఇటీవల రెండు బోర్లు వేశారు. నీరు సమృద్ధిగా పడ్డాయని మోటారు బిగించి త్వరితగతిన సరఫరా చేస్తే నీటి ఎద్దడి తీర్చిన వారవుతారని మండల కేంద్ర వాసులు కోరుతున్నారు. వీరబల్లికి శాశ్వత నీటి సరఫరాకు మరో వైపు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

■ ఈ విషయమై ఎంపీడీవో జవహర్‌బాబును

ట్యాంకరు వద్ద నీటిని కొనుగోలు చేసి పట్టుకుంటున్న గ్రామస్థులు

వివరణ కోరగా తాగునీటి సమస్య ఉందనే విషయం తన దృష్టిలో ఉందన్నారు. శాశ్వత పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదుకోని రోళ్లమడుగు

వీరబల్లి మండలానికి సరఫరా చేసే రోళ్లమడుగు తాగునీటి పథకం నుంచి సరఫరా అయ్యే నీరు సక్రమంగా అందడం లేదు. పైపులైన్ లేకపోవడంతో పైపులు పగలడం.. తరచూ మోటారు మరమ్మతులకు గురవడం జరుగుతోంది. దీంతో ఆ నీరు మండల కేంద్రానికి సరఫరా కావడం లేదు. 15 రోజులకు కూడా ఒక్క మారు వచ్చే పరిస్థితి లేదు.

సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వాములకు చక్రస్నానం

చెన్నకేశవ స్వామికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

పూజా కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం తితిదే అధికారుల ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వార్లకు రోజూ ఉదయం, పల్లకీ సేవ, సాయంత్రం గ్రామోత్సవాలు జరిపిస్తున్నారు. ఉదయం సిద్ధేశ్వర, ఆలయంలో ఉత్సవాలు ముగింపు సందర్భంగా ధ్వజావరోహణం జరిగింది. చెన్నకేశవ స్వామి వార్లకు పల్లకీ సేవ, చక్రస్నానం చేపట్టారు. తితిదే కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం కోలాటం, చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పేదలకు అన్నదానం

రాజంపేట: అన్నదానానికి మించిన దానం మరొకటిలేదని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నాసరుద్దీన్ తన తండ్రి జ్ఞాపకార్థంగా సోమవారం స్థానిక పాతబస్టాండు కూడలిలో పేదలకు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ నాయకులు నరసింహ, కృష్ణకుమార్, వెంకటసుబ్బయ్య, నరసింహరాజు, పి.చంద్ర పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సీఎంరాచపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కుడా ఛైర్మన్ రూపానందరెడ్డి

ఊటుకూరులో పర్యటిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

రాజంపేట (గ్రామీణ,చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం నేరుగా లబ్ధిదారులకు చేరేలా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట మండలం ఊటుకూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా ఊటుకూరులో ఆయన పర్యటించారు. నాయకులు రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు పాల్గొన్నారు. చిట్వేలి మండలం సీఎంరాచపల్లె, వడ్డిపల్లె పంచాయతీల్లో సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమాన్ని కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు.

రాయచోటి (సంబేపల్లె): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. కె.రామాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంబేపల్లె మండలం దేవపట్లలో తెదేపా నాయకులు పర్యటించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మల్లికార్జున, బలరాం, రౌఫా, మణికంఠ, హైదర్, కిశోర్, గంగిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హరియాదవ్, ప్రతాప్‌రెడ్డి, నరసింహనాయుడు, భాస్కర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ సంఘాలకు కమిటీల నియామకం

శివయ్యనాయుడు

లక్ష్మీరాజు

రాయచోటి, చిన్నమండెం: జిల్లాలోని 8 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఛైర్మన్‌తో పాటు ఒక్కో సహకార సంఘానికి ఇద్దరు సభ్యులను నియమించారు. చిన్నమండెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి ఛైర్మన్‌గా కోఫూరి శివయ్యనాయుడు, సభ్యులుగా దేవరింటి నాగేశ్వర, పి.గంగిరెడ్డి, సంబేపల్లెకు ఛైర్మన్‌గా నాగలక్ష్మి శివప్రసాద్‌రెడ్డి, సభ్యులుగా కూనాని సుబ్బరాజు, పూజల రాధ, లక్కిరెడ్డిపల్లెకు ఛైర్మన్‌గా వి.లక్ష్మీరాజు, సభ్యులుగా సి.రామసుబ్బయ్య, ఎస్.వెంకటరమణ, గాలివీడుకు ఛైర్మన్‌గా వి.శ్రీనివాసులురెడ్డి, సభ్యులు పి.శేఖరరెడ్డి, కె.రామప్పనాయుడు, అనంతయ్యగారిపల్లెకు ఛైర్మన్‌గా నాగలక్ష్మిరెడ్డి, సభ్యులుగా వై.నారాయణ, ఎం.శ్రీనివాసులరెడ్డి, అనంతసముద్రానికి ఛైర్మన్‌గా ఎ.మల్లికార్జున, సభ్యులుగా ఎ.పెద్దిరెడ్డి, ఎం.పట్టాభి, అనంతంపల్లెకు ఛైర్మన్‌గా పి.వెంకటరమణ, సభ్యులుగా ఎస్.చెంగల్‌రాజు, కె.రంగయ్య, పొందలూరుకు ఛైర్మన్‌గా పి.వెంకటేసు, సభ్యులు టి.పెంచలయ్య, ఆర్.గంగాధర్ ముల్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గాలివీడు.. బస్టాండ్ గోడు

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడులోని రాయచోటి-కదిరి రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరించారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆ రహదారిలోనే ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో వారంతా బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోంది. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఎక్కువ సమయం నిల్చోలేక ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉన్న నాలుగు రోడ్ల కూడలి, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో ఉన్న ఆర్టీసీ స్థలాన్ని కొందరు చిన్నపాటి వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్రమణలను తొలగించి బస్టాండ్, మరుగుదొడ్లు నిర్మించాలని వారు కోరుతున్నారు.

గాలివీడులోని కదిరి రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

సాంకేతిక సమస్యలు పరిష్కరించి జీతాలు చెల్లించండి

నియామక పత్రాలు అందిస్తున్న ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో అనేక మంది ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు రాక జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సాంకేతిక సమస్యను పరిష్కరించి త్వరగా జీతాలుచెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.రవీంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎం.నారాయణనాయక్, కోశాధికారిగా బి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా టి.రామ్మోహన్, కార్యదర్శిగా జి.మధుసూదనరావు, మహిళా కన్వీనరుగా మునీశ్వరమ్మ, క్రీడా కన్వీనరుగా ఎస్.రాధారాణిలకు నియామక పత్రాలు అందించారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలక శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ విభాగపు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం చొరవ చూపాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజినీరింగ్ విభాగపు కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ కమిషనర్ వాసుబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, యూనియన్ నాయకులు అక్బర్, శంకరయ్య, ఈశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, దేవ, రమణ, రమేష్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని వినతి

ప్రమాద బాధితుడితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు చంద్రశేఖర్, రవికుమార్

రాజంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకట్టపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సి.హెచ్.చంద్రశేఖర్, సి.రవికుమార్ డిమాండ్ చేశారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. రెడ్డిపల్లి చెరువు కట్టపై తరచూ జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించి వాటికి అనుగుణంగా అక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కడప- రేణిగుంట రోడ్డు మార్గాన్ని బాగు చేయాలని కోరామన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

సుండుపల్లి, న్యూస్‌టుడే: తుంగుట్టవడ్డెపల్లెకు చెందిన వీరనాగయ్య, కె.రవిలతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఇరు వర్గాల వారు వ్యక్తిగత విషయాలపై తరచూ వాగ్వాదాలకు దిగుతుండటంతో స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేధింపులపై...: సుండుపల్లి: రాయవరానికి చెందిన వివాహిత జన్నతున్నిషా ఇచ్చిన ఫిర్యాదుతో ఆమె భర్త అజ్మత్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.శ్రీనివాసులు తెలిపారు. బాధితురాలికి రాయచోటిలోని కొత్తపల్లి బాలాజీనగర్‌కు చెందిన అజ్మత్‌తో అయిదు సంవత్సరాల కిందట వివాహమైంది. ఈ నేపథ్యంలో ఇటీవల అదనపు కట్నం కోసం వేధిస్తూ గృహ హింసకు పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడి.. నలుగురికి గాయాలు

సిద్దవటం: సిద్దవటంలోని దిగువపేటలో సోమవారం ఉదయం పిచ్చికుక్క దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. గత మూడు రోజులుగా పిచ్చికుక్క గ్రామంలో తిరుగుతూ గేదేలను, కుక్కలను కరిచిందని స్థానికులు చెప్పారు. సోమవారం దిగువపేటలోని బేల్దారివీధికి చెందిన ఫాతిమా, గాంధీవీధికి చెందిన కోటపాటి నందకిశోర్ అనే చిన్నారులను, గాంధీవీధిలో బత్తన బాలగురవయ్య, పాలెం వసంతను పిచ్చికుక్క కరిచి గాయపరిచింది. చికిత్స కోసం బాధితులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. పెంపుడు కుక్కలను, గేదేలను సంబంధిత యజమానులు బయటకు వదిలితే తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహమ్మద్ రఫీ గ్రామంలో దండోరా వేయించారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

బ్రాహ్మణవీధి(రాయచోటి), న్యూస్‌టుడే: రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని వీరభద్రస్వామి నందివాహన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవారి ఆలయాలలో అర్చనలు, అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీపై ఆశీనులను చేశారు. ఆలయ ప్రాంగణంలో మాడవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఈవో వెంకటరమణారెడ్డి, అర్చకులు, స్థానిక, కన్నడ భక్తులు పాల్గొన్నారు.

జేఎల్ఎం గ్రేడ్-2లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

నినాదాలు చేస్తున్న జేఎల్ఎంలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో పని చేస్తున్న తమకు ఉద్యోగోన్నతులు కల్పించాలని జేఎల్ఎం గ్రేడ్-2లుగా పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నమండెం ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదోన్నతులు కల్పించాలని, నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి నిర్దిష్టమైన జాబ్‌చార్టు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో చేరడానికి గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు రాజంపేట ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని తమ రిజిస్ట్రేషన్ నంబరుతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో పరిశీలింపజేసుకోవాలని సూచించారు. ఈ నెల 23, 25 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐల్లో 26, 27 తేదీల్లో ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశ ప్రక్రియ చేపడుతారన్నారు. కౌన్సెలింగ్‌కి వచ్చే విద్యార్థులు సంబంధిత ధ్రువ పత్రాలను తీసుకొచ్చుకోవాలన్నారు.

స్తంభమంత నిర్లక్ష్యం!

పుల్లంపేట మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీ ఆర్.వడ్డిపల్లెకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలకు మొక్కల ముళ్ల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. టి.కమ్మపల్లె పంచాయతీలోని టి.కమ్మపల్లెకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసి విద్యుత్తు స్తంభాలకు మొక్కల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. దీంతో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతోంది. పశువుల మేతకు వెళ్లే వారు సైతం ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించి ప్రమాదాలను నివారిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట

తూముకుంట... సమస్యలతో తంటా

❖ నిధులున్నా అభివృద్ధి శూన్యం ❖ పట్టించుకోని అధికార యంత్రాంగం

తూముకుంట (గాలివీడు), న్యూస్‌టుడే: గాలివీడు మండలం తూముకుంట పంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ సౌర ప్లాంట్ సైతం ఏర్పాటు చేశారు. తద్వార సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నారు. మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు ఇష్టానుసారంగా నిధులు దారి మళ్లిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తూముకుంట కస్పాలో వీధుల్లో మురుగు నీరు ప్రవహిస్తుంది. పల్లెల్లో మురుగు నీటి కాలువలు, మంచి నీటి వసతి ఏర్పాటు అంతంతమాత్రంగానే ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ పాలనలో సచివాలయ భవనం, గ్రామీణ వైద్యశాల, ఆర్బీకే, గ్రంథాలయం భవనాలు అసంపూర్తిగా నిలిపేశారు.

తూముకుంట కస్పా వీధిలో మురుగు ప్రవాహం

నిర్మాణ దశలోనే గ్రంథాలయం భవనం పనులు

● స్థానిక పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయ సిబ్బంది గ్రామ సచివాలయంగా మార్చుకుని విధులు నిర్వహిస్తున్నారు. రాయచోటి-కదిరి ప్రధాన రహదారిలో ఇందుకూరవాండ్లపల్లె నుంచి తూముకుంటకు తారు రోడ్డు నిర్మించారు. తెల్లకొండ వద్ద రోడ్డు మలుపులతో ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో అదే మార్గంలో అదుపుతప్పి ద్విచక్ర వాహన ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో చోదకుడు మృత్యువాత పడినప్పటికీ సకాలంలో ఎవరూ గుర్తించలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● ఈ పంచాయతీ పరిధిలో మల్లేశ్వర స్వామి వెలిసిన సిగిరివనం పర్యాటక కేంద్రంగా పేరుంది. పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు రాకపోకలు సాగిస్తున్నారు. సౌర ప్లాంట్‌లో పని చేసే అధికారులు, సిబ్బంది రోజూ విధులకు హాజరవుతున్నారు. మలుపు దారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● ఈ విషయమై ఎంపీడీవోగా చంద్రమౌళీశ్వర్‌ను వివరణ కోరగా.. ఇటీవల బాధ్యతలు స్వీకరించారన్నారు. సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సీఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టాలి

తూముకుంట పంచాయతీకి సీఎస్ఆర్ నిధులు వస్తున్నాయి. సౌర విద్యుత్తు ప్లాంటు, సిగిరివనంతో పర్యాటకులూ తరచూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించాలి. గ్రామంలో మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలి. - కె.చంద్రశేఖర్ నాయుడు, రైతు, తూముకుంట

అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలకు వినతి

రాయచోటి, న్యూస్‌టుడే: అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను తన కార్యాలయంలో కలిసి సోమవారం వినతి పత్రాన్ని అందించినట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్సూర్ తెలిపారు. రైల్వేకోడూరు పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

CHANGE OF NAME

I, Kayanni Irshad Ali Khan (old name), S/o Kayanni Jafar Khan, R/o 22/130, Mahammad pura Street, Kothapalli, Rayachoty, Annamayya Dist. I changed my name to **KAYANI IRSHAD ALI KHAN**. Henceforth, I will be known as **"KAYANI IRSHAD ALI KHAN"** (new name).

భారతీయ స్టేట్ బ్యాంక్
జి.కె.రాచపల్లి, అన్నమయ్య జిల్లా.

బంగారు నగల బహిరంగ వేలం ప్రకటన

ఈ క్రింద పేర్కొన్న వ్యక్తులు మా బ్యాంక్ నందు బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న రుణాలను పలుమార్లు కోరినప్పటికీ అప్పు చెల్లించక నగలను విడిపించుకోలేక పోయినందున, మా రిజిస్టర్డు నోటీసు ముట్టకపోవుట చేత, ముట్టినవారు ఖాతరు చేయకపోవుట చేత ఈ ప్రకటన జారీ చేయడమైనది. ఏదో కారణముల చేత నోటీసు అందనివారు ఇదే చివరి నోటీసుగా భావించగలరు. కావున ఈ ప్రకటన చూసిన తక్షణం ఆ వ్యక్తులు అప్పు + వడ్డీ మరియు ఇతర ఖర్చులు చెల్లించి నగలను విడిపించుకోవలెను. లేని యెడల క్రింద తెలిపిన విధంగా మా శాఖ ఆవరణం నందు 18.07.2025వ తేదీ శుక్రవారం సా॥ 4.00 గం॥లకు బహిరంగ వేలం వేయబడును.

క్రమ సంఖ్య	ఖాతా సంఖ్య	ఖాతాదారులు పేరు, చిరునామా	అవుట్ స్టాండింగ్ అమౌంట్ + వడ్డీ
1.	43138292022	దేశం వెంకటరమణమ్మ, భర్త డి.కొండారెడ్డి, డి.నెం.5/31-ఎ, కుదువాండ్లపల్లి, రాయవరం గ్రామము, టి.సుండుపల్లె (మండలం), అన్నమయ్య జిల్లా.	1,19,984/-

గమనిక: [illegible]

ప్రదేశం : జి.కె.రాచపల్లి
తేది : 15.07.2025
బ్రాంచ్ మేనేజర్, 9490493265, 7702602277, 9490415836
భారతీయ స్టేట్ బ్యాంక్, జి.కె.రాచపల్లి బ్రాంచ్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ఈనాడు బాపట్ల

మంగళవారం జులై 15, 2025 5

చీరాల కుప్పడం చీరలకు జాతీయస్థాయి గుర్తింపు

బాపట్ల, న్యూస్‌టుడే: చీరాల చేనేత కుప్పడం పట్టుచీరలకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ అవార్డు సాధించింది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఓడీఓపీ) కింద కుప్పడం పట్టు చీరలను కేంద్రం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కొత్త దిల్లీలో సోమవారం నిర్వహించిన ఓడీఓపీ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ వెంకట మురళి అవార్డు అందుకున్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హాజరయ్యారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ చీరాల కుప్పడం చీరలకు లభించిన జాతీయ గుర్తింపు జిల్లాకు గర్వకారణమన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, చేనేత కార్మికుల సమష్టి కృషితోనే కుప్పడం చీరలకు బ్రాండ్ విలువ ఏర్పడిందన్నారు.

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

విద్యుత్తు సమస్యలపై ఫోన్‌ఇన్ రేపు

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులా..మీటర్ పని చేయటం లేదా..వ్యవసాయ కనెక్షన్ల మంజూరు..ఆక్వా చెరువులకు విద్యుత్తు రాయితీ..లోవోల్టేజీ ఇతర ఏ సమస్యలు ఉన్నా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింది నంబరుకు ఫోన్ చేసి సమస్యను అధికారికి వివరించవచ్చు. ఫోన్‌ఇన్‌లో సదరు అధికారి అందుబాటులో ఉండి మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు.

ఈనాడు మీతోడు

ఫోన్ చేయాల్సిన నంబరు: 80085 73141

16-07-2025, బుధవారం

ఉదయం 10.30గంటల నుంచి 12 గంటల వరకు

సాగు..జాగు

ముఖం చాటేసిన వర్షాలు

ఖరీఫ్ పంటల సాగులో జాప్యం చోటు చేసుకుంటోంది. పొడి వాతావరణం కారణంగా కృష్ణా పశ్చిమ డెల్టాలో వెద పద్ధతిలో వరి విత్తనాలు నాటినా మొలకలు సరిగా రావడం లేదు. వచ్చినా అధిక ఉష్ణోగ్రతలకు బతకడం లేదు. ఇప్పటికే పోసిన నారుమడులను కాపాడుకోవడానికి రైతులు కాలువల నుంచి ఇంజిన్లతో నీటిని తోడి తడులు ఇస్తున్నారు. జూన్‌లో లోటు వర్షపాతం నమోదైంది. జులైలో ఇప్పటివరకు వర్షాలు ఆశించిన విధంగా కురవక పోవడంతో పంటల సాగు ఊపందుకోలేదు.

న్యూస్‌టుడే, బాపట్ల

ప్రస్తుతం కృష్ణా పశ్చిమ డెల్టాకు 3700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కొమ్మమూరు కాలువకు 786 క్యూసెక్కులు వదిలారు. ఖరీఫ్‌లో 1.12 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఎగువ ఆయకట్టు ప్రాంతమైన వేమూరు, చుండూరు, కొల్లూరు, అమృతలూరు, భట్టిప్రోలులో తొలుత సాగు ప్రారంభమవుతుంది. రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడానికి వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. వేమూరు మండలంలో ఈ నెలలో సున్నా వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లోనూ 70 శాతం వర్షం తక్కువగా కురిసింది.

రైతులకు అష్టకష్టాలు.. పగటి పూట వేడిగాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రత 38 డిగ్రీలు దాటుతోంది. వెద పద్ధతిలో పొలంలో విత్తనాలు నాటినా 60 నుంచి 70 శాతమే మొలకలు వస్తున్నాయి. అవి కూడా వేడి వాతావరణానికి చనిపోతున్నాయి. తడులిచ్చి పైర్లను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో కాలువల వెంబడి భూముల్లో నారుమడులు పోశారు. కొమ్మమూరు కాలువకు చాలా తక్కువగా నీరు వస్తుండటంతో అనుబంధ కాలువలకు అరకొరగా విడుదల చేస్తున్నారు. నారుమడులు సైతం ఎండుముఖం పడుతుండటంతో కాలువలకు అడ్డుకట్ట వేసి ఇంజిన్లతో తోడి తడులిచ్చి కాపాడుకుంటున్నారు.

పీటీ ఛానల్ నుంచి ఇంజిన్‌తో నీటి తోడకం

జూన్‌లో..

- సాధారణ వర్షపాతం: 71 మి.మీ.
- నమోదైంది : 47.2 మి.మీ.
- వర్షం కురిసిన రోజులు: 05
- వర్షపాతం లోటు శాతం: 34

జులైలో (ఇప్పటి వరకు)..

- సాధారణ వర్షపాతం: 45.9 మి.మీ.
- నమోదైంది: 13.5 మి.మీ.

ఖరీఫ్ పంటల సాగుకు జులైలో కురిసే వర్షాలు కీలకం. కానీ సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. పంటలు పండించడానికి కాలువల ద్వారా 60 శాతం నీరు అందితే.. మిగతా 40 శాతం వర్షాల రూపంలో రావాలి. లోటు వర్షపాతం కారణంగా రైతులు పంటల సాగులో జాప్యం చేస్తున్నారు. వెద పద్ధతిలో విత్తనాలు నాటడానికి సిద్ధమైన వారు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. కాలువల్లోనూ పూర్తి సామర్థ్యం మేరకు సాగునీరు రావడం లేదు. 366 హెక్టార్లలో సాగు చేసిన వేరుసెనగ పైరు ఎదుగుదల ఆశించిన విధంగా లేదు. బోర్లు ఉన్న రైతులు రోజుకు మూడుతడులు ఇవ్వాల్సి వస్తోంది. ఉద్యాన పంటల రైతులు ఆచితూచి మొక్కలు నాటుతున్నారు. పత్తి విత్తనాలు నాటిన రైతులు మొక్కలు ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

కొమ్మాలపాడులో ఆక్రమణకు గురైన చెరువు

వారి దాతృత్వం.. కబ్జాదారులకు భోజ్యం

కొమ్మాలపాడు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: ఓ వైపు చెరువులు, కాలువలు, వాగులను పునరుద్ధరించే పనులను ప్రభుత్వాలు చేపడుతుండగా.. మరోవైపు ఉన్న వాటిని కొందరు తమ స్వార్థంతో ఎసరు పెడుతున్నారు. ఇందుకు సంతమాగులూరు మండలంలోని కబ్జాకు గురైన సాగు నీటి చెరువు దుస్థితే నిదర్శనం. దశాబ్దాల చరిత్ర ఉన్న కొమ్మాలపాడు జలాశయం కబ్జాదారుల హస్తాల్లో చిక్కి నేడు కనుమరుగవుతోంది. కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, సజ్జాపురం పంచాయతీల పరిధిలో ఓ వైపు ఎత్తైన కొండల్లో దాతలు కేటాయించిన 228.68 ఎకరాల విస్తీర్ణంలో భూములను కేటాయించి, 50 ఏళ్ల క్రితం చెరువును ఏర్పాటు చేశారు. దీనికి కొమ్మాలపాడు నుంచి సజ్జాపురం వెళ్లే మార్గంలో తూర్పునున్న కొండ వరకు నీరు నిలిచేందుకు వీలుగా ఎత్తైన కరకట్టనూ నిర్మించారు. ఈ మూడు గ్రామాల పరిధిలో 600 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సాగు నీరు, భూగర్భ జలాలు అడుగంటకుండా పశు పక్ష్యాదులకు తాగు నీరు అందించే సదాశయంతో దీన్ని నిర్మించారు. ఈ చెరువును ఆక్రమణదారులు మూడొంతులు కబ్జా చేశారు. వర్షం కురిసినప్పుడు వరద నీరు చెరువులోకి చేరితే తమ కబ్జా చేసిన భూముల్లోని పంటలు మునుగుతున్నాయని ఏకంగా కరకట్టకే కబ్జాదారులు గుట్టుచప్పుడు కాకుండా గండి కొట్టారు. మరో చోట వరద నీటికి మరో గండి పడటంతో ఎంత వర్షం కురిసినా ఆ చెరువులోకి చుక్కనీరు చేరకుండా దిగువకు వెళ్లిపోతోంది. గతంలో కరకట్టకు పడమర వైపు నిర్మించిన అలుగు నుంచి వరద నీరు సజ్జాపురం, కొప్పరం చెరువులకు కాలువ ద్వారా చేరేది. కానీ కరకట్టకు గండ్లు కొట్టడంతో పాటు అలుగు ప్రాంతంలో స్థానికులు కొందరు బావులు తవ్వడంతో పూర్తిగా రూపురేఖలే మారిపోయాయి. తక్షణం జలవనరుల శాఖ అధికారులు స్పందించి కబ్జాదారుల చెర నుంచి చెరువును కాపాడి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విజి'లెన్స్'కు సహాయ నిరాకరణ

వర్సిటీలో అధికారుల తీరు

ఏఎన్‌యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అవకతవకలపై జరుగుతున్న విజిలెన్స్ విచారణకు కొంతమంది సహకరించడం లేదని తెలిసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అకడమిక్ ఎగ్జిబిషన్, యువజనోత్సవాల నిర్వహణపై వివరాలు అడిగి వారం రోజులైనా ఇచ్చేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. విజిలెన్స్ విచారణకు రాకముందే అక్రమార్కులు ఎక్కడికక్కడ చక్కబెట్టేసినట్టు సమాచారం. ఇందుకు వారికి కొంతమంది అధ్యాపకులు సహకరించినట్లు తెలిసింది. గతేడాది జులైలో బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు అక్రమార్కులపై ప్రేమ చూపిస్తున్నారు. ఇప్పటికీ ఓ అధికారి అప్పటి వీసీతో సత్సంబంధాలు కొనసాగిస్తుండడం, తరచుగా ఆయనతో రహస్య సమావేశాలు నిర్వహిస్తుండడంతో అక్రమాలు బయటకు రాకుండా కప్పిపెడుతున్నట్లు సమాచారం. వర్సిటీలో చోటుచేసుకున్న అక్రమాలపై గత పది రోజులుగా విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగం విచారణ పనులను పరిశీలించారు. ఫార్మసీ కళాశాల వద్ద డ్రైనేజీ పైపులైను ఎందుకు బయట నిర్మించాల్సి వచ్చిందో ఆరా తీశారు. స్థలం లేక.. అలా నిర్మించాల్సి వచ్చిందని అధికారులు చెప్పినట్టు తెలిసింది. ఇంజినీరింగ్ పనుల్లో కొన్ని అక్రమాలు గుర్తించినట్లు చెబుతున్నారు.

కంపెనీల ఒప్పంద పత్రాలుంటేనే ముందుకు సాగండి

మార్టూరు, పర్చూరు, న్యూస్‌టుడే: నల్ల బర్లీ పొగాకు రైతులను కంపెనీలు నమ్మించి మోసం చేశాయి.. రైతుల పరిస్థితిని విని సీఎం చంద్రబాబు బాధపడ్డారు.. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పొగాకు రైతులను ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు పర్చూరు మండలం అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అడుసుమల్లిలో కేంద్రాన్ని యద్దనపూడి మండల రైతుల కోసమే ఏర్పాటు చేశారు. అక్కడ జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కంపెనీల నుంచి ఒప్పంద పత్రాలు ఉంటేనే రైతులు పొగాకు సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంట దిశగా ముందుకు సాగాలని, మొక్కజొన్నకు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించిందని, రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు త్వరలో మరికొన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. మార్టూరు మండలం జొన్నతాళి ప్రాంతలోని నూలుమిల్లు గోదాములను కొనుగోలు చేసిన పొగాకు నిల్వ చేసేందుకు ఎమ్మెల్యే పరిశీలించారు. కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.లవన్న, ఆర్డీవో పి.గ్లోరియా, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, తెదేపా మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి, తాటి నాగేశ్వరరావు, షంషుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

నిర్దిష్ట గడువులోగా సమస్యల పరిష్కారం

బాపట్ల, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలను నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలను ఎస్పీ నేరుగా విన్నారు. ఆయన మాట్లాడుతూ అర్జీలను చట్టపరిధిలో విచారించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యల నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, స్థల వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, తదితర సమస్యలపై మొత్తం 68 అర్జీలు వచ్చాయి. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు మిరపకు మొదటి బహుమతి

గుంటూరు, న్యూస్‌టుడే: ఒక జిల్లా-ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కింద గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. దేశ రాజధాని న్యూదిల్లీలోని భారత మండపం (ప్రగతి భవన్)లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా గుంటూరు మిరపకు వచ్చిన పురస్కారాన్ని కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మొదటి బహుమతి అందుకోవడం జిల్లా తరపున ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు.

రైతేరాజు — పరికరం చిన్న.. ఉపయోగం మిన్న — పశువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు — 6లో

మున్సిపల్ ఛైర్మన్ ఎవరు?

ముగ్గురి పేర్లను అధిష్ఠానానికి పంపిన ఎమ్మెల్యే

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పురపాలక సంఘ ఛైర్మన్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ పదవి కోసం పలువురు ప్రయత్నాలు చేయడంతో పాటు తమకే వస్తుందని భావించారు. ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య రెండు రోజుల కిందట కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, పొత్తూరు సుబ్బయ్య, మామిడాల రాము పేర్లను అధిష్ఠానానికి పంపడంతో మిగిలిన వారు నిరాశకు గురయ్యారు. ఎమ్మెల్యే సోమవారం ముగ్గురిని పిలిచి 'మీలో ఎవరి పేరును అధిష్ఠానం ప్రతిపాదిస్తే వారే ఛైర్మన్‌గా ఉంటారు. ఇందులో నా ప్రమేయం ఉండదని, మిగిలిన వారు దీనికి పూర్తిగా సహకరించాలి' అని సూచించినట్లు తెలిసింది. మిగిలిన ఇద్దరికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సమాచారం. వైస్ ఛైర్మన్ల పదవులు సామాజిక వర్గాల వారీగా ఇవ్వనున్నారు.

రేపే ఎన్నిక : మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక బుధవారం ఉదయం 11 గంటలకు ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి చంద్రశేఖర్‌నాయుడు నిర్వహించనున్నారు. స్థానిక సమావేశపు హాలులో చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక జరగనుంది. మే 14న మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబులపై తెదేపా మద్దతు కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో వారు పదవి నుంచి వైదొలగారు. ఇదే సమయంలో మరో వైస్‌ఛైర్మన్ శిఖా కొల్లి రామసుబ్బులు తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం తెదేపాకు మద్దతు తెలిపే కౌన్సిలర్లు 21 మంది ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే, ఎంపీల ఓట్లు ఉన్నందున మున్సిపల్ ఛైర్మన్ పదవి తెదేపా వశం కానుంది.

ఏడాది సర్వీసు పూర్తయితే పదోన్నతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో సహాచార్యులుగా ఏడాది సర్వీసు పూర్తయిన వారి వివరాలు వెంటనే పంపించాల్సిందిగా రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు సోమవారం కోరారు. దీంతో అర్హులైన వారంతా సంబంధిత పత్రాలను వెంటనే అందజేయాల్సిందిగా ప్రిన్సిపల్ సూచించారు. ఈ సమాచారాన్ని మంగళవారం డీఎంఈ కార్యాలయానికి పంపనున్నారు. ఇందులో కొందరికి ఆచార్యులుగా పదోన్నతి ఇవ్వనున్నారు. నిబంధనల ప్రకారం సహాచార్యులుగా మూడేళ్లు పూర్తయితేనే ఆచార్యులుగా పదోన్నతిస్తారు. ఆ నిబంధనను సడలించి ప్రస్తుతం ఏడాది పూర్తయినవారికీ ఉద్యోగోన్నతి ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా మాలిని

వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రం (పురుష) ప్రిన్సిపల్‌గా మాలినిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం జీవో జారీ చేశారు. ఏలూరు డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న ఆమెను తొలుత గుంటూరు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసరుగా గత నెల 27న బదిలీ చేశారు. ఆమె ఆ పోస్టులో చేరకుండానే శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా సవరించిన ఉత్తర్వులు తెచ్చుకోవడం గమనార్హం.

అభ్యసన సామర్థ్యాల్లో తడబాటు

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రాథమిక విద్యలో జిల్లా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉండగా. . ప్రాథమికోన్నత విద్యలో వెనకబాటు కనిపిస్తోంది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పేరిట విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై నివేదిక ఇచ్చింది. జిల్లాలో మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు మాతృభాష, గణితం, పరిసరాల పరిజ్ఞానం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో అభ్యసన సామర్థ్యాల ఫలితాలు వెలువడ్డాయి. ఎక్కువ అంశాల్లో జిల్లా సగటు రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉండటం విశేషం. రెండు అంశాల్లో మాత్రమే జాతీయ సగటు కన్నా జిల్లా సగటు తక్కువగా ఉంది. పలు విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉంది.

- గతేడాది డిసెంబరులో ఎన్‌సీఈఆర్టీ సర్వే నిర్వహించింది. ఆయా పరీక్షల్లో సాధించిన సగటు మార్కుల ఫలితాలను ఇటీవల విడుదల చేసింది. బాలబాలికల వారీగా చూస్తే.. మూడు విభాగాల్లో అన్ని సబ్జెక్టుల్లో అమ్మాయిలే ఎక్కువ సగటు సాధించారు.

వివిధ సబ్జెక్టుల్లో సగటు స్కోరు ఇలా..

తరగతి	పాఠ్యాంశం	జిల్లా	రాష్ట్రం	జాతీయ
మూడు	మాతృభాష	65	64	64
	గణితం	62	61	60
ఆరు	మాతృభాష	50	48	57
	గణితం	43	41	46
	ఈవీఎస్	41	40	49
తొమ్మిది	మాతృభాష	52	50	54
	గణితం	40	35	37
	సైన్సు	37	36	40
	సోషల్	40	37	40

- మూడో తరగతిలో మాతృభాష, గణితం సగటు మార్కుల్లో గ్రామీణ విద్యార్థుల కన్నా పట్టణ విద్యార్థులు ముందంజలో ఉన్నారు. ఆరో తరగతిలో మాత్రం గ్రామీణ విద్యార్థులు పైచేయి సాధించారు. తొమ్మిదో తరగతిలో అన్ని సబ్జెక్టుల్లో పట్టణ విద్యార్థులు ప్రతిభ చూపారు.
- జిల్లాలో 131 పాఠశాలల్లో (మూడో తరగతి 53, ఆరో తరగతి 39, తొమ్మిదో తరగతి 51 బడులు) సర్వే నిర్వహించారు. మొత్తం 3,093 మంది విద్యార్థులు, 445 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యతో మెరుగైన ఫలితాలు

ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాల మెరుగుదలకు వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాం. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందిస్తాం. పాఠశాలల ప్రగతి, విద్యా ప్రమాణాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాముల్ని చేస్తున్నాం. ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తాం. ఈ ఏడాది నిర్వహించే సర్వేలో మెరుగైన ఫలితాలు సాధిస్తాం. -పురుషోత్తం, డీఈవో

నకిలీ టీటీఈ పట్టివేత

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైలులో టీటీఈగా తనిఖీలు చేస్తూ.. ప్రయాణికుల నుంచి నగదు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే రక్షక దళం(ఆర్‌పీఎఫ్) సభ్యులు పట్టుకున్నారు. మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు(17215)లో టీటీఈ వలే తెల్లటి దుస్తులు ధరించి జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా.. అదే రైలులో విధులు నిర్వహిస్తున్న గుంటూరు టీటీఈ జాన్ వెస్లీ ఆయన్ను గుర్తింపు కార్డు చూపించమని అడగ్గా వాదనకు దిగాడు. ఈ రైలు నరసరావుపేటకు చేరగానే బండిలో నుంచి దూకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్‌పీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. విచారణలో అతని పేరు అవినాష్ గుప్తా, గుంటూరు అని తేలింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం అతను నకిలీ టీటీఈగా నిర్ధారించుకుని నరసరావుపేట ప్రభుత్వ రైల్వే పోలీసులకు ఆదివారం అప్పగించారు. జీఆర్‌పీ ఎస్ఐ కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్తు అదాలత్

బాపట్ల, న్యూస్‌టుడే: వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో విద్యుత్తు అదాలత్‌ను పట్టణంలోని ఎన్ఎస్‌పీ అగ్రహారం సాయిఫంక్షన్ ప్యాలెస్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఈఈ భాస్కరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ విక్టరీ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో అదాలత్ జరుగుతుందన్నారు. విద్యుత్తు వినియోగదారులు కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు అందజేస్తే ఛైర్మన్ పరిష్కరిస్తారని చెప్పారు.

సాగర్ నీటిమట్టం 554 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 554 అడుగులకు పెరిగింది. ఇది 218.6760 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 63,900 క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం నీటిమట్టం 883.40 అడుగుల వద్ద కొనసాగుతోంది. జూరాల, రోజాల నుంచి శ్రీశైలం జలాశయానికి 72,763 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

అన్నింటికీ ఆధారం.. త్వరపడాల్సిన తరుణం

నవీకరణకు లక్షల మంది దూరం

- అర్హత ఉండి కూడా జిల్లాకు చెందిన సుమారు 4 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం మొదటి, రెండు విడతల్లో సాయం అందలేదు. ఏంటని ఆరా తీస్తే ఆధార్ నవీకరణ జరగలేదనే రిమార్కు వచ్చింది. దీంతో తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకుని ఆధార్ కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చింది.
- మాచర్లకు చెందిన బాలుడు శ్రీనివాస్‌ను ఒకటో తరగతిలో చేర్పేందుకు వెళ్లగా ఆధార్ లేకపోవడంతో ఛైల్డ్ ఇన్ఫోలో వివరాలు నమోదు కాలేదు. తల్లికి వందనం లబ్ధిదారుల జాబితాలో విద్యార్థి పేరు చేరలేదు. వందల మంది విద్యార్థులదీ ఇదే పరిస్థితి.
- అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులుగా జూన్ 30లోగా ఆధార్ నవీకరణ చేయించుకున్న రైతులనే ఎంపిక చేశారు. ఈకేవైసీ, ఆధార్ నవీకరణ లేక చాలామందికి అర్హుల జాబితాలో చోటు దక్కలేదు. ఫలితంగా వారు రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నరసరావుపేట, న్యూస్‌టుడే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ ప్రామాణికంగా మారింది. కొత్తగా ఆధార్ పొందడంతో పాటు ఎప్పుడో పొందిన దానిని నవీకరణ చేయించుకోవడంలో చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా అర్హత ఉన్నా సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారు. మ్యాన్‌డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్స్ (ఎంబీయూ) చేయించుకోనివారు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షలాది మంది ఉన్నారు. వీరికి ఆధార్ ఉన్నా నవీకరణ చేయించుకోకపోవడంతో సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఏర్పడింది.

చిన్నారి ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

నవీకరించుకోవాల్సిన వారి వివరాలిలా...

జిల్లా	5 నుంచి 15 ఏళ్లలోపు	15 ఏళ్లకు పైబడిన వారు	మొత్తం
పల్నాడు	58,117	1,16,637	1,74,754
బాపట్ల	41,861	83,738	1,25,599
గుంటూరు	64,213	1,18,523	1,82,736

నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 18 వరకు.. మళ్లీ 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. పిల్లలైతే తల్లి లేదా తండ్రిని తీసుకుని, పెద్దలైతే స్వయంగా ఆధార్ కార్డుతో వెళ్లి వేలిముద్రలు వేస్తే నవీకరణ ప్రక్రియ పూర్తవుతుంది. దీనికి ఎటువంటి రుసుం వసూలు చేయరు. కొత్తగా ఆధార్ పొందేవారి నుంచి నిర్ణీత రుసుం వసూలు చేస్తారు.

(c) eenadu

డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న సుజన్

ఉపాధి పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు

బాపట్ల, న్యూస్‌టుడే: చినగంజాం మండలం కడవకుదురులో జరిగిన ఉపాధి హామీ పనుల్లో నకిలీ జాబ్‌కార్డులు, మస్తర్ల ద్వారా డ్వామా సిబ్బంది అక్రమాలకు పాల్పడి రూ.30 లక్షలు స్వాహా చేశారని ఆరోపిస్తూ కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక పార్టీ నాయకుల అండదండలతో నిధులు దుర్వినియోగం చేశారన్నారు. బినామీ కూలీలతో మస్తర్లు వేసి నిధులు డ్రా చేసి అవినీతికి పాల్పడ్డారన్నారు. అక్రమాల్లో ఏపీవో, క్షేత్ర సహాయకుడు, సాంకేతిక సహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్ పాత్ర ఉందని సమగ్ర విచారణ నిర్వహించి స్వాహా చేసిన నిధులు రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

★ సంతమాగులూరు మండలం కుందూరులో తమ పేరిట రెండున్నర ఎకరాలు భూమి ఉండగా స్థానిక రెవెన్యూ అధికారి అందులో 1.80 ఎకరాలను ఇద్దరు మహిళల పేరుతో ఆన్‌లైన్లో అక్రమంగా ఎక్కించారని రైతు దంపతులు కవిత, శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారి చేసిన అక్రమంపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరుతూ డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్లో ఇద్దరు మహిళల పేరుతో ఎక్కించిన 1.80 ఎకరాలు తొలగించి తమ భూమిని తిరిగి అప్పగించాలని కోరారు.

★ అన్ని అర్హతలు ఉన్నా ఆన్‌లైన్లో భూ విస్తీర్ణం తప్పుగా నమోదు కావటం వల్ల తమ పిల్లలకు తల్లికి వందనం సాయం అందలేదని కొరిశపాడు మండలం పిచ్చికలగుడిపాడుకు చెందిన పీజీఆర్ఎస్‌లో కొట్టె రామకృష్ణ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు 1.65 ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. జగనన్న భూరక్ష సర్వేలో పది ఎకరాలుగా చూపించారన్నారు. దీని వల్ల అనర్హుడిగా ప్రకటించి తల్లికి వందనం మంజూరు చేయలేదన్నారు. ఆన్‌లైన్లో జేఎల్‌పీఎం సమస్య వల్ల భూమి ఎక్కువగా చూపిస్తోందన్నారు. తప్పును సరిచేసి తన ఇద్దరి కుమార్తెలకు తల్లికి వందనం సాయం రూ.26 వేలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు.

★ బాపట్ల రైతుబజారులో దుకాణాలు కేటాయించినా రైతులు బయటకు వచ్చి రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్నారని పీజీఆర్ఎస్‌లో డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు ఎన్టీఆర్ పురపాలక కూరగాయల వ్యాపారుల సంఘం నేతలు యలవుల వెంకటేశ్వర్లు, రంగారావు ఫిర్యాదు చేశారు. రైతు బజారులోనే కూరగాయలు విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టాలని, రోడ్లపై అమ్మకాలు జరగకుండా చూడాలని కోరారు.

ఏడాదిలోనే అనేక పథకాల అమలు: గొట్టిపాటి

బల్లికురవ, న్యూస్‌టుడే: సుపరిపాలనలో కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసిందని, సర్కారు ఏర్పడిన తొలి సంవత్సరంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఐదేళ్లుగా గుంతలమయంగా మారిన రోడ్లను పూర్తి మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ముక్తేశ్వరంలో సుపరిపాలనలో తొలిఅడుగు-ఇంటింటికి తెలుగుదేశంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి కూటమి పాలనపై ప్రజాభిప్రాయాలు సేకరించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి ఇటీవల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చెన్నుపల్లి నుంచి వైదన వరకు రూ.3 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. నిలిపేసిన ఆర్టీసీ బస్సును తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

మహిళతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

సౌర పార్కు భూసేకరణ పరిహారం పెంచాలని వినతి

కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్ఎల్‌గుడిపాడు రైతులు

బాపట్ల, న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలో సౌర పార్కు కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు పరిహారం కింద ఎకరాకు రూ.18 లక్షలు మాత్రమే చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు ప్రకటించటం వల్ల తాము నష్టపోతామని ఎస్ఎల్‌గుడిపాడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన 15 మంది రైతులు కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను కలిసి భూసేకరణ పరిహారం తక్కువగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో 300 ఎకరాలు సేకరించటానికి ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. భూసేకరణ పరిహారం పెంచి రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. రైతులు మూర్తిరాజు, రవి, కాంతారావు, భాస్కరరావు మాట్లాడుతూ ఏడాదికి రెండు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. భూములను ప్రభుత్వం తీసుకుంటే ఉపాధి కోల్పోతామన్నారు. ఎస్ఎల్‌గుడిపాడులో భూసేకణ ప్రతిపాదిత భూములు జాతీయ రహదారికి రెండువైపులా ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ ధర ఎకరాకు రూ.6.50 లక్షల నుంచి 13.58 లక్షల వరకు ఉందని చెప్పారు. చీరాల ఆర్డీవో మాత్రం తక్కువ విలువ కలిగిన భూమిని పరిగణనలోకి తీసుకోవటం వల్ల నష్టపోతున్నామన్నారు. ఎకరా విలువ రూ.13లక్షలుగా పరిగణనలోకి తీసుకుని రెండున్నర రెట్లు కలిపి పరిహారం కింద రూ.32.50 లక్షల పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే సౌర పార్కు భూసేకరణ నుంచి తమ భూములను మినహాయించాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరా లక్ష్యం

ముప్పవరంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్తు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని బాపట్ల జిల్లా ఎస్ఈ జి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పవరం విద్యుత్తు ఉప కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి బిల్లుల వసూలుపై దృష్టి సారించాలని, ఫీడర్లలో సమస్యలు తలెత్తకుండా సిబ్బందితో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకంపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. విజిలెన్స్ ఎస్ఈ విజయకృష్ణ మాట్లాడారు. అద్దంకి ఈఈ మస్తాన్‌రావు, విజిలెన్స్ ఈఈ భాస్కర్‌రావు, ఏడీలు దామోదరం, సురేంద్ర, విజిలెన్స్ ఏడీ విజయ్‌శ్రీనివాస్, వీ అండ్ ఏపీటీఎస్ ఎస్సై ఎ.ఎడ్వర్ట్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.1.86 లక్షల అపరాధ రుసుం విధింపు..

మండలంలో విద్యుత్తు విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. 27 బృందాలుగా ఏర్పడి 1527 సర్వీసులను పరిశీలించారు. అదనపు లోడు వినియోగించుకుంటున్న 59 మందిపై కేసులు నమోదు చేసి రూ.1,53,200 జరిమానా, చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి రూ.15 వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా వేరే కేటగిరిలో విద్యుత్తు వాడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి రూ.18 వేలు మొత్తం రూ.1,86,200 అపరాధ రుసుం విధించినట్లు ఈఈ మస్తాన్‌రావు తెలిపారు.

పరికరం చిన్న.. ఉపయోగం మిన్న

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూపకల్పన

న్యూస్‌టుడే, బాపట్ల

బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యవసాయ యాంత్రీకరణ విభాగం ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే సామగ్రి తయారు చేసి అందుబాటులో ఉంచారు. చిన్న, సన్నకారు రైతుల కోసం వీటిని రూపొందించి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కళాశాలలో ఉత్పత్తి చేసిన పలు పరికరాల వివరాలను ఏడీ డీడీ స్మిత్ తెలిపారు.

కల్టివేటర్: ఒకసారి నేలను దున్నిన తర్వాత వదులైన మట్టిని గుల్లగా, చదును చేయటానికి, కలుపు మొక్కలు నివారించటానికి కల్టివేటర్ ఉపయోగపడుతుంది. నాణ్యమైన ఉక్కుతో పరికరాన్ని తయారు చేశారు. పరికరానికి ఉన్న క్రరులు దీర్ఘ కాలం అరిగిపోకుండా పని చేసేలా రూపొందించారు.

క్రరులదంతి: పంట సాళ్లలో, నేలపై మొలిచిన కలుపు మొక్కలను భూమిలో నుంచి పెకిలించి వేయటానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది. దీనికి కింద వైపున ఉన్న త్రిభుజాకార బ్లేడ్లు బలంగా నాటుకుని ఉన్న ముదురు కలుపును కూడా లాగేస్తుంది.

త్రిభుజాకార దంతి: ఈ పరికరం ఓ చిన్నపాటి గొర్రు లాగా పని చేస్తుంది. రైతులు, కూలీలు చేతితో లాగుతూ నేలను పెకిలించవచ్చు. మెట్ట భూముల్లో, పెరటి తోటల్లో, వరి సాళ్లలో కలుపు సులువుగా తీయటానికి అవకాశం ఉంటుంది.

నేలను చదును చేసే బ్లేడు: ట్రాక్టర్‌కు కలిపి పొలంలో బ్లేడు లాగితే నేలను చదును చేస్తుంది. లెవలర్‌గా, ట్రాక్టర్ రివర్స్ గేరులో నడిపినప్పుడు మట్టిని నెట్టడానికి బుల్డోజర్‌గా ఉపయోగపడుతుంది. భూ ఉపరితలంపై లోతైన గుంటలు నింపి చదును చేయటానికి పని చేస్తుంది. దీంతో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి మట్టి నెట్టుకొని వెళ్లి చదును చేయటానికి అవకాశం ఉంటుంది. బ్లేడు రెండు మీటర్ల పొడవు ఉంటుంది.

రైతేరాజు

విత్తన శుద్ధే మొక్కకు రక్షణ కవచం

పొన్నూరు, న్యూస్‌టుడే: విత్తనశుద్ధి మొక్కకు రక్షణ కవచమని పొన్నూరు మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. విత్తనశుద్ధి చేసుకునే విధానాన్ని వివరించారు. ఎంపిక చేసుకున్న విత్తనాల నుంచి చెత్త, చెదారం, తాలు, రాళ్లు, దుబ్బలు వేరు చేయాలి. అనంతరం విత్తనాలను సూర్యరశ్మిలో ఆరబెట్టాలి. కిలో విత్తనానికి కార్బండిజమ్ 3 గ్రాములు లేనిపక్షంలో సూడోమోనాస్ 10 గ్రాములను కలిపి ఆరబెట్టాలి. ఫలితంగా మొక్కకు తొలిదశలో ఆశించే చీడపీడలు నశిస్తాయి. రైతులు ఖర్చు తగ్గించుకునేందుకు వెదజల్లే పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు. గుంజ లేదా నీరు లేనిపక్షంలో విత్తనాలపై మందు కలిపి విత్తుకోవాలి. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్ల బెడద తగ్గి అధిక దిగుబడులు సాధించొచ్చు.

దానిమ్మ తోటల్లో తెగుళ్ల నివారణ చర్యలు

యడ్లపాడు, న్యూస్‌టుడే: దానిమ్మ తోటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా ఉద్యాన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని చిలకలూరిపేట ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. ❖ పక్షి కన్ను తెగులుతో దానిమ్మ చెట్ల ఆకులపై నల్లని మచ్చలు ఏర్పడి అవి క్రమంగా పెరిగి ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా ప్రొపికోనజోల్ 1.5 మి.లీ. స్ట్రెప్టోమైసిన్ 0.2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ❖ పండుకుళ్లు తెగులు సోకిన చెట్ల పండ్లు పక్వానికి రాక ముందే కుళ్లిపోయి రాలిపోతాయి. దీని నివారణకు వ్యాధి సోకిన చెట్లను తోట నుంచి తొలగించాలి. కాపర్ ఆధారిత శిలీంద్ర నాశకాలు వాడాలి.

❖ బొబ్బర తెగులుతో చెట్ల బెరడు రాలిపోయి పగుళ్లు ఏర్పడతాయి. నివారణకు వ్యాధి సోకిన భాగాలను తీసేసి సాఫ్ 2 గ్రా. లేదా ప్లాంటమైసిన్ 0.2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడల నివారించేలా..

❖ వేపనూనె, వేపపిండి, డైమిథోయేట్, జోల్ట్ మిశ్రమం వంటివి వాడాలి.
❖ పొలం చుట్టూ గడ్డిని తొలగించి సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి.
❖ మిత్రపురుగులు ఉపయోగించి పంటను నష్టపరిచే పురుగులను అదుపులో ఉంచుకోవచ్చు.
❖ రసాయన ఎరువులను పరిమిత మోతాదులో వాడాలి.

పశువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు

వినుకొండ, న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రభావం పశువుల ఆరోగ్యంపై ఎక్కువగా ఉంటుంది. అధిక తేమ, మట్టిలో ఉండే సూక్ష్మజీవులు, దోమలు, తడి వాతావరణంతో పలురకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నూజెండ్ల పశువైద్యాధికారి శివాజి తెలిపారు. వాటి నివారణ చర్యలను వివరించారు.

❖ దోమలు, ఈగల ద్వారా ముద్ద చర్మ వ్యాధి వస్తుంది. ఆవులపై దీనిప్రభావం అధికం. శరీరంపై పుండ్లు, జ్వరంతో పాటు ఆకలి కోల్పోతాయి. వైరల్ వ్యాధి కావడంతో పశువైద్యుని పర్యవేక్షణలో వ్యాధి నిరోధక శక్తి ఇచ్చే మందులు వాడి పశువును కాపాడుకోవచ్చు. ❖ బ్యాక్టీరియాతో సోకే గొంతువాపు వ్యాధి వల్ల పశువు గొంతు కింద వాపుతో పాటు శ్వాస తీసుకోలేకపోవడం, అధిక జ్వరంతో కొన్ని సందర్భాల్లో చనిపోతాయి. లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యుని సూచనల మేరకు యాంటీబయోటిక్స్, యాంటీపైరెటిక్స్ వాడి కాపాడుకోవచ్చు. వర్షాకాలానికి ముందే టీకాలు వేయించాలి.

❖ మట్టి ద్వారా వ్యాపించే బ్యాక్టీరియాతో లెప్టోస్పైరోసిస్ సోకుతుంది. ఎర్రమూత్రం, జ్వరం, తలదించుకుని నిలబడటం వ్యాధి లక్షణాలుగా గుర్తించి పశువైద్యుని సూచన మేరకు యాంటీబయోటిక్స్ వాడాలి. మంచినీరు, శుభ్రత, వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు.

❖ బ్యాక్టీరియాతో పశువులు, జీవాలు కాళ్లకు పుట్‌రాట్ వ్యాధి సోకుతుంది. దీనివల్ల గిట్టల్లో పుళ్లు, వాపు, నడవడానికి ఇబ్బంది ఉంటుంది. యాంటీబయోటిక్స్‌తో పాటు నొప్పి నివారణ మందులు వాడాలి. తేమ ఎక్కువ ఉన్న ప్రాంతంలో ఉంచకూడదు. గిట్టలు శుభ్రంగా ఉంచాలి.

❖ తడిసిన గడ్డి వేయడంతో జీర్ణవ్యవస్థ పాడై పొట్ట ఉబ్బరం, పారుడు వంటివి సంభవించే అవకాశం ఉంది. ఎండు గడ్డి, తగినంత మినరల్స్ వాడి నివారించుకోవచ్చు. ❖ వర్షాకాలంలో షెడ్ పొడిగా ఉంచాలి. వైద్యుల ప్రకారం హెచ్ఎస్, బిక్యూ, ఎఫ్ఎండీ, ఎస్‌డీని వేయించాలి. దోమలు, ఈగల నివారణకు ఫ్యూమిగేషన్, నెబులైజేషన్ చేయాలి. తడి లేకుండా ఎండిన పశుగ్రాసం ఇవ్వాలి. పశువును పరిశుభ్రంగా ఉంచాలి. వీటిని పాటించడం వల్ల పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.

డాక్టర్ డీవీ శివాజి

❖ ఆవులు, ఎద్దులకు సోకే జబ్బువాపుతో 105 డిగ్రీల జ్వరం, కాళ్లు లేదా భుజం ప్రాంతాల్లో వాపుతో కూడిన నొప్పి ఉంటుంది. పెన్సిలిన్స్, టెట్రాసైక్లిన్స్ వంటి మందులు వైద్యుల సూచన మేరకు వాడాలి. జూన్‌లో వ్యాక్సిన్ వేయడం మంచిది.

గుంటూరు వైద్యుడు హేమంత్‌కు రెండు ఫెలోషిప్‌లు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరోసర్జన్ హేమంత్ ఉప్పుటూరి లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన జరిగిన సమారోహంలో ఫెలోషిప్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఎఫ్ఆర్‌సీఎస్), ఇంటర్నేషనల్ సర్జికల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఫెలోషిప్(ఐఎస్‌టీపీ)లను అందుకున్నారు. ఈమేరకు గుంటూరులో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హేమంత్ ఉప్పుటూరి ఆ వివరాలు వెల్లడించారు. ఎఫ్ఆర్‌సీఎస్, ఐఎస్‌టీపీ రెండింటినీ ఒకేసారి అందుకున్న తొలి వ్యక్తిగా తనకు గుర్తింపు దక్కిందన్నారు. లండన్‌లో శిక్షణ సమయంలో నేర్చుకున్న నైపుణ్యాలతో స్థానిక రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించగలనని చెప్పారు. గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, వెల్లూరు క్రిస్టియన్ వైద్య కళాశాలలో న్యూరోసర్జరీ పూర్తి చేసి గుంటూరులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అమృత హాస్పిటల్స్, యాంజియో కేర్ హాస్పిటల్, న్యూరో క్యూర్ హాస్పిటల్, స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్ యాజమాన్యాలు, సిబ్బంది హేమంత్‌ను అభినందించారు.

బర్లీ పొగాకు కొనుగోలులో ఇబ్బంది రానీయొద్దు

ఈనాడు-అమరావతి, గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గోదాములు నిండిన నేపథ్యంలో.. ప్రైవేటు గోదాములను అద్దెకు తీసుకుని పొగాకు అక్కడికి తరలించాలని, అందుకయ్యే ఖర్చులను మార్క్‌ఫెడ్ భరిస్తుందని హామీ ఇచ్చారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. 2024-25 సంవత్సరంలో 80 మిలియన్ కిలోల ఉత్పత్తిని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 22 పొగాకు కంపెనీలు 36 మిలియన్ కిలోల పంట కొనుగోలు చేశాయని వివరించారు. ఈ నెల 21 నుంచి సన్న, చిన్నకారు రైతుల దగ్గరున్న మొత్తం పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 1,276 రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని అచ్చెన్నాయుడు వివరించారు. రానున్న సీజన్‌లో రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలు వేయాలని, అందుకనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ ఎక్స్-అఫీషియో ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు ఎస్.ఢిల్లీరావు, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొనడంతో దంపతులకు గాయాలు

అద్దంకి: రామ్‌నగర్ కూడలి వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో దక్షిణ అద్దంకికి చెందిన అంకయ్య దంపతులకు గాయాలవ్వగా ఒంగోలు తరలించారు. ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.

అధికారులతో ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు

బాపట్ల: చీరాల కామాక్షి కేర్ ఆసుపత్రి నిర్వహిస్తున్న భవనం లీజు వివాదం కోర్టులో ఉండగా భవన యజమాని వెంకట్రావు అధికారులతో ఒత్తిడి తెచ్చి బలవంతంగా ఖాళీ చేయించటానికి ప్రయత్నిస్తున్నారని కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆసుపత్రి ఎండీ దేవరాజు ఫిర్యాదు చేశారు.. అధికారుల జోక్యం తగదన్నారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

చీరాల: ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం పురపాలక కార్యాలయం ఎదుట కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. జీవో 36 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిమటా వీరాస్వామి, బాబూరావు, ఇమ్మానియేల్, సింగయ్య, చాంద్‌బాష, నాగేశ్వరరావు, కాంతారావు, విల్సన్, బత్తుల విశ్వేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం

బాపట్ల: పురపాలక ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే సమ్మె ఉద్ధృతం చేస్తామని పురపాలక కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. పురపాలక కార్యాలయం వద్ద కార్మికుల శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లామన్నారు. మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవటం వల్లే కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. నెల వేతనం రూ.24,500కు పెంచి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్, నేతలు శరత్, భాస్కరరరావు, నాగేశ్వరరావు, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై కేసు

అద్దంకి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఏఎస్ఐ సైదయ్య అందించిన సమాచారం మేరకు.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన డి.చంద్రారెడ్డి గతనెల 16న పట్టణంలోని రామ్‌నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా మేదరమెట్ల వైపు నుంచి వచ్చే ద్విచక్రవాహనం ఆయన్ను ఢీకొట్టింది. కాలికి తీవ్రగాయాలు కావటంతో తొలుత ఒంగోలు, అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. గుంటూరు వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

చీరాల అర్బన్: క్రిమిసంహారక మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... సిండికేట్ వీవర్స్ కాలనీకి చెందిన కడియాల వెంకటేశ్వర్లు(28) మద్యానికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో తరచూ భార్యాభర్తలు గొడవపడుతున్నారు. దీంతో మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్సై నాగ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

మార్టూరు: ఓ వ్యక్తిపై ముగ్గురు కర్రలతో దాడి చేయగా చికిత్స పొందుతూ మృతిచెందిన కేసులో ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు మార్టూరు పట్టణ సీఐ మద్దినేని శేషగిరిరావు తెలిపారు. స్థానిక జనార్దన్ కాలనీకి చెందిన పింద్రాల పోలయ్య (35)ను అదే కాలనీకి చెందిన పింద్రాల శ్రీను, పింద్ర పద్మ, పింద్ర చిన్నలు ఈనెల 12న రాత్రి దాడి చేయడంతో చిలకలూరిపేట అనంతరం గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలయ్య మృతిచెందాడని సీఐ చెప్పారు. దీనిపై అందిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా, ఆ ముగ్గుర్ని మార్టూరు- జొన్నతాళి మార్గంలోని మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలో అరెస్టు చేశామన్నారు. అద్దంకి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచామని చెప్పారు.

యువకుడిపై కత్తితో దాడి

రాచపూడి (మేదరమెట్ల), న్యూస్‌టుడే: చిన్నపాటి వివాదం కారణంగా ఒక యువకుడిపై మరొకరు కత్తితో దాడి చేయడంతో అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలంలో జరిగింది. కొరిశపాడు ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాచపూడి గ్రామానికి చెందిన మేడా మధుసూదనరావు ఆదివారం మద్యం మత్తులో ఇంటి సమీపంలో అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నాడు. అతడిని అదే గ్రామానికి చెందిన ముప్పనేని పూర్ణచంద్రరావు వారించబోవడంతో చిన్నపాటి గొడవ జరిగింది. ఈ విషయాన్ని మధుసూదనరావు చెన్నైలో ఉద్యోగం చేసుకుంటున్న తన కుమారుడు కార్తీక్‌కు తెలిపాడు. దీంతో కార్తీక్ చెన్నై నుంచి వచ్చేశాడు. ఆ సమయంలోనే కత్తిని కొనుగోలు చేశాడు. సోమవారం ఉదయం బజారులో ఉన్న పూర్ణచంద్రరావుతో తండ్రి కొడుకులు వాగ్వాదం పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే కార్తీక్ కత్తితో పూర్ణచంద్రరావు మెడపై మూడుసార్లు నరకడంతో అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సైలు సురేష్‌లు పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, రిటైల్ ధర - 121, చికెన్ విత్‌స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 98, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నప్పుడు విడిపించి టాప్ మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

[illegible] … ✆ 98491 61889.

HEALTH & CARE

మద్యపానం మానేయడం … [illegible]

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F పర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

స్వామి వివేకానంద గ్రూప్, VJA. … ✆ 99590 21122, 99590 31122.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మెగా ★ఆఫర్★ … 9133574455.

JOBS

Wanted DTP Operators with Telugu and English Typing. Contact: Don Bosco Printing Press. Guntur. Ph: 98661 13331, 83309 60969.

చీరాలలో 157 సం|| విశ్వాసం కలిగిన కంపెనీతో కొత్త బ్రాంచ్‌లో పనిచేయుటకు మేనేజర్, … VRS, గృహిణులు, … Loan/ MF/ Tax Cons … Age: 30-65 … 93916 41248, 89851 17531.

గుంటూరు ఆరండల్‌పేట … Cont: 80194 14262.

మా సంస్థ నందు పనిచేయుటకు …

మంగళగిరి NH-16 … Cell: 96854 14786, 96854 97786.

శ్రీ సాయి EM స్కూల్ … ✆: 95059 77315.

గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు 1) Receptionist, 2) ICU Staff, 3) PRO కావలెను. 85199 93945.

డ్యూటీ డాక్టర్స్, రిసెప్షనిస్ట్స్, నర్సెస్ (MPHW), ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను. కొత్త వారికి కూడా ప్రాధాన్యత. అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 94941 31450.

ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ "హోమ్ దాల్" గుంటూరు నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఫుల్ టైమ్ (20000/- నుండి 30000/-), పార్ట్ టైమ్ (10000/- నుండి 15000/-) కావలెను. ✆ 98885 62228 ; 93819 82818.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇంట్లో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు … [illegible]

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

నేడు 'డయల్ యువర్ డీఎం'

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజరు సుఖవాసి సునీల్ కుమార్ తెలిపారు. బస్సు సర్వీసుల గురించి సలహాలు, సూచనలు, ప్రయాణికులకు సమస్యలుంటే 99592 25423 నంబరుకు తెలియజేయాలని కోరారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లెలో ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఏడో వార్డు ఏకలవ్య బొమ్మ సెంటర్, 10వ వార్డు, అరవపల్లిరోడ్డులో విద్యుత్తు సరఫరా ఉండదని డీఈ శ్యాంసుధాకరబాబు తెలిపారు. అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

రేపల్లెలో ఆరు అర్జీలు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. రేపల్లె మండలం మోళ్లగుంటకు చెందిన ధనుంజయరావు అధికంగా వచ్చిన విద్యుత్తు బిల్లు తగ్గించాలని, మోళ్లగుంటలో అక్రమంగా రొయ్యల చెరువులు తీయడంతో పంట భూములకు నష్టం కలుగుతుందని వెంకట ఝాన్సీ లక్ష్మీబాయి, భూమి, రహదారికి సర్వే చేయించి సరిహద్దులు చూపాలని, అక్రమంగా భూమి సాగుచేస్తున్న తన అన్నపై చర్యలు తీసుకోవాలని, పంచాయతీ చెరువు లీజుకు తీసుకుని చేపల సాగు చేసి నష్టపోయానని నేడు అధికారులు వేలం నిర్వహిస్తున్నారని తనకు న్యాయం చేయాలని పలువురు అర్జీలు అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖలకు అర్జీలు పంపామని ఆర్డీవో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? సంగుపాలెం పంచాయతీ పరిధిలోని కురప్పాలెం ప్రధాన రహదారిపై కొద్దిపాటి వర్షానికే గుంతలో మురుగు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-శ్రీనివాసరావు, సంగుపాలెం**

✔ ఇటీవల కురిసిన వర్షానికి రహదారిపై నీరు నిలుస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీనివాసరెడ్డి, గ్రామకార్యదర్శి** – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

? రేపల్లె గరువురోడ్డులో ఓ వీధి దీపం వారం రోజులుగా వెలగడం లేదు. **-రాజేంద్రవర్మ, స్థానికుడు** ✔ వెంటనే విద్యుత్తు దీపం వెలిగేలా చర్యలు చేపడతాం. **-శామ్యూల్, మున్సిపల్ ఏఈ, రేపల్లె** – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

? బీబీఆర్ రోడ్డులో పెరవలి శివారు వద్ద స్థానికంగా సేకరించిన చెత్తను రహదారి అంచులో వేస్తున్నారు. **- స్థానికుడు, పెరవలి**

✔ సంఘటన స్థలాన్ని పరిశీలించి చెత్తను అక్కడ వేయకుండా చూస్తాం. **-శేఖర్, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, వేమూరు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

స్పందనకు వందనం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : భట్టిప్రోలులో రోజురోజుకి ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని ఈనెల 10న 'మేమున్నాం. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎస్సై శివయ్య స్పందించారు. రెండురోజులుగా చావలి సెంటరులో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి రహదారులపై వాహనాలు నిలపకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డుపై వాహనాలు ఉంచితే అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు.

నీటి కొళాయికి మరమ్మతులు

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని నడింపల్లి యాదవులపాలెంలో తాగునీటి కొళాయి నుంచి నీరు వృథాగా పోతుండటంతో అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. ఈనెల 11న మేమున్నాం..మీకు తోడుగా శీర్షికన ప్రచురితమైన సమస్యపై పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి సోమవారం సిబ్బందితో కొళాయి వద్ద మరమ్మతులు చేయించారు. కొళాయికి మూత బిగించారు.

రంగు మారినా పట్టించుకోరా!

కలుషిత జలాల సరఫరాతో జనం ఆందోళన

న్యూస్‌టుడే, రేపల్లెఅర్బన్

రేపల్లె పురపాలక సంఘం ఆధ్వర్యంలో సరఫరా అవుతున్న తాగునీరు రంగుమారి వస్తోంది. పలు వార్డుల్లో నీరు వాసన వస్తుండటంతో తాగేందుకు జనం భయపడుతున్నారు. కలుషిత నీరు తాగితే వ్యాధుల బారిన పడతామేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరురోగాలకు కారణమని వైద్యులు హెచ్చరిస్తున్నా మంచినీటి సరఫరాలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

అడుగంటిన తాగునీటి చెరువు

రంగుమారిన నీరు

అడుగంటిన చెరువు

రేపల్లె పట్టణంలో 28 వార్డుల్లో 60 వేలకు పైగా జనాభా ఉంది. వీరికి నీటిని సరఫరా చేసే పట్టణ శివారులోని చెరువు అడుగంటింది. మీటరు లోతులోనే ఉండటంతో సరఫరా చేస్తున్న నీరు రంగుమారి వాసన వస్తోందని ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. 1, 28 వార్డులకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కలుషిత నీరు సరఫరా అయితే వ్యాధులు చుట్టుముడతాయని పురవాసులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో నీటి సామర్థ్యం తగ్గుతుందని తెలిసినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజాసంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ప్రజలకు అంటువ్యాధులు సోకితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల పైప్‌లైన్‌కు లీకులు పడి నీరు వృథాగా పోతున్నా నిర్లక్ష్యం వీడటం లేదని మండిపడుతున్నారు. మున్సిపాలిటీ వారు సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు ఇష్టపడక కొందరు చేతిపంపులు, మరికొందరు ప్రైవేటు వ్యాపారులు విక్రయిస్తున్న డబ్బా నీటిపై ఆధారపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నీరు నింపుతున్నాం..

పంట కాలువలో నీరు అందుబాటులో ఉంది. మోటార్లతో చెరువును నింపడంతోపాటు నేరుగా తాగునీటి పథకం ప్లాంట్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకున్నాం. ప్లాంట్‌కు చేరిన నీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా అయ్యేలా చూస్తాం. ప్రస్తుతానికి 1, 28 వార్డుల్లో నీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లతో సరఫరా చేయిస్తున్నాం. పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందజేస్తాం.
– శామ్యూల్, మున్సిపల్ ఏఈ, రేపల్లె

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, ఉత్పత్తుల వాడకంపై వినియోగదారులకు అవగాహన కల్పించడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అసోసియేట్ వరదానం అన్నారు. సోమవారం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద మండల ఐసీఆర్పీలు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆమె మండల తహసీల్దారు పద్మావతితో కలిసి సందర్శించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన బ్లాక్‌రైస్, ముడి కందిపప్పు, చిరుధాన్యాల వివరాలను తహసీల్దారు తెలుసుకొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటు చేయటం మంచి నిర్ణయమన్నారు. మండల ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది రాహేల్‌రావు, పలువురు ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ఉత్పత్తుల వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దారు పద్మావతి

నేడు పీ4 గ్రామ సభలు

చెరుకుపల్లి న్యూస్‌టుడే: పీ4 అమలుపై మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. గ్రామసభల్లో బంగారు కుటుంబాల జాబితా ప్రదర్శిస్తారని, వాటిపై అభ్యంతరాలు ఉంటే సరిచేస్తారని చెప్పారు. ఒక్కో మార్గదర్శకుడికి 10 బంగారు కుటుంబాల బాధ్యత అప్పగించడం జరుగుతుందన్నారు.

ఎయిడ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

పేటేరు(రేపల్లె అర్బన్): ఎయిడ్స్ నిర్మూలన సమాజంలోని అందరి బాధ్యత అని వైద్యుడు కిశోర్ అన్నారు. రేపల్లె మండలం పేటేరులో సోమవారం సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 35 మందికి హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బి, సి పరీక్షలు చేశారు. ఐసీటీసీ కౌన్సిలర్ రాజేంద్ర కుమార్, భారతి, ప్రసన్న 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు దేశానికే ఆదర్శం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలులో మానేపల్లివారి చెరువులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అన్న క్యాంటీన్‌కు సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షత వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలోనే భట్టిప్రోలులో క్యాంటీన్ నిర్మాణం చేద్దామనుకున్నా సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిందని, తిరిగి శంకుస్థాపన చేయటం ఆనందంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదవాళ్లకు భోజనం అందించే అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. స్థల దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు సాంబిరెడ్డి, వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, తెదేపా రాష్ట్ర నాయకుడు బుచ్చి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ✦ ఐలవరంలో సుపరిపాలన: మండలంలోని ఐలవరంలో సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి సుపరిపాలన గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఐలవరంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వం కనీసం రహదారులను కూడా అభివృద్ధి చేయలేకపోయిందన్నారు.

భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు, పక్కనే ముమ్మనేని

దేవాదాయ శాఖ కమిషనర్‌కు సమస్యలపై వినతి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: అడంగల్‌లో తమ పేర్లు చేర్చాలని కోరుతూ అర్చక సమాఖ్య ప్రతినిధులు సోమవారం గొల్లపూడిలో దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. అర్చకత్వం చేస్తూ దేవాలయ భూములను అనుభవిస్తున్న తమ పేర్లను అడంగల్‌లో చేర్చకపోవటంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపరిహారం పొందలేక పోతున్నామని, బ్యాంకుల నుంచి పంటరుణాలు, వ్యవసాయశాఖ రాయితీపై అందించే ఎరువులు, విత్తనాలు కూడా పొందలేకపోతున్నామని తెలిపారు. సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పడంపై అర్చక సంఘాల ప్రతినిధులు నారాయణం శరత్‌చంద్ర, చావలి శ్రీధర్‌శర్మ, కాకుమాను సిద్ధాంతి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కమిషనర్ రామచంద్రమోహన్‌కు వినతి పత్రం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

నిజాంపట్నం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్‌ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్ సూచన మేరకు సోమవారం తెదేపా నాయకులు గోకర్ణమఠం, పసుమర్తిపాలెం గ్రామాల్లో ఇంటింటా పర్యటించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రతిఇంటికి సంక్షేమ ఫలాలు అర్హులకు అందాయన్నారు. నాయుడు నరసింహమూర్తి, ఇమ్రాన్‌ఖాన్, నరసింహారావు, తదితరులున్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొమ్మిడి రామకృష్ణ తదితరులు

కరపత్రాల పంపిణీ

నగరం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉల్లిపాలెం గ్రామంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో శ్రీహరి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరాహారదీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, కార్మిక సంఘ నాయకులు ప్రభాకరరావు, రవి, రామచంద్రరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉభయరామేశ్వర క్షేత్రం అభివృద్ధికి నిధులు

కొల్లూరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాలయాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చిలుమూరు ఉభయరామేశ్వర క్షేత్రం అభివృద్ధి కోసం దేవాదాయశాఖ తొలివిడతగా కేటాయించిన రూ.73 లక్షలు మంజూరు పత్రాన్ని సోమవారం ఆ దేవస్థానం ధర్మకర్త దుర్గానాగేశ్వరరావుకు అందజేశారు.

హార్బర్‌లో జెట్టీ వద్ద డ్రెడ్జింగ్ చేయరూ..

నిజాంపట్నం హార్బర్‌ను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగా బోట్లు నిలుపుకొనేందుకు జెట్టి నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. జెట్టి నిర్మాణ పనుల్లో భాగంగా తవ్విన మట్టిని జెట్టి పక్కనే కాలువలో పోశారు. దాన్ని డ్రెడ్జింగ్ చేసి తొలగించాల్సి ఉంది. జెట్టి పనులు పూర్తికాగానే మట్టి తొలగించి బోట్లు నిలుపుకొనేందుకు, రాకపోకలకు అనువుగా చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని మత్స్యకారులు భావించారు. జెట్టి పనులు పూర్తయినా నిర్మాణాల కోసం తీసిన మట్టిని తొలగించకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెడ్జింగ్ చేసి మట్టిని తొలగించాలని అధికారులకు విన్నవిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత ఏఈ మహేష్ వద్ద ప్రస్తావించగా సాధ్యమైనంత త్వరగా డ్రెడ్జింగ్ చేసి మట్టిని తొలగించి మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, నిజాంపట్నం

డ్రెడ్జింగ్ చేయాల్సిన తుంగభద్ర కాలువ

ఎట్టకేలకు కల్వర్టుకు మరమ్మతులు

ఈనాడు కథనాలకు స్పందన

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం కోడూరు-చందోలు మధ్య నాలుగేళ్ల క్రితం పొలాల్లో మురుగుపోయే కల్వర్టు వద్ద తెనాలి డ్రెయిన్ కట్టకు గండి పడి కట్టాంతా డ్రెయిన్‌లోకి జారిపోయింది. రాకపోకలతో పాటు పొలాల్లో మురుగుపోయే వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైకాపా పాలనలో కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఖరీఫ్‌లో రైతులు పొలాలకు వెళ్లిరావాలంటే రెండు కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని మే 7న 'కట్ట జారి నాలుగేళ్లు.. మరమ్మతులకు ఎన్నేళ్లు' శీర్షికన కథనం వచ్చింది. స్పందించిన డీఈ నరేంద్రబాబు కల్వర్టు తూము ఏర్పాటు చేసి గండి పూడ్చారు. సమస్య పరిష్కారం కావటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతుల తర్వాత ఇలా..

చెత్త తొలగింపు

నగరం: ఈనెల 14న ఈనాడులో వచ్చిన 'కొరవడిన వ్యర్థాల నిర్వహణ' వార్తకు ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ స్పందించారు. సచివాలయ పారిశుద్ధ్య కార్మికులతో పాటు మరో పదిమంది కార్మికులను ఏర్పాటు చేసి సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రహదారులు, చెత్తశుద్ధి కేంద్రంలో పేరుకున్న చెత్తను పూర్తిగా తొలగించారు. గ్రామంలో సేకరించిన తడిపొడి చెత్తను వేరు వేరుగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో వేయాలని ఈసందర్భంగా సిబ్బందికి సూచించారు.

స్తంభం వేశారు.. తీగలు మరిశారు..

బావాజీపాలెం నూతన సచివాలయం వద్ద విద్యుత్తు స్తంభం పాతది కావడంతో కొత్తది ఏర్పాటు చేశారు. నెలలు గడిచినా తీగలు మార్చకపోవడంతో వినియోగదారులకు ఎదురుచూపులు తప్పలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతనంగా ఏర్పాటు చేసిన స్తంభానికి తీగలు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను విద్యుత్తు శాఖ డీఈఈ సురేష్‌బాబు వద్ద ప్రస్తావించగా సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నిజాంపట్నం

తీగలు మార్చాల్సిన విద్యుత్తు స్తంభం

బస్టాండ్లలో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక మహిళా కండక్టర్లు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్ఎంయూ నాగమణి, వసుమతి, శ్రీనివాసరావు, జగన్మోహన్, సాంబయ్య తెలిపారు. తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ఎన్ఎంయూ నేతలు మాట్లాడుతూ బాపట్ల ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పెదనందిపాడు బస్టాండ్‌లో మహిళా కండక్టర్లకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. వేగేశన స్పందిస్తూ ఈ నెల 25న రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బాపట్ల పర్యటనకు వస్తున్నారని ఆర్టీసీ బస్టాండ్, డిపోలో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఎమ్మెల్యే నరేంద్రవర్మకు సమస్యలు వివరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

విశ్రాంత ఉపాధ్యాయుడికి సేవారత్న అవార్డు

నగరం, న్యూస్‌టుడే: మనం ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా నగరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యల్లాప్రగడ సీతాపతి జాతీయ సేవారత్న 2025 అవార్డును హైదరాబాద్‌లో ఇటీవల అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా హిందూధర్మ ప్రచారక్‌గా ఆయన చేస్తున్న సేవలు గుర్తించి సంస్థ ప్రతినిధులు అవార్డు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సత్యనారాయణ, జంజనం హేమశంకరరావు, మురళీకృష్ణ తదితరులు అభినందించారు.

హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న యల్లాప్రగడ సీతాపతి

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

వేమూరు, అమృతలూరు, కొల్లూరు, న్యూస్‌టుడే: చుండూరు మండలం మోదుకూరుకు చెందిన తన్నీరు నాగలక్ష్మి, కారుమూరువారిపాలేనికి చెందిన వజ్రాల వెంకటరెడ్డి, అమృతలూరుకు చెందిన వెలవోలు శ్రీధర్‌బాబు, తాతా భానువెంకటప్రసాద్, వి.జయశ్రీ, పెదపూడికి చెందిన షేక్ నన్నుషా, వేమూరు మండలం బూతమల్లికి చెందిన రావులపాటి విజయలక్ష్మి, కొల్లూరు మండలం పెసర్లంకకు చెందిన తోట శివపార్వతి, కిష్కిందపాలేనికి చెందిన కొల్లి రంగారావు, క్రాపకు చెందిన తరణి నాగరాణి, కొల్లూరుకు చెందిన నూకల వెంకటేశ్వరరెడ్డి, గరికపాటి వాణికుమారి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ప్రైవేటు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వీరంతా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా అందరికీ కలిపి రూ.5.22లక్షల సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే ఆనందబాబు గుంటూరులోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆనందబాబు

నూకాలమ్మకు వెండి కిరీటం వితరణ

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): మండలంలోని గుళపల్లి గ్రామదేవత శ్రీనూకాలమ్మ అమ్మవారికి దాతలు వెండి కిరీటం వితరణ చేశారు. గ్రామానికి చెందిన మువ్వల శ్రీనివాసరావు, ఏసుబాబు, పోతురాజు, సాంబశిరావు రూ.1.10లక్షల వెండి కిరీటాన్ని సమర్పించారు. సోమవారం పూజల అనంతరం అమ్మవారికి కిరీటం అలంకరించారు. భాజపా నేత పొన్నపల్లి సత్యనారాయణ, అర్చకస్వామి జొన్నలగడ్డ దివాకరశర్మ పాల్గొన్నారు. ఈవో నరసింహామూర్తి పర్యవేక్షించారు.

అమ్మవారు

ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి

బాపట్ల: మండల పరిధి 216 జాతీయ రహదారి బైపాస్‌లో మద్దిబోయినవారిపాలెం వద్ద రోడ్డు దాటుతున్న ఆసోదివారిపాలేనికి చెందిన ఎలక్ట్రీషియన్ దొంతెన ఏడుకొండలరెడ్డి(43)ని గుర్తు తెలియని ద్విచక్ర వాహనం సోమవారం రాత్రి ఢీకొంది. ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీకి తరలించి బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న పొన్నూరుకు చెందిన విద్యార్థి సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తోటి విద్యార్థులు వెంటనే పురుగుమందు డబ్బా లాగేసి దూరంగా విసిరేశారు. సదరు విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందింది. కుటుంబ కలహాల వల్లే విద్యార్థి బలవన్మరణానికి పాల్పడటానికి యత్నించినట్లు తెలిసింది.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం

బాపట్ల, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదంలో సమ్మెటవారిపాలేనికి చెందిన శ్రీనివాసరెడ్డి ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయి నిరాశ్రయులు కావటం బాధాకరమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెంలో శ్రీనివాసరెడ్డి గృహంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2 లక్షలకు పైగా నష్టపోయాడు. బాధిత కుటుంబాన్ని వేగేశన సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆదుకుంటామన్నారు.

రాత పుస్తకాలు పంపిణీ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: వెల్లటూరులోని మండల పరిషత్తు పాఠశాలలో 52 మంది విద్యార్థులకు భట్టిప్రోలుకు చెందిన మిఠాయి దుకాణం యజమాని గాత్రం నారాయణ రాత పుస్తకాలు అందించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఎంఈవో ఎన్.దేవరాజ్, సర్పంచి బి.రవి, ఉపాధ్యాయులు వి.సురేష్‌కుమార్, పున్నయ్య, కృష్ణప్రియ, లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు బల్లల వితరణ

భట్టిప్రోలు: పెసర్లంక పల్లెపాలెంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు అంబేడ్కర్ యూత్, గ్రామ పెద్దల సహకారంతో రూ.50 వేల బల్లలు, రూ.17వేల స్మార్ట్ టీవీని ఎంఈవో నీలం దేవరాజ్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు కూర్చోవడానికి దాతలు ఇచ్చిన బల్లలు ఉపయోగపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పథకం పూర్తి కాదు.. సాగు సాగదు

న్యూస్‌టుడే, నగరం

పమిడిమర్రులోని భట్టిప్రోలు డ్రెయిన్ సమీపంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం పడకేసింది. 2017లో రూ.8.68 కోట్లతో 1130 ఎకరాలకు సాగునీరు అందించేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం పథకానికి నిధులు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు ప్రారంభించి ఏడాదిలో దాదాపు 75 శాతం పనులు పూర్తి చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం పథక నిర్మాణం పనులు విస్మరించింది. దీంతో ఆయకట్టు రైతులు ఏళ్లుగా సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పమిడిమర్రు, కొలగానివారిపాలెం, వెనిగళ్లవారిపాలెం, చిలకాలవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు నిరుడు రూ.లక్షలు ఖర్చు చేసి బోర్లు వేసి సాగు చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా పథకం అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంప్‌హౌస్ నిర్మించాల్సిన ప్రాంతం

దశాబ్దాలుగా ఇబ్బందులు

బీడుబారిన పొలం వద్ద రైతు శ్రీను

ఆయకట్టు శివారు ప్రాంతం కావడంతో ఏటా సాగు జాప్యం అవుతోంది. సీజన్ చివరిలో నాటడం వల్ల భారీ వర్షాలకు ఏటా పంటలు ముంపుబారిన పడుతున్నాయి. ప్రకృతి విపత్తులతో ఏటా పాట్లు తప్పడం లేదు. గత సంవత్సరం మూడుపర్యాయాలు నాట్లు వేయాల్సి వచ్చింది. ఎత్తిపోతల పథకం పూర్తయితే సాగునీటి కష్టాల నుంచి ఒడ్డున పడతాం. **- శ్రీను, పమిడిమర్రు**

పనులు ప్రారంభింపజేసేలా కృషి చేస్తాం

నిలిచిన ఎత్తిపోతల పథకం పనుల ప్రారంభింపజేసేలా గుత్తేదారునితో మాట్లాడుతున్నాం. మిగిలిన పంపుహౌస్ నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ ఇతర చిన్న చిన్న పనులు పూర్తి చేసి త్వరలో రైతులకు సాగు నీరందిస్తాం. **- భాగ్యలక్ష్మి, ఈఈ**

బహిరంగ వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రేపల్లె కోర్టులో
ఇ.పి.నెం.1/2023 ఇన్ ఓ.యస్.నెం.240/2014

బిట్వీన్: మన్నవ శ్రీనివాసరావు ... డిక్రీ హోల్డర్

ఎదిరి

వడ్లమూడి ప్రదీప్ కుమార్ ... జడ్జిమెంట్ డెటార్

పై నెంబర్ డిక్రీ హోల్డర్ తన డిక్రీ బాకీ వసూలు నిమిత్తమై ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట ది.04-08-2025వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. కావున ఆసక్తి గల వారు పై కోర్టు వారి ఎదుట హాజరై సదరు బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: బాపట్ల డిస్ట్రిక్టు - చెరుకుపల్లి సబ్.డిస్ట్రిక్టు - చెరుకుపల్లి మండలం - ఆరుంబాక గ్రామము - డి.నెం.14-3రు య.1.82ట్లు మింజుమలె య.0.74 ట్లున్నూ మరియు డి.నెం.14-4రు య.1.87ట్లు మింజుమలె య.1.26ట్లున్నూ వెరశి రెండు నెంబర్లు తాలూకు ఏక ప్రదేశముగా వున్న య.2.00ట్లు శేరీ మాగాణి భూమికి **హద్దులు: తూర్పు:** దాసరి గురునాథం గారి భూమి హద్దు, **పడమర:** వడ్లమూడి శారద గారి వాటాకు రాబడి భూమి కొంత, పంట బోదె కాలువ కొంత, **ఉత్తరం:** సోమరౌతు సుబ్బారావు గారి భూమి హద్దు, **దక్షిణం:** తాతా మునిస్వామి గారి భూమి హద్దు. పై తెలిపిన హద్దుల మధ్య య.2.00ట్లు (రెండు ఎకరములు) లేక హె.0.810ర్లు శేరీ మాగాణి భూమి మాత్రము.

డిహెచ్‌ఆర్ విలువ రూ.12,00,000/-
అమీనా విలువ రూ.25,00,000/-
SRO విలువ: రూ.30,00,000/ (కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం తేదీ: 04-08-2025
తదుపరి విచారణ తేదీ: 11-08-2025

సం/- వట్టికూటి లీలా ప్రసాద్, డిక్రీ హోల్డరు, అడ్వకేట్, పొన్నూరు. 91774 43303.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

ఎన్నికల్లో బీఎల్వోలే కీలకం

అద్దంకి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో బీఎల్వోలే కీలకంగా వ్యవహరించాలని ఓటర్ల నమోదు అధికారి సీహెచ్. విజయ జ్యోతికుమారి అన్నారు. పురపాలక సమావేశ మందిరంలో అద్దంకి మండలంలోని బీఎల్వోలతో ఓటరు జాబితాపై అవగాహన నిమిత్తం ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. విజయజ్యోతికుమారి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఒకే ఇంటి నంబరుపై 10మంది కంటే ఎక్కువ ఓట్లు ఉండటం వివాదమైందన్నారు. ఈ నేపథ్యంలో బీఎల్వోలే ఇంటి నంబరు మంజూరు చేసేలా ఉండాలన్నారు. సాధ్యమైనంత వరకు బీఎల్వోలు ఆ పోలింగ్ బూత్‌లో ఓటరుగా ఉండటం మంచిదన్నారు. కనీసం నియోజకవర్గంలోనైనా ఓటరుగా ఉండాలన్నారు. అనంతరం వివిధ రకాల ప్రశ్నలు సంధించి, సమాధానాలు రప్పించారు. కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, వీఆర్వో దామా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? పమిడిపాడు పశువైద్యశాల సమీపంలోని మలుపులో రోడ్డుపై ఇసుక పోసి ఉంది. రాత్రి సమయంలో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇసుకను తొలగించాలి. **- స్థానికులు** ✔ వెంటనే రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, పమిడిపాడు – న్యూస్‌టుడే, మేదరమెట్ల**

దీపాలు వెలిగాయ్

స్పందనకు వందనం

చినగంజాం, న్యూస్‌టుడే: పెదగంజాం పరిధిలోని ఏటిమొగలో వీధి దీపాలు నాలుగు రోజులుగా వెలగడం లేదని స్థానికులు సమస్యను ఈ నెల 13న 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి కె.కృపారావు స్పందించారు. పంచాయతీ ఒప్పంద కార్మికుడిని సోమవారం పంపించి, వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కల.. నెరవేరుతున్న వేళ

చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే

అద్దంకి నియోజకవర్గంలో జల్‌జీవన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఇళ్లకు కుళాయిల ద్వారా నీరందుతుండగా.. త్వరలో మిగిలిన పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

బావులు, చేతిపంపుల నీరే అధిక గ్రామాల్లో ప్రజలకు ఆధారం. దీంతో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వేసవి వస్తే పరిస్థితి దారుణం. వైకాపా పాలనలో జలజీవన్ పనులు చాలా నెమ్మదిగా సాగాయి. గుత్తేదారులకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు దుర్వినియోగమయ్యాయి. కోట్లు వెచ్చించినా గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించలేకపోయారు. పైపులు వేసిన గ్రామాల్లో కుళాయిలు బిగించలేదు. కొన్ని గ్రామాల్లో బిగించినా తాగునీరు సరఫరా చేసే వ్యవస్థ లేకపోవడంతో గుత్తేదారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.

వేగంగా పనులు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్‌జీవన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అధికారులు, గుత్తేదారులు కలిసి ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో అయిదు మండలాల్లో గ్రామాల్లో రూ.57.47 కోట్ల నిధులతో 17000 కుళాయిలు ఏర్పాటు చేసేలా పనులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో ఇంటికే నీరు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. దాదాపుగా 45 శాతం పనులు పూర్తయినట్లు వెల్లడించారు.

ఏర్పాటు చేస్తున్న కుళాయి

మండలం	గ్రామాలు	నిధులు (రూ.కోట్లలో)	మంజూరైన కుళాయిలు
అద్దంకి	40	18.70	3948
బల్లికురవ	21	8.57	2920
జె.పంగులూరు	08	4.50	965
కొరిశపాడు	15	11.16	1755
సంతమాగులూరు	26	14.52	7412

త్వరితగతిన పూర్తి చేస్తాం

నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో పైపులైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపల ఇంటింటా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. ఆ లక్ష్యంతో పనులు చేస్తున్నాం. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా పనులు జరుగుతున్నాయి.

– శ్రీనివాసులు, డీఈ, అద్దంకి

ప్రణాళికాబద్ధ కృషితో ఉన్నత భవిత

చీరాల, న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో కళాశాల ఎంతో కీలకమైనదని, ఇక్కడ ప్రవేశించినప్పటి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా కష్టపడితే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని వీఆర్ఎస్, వైఆర్ఎన్ కళాశాల అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకుమారి, ఉమాశంకర్, జగదీష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రావినూతల బ్రాంచ్, గాంధీ రోడ్డు, రావినూతల గ్రామం మరియు పోస్టు, కొరిసపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 523213

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేదీ & సమయం: 30.07.2025, ఉ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు

డిమాండ్ నోటీసు తేదీ: 13.12.2021 స్వాధీనత నోటీసు తేదీ: 19.02.2022

రిజర్వు ధర: రూ. 54,02,000/- ధరావత్తు: రూ. 5,40,200/- బిడ్ పెంపుదల: రూ. 54,020/-

https://baanknet.com www.unionbankofindia.co.in

తేదీ: 07.07.2025 స్థలం: రావినూతల

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావినూతల బ్రాంచ్

నిండుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఈనాడు కథనానికి స్పందన

చినగంజాం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తోంది. దీనికి మండలంలోని సుమారు 20కి పైగా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలి. కొందరు హాజరుకాకపోవడంతో ప్రజలు సరైన రీతిలో వేదికకు రావడం లేదు. దీనిపై ఈ నెల 8న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. స్పందన తక్కువేగా?' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. సోమవారం జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్ ప్రభాకరరావుతో సహా జి.సుబ్బారావు (ఏపీఎం), లక్ష్మీదేవి (ఏపీవో), వాణిశ్రీ (అంగన్‌వాడీ సూపర్‌వైజర్), ఆర్.చంద్రశేఖర్ (ఏవో), అబ్దుల్ నజీర్, శ్రీనివాస్(ఏఈ ఇరిగేషన్), పి.గణనారాయణ (ఏఈ, ట్రాన్స్‌కో), పి.బసవరాణి (ఆర్‌డబ్ల్యూఎస్), రాజశేఖర్ (ఏఈ, హౌసింగ్), మండల పరిషత్ ఈవోఆర్డీ, డ్రైనేజి ఏఈలు హాజరయ్యారు. సంతరావూరుకు చెందిన ఓ మహిళ ఇంటి పొజిషన్ పత్రం కోసం అర్జీ ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు.

మధ్యవర్తిత్వంతో మొండి కేసుల పరిష్కారం

రహదారిపై ప్రదర్శనగా వెళుతున్న న్యాయమూర్తులు న్యాయవాదులు, విద్యార్థులు

అద్దంకి, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా మొండికేసులు సైతం సత్వరమే పరిష్కరించుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్/సీనియర్ సివిల్‌జడ్జి డి.నాగవెంకటలక్ష్మి అన్నారు. అద్దంకిలో సోమవారం మధ్యవర్తిత్వ వారోత్సవాల్లో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. కోర్టు భవనాల సముదాయం నుంచి బంగ్లా రోడ్డు, పాత బస్టాండ్, పురపాలక కార్యాలయం మీదుగా తిరిగి కోర్టు వద్దకు ప్రదర్శన సాగింది. స్థానికులనుద్దేశించి న్యాయమూర్తి మాట్లాడారు. లోక్ అదాలత్ మాదిరి మధ్యవర్తిత్వం నిర్వహించేందుకు, కేసులు రాజీ చేసేందుకు అద్దంకి న్యాయస్థానం వద్ద నలుగురు శిక్షణ పొందిన న్యాయవాదుల్ని నియమించినట్లు చెప్పారు. మహమ్మద్ రఫీ, పంచాగ్నుల ఉదయభాస్కర్, మారాత శ్రీనివాసరావు, కరి రామకృష్ణారావులు దీనికోసం పని చేస్తున్నారన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, న్యాయవాదులు, బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

కర్పూరపు రమేష్‌బాబు, S/o కృష్ణమూర్తి, పాపరాజుతోట, చీరాల అను నేను నాకు సంబంధించిన గుంటూరు SRO లో రిజిస్టారు కాబడిన డాక్యుమెంట్స్ 1317/1991, 8917/2004, 3894/2006 (4) ఒరిజినల్స్ మా ఇంటి నుండి Xerox కోసం సెంటర్‌కి వెళ్తున్న క్రమంలో పోయినది దొరికినవారు సంప్రదించగలరు.

99897 92379

గ్రామీణాభివృద్ధిపై అవగాహన సదస్సు

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక బీవీఆర్ రోటరీ భవనంలో సమగ్ర గ్రామీణాభివృద్ధిపై రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఆదివారం రాత్రి నిర్వహించారు. విజయలక్ష్మి ట్రస్ట్ ఛైర్మన్ వేగిరాజు శివవర్మ పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రాతాళ్లమెరకను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన విధానాలను, తమ గ్రామాభివృద్ధికి చేపట్టిన పనులను వీడియోల రూపంలో ప్రదర్శించారు. నాగులపాలేనికి చెందిన తన మిత్రుడు కొల్లా సుబ్బారావు ఆహ్వానం మేరకు గ్రామాభివృద్ధిపై సదస్సు నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. టి.కృష్ణమోహన్, ఎన్.శ్రీనివాసరావు, కె.ఆంజనేయులు, బి.రాజగోపాల్‌రెడ్డి, ఎన్.సుబ్బారావు, డి.శేషుబాబు, చాగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలి

అద్దంకి, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ నేత తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం రెండోరోజుకు చేరింది. పురపాలక కార్యాలయం నుంచి ప్రదర్శనగా పాత బస్టాండ్ వరకు వెళ్లి వచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెనుబాక ఆదాం, ఇంజినీరింగ్ విభాగం తరఫున జాన్, ఉసురుపాటి శామ్యూల్, రాజేశ్వరి, జాషువా, తోట వెంకటేశ్వర్లు, కరీం తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No. 6/22 In OS 36/18

Between: షేక్ ఖరీముల్లా ... DHR

and

షేక్ అల్లాబీ ... JDR

ఈ దిగువ షెడ్యూలు దాఖలాస్తిని పై కోర్టు వారి ఎదుట తేది: 30-7-2025న ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం గం॥ 5.00 ని॥ల మధ్య బహిరంగ వేలం జరుపబడును. వేలము పాటలో పాల్గొనుటకు ఆసక్తి గల పాటదారులు పై కోర్టు వారు నిర్దేశించిన వేలం షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా) - నర్సరావుపేట జిల్లా రిజిస్ట్రేషను - నర్సరావుపేట సబ్ రిజిస్ట్రేషన్ - సంతమాగులూరు (మం) సంతమాగులూరు గ్రామ పంచాయితీ - సంతమాగులూరు గ్రామ డి.నెం: 707/3ఎ లో విస్తీర్ణం A.c.3-79 సెంట్లులో A.c.1-75 సెంట్లు భూమి మాత్రమే. **తూర్పు:** దాసరి అంజయ్య మరియు తొలుచూరి వెంకటేశ్వర్లు భూమి, **దక్షిణం:** జమ్ముల నాగమ్మ భూమి, **పడమర:** తేలుకుట్ల శేషయ్య భూమి, **ఉత్తరం:** కోమటిగుంట చిన్న చెన్నయ్య భూమి,

DHR విలువ: Rs. 5,00,000/-, **అమినా విలువ:** Rs.19,25,000/-

వేలము తేది: 30.7.2025

పర్‌దర్ హియరింగ్: 6.8.2025

వేలము సమయము: ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం గం॥ 5.00 ని॥ మధ్య

వేలము జరుపు స్థలము: అద్దంకి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో

అద్దంకి
తేది: 14.7.25

యడవల్లి శ్రీనివాసరావు, B.Com, LLb
DHR తరపు అడ్వకేట్, అద్దంకి, 9441692970

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పాలన

చీరాల, న్యూస్‌టుడే: సంక్షేమం పేరుతో జగన్ రాష్ట్రంలో సంక్షోభం సృష్టించారని, బటన్ నొక్కి డబ్బుల్లేకుండా ప్రజలను మభ్యపెట్టారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దుయ్యబట్టారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా సోమవారం నాయకులు 4వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, వార్డు కౌన్సిలర్ జగదీష్, కమిషనర్ రషీద్, కొమ్మనబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

కొండమట్టి తవ్వకాల పరిశీలన

అద్దంకి: ధర్మవరం కొండమట్టి తవ్వకాలను చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ అదనపు సంచాలకులు రామచంద్రరావుతో కూడిన బృందం సోమవారం పరిశీలన చేసింది. అనుమతికి మించి తవ్వకాలు చేస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదు అందిన నేపథ్యంలో పరిశీలించినట్లు ఆర్డీవో చెప్పారు

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం

అద్దంకి, మార్టూరు, న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గంలోని 16 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 31 సంఘాలకు గతంలో తొమ్మిదింటికి కమిటీలు నియమించగా ప్రస్తుతం 16 సంఘాలకు నియమించారు. అద్దంకి మండల ధర్మవరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా చాగంటి రాజేంద్రప్రసాద్‌చౌదరి, మోదేపల్లి ఛైర్‌పర్సన్‌గా నర్రా వీరయ్య, నాగులపాడు సహకార సంఘానికి యేనుగంటి వెంకట్రామయ్య(బాబు), బల్లికురవకు గొట్టిపాటి లక్ష్మయ్య, కొత్తూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా మామిళ్లపల్లి ప్రవీణ్, కూకట్లపల్లికి పాలడుగు సుబ్బారావు, వైదనకు గాలం రామకృష్ణ, కొండమంజులూరుకు బత్తుల వెంకట్రావు, కోటపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా రావుల శింగరకొండ, చందలూరుకు బెల్లంకొండ శ్రీధర్ బాబు, ధైవాలరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా మద్దినేని రాఘవస్వామి, పమిడిపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా జాగర్లమూడి జయకృష్ణ, సోమవరప్పాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా ముప్పంగి వెంకటసుబ్బారెడ్డి, ఏల్చూరుకు నాదదాసు శ్రీనుబాబు, సజ్జాపురానికి గంధ్రు అంకమ్మరావు, వెల్లలచెరువుకు బెల్లంకొండ ఏడుకొండలు నియమితులయ్యారు. పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలం బొల్లాపల్లి, ద్రోణాదుల, దగ్గుబాడు సహకార సంఘం ఛైర్‌పర్సన్‌లుగా గొట్టిపాటి నరసింహారావు, ముప్పరాజు ఆంజనేయులు, చుండి చిన మస్తాన్‌రావును నియమించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు,
ఆంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్, 2వ లేన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

కందుకూరు మెయిన్ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్: శ్రీ పెద్దిరెడ్డి సురేష్ రెడ్డి ఫోన్ నెం. 9159916991

1. డిమాండ్ నోటీసు తేది: 15.12.2022 స్వాధీనత నోటీసు తేది: 28.02.2023
2. డిమాండ్ నోటీసు తేది: 09.05.2022 స్వాధీనత నోటీసు తేది: 28.02.2023
3. డిమాండ్ నోటీసు తేది: 01.08.2018 స్వాధీనత నోటీసు తేది: 25.10.2018
4. డిమాండ్ నోటీసు తేది: 04.06.2018 స్వాధీనత నోటీసు తేది: 06.08.2018

సింగరాయకొండ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్: శ్రీ శాంతను మహకుడ్ ఫోన్ నెం. 9853143606

5. డిమాండ్ నోటీసు తేది: 08.01.2018 స్వాధీనత నోటీసు తేది: 17.04.2018
6. డిమాండ్ నోటీసు తేది: 04.07.2019 స్వాధీనత నోటీసు తేది: 19.12.2019
7. డిమాండ్ నోటీసు తేది: 30.09.2023 స్వాధీనత నోటీసు తేది: 12.01.2024
8. డిమాండ్ నోటీసు తేది: 03.10.2024 స్వాధీనత నోటీసు తేది: 01.01.2025

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చీరాల బ్రాంచ్ (01009), పూటుకూరి బిల్డింగ్, దర్బార్ రోడ్, చీరాల, బాపట్ల జిల్లా, పిన్ కోడ్: 523155, ఇమెయిల్: Sbi.01009@Sbi.co.in

(రూల్-8(1) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

NPA: MC - CC Loan Account Number: 35426223129, MC - HOME Loan Account Number: 37014505243, MC – SBI SURAKSHA Account Number: 37014610757

తేది : 09.07.2025 ప్రదేశం: చీరాల

సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అటీ ఇటీ

సెయింట్ ఆన్స్‌లో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు అనుమతి

వేటపాలెం, న్యూస్‌టుడే: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు జేఎన్‌టీయూ కాకినాడ నుంచి అనుమతి లభించినట్లు కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ ఇంజినీరింగ్ విభాగాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానాచార్యుడు డాక్టరు కె.జగదీష్‌బాబు చెప్పారు.

హెపటైటిస్-బి, సి పరీక్షలు

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మార్టూరు పరిధిలోని గొట్టిపాటి నగర్, సీతాదేవి కాలనీలో హెపటైటిస్-బి, సి పరీక్షలను చేరువ చేసినట్లు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పీడీ బీవీ.సాగర్ తెలిపారు. సోమవారం కాలనీ ప్రజలకు పలు వ్యాధులపై అవగాహన కల్పించి రక్తన మూనాలు సేకరించారు. ఏపీ నియంత్రణ సంస్థ, దిశ, హెచ్ఐవీ, ఎయిడ్స్ సంస్థల నేతృత్వంలో పేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

ఇంకొల్లు, వేటపాలెం, న్యూస్‌టుడే: స్థానిక భవిత విద్యా వనరుల కేంద్రంలో దివ్యాంగులకు సోమవారం ఉపకరణాలు అందజేశారు. ఇటీవల దివ్యాంగుల అవసరాల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వై.దీక్షకు చక్రాల కుర్చీ, వరుణ్‌కు రొలేటర్, షేక్ ఆఫ్రా, వై.అదసలకు వినికిడి పరికరాలను ఎంఈవో శ్రీనివాసరావు అందజేశారు.

◆ వేటపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు రెండు ట్రైసైకిళ్లను ఎంఈవోలు సుబ్బయ్య, పురుషోత్తం అందజేశారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం తమ్మవరంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు.

సీఐ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

పర్చూరు: మార్టూరు రూరల్ సర్కిల్ సీఐగా జి.లక్ష్మీశ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ చెప్పారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధుల సంయుక్త పర్యవేక్షణలో చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.శాంతిబాయి కోరారు. మార్టూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు.

రీ సర్వే సజావుగా నిర్వహించాలి

పర్చూరు: రీ సర్వేను సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో రీ సర్వేపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

చెరువు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

బాపట్ల: మార్టూరు మండలం ద్రోణాదులలో రజకుల చెరువును ఆక్రమిస్తున్నారని పీజీఆర్ఎస్‌లో అధికారులకు రజక సంఘ నాయకులు సాంబయ్య, వాసు, వెంకట్రావు, కొండయ్య ఫిర్యాదు చేశారు. చెరువు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డీపీవో ప్రభాకరరావును కోరారు. ఇంకొల్లులో నాగుల చెరువులో మురుగు కలుస్తూ తాగునీరు కలుషితమవుతోందని అధికారులకు కందిమళ్ల శివన్నారాయణ సోమవారం ఫిర్యాదు చేశారు.

గృహ నిర్మాణ బకాయిలు చెల్లించాలి

సంతమాగులూరు: గతంలో తెదేపా హయాంలో నిర్మించిన ప్రభుత్వ గృహాల బకాయి బిల్లులను లబ్ధిదారులకు చెల్లించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని ఎంపీడీవో జ్యోతిర్మయికి అందించారు.

(c) eenadu

కుంకీలను చూసేందుకు సందర్శకుల తాకిడి

పెద్దసంఖ్యలో సందర్శకులు

పలమనేరు, న్యూస్‌టుడే: ముసలిమడుగు కుంకీ ఏనుగుల క్యాంపు వద్ద సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సందర్శకులను ఆదివారాలు మాత్రమే అనుమతిస్తుండగా.. అప్పుడప్పుడు మినహా రోజువారీగానూ సాయంత్రం సమయాల్లో పిల్లలు, మహిళలు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం ఉచితం కాగా.. త్వరలో టికెట్ పెట్టే యోచనలో ఉన్నారు. ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపారు. క్యాంటీన్ కూడా ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది. చిన్న పిల్లలు పెద్దసంఖ్యలో వస్తున్నందున వారికి అక్కడ ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. క్యాంపులో ఇప్పుడు ఆరు కుంకీలు ఉన్నాయి. టికెట్ కౌంటర్ నిర్మించామని టికెట్ల విక్రయానికి ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉందని ఎఫ్‌ఆర్‌ఓ నారాయణ తెలిపారు. ఆపై సందర్శన వేళలు నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

ఎక్స్‌రేనా.. రేపు రండి

రుయా ఓపీ విభాగం సోమవారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన రోగులతో కిటకిటలాడింది. ఇక్కడి ప్రధాన ద్వారం పక్కన ఉన్న డిజిటల్ రేడియోగ్రఫీ గది వద్ద డిజిటల్ ఎక్స్‌రే కోసం రోగులు బారులు తీరి కనిపించారు. మధ్యాహ్నం ఒంటి గంటయినా రద్దీ తగ్గకపోవడంతో 1:15 నిమిషాల సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది మిషన్ పని చేయడం లేదు.. రేపు ఉదయం 9 గంటలకు రండి అని చెప్పడంతో చేసేది లేక రోగులు ఉసూరుమంటూ వెళ్లారు. సిబ్బంది తీరుపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. - ఈనాడు, తిరుపతి

గోవిందా.. బిడ్డల చదువులెట్లా?

తితిదే కళాశాలల్లో ప్రవేశాలు దొరక్క పాట్లు

ఎస్వీ జూనియర్ కళాశాల వద్ద వేచివున్న విద్యార్థులు

తిరుపతి (ఎస్వీయూ, మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: బిడ్డల చదువుల కోసం నిరుపేద తల్లిదండ్రులు తితిదే జూనియర్ కళాశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నామమాత్రపు రుసుముతో నాణ్యమైన విద్యనందించడంతోపాటు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తుండటంతో ఈ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. ప్రైవేటు కళాశాలలకంటే అధికంగా మార్కులు సాధిస్తుండటంతో రాయలసీమ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు దేవుడా నీవే దిక్కంటూ వేడుకుంటున్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకుగాను ఎస్వీ జూనియర్ కళాశాలలో 792, పద్మావతి కళాశాలలో 968 సీట్లు ఉండగా ఈ విద్యా సంవత్సరం 15,000 దరఖాస్తులు వచ్చాయి. జూన్ 9-30 వరకు మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. ప్రస్తుతం 15 రోజులు కావస్తున్నా స్పాట్ అడ్మిషన్ల అంశం తేల్చకపోవడంతో తల్లిదండ్రులు ఆయా కళాశాలల వద్దకు చేరుకుని వాపోతున్నారు. 500కు పైగా మార్కులు సాధించినప్పటికీ కౌన్సెలింగ్‌లో తమ కుమార్తెకు సీటు రాలేదంటూ కళాశాలల వద్దకు చేరుకుంటున్నారు. మిగిలిన సీట్లకు స్పాట్ ప్రవేశాలు నిర్వహించి కేటాయించాలని ప్రాధేయపడుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి సిఫారసు లేఖలు తెస్తున్నారు. దరఖాస్తుల సమయంలో చేసిన పొరపాట్లతో కొందరికి సీట్లు వచ్చి ఉండవని, త్వరలో స్పాట్ ప్రవేశాల తేదీలు ప్రకటించి న్యాయం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

'యాప్' సోపాలతో అందని పోషకాహారం

- పంపిణీకి అంగన్‌వాడీల ఇక్కట్లు
- సర్వర్ మొరాయింపుతో తప్పని తిప్పలు

- యాదమరి మండలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ముఖ ఆధారిత గుర్తింపు సరిపోక ఓ గర్భిణి, బాలింతకు ఈ నెల పోషకాహార సరకులు సోమవారం వరకూ అందలేదు.
- జీడీనెల్లూరు మండలం ముక్కలత్తూరు పంచాయతీలోని ఓ కేంద్రంలో రెండ్రోజులపాటు సర్వర్ పని చేయకపోవడంతో ఈ నెల 14 వరకూ 75 శాతం మాత్రమే పోషకాహార పంపిణీ చేశారు.
- పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం వరకూ పోషకాహార పంపిణీ పూర్తి కాలేదు. ఒక్కో కేంద్రంలో ఒక్కో సమస్య ఉన్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొంటున్నారు. సర్వర్ సమస్య అన్ని చోట్లా ఉన్నా, ముఖ ఆధారిత గుర్తింపు సరిపోలక పోవడం, కొన్ని కేంద్రాల్లో సరకులు ఉన్నా లేనట్లు యాప్‌లో చూపుతుండటంతో పలువురికి పంపిణీ సాధ్యం కాలేదు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీకి సాంకేతిక సమస్య తలెత్తుతోంది. గర్భిణులు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లల తల్లులకు ప్రభుత్వం ఇంటి వద్దకే పోషకాహారాన్ని అందిస్తోంది. పారదర్శకత కోసం లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపును (ఫేషియల్ రికగ్నేషన్) ప్రవేశపెట్టింది. బాల సంజీవని, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో నమోదు తర్వాతే సరకులు అందించాలి. సర్వర్ సమస్య కారణంగా లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి.

ఉమ్మడి జిల్లాలో 4,768 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ప్రతి నెలా 47 వేల మంది పోషకాహారం ఇంటికి తీసుకెళ్తున్నారు. సరకుల పంపిణీకి కేంద్ర ప్రభుత్వం పోషణ ట్రాకర్ యాప్‌ను, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌ను తెచ్చాయి.. ఇదివరకు లబ్ధిదారులు ముఖ ఆధారిత గుర్తింపు నమోదు కాకున్నా, రిజిస్టర్‌లో సంతకం తీసుకుని వస్తువులు ఇచ్చేవారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల నుంచి ముఖ ఆధారిత గుర్తింపును తప్పనిసరి చేసింది. ఇందులో సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిదారులు గంటల కొద్దీ కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది.

వస్తువులు లేనట్లు చూపడంతో..

బాల సంజీవని యాప్‌లో పోషకాహారం వివరాలు నమోదు చేసి, లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు నమోదుకు యత్నిస్తే ప్లీజ్ కాంటాక్ట్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అని చూపుతోంది. కొన్నిచోట్ల సరకులు నిల్వ ఉన్నా లేవని చూపడంతో లబ్ధిదారులకు సరకులు ఉన్నా ఇవ్వడానికి వీలు కావడం లేదు. రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకున్న ముఖ ఆధారిత గుర్తింపు వివరాలు, వారికి సరకులు అందించేటప్పుడు తీసుకునే ఫేషియల్ రికగ్నేషన్‌కు సరిపోలడం లేదు. పోషణ ట్రాకర్ యాప్‌లో ఈకేవైసీ నమోదులోనూ జాప్యమవుతూ, తరచూ ఎర్రర్ అని చూపుతున్నట్లు వారు వాపోతున్నారు.

పంపిణీ కాకుంటే కోత..

ప్రతి నెలా 15లోగా పోషకాహారం పంపిణీ చేయాలి. యాప్‌లో నమోదైన పంపిణీ వివరాల ఆధారంగానే మరుసటి నెలలో సరకులు కేటాయిస్తారు. నిర్దేశిత సమయంలోగా పంపిణీ జరగకపోతే మరుసటి నెలలో సమస్య తలెత్తుతుంది

సమస్యలు పరిష్కరిస్తున్నాం..

పోషకాహార పంపిణీ విధానంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వాటిని ప్రతి రోజూ పర్యవేక్షించి సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. త్వరలో అన్నీ పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నారు.
- వెంకటేశ్వరి, పీడీ, ఐసీడీఎస్

అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0-6 వయసు గల పిల్లలు
2,420	10,936	9463	97,194 మంది

సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి సోమవారం రద్దీ కొనసాగుతోంది. భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డులోని శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి 16 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 80,193 మంది దర్శించుకోగా రూ.4.43 కోట్ల హుండీ కానుకలు లభించాయి. * శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. అష్టదళ పాదపద్మారాధన సేవను తితిదే రద్దు చేసింది.

గృహ నిర్మాణ సంస్థ పీడీ సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా హౌసింగ్ హెడ్ (గృహ నిర్మాణ సంస్థ పీడీ) గోపాల్‌నాయక్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన గతంలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో పనిచేసిన సమయంలో కింది స్థాయి ఉద్యోగుల నుంచి లంచం డిమాండ్ చేశారనే ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై విచారించిన ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ గోపాల్‌నాయక్‌పై సస్పెన్షన్ విధించింది. సస్పెన్షన్ సమయంలో ఆయన అనుమతి లేకుండా జిల్లా ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

రసాయనిక మందు కొంటేనే యూరియా

దుకాణదారుడి హుకుం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: యూరియా నిల్వ ఉందని బంగారుపాళ్యంలోని ఎరువుల దుకాణం చెంతకు రైతులు బారులు తీరడంతో సదరు వ్యాపారి రసాయన మందుకు అదనంగా రూ.250 వెచ్చించి కొంటేనే యూరియా ఇస్తామని చెప్పారు. ప్రతి రైతు తప్పక ఆధార్ కార్డు నకలు ఇవ్వాలని, ఒక రైతుకు మూడు బస్తాల యూరియా ఇస్తామని షరతు విధించారు. రసాయనిక మందు అవసరం లేకపోయినా, దుకాణదారుడి షరతులకు చేసేదేమీ లేక రైతులు కొనుగోలు చేశారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి భారతిని సంప్రదించగా మండలానికి 50 టన్నుల యూరియా సరఫరా అయిందని, షరతు విషయమై విచారణ చేపడతామన్నారు.

అర్ధాకలితో శిక్షణా..!

భోజనం పెట్టలేదని హెచ్‌ఎంల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: శిక్షణ తరగతులకు హాజరైన ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సకాలంలో మధ్యాహ్న భోజనం సమకూర్చలేదని, కొందరికి చాలలేదంటూ వారు సోమవారం నిరసన చేపట్టారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లాలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణకు 300 మందికి 220 మంది హాజరయ్యారు. వీరికి ఉదయం టీ, స్నాక్స్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదని, మధ్యాహ్న భోజనం వందమందికి చాలకపోవడంతో ప్రధానోపాధ్యాయులు నిరసన చేపట్టారు. వారితో నిర్వాహకులు మాట్లాడాక మరోసారి 3.30 గంటలకు తయారు చేసి అందజేశారు. భోజనం చాలక అర్ధాకలితో శిక్షణలో పాల్గొన్నట్లు వాపోయారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు 5,519 మంది దరఖాస్తు

కొనసాగుతోన్న వెబ్ ఆప్షన్ల నమోదు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఎస్వీయూ ఆవరణలోని పాత ఎంబీఏ భవనంలో విద్యార్థుల సౌలభ్యం కోసం సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 3,005 మంది విద్యార్థులు తమ ధ్రువపత్రాలను ఆన్‌లైన్ పద్ధతిలో సమర్పించారు. మరికొందరు నేరుగా పాల్గొని పరిశీలన ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మరో కేంద్రంలో 2,514 మంది విద్యార్థులు వివరాలు సమర్పించారు. వెబ్ ఆప్షన్ల నమోదులో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఇక్కడి సిబ్బంది సహకరిస్తున్నారు. రెగ్యులర్ కోర్సులకు రూ.42,000, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో రూ.1,62,000 నిర్ణయించారు. ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల 18న ముగియనుండగా మరుసటి రోజు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు.

రైతులకు ప్రోత్సాహక నగదు అందేలా చూడండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తోతాపురి మామిడి కిలోకు రూ.4 చొప్పున ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నగదు అసలైన లబ్ధిదారులకు అందాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గుజ్జు పరిశ్రమలకు 3 లక్షల టన్నుల తోతాపురి మామిడి సరఫరా జరిగింది. మామిడి రైతులకు రూ.120 కోట్లు ప్రోత్సాహకాల రూపంలో అందనుంది. జూన్‌లో మామిడి సరఫరా చేసిన రైతులకు ఈ నెలలో, ఈ నెలలో సరఫరా చేసిన వారికి ఆగస్టులో నగదు జమవుతుంది. రైతుల వివరాల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచూసుకోవాలి' అని కలెక్టర్ ఆదేశించారు. * జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 'మొదటి దశలో మంజూరైన 40 గోదాముల్లో 27 గోదాముల నిర్మాణం పూర్తయింది. 4 చోట్ల నిర్మాణాల్లో ఉన్నాయి. 9 చోట్ల ప్రారంభం కాలేదు. పూర్తయిన చోట్ల మౌలిక సౌకర్యాలు కల్పించాలి. సహకారశాఖ ద్వారా పెట్రోల్ బంకులు, పీఎం జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు.

కన్న తల్లిని కట్టేసి నాటకం

- ఆస్తి వివాదాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నం
- సామాజిక మాధ్యమాల్లో వైరలైన వీడియో
- వైకాపా సానుభూతిపరుడిపై కేసు

విద్యుత్తు స్తంభానికి గంగమ్మ

నిందితుడు సురేష్

శాంతిపురం (కుప్పం), న్యూస్‌టుడే: కుటుంబంలోని ఆస్తి వివాదాన్ని సానుభూతిగా మలుచుకునే కుట్రలో భాగంగా.. తల్లి, కొడుకు, కోడలు కలిసి అప్పుల వాళ్లు బంధించినట్లుగా ఆడిన నాటకాన్ని పోలీసులు ఛేదించారు. కన్న తల్లిని విద్యుత్తు స్తంభానికి కట్టేసి.. నిందను మరొకరిపై మోపి.. సమాజాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించిన కుమారుడిపైనా, అతడికి సహకరించిన తల్లి, భార్యపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైరలైన ఈ ఘటన శాంతిపురంలో సోమవారం చోటు చేసుకుంది. కుప్పం డీఎస్పీ పార్థసారథి కథనం మేరకు.. కర్లగట్ట పంచాయతీ తమ్మిగానిపల్లెకు చెందిన మునెప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మునెమ్మ పదేళ్ల కిందట మరణించగా, మునెప్ప ఈ నెల 5న మృతి చెందారు. మునెప్ప మొదటి భార్య మునెమ్మ కుమారుడు మంజునాథ్‌కు, రెండో భార్య గంగమ్మ కుమారుడు సురేష్‌కు మధ్య ఆస్తి వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సురేష్, అతడి భార్య ఇంద్రాణి, తల్లి గంగమ్మ కలిసి నాటకానికి తెరతీశారు. పొలం వద్ద గంగమ్మను విద్యుత్తు స్తంభానికి కట్టేశారు. మునెమ్మ కుమారుడు మంజునాథ్ ఈ దుశ్చర్యకు ఒడిగట్టాడని జనాన్ని నమ్మించేలా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు సురేష్. రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ అక్కడకు వెళ్లి విచారించగా.. వారంతా కలిసే ఈ నాటకమాడినట్లు తేలింది. ఆ ముగ్గురిపైనా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సురేష్ వైకాపా సానుభూతిపరుడని స్థానికంగా ప్రచారం సాగుతోంది. ఇటీవల కుప్పం మున్సిపాలిటీ పరిధి నారాయణపురంలో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని వివాహితను చెట్టుకు కట్టేసిన ఘటనను వైకాపా పక్కదోవ పట్టించేందుకు యత్నించిన విషయం విదితమే.

ప్రభుత్వంపై బురదజల్లడం దారుణం

జనం వ్యక్తిగత వివాదాలను ప్రభుత్వానికి ఆపాదించి బురదజల్లే ప్రయత్నాలను వైకాపా మానుకోలని తెదేపా మండలాధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు తదితరులు సోమవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తల్లి, కొడుకు, కోడలు కలిసి నాటకమాడిన వీడియోను కొందరు వైకాపా నేతలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి మహిళను బంధించినట్లుగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు.

ఇసుక అక్రమ రవాణా సూత్రధారి అరెస్టు

నగరి, న్యూస్‌టుడే: ఇసుకను తమిళనాడుకు అక్రమ రవాణా చేస్తున్న ప్రధాన నిందితుడు, చెన్నైకు చెందిన భరత్‌ను సోమవారం అరెస్టు చేశామని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి ఇసుకను టిప్పర్ల ద్వారా నగరికి తరలించి, అక్కడ వేస్ట్ సాండ్‌ని పైన నింపి తమిళనాడుకు అక్రమంగా తరలించే ఏడు టిప్పర్లను సీజ్ చేసి, ఏడుగురిని అరెస్టు చేసిన కేసులో నిందితులను నగరి ఇన్‌ఛార్జి జడ్జి సి.జానకి ఎదుట హాజరు పరచగా వారికి ఈ నెల 28 వరకు రిమాండ్ విధించారని, వారిని సత్యవేడు సబ్‌జైలుకు తరలించామని డీఎస్పీ విలేకరులకు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు భరత్‌ని నగరి సమీప కీళ్లపట్టు వద్ద సోమవారం ఉదయం అరెస్టు చేసి, అతడి నుంచి ఇసుకపై వేస్ట్ సాండ్ నింపేందుకు వినియోగించిన రూ.50 లక్షల విలువ చేసే జేసీబీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ అక్రమ రవాణాకు పూర్తి సహకారం అందించిన వేల్ అండ్ కో క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సంబంధిత మైనింగ్ శాఖ అధికారులకు సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ విక్రమ్, సిబ్బంది గజేంద్ర, అశోక్, పురుషోత్తం, శేఖర్, ఇంద్రకుమార్, కిశోర్, రమేష్, గణేశ్‌రెడ్డిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఇసుక అక్రమ రవాణాలో భాగస్వాములైన వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని నియమించామని డీఎస్పీ వివరించారు.

రైతేరాజు 8లో

ఆదర్శ నియంత్రికల మరమ్మతు కేంద్రంగా చిత్తూరు: సీఎండీ

రీజనరేషన్ ఆయిల్ పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరులోని విద్యుత్తు సంస్థ నియంత్రికల మరమ్మతు కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దనున్నామని, ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ఓఆర్ఎం(ఆయిల్ రీజనరేషన్ మిషన్) అద్భుతంగా పనిచేస్తోందని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. ఈ కేంద్రంలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన ఓఆర్ఎం పనితీరును ఆయన సోమవారం పరిశీలించారు. రాష్ట్రంలోనే తొలుత ఇక్కడ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చామని, త్వరలో డిస్కం పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. దీని వినియోగంతో ఆయిల్ వాల్యుయేషన్, నియంత్రికల విలువ పెరిగిందన్నారు. ఇక్కడ రీజనరేషన్ చేసిన ఆయిల్‌ను జిల్లాలోని అన్ని మరమ్మతు కేంద్రాలకు పంపుతామని చెప్పారు. రానున్న రోజుల్లో జిల్లాకు ఒక నియంత్రికల మరమ్మతు కేంద్రమే ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ❖ డిస్కంలో నియంత్రికలు, అనుబంధ పరికరాల కొరత లేదన్నారు. ఏఈలు మండల కేంద్రాల్లోనే నివాసం ఉండాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎండీ ఆదేశించారు. జిల్లా విద్యుత్తు శాఖ గోదామును తనిఖీ చేశారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, సీజీఎం జానకిరాం, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర, ఎంఆర్‌టీ ఈఈ బాబు, డీఈఈ రవి పాల్గొన్నారు.

ఇక మ్యాజిక్ డ్రెయిన్లు..!

- భూగర్భజలాల వృద్ధికి ప్రత్యేక ఏర్పాట్లు
- మురుగు సమస్యకు పరిష్కారం

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం

- తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం కుప్పం బాదూరులో 250 మీటర్లు కచ్చా డ్రెయిన్ నిర్మించేందుకు గుర్తించారు.
- చిత్తూరు జిల్లాలో ఇంకా ఏ గ్రామంలో నిర్మించాలనే దానిపై స్పష్టత రాలేదు. ఒకట్రెండు రోజుల్లో చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టే గ్రామం ఏదనేది తేలనుంది.

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భూగర్భ జలాల వృద్ధితో పాటు మురుగు నీటి సమస్య పరిష్కారానికి ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కాలువలు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో నిత్యం మురుగు నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నమూనా విధానంలో కచ్చా డ్రెయిన్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరంలో నిర్మించింది. ఆశించిన ఫలితం రావడంతో వీటి నిర్మాణంపై ప్రతి జిల్లా నుంచి ఇంజినీరింగ్, సాంకేతిక, క్షేత్ర సహాయకులకు ఇటీవల విజయవాడలో శిక్షణ ఇచ్చారు.

నిర్మాణమిలా.. ▸ సాధారణంగా 150 మీటర్లు ఈసీ డ్రెయిన్‌కు రూ.1.50 లక్షల ఖర్చవుతుంది. ఈ విధానంలో నిర్మిస్తే రూ.75 వేలకే పూర్తవుతుంది. ▸ 150 మీటర్లు పొడవు, 0.5 మీటర్ల వెడల్పుతో తొలి 50 మీటర్లు 0.4 మీ లోతు, తరవాత 0.5 మీ. చివర 50 మీటర్లు 0.6 మీటర్ల మేర తవ్వి మట్టి తొలగించాలి. ▸ కాలువలో ప్రతి 30 మీటర్లకు ఒక చోట 1.2 మీ మేర ఇంకుడు గుంత తవ్వాలి. కాలువ తవ్విన ప్రాంతంలో ఇళ్ల వైపు అడ్డుగా నాపరాళ్లు ఏర్పాటు చేసి తొలుత 225 ఎంఎం మెటల్, చివరిగా 10 ఎంఎం మెటల్ వేయాలి. ఇంకుడు గుంతల్లోనూ ఇదే విధానంలో నిర్దేశిత పరిమాణంలో రాయి, మెటల్ నింపాలి.

మురుగు సమస్య ఉండదు

ఈ తరహా నిర్మాణాలతో నీరు ఎప్పటికప్పుడు ఇంకిపోవడంతో మురుగు, దోమల సమస్య ఉండదు. దీనికితోడు భూమిలో నీరు ఇంకడం వల్ల భూగర్భ జలాల వృద్ధికి అవకాశం ఉంటుంది. - శ్రీనివాసప్రసాద్, పీడీ, డ్వామా

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY & SCIENCES: TIRUPATI
(AUTONOMOUS)
(Accredited by NAAC in "A" grade, All Eligible UG Programs Accredited by NBA, New Delhi)
Venkatapuram (V), Karakambadi Road, Renigunta (M), Tirupati - 517 520, Chittoor (A.P)
APEAPCET/ECET/ICET/PGECET COUNSELING CODE: AITT
Category- B Seats Admissions -2025
A few seats are available in 1st year B.Tech. / M. Tech. /MBA / MCA under Management Quota at this Institute.
B.Tech Courses - CSE, AIML, AIDS, CSE (Data Science), CSE (Cyber Security), CSIT, ECE, EEE, Mech Engg, and Civil Engg,. Eligible and interested candidates can approach the College office immediately along with relevant certificates.
For details Contact: 9701591084
Date: 14-07-2025
Sd/- PRINCIPAL

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

రైలు దోపిడీ దొంగల అరెస్టు

రెండు కత్తులు, కట్టర్ల స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: రైల్వే సిగ్నల్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రైలు ప్రయాణికులను దోచుకునే మహారాష్ట్రకు చెందిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్టు చేశారు. చిత్తూరు పోలీసు అతిథిగృహంలో గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ రాహుల్ మీనా మీడియాకు వివరాలు వెల్లడించారు. 'చిత్తూరు గ్రామీణ మండలం సిద్ధంపల్లి సమీపంలో జూన్ 26న చామరాజనగర్ ఎక్స్‌ప్రెస్ దోపిడీ ఘటనపై ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టాం. దొంగలు మామండూరు, ముంగిలిపట్టులో రెండుసార్లు, తాడిపత్రి, సిద్ధంపల్లి వద్ద దోపిడీకి పాల్పడ్డారు. పూతలపట్టు, మంత్రాలయం, అలంపూర్‌లో విఫలయత్నం చేశారు. పక్కా సమాచారంతో నిందితులను ఆదివారం రేణిగుంటలో అరెస్టు చేశారు. వీరిని మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాకు చెందిన జలిందర్ మహిర్యా పవార్(50), పుణే జిల్లాకు చెందిన కోహినూర్ నవనత్ పవార్(24)గా గుర్తించాం. వీరిద్దరి నుంచి రెండు వైర్ కట్టర్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నాం. దోపిడీ ముఠాలో మరికొందరు ఉన్నారు' అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసు ఛేదనకు కృషి చేసిన తిరుపతి డీఎస్పీ హర్షిత, రేణిగుంట, కడప ఇన్‌స్పెక్టర్లు యతీంద్ర, సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రవి, గోపాల్, ధర్మేంద్రరాజు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

చిత్తూరు: తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ వెంకటరవి, అధికారులు

చిత్తూరు (వ్యవసాయం), పెనుమూరు, న్యూస్‌టుడే: చిత్తూరు, పెనుమూరులోని నాలుగు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం సంయుక్తంగా దాడులు చేశారు. చిత్తూరులో 'ఓ' ఫారం లేకుండా విక్రయిస్తున్న రూ.3.15 లక్షల విలువచేసే 11 టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపేశామని విజిలెన్స్ సీఐ వెంకటరవి తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. దాడుల్లో తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఏడీ ధనంజయరెడ్డి, చిత్తూరు ఏడీఏ ఉమ, ఏవోలు శ్రీకాంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

రైతేరాజు

వరి నారు పెంపకంలో సూచనలు

పుంగనూరు, న్యూస్‌టుడే: నాటిన వరి పైరు త్వరగా కుదురుకోవాలన్నా, ఎక్కువ పిలకలు వచ్చి కట్టాలన్నా ఆరోగ్యవంతమైన నారు నాటడం ద్వారానే సాధ్యమని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. నాణ్యమైన నారు పెంపకానికి పలు సూచనలు చేశారు. ముందుగా నారుమడిని వారం వ్యవధిలో మూడు సార్లు దున్నాలి. నీరు పారించడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలు తీసుకుని విధిగా విత్తనశుద్ధి చేసి 24 గంటల పాటు శుభ్రమైన నీటిలో నానబెట్టాలి. తర్వాత గోనె సంచిలో నిల్వ చేయాలి. ఎక్కువ గుజ్జుగా కాకుండా విత్తనాలు పరస్పరం బాగా విస్తరించి ఉండాలి. నారుమడిలో మంచి నీటి నిల్వ సామర్థ్యం ఉండాలి. నీరు నిలిచే స్థలాలు కాకూడదు. సులభంగా నీరు పోయేలా కాలువ, సూర్యకాంతి బాగా పడే స్థలం కావాలి. మొలక వచ్చిన తర్వాత నారుమడిలో విత్తనాన్ని చల్లే ముందు మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. విత్తనాలను సమానంగా చల్లాలి.

ఎరువుల వాడకం

ఎకరా నర్సరీకి యూరియా 20 కిలోలు, సూపర్‌ఫాస్ఫేట్ 40 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 15 కిలోలు దుక్కిలోనే చల్లాలి. నారు ఆకు విచ్చుకునే వరకు ఆరుతడులు ఇవ్వాలి. తర్వాత నారుమడిలో పలుచగా నీరు నిలబెట్టాలి. రాగి ముడి, తక్కువ మొలకలు వంటి సమస్యలు వచ్చినట్లైతే ఫంగీసైడ్లు వాడాలి. తేనేటి పురుగులు, తామర పురుగులు వంటివి ఉంటే తగిన ఇన్సెక్టిసైడ్లు వాడాలి. సాధారణంగా మొలకలు వచ్చిన 20-25 రోజుల్లో నాటాలి. ఎర్ర మట్టి భూముల్లో 25-30 రోజుల వయసు నారు నాటాలి.

ఆదాయం పట్టు

మల్బరీ సాగుతో మంచి లాభాలు

కల్లూరు, న్యూస్‌టుడే: పట్టు పురుగుల పెంపకంతో ప్రతినెలా నికర ఆదాయం పొందుతున్నారు పశ్చిమ మండలాల్లోని కొందరు రైతులు. కొన్ని మెలకువలు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని చెబుతున్నారు. పెంపకం వివరాలివి.

▸ **రకాలు:** పట్టు పురుగుల్లో బైవోల్టిన్, బొంబాక్సీ మోరీ, ఏరి, ముగా, టసర్ రకాలున్నాయి.

▸ **మల్బరీ సాగు:** పురుగులకు మల్బరీ ఆకులను మేతగా అందించాలి. ఎకరాలో పురుగులను పెంచితే ఎకరాలో మల్బరీ మొక్కలు పెంచాలి.

▸ **లార్వా దశ:** ఒక షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. నేల నుంచి కనీసం రెండు అడుగుల ఎత్తు ఉండేలా బెడ్లు సిద్ధం చేయాలి. పురుగు రెండో జ్వరం దశ నుంచి గూడు దశకు చేరుకోవడానికి సుమారు 22 రోజులు పడుతుంది. గుడ్డు నుంచి లార్వా బయటకు రాగానే మల్బరీ ఆకులను తింటూ 17-20 రోజులకు 7-8 సెంటీమీటర్ల పొడవు పెరుగుతాయి. లార్వా దశలో ఉన్నప్పుడు పురుగులు వాటి బరువు కంటే ఎక్కువ ఆహారాన్ని తింటూ గూడు దశకు తేమని సిద్ధం చేసుకుంటాయి.

▸ **సేకరణ, విక్రయం:** పట్టు పురుగులు చుట్టూ గూడు పూర్తిగా ఏర్పడిన వెంటనే వేడి నీళ్లలో మరిగిస్తే గూడు లోపల ఉన్న పురుగు మరణిస్తుంది. వేడి నీటికి గూడులో ఉన్న జిగురు వంటి పదార్థం కరిగి పట్టు సేకరణకు అనువుగా మారుతుంది. సేకరించిన పట్టును మార్కెట్లో విక్రయిస్తారు. సీజన్ బట్టి కిలో పట్టుకు రూ.650-700 వరకు ఆదాయం లభిస్తుంది.

నెలకు రూ.50 వేలు:

నేను రెండెకరాల్లో పైగా అరకెరా షెడ్డులో పురుగుల పెంపకం, ఎకరాలో మల్బరీ సాగు చేపడుతున్నా. పురుగులను చిత్తూరు, కర్ణాటకలోని కోలార్, రాయల్‌పేట, చీలేర్లు నుంచి కొనుగోలు చేస్తున్నా. సెంటర్లో తెచ్చుకుంటాం. రెండో జ్వరంలో ఉన్నప్పుడు బైవోల్టిన్ అనే రకం 80 పురుగులు రూ.3200 పడతాయి. రవాణా, ఇతర ఖర్చులతో కలిపి రూ.4500 అవుతుంది. తరువాత 2 నుంచి 3, 4 దశల వరకు మల్బరీ ఆకులను పురుగులు 15 రోజులు ఆహారంగా తింటాయి. గూడు అల్లుతాయి. 4 రోజుల తరువాత నేత్రికల నుంచి గూళ్లు తీసుకుని పలమనేరు మార్కెట్‌కి తీసుకెళ్తాం. కిలో రూ.650తో విక్రయిస్తాం. అలా వంద కిలోలు రూ.65 వేలకు విక్రయించాక ఖర్చు రూ.పదిహేను వేలు పోను ప్రతి నెలా రూ.50 వేల ఆదాయం లభిస్తుంది.

- వై.సురేష్, పాతపేట గ్రామం, పులిచెర్ల మండలం

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే:

ప్రశ్న: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఏమిటి? కౌలు రైతుల పరిస్థితి ఎలా? -రైతు రామచంద్ర, కరకంబాడి, రేణిగుంట మండలం

జవాబు: వెబ్‌ల్యాండ్‌లో భూమి కలిగి జీవనోపాధి సర్వే చేయించుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు ఈ పథకానికి అర్హులు. కౌలు రైతులు స్థానిక వీఆర్వో వద్ద కౌలు గుర్తింపు పత్రం పొందితే వారికి అర్హత లభిస్తుంది. -సునీల్ కుమార్‌రెడ్డి, రేణిగుంట వ్యవసాయాధికారి

పోషకాల మేతతో సత్ఫలితాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పోషక విలువలు మెండుగా ఉండే పరిపూర్ణ మేతను గొర్రెలు, మేకలకు అందుబాటులో ఉంచడంతో పశుపోషకులు సత్ఫలితాలు సాధించవచ్చని అంటున్నారు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ భాస్కర్.

- పంట అవశేషాలైన వరి, జొన్న, పొద్దుతిరుగుడు పువ్వు రాలిపోయిన చెట్ల ఆకులను యంత్రాల సహాయంతో పొడి చేసుకోవాలి.
- వంద కిలోల పొడిలో యాభై శాతం వరకు వాడుకోవచ్చు. మిగిలిన యాభై శాతానికి మొక్కజొన్న, సజ్జ, జొన్న, నూనె తీసిన వేరుసెనగ పిండి, పొద్దుతిరుగుడు పిండి, వరి, గోధుమ తవుడు తదితర వాటిని కలిపి సంపూర్ణ మేతగా సిద్ధం చేసుకోవాలి.
- సంపూర్ణ మేతను గొర్రెలు, మేకలకు అందించడం వల్ల పోషకాలు సమృద్ధిగా జీవాలకు అందడంతో ఎదుగుదల బాగుంటుంది.
- వ్యాధినిరోధక శక్తి మరింతగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

క్వారీలో అక్రమ మైనింగ్ నిలిపివేయాలి

● గ్రీవెన్స్‌లో 299 వినతులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 299 వినతులు అందాయి. జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

● సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు నగరిలో పర్యటించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెదేపా నాయకుడు రామానుజం చలపతి విన్నవించారు. ఎంపీగా గెలిచి ఏడాది గడిచినా నగరిలో పర్యటించకుండా కొన్ని దుష్టశక్తులు ఆయన్ను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. తెదేపా నాయకులు లత, అలిమేలు, రాధ, హేమ, కన్నెమ్మ ఉన్నారు.

● చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే సమీపంలోని తమ గ్రామంలో సర్వీసు రహదారి నిర్మించాలని చిత్తూరు మండలం గువ్వకల్లు గ్రామస్థులు విన్నవించారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

లంచాలు తీసుకుని ఖాళీల్ని బ్లాక్ చేశారు

సచివాలయ ఏఎన్‌ఎం/డబ్ల్యుహెచ్‌ఎస్ బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ అన్యాయంగా జరిగిందని ఉద్యోగులు ఆరోపించారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. సీనియారిటీ జాబితాలో తప్పులు చూపి, ఖాళీల జాబితా విడుదల చేయకుండా కౌన్సెలింగ్ చేశారని చెప్పారు. తాము ఇచ్చిన 5 ఐచ్ఛికాల్లో ఒక్కటీ రాలేదని, లంచాలు తీసుకుని చాలా ప్రదేశాలు బ్లాక్ చేశారన్నారు. తమ వినతిపై స్పందించి ప్రస్తుతం నిర్వహించిన బదిలీ ప్రక్రియను రద్దు చేయాలన్నారు. చిత్తూరు జిల్లా వారికి చిత్తూరులో, తిరుపతి జిల్లా వారికి తిరుపతి జిల్లాలో రీ-కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉద్యోగులు విన్నవించారు. ఇదే విషయమై గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ సైతం వినతిపత్రం అందజేశారు.

● క్వారీలో అక్రమ మైనింగ్ వెంటనే నిలిపేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. నగరి మండలం గంగ్రాజుకుప్పం ఎస్సీ కాలనీ సమీప క్వారీలో మైనింగ్‌తో గుట్టలు మాయమయ్యే స్థితికి చేరాయన్నారు. భవిష్యత్తులో పశువులకు మేత దక్కదని, వర్షాల సమయంలో కొండల నుంచి నీరు పారే పరిస్థితి ఉండదన్నారు. పాలసముద్రం మండలంలో నిర్వహిస్తున్న క్వారీలు రద్దు చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, కోదండ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వెలుపల నిరసనలో సీపీఐ శ్రేణులు

డీపీవోకు 42 ఫిర్యాదులు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 42 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ ఫిర్యాదులు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను పరిష్కరించి వారంలోగా తనకు నివేదిక ఇవ్వాలని జూమ్ సమావేశంలో పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

నూతన కాటేజీ విధానంపై బ్లూప్రింట్ సిద్ధం చేయండి

ఈవో శ్యామలరావు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులకు వసతి కల్పించేందుకు నూతన కాటేజీ విధానాన్ని రూపొందించాలని అధికారులకు తితిదే ఈవో జె.శ్యామలరావు సూచించారు. స్థానిక పరిపాలనా భవనంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా దాతలు కాటేజీలు నిర్మించేందుకు అవసరమైన బ్లూప్రింట్ తయారు చేయాలన్నారు. నిర్దేశిత సమయానికి దాతలు కాటేజీలు నిర్మించి తితిదేకు అప్పగించడం, వారికి కేటాయించిన ప్రివిలేజెస్ దుర్వినియోగం కాకుండా చూడటం, దాతల ఎంపికలో విధివిధానాలు, బాధ్యతలు తదితర అంశాలు పారదర్శకంగా ఉండేలా నిబంధనలు రూపొందించాలన్నారు. అంతకుముందు విధానపరమైన అంశాలపై అదనపు ఈవో వర్చువల్ ద్వారా ఈవోకు వివరించారు. రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాల నామినేషన్‌కు గడువు పెంపు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జాతీయ పురస్కారాలు-2025 సంవత్సరానికిగాను ఉపాధ్యాయులు ఫైనల్ నామినేషన్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇందుకు ఈ నెల 15 నుంచి 20 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని డీఈవో వరలక్ష్మి సోమవారం తెలిపారు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ సెల్ఫ్ నామినేషన్స్ రిజిస్ట్రేషన్ ఈ నెల 17లోగా పూర్తి చేయాలన్నారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు.

సంతకాల సేకరణ ప్రారంభం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: చిత్తూరు రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే చెన్నై రైలుతో పాటు ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను చిత్తూరులో నిలపాలని కోరుతూ చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు సంతకాల సేకరణ చేపట్టారు. స్థానిక చిత్తూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం వంద మంది ప్రయాణికుల వద్ద సంతకాలు సేకరించి.. రైల్వే అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. తర్వాత స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా కేంద్ర రైల్వే శాఖ మంత్రికి వినతిపత్రాన్ని అందిస్తామని సొసైటీ నాయకులు తాండవమూర్తి, గోపీనాయక్, సత్య, కృష్ణసింగ్, వరద, కుమరేషన్ తెలిపారు.

నెలాఖరులోగా పరీక్షలు పూర్తిచేయాలి

చిత్తూరు (వైద్యవిభాగం), పూతలపట్టు, న్యూస్‌టుడే: జిల్లాలో క్షయ నివారణకు చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్' కార్యక్రమాన్ని సోమవారం కేంద్ర బృంద అధికారులు పర్యవేక్షించారు. క్షయ నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మధుమేహ, క్షయ బాధితులు, పౌష్టికాహార లోపం ఉన్నవారు 3.49 లక్షల మందిని గుర్తించారు. వీరిలో 35 వేల మందికి పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ డిప్యూటీ కమిషనరు భవాని సింగ్.. తన బృందంతో పూతలపట్టు మండలం వేపనపల్లె, నెల్లేపల్లి హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, చిత్తూరు క్షయ విభాగాన్ని సందర్శించారు. నవంబరు నెలాఖరులోగా మిగిలిన వారిని పరీక్షించాలని ఆదేశించారు. బృంద సభ్యులు ధర్మారావు, గంగాధర్, ధీరజ్, మనోహర్‌రెడ్డి జస్వంత్, జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్, ప్రోగ్రామ్ అధికారి సంతోష్, వెంకట్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో నిండి.. నీరు పారకుంది

చిత్తూరు నగరంలోని మురుగు కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. ప్లాస్టిక్ నిషేధం అంటున్నా అధికారులు మాటలకే కానీ.. దీన్ని ఆచరణలో చూపకపోవటంతో నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని ఈ చిత్రం చూస్తే అర్థమవుతోంది. నగరంలో చెత్తను ఎక్కడికక్కడ పడేస్తుండటంతో ఇదంతా కాలువల్లో పేరుకుపోతోంది. ఫలితంగా మురుగునీరు ముందుకు సాగక నిలిచి వర్షాకాలంలో రోడ్లను ముంచెత్తుతోంది. దీనివల్ల రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. **-ఈనాడు, చిత్తూరు**

నైపుణ్య వెలుగులు

☛ స్కిల్‌హబ్ శిక్షణలతో ఉపాధి

☛ రాణిస్తున్న యువత, మహిళలు

✱ పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన డెసాల్ట్ శిక్షణ కేంద్రంలో 10,600 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. కొందరు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు సొంతంగా వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారు.

చిత్తూరు కలెక్టరేట్, పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెదేపా ప్రభుత్వం నిరుద్యోగ యువతతో పాటు, ఇంజినీరింగ్, యూనివర్సిటీ స్థాయిలో పీజీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు గతంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు, సీమెన్స్ కేంద్రాలతో పాటు సీఎంఎస్‌ఈ కేంద్రాలు, డెసాల్ట్, ఈఎస్‌సీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వేలాది మంది యువత శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీమెన్స్ కేంద్రాలు మూతపడటంతో యువత భవిత అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తెస్తే వృత్తి నైపుణ్యాలు సాధించడంతోపాటు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉంది. మంగళవారం ప్రపంచ యువ నైపుణ్యం దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్‌లో కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న యువత

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్కిల్ హబ్, సీఎంఎస్‌ఈ, ఈఎస్‌సీ కేంద్రాల్లో శిక్షణ పొందిన యువత నాలుగు వేల మంది పైచిలుకు ఉద్యోగాలు సాధించారు. వృత్తివిద్యలో శిక్షణ పొందిన యువత, మహిళలు చేతివృత్తుల్లో ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు అధునాతన టెక్నాలజీలో శిక్షణ పొంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి తమ కాళ్లపై నిలబడి జీవిస్తున్నారు.

చంద్రగిరిలో శిక్షణ పొందిన యువతకు ధ్రువపత్రం అందజేస్తున్న తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

ప్రతి నియోజకవర్గంలో..

ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని స్కిల్ హబ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రతి బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నాం. తద్వారా ఎంతో మందికి ప్రయోజనం కలుగుతోంది. నిరుద్యోగ యువత స్కిల్ హబ్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి.

- ఆర్.లోకనాథం, గుణశేఖర్, తిరుపతి, చిత్తూరు జిల్లాల నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

జిల్లాలో స్కిల్ హబ్‌లు: 7 | సీఎంఎస్‌ఈ కేంద్రాలు: 5 | డెసాల్ట్ కేంద్రాలు: 4 | ఈఎస్‌సీ కేంద్రాలు: 25

మూడు టన్నుల తమిళనాడు బియ్యం పట్టివేత

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: తమిళనాడు నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల తమిళనాడు రేషన్ బియ్యాన్ని పట్టుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. రామకుప్పం పెట్రోల్ బంకు వద్ద సోమవారం తనిఖీ నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న వాహనం నుంచి కొందరు వ్యక్తులు పరారయ్యారు. వారిని పట్టుకుని విచారించగా, అక్రమ బియ్యం వ్యవహారం బయటపడింది. రామకుప్పం మండల ననియాలకు చెందిన సాగర్, కూలీ గోవిందరాజ్, మాణిక్‌లను అరెస్టు చేసి, మూడు టన్నుల బియ్యాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, వి.కోటకు చెందిన ఆండియప్ప, రామకుప్పం మండలానికి కుమార్ నాయక్ చెప్పిన విధంగా తమిళనాడు నుంచి బియ్యం తరలిస్తున్నట్లు చెప్పారని పోలీసులు తెలిపారు. ఎవరైనా అక్రమ వ్యాపారాలు చేస్తే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

గ్రావెల్ టిప్పర్ల స్వాధీనం

పాలసముద్రం, న్యూస్‌టుడే: పాలసముద్రం మండలం నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. వనదుర్గాపురం పంచాయతీ పరిధి, తమిళనాడు సరిహద్దు వడకుప్పం వద్ద కొండ నుంచి సోమవారం తమిళనాడు వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారం అందిందన్నారు. దాడుల సమయంలో తమిళనాడుకు చెందిన వ్యక్తులు, కొన్ని టిప్పర్లతో సహా పరారయ్యారని చెప్పారు. స్థానిక ఎస్సై చినరెడ్డెప్ప సహకారంతో ఆరు టిప్పర్లు, డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండలంలో గ్రావెల్ తరలింపునకు జిల్లా అధికారులు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని, రాత్రివేళ సరిహద్దు ప్రాంతాల్లో గ్రావెల్ తరలిపోతోందన్నారు. పంచాయతీల్లో గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం వస్తే తమకు తెలియజేయాలని కోరారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం పట్టణం: పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిని అరెస్టు, ఐదు తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిందితుడిని అరెస్టు చూపి, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన శక్తివేలును మండల పరిధిలోని ఇటీవల అరెస్టు చేసి రిమాండుకు పంపారు. విచారణ నిమిత్తం పోలీసు కస్టడీకి తీసుకోగా.. గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీసుస్టేషన్ల పరిధిలో నాలుగు ఇళ్లలో దొంగతనాలు చేసినట్లు, బంగారు, వెండి ఆభరణాలను తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌లోని ఓ బంగారు దుకాణంలో అమ్మినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడిపై కుప్పం పోలీసుస్టేషన్‌లో 5, వి.కోట పరిధిలో 3, బైరెడ్డిపల్లెలో 2 కేసులున్నాయని పోలీసులు తెలిపారు. వీటితో పాటు తమిళనాడు రాష్ట్రం ఊత్తంగిరి, పెరుంబార్రై, కోయంబత్తూరు, తిరుపూరు తదితర ప్రాంతాల్లో కేసులున్నట్లు చెప్పారు.

హాస్య కళాకారుడి ఆత్మహత్య

చిత్తూరు గ్రామీణ: తమిళనాడు రాష్ట్రం షోలింగర్‌లోని నరికుల్లమేటుకు చెందిన జయకరన్(28) వీధి నాటకాలు వేస్తూ జీవిస్తున్నారు. చిత్తూరు మండలం అరతల ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత మహోత్సవంలో నాటకాల నిమిత్తం ఆ నాటక బృందాన్ని రప్పించారు. ఆ బృందంలో జయకరన్ కమీడియన్ వేషధారణతో ప్రజల్ని నవ్విస్తున్నారు. రెండ్రోజుల క్రితం అతడు సొంత గ్రామానికి వెళ్లొచ్చారు. ఆదివారం రాత్రి కమీడియన్ వేషధారణతో స్థానికుల్ని మెప్పించారు. సోమవారం మధ్యాహ్నం ఆలయ సమీపంలో ఓ మామిడి తోటకు వెళ్లి, ఓ చెట్టుకు తన లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అతడి ఆత్మహత్యపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బీఎన్‌ఆర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త..

పెనుమూరు: గొడుగుమానుపల్లెకు చెందిన దయాసాగర్(28).. అమరరాజ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. అతడికి జీడీనెల్లూరు మండలం బాలగంగనపల్లెకు చెందిన లావణ్యతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను కాపురానికి రావాలని పిలిచేవాడని ఆమె తిరస్కరించేదని గ్రామస్థులు తెలిపారు. ఆదివారం విధులకు వెళ్లిన అతడు రాత్రి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. కుటుంబసభ్యులు సోమవారం గ్రామ సమీప వారి మామిడి తోటలో చూడగా చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

చిత్తూరు(నేరవార్తలు): చిత్తూరు గ్రామీణ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ(40)పై.. ఆమె పక్కింట్లోనే నివసిస్తున్న వరుసకు బావ అయిన వ్యక్తి(50).. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారం చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా సోమవారం రాత్రి వెలుగు చూసింది. బాధితులు తాలూకా పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు కాలేదు.

కడవరకు జీవన పోరాటమే

● కూలి పనుల్లోనే ముగిసిన జీవితం

శ్రీకాళహస్తి గ్రామీణం, వెంకటగిరి, న్యూస్‌టుడే: పేదరికంలో పుట్టి పొట్టకూటి కోసం వలస కూలీలుగా నిత్యం జీవన పోరాటం చేస్తూ తనువు చాలించారు ఆ కార్మికులు. స్థానికంగా పనులు లేకపోవడంతో మామిడికాయలు తెంపేందుకు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీకాలనీలోని బంధువుల చెంతకు చేరారు. మామిడికాయలు తెంపితే వచ్చే సంపాదనతో జీవితం సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో పుల్లంపేట మండలం రెడ్డిపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో వెంకటగిరి మండలం వల్లివేడు, శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి, కలవగుంట, చుక్కల నిడిగల్లు ఎస్టీకాలనీల్లో విషాదం నిండింది.

వలస కూలీగా వెళ్లి.. విగతజీవిగా మారి

శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లికి చెందిన శ్రీను(25) తండ్రి దశాబ్దాల కిందటే శెట్టిగుంట ఎస్టీకాలనీ నుంచి ఇక్కడికి వలస వచ్చారు. స్థానిక యువతి విజయలక్ష్మితో శ్రీనుకు వివాహమైంది. వీరికి వైష్ణవి(5), చంద్రిక(6) సంతానం. స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మామిడి సీజన్ వస్తే రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీకాలనీకి వెళ్లిపోతారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో శ్రీను మృతి చెందగా విజయలక్ష్మి, పిల్లలు గాయపడ్డారు. మామ వెంకటయ్యకు చెయ్యి విరిగింది. అత్త పోలమ్మ పరిస్థితి విషమంగా ఉంది.

భార్య, కుమారుడు మృతి

రాధ, జాని (పాత చిత్రాలు)

చుక్కలనిడిగల్లు ఎస్టీకాలనీకి చెందిన రమణయ్య దినసరి కూలిగా జీవనం సాగిస్తుంటారు. కొన్ని రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి శెట్టిగుంట ఎస్టీకాలనీకి వెళ్లి అక్కడి బంధువులతో పనులకు వెళ్లేవారు. లారీ ప్రమాదంలో రమణయ్య తీవ్రంగా గాయపడగా భార్య రాధ (35), కుమారుడు జాని(18) మృతి చెందడంతో కాలనీలో విషాదం నెలకొంది.

ఐదుగురికి తల్లి చిట్టెమ్మ

కలవగుంట ఎస్టీకాలనీకి చెందిన చిట్టెమ్మ(35) మొదటి భర్త మృతి చెందడంతో శివయ్యను రెండో పెళ్లి చేసుకుంది. ఈమెకు ఐదుగురు సంతానం. కూలి పనులకు వెళ్లి వారిని పోషిస్తోంది. ప్రమాదంలో చిట్టెమ్మ మృతిచెందడంతో పిల్లల పరిస్థితి ఏంటని స్థానికులు కంటతడి పెట్టారు.

చేతికొచ్చిన వేళ.. కడుపుకోత

మునిచంద్ర (పాత చిత్రం)

వెంకటగిరి మండలం వల్లివేడుకు చెందిన మునిచంద్ర(19) చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. కుమారుడు, కూతురికి ఎలాంటి కష్టం రానీయకుండా పెంచింది తల్లి సిద్ధమ్మ. ఇంటర్ వరకు చదివిన కుమారుడు విద్యలో రాణించలేకపోవడంతో ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుందామని చెప్పింది. ఖాళీగా ఉండటంతో ఎంతో కొంత సంపాదన ఉంటుందని రాజంపేట సమీపంలో బంధువుల వద్దకు రెండు నెలలు క్రితం మునిచంద్ర వెళ్లాడు. అక్కడే రోజువారీ కూలీగా సంపాదిస్తూ తల్లికి నగదు పంపుతూ ఉండేవాడు. వారం క్రితం ఇంటికొచ్చి వెళ్లాడు. ప్రమాదానికి ముందు కాయలు కోసి లోడ్ చేశామని, రైల్వేకోడూరుకు వెళ్తున్నామని ఫోన్‌లో చెప్పాడని, కొంత సేపటికే కుమారుడి మరణ వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని తల్లి విలపించింది. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

చికెన్ ధరలు	
వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	100
రిటైల్	122
లేయర్	112
బ్రాయిలర్	177
బ్రాయిలర్ స్కిన్ లెస్	201
లేయర్ మాంసం	190

తిరుమల తిరుపతి దేవస్థానము **టెండరు ప్రకటన**

శ్రీ కలిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం, కలిగిరికొండ నందు పూలు, పాలు, పెరుగు, తమలపాకులు మరియు అరటిపండు టెండర్ కొరకు 2025-2026 సంవత్సరమునకు టెండర్ మొదలైన రోజు నుండి 31-03-2026 గాను దరఖాస్తులు కోరడమైనది.

ఆసక్తిగల వ్యాపారస్తులు "కార్యనిర్వహణాధికారి, టి.టి.డి." పేరు మీద రూ.112/- డి.డి. తీసి, పై తెలిపిన ఆలయములో 14-07-2025వ తేదీ నుండి దరఖాస్తు పొందగలరు. టెండరు ఫారంతో ధరావత్తు సొమ్ము (ఇ.యం.డి) Rs. 10,000/- D.D ద్వారా జతపరచవలెను (E.O TTD పేరు మీద). టెండరు దరఖాస్తుల స్వీకరణ ముగింపు 23-07-2025 న 3.00 P.M. టెండరు పరిశీలన 23-07-2025 న 4.00 గంటలకు the Spl. Gr. Dy. E.O, SKVST కార్యాలయము, శ్రీనివాసమంగాపురం నందు జరుగును.

TTD-40021/10/2025-PRO SEC (Adv.No.134), Dt: 14-07-2025 కార్యనిర్వహణాధికారి

శ్రీ అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానము
అరగొండ గ్రామం, తవణంపల్లి మండలం, చిత్తూరు జిల్లా

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా! శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు లడ్డూ, వడ ప్రసాదములు తయారు చేయుటకు బ్రాహ్మణులు అవసరమై ఉన్నది. ఆసక్తిగల బ్రాహ్మణులు లడ్డూ, వడ ప్రసాదములు తయారు చేయుటకు ఈ ప్రకటన చూసిన వెంటనే తమరి యొక్క సర్టిఫికేట్లతో దేవస్థానం నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి,
టి.హనుమంతరావు, సెల్: 99665 75161, 7780 340743

EENADU Classifieds

HEALTH & CARE

శ్రీ విష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: Dr. K. కీర్తన గారిచే పురిటి బిడ్డల & చిన్నపిల్లల వైద్యనిపుణులు 24x7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి. ✆ 63035 53359.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దగ్గర TCL కంపెనీకి ఎదురుగా ఇంటి నిర్మాణానికి అనువైన అన్ని వసతులతో TUDA అప్రూవ్డ్ ప్లాట్స్ తక్కువ ధరకు కలవు. ✆ 82470 75857, 94943 92069.

అతి తక్కువ ధరల్లో, 46 సులభ వాయిదాల్లో, తుడా / డిటిసిపి అప్రూవ్డ్, స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు: 91145 61456.

వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో తిరుపతి రోడ్డుకి Tuda అప్రూవల్ లేఅవుట్‌లో Plots, 1 Sq.ft కమర్షియల్ Rs.1650, రెసిడెన్షియల్ Rs.1125. Contact: 99660 66111.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

LEASE/ RENT

GENERAL

తిరుపతి - బైరాగిపట్టెడ, 1170 sft, గ్రౌండ్ ఫ్లోర్, ఆఫీసెస్/ SPA/ ఏజెన్సీస్/ స్టాకిస్ట్‌లకు అనువుగా ఉంటుంది. Opp: సారా హాస్పిటల్. Cont: ✆ 91002 98051. Available from Oct-2025.

JOBS

WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. ✆ 93925 13633.

తిరుపతిలో శ్రీ లక్ష్మీనరసింహ గ్యాస్ ఏజెన్సీ, అవిలాల టూవీలర్ వెహికల్ ఉండి గ్యాస్ డెలివరీ చేయుటకు బాయ్స్ (Sal: 18K to 25K) ఆటో డ్రైవింగ్ తెలిసినవారు గ్యాస్ డెలివరీ చేయుటకు కావలెను & Office Staff కావలెను. Cont: ✆ 91333 31415, 97052 25444.

తిరుపతిలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు మేనేజర్, ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. Salary Negotiable. ✆ 97015 10490.

EENADU THE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

రూ.1.8 కోట్లతో ఈఈ కార్యాలయ భవనం

చిత్తూరు(మిట్టూరు): విద్యుత్తుశాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయ భవన నిర్మాణాలను రూ.1.8 కోట్లతో నిర్మించనున్నామని ఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. సోమవారం విద్యుత్తు శాఖ గోదాము, కార్యాలయాలను ఆయన పరిశీలించారు. గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయ ప్రాంగణంలోనే ఈఈ, ఈఆర్వో కార్యాలయ భవన నిర్మాణాలకు రూ.1.80 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఈఈ మునిచంద్ర.. సీఎండీకి వివరించారు. దీనిపై సీఎండీ స్పందించి వీలైనంత త్వరగా నిధులు కేటాయించి పనులు ప్రారంభింపజేస్తామని తెలిపారు.

23 వినతుల స్వీకరణ

చిత్తూరు గ్రామీణ: స్పందనలో ప్రజలు, రైతుల నుంచి 17 వినతులు అందాయని అర్బన్ మండల తహసీల్దారు కులశేఖర్, గ్రామీణ మండల తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందనకు ఆరు వినతులు అందాయని తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు.

పీఏసీల నియామకం

చిత్తూరు నగరం: చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంఘానికి ఒక ఛైర్మన్, ఇద్దరు సభ్యుల్ని నియమించారు. అరగొండ సహకార సంఘానికి రంజిత్‌రెడ్డి నియమితులయ్యారు. 30.10.2025 వరకు వీరి పదవీ కాలం కొనసాగుతుంది.

పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎంఈ వెంకట్రామిరెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక ఎంఈ వెంకట్రామిరెడ్డి సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛను 2, ఇంజినీరింగ్ 5, రెవెన్యూ 4 చొప్పున మొత్తం..11 వినతులు అందాయి. ఏసీపీ నాగేంద్ర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్తికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు హోమ్‌గార్డు విభాగంలో విధులు నిర్వర్తిస్తూ ఏప్రిల్ 29న అనారోగ్యంతో మృతి చెందిన హోమ్‌గార్డు సురేంద్రబాబు కుటుంబానికి సోమవారం ఎస్పీ మణికంఠ ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి భార్య ఆర్తికి.. హోమ్‌గార్డుల ఒకరోజు జీతం నుంచి రూ.3.5 లక్షల చెక్కు అందజేశారు. పోలీసు శాఖ పరంగా అందాల్సిన సహాయ సహకారాలను సకాలంలో అందిస్తామని భరోసా ఇచ్చారు. హోమ్‌గార్డు ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంకటహర గణపతి వ్రతంతో సకల పాపహరణం

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం ఉదయం, సాయంత్రం ఆగమోక్తంగా నిర్వహించిన సామూహిక సంకటహర గణపతి వ్రతంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో పెంచల కిశోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, చిట్టిబాబు, భక్తులు పాల్గొన్నారు.

వ్రతంలో పాల్గొన్న భక్తులు

నవోదయ విద్యాలయకు భూములివ్వండి

పూతలపట్టు: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం సోమవారం నిర్వహించారు. 13 మంది ఎంపీటీసీ సభ్యులకు ఐదుగురు హాజరయ్యారు. బైపల్లె సర్పంచి రామతులసి మాట్లాడుతూ విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదని, గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని కోరారు. పూతలపట్టు బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయ జిల్లాలో ఏర్పాటు చేయనున్నారని, ఇందుకు అవసరమైన 15 ఎకరాల భూమిని రైతులు అందజేయాలని గానీ.. డీకేటీ భూములు అందజేస్తే వారికి ప్రత్యామ్నాయ భూమి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వ్యయప్రయాసలకోర్చి వస్తున్నాం

● మొర ఆలకించి దయచూపండి

● బాధితుల కన్నీటి వేదన

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్

ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పరిష్కరించే నాథుడే లేరు.. ఇక అసలు మండలాల్లో తమ గోడు వినే వారే లేరు.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు పలువురు అర్జీదారులు.. చేసేదేమీలేక విసిగి వేసారి ఎంతో వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చామని.. మీరైనా తమ బాధలు ఆలకించి పరిష్కరించాలని తమ ఆవేదన వెలిబుచ్చారు.. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు.

విస్తీర్ణం తగ్గించేశారు..!

పట్టాదారు పాసుపుస్తకంలో భూ విస్తీర్ణం తగ్గించి నమోదు చేశారని ఐరాల మండలం ఎర్రచెల్ల పంచాయతీ అబ్బుకుంట గ్రామ వాసి జయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు 2.63 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దాని రిజిస్టర్ పత్రాలు తమ వద్దే ఉన్నాయన్నారు. అయితే పట్టాదారు పాసుపుస్తకంలో రెండు ఎకరాల భూ విస్తీర్ణమే నమోదు చేశారని వాపోయారు. మిగిలిన 60 సెంట్ల నమోదుకు వీఆర్వోను ఇప్పటికే పలుమార్లు సంప్రదించామని ఆయన కనీసం పట్టించుకోలేదని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

దౌర్జన్యం చేస్తున్నారు..

తమ గ్రామంలో 11 సెంట్ల భూమిని కొనుగోలు చేశామని, ఈ భూమిలో పనులు చేసుకోవడానికి వెళ్లగా తమపై కొందరు దౌర్జన్యం చేస్తున్నారని పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన చిన్నకన్నమ్మ వాపోయారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

శ్మశానానికి దారిలేక అవస్థ పడుతున్నాం..

తమ గ్రామానికి అనుకుని నిర్మిస్తున్న చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే పక్కన సర్వీసు రోడ్డు నిర్మించాలని చిత్తూరు నగర పరిధి 12వ డివిజన్‌లోని నరిగపల్లె హరిజనవాడ వాసులు విన్నవించారు. హరిజనవాడలో 45 కుటుంబాలు ఉన్నాయని, ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు శ్మశానానికి, పశువులు మేతకు, పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు దారి ఉండేదన్నారు. అయితే ఈ మార్గంలోనే ఎక్స్‌ప్రెస్ వే వెళ్తోందని, దీని పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. రహదారికి ఇరువైపులా వెళ్లేందుకు వీలులేకుండా నిర్మాణాలు చేపట్టారని, తద్వారా పొలాలు, పాఠశాలలు, ఇతర అవసరాలకు వెళ్లే వీల్లేదని, కనీసం శ్మశానానికి వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. గ్రామస్థుల సౌకర్యార్థం ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

వంక కాలువ దారి మూసేసి దౌర్జన్యం

తమ పొలాలకు వెళ్లే వంక కాలువ దారి మూసేసి తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తవణంపల్లె మండలం అరగొండ పంచాయతీ నల్లప్పరెడ్డిపల్లి గ్రామ వాసులు రామచంద్రయ్య, వాసు, అమరావతి, చిన్నబ్బ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పది కుటుంబాలకు చెందిన రైతులు తమ పొలాలకు వంక కాలువ ద్వారానే వెళుతున్నామని, ఇటీవల గ్రామానికి చెందిన కొందరు వంక కాలువ మీదుగా వెళ్లేందుకు దారి లేదని, మూసేస్తామని తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. తమ పొలాలకు వెళ్లేందుకు వేరే మార్గం లేదని, ప్రభుత్వ స్థలమైన వంక కాలువ ద్వారా వెళ్తున్నామని చెబితే వెళ్లరాదంటూ తమని ఇబ్బంది పెడుతున్నారని, తమకు న్యాయం చేసి దారి సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు.

చంపేస్తామని బెదిరిస్తున్నారు..



తమ పొలానికి తాము వెళ్తుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఐరాల మండలం ముదిగోళం వాసి రంగనాయకుల నాయుడు బోరున విలపించారు. తాతలు సంపాదించిన 10.30 ఎకరాల భూమిలో తమ పెద్దలు 9.50 ఎకరాలు తమ గ్రామానికి చెందిన వారికి విక్రయించారన్నారు. మిగిలిన 0.80 ఎకరాలకు సంబంధించిన ఈసీలు, రిజిస్టర్ ధ్రువీకరణ పత్రాలు తమవద్ద ఉన్నాయన్నారు. అయితే తమ వద్ద కొనుగోలు చేసిన వ్యక్తులు మొత్తం 10.30 ఎకరాల విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లో, పట్టాదారు పుస్తకంలో నమోదు చేసుకున్నారన్నారు. తనకున్న 0.80 ఎకరాల భూమి తమదని తహసీల్దార్ సైతం ధ్రువీకరించారన్నారు. అయితే ఆ భూమి వద్దకెళ్తే చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు.

సీతారాములకు వసంతోత్సవం

టి.పుత్తూరులోని శ్రీకోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సీతారామ లక్ష్మణులకు తిరుమంజనం, పుష్కరిణిలో వసంతోత్సవం చేసి చక్రస్నానం చేయించారు. రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తవణంపల్లె**

గ్రాప్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విజేతలతో ఉపాధ్యాయ బృందం

వెదురుకుప్పం: తిరుపతిలోని గిరిజన భవన్ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో వెదురుకుప్పం మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి మూడు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్య పతకాలను సాధించారు. తిరుమలయ్యపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-15 విభాగంలో యామిని(44 కేజీలు), హేమశ్రీ(61 కేజీలు), 34 కేజీల విభాగంలో చైతన్య ఉత్తమ ప్రతిభతో స్వర్ణాలు సాధించగా, ప్రతిష్ఠ 44 కేజీల విభాగంలో రజత పథకాన్ని సాధించింది. వీరితో పాటు పీభా హర్షిణి, భవ్య కాంస్య పతకాలు సాధించారు. వీరిని హెచ్‌ఎం చాముండేశ్వరి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

దాహార్తి తీర్చండి మహాప్రభో..

తాగునీరు లేకుండా అవస్థలు పడుతున్నామని పాలసముద్రం మండలం కృష్ణమ్మాపురం పంచాయతీ కొండం, ఇందిరానగర్ గ్రామస్థులు వాపోయారు. ప్రస్తుతం నీటికోసం పొలానికి నడిచి వెళ్లి తీసుకొస్తున్నామని, అధికారులు స్పందించి నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. **- న్యూస్‌టుడే, కలెక్టరేట్**

మన ఆరోగ్యం మన చేతిలోనే

పుత్తూరు: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని బాలాజీ మెడికల్ కళాశాల డాక్టర్ బ్రహ్మానందం పేర్కొన్నారు. పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం రేణిగుంటలోని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 200 మందిని పరీక్షించి మందులు అందజేశారు. హరేరామ హరేకృష్ణ సమాజం ప్రతినిధి విశ్వంభర గోపాలదాస్ ప్రభు ప్రవచనాలు చేయగా ఏడుగురు నూతన సభ్యులు చేరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు యుగంధర్‌రాజు, సభ్యులు రమేష్, సాయినాథరావు, రవికుమార్, కుప్పయ్య, రామలింగం, బాలసుబ్రహ్మణ్యం, చిరంజీవులు పాల్గొన్నారు

స్వర్ణరథంపై విహరించిన లంబోదరుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారు సిద్ధిబుద్ధి సమేతుడై స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ సోమవారం రాత్రి భక్తులను కరుణించారు. ఈవో పెంచల కిషోర్ దంపతులు, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

స్వర్ణరథం పై ఊరేగుతున్న సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి

ఘనంగా సత్యసాయి రథయాత్ర

చిత్తూరు(సంతపేట), పెనుమూరు: సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర సోమవారం జిల్లాకు చేరింది. నగరంలోని పలు వీధుల్లో ఈ యాత్రను నిర్వహించారు. రథంలోని సత్యసాయి చిత్రపటానికి ఎమ్మెల్యే జగన్మోహన్ పూజలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం పాల్గొన్నారు.

రథం వద్ద ఎమ్మెల్యే జగన్మోహన్

ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

నగరి, న్యూస్‌టుడే: 'నిర్లక్ష్యం.. నిరీక్షణ' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు స్పందన లభించింది. పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వరండాలో గత నెల రోజులుగా అలానే ఉంచిన దివ్యాంగుల బ్యాటరీ వాహనాలు, మూడు చక్రాల సైకిళ్లను సోమవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ 432 మందికి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు రూ.56 లక్షల విలువ చేసే ఉపకరణాలు అందించాయన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్ మాట్లాడుతూ గతేడాది డిసెంబరులో లబ్ధిదారులను ఎంపిక చేశామని, తాజాగా వీటిని అందజేశామన్నారు. ఆర్డీవో భవాని శంకరి, కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కృష్ణయ్య, తెదేపా పట్టణ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి శ్రీనివాసన్, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం సీసాల తొలగింపు

చిత్తపార పీహెచ్‌సీ వద్ద పగిలిన మద్యం సీసాల సమస్యపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ స్పందించి వాటిని తొలగింపజేశారు. గేటుకు తాళాలను వేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, గుడిపాల**

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

బంగారుపాళ్యం: టేకుమందలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ సుపరిపాలన-తొలిఅడుగులో భాగంగా ఎమ్మెల్యే జగన్మోహన్ సోమవారం 20, 23, 25 డివిజన్లలో ప్రచారం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఇరువారంలో సర్వీసు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కామాక్షమ్మాళ్ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, కార్పొరేటర్ అశోక్ పాల్గొన్నారు. **నిండ్ర:** ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. ఆరూరు దళితవాడలో కరపత్రాలు పంపిణీ చేశారు. మండల తెదేపా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరావు, విజయ్‌కుమార్, నాయకులు చిట్టిబాబునాయుడు, ఆనందరాజు, రఘుయాదవ్, సుధాకర్‌నాయుడు, పయణి, అయ్యప్ప పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** టేకుమంద, కీరమంద, కామాక్షపురం, వినాయకపురం, తుంబపాళ్యం, తుంబకుప్పం, ఈచనేరిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రచారం నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలు పరిష్కరించాలని ఆయన్ను కోరారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు ప్రకాష్ నాయుడు, జిల్లా ఈడిగ సంక్షేమ సమితి అధ్యక్షులు నాగరాజు, ధరణీప్రసాద్‌నాయుడు, జనార్దన్, జయచంద్రనాయుడు, హేమచంద్రనాయుడు, కోదండయాదవ్, కమలనాథరెడ్డి, రమేష్ పాల్గొన్నారు. **చిత్తూరు(జిల్లా పంచాయతీ):** ప్రజల కోసం పని చేయాలని అధికారులను ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. అసంపూర్తి పనులపై అధికారులను నిలదీశారు.

● బంగారుపాళ్యం మండలం, నలగాంపల్లెకు చెందిన జ్యోతీశ్వర్‌రావుకు సీఎం సహాయ నిధి రూ.2,00,109 చెక్కును ఎమ్మెల్యే మురళీమోహన్ అందజేశారు.

స్వచ్ఛ-సర్వేక్షన్ కేంద్ర కమిటీ సభ్యుడి పరిశీలన .. **నిండ్ర:** ఇరుగువాయిలో స్వచ్ఛ-సర్వేక్షన్ కార్యక్రమంలో పంచాయతీలకు పాయింట్ల కేటాయింపునకు కేంద్ర కమిటీ సభ్యుడు గోవిందస్వామి సోమవారం పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి మరుగుదొడ్లు ఉన్నాయా..? లేవా..? అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

తాగునీరు అందించాలి.. పాలసముద్రం: తమ గ్రామానికి తాగునీటి వసతి కల్పించి దాహార్తి తీర్చాలని కొండం గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. వారం రోజులుగా తాగునీరు సరిపోక ఇబ్బంది పడుతున్నామన్నారు. స్పందించిన ఎంపీడీవో సతీష్ నీటి వసతి గుర్తించి నూతన బోరు మంజూరు చేసి దాహార్తి తీరుస్తామని హామీ ఇచ్చారు

చిరస్మరణీయుడు గరిమెళ్ల.. చిత్తూరు విద్య: 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయాన్ని రచించి స్వతంత్ర కాంక్షను రేకెత్తించిన గరిమెళ్ల సత్యనారాయణ చిరస్మరణీయుడని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం గరిమెళ్ల సత్యనారాయణ జయంతి నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

పాలసముద్రం, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో తెదేపాను మరింత బలోపేతం చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు తెలిపారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి లోకేశ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. రాజంపేట నియోజకవర్గ సమాచారం అడిగి తెలుసుకున్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితి, అభివృద్ధిపై చర్చించారు.

రాజ సింహులు | ప్రతాప్ నాయుడు | శేషాద్రి నాయుడు | చిత్ర

సహకార సంఘ ఛైర్మన్ల నియామకం

జగన్నాథన్ | ఇంద్రసేన నాయుడు

చిత్తూరు(జిల్లా పంచాయతీ): నియోజకవర్గ పరిధిలోని చిత్తూరు గ్రామీణ పీఏసీఎస్ ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, సభ్యులుగా వెంకటేశ్వర్లు నాయుడు, మోహన్‌ను నియమించారు. గుడిపాల పీఏసీఎస్ ఛైర్మన్‌గా డి.ప్రతాప్‌నాయుడు, సభ్యులుగా హరిప్రసాద్, సెల్వినాథన్ నియమితులయ్యారు. **ఐరాల:** ఐరాల సహకార సంఘ ఛైర్మన్‌గా పులిగుండ్ల శేషాద్రినాయుడు, సభ్యులుగా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, యాదమరి ఛైర్‌పర్సన్‌గా చిత్ర, సభ్యులుగా మహబూబ్‌బాష, డి.ప్రభాకర్ నియమితులయ్యారు. పూతలపట్టు మండలంలోని పూతలపట్టు ఛైర్మన్ పి.జగన్నాథన్, సభ్యులుగా గుణశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, ఎర్రచెరువుపల్లె ఛైర్మన్ ఇంద్రసేననాయుడు, సభ్యులుగా సుబ్రహ్మణ్యం, కిషోర్‌ను నియమించారు. చిత్తూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌ను కలిసి సత్కరించారు.

మద్యం దుకాణాల మధ్య గొడవతో పోలీసు బందోబస్తు

కల్యాణపురం వద్ద మద్యం దుకాణాల మధ్య నియమించిన పోలీసులు

పుత్తూరు, న్యూస్‌టుడే: పట్టణంలో మద్యం దుకాణాల మధ్య గొడవ తారస్థాయికి చేరింది. ప్రభుత్వం ఈ దుకాణాలను టెండర్ల పద్ధతిన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. అదే సమయంలో గౌడ కులస్థులకు కొన్ని దుకాణాలు కేటాయించగా స్థానిక గౌడ దుకాణాన్ని ఎ.నారాయణగౌడ్ దక్కించుకున్నారు. ఈ దుకాణాన్ని స్థానిక కొండల చెరువు వద్ద బైపాస్‌లో పెట్టుకున్నారు. అక్కడ పలువురు అభ్యంతరం చెప్పడంతో ఈశలాపురం రోడ్డు వద్ద, కార్వేటినగరం రోడ్డులో విష్ణుమహల్ సమీపంలో, ఆరేటమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసేందుకు గదులు చూసుకున్నారు. అక్కడ మహిళలు, స్థానికులు అభ్యంతరం చెప్పడంతో ఎక్సైజ్ అధికారుల నిర్ణయంతో కల్యాణపురం వద్ద గౌడ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అప్పటికే అక్కడ గంగా వైన్స్ పేరుతో ఓ మద్యం దుకాణం ఉంది. దీంతో మద్యం దుకాణాల లైసెన్స్ హోల్డర్ల మధ్య కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గంగా వైన్స్‌కు చెందిన యజమానులు దుకాణంలో పని చేసే సిబ్బందిని కొట్టి శనివారం తాళాలు వేశారని, సిబ్బంది దుకాణ యజమాని దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయాన్ని దుకాణ లైసెన్స్ హోల్డర్ నారాయణ గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తమ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సంఘ సభ్యులతో అక్కడకు చేరుకుని అగ్రవర్ణాలు తమపై దాడులకు తెగబడుతున్నాయని, ఇది తగదని, తమకు రక్షణ కల్పించాలని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సంఘ నాయకులు స్పష్టం చేశారు. అక్కడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా దుకాణాల వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సీఐ సురేంద్రనాయుడు పోలీసులను ఏర్పాటు చేశారు.

వరి నారును మేకలు పాడుచేశాయని అడిగినందుకు దాడి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని తుంబకుప్పం దళితవాడకు చెందిన రామ్ విలాస్ పాశ్వాన్(28) వరి నారును.. విరుపాక్షపురానికి చెందిన అహ్మద్‌బాషాకు చెందిన మేకలు ఆదివారం పాడుచేశాయి. దీనిపై అతడు.. అహ్మద్‌బాషాను మందలించాడు. దీంతో అతడు కక్షగట్టి సోమవారం తుంబకుప్పం బస్టాప్ వద్ద ఉన్న రామ్‌విలాస్ పాశ్వాన్‌పై కత్తితో దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడు ప్రస్తుతం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అహ్మద్‌బాషాపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పుష్పమిసాయిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కార్వేటినగరం: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పుష్పమిసాయి రాష్ట్రస్థాయి పెంటథ్లాన్ 600 మీటర్ల రిలే పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించిందని హెచ్‌ఎం శేఖర్ సోమవారం తెలిపారు. శనివారం గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించడం గర్వకారణమన్నారు. పుష్పమిసాయిని ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు.

స్పందించి.. పరిష్కరించి

వళ్లియప్పనగర్‌లో పూడికతీత పనులు చేస్తున్న కార్మికుడు

● అధికార యంత్రాంగం చొరవ

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా 'ఈనాడు మీతోడు' విభాగంలోని 'మేమున్నాం-మీకుతోడు' ద్వారా వచ్చిన పలు సమస్యలపై నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు.. ఎప్పటికప్పుడు ప్రచురితమైన వార్తలపై స్పందించిన నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు.. వీధుల్లో చెత్త, వ్యర్థాలు, కాలువలు పూడిపోవడం, దోమల విజృంభణ తదితర సమస్యల్ని ప్రజలు ఫిర్యాదు చేయగా సమస్యలు పరిష్కరించారు.

● మురుకంబట్టులోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంపై స్థానికుల ఫిర్యాదు చేయగా నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు కాలువలో పూడిక తొలగింపజేశారు. ● విజయానగర్‌కాలనీలోని పూడిపోయిన కాలువలు శుభ్రం చేసి పారిశుద్ధ్య పనులు పూర్తిచేశారు. ● న్యూ బాలాజీకాలనీలో నివాసాల ఎదుట కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుని దుర్వాసన, దోమల బెడదపై ప్రజారోగ్య విభాగం అధికారులు చొరవ చూపి పరిష్కరించారు. ● మిట్టూరు ఎక్స్‌టెన్షన్‌లో నివాసాల మధ్య పేడదిబ్బలు, వ్యర్థాలు పేరుకుపోగా నగరపాలక ప్రజారోగ్య విభాగం సిబ్బంది కాలువలు బాగుచేశారు. ● మురుకంబట్టు జీకేనగర్‌లో నివాసాల ఎదుట డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడదపై స్థానికుల ఫిర్యాదు మేరకు దోమల సమస్య పరిష్కరించారు.

● వళ్లియప్పనగర్‌లోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడదపై స్థానికుల ఫిర్యాదుతో ప్రజారోగ్య విభాగం అధికారులు పూడికతీత పనులు పూర్తిచేశారు. ● లక్ష్మీనగర్‌కాలనీలోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో.. దుర్వాసన, దోమల బెడదపై స్పందించిన ప్రజారోగ్య విభాగం అధికారులు పూడిక తొలగింపజేశారు.

● గంగనపల్లి నుంచి గంగాకాలనీ వెళ్లే మార్గంలోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుని దుర్వాసన, దోమల బెడదపై స్థానికుల ఫిర్యాదుతో ప్రజారోగ్య విభాగం అధికారులు కాలువలు శుభ్రం చేయించారు.

నీటి వృథాకు అడ్డుకట్ట..

మిట్టకండ్రిగ గ్రామానికి ఎస్టీ కాలనీ వద్ద నుంచి గ్రామంలోకి తాగు నీరు సరఫరా చేసే పైపులైను లీకేజీ సమస్యపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మరమ్మతులు ప్రారంభింపజేశారు. **- న్యూస్‌టుడే, నిండ్ర**

గేటు వాల్వుకు మరమ్మతు

సాయినగర్ కాలనీ వద్ద ఉన్న గేటు వాల్వు వద్ద పగిలి నీరు లీకవుతున్న సమస్యపై పంచాయతీ కార్యదర్శి ప్రభు కిరణ్‌కుమార్ స్పందించి సిబ్బంది సహకారంతో మరమ్మతు చేయించి నీటి వృథా అరికట్టారు.

-న్యూస్‌టుడే, పెనుమూరు

ముళ్లకంపల తొలగింపు

సింహరాజుపురం పంచాయతీ కోసరాపల్లికి వెళ్లే రహదారిలో ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిన సమస్యపై స్పందించిన ఎంపీడీవో సతీష్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ సిబ్బంది సహాయంతో వాటిని తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, పాలసముద్రం

మట్టి కుప్పలు..

చిత్తూరు-పలమనేరు హైవేలోని తమిళనాడు హోటల్ సమీప రహదారి పక్కన ఉన్న మట్టికుప్పల సమస్యపై సీఐ శ్రీనివాసులు స్పందించి వాటిని తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION):: PUTTUR
S.O.P.No: 2/2025

BETWEEN:
Y.Gayathri ...Petitioner
AND:
Nil ...Respondent

జనరల్ నోటీస్

పై S.O.P.No.2/2025లో Y.గాయత్రి W/o V.సుబ్బరామయ్య అనువారు పుత్తూరు Hon'ble Civil Judge (Senior Division) కోర్టు నందు మనూ దాఖలా చేసిఉన్నారు. మనూదారు ఆయన గాయత్రి గారి భర్త V.సుబ్బరామయ్య జీవించిఉన్న కాలంలో D.ఉమాపతి అను ఆతనికి వేద్వేరు తేదీలలో రూ.25,00,000/- అప్పు ఇచ్చిఉన్నారని ఇందుకు మనూదారు వారసురాలని మనూదాఖలా చేసిఉన్నారు. పై విషయములో ఎవరికైన ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల అట్టివారు 13.08.2025 వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు నేరుగాగాని లేక న్యాయవాది తరుపున గానీ వారి వారి ఆక్షేపణలను తెలుపవలయును. ఎవరూ ఆక్షేపణ తెలుపని యెడల పై మనూదారుని వారసురాలని పరోక్ష తీర్మానము చేయుదురని తెలియపరచడమైనది.

B.RAVEENDRA B.Sc., BL.,
U.S.RAYUDU M.Sc., BL.,
P.G.VENKATESH, B.Sc., BL.,
Advocates/Puttur.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, తితిదే పాలకవర్గ సభ్యుడు శాంతారామ్, డా.సురేష్‌బాబు

'రైతుల ముసుగులో వైకాపా తీవ్రవాదులు'

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నడూ లేని విధంగా మామిడి రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని, రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తుంటే.. వైకాపా తీవ్రవాదులు రైతుల ముసుగులో గందరగోళం సృష్టించారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తోతాపురి మామిడి అధిక దిగుబడి రావడంతో పరిశ్రమలు మామిడి కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైకాపా నాయకుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పరిశ్రమ ద్వారా మార్కెట్‌లో తక్కువ ధరకే కొని రైతులను గిట్టుబాటు ధర రాకుండా చేశారని విమర్శించారు. పరిశ్రమలతో మాట్లాడి రైతుల గిట్టుబాటు ధర, రాయితీ వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వానికి మంచి పేరు రావడం చూసి ఓర్వలేని వైకాపా నాయకులు రోడ్లపై పారబోసి, ట్రాక్టర్ల ద్వారా తొక్కించి వైకాపా రాక్షస ఆనందం పొందడం దారుణమన్నారు. వైకాపా కుట్రలు ప్రభుత్వం గమనిస్తోందన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, తితిదే పాలకవర్గ సభ్యుడు శాంతారామ్, నాయకులు ప్రేమ్‌కుమార్, రామచంద్ర, సంతోష్ తదితరులు ఉన్నారు.

పాలేటమ్మ జాతర ప్రారంభం

సోమల: మండలంలోని నెల్లిమంద పాలేటమ్మ జాతరకు ఓ ప్రత్యేకత ఉంది. ఒక వర్షం వారు జాతర ముందు చేస్తే మరో వర్షం వచ్చేవరకు ముందు చేశారు. ఈ ఏడాది పాలేటమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని నెల్లిమంద గొల్లపల్లెలో బయటకు తీసి స్నానం చేయించి విశేష అలంకరణ చేసి పూజలు అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్థులు పల్లకిలో ఊరేగించారు.

కమనీయం.. ద్రౌపదీదేవి కల్యాణం

కమనీయం.. అమ్మవారి కల్యాణం

సదుం, కల్లూరు: సదుం గ్రామంలోని బెట్టువారిపల్లెలో ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞ కార్యక్రమంలో భాగంగా సోమవారం ద్రౌపదీదేవి అమ్మవారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ప్రాంగణంలో పెళ్లి పందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను అలంకరించారు. సకల దేవతలను ఆహ్వానం పలుకుతూ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సదుం గ్రామ పంచాయతీ ఉపసర్పంచి బాబురెడ్డి దంపతులు, జాంధ్రపేటకు చెందిన మల్రెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

అలంకరణలో వినాయకుడు

పుంగనూరు: సంకటహరచతుర్థి సందర్భంగా సంతగేటులో గల వినాయకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. మూలవిరాట్‌ను పూజించారు. నేడు పుంగనూరులో రథయాత్ర.. : సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 14న పెనుమూరులో ప్రారంభమైన శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర మంగళవారం పుంగనూరు చేరుకుంటుందని సత్యసాయి భజన మండలి కన్వీనరు కె.రఘుపతి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీటీ రోడ్డు నుంచి బజారువీధి, నాగపాళ్యం, మీదుగా కొత్తఇండ్లు చేరుకుంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.36లక్షలు మంజూరు.. కల్లూరు, న్యూస్‌టుడే: సదుం, పులిచెర్ల మండలాల్లో పలు అభివృద్ధి పనుల కోసం రాజంపేట పార్లమెంటు ఎంపీ మిథున్‌రెడ్డి రూ.36లక్షలు ఎంపీ నిధులను మంజూరు చేశారు. సదుం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ రూమ్ ఏర్పాటుకు రూ.13లక్షలు, చింతపర్తి వారిపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, దోబీఘాట్ వద్ద అదనపు గదికి రూ.5లక్షలు, పులిచెర్ల మండలం కల్లూరు పాఠశాలలో అదనపు గదికి రూ.4లక్షలు, కల్లూరు ముస్లిం శ్మశానవాటికలో ప్రహరీకి రూ.3లక్షలు మంజూరు చేశారు.

గోడప్రతులు ఆవిష్కరణ.. సదుం, కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరులోని ఓ సినిమా థియేటర్‌లో సీఎం చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

సార్.. నష్టపోతున్నాం.. స్పందించండి

✦ పీజీఆర్ఎస్‌లో సమస్యల వెల్లువ

వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: 'సార్.. పింఛన్లు, పరిశ్రమల నుంచి వచ్చే కలుషిత నీటితో పంటలు సాగు చేసి నష్టపోతున్నాం..' ఇలా తమ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ ఎదుట ఫిర్యాదుదారులు గోడును వెలిబుచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను కడ పీడీ పరిశీలించి, ఆయా శాఖాధికారులకు పంపారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాలుష్యం భరించలేక పోతున్నాం..

గ్రామీణ మండల పరిధిలోని స్టీల్ పరిశ్రమ నుంచి వెలువడే నల్లటి పొగ కారణంగా గ్రామంలో కాలుష్యం ఏర్పడుతోంది. 15 ఏళ్లుగా ఈ పరిస్థితి నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాం. ఈ కాలుష్యం కారణంగా సమీప పంటలు నాశనమై తీవ్రంగా నష్టపోతున్నాం. - 12 గ్రామాల ప్రజలు, - నడిమూరు, వసనాడు, జోగిండ్లు, పైపాళ్యం, ములకలపల్లి, కుప్పం మండలం

ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించండి..

కుప్పం పట్టణం మురుగన్ టాకీస్ వీధిలో నివాసం ఉంటున్నా. నాకు ఎవరూ లేక ఒంటరిగా జీవిస్తున్నా. ఆస్తులు సైతం లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. ఒంటరి మహిళ పింఛన్‌ను మంజూరు చేయించి, ఆదుకోవాలి. - నాగమ్మ, కుప్పం

అనాధీనంగా ఆన్‌లైన్‌లో చూపుతోంది

ఏళ్లుగా మా ఆధీనంలో ఉన్న భూమిని మా పూర్వీకుల నుంచి సాగు చేస్తున్నాం. గతంలో రెవెన్యూ రికార్డుల్లైన 1-బి, అడంగళ్‌లో మా ఆధీనంలో ఉన్నట్లు వస్తుండేది. 2020లో ఆన్‌లైన్‌లో అనాధీనంగా చూపుతోంది. వీఆర్వో క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించినా రికార్డుల్లో మార్పు కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నా. - కేశవప్ప, బల్ల, రామకుప్పం

అప్పటి వాలంటీర్లు ఒకే కార్డులో చేర్చారు

గతంలో నాకు పింఛన్ వస్తుండేది. నా కుమార్తె భర్త చనిపోవడం, అప్పటి వాలంటీరు వ్యవస్థలో నన్ను, నా కుమార్తెను ఒకే కార్డులో చేర్చారు. దీంతో ఆమెకు పింఛన్ వస్తోంది. వయసుపైబడిన నాకు పింఛన్ రావడం లేదు. - కమలమ్మ, 89-పెద్దూరు

చొరవ చూపి పరిష్కరించండయ్యా

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు అందాయి.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలి

నాలుగెకరాల పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నాం. నా వద్ద అన్ని పత్రాలు ఉన్నాయి. ఈ భూమిని వేరొకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అధికారులు విచారించి సదరు అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలని విన్నవిస్తున్నా. -సతీష్‌కుమార్, దిగువపల్లి, చౌడేపల్లె మండలం

విద్యుత్తు సర్వీసు ఇవ్వలేదు

సేద్యం పనుల కోసం ఆరు నెలల క్రితం బోరు వేశాను. విద్యుత్ సర్వీసు మంజూరు చేయాలని ఆరు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నా. అధికారులు నాకు న్యాయం చేయాలని అర్థిస్తున్నా. -కాటమన్న, నూనెముద్దలపల్లి, చౌడేపల్లె మండలం

చంద్రబాబు హామీలతో మరోసారి మోసం చేశారు: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను మోసపూరిత హామీలిచ్చి మళ్లీ మోసం చేశారని మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని వీఎంఆర్‌గార్డెన్‌లో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 40శాతం ఓట్లు వైకాపాకు వచ్చినప్పటికీ 11 సీట్లే వచ్చాయని, రానున్న ఎన్నికలలో 40శాతం నుంచి 60శాతానికి పెరగాలన్నారు. పురుషోత్తంరెడ్డి, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, రెడ్డీశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి సమస్యలు తెలుపుతున్న సభ్యులు

పట్టణ సమస్యలు పరిష్కరించండి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు డీఎస్పీ ప్రభాకర్‌ను కోరారు. సోమవారం ఆమేరకు ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో వ్యాపారుల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. గుండుబావి సర్కిల్, గంగమ్మఆలయ వీధి, శివాలయం, రంగబాబు కూడలి ప్రాంతాల్లో రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని కోరారు. పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యంపిళ్లే, నరసింహులు, సభ్యులు పాల్గొన్నారు.

భవనం.. శిథిలం

ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఏడాది కిందట వరకు ఇందులోనే తహసీల్దారు కార్యాలయం, సబ్‌ట్రెజరీ, పోలీసు వైర్‌లెస్‌స్టేషన్ ఉండేది. మొదట తహసీల్దారు కార్యాలయాన్ని కోర్టు సమీపంలోని నూతన భవనంలోకి ఒకదాన్ని, పట్టణంలో ఓ ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకుని సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని మార్చేశారు. ఇందులోనే ఉన్న సబ్‌జైలు కూడా దుస్థితికి చేరడంతో మదనపల్లెకు మార్పించేశారు. దుస్థితిలో ఉన్న వాటిని కూల్చేసి అవసరమున్న ప్రభుత్వ కార్యాలయాల కోసం నూతన భవన నిర్మాణాలు చేపట్టాలి. - న్యూస్‌టుడే, పలమనేరు

ప్రచారం.. ప్రమాదకరం

వ్యాపార ప్రచారాల కోసం ఏర్పాటు చేసిన బ్యానర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని కుప్పం బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ వంతెన వద్ద వ్యాపార ప్రచార బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. వీచిన గాలికి రోడ్డుపై పడింది. అప్పుడు ఏ వాహనం రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వంతెనకు నామమాత్రంగా కట్టడంతో చిన్నపాటి గాలికే రోడ్డుపైకి కొట్టుకొచ్చింది. అధికారుల నియంత్రణ లేకపోవడంతో సమస్యగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

బస్సు.. తుస్సు

కుప్పం ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రయాణికులపై నిర్లక్ష్యం చూపుతున్నారని వారు వాపోతున్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు నడుపుతున్న కండీషన్ లేని బస్సులతో తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకుంటామా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సోమవారం సాయంత్రం పెద్దపర్తికుంట గ్రామం నుంచి చిన్నగొల్లపల్లె, గుడుపల్లె మీదుగా కుప్పం వెళ్తున్న కాలం చెల్లిన బస్సు మార్గ మధ్యలో మరమ్మతులకు గురై ఆగిపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు గంటపాటు ఆలస్యమైందని వారు వాపోయారు.

- న్యూస్‌టుడే, గుడుపల్లె

పెళ్లి కళ వచ్చేస్తుందే..

మున్సిపల్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న షాదీమహళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పట్టణంలోని షాదీమహల్ నిర్మాణానికి రూ.కోటి విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ డిపార్టుమెంటు నుంచి సోమవారం ఆదేశాలు విడుదలయ్యాయి. గత తెదేపా హయాంలో 2019లో అప్పటి పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి వీటిని ప్రారంభించారు. తర్వాత వచ్చిన వైకాపా వీటి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసింది. జండామఠంలో మరమ్మతులతో పాటు అభివృద్ధి చేయడానికి రూ.20లక్షలు, దండపల్లెరోడ్డులో మరో రూ.20 లక్షలు విడుదల చేసింది. వి.కోటలో నిర్మాణానికి రూ.కోటి విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. - న్యూస్‌టుడే, పలమనేరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: బైపాస్ మార్గంలో ఎలాంటి అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా ప్రచార బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. - కుమార్, కుప్పం
సమాధానం: అనుమతులు లేకుండా బ్యానర్లను ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, కమిషనర్

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని ఎల్ఎం బ్యాంకు వెనుక మురుగు కాలువల్లో చెత్త పేరుకుని మురుగు ముందుకు పారడం లేదు. - సుబ్రహ్మణ్యం
సమాధానం: సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించి మురుగు పారేలా చేస్తాం. - ఎన్వీరమణారెడ్డి, కమిషనర్

ఈనాడు కథనానికి స్పందన

పరిసరాలు పరిశుభ్రం.. పెద్దపంజాణి: పెద్దారికుంట విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం ఎదుట అపరిశుభ్రతను వైద్యాధికారి మురళి ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రం చేయించారు. 'ఇక్కడ పరిసరాలు అపరిశుభ్రం' శీర్షికన ఈనాడులో ఆదివారం కథనం ప్రచురితమవడంతో స్పందించారు. బాగుపడిన కుళాయిలు.. చౌడేపల్లె: దిగువపల్లె పంచాయతీ బోయకొండ కింద యానాదిపాళ్యంలో తాగునీరు కుళాయిలను సోమవారం బాగుచేశారు. 'ఫౌంటెన్ కాదు.. పైపులీకేజీ' చిత్ర కథనం 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో లీలామాధవి సూచనలు మేరకు కార్యదర్శి పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చెంగారెడ్డిలు పైపులు, కుళాయిలు బాగుచేశారు.

స్పందనకు వందనం

తొలగిన మురుగు.. పలమనేరు: పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. కాలువలను కూడా శుభ్రం చేశారు. ఇక్కడ మురుగుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఈనాడులో సమస్య ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడుతూ.. ఇందిర, ఎన్టీఆర్, అంబేడ్కర్ కూడలి తదితర ప్రాంతాల్లో పార్కింగ్ చేసినా, అతివేగంగా వెళ్లినా కేసులు నమోదు చేస్తామన్నారు.

ముద్దచర్మ వ్యాధి సోకకుండా..

గుడుపల్లె: వర్షాభావం కారణంగా వీస్తున్న గాలితో వైరస్ కారణంగా పశువులకు ముద్దచర్మ వ్యాధి విస్తృతంగా ప్రబలే అవకాముందని, వ్యాధి సోకకుండా ముందస్తుగా పశువులకు టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టినట్లు మండల పశువైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. కాడేపల్లెలో మునిరత్నం అనే రైతుకు చెందిన పాడి పశువు అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స చేపట్టి మందులు సోమవారం అందచేశారు.

కలెక్టరుకు ఆహ్వానం

పుంగనూరు: పట్టణంలో ఈ నెల 27న ప్రారంభించే మహేష్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి కార్యక్రమానికి కలెక్టరు సుమిత్‌కుమార్, ఏఎస్పీ రాజశేఖర్‌రాజులను ఆహ్వానించామని నిర్వాహకుడు మహేష్ తెలిపారు. సీఐ సుబ్బరాయుడితో లోగోను సోమవారం ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

పుంగనూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం)లుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట వారు నల్లపట్టీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుతో చేపట్టిన ఈ నిరసనలో వారు మాట్లాడుతూ అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఏళ్లుగా ప్రమోషన్ కల్పించడంలేదని వాపోయారు.

వేధింపులపై కేసు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పలగార్లపల్లెకు చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు కోరిక తీర్చాలని వేధించాడు. పంచాయతీలతో రెండు రోజుల పాటు కాలయాపన చేశారు. దీంతో 'ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో వార్త వెలువడింది. స్పందించిన ఎస్సై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రెడ్డిసంఘం అభ్యున్నతికి కృషి

ఎన్నికకు హాజరైన సభ్యులు

పలమనేరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని రెడ్డి సంఘ సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఆ సంఘం (రాస్) నూతన అధ్యక్షుడిగా ఎంపికైన జయరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని లయన్స్ సర్వీసు కేంద్రంలో సోమవారం సంఘ ఎన్నికలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి

భూమిపూజలో పాల్గొన్న తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, నాయకులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు పేర్కొన్నారు. తీర్థం గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. గ్రామంలో రూ.9 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. తెదేపా నాయకులు సుబ్రహ్మణ్యం, కృష్ణప్ప, గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి, విశ్వనాథ్, మాబూసాహెబ్ పాల్గొన్నారు.

'ఓర్వలేకనే విమర్శలు'



మాట్లాడుతున్న తెదేపా మండలాధ్యక్షుడు మాధవరెడ్డి

పుంగనూరు: కూటమి ప్రభుత్వం చేపడుతున్న, అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారని తెదేపా మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, శ్రీకాంత్, సుహేల్‌బాషా అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ పెరుగుతుండడంతో వైకాపా ఉనికి నిలుపుకోవడానికి ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీవీరెడ్డి, జగదీష్‌రాజు, సమీపతి, విరూపాక్షి, వెంకటరెడ్డి, ప్రసాద్‌స్వామి, గంగులప్ప పాల్గొన్నారు.

పుర మిత్ర.. మన మిత్ర సేవలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో పుర మిత్ర.. మన మిత్ర యాప్ సేవలను కుప్పం ప్రజలు ఉపయోగించుకోవాలని కమిషనర్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వాట్సప్ నెం.9552300009 ద్వారా సేవలను వినియోగించుకోవాలన్నారు.

హాయ్ అంటే అరచేతికే ధ్రువపత్రం

❖ మనమిత్రతో సులభంగా సేవలు

పుంగనూరు పురపాలక కార్యాలయం

పుంగనూరు, న్యూస్‌టుడే: పరిపాలనలో కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అందులో భాగంగా స్మార్ట్ ఫోన్ ద్వారా సులభంగా సేవలు పొందేలా 'మన మిత్ర' పేరుతో వాట్సప్ నెంబరు 95523 00009ను ఏర్పాటు చేసింది. నంబరుకు హాయ్ అని సందేశం పంపితే. . కావాల్సిన సేవల ధ్రువపత్రాలు సులభంగా పొందొచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని ముఖ్యమైన పౌర సహాయక సేవలను తెలుసుకుందాం.

పన్నుల వివరాలు: పురపాలకశాఖకు చెల్లించే ఆస్తి పన్ను, నీటిపన్ను, కుళాయి కనెక్షన్లు, మురుగునీటి సమస్యలు, నిర్మాణాలకు అనుమతులు, నీటి ఛార్జీల బకాయిల వివరాలు తెలుసుకోవచ్చు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు: దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలపై పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ప్రజలు ఫిర్యాదు చేయొచ్చు. కలెక్టరు పరిశీలించి సంబంధిత అధికారులను క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక కోరతారు.

ఇంటి నుంచే బస్సు టిక్కెట్లు: జిల్లా నుంచి పొరుగు నగరాలైన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు ఎక్కువ రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వం సూచించిన మనమిత్ర యాప్ ద్వారా ఎక్కడికి వెళ్లాలన్నా ఇంట్లో నుంచే టిక్కెట్లు పొందవచ్చు.

వైద్యసేవలు తెలుసుకోవచ్చు: యాప్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య కార్డు ద్వారా అందుబాటులో ఉన్న వైద్య సేవలను ఆధార్ సంఖ్యను నమోదు చేసి తెలుసుకోవచ్చు.

విద్యుత్తు సమస్యల పరిష్కారం: విద్యుత్తు కనెక్షన్లు, ఛార్జీల చెల్లింపు, సరఫరాలో అంతరాయంపై సేవానెంబరు నమోదు చేసి సహాయం పొందే అవకాశం ఉంది.

ధ్రువపత్రాలు : కుల, ఆదాయ, వివాహ ధ్రువపత్రాలు, ఓబీసీ, టైటిల్‌డీడ్, పట్టాదారు పాసు పుస్తకం పొందొచ్చు.

దైవదర్శనం: రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల్లో దైవదర్శన టిక్కెట్లకు చరవాణి ద్వారా నమోదు, సేవల రకాలు, వసతి, దర్శనం, తేదీ ఎంపిక చేసుకోవచ్చు.

ఎలా పొందాలంటే..

మనమిత్ర యాప్‌ను ప్రదర్శిస్తున్న సీఎం చంద్రబాబు(పాత చిత్రం)

మనమిత్ర వాట్సప్ నెంబరు(9552300009)కు హాయ్ అని సందేశం పంపాలి. అవసరమైన ఐచ్ఛికంపై క్లిక్ చేయాల్సి ఉంటుంది. ఎంచుకున్న సేవలలో ఏ ధ్రువపత్రం, సేవను ఎంచుకోవాలి. అనంతరం ఆధార్ సంఖ్యను నమోదు చేస్తే ఓటీపీ వస్తోంది. లాగిన్ అయి వివరాలు నమోదు చేయాలి. పూర్తి సమాచారాన్ని, చెల్లింపులను పూర్తి చేసిన అనంతరం వాట్సప్ గవర్నెన్స్‌లో ధ్రువీకరణ పత్రాలు పొందొచ్చు.

ఆస్తి తగాదాతో మహిళలపై దాడికి యత్నం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాతో మహిళలపై కర్రతో దాడికి యత్నించిన ఘటనలో పోలీసులు వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి ఉలవలదిన్నె గ్రామానికి చెందిన క్రిష్ణప్ప పెద్ద కోడలు సావిత్రి, మనవరాలు రాధలపై.... మామ క్రిష్ణప్ప బంధువు గణేష్ అనే యువకుడు ఆస్తి తగాదాతో చంపేస్తానని బెదిరించేవారు. దీంతో సావిత్రి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె మండలం జంగాలపల్లెకు చెందిన భాస్కర్ పుంగనూరు మండలం ఈడిగపల్లెలో తన స్నేహితుడు శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని పరామర్శించేందుకు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఆలస్యం కావడంతో అక్కడే నిద్రించారు. సోమవారం ఉదయం ఇంటి ముందు వాహనం చోరీకి గురైనట్లు గుర్తించారు. భాస్కర్ ఫిర్యాదు మేరకు పుంగనూరు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

200మీటర్ల కేబుల్..

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని చారాల పంచాయతీ కురప్పల్లెకు తాగునీరు సరఫరా చేస్తున్న బోరుకు అమర్చిన 200 మీటర్ల కేబుల్ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. పంచాయతీ సర్పంచి విజయకుమారి, కార్యదర్శి ప్రసాద్‌లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు

బాలిక అదృశ్యం

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల గిరిజన బాలిక ఈ నెల 8న అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. ఆచూకీ దొరకకపోవడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివశంకర్ తెలిపారు.

ముగ్గురిపై దౌర్జన్యం కేసు నమోదు

క్రైం కార్నర్

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని తీర్థం గ్రామానికి చెందిన ముగ్గురిపై సోమవారం దౌర్జన్యం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై పరశురాముడు తెలిపారు. గ్రామానికి చెందిన గోవిందస్వామి అన్ని రికార్డులు కల్గిన తన పొలాన్ని ట్రాక్టరుతో దున్నుతుండగా సోమశేఖర్, యుగంధర్, రెడ్డెప్పలు దౌర్జన్యం చేస్తూ దుక్కి దున్నకుండా అడ్డుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత.. వివాహిత అరెస్టు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి మూడు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ధనంజయరెడ్డి తెలిపారు. రాయలపేట పంచాయతీ గొనివారిపల్లె గ్రామానికి మునెప్ప భార్య సుమతి ఇంటి వద్ద గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచుకున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం సిబ్బందితో తనిఖీ చేయగా లభించింది. స్వాధీనం చేసుకుని నిందితురాలు సుమతిని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితురాలు

(c) eenadu

పెద్దాపురంలో కార్మికులు తయారుచేసిన సిల్క్

పెద్దాపురం సిల్క్‌కు అరుదైన గుర్తింపు

అవార్డు అందుకున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ కలెక్టరేట్, పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద 2024-25కు పెద్దాపురం సిల్క్ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలోని 26 జిల్లాలు పోటీలో నిలవగా.. ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులకు అవార్డులు వచ్చాయి. అందులో కాకినాడ జిల్లానుంచి పెద్దాపురం సిల్క్‌కు చోటు దక్కింది. పురస్కారాన్ని సోమవారం దిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్‌గోయల్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అందరి కృషితో ఇటీవల జిల్లాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు ఎక్కువగా వచ్చాయన్నారు.

పూర్వం నుంచీ ప్రసిద్ధి..: పెద్దాపురం సిల్క్ పూర్వం నుంచి ఎంతో ప్రసిద్ధి. పట్టణంలో రెండు చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో దారానికి రంగులద్దే పనిపై 40 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. బెంగళూరు నుంచి తెప్పించిన సిల్క్‌కు ఇక్కడ రంగులద్ది ఉప్పాడలోని చీరల తయారీ మగ్గాల వారికి తరలిస్తారు. అక్కడ వారు చీరలు నేసి ఎగుమతి చేస్తారు. స్థానికంగానూ విక్రయాలు చేస్తారు.

70 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)లకు పర్సన్ ఇన్‌ఛార్జుల (త్రీమెన్ కమిటీలు) నియామకం కొనసాగుతోంది. మొదటి విడతగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 110 సొసైటీలకు కమిటీలను నియమించగా, తాజాగా సోమవారం విడుదల చేసిన జీవో జాబితాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 52, కాకినాడ జిల్లాలో 14, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 1, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 3 పీఏసీఎస్‌లకు ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వరదల వేళ.. తప్పని యాతన

▪ పశ్చిమలోని లంకగ్రామాల వాసుల మొర ▪ ఆర్థిక భారం భరించలేకున్నామని ఆవేదన

న్యూస్‌టుడే, పి.గన్నవరం, ఆచంట

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండల పరిధిలోని వివిధ లంకగ్రామాల ప్రజలు నిత్యం పనుల నిమిత్తం సమీపంలోని కోనసీమ జిల్లా పి.గన్నవరం వస్తుంటారు. గోదావరి వరదల సమయంలో రేవులు దాటి రాకపోకలు సాగించాలి. ప్రభుత్వ పరంగా మరపడవలు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఆర్థిక భారం భరించలేకపోతున్నామని వాపోతున్నారు. గోదావరి మధ్యలో ఉన్న పెదమల్లంక, అనగార్లంక, కోడేరులంక, మర్రిమూల, అయోధ్యలంక వాసులు సొంతంగా మరపడవలు ఏర్పాటుచేసుకుని వాటి నిర్వహణ, పడవ నడిపే వ్యక్తికి అయ్యే ఖర్చులు భరిస్తూ నిత్యం రేవులు దాటుతున్నారు. సీజన్ తగ్గేవరకు కుటుంబానికి రూ.500 నుంచి రూ.600 చొప్పున నెలకు భరిస్తున్నామని సోమవారం 'ఈనాడు-ఈటీవీ' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా నుంచి రేవు కూలు అక్కడి లంకగ్రామాల వారికి పెట్టినట్లుగానే తమకూ పడవలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో..: కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవి సహాయంతో లంకగ్రామాల్లో పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రేవుల్లో కొన్ని లైఫ్‌జాకెట్లు అందించారు. మరపడవలు ఏర్పాటు చేయడమనేది ఖర్చుతో కూడుకున్నది. వీటిని పశ్చిమగోదావరి జిల్లా అధికారులు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

లైఫ్‌జాకెట్లు లేకుండా మర పడవలో వెళ్తున్న పెదమల్లంక వాసులు

పడవ దిగిన తరువాత ఇళ్లకు చేరుకునేందుకు చిన్నారులను ఎత్తుకొని వస్తున్న అనగార్లంక వాసులు

పడవలు కావాలి

పశ్చిమ గోదావరికి మధ్యలో ఉన్నాం. బెల్లంపూడి నుంచి రేవు దాటి మధ్యలో చిన్నపాటి పాయలో నడుములోతు నీటిలో నడిచి ఇళ్లకు చేరుకుంటున్నాం. వరదల సమయంలో ఏటా సొంతంగా మరపడవలను సమకూర్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. **-చీకరమిల్లి సురేష్, పెదమల్లంక, ఆచంట**

నిర్లక్ష్యానికి గురవుతున్నాం..

మా సమస్యల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. అనేకమంది విద్యార్థులు చదువుల కోసం కోనసీమ జిల్లావైపు రాకపోకలు సాగిస్తుంటారు. అటు వైపు లంకగ్రామాలకు ప్రభుత్వం మరపడవలు ఏర్పాటు చేసింది. మాకు మాత్రం లేవు.. నిర్లక్ష్యానికి గురవుతున్నాం. **-తవిటికి కృష్ణమూర్తి, అనగార్లంక**

ఆర్డీవో దృష్టికి తీసుకెళతాం..

ఆచంట మండల పరిధిలో గోదావరి నదికి మధ్యలో ఉన్న లంకగ్రామాలకు వరదల సమయంలో మరపడవలు ఏర్పాటు చేయడంలేదు. మా వద్ద లైఫ్‌జాకెట్లు లేవు. మంగళవారం సమావేశం ఉంది. నరసాపురం ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటాం.

-కనకరాజు, తహసీల్దార్, ఆచంట

బదిలీలు.. అక్రమ వసూళ్లు

▪ సచివాలయాల్లో ప్రహసనంగా ప్రక్రియ ▪ సగం మందికి పైగా అందని ఉత్తర్వులు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. 6066 మందికి స్థానచలనం కలగగా, వీరిలో సగం మందికి ఇప్పటికీ ఉత్తర్వులు అందకపోవడం గమనార్హం. కొందరికి ఉత్తర్వులు జారీ చేసినా, ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ చేయకుండా కొన్నిశాఖల అధికారులు తాత్సారం చేస్తున్నారు. సిఫార్సులు.. వసూళ్లతో వాటిలో మార్పులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీవో 5 ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీల ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలిచ్చినా.. కేవలం వీఆర్వో, ఏఎన్‌ఎం, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్స్‌కు మాత్రమే అమలుచేశారు. మిగతా వారికి కొత్త జిల్లాల పరిధిలోనే బదిలీల ప్రక్రియ నిర్వహించడంతో చాలా మంది నష్టపోయారు.

పాలన కుంటుపడి: కొత్త స్థానాల్లో ఉద్యోగులు చేరకపోవడంతో పరిపాలన కుంటుపడుతోంది. పంచాయతీల్లో స్వర్ణభారతి కార్యక్రమం ద్వారా ఇంటి పన్నును ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పేరుతో సిబ్బందిని రిలీవ్ చేయడంలేదు. బూత్ స్థాయి అధికారులుగా ఉన్నవారికి శిక్షణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. గ్రామ సర్వేయర్లదీ ఇదే పరిస్థితి. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలపై వచ్చిన దరఖాస్తులు మూలుగుతున్నాయి.

వార్డు సచివాలయాల్లో పూర్తి

ఉమ్మడి జిల్లా పరిధిలోని నగరం, పట్టణ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. గడువు లోగా దీన్ని పూర్తి చేసి, ఉద్యోగులను రిలీవ్ చేయడంతో కొత్త స్థానాల్లో చేరారు. మొత్తం 1,177 మందికి స్థానచలనం కల్పించారు.

కాకినాడలో నిరసన తెలుపుతున్న సచివాలయ మహిళా పోలీసులు

సొమ్ములిస్తే మార్చేస్తున్నారు...

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకే బదిలీల్లో అగ్రతాంబూలమిచ్చారు. వీటితో పాటు కొన్ని శాఖల్లో వసూళ్లకు తెరతీశారు. ◆ కాకినాడ కలెక్టరేట్‌లో ఉన్న ఒక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్రంగా సొమ్ములు వసూలుచేసి, నచ్చినచోట పోస్టింగ్‌లు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఈ శాఖలో 844 మందికి స్థానచలనం కల్పించారు. నచ్చిన చోట పోస్టింగ్‌కు రూ.20వేలకు పైగా వసూలు చేశారనే వాదన ఉంది. ◆ వైద్య,ఆరోగ్యశాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో 1,051 మందికి స్థానచలనం కల్పించారు. ఇక్కడ కొందరు అధికారులు సొమ్ములు వసూలు చేసి ఉత్తర్వుల్లో మార్పు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 120 మందికి మార్చారని చెబుతున్నారు. ◆ బదిలీలకు సంబంధించి ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలు కోరారు. ఇవేవీ పట్టించుకోకుండా కొందరు అధికారులు ఇష్టారీతిన ప్రక్రియ చేపట్టారు. ◆ ఉమ్మడి జిల్లా పరిధిలో 1,020 మంది మహిళా పోలీసులకు స్థానచలనం కల్పించారు. దీనిలో తీవ్ర అన్యాయం జరిగిందని సుమారు 60 మంది కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

వరదల సీజన్ పూర్తయ్యేవరకు అప్రమత్తం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: గోదావరి వరదల సీజన్ పూర్తయ్యేవరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండేవిధంగా కార్యాచరణ చేశామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. సోమవారం పి.గన్నవరం మండలం బూరుగులంకరేవులో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ తాత్కాలిక బాట తెగిపోవడంతో ఈ ప్రాంత ప్రజలపై వరద ప్రభావం పడిందన్నారు. బూరుగులంకరేవుతో పాటు బెల్లంపూడి, శివాయిలంక, ఊడిమూడి రేవుల్లో మరపడవలను లైఫ్‌జాకెట్లతో అందుబాటులో ఉంచామన్నారు. రేవులు దాటే సమయంలో విధిగా వీటిని ధరించాలని సూచించారు. ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాన్ని సైతం అందుబాటులో ఉంచామన్నారు. మరపడవలు, తాగునీరు, వైద్యం అందించేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, పి.గన్నవరం నియోజకవర్గ వరదల ప్రత్యేకాధికారి టి.జయచంద్రగాంధీ, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, సర్పంచులు డి.సత్యనారాయణ, ఎన్.ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యులు పి.మోషే, ఎ.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బూరుగులంకరేవులో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఇక అనుమతులిచ్చేది భూగర్భ గనుల శాఖే!

మిగిసిన సుధాకర్ ఇన్‌ఫ్రా సీనరేజీ వసూళ్ల గడువు

ఈనాడు, అమలాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గనుల తవ్వకాలకు సంబంధించి భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలోనే ఇకపై అనుమతులు ఇవ్వనున్నారు. వైకాపా హయాంలో వీటి సీనరేజీ వసూళ్ల బాధ్యత సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చి రెండేళ్లకు రూ.233 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. మూడు నెలలపాటు సీనరేజీ వసూళ్లు చేయలేకపోవడంతో కూటమి ప్రభుత్వం పొడిగించింది. అది కూడా ముగియడంతో సోమవారం నుంచి పాత విధానంలోనే గనుల లీజులు, అనుమతులు భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలో ఇవ్వనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయని జిల్లా అధికారి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు.

కోనసీమలో ఇసుక అక్రమాలు సీఎం దృష్టికి..

కోనసీమలో నిషేధం ఉన్నప్పటికీ జూన్ 1 తరువాత గోదావరిలో యథేచ్ఛగా తవ్వకాలు చేసిన వైనంపై సీఎం కార్యాలయానికి నివేదిక వెళ్లింది. మండపేట, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో అడ్డగోలుగా యంత్రాలతో ఇసుక తరలింపుపై గనులశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం నివేదిక పంపినట్లు తెలిసింది. కపిలేశ్వరపురంలో తరలింపులపై 'ఈనాడు, ఈటీవీ'లో కథనం ప్రచురితమైన తరువాత యంత్రాంగం అన్నిచోట్ల దాడులు నిర్వహించింది. కొన్ని నిల్వకేంద్రాల్లో పరిమితికి మించి ఉన్నట్లు గుర్తించింది. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న నేతల వివరాలతో నివేదిక సీఎం దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

సేంద్రియ సాగుతో భూసారం.. ఆరోగ్యం

అమలాపురం కలెక్టరేట్: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మార్కెటింగ్, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రకృతి సాగులో పండించే పంటల ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందన్నారు. రైతులకు ఖరీఫ్ సాగులో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేసీ నిశాంతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బోసుబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో ఎమ్మెల్యే దాట్ల, ఎంపీ హరీష్ మాథుర్ తదితరులు

కష్టపడి పనిచేస్తే.. మరో 40 ఏళ్లు పార్టీకి బలం

మంత్రి కొల్లు రవీంద్ర

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నాగిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కాట్రేనికోనలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్ఠమే లక్ష్యంగా కుటుంబ సారథుల నియామకానికి శ్రీకారం చుట్టామన్నారు. దీనిని అమలుచేస్తే మరో 40 ఏళ్లు తెదేపా బలంగా ఉంటుందన్నారు. నాడు ఎన్టీఆర్ రూ.30తో పింఛను ప్రారంభిస్తే దానిని రూ.4వేలు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్, అతని అనుచరులు రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి 11 లక్షల కోట్ల అప్పులున్నా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. రూ.395 కోట్లతో ఏటిగట్టు రక్షణకు, రూ.250 కోట్లతో లంక గ్రామలు కోతకు గురవ్వకుండా పనులకు, భైరవపాలెం, మొల్లేటిమొగ, పల్లం, నీలరేవులో వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు ఎంపీ గంటి హరీష్‌మాథుర్ మాట్లాడుతూ ప్రజల చిరకాల కోరిక కోనసీమలో రైలుకూత వినిపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ముమ్మిడివరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ ప్రగతిని వివరించారు. అనంతరం పల్లం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మోకా ఆనందసాగర్, గుత్తుల సాయి, చెల్లి అశోక్, నడింపల్లి సుబ్బరాజు, డి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

అబ్బే.. ఆ అభ్యంతరాలు ఓ లెక్కా!

జడ్పీలో గత అయిదేళ్లలో రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలు

ఈనాడు, కాకినాడ: ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వం వివిధ పద్దుల కింద ఇచ్చే నిధుల వ్యయంలో స్థానిక సంస్థలు పారదర్శకత పాటించడం లేదు. చేసే పనులకు, రాస్తున్న లెక్కలకు పొంతన ఉండడం లేదు. ఉమ్మడి జిల్లా పరిషత్తుకు సంబంధించి వైకాపా హయాంలో గత అయిదేళ్లలో సుమారు రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలపై ఆడిట్ అధికారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందులో కొన్ని అవకతవకలు, మరికొన్ని విధాన లోపాలున్నా అధికారులు కిమ్మనడంలేదు.

దస్త్రాల్లో లెక్కలు.. అన్నీ చిక్కులే

జడ్పీలో 2019 నుంచి 2024 మధ్యలో 397 లావాదేవీలు, వ్యవహారాల్లో రూ.85.45 కోట్ల లెక్కలు తేలడంలేదు. కొన్ని పనులకు ఎం.బుక్‌లో ఒకలా, చెల్లింపుల రిజిస్టర్‌లో మరోలా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలు, జడ్పీ ఆస్తుల నుంచి లీజు ఆదాయాలు, వేలం పాటల నిర్వహణలో తేడాలున్నాయి. ❖ జడ్పీ కల్యాణ మండపంలో లైటింగ్, డెకరేషన్, సౌకర్యాల కల్పనకు 2021-22 నుంచి 2023-24 వరకు వేలం లేక రూ.10 లక్షలకుపైగా కోల్పోవాల్సి వచ్చింది. ఎన్నికల సామగ్రి నిల్వకు ఉపయోగిస్తున్నామని చెబుతున్నారు. మరి 2023-24 మండపం రికార్డు పరిశీలిస్తే 49 బుకింగ్స్ ఉన్నట్లు రాసిపెట్టారు. వేలం వేయకుండా అద్దెలకు ఇవ్వడంతో నష్టం చేకూరినట్లే. ❖ బిక్కవోలు మండలం కాపవరంలో 11 ఎకరాలు, మండపేట మండలం కేశవరంలో 15.28 ఎకరాలు జడ్పీ గ్రావెల్ భూములున్నా లీజుకు ఇవ్వలేదు. మరో 20 చోట్ల భూములు, కొబ్బరి చెట్ల ద్వారా ఆదాయం వచ్చే మార్గమున్నా వదిలేశారు. ❖ జిల్లాలో 63 సమగ్ర నీటి పథకాలున్నాయి. వీటిలోకి కాలువల ద్వారా వచ్చి పెరిగిన చేపలను వేలం, అమ్మకాలు చేయకుండా వదిలేస్తున్నారు. కరప, కొమ్మనపల్లి పథకాల్లో ఒకరోజు చేపల విక్రయంతో రూ.2.25 లక్షలు వచ్చింది. మిగతా పథకాల ద్వారా ఇదేమాదిరి ఆదాయం పొందొచ్చు.

ఏడాది	ఆడిట్ అభ్యంతరాలు	విలువ (రూ.కోట్లలో)
2019-20	76	25.45
2020-21	66	10.89
2021-22	84	12.09
2022-23	87	31.60
2023-24	84	5.41

జగనన్న సేవలో ఆస్తులు మాయం..

❖ వేమగిరిలో 22.89 ఎకరాల క్వారీ భూములు జడ్పీకి ఉండేవి. జగనన్న కాలనీ స్థలాల కోసం సీఈవో అప్పగించేశారు. ❖ 2023-24లో పది విద్యార్థులకు అధ్యయన సామగ్రి కోసం రూ.33 లక్షలు ఖర్చుచేశారు. జగన్ బొమ్మలు వేసి ప్రచారం చేసుకున్నారు. వీటిని ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ద్వారా కాకుండా ఓపెన్ టెండర్ పిలిచి గుత్తేదారుకు అప్పగించేశారు.

అభ్యంతరాలను పరిశీలించాలి

ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంది. రికార్డులు ఒక ఏడాది చూపకుంటే తర్వాత చూపించి అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అలా జరుగుతుందో లేదో చూడాలి. నిధుల దుర్వినియోగం తేలితే బాధ్యుల నుంచి రికవరీలు చేయిస్తాం. - **-లక్ష్మణరావు, సీఈవో**

సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటరావు, హాజరైన అధికారులు

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు నిర్వహించనున్న పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధించిన పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఏపీపీఎస్సీ, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్తు, పోలీసు, వైద్య,ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. కాకినాడలోని ఎస్.అచ్యుతాపురం రైల్వే గేటు వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, కాకినాడ గ్రామీణ మండలం, రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీస్ సంస్థల్లో రోజూ రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు అరగంట ముందుగా హాజరుకావాలని సూచించారు. కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపాలని డీఆర్వో ఆదేశించారు. ఏపీపీఎస్సీ అధికారులు టి.వెంకటరమణ, ఎస్.ప్రతాప్, జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాస్, కలెక్టరేట్ సెక్షన్ అధికారి ఎం.జగన్నాథం, ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి చైనులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సదరం స్లాట్లు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

మారిన విధానంతో దివ్యాంగులకు మేలు

విభిన్న ప్రతిభావంతులు సామాజిక పింఛను పొందాలంటే వైకల్య ధ్రువీకరణ పత్రం(సదరం) తప్పనిసరి. గతంలో వైకాపా ప్రభుత్వంలో కాసుల కక్కుర్తితో కొందరు అనర్హులకూ వీటిని మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అర్హులకు మొండి చేయి ఎదురైంది.

కొత్త స్లాట్‌లకు వీలు కల్పిస్తూ...

దివ్యాంగుల అవస్థలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం కొత్త స్లాట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల మొదటి వారం నుంచి మూడు నెలల పాటు సదరం ధ్రువీకరణ పత్రాలకు స్లాట్‌లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి.

ఆసుపత్రుల్లో రెండు రకాల పరీక్షలు..

జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రులు, రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం సీహెచ్‌సీల్లో సోమ, మంగళ వారాల్లో కొత్త స్లాట్‌లకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట సీహెచ్‌ల్లో ఆర్థో (ఎముకలకు) పరీక్షలు, అమలాపురం, రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రుల్లో కళ్లకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. ప్రస్తుతానికి ఈ రెండు వైకల్యాలకు సంబంధించిన స్లాట్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

మీ సేవ, సచివాలయాల్లో నమోదుకు అవకాశం

గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు, మీసేవ కేంద్రాల్లోనూ స్లాట్ నమోదుకు అవకాశం కల్పించారు. సంబంధిత ఆసుపత్రికి వెళ్లేటప్పుడు వైకల్యం నిర్ధారణకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకు వెళ్లాలి.

రోజుకు 20 మంది చొప్పున పరిశీలన

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన జరుగుతోంది. ఈ నేపథ్యంలో మొదట్లో కొత్త స్లాట్‌లకు సోమవారం మాత్రమే పరీక్షలను నిర్వహించే వారు. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతుండటంతో మంగళవారమూ పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అయిదు ఆసుపత్రుల్లో ఒక్కొక్కచోట రోజుకు 20 స్లాట్‌ల చొప్పున కేటాయిస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

జిల్లాలో అయిదు ఆసుపత్రుల్లో సోమ, మంగళవారాల్లో కొత్తగా సదరం ధ్రువీకరణ పత్రాల మంజూరుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ధ్రువీకరణ పత్రాల కోసం 15 నుంచి 20 రోజుల వరకు పట్టే అవకాశం ఉంది. **-డా.కార్తిక్, డీసీహెచ్‌ఎస్**

అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో సదరం పరీక్షలకు హాజరైన దివ్యాంగులు

నాయకత్వ లక్షణాలతో.. పాఠశాలల సమర్థ నిర్వహణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని డీఈవో షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మి పేర్కొన్నారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్)లో భాగంగా చెయ్యేరులోని శ్రీనివాస స్వయంప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో 260 మంది ప్రధానోపాధ్యాయులకు నాలుగు రోజుల లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. పాఠశాల నిర్వహణలో నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమన్నారు. పాఠశాలను సమర్థవంతంగా నిర్వహించడానికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. శిక్షణ కోర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోని 650 మంది ప్రధానోపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. స్వీయ అవగాహన, నిర్వహణ, పాఠ్యాంశాల బోధన, అభ్యాసన సంస్కృతిని ప్రోత్సాహించడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఎంఏకే భీమారావు, రామచంద్రరావు, ఎస్.ఎస్.శ్రీధర్‌కృష్ణ, ఉదయభాస్కరరావు, సత్యకృష్ణ, నిరంజని, సుందరి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు అయిదు అర్జీలు

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. భూసమస్యలపై 2, ఆత్రేయపురం మండలంలో ఏటిగట్ల సమస్యపై 2, కొత్తపేటలో కౌశిక డ్రెయిన్ పక్కన బురదమట్టి తొలగించాలని ఒకటి చొప్పున మొత్తం 5 వినతులు వచ్చాయని ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. భూసమస్యలు, ఏటిగట్ల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారుకు పంపించామన్నారు. కౌశిక డ్రెయిన్ సమస్యపై డ్రెయినేజీ డీఈ నాగార్జునకు పంపించినట్లు తెలిపారు.

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందుతున్న అర్జీలకు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని డీఆర్వో రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్ కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో ఇతర అధికారులతో కలిసి డీఆర్వో రాజకుమారి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో 290 మంది వినతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

DEEPAK NEXGEN FEEDS Pvt. Ltd.
Bommuluru, Near Hanuman Junction, Krishna Dist., A.P. 521 105
WANTED
Deepak Nexgen is a leading and fast growing Fish and Shrimp feed Manufacturing industry looking for the following positions:
Plant Incharge/Manager: B.Tech. (Mechanical) with 15 to 20 years of experience in shrimp feed plant operations. Able to handle individually.
Maintenance Incharge/Manager: B.Tech. (Mechanical) with 08 to 10 years of experience in shrimp feed machinery.
Electrical Incharge/Manager: B.Tech. Electrical with 10 to 15 years of experience in shrimp feed manufacturing industry.
Kitchen Supervisor: Experienced candidates in Kitchen Operations, Ensuring food Safety and Quality, maintianing a clean and organized kitchen environment.
Electrical Incharge(Residential Villas Maintenance): Required experience person for Residential Villas Electrical Maintenance.
Interested Candidates with Relevant Experience
Mail us your resumes to: ifeedhr@gmail.com

(c) eenadu

రుణ సాయం.. ఉన్నత విద్యకు ఊతం

– న్యూస్‌టుడే, ద్వారపూడి

కొత్త విద్యాసంవత్సరంలో విద్యార్థుల ఉన్నత చదువులకు బ్యాంకులు బాటలు వేస్తున్నాయి. రుణసాయం అందిస్తూ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచిస్తున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇప్పటికే దరఖాస్తు చేయగా కొందరికి మంజూరు కూడా పూర్తయింది.

పేద, మధ్యతరగతి వర్గాలకు ఉన్నత విద్య చేరువ చేయాలనే సదుద్దేశంతో ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలుస్తోంది. కేంద్ర ఆర్థిక, ఉన్నత విద్య, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) సంయుక్తంగా పోర్టల్‌ను రూపొందించాయి. దేశంలోని 38 బ్యాంకులు, అనుబంధ ఆర్థిక సంస్థలు ఇందులో నమోదయ్యాయి. మొత్తం 86 రకాల విద్యా రుణాలు అందిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో కోనసీమ జిల్లాలో రూ.74.84 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినా రూ.84 కోట్లు రుణాలిచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.58.69 కోట్లు లక్ష్యం కాగా జూన్ నెలాఖరు వరకు రూ.15.7 కోట్లు మంజూరుచేశారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, మలేషియా, యూకే తదితర దేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి రుణ సాయం లభిస్తోంది.

● జిల్లాలో రూ.58.69 కోట్ల మంజూరు లక్ష్యం

ఏయే కోర్సులు.. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, పీజీ డిప్లొమా ఇన్ ప్రొఫెషనల్ కోర్సెస్, ఛార్టర్డ్ ఎకౌంటెన్సీ, మేనేజ్‌మెంట్, ఐటీ, వృత్తి విద్యా కోర్సుల్లో చేరేవారు అర్హులు. యూజీసీ, ఏఐసీటీఈ, ఎంసీఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధీకృత సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకునేవారు దరఖాస్తు చేయవచ్చు. ముందుగా విద్యాలక్ష్మి పోర్టల్‌లో వివరాలు నమోదుచేసుకుని దరఖాస్తు భర్తీ చేయాలి. అందులోనే గరిష్ఠంగా మూడు బ్యాంకులను ఎంపిక చేసుకోవచ్చు. ఈ ప్రక్రియకు ఆమోదం లభిస్తే రుణానికి సంబంధించిన పూర్తి వివరాలు చరవాణి, ఈమెయిల్‌కి వస్తాయి.

సద్వినియోగం చేసుకోండి..

అవసరమైన విద్యార్థులకు పలు బ్యాంకుల ద్వారా విద్యా రుణాలు అందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ విద్యాలక్ష్మి పథకం ద్వారా రుణాలిచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. గత ఏడాదిలో లక్ష్యానికి మించి మంజూరుచేశాం. ఈ ఏడాదిలో కూడా విరివిగా జారీచేస్తాం. అవసరమైన విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.కేశవ రామకృష్ణ అభిషేకవర్మ, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్, కోనసీమ జిల్లా

మంచి అవకాశం.. అమలాపురానికి చెందిన అవినాష్ విద్యాలక్ష్మి పథకంలో రూ.7.50 లక్షల బ్యాంకు రుణం తీసుకుని బీటెక్ పూర్తిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో రూ.7 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తూ వాయిదాల ద్వారా రుణ చెల్లింపు చేస్తున్నారు.

రూ.40 లక్షలతో.. ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన అనుపిండి కిరణ్మయి అవసరమైన పత్రాలతో రూ.40 లక్షల రుణం తీసుకుని అమెరికాలో ఎమ్మెస్ పూర్తిచేశారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లో మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఏడాదికి రూ.1.5 కోట్ల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నారు.

ఆకుకూరలు.. కురిపించే సిరులు

రైతేరాజు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలో సాగవుతున్న ఆకుకూరలు

స్ఫూర్తి

అనతి కాలంలోనే పంట చేతికొచ్చే ఆకు కూరలను సాగుచేసి లాభాలు ఆర్జిస్తున్నాయి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ర్యాలి, పులిదిండి తదితర గ్రామాల్లో 300 కుటుంబాలు. ఈ ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో వీటి సాగు చేపట్టి నిత్యం ఆదాయం పొందుతున్నారు. గోంగూర, తోటకూర, బచ్చలి, పొన్నగంటి, చుక్క, మెంతికూర, కొత్తిమీర తదితరాలు సాగు చేస్తూ ఏడాది పొడవునా చింత లేకుండా ఉపాధి పొందుతున్నారు.

విత్తిన నెల రోజులకే కోతకు..

చిన్నచిన్న కమతాల్లో ఎవరికి వారే స్వయంగా పొలంలో నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లుతారు. విత్తిన నెలకు ఆకు కూరలు కోతకు వస్తాయి. సమీపంలోని రాజమహేంద్రవరం, తణుకు, రావులపాలెం, ధవళేశ్వరం వంటి పట్టణాలకు తీసువెళ్లి విక్రయిస్తారు. గోంగూరను స్థానిక పచ్చడి తయారీ కంపెనీల వారు టోకుగా పెద్దమొత్తంలో కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. సేంద్రియ ఎరువులు వాడటంతో వీటికి గిరాకీ ఉంటుంది. మార్కెట్‌కు వెళ్లగానే కొనుగోలుదారులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అంతగా తెగుళ్లు ఆశించవు. ఈ గ్రామాల్లోని కొత్తిమీరకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలో విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ తదితర నగరాలకు ఆర్టీసీ బస్సుల్లో ఎగుమతి చేస్తుంటారు.

కాలంతో నిమిత్తం లేకుండా..

కాలంతో నిమిత్తం లేకుండా ఏడాది పొడవునా ఏదో రకం ఆకుకూర పండిస్తుంటారు. కుటుంబ సభ్యులు ఆసరాగా ఉంటారు. మేలైన విత్తనాలు ఎంచుకుంటారు. ఎకరాకు పెట్టుబడితో పాటు కౌలు కింద రూ.60 వేల వరకు అవుతుంది. ఖర్చులు పోను నికర ఆదాయం రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు వస్తుంది.

మంచి లాభదాయకం

తోటకూర, గోంగూర, బచ్చలి, పాలకూర, చుక్కకూర ఎక్కువగా సాగు చేస్తుంటాను. ఇవి విత్తిన నెల రోజులకే కోతకు వస్తాయి. అన్ని ఖర్చులు పోను నెలకు నికరంగా రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. మిగతా పంటల కంటే చిన్న కమతాల వారికి ఈ సాగు లాభదాయకం.

– బొచ్చు సింహాద్రి, రైతు, ర్యాలి

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం: సుభాష్

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, దీర్ఘకాలిక ప్రణాళికతో ఆయన రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు కృషిచేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రజల సమస్యలు వివరాలను మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న మంత్రి సుభాష్

విగ్రహానికి పూలమాల వేసిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు

అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేసుకోవాలి

కొత్తపేట: అసమానతలు లేని సమాజం కోసం బాబాసాహెబ్ అంబేడ్కర్ పాటుపడ్డారని అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్‌మాధుర్ అన్నారు. కొత్తపేట రెడ్డివారిపేటలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లి సాకారం చేసుకోవడమే ఆయనకు మనమిచ్చే గౌరవమని అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందించిన సేవలు నిరుపమానమన్నారు. సర్పంచి భూసి జయలక్ష్మి, భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, గుబ్బల మూర్తి, వార్డు మెంబర్లు కాశీ ధనరాజు, బండిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు మీటరుకు సాంకేతిక లోపం

మామిడికుదురు: మామిడికుదురు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నన్నపురాజు సత్యనారాయణ ఇంటి విద్యుత్తు మీటరుకు సాంకేతిక లోపం ఉన్నందున రీడింగ్ తేడాలను గుర్తించి వినియోగదారుడికి తెలియజేసినట్లు అమలాపురం ఎస్‌ఈ బి.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.15.14 లక్షల బిల్లు రావడంపై ఆమె వివరణ ఇచ్చారు. మీటరును పరిశీలించి సరైన రీడింగ్‌తో బిల్లు జారీ చేస్తామని చెప్పామన్నారు. వినియోగదారునికి తమ శాఖ నుంచి ఏవిధమైన బిల్లు ఇవ్వలేదన్నారు.

నిన్న పచ్చగా.. నేడు పరవళ్లు తొక్కగా..

ముక్తేశ్వరం- తొగరపాయ పాత వంతెన ప్రాంతంలో అయిదు రోజుల క్రితం చుక్కనీరు లేదు. నదీగర్భం పచ్చని తివాచీని తలపించేది. కొద్దిరోజులుగా గోదావరికి వరద రావడంతో వృద్ధ గౌతమీ జలకళను సంతరించుకుంది. తొగరపాయ పాత వంతెన వద్ద నిండుగా ప్రవహిస్తోంది. -న్యూస్‌టుడే, కోనసీమ

కోళ్లు.. అరికడదాం వ్యాధులు

గొల్లప్రోలు: వర్షాకాలంలో కోళ్లకు ఆశించే వ్యాధులు, నివారణ చర్యల గురించి చేబ్రోలు పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వివరించారు.

● కొక్కెర వ్యాధి: ఈ వ్యాధి అన్ని వయసుల కోళ్లలో వ్యాపిస్తుంది. కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా సంక్రమిస్తుంది. కాళ్లకు, మెడకు, రెక్కలకు పక్షవాతం కనిపిస్తుంది. ముక్కు నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. మెడ వంకర్లు తిరుగుతూ మూడు నాలుగు రోజుల్లో మరణిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరుచేయాలి. చనిపోయిన వాటిని లోతైన గుంతల్లో పాతిపెట్టాలి. లేకుంటే కాల్చివేయాలి. మేత, నీళ్ల తొట్టెలను శుభ్రం చేయాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

● మశూచి: 5-12 నెలల వయసు గల కోళ్లలో కనిపిస్తుంది. వ్యాధి సోకిన వాటిని తాకడం వల్ల, స్వేచ్ఛగా తిరిగే పక్షుల వల్ల వ్యాపిస్తుంది. కలుషిత నీరు, మేత, ఈగలు, దోమలు, పరాన్నజీవుల కారణంగా వ్యాప్తి చెందుతుంది. చర్మం, తల, కంటి రెప్పలపైన పొక్కులు కనిపిస్తాయి. శ్వాస సరిగా ఆడక కష్టంగా జీవిస్తుంది. కంటి పొర, ముక్కు ఎర్రబడి, ముక్కు రంధ్రాల నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరు చేయాలి. యాంటీ బయాటిక్ మందులు నీటిలో కలిపి ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉన్నవాటికి వ్యాధినిరోధక, ఫాల్‌పాక్స్ టీకాలు వేయించాలి.

మామిడి తోటల్లో యాజమాన్యంతో మేలు

మీ కోసం

మలికిపురం: ప్రస్తుతం మామిడి పంట చివరి దశలో ఉంది. కాయల కోత అనంతరం తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మలికిపురం ఉద్యానశాఖ అధికారి దిలీప్‌కుమార్ చెబుతున్నారు. కోత అనంతరం చెట్లకు కొన్ని రోజుల పాటు విశ్రాంతి ఇవ్వాలి. పోషక లోపాల సవరణకు, నిలకడగా కాపు కాసేందుకు జులై, అక్టోబరు నెలల్లో జింక్‌సల్ఫేట్ రెండు గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎండిపోయిన

కాయల కోత అనంతరం జాగ్రత్తలు పాటించాలి

కొమ్మలు, కాయ వదిలేసిన తొడిమలను కత్తిరించాలి. దీంతో చెట్టుకు సూర్యరశ్మి బాగా సోకి కాపు పెరుగుతుంది. కత్తిరించిన పెద్ద కొమ్మలకు బోర్డు లేహ్యం పూయాలి. చెట్లకు సేంద్రియ ఎరువులు, వేపచెక్క, వర్మీకంపోస్టు వేయడంతో అధిక దిగుబడులు వస్తాయి. వర్షాలు పడే సమయంలో తోటల్లో జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట వేసుకుని 45 రోజుల అనంతరం కలియదున్నితే నవంబరు, డిసెంబరు నెలల్లో త్వరగా చెట్లు పూతకు వస్తాయి.

విత్తనశుద్ధితో లాభాలిలా..

విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి

తెలుసుకుందాం..

కిర్లంపూడి: నారుమళ్లకు తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు రైతులు అవలంబించాల్సిన విధానాలను, విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను కిర్లంపూడి మండల వ్యవసాయాధికారిణి సుధామాధురి వివరించారు. విత్తనశుద్ధితో శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, వైరస్ వంటి రోగకారకాలను నాశనం చేయొచ్చు. దీనివల్ల మొక్కలు ఆరోగ్యంగా, ఏపుగా పెరుగుతాయి. తద్వారా దిగుబడి పెరుగుతుంది. విత్తన నాణ్యతను కాపాడుతూ జీవనశక్తిని పెంచుతుంది. శుద్ధిచేసిన విత్తనాలు త్వరగా ఏకరీతిన మొలకెత్తుతాయి. మొక్కలు ప్రారంభ దశలోనే వ్యాధులను తట్టుకుని తెగుళ్ల నుంచి రక్షించబడతాయి. విత్తనశుద్ధిని జీవరసాయన పద్ధతిలో చేపట్టడం ద్వారా పంట రక్షణకు రసాయనాల వాడకం తగ్గుతుంది. ఇది రైతుకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ఉపయోగకరంగా మారుతుంది.

స్వదేశానికి గల్ఫ్ బాధితురాలు

అయినవిల్లి: విలస గ్రామానికి చెందిన సవరపు రామలక్ష్మి ఈ ఏడాది మార్చి నెలలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక ఏజెంట్ ద్వారా మస్కట్ వెళ్లారు. అక్కడ యజమాని సక్రమంగా తిండి పెట్టకుండా చిత్రహింసలకు గురిచేశారు. ఏమి చేయాలో తెలియక విలపిస్తూ ఒక వీడియోను కుటుంబ సభ్యులకు పోస్ట్ చేశారు. దీనిపై ఈ నెల 3న 'స్వదేశానికి తీసుకురావాలని వేడుకోలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కలెక్టర్ మహేష్‌కుమార్ వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కోనసీమ సెంటర్‌ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి రాజకుమారి, సమన్వయకర్త రమేష్ తదితరులు రామలక్ష్మి కుమారుడు సతీష్ నుంచి వివరాలు తెలుసుకుని స్వదేశానికి తీసుకువచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో ఆమె సోమవారం దిల్లీ, అక్కడి నుంచి హైదరాబాద్ వచ్చి స్వగ్రామమైన విలస బయలుదేరినట్లు తెలిసింది.

బతికున్నా.. మరణించినట్లు నమోదు

● ఆధార్ నంబరు తారుమారుతో ఆరేళ్లుగా ఆగిన రేషన్

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన హిమలక్ష్మి, సోదరుడు కృష్ణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమలాపురం మండలం వేమవరం ప్రాంతానికి చెందిన మేడిద ఎస్ఎస్‌వీ కృష్ణ బతికున్నా రేషన్ కార్డులో మాత్రం మృతి చెందినట్లు చూపిస్తున్నారని ఆమె సోదరి హిమలక్ష్మి వాపోయారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ తండ్రి శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. మరణ ధ్రువీకరణ సమయంలో దివ్యాంగుడైన కృష్ణ ఆధార్ నంబరు తండ్రి నంబరుగా నమోదు చేశారు. తర్వాత రేషన్ కార్డులో కృష్ణ మృతి చెందినట్లు నమోదైంది. దీనివల్ల ఆరేళ్లుగా నిత్యావసరాలు అందడం లేదని ఆమె వాపోయారు. తమ తల్లి కూలి పని చేసి పోషిస్తోందని, ఉన్నతాధికారులు స్పందించి రేషన్ అందేలా చూడాలని ఆమె కోరారు.

ధర.. హారతికర్పూరం

– న్యూస్‌టుడే, అంబాజీపేట

అంబాజీపేట మార్కెట్‌కు అరటి గెలలు తీసుకొచ్చిన రైతులు

అంబాజీపేట అరటి మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. సోమవారం కర్పూర రకం గెలలు అయిదు రూ.250 పలికాయి. రైతులు చేసేదిలేక అయినకాడికి అమ్ముకుని నిరుత్సాహంగా ఇంటికి వెళుతున్నారు.

ఆషాఢం దెబ్బ..: గతేడాది ఆషాఢ మాసంలో కర్పూర రకం అరటి గెలలకు మంచి ధర దక్కింది. ఒడిశా రాష్ట్రానికి ఎక్కువగా ఎగుమతయ్యాయి. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రైతులు ఈ రకం ఎక్కువగా అందివచ్చేలా చూసుకున్నారు. అందరూ ఇలాగే చేయడంతో ప్రస్తుతం ఉత్పత్తి ఎక్కువగా వచ్చింది. దీనికితోడు ఒడిశా నుంచి డిమాండ్ ఆశించిన మేర లేక వ్యాపారులకు ఆర్డర్లు రాలేదు. ఈ పరిస్థితుల్లో కోనసీమ అరటి మార్కెట్‌కు అటు ఆషాఢం.. ఇటు ఒడిశా దెబ్బకొట్టింది.

శ్రావణంపైనే ఆశలు: ఆషాఢ మాసంలో పెద్దగా శుభకార్యాలు ఉండవు. దీంతో కర్పూర రకం అరటి గెలలకు డిమాండ్ తగ్గిపోయింది. రైతుల నుంచి వ్యాపారులు అయినకాడికి అడుగుతున్నారు. ఈ నెల 24తో ఆషాఢం ముగుస్తుంది. 25 నుంచి శ్రావణ మాసం వస్తుంది. శ్రావణంలో వరలక్ష్మీవ్రతంతో పాటు ఇతర పండగలు, పర్వదినాలు, శుభకార్యాలు, వివాహాలు ఉంటాయి. ఈ సమయంలో డిమాండ్ వచ్చి ఎక్కువ ధర పలికే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

చీరల డిజైనింగ్‌పై ఉచిత శిక్షణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట ఆర్యవైశ్య సంఘం వైఎంవీఏ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం వద్ద ఈ నెల 16, 17 తేదీల్లో మహిళలకు చీరలపై స్క్రీన్ ప్రింటింగ్ డిజైనింగ్‌పై రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 98660 83729 చరవాణి నంబరులో సంప్రదించాలని కోరారు.

వాడపల్లి క్షేత్రంలో వైద్య సేవకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్రేయపురం: కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు. నర్సింగ్ తెలిసిన పురుషులు, మహిళలు సేవ చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వారసత్వ సంపద పరిరక్షణకు కృషి అభినందనీయం

● సత్యనారాయణకు సీఎం చంద్రబాబు లేఖ

చంద్రబాబుకు పంపిన బహుమతిని చూపిస్తున్న సత్యనారాయణ

యానాం, న్యూస్‌టుడే: గుండు సూదితో అద్దాల వెనుక బొమ్మలు వేసి ప్రముఖులకు బహుమతిగా పంపించే యానాంకు చెందిన తాళ్ల వ్యాపారి గ్రంధి సత్యనారాయణ అలియాస్ సత్తిపండుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు సోమవారం అభినందన లేఖ పంపించారు. బుద్ధ జయంతి, అంతర్జాతీయ యోగా దినోత్సవాల సందర్భంగా అద్దం వెనుక చెక్కిన క్లిష్టమైన బుద్ధుడి కళాకృతిని బహుమతిగా అందుకోవడం ఆనందంగా ఉందని సత్యనారాయణకు చంద్రబాబు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఇటువంటి ప్రత్యేకమైన కళాఖండం ద్వారా మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని సంరక్షించి ప్రోత్సహించడంలో మీ అంకితభావం ప్రశంసనీయమని కితాబునిచ్చారు. 1999, 2014లో మీరు పంపించిన బహుమతులు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న మీ అభిరుచి, సృజనాత్మకతకు నిదర్శనాలని పేర్కొన్నారు. గ్రంధి సత్యనారాయణ మూడు దశాబ్దాల నుంచి దేశంలోని ఎందరో ప్రముఖులకు బొమ్మలు పంపించి వారి నుంచి అభినందన లేఖలు అందుకున్నారు. తాను పంపిన బహుమతులను గుర్తుపెట్టుకుని చంద్రబాబు స్పందించడం తనకు సంతోషంగా ఉందని సత్యనారాయణ పేర్కొన్నారు.

నారుమడులు ఎండుతున్నాయి..

కూళ్ల లాకు వద్ద నీటి మట్టాన్ని పెంచాలని అధికారులను కోరుతున్న నీటిసంఘాల అధ్యక్షులు, రైతులు

పామర్రు, న్యూస్‌టుడే: నెల రోజులుగా సరైన వర్షాలు లేవు. వారం రోజులుగా ఎండలు పెరిగాయి. పంట పొలాల్లో నీటి మట్టం తగ్గి శివారులో నారుమడులు ఎండిపోతున్నాయి.. కాల్వలకు అదనపు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నీటి సంఘాల అధ్యక్షులు అధికారుల ముందు గళం విప్పారు. కూళ్ల నీటి సంఘం అధ్యక్షుడు ఎనుమల గోపాలకృష్ణ (చిట్టిబాబు), సభ్యులు ఆచంట శ్రీను, చిట్టూరి సుబ్బారావు తదితరులు సోమవారం శివారు ప్రాంతాల్లోని నీటి ఎద్దడి పొలాలను పరిశీలించారు. అనంతరం జల వనరుల శాఖ ఎస్ఈ గోపీనాథ్, ఈఈ వి.రామకృష్ణ, ఏఈ సుందర్‌సింగ్‌లతో మాట్లాడి వారిని క్షేత్రస్థాయికి రావాలని కోరగా వారొచ్చి పరిస్థితిని పరిశీలించారు. కూళ్ల లాకుల వద్ద నీటిమట్టం నాలుగున్నర అడుగులకుపైగా ఉండేలా చూడాలని స్థానికులు పట్టుపట్టారు. కాల్వలో నీటి లభ్యతను పరిశీలించి గుర్రపుడెక్కను తొలగిస్తే నీటి సరఫరా మెరుగుపడుతుందని అధికారుల ముందు మొరపెట్టుకున్నారు. అన్నింటినీ పరిశీలిస్తామని, నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

మహిళా ప్రజాప్రతినిధులూ ప్రభావవంత నేతలుకండి

సామర్లకోట: పాలనలో మహిళా ప్రజాప్రతినిధులు ప్రభావవంత నేతలుగా ఎదగాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కేఎన్‌వీ ప్రసాదరావు అన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులకు 'మార్పు ద్వారా విజేతలు' శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పరిపాలనలో మహిళల పాత్ర, భాగస్వామ్యం పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమణి, డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు శర్మ, సుశీల పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

పి.గన్నవరం: ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న బీఎల్వోలకు సోమవారం పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధ్రువపత్రాలు అందించారు. దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్లు పంపిణీ చేశారు. తహసీల్దార్, సహాయ ఓటర్ల నమోదు అధికారిణి పి.శ్రీపల్లవి, శిక్షకుడు పి.నర్సింహారావు పాల్గొన్నారు.

వాహనంపై వెళ్తుండగా.. గుండెపోటుతో గృహిణి మృతి

తేజస్విని (పాత చిత్రం)

యానాం, న్యూస్‌టుడే: భర్తతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ తాళ్లరేవు మండలం నీలపల్లి సమీపంలో కుప్పకూలి మృతిచెందిన ఘటన తీవ్ర విషాదంలో ముంచెత్తింది. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న సత్తి హరిశ్చంద్రప్రసాద్.. యానాంలోని బంధువుల ఇంట్లో వేడుకకు హాజరయ్యేందుకు భార్య తేజస్విని(28)తో కలిసి బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చెక్‌పోస్టు సమీపంలో తేజస్విని అస్వస్థతకు గురయ్యారు. మంచినీళ్లు తాగుతూ అక్కడే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కలవారి సాయంతో ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళ్ల ముందే భార్య మరణించడంతో హరిశ్చంద్రప్రసాద్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ దంపతులకు అయిదేళ్ల కుమార్తె ఉంది. తేజస్విని తండ్రి మండేలా శ్రీరామమూర్తి ఓ ఛానెల్‌లో జర్నలిస్టుగా పనిచేస్తూ, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. కుమార్తె మృతి విషయం తెలిసి భార్యతో కలిసి యానాం ఆసుపత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జిల్లాలోని మీడియా ప్రతినిధులు శ్రీరామమూర్తిని పరామర్శించి సంతాపం తెలిపారు. తేజస్విని మృతదేహాన్ని రాజమహేంద్రవరం తరలించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

HEALTH & CARE

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

GENERAL

TO LET

JOBS

WANTED: To teach Maths and English 02 Nos, Primary and High School. Cont: GTLC EM School, Rajahmundry.

WANTED TEACHERS Immediately For High School
English, Hindi Maths & social
Satyabhama School Anaparthi
sbemschool@gmail.com
91774 88666

గమనిక

EENADU for Advertisement Contact: 8008597607

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి	24,000
	27,000
	25,000
	26,000
	24,000
	19,000-22,000
	19,000-20,000
	6,000
	400

	94.00
	116.00
	168.00
	191.00

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

యార్డు వద్ద కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, న్యూస్‌టుడే: ఆర్డీవో, ఇతర ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలకు కొత్తపేట మార్కెట్ యార్డు వద్ద గల 3 ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం పరిశీలించారు. ఆర్డీవో పి.శ్రీకర్, డీఎల్‌డీవో టి.రాజేశ్వరరావు, సర్పంచి భూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదానాల నిర్మాణానికి ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లికి చెందిన బొక్కా వెంకన్నబాబు, లోహిత దంపతులు రూ.1,01,116 విరాళాన్ని సోమవారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం పర్యవేక్షకుడు పి.రాంబాబు అభినందించారు.

దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న రాంబాబు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ. 10 - మ. 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

చేతి పంపులకు మరమ్మతులు

ఆత్రేయపురం: లొల్ల గ్రామంలో కొన్ని తాగునీటి పంపులు దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కాయల జగన్నాథం వద్ద ప్రస్తావించగా స్పందించి మరమ్మతులు చేయించారు.

వ్యర్థాల తొలగింపు

రావులపాలెం పట్టణం: రావులపాలెం మండలం ఊబలంక రోడ్డు చెంతన చెత్త పేరుకుపోయి అందులో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను డిప్యూటీ ఎంపీడీవో శర్మ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

రహదారి నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఆత్రేయపురం: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని రావులపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.విద్యాసాగర్ అన్నారు. ఆయన సోమవారం వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, డ్రెస్ కోడ్ పాటించకున్నా, లైసెన్స్ లేకున్నా, మద్యం తాగి ఆటో నడిపినా సహించబోమని హెచ్చరించారు. ఎస్సై ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మొద్దు

ఆత్రేయపురం: అపరిచితులను నమ్మొద్దని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. ఆయన సోమవారం అంకంపాలెం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు 'స్త్రీలు, బాలికల భద్రత, డ్రగ్స్, సైబర్ క్రైమ్' తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నతస్థానాలకు చేరాలని సూచించారు. స్త్రీలు, బాలికలు ఆపదలో ఉంటే శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్సై ఎస్.రాము, ఆదర్శ రైతు కడప కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయిని పరిమళకుమారి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో 2001-02లో పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల్లో ఇద్దరికి ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. జీవనోపాధి నిమిత్తం ఏలూరు జిల్లా పనికివెళ్లిన అంబాజీపేట, నందంపూడి గ్రామాలకు చెందిన మోకా రమేష్, షేక్ సుల్తాన్‌లు ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో దెందులూరు వద్ద వారు నడుపుతున్న మోటార్ సైకిల్‌ను కారు బలంగా ఢీకొట్టింది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. లేవలేని స్థితిలో మంచంపైనే ఉన్నారు. దీంతో వారితో కలిసి పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జయను రాధాకృష్ణ, బండారు నాగమణి, అంకం భారతి, కేతా సతీష్ పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రేవుల్లో కొనసాగుతున్న వరద

లైఫ్‌జాకెట్లు ధరించి ఊడిమూడిలంకలోకి వెళ్తున్న రైతులు

అప్పనపల్లి స్నానఘట్టం సమీపంలో..

జొన్నాడ రెండు వారధుల మధ్య గోదావరి ప్రవాహం

పి.గన్నవరం, మామిడికుదురు, అలమూరు, న్యూస్‌టుడే: కోనసీమలోని గోదావరి నదీపాయల్లో వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం బ్యారేజీకి దిగువన వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి, తొగరపాయలతో పాటు వివిధ అనుబంధ పాయల్లో వరద ప్రవాహం తగ్గినప్పటికీ ప్రవాహ ఉరవడి కొనసాగుతోంది. పి.గన్నవరం మండలం బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజలు మరపడవల్లో లైఫ్‌జాకెట్లు ధరించి రాకపోకలు సాగిస్తున్నారు. బెల్లంపూడి, ఊడిమూడికి దిగువన ఉన్న రేవుల్లో రైతులకు ప్రత్యేకంగా మరపడవలు, వరద రక్షణ సామగ్రి ఏర్పాటు చేశారు. తప్పనిసరిగా లైఫ్‌జాకెట్లు ధరించాలని తహసీల్దార్ పి.శ్రీపల్లవి సూచించారు. చాకలిపాలెం సమీపంలోని కనకాయలంక కాజ్‌వే వద్ద గ్రామస్థులు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి సోమవారం సాయంత్రం 6 గంటలకు 3,58,900 క్యూసెక్కులు సముద్రంలోకి విడిచిపెట్టారు.

● మామిడికుదురు మండలంలో సముద్రం పోటు ప్రభావంతో వైనతేయ నదిలో మధ్య లంకలు, పెదగుబ్బలంకల్లో ముంపునీరు చేరింది. పాటురేవుల్లోకి కూడా క్రమేణా వరద పోటెత్తింది. అప్పనపల్లి స్నానఘట్టం వద్ద వరద ప్రవాహం పెరగడంతో మెట్లన్నీ నీట మునిగాయి. పాశర్లపూడిలో వారధి సమీపంలో స్నానఘట్టం వరకు నీరు పెరిగింది. దీనికి సమీపంలోని పడవ విహార కేంద్రం వద్ద కూడా వరద పరవళ్లు తొక్కుతోంది. తీర గ్రామాల్లో ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. వరద నీటిలో దిగొద్దని, స్నానాలు చేయొద్దని ఎస్సై చైతన్యకుమార్ హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లంకల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని రైతులకు సూచించారు.

● పైనుంచి వస్తున్న వరద నీటితో అలమూరు మండలం బడుగువానిలంక, మూలస్థానం, జొన్నాడ, అలమూరు ప్రాంతంలో గౌతమినది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

నారసంచుల వినియోగంతో మేలు

అంబాజీపేట: ప్లాస్టిక్‌కి విముక్తి కలిగించే ప్లాస్టిక్ సంచి బదులు నార సంచులను వినియోగించాలని డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ అన్నారు. ఇరుసుమండలోని సెయింట్ జోసెఫ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం తడి, పొడి చెత్త నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

అమలాపురం గ్రామీణం: నూతన ద్విచక్ర వాహనాలు విక్రయించే దుకాణదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కార్యాలయంలో దుకాణదారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెలాఖరులోపు తప్పనిసరిగా లైసెన్సును రెన్యువల్ చేయించుకోవాలన్నారు. వాహన కొనుగోలుదారులకు ఐఎస్ఐ మార్కు ఉండే హెల్మెట్లను మాత్రమే విక్రయించాలని సూచించారు.

రాజోలు ఎంపీపీ అభ్యర్థిగా శ్రీదుర్గ

ఎంపికైన కదలి శ్రీదుర్గ

మలికిపురం, న్యూస్‌టుడే: ఈ నెల 16న జరిగే రాజోలు ఎంపీపీ ఎన్నికలో పోటీచేసే అభ్యర్థిగా కదలి శ్రీదుర్గ ఎంపికయ్యారు. సోమవారం అల్లవరం ఎంజీ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అధ్యక్షతన తెలుగుదేశం, జనసేన పార్టీల సంయుక్త సమావేశం నిర్వహించారు. తొలుత ఎంపీపీ కేతా శ్రీనివాస్ మృతికి సమావేశం సంతాపం వ్యక్తం చేసింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెదేపా నాయకుడు, శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన శ్రీనివాస్ ఎంపీపీగా పదవి బాధ్యతలు నిర్వర్తించిన క్రమంలో ప్రస్తుతం ఆ పదవిని భర్తీ చేయడానికి తెదేపాలోని అదే సామాజికవర్గ ఎంపీటీసీ సభ్యులకే అవకాశం కల్పించాలని సూచించారు. తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం తెదేపాకు చెందిన ఏడుగురు, జనసేనకు చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడి వారి ఏకాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. పొన్నమండ ఎంపీటీసీ సభ్యురాలు కదలి శ్రీదుర్గ పేరును వారు ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. 16న ఎంపీపీ ఎన్నిక సంబంధించి ఉప ఎంపీపీలు ఇంటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యాంబాబులను విప్‌లుగా నియమిస్తూ సమావేశంలో ప్రకటించారు. విప్ ఓటు అనుగుణంగానే ఓటు వేయాలని ఎంపీటీసీ సభ్యులకు నాయకులు సూచించారు. 12 మంది ఎంపీటీసీ సభ్యులను 16న జరిగే సమావేశానికి హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విప్‌లదేనని చెప్పారు. ఎంపీపీ అభ్యర్థిగా ఎంపికైన శ్రీదుర్గను అభినందించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, తెదేపా పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, తెదేపా, జనసేన మండల శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ, రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ రాజశేఖరం, రామ్మోహనరావు

సంకటహర చతుర్థి పూజలు

అయినవిల్లి, ఆత్రేయపురం, అలమూరు, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా సోమవారం వినాయక ఆలయాల్లో గరిక, కుంకుమ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. వివిధ రుసుముల ద్వారా రూ.2,44,622 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ● ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరుని ఆలయంలో వినాయకుడికి పూజలు నిర్వహించారు. దేవస్థానం మేనేజర్ గొలింగ వినయ్‌కుమార్‌రాజు పాల్గొన్నారు. ● అలమూరు, పెదపళ్ల, చింతలూరు గణపతి సంకష్టహర గణేశ హోమం నిర్వహించారు.

పెదపళ్లలో బాలగణపతిని దర్శించుకుంటున్న భక్తులు

చింతలూరులో..

ఆత్రేయపురంలో..

ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

రావులపాడులో సత్యసాయి భక్తుల ప్రదర్శన

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రావులపాడులో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో రథంపై బాబా చిత్రపటాన్ని ఉంచి భజనలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ దేవతలు ఆదిలక్ష్మి, పాటమ్మవార్ల ఆలయం వద్ద ప్రత్యేక భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు.

రోడ్డుపై గుంతలు.. ప్రమాద ఘంటికలు

తాటిపాక కూడలికి సమీపంలో జాతీయ రహదారి గుంతలు పడటంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతతో రద్దీగా ఉండే ఈ రహదారిలో గుంతలు కనిపించక పలువురు చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై జాతీయ రహదారుల ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా గుంతలను పూడుస్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజోలు

ఆదమరిస్తే.. అంతే సంగతులు!

మామిడికుదురు మండలం పెదపట్నంలో విస్తరించిన సిమెంటు రహదారి మధ్యలోకి వచ్చిన ఇనుప విద్యుత్తు స్తంభాన్ని దూరంగా తరలించకపోవడంతో వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి సమయాల్లో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్తంభాన్ని గుర్తించేలా స్థానికులు దాని చుట్టూ తెల్లని వస్త్రాన్ని చుట్టారు. ఈ విషయాన్ని నగరం విద్యుత్తు ఉప కేంద్రం ఏఈ వెంకటేశ్ దృష్టికి తీసుకువెళ్లగా, రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని దూరంగా తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

దెబ్బతిన్న పైపులైన్.. తాగునీరు వృథా

మెగా రక్షిత మంచినీటి పథకం పైపులైన్ దెబ్బతినడంతో వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. శివారు గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. బొబ్బర్లంక నుంచి రాష్ట్రీయ రహదారి వెంబడి ఉన్న పథకం ప్రధాన పైపులైన్ చిట్లిపోయి ఫౌంటైన్‌లా నీరు విరజిమ్ముతుండటంతో వృథాగా పోతోంది. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ వద్ద ప్రస్తావించగా, పైపులైన్‌కు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి భరోసా

కొత్తపేట, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో గ్రామాల్లో సైతం అశాంతి నెలకొని ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రశాంతత నెలకొని రాష్ట్ర అభివృద్ధికి భరోసా లభించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పలివెల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు గనిశెట్టి వీరేష్, పలివెల సర్పంచి సాదె లక్ష్మి, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచొద్దు

కొత్తపేట, న్యూస్‌టుడే: వర్షాకాలంలో డెంగీపై ప్రజలు అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. సోమవారం అవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పలివెలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లతోపాటు ఆయన పాల్గొన్నారు. నీటి కుంటలు, ప్లాస్టిక్ సీసాలు, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అవి దోమలకు ఆవాసాలుగా మారి డెంగీ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఆరోగ్య సమస్యలుంటే అశ్రద్ధ వహించకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. డాక్టర్ సుమలత, కంఠంశెట్టి శ్రీనివాసరావు, కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డి వ్యాఖ్యలపై మండిపాటు

అంబాజీపేట, న్యూస్‌టుడే: వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని పి.గన్నవరం నియోజకవర్గ తెదేపా కోకన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ మండిపడ్డారు. పుల్లేటికుర్రులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో ఇసుక, మట్టి, తువ్వ ఇసుక మాఫియాను నిర్వహించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తోందన్నారు. కూటమి ఎమ్మెల్యేలపై చేస్తున్న వ్యాఖ్యలను జగ్గిరెడ్డి నిరూపించాలని డిమాండ్ చేశారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదుల అవగాహన

రాజోలు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజోలులో సోమవారం కిలోమీటరు నడక నిర్వహించారు. మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారంపై ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. న్యాయవాదులు మామిడిశెట్టి సాయిబాబు, ఎ.శ్రీనివాస్, వై.ఏడుకొండలు, జి.పద్మ, డి.శ్రీనివాస్, ఎం.రాజ్‌కుమార్, సీహెచ్.సాగర్, ప్రియబాంధవి, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజోలులో లీగల్‌సెల్ ఆధ్వర్యంలో..

ముంపు సమస్య పరిష్కారానికి వినతి

ఎమ్మెల్సీ వీర్రాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మలికిపురం, న్యూస్‌టుడే: శంకరగుప్తం మేజరు డ్రెయిను ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ భాజపా జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేశ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అడబాల రాంబాబు సోమవారం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి సంబంధిత ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడగా.. డ్రెయిన్ మరమ్మతులకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, కొంతమేర నిధులు విడుదల చేసి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

వలస కూలీల చిన్నారులకు అక్షరాభ్యాసం

చిన్నారులతో దిద్దిస్తున్న సంస్థ నిర్వాహకులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదన్న ఉద్దేశంతో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పుట్టిన రోజు పురస్కరించుకుని ఆయన అభిమాని మచ్చా కుమార్‌రాజా సహకారంతో వలస కూలీల చిన్నారులకు సోమవారం ర్యాలిలో స్థానిక అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వలస కూలీలకు విద్య ఆవశ్యకత గురించి తెలియజేసి, వారి పిల్లలకు పలకలు, పుస్తకాలు తదితర విద్యా సామగ్రి అందజేశారు. సంస్థ నిర్వాహకులు శ్యామ్‌కుమార్, చింతా మోహిత్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మాణ పనులు వేగవంతం

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారానికి, రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన తోకలంక మధ్య నదీపాయపై కాజ్‌వే నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా తోకలంక ప్రజల స్వప్నమైన కాజ్‌వే నిర్మాణంపై ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించగా, గ్రామస్థులు రూ.3 లక్షలు విరాళం ఇచ్చారు. గోదావరిలో వరద ఉద్ధృతి ఉండటంతో సోమవారం కాజ్‌వే పనులను ఎంపీడీవో రాజు తదితరులు పరిశీలించారు. వీలైనంత త్వరలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

నటనలో మేటి 'కోట'

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా తదితరులు

పి.గన్నవరం: కోట శ్రీనివాసరావు మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. శాసనసభ్యుడిగా చక్కటి ప్రజాసేవ అందించారని గుర్తుచేశారు. సోమవారం పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన సంతాప సభకు మండల భాజపా అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అయ్యాజీవేమా తదితరులు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆరుమిల్లి వీరభద్రరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, కుడుపూడి సూర్యనారాయణ, చిట్నీడి రంగసాయి, మేడిది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ఆలమూరు: విశాఖపట్నంలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన 36వ అఖిలభారత క్లాసికల్, ఫోక్ డ్యాన్స్ పోటీల్లో సినీ క్లాసికల్ డ్యాన్స్ జూనియర్ విభాగంలో ఆలమూరు శ్రీసిద్ధార్థ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని డి.కావ్యశ్రీ ప్రథమ, క్లాసికల్ గ్రూప్ జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతులు సాధించారు. నిడదవోలుకు చెందిన శ్రీభ్రామరి కూచిపూడి నాట్యనిలయం నిర్వహించిన నాట్య శిరోమణి నృత్యోత్సవం 2025 పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థినులు సీహెచ్ ప్రణీత, కె.శరణ్య, ఏడో తరగతి విద్యార్థినులు టి.మణిశ్రీ, ఐ.చైత్రిక ప్రతిభ చూపి ప్రశంసాపత్రాలు పొందారు. వీరిని సోమవారం పాఠశాలలో డైరెక్టర్ ముల్లారావు, ప్రిన్సిపల్ గుణశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి

మామిడికుదురు: గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు అన్నంనీడి మహాలక్ష్మి (101) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమెకు కుమార్తె, ఇద్దరు కుమారులుసహా 9 మంది మనవళ్లు, మనవరాళ్లు, 16 మంది మునిమనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. తుది శ్వాస విడిచే వరకు తన పనులన్నీ స్వయంగా చేసుకున్నారని, 25 ఏళ్లుగా ఒంటిపూట భోజనం చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు

అయినవిల్లి, న్యూస్‌టుడే: విలస గ్రామానికి చెందిన దేవాబత్తుల బాలయోగి(43) ఈ నెల 8న అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్స నిమిత్తం తొలుత అమలాపురం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు. చికిత్స పొందుతూ 11వ తేదీన మృతి చెందారన్నారు. కుటుంబంలో పరిస్థితులతో మనోవేదనతో మృతిచెందినట్లు ఆయన తల్లి మహాలక్ష్మి సోమవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పుట్టుకొస్తున్న దోమలు.. విస్తరిస్తున్న జ్వరాలు

న్యూస్‌టుడే, కొత్తపేట

గ్రామాల్లో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో దోమలు విజృంభిస్తున్నాయి. పంచాయతీలు దోమల నిర్మూలన చర్యలు చేపట్టకపోవడంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పల్లెల్లో చిన్నపాటి వర్షానికే రోడ్ల పైకి మురుగు చేరుతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. కొత్తపేటలోని సంతోష్‌నగర్, మార్కెట్ వీధి, పాత, కొత్త రామాలయాల ప్రాంతాలు, రెవెన్యూ కాలనీ, బిళ్లకుర్రు, అవిడి తదితర గ్రామాల్లో అస్తవ్యస్త పారిశుద్ధ్య పరిస్థితులు ఉన్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు, వర్షపునీరు నిలిచిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ సుమారు 200 మంది రోగులు వస్తుండగా వీరిలో దాదాపు 60 మంది జ్వరబాధితులే ఉంటున్నారు. వైద్యుల కొరత కారణంగా రోగులకు పరీక్షల్లో జాప్యం చోటుచేసుకుంటోంది.

కొత్తపేట ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగులు

వైద్యులను సంప్రదించాలి

జ్వర లక్షణాలు కనిపించిన వెంటే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణకు తగిన పరీక్షలు చేయించుకోవాలి. ఆరోగ్యం కుదుటపడేవరకు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ మొర్తాల వంశీకుమార్, ప్రభుత్వాసుపత్రి వైద్యుడు, కొత్తపేట

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

డి.గన్నవరం బ్రాంచ్, పి. గన్నవరం, తూర్పుగోదావరి జిల్లా

స్వాధీనతా ప్రకటన

(చర మరియు స్థిరాస్తుల కోసం)

సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పి.గన్నవరం బ్రాంచ్, పి.గన్నవరం, తూర్పుగోదావరి జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **09-5-2025** తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేసి ఋణగ్రహీత : **శ్రీ అంబటి శ్రీనివాసరావు,** తండ్రి: సూర్యారావు, డోర్‌నెం. 1-65, అంబటివారి పాలెం, పి. గన్నవరం, పి.గన్నవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. **(HL Account No. 38728037705, Suraksha Account No. 38741674034)** వారిని సదరు నోటీసులో తెలిపిన విధంగా **03-05-2025** తేది నాటికి **మొత్తం రూ.45,16,950/- (నలభైఅయిదు లక్షల పదహారువేల తొమ్మిదివందల యాభై రూపాయలు మాత్రమే)** + వడ్డీ, వ్యయాలు, చార్జీలు మొ. వాటిని తనుగుణంగా చెల్లించిన మొత్తం తగ్గించి, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని కోరారు.

ఋణగ్రహీత / హామీదారులు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8 మరియు 9తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకం దారు **09 జూలై 2025**న నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా ఋణగ్రహీతకు / హామీదారునకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారం జరపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **03-05-2025 తేది నాటికి మొత్తం రూ.45,16,950/- (నలభైఅయిదు లక్షల పదహారువేల తొమ్మిదివందల యాభై రూపాయలు మాత్రమే) + వడ్డీ, వ్యయాలు మరియు అనుషంగిక చార్జీలు మొ॥నవి** తదుపరిగా మీరు ఏమైనా చెల్లింపులు చేస్తే అవి తగ్గించి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జీలకు లోబడి ఉంటాయని ముఖ్యంగా ఋణగ్రహీతను / హామీదారులను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

చర మరియు స్థిరాస్తుల వివరణ

శ్రీ అంబటి శ్రీనివాసరావు, తండ్రి : సూర్యారావు

తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం గ్రామపంచాయతీ ప్రాంతం, ఎల్.గన్నవరం గ్రామం, పి.గన్నవరం మండలం అంబాజీపేట ఎస్.ఆర్.వో, ఆర్ఎస్ నెం.178/6 జీరాయితీ తూర్పుగోదావరి జిల్లా య.0.10 సెంట్ల విస్తీర్ణంలో ఆర్.ఎస్.నెం.178/6లో పి.గన్నవరం మండలం పి.గన్నవరం గ్రామంలో నిర్మాణానికి ప్రతిపాదించిన ఆర్.సి.సి నివాస భవనాన్ని నిర్మించడం మరియు దానితో అనుబంధించబడిన అన్ని సౌలభ్యం హక్కులతో కలిపి. **సరిహద్దులు : తూర్పు : రోడ్డు, దక్షిణం :** ఈతకోట పెద్దులు గారి భూమి, **పడమర :** గెద్దాడ కృష్ణమూర్తిగారి భూమి, **ఉత్తరం :** శ్రీ గరుడేశ్వరస్వామి దేవస్థానం భూమి. దానికి అనుసంధానించబడిన అన్ని సౌలభ్య హక్కులతో కలిపి.

తేది : 09-7-2025 — అధీకృత అధికారి
ప్రదేశం : పి. గన్నవరం — స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాసరావు

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

అమలాపురం గ్రామీణం: నూతన ద్విచక్ర వాహనాలు విక్రయించే దుకాణదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కార్యాలయంలో దుకాణదారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా డీలర్ల లైసెన్సును రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నూతన వాహన కొనుగోలుదారులకు ఐఎస్ఐ మార్కు ఉండే హెల్మెట్‌ను మాత్రమే విక్రయించాలని సూచించారు.

ఇంజినీరింగ్ కార్మికుల వంటావార్పు

ముమ్మిడివరం: ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేష్ (సీఐటీయూ) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు సోమవారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సమ్మెకాలపు ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణ్‌కుమార్, విళ్ల వీరాస్వామినాయుడు, యలమంచిలి బాలరాజు, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, జి.రమేష్, వై.రమణ, ఎ.సత్తిబాబు, వి.ప్రసాద్, ఎస్.రామరాజు, జి.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, కె.శివ, కె.గోవిందు, కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

గొవ్వాలవారి రోడ్డులో..

మొబర్లీపేటలో..

స్పందనకు వందనం

సమస్య: అమలాపురం గొవ్వాలవారి రోడ్డులో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం -కిరణ్, స్థానికుడు

సమస్య: మొబర్లీపేట మురుగుకాలువ అపరిశుభ్రంగా తయారైంది -రాంబాబు, స్థానికుడు

సమస్య: ఎత్తురోడ్డు మురుగుకాలువ పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. - సురేష్, స్థానికుడు

పరిష్కారం: పట్టణంలోని గొవ్వాలవారి రోడ్డులో పిచ్చిమొక్కలు, మొబర్లీపేట, ఎత్తురోడ్డు మురుగు కాలువలో పిచ్చిమొక్కల సమస్యలు తెలుపగా సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వారు సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పగబట్టిన పొగ

■ డంపింగ్‌యార్డుకు నిప్పుపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి
■ అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికుల వేదన

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ఒక పక్క దుర్వాసన, మరో పక్క దట్టమైన పొగతో జనం ఇబ్బంది పడుతున్నారు. పగలూరాత్రీ తేడా లేకుండా పొగ, దుర్వాసన రావడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. అమలాపురం డంపింగ్‌యార్డులోని వ్యర్థాల గుట్టలకు నిప్పుపెట్టడంతో మంటలు ఎగసి పొగ వ్యాపిస్తోంది. దీనివల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నామని చుట్టుపక్కల నివాసితులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలోకి చేరుతున్న వ్యర్థాలు

ఈ ప్రాంతాల్లో ఉక్కిరిబిక్కిరి

డంపింగ్‌యార్డు పరిసరాలతోపాటు పట్టణ శివారు గ్రామాల్లో కాలువలు, రహదారుల పక్కన ఇదే పరిస్థితి. నల్లవంతెన బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా, కిమ్స్ కళాశాల దగ్గరలో, ఈదరపల్లి వంతెన దగ్గరలో, శివాలయంరోడ్డు కాలువల వద్ద ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్త వేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పురపాలక అధికారులు అమలుచేయకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. మురుగు కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. వాటిని తరలించకుండా మంటపెట్టడంతో పొగ వ్యాపిస్తోంది. ప్రధానంగా మద్యం దుకాణాల ఎదురుగా ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు కుప్పలు పేరుకుపోతున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

డంపింగ్‌యార్డు చుట్టు ఉన్న మూడు వార్డుల ప్రజలు దుర్వాసన, పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి ఆనుకుని అమలాపురం డిపో మద్యం సరఫరా చేసే గోదాం ఉంది. అక్కడ వందల మంది కార్మికులు పనిచేస్తున్నారు. నిప్పురవ్వలు ఎగిసిపడి అక్కడ అగ్నిప్రమాదం జరిగితే మా పరిస్థితి ఏమిటని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూతవేటు దూరంలో ఉన్న కళాశాలల్లో వందల విద్యార్థులు చదువుతున్నారు. వీరితోపాటు ఉపాధ్యాయులు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పొగ వ్యాపించడంతో నరకం అనుభవిస్తున్నామని వారు చెబుతున్నారు. బైపాస్‌రోడ్డు పొగతో నిండిపోవడంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు దారి కనిపించక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

ఎంత ఖర్చు పెట్టినా..

డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను సరిచేయడానికి పురపాలక సంఘం ఏటా నిధులు వెచ్చిస్తోంది. ఎంత చేసినా ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. కార్మికనగర్ దగ్గరలో కాలువ పక్కనే చెత్త వేసి తగలబెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

నల్లవంతెన నుంచి నడిపూడి వెళ్లేదారిలో పొగ

నరకం అనుభవిస్తున్నాం..

పొగ వల్ల పెద్దలు, పిల్లలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి పొగతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం. ప్లాస్టిక్‌వ్యర్థాలు, ప్రమాదకర వస్తువులను కాలుస్తుండటంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కరించడం లేదు. చుట్టు పక్కల జిల్లా కార్యాలయాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
–వెంకాయమ్మ, కార్మికనగర్

త్వరలోనే పరిష్కారమయ్యేలా చర్యలు

డంపింగ్‌యార్డుల్లోని చెత్త పేరుకుపోయి రసాయనిక చర్యల వల్ల మంటలు ఏర్పడుతున్నాయి. చెత్తకు నిప్పుపెట్టడం లేదు. మున్సిపల్ సిబ్బందితో మంటలను ఆర్పిస్తున్నాం. అధ్వానంగా ఉన్న వ్యర్థాల గుట్టలను శుభ్రం చేయించి శాస్త్రీయ పద్ధతిలో గుత్తేదారులు ప్రాసెస్ చేస్తున్నారు. డంపింగ్ యార్డుకు 15 నుంచి 20 ఎకరాలు అవసరం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.
–వి.నిర్మల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మంత్రిగా జాన్‌కుమార్ ప్రమాణస్వీకారం



జాన్‌కుమార్‌ను సత్కరిస్తున్న సీఎం రంగసామి, ఎల్జీ కైలాష్‌నాథన్

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి మంత్రివర్గ సభ్యుడిగా భాజపా ఎమ్మెల్యే జాన్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం మధ్యాహ్నం అట్టహాసంగా జరిగింది. రాజ్ నివాస్‌లో నిర్వహించిన ప్రమాణస్వీకార వేడుకలో లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్, సీఎం ఎన్.రంగసామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ ఇతర మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా ఎంపికైన తీపాంథ్యన్, జీఎన్ఎస్ రాజశేఖర్, సెల్వం వేలాయుధన్‌లతో స్పీకరు ఏంబళం సెల్వం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ వేడుకలలో పాల్గొన్న యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ నూతన మంత్రి జాన్‌కుమార్, నామినేటెడ్ ఎమ్మెల్యేలను సత్కరించి అభినందనలు తెలిపారు.

రాజీ మార్గంతో సమస్యలకు పరిష్కారం

ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి శ్రీలేఖ, న్యాయవాదులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాజీ మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలని కోరుతూ అమలాపురం కోర్టు ప్రాంగణం నుంచి గడియారస్తంభం వరకు అదనపు సివిల్ జడ్జి ఎస్.శ్రీలేఖ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. రాజీ మార్గం ద్వారా గెలుపు సొంతం అవుతుందని, డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు. బార్ అధ్యక్షుడు చింతపల్లి అజేయ్‌కుమార్, నందెపు చినవెంకటేశ్వరరావు, కళా వెంకట్రావు, బీవీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

అమలాపురం గ్రామీణం: అమలాపురం మండల వ్యవసాయశాఖ అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన కడలి ధర్మప్రసాద్ సేవలు అభినందనీయమని రెడ్డిపల్లి సర్పంచి కరాటం రత్నప్రసన్న, ప్రవీణ్ అన్నారు. పంచాయతీ కార్యాలయంలో సన్మానసభను సోమవారం నిర్వహించారు. రైతులకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. కరాటం సూర్యభాస్కరరావు, కొలిశెట్టి జయప్రకాష్, గణపతి, నెల్లి వెంకటలక్ష్మి, మహేష్, దొరబాబు, సతీష్ పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తత అవసరం

యానాం, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాల సమయంలో అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా ఉండాలని పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాపనులశాఖ, పురపాలకసంఘం, రెవెన్యూ, విద్యుత్తు, మత్స్య, పోలీసు, అగ్నిమాపక, ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, విద్యాశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాన్లు, వరదలు, భారీ వర్షాలు వస్తే చేపట్టాల్సిన బాధ్యతలు గురించి వివరించారు. సమావేశంలో కమిషనర్ బుద్ధి అఖిల్, ఆరోగ్యశాఖ డీడీ రవిశంకర్, డీటీ వెంకటేశ్వరరావు, ఏఈ ఎంవీవీ సత్యనారాయణ, సీఐ అడలరసన్, ఏడీ గొంతెయ్య తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తించిన తాచుపాము

పాముతో గణేష్‌వర్మ

ఉప్పలగుప్తం మండలం చినగాడవెల్లిలోని నరసింహం ఇంటి వద్ద కోళ్ల గూటిలోని గోధుమ తాచు పామును భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ సోమవారం పట్టుకున్నారు. అంతకు ముందు దానిని చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పామును సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలంలో పాములు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అవి కనిపిస్తే తనకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఎరువుల దుకాణంలో తనిఖీలు

కాట్రేనికోన: దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని శ్రీకాకుళం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్‌వీ మధు తెలిపారు. కాట్రేనికోనలోని సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ దుకాణంలో ఆయన, శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ డీవీవీ సతీష్‌కుమార్, ఏవో బి.మృధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ.5.73 లక్షల విలువైన యూరియా, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

అమలాపురం గ్రామీణం: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలగాలని అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్సై వై.శేఖర్‌బాబు సూచించారు. తాండవపల్లి, వన్నెచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని విద్యార్థులను సూచించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎ.వేమవరప్పాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు చొల్లంగి సాయిబాబు పాల్గొన్నారు.

★ ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రాము, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం పట్టణం: కూటమి ప్రభుత్వం హయాంలో ప్రశాంతత నెలకొందని నియోజకవర్గ పరిశీలికుడు పెచ్చెట్టి బాబు అన్నారు. అమలాపురం పట్టణంలోని 22, 23, 24 వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం తెదేపా నాయకులు సోమవారం నిర్వహించారు. తెదేపా నాయకులు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, టి.నేతాజీ, కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి, పలివెల శ్రీను, నల్లా స్వామి, కర్రి దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లంలో అరుగుపై కూర్చుని చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కాట్రేనికోన: పల్లం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎంపీ హరీశ్ మాథుర్, మోకా ఆనందసాగర్, గుత్తుల సాయి, చెల్లి అశోక్, నడింపల్లి సుబ్బరాజు, డి.సత్యం ,కూటమీపార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

సాల్మన్‌రాజు

యానాం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని బాలాఘాట్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరగనున్న డాక్టర్ బీసీ రాయ్ జూనియర్ నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొనే పుదుచ్చేరి జట్టుకు మహాత్మాగాంధీ బాలుర హైస్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి కామాడి సాల్మన్‌రాజు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు ఐవీకే మోహన్ తెలిపారు. 15 రోజులపాటు పుదుచ్చేరిలో నిర్వహించే శిక్షణకు పంపించినట్లు చెప్పారు. జాతీయ ఫుట్‌బాల్ పోటీకి ఎంపికైన సాల్మన్‌రాజును విద్యాశాఖాధికారి పీఎల్‌ప్రవీణ్, హెడ్మాస్టర్ నాగదేవి అభినందించారు.

ఒక ఆధార్.. అయిదు సర్వీసులు

ఫిర్యాదు చేసిన నాగశిరోమణి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తన ఆధార్ కార్డుకు అయిదు విద్యుత్తు మీటర్లు అనుసంధానం కావడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని అమలాపురం పట్టణానికి చెందిన ఉయ్యూరి నాగశిరోమణి వాపోయారు. అమలాపురం డివిజన్‌లోని వేర్వేరు గ్రామాల్లో ఉన్న విద్యుత్తు సర్వీసులు తన ఆధార్ కార్డుకు అనుసంధానమైనట్లు చెప్పారు. దీనివల్ల విద్యుత్తు వాడం ఎక్కువగా ఉన్నట్లు చూపించి తల్లికివందనం పథకం అందలేదన్నారు. అధికారులు స్పందించి తన ఆధార్ కార్డుతో లింక్ అయిన సర్వీసులు తొలగించి, ప్రభుత్వ పథకాలను అందించాలని కోరుతున్నారు.

చేపల చెరువు కౌలుహక్కు బహిరంగ వేలం ప్రకటన సవరణ

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం టౌన్ మరియు మండలము నందు యున్న శ్రీ మంత్రిప్రగడ వారి సత్రము హక్కుభుక్తములో గల ఈ దిగువ ఉదహరించిన గ్రామములో గల చెరువు దేవదాయ శాఖ అధికారుల సమక్షమున ఆంధ్రప్రదేశ్ హిందూమత దేవదాయ - ధర్మదాయ శాఖ చట్టములోని సెక్షన్ (82) లోని ఉప సెక్షన్ (1) ప్రకారము మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జి.ఒ.ఎమ్.ఎస్.నెం. 379, ది.11-03-2003 ప్రకారం జారీచేయబడిన నిబంధనలను అనుసరించి సదరు భూమిని కౌలు హక్కునకు బహిరంగ వేలంపాట జరుపబడును.

వరుస నెం.	భూమి యున్న గ్రామము మరియు మండలము	విస్తీర్ణము వివరము	భూమి స్వభావము	కౌలు కాలపరిమితి	పాట జరుగు తేదీ, సమయం
1	వన్నెచింతలపూడి (గ్రా) అమలాపురం (మం)	07.16 సెంట్లు	చేపల చెరువు	2025-2026 సం॥ నుండి 2027-2028 సం॥ వరకు	ది.25-07-2025 శుక్రవారము ఉదయం గం॥10.00లకు సీల్డు టెండర్లు గం॥11.00లకు బహిరంగ వేలంపాట

అమలాపురం, తేది.14-07-2025.
సం/- జె.రామలింగేశ్వరరావు
కార్యనిర్వహణాధికారి.

బాధ్యులపై చర్యలకు వినతి

చెక్కపల్లి శ్రీనివాస్, వెన్నెల సహవిద్యార్థులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తన కుమార్తె చెక్కపల్లి వెన్నెల ఆలమూరు మండలం చెముడులంక శ్రీషిర్డిసాయి విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుతూ గత ఏడాది ఆత్మహత్య చేసుకుందని, దీనికి కారణమైన పాఠశాలపై చర్యలు తీసుకోవాలని తండ్రి శ్రీనివాస్ ఎస్పీ కృష్ణారావుకు సోమవారం వినతి అందజేశారు. దసరా సెలవుల విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాఠశాల యాజమాన్యం కక్షగట్టి ఆమెను బెదిరించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. 9 నెలలు గడిచినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. వెన్నెల కేసును పరిష్కరించాలని ఫోటోగ్రాఫర్లు నల్లచొక్కాలు ధరించి వచ్చారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణారావు వినతులు స్వీకరించారు. 35 మంది వివిధ సమస్యలపై అర్జీదారుల అందజేశారు.

అర్జీ ఇచ్చేందుకు వచ్చి.. సొమ్మసిల్లిన మహిళ

అమలాపురం కలెక్టరేట్: తమ సమస్యపై వినతి ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయిన ఘటన సోమవారం గోదావరి భవన్‌లో చోటు చేసుకుంది. ద్రాక్షారామ పరిధిలో వెలంపాలెం ప్రాంతానికి చెందిన చెల్లి మంగ, తన భర్త సుబ్రహ్మణ్యంతో కలిసి స్థానికంగా ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన భూములను కొన్నేళ్లుగా కౌలుకు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. తాము సాగు చేస్తున్న భూములను ఇటీవల వేరే వారికి కౌలు నిర్ధారణ చేయడంతో తాము జీవనోపాధి కోల్పోయామని సుబ్రహ్మణ్యం వాపోయారు. దీనిపై వారు సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చేందుకు వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గోదావరి భవనంలో మంగ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

స్పృహ తప్పి పడిపోయిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

అమలాపురం గ్రామీణం: ఇటీవల కామనగరువులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేయూతనందించారు. జంగంపాలెంలోని బాధిత కుటుంబాలైన కుంచే శాంతమ్మ, వాసంశెట్టి పెద్దిరాజు కుటుంబాలకు సొసైటీ ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ చేతులమీదుగా వంట సామగ్రి, టార్పాలిన్, రగ్గులు, బియ్యం, కూరగాయలు, దుస్తులు సోమవారం అందించారు. రెడ్‌క్రాస్ సంయుక్త కోశాధికారి జల్లి సుజాత, సర్పంచి నక్కా అరుణకుమారి, చంద్రశేఖర్, సభ్యులు బి.వి.హనుమంతరావు, ఓ.బాలరాజు, పట్నాల రమణ, శేఖర్, బి.శివరాం తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం మధ్యాహ్నం వరద నీటిలో ఫెర్రీరోడ్డు

సోమవారం సాయంత్రం ఇలా..

తొలగిన వరద ముంపు

ఒక్కరోజులో గోదావరి నీటిమట్టంలో ఏర్పడిన హెచ్చు తగ్గుల ప్రభావం యానాం రాజీవ్‌బీచ్‌కు వెళ్లే ఫెర్రీరోడ్డులో స్పష్టంగా కనిపించింది. ఆదివారం ఆరు లక్షల క్యూసెక్కుల పైగా నీరు సముద్రంలోకి చేరడంతో ఫ్రాన్సుతిప్పలోని గురుకృష్ణాపురం, ఫెర్రీరోడ్డును వరద ముంచెత్తింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. సోమవారం గోదావరి నీటి మట్టం తగ్గడంతో యానాంలో వరద ముంపు తొలగింది. –న్యూస్‌టుడే, యానాం

మౌలిక వసతులు ఏవీ..?

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీ, మట్టాడిపాలెం, అగ్రహారం, పల్లిపాలెం తదితర కాలనీల్లో మౌలిక వసతులు కానరాక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇందిరా కాలనీలో 30 ఏళ్ల క్రితం పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చింది. వాటిలో కొంతమంది పక్కా ఇళ్లు నిర్మించుకోగా.. పలువురు పూరిపాకలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీకి కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి వెళ్లే రహదారికి ఇటీవల కొంత గ్రావెల్ వేసినా.. అంతర్గత రహదార్లకు తట్ట మట్టి కూడా వేయలేదు. వర్షాకాలం వచ్చిందంటే వారు పడే పాట్లు అన్నీఇన్నీ కావు. మట్టిరోడ్డులో జారిపడుతూ.. ప్రయాణించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

జగనన్న కాలనీల్లో కానరాని డ్రెయిన్లు.. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఎక్కడా మౌలిక వసతులు కానరాని పరిస్థితి నెలకొంది. ముమ్మిడివరం నియోజకవర్గంలో 125 లే అవుట్లలో ప్రజలకు ఇళ్ల స్థలాలను ఇచ్చారు. వీటిలో చాలా వరకు మెరక చేయకపోవడం, రహదార్లు నిర్మాణం లేక ఇక్కట్లు ఎదురౌతున్నాయి. కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్‌ను తీసుకెళ్లాలన్నా.. దారి లేకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేని మధ్యలోనే నిలిపివేసిన పరిస్థితి ఎదురౌతోంది. పలు జగనన్న కాలనీల్లో రహదార్లు నిర్మించినా.. మురుగుకాలువల వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. లబ్ధిదారులకు పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వడం.. ఇళ్లన్నీ ఇరుకిరుకుగా ఉండడం.. వారు వినియోగించిన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఎక్కడి మురుగు అక్కడే ఉంటోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రహదారి, డ్రెయిన్ సౌకర్యం లేని ముమ్మిడివరంలోని కాలనీ

కానరాని పనులు.. జగనన్న కాలనీల్లో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టి.. అక్కడ మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అప్పట్లో వైకాపా పాలకులు పదేపదే గొప్పలు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎక్కడా పనులు చేపట్టలేదు. చివరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సైతం సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులను భవన నిర్మాణాలకు మాత్రమే కేటాయించి.. రహదార్లు డ్రెయిన్లను విస్మరించారు.

నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం..

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కాలనీల్లో స్థానిక శాసన సభ్యులు దాట్ల సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. కాలనీల్లో అంతర్గత రహదార్లు, డ్రెయిన్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
-పి.రవివర్మ, నగర పంచాయతీ కమిషనర్, ముమ్మిడివరం

ప్రమాణస్వీకార మహోత్సవ శుభాకాంక్షలు

శ్రీ రుద్రరాజు సురేష్ రాజు గారు
ఛైర్‌పర్సన్: PACS, గోడిలంక

గోడిలంక PACS ఛైర్‌పర్సన్‌గా నేడు ప్రమాణస్వీకారం చేస్తున్న మంచిమనిషి, శ్రేయోభిలాషులు, మా ప్రియ మిత్రులు శ్రీ రుద్రరాజు సురేష్ రాజు గారికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.

Best Compliments From:
గుంటూరి పాండురంగరాజు (పాండు), గుండెపూడి
S.R.K.V.V.L.K.రాజు (చిన్నబాబు)
కాట్రేనికోన

(c) eenadu

వలస కూలీల చిన్నారులకు అక్షరాభ్యాసం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదన్న ఉద్దేశంతో ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన అభిమాని మద్దూ కుమార్‌రాజా సహకారంతో వలస కూలీల చిన్నారులకు సోమవారం ర్యాలిలో స్థానిక అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వలస కూలీలకు విద్య ఆవశ్యకత గురించి తెలియజేసి, వారి పిల్లలకు పలకలు, పుస్తకాలు తదితర విద్యా సామగ్రి అందజేశారు. సంస్థ నిర్వాహకులు శ్యామ్‌కుమార్, చింతా మోహిత్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

•మండపేట • రామచంద్రపురం

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదానశాల నిర్మాణానికి ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లి గ్రామానికి చెందిన బొక్కా వెంకన్నబాబు, లోహిత దంపతులు రూ.1,01,116 విరాళాన్ని సోమవారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం పర్యవేక్షకుడు పి.రాంబాబు అభినందించారు.

దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న రాంబాబు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ద్రాక్షారామ: 80085 74192 ద్వారపూడి: 91543 96553

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు రజకవీధిలో వీధి దీపాలు రాత్రివేళల్లో వెలగడంలేదు. - ఎస్.సుబ్బారావు, జడ్.మేడపాడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు.

సమస్య: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధి బంగారమ్మపాలెంలో రహదారి పక్కన వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. - పి.మురళి, ద్వారపూడి

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణకు తెలియజేయగా వెంటనే సిబ్బందిని పంపించి చెత్తను తొలగింపజేసి పరిసరాలు శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

స్పందనకు వందనం

పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంకు కార్యాలయం వద్ద డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. కమిషనర్ ఆదేశాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వ్యర్థాలు తొలగించే పనులు చేపట్టారు. - న్యూస్‌టుడే, మండపేట

వ్యర్థాలు తొలగించారు.. రాయవరం చెల్లాయమ్మపేటలోని డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోయిందని 'మేమున్నాం.. మీకు తోడు'గా ద్వారా సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, రాయవరం

సాధనతో ఆరోగ్య యోగం..

యోగాలో రాణిస్తున్న చిన్నారులు

మండపేట, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరిగిన నేపథ్యంలో వయసుతో సంబంధం లేకుండా ఎంతోమంది సాధన చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల కారణంగా పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు. కష్టపడి సంపాదించిన ఆదాయంలో 40 శాతం వైద్యానికే ఖర్చు చేస్తున్నారు. దీనివల్ల పనిచేసే సామర్థ్యం తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య పరిరక్షణకు యోగాసాధన ఆవశ్యకతను అనుభవపూర్వకంగా గుర్తిస్తున్నారు. వారి అనుభవాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా ఎక్కువ మంది నేర్చుకునేలా ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల మండపేటలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ఎదురుగా నందమూరి తారకరామారావు స్కేటింగ్ పార్కులో ఏర్పాటుచేసిన యోగా కేంద్రంలో చిన్నారులు సైతం ఆసక్తిగా యోగాసనాలు నేర్చుకుంటున్నారు. వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు చిన్నారులు జిల్లా అమలాపురంలో నిర్వహించిన యోగాంధ్ర పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

యోగా సాధనలో విద్యార్థులు

నిత్యం స్కూలుకి వెళుతున్నాను..

ఆరు నెలలుగా ప్రాణాయామం, యోగాసనాలు నేర్చుకుంటున్నాను. అమలాపురంలో నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. ఇపుడు రోజూ మానకుండా పాఠశాలకు వెళుతున్నాను. గతంలో వెళ్లలేకపోయేదాన్ని. ప్రస్తుతం ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విని బాగా చదువుకుంటున్నాను. - శరణ్య 5వ తరగతి, మండపేట

చదువుతో ఒత్తిడి లేదు..

ఉన్నత తరగతులకు వెళుతున్నప్పటి నుంచి సబ్జెక్టులు పెరిగి చదవాలంటే ఒత్తిడికి గురవుతూ ఉంటారు. ఏడాది కాలంగా యోగాలో శిక్షణ పొందుతున్నాను. పాఠాలు పెరిగినా హోంవర్కు ఎక్కువైనా ఒత్తిడికి గురవకుండా చదువుపై దృష్టి సారిస్తున్నాను. - ఐశ్వర్య, 8వ తరగతి

ఏకాగ్రత పెరిగి మార్కులు వస్తున్నాయి..

నేను గత 6 నెలలుగా యోగా నేర్చుకుంటున్నాను. ఇటీవల అమలాపురంలో నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి అందుకున్నాను. యోగా నేర్చుకోవడం వల్ల పాఠశాలలో చెప్పిన పాఠాలు బాగా అర్థమవుతున్నాయి. పరీక్షలు బాగా రాయడంతో మార్కులు కూడా బాగా వస్తున్నాయి. - సూర్యవర్షిణి, 6వ తరగతి

బీఎల్వోలకు శిక్షణ తరగతులు

రాయవరం: జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం బూత్‌స్థాయి అధికారులకు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. మండపేట నియోజకవర్గం ఎన్నికల నమోదు అధికారి పి.శ్రీకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ట్రైనీలు నాగాం నాగిరెడ్డి ఎన్నికల విధులు, బాధ్యతలు, ఫారం-6, 6ఏ, 7, 8, 9, 10, 11, 11ఏ, 11బి, 12, 13, 14 దరఖాస్తులపై అవగాహన కల్పించారు. అనంతరం బీఎల్వోలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఐవీ శెట్టి, పి.ఎ.మెహర్‌బాబా, రాయవరం డీటీ కె.భాస్కర్, ఈవోఆర్డీ డీటీ సంధ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను మార్చేశారు

అల్లవరం, న్యూస్‌టుడే: బెండమూర్లంకలో తమకు చెందిన ఇంటి స్థలాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు వేరే వ్యక్తి పేరున మార్పు చేసి ఇంటి పన్ను సైతం మార్చేశారని సానబోయిన లక్ష్మణ్ కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. తమకు స్థానికంగా 676/1 సర్వే నంబరులో 2.5 సెంట్ల ఇంటి స్థలం ఉందని, ఉపాధి నిమిత్తం ప్రస్తుతం భద్రాచలంలో ఉంటున్నామన్నారు. ఆ స్థలాన్ని అంబాజీపేట మండలం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాల ద్వారా వేరే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి స్థలం ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న ఆర్డీవో అఖిల

ఆర్డీవో కార్యాలయంలో 7 అర్జీలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్‌ఎస్)లో వివిధ సమస్యలపై ఏడు అర్జీలు వచ్చాయి. ఆయా వర్గాల నుంచి ఆర్డీవో అఖిల వినతులు స్వీకరించారు. వీటిలో రెండు ఆక్రమణల తొలగింపునకు సంబంధించినవి కాగా, సెక్షన్ 22ఏ నుంచి భూములు తొలగించాలని ఒకటి, రైసుమిల్లుల జట్టు కార్మికులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మరొకటి, మోసపూరితంగా డబ్బు వసూలుచేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మూడు దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. ఆయా అర్జీలను పరిష్కారం నిమిత్తం సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపిస్తున్నట్లు ఆమె వివరించారు.

అన్ని వర్గాలకు నచ్చేలా.. జనం మెచ్చేలా పాలన

రామచంద్రపురంలో మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి పాలన అన్ని వర్గాలకు నచ్చేలా.. జనం మెచ్చేలా సాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పట్టణంలోని 10, 11 వార్డుల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిపై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని పలువురు మంత్రికి వివరించారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభమవుతుందని వివరించారు. నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు కాకినాడ రామారావు, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చందమామ వాసు, కూటమి నాయకులు, బూత్ కస్టర్లు, ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● శీలంవారి సావరంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కూటమి నాయకులు మేడిశెట్టి శేషారావు, కంచుమర్తి బాబూరావు తదితరులు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచారు.

మండపేట: పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం 5వ వార్డులో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా పర్యటించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, నేతలు గడి సత్యవతి, బంగ సంజయ్ పాల్గొన్నారు.

కాజులూరు: కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో సంక్షేమమే ధ్యేయంగా భవిష్యత్తులో పాలన కొనసాగుతుందని సహకార సంఘం అధ్యక్షుడు లంగర శ్రీను అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజాభిప్రాయాలు సేకరించి మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. పార్టీ నేతలు నక్కా శ్రీను, లక్ష్మీనారాయణ, అంగర శ్రీను, అత్తిలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులతో కలిసి పర్యటిస్తున్న మంత్రి సుభాష్

ద్విచక్ర వాహనాలు, వ్యాపార బడ్డీలతో ఆక్రమణ

కాలిబాట.. కానరాదు..

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలో పాదచారుల కోసం ప్రత్యేకించి ఏర్పాటుచేసిన కాలిబాటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. వివిధ వస్తుసామగ్రి, పండ్ల విక్రయించే వ్యాపార బండ్లతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఫుట్‌పాత్‌పై నిలపడంతో నడిచేదారికి అవకాశం లేక రోడ్డుపై వెళుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా బైకులను ఎక్కువగా నిలపడంతో కళాశాల విడిచిపెట్టే మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రోడ్డుపై రద్దీ పెరుగుతుంది. డాక్టర్ స్టాలిన్ ఆసుపత్రి పరిసరాల్లోనూ ఆకతాయిల చేష్టలతో కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ నాగేశ్వరరావును వివరణ కోరగా మధ్యాహ్న సమయంలో పోలీసులను మఫ్టీలో ఉంచుతున్నామని చెప్పారు.

బీటలువారి కుంగిన సిమెంటు రహదారి

పట్టణంలోని 8వ వార్డు పరిధి ఎస్సీపేట ఆదర్శ హెల్పింగ్ హేండ్స్ అన్నదాన శిబిరం ఎదురుగా సిమెంటు రహదారి బీటలు వారింది. కొన్ని చోట్ల ముక్కలుగా విరిగిపోయింది. మధ్యలో ఖాళీ ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావును వివరణ కోరగా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, మండపేట

పూడిక తొలగించి.. రోడ్డుపై వదిలేశారు

వెలంపాలెం-నెలపర్తిపాడు మార్గంలోని పంట పొలాల నుంచి మురుగు పోయే కాలువలో ఇటీవల జేసీబీ సాయంతో పూడిక తొలగించారు. కాలువలో ప్రవాహం పెరిగేలా చర్యలు చేపట్టారు. అంతవరకు బాగానే ఉన్నా పూడిక మట్టిని ప్రధాన రహదారి పక్కన వదిలేశారు. పనులు పూర్తయి దాదాపు నెల రోజులు కావస్తున్నా వ్యర్థాలు, మట్టిని తొలగించకపోవడంతో మళ్లీ రహదారిపైకి చేరుతోంది. వర్షాలు కురిస్తే బురదగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ విషయమై డ్రైనేజీ డీఈఈ పోచారావును వివరణ కోరగా వాస్తవానికి డ్రైనేజీ గట్టును రోడ్డుగా వాడడంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెప్పారు. ఆయా పనులను స్థానికంగా చేపట్టారని, వారితో మాట్లాడి తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

నీటిట్యాంకు పైకప్పు పనులు ప్రారంభం

మండపేట, న్యూస్‌టుడే: నీటి సరఫరాకు ఉద్దేశించిన ట్యాంకు కూలిపోయి నెల రోజులకు పైగా గడుస్తున్నా పనులు ఇంకా కొలిక్కిరాలేదు. దీంతో రక్షితనీటి కోసం స్థానికులు కటకటలాడుతున్నారు. ఈ నేపథ్యంలో ట్యాంకు పైకప్పు పనులను సోమవారం ప్రారంభించారు. ట్యాంకు మధ్యలో ఏర్పాటుచేసిన పిల్లర్‌ను కలుపుతూ అంచుల నుంచి నిలువుగా బలమైన ఇనుప కమ్మీలు బిగిస్తున్నారు. దీనిపై డూమ్ వేసే చర్యలు చేపట్టామని డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఈనెలాఖరుకు పనులు పూర్తిచేసే అవకాశాలున్నాయని ఆయన చెప్పారు.

యనమదల సొసైటీ త్రిసభ్య కమిటీ ఏర్పాటు



నూతన త్రిసభ్యకమిటీ సభ్యులు

ద్రాక్షారామ: యనమదల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి త్రిసభ్య కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలతో తాడిపల్లి గ్రామానికి చెందిన మాదాల ఆనందరావు ఛైర్మన్‌గా, గుణ్ణం కృష్ణమూర్తి, రొక్కాల రామారావు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సొసైటీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తెస్తే మంత్రి సహకారంతో పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ కోలాట ప్రదర్శనలో మహిళలు

కనులపండువగా ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ శ్రీభీమేశ్వరాలయ ప్రాంగణంలో కొలువైన శ్రీప్రసన్నాంజనేయస్వామివారి ఆలయ సప్త సప్తాహ మహోత్సవంలో ఆరు వారాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా రూపొందించిన ఉష్ట్ర వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి మేళతాళాలు, కోలాట ప్రదర్శనతో యాత్రను వైభవంగా జరిపించారు. ద్రాక్షారామ, వెలంపాలెం వీధుల్లో ఊరేగింపు సాగింది. దారి పొడవునా ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోణం శ్రీను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశుగ్రాస క్షేత్రంలో అధికారులు, రైతులు

పశుగ్రాసం పెంచండి.. లాభాలు పొందండి

పామర్రు: వివిధ రకాల పశుగ్రాసాలు పెంచడం ద్వారా రైతులు లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయని పశు సంవర్ధక శాఖ ఏడీ ఒ.రామకృష్ణ అనారు. పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా సోమవారం కె.గంగవరం మండలం బ్రహ్మపురి, మసకపల్లి, కోట తదితర తీర గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనుము, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట రకాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటిని పశువులకు అందిస్తే సకాలంలో ఎదకు వస్తాయని చెప్పారు. పాల దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందని వివరించారు. పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలు వివరించారు. స్థానిక రైతులు, పశు సంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రలోభాలకు ఆకర్షితులవ్వొద్దు..

శక్తి యాప్‌పై విద్యార్థులకు పోలీసు శాఖ అవగాహన

రాయవరం, న్యూస్‌టుడే: కిశోర బాలికలు, యువత సామాజిక మాధ్యమాల ప్రలోభాలకు ఆకర్షితులు కావొద్దని రామచంద్రపురం డివిజన్ శిక్షణ డీఎస్పీ ప్రదీప్తి సూచించారు. సోమవారం రాయవరంలోని శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం శాంతి సునీత అధ్యక్షతన శక్తి యాప్ వినియోగంపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పాఠశాల, కళాశాల దశలో విద్యపై దృష్టిసారించి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలన్నారు. ఇటీవల కపిలేశ్వరపురం మండలం అంగరలో ఇంట్లో చెప్పకుండా అదృశ్యమైన బాలిక ఉదంతాన్ని డీఎస్పీ ఉదాహరిస్తూ తెలిసీ తెలియని వయసులో యువతలు, చిన్నారులు మోసపోతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయని చెప్పారు. చట్టాలు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్ ద్వారా అందిస్తున్న సహకారంపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మండపేట గ్రామీణ సీఐ దొరరాజు, రాయవరం ఎస్సై సురేష్‌బాబు చరవాణిలో యాప్ వినియోగించే తీరు, ప్రయోజనాలు వివరించారు. రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి అధికారి అభిరామ్, ప్రభుత్వ జూనియర్, విజ్ఞాన్ కళాశాల, జడ్పీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో అవగాహన కల్పిస్తున్న శిక్షణ డీఎస్పీ ప్రదీప్తి

హామీలు అమలు చేయండి..

ద్రాక్షారామ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని రామచంద్రపురం నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి, యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ కోరారు. సోమవారం హసనబాద కమ్యూనిటీ హాలులో పార్టీ మండల అధ్యక్షుడు పోలినాటి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. త్వరలో గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గం పరిశీలకుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి భవాని, ఏపీఐఐసీ మాజీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మాణ పనులు వేగవంతం

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారానికి, రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన తోకలంక మధ్య నదీపాయపై కాజ్‌వే నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా తోకలంక ప్రజల స్వప్నమైన కాజ్‌వే నిర్మాణంపై ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించగా, గ్రామస్థులు రూ.3 లక్షలు విరాళం ఇచ్చారు. గోదావరిలో వరద ఉద్ధృతి ఉండటంతో సోమవారం కాజ్‌వే పనులను ఎంపీడీవో రాజు తదితరులు పరిశీలించారు. వీలైనంత త్వరలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

రైస్‌మిల్లు కార్మికుల కూలి రేట్లు పెంచాలని ధర్నా

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రైస్‌మిల్లు కార్మికుల కూలి రేట్లు పెంచాలని రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు తదితర ప్రాంతాలతో పాటు రామచంద్రపురం డివిజన్‌లో పనిచేస్తున్న జట్టు కార్మికులకు మిల్లు యాజమాన్యాలు అతి తక్కువ కూలి చెల్లిస్తున్నాయని కార్మిక నేతలు పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులు లేక పూట గడవని పరిస్థితి ఎదురవుతోందన్నారు. కార్మిక అధికారులు కల్పించుకుని రేట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు కోరారు. రెండు సంవత్సరాల క్రితం అరకొరగా మిల్లు యాజమాన్యాలు పెంచిన రేట్ల ఒప్పందం 2024 ఏప్రిల్ ఒకటో తేదీతో ముగిసిందని, మరో రెండేళ్లకు ఒప్పందం చేసుకోవాలని కార్మికులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో అఖిలకు అందించారు. కార్యక్రమంలో మీసాల శ్రీను, చిట్టూరి శ్రీనివాసరావు, కోసూరి జగన్నాథం, భూమిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, కడియాల అప్పారావు, ఎం.గణేష్, కర్రి రామకృష్ణ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నిరసనలో ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - విశాఖపట్నం

గ్రౌండ్ మరియు 1వ అంతస్తు, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ్ భవన్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530020

O.A.నెం.572/2025

డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రక్రియ) రూల్స్, 1993 యొక్క సబ్ - రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సమన్లు.

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECCC & SARC, రామారావుపేట, కాకినాడ, దాని మేనేజర్ & అధీకృత సంతకదారుడు. ... దరఖాస్తుదారుడు

మధ్య (VS)

శ్రీ కస్తూరి రాజగోపాలకృష్ణమోహన్, తండ్రి: వెంకటరాజు

క్రింది వారికి,

శ్రీ కస్తూరి రాజగోపాలకృష్ణమోహన్, తండ్రి: **వెంకటరాజు,** డో.నెం. 12-6-38/1, చల్లా వారి వీధి, రామచంద్రపురం, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533255. ...ప్రతివాదులు

పేపరు ప్రచురణ ద్వారా ప్రతివాదులకు సమన్లు

గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ వారి సమక్షమున

OA/572/2025, తేది: 01-08-2025న జాబితా (లిస్టెడ్) చేయటమైనది.

రుణం రూ.23,76,368.83 పై॥లు వసూలు కొరకు మీ పైన వేసిన దావా (ఓ.ఎ) ననుసరించి, చట్టం యొక్క 19 (4) సెక్షన్ క్రింద సదరు దరఖాస్తు పైన గౌరవనీయ ట్రిబ్యునల్ సమన్లు / నోటీసు జారీ (దరఖాస్తు డాక్యుమెంట్లు కాపీలు వగైరాతో మా సమక్షమున అందజేయబడతాయి) చేయడమైనది. చట్టం యొక్క 19వ సెక్షన్ (4)వ సబ్ - సెక్షన్ తదనుగుణంగా మీరు, ప్రతివాదులు ఈ క్రింది అంశాలు గమనించవలెను.

(1) సమన్లు జారీ చేసిన 30 రోజులు లోగా కోరిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి.

(2) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన ఎస్సెట్స్ లేదా ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు మరియు ఎస్సెట్స్ వివరాలను వెల్లడించాలి.

ఆస్తులు ఎటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉన్నందున, సెక్యూర్డ్ ఎస్సెట్స్ లేదా అటువంటి ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన వాటితో లావాదేవీలు చేయుట లేదా విక్రయించుట నుండి మిమ్మల్ని నిరోధించడమైనది.

(3) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన లేదా బహిరంగ పరచిన సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఎస్సెట్స్ మరియు / లేదా ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు పైన మీరు సాధారణ వ్యాపారం మినహా, వాటిని ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించుట, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు ద్వారా మీరు బదిలీచేయ వీలులేదు.

(4) సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అట్టి విక్రయ ఆదాయాన్ని సదరు ఆస్తులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ కలిగియున్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థలు నందు నిర్వహిస్తున్న ఖాతా నందు జమ చేయవలెను.

ఇందుకు సంబంధించి లిఖిత స్టేట్‌మెంట్‌ను, దాని కాపీని దరఖాస్తుదారునికి దాఖలు చేస్తూ తేది: **01-08-2025** నాటి ఉ॥ **10.30** గంటలకు ప్రిసైడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ సమక్షంనకు హాజరు కావలసినదిగా కూడా మీకు సూచించడమైనది అట్లు చేయనిచో దరఖాస్తు మీ పరోక్షమున విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.

(ఇది నా స్వహస్తాలతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో 07, జులై 2025న ఇవ్వడమైనది)

సం/- **సమన్లు జారీ చేయు అధీకృత అధికారి**

రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

(c) eenadu

పెద్దాపురంలో కార్మికులు తయారుచేసిన సిల్క్

పెద్దాపురం సిల్క్‌కు అరుదైన గుర్తింపు

అవార్డు అందుకున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ కలెక్టరేట్, పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద 2024-25కు పెద్దాపురం సిల్క్ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలోని 26 జిల్లాలు పోటీలో నిలవగా.. ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులకు అవార్డులు వచ్చాయి. అందులో కాకినాడ జిల్లానుంచి పెద్దాపురం సిల్క్‌కు చోటు దక్కింది. పురస్కారాన్ని సోమవారం దిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్‌గోయల్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అందరి కృషితో ఇటీవల జిల్లాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు ఎక్కువగా వచ్చాయన్నారు.

పూర్వం నుంచీ ప్రసిద్ధి..: పెద్దాపురం సిల్క్ పూర్వం నుంచి ఎంతో ప్రసిద్ధి. పట్టణంలో రెండు చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో దారానికి రంగులద్దే పనిపై 40 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. బెంగళూరు నుంచి తెప్పించిన సిల్క్‌కు ఇక్కడ రంగులద్ది ఉప్పాడలోని చీరల తయారీ మగ్గాల వారికి తరలిస్తారు. అక్కడ వారు చీరలు నేసి ఎగుమతి చేస్తారు. స్థానికంగానూ విక్రయాలు చేస్తారు.

బృహత్తర ప్రణాళిక.. ప్రగతి వీచిక

రుడా కార్యాలయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (రుడా) పరిధిలోని పురపాలికలకు కలిపి కొత్త బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమలు చేయనున్నారు. ఇప్పటికే డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేశారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు కూడా స్వీకరించారు. దీనికి త్వరలో సర్కారు నుంచి ఆమోదం లభించనుంది. పట్టణాలతో పాటు వాటిని ఆనుకొని ఉన్న శివారు గ్రామాలను కలిపి పట్టణ సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో కొత్త మాస్టర్ ప్లాన్‌లో రుడా పరిధిలోని పురపాలికల్లో సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ప్రణాళిక తయారు చేశారు. రుడా పరిధిలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతోపాటు, రామచంద్రాపురం, కొవ్వూరు, నిడదవోలు పురపాలికలు ఉన్నాయి.

విలీనం కానున్న గ్రామాలు

☛ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 12 గ్రామాలను విలీనం చేసి ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం నగర విస్తీర్ణం 44.5 చదరపు కి.మీ ఉండగా, కొత్తగా కలిపిన గ్రామాలతో 162 చ.కి.మీ విస్తీర్ణంతో మహా రాజమహేంద్రవరంగా అభివృద్ధి కానుంది. దీంతో నగరాన్ని ఆనుకొని కాతేరు, తొర్రేడు, కోలమూరు, గాడాల, పాలచర్ల, లాలాచెరువు, దివాన్‌చెరువు, పిడింగొయ్యి, హుకుంపేట, శాటిలైట్‌సిటీ, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామ పంచాయతీలు ప్లాన్‌లో కలుస్తాయి.

☛ కొవ్వూరు పురపాలిక పరిధిలో చుట్టుపక్కల తొమ్మిది గ్రామాలను విలీనం చేస్తూ 36.63 చ.కి.మీ విస్తీర్ణంతో డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధమైంది. దీని కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. నమోదైన అభ్యంతరాలు పరిశీలిస్తున్నారు.

☛ రామచంద్రాపురంలో చుట్టుపక్కల 14 గ్రామ పంచాయతీలను కలిపి 43.94 చ.కి.మీతో ప్లాన్ సిద్ధం చేశారు. తాజాగా అభ్యంతరాలు స్వీకరణకు గడువు విధించారు. ప్రస్తుతం దీనిని మున్సిపల్ కార్యాలయంతో పాటు రెవెన్యూ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

☛ నిడదవోలు పురపాలికలో శివారు ప్రాంతాల్లో 14 గ్రామాలను కలిపి 47 చ.కి.మీ విస్తీర్ణంతో ప్లాన్ తయారు చేయగా.. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ముసాయిదా ప్లాన్ సిద్ధమవుతుంది. రుడా నేతృత్వంలో ప్రణాళికా విభాగం అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

పట్టణీకరణతో మౌలిక వసతులు

కూటమి ప్రభుత్వం పట్టణీకరణ పేరుతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఆ బాధ్యతలను అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీకి అప్పగించారు. దీంతో పురపాలికలకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో అర్బన్ తరహాలో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తారు. తద్వారా పట్టణాల తరహాలో రోడ్ల విస్తరణ, కాలువల ఆధునికీకరణ చేపడతారు. గ్రామాల్లో తాగునీటి సదుపాయం మెరుగుపరుస్తారు. విద్య, ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తారు. గ్రామాల్లో ప్రాథమిక కేంద్రాలను విస్తరించడం, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తారు. పీపీపీ విధానంలో నిర్మాణ రంగాన్ని తీసుకొస్తారు. హోటళ్లు, పర్యాటక అభివృద్ధి, పార్కులు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తారు. వాస్తవానికి రుడా పరిధి 3156.67 చ.కి.మీ విస్తీర్ణంతో ఉంది. 392 గ్రామాలు, 27 మండలాలు ఉన్నాయి. అయితే 4 పురపాలికలను మినహాయిస్తే మిగిలిన గ్రామాల్లో కూడా ఇదే తరహాలో యూఎల్‌బీలను కూడా విస్తరిస్తారు.

బదిలీలు.. అక్రమ వసూళ్లు

▪ సచివాలయాల్లో ప్రహసనంగా ప్రక్రియ ▪ సగం మందికి పైగా అందని ఉత్తర్వులు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. 6066 మందికి స్థానచలనం కలగగా, వీరిలో సగం మందికి ఇప్పటికీ ఉత్తర్వులు అందకపోవడం గమనార్హం. కొందరికి ఉత్తర్వులు జారీ చేసినా, ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ చేయకుండా కొన్నిశాఖల అధికారులు తాత్సారం చేస్తున్నారు. సిఫార్సులు.. వసూళ్లతో వాటిలో మార్పులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీవో 5 ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీల ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలిచ్చినా.. కేవలం వీఆర్వో, ఏఎన్ఎం, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్స్‌కు మాత్రమే అమలుచేశారు. మిగతా వారికి కొత్త జిల్లాల పరిధిలోనే బదిలీల ప్రక్రియ నిర్వహించడంతో చాలా మంది నష్టపోయారు.

కాకినాడలో నిరసన తెలుపుతున్న సచివాలయ మహిళా పోలీసులు

పాలన కుంటుపడి: కొత్త స్థానాల్లో ఉద్యోగులు చేరకపోవడంతో పరిపాలన కుంటుపడుతోంది. పంచాయతీల్లో స్వర్ణభారతి కార్యక్రమం ద్వారా ఇంటి పన్నుల ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పేరుతో సిబ్బందిని రిలీవ్ చేయడంలేదు. బాధ్యతాయుత స్థాయి అధికారులుగా ఉన్నవారికి శిక్షణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి. జాయింట్ ఎల్‌ఎమ్‌ఎల్ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు మూలుగుతున్నాయి.

వార్డు సచివాలయాల్లో పూర్తి

ఉమ్మడి జిల్లా పరిధిలోని నగరం, పట్టణ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. గడువు లోగా దీన్ని పూర్తి చేసి, ఉద్యోగులను రిలీవ్ చేయడంతో కొత్త స్థానాల్లో చేరారు. మొత్తం 1,177 మందికి స్థానచలనం కల్పించారు.

సొమ్ములిస్తే మార్చేస్తున్నారు...

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకే బదిలీల్లో అగ్రతాంబూలమిచ్చారు. వీటితో పాటు కొన్ని శాఖల్లో వసూళ్లకు తెరతీశారు. ◆ కాకినాడ కలెక్టరేట్‌లో ఉన్న ఒక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్రంగా సొమ్ములు వసూలుచేసి, నచ్చినచోట పోస్టింగ్‌లు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఈ శాఖలో 844 మందికి స్థానచలనం కల్పించారు. నచ్చిన చోట పోస్టింగ్‌కు రూ.20వేలకు పైగా వసూలు చేశారనే వాదన ఉంది. ◆ వైద్య,ఆరోగ్యశాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో 1,051 మందికి స్థానచలనం కల్పించారు. ఇక్కడ కొందరు అధికారులు సొమ్ములు వసూలు చేసి ఉత్తర్వుల్లో మార్పు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 120 మందికి మార్చారని చెబుతున్నారు. ◆ బదిలీలకు సంబంధించి ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలు కోరారు. ఇవేవీ పట్టించుకోకుండా కొందరు అధికారులు ఇష్టారీతిన ప్రక్రియ చేపట్టారు. ◆ ఉమ్మడి జిల్లా పరిధిలో 1,020 మంది మహిళా పోలీసులకు స్థానచలనం కల్పించారు. దీనిలో కొందరికి అన్యాయం జరిగిందని సుమారు 60 మంది కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

వారలా.. వీరిలా

సాగునీటికి అన్నదాతల ఇక్కట్లు

న్యూస్‌టుడే, నిడదవోలు: శాఖల మధ్య సమన్వయ లోపం శివారు భూముల రైతులకు శాపంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే సాగునీటిని విడుదల చేసినా.. నిడదవోలులో రైలు పైవంతెన పనుల కారణంగా కాలువలో మట్టి పేరుకుపోయి ప్రవాహం ముందుకు సాగని పరిస్థితి ఉంది. ఆ మట్టిని తొలగించి సాగునీరు సక్రమంగా పొలాలకు చేరేలా చూడాల్సిన అధికారులు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిస్ నుంచి 78 కాలువలకు 6,800 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తున్నారు. అయితే అది శివారు భూములకు చేరకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా ఆ స్థాయిలో నీరు విడుదల చేస్తే సాగుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారుల అంచనా. కానీ ప్రస్తుతం పశ్చిమ డెల్టా పరిధిలో పలు కాలువల పరిధిలో సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు వద్ద చేపడుతున్న రైలు పైవంతెన (ఆర్వోబీ) పనులే ఇందుకు కారణమని అంటున్నారు.

వేసవిలోనే పునాదుల వరకు పూర్తయినా..

వేసవిలో కాలువలు కట్టివేసిన సమయంలో సమిశ్రగూడెం వైపు నిర్మాణాల్లో ఆర్వోబీ సంబంధించిన గుంతలు తీసి పునాదుల వరకు పూర్తి చేశారు. ఇక మిగిలిన స్తంభాల (పిల్లర్ల) నిర్మాణం పనులు ప్రస్తుతం చేపడుతుండడంతో కాలువ మట్టితో పూడిపోయింది. ఈ పనుల దృష్ట్యా జూన్ 1న కాలువలకు నీరు విడుదల చేసినా.. తర్వాత వారం పది రోజులపాటు తక్కువ స్థాయిలో కాలువకు వదిలారు. చాలా వరకు కాలువలో మట్టి అలాగే ఉండి పోవడంతో కిందకు సక్రమంగా పారక పోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను జలవనరులు, ఆర్.అండ్.బి.శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొంతవరకు సరిచేశారు. అయినా ఇంకా నీరు పూర్తిస్థాయిలో రావడం లేదంటూ రైతులు జలవనరుల శాఖ అధికారుల దృష్టికి తెస్తున్నారు. ఇంకా కాలువలో మట్టిని తొలగించాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ నిడదవోలు ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా కాలువలో మట్టి తొలగింపు విషయమై ఆర్.బి.శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొంత వరకు తొలగించినా, ఇంకా కొంత మిగిలి ఉందన్నారు. ఈ సమస్యను ఆర్.బి.శాఖ నిడదవోలు ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా కాలువలో ఇబ్బంది లేకుండా చాలా వరకు మట్టి తొలగించామన్నారు. ఇంకా ఎక్కడైనా ఇబ్బందులుంటే తొలగిస్తున్నామన్నారు.

ఆర్వోబీ పనుల కారణంగా కొంతమేర పూడిపోయిన కాలువ

శాకంబరిగా దుర్గమ్మ అనపర్తి మార్కండేయపురంలోని భావనా ఋషి భద్రావతి సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో కొలువైన దుర్గమ్మతల్లి సోమవారం శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. -న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం

గిరిజన సంక్షేమాధికారిణిగా నాగశిరీష

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణిగా మోపిదేవి నాగశిరీష బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా గిరిజన సంక్షేమాధికారిణిగా పనిచేసిన ఈమె బదిలీపై ఇక్కడకొచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ జిల్లా గిరిజన సంక్షేమాధికారిణిగా విధులు నిర్వర్తించిన కె.ఎన్.జ్యోతి రంపచోడవరానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగశిరీష మాట్లాడుతూ జిల్లా పరిధిలో గిరిజనుల సంక్షేమానికి, గిరిజన వసతిగృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

జిల్లాస్థాయి పరిష్కార వేదికకు 238 అర్జీలు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై మొత్తం 238 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖ పరిధిలో పరిష్కారానికి అర్జీలు 95 ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖ 37, పోలీస్ శాఖ 28, పాఠశాల విద్య 27, విద్యుత్తు శాఖ 13, ఇతర శాఖలు 38 చొప్పున వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, ఆర్డీవో సీతారామమూర్తి ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ● తన పేరు మీద ఉన్న అయిదు సెంట్ల స్థలంలో సంఘ భవన నిర్మాణానికి అనుమతి లేకుండా దళిత అభ్యుదయ యువజన సేవా సంఘం వారు తప్పుడు తీర్మానం చేసి స్థలాన్ని ఆక్రమించారని గోపాలపురం మండలం కొవ్వూరుపాడు గ్రామానికి చెందిన దండే ప్రసన్నకుమార్ ఫిర్యాదు చేశారు. ● తనకు చెందిన 0.55 సెంట్ల స్థలానికి సంబంధించి రీసర్వేలో కొలతల వ్యత్యాసం వచ్చిందని చాగల్లు మండలానికి చెందిన అన్నపూర్ణ అర్జీ అందించారు. ● తన పొలం వివరాలు ఆన్‌లైన్ చేయడంలేదంటూ దేవరపల్లిమండలం గొల్లగూడెంకు చెందిన వీరవెంకటరమణ ఫిర్యాదు చేశారు. ● ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆయా అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ ఇతర అధికారులు

ఇక ప్రతి వారం కలెక్టరేట్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ రంగ హస్తకళల అభివృద్ధి సంస్థ (ఆప్కో) ఆధ్వర్యంలో ఇకపై ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నారు. చేనేత పరిశ్రమను ప్రోత్సహించడంతోపాటు ప్రతి వారం పీజీఆర్ఎస్‌లో అర్జీలు అందించడానికి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు చేనేత వస్త్రాలను 30 శాతం రాయితీపై అందుబాటులో ఉంచనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఆప్కో స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ ప్రశాంతి సోమవారం స్టాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్నిక, నాణ్యత విషయంలో భారతీయ చేనేత వస్త్రాలకు విశిష్ట గుర్తింపు ఉందన్నారు. చేనేత వస్త్రాలను ఆదరించడం ద్వారా నేత కార్మికులకు మెరుగైన జీవనోపాధి కల్పించవచ్చని, ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలన్నారు.

అబ్బే.. ఆ అభ్యంతరాలు ఓ లెక్కా!

జడ్పీలో గత అయిదేళ్లలో రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలు

ఈనాడు, కాకినాడ: ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వం వివిధ పద్దుల కింద ఇచ్చే నిధుల వ్యయంలో స్థానిక సంస్థలు పారదర్శకత పాటించడం లేదు. చేసే పనులకు, రాస్తున్న లెక్కలకు పొంతన ఉండడం లేదు. ఉమ్మడి జిల్లా పరిషత్తుకు సంబంధించి వైకాపా పాలనలో గత అయిదేళ్లలో సుమారు రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలపై ఆడిట్ అధికారుల అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందులో కొన్ని అవకతవకలు, మరికొన్ని విధానపరమైన లోపాలున్నాయని అధికారులు కిమ్మనడంలేదు.

దస్త్రాల్లో లెక్కలు.. అన్నీ చిక్కులే

జడ్పీలో 2019 నుంచి 2024 మధ్యలో 397 అభ్యంతరాలు వెల్లడి కాగా, వ్యవహారాల్లో రూ.85.45 కోట్ల లెక్కలు తేడాలొచ్చాయి. కొన్ని పనులకు ఎం.బుక్‌లో ఒకలా, చెల్లింపుల రిజిస్టర్‌లో మరోలా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలు, జడ్పీ ఆస్తుల నుంచి లీజు ఆదాయాలు, వేలం పాటల నిర్వహణలో తేడాలున్నాయి. ❖ జడ్పీ కల్యాణ మండపంలో లైటింగ్, డెకరేషన్, సౌకర్యాల కల్పనకు 2021-22 నుంచి 2023-24 వరకు వేలం లేక రూ.10 లక్షల పైగా కోల్పోవాల్సి వచ్చింది. ఎన్నికల సామగ్రి నిల్వకు ఉపయోగిస్తున్నామని చెబుతున్నారు. మరి 2023-24 మండపం రికార్డు పరిశీలిస్తే 49 బుకింగ్స్ ఉన్నట్లు రాసిపెట్టారు. వేలం వేయకుండా అద్దెకు ఇవ్వడంతో నష్టం చేకూరింది. ❖ పిఠాపురం మండలం కావవరంలో 11 ఎకరాలు, మండపేట మండలం కేశవరంలో 15.28 ఎకరాలు జడ్పీ గ్రావెల్ భూములున్నా లీజుకు ఇవ్వలేదు. మరో 20 చోట్ల భూములు, కొబ్బరి చెట్ల ద్వారా ఆదాయం వచ్చే మార్గమున్నా వదిలేశారు. ❖ జిల్లాలో 63 సమగ్ర నీటి పథకాలున్నాయి. వీటికి కాలువల ద్వారా వచ్చి పెరిగిన చేపలను వేలం, ఉమ్మకాలు చేయకుండా వదిలేస్తున్నారు. కరప, కొమ్మనపల్లి పథకాల్లో ఒకరోజు చేపల విక్రయంతో రూ.2.25 లక్షలు వచ్చింది. మిగతా పథకాల ద్వారా ఇదేమాదిరి ఆదాయం పొందొచ్చు.

ఏడాది	ఆడిట్ అభ్యంతరాలు	విలువ (రూ.కోట్లలో)
2019-20	76	25.45
2020-21	66	10.89
2021-22	84	12.09
2022-23	87	31.60
2023-24	84	5.41

జగనన్న సేవలో ఉప్పుల మాయం..

❖ వేమగిరిలో 22.89 ఎకరాల క్వారీ భూములు జడ్పీకి ఉంది. జగనన్న కాలనీ స్థలాల కోసం సీతీవో అప్పగించారు. ❖ 2023-24లో పది విద్యార్థులకు అధ్యయన సామగ్రి కోసం రూ.33 లక్షలు ఖర్చుచేశారు. జగన్ బొమ్మలు వేసి ప్రచారం చేసుకున్నారు. వీటిని ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ద్వారా కాకుండా ఓపెన్ టెండర్ పిలిచి గుత్తేదారుకు అప్పగించేశారు.

అభ్యంతరాలను పరిశీలించాలి

ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంది. రికార్డులు ఒక ఏడాది చూపకుంటే తర్వాత చూపించి అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అలా జరుగుతుందో లేదో చూడాలి. నిధుల దుర్వినియోగం తేలితే బాధ్యుల నుంచి రికవరీలు చేయిస్తాం. - **లక్ష్మణరావు, సీఈవో**

ఇక అనుమతులిచ్చేది భూగర్భ గనుల శాఖే!

ముగిసిన సుధాకర్ ఇన్‌ఫ్రా సీనరేజీ వసూళ్ల గడువు

ఈనాడు, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గనుల తవ్వకాలకు సంబంధించి భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలోనే ఇకపై అనుమతులు ఇవ్వనున్నారు. వైకాపా హయాంలో వీటి సీనరేజీ వసూళ్ల బాధ్యత సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చి రెండేళ్లకు రూ.233 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. మూడు నెలలపాటు సీనరేజీ వసూళ్లు చేయలేకపోవడంతో కూటమి ప్రభుత్వం పొడిగించింది. అది కూడా ముగియడంతో సోమవారం నుంచి పాత విధానంలోనే గనుల లీజులు, అనుమతులు భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలో ఇవ్వనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయని జిల్లా అధికారి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు.

కోనసీమలో ఇసుక అక్రమాలు సీఎం దృష్టికి..

కోనసీమలో నిషేధం ఉన్నప్పటికీ జూన్ 1 తరువాత గోదావరిలో యథేచ్ఛగా తవ్వకాలు చేసిన వైనంపై సీఎం కార్యాలయానికి నివేదిక వెళ్లింది. మండపేట, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో అడ్డగోలుగా యంత్రాలతో ఇసుక తరలింపుపై గనులశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం నివేదిక పంపినట్లు తెలిసింది. కపిలేశ్వరపురంలో తరలింపులపై 'ఈనాడు, ఈటీవీ'లో కథనం ప్రచురితమైన తరువాత యంత్రాంగం అన్ని చోట్ల దాడులు నిర్వహించింది. కొన్ని నిల్వకేంద్రాల్లో పరిమితికి మించి ఉన్నట్లు గుర్తించింది. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న నేతల వివరాలతో నివేదిక సీఎం దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

అదనంగా సీసీ కెమెరాలు.. ఫిర్యాదుల కమిటీలు

జీజీహెచ్ ఘటన నేపథ్యంలో అధికారుల అప్రమత్తం

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్)లో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు నేర్చుకోవడానికి వచ్చిన విద్యార్థినులతో అక్కడి సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించి అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఒకేషనల్ విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ జీజీహెచ్‌తో పాటు రంగరాయ వైద్యకళాశాలను పరిశీలించి పలు సిఫార్సులు చేశారు. ఈ మేరకు విద్యార్థినులు పనిచేసేచోట, ల్యాబ్‌లలో అదనంగా 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలు, వాటి బాధ్యతలపై విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించారు. వైద్య విద్యార్థుల మాదిరిగానే ఆరోగ్య సంరక్షణ సహాయక కోర్సులు చేసేవారికి తరగతులు నిర్వహించి స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రంగరాయ ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్ తెలిపారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సూచనల మేరకు జీజీహెచ్‌లో ఈ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా భోజనశాల, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ధర.. హారతికర్పూరం

అంబాజీపేట: అంబాజీపేట అరటి మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. సోమవారం కర్పూర రకం గెలలు అయిదు రూ.250 పలికాయి. రైతులు చేసేదిలేక అయినకాడికి అమ్ముకుని నిరుత్సాహంగా ఇంటికి వెళుతున్నారు.

ఆషాఢం దెబ్బ..: గతేడాది ఆషాఢ మాసంలో కర్పూర రకం అరటి గెలలకు మంచి ధర దక్కింది. ఒడిశా రాష్ట్రానికి ఎక్కువగా ఎగుమతయ్యాయి. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రైతులు ఈ రకం ఎక్కువగా అందివచ్చేలా చూసుకున్నారు. అందరూ ఇలాగే చేయడంతో ప్రస్తుతం ఉత్పత్తి ఎక్కువగా వచ్చింది. దీనికితోడు ఒడిశా నుంచి డిమాండ్ ఆశించిన మేర లేక వ్యాపారులకు ఆర్డర్లు రాలేదు. ఈ పరిస్థితుల్లో కోనసీమ అరటి మార్కెట్‌కు అటు ఆషాఢం.. ఇటు ఒడిశా దెబ్బకొట్టింది.

శ్రావణంపైనే ఆశలు: ఆషాఢ మాసంలో పెద్దగా శుభకార్యాలు ఉండవు. దీంతో కర్పూర రకం అరటి గెలలకు డిమాండ్ తగ్గిపోయింది. రైతుల నుంచి వ్యాపారులు అయినకాడికి అడుగుతున్నారు. ఈ నెల 24తో ఆషాఢం ముగుస్తుంది. 25 నుంచి శ్రావణ మాసం వస్తుంది. శ్రావణంలో వరలక్ష్మీవ్రతంతో పాటు ఇతర పండగలు, పర్వదినాలు, శుభకార్యాలు, వివాహాలు ఉంటాయి. ఈ సమయంలో డిమాండ్ వచ్చి ఎక్కువ ధర పలికే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

70 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకం

గాంధీనగర్: ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)లకు పర్సన్ ఇన్‌ఛార్జుల(త్రీమెన్ కమిటీలు) నియామకం కొనసాగుతుంది. మొదటి విడతగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 110 సొసైటీలకు కమిటీలను నియమించగా, తాజాగా సోమవారం విడుదల చేసిన జీవో జాబితాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 52, కాకినాడ జిల్లాలో 14, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 1, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 3 పీఏసీఎస్‌లకు ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కానరాని భద్రతా చర్యలు..!

ఉద్ధృతంగా గోదావరి ప్రవాహం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 6,56,341 క్యూసెక్కుల అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. పుష్కరఘాట్ వద్ద ఏకంగా 50 అడుగులకు వరద చేరింది. ఘాట్లపైకి నీరు చేరడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఆదివారం రాత్రికి కొంతమేర ఉద్ధృతి తగ్గినా, ఇక్కడ ప్రవాహం జోరుగా ఉంది. గోదావరిని చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. నదిలో స్నానాలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో పలువురు గల్లంతైన సందర్భాలు ఉన్నాయి.

ప్రమాదకరంగా స్నానాలు

పెరుగుతున్నసందర్శకులు: వరద సమయంలో జలవనరులశాఖ, నగరపాలక సంస్థ, పోలీసు తదితర శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం. పుష్కరఘాట్ వద్ద, వీఐపీ ఘాట్, సరస్వతీ ఘాట్, గౌతమీ తీరానికి సందర్శకులు భారీగా వస్తున్నారు. ఇక్కడ ఊబులు కూడా ఉన్నాయి. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏటా నదీ తీర ప్రాంతాల్లో డ్రెడ్జింగ్ చేపట్టాలి. నాలుగేళ్లుగా డ్రెడ్జింగ్ పనులు నిలిపేశారు. దీంతో నదీ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. పుష్కరఘాట్‌లోకి ప్రవేశం లేకుండా తాళాలు వేస్తారు. మిగిలిన ఘాట్లు మూసేస్తారు. పోలీసుల బందోబస్తు కూడా ఉంటుంది. ప్రస్తుతం ఎలాంటి రక్షణ చర్యలు లేవు. నదిలో బోటు షికారును తాత్కాలికంగా ఆపేశారు. పాపికొండలు యాత్ర రద్దు చేశారు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గట్టుపై ఏమాత్రం జారినా నదిలో పడి కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

DEEPAK NEXGEN FEEDS Pvt. Ltd.
Bommuluru, Near Hanuman Junction, Krishna Dist., A.P. 521 105
WANTED
Deepak Nexgen is a leading and fast growing Fish and Shrimp feed Manufacturing industry looking for the following positions:
Plant Incharge/Manager: B.Tech. (Mechanical) with 15 to 20 years of experience in shrimp feed plant operations. Able to handle individually.
Maintenance Incharge/Manager: B.Tech. (Mechanical) with 08 to 10 years of experience in shrimp feed machinery.
Electrical Incharge/Manager: B.Tech. Electrical with 10 to 15 years of experience in shrimp feed manufacturing industry.
Kitchen Supervisor: Experienced candidates in Kitchen Operations, Ensuring food Safety and Quality, maintianing a clean and organized kitchen environment.
Electrical Incharge(Residential Villas Maintenance): Required experience person for Residential Villas Electrical Maintenance.
Interested Candidates with Relevant Experience
Mail us your resumes to: ifeedhr@gmail.com

(c) eenadu

అపోహలు వద్దు.. అవగాహన అవసరం

నేడు ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ప్లాస్టిక్ సర్జరీ అంటే చాలామంది అందానికి సంబంధించిన శస్త్రచికిత్స(కాస్మటిక్ సర్జరీ) అని భావిస్తుంటారు. ఇది పూర్తిగా నిజం కాదు. అది అందులో ఒక భాగం మాత్రమే. దీంతో పాటు కాలిన గాయాలు, రోడ్డుప్రమాదాలు(పెదవి, ముఖంపై గాయాలు), పుట్టుకతో కలిగే వైకల్యాలు(చీలిక పెదవి, కణుతులు, చేతి లేక ఇతర భాగాలు), క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్సలు, రక్తనాడులు, బోదకాలు, మధుమేహ సంబంధిత వ్యాధులకు(డయాబెటిక్ ఫుట్) శస్త్రచికిత్సలు తదితరాలన్నీ ఈ కోవ కిందకే వస్తాయి. దీనికి సంబంధించి కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక విభాగం ఉంది. నేడు ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా కథనం.

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో రోగులు

అందుబాటులో ప్రత్యేక సేవలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్ డా. రత్నభూషణ్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. భారతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. రమేష్, డా. అజయ్ తదితర వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. త్వరలో మరింత మంది రానున్నారు. ఇక్కడ 24 గంటల పాటూ సేవలు అందిస్తారు. ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి, సాధారణ జీవితాన్ని గడపటానికి, జీవనశైలిని మెరుగుపరచడానికి ఈ శస్త్రచికిత్సలు దోహదపడతాయి.

✦ ఇటీవల ఐదేళ్ల పాప 50 శాతం కాలిన గాయాలతో కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు మూడు దశల్లో శస్త్రచికిత్స చేశారు. గాయాలన్నీ మాని చిన్నారి పూర్తిగా కోలుకుని, ఇప్పుడు పాఠశాలకు వెళ్తుంది.

✦ ఓ పాప దవడ ఎముకలు కలిసిపోయి(సింగ్నాథియా) పుట్టింది. ఆమెకు వెంటనే కాకినాడ జీజీహెచ్‌లో ఆపరేషన్ చేసి నోరు తెరుచుకునేలా చేశారు. దాంతో చిన్నారి పాలు తాగడం సాధ్యమైంది. ఆమె ఎదుగుదల కూడా బాగుంది.

✦ గతేడాది మార్చిలో చలి మంట కాగుతున్న ఓ బాలికకు ప్రమాదవశాత్తూ ఛాతి, పొట్ట, రెండు కాళ్లు, చేతులు కాలిపోయాయి. ఆ బాలికకు వేరే భాగాల నుంచి చర్మం తీసి కాలిన చోట అమర్చి శస్త్రచికిత్స నిర్వహించారు. ఇది ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. జీజీహెచ్‌లో ఉచితంగా చేశారు.

గత నాలుగేళ్లలో వివరాలిలా..

ఏడాది	ఓపీ	ఐపీ	శస్త్రచికిత్సలు
2022	1509	136	472
2023	4125	881	841
2024	4609	988	1160
2025 (ఇప్పటివరకూ)	2374	402	523

వినియోగించుకోండి

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అన్ని రకాల వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందానికి సంబంధించినది కాదు. కాలిన గాయాలు, ప్రమాదాల బారిన పడిన వారికి చేస్తాం. ఇక్కడ ఉచితంగా సేవలందిస్తాం. అవసరమైనవారు వినియోగించుకోవాలి.

- డా.రత్నభూషణ్, ప్లాస్టిక్ సర్జరీ నిపుణురాలు, జీజీహెచ్

ఆకుకూరలు.. కురిపించే సిరులు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలో సాగవుతున్న ఆకుకూరలు

అనతి కాలంలోనే పంట చేతికొచ్చే ఆకు కూరలను సాగుచేసి లాభాలు ఆర్జిస్తున్నాయి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ర్యాలి, పులిదిండి తదితర గ్రామాల్లో 300 కుటుంబాలు. ఈ ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో వీటి సాగు చేపట్టి నిత్యం ఆదాయం పొందుతున్నారు. గోంగూర, తోటకూర, బచ్చలి, పొన్నగంటి, చుక్క, మెంతికూర, కొత్తిమీర తదితరాలు సాగు చేస్తూ ఏడాది పొడవునా చింత లేకుండా ఉపాధి పొందుతున్నారు.

స్ఫూర్తి

విత్తిన నెల రోజులకే కోతకు..

చిన్నచిన్న కమతాల్లో ఎవరికి వారే స్వయంగా పొలంలో నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లుతారు. విత్తిన నెలకు ఆకు కూరలు కోతకు వస్తాయి. సమీపంలోని రాజమహేంద్రవరం, తణుకు, రావులపాలెం, ధవళేశ్వరం వంటి పట్టణాలకు తీసువెళ్లి విక్రయిస్తారు. గోంగూరను స్థానిక పచ్చడి తయారీ కంపెనీల వారు టోకుగా పెద్దమొత్తంలో కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. సేంద్రియ ఎరువులు వాడటంతో వీటికి గిరాకీ ఉంటుంది. మార్కెట్‌కు వెళ్లగానే కొనుగోలుదారులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అంతగా తెగుళ్లు ఆశించవు. ఈ గ్రామాల్లోని కొత్తిమీరకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలో విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ తదితర నగరాలకు ఆర్టీసీ బస్సుల్లో ఎగుమతి చేస్తుంటారు.

రైతేరాజు

కాలంతో నిమిత్తం లేకుండా..

కాలంతో నిమిత్తం లేకుండా ఏడాది పొడవునా ఏదో రకం ఆకుకూర పండిస్తుంటారు. కుటుంబ సభ్యులు ఆసరాగా ఉంటారు. మేలైన విత్తనాలు ఎంచుకుంటారు. ఎకరాకు పెట్టుబడితో పాటు కౌలు కింద రూ.60 వేల వరకు అవుతుంది. ఖర్చులు పోను నికర ఆదాయం రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు వస్తుంది.

మంచి లాభదాయకం

తోటకూర, గోంగూర, బచ్చలి, పాలకూర, చుక్కకూర ఎక్కువగా సాగు చేస్తుంటాను. ఇవి విత్తిన నెల రోజులకే కోతకు వస్తాయి. అన్ని ఖర్చులు పోను నెలకు నికరంగా రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. మిగతా పంటల కంటే చిన్న కమతాల వారికి ఈ సాగు లాభదాయకం.

- బొచ్చు సింహాద్రి, రైతు, ర్యాలి

ఏఐ.. శస్త్రచికిత్స చేసేయ్..!

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధను వినియోగించి అత్యంత కచ్చితత్వంతో సమర్థంగా శస్త్రచికిత్సలు చేసే అత్యాధునిక ఎస్ఎస్ఐ మంత్ర రోబోను సోమవారం రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో ప్రారంభించారు. యూరాలజీ, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఎంటరాలజీ, బేరియాట్రిక్, క్యాన్సర్ వంటి శస్త్రచికిత్సలను ఎంతో సులభంగా అత్యంత భద్రతతో రోబో ద్వారా చేయవచ్చని ఎండీ విజయ్‌కుమార్ తెలిపారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యక్రమానికి హాజరై రోబోను ప్రారంభించారు. గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీ రాజమహేంద్రవరం అధ్యక్షుడు దూరెడ్డి పెదిరెడ్డి విజయభాస్కర్, వైద్యులు సజ్జా పద్మ, రమ్య, మంజూష, పవన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తెరపై రోబో పనిచేసే విధానాన్ని మంత్రికి వివరిస్తున్న వైద్యులు

కోళ్లు.. అరికడదాం వ్యాధులు

గొల్లప్రోలు: వర్షాకాలంలో కోళ్లకు ఆశించే వ్యాధులు, నివారణ చర్యల గురించి చేబ్రోలు పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వివరించారు.

● కొక్కెర వ్యాధి: ఈ వ్యాధి అన్ని వయసుల కోళ్లలో వ్యాపిస్తుంది. కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా సంక్రమిస్తుంది. కాళ్లకు, మెడకు, రెక్కలకు పక్షవాతం కనిపిస్తుంది. ముక్కు నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. మెడ వంకర్లు తిరుగుతూ మూడు నాలుగు రోజుల్లో మరణిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరుచేయాలి. చనిపోయిన వాటిని లోతైన గుంతల్లో పాతిపెట్టాలి. లేకుంటే కాల్చివేయాలి. మేత, నీళ్ల తొట్టెలను శుభ్రం చేయాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

● మశూచి: 5-12 నెలల వయసు గల కోళ్లలో కనిపిస్తుంది. వ్యాధి సోకిన వాటిని తాకడం వల్ల, స్వేచ్ఛగా తిరిగే పక్షుల వల్ల వ్యాపిస్తుంది. కలుషిత నీరు, మేత, ఈగలు, దోమలు, పరాన్నజీవుల కారణంగా వ్యాప్తి చెందుతుంది. చర్మం, తల, కంటి రెప్పలపైన పొక్కులు కనిపిస్తాయి. శ్వాస సరిగా ఆడక కష్టంగా జీవిస్తుంది. కంటి పొర, ముక్కు ఎర్రబడి, ముక్కు రంధ్రాల నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరు చేయాలి. యాంటీ బయాటిక్ మందులు నీటిలో కలిపి ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉన్నవాటికి వ్యాధినిరోధక, ఫాల్‌పాక్స్ టీకాలు వేయించాలి.

మామిడి తోటల్లో యాజమాన్యంతో మేలు

మీ కోసం

మలికిపురం: ప్రస్తుతం మామిడి పంట చివరి దశలో ఉంది. కాయల కోత అనంతరం తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మలికిపురం ఉద్యానశాఖ అధికారి దిలీప్‌కుమార్ చెబుతున్నారు. కోత అనంతరం చెట్లకు కొన్ని రోజుల పాటు విశ్రాంతి ఇవ్వాలి. పోషక లోపాల సవరణ, నిలకడగా కాపు కాసేందుకు జులై, ఆగస్టు నెలల్లో జింక్‌సల్ఫేట్ రెండు గ్రాములు, యూరియా పది గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎండిపోయిన

కాయల కోత అనంతరం జాగ్రత్తలు పాటించాలి

కొమ్మలు, కాయ వదిలేసిన తొడిమలను కత్తిరించాలి. దీంతో చెట్టుకు సూర్యరశ్మి బాగా సోకి కాపు పెరుగుతుంది. కత్తిరించిన పెద్ద కొమ్మలకు బోర్డు లేప్యం పూయాలి. చెట్టుకు సేంద్రియ ఎరువులు, వేపచెక్క, వర్మీకంపోస్టు వేయడంతో అధిక దిగుబడులు వస్తాయి. వర్షాలు పడే సమయంలో తోటల్లో జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట వేసుకుని 45 రోజుల అనంతరం కలియదున్నితే నవంబరు, డిసెంబరు నెలల్లో త్వరగా చెట్లు పూతకు వస్తాయి.

విత్తనశుద్ధితో లాభాలిలా..

విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి

తెలుసుకుందాం..

కిర్లంపూడి: నారుమళ్లకు తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు రైతులు అవలంబించాల్సిన విధానాలు, విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను కిర్లంపూడి మండల వ్యవసాయాధికారిణి సుధామాధురి వివరించారు. విత్తనశుద్ధితో శిలీంద్రాలు, బ్యాక్టీరియా, వైరస్ వంటి రోగకారకాలు నాశనం చేయొచ్చు. దీనివల్ల మొక్కలు ఆరోగ్యంగా, ఏపుగా పెరుగుతాయి. తద్వారా దిగుబడి పెరుగుతుంది. విత్తన నాణ్యతను కాపాడుతూ జీవనశక్తిని పెంచుతుంది. శుద్ధిచేసిన విత్తనాలు త్వరగా ఏకరీతిన మొలకెత్తుతాయి. మొక్కలు ప్రారంభ దశలోనే వ్యాధులను తట్టుకుని తెగుళ్ల నుంచి రక్షించబడతాయి. విత్తనశుద్ధి జీవసాయన పద్ధతిలో చేపట్టడం ద్వారా పంట రక్షణకు రసాయనాల వాడకం తగ్గుతుంది. ఇది రైతుకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ఉపయోగకరంగా మారుతుంది.

హాజరు పట్టికలో సంతకం పెట్టి.. కుప్పకూలి

● గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

ఎస్వీఎస్ మూర్తిరాజు (పాత చిత్రం)

నల్లజర్ల: నాయకత్వ లక్షణాల పెంపు శిక్షణ తరగతులకు హాజరైన ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాల పెంపుపై విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 4 రోజుల శిక్షణ తరగతులు తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం అరట్లకట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఎస్ మూర్తి రాజు(61) రిసోర్సు పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సోమవారం పాలకొల్లులో బయలుదేరి తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చే సరికి అస్వస్థతకు గురయ్యారు. వైజ్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకొని అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి కుప్పకూలిపోయారు. చికిత్స నిమిత్తం ఉన్న కారులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అంబులెన్స్‌లో పాలకొల్లు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూర్తిరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జనసేన ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి తొలగింపుపై విచారణ

కొవ్వూరు పట్టణం, చాగల్లు, న్యూస్‌టుడే: కొవ్వూరు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి టి.వి. రామారావును తప్పిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ అంశంపై విచారణ చేపట్టారు. సహకార సంఘాల త్రిసభ్య కమిటీల నియామకంపై ఈనెల 10న ఉదయం రామారావు రోడ్డెక్కి వెంటనే వద్ద జనసైనికులతో నిరసన చేపట్టడంతో కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ప్రవర్తించారంటూ ఆ రోజు సాయంత్రం ఆయనను ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జనసేన ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఒక్కొక్కరితో వేర్వేరుగా మాట్లాడి స్థానిక పరిస్థితులపై ఆరా తీసి ఆ వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదిక ఆధారంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సమాచారం.

పట్టాలెక్కనున్న 'ప్రసాద్' పనులు

ఈనాడు కథనానికి స్పందన

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో కేంద్ర పథకం 'ప్రసాద్' ద్వారా చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎట్టకేలకు టెండర్లు ఖరారయ్యాయి. రూ.25.32 కోట్లు కేంద్రం కేటాయించగా ముందుగా రూ.18.98 కోట్ల అంచనాతో ప్రధాన పనులను టెండర్లు పిలిచారు. రాజమహేంద్రవరానికి చెందిన గాలి సుబ్బరాజు కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది. అంచనా వ్యయానికి 3.69 శాతం (రూ.70 లక్షలు) తక్కువకు పనులు చేపట్టేందుకు గుత్తేదారు ముందుకు వచ్చారు. గతంలో టెండర్లు దక్కించుకుని రద్దయిన కె.అనంతరావు అండ్ కో సంస్థ ఏకంగా 16.38 శాతం తక్కువకు (అంచనా వ్యయం కన్నా రూ.3.10 కోట్లు) పనులు చేపట్టడానికి ముందుకురాగా తాజా టెండర్లలో కేవలం 3.69 శాతం తక్కువకు టెండర్లు దాఖలు కావడం గమనార్హం. ఈ నెలాఖరుకు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ ఈశ్వరయ్య తెలిపారు. నిత్యాన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, రక్షణ గోడ, మరుగుదొడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంటు తదితర పనులు చేపట్టనున్నారు. టెండర్లు ఖరారులో జాప్యంపై గత నెల 26న 'అన్నవరం.. ప్రసాద్ పనులకు గ్రహణం' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చకచకా ప్రక్రియ చేపట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపే లక్ష్యం

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండలం మల్లంపూడిలో స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. నాలుగు రోజులు నిర్వహించే ఈ శిక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి 176 మంది ప్రధానోపాధ్యాయులు, 9 మంది మాస్టర్ ఫెసిలిటేటర్స్ హాజరయ్యారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు, వారి అభ్యసనా సామర్థ్యాలు, ఫైనాన్షియల్ ఎకౌంటెన్సీ పెంపొందించడం, పాఠశాల అభివృద్ధికి నాయకత్వం వహించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంఓ గౌరీశంకర్‌రావు, అనపర్తి ఎంఈఓ సత్తిరెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్, తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నీట్-2025లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 19వ ర్యాంకు, ఏపీ స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరం తిరుమల విద్యార్థి డి.కార్తీక్‌రామ్ కిరీటిని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ అభినందించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2025లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆలిండియా ఎనిమిదో ర్యాంకు కె.యశ్వంత్ సాత్విక్, ఎస్సీ కేటగిరీలో ఆలిండియా రెండో ర్యాంకు సాధించిన కె.ప్రణీత్‌లను సైతం ఆయన మెచ్చుకుని సత్కరించారు. ఘనత సాధించిన తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావును అభినందించారు. రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం ఉండవల్లిలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్న చిన్న విషయాలకు విద్యార్థులకు ఆందోళనకు గురవుతున్నారన్నారు. జీవితాన్ని ఓ సవాల్‌గా స్వీకరించి ముందుకెళ్లాలని సూచించారు.

డ్రైవర్‌ను వెంటాడిన భయం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందడంతో ఆత్మహత్య

రామారావు (పాత చిత్రం)

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఓ మహిళ మృతి చెందడంతో తీవ్ర ఆందోళనకు గురైన డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . ఈ నెల 8న పటవల వద్ద ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న వివాహిత మృతి చెందారు. ఆ ప్రమాదంలో ఆమె భర్త, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. ఆ ప్రమాదం జరిగిన వెంటనే కోటనందూరు మండలం బిల్లనందూరుకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ పెదరెడ్ల రామారావు భయపడి పరారయ్యాడు. అదేరోజు భార్యకు ఫోన్ చేసి తాను పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పి చరవాణి స్విచ్ఛాఫ్ చేశాడు. సుంకరపాలెంలోని కొబ్బరి తోటలో సోమవారం అతడి మృతదేహం గుర్తించారు.

మహిళా ప్రజాప్రతినిధులూ ప్రభావవంత నేతలుకండి

సామర్లకోట: పాలనలో మహిళా ప్రజాప్రతినిధులు ప్రభావవంత నేతలుగా ఎదగాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కేవీఎస్ ప్రసాదరావు అన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులకు 'మార్పు ద్వారా విజేతలు' శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పరిపాలనలో మహిళల పాత్ర, భాగస్వామ్యం పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమణి, డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు శర్మ, సుశీల పాల్గొన్నారు.

వాహనంపై వెళ్తుండగా.. గుండెపోటుతో గృహిణి మృతి

తేజస్విని (పాత చిత్రం)

యానాం, న్యూస్‌టుడే: భర్తతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ తాళ్లరేవు మండలం నీలపల్లి సమీపంలో కుప్పకూలి మృతిచెందిన ఘటన తీవ్ర విషాదంలో ముంచెత్తింది. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న సత్తి హరిశ్చంద్రప్రసాద్.. యానాంలోని బంధువుల ఇంట్లో వేడుకకు హాజరయ్యేందుకు భార్య తేజస్విని(28)తో కలిసి బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చెక్‌పోస్టు సమీపంలో తేజస్విని అస్వస్థతకు గురయ్యారు. మంచినీళ్లు తాగుతూ అక్కడే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కలవారి సాయంతో ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళ్ల ముందే భార్య మరణించడంతో హరిశ్చంద్రప్రసాద్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ దంపతులకు అయిదేళ్ల కుమార్తె ఉంది. తేజస్విని తండ్రి మండేలా శ్రీరామమూర్తి ఓ ఛానెల్‌లో జర్నలిస్టుగా పనిచేస్తూ, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. కుమార్తె మృతి విషయం తెలిసి భార్యతో కలిసి యానాం ఆసుపత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జిల్లాలోని మీడియా ప్రతినిధులు శ్రీరామమూర్తిని పరామర్శించి సంతాపం తెలిపారు. తేజస్విని మృతదేహాన్ని రాజమహేంద్రవరం తరలించారు.

బిక్కవోలు రైల్వేస్టేషన్‌లో మంటలు

బిక్కవోలు: బిక్కవోలు రైల్వేస్టేషన్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మూడో ప్లాట్‌ఫారంపై నిర్మాణంలో ఉన్న ప్రయాణికుల విశ్రాంతి షెడ్డు వద్ద పనిచేస్తున్న కార్మికులు వంట చేసుకుంటుండగా గ్యాస్‌లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రైల్వే సిబ్బంది వెంటనే అనపర్తి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు రైల్వేస్టేషన్‌కు చేరుకొని మంటలను అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్ షుగర్‌కు. రాజమండ్రి (ఇంతకు ముందు మెట్రో లాడ్జి) ఇప్పుడు same కేంప్. శ్రీసాయిలక్ష్మి లాడ్జిలో మందులు. SVG మార్కెట్‌రోడ్. ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3, 17 తేదీల్లో.

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ||గ|| RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

GENERAL

కొండయ్యపాలెం ఫ్లైఓవర్ జంక్షన్‌లో సుమారుగా 440 గ||లు మరియు ఉప్పాడలో స్థలములు అమ్మకమునకు కలదు. Cont: P.A.స్వామి, ✆ 98481 07949, 99856 46888.

TO LET

సామర్లకోట, అయోధ్యరామపురం పాత కరెంట్ ఆఫీస్ బిల్డింగ్ అద్దెకు. ఆఫీస్‌లకు, స్కూల్స్ కు, రెసిడెన్షియల్ పర్పస్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 83415 16208, 92961 07984.

JOBS

WANTED: To teach Maths and English-02 Nos, Primary and High School. Cont: GTLC EM School, Rajahmundry, ✆ 98497 02543, 85007 37977.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

రాజమండ్రి టూ-వీలర్ ఎలక్ట్రికల్ షోరూం (ఏథర్) నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & టెలీకాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం లభించును. LIC Building దగ్గర, మోరంపూడి. Ph: 800 888 4256.

WANTED TEACHERS Immediately For High School
English, Hindi Maths & social
Satyabhama School Anaparthi
sbemschool@gmail.com
91774 88666

ప్రముఖ 2-వీలర్ ఫైనాన్స్ నందు రాజమండ్రిలో పనిచేయుటకు కలెక్షన్ టెలికాలర్స్ (మేల్ & ఫిమేల్) కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 85006 44978 / 77997 76685.

ప్రముఖ 2-వీలర్ ఫైనాన్స్ నందు కాకినాడలో కలెక్షన్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 85006 44978 / 77997 76685.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

EENADU for Advertisement Contact: 8008597607

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-96 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	24,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	94-00
రిటైల్ లైవ్	116-00
డ్రెస్డ్	168-00
స్కిన్‌లెస్	191-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

అనుమతుల్లేని అమ్మకాలతో ఆందోళన

తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా సాగుతున్న పెట్రోలు, డీజిల్ అమ్మకాలపై పెట్రోల్ బంకుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 9న బిక్కవోలు పెట్రోలు బంక్ నిర్వాహకులు సరైన బిల్లులు లేకుండా విక్రయాలకు వెళుతున్న ట్యాంకర్‌ని ఆపి పోలీసులకు అప్పగిస్తే.. అనుమతులు ఉన్నాయని వదిలేయడంపై యజమానుల సంఘ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం కొందరు యజమానులు తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో ఆ అంశం ఎంఎస్‌వోది అని చెప్పడంతో ఆయనకు ఫోన్ చేసి తహసీల్దారు కార్యాలయానికి రావాలని కోరారు. దాదాపు గంట సమయం నిరీక్షించినా రాకపోవడంతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం బంకుల నిర్వహణ కష్టంగా మారిందని, యానాం తదితర ప్రాంతాల నుంచి చౌకగా డీజిల్, పెట్రోల్ తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారని చెప్పారు. రైస్‌మిల్లులు, ఇతర పరిశ్రమల వద్దకు నేరుగా ట్యాంకర్‌ను తీసుకువెళ్లి చౌకగా ఇంధనాన్ని విక్రయిస్తుంటే బంకుల వరకు రావాల్సిన అవసరం లేదని, దీనివల్ల విక్రయాలు తగ్గిపోతున్నాయని చెప్పారు.

తల్లికి వందనం.. నాన్నకు ఇవ్వండి..!

వినతిపత్రం అందజేస్తున్న అక్కాచెల్లెళ్లు

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన చిత్రపు సంధ్యన, సునైనా అక్కచెల్లెళ్లు. అదే గ్రామంలోని ఉన్నతపాఠశాలలో పది, తొమ్మిది తరగతులు చదువుతున్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తల్లికి వందనం నాన్నకు ఇవ్వాలని ఎంపీడీవోకు అర్జీ ఇచ్చారు. విద్యార్థుల తండ్రి చిత్రపు అబ్బులు, వారి తల్లి కొన్ని కారణాలతో విడిపోయి ఉంటున్నారు. "కాలుపనిచేయకపోయినా నాన్న ఉపాధి పనులకు వెళ్లి మా ఇద్దర్నీ చదివిస్తున్నారు. గత అయిదేళ్ల నుంచి అమ్మఒడి, తల్లికి వందనం నగదు అమ్మ ఖాతాలో పడుతున్నందున ఆమె డబ్బు తీసుకుంటున్నారు. ప్రభుత్వ బడిలో మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, దుస్తులు తదితర వన్నీ ఇవ్వడం వల్ల చదువుకోగలుగుతున్నాం. వర్షం వస్తే నీరు కారిపోయే పాకలో ఉంటూ చదువుతున్నాం. తల్లికి వందనం డబ్బులు ఇస్తే మా అవసరాలు తీర్చుకుంటామని వేడుకున్నా అమ్మ వినడం లేదు. తల్లి పేరున ఉన్న ఖాతా నిలిపివేసి మమ్మల్ని కంటికి రెప్పలా చూస్తున్న నాన్న పేరున పథకం వర్తింపజేయండి." పీజీఆర్ఎస్‌తోపాటు సీతానగరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి మరో వినతిపత్రం అందించారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్

దేవీచౌక్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు డాక్టరేట్ పొందారు. రసాయనశాస్త్ర అధ్యాపకులు మంచిరాజు పద్మజ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి, భౌతికశాస్త్ర విభాగాధిపతి చిన్నం కోమల లక్ష్మిలు గీతం విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రామచంద్రరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామ్మూర్తి, సహాయ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, డాక్టర్ అక్కిరాజు రాజేశ్వరి, డాక్టర్ గోరినాయుడు, టి.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు వీరిని అభినందించారు.

20న గోరింటాకు పోటీలు

ఏవీఏ రోడ్డు: తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మహిళ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20 మధ్యాహ్నం 3.00 గంటలకు రాజమహేంద్రవరం సరస్వతి హాల్‌లో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షురాలు ముడుసూరు వాణిశ్రీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గోరింటాకు పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 18లోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 25 ఏళ్లు నిండిన వివాహితలే అర్హులన్నారు. గెలుపొందిన మొదటి ముగ్గురు మహిళలకు అందిస్తామన్నారు.

పారిశుద్ధ్య సమస్యలా.. ఫోన్ చేయండి

డయల్ యువర్ ఎంహెచ్‌వో

నేటి ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి ఎ.వినూత్నతో ఫోన్-ఇన్ కార్యక్రమం జరగనుంది. నివాస ప్రాంతాల్లో అపరిశుభ్రత, కాలువల్లో పూడిక పేరుకుపోవడం, దోమలు, వీధి కుక్కల సమస్యలు, మురుగు రోడ్లపైకి చేరడం తదితర పారిశుద్ధ్య సమస్యలపై ఫోన్ చేయొచ్చు. మీ సమస్యలకు పరిష్కారం పొందవచ్చు. వ్యక్తిగత సమస్యలు ప్రస్తావించకూడదు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. సమయం: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రాంతాలు: దానవాయిపేట, గాంధీ పార్కు ప్రాంతం, ఆనంద్ రీజెన్సీ ప్రాంతం సమయం: ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రాంతాలు: కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లింపేట, అంబేడ్కర్‌పేట, ఆఫీసర్స్‌కాలనీ, పంచాయతీ ప్రాంతం, పరిమినగర్, బొమ్మూరుకాలనీ, నాలుగోవంతెన ప్రాంతం, సాయిరామ్ కాలనీ, కాతేరులోని బ్రాహ్మణ అగ్రహారం, రాయుడుపాలెం, కోలమూరు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-25/చిన్నవి-23, వంకాయలు నలుపు-40/గులాబీ-48/తెలుపు-48/దొమ్మీరు-54, బెండ-28, బీర పందిరి-30/24, దొండ-28, క్యారెట్-32, బీట్‌రూట్-34, గోరుచిక్కుడు-42, దోస-14, ఆనపకాయ-25, చిక్కుడు-56, పచ్చిమిర్చి-68, బంగాళదుంపలు-22, ఉల్లిపాయలు-22

మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా

శ్యామలాసెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక దానవాయిపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును ఆయన సోమవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన పాఠశాల దస్త్రాలను పరిశీలించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థి అబుకిజర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఐ దిలీప్‌కుమార్ తదితరులు

ఆలకించండి.. పరిష్కరించండి

న్యూస్‌టుడే, కలెక్టరేట్: వారంతా అర్జీదారులు.. ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య.. రీసర్వేలో లోపాలు.. ఆన్‌లైన్‌లో వివరాలు లేకపోవడం.. భూమి ఆక్రమణకు గురవ్వడం.. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందకపోవడం..ఇలా పలు సమస్యలు జిల్లా స్థాయిలో పరిష్కారం కాక.. స్థానిక కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేక.. వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్ వరకు వచ్చారు. తమ గోడును నేరుగా ఉన్నతాధికారులకు విన్నవించుకుంటే పరిష్కారం లభిస్తుందని ఆశతో సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో అర్జీలు అందించారు. తమ మొర ఆలకించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ★ తన కుమార్తె నాగలక్ష్మి 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నారు. అంత్యోదయ అన్నయోజన కార్డు మంజూరు చేసి ఆదుకోవాలని నగరంలోని ఆనందనగర్ ప్రాంతానికి చెందిన మట్టపర్తి సత్యజ్యోతి అర్జీ అందించారు. ★ రెండో అంతస్తు భవన నిర్మాణానికి అనుమతుల కోసం ప్లాన్ అప్రూవల్ ఇచ్చినా.. సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ఉత్తర్వులు జారీ చేయలేదని బొబ్బిలాంకకు చెందిన పత్ర హోమ్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. ★ యానిమేటర్లకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించి, అర్హత ఉన్నవారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ పలువురు యానిమేటర్లు అధికారులకు వినతి పత్రాలు అందించారు. ★ తమ ఇంటిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఒకరు గుడిసె వేసి మట్టిని తవ్వి విక్రయించినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదని.. ఇప్పుడు ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని వేమగిరికి చెందిన ముత్యాలమ్మ అర్జీ అందించారు.★ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని కోరుతూ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి భీమారావు, ఉపాధ్యక్షుడు సునీల్ ఆధ్వర్యంలో పలువురు అధికారులకు అర్జీ అందించారు.

కలెక్టరేట్ సమావేశమందిరం వద్ద అర్జీదారులు

నా భూమిని మరొకరి పేరుపై మార్చేశారు

మోత లలితకుమారి

తనకు చెందిన 1.5 ఎకరాల భూమిని మరొకరి పేరున రెవెన్యూ సిబ్బంది వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించి మ్యుటేషన్ చేశారంటూ మోత లలితకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. మొరంపూడిలో 1.50 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉందని చెప్పారు. కాగా రీసర్వేలో 20 సెంట్లు పల్లె, రైతు భూమిలో కలిపేయడంతో దానిపై అనేకసార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాను.. సర్వేయర్ సర్వే చేసినప్పటికీ ఏవిధమైన నివేదిక ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా వెబ్‌ల్యాండ్‌లో తన పేరు తొలగించి పక్కరైతు పేరు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

'తల్లికి వందనం' లబ్ధి చేకూర్చాలంటూ..

అర్జీ అందించేందుకు వచ్చిన మహిళలు

నిరుపేదలైన తమకు తల్లికి వందనం పథకంలో లబ్ధి చేకూర్చి పిల్లల చదువులకు సహకారం అందించాలంటూ నగరంతోపాటు ధవళేశ్వరం ఉప్పరకాలనీకి చెందిన పలువురు మహిళలు కలెక్టరేట్‌లో అధికారులకు అర్జీలు అందించారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం.. విద్యుత్తు బిల్లు ఎక్కువ వచ్చిందంటూ పథకానికి అనర్హులను చేశారని ఉప్పరకాలనీకి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు బిల్లు 300 యూనిట్లు కంటే తక్కువగా వచ్చినట్లు బిల్లు చూపి సచివాలయంలో మళ్లీ దరఖాస్తు చేసినా లబ్ధి చేకూరలేదని, ఉన్నతాధికారులు పరిశీలన చేసి, సమస్య పరిష్కరించాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాల నేపథ్యంలో చారిత్రక నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేలా లక్ష్యంగా పని చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం జాంపేట పూలమార్కెట్, ఫిష్, నీవీ మార్కెట్‌లను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలకు జరిమానాలు విధించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే దాదాపు 20 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తి స్థాయిలో నిలిపివేయాలన్నారు. జ్యూట్ బ్యాగులు, కాగిత సంచులు మాత్రమే వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా కాలువల్లో వేయడం వల్ల గోదావరి కాలుష్యం బారిన పడుతుందన్నారు. వ్యాపార వర్గాలు, వినియోగదారులు తమతో సహకరించాల్సి ఉందన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి వినూత్న, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాంపేట వద్ద తనిఖీల్లో కలెక్టర్ ప్రశాంతి, ఎంహెచ్‌ఓ వినూత్న

జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం' (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) సుబ్బరాజు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై అర్జీలు అందించారు. వివిధ సమస్యలపై 36 ఫిర్యాదులు వచ్చాయి.

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు

సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై 17 మంది అర్జీలు అందజేశారు.

అర్జీ స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలంటూ ఆందోళన

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం) : పేదల సాగులో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములను జిరాయితీ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో మార్చి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బాధిత రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. గోకవరం మండలం గంగంపాలెంలోని ప్రభుత్వ సీలింగ్ భూములను 1993 నుంచి 37 పేద కుటుంబాలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. వీటికి పట్టాలు ఇవ్వాలని 30 ఏళ్లుగా పోరాటం చేయగా 2021 జులైలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి పాస్ పుస్తకాలు జారీ చేసిందన్నారు. అయితే వీటిని కాజేసేందుకు అప్పటి గోకవరం మండల రెవెన్యూ అధికారుల సహకారంతో హైదరాబాద్, గోకవరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కుట్ర చేశారని ఆరోపించారు. ఈ అవకతవకలపై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేసి, నివేదిక ఇచ్చారన్నారు. దీనిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్ చిన్నరాముడుకు ఏఐకేఎంఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడు మండవ దుర్గాప్రసాద్, పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీమన్నారాయణ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనపల్లి సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు, బాధితులు

కాలువలు.. ప్రమాద ఘంటికలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరంలో మురుగు కాలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రక్షణ వలయాలు దెబ్బతినడంతో చోదకులు, ప్రజలు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా కాలువల్లో పడిపోయే ప్రమాదం ఉంది. ఆవ ప్రాంతంలో ఓపెన్ కాలువలో పాఠశాల నుంచి తిరిగి ఇంటికి వస్తూ కాలువలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఇదే తరహాలో గతంలో సాయిమార్గ్‌లో నిర్మాణంలో ఉన్న కాలువలో అదుపుతప్పి ఒకరు మృతి చెందారు.

ఆదెమ్మదిబ్బ వద్ద కర్రలతో తాత్కాలికంగా రక్షణ

పట్టాలెక్కని ప్రతిపాదనలు

నగరంలో 630 కి.మీ విస్తీర్ణంలో కాలువలు ఉన్నాయి. వీటిలో 140 కి.మీ మేర ప్రధాన కాలువలు ఉన్నాయి. ముఖ్యమైన కాలువలకు ఎటువంటి పై కప్పులు లేకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. ఆర్యాపురం నుంచి ఆదెమ్మదిబ్బ, నటరాజ్, జయరామ్ థియేటర్ మీదుగా ఎన్ఆర్‌జీసీ ప్లాంటుకు వెళ్లే కాలువ ప్రమాదకరంగా ఉంది. కనీసం పై కప్పు లేకుండా కాలువలను వదిలేశారు. గతంలో పశువులు, రాత్రి సమయంలో వృద్ధులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. పాఠశాలకు వెళుతూ ఆర్యాపురం చెరువు ఆనుకొని ఉన్న కాలువలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన కూడా గతంలో చోటు చేసుకొంది. తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా.. యంత్రాంగం స్పందించడం లేదు. లాలాచెరువు నుంచి వై-జంక్షన్‌కు వచ్చే ప్రధాన కాలువ కొంత మేర ఓపెన్‌గానే వదిలేశారు. ఇక్కడ కూడా తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పైగా రోడ్డుకు ఆనుకొని కాలువలు ఉండటం వల్ల సులువుగా ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. కోరుకొండ రోడ్డులో ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువకు అక్కడక్కడా ఖాళీలు వదిలేశారు. ప్రధాన రహదారి కావడంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు జారిపోయే ప్రమాదం ఉంది. కోటిపల్లి బస్టాండ్ నుంచి వెళ్లే రాతి ఛానల్, ఆవ ఛానల్ కూడా ఓపెన్‌గా ఉన్నాయి. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు గత పుష్కరాలకు రాజమహేంద్రవరం పర్యటించారు. బహిరంగ కాలువలపై నివేదిక అందించారు. కాలువలు ఓపెన్‌గా ఉండటం వల్ల కాలుష్య తీవ్రత పెరుగుతుందని, పైగా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. తక్షణం భూగర్భ కాలువలు నిర్మించాలని సూచించారు. అప్పట్లో భూగర్భ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా పనులు పట్టాలెక్కలేదు. భారీగా నిధులు సేకరణ చేయాల్సి ఉండటంతో పక్కన పెట్టారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి బహిరంగ కాలువలకు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

తుమ్మలావ వద్ద ప్రమాదకరంగా..

నల్లాఛానల్ ఇలా..

వర్షాకాలం.. అప్రమత్తతే కీలకం

ముందస్తు జాగ్రత్తలతోనే విద్యుత్తు ప్రమాదాల నివారణ

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, దేవీచౌక్: గత ఏడాది నవంబరులో ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఓ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా నలుగురు విద్యుదాఘాతంతో మృతి చెందారు. ● నగరంలో ఇటీవల ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జేకేసీ ఐటీ ల్యాబ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో రూ. 15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తలోనే ప్రమాదాలను నివారించవచ్చని సంబంధిత శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఎక్కడో చోట విద్యుత్తు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

ఏం చేయాలంటే.. ● గోడలకు చెమ్మ ఉంటే ముందుగానే గుర్తించి వైరింగ్ వ్యవస్థ సరిచేసుకోవాలి. ● తడి చేతులు, కాళ్లతో విద్యుత్తు పరికరాలను వినియోగించకూడదు. ● ఇళ్ల నిర్మాణాల్లో తప్పనిసరిగా ఎర్త్ వైర్ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. ● స్విచ్‌బోర్డును పిల్లలకు అందకుండా ఎత్తులో ఉండే విధంగా అమర్చుకోవాలి. ● నిర్ణీత కాలంలోపు వైరింగ్‌ను మార్చుకోకపోతే లోపల వైర్లు దెబ్బతిని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ● విద్యుత్తు తీగలకు దూరంగా తడి దుస్తులను ఆరబెట్టాలి. ● విద్యుత్తు స్తంభం నుంచి సరఫరా అగినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలి. ● నాణ్యత లేని విద్యుత్తు ఉపకరణాలను వినియోగించవద్దు. ● రాత్రి సమయాల్లో వంట గ్యాస్ సిలిండర్‌ను తప్పకుండా కట్టివేయాలి.'విద్యుత్తు ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. వర్షం పడుతున్న సమయంలో స్తంభాలు తడిగా ఉంటాయి. స్తంభాలు తాకకూడదు. తడి ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు పని చేస్తున్నప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు కూడా చేపడుతున్నాం. ఎవరికి వారే భద్రతా నియమాలను పాటించాలి.' అని ఎస్ఈ తిలక్‌కుమార్ అన్నారు.

హారతి అందుకుంటున్న అర్బన్ ఎమ్మెల్యే శ్రీనివాస్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఆదిరెడ్డి

టి.నగర్, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సాయంత్రం 12, 45, 15 డివిజన్లలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పింఛన్ల పెంపు, దీపం పథకాలపై ఆరా తీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ 4 అమలు చేస్తున్నట్లు చెప్పారు. పుష్కరాల నేపథ్యంలో నగరాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు.

నకిలీ దస్త్రాలతో మోసం.. ఇద్దరికి రెండున్నరేళ్ల జైలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఓ కేసులో ప్రాపర్టీగా ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను రిలీజ్ చేసేందుకు నకిలీ దస్త్రాలతో మోసం చేసిన ఇద్దరికి రెండున్నరేళ్ల జైలుశిక్ష విధిస్తూ మూడో అదనపు మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారని జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నంలోని పాత గాజువాకకు చెందిన నాగవల్లి రామకృష్ణకు చెందిన ఆయిల్ ట్యాంకర్ కేసు 2018లో రాజమహేంద్రవరంలోని ఏడో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఉంది. దీనిని విడిపించడానికి రామకృష్ణ.. రాజమహేంద్రవరంలోని కంబాలపేటకు చెందిన బట్టు కుమార్‌ను సంప్రదించారు. ఆయిల్ ట్యాంకర్ కేసులో అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి కోర్టుకు అందజేశారు. దీనిపై కోర్టు విచారణ చేయించగా నకిలీ దస్త్రాలు సమర్పించినట్లు తేలడంతో మూడోపట్టణ పోలీసులకు కోర్టు నుంచి ఫిర్యాదు అందింది. అప్పటి ఎస్సై భానుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నివేదికను కోర్టుకు అందజేయడంతో విచారణ అనంతరం నేరం రుజువైంది. నిందితులకు రెండున్నరేళ్ల జైలు, రూ.20 వేలు జరిమానా కోర్టు విధించింది.

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన ప్రయోజనం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతో సమయం వృథా కాదని.. త్వరితగతిన ప్రయోజనం చేకూరుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం వివిధ చిట్‌ఫండ్, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల ప్రతినిధులతో సమావేశమై 'దేశం కోసం మధ్యవర్తిత్వం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 90 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆయా సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్, రాజీపడదగిన అన్ని ఇతర కేసులను పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాస్, జీకే కపూర్, జగదీష్‌కుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ నిర్వహించే ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్ సూచించారు. సోమవారం రాజమహేంద్రవరం తాడితోట వద్ద ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ప్రాంగణంలో మినీ ఉద్యోగ మేళా నిర్వహించారు. పాటిల్ గ్రూప్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, కిమ్స్, నవతా సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు మొత్తం 46 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 21 మంది ఆయా ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఉపాధి అధికారి తెలిపారు.

వసతి గృహాలు, పాఠశాలల్లో తనిఖీలకు ఆదేశాలు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి మౌలిక సదుపాయాలపై నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. సోమవారం సాయంత్రం విద్య, గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల అధికారులతో జేసీ చిన్నరాముడుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవోలు, తహసీల్దార్లు సంయుక్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, వంటశాలల పరిశుభ్రత, క్రిమికీటకాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లలకు ఇచ్చే అల్పాహారం, భోజనం రుచి, పరిశుభ్రత, నాణ్యత ప్రతివారం అధికారులే ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అవసరమైతే రాత్రివేళలో వసతి గృహాలను సందర్శించి సమస్యలు గుర్తించాలని సూచించారు. హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తూ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఉప విభజనల సర్వే, నీటిపన్నులు తదితర రెవెన్యూ అంశాలపై చర్చించారు.

బడులకు రయ్..రయ్..!

విద్యార్థులకు రవాణా భత్యం

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్: ప్రభుత్వ విద్యావ్యవస్థలో నూతన ఒరవడి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పాఠశాలల పునఃప్రారంభం రోజునే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్‌లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలుంటే అందరి తల్లుల ఖాతాల్లో నిధులు జమచేసిన ప్రభుత్వం తాజాగా దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు రవాణా భత్యాన్ని కూడా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. దూరప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తల్లుల ఖాతాలకు రవాణా భత్యం నిధులు జమ చేయనుంది.

ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600చొప్పున మూడు నెలలకు రూ.1800ను విద్యార్థి తల్లి ఖాతాలో జమ చేస్తారు. పాఠశాలలు దూరంగా ఉన్నచోట పిల్లలు ఆటోల్లో బడులకు వెళ్తుంటారు. తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై దింపినా పెట్రోల్ ఖర్చు అవుతుంది. మరోవైపు ప్రమాదాల భయం వెంటాడుతోంది. ఆటోలో ఎక్కువమంది ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురైన సంఘటనలు లేకపోలేదు. ఈ సమస్యలకు పరిష్కారంగా విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు చేరుకోవాలన్న ఉద్దేశంతో మూడునెలలకొకసారి రవాణా భత్యం చెల్లించనున్నారు.

రాజమహేంద్రవరంలో పాఠశాలలు, విద్యార్థులు	
ప్రాథమిక పాఠశాలలు: 54	ఉన్నత: 21
ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు: 7850	
దూరప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే వారు: 78	
ఒక్కో విద్యార్థికి రవాణా భత్యం: రూ.600 (నెలకు)	

అర్హులు వీరే..

★ పాఠశాలకు కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉండి, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు అర్హులు ★ 3 కి.మీ కంటే ఎక్కువ దూరంలో నివసిస్తున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులు కూడా రవాణా భత్యానికి దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో కూడా ఏడాదికి ఒకసారి రవాణా ఛార్జీలు ఇచ్చేవారు. ఏడాదికి ఒకసారి ఇవ్వటం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావటంతో కూటమి ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి ఇవ్వాలని నిర్ణయించింది.

ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు ప్రారంభించండి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పద్ధతిలో డిగ్రీ ప్రవేశాలు ప్రారంభించాలని, డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. నగరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలకు ప్రిన్సిపల్, అధ్యాపకులను నియమించాలని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఇంటర్ పరీక్ష ఫలితాలు వెలువడి మూడు నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు డిగ్రీలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించకపోవడం దారుణమన్నారు.

లింకు దస్తావేజు పోయినది

గోసాల చిన్న, S/o ముసలయ్య, D.No.1-99, రాధేయపాలెం గ్రామం, రాజానగరం మండలం, తూ॥గో॥జిల్లా కాపురస్థుడనైన నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా, రాధేయపాలెం గ్రామములో గల సర్వే నెం.37/1Gలో నాకు చెందిన ఎ.0160 సెంట్లు భూమి నా తండ్రి తదనంతరము దస్తావేజు నెం.496/2025 ద్వారా నాకు సంక్రమించినది. నా తండ్రి ముసలయ్య గారు సుంకర వీర్రాజు గారి దగ్గర క్రయం పొందిన ఒరిజినల్ లింకు దస్తావేజులు నెం.7454/1983 తీసుకుని ది.02.07.2025న ఇంటి నుండి రాజమండ్రి ప్రకాశ్‌నగర్ ఏరియా బ్యాంక్ పని నిమిత్తం వెళ్తుండగా దారిలో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

సెల్ : 99669 77113

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ఐటీఐలో రెండోవిడత ప్రవేశాలకు దరఖాస్తులు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో రెండో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రాజమహేంద్రవరం ఐటీఐ ప్రిన్సిపల్ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఐటీఐ. ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 22న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు, రంగాపురం, ఆరికిరేవుల గ్రామాల్లో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కేంద్ర బృందం సభ్యులు పర్యటిస్తారని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించడంతో పాటు గ్రామాల్లో ఆరుబయట మలవిసర్జన చేస్తున్నారా.. ప్రభుత్వ మరుగుదొడ్లు ఎంతవరకు వినియోగిస్తున్నారనే విషయాలను బృందం సభ్యులు పరిశీలిస్తారని వివరించారు. రోజుకో గ్రామం చొప్పున మూడు రోజులు మూడు గ్రామాల్లో పర్యటిస్తారని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947
ఉ॥ 10 - మ॥ 1

పూడిక తీయాలి

సమస్య: హుకుంపేట 12వ వీధి కాలువలో పూడికలు పేరుకుపోయాయి. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం కాలువలో ఉండటం వల్ల మురుగు నిలిచిపోయి, ఇళ్ల వద్ద ఆగిపోతుంది. **- రామకృష్ణ, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిచేత పూడికలు తీయిస్తాం. మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. **- కాశీ, గ్రామకార్యదర్శి, హుకుంపేట**

– న్యూస్‌టుడే, బొమ్మూరు

నీటి వృథా ఆగింది

స్పందనకు వందనం

బొమ్మూరు ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయ సమీపంలో పైపు లైను నుంచి నీరు వృథాగా పోతుంది. రోడ్డంతా నీరు ఉండటం వల్ల రాకపోకలకు అంతరాయంగా ఉందని ఈనాడులో 'అంతా నీటిమయం' శీర్షికన వార్త సోమవారం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన కార్యదర్శి కాశీ సిబ్బంది చేత మరమ్మతులు చేయించి నీటి వృథాను నియంత్రించారు. సమస్య పరిష్కారం అవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు

మొక్కల మిత్రులు అవుతారా..!

పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో గాడితప్పిన విధానాలను కొత్త ఆలోచనలతో కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుంది. అందులో భాగంగా పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించింది. పాఠశాలలు, గ్రామాల్లో పచ్చదనం పెంచడానికి విద్యార్థులకు బాధ్యత అప్పగించింది.

గ్రామాలు పచ్చదనంగా ఉండాలి

నేటి సమాజంలో ఎక్కడ చూసినా భవనాలు, వాణిజ్య సముదాయాలు, వాయుకాలుష్యంతో నిండిపోయాయి. ఆక్సిజన్ శాతం పెంచి పర్యావరణాన్ని బాగుచేయడానికి ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేస్తుంది. దీనిని జియో ట్యాగ్ ద్వారా వివరాలు ఆన్‌లైన్ చేసింది. ఇందులో 4 నుంచి 10వ తరగతి విద్యార్థులను భాగస్వాములను చేయడంతో పాటు తల్లిదండ్రులకు బాధ్యతను అప్పగించింది.

మండలం	ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు	నాటిన మొక్కలు
రాజమహేంద్రవరం గ్రామీణం	130	23618
కడియం	81	7053
కోరుకొండ	84	48765
అనపర్తి	60	5575
సీతానగరం	76	25930
రాజానగరం	104	19616

విధానం ఇలా...

ఎల్ఈఏపీ అనే యాప్‌లో అన్ని పాఠశాలల విద్యార్థులు గ్రీన్‌పాస్‌పోర్ట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. యాప్‌లో విద్యార్థి పిన్ నంబరు, పుట్టిన తేదీ నమోదు చేయాలి. గ్రీన్‌పాస్‌పోర్ట్ ఎంపికపై క్లిక్ చేసి మై ప్లాంట్ ఎన్‌రోల్‌మెంట్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి కావల్సిన మొక్కల సంఖ్య నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత పాఠశాల యాజమాన్యం ఇచ్చిన మొక్కను ఇంటి పరిసరాల్లో మొక్కను నాటాలి. ఇందుకుగాను ప్రభుత్వం ప్రశంసాపత్రాన్ని అందజేస్తుంది.

మొక్కకు పాస్‌పోర్ట్

మొక్క తీసుకున్న ప్రతీ విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్ట్ కార్డు ఇస్తారు. అందులో మొక్క పేరు, శాస్త్రీయ నామం, నాటిన తేదీ, మొక్క ఉన్న ప్రాంతాన్ని పొందుపరుస్తారు. మొక్కను నాటిన నుంచి విద్యార్థి తల్లి మూడేళ్ల పాటు యోగక్షేమం చూసుకోవాలి. ప్రతీ నెల మొక్కఎదుగుదల వివరాలు కార్డులో నమోదు చేయాలి. మూడేళ్లు సంరక్షించినందుకు పాయింట్లు కేటాయిస్తారు.

ఇప్పటికే అందజేశాం

ప్రతీ మొక్కను విద్యార్థి స్నేహితుడిలా భావిస్తే మంచి మిత్రుడులా నీడ నిస్తుంది. తల్లిలా తోడుగా ఉంటుంది. పాఠశాలల్లో ఇప్పటికే మొక్కలు అందజేశాం. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఎలా పెంచాలి, వాటి రక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నాం.

- తులసీదాస్, మండల విద్యాశాఖ అధికారి, రాజమహేంద్రవరం గ్రామీణం

నూతన నర్సరీలు నమోదు చేసుకోవాలి

కడియం, న్యూస్‌టుడే: నూతనంగా నర్సరీలు స్థాపించిన రైతులు ఆ వివరాలను నమోదు చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి లావణ్య సూచించారు. ఆ మేరకు ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె కడియంలో మాట్లాడారు. జగ్గంపేట నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె కడియం వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే అనుమతులు పొందిన రైతులు వాటి గడువు ముగిస్తే వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు. మరెన్ని వివరాలకు 79950 86839 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ప్రధాన డ్రెయినేజి సమస్యకు పరిష్కారం

మురుగునీటి కాలువ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రంగంపేట: రంగంపేట మండలం జి.దొంతమూరులోని ప్రధాన మురుగునీటి కాలువకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. సోమవారం ప్రధానకాలువలో ప్రొక్లెయిన్‌తో పూడిక తీత పనులు చేయడంతోపాటు ఆక్రమణలను తొలగించారు. ఈ పనులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించగా స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గరిమెళ్ల జయంతి

గరిమెళ్ల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పులగుర్త లోని ఆర్‌వీఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో గరిమెళ్ల సత్యనారాయణ జయంతి వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. తన గేయాలతో బ్రిటీషు వారి గుండెల్లో రైలు పరిగెత్తించిన వ్యక్తి గరిమెళ్ల అని రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి ఉపాధ్యాయులతో కలిసి గరిమెళ్ల చిత్రపటానికి నివాళి అర్పించారు.

శిరస్త్రాణం తప్పక ధరించాలి

శిరస్త్రాణం పెడుతున్న సీఐ సుమంత్, ఎస్సై శ్రీనునాయక్

ధవళేశ్వరం, అనపర్తి గ్రామీణం: ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక బ్యారేజీ కూడలిలో ఎస్సై క్రాంతికుమార్‌తో కలసి హెల్మెట్ ధరించని వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ● అనపర్తిలో ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. శిరస్త్రాణం వాడకంపై ఎస్సై శ్రీనునాయక్‌తో కలిసి సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా, గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

రాత పుస్తకాల పంపిణీ

బొమ్మూరు, న్యూస్‌టుడే: శాటిలైట్‌సిటీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు భారత రైసింగ్ ఫౌండేషన్ ఛైర్మన్ చైతన్య రాతపుస్తకాలను సోమవారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతగా చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆటలకు సంబంధించిన 100 దుస్తులు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలంపైన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాపారావు స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలువురు దంపతులు పూజలు చేశారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం

కూరగాయలు, ఆకుకూరల అలంకరణలో అమ్మవారు

అనపర్తి గ్రామీణం: అనపర్తి మార్కండేయపురంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న దుర్గమ్మతల్లి శాకంబరీదేవిగా భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సుమారు 100 కేజీల కాయగూరలతో అమ్మవారిని అలంకరించారు. **బిక్కవోలు:** స్థానిక శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాస సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు జగన్నాథను శాకంబరిగా అలంకరించారు. కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని అలంకరించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని గణపతి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ● శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో పంచామృతాభిషేకాలతో పాటు భక్తుల సమక్షంలో పూజలు జరిపించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ● జువ్వలదొడ్డిలోని సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం సమర్పించిన సారెను సోమవారం భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. మొత్తం 558 కిలోల స్వీట్లు అమ్మవారికి సారె రూపంలో భక్తులు అందించారు.

సివిల్ ఇంజినీర్లకు విస్తృత అవకాశాలు

మాట్లాడుతున్న సంతోష్‌రెడ్డి

రాజానగరం, న్యూస్‌టుడే: సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులకు వివిధ రంగాలలో విస్తృతశ్రేణి ఉపాధి అవకాశాలు ఉన్నాయని స్కైస్ మేనేజింగ్ డైరక్టర్, వ్యవస్థాపకులు బద్దం సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి పి.వి.కోటేశ్వరరావు అధ్యక్షతన పట్టభద్రులకు ఉపాధి అవకాశాలపైన అవగాహన కల్పించారు. సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్‌తో సహా వివిధ రంగాలలో ఉన్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమయ్యే నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్, క్వాంటిటీ సర్వేయింగ్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జీజీయూ ప్రొ వైస్ ఛాన్సులర్ కె.వి.బి.రాజు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి పి.వి.కోటేశ్వరరావు, సివిల్ విభాగపు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రాజానగరం: జి.యర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు, కానవరం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కానవరం ఇండస్ట్రియల్ ఫీడర్ పై రాదేయపాలెంలో గృహవిద్యుత్తుకు ఈ నెల 15న విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఇన్‌ఛార్జి జె.పి.బి.నటరాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

CHANGE OF NAME

I, CHELAMSETTY RAJESH RATNAM S/o. Subrahmanyam, D.No.4-119, Main Road, Chinakondepudi, Seethanagaram- 533287 E.G.Dt. I have changed my name from CHELAMSETTI RAJESH RATNAM (Old name) to CHELAMSETTY RAJESH RATNAM (New name) hence forth I am being called CHELAMSETTY RAJESH RATNAM S/o. Subrahmanyam for all purposes.

ప్రకటన

నా క్లయింటు ప్రస్తుత నివాసం తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం, దోసకాయలపల్లి గ్రామ కాపురస్తురాలు మార్పి శ్రీరాములు గారి కుమార్తె సూర్యలక్ష్మి మరియు పడిశలేరు గ్రామస్తులు ఏలూరి రామకృష్ణ గారి భార్య ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ వివాహమునకు ముందు, తన తండ్రి గారి తాలూకు దోసకాయలపల్లి గ్రామం తాలూకు భూములు సర్వే నం. 76/2 లో య. 0-56 [illegible] 77/1లో య. 3-08 [illegible] 3-64 [illegible] 1-21 [illegible] సర్వే నం. 776లో య. 12-39 [illegible] 1-95 1/2 [illegible] 28-02-1975న [illegible] డాక్యుమెంట్ నం. 346/1975 [illegible] 15-05-2025న [illegible]

కె.శ్రీరామప్రసాద్, న్యాయవాది, బూరుగుపూడి
బూరుగుపూడి, కోరుకొండ మండలం
14-7-25 సెల్: 9652126100

చోదకా జర భద్రం

బొమ్మూరు చెరువుగట్టు నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. రహదారి పక్కన రక్షణ గోడ లేకపోవడంతో వాహనాలు అదుపుతప్పి మురుగు కాలువలో పడే అవకాశం ఉందని ప్రాంతవాసులు చెబుతున్నారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు లేకపోవడం వల్ల లారీలు వేగంగా వస్తున్నప్పుడు చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. [illegible] సమస్యపై గ్రామకార్యదర్శి కాశీని వివరణ కోరగా జాతీయ రహదారి అధికారులకు సమస్య తెలియజేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, బొమ్మూరు

వ్యర్థాల నిల్వలతో ఇబ్బందులు

కోరుకొండలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గత కొంత కాలంగా రహదారుల పక్కన చెత్త గుట్టలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే నివాసాల మధ్య చెత్త నిల్వ ఉండటంతో దోమల బెడద విపరీతంగా ఉంది. గ్రామంలో కుక్కలు ఇబ్బడిముబ్బడిగా తిరుగుతున్నాయి. వీధుల్లో కుక్కలు గుంపుగా ఏర్పడి జనంపై దాడికి దిగుతున్నాయి. గతంలో ఒక పిచ్చి కుక్క ముగ్గురిపై దాడి చేసి గాయపరిచిన సంగతి తెలిసిందే. కుక్కలను పట్టి దూరంగా వదిలిపెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోరుకొండ

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

మహిళకు కరపత్రం అందజేస్తున్న బీవీఆర్ చౌదరి

రాజానగరం: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మండలంలోని కొండగుంటూరు, రాధేయపాలెం గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. [illegible] కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గంగిశెట్టి చంటిబాబు, కె.కేశవరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లం రత్నం, బచ్చు ప్రసాద్, బుద్దిగ అప్పారావు, మాజీ ఎంపీటీసీ పి.వెంకటేష్, పాల్గొన్నారు.

పెదపూడి,రంగంపేట: కూటమి పాలనలో ప్రజలకు మంచి జరుగుతుందని అనపర్తి నియోజకవర్గ తెదేపా నాయకుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం పెదపూడి మండలం గండ్రేడు, రంగంపేట మండలం ముకుందవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. [illegible] గంటా రాజు, జుత్తుక సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాస్

కడియం, న్యూస్‌టుడే: కడియం మండలం డిప్యూటీ ఎంపీడీవోగా ఎన్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం పంచాయతీ డివిజనల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై కడియం వచ్చారు. ఆ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పంచాయతీల అభివృద్ధికి గ్రామస్థులు సహకారం తప్పనిసరి అని అన్నారు. ఇంటింటా తడి-పొడి చెత్త సేకరణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతూ అవగాహన పెంచుతామన్నారు.

కరాటే శిక్షకుడు గుండెపోటుతో మృతి

ధవళేశ్వరం: ధవళేశ్వరానికి చెందిన కరాటే శిక్షకుడు పిట్టల శ్రీను సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. అంతర్జాతీయ కరాటే పోటీలలో బ్లాక్ బెల్ట్ పట్టా అందుకోగా, వేలాది మంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి జాతీయ పోటీలకు పంపారు. మహిళలకు రక్షణ అవసరమని వివిధ పాఠశాలలలో ఉచితంగా కరాటే శిక్షణ అందించారు. ఆయన మృతిపట్ల రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఫైటర్స్ అసోషియేషన్‌లు సంతాపం తెలిపాయి.

జూదరుల అరెస్ట్

గోకవరం: జూదం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం శివారున ఉన్న కొండ వద్ద జూదం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంపై సోమవారం ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7వేలు నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పది మందిపై కేసు నమోదు చేశామన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గోకవరం, న్యూస్‌టుడే: ఆగిఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు ప్రమాదానికి గురైంది. వివరాల ప్రకారం గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఆదివారం రాత్రి కాకినాడ నుంచి చివరి సర్వీసుగా గోకవరం బయలుదేరింది. అర్ధరాత్రి సమయంలో గోకవరం మండలం కొత్తపల్లి చేరేసరికి రోడ్డు పక్కన నిలిపిన సిమెంట్ లోడు లారీని డ్రైవర్ గుర్తించక వెనుకనుంచి ఈ బస్సు ఢీకొంది. దీంతో బస్సులోని ఎడమ వైపు భాగం చాలావరకు దెబ్బతింది. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం, కండక్టర్ తన సీటులో కాకుండా వెనుక కూర్చోవడంతో ఎవరికీ ఏమి కాలేదు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యంనాయుడు

డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

రాజానగరం: డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యంనాయుడు అన్నారు. సోమవారం రాజానగరంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు పరిశ్రమల స్థాపనకు కావాల్సిన లాభదాయకమైన వ్యాపారాల ఎంపిక, రుణ సదుపాయాలకు కావాల్సిన ప్రాజెక్ట్ రిపోర్ట్, యంత్రాల పరికరాలు, ముడిసరుకు, మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ రాయితీ పథకాలు కోసం వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సునీత, సుకన్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం

దుకాణాలు పరిశీలిస్తున్న డీపీవో శాంతామణి

బొమ్మూరు: బొమ్మూరులోని చిన్న,పెద్ద వ్యాపార దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు, విక్రయాలు చేయరాదని డీపీవో శాంతామణి వ్యాపారులకు సూచించారు. బొమ్మూరు కూడలిలో పలు దుకాణాల యజమానులకు దీనిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలిపారు. దుకాణాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు జరిపితే రూ.2,500 నుంచి లక్ష వరకు జరిమాన విధిస్తామని తెలిపారు.

నైతిక విలువలతో మెలగాలి..

మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్ర కిరణ్

బిక్కవోలు, న్యూస్‌టుడే: విద్యార్థులు నైతిక విలువలతో మెలగాలని బిక్కవోలు ఎస్సై రవిచంద్రకిరణ్ సూచించారు. పందలపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో నైతిక విలువలపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం, జూదం, డ్రగ్స్, పొగతాగడం లాంటి వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఓఎస్ యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ 1వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

E.P. No.3/2014, O.S., No. 870/2012

Between:

Kothala Veera Venkata Ram Kishore, Son of Ramarao, Hindu, aged 42 years, Real Estate Business, Rajahmundry, East Godavari District. ...DHr

AND

Danduboina Ravi, Son of Rama Krishna, Hindu, aged 39 years, Business, D.No.18-215/9, Dowleswaram agraharam, Dowleswaram, East Godavari District. ...JDr

పై నెంబరు E.P. డిక్రీ బాకీ వసూలు నిమిత్తం JDr తాలూకు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి సమక్షంలో ది. 31-07-2025 వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల లగాయితు బహిరంగ వేలం జరుగును. కావలసినవారు వచ్చి పాడుకొనవచ్చును. పాట షరతులు కోర్టు నజారత్ గారిని అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

East Godavari District, Rajahmundry Sub Registry, Rajahmundry Municipal Corporation, Rajahmundry Prakash Nagar, R.S.No.208/1, Plot No.0/A271, House bearing D.No.81-21-13/12, Om Residency Apartment, Flat No. FH-1, an extent of 45.6 Sq. yards within the following boundaries.

EAST: Open to Sky, **SOUTH:** Open to Sky, **WEST:** Entrance Common Corridor and Lift, **NORTH:** Open to Sky.

Within the above said boundaries an extent of 45.6 sq.yards roof with all structuros, Electrical Service Connection with all its easementary and prescriptive rights.

DHR విలువ: రూ.10,00,000/-
అమీనా విలువ: రూ.40,00,000/-
మార్కెట్ విలువ: రూ.52,80,000/-
JDr విలువ: ఇవ్వలేదు

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా వేలం తేది : 31-07-2025
తదుపరి విచారణ తేది : 7-08-2025

కె.భరణికుమార్, అడ్వకేట్
కోరుకొండ రోడ్, వీరభద్రపురం, రాజమండ్రి
రాజమండ్రి 14-07-2025

సాంకేతిక పరిజ్ఞానాలకు కేంద్రంగా రాష్ట్రం

కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో క్వాంటం టెక్నాలజీపై ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), అకడమిక్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (ఏటీఏఎల్) అధ్యక్షతన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)ని ప్రారంభించారు. సోమవారం విశ్వవిద్యాలయ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వీసీ ఎస్.ప్రసన్నశ్రీ హాజరై మాట్లాడారు. ఐఐటీ, ఎన్ఐటీల వంటి సంస్థల నుంచి ప్రముఖ రిసోర్స్‌పర్సన్‌లను ఒక చోట చేర్చి, వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీల రంగాన్ని అన్వేషించడమే ఎఫ్‌డీపీ లక్ష్యమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపక సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రారంభించిన క్వాంటం వ్యాలీ చొరవను భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలకు కేంద్రంగా రాష్ట్రాన్ని మారుస్తుందన్నారు. ఎఫ్‌డీపీ కన్వీనర్ వి.పెర్సిస్ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీలపై ఏఐసీటీఈ, ఏటీఏఎల్, ఆర్థిక సహకారంతో జులై 14 నుంచి 19వ తేదీ వరకు వారం రోజుల పాటు ఎఫ్‌డీపీ నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 50 మంది అధ్యాపక సభ్యులు హాజరయ్యారన్నారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీపీ కన్వీనర్ వి.పెర్సిస్, కో కన్వీనర్ జి.కీర్తిమరీట, సీఎస్ఈ విభాగాధిపతి బి.కెజియారాణి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సీతానగరం, న్యూస్‌టుడే: పురుషోత్తపట్నం సత్యసాయి తాగునీటి ఎత్తిపోతల పథకం కార్మికులు గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.రామకృష్ణ సోమవారం తెలిపారు. దేవీపట్నం, గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 64 గ్రామాలకు సత్యసాయి తాగునీరు చేరేది, పథకం నిలిపివేయడంతో గ్రామపంచాయతీల రక్షిత మంచినీటి పథకాల నుంచి తాగునీరు సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. దేవీపట్నం మండలంలో 18లో 15 గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరించామని, ఇంకా మూడు గ్రామాలకు మాత్రమే నీరు చేరలేదన్నారు. గత ప్రభుత్వంలో 18 నెలలు కార్మికులకు బకాయిలు ఉన్నాయని, కూటమి వచ్చిన తర్వాత రెండు నెలలు వేతనాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది జూన్‌లో రూ.5 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని ప్రతి మూడు నెలలకు రూ.కోటి చొప్పున నిధులు వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు.

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తు శాఖ ఏఈ జి.శ్రీనివాస కోరారు. విద్యుత్తు, వెలుగు శాఖల సమన్వయంతో ఇంటింటా సర్వే చేసి, రాయితీ కరపత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 1334 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో 114 మందికి ఈ పథకాన్ని అమలు చేశామన్నారు. 278 మంది ఈ పథకానికి డిపాజిట్ చెల్లించారని, వారందరికీ త్వరలో సూర్యఘర్ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దరిలో పంచాయతీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా సోమవారం దుకాణదారులకు నోటీసులు అందజేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ముప్పుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యదర్శి వంగ శ్రీనివాసరావు, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ మంజూరు

కొవ్వూరు పట్టణం: ఆరికిరేవుల సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలకు సభ్యులు వడ్డీ రాయితీ పొందారని ఛైర్మన్ చావా రామకృష్ణ శ్రీనివాసరావు తెలిపారు. 2022-23 ఏడాదికి సంబంధించి వడ్డీ రాయితీగా (3 శాతం) రూ.12,25,195 మంజూరయ్యాయన్నారు. సంఘంలో సభ్యులుగా ఉన్న 610 మంది రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్వర ప్రయోజనానికి పరిష్కార వేదిక

కొవ్వూరు పట్టణం: సత్వర ప్రయోజనం కల్పించడమే ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదిక సంకల్పమని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వేదిక ద్వారా సోమవారం 17 అర్జీలను స్వీకరించారు. భూమి రీసర్వే, ఆక్రమణల తొలగింపు, సంక్షేమ పథకాల అర్హత, వెబ్‌ల్యాండ్‌లో తప్పులను సరిచేయాలని, వీధి దీపాల ఏర్పాటు, డ్రైయిన్లు, రహదారుల నిర్మాణం లాంటి అంశాలపై అర్జీలు ఇచ్చారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఆదేశించారు. డివిజన్‌స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతలు ముందుకు రావాలి

గోపాలపురం: మానవత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించే మెగా రక్తదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని తహసీల్దార్ అజయబాబు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మానవత సభ్యులు, రెవెన్యూ అధికారులు సోమవారం విడుదల చేశారు. గోపాలపురం శర్వాణి పాఠశాల ఆవరణలో జరిగే ఈ శిబిరంలో ఆరోగ్యవంతులైన యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు వెంకటేశ్వరరావు, నల్లరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

CHANGE OF NAME

I NAZER UNNISA BEGUM (Old Name) W/o MOHAMMAD GOUSE resident of D.No: 5-207, Kotha Peta, Chagallu, East Godavari, Andhra Pradesh-534 342. I have changed my name as SHAIK NAJIR (New Name) Hereafter my name is know as SHAIK NAJIR (New Name) W/o MOHAMMAD GOUSE

కమిషనర్‌కు అభినందన

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం పురపాలక కమిషనర్ (ఎఫ్ఏసీ) గ్రంథి సందీప్‌ను సోమవారం కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో అభినందించారు. సంఘం తరఫున చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు వివరించారు. సంఘ నూతన అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, కార్యదర్శి కాకి అనిల్‌కుమార్, కోశాధికారి కంకటాల రాంబాబు, నాయకులు మద్దుల సత్యనారాయణ, కొత్తమాసు వాసు, మద్దుల సోమరాజు (నాని), వలివేటి ప్రసాద్, దేవతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

Between: GWOP No.34/2025

[illegible] ...పిటిషనర్

Nil ...రెస్పాండెంట్

వాయిదా: 24/7/2025

[illegible]

PETITION SCHEDULE PROPERTY

East Godavari District, Chagallu Mandal, Kovvur SRO, Mallavaram Panchayat, an Zeroity land in extent of Ac. 2-103 cents in RS No. 161-1A, 1B, 2 and 162-1 in LP No. 535 of land is bounded by:

East: Land of Lakamsani Seethamahalakshmi; **South:** Lands of Medikonda Veerraju, Muppavarapu Swathi, Lakamsani Ramachandra Rao; **West:** Road; and **North:** Land of Lakamsani Surendra.

Within the above said boundaries 1/3rd undivided share in an extent of Ac. 2-103 cents of land with all easementary rights.

K.S. RAGHAVULU, Advocate
#13-11-14/6, Kovvur, E.G.Dt, Cell: 94411 16118

డ్రోన్ వినియోగం.. సేద్యం లాభదాయకం

న్యూస్‌టుడే, తాళ్లపూడి

రూ.1.96 లక్షలకే యంత్రం

తాళ్లపూడిలోని వరి పొలంలో డ్రోన్ ద్వారా సస్యరక్షణ మందుల పిచికారీ

ప్రస్తుతం డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. పంటల సాగులోనూ భాగంగా మారింది. గతంలో పురుగు మందులు పిచికారీ చేయాలంటే కూలీలపై ఆధారపడే వారు. దీని వల్ల ఎక్కువ సమయం, అధిక ఖర్చుతో పాటు పిచికారీ చేసేవారు రుగ్మతల బారిన పడిన సందర్భాలున్నాయి. వీరి అవస్థలను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం గత ఏడాది నుంచే వ్యవసాయ శాఖ ద్వారా డ్రోన్ పంపిణీకి చర్యలు చేపట్టింది. లక్ష్యంతో పనిలేకుండా కేటాయింపులు జరుపుతోంది. ఎక్కువ మంది రైతులను ప్రోత్సహించేందుకు వీలుగా బృందంగా ఏర్పడిన వారికి 80 శాతం రాయితీపై డ్రోన్ అందజేసేందుకు చర్యలు చేపట్టింది. వారికి ఉపాధి కల్పించి అదనపు ఆదాయం సమకూర్చేలా దృష్టి సారించింది. మూడు నియోజకవర్గాల పరిధిలో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని సుమారు 32వేల హెక్టార్ల పరిధిలో వరి, మరో సుమారు 10 వేల హెక్టార్లల్లో ఉద్యాన, ఇతర పంటలు సాగవుతున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో 8, గోపాలపురం నియోజకవర్గంలో 10, నిడదవోలు నియోజకవర్గం పరిధిలో 4 రైతు బృందాలకు రాయితీపై డ్రోన్లు అందజేశారు. నల్లజర్ల మండలంలో 5, తాళ్లపూడి మండలంలో 4 అత్యధికంగా ఇచ్చారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో ఇంకా సుమారు 20 పైగా డ్రోన్లు పంపిణీ చేయనున్నారు. వ్యవసాయశాఖ ద్వారా రైతుల అవసరాల మేరకు ఎన్ని కావాల్సినా ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

సమయం, సొమ్ము ఆదా..

ప్రస్తుత పరిస్థితుల్లో పురుగు మందుల పిచికారీ, ఎరువులు పొలాల్లో చల్లించాలంటే ఒక మనిషికి రూ.700 చెల్లించాలి. ఈ పని పూర్తి కావడానికి కనీసం సుమారు 4 గంటల సమయం పడుతోంది. పిచికారీ చేయాల్సిన మందు ఎకరానికి నీళ్లతో కలిపి 200 లీటర్లు పడుతోంది, అదే డ్రోన్ ద్వారా చేయడానికి ఎకరానికి కేవలం ఐదు నిమిషాల్లో పిచికారీ పూర్తవుతోంది. దీనికి రూ.300 నుంచి రూ.400 తీసుకుంటున్నారు. కేవలం పది లీటర్ల మందు సరిపోతోంది. ప్రస్తుత కూలీల కొరత నేపథ్యంతో పాటు వాతావరణ పరిస్థితుల్లో రైతులు డ్రోన్ వైపు మొగ్గుచూపుతున్నారు. డ్రోన్ తీసుకున్న బృందానికి ఏడాదిలోగా పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చే అవకాశముందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అయిదుగురు బృందంగా ఏర్పడితే..

ఐదుగురు రైతులు బృందంగా ఏర్పడి ముందుగా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గ్రూపు పేరు నమోదు చేసుకోవాలి. సభ్యుల్లో ఒకరు ఇంటర్ చదివి ఉండాలి. అతడిని పైలట్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు. డ్రోన్‌తో ఎలా పని చేయాలి. నిర్వహణ, ఎరువులు, సస్యరక్షణ మందుల పిచికారీ ఎలా చేయాలనే అంశాలపై 12 రోజుల పాటు ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. ఈ శిక్షణ పొందిన వారు మాత్రమే పరికరాన్ని వినియోగించాలి. డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు కాగా రైతు ఈ మొత్తాన్ని ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తంలో బ్యాంకు రుణం కింద రూ.4.90లక్షలు ఇస్తే రైతు రూ.4.80లక్షలు చెల్లించాలి. అనంతరం 80శాతం రాయితీ అంటే రూ.7.84లక్షలు తిరిగి రైతు బ్యాంకుఖాతాలోకి జమ అవుతుంది. దీంతో రైతుకు రూ.1.96 లక్షలకే యంత్రం లభిస్తోంది. ప్రస్తుతం మండలాల వారీగా లక్ష్యం కాకుండా వారి అవసరాల మేరకు కేటాయింపులు జరుగుతున్నాయని తాళ్లపూడి మండల వ్యవసాయాధికారిణి రుచిత తెలిపారు. రైతు బృందాలు ముందుకొచ్చి వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రోన్ తీసుకున్న రైతు బృందం వారి సొంత పొలాలతో పాటు ఇతర పొలాల్లో కూడా వీటిని వినియోగించాలని వివరించారు.

పాస్టర్ల సంఘం మండలాధ్యక్షుడిగా జోసెఫ్

నల్లజర్ల, న్యూస్‌టుడే: మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడిగా డి.జోసెఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకుడు మరపట్ల జోజి తెలిపారు. తెలికిచెర్లలోని చర్చిలో మండల పాస్టర్ల సంఘ సమావేశం రాజ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా జోసెఫ్, కార్యదర్శిగా నిమ్మల సురేష్, కోశాధికారిగా రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ పాస్టర్ల సమస్యల పరిష్కారానికి పోరాడుతానని, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంబాబు, సియోను కుమార్, రాజేష్, ఎజ్రా, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలుచేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: సమ్మె కాలపు రాతపూర్వక ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 16 నుంచి చేపట్టే సమ్మెపై కొవ్వూరు పురపాలక వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయు) నాయకులు కమిషనర్ జి.సందీప్‌నకు సోమవారం నోటీసు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అధికారం ఇవ్వాలన్న ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచి 17 రోజుల సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కల్పించాలన్నారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఎం.సుందరబాబు, అధ్యక్షుడు భూపతి రవీంద్ర, ప్రధాన కార్యదర్శి పి.వాసు, కల్యాణ రాజేష్, రాజాన అప్పారావు, ఎం.కిషోర్, మీసాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
सेन्ट्रल बैंक ऑफ़ इंडिया
1911 से आपके लिए "सेंट्रल" "CENTRAL" TO YOU SINCE 1911
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
తాడేపల్లిగూడెం బ్రాంచి, జూబ్లీ రోడ్డు, పోలీస్ స్టేషన్ ఎదురు, తాడేపల్లిగూడెం-534101, Tel: 08818-221140, 221170

[రూల్ 8(1)] స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీతలు: (1) శ్రీ మంద కృష్ణారావు, మేనేజింగ్ పార్టనర్, M/s. శ్రీ కృష్ణ పౌల్ట్రీ ఫామ్,** డి.నెం.6-118, పోతవరం గ్రామము, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా-534176. **(2) శ్రీ మంద మహేష్, మేనేజింగ్ పార్టనర్, M/s. శ్రీ కృష్ణ పౌల్ట్రీ ఫామ్,** డి.నెం.6-118, గంగమ్మ గుడి వీధి, పోతవరం గ్రామము-534176, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా. **(3) శ్రీ మంద సత్యనారాయణ, తండ్రి: మంద కృష్ణారావు, పార్టనర్,** ఆర్.యస్.నెం.6-118, గంగమ్మ గుడి వీధి, పోతవరం గ్రామము-534176, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా. **(4) శ్రీ మంద నాగేశ్వరరావు, తండ్రి: మంద కృష్ణారావు, పార్టనర్,** ఆర్.యస్.నెం.6-118, గంగమ్మ గుడి వీధి, పోతవరం గ్రామము-534176, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా. **(5) శ్రీ మంద లింగేశ్వరరావు, తండ్రి: మంద కృష్ణారావు, పార్టనర్,** ఆర్.యస్.నెం.6-118, గంగమ్మ గుడి వీధి, పోతవరం గ్రామము-534176, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా. **(6) M/s. శ్రీ కృష్ణ పౌల్ట్రీ ఫామ్,** ఆర్.యస్.నెం.197/3, పోతవరం గ్రామము, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా వారు మొత్తం బకాయిసొమ్ము **రూ.1,95,92,095.11 (అక్షరాల ఒక కోటి తొంభై ఐదు లక్షల తొంభై రెండు వేల తొంభై ఐదు రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే) మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలు** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **డి.02.05.2025 తేదీన డిమాండ్ నోటీసు** జారీచేయడమైనది. **సదరు నోటీసు తిరిగివచ్చినది, కావున అదే నోటీసును డి.10.05.2025 తేదీన పేపర్‌లో ప్రచురించబడినది.**

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీత విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న **ఆస్తిని 10-07-2025 తేదీన స్వాధీనత** తీసుకోవడమైనదని ఋణగ్రహీతకు, హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **బకాయిమొత్తము రూ.1,95,92,095.11 (అక్షరాల ఒక కోటి తొంభై ఐదు లక్షల తొంభై రెండు వేల తొంభై ఐదు రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే) మరియు వడ్డీ మరియు మొత్తం బకాయి రికవరీ అయ్యేంత వరకు ఇతర ఛార్జీలు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడేపల్లిగూడెం** బ్రాంచి వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతను, హామీదారును మరియు సాధారణ ప్రజానీకానిని హెచ్చరించడమైనది. సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉపవిభాగం (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతలకు, సహ ఋణగ్రహీతలకు విన్నవించటమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు

శ్రీ మంద కృష్ణారావు, తండ్రి: సత్తయ్య పేరునగల ఆస్తి.

ఎ) తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, పోతవరం గ్రామము, ఆర్.యస్.నెం.197/3 నందు య॥ 4.08 సెంట్లు **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** గవర్నమెంట్ పుంత; **దక్షిణం:** మంద కృష్ణారావు; **పడమర:** మణ్యం అప్పారావు; **ఉత్తరం:** మంద లక్ష్మీపతి. ఈ పై హద్దుల మధ్యలోని య॥ 4.08 సెంట్లు స్థలము మరియు అందులో M/s. **శ్రీ కృష్ణ పౌల్ట్రీ ఫామ్ యొక్క పౌల్ట్రీ షెడ్స్ మరియు గోడౌన్, ఇన్‌స్టాలేషన్స్, ఫిట్టింగ్స్, ఫిక్చర్స్ మొ॥**

బి) తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి సబ్ డివిజన్, పోతవరం గ్రామము, పాత డి.నెం.7-181, కొత్త డి.నెం.6-118 మరియు అసెస్‌మెంట్ నెం.1039, ఆర్.యస్.నెం.258/3 నందు 266 చ॥గ॥ల స్థలము మరియు అందులోని ఆర్‌సిసి రూఫ్ రెండంతస్తుల భవనము **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** మంద లక్ష్మీపతి స్థలము; **దక్షిణం:** మంద లక్ష్మీపతి; **పడమర:** దుగ్గిరాల రాంబాబు మరియు ఇతరుల ఇల్లు, స్థలము; **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు.

శ్రీ మంద బ్రహ్మయ్య, మంద లక్ష్మీపతి, మంద కృష్ణారావు మరియు గారపాటి సత్తెమ్మ మధ్య జరిగిన పార్టీషన్ దస్తావేజు నెం.1945/2012, తేదీ.22-05-2012 ప్రకారం.

తేది: 10-07-2025, ప్రదేశము: తాడేపల్లిగూడెం సం/- అధీకృత అధికారి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నేటి నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: పుల్లలపాడు, దూబచర్ల, ప్రకాశరావుపాలెం విద్యుత్తు ఉప కేంద్రాల్లో నూతన లైన్లు ఏర్పాటు దృష్ట్యా మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు.

కాటకోటేశ్వరం ఉపకేంద్రం పరిధిలో..

నిడదవోలు: కాటకోటేశ్వరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 100 కేవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌పై 3 ఫేజ్‌లైన్ పనుల నిమిత్తం ఈనెల 15న కాటకోటేశ్వరం, ఉనకరమిల్లిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు.

రేపు మూడు గ్రామాల్లో..

దేవరపల్లి: రామన్నపాలెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

శాకంబరిగా వాసవీమాత

ఉండ్రాజవరం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఉండ్రాజవరంలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు, సహస్ర నామ పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.





అపోహలు వద్దు.. అవగాహన అవసరం

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ప్లాస్టిక్ సర్జరీ అంటే చాలామంది అందానికి సంబంధించిన శస్త్రచికిత్స(కాస్మటిక్ సర్జరీ) అని భావిస్తుంటారు. ఇది పూర్తిగా నిజం కాదు. అది అందులో ఒక భాగం మాత్రమే. దీంతో పాటు కాలిన గాయాలు, రోడ్డుప్రమాదాలు(పెదవి, ముఖంపై గాయాలు), పుట్టుకతో కలిగే వైకల్యాలు(చీలిక పెదవి, కణుతులు, చేతి లేక ఇతర భాగాలు), క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్సలు, రక్తనాడులు, బోదకాలు, మధుమేహ సంబంధిత వ్యాధులకు(డయాబెటిక్ ఫుట్) శస్త్రచికిత్సలు తదితరాలన్నీ ఈ కోవ కిందకే వస్తాయి. దీనికి సంబంధించి కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక విభాగం ఉంది. నేడు ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా కథనం.

నేడు ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో రోగులు

అందుబాటులో ప్రత్యేక సేవలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్ డా.రత్నభూషణ్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.భారతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.రమేష్, డా.అజయ్ తదితర వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. త్వరలో మరింత మంది రానున్నారు. ఇక్కడ 24 గంటల పాటూ సేవలు అందిస్తారు. ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి, సాధారణ జీవితాన్ని గడపటానికి, జీవనశైలిని మెరుగుపరచడానికి ఈ శస్త్రచికిత్సలు దోహదపడతాయి.

✦ ఇటీవల ఐదేళ్ల పాప 50 శాతం కాలిన గాయాలతో కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు మూడు దశల్లో శస్త్రచికిత్స చేశారు. గాయాలన్నీ మాని చిన్నారి పూర్తిగా కోలుకుని, ఇప్పుడు పాఠశాలకు వెళ్తుంది.
✦ ఓ పాప దవడ ఎముకలు కలిసిపోయి(సింగ్నాథియా) పుట్టింది. ఆమెకు వెంటనే కాకినాడ జీజీహెచ్‌లో ఆపరేషన్ చేసి నోరు తెరుచుకునేలా చేశారు. దాంతో చిన్నారి పాలు తాగడం సాధ్యమైంది. ఆమె ఎదుగుదల కూడా బాగుంది.
✦ గతేడాది మార్చిలో చలి మంట కాగుతున్న ఓ బాలికకు ప్రమాదవశాత్తూ ఛాతి, పొట్ట, రెండు కాళ్లు, చేతులు కాలిపోయాయి. ఆ బాలికకు వేరే భాగాల నుంచి చర్మం తీసి కాలిన చోట అమర్చి శస్త్రచికిత్స నిర్వహించారు. ఇది ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. జీజీహెచ్‌లో ఉచితంగా చేశారు.

గత నాలుగేళ్లలో వివరాలిలా..

ఏడాది	ఓపీ	ఐపీ	శస్త్రచికిత్సలు
2022	1509	136	472
2023	4125	881	841
2024	4609	988	1160
2025 (ఇప్పటివరకూ)	2374	402	523

వినియోగించుకోండి

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అన్ని రకాల వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందానికి సంబంధించినది కాదు. కాలిన గాయాలు, ప్రమాదాల బారిన పడిన వారికి చేస్తాం. ఇక్కడ ఉచితంగా సేవలందిస్తాం. అవసరమైనవారు వినియోగించుకోవాలి.

- డా.రత్నభూషణ్, ప్లాస్టిక్ సర్జరీ నిపుణురాలు, జీజీహెచ్

ఆకుకూరలు.. కురిపించే సిరులు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అనతి కాలంలోనే పంట చేతికొచ్చే ఆకు కూరలను సాగుచేసి లాభాలు ఆర్జిస్తున్నారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ర్యాలి, పులిదిండి తదితర గ్రామాల్లో 300 కుటుంబాలు. ఈ ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో వీటి సాగు చేపట్టి నిత్యం ఆదాయం పొందుతున్నారు. గోంగూర, తోటకూర, బచ్చలి, పొన్నగంటి, చుక్క, మెంతికూర, కొత్తిమీర తదితరాలు సాగు చేస్తూ ఏడాది పొడవునా చింత లేకుండా ఉపాధి పొందుతున్నారు.

ర్యాలి గ్రామంలో సాగవుతున్న ఆకుకూరలు

స్ఫూర్తి

విత్తిన నెల రోజులకే కోతకు..

చిన్నచిన్న కమతాల్లో ఎవరికి వారే స్వయంగా పొలంలో నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లుతారు. విత్తిన నెలకు ఆకు కూరలు కోతకు వస్తాయి. సమీపంలోని రాజమహేంద్రవరం, తణుకు, రావులపాలెం, ధవళేశ్వరం వంటి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తారు. గోంగూరను స్థానిక పచ్చడి తయారీ కంపెనీల వారు టోకుగా పెద్దమొత్తంలో కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. సేంద్రియ ఎరువులు వాడటంతో వీటికి గిరాకీ ఉంటుంది. మార్కెట్‌కు వెళ్లగానే కొనుగోలుదారులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అంతగా తెగుళ్లు ఆశించవు. ఈ గ్రామంలోని కొత్తిమీరకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలో విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ తదితర నగరాలకు ఆర్టీసీ బస్సుల్లో ఎగుమతి చేస్తుంటారు.

రైతేరాజు

కాలంతో నిమిత్తం లేకుండా..

కాలంతో నిమిత్తం లేకుండా ఏడాది పొడవునా ఏదో రకం ఆకుకూర పండిస్తుంటారు. కుటుంబ సభ్యులు ఆసరాగా ఉంటారు. మేలైన విత్తనాలు ఎంచుకుంటారు. ఎకరాకు పెట్టుబడితో పాటు కౌలు కింద రూ.60 వేల వరకు అవుతుంది. ఖర్చులు పోను నికర ఆదాయం రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు వస్తుంది.

మంచి లాభదాయకం

తోటకూర, గోంగూర, బచ్చలి, పాలకూర, చుక్కకూర ఎక్కువగా సాగు చేస్తుంటాను. ఇవి విత్తిన నెల రోజులకే కోతకు వస్తాయి. అన్ని ఖర్చులు పోను నెలకు నికరంగా రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. మిగతా పంటల కంటే చిన్న కమతాల వారికి ఈ సాగు లాభదాయకం.

- బొచ్చు సింహాద్రి, రైతు, ర్యాలి

ఏఐ.. శస్త్రచికిత్స చేసేయ్..!

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధను వినియోగించి అత్యంత కచ్చితత్వంతో సమర్థంగా శస్త్రచికిత్సలు చేసే అత్యాధునిక ఎస్ఎస్ఐ మంత్ర రోబోను సోమవారం రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో ప్రారంభించారు. యూరాలజీ, జనరల్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, బేరియాట్రిక్, క్యాన్సర్ వంటి శస్త్రచికిత్సలను ఎంతో సులభంగా అత్యుత్తమ భద్రతతో రోబో ద్వారా చేయవచ్చని ఎండీ విజయ్‌కుమార్ తెలిపారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యక్రమానికి హాజరై రోబోను ప్రారంభించారు. గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీ రాజమహేంద్రవరంశాఖ అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయభాస్కర్, వైద్యులు సజ్జా పద్మ, రమ్య, మంజూష, పవన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తెరపై రోబో పనిచేసే విధానాన్ని మంత్రికి వివరిస్తున్న వైద్యులు

కోళ్లు.. అరికడదాం వ్యాధులు

గొల్లప్రోలు: వర్షాకాలంలో కోళ్లకు ఆశించే వ్యాధులు, నివారణ చర్యల గురించి చేబ్రోలు పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వివరించారు.

● కొక్కెర వ్యాధి: ఈ వ్యాధి అన్ని వయసుల కోళ్లలో వ్యాపిస్తుంది. కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా సంక్రమిస్తుంది. కాళ్లకు, మెడకు, రెక్కలకు పక్షవాతం కనిపిస్తుంది. ముక్కు నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. మెడ వంకర్లు తిరుగుతూ మూడు నాలుగు రోజుల్లో మరణిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరుచేయాలి. చనిపోయిన వాటిని లోతైన గుంతల్లో పాతిపెట్టాలి. లేకుంటే కాల్చివేయాలి. మేత, నీళ్ల తొట్టెలను శుభ్రం చేయాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

● మశూచి: 5-12 నెలల వయసు గల కోళ్లలో కనిపిస్తుంది. వ్యాధి సోకిన వాటిని తాకడం వల్ల, స్వేచ్ఛగా తిరిగే పక్షుల వల్ల వ్యాపిస్తుంది. కలుషిత నీరు, మేత, ఈగలు, దోమలు, వలసపక్షులు కారణంగా వ్యాప్తి చెందుతుంది. చర్మం, తల, కంటి రెప్పలపైన పొక్కులు కనిపిస్తాయి. శ్వాస సరిగా ఆడక కష్టంగా జీవిస్తుంది. కంటి పొర, ముక్కు, ఎర్రబడి, ముక్కు రంధ్రాల నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరు చేయాలి. యాంటీ బయాటిక్ మందులు నీటిలో కలిపి ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉన్నవాటికి వ్యాధినిరోధక, ఫౌల్‌పాక్స్ టీకాలు వేయించాలి.

మామిడి తోటల్లో యాజమాన్యంతో మేలు

మీ కోసం

మలికిపురం: ప్రస్తుతం మామిడి పంట చివరి దశలో ఉంది. కాయల కోత అనంతరం తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మలికిపురం ఉద్యానశాఖ అధికారి దిలీప్‌కుమార్ చెబుతున్నారు. కోత అనంతరం చెట్లకు కొన్ని రోజుల పాటు విశ్రాంతి ఇవ్వాలి. పోషక లోపాల సవరణకు, నిలకడగా కాపు కాసేందుకు జులై, అక్టోబరు నెలల్లో జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎండిపోయిన

కాయల కోత అనంతరం జాగ్రత్తలు పాటించాలి

కొమ్మలు, కాయ వదిలిన తొడిమలను కత్తిరించాలి. దీంతో చెట్టుకు సూర్యరశ్మి బాగా సోకి కాపు పెరుగుతుంది. కత్తిరించిన పెద్ద కొమ్మలకు బోర్డో లేపనం పూయాలి. చెట్టుకు సేంద్రియ ఎరువులు, వేపచెక్క, వర్మికంపోస్టు వేయడంతో అధిక దిగుబడులు వస్తాయి. వర్షాలు పడే సమయంలో తోటల్లో జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట వేసుకుని 45 రోజుల అనంతరం కలియదున్నాలి. నవంబరు, డిసెంబరు నెలల్లో త్వరగా చెట్లు పూతకు వస్తాయి.

విత్తనశుద్ధితో లాభాలిలా..

విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి

కిర్లంపూడి: నారుమళ్లకు తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు రైతులు అవలంబించాల్సిన విధానాలు, విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను కిర్లంపూడి మండల వ్యవసాయాధికారిణి సుధామాధురి వివరించారు.

తెలుసుకుందాం..

విత్తనశుద్ధితో: శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, వైరస్ వంటి రోగకారకాల నాశనం చేయొచ్చు. దీనివల్ల మొక్కలు ఆరోగ్యంగా, ఏపుగా పెరుగుతాయి. తద్వారా దిగుబడి పెరుగుతుంది. విత్తన నాణ్యతను కాపాడుతూ జీవనశక్తిని పెంచుతుంది. శుద్ధిచేసిన విత్తనాలు త్వరగా ఏకరీతిన మొలకెత్తుతాయి. మొక్కలు ప్రారంభ దశలోనే వ్యాధులను తట్టుకుని తెగుళ్ల నుంచి రక్షించబడతాయి. విత్తనశుద్ధిని జీవరసాయన పద్ధతిలో చేపట్టడం ద్వారా పంట రక్షణకు రసాయనాల వాడకం తగ్గుతుంది. ఇది రైతుకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ఉపయోగకరంగా మారుతుంది.

హాజరు పట్టికలో సంతకం పెట్టి.. కుప్పకూలి

● గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

ఎస్వీఎస్ మూర్తిరాజు (పాత చిత్రం)

నల్లజర్ల: నాయకత్వ లక్షణాల పెంపు శిక్షణ తరగతులకు హాజరైన ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాల పెంపుపై విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 4 రోజుల శిక్షణ తరగతులు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం అరట్లకట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఎస్ మూర్తిరాజు(61) రిసోర్సు పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సోమవారం పాలకొల్లులో బయల్దేరి తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చే సరికి అస్వస్థతకు గురయ్యారు. వైజ్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకుని అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి కుప్పకూలిపోయారు. చికిత్స నిమిత్తం ఉన్న కారులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అంబులెన్స్‌లో పాలకొల్లు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూర్తిరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జనసేన ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి తొలగింపుపై విచారణ

కొవ్వూరు పట్టణం, చాగల్లు, న్యూస్‌టుడే: కొవ్వూరు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి టి.వి.రామారావును తప్పిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ అంశంపై విచారణ చేపట్టారు. ఈ నెల 10న ఉదయం రామారావు రోడ్‌కం రైలు వంతెన వద్ద జనసైనికులతో నిరసన చేపట్టడంతో కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ప్రవర్తించారంటూ ఆ రోజు సాయంత్రమే ఆయనను ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జనసేన ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఒక్కొక్కరితో వేర్వేరుగా మాట్లాడి స్థానిక పరిస్థితులపై ఆరా తీసి ఆ వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదిక ఆధారంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సమాచారం.

సమస్యల పరిష్కారానికి కృషి

జవహర్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

చాగల్లు, కొవ్వూరు పట్టణం: బ్యాంకింగ్ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆల్ ఇండియా అధ్యక్షుడు జి.దయాకర్, పలువురు సభ్యులు కొవ్వూరు కార్యాలయంలో సోమవారం జవహర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ బ్యాంకింగ్ వ్యవస్థలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సంఘ ఉపాధ్యక్షుడు చిరంజీవి, సంఘ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు జవహర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సినీ రంగానికి తీరని లోటు

కొవ్వూరు పట్టణం: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ రంగానికి తీరని లోటు అని కొవ్వూరు ఏఎన్నార్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే రంగారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి పాత్రనైనా అవలీలగా నటించి తెలుగు ప్రజల గుండెల్లో కోట నిలిచిపోతారన్నారు. ఆనాటి అగ్ర నటుల నుంచి ఇప్పటి యువ హీరోల వరకు అందరితో నటించి మెప్పించారన్నారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

కొవ్వూరు పట్టణం: అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పశివేదలలో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలను అందించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణకు రూ.1.53 లక్షలు, వేములపల్లి వెంకటేశ్వరరావుకు రూ.41,792 విలువైన చెక్కులను అందించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, నాయకులు గారపాటి శ్రీను, నారాయణ, రామచంద్రరావు, గోపాల్, బసివిరెడ్డి, రాజబాబు, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : మండలంలోని చంద్రవరం, మల్లవరంలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే ముప్పిడి ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పశివేదలలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ఉండ్రాజవరం : ప్రజా సమస్యలు పరిష్కరించటం కోసమే 'సుపరి పాలనలో తొలి అడుగు.. ఇంటింటా తెదేపా ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. తెదేపా శ్రేణులు కలిసి మండలంలోని మోర్తలో సోమవారం ఇంటింటా పర్యటించారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు రాచమళ్ల శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న మంత్రి దుర్గేష్

పేదల ఆరోగ్యానికి సంజీవని సీఎం సహాయనిధి

నిడదవోలు, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి సంజీవని వంటిదని, దీనివల్ల పేదలకు ఆరోగ్య భద్రత చేకూరుతుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని కార్యాలయంలో నియోకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు రూ.22,94,913 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మరో ముగ్గురికి రూ.8 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను ఆయన సోమవారం అందించారు. నియోజకవర్గంలో ఇంత వరకు 192 మందికి రూ.1.84 కోట్ల లబ్ధి చేకూర్చమన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు పాల్గొన్నారు.

700 టన్నుల ఇసుక స్వాధీనం

పెరవలి: ముందస్తు సమాచారం మేరకు మండలంలోని మల్లేశ్వరంలో మేడిచర్ల సూర్య భాస్కరరావు అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన 700 టన్నుల ఇసుక సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి ఫణిభూషణరెడ్డి తెలిపారు.

కల్వర్టు పనుల పరిశీలన

గోపాలపురం: గోపాలపురంలోని నక్కిర్లమ్మ చెరువు వద్ద ర.భ.శాఖ రహదారిపై నిర్మించిన కల్వర్టు శిధిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో దాని స్థానంలో నూతన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మూడు రోజుల నుంచి పాత నిర్మాణం తొలగించి కొత్తగా పనులు ప్రారంభించారు. వాటిని ర.భ.శాఖ డీఈ రమణ సోమవారం పరిశీలన చేశారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. రాజమండ్రి (ఇంతకు ముందు మెట్రో లాడ్జి) ఇప్పుడు same కేంప్. శ్రీసాయిలక్ష్మి లాడ్జిలో మందులు. SVG మార్కెట్‌రోడ్. ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3, 17 తేదీల్లో.

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

GENERAL

కొండయ్యపాలెం ఫ్లైఓవర్ జంక్షన్‌లో సుమారుగా 440 గ॥లు మరియు ఉప్పాడలో స్థలములు అమ్మకమునకు కలదు. Cont: P.A.స్వామి, ✆ 98481 07949, 99856 46888.

TO LET

సామర్లకోట, అయోధ్యరామపురం పాత కరెంట్ ఆఫీస్ బిల్డింగ్ అద్దెకు. ఆఫీస్‌లకు, స్కూల్స్ కు, రెసిడెన్షియల్ పర్పస్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 83415 16208, 92961 07984.

EENADU e Classifieds

JOBS

WANTED: To teach Maths and English 02 Nos, Primary and High School. Cont: GTLC EM School, Rajahmundry, ✆ 98497 02543, 85007 37977.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

రాజమండ్రి టూ-వీలర్ ఎలక్ట్రికల్ షోరూం (ఏథర్) నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం లభించును. LIC Building దగ్గర, మోరంపూడి. Ph: 800 888 4256.

ప్రముఖ 2-వీలర్ ఫైనాన్స్ నందు రాజమండ్రిలో పనిచేయుటకు కలెక్షన్ టెలికాలర్స్ (మేల్ & ఫిమేల్) కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 85006 44978 / 77997 76685.

ప్రముఖ 2-వీలర్ ఫైనాన్స్ నందు కాకినాడలో కలెక్షన్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 85006 44978 / 77997 76685.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

WANTED TEACHERS Immediately For High School
English, Hindi Maths & social
Satyabhama School Anaparthi
sbemschool@gmail.com
91774 88666

EENADU for Advertisement Contact: 8008597607

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-96 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	24,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	94-00
రిటైల్ లైవ్	116-00
డ్రెస్డ్	168-00
స్కిన్‌లెస్	191-00

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

నిడదవోలు: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్తు ఉద్యోగ, కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు. 1999-2024 మధ్య కాలంలో నియమితులైన ఉద్యోగులందరికీ ఈపీఎఫ్, జీపీఎఫ్ మార్పులతోపాటు పింఛన్ హక్కు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ పీఆర్సీ బకాయిలు ఒకే విడతగా చెల్లించాలని, తెలంగాణ తరహాలో డైరెక్టు పేమెంట్ విధానం అమల్లోకి తేవాలని, విద్యుత్తు ఉద్యోగులకు నగదు రహితంగా అపరిమిత వైద్య సదుపాయాలం కల్పించాలని, ఎనర్జీ అసిస్టెంట్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ నిబంధనలు అమలు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

చాగల్లు, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలం రాగోలపల్లికి చెందిన ఎన్.రత్నాజి ఆదివారం కుమారదేవం గండిపోశమ్మ అమ్మవారి గుడి వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా దివిలికి చెందిన బి.వెంకటేష్ మరో ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురెదుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన రత్నాజి ఫిర్యాదు, రాజమహేంద్రవరం ఆసుపత్రి నుంచి అందిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శ్రీహరి తెలిపారు.

కొట్లాడుకున్న ఇద్దరిపై..

చాగల్లు : కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామ శివారులో కె.మధు, ఇ.రాజు అనే వారి మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీసింది. దీనిపై ఆ ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు.

దుద్దుకూరు మాజీ సర్పంచి మృతి



కరుటూరి సూర్యారావు (పాతచిత్రం)

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు మాజీ సర్పంచి కరుటూరి సూర్యారావు(85) సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన 1970-75 మధ్య సర్పంచిగా పని చేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు కరుటూరి శ్రీరామమూర్తి తెదేపా నాయకుడు కాగా చిన్న కుమారుడు ధనుంజయ పారిశ్రామికవేత్త. సూర్యారావు మృతదేహానికి తెదేపా నాయకులు, ప్రముఖులు నివాళి అర్పించారు.

గుర్తుతెలియని వ్యక్తి..

నిడదవోలు: చాగల్లు-నిడదవోలు రైల్వే స్టేషన్‌ల మధ్య సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి ఎగువకు వెళ్లే రైలు నుంచి జారిపడి లేదా మరి ఏ ఇతర కారణాల వల్ల గాయపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుడి చేతిపై నెమలి పింఛం పచ్చబొట్టు ఉందన్నారు. ఆకుపచ్చ రంగు పొడవు చేతుల చొక్కా, ఐస్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రి మార్చ్యురి రూంలో భద్రపరచినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 96906 17090, 99480 10061 చరవాణి నంబర్లలో సంప్రదించాలన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

కారు బీభత్సం.. మల్లవరం వాసి దుర్మరణం

హైదరాబాద్, న్యూస్‌టుడే: కారు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. నవీన్ అనే వ్యక్తి మిడ్ ల్యాండ్ బేకరీ నుంచి జీటీఎస్ టెంపుల్ వైపునకు కార్‌తో దూసుకెళ్తుండగా... అదుపు తప్పి యాక్టివా వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ వాహనం నడుపుతున్న చాగల్లు మండలం మల్లవరానికి చెందిన సత్యనారాయణమూర్తి(38) అనే వ్యక్తి ఎగిరి కారుపై పడి, కొంతదూరం వెళ్లాక కింద పడడంతో బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించినా అర్ధగంట వరకు రాలేదు. ఘటన స్థలికి బోరబండ పోలీసులు చేరుకున్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది సత్యనారాయణను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కారు డ్రైవర్‌తోపాటు దాని యజమాని సంఘటన జరగ్గానే పరారైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్‌కు ఫిట్స్ రావడం వల్ల సంఘటన జరిగిందా? లేదా అతడు మద్యం మత్తులో ఉన్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై మృతుడి భార్య బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: దేవరపల్లి గ్రామ శివారులోని బీహెచ్ ఎస్ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో సోమవారం రాత్రి 8.15 గంటలకు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని రామన్నపాలేనికి చెందిన బోయిన నాగరాజు, కరివేదల కిషోర్ దేవరపల్లి పొగాకు బోర్డులో బేళ్లు దింపి స్వగ్రామానికి వెళుతుండగా బీహెచ్‌ఎస్ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఇంజిన్ కింద ఇరుక్కుపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో ఇంజిన్‌ను పైకి లేపి ఇద్దరిని అంబులెన్స్‌లో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం ఏమీ లేదని, ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

గోపాలపురం: ముందస్తు సమాచారం మేరకు మండల పరిధిలోని దొండపూడి, వెంకటాయపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై సోమవారం దాడి చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఈ దాడిలో వెంకటాయపాలెంలో 8 మందిని అదుపులోకి తీసుకుని, రూ.3800 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, దొండపూడిలో 12 మందిని అదుపులోకి తీసుకోని రూ.8020 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మాట్లాడుతున్న మహేశ్ కుమార్, వేదికపై కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే చంటి తదితరులు

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం: ఎంపీ

పేర్లు నమోదు చేసుకుంటున్న యువత

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోందని ఎంపీ మహేశ్‌కుమార్ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంపీ ఆధ్వర్యాన సోమవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రస్తుత ఉద్యోగ మేళా ద్వారా 42 ప్రైవేటు సంస్థల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 42 మేళాలు నిర్వహించి 2,400 మందికి ఉపాధి కల్పించామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రసంగించారు. ఏపీ ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్ (దెందులూరు), చిర్రి బాలరాజు (పోలవరం), ఇడా ఛైర్మన్ శివప్రసాద్, సీఆర్ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లేసు అల్లికలకు దక్కిన గౌరవం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద నరసాపురం లేసు అల్లికలకు అవార్డు దక్కిన విషయం తెలిసిందే. దిల్లీలో ఆ అవార్డును కేంద్ర వాణిజ్య , పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ నాగరాణి అందుకున్నారు. ఈ గుర్తింపుతో వేల మందికి ప్రోత్సాహం ఇవ్వగలుగుతామన్నారు.

24 సంఘాలకు త్రిసభ్య కమిటీలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు మలి విడత త్రిసభ్య కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లాలో 158 సహకార సంఘాలు ఉండగా.. తొలి విడతలో 34 సంఘాలకు కమిటీలను నియమించింది. ఈ కమిటీలో ఛైర్మన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. తొలి జాబితాలోని కమిటీలు ఇప్పటికే బాధ్యతలు స్వీకరించాయి. తాజాగా జిల్లాలో మరో విడతలో 24 సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించింది. ఇప్పటి వరకు 58 సంఘాలకు సారథుల నియామక ప్రక్రియ పూర్తవగా, మిగతా వాటికీ త్వరలోనే కమిటీలు నియమించే అవకాశముందని జిల్లా సహకార అధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఏలూరు ప్రజలం తాగలేం

☛ నగరంలో కానరాని నీటి పరీక్షలు
☛ నాలుగేళ్ల క్రితం అంతుచిక్కని వ్యాధి

ఈనాడు-ఏలూరు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో నీటి నాణ్యత పరీక్షలు మొక్కుబడిగా మారాయి. వాటి నిర్వహణ ప్రణాళికాబద్ధంగా సాగటం లేదు. అసలు నిత్యం క్లోరోస్కోపీతో సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు నీటి పరీక్షలు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించే నాథుడే లేకుండా పోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తోంది. నగరంలో ఎమ్మెల్యే బడేటి చంటి ఇతర తెదేపా నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల గురించి చెబుతున్నారు. ఆ సందర్భంగా ప్రజలు పలుచోట్ల నీటి నాణ్యత లోపిస్తోందని, మురుగు వాసన వస్తోందని అధికారులు పట్టించుకోవటం లేదని ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా నగరంలో నీటి సరఫరా తీరుపై అనేక విమర్శలు ఉన్నాయి.

తనిఖీలు ఏవీ?

నిత్యం కమిషనర్ తన యంత్రాంగాన్ని వెంటబెట్టుకుని వేకువజామునే వెళ్లి ఆ రోజు పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంది? పారిశుద్ధ్య కార్మికులు, మేస్త్రీలు అందరూ విధుల్లో ఉన్నారా లేదా అనేది తెలుసుకోవటానికి హాజరు తీసుకోవాలి. ఆపై నగరంలో వస్తున్న నీళ్లు ఎలా ఉంటున్నాయని అడిగి తెలుసుకోవాలి. ఈ క్షేత్రపర్యటనలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కమిషనర్, ఇతర అధికారులు చుట్టపుచూపుగా అవుట్‌డోర్ ఇన్‌స్పెక్షన్లు చేస్తున్నారు. కమిషనర్ రాలేని పక్షంలో ఎంఈ, శానిటరీ సూపర్‌వైజర్, ఇంజినీరింగ్ అధికారులైనా చూడాలి. ఇది కొరవడింది. కమిషనర్ పర్యటనలు మొక్కుబడిగా తయారయ్యాయి.

● నాలుగేళ్ల క్రితం నగరంలో అంతుచిక్కని వ్యాధితో అనేకమంది ఆసుపత్రులు పాలయ్యారు. అప్పట్లో ఇది దేశ వ్యాప్తంగా సంచలనమైంది. దిల్లీ నుంచి శాస్త్రవేత్తలు వచ్చి కారణాలేమిటని పరిశీలించారు. ప్రజలు దాన్ని మరవలేదు. ఇప్పటికీ నీటి నిర్వహణపై నగరపాలకలో అదే నిర్లక్ష్యం, నిర్లిప్తత రాజ్యమేలుతోంది. అసలు ఎందుకు పరీక్షలు చేయలేకపోతున్నారో ప్రశ్నించుకోవాలి. విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం నగరపాలకల్లో నిత్యం ఈ నీటి నాణ్యత పరీక్షలు చేస్తున్నారు.



చేయాల్సింది ఇదీ..

రోజు పంపులు వచ్చేటప్పుడు క్లోరోస్కోపీతో కనీసం 20 ఇళ్లలో చేయాలి. పంపులు వద్ద.. మధ్యలో, చివరి పాయింట్‌లోనూ జరపాలి. వాటిల్లో ఏమైనా క్లోరిన్ తగ్గిందా లేదా అనేది పరిశీలించాలి. ఈ తరహాలో భీమవరం పురపాలికలో నిత్యం చేస్తున్నారు. వారానికి ఒకసారి బ్యాక్టీరియా పరీక్షలు చేయిస్తున్నారు. ప్రజారోగ్యం పట్ల అక్కడి అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారో అర్థమవుతోంది.

95కు ఒక్కటీ నిర్మించలే

మాటలకే పరిమితమైన డిజిటల్ గ్రంథాలయాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామీణ యువత ఇంటి నుంచే పని చేసే విధానం రావాలి. ఇందుకు ప్రతి గ్రామంలో డిజిటల్ గ్రంథాలయాలు నిర్మిస్తాం. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఇబ్బందుల్లేకుండా, అంతర్జాలం సౌకర్యం కల్పిస్తాం. యువతకు దిక్సూచిలా తీర్చిదిద్దుతామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 95 గ్రామాల్లో మహిళా స్వయం సహాయక బృందాల సమాఖ్య భవనాల పేరిట వైఎస్సార్ డిజిటల్ గ్రంథాలయం నిర్మించేలా మార్గదర్శకాలు జారీ చేశారు. మూడేళ్ల కాలంలో ఒక్క భవనం నిర్మించలేదు. నూజివీడులో మాత్రం గ్రంథాయాలన్ని డిజిటల్ గ్రంథాలయంగా ఆధునికీకరించారు.

చాలీచాలని నిధులు.. వైకాపా హయాంలో బిల్లుల చెల్లింపుల్లో నెలకొన్న జాప్యం కారణంగా గుత్తేదారులు ముందుకు రాలేదు. రూ.16 లక్షలతో భవన నిర్మాణం పూర్తయినా ఫ్లోరింగ్, రంగులు, ఇతరత్రా సౌకర్యాలు సమకూరడం అసాధ్యమని భావించారు. నమూనా ప్రకారం భవనం నిర్మించాలంటే మరో రూ.6 లక్షలు కేటాయించాలని ఇంజినీరులు, గుత్తేదారులు విజ్ఞప్తి చేసినా, నాటి సర్కారు పట్టించుకోలేదు. భవన నిర్మాణాలు పూర్తయ్యాక, వాటిని ఎవరికి అప్పగించాలి.. నిర్వహణ ఎవరిది అన్న అంశంపైనా స్పష్టత లేకపోవడం గందరగోళానికి దారితీసింది. ఫలితంగా గత సర్కారు మాటలు నీటిపై రాతలుగా మిగిలిపోయాయి. డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణాలపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు, నిధులు రావాల్సి ఉందని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ ఎస్వీ రామన్ తెలిపారు.

సాధారణ స్థితికి గోదావరి

వరద తగ్గి.. నదీ గర్భంలోకి ప్రవాహం

కుక్కునూరు, న్యూస్‌టుడే: గోదావరి వరద వేగంగా తగ్గిపోయింది. సోమవారం సాయంత్రం 7 గంటలకు భద్రాచలం వద్ద 22 అడుగులకు సాధారణ స్థితికి చేరుకుంది. గతంలో వచ్చిన వరదలు 15 రోజులకు తక్కువ కాకుండా ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. ఈ సారి కేవలం నాలుగు రోజుల్లోనే పోటెత్తటం, తగ్గిపోవటం గమనార్హం.

కుక్కునూరు మండలం గుండేటివాగు వద్ద శనివారం రాత్రి వరకు దాదాపు 10 అడుగుల లోతు ఉన్న వరద నీరు అరడుగుకు చేరింది.

స్పిల్‌వే నుంచి నాలుగు లక్షల క్యూసెక్కులు విడుదల.. పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి పెరిగిన వరద క్రమేపీ తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం సాయంత్రానికి నీటి మట్టం 29.30 మీటర్లకు తగ్గింది. 48 గేట్ల నుంచి నాలుగు లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తోంది. దాదాపు తొమ్మిది లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు జల వనరుల శాఖాధికారులు ప్రాథమికంగా అంచన వేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు స్పిల్‌వే నుంచి 7.63 లక్షల క్యూసెక్కులు మాత్రమే దిగువకు స్పిల్ ఛానల్ ద్వారా గోదావరిలోకి వెళ్లింది. తర్వాత వరద క్రమేపీ తగ్గినట్లు జల వనరుల శాఖాధికారులు పేర్కొన్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఇసుక తిన్నెలు పోలవరం వద్ద బయట పడుతున్నాయి.

నిలకడగా ఉద్ధృతి.. ఆచంట, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: మూడు రోజుల పాటు లంక గ్రామాల్లో పెరుగుతూ వచ్చిన గోదావరి వరద సోమవారం కాస్త నెమ్మదించి నిలకడగా కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. లంక భూముల్లో పండించిన కూరగాయలను పడవలపై తీసుకువచ్చేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆచంట మండల పరిధిలో లంక గ్రామాల్లో పడవలు ఉంచే ప్రాంతాలు బురదగా తయారయ్యాయి. పెదమల్లం లంక, ఆనగర్లంక, కోడేరులంక, అయోధ్యలంక, మర్రిమూల, నడిగాడి, పుచ్చలలంక ప్రాంతాలకు చెందిన వారు అన్ని అవసరాలకు కోనసీమ జిల్లాకు పడవల్లో వెళ్తుంటారు. లంక గ్రామాల్లో రేవుల వద్ద పేరుకుపోయిన బురదలోంచి వీరు రాకపోకలు సాగిస్తున్నారు.

నడపలేక.. నిలపలేక!

➲ పార్కింగ్ స్థలాల ఆక్రమణ
➲ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో వాహనాల నిలుపుదలకు ప్రత్యేక స్థలాలు లేక.. చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల స్థలాలున్నా, వాటిని చిరు వ్యాపారులు ఆక్రమించేశారు. ప్రధానంగా ఇరుకు రోడ్లలో వాహనాల నిలుపుదలకు తీవ్ర సమస్య ఏర్పడుతోంది. మరోవైపు నో పార్కింగ్ అంటూ పోలీసులు అపరాధ రుసుము విధిస్తుండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

ఆర్ఆర్‌పేటలో రోడ్డు పక్కన నిలిపిన కార్లు

ప్రధాన ప్రాంతాల్లోనే.. ఆర్ఆర్ పేట, పవర్‌పేట, కర్రల వంతెన రోడ్డు, మెయిన్ బజార్, విజయ్‌విహార్ కూడలి, బిర్లాభవన్ కూడలి, పత్తేబాద రోడ్డుల్లో వాహనాల నిలుపుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఆసుపత్రులు, రెస్టారెంట్లు, వస్త్ర దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలున్నాయి. ఇక్కడ రోడ్డు పక్కన నిలుపుదల చేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు అరకొర పార్కింగ్ స్థలాలు, రోడ్ల అంచుల్లో కొందరు తోపుడు బండ్లు, తాత్కాలిక పందిళ్లు వేసుకుని వ్యాపారాలు సాగిస్తుండటంతో.. ఎక్కడా వాహనాలు ఆపేందుకు ఖాళీ ఉండటం లేదు.

నో పార్కింగ్ కేసులు వివరాలిలా..

సంవత్సరం	కేసులు
2022	1050
2023	1003
2024	1110
2025	690
(ఇప్పటి వరకు)	

ఇరుకుగా విజయ్‌విహార్ కూడలి- పత్తేబాద రోడ్డు

తలనొప్పిగా డివైడర్లు సహజంగా కాస్త వెడల్పున్న రోడ్ల మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేస్తుంటారు. ఏలూరులో మాత్రం చిన్న మార్గాల్లోనూ విభాగినులు ఏర్పాటు చేయడం తలనొప్పిగా మారింది. ఫలితంగా రోడ్డు కుచించుకుపోయింది. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించేందుకు వీలుండటం లేదు. ఆయా మార్గాల్లో ఏదైనా వాహనం రోడ్డు పక్కన నిలిపితే ఇక నరకం చూడాల్సిందే. శ్రీనివాస థియేటర్, విజయవిహార్ కూడలి నుంచి పత్తేబాద, మున్సిపల్ కార్యాలయ కాలువ, చందన బ్రదర్స్ రోడ్డుల్లో సమస్యలు నెలకొన్నాయి. 'ప్రధాన దారుల్లో కొన్ని చోట్ల పార్కింగ్ స్థలాలున్నాయి. వాటిల్లో చిరు వ్యాపారాలు సాగిస్తే చర్యలు తీసుకుంటాం. షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు, వస్త్ర దుకాణాల్లో కొన్ని చోట్ల లోపల పార్కింగ్ స్థలాలున్నాయి. కొనుగోలుదారులు లోపల వాహనాలు నిలుపుకోవాలి' అని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు తెలిపారు.

సాగుదామా.. డ్రోన్ దారిలో!

❑ 80 శాతం రాయితీపై అందజేత ❑ జిల్లాకు 40 యూనిట్ల కేటాయింపు

ఏలూరు ఆర్ఆర్ పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: సాగులో యాంత్రీకరణ, సాంకేతికతను అందిపుచ్చుకొని.. రైతులు మేలైన దిగుబడులు సాధించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కూలీల కొరత అధిగమించడంతో పాటు వ్యయభారం తగ్గించుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులు పొందేలా రాయితీపై డ్రోన్లు అందిస్తోంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీకి 80 శాతం రాయితీతో ప్రతి మండలానికి కిసాన్ డ్రోన్లు మంజూరు చేస్తోంది. జిల్లాలో పెదవేగి, జంగారెడ్డిగూడెం, పోలవరం, ముదినేపల్లి, చాట్రాయి, నూజివీడు, మండవల్లి, కలిదిండి, చింతలపూడి, కొయ్యలగూడెం మండలాల రైతులకు డ్రోన్లు అందజేసింది.

డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న మంత్రి పార్థసారథి(పాత చిత్రం)

నిబంధనలివీ.. కనీసం అయిదుగురు రైతులు సంఘంగా ఏర్పడాలి. వీరిలో ఒకరు కనీసం పదో తరగతి లేదా ఐటీఐ చదివి, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఆ రైతుకు డ్రోన్ వినియోగంపై 12 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు. రైతు సంఘం బ్యాంకు ఖాతా తెరచి రూ.4.90 లక్షలు డిపాజిట్ చేయాలి. మిగతా రూ.4.90 లక్షలు బ్యాంకు రుణంగా ఇస్తారు. అనంతరం ప్రభుత్వం 80 శాతం రాయితీగా రూ.7.84 లక్షలు తిరిగి ఖాతాలో జమవుతుంది.

సమయం.. నగదు ఆదా

డ్రోన్ల వినియోగంతో సమయంతో పాటు డబ్బు ఆదావుతోంది. కూలీల కొరతను అధిగమించవచ్చు. సాధారణంగా ఎకరాకు మందు పిచికారీ చేయడానికి కనీసం గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. రూ.500 వరకు ఖర్చవుతోంది. డ్రోన్‌తో ఆకులపై నేరుగా మందు పడి అయిదు నిమిషాల్లో పని పూర్తవుతోంది. ఖర్చు తక్కువే అవుతోంది. కేవలం పది లీటర్ల మందు పిచికారీ చేస్తే సరిపోతోంది. 'జిల్లాలో డ్రోన్లు పొందేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అవసరమైతే మరిన్ని యూనిట్లు కేటాయిస్తాం' అని జిల్లా జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు.

జిల్లా సమాచారమిలా.. మంజూరైన యూనిట్లు **40** మొత్తం డ్రోన్ల విలువ **రూ.3.92 కోట్లు** పంపిణీ చేసినవి **24**

బాధలు వింటారని.. బాసటగా నిలుస్తారని!

'మీ కోసం'లో బాధితుల వేడుకోలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధాప్యంతో ఒకరు.. వైకల్యంతో ఇంకొకరు. మలి వయసులో కొట్టుమిట్టాడుతున్న మరికొందరు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మండల స్థాయిలో ఎవరూ పట్టించుకోకపోవడంతో.. తమ బాధలు వింటారని, బాసటగా నిలుస్తారని వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. 'మీ కోసం'లో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతులు అందించారు.

భూమి ఆక్రమించారని..

నా పేరు జయమంగళ ప్రహ్లాద్. దివ్యాంగుడిని. మండవల్లి మండలం పెనుమాకలంకలో 50 సెంట్ల భూమి ఉంది. దాన్ని కొందరు ఆక్రమించేశారు. నా భూమిని సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించాలని పలుమార్లు తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించా. ఇప్పటికీ సర్వే చేయలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కుమారుడి సహాయంతో కలెక్టరేట్‌కు వచ్చాను. సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నా.

పింఛను రద్దు చేశారని..

నా పేరు పోగుల పొంచాట. నా వయసు 77 ఏళ్లు. జీలుగుమిల్లి మండలం అయ్యవారి పోలవరంలో నివసిస్తున్నా. కొన్నాళ్ల క్రితం వరకు వృద్ధాప్య పింఛను వచ్చేది. నా బదులు భార్యకు పింఛను వచ్చేలా పేరు మార్చారు. ఆమె ఏడాదిన్నర క్రితం మరణించింది. ఆ పింఛను నాకు ఇప్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా. పట్టించుకోవడం లేదు. వృద్ధాప్యంలో నాకు జీవనం కష్టంగా ఉంది. జిల్లా అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయించాలి.

యువతితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, చిత్రంలో జేసీ ధాత్రిరెడ్డి తదితరులు

389 అర్జీలు రాక

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం నిర్వహించిన 'మీ కోసం'కు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి 389 అర్జీలు అందజేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొని వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం: ఎస్పీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పలువురు కార్యాలయానికి వచ్చి తమ గోడును ఎస్పీకి వెల్లబోసుకున్నారు. వాటన్నింటినీ విన్న ప్రతాప్ శివకిశోర్.. త్వరితం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంలో ఫిర్యాదుదారుల సమస్యలు నమోదు చేశారు. భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ తగాదాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్ కుమార్, పలువురు సీఐలు పాల్గొన్నారు.

కొత్త ఒరవడి.. లాభాల దిగుబడి | రైతేరాజు | కొత్త విద్యార్థులొచ్చారు! 6లో

ఐటీఐల్లో ప్రవేశ గడువు పెంపు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు ఈ నెల 20 వరకు పొడిగించినట్లు ప్రధానాచార్యుడు డి.భూషణం తెలిపారు. విద్యార్థులు https://iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆ ప్రతిని ఎంచుకున్న కళాశాలలో 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశ దరఖాస్తుదారులకు 23 నుంచి 25 వరకు, ప్రైవేటు ఐటీఐల అభ్యర్థులకు ఈ నెల 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 08812-230269 నంబరును సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాలు.. చేయి ఆడక స్ట్రెచర్‌పై వచ్చి..

✦ గంటలోనే కుదురుకున్న రోగి ✦ ఏలూరు బోధనాసుపత్రిలో అరుదైన వైద్యం

ఈనాడు-ఏలూరు: ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఓ రోగికి అరుదైన వైద్యం చేశారు. పక్షవాత లక్షణాలతో మూడు రోజుల క్రితం కాళ్లు, చేతులు బిగిసుకుపోయి స్ట్రెచర్‌పై ఆసుపత్రిలో చేరిన రోగికి 'థ్రాంబోలైసిస్' చేసి పక్షవాతం ముప్పు నుంచి కాపాడారు. పెదవేగికి చెందిన వెంకటేశ్వరమ్మ (60)కు ఈ నెల 12న ఉదయం 8 గంటలకు కుడి కాలు ఒకటి, కుడి చేయొకటి పనిచేయటం లేదు. కరెంటు షాకు తగిలి గుంజినట్లు, లాగేసినట్లు అనిపించిన స్థితిలో ఆమెను స్ట్రెచర్‌పై తీసుకొచ్చారు.

చకచకా పరీక్షలు చేసి.. చకచకా పరీక్షలు చేసిన వైద్యులు ఆమెకు పక్షవాతం వచ్చినట్లు నిర్ధారించుకున్నారు. లక్షణాలు బయటపడిన నాలుగు గంటల్లోపు దాని నివారణకు ఇంజెక్షన్ ఇస్తే ఫలితం ఉంటుందని వెంటనే ఆమెకు రూ.30-40 వేల ఖరీదు చేసే థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ చేశారు. అత్యవసర సేవల విభాగంలో ఆచార్య విద్యాసాగర్ పర్యవేక్షణలో జూనియర్, పీజీ వైద్యులు ఆమెకు సకాలంలో చికిత్స చేసి గంటలోపే ఆమె కాళ్లు, చేతులు ఆడించారు. స్ట్రెచర్‌పై వచ్చిన ఆమె సాయంత్రానికి బెడ్‌పై నుంచి లేవటం.. వార్డులో తిరగటం వంటివి చేశారని విద్యాసాగర్ తెలిపారు.

రోగితో మాట్లాడుతున్న విద్యాసాగర్, చిత్రంలో జూనియర్ వైద్యులు

రిఫర్ చేయకుండా.. గుంటూరు, విజయవాడ, కాకినాడ బోధనాసుపత్రుల్లో పక్షవాత రోగులకు థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ చేసి దాన్ని నివారించటం అక్కడ షరామామూలే. గతంలో ఇక్కడి నుంచి ఈ వైద్యసేవల కోసం రోగులను గుంటూరుకు రిఫర్ చేసేవారు. ప్రస్తుతం న్యూరోసర్జన్ ఆచార్య విద్యాసాగర్ స్ట్రోకు రోగులకు ఇక్కడే వైద్యసేవలు అందిస్తున్నారు. రిఫర్ చేయటం లేదు. ఇది రోగులకు ఊరటనిస్తోంది. పక్షవాత రోగులకు ఇక్కడ అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. వినియోగించుకోవాలని ఆసుపత్రివర్గాలు కోరుతున్నాయి.

నేడు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల పర్యటన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఏలూరు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం పీ4 కార్యక్రమం అమలుపై సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు నుంచి బయల్దేరి 3.15 గంటలకు చొదిమెళ్ల గ్రామం చేరుకుంటారు. అక్కడ ఆయిల్ పామ్ తోటలను పరిశీలిస్తారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శిస్తారు.

వేగంగా గిరిజన ఆవాసాల అభివృద్ధి: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులతో సోమవారం ఆమె దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీఎం జన్‌మన్ ద్వారా మారుమూల గిరిజన గ్రామాల ప్రగతి పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజనులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథ్‌బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

19 ఆలయ పాలకమండళ్లకు అనుమతులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: జిల్లాలో 19 ఆలయ పాలకమండళ్ల నియామకానికి అనుమతులు వచ్చినట్లు దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాశ్ తెలిపారు. ఈ ఏడాది మే నెలలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో జిల్లాలో 129 ఆలయాలకు 69 దేవస్థానాల నుంచి దరఖాస్తులు చేయగా 19కి అనుమతులు ఇచ్చారు.

వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు

సేవాభావానికి మారుపేరుగా నిలిచి,
లయనిజంలో ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించి,
ఎందరో అంధులకు ఆశాకిరణంగా నిలిచిన
శ్రీమతి రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల
ఆవిర్భావానికి ప్రధాన కారకులు
కీ॥శే॥ కొత్తపల్లి రామారావు గారి
జన్మదినోత్సవాన్ని మా నేత్ర వైద్యశాల వ్యవస్థాపక దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా,
31 సంవత్సరాలుగా మా వైద్యసేవలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్న దాతలకు, సేవాసంస్థలకు
మరియు మా సేవలు వినియోగించుకుంటున్న పేషెంట్లకు
మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.



కీ॥శే॥ కొత్తపల్లి రామారావు గారు
పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్
చైర్మన్, మోడరన్ రూఫింగ్స్ లిమిటెడ్

ట్రస్ట్‌బోర్డు సభ్యులు మరియు సిబ్బంది
శ్రీమతి రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల
గాంధీనగర్, నిడదవోలు
31st YEAR IN EYE CARE

(c) eenadu

బాడి తొలగింది.. బాట పడింది

గుర్వాయిపాలెం (కలిదిండి), న్యూస్‌టుడే: రహదారిపై 'బాడి' తొలగింది. 'బడి'కి బాట పడింది. గుర్వాయిపాలెంలోని ఒకటో వార్డులో రోడ్డు అధ్వానంగా ఉండటంతో బీసీ కాలనీ విద్యార్థులు బడికి వెళ్లలేకపోతున్న నేపథ్యంలో ఈనెల 5న 'ఈనాడు'లో 'బడికెళ్లనీయని బాడి' శీర్షికన ప్రచురితమైన కథనానికి సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు స్పందించారు. ఆయనే దగ్గరుండి తొలుత రోడ్డుకు బుసకతో చదును చేయించారు. తరవాత దానిపై రబ్బీస్ వేయించారు. కార్యదర్శి ఉదయ్‌కుమార్ పనులు పర్యవేక్షించారు. రోడ్డు బాగు పడటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

కొత్త విద్యార్థులొచ్చారు! కళకళలాడిన ట్రిపుల్ ఐటీ ప్రాంగణం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చిన విద్యార్థులకు మంగళవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ఆర్జీయూకేటీ అధికారులు ప్రకటించారు. దీంతో సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు తరలి రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణం కిటకిటలాడింది. విద్యార్థులు తమకు కేటాయించిన వసతి గృహాల్లోకి వెళ్లేందుకు యత్నించడంతో రద్దీ నెలకొంది. టోకెన్ సిస్టం ద్వారా పేర్లు నమోదు తదితరాలను ట్రిపుల్ ఐటీ వార్డెన్లు ఇతర సిబ్బంది పరిశీలించి విద్యార్థులను వసతి గృహం లోపలికి పంపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల సమయం వచ్చే వరకు నేలపై సేద తీరారు. మరికొందరు చెట్ల కింద వేచి ఉన్నారు. కనీసం ఆయా వసతి గృహాల వద్ద కూర్చునేందుకు కుర్చీలను సైతం ఏర్పాటు చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

వసతి గృహం వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు

పిల్లలను వెంట పెట్టుకుని..

బైపాస్ రోడ్డులో వెలుగులు!

ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ(ఈడ) ఆధ్వర్యంలో ఏలూరు నుంచి కలపర్రు టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో ఒకవైపు గోతులు తవ్వి విద్యుత్తు కేబుళ్లను వేసి స్తంభాలను అమర్చుతున్నారు. ప్రస్తుతానికి జాతీయ రహదారి కూడలి నుంచి మినీబైపాస్ వరకూ అయిదు కిలోమీటర్ల మేర వంద స్తంభాలు వేసేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాత్రి వేళల్లో ఇన్నాళ్లూ ఉన్న చీకట్లు తొలగిపోయి కాంతులు ప్రసరించనుండడంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **-ఈనాడు, ఏలూరు**

సిద్ధంగా ఉన్న స్తంభాలు

కొత్తగా వేసిన విద్యుద్దీప స్తంభాలు

16 టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జంగారెడ్డిగూడెం పట్టణంలోని చాముండేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో సరైన ద్రవీకరణ పత్రాలు లేని రూ.2.30 లక్షలు విలువైన 16 టన్నుల ఎరువుల విక్రయాలు చేయకుండా నిలుపుదల చేస్తూ ఆదేశించినట్లు మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా సోమవారం జంగారెడ్డిగూడెంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరిలో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలతోపాటు, కాలపరిమితి దాటిన రూ.6,500 విలువైన పురుగు మందులను గుర్తించినట్లు చెప్పారు. దాడులలో విజిలెన్స్ సీఐ మధుబాబు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి, శ్రీహరిపురంలోని పలు ఎరువులు, విత్తన, పురుగు మందుల దుకాణాలపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, అనపర్తి, ఏలూరు, మండవల్లి ఏడీఏలు డీవీ కృష్ణ, అనిల్‌కుమారి, జి.వెంకటమణి తనిఖీలు చేశారు. విధిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీహరిపురంలోని షణ్ముక ఎంటర్‌ప్రైజెస్‌లో సరైన పత్రాలు లేని 23.075 మెట్రిక్ టన్నుల(రూ.1,89,292 విలువైన) ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

కొత్త ఒరవడి.. లాభాల దిగుబడి

పంట మార్పిడి విధానంలో సత్ఫలితాలు సాధిస్తున్న రమేష్

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: సంప్రదాయ వ్యవసాయ పద్ధతిలో పంట మార్పిడి విధానాన్ని అవలంబించి సత్ఫలితాలు సాధిస్తున్నారు జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన రైతు సత్తెనపల్లి రమేష్. ఆయన తండ్రి పండించే వరి, మొక్కజొన్న సాగు చేసే విధానాన్ని చిన్ననాటి నుంచే నిశితంగా పరిశీలించేవారు. చదువు పూర్తయ్యాక వ్యవసాయంపై మక్కువతో కుటుంబానికి ఆసరాగా నిలిచారు. తనకున్న నాలుగెకరాల వ్యవసాయ క్షేత్రంలో కొత్త రకాల వరి, మొక్కజొన్న విత్తనాలు వినియోగించి అధిక దిగుబడి సాధించేవారు.

పేరంపేటలో తోట

వ్యవసాయంలో మార్పు కోసం.. వరి, మొక్కజొన్న పంటలకు ఒక్కోసారి సరైన గిట్టుబాటు ధర రాకపోవడం, వర్షాల బారినపడకుండా ధాన్యం, మొక్కజొన్నలను కంటికి రెప్పలా కాపాడుకోవడం రమేష్‌కు భారంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను వేయాలని నిర్ణయించుకున్నారు. సహచర రైతుల సూచనల మేరకు వేరుశనగ పంటను ఓ రెండెకరాల్లో ప్రయోగాత్మకంగా వేసి ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధించారు. ఆ స్ఫూర్తితో మరో పదెకరాలు కౌలుకు తీసుకుని అదే పంటను పండిస్తూ లాభాలు గడిస్తున్నారు.

పరికరాలతో.. వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి వాటిపైనా రమేష్ ఆదాయం సంపాదిస్తున్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం మండలంలో వేరుశనగ సాగు విస్తరించడంతో యంత్రాలకు గిరాకీ పెరిగింది. దీనిని అందిపుచ్చుకున్న రమేష్ రూ.3 లక్షలతో యంత్రాలు కొనుగోలు చేశారు. తమ సొంత పనులకు వినియోగించుకున్నాక ఇతర రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చి అదనపు ఆదాయం పొందుతున్నారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తోందని రైతు రమేష్ తెలిపారు. సాగులో ఒడుదొడుకులు అధిగమించాలంటే రైతులందరూ పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని ఆయన సూచిస్తున్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా గ్రామసభ తగదు'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు భూసేకరణ కోసం గిరిజన చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించే ప్రయత్నం చేయడం తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. పంచాయతీ పాలకవర్గం, సర్పంచి, స్థానికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు సోమవారం రెడ్డిగణపవరంలో గ్రామసభను నిర్వహించేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఆయన నేతృత్వంలో అడ్డుకున్నారు. కొద్దిసేపు సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామసభ సమాచారాన్ని కొంత మంది గిరిజనేతరులకు మాత్రమే చెప్పి, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎం.మంగరాజు మాట్లాడుతూ దాదాపు ముప్పై ఏళ్లుగా గిరిజనులు సాగులో ఉన్న ఎసైన్డ్, వివాదాస్పద భూములను సేకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయం, గ్రామసభ తీర్మానాలు లేకుండా ఇచ్చివంటి చర్యలు చేపడుతు వల్ల గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో సేకరించిన నిర్వాసితులకు కేటాయించగా మిగిలిన భూములను ఇవ్వకుండా, కొత్తగా మళ్లీ భూములు సేకరించేందుకు రహస్యంగా గ్రామసభ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, మాజీ సర్పంచి కొర్స జలపాలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పూనెం దుర్గారావు, నాయకులు కట్టం వెంకటేశ్వరరావు, గొడ్డా పవన్‌కళ్యాణ్, వెట్టి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

కాళ్లు అమర్చిన వారితో ట్రస్టు, హీల్ ప్రతినిధులు

కృత్రిమ కాళ్ల అమరికతో ఆత్మవిశ్వాసం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అమరికతో ఆత్మవిశ్వాసం పెంపొందింది. దివ్యాంగ బాలలు విద్య కొనసాగించడానికి దోహదపడుతుందని చుండూరు కోటయ్య, రామశేషమ్మ చారిటబుల్ ట్రస్టు ముఖ్య బాధ్యుడు మధుసూదనరావు అన్నారు. తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో చుండూరు కోటయ్య, రామశేషమ్మ చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 13 మందికి కృత్రిమ కాళ్లను సోమవారం అందజేశారు. హీల్ సీఈవో కె.ఆశయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 729 మందికి కృత్రిమ కాళ్లను అందజేశామన్నారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, డైరెక్టర్ టి.భాస్కర్, ప్రముఖ సంఘ సేవకులు చుండూరు బుజ్జమ్మ, గద్దె ప్రేమ, కుటుంబ సభ్యులు, వీరపనేని రామారావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ సంచాలకుడు ఎం.ఫణికిశోర్ తెలిపారు. యువకులకు ఫోన్ల మరమ్మతులకు 30 రోజులు, యువతులకు జనపనార సంచుల తయారీలో 14 రోజులపాటు శిక్షణనిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం ధ్రువపత్రాలు అందజేతతో ముద్ర రుణానికి సిఫార్సు చేస్తామన్నారు. ఇతర వివరాలకు 99485 65256 నంబర్‌ను సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశ్న: ఖరీఫ్ కూరగాయ సాగులో సస్యరక్షణ చర్యలు తెలపండి ? - సురేష్‌బాబు, ద్వారకాతిరుమల

సమాధానం: బెండ మొక్కల మొదళ్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి. ఎండు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి మొదళ్లలో మట్టి బాగా తడిచేలా పోయాలి. రసం పీల్చు పురుగు నివారణకు లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. కలిపి ఆకులు, కాండం తడిచేలా పిచికారీ చేయాలి. వంగలో కాండం తొలుచు పురుగు ఆశించకుండా 100 చ.మీ.కు నాటే ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 250 గ్రా. నేలలో కలియబెట్టాలి. పందిరి జాతి కూరగాయల ఆకుల పైభాగాన పసుపు రంగు, అడుగున ఊదా రంగు మచ్చలు ఏర్పడితే లీటరు నీటిలో మాంకోజెబ్ 2.5 గ్రా. కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు
✆ చరవాణి
73826 33692

రైతేరాజు

తేనెటీగల పెంపకంతో.. అదనపు ఆదాయం

పెనుగొండ, పోడూరు, న్యూస్‌టుడే: ఉద్యాన తోటల్లో తేనెటీగల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖాధికారిణి కె.ప్రియదర్శిని తెలిపారు. కొబ్బరి, పండ్ల తోటల్లో తేనె పెట్టెలను ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా రాయితీలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. తేనెతో పాటు ఉప ఉత్పత్తుల ద్వారా ఆదాయం ఆర్జించవచ్చని తెలిపారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)లో ఒక పెట్టెకు, తేనెటీగలకు కలిపి రూ.1,600 రాయితీ ఇస్తారు. ఒక రైతు కనిష్ఠంగా 8, గరిష్ఠంగా 50 పెట్టెలు రాయితీపై పొందవచ్చు. దీంతో పాటు తేనెటీగల పెంపకానికి ఉపయోగించే పరికరాలకు రూ.8 వేల రాయితీ విడిగా లభిస్తుంది.

ఉప ఉత్పత్తులు ఇవీ..
పుప్పొడి: దీనిలో ప్రోటీన్లతో పాటు ఔషధ గుణాలు ఉంటాయి. వివిధ ఔషధాలు, పోషకాల తయారీలో దీనిని వాడుతారు.
మైనం: కూలీ ఈగలు తయారు చేసే మైనం విలువ తేనె కంటే 10 రెట్లు ఎక్కువ. దీనిని సబ్బులు, క్రీములు, సౌందర్య సాధనాలు, లేపనాల తయారీలో ఉపయోగిస్తారు.
రాజాహారం: కూలీ ఈగలు తయారు చేసే అత్యంత విలువైన పదార్థం ఇది. దీనిలో 14% చక్కెర, 66% నీరు, 5% కొవ్వు పదార్థాలు ఉంటాయి. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు కిలో రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతుంది.
ప్రోపోలిస్: దీనిలో యాంటీసెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి.
తేనెటీగల విషం: దీనిలో వివిధ రకాల పెప్టయిడ్లు, ఎంజైములు అధికంగా ఉంటాయి. కీళ్ల వ్యాధులు, నరాల నొప్పులు, పార్కిన్సన్, అల్జీమర్ తదితర వ్యాధుల చికిత్సలో ఉపయోగిస్తారు.

సైబర్ బాధితుడికి సాంత్వన

రూ.1.64 లక్షల రికవరీ సొమ్ము అందజేత

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ బాధితుడికి సాంత్వన చేకూరుస్తూ.. అతడికి పోలీసులు రికవరీ సొమ్ము రూ.1.64 లక్షలు అందజేశారు. కైకలూరు మండలం తామరకొల్లుకు చెందిన శ్రీనివాసరావు ఫోన్‌కు ఇటీవల ఓ లింక్ వచ్చింది. దాన్ని తెరవడంతో బ్యాంకు ఖాతాలోని రూ.1.64 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు కైకలూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ కృష్ణ సైబర్ క్రైం విభాగానికి సమాచారం అందించి కేసు నమోదు చేశారు. సైబర్ మోసగాళ్ల నుంచి సొమ్ము రికవరీ చేసి ఆ మొత్తాన్ని సోమవారం ఏలూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చేతులమీదుగా బాధితుడికి అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్రీనివాసరావుకు సొమ్ము ఇస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చేప పిల్లల రవాణాలో.. జాగ్రత్తలు తప్పనిసరి!

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: విత్తన చెరువు నుంచి చేప పిల్లలను రవాణా చేసే సమయంలో జాగ్రత్తలు పాటించకుంటే అవి మృత్యువాతపడి నష్టపోయే ప్రమాదం ఉంది. దీని నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని భీమవరానికి చెందిన ఆక్వా రంగ నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు. వివరాలు ఇలా..

- చేప పిల్లల మార్పిడికి మూడు రోజుల ముందు నుంచి మేతలు ఆపేయాలి. ఒక రోజు ముందు చేప పిల్లలను వలతో లాగి (తిరగవేత) మళ్లీ చెరువులో వదలాలి. ఆ సమయంలో ఎకరాకు 25 కిలోల చొప్పున సముద్ర ఉప్పు చల్లాలి. బుటాక్స్ లేదా కాపర్‌క్యూర్ వంటి రసాయనాలను చెరువు నీటిపై చల్లాలి. రవాణాను ఉదయం 7 గంటలకు ప్రారంభించి 10 గంటల లోపు పూర్తిచేయాలి. చేప పిల్లలను వలతో లాగే సమయంలో ఆక్సిజన్ అందేలా కాల్షియం లేదా మోనో పెర్బోరేట్ వంటి వాటిని నీటిలో చల్లి ఆక్సిజన్ స్థాయిని స్థిరీకరించాలి.

సైజుకు అనుగుణంగా..

సైజును బట్టి వ్యానుకు 200 నుంచి 500 కిలోల బరువు మించకుండా చేప పిల్లలు వేసి రవాణా చేయాలి. డ్రమ్ముల్లో రవాణా చేస్తే 150 నుంచి 300 కిలోలకు మించకుండా వేయాలి. కొత్త చెరువులో చేప పిల్లలను వదిలిన వెంటనే ఐడోఫోర్-20 వంటి రసాయనాలను చెరువు నీటిపై ఎకరాకు 250 మి.లీ. చొప్పున చల్లాలి. రెండో రోజు నుంచి ప్రభుత్వ అనుమతి పొందిన వ్యాధి నిరోధ ఔషధాలను పచ్చితవుడుతో కలిపి టన్ను చేపలకు 15 గ్రాముల చొప్పున అందించాలి.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏడో తరగతి చదువుతున్న బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు. . కొత్తపేట ప్రాంతానికి చెందిన 75 ఏళ్ల వయసున్న తిర్రి సూర్యనారాయణమూర్తి వారం రోజులుగా నగరానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. సదరు బాలిక రోజూ పాఠశాలకెళ్లి సాయంత్రం వేళ అమ్మమ్మ ఇంటికి వెళ్తుంటుంది. ఈ క్రమంలో వృద్ధుడు విద్యార్థిని మచ్చిక చేసుకొని.. రోజూ కాసేపు ఇంటికి పిలిపించుకొని లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో.. ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సోమవారం కేసు నమోదు చేసి.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

బాధితురాలి బంధువుల ధర్నా..

పోలీసులు నిందితుడిని వదిలేశారంటూ పుకార్లు రావడంతో ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు సోమవారం రాత్రి రెండో పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. సీఐ అశోక్‌కుమార్ నిరసనకారులతో మాట్లాడి సర్దిచెప్పారు. నిందితుడు తమ అదుపులోనే ఉన్నారని చెప్పడంతో.. వారు శాంతించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

108 వాహన సిబ్బందిపై.. ఎనిమిది మంది అరెస్టు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 108 వాహన సిబ్బందిపై కొందరు యువకులు దాడి చేసిన ఘటనపై కైకలూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన కోనాల లక్ష్మణరావు 108 వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్నారు. ఈనెల 12 శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై కైకలూరు విధులకు వస్తున్న సమయంలో గోపవరం రోడ్డులో రైల్వే గేటు వేయడంతో ఆగారు. గేటు తీసిన అనంతరం వాహనాలు రద్దీగా ఉండటంతో ముందుకు వెళ్లే వీలు లేక వేచి ఉన్నారు. ఈక్రమంలో వెనుక ఉన్న కొదమల హేమంత్ అనే యువకుడు ముందుకు వెళ్లాలని బండి హారన్ కొట్టాడు. ముందు వాహనాలు ఉంటే వెళ్లేది ఎలాని లక్ష్మణ్ సమాధానం ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో హేమంత్ తన స్నేహితులకు ఫోన్ చేసి రైల్వే గేటు వద్దకు రప్పించాడు. వచ్చీ రావడంతోనే యువకులంతా లక్ష్మణరావుపై విచక్షణారహితంగా దాడి చేశారు. క్షతగాత్రుడు విషయాన్ని ఫోన్‌లో 108 వాహన పైలెట్ నాగరాజుకు తెలపగా హుటాహుటిన అక్కడ చేరుకున్నాడు. అక్కడే వేచి ఉన్న యువకులు నాగరాజుపై కూడా దాడి చేసి గాయపరిచారు. ఇందులో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలవ్వగా.. కైకలూరు, అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు ఫిర్యాదుపై పట్టణ సీఐ కృష్ణ సీసీ కెమెరాలను పరిశీలించారు. దాడికి పాల్పడిన యువకులు మండలంలోని ఆటపాక పంచాయతీ పరిధిలోని జాన్‌పేటకు చెందిన వారుగా గుర్తించారు. దాడికి ప్రధాన కారకుడైన హేమంత్ మరో ఏడుగురిని సోమవారం అదుపులోకి తీసుకుని ఎస్సై ఆర్.శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

మైన్స్ ఏడీ రవికాంత్ మృతి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక భూగర్భ గనుల శాఖ జిల్లా కార్యాలయంలో విజిలెన్స్ విభాగం ఏడీగా పని చేస్తున్న రవికాంత్(55) మృతి చెందారు. సత్రంపాడులోని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుకు గురై అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు.

డెంగీ లక్షణాలతో యువకుడు..

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడేనికి చెందిన యువ వ్యాపారవేత్త డి.పూర్ణచందు (26) డెంగీ లక్షణాలతో ఆదివారం మృతి చెందారు. నాలుగు రోజుల కిందట ఆయన జ్వరం బారిన పడగా ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తొలుత రక్త కణాలు పడిపోయాయి. రెండు రోజులు ఆరోగ్యం నిలకడగానే ఉన్నా తదనంతరం కాలేయం, ఊపిరితిత్తుల ఇబ్బందులతోపాటు శ్వాస సమస్య తలెత్తి పూర్ణచందు మృతి చెందారు. మృతుడు పూర్ణచందుకు భార్య నిండు చూలాలు. యుక్త వయసులోనే పూర్ణచందు మృతి ఆ కుటుంబాన్ని కలచివేసింది.

పూర్ణచందు (పాత చిత్రం)

అడవి మధ్యలో అగచాట్లు! గిరిజనులకు తీరని కష్టాలు

పోలవరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్లక్ష్యపు నిర్ణయాలు అడవి బిడ్డలకు శాపాలుగా మారుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున గెడ్డపల్లి నుంచి సుమారు 20 మంది గిరిజనులతో బయలుదేరిన వ్యాన్ చిలకలగండి వద్దకు వచ్చే సరికి రాళ్లు తగిలి నిలిచిపోయింది. దీంతో అందులోని వారంతా కిందకు దిగి గంటకుపైగా తిప్పలు పడి దానిని బయటకు నెట్టారు. దశాబ్దాల తరబడి కొండలు, గుట్టల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, చినుకు పడితే కనీసం ద్విచక్ర వాహనం తిరిగే పరిస్థితి ఉండటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. జన్‌మన్ కార్యక్రమంలో మన్యంలో మొదటగా గెడ్డపల్లికి రోడ్డు వేస్తారని భావించామని, సర్వే నివేదికలో రోడ్డు బాగుందని ఇవ్వడంతో మంజూరు కాలేదని గెడ్డపల్లి పంచాయతీ సర్పంచి సూండ్రు శారద వాపోయారు. ఈ పరిస్థితిపై రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ప్రత్యేక డివిజన్ ఏఈ అంకిరెడ్డిని సంప్రదించగా రెండో దశలో చింతపల్లి నుంచి గెడ్డపల్లి వరకు 8 కి.మీ. పొడవున రోడ్డుకు రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. సర్వే రిపోర్టులో రహదారి బాగుందని నివేదించడంతో మొదటి దశలో ప్రతిపాదించలేకపోయామని చెప్పారు.

అధ్వానంగా ఉన్న రోడ్డుపై వాహనం నిలిచిపోయి మహిళల ఇబ్బందులు

భార్యను చంపుతానని బెదిరించిన భర్తపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భార్యను కొట్టి చంపుతామని బెదిరించిన భర్తపై జంగారెడ్డిగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. స్టేషన్ రైటర్ టి.బాబూరావు కథనం ప్రకారం..జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన నన్నుబ్రోలు నాగదుర్గాప్రసాద్, సత్యతులసిలు భార్యభర్తలు. వీరిద్దరి మధ్య వివాదాల కారణంగా కొద్ది కాలంగా సత్యతులసి తన పిల్లలతో స్థానికంగా ఓ ఇంట్లో విడిగా ఉంటూ.. నాగదుర్గాప్రసాద్‌పై మెయింటినెన్స్ కేసు వేశారు. ఆదివారం భార్య ఉంటున్న ఇంటికి వచ్చిన నాగదుర్గాప్రసాద్ సదరు కేసు ఉపసంహరించుకోమని సత్యతులసిపై దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

విజయవాడకు తరలిస్తుండగా ఒకరి దుర్మరణం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోవడంతో యువకుడు మృతి చెందిన నగర శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఒకటో పట్టణం నవాబుపేటకు చెందిన కిరణ్(22) ఐటీఐ చదివారు. ఈ నెల 13 రాత్రి స్నేహితులతో కలిసి ఆశ్రం సమీప దాబాకు వెళ్లారు. ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా.. మార్గం మధ్యలోని తూర్పులాకుల వద్ద వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని స్నేహితులు వెంటనే సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలో మృతి చెందారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES
రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.
పశ్చిమ గోదావరి, ఏలూరు లలో సుర్తక్ష పబ్లిక్ హెల్త్ కౌన్సిల్ NGO లో పని చేయుటకు వాలంటీర్స్ & కో ఆర్డినేటర్లు గ్రామాలలో సర్వే చేయుటకు కావలెను.

PEOPLE CARE
OLD AGE HOME

REAL ESTATE
LAND FOR SALE

JOBS

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

గొయ్యి పూడ్చి.. తారు వేసి..

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక గాంధీ మైదానం కూడలి పాత వంతెన వద్ద ఏర్పడిన భారీ గొయ్యిను ఎట్టకేలకు పూడ్చి, తారు రోడ్డు నిర్మించారు. మూల మలుపులో రోడ్డు దెబ్బతినడంతో.. తరచూ పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడేశారు. దీనిపై 'ప్రమాదాల లోగిలి.. మూడు రోడ్ల కూడలి', 'గోతిలో పడితే అంతే!' శీర్షికలతో మే 12, జూన్ 8న 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు స్పందించి సమస్య పరిష్కరించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

మహిళకు చెక్కు అందిస్తున్న ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఆపద సమయంలో పేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో 35 మందికి రూ.34,57,905 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు సోమవారం పంపిణీ చేశారు. వీటిలో 33 మందికి రూ.29,07,905 చెక్కులు, ఇద్దరికి ముందస్తు వైద్య ఖర్చులకు రూ.5.50 లక్షలు ఎల్వోసీలున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటి వరకు 182 మంది రూ.1,85,41,310 మంజూరైనట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు టూటౌన్: 80085 74487	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

పెదపాడు, న్యూస్‌టుడే: ? బల్లరేవుతూము కూడలి వద్ద సురక్షిత మంచినీరు సరఫరా చేసే పైపు వాల్వ్ దెబ్బతింది. ఫలితంగా తాగునీరు వృథాగా పోతోంది. - సుబ్బారావు

✔ పైపులైన్ వాల్వ్‌ను పరిశీలిస్తాం. లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - బి.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

భీమడోలు, న్యూస్‌టుడే: ? సూరప్పగూడెం పంచాయతీ పాతూరులో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. పలుచోట్ల మురుగు కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. మురుగు ముందుకెళ్లే అవకాశం లేక నిలిచిపోతోంది. - నాగేశ్వరరావు

✔ డ్రెయినేజీలో పూడికతీతకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా సహకరించాలి. - ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శి

శివారు.. సమస్యలతో బేజారు!

అధ్వాన రోడ్లు, కాలువలతో సతమతం

ఏలూరు నగర శివారు రాజీవ్ స్వగృహ కాలనీకి వెళ్లే రోడ్డు తటాకాన్ని తలపిస్తున్న దృశ్యమిది. దారంతా గోతులు పడి, అందులో వర్షపు నీరు చేరడంతో.. రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చాటపర్రు(ఏలూరు వన్‌టౌన్), న్యూస్‌టుడే: నగర శివారు కాలనీల్లో ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాలు మృగ్యమవడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్‌గృహకల్పన సముదాయాల ప్రాంతం, లక్ష్మమ్మ చెరువుగట్టు, తంగెళ్లమూడిలోని శివగోపాలపురం, ఇంద్రియాగూడెం, టీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచిపోయి తటాకాలను తలపిస్తున్నాయి. ఈ దారుల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియక కింద పడిపోతున్నారు.

అంతటా పారిశుద్ధ్య లోపం.. ఆయా కాలనీల్లో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటోంది. వ్యర్థ నీటితోపాటు [illegible] మురుగు రోడ్లపై పారుతోంది. పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో.. దుర్వాసన వస్తోంది. దీనికితోడు దోమల ఆవాస కేంద్రాలుగా తయారవుతోంది. దోమల మోతతో రాత్రుళ్లు నిద్ర కరవవుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలువల్లోని వ్యర్థాలను తరచూ తొలగించాలని కోరుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. 'శివారు ప్రాంతాల ప్రగతికి చర్యలు తీసుకుంటాం. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం' అని అదనపు కమిషనర్ చంద్రయ్య తెలిపారు.

తంగెళ్లమూడి ప్రాంతంలోని శివగోపాలపురంలో రోడ్డుపై మురుగునీరు నిలిచిన చిత్రమిది. కాలనీలో సీసీ రోడ్లు, పక్కా మురుగు కాలువలు లేకపోవడంతో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఆ మురుగులో నడుస్తూనే స్థానికులు ఇళ్లకు చేరుకుంటున్నారు.

ఏఐతో జవాబుదారీతనం: ఎస్పీ

మాట్లాడుతున్న ప్రతాప్ శివకిశోర్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ విభాగం ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తే.. ప్రతి అర్జీకి పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, కార్యాలయ రిసెప్షన్ సిబ్బందికి ఏఐపై సోమవారం ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులను ఏఐ బోట్‌కు అనుసంధానం, వారి వివరాలు నమోదు, పిటిషన్ జనరేట్ విధానం తదితర అంశాలన్నీ క్షుణ్నంగా పరిశీలించాలని సూచించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు కోటేశ్వరరావు, అశోక్ కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

దెందులూరు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా గంగన్నగూడెం, సానిగూడెం, గోపన్నపాలెం, సోమవరప్పాడు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై గ్రామాలకు వివరించారు. అప్పై ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని తెదేపా యాప్‌లో నమోదు చేశారు. ఆయా సమస్యలను త్వరిత పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

కరపత్రం పంపిణీ చేస్తున్న ప్రభాకర్

ఇళ్ల అక్రమ నిర్మాణాలపై ఆందోళన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక ఆముదాల అప్పలస్వామి కాలనీలోని సామాజిక స్థలాన్ని కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని ఆక్షి మహిళలు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. గతంలోనూ ఇళ్లు నిర్మిస్తే తమ ఫిర్యాదుతో అప్పటి ప్రభుత్వం కూల్చేసిందని గుర్తు చేశారు. ఆ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని వారు కోరారు.

యాజమాన్యంపై చర్యలకు విజ్ఞప్తి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సెలవుల్లో పాఠశాలలు తెరచి తరగతులు నిర్వహించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా, నగర అధ్యక్షులు కె.నాని, వై.యశ్వంత్ విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. తంగెళ్లమూడిలోని ఓ ప్రైవేటు పాఠశాలను రెండో శనివారం తెరిచి తరగతులు నిర్వహించారని ఆరోపించారు.

హామీల అమలుకు ప్రాధాన్యం: ఎంపీ

భీమడోలు, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల వంద శాతం అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా ఆయన సోమవారం పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. అనుభవం, సమర్థత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తోందన్నారు. విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. అంతకుముందు మహేశ్‌కుమార్‌కు నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. పెద్దిరాజు, భరత్, హరీశ్, శేషగిరి, బాలానందం, సత్యనారాయణ, యుగంధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పుట్టా మహేశ్‌కుమార్

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన శ్రేణులు దృష్టి సారించాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 50వ డివిజన్ నూతన కమిటీని సోమవారం నియమించారు. అధ్యక్షుడిగా ఎంపికైన ముత్యాల కొండబాబును అప్పలనాయుడు అభినందించి మాట్లాడారు. డివిజన్ కమిటీల నియామకంతో బూత్ స్థాయిలో పార్టీ బలం పెరిగిందన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళల భద్రతే లక్ష్యం: సీఐ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళల భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావు అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి మహిళా నర్సింగ్ కళాశాలలో సోమవారం శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినుల ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించారు.

శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా మాలిని

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రం (పురుష) ప్రిన్సిపల్‌గా మాలినిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు జీవో జారీ చేశారు. ఏలూరు డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న ఆమెను తొలుత గుంటూరు నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసరుగా గత నెల 27న బదిలీ చేశారు. ఆమె ఆ పోస్టులో చేరకుండానే శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా సవరించిన ఉత్తర్వులు తెచ్చుకోవడం గమనార్హం.

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: బడేటి

మహిళతో ముచ్చటిస్తున్న చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఇందులో భాగంగానే రాజధాని అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా 43వ డివిజన్‌లో సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యమిస్తానని ఆయన పేర్కొన్నారు. నాయకులు పెదబాబు, పార్థసారథి తదితరులు ఉన్నారు.

పీఎఫ్ రుణాల మంజూరుకు వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక నగరపాలక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు ఇవ్వాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భానుప్రతాప్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. గతంలో నగరపాలక సంస్థ కమిషనర్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలల విలీన ప్రక్రియలో డీఈవో పరిధిలోకి వెళ్లారన్నారు. వీరి పీఎఫ్ రుణాల సొమ్మును విద్యా శాఖకు బట్వాడా చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు భూక్యా రాము, ఇ.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులతో సంస్థ ఛైర్మన్, ఉపాధ్యాయులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ దిడ్ల యాంజిలో అన్నారు. స్థానిక వైఎస్సార్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 102 మందికి సోమవారం రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఏపీ ఎస్టీఏ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టీవెన్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఏటా పేద పిల్లలకు ఉచితంగా పుస్తకాలివ్వడం, సదుపాయాలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు.

బాదంపూడి(ఉంగుటూరు): బాదంపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయిని ముగుళ్ల అరుణకుమారి తన తల్లిదండ్రులు లక్ష్మయ్య, పుష్పకాంతం జ్ఞాపకార్థం ప్రింటర్ వితరణ చేశారు.

నిడమర్రు: పెదనిండ్రకొలను ఆదర్శ పాఠశాల-1 విద్యార్థులకు దాతలు రూ.40 వేలు విలువైన విద్యా సామగ్రి సోమవారం పంపిణీ చేశారు. జనసేన నాయకుడు పచ్చాకుల వాసు రూ.20 వేలు, చింతా వెంకటేశ్వరరావు(ఎర్రబాబు) రూ.20 వేలు వెచ్చించి రాత పుస్తకాలు, భోజన పళ్లాలు, గుర్తింపు కార్డులు, కుర్చీలు వితరణ చేశారు.

విద్యుత్తు స్మార్టు మీటర్లు వద్దు: సీపీఎం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్టు మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి హెచ్చరించారు. స్థానిక జిల్లా విద్యుత్తు భవన్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. నాయకులు కనకరావు, ఇస్సాక్, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి.. నమోస్తుతే..

ఏలూరు నగరం, గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక హనుమాన్ నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం పూజలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారిని వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

పార్వతీపరమేశ్వరులకు.. ఉంగుటూరు: చేబ్రోలులోని పార్వతీ సమేత రామలింగేశ్వరాలయంలో.. స్వామి, అమ్మవార్లకు సోమవారం శాకంబరి అలంకరణ చేశారు. ప్రాంగణాన్ని టన్ను కూరగాయలు, ఆకు కూరలతో ముస్తాబు చేశారు. కూరగాయలతో శివ లింగం ఏర్పాటు చేశారు. భక్తులు 100 కిలోల పిండి వంటలు సారెగా సమర్పించారు.

కోట శ్రీనివాసరావుకు నివాళి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సినీ, రాజకీయ రంగాల్లో కోట శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారని భాజపా నియోజకవర్గ కన్వీనర్ మాల తీరాణి అన్నారు. నారాయణపురంలో కోట చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. 2000లో భాజపా తరఫున నారాయణపురం-2 ఎంపీటీసీ సభ్యురాలిగా తాను పోటీ చేశానని, తనకు మద్దతుగా కోట శ్రీనివాసరావు ప్రచారం చేశారని గుర్తు చేశారు.

ఆర్టీసీ డీజిల్ యంత్రం మొరాయింపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలోని డీజిల్ యంత్రం మళ్లీ మొరాయించింది. దీనిద్వారా రోజూ 134 బస్సులకు డీజిల్ పోస్తుంటారు. బంకులో రెండు పంపులుండగా.. ఒకటి సోమవారం ఉదయం నుంచి పూర్తిగా పనిచేయడం లేదు. ఫలితంగా కొన్ని బస్సులకు మాత్రమే డీజిల్ పోస్తున్నారు. మిగతా వాటికి గ్యారేజీ బయట ఉన్న బంకుల్లో డీజిల్ పోయిస్తున్నారు. హెచ్‌పీసీఎల్ అధికారులకు సమాచారం అందించామని, వారు మరమ్మతులు చేయాల్సి ఉందని డిపో మేనేజరు బి.వాణి తెలిపారు.

సంపద.. సృష్టిద్దాం పద!

కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు అడుగులు

పెదపాడు మండలం వసంతవాడలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రం నిరుపయోగంగా మారిన చిత్రమిది. ఇక్కడ చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయకపోవడంతో.. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

'వట్లూరు- ఏలూరు మినీ బైపాస్, వట్లూరు- కలపర్రు, వట్లూరు- భోగాపురం మార్గాలు, ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద రోడ్డు అంచున చెత్తాచెదారం పడేస్తున్నారు. చెత్తకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో.. దట్టంగా పొగ కమ్మేసి ప్రయాణికులు, చోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో ఇంటింటా చెత్త సేకరించాలి. దాన్నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయాలి. తద్వారా సంపద సృష్టించాలి. పల్లెలను పరిశుభ్రంగా మార్చాలన్న సంకల్పంతో.. గత తెదేపా ప్రభుత్వం సంపద కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించి ప్రతి పంచాయతీలో కేంద్రాలు నిర్మించింది. వైకాపా అయిదేళ్ల పాలనలో వీటిని పూర్తిగా విస్మరించింది. పెదపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా, కొన్ని కేంద్రాలను నేటికీ వినియోగంలోకి తేలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది.

పెదపాడు మండలం కొత్తముప్పర్రులో రోడ్డు పక్కన చెత్తాచెదారాలు దహనం చేసిన దృశ్యమిది. గ్రామంలో సేకరించిన వ్యర్థాలు రహదారి పక్కన పోగుచేసి నిప్పు పెట్టడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

21 పంచాయతీల్లో.. మండలంలో 23 పంచాయతీలున్నాయి. కొనికి, ఏపూరు మినహా మిగతా 21 చోట్ల షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామాల్లో వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్త సేంద్రియ ఎరువుగా మార్చి, రైతులకు తక్కువ ధరకే విక్రయించనున్నారు. '21 గ్రామాల్లో షెడ్లు నిర్మించాం. కొనికి కేంద్రం న్యాయస్థానం పరిధిలో ఉంది. నిర్మాణాలు పూర్తయిన చోట సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకొస్తాం' అని ఈవోపీఆర్డీ సూర్యకుమార్ తెలిపారు.

ప్రగతి పథాన నడిపిస్తా: మోటేపల్లి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జాలిపూడి విశాల సహకార పరపతి సంఘాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తానని త్రిసభ్య కమిటీ ఛైర్మన్ మోటేపల్లి పవన్ హరిశ్చంద్ర కుమార్ తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయ ఆవరణలో సోమవారం కమిటీ ఛైర్మన్, సభ్యులు నందిగం రమేశ్, కోడి శివరామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. వారికి పలువురు పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి

ఏలూరు గ్రామీణ న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ భానుప్రతాప్, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సోమవారం వారు సమావేశమై మాట్లాడారు. ఎంఈ సురేంద్రబాబు, డీఈఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విశాల సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉంగుటూరు, ఏలూరు నియోజకవర్గాల్లోని 14 సొసైటీలకు నూతన కమిటీలు కొలువుదీరనున్నాయి. గణపవరం మండలంలో ఎనిమిదింటికి నాలుగు జనసేన, మూడు తెదేపా, ఒకటి భాజపాకు కేటాయించారు. నిడమర్రు మండలంలో మూడింటికి చిననిండ్రకొలను(తెదేపా) మొదటి జాబితాలో ప్రకటించగా.. మిగతా రెండింటిని జనసేనకు కేటాయించారు. భీమడోలు మండలంలో మూడింటికి తెదేపా 2, జనసేనకు ఒకటి కేటాయించారు. గుండుగొలను సొసైటీ సభ్యుడిది ఈకేవైసీ పూర్తికాకపోవడంతో అధికారికంగా ప్రకటించలేదు. భీమడోలు సొసైటీ ఛైర్మన్‌గా ఇప్పటికే ఆప్కాబ్, ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులుకు కేటాయించారు. ఏలూరు నియోజకవర్గంలో రెండు సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించారు.

సొసైటీ	ఛైర్మన్
భీమడోలు	గన్ని వీరాంజనేయులు
పూళ్ల	వట్టి ధర్మ వెంకట సత్యలక్ష్మీనారాయణ
అడవికొలను	గోలి సాయి పుండరీకాక్షుడు
పెదనిండ్రకొలను	కందులపాటి సత్యనారాయణ
గణపవరం	కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు
డీకే వల్లి	దాసం వెంకటేశ్వరరావు
కేశవరం	ఇందుకూరి చక్రవర్తి రాజు
కోమర్రు	గంగుమోగుల చిన రత్తయ్య
జల్లికొమ్మర	మద్దాల మహంకాళి
మొయ్యేరు	కానుమిల్లి వెంకటేశ్వరరావు
ముగ్గళ్ల	గురుజు నాగ సూర్య సత్యనారాయణ
కాశిపాడు	కొలనువాడ శ్రీనివాస రాజు
ఏలూరు నగరం	ఇర్ని అశోక్ కుమార్
శనివారపుపేట	కోనేరు వంశీ కృష్ణ

ఉద్యోగాల సాధనకు క్రీడలు దోహదం

దెందులూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగాలు సాధనకు క్రీడలు దోహదపడతాయని ప్రధానాచార్యుడు నతానియేలు అన్నారు. స్థానిక గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో 'లేటెస్ట్ ట్రెండ్స్.. హ్యాండ్‌బాల్ గేమ్'పై నాలుగు రోజుల పాటు జరగనున్న కార్యశాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హ్యాండ్‌బాల్‌కు సంబంధించి ప్రాక్టికల్, థియరీ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. బి.కృష్ణదీపిక, వలపుల సౌజన్య విషయ నిపుణులుగా వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

మాట్లాడుతున్న నతానియేలు

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరుకు చెందిన ధనకుమార్(44) కొన్నాళ్లుగా ఏలూరులో భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. రోజూ రాత్రుళ్లు లాడ్జిలు లేదా పని చేస్తున్న చోట నిద్రిస్తున్నారు. ఆదివారం రాత్రి ఓ భవనంపై నిద్రించి, ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు సర్వజన ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఒకటో పట్టణ ఎస్సై నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడిపై దాడి..: ఏలూరు నేరవార్తలు: కలిదిండి మండలం చింతలపర్రుకు చెందిన సాదరాల బ్రహ్మం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సొంత పనిపై హైదరాబాద్ వెళ్లి సోమవారం తెల్లవారుజామున ఏలూరు స్టేషన్‌లో రైలు దిగారు. కైకలూరు వెళ్లేందుకు పాత బస్టాండ్ వద్దకు వచ్చారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఎక్కడికి వెళ్లాలని బ్రహ్మంను అడిగారు. కైకలూరు వెళ్లాలని చెప్పడంతో.. తాము అటే వెళ్తామని వాహనం ఎక్కించుకున్నారు. నగర శివారు వైఎస్సార్ కాలనీ ప్రాంతానికి తీసుకెళ్లి యువకుడిపై దాడి చేసి ఫోన్, రూ.5500 లాక్కుని పరారయ్యారు. క్షతగాత్రుడ్ని స్థానికులు సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. గ్రామీణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో చోరీ.. పెదవేగి: విజయరాయికి చెందిన నాగేశ్వరరావు ఇంటికి తాళమేసి కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చి ఉద్యోగానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.25,400 కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గంజాయి తాగుతున్న అయిదుగురి అరెస్టు.. ఏలూరు నేరవార్తలు: డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టిన పోలీసులు.. నగర శివారు కండ్రికగూడెంలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో కొందరు గంజాయి తాగుతున్నట్లు గుర్తించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఈగల్ టీం పోలీసులు అక్కడికి చేరుకొని అయిదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

తల్లీకుమారుడికి గాయాలు.. ఉంగుటూరు: పెంటపాడు మండలం దర్శిపర్రుకు చెందిన శివ, అతడి తల్లి కనకరత్నం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కైకరం వద్ద ఆటో ఢీకొంది. తల్లీకుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి.

జూద స్థావరంపై దాడి.. పెదపాడు: గోగుంటలోని జూద స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు.

ప్రకటన

నాక్షుయింటు ఇండియన్ బ్యాంక్, రామచంద్రరావుపేట బ్రాంచి యొక్క బ్రాంచి మేనేజర్ గారి తరవున యావన్మందికి తెలియచేయునది ఏమనగా

ఈదర వెంకట్రావు, తండ్రి: పట్టాభిరామయ్య అనువారు మా బ్యాంక్ నందు 1985వ సం.లో హౌసింగ్ లోన్ శాంక్షన్ టికెట్ 5551: టి.పి ద్వారా రూ. 75,000/- లు తీసుకొని ఉన్నారు. సదరు లోన్‌కు హామీగా వారి తాలూకు ఈ క్రింద వివరించిన దస్తావేజులు ది. 06.03.1986 వ తేదిన డిపాజిట్ చేసినారు.

1. ది. 07.03.1985 వ తేదీన ఈదర పట్టాభిరామయ్య గారు, వారి కుమారులు వ్రాసుకున్న అన్ రిజిస్టర్డ్ పార్టిషయన్ లిస్టు.
2. ది. 10.01.1986 వ తేదిన ఈదర పట్టాభిరామయ్య గారు, వారి కుమారులు ఈదర వెంకట్రావు గారి పేర వ్రాసిన రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు డాక్యుమెంట్ నెం. 111/1986 ఏలూరు ఎస్.ఆర్.ఓ

సదరు పైన వివరించిన దస్తావేజులు బ్యాంక్ షిఫ్టింగ్ సమయంలో కనబడకుండా పోయినవి. కావున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు పైన వివరించిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల బ్యాంక్ వారికి అందజేయవలెను. సదరు దస్తావేజుల పై ఇతరులు ఏవిధమైన లావాదేవీలు జరిపినా చెల్లవని తెలియచేయటమైనది.

బి. గౌరీశంకర్ - అడ్వకేట్, ఏలూరు
అడవికొలను వారి వీధి, పవర్‌పేట, ఏలూరు-534002, పశ్చిమ గోదావరి జిల్లా. సెల్: 7416236226.

స్తంభాలు.. ప్రమాద కారకాలు!

గణపవరం- పిప్పర మార్గంలోని అగ్రహార గోపవరం, ముగ్గళ్ల కూడలి మధ్య విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఓ వైపు ఒరిగిపోయి ఉండటంతో.. చిన్నపాటి గాలికే కూలిపోయేలా కనిపిస్తోంది. ఫలితంగా పొలాలకు వెళ్లాలన్నా.. ఈ మార్గంలో ప్రయాణించాలన్నా రైతులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాలను సరి చేయాలని వారు కోరుతున్నారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలా.. పాతవాటినే సరిచేయాలన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని విద్యుత్తు ఏఈ వెంకన్నబాబు తెలిపారు. - న్యూస్‌టుడే, ముగ్గళ్ల(గణపవరం)

ప్రాంగణం.. మందుబాబుల నిలయం

గణపవరం బస్టాండు మీదుగా రోజూ వివిధ ప్రాంతాలకు సుమారు 90కి పైగా బస్సు సర్వీసులు నడుస్తుంటాయి. నిడమర్రు, గణపవరం మండలాలతో పాటు ఉండిలోని పలు గ్రామాలకు ప్రధాన కూడలి కావడంతో.. వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పొద్దుపోతే కొందరు ఆకతాయిలు ప్రయాణ ప్రాంగణాన్ని తమ అడ్డాగా మార్చుకొని మద్యం తాగుతున్నారు. సీసాలను అక్కడే పగులగొడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో ఆకతాయిలు, మద్యంబాబులకు అడ్డుకట్ట వేస్తామని, ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తామని ఎస్సై ఎం.మణికుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, గణపవరం

వంతెన.. నిలిచేనా!

ఏలూరు నగరంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి జూట్‌మిల్లు వరకున్న పైవంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల వంతెన పగుళ్లించింది. దీని పైనుంచి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు 80 ఏళ్ల కిందట నిర్మించిన వారధి బాగోగులను అధికారులు, పాలకులు విస్మరించారు. వంతెన కింద ఏపుగా చెట్లు పెరిగిపోయాయి. వాటిని తొలగించడంలో తాత్సారం ప్రదర్శిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు

దేవదాయ ధర్మదాయ శాఖ

టెండరు-కం-బహిరంగ వేలం పాట ప్రకటన

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కంసాలిగుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానమునకు చెందిన ఉంగుటూరు మండలం, కంసాలిగుంట గ్రామ శివారు, నల్లమాడు రెవెన్యూ గ్రామ ఆర్.యస్.నెం. 272/26లో సుమారు య.1.00ట్లు భూమిని సేద్యము (Damages for use and occupation of the land) చేసుకొనుటకు 2025-2026 ఒక సంవత్సరంనకు గాను ది.17.07.2025వ తేది గురువారం ఉదయం గం.11.00లకు శ్రీ స్వామి వారి దేవస్థానము వద్ద టెండర్-కం-బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు రూ.5000/-లు దరావతు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. మరిన్ని వివరములకు ఈ దిగువ సెల్ నెంబర్లకు సంప్రదించగలరు.

కంసాలిగుంట
తేది. 12.07.2025.

సం/- కార్యనిర్వహణాధికారి
సెల్ నెం. 9848295603, 9949499871

(c) eenadu

పోలవరం
•పోలవరం •చింతలపూడి

శ్రీవారి సేవలో ఏలూరు ఎంపీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి శ్రీవారి జ్ఞాపిక అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని బయనేరు, పర్రెడ్డిగూడెం, పట్టణ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ పీఆర్ అహ్మద్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే పనుల కోసం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు, అయ్యన్నకాలనీ, కొవ్వూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, ఎస్సీ కాలనీ, లక్ష్మీగణపతి టౌన్‌షిప్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. మైసన్నగూడెం, శ్రీనివాసపురం సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ, గృహ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: శంకుచక్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యసాయి ఫీడర్‌లో ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా నూతన విద్యుత్తు నియంత్రికల ఏర్పాటు తదితర పనుల నిమిత్తం ప్రగడవరం, తిమ్మిరెడ్డిపల్లి, ముక్కంపాడు, శ్రీరామపురం, వెంకంపాలెం గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని యర్రగుంటపల్లి 24 గంటల ఫీడర్ పరిధిలో కొత్త విద్యుత్తు నియంత్రికల పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మీ గ్రామంలో సమస్యలా ?

జంగారెడ్డిగూడెం డీఎల్పీవోతో రేపు ఫోన్ ఇన్

ఈనాడు మిత్రుడు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మీ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు ఉన్నాయా? వెలగని వీధి దీపాలు, తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? ఇంటి పన్నులు, పంచాయతీ స్థలాల ఆక్రమణలు ఉన్నాయా ? మీ గ్రామ పరిధిలో మీరు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జంగారెడ్డిగూడెం డివిజినల్ పంచాయతీ అధికారి ఎం. రాజు దృష్టికి తీసుకువెళ్లే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాలతోపాటు ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం గ్రామీణ, కామవరపుకోట మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మీరు నిర్ణీత సమయానికి ఫోన్ చేసి మీ పేరు, గ్రామం తెలియజేసి మీరు ఎదుర్కొంటున్న సమస్య డీఎల్పీవో రాజు దృష్టికి తీసుకెళ్లవచ్చు.

తేదీ : 16.7.2025 (బుధవారం) | సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ నంబరు : 83338 19912

బాబోయ్.. అక్కడ విధులా..!

భర్తీకి నోచుకోని ఐసీడీఎస్ ఖాళీలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు పరిధిలో పని చేసేందుకు ఉద్యోగులు వెనుకడుగు వేస్తున్నారు. కొయ్యలగూడెం సెక్టారులో బాధ్యతల నిర్వహణకు బెంబేలెత్తుతున్నారు. సీడీపీవో స్థానం ఏడాదిగా ఖాళీగా ఉంది. ఇటీవల బదిలీల నేపథ్యంలో ఖాళీ అయిన బయ్యనగూడెం సెక్టారు, పోలవరం, రామయ్యపేట సెక్టార్ల సూపర్‌వైజర్ల పోస్టుల్లోకి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో పొంగుటూరు సెక్టారు సూపర్‌వైజరుకే మండలంలోని మిగిలిన సెక్టార్ల బాధ్యతలు అప్పగించారు. పోలవరం సూపర్‌వైజర్‌కు రామయ్యపేట సెక్టారు అప్పగించారు. ఇటీవల ఆమె కొయ్యలగూడెం మండలం బదిలీ అయ్యారు. రిలీవ్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆమె అక్కడే ఉన్నారు.

కొరవడిన పర్యవేక్షణ.. కొయ్యలగూడెం ఇన్‌ఛార్జి సీడీపీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బుట్టాయగూడెం సీడీపీవో తులసి ఏలూరు జిల్లా కార్యాలయానికి బదిలీ అయినా ఆ బాధ్యతలను ఇప్పటికీ చూస్తున్నారు. అధికారుల క్షేత్రపర్యటనలు లేకపోవడంతో కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. ప్రాజెక్టులో పోషణ్ 2.0 కార్యక్రమంలో భాగంగా సక్షం పథకానికి ఎంపికైన 43 కేంద్రాల్లో అమలవుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించే నాథులు లేరు. లబ్ధిదారులకు ముఖ ఆధారిత గుర్తింపు విధానంలో పోషక పదార్థాల సరఫరాకు సంబంధించి నివేదికలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, ఈకేవైసీ నమోదు, తదితర అంశాల్లో ప్రాజెక్టు పని తీరు అట్టడుగునకు దిగజారడంపై అధికారుల్లో అసహనం వ్యక్తం అవుతోంది.

మండలంలో ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలు, మినీకేంద్రాల వివరాలు		
కొయ్యలగూడెం	79	18
పోలవరం	70	19
మూడేళ్ల లోపు చిన్నారులు 3,206		
పూర్వప్రాథమిక 2,677		
గర్భిణులు 603		
బాలింతలు 454		

ఉద్యోగుల వెనుకడుగు.. కొయ్యలగూడెం ప్రాజెక్టు పరిధిలో ముఖ్యంగా కొయ్యలగూడెం సెక్టారు పరిధిలో పని చేయడానికి సూపర్‌వైజరు స్థాయి ఉద్యోగులెవరూ ఆసక్తి కనబర్చడం లేదని తెలిసింది. అవసరమైతే పక్క సెక్టార్లకు అదనపు బాధ్యతలు అప్పగించినా చేయడానికి సిద్ధమంటూ, కొయ్యలగూడెం బాధ్యతలకు ససేమిరా అంటున్నారని సమాచారం. తాజాగా బదిలీపై నియమితులైన ఒక అధికారిణి సైతం కొయ్యలగూడెం బాధ్యతలను చేపట్టడానికి తటపటాయిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఉద్యోగులను బుజ్జగించడం ఉన్నతాధికారులకు శిరోభారంగా మారిందంటున్నారు. మండల కేంద్రం లోనే ప్రాజెక్టు కేంద్ర కార్యాలయం ఉండటంతో తరచూ అదనపు పనులు తలకెత్తుకోవాల్సి ఉంటుందన్నదే వారి ఆందోళన.

★ పదోన్నతులలో భాగంగా సీడీపీవో స్థానం త్వరలోనే భర్తీ అయ్యే అవకాశం ఉందని ఇన్‌ఛార్జి సీడీపీవో తులసి అన్నారు. సెక్టార్ల సూపర్‌వైజర్ల పోస్టులను బదిలీల్లో భాగంగా భర్తీ చేస్తారని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల విభజన

మాట్లాడుతున్న తహసీల్దార్ సాయిరాజు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలంలో ఎల్ఎన్డీ పేట, కొత్తపట్టిసీమ, పోలవరం పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓటర్లు పైబడిన బూత్‌లు నాలుగు ఉన్నాయని తహసీల్దార్ సాయిరాజు చెప్పారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కేంద్రాలను రెండు చొప్పున విడదీయడం జరిగిందని, పోలింగ్‌కు అనుకూలంగా పక్కనే ఉన్న గదులను ఉపయోగించుకుంటామని తహసీల్దార్ వివరించారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

రూ.5.80లక్షల విలువైన ఎరువులు సీజ్

నిల్వలను ఆరా తీస్తున్న అధికారులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎరువుల దుకాణాల్లో రాష్ట్ర స్థాయి విజిలెన్సు అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొయ్యలగూడెం, పొంగుటూరు గ్రామాల్లో మూడు హోల్‌సేల్, రెండు రిటైల్ దుకాణాల్లో జరిపిన తనిఖీల్లో అధికారిక అనుమతి పత్రాలు లేని సుమారు రూ.5.80 లక్షల విలువైన పలు రకాల ఎరువుల నిల్వలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. తనిఖీల్లో విజయవాడ విజిలెన్సు సహాయ సంచాలకుడు బి.వెంకటేశ్వర్లు, విజయవాడ విజిలెన్సు సీఐ మధు, మండల వ్యవసాయాధికారి పోశారావు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అక్రమ బదలాయింపులపై ఎమ్మెల్యే ఫిర్యాదు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: అసైన్డ్ భూముల అక్రమ బదలాయింపులు జరుగుతున్నాయని వచ్చిన ఆరోపణలపై గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్పందించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కలెక్టర్‌కు రాత పూర్వకంగా విన్నవించారు. ద్వారకాతిరుమల మండలం కొమ్మరలో అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా మార్చడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రహదారుల నిర్మాణానికి సహకరించండి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్, తెదేపా నాయకులతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి- గురుభట్లగూడెం, లింగపాలెం- పుప్పాలవారిగూడెం, ఏలూరు- జంగారెడ్డిగూడెం, చింతలపూడి- ఏలూరు, చింతలపూడి- మేడిశెట్టివారిపాలెం రహదారుల పనులు చేపట్టాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులను మరమ్మతులు, ఇతర పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కామవరపుకోట మండలం ఆడమిల్లిలో వంతెన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనికి అవసరమైన నిధులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్, నాయకులు

వినతుల స్వీకరణ

చింతలపూడి, న్యూస్‌టుడే: పింఛను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు అయ్యేలా చూసే బాధ్యత తనదని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి సోమవారం ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. స్థానికంగా ఉన్న సమస్యలను నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

కుమారుడిపై వృద్ధ దంపతుల ఫిర్యాదు

మీ కోసంలో అర్జీల వెల్లువ

వృద్ధ దంపతుల ఆవేదన ఆలకిస్తున్న ఆర్డీవో రమణ

జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, న్యూస్‌టుడే: తమ భూమిలోని పంటను తన కుమారుడు సుధాకర్‌రెడ్డి తీసుకోనీయకుండా అడ్డుకుంటున్నాడని బుట్టాయగూడెం మండలం పందిరిమామిడిగూడెం గ్రామానికి చెందిన రైతు కెల్లెల సోమిరెడ్డి ఆర్డీవో ఎంవీ రమణకు సోమవారం నిర్వహించిన మీకోసంలో ఫిర్యాదు చేశారు. దీంతో కొద్ది నెలలుగా జీలుగుమిల్లిలోని తన కుమార్తె వద్ద ఉంటున్నట్లు సోమిరెడ్డి పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీవో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగిన మీకోసంలో సోమవారం పలు సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. బుట్టాయగూడెంలోని తన పొలంలోకి వెళ్లనీయకుండా కొందరు అడ్డుకుంటున్నారని సంధిని కృష్ణారావు ఫిర్యాదు చేశారు. జైనవారిగూడెంలోని తన భూమిని మరొకరి పేరున ఆన్‌లైన్ చేశారని కలపాల కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుట్టాయగూడెంలో తనకున్న 4.94 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ వెంకటరామారావు అర్జీ ఇచ్చారు. తన కుమారుడు తనను ఇంటి నుంచి గెంటి వేశాడని రక్షణ కల్పించాలని జంగారెడ్డిగూడెంకి చెందిన కె.ప్రభావతి ఫిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన పలు అర్జీలను ఆర్డీవో బాధితుల నుంచి తీసుకున్నారు.

ఆకతాయిల బెడదపై .. **జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో గ్రామస్థులు పలువురు ఫిర్యాదు అందించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల బెంచీలపై నిరంతరం కూర్చుని మద్యం తాగుతూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ స్లీవజోజికి వినతి పత్రాన్ని ఇచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలను సహించం: సీఐ

మాట్లాడుతున్న సుభాష్

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేరాలకు పాల్పడే వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. మధ్యవర్తిత్వం మాటున పంచాయతీల పేరుతో డబ్బులు వసూలు చేసే వారిపై బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు అందితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వ్యభిచార గృహాలు, గంజాయి రవాణా, విక్రయం తదితరాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. వేధింపులపై 112, శక్తి యాప్ ద్వారా ఫిర్యాదులు చేస్తే ఆకతాయిల పనిపడతామని, సమాచారం అందించిన బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

బైపాస్ ఉన్నా.. పట్టణం వైపే..

చింతలపూడిలో తీరని ట్రాఫిక్ కష్టాలు

పట్టణంలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఆయిల్‌పామ్ గెలల లారీ

చింతలపూడి, న్యూస్‌టుడే: భారీ వాహనాలు చింతలపూడి పట్టణంలోకి రాకుండా బయట నుంచి వెళ్లేలా పదేళ్ల కిందటే బైపాస్ రహదారి నిర్మించారు. కానీ భారీ వాహనాలన్నీ పట్టణంలోకి వస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ గెలల లారీలు నిత్యం 500 వరకు సీతానగరం కర్మాగారానికి వెళ్తుంటాయి. లింగపాలెం, కామవరపుకోట, చింతలపూడి మండలాల నుంచి నిత్యం ఈ లోడ్ లారీలు పెద్ద సంఖ్యలో తిరుగుతుంటాయి. లారీల చుట్టూ మెస్‌లు కట్టి 10 నుంచి 20 టన్నులు అధిక లోడ్‌తో పట్టణంలోనికి వస్తున్నాయి. ఈ లారీల వల్ల ప్రధాన రహదారి గోతులు మయంగా మారడమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్నాయి. ఇటీవల గెలలు లారీల నుంచి జారి ఒక వ్యక్తి తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. సాయిస్ఫూర్తి ఆసుపత్రి సమీపంలో లోడ్ లారీ తిరగబడటంతో వాహనదారులు ఆందోళన చెందారు. వీటిని పట్టణంలోకి అనుమతించకుండా బైపాస్ రహదారి మీదుగా సీతానగరం కర్మాగారానికి వెళ్లేలా గతంలో పోలీసులు ఆదేశాలు జారీ చేసినా అవి బుట్టదాఖలయ్యాయి. ఉదయం, సాయంత్రం పాఠశాలల బస్సులు తిరిగే సమయంలో లారీల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై ఎస్సై సతీశ్‌ను వివరణ కోరగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

వరద తగ్గి.. తెరుచుకున్న దారులు

కుక్కునూరు, వేలేరుపాడు, న్యూస్‌టుడే: గోదావరిలో వరద తగ్గిపోయింది. సోమవారం ఉదయం వరకూ 28 అడుగులతో వరద ప్రవహిస్తుండటంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు రహదారులు నీటమునిగే ఉన్నాయి. సోమవారం సాయంత్రానికి వరద 21 అడుగులకు తగ్గిపోవటంతో రహదారులు కొన్ని బయటపడ్డాయి. కుక్కునూరు-వేలేరుపాడు మార్గంలోని గుండేటివాగు వంతెన సోమవారం ఉదయం వరకూ నీటిలోనే మునిగి ఉంది. సాయంత్రానికి వరదనీరు తగ్గిపోవటంతో వంతెన బయటపడింది. దీంతో గత నాలుగు రోజులుగా వయా నల్లకుంట మీదుగా చుట్టుతిరిగి వెళ్తున్న ప్రయాణికులు, సాయంత్రం నుంచి ఈ రహదారిపై పయనిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని ఎద్దువాగు వంతెన ఇంకా బయటపడలేదు. వరదనీరు కొద్దిగా ఉండటంతోపాటు బురద పేరుకుపోవటంతో ఆ దారి ప్రయాణానికి అనుకూలంగా మారలేదు.

బాలిక అదృశ్యం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యంపై జంగారెడ్డిగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు...జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఓ బాలిక (16) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి భోజనం అనంతరం బాలిక, కుటుంబసభ్యులు ఇంట్లో నిద్రించారు. తిరిగి ఉదయం ఆమె తల్లి లేచి చూసేసరికి బాలిక కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో బాలిక తల్లి సోమవారం పోలీసులను ఆశ్రయించారు.

వ్యక్తి.. టి.నరసాపురం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ ఈ నెల 7వ తేదీ నుంచి కనిపించడం లేదని ఎస్సై జయబాబు సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మీరా సాహెబ్ ఇటీవల పలు అనారోగ్య సమస్యలతో మతిస్థిమితం లేకుండా పోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అతడి భార్య మాబూ సుభాని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవి ఇవి అన్నీ

ఉన్నత విద్యావంతులను చేయాలి.. బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ముస్లిం సోదరులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ముస్లిం ఐకాస జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ సభ్యుడు షేక్ ముస్తఫా కోరారు. దొరమామిడి మసీద్‌లో ముస్లిం పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయండి.. కుక్కునూరు, న్యూస్‌టుడే: మండలంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనీ, ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ కోరింది. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

ఓటు నమోదుపై అవగాహన.. జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఓటు నమోదు, మార్పులు, చేర్పులు నిత్య ప్రక్రియ అని తహసీల్దారు స్లీవజోజి పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ మండలంలోని బీఎల్‌వోలకు సోమవారం స్థానిక పురపాలక కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పరామర్శ.. చింతలపూడి, న్యూస్‌టుడే: మండలంలోని ముక్కంపాడు గ్రామ తెదేపా నాయకుడు మానేపల్లి రాజారావు కుమారుడు కిశోర్‌ను విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రిలో ఏపీ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత సోమవారం పరామర్శించారు. తెదేపా నుంచి అన్ని సహాయ సహకారాలు అందేలా చూస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు.

లాడ్జిపై పోలీసుల దాడి.. పోలవరం, న్యూస్‌టుడే: బంగారమ్మపేట సమీపంలో రహదారి పక్కన ఉన్న లాడ్జిలో జూదం ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి పేక ముక్కలతోపాటు రూ.5,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ చెప్పారు.

విద్యుత్తు నియంత్రికలో రాగి తీగ చోరీ.. టి.నరసాపురం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: టి.నరసాపురం శివారులోని పంట పొలాల్లో రైతు నాగరాజుకు చెందిన విద్యుత్తు నియంత్రికను పగలగొట్టి అందులోని రాగి తీగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై జయబాబు సోమవారం తెలిపారు. విద్యుత్తుశాఖ ఏఈ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వసతి గృహానికి భవనం నిర్మించాలి

ధర్నా చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెంలోని గిరిజన బాలుర వసతి గృహానికి భవనం నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రధాన రహదారిపై కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూషణం మాట్లాడుతూ విద్యార్థులు వసతికి చాలా అవస్థలు పడుతున్నారని వాపోయారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

రూ.8 లక్షలతో తాగునీటి పథకం

పనులకు భూమిపూజ చేసిన రామారావు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కుంతలగూడెంలో తాగునీటి పథకం పనులకు ఎంపీపీ గంజిమాల రామారావు సోమవారం భూమిపూజ చేశారు. మండల పరిషత్తు నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన ఈ పథకాన్ని ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని ఎంపీపీ తెలిపారు. వర్షాలకు వరద నీటి బెడద నివారణకు వీలుగా రూ.3 లక్షల అంచనా వ్యయంతో డ్రెయిన్ నిర్మాణ పనులను సర్పంచి పులి నాగలక్ష్మితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వేలేరుపాడు మండలం బోళ్లపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న సున్నం ముత్యాలును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.

సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా..

ఇంటింట ప్రచార కార్యక్రమంలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు కావాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు అన్నారు. రాజులకాలనీ పరిధిలోని 44, 45 పోలింగ్ బూత్ కమిటీలు, 52వ బూత్ పరిధిలోని కన్వీనర్లతో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, నాయకులు మహ్మద్ రఫీ, జవ్వాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ములగలంపాడు గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అనంతరం స్థానిక నాయకులు బొల్లిన పుల్లారావు ఇంటి వద్ద జరిగిన ముఖ్య కార్యకర్తలు సమావేశంలో మాట్లాడారు.

బాధితురాలికి పలువురి ఆపన్నహస్తం

సాయం అందిస్తున్న దాతలు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయురాలిగా మారిన మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన పద్దం మేరీ అనే ఆశ కార్యకర్త కుటుంబానికి సోమవారం పలువురు ఆపన్నహస్తం అందించారు. ఆదివాసీ మెడికల్, ఆరోగ్య ఉద్యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ గల బియ్యం, దుస్తులు, వంట పాత్రలు పంపిణీ చేశారు. వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రూ.20,500 నగదు, రుద్రంకోటకు చెందిన పలివెల రాజు రూ.1000 అందించారు. జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య సహాయకుడు కూరం ప్రసాద్ తన వంతు సాయంగా రూ.5 వేలతో మంచం, మంచినూనె, కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అగత, ఆరోగ్య సహాయకుడు శ్రీరాములు దొర, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆయకట్టు రైతుకు అన్యాయం'

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పెదవాగు ప్రాజెక్టు వరదల్లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపించి అన్యాయం చేసిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ అన్నారు. చాగరపల్లిలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్ల ముత్యాలరావు, కట్టం ముత్యాలరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కాలువ గండ్లతో పంటలకు నష్టం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ పరిధిలోని ఇసుక కాలువకు మూడు సంవత్సరాల కిందట పడిన గండ్లు నేటికీ పూడ్చకపోవడంతో ఏటా పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆయకట్టు రైతులు సోమవారం మీ కోసం కార్యక్రమంలో తహసీల్దార్ సాయిరాజుకు వినతి పత్రం అందజేశారు.

స్పందించిన మానవత్వం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడులో సోమవారం మరణించిన అనాథ వృద్ధురాలు గెల్లా సత్తెమ్మ(80) అంత్యక్రియలను కొయ్యలగూడెం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు నిర్వహించారు. స్థానికుల సహకారంతో శాంతిరథం వాహనంలో మృతదేహాన్ని కొవ్వూరు గోదావరి ఒడ్డున ఉన్న దహన వాటికకు తరలించిన సంస్థ సభ్యులు దహన సంస్కారాలను కూడా పూర్తి చేయడం గమనార్హం. వృద్ధురాలి అంతిమ సంస్కారాల నిమిత్తం గ్రామస్థులు కాకర్ల బుజ్జి, గెడా సుబ్బారావు రూ.7వేల నగదు సమకూర్చారు.

నూతన ప్రారంభోత్సవ ఆహ్వానము

జంగారెడ్డిగూడెంలో ఇప్పుడు 50 బెడ్స్ సదుపాయంతో అత్యాధునిక లాబ్స్ సౌకర్యంతో అన్ని రకముల గుండె సంబంధిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలియజేయుటకు సంతోషిస్తూ...

నేడు 15-07-2025 ఉదయం 11-00 గం॥లకు

డా॥ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్

ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న ముఖ్య అతిథులు
ఏలూరు పార్లమెంట్ సభ్యులు గౌ॥ శ్రీ పుట్టా మహేష్‌కుమార్ గార్కి
చింతలపూడి శాసనసభ్యులు గౌ॥ శ్రీ సొంగా రోషన్ కుమార్ గార్కి
పోలవరం శాసనసభ్యులు గౌ॥ శ్రీ చిర్రి బాలరాజు గార్కి
మరియు అందరికీ స్వాగతం - సుస్వాగతం.

డా॥ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్
విజయకృష్ణ రెసిడెన్సీ, లోటస్ లేఔట్, అశ్వారావుపేట రోడ్,
వేగవరం, జంగారెడ్డిగూడెం, ✆ 91775 78577

Dr. S.VENU
MD, DNB (Cardiology)

Dr. P.SREEJA
M.S., (Ophthal)

Best wishes from: Dr. P.Vijaya Bhaskara Reddy, M.S., (Ophthal)

నూజివీడు
● నూజివీడు ● కైకలూరు

సీతమ్మకు సారె సమర్పణ

చాట్రాయి, న్యూస్‌టుడే: కోటపాడులోని కోదండ రామాలయంలోని సీతమ్మవారికి సోమవారం పలువురు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. గ్రామంలో ఊరేగింపుగా వచ్చారు. అనంతరం ఆలయ పూజారి పవన్ శర్మ ఆధ్వర్యంలో సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

సారె అందజేస్తున్న మహిళలు

రహదారి నిబంధనలతో సురక్షిత ప్రయాణం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం సాధ్యమని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డు వద్ద పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, మద్యం తాగి, అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనల్లో వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కైకలూరు, కలిదిండి, న్యూస్‌టుడే: చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం మంగళవారం పలు గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జీబీ శ్రీనివాస్ తెలిపారు. కైకలూరులోని కోరుకొల్లు రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, చిన మసీదు, షాదీఖానా, అగ్రహారం రోడ్డు ప్రాంతాల్లో, కలిదిండి మండలంలో పోతుమర్రు, తాడినాడ, ఇబ్రాంపురం, గొల్లగూడెం, సున్నంపూడి, చినతాడినాడ, కలిదిండి, వెంకటాపురం, గురవాయిపాలెం, లోడిదలంక, కొండంగి, గోపాలపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

ఐటీఐ ప్రవేశాల గడువు 20 వరకు పొడిగింపు

నూజివీడు రూరల్: ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈనెల 20 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ రజిత తెలిపారు. 21న ధ్రువపత్రాల పరిశీలన, 24న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08656-232711 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముందు పాక.. తర్వాత శాశ్వత పాగా!

● ఎంఎన్‌కే రోడ్డు అంచుల్లో ఆక్రమణలు ● పట్టించుకోని అధికారులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడులో రహదారుల వెంబడి ఆక్రమణలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులను అదేమని ప్రశ్నిస్తే.. సరిపడా సిబ్బంది లేరని, ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదని సాకుగా చెబుతున్నారు. ఇదే అదనుగా ఆక్రమణదారులు రహదారి మార్జిన్‌లలో ఏకంగా దుకాణాలు నిర్మించేస్తున్నారు.

తుక్కులూరు- నూజివీడు మార్గంలో రహదారి వెంబడి ఇలా..

మార్కెట్ కమిటీ గోడ సమీపంలో..

మచిలీపట్నం- నూజివీడు - కల్లూరు(ఎంఎన్‌కే) రహదారిగా పిలుస్తారు. హనుమాన్‌జంక్షన్ వద్ద రైల్వే వంతెన నుంచి ఈ రహదారి కల్లూరు వరకు విస్తరించి ఉంది. నూజివీడు పట్టణంలో నుంచి దీనిని నిర్మించారు. బైపాస్ రహదారి నిర్మాణం జరగడంతో ప్రస్తుతం తుక్కులూరు సమీపం నుంచి పోతురెడ్డిపల్లి క్రాస్ రోడ్ వైపు వాహనాలు వెళ్తున్నాయి. తుక్కులూరు నుంచి నూజివీడు వైపు వచ్చే రహదారిని ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ పర్యవేక్షిస్తోంది. అయితే దీనికి ఇరువైపులా పదుల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. తాత్కాలికంగా తాటాకుల పాక లేదా పరదాలతో ప్రారంభమైన వీరి దందా ఏకంగా షెడ్లు నిర్మించే వరకు వచ్చింది. ఇదే పరిస్థితి పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద చోటు చేసుకుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో మార్కెట్ కమిటీ గోడలకు సమీపంలో ఆక్రమణలు వెలుస్తున్నాయి.

పన్ను వసూలు చేస్తూ..

పురపాలక సంఘం ఆక్రమణలు తొలగించకుండా టెంపరరీ ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్ అంటూ వసూలు చేస్తుండటంతో విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తు మీటర్లు మంజూరు చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు ఏకంగా శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. ఫలితంగా ఎదురెదురుగా వాహనాలు వస్తే.. చోదకులకు అవస్థలు తప్పడం లేదు.

గతంలో రూ.లక్షలు ఖర్చు చేసి..

గతంలో ఎంఎన్‌కే రహదారి నిర్మాణం సమయంలో సీతారామపురం, మర్రిబంధం, మీర్జాపురం, గొల్లపల్లి, మొర్సపూడి, తుక్కులూరు, అన్నవరం, హనుమంతులగూడెం, మిట్టగూడెం, లీలానగర్ క్రాస్ వరకు ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. ఈ గ్రామాల మధ్య హైవే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణదారులు మళ్లీ ఆక్రమించి వ్యాపారాలు చేసేస్తున్నారు. ఎంఎన్‌కే రహదారి పరిధిలో హైవే, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ఆక్రమణలు తొలగించాల్సి ఉందని పలువురు చెబుతున్నారు. 'సిబ్బంది తక్కువగా ఉన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తా.' అని ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నూజివీడు :80085 74698 కైకలూరు :73060 88555
ముసునూరు:93983 81268 కలిదిండి :90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే: ? కాపుల వీధిలో చెత్త సేకరణ చేయడం లేదు. వ్యర్థాలు దుర్వాసన వస్తున్నాయి. - వాసంతి
✔ చర్యలు తీసుకుంటాం. - వై.ప్రసాద్ పంచాయతీ ఈవో

కలిదిండి, న్యూస్‌టుడే: ? సోనారుద్రవరం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. ఇబ్బందిగా ఉంటుంది. - రాజు
✔ పని చేయని దీపాలు తొలగించి, కొత్తవి ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం. - రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి

'అన్నదాత సుఖీభవ' మంజూరుకు వినతి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గతంలో రైతు జాబితాలో నగదు జమైందని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అదే రైతుల పేర్లు కనిపించకపోవడంతో అన్నదాత సుఖీభవ నిధులు పడే పరిస్థితి లేకుండా పోయిందని పాతరావిచర్ల రైతులు నూజివీడు సబ్‌కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌కు సమస్యను విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసంలో సర్పంచి బసవరాజు అప్పుస్వామి నాగేశ్ ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం అందించారు. అన్నదాత సుఖీభవ వర్తించేలా చూడాలని కోరారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సబ్‌కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న నాగేశ్ తదితరులు

18న మండల సమావేశం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటలకు ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.భార్గవి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలో ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మె చేస్తున్న దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

వీధి దీపాల ఏర్పాటుకు డిమాండ్

ముసునూరు, న్యూస్‌టుడే: రమణక్కపేటలో మూడు నెలలకు పైగా వీధి దీపాలు వెలగడం లేదని మహిళలు సోమవారం సాయంత్రం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. మూడు నెలలు పైగా వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలంలో పాముల సంచారం ఎక్కువగా ఉందని వాపోయారు. సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు పంచాయతీ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం దేశం కోసం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నూజివీడు న్యాయస్థానం పరిధిలో నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ తెలిపారు. సోమవారం సాయంత్రం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం రమేష్, ఇతర న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే పెదఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఒ.అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.త్రివేణి, న్యాయవాదులు హరిబాబు, బసవరాజు రామకృష్ణ, డిక్సన్, ఎస్‌కే ప్రసాద్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

కైకలూరు, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతో కేసులు సత్వరం పరిష్కారం లభిస్తుందని న్యాయవాదులు మాదాల సత్యనారాయణ, దేవరపల్లి శివప్రసాద్, కోటయ్య తెలిపారు. మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో స్థానిక సివిల్ కోర్టుల్లో ఏర్పాటు చేసిన మీడియేషన్ కేంద్రం ఉపయోగాలపై కక్షిదారులకు సోమవారం న్యాయవాదులు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా అనేక కోర్టుల్లో వేలాది సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్న తరుణంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మీడియేషన్ కేంద్రం ద్వారా సమ న్యాయంతో సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఈమేరకు మంగళవారం న్యాయమూర్తుల ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై కైకలూరులో ఉదయం 9 గంటల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మీడియేషన్ కేంద్రం అందించే సేవలపై ముద్రించిన కరపత్రాలను కక్షిదారులకు అందించారు.

కరపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

నూజివీడు: సమావేశంలో న్యాయమూర్తి శైలజ

గ్రామీణ ప్రాంతాలకూ సేవలు విస్తరించాలి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలని ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ జిల్లా 3020 పూర్వ గవర్నర్ రావూరి సుబ్బారావు తెలిపారు. ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. 2025-26 సంవత్సరానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా రొటేరియన్ సజ్జా శశికాంత్‌ను రెండోసారి ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మండా శ్రీనివాసరావు, కోశాధికారి పీడీ వెంకటరత్నంను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథి సుబ్బారావు మాట్లాడుతూ. . నిస్వార్థంగా సేవ చేయాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షుడ్ని, సభ్యులను సత్కరించారు.

శశికాంత్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రైవేటులో పుస్తకాల పేరుతో దందా: ఏఐఎస్ఎఫ్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నియోజకవర్గంలో పుస్తకాల పేరుతో పెద్ద ఎత్తున దందా నిర్వహిస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తూ ప్రైవేటు విద్యా సంస్థలకు కొమ్ము కాయడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ అన్నారు. ఆగిరిపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా పుస్తకాల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు సంతోశ్, ఆకాశ్, వరప్రసాద్ ఆ పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారని, యజమాన్యం విద్యార్థి నాయకులపై అసభ్య పదజాలంతో దూషణకు దిగడం హేయమైన చర్య అన్నారు. దీంతో ఆగిరిపల్లి ఎంఈవో కార్యాలయం ముందు సోమవారం నిరసన తెలిపారు. దీనిపై ఎంఈవోకు ఫిర్యాదు చేసినా ప్రైవేటు విద్యాసంస్థకు కొమ్ముకాశారని, దీనిని జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

జనసేన బలోపేతానికి కృషి: జయమంగళ

ముదినేపల్లి, (కలిదిండి), న్యూస్‌టుడే: జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తెలిపారు. ముదినేపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ కిట్లు అందించారు. అనంతరం జబీలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేతా సాయి, తుమ్మ నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెండు కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జనసేన మండలాధ్యక్షుడు బెల్లపుకొండ వెంకట్రావు, నాయకులు యర్ర కృష్ణ, వి.శ్రీను, తాడి ఇంద్ర, అంజె నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటరమణ

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని గెయిల్ ఇండియా డీజీఎం కృపాశంకర్ తివారి అన్నారు. ఈదర జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ గెయిల్ ఇండియా లిమిటెడ్ కొండపల్లి వారు స్వచ్ఛత పక్వాడ వారోత్సవాల సందర్భంగా శుభ్రపరిచే కిట్లు, వస్తువులు, విద్యార్థినులకు రుతు రుమాళ్లు అందజేశారు.

పోల్‌రాజ్ పూడింది.. గొంతెండుతోంది!

చినతాడినాడ, కాళ్లపాలెం (కలిదిండి), న్యూస్‌టుడే: పోల్‌రాజ్ కాలువ పూడిపోవడంతో శివారు గ్రామాలకు తాగు, సాగు నీరు చేరడం లేదు. కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ, చినతాడినాడ గ్రామాలకు సాగు, తాగునీటికి పోల్‌రాజ్ కాలువే ప్రధాన వనరుగా ఉంది. ఈ కాలువ పూడిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో మంచినీటి చెరువు నింపడానికీ కష్ట పడాల్సి వస్తోంది. చినతాడినాడలోని పల్లెపాలెం గ్రామస్థులు సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా నుంచి తాగునీరు కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ విషయమై జలవనరుల శాఖ వింజరం సెక్షన్ ఏఈఈ కుంభా సత్యనారాయణ మాట్లాడుతూ.. కొండూరు నుంచి చినతాడినాడ వరకు పోల్‌రాజ్ కాలువ తవ్వకానికి రూ.12 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న చినతాడినాడ పల్లెపాలెం వాసులు

కాళ్లపాలెం- చినతాడినాడ మధ్యలో కాలువ ఇలా..

అల్లుకున్న నిర్లక్ష్యం.. సరఫరాకు తరచూ అంతరాయం

తరచూ విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్నా.. సిబ్బందికి కనువిప్పు కలగడం లేదు. స్తంభాలు, తీగల నిర్వహణపై అధికారులు దృష్టి సారించడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా విద్యుత్తు నియంత్రికల చుట్టూ ముళ్ల చెట్లు పెరుగుతున్నాయి. ముసునూరు సినిమా థియేటర్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక చుట్టూ కంప చెట్లు, తీగజాతి పాదులు అల్లుకోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గాలులకు చెట్ల కొమ్మలు తీగలకు తగిలి సరఫరా నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై లైన్‌మేన్ రమేశ్ మాట్లాడుతూ. . వెంటనే తీగలు తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ముసునూరు

అన్నవరంలో అంధకారం!

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి శివారు అన్నవరం కాలనీ వారం రోజులుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రధాన రహదారులు చీకటిగా మారాయి. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గత వైకాపా హయాంలో అవగాహన రాహిత్యంతో రెండు శ్మశాన వాటికల వద్ద ఇళ్లస్థలాలు కేటాయించింది. సుమారు మూడు వందల మందికిగాను సుమారు 110 ఇళ్ల వరకు నిర్మించుకున్నారు. అయితే ఒక్క రహదారి గాని, డ్రెయినేజీ గాని నిర్మించకపోవడంతో చినుకు పడితే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో విష పురుగులు, పాములు సంచారం విపరీతంగా ఉన్నాయి. నిర్మించుకున్నాక తప్పదని బిక్కుబిక్కుమంటూ అలానే కాలం గడుపుతున్నారు. వాటికి తోడు ఇప్పుడు వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జి.రమేశ్ మాట్లాడుతూ.. మొదట ఫ్యూజులు పోవడంతో వేశామని, అయినా వెలగడం లేదని, అందుకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేయించి తెస్తున్నామని, వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన

చాట్రాయి, న్యూస్‌టుడే: సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే లక్ష్యంతో పని చేస్తున్నామని తెదేపా యువ నాయకుడు కొలుసు నితిన్ కృష్ణ అన్నారు. నరసింహారావుపాలెం, పిట్టలవారిగూడెం గ్రామాల్లో సోమవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని. . ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు.

పథకాలు వివరిస్తున్న కొడాలి, నాయకులు

కైకలూరు, న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో సోమవారం కైకలూరులో 112, 113, 119 బూత్‌ల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఏడాది పాలనపై అభిప్రాయాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం పిన్నమరెడ్డిపల్లిలో తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ★ ఈదరలో తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం కుమార్, నాయకులు బత్తుల సాంబిరెడ్డి, కె.వీరనాగరాజు పాల్గొన్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జనం మెచ్చేలా కూటమి ఏడాది పాలన సాగిందని, పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటకాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. చిగురుకోటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు.

నరసింహారావుపాలెం: కరపత్రం అందిస్తున్న నితిన్‌కృష్ణ

ముసునూరు, న్యూస్‌టుడే: తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రఘు, సర్పంచి చలసాని దామోదరరావు, గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర వలసపల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

యువకుడిపై దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కలిదిండి మండలం చింతలపర్రుకు చెందిన సాదరాల బ్రహ్మం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సొంత పనిపై హైదరాబాద్ వెళ్లి సోమవారం తెల్లవారుజామున ఏలూరు స్టేషన్‌లో రైలు దిగారు. కైకలూరు వెళ్లేందుకు పాత బస్టాండ్ వద్దకు వచ్చారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఎక్కడికి వెళ్లాలని ఆయన్ను అడిగారు. కైకలూరు వెళ్లాలని చెప్పడంతో.. తాము అటే వెళ్తామని వాహనం ఎక్కించుకున్నారు. నగర శివారు వైఎస్సార్ కాలనీ ప్రాంతానికి తీసుకెళ్లి బ్రహ్మంపై దాడి చేసి ఫోన్, రూ.5,500 లాక్కుని పరారయ్యారు. క్షతగాత్రుడ్ని స్థానికులు సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ఎన్నిక

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా వరద శ్యామ్ ఎన్నికయ్యారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ అధ్యక్షతన అగ్రహారం చిన్నగారి రైస్ మిల్లులో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తుంపూడి గణేశ్‌ను ప్రాంతీయ కార్యదర్శిగా నియమించినట్లు వివరించారు. ఎన్నిక అనంతరం అధ్యక్షుడు వరదశ్యామ్ తాతనాయనమ్మ వేణుగోపాలరావు, శేషారత్నం జ్ఞాపకార్థం ఆర్యవైశ్యుల అపకర్మల భవనానికి రూ.4 లక్షల విలువైన భూమిని వితరణగా ఇచ్చారు.

అధ్యక్షుడిగా ఎన్నికైన శ్యామ్‌ను అభినందిస్తున్న పెద్దలు

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం

నూజివీడు, కైకలూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఆలంబనగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం రెండో జాబితాను సోమవారం విడుదల చేసింది. ప్రతి సంఘానికి ఛైర్మన్, ఇద్దరు సభ్యులను నియమిస్తూ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ జాబితా విడుదల చేశారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లోని పలు సంఘాలకు కమిటీలను నియమించారు. సంఘాల వారీగా రెండు నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీల వివరాలు ఇలా ఉన్నాయి.

సొసైటీ	ఛైర్మన్	సభ్యులు
యనమదల	పల్లెర్లమూడి వెంకటసత్యవరప్రసాద్	దాకారపు వెంకటరత్నం, పల్లిపాముల రంగారావు
తుక్కులూరు	గోగినేని రామకృష్ణ	పున్నం సాంబశివరావు, బడిపట్టి ఆరోగ్యం
ఎం.ఎన్.పాలెం	యనమదల సృజన చౌదరి	మరీదు శోభనాద్రి, ఓలేటి వెంకట రంగారావు
మీర్జాపురం	కన్నికంటి శ్రీనివాసరావు	జక్కుల రంగారావు, దేవరపల్లి డేవిడ్ రాజు
పోతురెడ్డిపల్లి	అక్కినేని బెనర్జీ	జుజ్జవరపు రాణి, మందపాటి తిరుపతయ్య
పల్లెర్లమూడి	అట్లూరి రమేశ్	బెజవాడ ఉషారాణి, శిలారపు సంగీతరావు
తోటపల్లి	పరిమి శోభనాద్రి	బెజవాడ శివవెంకటరాంబాబు, మొక్కపాటి రామకృష్ణ
కృష్ణవరం	కొండిశెట్టి శ్రీనివాసరావు	వీరాబత్తిన విశ్రాంతం, పోత్రు రామారావు
శోభనాపురం	నలజాల హరిబాబు	చక్కిరాల గోపీకృష్ణ, తిరుపతి తిరుపతిరావు
వలసపల్లి	కొల్లి కృష్ణయ్య	కర్రా మహాలక్ష్మీ, కొలుసు సత్యనారాయణ
గోపవరం	ఉప్పలపాటి గణేశ్	పులిచర్ల భూచక్రధరరావు, పోలిమెట్ల స్వరూపారాణి
కాట్రేనిపాడు	బొమ్మకంటి శ్యామలరావు	జువ్వనపూడి కనకయ్య, పిన్నిబోయిన స్వాతి
చనుబండ	మోరంపూడి శ్రీనివాసరావు	కంచు మల్లయ్య, నందిపాము ప్రభాకరరావు
పోలవరం	యర్రా ప్రసాదరావు	తానంకి దేవరాజు, యర్రోజు పద్మావతి
తుమ్మగూడెం	దమ్మెర వెంకట సత్య రామ్‌కుమార్	మాదల చిట్టిబాబు, త్రివేది ఆదిమ్మ
నరసింహారావుపాలెం	కట్టా నాగ దుర్గారావు	తుమ్మురు సురేశ్ రెడ్డి, నక్కా ఝాన్సీరాణి
చిగురుకోట	చలసాని జగన్‌మోహనరావు	భట్రాజు శ్యామలరావు, కుంచే కోటేశ్వరరావు
పుట్లచెరువు	గురుగుబెల్లి సత్యనారాయణ	బొడ్డుపల్లి అప్పారావు, గురుగుబెల్లి నాగేశ్వరరావు

రైతులకు బాసటగా నిలవాలి

వడాలి (ముదినేపల్లి), న్యూస్‌టుడే: పీఏసీఎస్‌లకు నియమించిన త్రిసభ్య కమిటీలు రైతులకు రుణాలు, ఎరువులు సకాలంలో అందించి బాసటగా నిలవాలని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. వడాలిలో సోమవారం నిర్వహించిన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధ్యక్షునిగా అనగాని గంగాధరరావు, సభ్యులుగా మరడాని సత్యనారాయణ, మందపాటి గంగరాజులతో ప్రమాణం చేయించి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. పెదగొన్నూరు డీసీ వైస్ ఛైర్మన్ కట్టా కోటయ్య, డీసీ సభ్యులు మారగాని శంకరరావు, బుద్ధ కాశీవరప్రసాద్, పాల సొసైటీ ఛైర్మన్ ఈడే బుజ్జి, కార్యదర్శి మరీదు బాలదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు

లీజు సొమ్ము చెల్లించాలని ఆందోళన

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం శింగనపూడి ఫీల్డు లేబర్ కోపరేటివ్ సొసైటీ భూముల లీజు సొమ్ము చెల్లించే వరకు అందులో సాగు చేసిన రొయ్యల వ్యాను కదిలేది లేదంటూ సభ్యులు సోమవారం ఆందోళన చేశారు. ఎస్సై రామచంద్రరావు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఇరుపార్టీల భూములకు సంబంధించిన రికార్డులు తీసుకురావాలని, ఇలా ఆందోళన చేయడం సమంజసం కాదని తెలిపారు. భూములు అప్పగించాలని లేకుంటే లీజులైన చెల్లించేలా న్యాయం చేయాలని సొసైటీ సభ్యులు కోరారు. ఎస్సీలకు చెందిన ఫీల్డు లేబర్ సొసైటీ భూములను లీజులు చెల్లించకుండా కొంత మంది అనుభవించడంతో కొంతకాలంగా సభ్యులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. సొసైటీ అధ్యక్షుడు జగదీశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెబాట పడుతున్నట్లు ప్రకటించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికులకు ఏడేళ్లుగా జీతాలను పెంచడం లేదన్నారు. సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

AKKINENI NAGESWARA RAO
COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
GUDIVADA, Krishna Dist. A.P
EAPCET CODE ANRG
Approved by AICTE & Affiliated to JNTUK, Kakinada

B.Tech. PROGRAMMES OFFERED
Computer Science & Engineering (CSE)
Information Technology (IT)
Electronics and Communication Engineering (ECE)
Artificial Intelligence & Data Science (AI & DS)
94405 35959, 98496 13279, 08674-245737
Bus & Hostels Facility Available
K.S.APPA RAO
Secretary & Correspondent

(c) eenadu

బదిలీలు.. అక్రమ వసూళ్లు

సచివాలయాల్లో ప్రహసనంగా ప్రక్రియ ● సగం మందికిపైగా అందని ఉత్తర్వులు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. 6066 మందికి స్థానచలనం కలగగా, వీరిలో సగం మందికి ఇప్పటికీ ఉత్తర్వులు అందకపోవడం గమనార్హం. కొందరికి ఉత్తర్వులు జారీ చేసినా, ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ చేయకుండా కొన్నిశాఖల అధికారులు తాత్సారం చేస్తున్నారు. సిఫార్సులు.. వసూళ్లతో వాటిలో మార్పులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీవో 5 ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీల ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలిచ్చినా.. కేవలం వీఆర్వో, ఏఎన్ఎం, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు మాత్రమే అమలుచేశారు. మిగతా వారికి కొత్త జిల్లాల పరిధిలోనే బదిలీల ప్రక్రియ నిర్వహించడంతో చాలా మంది నష్టపోయారు.

పాలన పడక

కాకినాడలో నిరసన తెలుపుతున్న సచివాలయ మహిళా పోలీసులు (పాతచిత్రం)

కొత్త స్థానాల్లో ఉద్యోగులు చేరకపోవడంతో పరిపాలన కుంటుపడుతోంది. పంచాయతీల్లో స్వర్ణభారతి కార్యక్రమం ద్వారా ఇంటి పన్నును ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పేరుతో సిబ్బందిని రిలీవ్ చేయడంలేదు. బూత్‌స్థాయి అధికారులుగా ఉన్నవారికి శిక్షణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. గ్రామ సర్వేయర్లదీ ఇదే పరిస్థితి. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలపై వచ్చిన దరఖాస్తులు మూలుగుతున్నాయి.

సొమ్ములిస్తే మార్చేస్తున్నారు...

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకే బదిలీల్లో అగ్రతాంబూలమిచ్చారు. వీటితో పాటు కొన్ని శాఖల్లో వసూళ్లకు తెరతీశారు.
◆ కాకినాడ కలెక్టరేట్‌లో ఉన్న ఒక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్రంగా సొమ్ములు వసూలుచేసి, నచ్చినచోట పోస్టింగ్‌లు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఈ శాఖలో 844 మందికి స్థానచలనం కల్పించారు. నచ్చినచోట పోస్టింగ్‌కు రూ.20వేలకుపైగా వసూలు చేశారనే వాదన ఉంది.
◆ వైద్య,ఆరోగ్యశాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో 1,051 మందికి స్థానచలనం కల్పించారు. ఇక్కడ కొందరు అధికారులు సొమ్ములు వసూలు చేసి ఉత్తర్వుల్లో మార్పు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 120 మందికి మార్చారని చెబుతున్నారు.
◆ బదిలీలకు సంబంధించి ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలు కోరారు. ఇవేవీ పట్టించుకోకుండా కొందరు అధికారులు ఇష్టారీతిన ప్రక్రియ చేపట్టారు.
◆ ఉమ్మడి జిల్లా పరిధిలో 1,020 మంది మహిళా పోలీసులకు స్థానచలనం కల్పించారు. దీనిలో తీవ్ర అన్యాయం జరిగిందని సుమారు 60 మంది కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

వార్డు సచివాలయాల్లో పూర్తి

ఉమ్మడి జిల్లా పరిధిలోని నగరం, పట్టణ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. గడువులోగా దీన్ని పూర్తి చేసి, ఉద్యోగులను రిలీవ్ చేయడంతో కొత్త స్థానాల్లో చేరారు. మొత్తం 1,177 మందికి స్థానచలనం కల్పించారు.

పెద్దాపురం సిల్క్.. జాతీయస్థాయిలో తళుక్కు..!

ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద కేంద్ర పురస్కారం

కాకినాడ కలెక్టరేట్, పెద్దాపురం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద 2024-25కు పెద్దాపురం సిల్క్ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలోని 26 జిల్లాలు పోటీలో నిలవగా.. ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులకు అవార్డులు వచ్చాయి. అందులో కాకినాడ జిల్లాకు పెద్దాపురం సిల్క్ ద్వారా దక్కింది. పురస్కారాన్ని సోమవారం దిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్‌గోయల్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అందరి కృషితో ఐదేళ్ల జిల్లాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు ఎక్కువ వచ్చాయన్నారు.

అవార్డు అందుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

పూర్వం నుంచి ప్రసిద్ధి..

పెద్దాపురం సిల్క్ పూర్వం నుంచి ఎంతో ప్రసిద్ధి. పట్టణంలో రెండు చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో దారానికి రంగులద్దే పనిపై 40 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. బెంగళూరు నుంచి తెప్పించిన సిల్క్‌కు ఇక్కడ రంగులద్ది ఉప్పాడలోని చీరల తయారీ మగ్గాల వారికి తరలిస్తారు. అక్కడ వారు చీరలు నేసి ఎగుమతి చేస్తారు. స్థానికంగానూ విక్రయాలు చేస్తారు.

గాంధీ మెచ్చిన సిల్క్ ఇదీ..

జాతిపిత మహాత్మాగాంధీ 1929, 1933లలో రెండుసార్లు పెద్దాపురం సందర్శించారు. అప్పుడు చేనేత కార్మికులు నేసే పట్టు నాణ్యత, వారి ఉత్పత్తులను చూసి మంత్రముగ్ధులై వాటికి స్వదేశీ సిల్క్‌గా కితాబిచ్చారు.

జిల్లాలో రూ.235 కోట్లతో ఉపాధి పనులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో రూ.235 కోట్లతో పనులు నిర్వహించారని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం పర్యటించి ఉపాధి పథకంలో చేసిన పనులు పరిశీలించారు. పశువులకోసం నిర్మించిన షెడ్లు, సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు పరిశీలించి రైతులు, ప్రజలతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 4.77లక్షల మంది ఉపాధి కూలీలున్నారన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 37.85 లక్షల పని దినాలు పూర్తయ్యాయన్నారు. గత ఏడాదిలో 75 లక్షల పని దినాలు పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 80 లక్షల రోజులు లక్ష్యమన్నారు. ఏపీవో గంగాభవాని, సిబ్బంది వెంట ఉన్నారు.

నది వరద నీట.. నారుమడిన బీట..

తాళ్లరేవు శివారు ఆయకట్టుకు సాగునీటి కొరత

ఎండిన ఆకుమడిలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళా కౌలు రైతు ఆదిలక్ష్మి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలంలో ఖరీఫ్ ప్రారంభంలోనే సాగునీటి కష్టాలు స్వాగతం పలుకుతున్నాయి. ఒక పక్క గోదావరికి వరదలు వచ్చి గ్రామాల్లోకి నీరు చేరుకుంటుండగా పక్కనే ఉన్న పంటపొలాల్లోని ఆకు మడులు బీటలు వారుతున్నాయి. పది రోజుల క్రితం వేసిన ఆకుమడికి నీరందక ఎండిపోతోందని తాళ్లరేవుకు చెందిన మహిళా కౌలు రైతు తవిటికి ఆదిలక్ష్మి సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరం భూమి కౌలుకు చేస్తున్నానని, వారం రోజుల నుంచి సాగునీరు అందక ఆకుమడి పాడైందని వాపోయారు. పంట బోదిలో చుక్కనీరు లేక గూళ్ల సాయంతో తోడుకునే అవకాశమూ లేదన్నారు. ఈ సమస్యను జలవనరుల శాఖ ఏఈ అనూష వద్ద ప్రస్తావించగా తాళ్లరేవు లాకుల వద్ద 1.9 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. ప్రతి ఎకరానికి నీరందాలంటే 2.6 అడుగుల నీటి మట్టం ఉండాలన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు నిర్వహించనున్న పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధించిన పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఏపీపీఎస్సీ, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్తు, పోలీసు, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. కాకినాడలోని ఎస్.అచ్యుతాపురం రైల్వేగేటు వద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, కాకినాడ గ్రామీణ మండలం, రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీస్ సంస్థల్లో రోజూ రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు అరగంట ముందుగా హాజరుకావాలని సూచించారు. కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపాలని డీఆర్వో ఆదేశించారు. ఏపీపీఎస్సీ అధికారులు టి.కోటరమణ, ఎస్.ప్రతాప్, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాస్, కలెక్టరేట్ సెక్షన్ అధికారి ఎం.జగన్నాథం, ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి పైనులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటరావు, హాజరైన అధికారులు

క్వారీ శకటాలు.. ఛిద్రమవుతున్న మార్గాలు..!

రాత్రి..పగలు తేడా లేకుండా

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, శంఖవరం

ఓ వైపు గుంతల మార్గాలను ప్రభుత్వం బాగుచేస్తుంటే మరో వైపు క్వారీలు, క్రషర్ల లారీలు ఛిద్రం చేస్తున్నాయి. వీటి ధాటికి దుమ్ము, ధూళితో పాటు ఈత కొలనులను తలపించేలా గోతులు పడుతున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో కత్తిపూడి, రౌతులపూడి మార్గంలో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. కంకర, బండరాళ్లతో లారీలు రయ్..రయ్‌మంటూ దూసుకెళ్తుంటాయి. పరిమితికి మించి బరువుతో ఊరి మధ్య నుంచే భారీ టిప్పర్లు తిరుగుతుండటంతో క్షణ క్షణం భయం భయంగా గడుపుతున్నామని 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఎదుట స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కత్తిపూడి రౌతులపూడి మార్గంలో క్వారీ లారీల రాకపోకలు

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో మెటల్, గ్రావెల్ నల్లరాతి క్వారీలున్నాయి. పైడిపాల ప్రాంతంలో క్రషర్లు ఉన్నాయి. దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా బమిడికలొద్ది లేటరైట్ క్వారీ ఉంది. వీటి నుంచి రౌతులపూడి, శంఖవరం మండల కేంద్రాల మీదుగా కత్తిపూడి కూడలిలో జాతీయ రహదారి వరకు 20 కి.మీ. మేర పావనగా రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాలు తిరుగుతూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 20 టన్నుల బరువు వాహనాలకు వీలుగా రోడ్లు నిర్మిస్తున్నారు. కానీ క్వారీ టిప్పర్లు 50 నుంచి 60 టన్నుల బరువుతో తిప్పుతున్నారు. ఇరుకురోడ్లు, గ్రామాల మధ్య నుంచి వెళుతుండటంతో దుమ్ము, ధూళి ఇళ్లల్లోకి చేరుతోంది.

అంతా సెటిల్‌మెంట్లే..

క్వారీ లారీలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎవరైనా క్వారీ లారీ ఢీకొంటే అక్కడ కేసులేవీ నమోదు కావు. అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసి విషయం బయటకు రాకుండా చేస్తున్నారు. దీనికి స్థానిక పెద్దలు సహకారం అందిస్తున్నారు. క్వారీలు, క్రషర్ల నుంచి వెళ్లే ప్రతి లారీకి కొంత మొత్తం చొప్పున నేతలకు ముట్టజెప్పుతున్నారనే ఆరోపణలున్నాయి. 'క్వారీ లారీలు నిమిషానికి 30 తిరుగుతున్నాయి. దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నాం. చాలా మంది అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నారు.' అని రౌతులపూడికి చెందిన సుభాషిణి వాపోయారు. 'ఈ మార్గంలో ఆటో తిప్పడానికే భయపడుతున్నాం. వచ్చిన ఆదాయం కంటే వాహనం మరమ్మతులకే ఎక్కువ ఖర్చవుతోంది. అడుగడుగునా గోతులు, వేగంగా వచ్చే లారీలతో నిత్యం భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం.' అని ఆటో డ్రైవర్ గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. 'క్వారీ లారీలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా.. అనుమతికి మించి రవాణా చేస్తున్నారా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు...వంటి అంశాలపై పరిశీలన చేయిస్తాం. నిబంధనలు అతిక్రమించే వాహనాలపై చర్యలు తీసుకుంటాం.' అని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు.

శంఖవరం సమీపంలో క్వారీ లారీలతో ఏర్పడిన గొయ్యి

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

కలెక్టరేట్‌కు వెల్లువెత్తిన అర్జీలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి కొండంత ఆశతో మండుటెండలోనూ పెద్ద సంఖ్యలో ప్రజలు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు తరలివచ్చారు. భూసమస్యలు పరిష్కరించాలని, రీ-సర్వే తప్పులు తీర్చాలని, సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని, ద్వాక్రా సొమ్ములు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, పేదల భూములను కాపాడాలని, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తదితర సమస్యలపై మొత్తం 642 మంది వినతులు అందజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జేసీ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకటరావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సీపీవో త్రినాథ, సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావులు అర్జీలు స్వీకరించారు. జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఒకసారి వచ్చి అర్జీ మళ్లీ మళ్లీ పీజీఆర్ఎస్‌కు వస్తే సంబంధిత పరిష్కార అధికారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.

సమస్య తెలుసుకుంటున్న జేసీ రాహుల్‌మీనా

అదనంగా సీసీ కెమెరాలు.. ఫిర్యాదుల కమిటీలు

జీజీహెచ్ ఘటన నేపథ్యంలో అధికారుల అప్రమత్తం

ఈనాడు, కాకినాడ: కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్)లో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు నేర్చుకోవడానికి వచ్చిన విద్యార్థినులతో అక్కడి సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించి అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఒకేషనల్ విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ జీజీహెచ్‌తో పాటు రంగరాయ వైద్యకళాశాలను పరిశీలించి పలు సిఫార్సులు చేశారు. ఈ మేరకు విద్యార్థినులు పనిచేసేచోట, ల్యాబ్‌లలో అదనంగా 5 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలు, వాటి బాధ్యతలపై విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించారు. వైద్య విద్యార్థుల మాదిరిగానే ఆరోగ్య సంరక్షణ సహాయక కోర్సులు చేసేవారికి తరగతులు నిర్వహించి స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రంగరాయ ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్ తెలిపారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సూచనల మేరకు జీజీహెచ్‌లో ఈ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా భోజనశాల, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అబ్బే.. ఆ అభ్యంతరాలు ఓ లెక్కా!

జడ్పీలో గత అయిదేళ్లలో రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలు

ఈనాడు, కాకినాడ: ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వం వివిధ పద్దుల కింద ఇచ్చే నిధుల వ్యయంలో స్థానిక సంస్థలు పారదర్శకత పాటించడం లేదు. చేసే పనులకు, రాస్తున్న లెక్కలకు పొంతన ఉండడంలేదు. ఉమ్మడి జిల్లా పరిషత్తుకు సంబంధించి వైకాపా హయాంలో గత అయిదేళ్లలో సుమారు రూ.85.45 కోట్ల లెక్కల్లో తేడాలపై ఆడిట్ అధికారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందులో కొన్ని అవకతవకలు, మరికొన్ని విధాన లోపాలున్నా అధికారులు కిమ్మనడంలేదు.

ఏడాది	ఆడిట్ అభ్యంతరాలు	విలువ (రూ.కోట్లలో)
2019-20	76	25.45
2020-21	66	10.89
2021-22	84	12.09
2022-23	87	31.60
2023-24	84	5.41

దస్త్రాల్లో లెక్కలు.. అన్నీ చిక్కులే

జడ్పీలో 2019 నుంచి 2024 మధ్యలో 397 లావాదేవీలు, వ్యవహారాల్లో రూ.85.45 కోట్ల లెక్కలు తేలడం లేదు. కొన్ని పనులకు ఎం.బుక్‌లో ఒకలా, చెల్లింపుల రిజిస్టర్‌లో మరోలా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలు, జడ్పీ ఆస్తుల నుంచి లీజు ఆదాయాలు, వేలం పాటల నిర్వహణలో తేడాలున్నాయి. ❖ జడ్పీ కల్యాణ మండపంలో లైటింగ్, డెకరేషన్, సౌకర్యాల కల్పనకు 2021-22 నుంచి 2023-24 వరకు వేలం లేక రూ.10 లక్షలకుపైగా కోల్పోవాల్సి వచ్చింది. ఎన్నికల సామగ్రి నిల్వకు ఉపయోగిస్తున్నామని చెబుతున్నారు. మరి 2023-24 మండపం రికార్డు పరిశీలిస్తే 49 బుకింగ్స్ ఉన్నట్లు రాసిపెట్టారు. వేలం వేయకుండా అద్దెలకు ఇవ్వడంతో నష్టం చేకూరినట్లే. ❖ బిక్కవోలు మండలం కాపవరంలో 11 ఎకరాలు, మండపేట మండలం కేశవరంలో 15.28 ఎకరాలు జడ్పీ గ్రావెల్ భూములున్నా లీజుకు ఇవ్వలేదు. మరో 20 చోట్ల భూములు, కొబ్బరి చెట్ల ద్వారా ఆదాయం వచ్చే మార్గమున్నా వదిలేశారు. ❖ జిల్లాలో 63 సమగ్ర నీటి పథకాలున్నాయి. వీటిలోకి కాలువల ద్వారా వచ్చి పెరిగిన చేపలను వేలం, అమ్మకాలు చేయకుండా వదిలేస్తున్నారు. కరప, కొమ్మనపల్లి పథకాల్లో ఒకరోజు చేపల విక్రయంతో రూ.2.25 లక్షలు వచ్చింది. మిగతా పథకాల ద్వారా ఇదేమాదిరి ఆదాయం పొందొచ్చు.

జగనన్న సేవలో ఆస్తులు మాయం..

❖ వేమగిరిలో 22.89 ఎకరాల క్వారీ భూములు జడ్పీకి ఉండేవి. జగనన్న కాలనీ స్థలాల కోసం సీఈవో అప్పగించేశారు. ❖ 2023-24లో పది విద్యార్థులకు అధ్యయన సామగ్రి కోసం రూ.33 లక్షలు ఖర్చుచేశారు. జగన్ బొమ్మలు వేసి ప్రచారం చేసుకున్నారు. వీటిని ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ద్వారా కాకుండా ఓపెన్ టెండర్ పిలిచి గుత్తేదారుకు అప్పగించేశారు.

అభ్యంతరాలను పరిశీలించాలి

ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. రికార్డులు ఒక ఏడాది చూపకుంటే తర్వాత చూపించి ఆ మేరకు అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అలా జరుగుతుందో లేదో చూడాలి. నిధుల దుర్వినియోగం అయినట్లు తేలితే బాధ్యుల నుంచి రికవరీలు చేయిస్తాం.
-లక్ష్మణరావు, సీఈవో, జడ్పీ కాకినాడ

డ్రైవర్‌ను వెంటాడిన భయం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందడంతో ఆత్మహత్య

రామారావు (పాత చిత్రం)

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఓ మహిళ మృతి చెందడంతో తీవ్ర ఆందోళనకు గురైన డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న పటవల వద్ద ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న వివాహిత మృతి చెందారు. ఆ ప్రమాదంలో ఆమె భర్త, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. ఆ ప్రమాదం జరిగిన వెంటనే కోటనందూరు మండలం బిల్లనందూరుకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ పెదరెడ్ల రామారావు భయపడి పరారయ్యాడు. అదేరోజు భార్యకు ఫోన్ చేసి తాను పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పి చరవాణి స్విచ్ఛాఫ్ చేశాడు. సుంకరపాలెంలోని కొబ్బరి తోటలో సోమవారం అతడి మృతదేహం గుర్తించారు.

మహిళలకు మెరుగైన వైద్యసేవలందించండి

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే మహిళలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ... వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఆమె కాకినాడ జీజీహెచ్‌ను సోమవారం సందర్శించారు. తొలుత సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటివరకూ అందించిన సేవలపై ఆరా తీశారు. అనంతరం జీజీహెచ్‌లోని 7వ నెంబర్ ల్యాబ్‌ను సందర్శించారు. మాతాశిశువిభాగాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఇతర వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, ట్రైనీ డీఎస్పీ జీవన, మహిళా పోలీసుస్టేషన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు, వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు, ట్రాఫిక్-1 సీఐ రమేష్, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ దుర్గాదేవి, సఖి సెంటర్ అడ్మిన్ ఆర్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లోని మాతశిశువిభాగంలో పరిశీలిస్తున్న డాక్టర్ రాయపాటి శైలజ

70 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)లకు పర్సన్ ఇన్‌ఛార్జుల(త్రీమెన్ కమిటీలు) నియామకం కొనసాగుతుంది. మొదటి విడతగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 110 సొసైటీలకు కమిటీలను నియమించగా, తాజాగా సోమవారం విడుదల చేసిన జీవో జాబితాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 52, కాకినాడ జిల్లాలో 14, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 1, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 3 పీఏసీఎస్‌లకు ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక అనుమతులిచ్చేది భూగర్భ గనుల శాఖే!

ముగిసిన సుధాకర్ ఇన్‌ఫ్రా సీనరేజీ వసూళ్ల గడువు

ఈనాడు, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గనుల తవ్వకాలకు సంబంధించి భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలోనే ఇకపై అనుమతులు ఇవ్వనున్నారు. వైకాపా హయాంలో వీటికి సంబంధించి సీనరేజీ వసూళ్ల బాధ్యత సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చి రెండేళ్లకు రూ.233 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. మూడు నెలల పాటు సీనరేజీ వసూళ్లు చేయలేకపోవడంతో ఆ సంస్థ అభ్యర్థన మేరకు కూటమి ప్రభుత్వం పొడిగించింది. అది కూడా ముగియడంతో సోమవారం నుంచి పాత విధానంలోనే గనుల లీజులు, అనుమతులు భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలో ఇవ్వనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయని జిల్లా అధికారి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు.

కోనసీమలో ఇసుక అక్రమాలు సీఎం దృష్టికి..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిషేధం ఉన్నప్పటికీ జూన్ 1 తరువాత గోదావరిలో యథేచ్ఛగా తవ్వకాలు చేసిన వైనంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి సమగ్ర నివేదిక వెళ్లింది. మండపేట, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో కొన్నిచోట్ల రేయింబవళ్లు, మరికొన్నిచోట్ల రాత్రివేళల్లో అడ్డగోలుగా యంత్రాలతో ఇసుక తరలింపుపై గనుల శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం నివేదిక పంపినట్లు తెలిసింది. కపిలేశ్వరపురంలో తరలింపులపై 'ఈనాడు, ఈటీవీ'లో కథనం ప్రచురితమైన తరువాత ఉన్నతాధికారులతోపాటు, జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుని అన్నిచోట్ల దాడులు నిర్వహించింది. కొన్ని నిల్వకేంద్రాల్లో పరిమితికి మించి ఉన్నట్లు గుర్తించి అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. నిబంధనలు అతిక్రమించినవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు, లీజుదారుకు రూ.కోట్లలో అపరాధ రుసుము విధించారు. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకుల సమగ్ర వివరాలతో నివేదిక ఉన్నతాధికారులకు చేరగా, అక్కడి నుంచి సీఎం దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఎగ్జిబిషన్ కాకినాడ
పటోల & బంధేజ్ చీరలు మరియు దుపట్టా

@ గ్రాండ్ కాకినాడ బై జిఆర్‌టి హోటల్స్
11-3-11, వెల్కమ్ హాస్పిటల్ స్ట్రీట్, రామారావు పేట, కాకినాడ / ఫోన్: 8735886935

DEEPAK NEXGEN FEEDS Pvt. Ltd.
Bommuluru, Near Hanuman Junction, Krishna Dist., A.P. 521 105
WANTED
Deepak Nexgen is a leading and fast growing Fish and Shrimp feed Manufacturing industry looking for the following positions:
Plant Incharge/Manager: B.Tech. (Mechanical) with 15 to 20 years of experience in shrimp feed plant operations. Able to handle individually.
Maintenance Incharge/Manager: B.Tech. (Mechanical) with 08 to 10 years of experience in shrimp feed machinery.
Electrical Incharge/Manager: B.Tech. Electrical with 10 to 15 years of experience in shrimp feed manufacturing industry.
Kitchen Supervisor: Experienced candidates in Kitchen Operations, Ensuring food Safety and Quality, maintianing a clean and organized kitchen environment.
Electrical Incharge(Residential Villas Maintenance): Required experience person for Residential Villas Electrical Maintenance. Interested Candidates with Relevant Experience
Mail us your resumes to: ifeedhr@gmail.com

(c) eenadu

శతాబ్దమైనా.. చెక్కచెదరలేదు

పి.మల్లవరంలో వందేళ్ల నాటి చెక్క పెట్టె అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. తన తండ్రి ధూళిపూడి పాముకాపు వ్యాపారం చేయగా వచ్చిన డబ్బులు, బంగారు ఆభరణాలు ఇందులో భద్రపరిచేవారని కుమారుడు శుభ తెలిపారు. లోపల తొమ్మిది అరలు, అద్దాలతో తీర్చిదిద్దారు. పురాతన వస్తువుల సేకరణలో భాగంగా ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో దీనిని ప్రదర్శించారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

బస్సు.. ఆపేసి కస్సుబుస్సు

అద్దరిపేట నుంచి కాకినాడ వెళ్లే ఆర్టీసీ బస్సును సోమవారం విద్యార్థులు అడ్డుకుని నిరసన తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఉప్పాడ సెంటర్‌లో నిరీక్షిస్తున్నా.. బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో కోపోద్రిక్తులయ్యారు. వారంతా రహదారిపై అడ్డంగా ఉండి బస్సులు నిలిపేశారు. తామెలా విద్యాలయాలకు వెళ్లాలని డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఎస్సై వెంకటేష్ వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

ఆకుకూరలు.. కురిపించే సిరులు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలో సాగవుతున్న ఆకుకూరలు

అనతి కాలంలోనే పంట చేతికొచ్చే ఆకు కూరలను సాగుచేసి లాభాలు ఆర్జిస్తున్నాయి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ర్యాలి, పులిదిండి తదితర గ్రామాల్లో 300 కుటుంబాలు. ఈ ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో వీటి సాగు చేపట్టి నిత్యం ఆదాయం పొందుతున్నారు. గోంగూర, తోటకూర, బచ్చలి, పొన్నగంటి, చుక్క, మెంతికూర, కొత్తిమీర తదితరాలు సాగు చేస్తూ ఏడాది పొడవునా చింత లేకుండా ఉపాధి పొందుతున్నారు.

విత్తిన నెల రోజులకే కోతకు..

చిన్నచిన్న కమతాల్లో ఎవరికి వారే స్వయంగా పొలంలో నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లుతారు. విత్తిన నెలకు ఆకు కూరలు కోతకు వస్తాయి. సమీపంలోని రాజమహేంద్రవరం, తణుకు, రావులపాలెం, ధవళేశ్వరం వంటి పట్టణాలకు తీసువెళ్లి విక్రయిస్తారు.

స్ఫూర్తి

గోంగూరను స్థానిక పచ్చడి తయారీ కంపెనీల వారు టోకుగా పెద్దమొత్తంలో కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. సేంద్రియ ఎరువులు వాడటంతో వీటికి గిరాకీ ఉంటుంది. మార్కెట్‌కు వెళ్లగానే కొనుగోలుదారులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అంతగా తెగుళ్లు ఆశించవు. ఈ గ్రామాల్లోని కొత్తిమీరకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలో విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ తదితర నగరాలకు ఆర్టీసీ బస్సుల్లో ఎగుమతి చేస్తుంటారు.

రైతేరాజు

కాలంతో నిమిత్తం లేకుండా..

కాలంతో నిమిత్తం లేకుండా ఏడాది పొడవునా ఏదో రకం ఆకుకూర పండిస్తుంటారు. కుటుంబ సభ్యులు ఆసరాగా ఉంటారు. మేలైన విత్తనాలు ఎంచుకుంటారు. ఎకరాకు పెట్టుబడితో పాటు కౌలు కింద రూ.60 వేల వరకు అవుతుంది. ఖర్చులు పోను నికర ఆదాయం రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు వస్తుంది.

మంచి లాభదాయకం

తోటకూర, గోంగూర, బచ్చలి, పాలకూర, చుక్కకూర ఎక్కువగా సాగు చేస్తుంటాను. ఇవి విత్తిన నెల రోజులకే కోతకు వస్తాయి. అన్ని ఖర్చులు పోను నెలకు నికరంగా రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. మిగతా పంటల కంటే చిన్న కమతాల వారికి ఈ సాగు లాభదాయకం.

- బొచ్చు సింహాద్రి, రైతు, ర్యాలి

కోళ్లు.. అరికడదాం వ్యాధులు

గొల్లప్రోలు: వర్షాకాలంలో కోళ్లకు ఆశించే వ్యాధులు, నివారణ చర్యల గురించి చేబ్రోలు పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వివరించారు.

- కొక్కెర వ్యాధి: ఈ వ్యాధి అన్ని వయసుల కోళ్లలో వ్యాపిస్తుంది. కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా సంక్రమిస్తుంది. కాళ్లకు, మెడకు, రెక్కలకు పక్షవాతం కనిపిస్తుంది. ముక్కు నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. మెడ వంకర్లు తిరుగుతూ మూడు నాలుగు రోజుల్లో మరణిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరుచేయాలి. చనిపోయిన వాటిని లోతైన గుంతల్లో పాతిపెట్టాలి. లేకుంటే కాల్చివేయాలి. మేత, నీళ్ల తొట్టెలను శుభ్రం చేయాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.
- మశూచి: 5-12 నెలల వయసు గల కోళ్లలో కనిపిస్తుంది. వ్యాధి సోకిన వాటిని తాకడం వల్ల, స్వేచ్ఛగా తిరిగే పక్షుల వల్ల వ్యాపిస్తుంది. కలుషిత నీరు, మేత, ఈగలు, దోమలు, పరాన్నజీవుల కారణంగా వ్యాప్తి చెందుతుంది. చర్మం, తల, కంటి రెప్పలపైన పొక్కులు కనిపిస్తాయి. శ్వాస సరిగా ఆడక కష్టంగా జీవిస్తుంది. కంటి పొర, ముక్కు ఎర్రబడి, ముక్కు రంధ్రాల నుంచి చిక్కటి ద్రవం కారుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తే గుంపు నుంచి వేరు చేయాలి. యాంటీ బయాటిక్ మందులు నీటిలో కలిపి ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉన్నవాటికి వ్యాధినిరోధక, ఫౌల్‌పాక్స్ టీకాలు వేయించాలి.

మామిడి తోటల్లో యాజమాన్యంతో మేలు

మలికిపురం: ప్రస్తుతం మామిడి పంట చివరి దశలో ఉంది. కాయల కోత అనంతరం తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మలికిపురం ఉద్యానశాఖ అధికారి దిలీప్‌కుమార్ చెబుతున్నారు. కోత అనంతరం చెట్లకు కొన్ని రోజుల పాటు విశ్రాంతి ఇవ్వాలి. పోషక లోపాల సవరణకు, నిలకడగా కాపు కాసేందుకు జులై, అక్టోబరు నెలల్లో జింక్‌సల్ఫేట్ రెండు గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎండిపోయిన

మీ కోసం

కాయల కోత అనంతరం జాగ్రత్తలు పాటించాలి

కొమ్మలు, కాయ వదిలేసిన తొడిమలను కత్తిరించాలి. దీంతో చెట్టుకు సూర్యరశ్మి బాగా సోకి కాపు పెరుగుతుంది. కత్తిరించిన పెద్ద కొమ్మలకు బోర్డు లేహ్యం పూయాలి. చెట్లకు సేంద్రియ ఎరువులు, వేపచెక్క, వర్మీకంపోస్టు వేయడంతో అధిక దిగుబడులు వస్తాయి. వర్షాలు పడే సమయంలో తోటల్లో జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట వేసుకుని 45 రోజుల అనంతరం కలియదున్నితే నవంబరు, డిసెంబరు నెలల్లో త్వరగా చెట్లు పూతకు వస్తాయి.

విత్తనశుద్ధితో లాభాలిలా..

విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి

కిర్లంపూడి: నారుమళ్లకు తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు రైతులు అవలంబించాల్సిన విధానాలను, విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను కిర్లంపూడి మండల వ్యవసాయాధికారిణి సుధామాధురి వివరించారు. విత్తనశుద్ధితో శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, వైరస్ వంటి రోగకారకాలను నాశనం చేయొచ్చు. దీనివల్ల మొక్కలు ఆరోగ్యంగా, ఏపుగా పెరుగుతాయి. తద్వారా దిగుబడి పెరుగుతుంది. విత్తన నాణ్యతను కాపాడుతూ జీవనశక్తిని పెంచుతుంది. శుద్ధిచేసిన విత్తనాలు త్వరగా ఏకరీతిన మొలకెత్తుతాయి. మొక్కలు ప్రారంభ దశలోనే వ్యాధులను

తెలుసుకుందాం..

తట్టుకుని తెగుళ్ల నుంచి రక్షించబడతాయి. విత్తనశుద్ధిని జీవరసాయన పద్ధతిలో చేపట్టడం ద్వారా పంట రక్షణకు రసాయనాల వాడకం తగ్గుతుంది. ఇది రైతుకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ఉపయోగకరంగా మారుతుంది.

అపోహలు వద్దు.. అవగాహన అవసరం

నేడు ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ప్లాస్టిక్ సర్జరీ అంటే చాలామంది అందానికి సంబంధించిన శస్త్రచికిత్స(కాస్మటిక్ సర్జరీ) అని భావిస్తుంటారు. ఇది పూర్తిగా నిజం కాదు. అది అందులో ఒక భాగం మాత్రమే. దీంతో పాటు కాలిన గాయాలు, రోడ్డుప్రమాదాలు(పెదవి, ముఖంపై గాయాలు), పుట్టుకతో కలిగే వైకల్యాలు(చీటిక పెదవి, కణుతులు, చేతి లేక ఇతర భాగాలు), క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్సలు, రక్తనాడులు, బోదకాలు, మధుమేహ సంబంధిత వ్యాధులకు(డయాబెటిక్ ఫుట్) శస్త్రచికిత్సలు తదితరాలన్నీ ఈ కోవ కిందకే వస్తాయి. దీనికి సంబంధించి కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక విభాగం ఉంది. నేడు ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా కథనం.

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో రోగులు

అందుబాటులో ప్రత్యేక సేవలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్ డా.రత్నభూషణ్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.భారతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.రమేష్, డా.అజయ్ తదితర వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. త్వరలో మరింత మంది రానున్నారు. ఇక్కడ 24 గంటల పాటూ సేవలు అందిస్తారు. ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి, సాధారణ జీవితాన్ని గడపటానికి, జీవనశైలిని మెరుగుపరచడానికి ఈ శస్త్రచికిత్సలు దోహదపడతాయి.

- ఇటీవల ఐదేళ్ల పాప 50 శాతం కాలిన గాయాలతో కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు మూడు దశల్లో శస్త్రచికిత్స చేశారు. గాయాలన్నీ మాని చిన్నారి పూర్తిగా కోలుకుని, ఇప్పుడు పాఠశాలకు వెళ్తుంది.
- ఓ పాప దవడ ఎముకలు కలిసిపోయి(సింగ్నాథియా) పుట్టింది. ఆమెకు వెంటనే కాకినాడ జీజీహెచ్‌లో ఆపరేషన్ చేసి నోరు తెరుచుకునేలా చేశారు. దాంతో చిన్నారి పాలు తాగడం సాధ్యమైంది. ఆమె ఎదుగుదల కూడా బాగుంది.
- గతేడాది మార్చిలో చలి మంట కాగుతున్న ఓ బాలికకు ప్రమాదవశాత్తూ ఛాతి, పొట్ట, రెండు కాళ్లు, చేతులు కాలిపోయాయి. ఆ బాలికకు వేరే భాగాల నుంచి చర్మం తీసి కాలిన చోట అమర్చి శస్త్రచికిత్స నిర్వహించారు. ఇది ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. జీజీహెచ్‌లో ఉచితంగా చేశారు.

గత నాలుగేళ్లలో వివరాలిలా..

ఏడాది	ఓపీ	ఐపీ	శస్త్రచికిత్సలు
2022	1509	136	472
2023	4125	881	841
2024	4609	988	1160
2025	2374	402	523

(ఇప్పటివరకూ)

వినియోగించుకోండి

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అన్ని రకాల వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందానికి సంబంధించినది కాదు. కాలిన గాయాలు, ప్రమాదాల బారిన పడిన వారికి చేస్తాం. ఇక్కడ ఉచితంగా సేవలందిస్తాం. అవసరమైనవారు వినియోగించుకోవాలి.

- డా.రత్నభూషణ్, ప్లాస్టిక్ సర్జరీ నిపుణురాలు, జీజీహెచ్

డాక్యుమెంట్ పోయినది

దాసం.శ్రీరామకృష్ణ, S/o.తమ్మారావు (లేటు), డోర్ నెం.1-69/3-3, రైల్వే స్టేషన్ దగ్గర, శ్రీనివాసనగర్, కొవ్వాడ, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా అను నా పేరిట గల ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్.7901/2023 తేది.11-08-2023గలది ది.07-07-2025న కాకినాడ, కొవ్వాడ నుండి ఇంద్రపాలెం జెరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా మార్గమధ్యంలో జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. దాసం.శ్రీరామకృష్ణ (లేటు). సెల్: 99512 83991

శ్రీసంస్థాన్ ఈవోగా శివబాబు

తొండంగి, పిఠాపురం: శ్రీసంస్థాన్ ఈవోగా కాకినాడ తూరంగేశ్వరస్వామి ఆలయ ఈవో జి.శివబాబును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటివరకు ఈవోగా ఉన్న శ్రీరాములు బాధ్యతల నుంచి తొలగించినట్లు సమాచారం.

హాకీ టోర్నీ, ఆర్మీ ర్యాలీకి రూ.లక్ష విరాళం

జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావుకు చెక్కును అందజేస్తున్న ఏపీఎన్‌జీజీవో ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వచ్చేనెలలో కాకినాడలోని క్రీడా మైదానంలో నిర్వహించనున్న జాతీయ జూనియర్ మహిళా హాకీ టోర్నీ, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఏపీఎన్‌జీజీవో ఉమ్మడి జిల్లా శాఖ రూ.లక్ష విరాళం ఇచ్చింది. సోమవారం కలెక్టరేట్‌లో ఏపీఎన్‌జీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబులు రూ.లక్ష చెక్కును సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో జె.వెంకటరావులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీజీవో ప్రతినిధులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ల చంద్రరావు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ) డి.నెం.2-26-1, వార్డు నెం.5, 50 బిల్డింగ్స్ సెంటర్, శ్రీనగర్, కాకినాడ-533003.

రూల్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

[illegible]

సాధారణ, నీటి మార్గాలు మరియు అన్ని సౌలభ్యం హక్కులను కలిగి ఉంది.

టైటిల్ హోల్డర్: శ్రీ పుణ్యమంతుల నాగేశ్వరరావు, తండ్రి: పుణ్యమంతుల భక్మీర్.

తేది: 11.07.2025, ప్రదేశం: కాకినాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

మమ.. అనిపించారు..

- పిఠాపురం శ్రీసంస్థాన్ భూములు పాత పాటదారులకే కేటాయింపు

తొండంగి, న్యూస్‌టుడే: పిఠాపురం శ్రీసంస్థానకు చెందిన 511 ఎకరాల భూములు తొండంగిలో ఉన్నాయి. వీటికి వేలం గడువు ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. మే నుంచి కౌలు బహిరంగ వేలం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమైనా మొదటిసారి రైతులు లేరని, రెండోసారి వరికుప్పలు ఒబ్బిడి కాలేదని, మూడు, నాలుగోసారి పోలీసు బందోబస్తు లేదని వాయిదా వేశారు. ఈసారి కూడా నిర్వహిస్తారో లేదోనని రైతులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఐదోసారి వేలంపాట శ్రీసంస్థాన్ ఈవో శ్రీరాములు ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. కాకినాడ నూకాలమ్మ ఆలయ ఈవో వీరభద్రరావు పరిశీలకులుగా హాజరయ్యారు. 511 ఎకరాల భూమిని 180 బిట్లుగా విభజించి రోజుకు 30 బిట్లకు వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం 61.90 ఎకరాలకు వేలం నిర్వహించగా 30 మంది రైతులు దక్కించుకున్నారు.

నలుగురు మినహా..

పాత పాటదారులకే(నలుగురు మినహా) రూ.100 నుంచి రూ.300 పెంచి భూములు కట్టబెట్టడం గమనార్హం. గతంలో 61.90 ఎకరాలకు రూ.5,64,200 ఆదాయం రాగా తాజాగా నిర్వహించిన పాటల ద్వారా రూ.5,79,300 సమకూరింది. సీఐ చెన్నకేశవరావు, ఎస్సై జగన్మోహనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాగునీటి ఎద్దడిపై అధికారుల నిలదీత

జలవనరులశాఖ ఎస్ఈ కె.గోపినాథ్, ఈఈ రామకృష్ణను ప్రశ్నిస్తున్న తాళ్లరేవు, పోలేకుర్రు రైతులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో ఆకుమడులు ఎప్పుడూ ఎండి పోలేదని, పరిస్థితి ఇలా ఉంటే పంటలు ఎలా పండించాలని రైతులు దడాల బుజ్జిబాబు, రాయుడు శ్రీనివాస్, కన్నీడి లక్ష్మణ్ ప్రశ్నించారు. తాళ్లరేవులోని జలవనరులశాఖ కార్యాలయాన్ని రైతులు సోమవారం ముట్టడించారు. ఎస్ఈ కె.గోపినాథ్, ఈఈ రామకృష్ణతో సాగునీటి ఇబ్బందులపై రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, నీటిసంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణంరాజు, అల్లూరి సాయిరాజు, మొగలతుర్తి శ్రీనివాసరావు చర్చించారు. సమస్యను పరిష్కరించాలని, లేకుంటే రోడ్డెక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టర్ అనుమతితో తాళ్లరేవు సైఫన్ వంతెన వద్ద మోటార్లు ఏర్పాటు చేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. అధికారులు మాట్లాడుతూ జిల్లాలో 1500 ఎకరాలకు నీటి ఎద్దడి సమస్య ఉందన్నారు. 24 గంటల్లో పూర్తి స్థాయి పంట పొలాలకు సాగునీరు అందిస్తామన్నారు. జలవనరుల శాఖ ఏఈ అనూష పాల్గొన్నారు.

రేపు జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం

కాకినాడ కలెక్టరేట్: జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం (డీఆర్‌సీ) బుధవారం నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణ అధ్యక్షతన కలెక్టరేట్‌లో ఈ సమావేశం జరగనుంది. వివిధ శాఖల పనితీరు, గత సమీక్షలో గుర్తించిన అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా వ్యవసాయం, గృహనిర్మాణం, విద్య, వైద్యారోగ్యశాఖల ద్వారా అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్న తీరుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షించనున్నారు.

మహిళా ప్రజాప్రతినిధులూ ప్రభావవంత నేతలుకండి

సామర్లకోట: పాలనలో మహిళా ప్రజాప్రతినిధులు ప్రభావవంత నేతలుగా ఎదగాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కేవీవీ ప్రసాదరావు అన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులకు 'మార్పు ద్వారా విజేతలు' శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పరిపాలనలో మహిళల పాత్ర, భాగస్వామ్యం పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమణి, డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు శర్మ, సుశీల పాల్గొన్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్ షుగర్‌కు. రాజమండ్రి (ఇంతకు ముందు మెట్రో లాడ్జి) ఇప్పుడు same కేంప్. శ్రీసాయిలక్ష్మీ లాడ్జిలో మందులు. SVG మార్కెట్‌రోడ్. ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3, 17 తేదీల్లో.

REAL ESTATE

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ||గ|| RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

GENERAL

కొండయ్యపాలెం ఫ్లైఓవర్ జంక్షన్‌లో సుమారుగా 440 గ||లు మరియు ఉప్పాడలో స్థలములు అమ్మకమునకు కలదు. Cont: P.A.స్వామి, ✆ 98481 07949, 99856 46888.

TO LET

సామర్లకోట, అయోధ్యరామపురం పాత కరెంట్ ఆఫీస్ బిల్డింగ్ అద్దెకు. ఆఫీస్‌లకు, స్కూల్స్ కు, రెసిడెన్షియల్ పర్పస్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 83415 16208, 92961 07984.

EENADU Classifieds

JOBS

WANTED: To teach Maths and English 02 Nos, Primary and High School. Cont: GTLC EM School, Rajahmundry, ✆ 98497 02543, 85007 37977.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52843.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

రాజమండ్రి టూ-వీలర్ ఎలక్ట్రిక్ షోరూం (ఏథర్) నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం లభించును. LIC Building దగ్గర, మోరంపూడి. Ph: 800 888 4256.

ప్రముఖ 2-వీలర్ ఫైనాన్స్ నందు రాజమండ్రిలో పనిచేయుటకు కలెక్షన్ టెలికాలర్స్ (మేల్ & ఫిమేల్) కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 85006 44978 / 77997 76685.

ప్రముఖ 2-వీలర్ ఫైనాన్స్ నందు కాకినాడలో కలెక్షన్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 85006 44978 / 77997 76685.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10వ ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

WANTED TEACHERS Immediately For High School English, Hindi Maths & social Satyabhama School Anaparthi sbemschool@gmail.com 91774 88666

EENADU for Advertisement Contact: 8008597607

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-96 పై॥ అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	24,000
కురిడీ (వెయ్యింటికి): పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	94-00
రిటైల్ లైవ్	116-00
డ్రెస్డ్	168-00
స్కిన్‌లెస్	191-00

మా బంగారం మాకు ఇవ్వాలి

తేటగుంట కెనరా బ్యాంకు వద్ద బాధితుల నిరసన

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తేటగుంట కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం గోల్‌మాల్ కావడంతో బాధితులు గత నాలుగు నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే బంగారం తాకట్టుపెట్టిన వారికి ఆభరణాలు ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు ఇచ్చిన గడువు ముగియడంతో సోమవారం బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తూ తమ బంగారం తమకు ఇవ్వాలని నినాదాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు బ్యాంకు వద్దకు వెళ్లి సంబంధిత అధికారులతో చర్చించి వారం రోజుల వ్యవధిలో తాకట్టుపెట్టిన వారు రుణం చెల్లిస్తే వారి బంగారం వారికి అప్పగించే విధంగా బ్యాంకు అధికారులను, బాధితులను ఒప్పించారు. ఈ విషయంపై గత నాలుగు నెలల కిందట బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగుతుందని నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పట్టాలెక్కనున్న 'ప్రసాద్' పనులు

ఈనాడు కథనానికి స్పందన

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో కేంద్ర పథకం 'ప్రసాద్' ద్వారా చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎట్టకేలకు టెండర్లు ఖరారయ్యాయి. రూ.25.32 కోట్లు కేంద్రం కేటాయించగా ముందుగా రూ.18.98 కోట్ల అంచనాతో ప్రధాన పనులను టెండర్లు పిలిచారు. రాజమహేంద్రవరానికి చెందిన గాలి సుబ్బరాజు కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది. అంచనా వ్యయానికి 3.69 శాతం (రూ.70 లక్షలు) తక్కువకు పనులు చేపట్టేందుకు గుత్తేదారు ముందుకు వచ్చారు. గతంలో టెండర్లు దక్కించుకుని రద్దయిన కె.అనంతరావు అండ్ కో సంస్థ ఏకంగా 16.38 శాతం తక్కువకు (అంచనా వ్యయం కన్నా రూ.3.10 కోట్లు) పనులు చేపట్టడానికి ముందుకురాగా తాజా టెండర్లలో కేవలం 3.69 శాతం తక్కువకు టెండర్లు దాఖలు కావడం గమనార్హం. ఈ నెలాఖరుకు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ ఈశ్వరయ్య తెలిపారు. నిత్యాన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, రక్షణ గోడ, మరుగుదొడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంటు తదితర పనులు చేపట్టనున్నారు. టెండర్లు ఖరారులో జాప్యంపై గత నెల 26న 'అన్నవరం.. ప్రసాద్ పనులకు గ్రహణం' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చకచకా ప్రక్రియ చేపట్టారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

- నలుగురు నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ తదితరులు

మసీదు సెంటర్(కాకినాడ), పలు చోట్ల ఇలా చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ సోమవారం వివరాలు వెల్లడించారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ నెల 13న తూరంగి శివారులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారిలో జగన్నాథపురం సత్యదేవనగర్‌కి చెందిన గంపల సతీష్, కాకినాడ రూరల్ కొవ్వూరుకు చెందిన మల్లాడి దుర్గాప్రసాద్, గొడారిగుంటకు చెందిన కాలాడి అర్జునరావు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన గొర్రిపూడి వెంకటరమణ ఉన్నారు. వారి నుంచి 119 గ్రాముల బంగారు ఆభరణాలు, 1567 గ్రాముల వెండి వస్తువులు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇంద్రపాలెం, సర్పవరం, సామర్లకోట, రావులపాలెం, యానాం పోలీసుస్టేషన్లలో నమోదైన 5 చోరీ కేసుల్లో వీరు నిందితులు. పలు కేసుల్లో జైలుకెళ్లారు. అక్కడ పరిచయాలు పెంచుకుని, బయటకు వచ్చి ముఠాగా ఏర్పడి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన రూరల్ సీఐ చైతన్యకృష్ణ, సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు, సిబ్బంది రాంబాబు, మొయిన్, ప్రసాద్, శ్రీను, చిన్న, సతీష్, నారాయణరెడ్డి, పుల్లయ్య, గోవిందు, వర్మ ఈశ్వరరావు, సీసీఎస్ సిబ్బందిని ఎస్డీపీవో అభినందించారు.

సముద్రంలో వేటకుకెళ్లి మత్స్యకారుడి మృతి

తాళ్లరేవు: కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలేనికి చెందిన మత్స్యకారుడు చేపల వేటకెళ్లి మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చినబొడ్డువెంకటాయపాలేనికి చెందిన సంగాడి సూరిబాబు(33) ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో మరికొంతమందితో కలిసి పడవపై సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. రెండు గంటల సమయంలో వలలో కాలు చిక్కుకోవడంతో నీటిలో పడి మృతి చెందాడు. అతడికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట - 18, 20, వంకాయలు - 40, 44, 55, బెండకాయలు - 32, పచ్చిమిర్చి - 60, 78, 80, కాకరకాయ - 40, బీర - 35, 40, క్యాబేజీ - 30, క్యారెట్ - 36, దొండకాయలు - 30, బంగాళాదుంపలు - 20, 23, ఉల్లి - 23, 29, గోరుచిక్కుళ్లు - 40, దోసకాయలు - 20, చిక్కుళ్లు- 50, చేమదుంపలు - 40, బీట్‌రూట్ - 36, కీర దోస - 46, బీన్స్‌కాయలు - 90, అల్లం - 48, క్యాప్సికం - 106, బొబ్బర్లు - 18, చిలకడదుంపలు - 36, ఒకటి చొప్పున ఆనపకాయ - 20, 25, పొట్లకాయ - 25, 30, అరటికాయ - 7, 8, 9, మునగకాడ - 6, 7, మామిడికాయ - 6, 8, నిమ్మకాయలు(డజన్) - 24, 36.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- సూపర్‌మ్యాన్, జురాసిక్ వరల్డ్ రీ బర్త్, ఓ భామా అయ్యో రామ, కుబేర, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- ఓ భామా అయ్యో రామ, మార్గన్, ది 100, లక్ష్మి- సూపర్‌మ్యాన్, సత్యగౌరి- వర్జిన్ బాయ్స్, తిరుమల- తమ్ముడు, సీఅండ్‌సీ 1- సూపర్‌మ్యాన్, సీఅండ్‌సీ 2- కుబేర, శ్రీప్రియ- జురాసిక్ వరల్డ్ రీ బర్త్(ఉ, సా), 3 బీహెచ్‌కే(మ, రా), పద్మప్రియ- సూపర్‌మ్యాన్, సూర్య1(వాకలపూడి)- తమ్ముడు, సూర్య 2- సూపర్‌మ్యాన్.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ నగరం : 80085 74157
సాంబమూర్తినగర్ : 91548 46719, మసీదుసెంటర్ : 91541 18210
గాంధీనగర్ : 80085 74159, బాలాజీచెరువు : 80085 74154

చెట్టుకొమ్మల తరలింపు

గాంధీనగర్‌లోని ప్రధాన రహదారి పక్కన చెట్టుకొమ్మలను తొలగించి, అక్కడే పడేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందితో కొమ్మలను తొలగించి, సమస్యను పరిష్కరించారు.

మొక్కలు తొలగించారు

గైగోలుపాడుకు వెళ్లే రహదారిలో అరుణోదయ మార్గ్ కూడలి వద్ద విద్యుత్తు స్తంభంపై మొక్క తీగ అల్లుకుని ప్రమాదకరంగా ఉందని 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. అల్లుకున్న పొదలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు సందనం

పొంచి ఉన్న ప్రమాదం

కాకినాడ గాంధీనగర్‌లోని ఓ కూడలి వద్ద విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన విద్యుత్ పెట్టె ప్రమాదకరంగా ఉంది. చిన్నారులు సైతం చేతికందేంత ఎత్తులో ఉండి, తీగలు వేలాడుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే ఆస్కారముందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

పట్టించుకోండి.. పరిష్కారం చూపండి

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

రెండు, మూడుసార్లు అర్జీలు ఇచ్చినా.. పరిష్కారానికి నోచుకోవడంలేదని కొందరు.. పరిష్కరించినట్లు చూపి.. అర్జీని మూసివేస్తున్నారని మరికొందరు.. మండల, డివిజన్ స్థాయిలో ఫిర్యాదులు ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని ఇంకొందరు.. తమ ఆవేదనను తీర్చాలని పెద్ద సంఖ్యలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చారు. సంయుక్త కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులకు వినతులు అందజేశారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ మందిరం అర్జీదారులతో కిటకిలాడింది. తమ సమస్యలు పరిష్కరించి స్వాంతన చేకూర్చాలని వారు వేడుకున్నారు.

సర్వే చేయరు.. పట్టాలు ఇవ్వరు..

గృహ నిర్మాణ సంస్థ నా ఇంటికి పట్టా ఇవ్వడంలేదు. ఓటీఎస్ పూర్తయినా అధికారులు కాలయాపన చేస్తున్నారు. గ్రామ సచివాలయంలో సంప్రదించినా పట్టించుకోవడం లేదు. రెండుసార్లు కలెక్టరేట్‌లో అర్జీ అందజేశాను. నా ఇంటి సరిహద్దు సమస్యపై సర్వేకు దరఖాస్తు చేసినా, ఇప్పటివరకు పట్టించుకోలేదు. నా స్థలానికి సర్వే చేయించి సమస్యలు పరిష్కరించాలి. - ఎద్దుల అప్పన్న, గురజనాపల్లి, కరప మండలం

పంటకాల్వ మూసేశారు

గండేపల్లి మండలం, బొర్రంపాలెంలో చేపల చెరువులు నిర్వహించే ఒక రైతు పంట కాల్వను మూసేయడంతో 30 ఎకరాల భూమికి సాగునీరందక ఎండిపోతోంది. నందూరి చెరువు నుంచి ఖండికి వెళ్లే కాలువను 20 మీటర్ల మేర కప్పేసి, చేపల చెరువుకు దారి వేసుకున్నారు. దీంతో పుష్కలంగా నీరున్నా.. మా పొలాలకు రావడం లేదు. ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో అధికారులు సమస్యను పరిష్కరించి ఆదుకోవాలి. - శీలం వెంకటరమణ, బొర్రంపాలెం

బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష మాయం

కిర్లంపూడిలో రాజీవ్ డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. మా గ్రూప్‌నకు రూ.20 లక్షలు రుణం ఇచ్చారు. నాకు రూ.1.73 లక్షలు రాగా, ఈ సొమ్మును నా బ్యాంకు ఖాతాలో వేశారు. కొన్ని రోజుల వ్యవధిలోనే దీనిలో రూ.లక్ష మాయమైంది. బ్యాంకు అధికారులు, యానిమేటర్లను అడిగితే మా కుటుంబ సభ్యురాలి అప్పునకు జమ చేశామని చెబుతున్నారు. నా అనుమతి లేకుండా బదలాయించారు. దీనిపై అనేకసార్లు బ్యాంకు అధికారులు, యానిమేటర్లను సంప్రదించినా, పట్టించుకోవడంలేదు. నా సమస్యను పరిష్కరించి ఆదుకోవాలి. - నేతల పద్మ, కిర్లంపూడి, కిర్లంపూడి మండలం

మొక్క నాటుతున్న సత్యసూర్య, కళాశాల సిబ్బంది

ప్రకృతిని పరిరక్షించండి

సాంబమూర్తినగర్: ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి, దత్తత తీసుకుని పెంచాలని, భవిష్యత్తు తరాల కోసం ప్రకృతిని కాపాడాలని మై భారత్ సభ్యులు సూరపురెడ్డి సత్యసూర్య అన్నారు. కాకినాడ ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ సంస్థ మై భారత్ శాఖ ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్'(తల్లికి గుర్తుగా ఒక్క మొక్కను నాటడం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ జి.ఉమారాణి, ఎం.సత్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత ఆహారంతో కార్మికులకు అస్వస్థత

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్: కాకినాడ సీపోర్టు ప్రాంతంలో ఓ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురవడంతో ఆదివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో చేరారు. ఒడిశాకు చెందిన చెందిన ఆరుగురు, అరకు ప్రాంతం నుంచి వచ్చిన ఎనిమిది మంది ఓ కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం భోజనం వండుకుని తిన్నారు. వారంతా రాత్రి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవడంతో తోటి కార్మికులు, సిబ్బంది వారిని జీజీహెచ్‌కు తరలించారు. వెంటనే వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం అందరూ కోలుకున్నారు. కలుషితాహారమే దీనికి కారణమని భావిస్తున్నారు. దీనిపై సర్పవరం పోలీసులు వివరాలు సేకరించారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

సమస్య వింటున్న ఎస్పీ బిందుమాధవ్

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మొత్తం 93 మంది అర్జీలు అందజేశారు. ఎస్పీ వారితో నేరుగా మాట్లాడారు. సకాలంలో వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు స్థానిక పోలీసుస్టేషన్లు, సర్కిల్, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ నగరం: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్ కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అంతకు ముందు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించి ఫోన్ ద్వారా వచ్చిన సమస్యలను అదనపు కమిషనర్ నమోదు చేసుకున్నారు. ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ కనకారావు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, ఏసీపీ శ్రీధర్, డీసీపీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కాకినాడ నగరం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు.. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2025కు దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఈ నెల 17లోపు nationalawardstoteachers.education.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

సిబ్బందికి స్టవ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా నగరంలోని 12వ వార్డు పర్లోపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్‌లు, ప్రీస్కూల్ పిల్లలకు పీపీ1, పీపీ2 వర్క్‌బుక్స్ అందజేశారు. అనంతరం దుమ్ములపేట సెక్టార్ సూపర్‌వైజర్ దయామణి ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూటమి పాలనతోనే ప్రగతి

కాకినాడ నగరం: రాష్ట్రాభివృద్ధి కూటమి పాలనతోనే సాధ్యమని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం 12, 41వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ ఏడాదిపాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారన్నారు. ప్రజలు వైకాపా మాయమాటలు నమ్మవద్దని సూచించారు. స్థానిక నాయకులు తుమ్మల రమేష్, సునీత, గోడి సత్యవతి, జొన్నాడ వెంకటరమణ, మైలపల్లి విద్యాసాగర్, కడలి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో వెంకటరావుకు సత్కారం

డీఆర్వోను సత్కరిస్తున్న జిల్లా స్థాయి అధికారులు

కాకినాడ కలెక్టరేట్: స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావును హౌసింగ్ పీడీ, ఎస్‌డీసీ ఎన్వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అధికారులు సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో డీఆర్వో చేస్తున్న కృషి అభినందనీయమని అధికారులు ప్రశంసించారు. డిప్యూటీ కలెక్టర్, బీసీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీనివాసరావు, సీపీవో పి.త్రినాథ, సమగ్ర శిక్షా అధికారి వేణుగోపాలరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు ఎ.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత గోళ్లమూడి మృతి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, జనవిజ్ఞాన వేదిక నాయకుడిగా, అక్షర గోదావరి ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీపీఎం మాజీ కార్పొరేటర్ గోళ్లమూడి నాగేశ్వరరావు(84) నేతాజీ వీధిలోని ఆయన స్వగృహంలో సోమవారం కన్నుమూశారు. ఆయనకు భార్య లలిత కుమారి, కుమారుడు అజయ్ ఉన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.ప్రసాదరావు, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి, జి.బేబీరాణి, ఎం.రాజశేఖర్, సిహెచ్.రమణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు గోళ్లమూడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. జిల్లా జేఏసీ మాజీ ఛైర్మన్ ఆచంట రామానాయుడు, బూరిగ ఆశీర్వాదం, యూటీఎఫ్, జవివే నాయకులు, పెన్షనర్ల సంఘ నేతలు తదితరులు గోళ్లమూడి మృతికి సంతాపం తెలిపారు. ఆయన నేత్రాలను ఐబ్యాంకుకు దానం చేశారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు

కాకినాడ నగరం: కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ డా.కె.ఆంజనేయులు తెలిపారు. కంప్యూటర్ సైన్స్ 2, బయో టెక్నాలజీ 1 చొప్పున ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం ఈ నెల 17న కళాశాలలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సర్పవరం భూములను రక్షించాలని డిమాండ్ చేస్తున్న ఎస్సీ నాయకులు

ఆవేదన.. ఆందోళన

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్ వద్ద సోమవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ గ్రామీణ మండలం సర్పవరం గ్రామంలో గతంలో ఎస్సీ వర్గానికి బర్మా కాందిశీకులకు ఇచ్చిన 1.37 ఎకరాలను కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని, దీనిని రక్షించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఏనుగుపల్లి జ్యోతి, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు వల్లూరి సత్తిబాబు, పలివెల నవీన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ భూములను ఎస్సీల్లోని పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల నుంచి ఈ భూమిని కాపాడాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. * ఈ భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ప్రతినిధులు జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. ఏనుగుపల్లి కృష్ణ, తోటి చెంగలరావు, పిల్లి శివకుమార్, గుబ్బల ఆదినారాయణమూర్తి, అడబాక గురునాథ్ పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి..

కాకినాడ కలెక్టరేట్: సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన కిరణ్‌కార్తీక్‌ను అత్యంత దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతి పత్రం అందజేసి, న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కిరణ్‌కార్తీక్ తల్లిదండ్రులు వీరవెంకటరమణ, స్వరూప మాట్లాడుతూ నిందితులుపై చర్యలు తీసుకోకుండా సామర్లకోట పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయరూ..

కాకినాడ కలెక్టరేట్: భూములు రీ-సర్వే చేసినా.. వీటి వివరాలను అడంగళ్, ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని, తీవ్రంగా నష్టపోతున్నామని, ఉన్నతాధికారులు ఆదుకోవాలని ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురం గ్రామ రైతులు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో జేసీ రాహుల్‌మీనాకు వినతి పత్రం అందజేశారు. మా గ్రామంలోని సర్వే నంబరు 59-2లో 80 ఎకరాల భూమిని 60 ఏళ్ల నుంచి 70 మంది రైతులు కొని సాగు చేసుకుంటున్నామని, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారని తెలిపారు. రీ-సర్వే పూర్తయినా ఈ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చకపోవడంతో బ్యాంకు అప్పు పుట్టడం లేదని, ప్రభుత్వ రాయితీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ బీసీ మహాసభను విజయవంతం చేయండి

కాకినాడ కలెక్టరేట్: ఈనెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభను విజయవంతం చేయాలని బీసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సాంబమూర్తినగర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుండల సాయికుమార్ ఆధ్వర్యంలో మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వియ్యపు అప్పలస్వామి, పంచకట్ల రామకృష్ణ, మరుకుర్తి వీరగంగాధర్, చీపురుపల్లి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ లయన్స్ క్లబ్ ప్రారంభం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

గాంధీనగర్: కాకినాడ రూరల్ లయన్స్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా దంత వైదులు డా.అడ్డాల సత్యనారాయణ, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా రంగనాయకులుతో లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ, రమేష్, విశ్వేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ జిల్లా గవర్నర్ ఈశ్వరరావు, చిట్నీడి శ్రీనివాసు, సభ్యులు ఎన్.వెంకటేశ్వరరావు, తలారి రామచంద్రరావు, ప్రభుదాస్, కామేశ్వరి, కె.శ్రీనివాసు, కేసవ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

కాకినాడ నగరం: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ డా.ఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కృషిభవన్‌లో సోమవారం ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. కావాల్సిన వారికి డీఏపీ ఇస్తామని, జిల్లాలో యూరియా కొరత లేదని చెప్పారు. తాడేపల్లిగూడెం నుంచి అనధికారికంగా ఎరువులు జిల్లాకు వస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, దీనివల్ల జిల్లాలో 35 శాతం కంటే ఎక్కువ వినియోగం జరుగుతున్నట్లు కేంద్రం గుర్తించిందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. మన జిల్లాకు కేటాయించిన సరకు ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోబోమని జేడీ హెచ్చరించారు. ఏడీఏలు బాబూరావు, పి.స్వాతి, ఎంఏవో ఎన్.మురళీధర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమ్మె జయప్రదం

గాంధీనగర్: నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న చేపట్టిన సమ్మె కార్మికులందరి సమష్టి కృషితో విజయవంతమైందని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, సిహెచ్.రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ ఏపీ, తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.రాజు, ఏఐసీసీటీయూ రాష్ట్ర నేత జి.సత్యనారాయణ, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే ఉద్యోగ భద్రత కలిగిన వారు సైతం అసంఘటిత రంగ కార్మికులుగా మారిపోవాల్సి వస్తుందన్నారు. పరిశ్రమల్లో పనిచేసేవారు శ్రమదోపిడీకి గురవుతారని చెప్పారు. ఏ రంగంలో పనిచేసేవారికైనా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలనే పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్రంలో పెంచిన పని గంటలు తక్షణం ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినుల చదువుకు ఆర్థిక సాయం

అందజేస్తున్న డాక్టర్ రామకృష్ణ, కోన సతీష్, ప్రశాంతి

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని భానుగుడి సెంటర్‌లోని అక్వేరియం రెస్టారెంట్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మానస, బీఎస్సీ నర్సింగ్ మూడో ఏడాది చదువుతున్న మహిమలకు రూ.20 వేల చొప్పున ఆర్థికసాయాన్ని నిర్వాహకులు కోన సతీష్, ప్రశాంతి అందించారు. కార్యక్రమానికి హాజరైన ట్రస్టు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ తాను కూడా ప్రతినెలా రూ.5 వేలను చిన్నారుల చదువు నిమిత్తం సహాయం చేస్తానని పేర్కొన్నారు. శ్రీయువసేన అధ్యక్షుడు బొల్ల సతీష్, యండమూరి మణికంఠ, బొరుసు నాని, శ్రీను, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కల్నల్ మాలిక్

సాంబమూర్తినగర్: కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్‌పై విద్యార్థినులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్, ఎన్‌సీసీ ఏఎన్ఓ కెప్టెన్ డా.జి.ప్రమీలరాణి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు, చివరి సంవత్సరం విద్యార్థినులకు పథకంపై వివరించారు. నాయక్ గోపాల్, కమాండింగ్ అధికారి కల్నల్ హెచ్ఎస్ మాలిక్ మాట్లాడారు. ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ సువర్చల, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవిపై సంబరాలు

కాకినాడ నగరం: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా నారా లోకేశ్ యవజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్ర, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, బత్తుల సూర్యప్రసాద్, అడపా జగదీష్, కర్రి వీరబాబు, సత్యనారాయణ, నాగబాబు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

మసీదు సెంటర్ (కాకినాడ): ఈ నెల 13న జరిగిన రెండు చోరీ కేసుల్లో నిందితుడు ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లును కాకినాడ పోర్టు పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్, క్రైం సీఐ వి.కృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, అదుపులోకి తీసుకుని, 16 గ్రాములు విలువజేసే బంగారు ఆభరణాలను రికవరీ చేసుకున్నారని చెప్పారు.



ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

జిల్లా కేంద్రమైన కాకినాడలోని ఆర్టీసీ బస్టాండులో వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆవరణలో ఎలాంటి షెడ్డు లేకపోవడంతో వాహనాలు ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ పాడవుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ ఓ షెడ్డుతో కూడిన పార్కింగ్ స్థలం ఉన్నా నాలుగేళ్లకిందట అక్కడి షెడ్డు విషయంలో నిర్వాహకుడు కోర్టుకెళ్లారు. అప్పటినుంచి అది నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీని పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇక డిపో గ్యారేజ్ ఆనుకుని వెనుక వైపు ఓ పార్కింగ్ షెడ్డు ఏర్పాటు చేసినా చాలడం లేదు. పైగా అక్కడికి వెళ్లాలంటే ప్లాట్‌ఫాంలపై ఉన్న బస్సులను దాటాలి. ఒక్కోసారి బస్సులు నిండుగా ఉండటంతో వెళ్లలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. ఆ క్రమంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు కొందరు ప్రయాణికులు కార్లు, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండు ఆవరణలో నిరుపయోగంగా పార్కింగ్ షెడ్డు

ఆరుబయటే వాహనాలు

చర్యలు తీసుకుంటాం..

బస్టాండు ముందు భాగాన ఉన్న పార్కింగ్ షెడ్డు విషయమై కోర్టులో వివాదం నడుస్తోంది. ఇది త్వరలో సమసిపోతోంది. వెనుక వైపు గ్యారేజ్ ఆనుకుని షెడ్డు ఏర్పాటు చేశాం. ఆవరణలో ఇష్టానుసారంగా పార్కింగ్ చేయకుండా సిబ్బందిని నియమించాం. ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. - బాలకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్, కాకినాడ డిపో

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

వ్యాధుల బారినపడకుండా చర్యలు

గొల్లప్రోలు: డయేరియా, అతిసార వంటివాటి బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణాధికారి అహ్మద్‌బాషా సూచించారు. తాటిపర్తిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. వన్నెపూడిలో దోమతెరల వినియోగం వివరించారు. రజనీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి

పెద్దాపురం: విద్యాహక్కు చట్టం అమలులో కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అలక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు ఆర్డీవో శ్రీరమణికి వినతిపత్రం అందించారు. ఈ మేరకు క్రాంతికుమార్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్ల కేటాయింపును చాలామంది పాటించడం లేదన్నారు. అప్పన్న, నరసింహమూర్తి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలకు పరిష్కారం

పిఠాపురం: ప్రజల అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతామని పాడా ఏపీడీ వసంతమాధవి తెలిపారు. సోమవారం పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. 74 అర్జీలు స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు వాటిని పరిష్కరించాలని సూచించారు. కమిషనర్ కనకారావు తదితరులు పాల్గొన్నారు. ✦ పెద్దాపురం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆరు అర్జీలు వచ్చాయని ఆర్డీవో శ్రీరమణి తెలిపారు.

నేడు మంత్రితో గడియారస్తంభం ప్రారంభం

సామర్లకోట: సామర్లకోట పట్టణంలోని స్టేషన్ సెంటర్ రింగ్ వద్ద నిర్మించిన గడియార స్తంభాన్ని మంగళవారం ఉదయం 6 గంటలకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరం మంత్రి పెద్దాపురంలో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే చినరాజప్ప సోమవారం తెలిపారు.

దుకాణంలో తనిఖీలు

గొల్లప్రోలు: గొల్లప్రోలులో పురుగు మందులు, విత్తనాల దుకాణాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక హోల్‌సేల్ దుకాణమైన శ్రీకృష్ణ ఏజెన్సీస్‌లో ధ్రువపత్రాలు, నిల్వల గురించి చూశామన్నారు. ఆ శాఖ అధికారి శివరామకృష్ణ, ముమ్మిడివరం ఏడీఏ వంశీ, ఏవో సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు కృషి

సామర్లకోట: బాలల హక్కుల పరిరక్షణకు కమిటీ కృషి చేయాలని పురపాలిక ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. సోమవారం సామర్లకోట భీమేశ్వర లయన్స్‌క్లబ్ భవనంలో ఉష అధ్యక్షతన మండల, వార్డు స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులకు బాలల చట్టాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ శ్రీవిద్య, సీఐ కృష్ణభగవాన్ పలు అంశాలు వివరించారు. శ్రీనివాసరావు, దుర్గారాణి, ఉమాదేవి, సుల్తానాబీబీ, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు తొలగిస్తాం..

'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో డీఈఈ శ్రీనివాస్

పిఠాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు తొలగించేందుకు నిత్యం కృషి చేస్తున్నాం. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. పిఠాపురంలో 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ఉప కేంద్రాన్ని రూ.3 కోట్లతో నిర్మిస్తున్నాం. రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుంది. 75 కొత్త నియంత్రికలు రూ.1.40 కోట్లతో సిద్ధం చేశాం. పిఠాపురం నుంచి పి.దొంతమూరుకు కొత్త విద్యుత్తు లైన్ ఏర్పాటుకోసం రూ.1.08 కోట్లు వెచ్చించాం. స్తంభాలు చాలావరకు మార్చుతున్నాం. ముఖ్యంగా సోలార్ విద్యుత్తు ప్యానెళ్ల ఏర్పాటుకు ద్వారా సంఘాలకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. ఆ మేరకు వారికి అవగాహన కల్పిస్తున్నామని డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. 'ఈనాడు' ఫోన్ ఇన్ ద్వారా సోమవారం ప్రజల నుంచి వచ్చిన 50కిపైగా సమస్యలు విని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

? సమస్య: కొత్తపల్లి మండలం కొండెవరం ఇందిరానగర్‌లో 11 కేవీ విద్యుత్తు లైన్ అవసరం. - **వేమగిరి రాంబాబు**

✓ సమాధానం: దీనికి ప్రభుత్వం నుంచి సొమ్ము చెల్లించాల్సిఉంది. ఆ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

? పిఠాపురం జార్జిగారివీధిలో ఇటీవల స్మార్ట్‌మీటరు పెట్టారు. దాంతో మాకు బిల్లు ఎక్కువగా వచ్చింది. - **సూర్యనారాయణ**

✓ స్మార్ట్ మీటర్‌లో అసలు సమస్యలు రావు. మీకు కలిగిన ఇబ్బందిని పరిశీలించేందుకు లైన్‌మేన్‌ను ఇంటికే పంపిస్తాం.

? ఉప్పాడ మార్కెట్‌లో నియంత్రిక వద్ద తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. సరిచేయించాలని మనవి. - **వీరబాబు**

✓ అవి కేబుల్ తీగలు కావచ్చు. సిబ్బందిని పంపి పరిశీలించి.. ఒకవేళ విద్యుత్తు తీగల్ని తప్పకుండా సరి చేయిస్తాం.

? పిఠాపురంలోని చిట్టోడితోట, వెలంపేటల్లో లోఓల్టేజీతో ఇళ్లలోని ఉపకరణాలు కాలిపోతున్నాయి. - **ఇందిరా, ఆలీషా**

✓ ఏసీలు తదితరాల వల్ల విద్యుత్తు వినియోగం పెరిగి ఇబ్బందులు తలెత్తుతాయి. నియంత్రిక ఏర్పాటు చేస్తాం.

? గొల్లప్రోలులోని కరణంగారివీధిలో నిత్యం విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. - **రవీంద్ర, రాజా, ఊటా సుధాకర్**

✓ చెట్ల కొమ్మల తొలగింపు పనులు జరుగుతున్నాయి. పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతాం.

? పిఠాపురం మండలం జములపల్లి, కొత్తపల్లిలోని అమీనాబాద్‌లలో నియంత్రికలు చెత్తలో ఉన్నాయి. - **ప్రసాద్, కాశీ**

✓ నియంత్రికలు, తీగల మార్పునకు ఆ ప్రాంత వాసులు రుసుములు చెల్లిస్తే ఆ వెంటనే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

? గోర్సలో ఒకే ఆధార్‌పై నాలుగు మీటర్లు చూపిస్తున్నాయి. పింఛను, రేషన్ కార్డు రావడం లేదు. - **కాదా ప్రసాద్**

✓ కార్యాలయానికి వస్తే ఆన్‌లైన్‌లో పరిశీలించి మీ పేరున లేనివి తొలగిస్తాం.

? నా పేరున ఏడు మీటర్లున్నట్లు ఆన్‌లైన్‌లో ఉండడంతో తల్లికి వందనం లబ్ధి రాలేదు. - **ఎ.లోవకుమారి, దుర్గాడ**

✓ ఆధార్‌కు అనుసంధానంలో ఇబ్బంది ఇది. మమ్మల్ని సంప్రదించి సరిచేయించుకోండి.

? గోకివాడకు పిఠాపురం లైన్‌నుంచి కాకుండా పి.దొంతమూరు నుంచి విద్యుత్తు ఇవ్వడంతో అంతరాయం ఏర్పడుతోంది. - **పవన్, హరిబాబు**

✓ పి.దొంతమూరు లైన్ కొత్తగా ఏర్పాటు చేశాం. ఇకపై సమస్యలు రావు.

? కొండెవరంలోని కొండయ్యకాలువ మార్గంలో పొలాల్లోని విద్యుత్తు స్తంభాలు వాలిపోయి ఉన్నాయి. - **తలుపులరావు**

✓ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చోట్ల స్తంభాలు ఏర్పాటు చేయిస్తాం.

? పిఠాపురంలో మా ఇంటికి సోలార్ విద్యుత్తు కావాలి. ఏం చేయాలి, ఏర్పాటు చేసుకునేందుకు ఎంత చెల్లించాలి. - **రమేష్**

✓ సోలార్‌కు రాయితీలున్నాయి. 2 కిలోవాట్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్‌కు రూ.75 వేల రాయితీ వర్తిస్తుంది.

? తాటిపర్తిలో లైన్‌మెన్‌లు అందుబాటులో ఉండడం లేదు. ప్రైవేటు వారితో పనులకు డబ్బులవుతున్నాయి. - **సుబ్రహ్మణ్యం**

✓ లైన్‌మేన్‌ను అందుబాటులో ఉండాలని హెచ్చరిస్తాం. అనుమతి లేకుండా ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో పని చేయకూడదు.

? పిఠాపురంలో స్టువార్టుపేట, ఉప్పాడ సెంటర్‌లో నియంత్రికలను ఎత్తుపెంచి, రక్షణగా గోడలు కట్టాలి. - **శ్రీను**

✓ నియంత్రికలను సిబ్బందితో కలిసి పరిశీలిసాం. రక్షణ చర్యలు తీసుకుంటాం.

? పిఠాపురంలో అగ్రహారం కబేళామార్గంలో విద్యుత్తు తీగలు కిందకు ఉన్నాయి. లోడ్ ఎక్కువై కాలిపోతున్నాయి. - **గంటా బాబీ**

✓ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరాన్ని బట్టి సురక్షితంగా తీగలు మార్పు చేస్తాం.

? తాటిపర్తి పుంతరోడ్డులో నిత్యం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చర్యలు చేపట్టండి. - **బొజ్జా ప్రసాద్**

✓ వినియోగదారుల సంఖ్య ఆధారంగానే లైన్‌ఉంది. అవసరమైతే మార్పు చేస్తాం.

శాకంబరి దర్శనం.. శుభకరం

కరప: కరప శివాలయంలో పర్వతవర్ధిని అమ్మవారిని సోమవారం శాకంబరిగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాస్, ఫణిరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ప్రత్యేక కార్యక్రమాలతో శివాలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో శోభిల్లింది.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలంలో విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నట్లు ఈఈ ప్రభాకర్ తెలిపారు. దాంతో దుర్గాడలో వ్యవసాయ సర్వీసులకు, ఎ.విజయనగరంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

ఆలయాదాయం రూ.56.74 లక్షలు

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ జాతరలో భాగంగా 19 రోజులకు రూ.56,74,507 ఆదాయం వచ్చిందని ఏసీ విజయలక్ష్మి సోమవారం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: నడకుదురు పశువుల ఆసుపత్రి సమీపంలో వ్యర్థాలు వేస్తున్నారు. దాంతో దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నాం. - **చంద్రరావు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వారిజకు చెప్పగా సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించారు.

సమస్య: గొల్లప్రోలు కరణంగారి తోట వీధిరోడ్డుపై చెత్త పేరుకుపోయింది. వాసనకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. - **స్థానికులు**

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్‌కు చెప్పగా సిబ్బందితో తొలగింపజేశారు.

సమస్య: మంగళవారపుపేటలో మురుగుకాలువ శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందిపడుతున్నాం. - **రమణ**

పరిష్కారం: పారిశుద్ధ్య విభాగం అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు.

సమస్య: పిఠాపురంలోని సీతయ్యగారితోట, పప్పుల వీధి, ఉప్పాడ సెంటర్ తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుని ఉంది. - **రమేష్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా కార్మికులతో శుభ్రత చర్యలు చేపట్టారు.

సమస్య: కొత్తపల్లి శివాలయం వీధిలో మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. - **స్థానికులు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

– న్యూస్‌టుడే, కరప, గొల్లప్రోలు, పెద్దాపురం, పిఠాపురం, కొత్తపల్లి

సుపరిపాలనలో తొలిఅడుగు.. ప్రజావిజయం

కాజులూరు, పెదపూడి: కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో సంక్షేమమే ధ్యేయంగా భవిషత్తులో పాలన కొనసాగుతుందని సహకార సంఘం అధ్యక్షుడు లంగర కృష్ణ అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజాభిప్రాయాలు సేకరించి మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. పార్టీ నేతలు నక్కా శ్రీను, లక్ష్మీనారాయణ, అంగర శ్రీను, అత్తిలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ✦ తెదేపా అనపర్తి నియోజకవర్గ యువనాయకుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పెదపూడి మండలం గండ్రేడులో పర్యటించారు.

కరపత్రాలు అందిస్తున్న కూటమి నాయకులు

విలక్షణ నటుడు కోట మృతికి సంతాపం

పిఠాపురం: ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి కోట శ్రీనివాసరావు అని భాజపా జిల్లా కార్యదర్శి గండి కొండలరావు అన్నారు. కోట మృతికి సోమవారం సంతాపం వ్యక్తం చేస్తూ పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయంలో శ్రద్ధాంజలి కార్యక్రమం పట్టణ భాజపా అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మురళీధరరావు, ఏడుకొండలు, తాతీలు, లక్ష్మీరావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

కోట చిత్రపటం వద్ద భాజపా నేతలు

నాలుగు రోజుల్లో పురుషోత్తపట్నం నీరు

పిఠాపురం: ఏలేరు ఆయకట్టుపై సాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో నాలుగు రోజుల్లో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి నీరు చేరుతుందని మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్కొన్నారు. పిఠాపురం మండలంలోని పి.దొంతమూరు, వెల్దుర్తి, పి.తిమ్మాపురం, పి.రాయవరం, భోగాపురం, రాపర్తి, బి.ప్రత్తిపాడు రైతుల అభ్యర్థన మేరకు సింహాద్రిరాజు కాలువలను సోమవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వంలో పంట కాలువల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, అధికారుల నిర్లక్ష్యంతో పనులు పూర్తి కాలేదన్నారు. సమస్యను మంత్రి రామానాయుడుకు తెలిపామన్నారు. ఏలేరులో 10 టీఎంసీల నీరు ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇన్కో పైపులైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో నాలుగు రోజుల్లో పురుషోత్తపట్నం నుంచి నీరు మళ్లిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. పీబీసీకి కూడా నీరు పుష్కలంగా సరఫరా చేయాలని తెలిపామన్నారు.

లయన్స్ క్లబ్ విజన్ సేవలు

సర్పవరం జంక్షన్: ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని విజన్ అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి తెలిపారు. రమణయ్యపేటలో సోమవారం క్లబ్ కార్యదర్శి శ్రీవాణి సౌజన్యంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు నిత్యావసరాలు అందించారు. ప్రసూన, విజయలక్ష్మి, ప్రసాదరావు, సత్యనారాయణ రాజు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కృష్ణ మృతికి ఎమ్మెల్యే నివాళి

సామర్లకోట: సామర్లకోట పురపాలిక సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మృతికి ఎమ్మెల్యే చినరాజప్ప సోమవారం నివాళి అర్పించారు. 25 ఏళ్లపాటు ఆయన ప్రజలకు సేవలందించారన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు అరుణ, శ్రీకాంత్, కుమారస్వామి, జగదీశ్‌మోహన్, రవిచంద్రప్రసాద్ తదితరులు సంతాపం ప్రకటించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కరప: వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వాణి సోమవారం కోరారు. మ్యాథ్స్ బోధించేవారు కావాలని, ఎమ్మెస్సీలో 50 శాతం మార్కులతో అర్హత కలిగి ఉండాలన్నారు. బయోడేటాతో ఈ నెల 16న ఉదయం ముఖాముఖికి హాజరుకావాలని కోరారు.

వేలం ప్రకటన

In the Court of the Honourable Senior Civil Judge, Pithapuram

EP 1/2023 in OS 88/2017

Between:

Kedarisetti Suneetha ...DHR

Kurakala Gangadhara Ramarao ...JDR

పై నెంబర్ అమలు గ్రంథములో DHR/వాది యొక్క డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ క్రింది ఉదహరించిన EP Schedule దాఖలా ఆస్తిని ది.21-07-2025వ తేదీన ఉదయం గం.10.30 ని.లకు ...

DHR Value: 8,00,000/-

Amin Value: 35,00,000/-

JDR ...

// By order of the Court //

K.S.R.Bhaskar

M.Satyavani Sri

Advocates

Madhavaraayudupalem

Pithapuram - 533 450, Cell: 94408 60625

కాలువలో వ్యర్థాలు..సాగునీటికి ఆటంకాలు

పిఠాపురం మండలం భీమ్‌నగర్ వద్ద ఏలేరు కాలువలో చెత్త వేస్తున్నారు. ఇళ్లలో తొలగించిన వ్యర్థాలను సైతం తీసుకొచ్చి ఈ ప్రాంతంలో వంతెన పక్కనే కాలువలో పడేస్తున్నారు. దాంతో కాలువ మూసుకుపోతోందని స్థానిక రైతులు గగ్గోలు పెడుతున్నారు. సమస్యను ఈవోపీఆర్డీ రామకృష్ణతో చెప్పగా శుభ్రం చేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

చిన్నపాటి పనులు..చేయకనే ఇబ్బందులు

కూరాడ శివారు చినమామిడాడలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టి మూడు నెలలు గడుస్తున్నా గ్రావెల్‌తో బెర్మలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులకు ఇరుపక్కలా బెర్మలు లేవు. సమస్యపై ఏఈ శైలజకు తెలుపగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

'వందనం' అందలే.. వదనం మురవలే..!

దుర్గాడలోని కటారి కృష్ణ తల్లిదండ్రులు లేని తన మనవడు మణిశంకర్‌ను గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదివిస్తున్నారు. ఈ చిన్నారికి గార్డియన్‌గా ఉన్న కూలిపనులకు వెళ్లే కృష్ణ పేరున 11 ఎకరాల భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది. గత ప్రభుత్వంలో అధికారుల తప్పిదంతో ఇలా జరిగిందని అధికారులు న్యాయం చేయాలని సోమవారం పిఠాపురంలోని పాడా కార్యాలయానికి వచ్చి విన్నవించారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి

పెద్దాపురం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పెంపును వ్యతిరేకించాలని కోరుతూ సోమవారం పెద్దాపురంలో పట్టణ సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార జాతా కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు వీర్రాజు, సుబ్బలక్ష్మి, కృష్ణ, నరసింహమూర్తి, అప్పన్న, విశ్వనాథం, రమణ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా చేర్చండి

గొల్లప్రోలు: అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని గొల్లప్రోలు ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాలకృష్ణ ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. శిక్షణ పొందిన బీఎల్‌వోలకు తహసీల్దారు ధ్రువపత్రాలు అందజేశారు. పద్మవేణి, నాగసౌజన్య, బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

వేలం ప్రకటన

మహారాష్ట్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: కాకినాడ

E.P.No.172/2023 in O.S.No.356/2021

Between:

వాసంశెట్టి వెంకటలక్ష్మి ...DHr

మరియు

1) కోటి శ్రీనివాస్

2) కోటి భవాని

3) కోటి వెంకట ప్రసాద్ ...JDrs

SCHEDULE: East Godavari District, presently Kakinada District, Tallarevu Sub Registry, Tallarevu Mandal, Sunkarapalem Gram Panchayat, Sunkarapalem Village, Zeroyathi wet, S.No.39/4 full extent of Ac. 0-47 cents western side an extent of 265 Sq. yards of site and ACC Roof shed bounded by:

East: 76.6 feet - Site belongs to Karri Satish Kumar Reddy, West: 59.0 feet - Agricultural land belongs to Toleti Suryanarayana, North: 41.6 feet - Agricultural land belongs to Kakaraparthi Someswara Sarma, South: 34.9 feet - Puntha Road.

Within the above boundaries the total extent of 265 sq.yds. of site with all easementary rights, common ways etc.

DHr Value: Rs.1,00,000/-

Amin Value: Rs.5,30,000/-

K.V.S.V.లక్ష్మీబాపు (డిహెచ్‌ఆర్)

అడ్వకేట్, డో.నెం.6-1-9/1, కాకినాడ, సెల్: 9866211196

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

పెద్దాపురం: జాతీయ లోక్ అదాలత్‌తోపాటు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి పేర్కొన్నారు. పెద్దాపురం పట్టణంలో సోమవారం ర్యాలీని ఆమె ప్రారంభించారు. జడ్జి దేవీరత్నకుమారి, సత్యనారాయణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు. ✦ సర్పవరం జంక్షన్: బోటుక్లబ్ ఉద్యానంలో సోమవారం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో యనమల రామం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నప్రసాదరావు, శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న జడ్జి చంద్రమౌళీశ్వరి

సాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

పిఠాపురం, న్యూస్‌టుడే: ఏలేరు, పీబీసీ ద్వారా ప్రతి ఎకరాకూ సాగునీరు పుష్కలంగా అందేలా చూడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అధికారులను కలిసి కోరారు. సోమవారం చిత్రాడ పీబీసీ కాలువ, సామర్లకోట మార్గంలోని ఏలేరు కాలువల పరిస్థితిని ఆర్డీవో మల్లిబాబు, డీఈ శేషగిరి ఇతర అధికారులు కాలువలను పరిశీలించారు. సూచనలు చేశారు. సునీల్‌కుమార్, స్వాతి, గోపాలకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత యోగా తరగతులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో లయన్స్, వాసవీక్లబ్‌ల ఆధ్వర్యంలో గణపతి సచ్చిదానంద స్వామిజీ, మైసూర్ శిష్యుల పర్యవేక్షణలో దత్తక్రియ యోగా తరగతులు మంగళవారం ప్రారంభమవుతాయని నిర్వాహకులు సామా భగవాన్, అత్తూలూరి శ్రీను తెలిపారు. ఈ తరగతులు 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

"I've fought the good fight,
I have finished the race, I have kept the faith"
- 2 Timothy 4:7

In loving memory of



Proddoku Israel

25th March 1925 - 13th July 2025

Funeral Service
Date : 15th July 2025 | 8:30 am
Venue : LEF Church, Kakinada

Place of Burial
Sambamurthy Nagar
Burial Ground (Old)

Memorial Service
Date : 17th July 2025 | 6:00 pm Venue : LEF Church, Kakinada
Followed by Dinner @ Our Residence 10-4-32/C, Ramaraopet, Kakinada

Sons :
Samuel Vijaykumar & Family
John Rajkumar (AC John) & Family
+91 9849562336

Daughters :
Sujatha Mary & Family
Shanthi Benhur & Family
Elizabeth Florence & Family

Deepest Condolences from KIET & RIMS

బస్తాలు చూపుతున్న అధికారులు

గోరింటలో పీడీఎస్ బియ్యం స్వాధీనం

పెద్దాపురం: పెద్దాపురం మండలం గోరింటలో అక్రమంగా నిల్వఉంచిన 4.4 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి సత్యనారాయణరాజు తెలిపారు. అక్రమ వ్యాపారం సాగిస్తున్న గ్రామానికి చెందిన రాగంశెట్టి స్వామిపై 6 ఏ, క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. గతంలో ఇతని సోదరుడిపై పలుమార్లు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

కరప: వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై సునీత తెలిపారు. కరపలో ఈ నెల 13న ఆస్తి తగాదా నేపథ్యంలో చోటుచేసుకున్న గొడవలో బి.చంద్రశేఖర్ అనే యువకుడు క్షణికావేశంలో అతని బంధువైన వీరరాఘవపై కత్తితో దాడి చేసిన కేసులో రిమాండ్ పడిందన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టుకు అభినందన

సర్పవరం జంక్షన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏపీఎస్పీ కాకినాడ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని ఏపీఎస్పీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు తెలిపారు. సోమవారం జట్టును సుబ్బరాజు తదితరులు అభినందించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో జరిగిన పోటీలో క్రీడాకారులు రాణించారన్నారు.

హంతకులను శిక్షించాలి

కాకినాడ కలెక్టరేట్: సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన కిరణ్‌కార్తీక్‌ను అత్యంత దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతి పత్రం అందజేసి, న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కిరణ్‌కార్తీక్ తల్లిదండ్రులు వీరవెంకటరమణ, స్వరూప మాట్లాడుతూ నిందితులపై చర్యలు తీసుకోకుండా సామర్లకోట పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

పాలకవర్గం నై.. పనులకు సై

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రూ.1.27 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు రూపొందించిన ప్రతిపాదనలను వైకాపా మద్దతు పాలకవర్గం అజెండాలో చేర్చకుండా అడ్డుకున్నప్పటికీ జిల్లా కలెక్టరు జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వులతో పనుల నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 2020 పథకాల ద్వారా వచ్చిన నిధులు తదుపరి సర్దుబాటు చేసే విధానంలో గొల్లప్రోలులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషితో రూ.కోటి నగర పంచాయతీకి మంజూరు చేశారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచి గుత్తేదారుల ఎంపికకు సోమవారం ప్రకటన జారీ చేశారు. మే నెలలో జరిగిన సాధారణ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఈ పనులు ప్రతిపాదించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ కనకారావు భావించారు. పాలకవర్గ సమావేశంలో పనుల జాబితాను అజెండాగా పెట్టేందుకు సభ్యులు ఒప్పుకోలేదు. జూన్ నెలలో జరిగే సమావేశంలో రూ.కోటితో పనుల ప్రతిపాదన చేర్చి అజెండా జారీ చేయాలని కమిషనర్ పంపగా, ఆ అంశాన్ని తొలగించి మిగిలిన అంశాల అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ఛైర్‌పర్సన్ తెలిపారు. కమిషనర్ అంగీకరించక జూన్‌లో సమావేశం ఏర్పాటు కాలేదు. సభ్యులెవ్వరికీ తెలియకుండా ఏకపక్షంగా పనుల జాబితా రూపొందించారని, వీటిని అంగీకరించేదిలేదని ఛైర్‌పర్సన్ మంగతాయారు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనకు పాలకవర్గం అంగీకరించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు కమిషనర్ నివేదిక పంపారు. కలెక్టరు ప్రత్యేక ఉత్తర్వులతో రూ.కోటితో పనుల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ కనకారావు తెలిపారు. టెండర్ల గడువు ముగిసిన వెంటనే గుత్తేదారులతో పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూస్తామన్నారు.

గొల్లప్రోలులోని ఆరో వార్డులో సిమెంటు రోడ్డు నిర్మించనున్న వీధి

తుని
•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు జగ్గంపేటకు పురపాలకశాఖ మంత్రి రాక

జగ్గంపేట: జగ్గంపేటలో మంగళవారం నిర్వహించబోయే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పాల్గొంటారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తెదేపా కార్యాలయంలో టౌన్ బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తెదేపా ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నెహ్రూ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు తెదేపా కార్యాలయానికి మంత్రి చేరుకుంటారని, అక్కడ నుంచి జగ్గంపేటలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, నండ్ల చిరంజీవి పాల్గొన్నారు.

భారీ సైజు గన్ కాదు

గండేపల్లి, న్యూస్‌టుడే: భారీ సైజు మిషన్ గన్ ఆకారాన్ని పోలిన యంత్రం ఎన్‌హెచ్‌పై వాహనదారులను, ప్రయాణికులను కనువిందు చేసింది. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపుగా ట్రాలీపై వెళ్తున్న మిషన్ యంత్రం సోమవారం గండేపల్లి మండలం మల్లేపల్లి ఎన్‌హెచ్‌పై కనిపించింది. ఇది చూడడానికి అచ్చం గన్‌ను పోలినట్లు ఉండటంతో ప్రయాణికులు ఆగి తిలకించారు. భారీ యంత్రాలను, మెషిన్లను పైకి ఎత్తేందుకు, దింపేందుకు ఉపయోగిస్తారని వాహనదారుడు తెలియజేశారు.

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ మెహర్

అనవసర లింక్‌లను తెరవద్దు

✦ 'ఈనాడు' ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన

తొండంగి, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.వీకే.మెహర్ అన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల విద్యార్థులు, ఉద్యోగులు సైబర్ నేరాలకు ఎక్కువగా బలవుతున్నారన్నారు. తెలియని ఫోన్ నంబర్లకు స్పందించడంతో పాటు చరవాణులకు వచ్చే అనవసర లింక్‌లను ఓపెన్ చేసి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు సమాచారం, తెలియని నంబర్లను సేవ్ చేసుకోవడం వంటివి చేయకూడదన్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లో తెలియనివారు ఫోన్ చేసుకుంటామని అడిగితే ఫోన్ ఇవ్వకూడదన్నారు. వైస్ ప్రిన్సిపల్ దివాకర్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాము, అధ్యాపకులు కృష్ణారావు, మహాలక్ష్మి, జగదీష్, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈనాడు మీతోడు

హాజరైన కళాశాల విద్యార్థులు

అధ్వాన పారిశుద్ధ్యం..

గ్రామాలు, పట్టణాల్లో రోజురోజుకి పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలు

పరిశీలన

గండేపల్లి, జగ్గంపేట, న్యూస్‌టుడే: గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ సంకల్పం సాధించేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారుల ఆదేశాలున్నా గ్రామస్థాయిలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించాలని ఎప్పటికప్పుడు కార్యదర్శులకు సూచిస్తున్నా కొన్ని చోట్ల నీలినీడలు వెంటాడుతున్నాయి. జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 52 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆచరణలో అవి తూతూ మంత్రంగానే దర్శనమిస్తున్నాయి. గండేపల్లి మండలంలో తాళ్లూరు, మల్లేపల్లి పంచాయతీల్లో గత వైకాపా పాలనలో రిక్షాలు, తడి, పొడి చెత్త ఆటోలు మూలకు చేరాయి. తాళ్లూరు, మల్లేపల్లి, నీలాద్రిరావుపేట గ్రామాల్లో ఎన్‌హెచ్ పక్కనే చెత్త వేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిస్తున్నారు.

తాళ్లూరు పంచాయతీలో మూలకు చేరిన వాహనం

మండలం	పంచాయతీలు	సంపద కేంద్రాలు
జగ్గంపేట	16	16
కిర్లంపూడి	18	18
గండేపల్లి	18	17

వారానికి రెండుసార్లు సేకరించాలని ఆదేశాలిచ్చాం..

ప్రతీ గ్రామంలో వారానికి రెండు సార్లు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించాలని కార్యదర్శులను ఆదేశాలిచ్చాం. శివారు ప్రాంతాల్లో, ఎన్‌హెచ్ పక్కన చెత్త వేయరాదని సూచించాం. ప్రతీ సంపద కేంద్రాన్ని నిర్వహణలోకి తీసుకొస్తాం.

- చంద్రరావు ఎంపీడీవో గండేపల్లి

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని అనేక వార్డులు తీవ్ర కాలుష్యభరితంగా మారుతున్నాయి. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు, వైస్‌చైర్మన్ కూడా పారిశుద్ధ్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డులకు వెళ్తున్నపుడు ప్రజలు నిలదీస్తున్నారని, వారికి సమాధానం చెప్పలేకపోతున్నామని పలువురు కౌన్సిలర్లు అంటున్నారు.

మురికి కూపాలే దర్శనమిస్తున్నాయి

పట్టణంలోని ఉప్పరిగూడెం, రామకృష్ణాకాలనీ, వీరవరపుపేట, సాయినగర్, మేదరిపేట, కొండవారిపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వస్తుంది. కాలువలు, రోడ్లపైనా భారీగా చెత్త పేరుకుపోయింది. వీధుల్లో సేకరించిన చెత్త ఇసకలపేట వద్ద వేస్తుండటంతో చుట్టుపక్కల ఇళ్లల్లోని వారు దుర్వాసన, పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రామకృష్ణాకాలనీ ప్రధాన డ్రెయినేజీలో వ్యర్థాలు

నిర్వహణపై నిండా నిర్లక్ష్యం..

పెంటకోటరోడ్డు, బాడవతోట, ఎస్‌ఏరోడ్డు, ఎమ్మార్‌పేట, సీతారంపురం తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా ఉంది. ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అప్పుడే కాలువల్లో సిల్ట్ తొలగింపునకు విడతల వారీగా సుమారు రూ.60 లక్షలకు పైబడి కేటాయించినా క్షేత్రస్థాయి ఆచరణలో నిర్లక్ష్యం రాజ్యమేలుతుంది.

✦ పట్టణంలో వార్డులు: 30
✦ జనాభా: సుమారు 62 వేలు
✦ రోజుకు ఉత్పత్తి అవుతున్న చెత్త: 56 మెట్రిక్ టన్నులు
✦ ప్రస్తుతం ఉన్న కార్మికులు: 95
✦ అదనంగా అవసరమైనవారు: 30 మంది

చర్యలు తీసుకుంటాం

డంపింగ్‌యార్డుకు స్థల సేకరణ త్వరలోనే పూర్తవుతుంది. ఉప్పరిగూడెం రోడ్డులో సుమారు రెండు ఎకరాల స్థలం పురపాలక సంఘం సేకరిస్తోంది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కాలువల్లో సిల్ట్ తొలగించే ప్రక్రియ చేపట్టాం. అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీలు కొత్తగా నిర్మిస్తాం.

- ఎ.వెంకట్రావు, పురపాలక కమిషనర్, తుని

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

గండేపల్లి: ప్రతీ ఇంటికి కూటమి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లి మండలం మురారి గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి తారకరామారావు, కందుల కొండయ్య దొర విగ్రహాలకు పూలదండలు వేశారు. అనంతరం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు పోతుల మోహనరావు, జాస్తీ వసంత్, సుంకవెల్లి రాజు, కొత్త కొండబాబు పాల్గొన్నారు.

మురారిలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ, తెదేపా నాయకులు

యర్రవరంలో ఎమ్మెల్యే సత్యప్రభ, నాయకులు

ఏడాది పాలనలో అన్ని వర్గాలకు మేలు చేశాం

ఏలేశ్వరం: యర్రవరం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేసిన ప్రగతిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అన్ని వర్గాలకు మేలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఏ సమస్య ఉన్నా చెప్పాలని, తమ పరిధిలోని ఇబ్బందులకు తక్షణ పరిష్కారం చూపుతానన్నారు. బసా ప్రసాద్, మైరాల కనకారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపాలకృష్ణ, సూతి బూరయ్య, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అపీత కుచాంబకు సారె సమర్పణ

ప్రత్తిపాడు: రాచపల్లి రమణ సేవాశ్రమంలోని అపీత కుచాంబకు సోమవారం గ్రామస్థులు ఆషాఢ మాసం సందర్భంగా కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. రాచపల్లి గ్రామానికి చెందిన మహిళలు ఇంటికో వంటకాన్ని అమ్మవారికి సారెగా నివేదించేందుకు మేళతాళాలతో తీసుకువచ్చి సమర్పించారు. అరుణాచలేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు అనంతరం అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు

సారెతో గ్రామస్థులు

జడ్జి నేతృత్వంలో 1కే నడక

ప్రత్తిపాడు: నల్సా ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'దేశం కోసం మధ్యవర్తిత్వం' వారోత్సవాల్లో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి ఎల్.గోపీనాథ్ నేతృత్వంలో 1కే నడక కార్యక్రమాన్ని ప్రత్తిపాడులో సోమవారం నిర్వహించారు. ప్రత్తిపాడు కోర్టు నుంచి ప్రధాన రహదారి మీదుగా ఈ నడక సాగింది. మధ్యవర్తిత్వంతో వివాదాలను పరిష్కరించుకొనే వీలుందని జడ్జి సూచించారు. ప్రయోజనాలను వివరిస్తూ న్యాయవాదులు నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.చిట్టిబాబు, న్యాయవాదులు బుగత శివ, ఆడారి సుగుణ, అవసరాల దేవి, ఆకాశపు. మల్లేశ్వరరావు, ఆర్వీ వెంకట్రావు. బి.మధు, నాగేంద్రరాజు, శ్రీనివాస భారతి, సూరిబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో 1కే నడకలో జూనియర్ సివిల్ జడ్జి ఎల్.గోపీనాథ్, న్యాయవాదులు

పట్టాదారు పుస్తకాలు ఇవ్వాలని ఆందోళన

ఏలేశ్వరం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు ఇచ్చి ఇరవై ఏళ్లు గడుస్తున్నా నేటికీ పట్టాదారు పుస్తకాలు ఇవ్వలేదని ఆరోపిస్తూ మండలంలోని తూర్పులక్ష్మీపురం గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ ఎందుకు ఈ ప్రక్రియ జరగడం లేదో బదులివ్వాలని తహసీల్దార్ కుశరాజుని ప్రశ్నించి వినతిపత్రాన్ని అందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారన్నారు. సుబ్బయ్య, మేరీ, అప్పలరాజు, సత్యవతి, చిన్న పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్త యర్రవరంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తెదేపా సీనియన్ నాయకుడు బసా ప్రసాద్ ప్రారంభించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ మిషన్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వచ్చి 200 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి ఆసుపత్రికి పంపామని సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు చెప్పారు.

స్వచ్ఛందంగా ముందుకొచ్చారు..

రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న రైతులు

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని రాజపూడిలో పుష్కరకాలువను ఆనుకుని రైతుల పొలాలకు వెళ్లే రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. వర్షాకాలం రాకముందే రోడ్డును బాగుచేయాలని రైతులు కోరినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గ్రామ సర్పంచి భూసాల విష్ణుమూర్తి సహకారంతో గోతుల్లో రాళ్లు, మట్టి ఏర్పాటు చేయడంతో పలువురు రైతులు పారలు, గునపాలతో చదును చేసుకున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి రెండోవిడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్‌కి సంబంధించి దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. అభ్యర్థులు ఈనెల 20న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94402 62266, 81423 45444 నంబర్లను సంప్రదించాలన్నారు.

భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయరూ..!

కాకినాడ కలెక్టరేట్: భూములు రీ-సర్వే చేసినా.. వీటి వివరాలను అడంగళ్, ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని, తీవ్రంగా నష్టపోతున్నామని, ఉన్నతాధికారులు ఆదుకోవాలని ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురం గ్రామ రైతులు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో జేసీ రాహుల్‌మీనాకు వినతి పత్రం అందజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక

జగ్గంపేట గ్రామీణ మండలంలోని రామవరం ఎన్‌హెచ్‌ను ఆనుకుని ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదాన్ని తలపిస్తుంది. రోడ్డుపక్కన విద్యుత్తు స్తంభానికి నియంత్రిక అమర్చగా ఎన్‌హెచ్ నిర్మాణ సమయంలో రోడ్డును ఎత్తుచేయడంతో నియంత్రిక నేలపై ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ నియంత్రిక చుట్టూ పచ్చిక పేరుకుపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

విరిగిన గేటు గోడ..

తుని తహసీల్దారు కార్యాలయం ప్రహరి గోడ గేట్‌వద్ద ఉన్న గోడ విరిగిపోవడంతో ప్రమాదం పొంచిఉందని అక్కడకు వచ్చేవారు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం ద్వారా తహసీల్దారు కార్యాయానికి వివిధ పనుల ద్వారా నిత్యం వందలాది మంది వచ్చివెళ్తుంటారు. అయితే ఎప్పుడు ఎవరిపై ఈ గేట్ పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి గోడకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

చక్రాల కుర్చీ పరిస్థితి ఇదీ..

తుని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వచ్చే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. బస్సుల్లో ప్రయాణానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా అందుబాటులో ఉంచిన చక్రాల కుర్చీ మూలకు చేరింది. మరమ్మతులు చేయించకపోవడంతో అనేక మంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందిపడుతున్నారు. అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని పట్టణం

తలుపులు అమర్చారు..

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని రాజపూడి బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపుల్లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీనిపై 'వసతిగృహ విద్యార్థుల అవస్థలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ ఎం.శోభారాణి స్పందించారు. తక్షణం మరుగుదొడ్ల తలుపులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఏఈ రామ్మోహనరావుకు ఆదేశాలు జారీచేయగా స్పందించి వసతిగృహంలో తలుపులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

ఈనాడు కథనాలకు స్పందన

పేరు తొలగించిన అధికారులు

తొండంగి: తొండంగిలో ఎంపీడీవో, తహసీల్దారు, వెలుగు కార్యాలయాలకు వెళ్లే ప్రధాన మార్గంలో ఆయా శాఖల కార్యాలయాలకు మార్గం చూపుతూ ఏర్పాటు చేసిన బోర్డుపై వెలుగు కార్యాలయం అన్న పేరుకు బదులు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం అని ఉంది. దీనిపై సోమవారం 'ఏడాది దాటినా అలాగేనా' అనే శీర్షికన చిత్రవార్త ప్రచురితమైంది. వెలుగు ఏపీఎం సౌభాగ్యవతి, సీసీ విజయలక్ష్మి స్పందించి సిబ్బందితో ఆపేరును తొలగించారు.

జగ్గంపేట అగ్నిమాపకాధికారిగా అనిల్‌కుమార్

జగ్గంపేట: జగ్గంపేట అగ్నిమాపక అధికారిగా చెల్లె అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక తెదేపా కార్యాలయం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా రాజోలు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా జగ్గంపేటకు వచ్చానన్నారు. ఈ ప్రాంతంలో ఏ అగ్నిప్రమాదం జరిగినా సకాలంలో స్పందించి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కుమ్మరిలోవకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం

తుని గ్రామీణం: మండలంలోని కుమ్మరిలోవ కాలనీ పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా తొలగించనున్నారు. దీంతో కాలనీ సమీపంలోని కొండను తవ్వే పనులు చేపట్టడంతో జాతీయ రహదారి నుంచి కాలనీకి వెళ్లే దారి తొలగించే పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రహదారికి బదులుగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. తాత్కాలికంగా గ్రామానికి మరో రోడ్డు నిర్మాణ పనులు పోలవరం ఇంజినీరింగ్ సిబ్బంది చేపట్టారు. కాలువ నిర్మాణ పనులు పూర్తైన అనంతరం తిరిగి ప్రస్తుతం ఉన్న రహదారిని పునరుద్ధరిస్తామని వారు తెలిపారు.

తక్షణమే నీటిని విడుదల చేయండి

జగ్గంపేట, న్యూస్‌టుడే: పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగమైన తాళ్లూరు లిఫ్ట్ నీరు అందక గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ ఆరోపించారు. ఈమేరకు జగ్గంపేటలోని తన నివాసంలో మాట్లాడారు. సోమవారం ఖరీఫ్ సాగుకు అవసరమైన నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. పీసీసీ సభ్యులు శ్రీవత్సవాయి సత్యనారాయణరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైకాపా విస్తృత స్థాయి సమావేశం

జగ్గంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. సోమవారం స్థానిక వైకాపా పార్టీ కార్యాలయంలో జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్‌బాబు అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నరసింహం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏవిధంగా దగా చేస్తుందో వివరించారు. తోట శ్రీరాంజీ, రామకుర్తి జగ్గారావు, కరుటూరి శ్రీనివాస్, సత్యనారాయణ, తులా రాము, కరుటూరి వీర్రాజు పాల్గొన్నారు.

పునరావాస కాలనీ ఏర్పాటుచేయాలి

కిర్లంపూడి: పుష్కరకాలువ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికి పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచి పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు. 2007లో పుష్కర కాలువ నిర్మాణ సమయంలో బూరుగుపూడి గ్రామానికి చెందిన 150 ఇళ్ల కుటుంబాలకు 18 సంవత్సరాలుగా బాధితులు ఇళ్లులేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ మేరకు సోమవారం బాధిత కుటుంబాలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు పునరావాస కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే పక్కా భవనం నిర్మించి ఇవ్వాలని కోరారు.

నలుగురు జూదరుల అరెస్టు

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని జె.కొత్తూరు శివారులో జూదశిబిరంపై దాడిచేసి నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. వీరివద్ద నుంచి అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి నిందితులతో పాటు రూ.11,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైతులకు సేవలందించాలని సూచన

రౌతులపూడి: సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ త్రిసభ్య కమిటీకి సూచించారు. రౌతులపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. తెదేపా మండల నేతలు సత్యనారాయణ, ఇంటిపల్లి భాస్కర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు మన్ననలు పొందాలన్నారు. తెదేపా మండల నేతలు తమరాల సత్యనారాయణ, ఇంటిపల్లి భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిడజాం గ్రామంలోని పోలేరమ్మ దుర్గాంబకు ప్రత్యేక పూజలు చేశారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట: జగ్గంపేట మెయిన్‌రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రతి సోమవారం దాతల సహకారంతో అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ డైరెక్టర్ కొత్త కొండబాబు సహకారంతో ఏర్పాటుచేశారు. తెదేపా నాయకులు మారిశెట్టి భద్రం, ఎస్‌వీఎస్ అప్పలరాజు పేదలకు భోజనాలు వడ్డన నిర్వహించారు. బద్ది సురేష్, వేములకొండ జోగారావు, మానేపల్లి బంగారాజు, గుప్తా, కొత్త ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు భోజనాలు వడ్డిస్తున్న కొండబాబు

తునిలో బంగారు ఆభరణాల చోరీ

తుని: పట్టణంలోని కొత్తపేట కోమాకుల వారి వీధిలో దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సత్య నివాసంలో చోరీ జరిగింది. సుమారు 64 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని కాకినాడ క్లూస్‌టీంతో కలిసి ఎస్సై జె.విజయబాబు సోమవారం పరిశీలించారు. కుటుంబ సభ్యులతో కలిసి లోకేష్ పెద్దాపురం మరిడమ్మ దేవస్థానానికి వెళ్లి రాత్రి 10.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి చేరుకున్నారు. అయితే కింది పోర్షన్‌కు తాళాలు వేసి మేడపైన ఉన్న సోదరుడి ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచి చూసుకోగా తలుపుల గొళ్లెం విరిగి ఉన్నట్లు గుర్తించారు. బీరువాలోని బంగారు వస్తువులు చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీంతో పరిశీలిస్తున్న ఎస్సై

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ. 10 - మ. 1

సమస్య: కొంతంగి గ్రామంలో పాఠశాలకు వెళ్లే కాలువలో మురుగు తొలగించని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - శివ, స్థానికుడు
సమాధానం: మురుగు తొలగింపు సమస్యను పరిష్కరిస్తాం. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి కొంతంగి – న్యూస్‌టుడే, శంఖవరం

పంట కాలువను పూడ్చేశారంటూ ఫిర్యాదు

గండేపల్లి: పంట కాలువను పూడ్చేశారంటూ రైతులు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామంలో సంచార చెరువు నుంచి కండి కాలువ చివరి వరకు పంట కాలువ ఉండేది. గ్రామంలోని శీలం చిన్నారావు ఇంటిముందు ఉన్న కాలువను పూడ్చేయడంతో గత కొన్ని రోజులుగా సుమారు 38 ఎకరాలకు సంబంధించిన 25 మంది రైతుల పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయి. ఈమేరకు సోమవారం కాకినాడలోని పీజీఆర్ఎస్‌లో రైతులు శీలం సురేష్, మంగిన సూరిబాబు, వెంకటేశ్వరులు, కేతా సూరిబాబు, వెంకటరమణ, రాజు ఫిర్యాదు చేశారు.

పాఠశాలలను పట్టించుకోండి సారూ..

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల చెంత చెత్తపోగులు, కలుపు మొక్కలు, నీటినిల్వలతో అపరిశుభ్రత కనిపిస్తుంది. వేసవి సెలవుల అనంతరం బడులు తెరిచి మూడునెలలు కావస్తున్నా ఇంకా కొన్ని చోట్ల శుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై అద్దం పడుతుంది. నియోజకవర్గ పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల చెంత ఇదే పరిస్థితి ఉంది. అధికారులు దృష్టిసారించి శుభ్రత చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.
✦ జగ్గంపేట మండలంలోని గొల్లల గుంట శివారు సీతంపేటలో ప్రాథమిక పాఠశాల చుట్టూ కలుపుమొక్కలు పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. కట్టా పులపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ లేక పోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. రామవరంలో ప్రహరీ లేకపోవడంతో కాలినడక నుంచి చెత్త పాఠశాల ఆవరణలో వేస్తున్నారు.
✦ గండేపల్లి మండలం మురారి ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాల ఆవరణ లోతుగా ఉండటంతో వర్షంనీరు నిలిచిపోతోంది. దీంతో రోజులతరబడి వర్షంనీరుపోయే మార్గంలేక పాఠశాలకు వచ్చే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
✦ కిర్లంపూడి మండలంలో సింహాద్రిపురం ఉన్నత పాఠశాలకు ఆనుకుని చెత్త, వ్యర్థాలు వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సీతంపేట ప్రాథమిక పాఠశాల చుట్టూ కలుపుమొక్కలు

చర్యలు చేపడతాం..

ప్రభుత్వ పాఠశాలల చుట్టూ అపరిశుభ్రత ఉన్నచోట ప్రత్యేక దృష్టిసారించి తక్షణం తొలగించేందుకు చర్యలు చేపడతాం. పాఠశాలల శుభ్రత పై మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. పంచాయతీ సిబ్బందిని సమకూర్చి అపరిశుభ్రతను తొలగిస్తాం.

- ఆర్.స్వామి, ఎంఈవో, జగ్గంపేట

శ్రీ వెంకటేశ్వర ఐ.టి.ఐ - జగ్గంపేట
గోకవరం రోడ్, సెల్: 92474 30301
ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడులలో అడ్మిషన్లు జరుగుచున్నవి.
కొద్ది సీట్లు మాత్రమే కలవు

(c) eenadu

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ విభు భక్రు

జస్టిస్ విభు భక్రు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ విభు భక్రు (59)ను నియమిస్తూ కేంద్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ వి.కామేశ్వరరావు సేవలు అందిస్తున్నారు. నాగపూర్‌కు చెందిన ఆయన దిల్లీలోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక 1985లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెండ్స్ ఆఫ్ ఇండియాలో విద్యార్థిగా పేరు నమోదు చేయించుకున్నారు. దిల్లీ విశ్వవిద్యాలయంలో బీకాం (హానర్స్) డిగ్రీ పూర్తి చేసిన అనంతరం 1989లో సీఏ పూర్తి చేశారు. ఎల్ఎల్‌బీ పట్టాను 1990లో అందుకుని దిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. సర్వోన్నత న్యాయస్థానం, దిల్లీ ఉన్నత న్యాయస్థానంలో కంపెనీ లా బోర్డు ప్రతినిధిగా సేవలు అందించారు. దిల్లీ ఉన్నత న్యాయస్థానంలో సీనియరు న్యాయవాదిగా 2011 జులై 28న బాధ్యతలు చేపట్టారు. అదే న్యాయస్థానంలో అదనపు న్యాయమూర్తిగా 2014 ఏప్రిల్ 17న బాధ్యతలు చేపట్టి పూర్తి స్థాయి న్యాయమూర్తిగా 2015 మార్చి 18న నియమితులయ్యారు. ఆ న్యాయస్థానంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా 2024 డిసెంబరు 5 నుంచి 2025 జనవరి 21 వరకు సేవలు అందించారు.

తల్లీకూతుళ్ల విషాదాంతం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వైట్‌ఫీల్డ్ పోలీసుఠాణా పరిధిలోని నాగూండనహళ్లిలో తల్లి రచితా రెడ్డి(46) ఆమె కుమార్తె శ్రీజారెడ్డి(24) పడకగదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. శ్రీజారెడ్డి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాగూండనహళ్లిలో అద్దె ఇంట్లో ఉండేవారు. ఉదయం కుమార్తె శ్రీజారెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని తల్లి రచితారెడ్డి అల్లుడికి సమాచారం ఇచ్చి తానూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీస్ అధికారులు వివరించారు. జీవించడం తనకు ఇష్టంలేదని ఫోన్‌లో అల్లుడికి చెప్పి అత్త ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. స్థానిక పోలీసు అధికారులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు.

శివకుమార్, ఇతర నేతలతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న ముఖ్యమంత్రి

అభివృద్ధికి సర్కారు ఆలంబన

విజయపుర, న్యూస్‌టుడే : ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్నామని, అభివృద్ధికి అనుగుణమైన ప్రభుత్వం ఇదేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. భాజపా, దళ్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి అభివృద్ధి పనులతోనే బదులిస్తామని చెప్పారు. ఇండి పట్టణంలో శక్తి పథకం 500 కోట్ల జీరో టికెట్లను దాటిన నేపథ్యంలో ఓ ఆర్టీసీ బస్సుకు పూజ చేసి, మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. 'నిమ్మ అభివృద్ధి మండలి' లాంఛనాన్ని ఆవిష్కరించారు. రూ.4157 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, భూమి పూజ, రూ.401 కోట్లతో పూర్తి చేసిన నిర్మాణాలను ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధిపై విపక్ష నేతలు బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. ప్రజల ముందు దాఖలాలతో సహా తాను హాజరవుతానని తెలిపారు. విజయపుర జిల్లా గతంలో ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందనేందుకు ఇక్కడి ప్రజలే సాక్ష్యమని చెప్పారు. తాగు, సాగునీటి సదుపాయాలు, రహదారులు, మౌలిక సదుపాయాల వృద్ధికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చెప్పారు. దళ్‌తో కలిసి భాజపా తప్పుడు ఆరోపణలు, ప్రచారాన్ని చేస్తున్నా ప్రజలను తమను ఆదరిస్తున్నారని తెలిపారు. శక్తి పథకంలో 500 కోట్ల సార్లు మహిళలు ప్రయాణించేందుకు తమ

ముఖ్యమంత్రి ప్రకటన

ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.12,669 కోట్లను ఖర్చు చేశామని వివరించారు. ఎమ్మెల్యే యశవంతరాయ పాటిల్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు, హెచ్‌సీ మహదేవప్ప, దినేశ్ గుండూరావు, ఎంబీ పాటిల్, శివానంద పాటిల్, శరణ ప్రకాశ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

తమను ఆహ్వానించలేదు

సిగందూరులో వంతెన ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి, భాజపా నాయకులు తమను ముందుగా ఆహ్వానించలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరినా, భాజపా నాయకుల ఒత్తిళ్లకు గడ్కరీ తలొగ్గారని చెప్పారు. ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడం సరికాదని చెప్పినా అక్కడి నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. భాజపా తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ తమ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, చట్టసభకు ఎన్నికైన ప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఈ వంతెనకు భూమి, ఇతర ఖర్చులు, సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వమే కల్పించిన విషయాన్ని విస్మరించడం శోచనీయమని వ్యాఖ్యానించారు.

ఇండిలో కార్యక్రమానికి కదలి వచ్చిన కార్యకర్తలు

దూరం పెంచిన తీగ వంతెన

ఈనాడు, బెంగళూరు : జీఎస్టీ పరిహారం, ఆర్థిక సంఘాల సిఫార్సులు, కేంద్ర నిధుల చెల్లింపుల్లో రాష్ట్రంపై వివక్ష, సమాఖ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో కర్ణాటకకు అన్యాయం, భాజపాయేతర రాష్ట్రాలపై కేంద్రం శీతకన్ను.. వంటి పలు రకాల ఆరోపణలతో కేంద్రంపై విరుచుకుపడే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సిగందూరు తీగ వంతెన ప్రాజెక్టుతో మరోసారి కన్నెర్ర చేసింది. సోమవారం శివమొగ్గ జిల్లాలో ప్రారంభించిన రూ.473 కోట్ల విలువైన తీగ వంతెన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపంతో పాటు ఇరువురి మధ్య అంతరాన్ని మరోసారి వ్యక్తం చేసింది. రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం. శివమొగ్గ జిల్లాలోని సాగర్, హొసదుర్గ తాలూకాల మధ్య అంతరాన్ని తగ్గించటం, చౌడేశ్వరి దేవాలయానికి మరింత త్వరగా చేరుకునేందుకు అవకాశం కల్పించే తీగమార్గం ప్రారంభోత్సవానికి కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో పాటు మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప హాజరైనా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏ ఒక్క ప్రతినిధీ హాజరు కాకపోవటం రాజకీయ రచ్చకు దారితీసింది.

పట్టు సడలని రాష్ట్రం

వాస్తవానికి ఏ కేంద్ర ప్రభుత్వ పథకమైనా రాష్ట్రంలో ప్రారంభిస్తే అందులో రాష్ట్ర వాటా ఉంటుంది. జల్‌జీవన్ మిషన్, వందేభారత్‌తో పాటు ఇతర రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్రం కనీస నిధులు అందించటం, స్థలాలివ్వటం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనల్లోనూ రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు హాజరవుతుంటారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఇరు ప్రభుత్వాలు సమన్వయంతో ప్రజా సంబంధ పనులకు సహకరించుకుంటాయి. ఏరో

సిగందూరు వంతెన ప్రారంభవేళ.. హోమంలో పాల్గొన్న భాజపా నేతలు

కేంద్ర.. రాష్ట్రాల మధ్య రగడ

ఇండియా, ఇన్వెస్ట్ కర్ణాటక వంటి కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత కార్యక్రమాలకూ కేంద్ర మంత్రులు, వీలుంటే ప్రధాని సైతం హాజరవుతారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ఉంటే ఈ సమన్వయం మరింత ఎక్కువగా ఉంటుంది. వేర్వేరు ప్రభుత్వాలుంటే ఈ సమన్వయం కొరవడుతుంటుంది. ఈ సమస్య ప్రస్తుత కేంద్ర, రాష్ట్రాల మధ్య కాస్త ఎక్కువగా ఉన్నట్లే కనిపిస్తోంది.

ఆహ్వానం తప్పించారా?

మాకు కనీసం రెండు నెలల ముందుగా ఈ కార్యక్రమం గురించి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. కేవలం మూడు రోజుల ముందు మొక్కుబడిగా ఆహ్వానం అందించటంతో ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల కారణంగా తాను హాజరు కాలేకపోయానని తేల్చి చెప్పారు. మాకూ వారం రోజుల ముందుగానే ఈ కార్యక్రమం గురించి ఆహ్వానం లభించినా హాజరయ్యాను. ప్రత్యక్షంగా కాకున్నా వర్చువల్‌లో హాజరు కావాలని మనవి చేసినా ముఖ్యమంత్రి అందుకు అంగీకరించలేదంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్‌లో వివరణ ఇచ్చారు. ఒకరు ముఖ్యమంత్రి, మరొకరు కేంద్ర మంత్రి.. వీరి ముందస్తు కార్యక్రమాలు వాయిదా వేయలేనివి. వర్చువల్‌లో హాజరైనా, తన తరపున మరొకరిని పంపే అవకాశం ఉన్నా ముఖ్యమంత్రి పట్టు సడలించకపోవటం వెనుక రాజకీయం ఉందన్న వాదన వినిపిస్తోంది. ఇక ముఖ్యమంత్రి వంటి నేతకు కనీసం వారం రోజుల ముందుగా ఆహ్వానం ఇవ్వకపోవటం ఉద్దేశపూరిత వ్యూహం ఉందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

దిల్లీకి వెళ్లగా లేనిది..

రాష్ట్ర ప్రజల పన్నులతో నిర్మించిన ప్రాజెక్టుకు ముఖ్యమంత్రిని ఆహ్వానించకపోవటం సరికాదని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే ఇలాంటి కార్యక్రమానికి హాజరవ్వాలన్నది ప్రభుత్వ కనీస కర్తవ్యమని భాజపా ఎదురుదాడి చేస్తోంది. ఇదే సందర్భంగా నెలకు రెండు మూడుసార్లు దిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీ ఇంటి ముందు గంటల కొద్దీ ఎదురుచూసే ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఎంతో కీలకమైన ప్రాజెక్టులకు హాజరవ్వాలంటే ముహూర్తాలు, ఆహ్వానాలు చూస్తున్నారని విపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రిని ఆహ్వానించని కేంద్రం ఏడు కోట్ల రాష్ట్ర ప్రజలను అవమానపరిచినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా నిందించారు.

వేదికపై కేంద్ర మంత్రి గడ్కరీ, యడియూరప్ప, బీవై రాఘవేంద్ర తదితరులు

ఇదొక అద్భుతం!

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ జిల్లాలో ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం, శక్తిపీఠం సిగందూరు చౌడేశ్వరి అమ్మవారి క్షేత్రానికి చేరుకోవడానికి అత్యాధునిక వంతెన నిర్మాణం ఆధునిక ఇంజినీరింగ్‌కు అద్దం పడుతుందని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నారు. శివమొగ్గకు బైపాస్ రెడ్డు, ఆగుంబె ఘాట్‌లో సొరంగ మార్గాన్ని నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. గడ్కరీ మ్యాన్ ఆఫ్ నేషనల్ హైవేస్ అని కేంద్ర మంత్రి గడ్కరీ అభివర్ణించారు. సీనియరు నాయకుడు కాగోడు తిమ్మప్ప, లోక్‌సభ సభ్యుడు బీవై రాఘవేంద్ర, ఎమ్మెల్యేలు అరగ జ్ఞానేంద్ర, చెన్నబసప్ప, హరతాళు హాలప్ప, గురురాజ్ గంటి, ఎమ్మెల్యేలు భారతి శెట్టి, డీఎస్ అరుణ్, ధనుంజయ సర్జి, సిమెంట్ మంజునాథ్, హేమలతా నాయక్, ఇంజినీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శరావతి నది వెనుక జలాల్లో నిర్మించిన వంతెన ఇదే

గుండెపోటుతో టెకీ మృతి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : స్నేహితులతో కలిసి చిక్కమగళూరు పర్యటనకు వచ్చిన రాహుల్ (29) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీరు (టెకీ) సోమవారం గుండెపోటుతో మరణించారు. బెంగళూరులోని అక్షయ నగరకు చెందిన ఆయన నగర శివార్లలోని హోం స్టేలో ఉన్న సమయంలో ఛాతీ పట్టుకుని కుప్పకూలిపోయారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించారు.

'సిద్ధు సర్కారు పదిలం'

గదగ, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి పీఠం కోసం కొనసాగుతున్న పోటీలో ఎమ్మెల్యేల కొనుగోళ్లు మొదలయ్యాయని భాజపా నాయకులు చేసిన ఆరోపణలను మంత్రి హెచ్‌కే పాటిల్ కొట్టివేశారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వం ఐదేళ్ల పాటు సురక్షితంగా ఉంటుందని, ఆ తర్వాత మరోసారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి నేతల మద్దతు ఉందని తెలిపారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు చేసిన కుట్రలు ఫలించకపోవడంతో భాజపా నేతలు ఇటువంటి ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

సరోజాదేవి నివాసం వద్ద కడసారి నివాళి అర్పించేందుకు వచ్చిన అభిమానులు

నివాళి అర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై

సరోజాదేవి నివాసం వెలుపల ఏర్పాటు చేసిన ఫొటోలు

చినబోయిన చందనసీమ

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : చందనసీమ వెండితెరను మురిపించిన అలనాటి నటీమణి బి.సరోజాదేవి అంతిమదర్శనానికి అభిమానగణం పోటెత్తింది. రాజకీయ, సినీరంగ ప్రముఖులు కదలివచ్చి నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ బొమ్మై, వీరప్పమొయిలీతోపాటు అనేకానేక మంది ప్రముఖులు మల్లేశ్వరంలోని ఆమె నివాసాన్ని సోమవారం సాయంత్రం సందర్శించారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్న క్రమంలో మండ్య సమీప దశవారలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె మరణం దక్షిణాది సినీరంగానికి తీరని లోటని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాధాకృష్ణరాజు విచారం వ్యక్తం చేశారు.

నివాళి అర్పించేందుకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ

శక్తి సంబరం

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి ఉద్దేశించిన 'శక్తి' పథకంలో 500 కోట్ల లబ్ధిదారుకు సోమవారం బెంగళూరులో బీఎంటీసీ బస్సులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య టికెట్ అందించి అభినందించారు. చామరాజపేటకు చెందిన లత అనే ఆ లబ్ధిదారు టికెట్ అందుకుని, ముఖ్యమంత్రి చేతుల మీదుగానే కానుకలు స్వీకరించి మురిసిపోతున్న చిత్రమిదీ! **(న్యూస్‌టుడే, శివాజీనగర)**

జలభద్రత సాధనకు ఉద్యమం

గాంధీనగర, యలహంక, న్యూస్‌టుడే : భద్రా కుడి కాలువ నుంచి తాగు నీటి కోసం ప్రత్యేకంగా జలాశయానికి మళ్లించడంతో సాగుకు ఇబ్బంది ఎదురవుతుందని దావణగెరె, శివమొగ్గల జిల్లా రైతుల సంఘాల నాయకులు బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో సోమవారం ధర్నాకు దిగారు. తమకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని ఆందోళనకారులు ఆక్రోశించారు. వక్క, ఇతర పంటలకు మద్దతు ధర, పంట నష్టానికి బీమా లభించలేదంటూ నినాదాలు చేశారు. ఇప్పుడు సాగునీటికీ ఆందోళన చేయవలసిన పరిస్థితులను ప్రభుత్వం సృష్టిస్తోందని దుయ్యబట్టారు.

● దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణ వద్ద 13 గ్రామాల పరిధిలో 1700కు పైగా సారవంతమైన భూములను స్వాధీనపరుచుకుంటూ ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని నటుడు ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, సమస్యను తెలిపేందుకు సీఎం నివాసం వద్దకు వెళితే తమను అడ్డుకున్నారని, అనంతరం కంటితుడుపు చర్యగా సమావేశాన్ని నిర్వహించి, మరోసారి భేటీ అవుతామని చెప్పి కాలహరణ చేస్తున్నారని ఆక్రోశించారు. రైతులకు అన్యాయం జరిగితే తాను ముందుండి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్న దావణగెరె, శివమొగ్గ జిల్లాల రైతులు

కాంగ్రెస్ నాయకుడి అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కలబురగి దక్షిణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగరాజ్ కణ్ణిని మహారాష్ట్రలోని కల్యాణ్ ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ముంబయికి సమీపంలోని థాణే నగరంలో మాదక ద్రవ్యాలను సరఫరా చేసి విక్రయిస్తున్న ఆరోపణలపై ఆయనను అరెస్టు చేసి విచారణ చేపట్టారు. అరెస్టు సమయంలో నిషేధిత 120 కొడెనైన్ సిరప్ సీసాలు జప్తు చేసుకున్నారు. కలబురగి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అల్లమప్రభు పాటిల్‌కు లింగరాజ్ అత్యంత ఆప్తుడు.

భౌభౌ నిరసన

బెంగళూరు పాలికె అధికారులు వీధి శునకాలకు కోడిమాంసపు భోజనాన్ని వండివార్చాలనే నిర్ణయానికి నిరసన వ్యక్తమవుతోంది. బెంగళూరు మెజెస్టిక్ బస్టాండ్ ఆవరణలో సోమవారం జాగిలానికి బిస్కెట్లు తినిపించి.. వినూత్న నిరసనకు దిగిన కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్ **(న్యూస్‌టుడే, శివాజీనగర)**

మేలుకోటె సంబరాలు

చారిత్రక మేలుకోటె చెలువనారాయణ స్వామి ఆలయంలో రాజముడి బ్రహ్మోత్సవాలు, మహాభిషేకం, కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. చెలువనారాయణ స్వామి, కల్యాణ నాయకి, ముమ్మడి కృష్ణరాజ ఒడెయరు అందించిన ఉత్సవమూర్తులు, ఆభరణాలకు అధికారుల సమక్షంలో సోమవారం పూజలు చేశామని అర్చకులు ప్రకటించారు. **(న్యూస్‌టుడే, మండ్య)**

ధర్మస్థల ఘటనలపై సిట్ ఏర్పాటుకు వినతి

మంగళూరు, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక కేంద్రం ధర్మస్థల చుట్టుపక్కల రెండు దశాబ్దాలుగా హత్యలు, హత్యాచారాలు, అసహజ మరణాలు ఎక్కువయ్యాయని వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలను వెలికి తీసేందుకు ప్రత్యేక దర్యాప్తు దళాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. తానే పలు మృతదేహాలను రహస్యంగా సాగించి, అంత్యక్రియలు చేశానని ఒక వ్యక్తి ఇప్పటికే జిల్లా ఎస్పీకి లేఖ రాయడం, బెళ్తంగడిలోని న్యాయస్థానం ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చిన నేపథ్యంలో ఈ కేసుల విచారణకు సిట్ అవసరమని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన వ్యక్తి ధర్మస్థలలో పారిశుద్ధ్య కార్మికునిగా సేవలు అందించి పదవీ విరమణ చేశాడు. అతను లేఖ రాసిన అనంతరం తీసుకున్న చర్యలు, దర్యాప్తు ప్రారంభం తదితర అంశాలకు సంబంధించి వివరణ ఇవ్వాలని కోరుతూ దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీకి లేఖ రాశానని ఆమె తెలిపారు.

కళాకారుల ఆగ్రహం

తమకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ రవీంద్ర కళాక్షేత్ర వద్ద ధర్నా చేస్తున్న యక్షగాన కళాకారులు సోమవారం నిరసనకు దిగారు. ఈ కళను బతికించడం కష్టంగా మారుతున్న క్రమంలో నిరసనకు దిగక తప్పడం లేదన్నారు. **(న్యూస్‌టుడే, జయనగర)**

నిమ్మ పండును తదేకంగా చూస్తున్న సిద్ధరామయ్య

నిమ్మకు లాభాల నీరు

విజయపుర, న్యూస్‌టుడే : ఇండిలో ఏర్పాటు చేసిన నిమ్మ అభివృద్ధి మండలిని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ప్రారంభించారు. స్థానికంగా పండిన ఒక నిమ్మకాయను అక్కడి నేతలు ఆయనకు అందించారు. దాన్ని చాలా సమయం చేత్తో పట్టుకుని దీర్ఘాలోచనలో పడిన సీఎం మధ్యమధ్యలో దాని సువాసన ఆఘ్రాణిస్తూ వేదికపై కూర్చున్నారు. మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ తన జేబులో, చేతిలో నిమ్మకాయ లేకుండా ఇంటి గడపదాటరు. నిమ్మకాయ పట్టుకుంటే తానూ మూఢనమ్మకాలను ఆచరిస్తున్నట్లు కాదని ఇటీవలే సీఎం ఒక సందర్భంలో వ్యాఖ్యలు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

పొలం వద్ద తండ్రీకొడుకుల మృతదేహాలు

పెనవేసుకున్న పుడమిపైనే
హలధారి తుదిశ్వాస ఆగింది..
కరెంటు తీగే యమపాశమై
తండ్రీకొడుకుల ఊపిరి తీసింది..
పొలానికి నీరు పారించాలని వెళ్తే..
ప్రాణాలే తోడేసింది..
ఇంటి పెద్దను, కన్నపేగును దూరం చేసింది..
మృత్యువులోనూ వీడని వారి బంధం
కంటనీరు తెప్పించింది..
అందివచ్చిన కొడుకు ఆసరా అవుతాడనుకుంటే..
మాటేసిన మృత్యువు అంతలోనే బలిగొంది..
తెలతెలవారకనే దుగ్గత్తిలో
విషాదఛాయలు అలుముకున్నాయి..
ఆ ఇల్లు కన్నీటి సంద్రమైంది..
బంధువుల రోదనలు మిన్నుముట్టాయి..

కలిసెళ్లారు .. కడతేరిపోయారు

● విద్యుదాఘాతంతో తండ్రీకొడుకుల మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: పొలంలో తెగిపడిన విద్యుత్తు తీగను ఆకస్మికంగా తొక్కడంతో తండ్రీకొడుకులు రమేశ్ (40), చంద్రప్ప (16) తీవ్ర విద్యుదాఘాతంతో ప్రమాద స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా దుగ్గత్తిలో చోటుచేసుకుంది. ఈ ప్రాంతానికి చెందిన తండ్రీకొడుకులు పొలానికి నీరు పారించాలని వెళ్లారు. మోటార్ ఆన్ చేయాలని తండ్రి వెళ్లగా, కొడుకు వెంట నడిచాడు. పొలంలో చెట్ల నడుమ తెగిపడిన విద్యుత్తు తీగను గమనించకుండా ఇద్దరూ ఒకేసారి తొక్కడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పొరుగు పొలం వారు గుర్తించి జెస్కాం కార్యాలయానికి సమాచారం అందించారు. ఆ ప్రాంతంలో వెళ్లే విద్యుత్తు మార్గంలో సరఫరా నిలిపివేశారు. ఇంటి పెద్ద, కుమారుడు మృతిచెందడంతో రైతు కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. హలవాగలు జెస్కాం ఇంజినీర్లు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రాణం తీసిన విద్యుత్తు తీగలు

కళాసేవకు సత్కారం

రంగారెడ్డికి కర్ణాటక భూషణ పురస్కారం అందజేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి సంతోష్‌హెగ్డే, ముఖ్యమంత్రి చంద్రు తదితరులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ఐదు దశాబ్దాల నుంచి హార్మోనియం వాద్య కళాకారుడిగా సేవలందిస్తున్న కారెకల్లుకు చెందిన వై. రంగారెడ్డికి బెంగళూరు రవీంద్ర కళాక్షేత్రంలో కర్ణాటక భూషణ పురస్కారం అందజేసి సత్కరించారు. ఎనభై ఏళ్లు దాటినా.. వాద్యరంగంలో రాణిస్తూ ఇప్పటికీ పల్లెల్లో నాటకాలు, బయలాటలకు మాస్టారుగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత లోకాయుక్త న్యాయమూర్తి సంతోష్ హెగ్డే, చలనచిత్ర నటుడు ముఖ్యమంత్రి చంద్రు చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. రంగారెడ్డిని నగరంలోని పలు సంస్థల ప్రతినిధులు, కళాకారులు అభినందించారు.

ఓర్పే యువతకు బలం

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తాడిపత్రి గోవింద విఠల్, ప్రధాన ఆచార్యుడు సుంకప్ప తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: యువతకు అత్యుత్తమ బలం ఓర్పు.. అలవాటు చేసుకుంటే సమాజంలో ఉత్తమ వ్యక్తిగా అవుతారని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా. యల్లా రమేష్‌బాబు పేర్కొన్నారు. భారత కుటుంబ నియంత్రణ సంఘం (ఎఫ్.పి.ఎ.ఐ.), ప్రభుత్వ మున్సిపల్ పదవీ పూర్వ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖాధికారి డా. యల్లా రమేష్‌బాబు మాట్లాడుతూ యువతీ, యువకులు తొందరపడి వివాహం చేసుకోకండి. సొంత నిర్ణయాలు తీసుకోవడానికి, జీవిత భాగస్వామిని ఎంచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసి మంచి జీవితాన్ని నిర్మించుకోవడానికి సమయం తీసుకోవాలన్నారు. ఎఫ్.పి.ఎ.ఐ. అధ్యక్షుడు తాడిపత్రి గోవింద విఠల్ మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించడం ద్వారా సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు సుంకప్ప మాట్లాడుతూ యువత జీవితంలో ఏమి చేయాలి. ఏమి చేయకూడదో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలకు మొత్తం 48 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో పవన్ (ప్రథమ), పద్మావతి (ద్వితీయ), మణికంఠ (తృతీయ) స్థానాల్లో నిలవగా అతిథులు వారిని అభినందించారు. ఎఫ్.పి.ఎ.ఐ. మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకుల కులుకుల ఆగుంబె!

సూర్యాస్తమయ వీక్షణకు నిత్యం పోటెత్తే జనం

అపురూప ప్రకృతి దృశ్యకావ్యం..ఆగుంబె కొండమార్గం

ఒంపులు తిరిగి.. సొంపులుబోయే మార్గాలకు నెలవు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : ఎడతెగని చినుకులు.. దారి పొడవునా జలపాత ధారలు.. ఒంపులు తిరిగి పరుగులు పెట్టించే కొండదారులు.. వెరసి ఆగుంబె! పడమటి కనుమల్లోని ఈ చిరుగ్రామం చేరుకుంటే ప్రకృతిమాత ఒడిలో మైమరచిపోయి కదలని విహరించిందంటే! ఆచార్య ఆర్కే నారాయణ్ రచించిన 'మాల్గుడి డేస్' బుల్లితెరపైకెక్కించడానికి ఎంచుకున్న ప్రకృతిధామమే ఈ ఆగుంబె. అబురపాటు చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిందా.. అన్నంత రమణీయత ఈ కొండపల్లె సొంతం. కన్నడిగుల నిత్య కల్పవృక్షంగా పేరొందిన ఈ పరిసరాలను ప్రకృతిపర్యాటక కేంద్రంగా ప్రకటించి అభివృద్ధి చేశారు. ఇక్కడ అత్యధిక వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో దక్షిణ భారత చిరపుంజిగా వినుతికెక్కింది. ఏడాదిలో అతికొద్ది రోజులు మాత్రమే ఇక్కడ ఎండజాడ కనపిస్తుంది. మిగిలిన రోజులన్నీ వానలో తడవాల్సిందే. 'ఆగుంబె వానకిటి' అటవీ పరిశోధన (ఏఆర్ఆర్ఎస్) కేంద్రం ఇక్కడే విస్తరించింది. పడగరాల్లో కాళింగ సర్పాలు (కింగ్‌కోబ్రా) విపరీతంగా తారాడుతుంటాయి. 'కాళింగసర్పాల రాజధాని'గా ఆగుంబె అడవిని యునెస్కో గుర్తించింది.. దేశ, విదేశీ సందర్శకుల తాకిడి తక్కువేమీ కాదు. ఇక వానల్లోనే సాహసపర్యాటకం (ట్రెక్కింగ్) సాగించడానికి యువకుల ఉరకలు వేస్తుంటారు. ఇపుడే వానాకాలం.. సాహసికుల ఆయువులన్నీ ఇటే సాగుతున్నాయి. గిరిధామం చుట్టూ అల్లుకున్నట్లు కనిపించే కుంచికల్ జలపాతం, సావెహక్లు జలాశయం, ఉడుపి వైపు సాగేవేళ కనపడే కమలశిల ఆలయం.. అద్భుతం అనిపిస్తాయి. ●ఆగుంబెకు చేరువలోని గిరిధామం పైనుంచి సూర్యాస్తమయ వీక్షణ ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఉడుపి సమీప సముద్రం మీదుగా సూర్యుడు పడమటింటికి చేరే దృశ్యకావ్యాన్ని కెమెరాల్లో బంధించేందుకు పర్యాటకులు పోటీపడుతుంటారు. సంధ్యాసమయం ముగిశాక.. ఇక ఆ కీకారణ్యంలో నిలువడానికి ఎవరూ సాహసించరు. ప్రముఖ పర్యావరణ అధ్యయనకారుడు రోమూలస్ వైటేకర్ సూచనలతో కాళింగ సర్పాల సంరక్షణ, వర్షపు కీకారణ్యాల అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్న చోట.. పర్యాటకం వేయి పూల చినుకులై వికసిస్తోంది!

● పర్యావరణానికి పెట్టింది పేరైన చిక్కమగళూరు- ఉడుపి జిల్లాల మధ్య పడమటి కనుమల్లో విస్తరించిన ప్రధాన రహదారిపై పయనిస్తే.. ఆగుంబె చేరుకోవచ్చు. పేరుకు చిరు గ్రామమైనా.. ఆతిథ్యానికి కొదవలేదు. చక్కని ఆహారశాలలు, విశ్రాంతి మందిరాలు కొండకోనల్లో ఒదిగిపోయాయి. ఏడాదిలో ఎనిమిది వేల మిల్లీమీటర్ల వర్షపాతం తక్కువకాకుండా ఇక్కడ నమోదవుతుంది. దక్షిణ భారతంలో ఈ రికార్డును మరే ప్రాంతమూ అధిగమించలేదు. అందుకే.. ఇక్కడున్న జలపాతాలకు లెక్కేలేదు. చిన్న, పెద్ద వందకు పైగా ధారలను వానాకాలంలో చూడొచ్చు. కొన్నింటి దరిదాపులకూ వెళ్లలేనంత హోరు ప్రదర్శిస్తాయి. కొన్ని కీకారణ్యంలో 'జల'దరిస్తుంటాయి.

మంత్రి చెప్పిన సహాయవాణి ఏమైంది?

బెంగళూరు (కృష్ణరాజపుర), న్యూస్‌టుడే : మహిళలు, యువతులు తమపై దౌర్జన్యం జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఇటీవల పిలుపునిచ్చారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే సైబర్ క్రైమ్ కాల్ సెంటర్‌కు వెళుతోందని కవితారెడ్డి అనే మహిళ అభ్యంతరం తెలిపింది. తన కాల్ రికార్డును సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సైబర్ క్రైమ్ సహాయవాణికి చెందిన సిబ్బంది హిందీలో మాట్లాడుతున్నారని, పలు ప్రాంతాల్లో మహిళలకు ఆ భాష రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు సరైన నంబరును ప్రకటించాలని ఆమె మంత్రిని కోరారు.

ఆశీర్వచనం చేస్తున్న శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డా.చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య స్వామి

సమాజ శ్రేయస్సే మఠాల కర్తవ్యం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సే మఠాల కర్తవ్యమని శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డా. చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీశైల శివశక్తి సాంస్కృతిక భవనంలో ఇష్టలింగ మహాపూజ, సిద్ధాంత శిఖామణి పురాణ ప్రవచనం, జంగమ పిల్లలకు దీక్ష కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఆయన భక్తులకు ఆశీర్వచనం చేశారు. మఠాలు ప్రజల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తాయి, ప్రజలు, భక్తులు ధార్మిక సంస్థలపై భక్తి భావనతో ఉండాలన్నారు. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తిని పరమాత్ముడు సృష్టించాడు, జీవితంలో ప్రతిఒక్కరూ ప్రాణలింగ, భావలింగ, విశ్వలింగను అలవర్చుకొంటే ఉత్తమ జీవనం, ఉత్తమ సమాజం నిర్మాణానికి దోహద పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థినులు భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. తెక్కెలకోట కంబాళిమఠం మఠాధిపతి వీరభద్ర శివాచార్య స్వామి అధ్యక్షతన వహించగా హాల్వి మఠాధిపతి అభినవ మహంత స్వామి, వివిధ మఠాలకు చెందిన స్వామీజీలు నాగభూషణ మహాస్వామి, చన్నవీర శివాచార్య స్వామి, అభినవ రేణుకా శాంతమల్ల శివాచార్య స్వామి, శివయోగి శివాచార్య స్వామి, బసవభూషణ స్వామి, స్థానిక వీరశైవ మహాసభ ప్రతినిధులు, సభ్యులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

గనినాడు.. కళాకారులకు పుట్టినిల్లు

బళ్లారి, న్యూస్‌టుడే: దేశ సాహిత్యం, సంస్కృతిని కాపాడటానికి, అభివృద్ధి చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కళాకారిణి బి.వీణా తెలిపారు. కన్నడ సాంస్కృతిక శాఖ, రాంసాగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సౌరభ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. రాంసాగర్ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఆశా మాట్లాడుతూ గ్రామంలో పలువురు జానపద కళాకారులు, సాహితీవేత్తలు ఉన్నారు. జిల్లా, రాష్ట్రానికే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టారన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ అధికారి నాగరాజ మాట్లాడుతూ కర్ణాటక రంగస్థలం కళాకారులకు పుట్టినిల్లు. బళ్లారి జిల్లాలో పలువురు కళాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. బళ్లారికి చెందిన మోహన్ కలబురగితో వయోలిన్ వాదన, దొడ్డబసప్ప గవాయి బృందంతో సుగమ సంగీత కార్యక్రమం, వనమాల కులకర్ణి బృందంతో సామూహిక నృత్య ప్రదర్శన, యల్లపగౌడ శంకరబండ బృందంతో జానపద గేయాలు, ఏళుబెంచి సి.ఎం. కరుణామూర్తి బృందంతో సంగీతం, బళ్లారి వరలక్ష్మి బృందంతో హేమారెడ్డి మల్లమ్మ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. జీపీ ఉపాధ్యక్షుడు రామయ్య, కళాకారులు ప్రశాంత్, వరలక్ష్మి, వనమాల కులకర్ణి, సీతా పాల్గొన్నారు.

సౌరభ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న జీపీ అధ్యక్షురాలు ఆశ, కళాకారులు తదితరులు

కత్తిపట్టిన పగటి వేషగాళ్ల ప్రదర్శన

యక్షగానంలో పాత్రధారుల ప్రతిభ

శక్తి పథకంపై గోడపత్రాలను విడుదల చేస్తున్న మేయర్ ముల్లంగి నందీశ్, చిత్రంలో ముండరగి నాగరాజు, చిదానందప్ప , ఎస్పీ శోభారాణి, అధికారులు

కారటగి: శక్తి యోజన సంబరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కంప్లిలో వేడుకలు ఆచరిస్తున్న నాయకులు, ఆర్టీసీ అధికారులు

మాన్వి: బస్టాండులో మహిళలకు తీపి అందిస్తున్న హంపయ్యనాయక్

కొప్పళలో ఆర్టీసీ బస్సుకు పూజ చేస్తున్న శాసనసభ్యుడు రాఘవేంద్ర హిట్నాళ

శక్తి పథకం.. అతివలకు వరం

బళ్లారి, న్యూస్‌టుడే: శ్రామిక, పేద మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారంటీల్లో..శక్తి పథకం మహిళకు మరింత శక్తిని నింపింది... ఈ పథకం మరింత విజయవంతంగా ముందుకు సాగుతోందని మేయర్ ముల్లంగి నందీశ్ పేర్కొన్నారు. కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి విభాగం ఆధ్వర్యంలో సోమవారం నూతన బస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శక్తి పథకం కింద 500 కోట్ల సార్లు ప్రయాణికుల వేడుకను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఐదు గ్యారంటీల్లో శక్తి పథకం కింద 500 కోట్ల సార్లు మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ఈ పథకం మహిళలకు ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా హామీ పథకాల అమలు కమిటీ ఛైర్మన్ చిదానందప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారంటీలపై మొదట్లో పలువురు విమర్శించారు. ఐదు గ్యారంటీల్లో మొదట శక్తి పథకం 2023 జున్ 11న ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వం శక్తి పథకానికే రూ. 12వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అన్నభాగ్య, గృహలక్ష్మి, గృహజ్యోతి, యువనిధి పథకాలను అమలు చేసిందన్నారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజు ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాలను వివరించారు. జిల్లా పోలీస్ అధికారిణి డా. శోభారాణి, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, కేకేఆర్టీసీ అధికారి ఇనాయత్ భగవాన్, విభాగం ట్రాఫిక్ నియంత్రణ అధికారి చామరాజ్, అధికారులు లయ్యాజ్, గంగాధర్, శివప్రకాశ్, శారద, బాషా, శివకుమార్, పంపారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

కారటగి, న్యూస్‌టుడే: పంచ గ్యారంటీలో భాగంగా కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడంతో కారటగి ప్రయాణ ప్రాంగణం ఆవరణలో సోమవారం సంభ్రమాచరణ జరిపారు. గ్యారంటీ పథకాల అనుష్ఠాన సమితి అధ్యక్షుడు దేవప్ప బావికట్టె నేతృత్వంలో ఆర్టీసీ బస్‌కు పూజ జరిపి ప్రయాణికులకు మిఠాయి అందించారు. దేవప్ప మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 2023 జూన్ 11న రాష్ట్ర ప్రభుత్వం శక్తి యోజనను ప్రారంభించింది. రాష్ట్రంలోని మహిళలకు ఇది ఎంతో ఉపయోగమైందన్నారు. తాలూకా పంచాయతీ అధికారిణి లక్ష్మీదేవి, నాయకులు బసవరాజ్ నీరగంటి, శరణేగౌడ మాలిపాటిల్, శివారెడ్డి నాయక్, శశిధర గౌడ, అయ్యప్ప ఉప్పార తదితరులు పాల్గొన్నారు.

కంప్లి బస్టాండులో: కంప్లి బస్టాండులో శక్తి యోజన సంబరాన్ని పంచ గ్యారంటీ అనుష్ఠాన సమితి నిర్వహించింది. బస్సుకు పూజలు జరిపి మిఠాయి పంచి పెట్టారు. అనుష్ఠాన సమితి తాలూకా అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, నాయకులు ఎం.సుధీర్, సిద్ధప్ప, కరేకల్ మనోహర్, హబీబ్ రహమాన్, ఎం. ఉస్మాన్, గుర్రం గోపాల్, అక్కి జిలాన్, కురుగోడు డిపో మేనేజర్ బి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాన్వి, న్యూస్‌టుడే : దేశంలో సామాజిక న్యాయానికి కట్టుబడి పేదల పక్షాన నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన శక్తి యోజన విజయోత్సవంలో ఆయన మహిళలకు తీపి తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేదల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. మాన్వి తాలూకాలో 71 లక్షల మంది మహిళలు ప్రయాణించినట్లు తెలిపారు. నరేంద్ర మోదీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకోవటంలో విఫలం చెందారన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు లక్ష్మీవీరేశ్, గ్యారంటీ అమలు సమితి అధ్యక్షుడు అమరేశప్ప, నాయకులు గఫూర్‌సాబ్, లక్ష్మీదేవి, రాజా శుభాశ్చంద్రనాయక్, శివరాజ్‌నాయక్, చాంద్‌పాషా, హుసేన్‌బేగ్, జిలానీ కురేషి, సుఖముని, మహాబళేశ్వర, పురపాలక సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. సిరివార బస్టాండ్‌లో శక్తి పథకం విజయోత్సవం జరిపారు. గ్యారంటీ సమితి అధ్యక్షుడు బ్రిజేష్‌పాటిల్, రమేష్ దర్శనకర్, శశిధర్‌స్వామి మహిళలు పాల్గొన్నారు.

గంగావతి,న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే శక్తిపథకం చరిత్రాత్మక సాధన చేసిందని కొప్పళ శాసనసభ్యుడు రఘవేంద్ర హిట్నాళ పేర్కొన్నారు. 500 కోట్ల సార్లు మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసిన నేపథ్యంలో సోమవారం కొప్పళ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ బస్సుల పూజా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అన్ని గ్యారంటీలను ప్రజలకు అందించిందన్నారు. ముఖ్యమంత్రి విజయవంతంగా వీటిని అమలు చేశారన్నారు. జిల్లా గ్యారంటీ పథకాల సమితి అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 500కోట్ల సార్లు మహిళలకు ఉచిత ప్రయాణం అందించడం దేశంలోనే అతి పెద్ద సాధన అన్నారు. జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ, నగరసభ అధ్యక్షుడు అంజద పటేల్, సమితి ఉపాధ్యక్షుడు మంజునాథ్ గొండబాళ, ఆర్టీసీ విభాగ నియంత్రణాధికారి రాజేంద్ర జాదవ్, టి.బాలచంద్రన్, జ్యోతి గొండబాళ పాల్గొన్నారు.

సిరుగుప్ప, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన ఐదు గ్యారంటీల్లో ఒకటైన శక్తి యోజన విజయవంతం కావడంతో పంచసూత్రాల గ్యారంటీ సమితి ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి విజయోత్సవాన్ని ఆచరించారు. పట్టణంలోని కల్యాణ కర్ణాటక బస్సు ప్రయాణ ప్రాంగణంలో సోమవారం బస్సును అందంగా అలంకరించి మహిళలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు మారుతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.కరిబసప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రెండేళ్లు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు శక్తి పథకానికి 500 కోట్ల సార్లు మహిళలు ప్రయాణం సాగించారు. రూ. 12,669 కోట్లు ప్రభుత్వం ఈ పథకానికి ఖర్చు చేసిందన్నారు. నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, ఉపాధ్యక్షురాలు యశోదమూర్తి, తాలూకా పంచాయతీ మేనేజర్ సుజాత, పార్టీ నాయకురాలు లక్ష్మి, దానేశ్వరి, నాయకులు పాలాక్షిగౌడ, వెంకటరెడ్డి, చన్నబసవ, డిపో మేనేజర్ తిరుమల పాల్గొన్నారు.

సింధనూరు, న్యూస్‌టుడే: యావత్ దేశానికే ఆదర్శంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పంచ గ్యారంటీలు అమలుపర్చి విజయవంతంగా నిర్వహిస్తుండటం మన్ననలు అందుతున్నాయి..దీన్ని మరిన్ని రాష్ట్రాలు ఆదర్శంగా మలుచుకుంటుండటం మన గొప్పతనమని ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి హర్షం వ్యక్తం చేశారు. పంచ గ్యారంటీల్లో ఒకటైన మహిళల ఉచిత బస్సు ప్రయాణ 'శక్తి యోజన' అమలు చేసిన రెండేళ్లలో 500 కోట్ల సార్లు మహిళా ప్రయాణికులు లబ్ధి పొందడాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన స్థానిక ప్రయాణప్రాంగణంలో మహిళా ప్రయాణికులను సత్కరించారు. తొలుత అయిదు వందల కోట్ల ఒకటో ప్రయాణికురాలికి టికెట్ అందించి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ప్రాధికార నూతన అధ్యక్షుడు బాబూగౌడ బాదర్లి ప్రయాణప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం జరిపి మహిళా ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు. గ్యారంటీల సమితి తాలూకా అధ్యక్షుడు అనిల్, డిపో మేనేజర్ హొన్నేశ్ పాల్గొన్నారు.

హొసపేటె, న్యూస్‌టుడే: రెండేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, మాటలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకొంటోందని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్. గవియప్ప హర్షం వ్యక్తం చేశారు. శక్తిపథకంలో రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది సార్లు మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన నేపథ్యంలో సోమవారం హొసపేటె ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన సంభ్రమాచరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదు గ్యారంటీ పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి, ఈ ఘనత ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకే చెందుతుందని కొనియాడారు. విజయనగర జిల్లాలో 7.25 కోట్ల మహిళలు ఇప్పటివరకూ బస్సుల్లో ప్రయాణించారని వివరించారు. హుడా అధ్యక్షుడు మొహ్మద్ ఇమామ్ నియాజి, గ్యారంటీ పథకాల జారీ సమితి జిల్లాధ్యక్షుడు కురి శివమూర్తి, ఆర్టీసీ హొసపేటె నియంత్రణాధికారి తిమ్మారెడ్డి హీరా పాల్గొన్నారు.

హొసపేటెలో ప్రయాణికురాలికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

చెళ్లకెర,న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ఒక చోటు నుంచి మరో చోటుకు ప్రయాణించడంతో వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే టి. రఘుమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా ప్రయాణికులకు తీపి పదార్థాలను పంచి పెట్టారు. ఉపాధి పనులను వెదుక్కొని రోజూ దూర ప్రాంతాలకు ఒంటరిగా ప్రయాణిస్తున్నారన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. బస్సులు, బస్టాండును పూల హారాలు, గాలిబుడగలతో అందంగా అలంకరించారు.

సిరుగుప్ప: గ్యారంటీ సమితి ఆధ్వర్యంలో విజయోత్సవాన్ని ఆచరిస్తున్న శ్రేణులు

సింధనూరు ప్రయాణ ప్రాంగణంలో మహిళలను సత్కరించిన ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

చెళ్లకెర ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులతో కలిసి సంబరాలు జరుపుకొంటున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్ ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పందులు, ఫామ్స్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ నేషనల్ హార్టికల్చర్ ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

JOBS

అగ్రికల్చర్ మోటార్‌ల అడ్రస్‌ల కలెక్షన్స్‌కు బైక్ ఉన్న బాయ్స్ కావలెను. నో కాల్స్. Only వాట్సాప్. మీ పేరు, జిల్లా పేరు పంపండి. రోజుకు 900/- రూ॥. Cell: 7075945321.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్లారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

శివశరణ హడపద అప్పణ్ణ జయంతిలో జడేశ్ శివలింగ తాతానవరు తదితరులు

ఆదర్శనీయుడు శివశరణ హడపద అప్పణ్ణ

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా సమీపంలోని హెచ్.వీరాపురం గ్రామంలోని శ్రీ జ్ఞానజ్యోతి శివలింగ మందిరంలో సోమవారం శివశరణ హడపద అప్పణ్ణ జయంతిని నిర్వహించారు. జడేశ్ శివలింగ తాతనవరు, ఉపాధ్యాయులు రామప్ప, బసవరాజ్, రాజసాబ్, హుచ్చప్ప, హులగప్ప, బానట్టి శివరామప్ప, జడేశ, మల్లికార్జున తదితరులు హడపద అప్పణ్ణ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. హడపద అప్పణ్ణ తన వచనాలతో సమాజంలో మార్పులు తీసుకుని రావడానికి శ్రమించారన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న పది, పీయూసీ విద్యార్థులతో ప్రముఖులు

భావవ్యక్తీకరణే అమూల్యం

హొసపేటె, న్యూస్‌టుడే: మీరు సాధించే మార్కులకన్నా మీలో ఉన్న భావవ్యక్తీకరణ నైపుణ్యానికి చాలా విలువ ఉందని హుడా, అంజుమన్ సమితి అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి పేర్కొన్నారు. అంజుమన్ ఖిద్మతే సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో పదోతరగతి, పీయూసీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కూడా మొదటి ప్రాధాన్యం ఇస్తోంది, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్రీడల్లో రాణించినవారికీ చక్కటి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. సమితి ఉపాధ్యక్షుడు ఫైరోజ్‌ఖాన్, ప్రముఖులు అన్సర్ బాషా, డాక్టర్ దర్వేశ్ పాల్గొన్నారు.

కన్నడ పాఠశాలలను ఆదుకోండి సారూ..

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కన్నడ పాఠశాలలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆదుకోవాలని అనుదాన రహిత కన్నడ పాఠశాలల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. అనుదాన రహిత కన్నడ పాఠశాలలు, పీయూ కళాశాలల సంఘం అధ్యక్షుడు శివప్ప, ఉపాధ్యాయుల ఒక్కూట సంఘం ప్రతినిధులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మాట్లాడారు. కన్నడభాష అమలుపై ప్రభుత్వాలు నినాదాలకే పరిమితం చేస్తున్నాయని ఆరోపించారు. కన్నడ భాషపై అభిమానంతో రాష్ట్రంలో పాఠశాలలను ప్రారంభించి నిర్వహిస్తున్నాం, అయినా ఎలాంటి ఆర్థిక తోడ్పాటు లభించక పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేక పాఠశాలలు మూసివేసే దిశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ గౌసియాబేగంకు వినతిపత్రం అందించారు. సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ గౌసియాబేగంకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వం

హొసపేటె, న్యూస్‌టుడే: రెండేళ్ల వ్యవధిలో ప్రభుత్వం రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఎద్దేళు కర్ణాటక (మేలుకో కర్ణాటక) సంఘటన ప్రముఖుడు రవికుమార్ గుడిమని విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఐదు గ్యారంటీలకు నిధులను సమకూర్చడంలో ఈ ప్రభుత్వ పుణ్యకాలమంతా పూర్తవుతోంది, ఇక మిగిలిన అభివృద్ధి పనులను ఎలా పూర్తి చేస్తుందో దేవుడికే తెలియాలని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో రైతుల సంక్షేమానికి ఒక్క మంచి పని చేయలేదని దుయ్యబట్టారు. బెంగళూరు గ్రామీణంలోని దేవనహళ్లిలో రైతుల భూములను బలవంతంగా లాక్కొని వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. బాజపాను దింపి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే, ఈ ప్రభుత్వ తీరు కూడా దొందూ దొందేనని ఆరోపించారు.

ముఖ్యాధికారుల హాజరు తప్పనిసరి

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకా స్థాయి అధికారుల ప్రగతి పరిశీలన సమావేశానికి ఆయా శాఖల ముఖ్య అధికారులు రావాలని కంప్లి తాలూకా ఇన్‌ఛార్జి అధికారిణి, శిరసి ఉప విభాగ అధికారిణి అర్చన సూచించారు. కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన తాలూకా ప్రగతి పరిశీలన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా రావాలన్నారు. వివిధ శాఖల ప్రగతిని పరిశీలించారు. అంతకుముందు ఆమె సోమసాగర గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అంబులెన్స్ సదుపాయం కల్పించాలని, సిబ్బందిని నియమించాలని ప్రజలు అధికారిణిని కోరారు. అనంతరం ఆమె నాలుగు విద్యార్థి వసతి నిలయాలకు వెళ్లి పరిశీలించారు. హొస దరోజీ, హళె దరోజీ, 2.ముద్దాపుర, ఒర్వాయి తదితర గ్రామాల నుంచి కంప్లి కళాశాలకు వస్తున్న పలువురు విద్యార్థినులు అధికారిణిని కలిసి బీసీఎం వసతి నిలయం ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్ మంజు నాయక్, టీపీ అధికారి శ్రీకుమార్, పురసభ ముఖ్యాధికారి బి.మల్లికార్జున, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారిణికి సమస్యలను వివరిస్తున్న గ్రామీణ ప్రాంత కళాశాల విద్యార్థినులు

ఉప్పార హొసళ్లి పంచాయతీ అధ్యక్షురాలిగా సువర్ణమ్మ

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ఉప్పార హొసళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్ష ఎన్నికల్లో సువర్ణమ్మ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బసవరాజ్ పేర్కొన్నారు. పంచాయతీ అధ్యక్షురాలి ఎన్నికకు సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 19 మంది సభ్యులకుగాను సువర్ణమ్మకు 11 మంది సభ్యులు మద్దతు తెలిపారు. ఎన్నికల అధికారి ఆమెను అధ్యక్షురాలిగా ప్రకటించారు. మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప నూతన అధ్యక్షురాలిని అభినందించారు. భాజపా తాలూకా అధ్యక్షుడు కుంట్నాళ్ మల్లికార్జున స్వామి, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఎం.ఎస్.సిద్ధప్ప, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సువర్ణమ్మను అభినందిస్తున్న సోమలింగప్ప, ఇతర నాయకులు

ఆటోబోల్తా పడి ఒకరి మృతి

గుత్తి, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా గుత్తి-గుత్తిఆర్.ఎస్ మధ్య సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో ఐదుగురు గాయపడ్డారు. పామిడి మండలం కొండూరుకు చెందిన ఎరుకలప్ప(70) తన కుటుంబీకులతో కర్ణాటకలోని హొసపేటెలో నివాసం ఉంటున్నారు. తన కుటుంబీకులతో కలిసి తిరుమలకు దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుత్తి వరకు రైల్లో వచ్చి కొండూరుకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో కుక్కలు అడ్డురావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడగా ఎరుకలప్ప తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇదే ఘటనలో గాయపడిన విజయలక్ష్మి, వీరభద్రప్ప, రాజు, తిమ్మప్ప, ఆటో చోదకుడు రాజ్‌కుమార్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

14-07-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.49	1606.81
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	43,223	12,194
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	36,899	203
నీటి నిల్వ (టి.ఎం.సి)	78.106	31.709

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ధీమా ఇవ్వలేదు.. బీమా చేసుకోలేదు

☛ పథకంపై రైతుల విముఖత ☛ భారీగా తగ్గిన సంఖ్య

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు.. వర్షాభావం, వరద ముంపు.. వంటి కారణాలతో పంటలు నష్టపోయి కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కర్ణాటక రైతు సురక్ష ప్రధాన మంత్రి ఫసల్ బీమాపై జిల్లా రైతులు అనాసక్తి చూపుతున్నారు. గతేడాది మాదిరిగా అధికారులు పంటల బీమాపై అవగాహన కల్పించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంట నష్టపోయిన రైతులకు సరిగ్గా పరిహారం రాకపోవడమే ఇందుకు కారణమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు జిల్లా వ్యాప్తంగా 15,974 మంది రైతులు పంటల బీమా నమోదు చేసుకున్నారు. వారిలో 959 మందికి మాత్రమే నష్ట పరిహారం మంజూరైంది. మిగిలిన వారికి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి సాగు చేసిన రైతుల్లో 8,854 మందికి పరిహారం అందాల్సి ఉంది. అప్పట్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడపత్రాలను ముద్రించి అధికారులు ప్రచారం చేశారు. బీమా పరిహారం మంజూరు చేయించడంలో పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతు సంపర్క కేంద్రంలో జాగృతి కల్పిస్తూ..

2024-25 ఏడాదిలో పంటల బీమా

తాలూకా	నమోదైన రైతులు	పరిహారం వచ్చిన రైతులు
బళ్లారి	2631	161
కురుగోడు	964	20
సిరుగుప్ప	7,127	80
కంప్లి	2,467	10
సండూరు	2,785	688
మొత్తం	15,974	959

పేర్లు నమోదు ఇలా..

2024-25 ఏడాదికి పత్తి పంటకు 418 మంది, శనగ 1704, మొక్కజొన్న 1,286 కొర్రలు 354 మంది రైతులు, మినుములు 42, ఎర్ర జొన్నలు 661 కలిపి మొత్తం 15,974 మంది పంటల బీమా చేయించుకున్నారు. నష్టపోయిన రైతులకు రూ.2.15 కోట్లు రావాల్సి ఉండగా, 959 మంది రైతులకు 32.19 లక్షలు మాత్రమే పరిహారం అందింది. ఈ కారణంగా చాలా మంది కంతు చెల్లించడానికి ముందుకు రావడంలేదు.

స్పందన అంతంతమాత్రమే

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడిచినా వర్షాధారం కింద రైతులు పంటలు సాగు చేసినా ఎక్కువ మంది బీమా చేయించుకోవడానికి నిరాశక్తి చూపుతున్నారు. వ్యవసాయ శాఖాధికారులు గ్రామాల వారీగా పంటల బీమాపై ముద్రించిన కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్నారు. బళ్లారి-17, కురుగోడు-49, సండూరు-70, సిరుగుప్ప-37, కంప్లి 30 మంది కలిపి ఐదు తాలూకాల్లో 203 మంది బీమా చేయించుకున్నారు. నమోదు కోసం రైతులు బ్యాంకు, గ్రామ ఒన్ సేవా కేంద్రాల్లో సంప్రదించవచ్చు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా..రైతు సంపర్క కేంద్రాలు, సహాయ వ్యవసాయ నిర్దేశక కార్యాలయం, జేడీ కార్యాలయ అధికారులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉపాధి కూలీలతో పంటల బీమాపై అవగాహన

కష్టాల్లో ఆదుకుంటుంది

పంటల బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. పంటలు సాగు చేసి నష్టపోతే బీమా చేయిస్తే రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే ప్రతి రైతు బీమా చేయించుకోవాలి. నష్టపరిహారం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

- సోమసుందర్, వ్యవసాయశాఖ జేడీ, బళ్లారి

వీఎస్కేయూ రిజిస్ట్రార్‌గా నాగరాజు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (వీఎస్కేయూ) పరిపాలన విభాగం రిజిస్ట్రార్‌గా సి.నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్ ధార్వాడ నీటిపారుదల శాఖకు బదిలీ కావడంతో బాధ్య రిజిస్ట్రార్‌గా జి.పి.దినేశ్ నిర్వహిస్తూ వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ కె.ఎ.ఎస్ అధికారి సి.నాగరాజును రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం విశ్వవిద్యాలయంలో జి.పి.దినేశ్ నుంచి సి.నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి: బళ్లారి గ్రామీణ ఉప విభాగం జెస్కాం వ్యాప్తి 110 కె.వి.అల్లీపురం ఉత్తర మార్గంలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 16న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోకి వచ్చే శ్రీధరగడ్డ చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

బళ్లారి, న్యూస్‌టుడే: తెక్కలకోటె పోలీస్ స్టేషన్ వ్యాప్తికి చెందిన శేఖణ్ణ (50) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

చెరువులో దూకి యువకుడి గల్లంతు

మాన్వి: మాన్వి పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీకి చెందిన నాగరాజ్ భోవి (22)అనే యువకుడు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం రబ్బణకల్ క్యాంపునకు వెళ్లాడు. అక్కడికి సమీపంలోని చెరువులో ఈతకొట్టేందుకు ముందుగా నాగరాజ్ దూకాడు. నీట మునిగిన నాగరాజ్ ఎంత సేపటికీ బయటికి రాలేదు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపకదళం సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

నాగరాజ్

యోగా దివ్యౌషధం

గురువందన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమ్మరచేడు కల్యాణస్వామి, పాంపనగౌడ, ఇస్వి పంపాపతి తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఏదో కారణంతో ఒత్తిడికి గురి అవుతున్నారు. ప్రశాంత జీవనం సాగించడానికి యోగా ఔషధంగా ఉపయోగపడుతుందని కమ్మరచేడు కల్యాణ స్వామి, వేదిక మహిళ విభాగం అధ్యక్షురాలు జ్యోతి ప్రకాశ్ పతంజలి యోగా సమితి అధ్యక్షులు పాంపనగౌడ, యోగా గురువు ఇస్వి పంపాపతి పేర్కొన్నారు. బళ్లారి కన్నడ చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఉంకి మరిసిద్ధమ్మ పాఠశాల ఆవరణలో జిల్లా పతంజలి యోగా సమితి, బసవేశ్వర యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన గురువందన, యోగా గురువులకు అభినందన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న నగరంలో 51 యోగా శిబిరాలను ప్రారంభించినట్లు తెలిపారు. యోగా శిబిరాలు కాలనీలకు సమీపంలో ఉండటం ఉపయోగకరంగా మారాయన్నారు. అశోక్ దిన్ని బృందంతో యోగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ముఖ్య గురువు మంజుళ, కన్నడ చైతన్య వేదిక అధ్యక్షుడు ప్రభుకుమార్, గౌరవాధ్యక్షుడు విరుపాక్షప్ప, కార్పొరేటర్ సురేఖగౌడ, మాజీ కార్పొరేటర్ మల్లనగౌడ, జిల్లా ఆయుష్ అధికారి విరుపాక్షప్ప, పురాణిక్, రుద్రప్ప పాల్గొన్నారు.

యోగా సాధన చేస్తున్న సాధకులు

డిమాండ్ల సాధనకు ఆశాల నిరసన

బళ్లారి, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ నగరంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ నేతృత్వంలో స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని ఉద్యానవనం నుంచి గడిగి చెన్నప్ప కూడలి మీదుగా జిల్లా పాలనాధికారి కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల ప్రకారం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.10వేలకు పెంచాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.1000 పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించినా నేటికీ అమలు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. జనవరిలో నిరవధిక సత్యాగ్రహం చేసిన సమయంలో ఆశలకు రూ.10వేలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నేరుగా ప్రకటించడమే కాకుండా వివిధ సౌలభ్యాలను సమావేశంలో ఒప్పుకున్నారని గుర్తు చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీసీ కార్యాలయం అధికారికి అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, గౌరవ అధ్యక్షురాలు శాంత, అధ్యక్షురాలు గీత, సభ్యులు సత్యమ్మ, రామక్క, డా.ప్రమోద్ పాల్గొన్నారు.

డీసీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఆశా కార్యకర్తలు

వైద్యుడు ప్రశాంత్‌కుమార్ బదిలీ ఆపండి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో పనిచేస్తున్న గైనకాలజీ వైద్యుడి బదిలీని రద్దు చేయాలని దళిత సంఘర్ష సమితి ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ప్రతినిధులు దరగప్ప, రామప్ప, యోగానంద, తదితరులు మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్యుడు ప్రశాంత్‌కుమార్ మహిళలకు ఉత్తమ ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. వంద పడకల ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉంది, ఉన్న ఒక్క వైద్యుడిని బదిలీ చేస్తే పేద రోగులకు వైద్యం అందదని వాపోయారు. ఆయనను తిరిగి సిరుగుప్ప ఆసుపత్రికి బదిలీ చేయాలని కోరుతూ తహసీల్దార్ గౌసియాబేగంకు వినతిపత్రం అందించారు.

తహసీల్దార్ గౌసియాబేగంకు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధి

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని శివపుర మెట్రి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి సమితి ఎన్నిక సోమవారం జరిగింది. విద్యార్థుల తల్లి దండ్రులు సమావేశమై సమితి సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హెచ్.శాంతకుమార్, ఉపాధ్యక్షురాలిగా హులిగమ్మ, కార్యదర్శిగా ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ 13 మంది కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. సమితి నూతన అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నాగమ్మ, మాజీ అధ్యక్షురాలు గుండమ్మ, జీపీ సభ్యులు కుమారస్వామి, గిరీశ్, క్రాంతి బళగ అధ్యక్షుడు హెచ్.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా నియమితులైన పాఠశాల అభివృద్ధి సమితి సభ్యులతో ప్రజా ప్రతినిధులు

దరఖాస్తు గడువు పొడిగించాలని వినతి

హొసపేటె, న్యూస్‌టుడే: ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం నగరసభ ప్రకటించిన దరఖాస్తుల సమర్పణ గడువును నెలరోజులపాటు పొడిగించాలని, పారదర్శకంగా ఇళ్ల స్థలాల పంపిణీ చేపట్టాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు నగరసభ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా కార్యదర్శి ఆర్.భాస్కర్‌రెడ్డి, యల్లాలింగ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల దరఖాస్తుల గడువు ఈ నెల 15వరకు ఉంది, దాన్ని మరో 15రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు. 2015లో సుమారు 8 వేల మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు సమర్పించగా, ఇప్పటి వరకూ కేటాయించలేదన్నారు. ప్రక్రియ దరఖాస్తులకే ఆగిపోకుండా తదుపరి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు సమర్పించేందుకు ఆన్‌లైన్ కేంద్రాల వారు రూ.200దాకా రుసుం వసూలు చేస్తున్నారు, వాటిని నియంత్రించాలని కోరారు. ప్రముఖులు కె.ఎం.స్వప్న, ఇ.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆకట్టుకున్న సాంస్కృతిక సౌరభ

జానపద గీతాన్ని ఆలాపిస్తున్న కళాకారులు

కంప్లి, న్యూస్‌టుడే: కన్నడ, సంస్కృతి శాఖ తాలూకాలోని రామసాగర గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక సౌరభ ఆకట్టుకుంది. కన్నడ, సంస్కృతి శాఖ జిల్లా సహాయ నిర్దేశకుడు బి.నాగరాజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకే సాంస్కృతిక సౌరభ ఏర్పాటు చేశామన్నారు. కళాకారులు బళ్లారి మోహన్ కలబురగి వాయలిన్ వాదన, కె.దొడ్డ బసప్ప గవాయి సుగమ సంగీతం, యల్లన గౌడ శంకరబండి బృందంతో జానపద గీతాల ఆలాపన, వనమాల కులకర్ణి బృందంతో జానపద నృత్యం, ఏళుబెంచి కరుణామూర్తి కథా కీర్తన, వరలక్ష్మి బృందంతో హేమరెడ్డి మల్లమ్మ నాటిక తదితర ప్రదర్శనలు జరిగాయి. అంతకుముందు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు కళాకారుల ఊరేగింపు నిర్వహించారు. ఆదివాసి రక్షణ పరిషత్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి శికారి రాము, జీపీ అధ్యక్షురాలు ఆశా, ఉపాధ్యక్షుడు ఆర్.ఎం.రామయ్య, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నృత్యంతో అలరిస్తున్న యువతులు

కళాకారుల పౌరాణిక నాటిక ప్రదర్శనలో ఓ ఘట్టం

మఠం ఆధ్వర్యంలో సమ్మేళనం

మాన్వి, న్యూస్‌టుడే : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో దాస సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు మంత్రాలయం సుబుదేంద్రతీర్థ శ్రీపాదంగళ్ పేర్కొన్నారు. పట్టణంలో ఉన్నతీకరించిన రాఘవేంద్రస్వామి మఠాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయన సోమవారం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మాన్వికి మంత్రాలయం మఠానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఈ మఠానికి మంత్రాలయం మఠం అన్ని విధాలా సాయపడుతుందన్నారు. దాససాహిత్యానికి మాన్వి పుట్టినిల్లు అన్నారు. మఠంలో సన్నిధాన పూజలు చేశారు. బ్రాహ్మణ, ఆర్యవైశ్య సముదాయం ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పూజ చేస్తున్న సుబుదేంద్రతీర్థ శ్రీపాదంగళ్

జనం మెచ్చేలా శ్రమదానం

చెట్టు కొమ్మను కత్తిరిస్తూ శ్రమదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నాడగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: స్థానిక వనసిరి ఫౌండేషన్, అఖండభూమి ఫౌండేషన్ ప్రతినిధులు పట్టణ జనం మెచ్చే కార్యానికి నాంది పలికారు. ఇటీవల కురుసిన వర్షాలకు అనేక వీధుల్లో చెట్లు ఏపుగా అడ్డదిడ్డంగా పెరిగిపోయి సంచరించడానికి ఇబ్బందిగా మారింది. గమనించిన వనసిరి, అఖండభూమి ప్రతినిధులు సోమవారం శ్రమదానానికి దిగారు. అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరిస్తూ వీధులను అందంగా మార్చుతున్నారు. ఆదర్శకాలనీలో మాజీ మంత్రి నాడగౌడతో కార్యక్రమాన్ని ఆరంభించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రోజూ ఈ పనులు జరిపి వీధులను అందంగా మార్చుతామని వనసిరి అధ్యక్షుడు అమరేగౌడ, అఖండభూమి అధ్యక్షుడు నెక్కంటి సురేశ్ తెలిపారు.

కొమ్మలు కత్తిరించిన అనంతరం విశాలంగా మారిన ఆదర్శకాలనీలోని ఓ వీధి

అభ్యంతరాలకు ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె వ్యాప్తిలోని కప్పగల్ రహదారికి మాజీ మంత్రి ముండ్లూరు రామప్ప రహదారిగా, అనంతపురం రహదారి ప్రభుత్వ అతిథి భవనం ముందు కూడలికి శ్రీకృష్ణ కూడలిగా నామకరణం చేయాలని పాలికె సామాన్య సమావేశం ముందు ఉంచారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే 30 రోజుల్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

సేలంలో బళ్లారి కళాకారుల ప్రతిభ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: తమిళనాడులోని సేలంలో ఆదివారం చేపట్టిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో నగరానికి చెందిన సుజాత నాట్య కళా అకాడమీ నృత్య విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. భరతనాట్యాన్ని ప్రదర్శించి బహుమతులు అందుకున్నారని నాట్యాచార్యుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28నిమిషాలపాటు నిర్విరామంగా భక్తిపాటలకు నృత్యం చేశారన్నారు. నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారని ఆయన పేర్కొన్నారు.

పురస్కారాలు అందుకుంటున్న సుజాత నృత్య అకాడమీ కళాకారులు

(c) eenadu

ఈ పయనం.. ప్రగతిదాయకం

బస్సులో మరో మహిళకు టికెట్ అందిస్తున్న సిద్ధరామయ్య

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ సోమవారం కొంత సమయం బీఎంటీసీ కండక్టర్లుగా మారిపోయారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు శక్తి పథకం కింద బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని హామీనిచ్చి.. అమలు చేశారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి విజయవంతంగా కొనసాగుతోంది. ఆలయాలకు, పుట్టిళ్లకు, దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులను కలిసేందుకు ఈ ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు వినియోగించుకుంటున్నారు. ఆధార్ కార్డు చూపించి, తాము వెళ్లవలసిన గమ్యస్థానం వివరాలు చెబితే కండక్టర్ జీరో టికెట్ ఇస్తారు. ప్రారంభంలో మహిళలు ప్రయాణాలకు పోటీ పడడంతో పురుషులకు బస్సులో ప్రయాణించేందుకు, సీట్లలో కూర్చునేందుకే అవకాశం లభించలేదు. తదుపరి కొద్ది నెలలకే సమస్య నియంత్రణలోకి వచ్చింది. ఆర్టీసీ,

జీరో టికెట్ కొనుగోలు చేసుకున్న 500 కోటి ప్రయాణికురాలితో మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి

టికెట్.. టికెట్ అంటూ సిద్ధు, డీకే సందడి

బీఎంటీసీల్లో ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. ఇప్పటి వరకు 500 కోట్ల జీరో టికెట్లను రవాణా శాఖ వితరణ చేసింది. కుమారకృపరోడ్డు విండ్సర్ మ్యానర్ వద్ద బీఎంటీసీ బస్సులో ముఖ్యమంత్రి ఒక ప్రయాణికురాలికి 500 కోటి జీరో టికెట్‌ను అందించి.. ఆనందాన్ని పంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌తో కలిసి ఆ ప్రయాణికురాలిని సత్కరించారు. ఆ తర్వాత టికెట్లు తీసుకున్న కొందరు ప్రయాణికురాళ్లకు శివకుమార్, సిద్ధరామయ్య బహుమతులు అందించి అభినందించారు.

ఉచిత ప్రయాణ కుటుంబ సభ్యులతో చిన్నారి ప్రయాణికురాలు

ఓ ప్రయాణిరాలికి బహుమతి అందిస్తున్న డీకే శివకుమార్

అభినయ సరస్వతికి కన్నీటి నివాళి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బహుభాషా నటి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత బి సరోజాదేవి (87) సోమవారం ఉదయం కన్నుమూశారనే సమాచారం కన్నడ చిత్రసీమను దిగ్భ్రాంతికి గురిచేసింది. వయోసహజ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఆమెను మల్లేశ్వరం మణిపాల్ ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. అభిమానుల ఆదరాభిమానాలను అందుకున్న ఆమె ఆరు దశాబ్దాల పాటు చిత్ర పరిశ్రమలో కళా సేవ చేసి కన్నడ, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఓ మెరుపు మెరిసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. రామనగర జిల్లా చెన్నపట్టణ తాలూకా దశవార గ్రామంలో తన భర్త శ్రీహర్ష సమాధి పక్కన ఒక్కలిగ సముదాయ సంప్రదాయాలకు అనుగుణంగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ బొమ్మై, యడియూరప్ప, సదానందగౌడ, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. వెండితెర ప్రముఖులు శివరాజ్ కుమార్, ఉపేంద్ర, తార, దర్శన్, యశ్ తదితరులు ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా, 45వ జాతీయ సినీ అవార్డుల విజేతగా, 53వ జాతీయ సినీ అవార్డుల న్యాయనిర్ణేతల్లో ఒకరిగా ఆమె అందించిన సేవలను అందరూ స్మరించుకున్నారు. కర్ణాటక ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అధ్యక్షురాలిగా కూడా ఆమె వ్యవహరించారు.

భౌతికకాయం వద్ద సీనియరు నటి, మాజీ ఎమ్మెల్సీ తారా అనూరాధ

అభినేత్రి సరోజాదేవి (పాతచిత్రం)

నివాళి అర్పించేందుకు వస్తున్న కుమారునితో కలిసి వస్తున్న రాఘవేంద్ర రాజ్‌కుమార్

విషాదవదనంతో నటుడు శివరాజ్ కుమార్

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	75
క్యారెట్-	85
బీరకాయలు-	50
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	35
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	30
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	170
బీట్‌రూట్-	40
వంకాయలు-	60
బెండకాయలు-	65
ముల్లంగి-	45
నిమ్మకాయ-	280
పండ్లు,ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	420
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	395
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	45
బొప్పాయి-	35
ఆరంజి-	195
బత్తాయి-	95

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

సర్కారు తీరుపై పోరాటం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలో అధికార పార్టీ ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య ఆరోపించారు. నగరంలో వాహన రద్దీ సమస్య నియంత్రించేందుకు సొరంగ మార్గం పేరిట కొత్త కుంభకోణానికి ప్రభుత్వం తెరతీసిందని విమర్శించారు. నగరంలో 18 కి.మీ. సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేస్తే గంటకు 600 నుంచి 1600 మంది మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదే రహదారిపై ద్విచక్ర వాహనదారులను అనుమతిస్తే 7500 మంది, అదే మార్గంలో మెట్రో ఏర్పాటు చేస్తే గంటకు పాతిక వేల మంది ప్రయాణించవచ్చని వివరించారు. సొరంగ మార్గం పథకాన్ని కేవలం శ్రీమంతుల కోసమే చేపట్టినట్లు ఉందని దుయ్యబట్టారు. బ్రాండ్ బెంగళూరులో కనీస మౌలిక సదుపాయాలను కల్పించకుండా, విస్తరించుకుంటూ వెళితే ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. పథకానికి సంబంధించిన నివేదిక రూపొందించేందుకు ఒక కంపెనీకి ప్రభుత్వం రూ.9.5 కోట్లు కేటాయించిందన్నారు. అన్ని అంశాలూ ముందుంచుకుని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. అవైజ్ఞానికంగా చేపట్టే నిర్మాణాలు, పనులను అడ్డుకుంటామని తెలిపారు.

తేజస్వి సూర్య

ఆంజనేయ ఆలయ ట్రస్టు సభ్యుల పిటీషన్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : చరిత్ర ప్రసిద్ధ గాళి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోవడాన్ని ప్రశ్నిస్తూ ఆలయం ట్రస్టు ప్రతినిధులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ట్రస్టు నిర్వహణలో పారదర్శకత లేదని, హుండీలోని కానుకలను కొల్లేస్తున్నారని ఆరోపిస్తూ ఆలయాన్ని తమ పరిధిలోకి చేర్చుకోవడం సరికాదని వేసుకున్న అర్జీని మంగళవారం విచారిస్తామని జస్టిస్ సునీల్ దత్ తెలిపారు.

ఆరోగ్యం బాగాలేదంటూ.. ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

మంగళూరు, న్యూస్‌టుడే : బెళ్తంగడి తాలూకా కొయ్యూరు గ్రామంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రమ్య (32) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుడు లతీశ్‌ను ఆమె రెండేళ్ల కిందటే వివాహం చేసుకుంది. ఆరోగ్యం బాగోలేదని బెళ్తంగడిలోని తల్లి వద్దకు వచ్చి ఉరి వేసుకుంది. బెళ్తంగడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో హత్య

బెళగావి, న్యూస్‌టుడే : నగర శివార్లలోని ఒక తోటలో ఆదివారం రాత్రి చేసుకున్న మద్యం పార్టీ హత్యతో ముగిసింది. చిన్న విషయంలో గొడవ పడిన స్నేహితులు.. వినోద్ మళశెట్టి (30) అనే వ్యక్తిని పొడిచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. నలుగురు అనుమానితులను యరగట్టి ఠాణా పోలీసులు అదుపునకు తీసుకుని విచారణ చేపట్టారు.

సోనూ నిగమ్‌కు ఊరట

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తన పేరును పోలే పేరుతో ట్వీట్లు చేస్తున్న వ్యక్తితో తాను పలు ఇబ్బందులు ఎదుర్కొన్నానని బహుభాషా గాయకుడు సోనూ నిగమ్ పేర్కొన్నారు. అతను చేసిన పోస్టులకు తాను నోటీసులు అందుకున్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. కన్నడిగులతో పాటు పలు ప్రాంతాల వారి ఆగ్రహానికి గురయ్యేందుకు కారణమైన వ్యక్తి బిహారులో క్రిమినల్ కేసులు వాదించే సోను నిగమ్ సింగ్ ఖాతాపై నియంత్రణ, పేరు మార్పు చేసుకునేలా బొంబాయి హైకోర్టు ఆదేశించిందని తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసి హర్షాన్ని వ్యక్తం చేశారు.

డ్రైవరుపై స్థానికుల దాడి

బీదర్, న్యూస్‌టుడే : బీదర్ సమీపంలోని చిక్కపేట్‌కు చెందిన ఒక విద్యార్థి తన స్టాప్ వద్ద బస్సు పూర్తిగా ఆగకుండానే డోరు తీసుకుని కిందకు దూకాడు. అలా చేయడం సరికాదని డ్రైవరు ఉమేశ్ బస్సు దిగి వెళ్లి ఆ విద్యార్థికి హితవు పలికారు. ప్రమాదవశాత్తు కిందపడి తలకు గాయాలైతే ప్రాణాపాయం సంభవిస్తుందని చెబుతున్న సమయంలో గ్రామస్థులు అందరూ అక్కడకు చేరుకుని డ్రైవరుపై దాడి చేసి వెళ్లారు. మూర్ఛపోయిన బాధితుడ్ని ఇతర ప్రయాణికుల సాయంతో కండక్టర్ విజయకుమార్ ఆసుపత్రికి తరలించారు. బీదర్ గ్రామీణ ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అదుపు తప్పిన కారు

హాసన, న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి మంగళూరుకు వెళుతున్న పర్యాటకుల కారు అదుపు తప్పి రహదారి పక్కన చిన్న పల్లంలోకి బోల్తా కొట్టింది. మలుపులో నియంత్రణ సాధ్యం కాక, మినీ జలపాతం వద్ద గుంతలోకి పడిపోయింది. స్థానికులు వారిని రక్షించి ఆసుపత్రిలో చేర్పించారు. బాధితులకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సకలేశపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ, నేషనల్ హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్రః 98491 61889.

JOBS

అగ్రికల్చర్ మోటర్‌ల అడ్రస్‌ల కలెక్షన్స్‌కు బైక్ ఉన్న బాయ్స్ కావలెను. నో కాల్స్. Only వాట్సప్. మీ పేరు, జిల్లా పేరు పంపండి. రోజుకు 900/- రూ॥. Cell: 7075945321.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

చినుకుల కులుకుల ఆగుంబె!

సూర్యాస్తమయ వీక్షణకు నిత్యం పోటెత్తే జనం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : ఎడతెగని చినుకులు.. దారి పొడవునా జలపాత ధారలు.. ఒంపులు తిరిగి పరుగులు పెట్టించే కొండదారులు.. వెరసి ఆగుంబె! పడమటి కనుమల్లోని ఈ చిరు గ్రామం చేరుకుంటే ప్రకృతిమాత ఒడిలో మైమరచిపోయి కదలని విహారులెందరో! ఆచార్య ఆర్కే నారాయణ్ రచించిన 'మాల్గుడి డేస్' బుల్లితెరపైకెక్కించడానికి ఎంచుకున్న ప్రకృతిధామమే ఈ ఆగుంబె. అణువణువూ చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిందా. . అన్నంత రమణీయత ఈ కొండపల్లె సొంతం. కన్నడిగుల నిసర్గ కల్పవృక్షంగా పేరొందిన ఈ పరిసరాలను ప్రకృతిపర్యాటక కేంద్రంగా ప్రకటించి అభివృద్ధి చేశారు. ఇక్కడ అత్యధిక వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో దక్షిణ భారత చిరపుంజిగా వినుతికెక్కింది. ఏడాదిలో అతికొద్ది రోజులు మాత్రమే ఇక్కడ ఎండజాడ కానవస్తుంది. మిగిలిన రోజులన్నీ వానలో తడవాల్సిందే. 'ఆగుంబె వాననీటి అటవీ పరిశోధన' (ఏఆర్ఆర్ఎస్) కేంద్రం ఇక్కడే విస్తరించింది. పరిసరాల్లో కాళింగ సర్పాలు (కింగ్ కోబ్రా) విపరీతంగా తారాడుతుంటాయి. 'కాళింగసర్పాల రాజధాని'గా ఆగుంబె అడవిని యునెస్కో గుర్తించాక.. దేశ, విదేశీ సందర్శకుల తాకిడి తక్కువేమీ కాదు. ఇక.. వానల్లోనే సాహస పర్యాటకం (ట్రెక్కింగ్) సాగించడానికి యువకులు ఉరకలు వేస్తుంటారు. ఇపుడే వానాకాలం.. సాహసికుల అడుగులన్నీ ఇటే సాగుతున్నాయి. గిరిధామం చుట్టూ అల్లుకున్నట్లు కనిపించే కుంచికల్ జలపాతం, సావెహక్లు జలాశయం, ఉడుపి వైపు సాగే వేళ కానవచ్చే కమలశిల ఆలయం.. అద్భుతం అనిపిస్తాయి.

ఒంపులు తిరిగి.. సొంపులుబోయే మార్గాలకు నెలవు

- పర్యావరణానికి పెట్టింది పేరైన చిక్కమగళూరు- ఉడుపి జిల్లాల మధ్య పడమటి కనుమల్లో విస్తరించిన ప్రధాన రహదారిపై పయనిస్తే.. ఆగుంబె చేరుకోవచ్చు. పేరుకు చిరు గ్రామమైనా.. ఆతిథ్యానికి కొదవలేదు. చక్కని ఆహారశాలలు, విశ్రాంతి మందిరాలు కొండకోనల్లో ఒదిగిపోయాయి. ఏడాదిలో ఎనిమిది వేల మిల్లీమీటర్ల వర్షపాతం తక్కువకాకుండా ఇక్కడ నమోదవుతుంది. దక్షిణ భారతంలో ఈ రికార్డును మరే ప్రాంతమూ అధిగమించలేదు. అందుకే.. ఇక్కడున్న జలపాతాలకు లెక్కేలేదు. చిన్న, పెద్ద వందకు పైగా ధారలను వానాకాలంలో చూడొచ్చు. కొన్నింటి దరిదాపులకూ వెళ్లలేనంత హోరు ప్రదర్శిస్తాయి. కొన్ని కీకారణ్యంలో 'జల'దరిస్తుంటాయి.
- ఆగుంబెకు చేరువలోని గిరిధామం పైనుంచి సూర్యాస్తమయ వీక్షణకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఉడుపి సమీప సముద్రం మీదుగా సూర్యుడు పడమటింటికి చేరు దృశ్యకావ్యాన్ని కెమేరాల్లో బంధించేందుకు పర్యాటకులు పోటీపడుతుంటారు. సంధ్యాసమయం ముగిశాక.. ఇక ఆ కీకారణ్యంలో నిలువడానికి ఎవరూ సాహసించరు. ప్రముఖ పర్యావరణ అధ్యయనకారుడు రోములస్ వైట్కర్ సూచనలతో కాళింగ సర్పాల సంరక్షణ, వర్షపు కీకారణ్యాల అభివృద్ధి చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్న చోట.. పర్యాటకం వేయి పూల చినుకులై వికసిస్తోంది!

అపురూప ప్రకృతి దృశ్యకావ్యం..ఆగుంబె కొండమార్గం

చిరుగ్రామం ఆగుంబె.. జీవనమే వాననీటి సంగమం

'బాంబు' బూచి వెనుక కుట్ర?

మైసూరులో దొరికిన నిందితుడు

కార్వార, న్యూస్‌టుడే : ఉత్తర కన్నడ జిల్లా భట్కళను బాంబులతో పేల్చి వేస్తానని వరుసగా రెండు రోజులు పోలీసులకు ఈ-మెయిళ్లు పంపిన తమిళనాడుకు చెందిన కణ్ణన్ గురుస్వామి అనే వ్యక్తిని మైసూరులో సోమవారం అరెస్టు చేశారు. ఈ-మెయిల్ తాను పంపించలేదని, తన నుంచి ఫోన్ తీసుకున్న వ్యక్తి తన దృష్టికి రాకుండానే మెయిల్ పంపించాడని అతను వాదిస్తున్నాడని జిల్లా ఎస్పీ ఎం.నారాయణ్ తెలిపారు. భట్కళను పేల్చి వేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి గతంలో మైసూరు, బళ్లారి, కేరళ తదితర ప్రాంతాల్లోనూ పేలుళ్లకు పాల్పడతానని బెదిరింపులకు పాల్పడ్డాడని గుర్తించారు. ఆ ఉగ్రవాదికీ- కణ్ణన్‌కు ఏమైనా సంబంధాలు ఉన్నాయా లేదా అని గుర్తించవలసి ఉందని నారాయణ్ చెప్పారు. మైసూరు, బళ్లారి, కేరళ పోలీసులు కూడా అతన్ని విచారించాలని సిద్ధం కాగా, మైసూరు నుంచి కార్వారకు కణ్ణన్‌ను తీసుకువచ్చి విచారణ చేస్తున్నామని ఎస్పీ వివరించారు.

భట్కళ పట్టణ కూడలిలో స్తూపం

కళాసేవకు సత్కారం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ఐదు దశాబ్దాల నుంచి హార్మోనియం వాద్య కళాకారుడిగా సేవలందిస్తున్న కారెకల్లుకు చెందిన వై. రంగారెడ్డికి బెంగళూరు రవీంద్ర కళాక్షేత్రంలో కర్ణాటక భూషణ పురస్కారం అందజేసి సత్కరించారు. ఎనభైఏళ్లు దాటినా.. వాద్య రంగంలో రాణిస్తూ ఇప్పటికీ పల్లెల్లో నాటకాలు, బయలాటలకు మాస్టారుగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత లోకాయుక్త న్యాయమూర్తి సంతోష్ హెగ్డే, చలనచిత్ర నటుడు ముఖ్యమంత్రి చంద్రు చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

మంత్రి చెప్పిన సహాయవాణి ఏమైంది?

బెంగళూరు (కృష్ణరాజపుర), న్యూస్‌టుడే : మహిళలు, యువతులు తమపై దౌర్జన్యం జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఇటీవల పిలుపునిచ్చారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే సైబర్ క్రైమ్ కాల్ సెంటర్‌కు వెళుతోందని కవితారెడ్డి అనే మహిళ అభ్యంతరం తెలిపింది. తన కాల్ రికార్డును సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సైబర్ క్రైమ్ సహాయవాణికి చెందిన సిబ్బంది హిందీలో మాట్లాడుతున్నారని, పలు ప్రాంతాల్లో మహిళలకు ఆ భాష రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు సరైన నంబరును ప్రకటించాలని ఆమె మంత్రిని కోరారు.

గనినాడు.. కళాకారులకు పుట్టినిల్లు

బళ్లారి, న్యూస్‌టుడే: దేశ సాహిత్యం, సంస్కృతిని కాపాడటానికి, అభివృద్ధి చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కళాకారిణి బి.వీణా తెలిపారు. కన్నడ సాంస్కృతిక శాఖ, రాంసాగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సౌరభ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలోని పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. రాంసాగర్ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఆశా మాట్లాడుతూ రాంసాగర్ గ్రామంలో పలువురు జానపద కళాకారులు, సాహితీవేత్తలు ఉన్నారు. జిల్లా, రాష్ట్రానికే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టారన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ అధికారి నాగరాజ మాట్లాడుతూ కర్ణాటక రంగస్థలం కళాకారులకు పుట్టినిల్లు. బళ్లారి జిల్లాలో పలువురు కళాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. బళ్లారికి చెందిన మోహన్ కలబురగితో వయోలిన్ వాదన, దొడ్డబసప్ప గవాయి బృందంతో సుగమ సంగీత కార్యక్రమం, వనమాల కులకర్ణి బృందంతో సామూహిక నృత్య ప్రదర్శన, యల్లపగౌడ శంకరబండ బృందంతో జానపద గేయాలు, ఏళుబెంచి సి.ఎం.కరుణామూర్తి బృందంతో సంగీతం, బళ్లారి వరలక్ష్మి బృందంతో హేమారెడ్డి మల్లమ్మ నాటక ప్రదర్శన చేశాయి. జీపీ ఉపాధ్యక్షుడు రామయ్య, కళాకారులు ప్రశాంత్, వరలక్ష్మి, వనమాల కులకర్ణి, సీతా పాల్గొన్నారు.

పగటి వేషగాళ్ల ప్రదర్శన

ఓర్పే యువతకు బలం

బళ్లారి, న్యూస్‌టుడే: యువతకు అత్యుత్తమ బలం ఓర్పు.. అలవాటు చేసుకుంటే సమాజంలో ఉత్తమ వ్యక్తిగా అవుతారని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు పేర్కొన్నారు. భారత కుటుంబ నియంత్రణ సంఘం (ఎఫ్.పి.ఎ.ఐ.), ప్రభుత్వ మున్సిపల్ పదవీ పూర్వ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు మాట్లాడుతూ యువతీ, యువకులు తొందరపడి వివాహం చేసుకోకండి. సొంత నిర్ణయాలు తీసుకోవడానికి, జీవిత భాగస్వామిని ఎంచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసి మంచి జీవితాన్ని నిర్మించుకోవడానికి సమయం తీసుకోవాలన్నారు. ఎఫ్.పి.ఎ.ఐ. అధ్యక్షుడు తాడిపత్రి గోవింద విఠల్ మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించడం ద్వారా సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు సుంకప్ప మాట్లాడుతూ యువత జీవితంలో ఏమి చేయాలి. ఏమి చేయకూడదని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలకు మొత్తం 48 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో పవన్ (ప్రథమ), పద్మావతి (ద్వితీయ), మణికంఠ (తృతీయ) స్థానాల్లో నిలవగా అతిథులు వారిని అభినందించారు. ఎఫ్.పి.ఎ.ఐ. మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తాడిపత్రి గోవింద విఠల్, ప్రధాన ఆచార్యుడు సుంకప్ప తదితరులు

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

అనారోగ్య శునకాలకు మాత్రమే ఆహారం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలో ఉన్న 2.7 లక్షల వీధి కుక్కల్లో అనారోగ్యంతో బాధపడుతున్న నాలుగు వేల కుక్కలకు మాత్రమే పౌష్టికాహారం సరఫరా చేస్తామని పాలికె ప్రత్యేక కమిషనర్ సురళ్కర్ వికాస్ కిశోర్ తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అందుకు సంబంధించిన టెండర్లను ఆహ్వానించామని, బిర్యానీ సరఫరా చేసే ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. ఆ ప్రతిపాదన టెండర్లలో ప్రస్తావించలేదన్నారు. ఆహారాన్ని సరఫరా చేయడం ద్వారా కుక్కల కాటు నుంచి, రేబిస్ తదితర వాటిని నియంత్రించవచ్చున్నారు. ఈ పథకం అమలుకు రూ.2.88 కోట్లు వ్యయం చేస్తామని, ప్రతి విభాగంలో వంద కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. రోజుకు ఒక కుక్కకు సరఫరా చేసే ఆహారానికి రూ.19 ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు.

ఆకట్టుకున్న సంగీత ప్రదర్శన

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : కల్చర్ ఆఫ్ ఇండియా-మార్నింగ్ రాగాస్ పేరిట జేపీనగరలోని ఆర్ట్ హౌజ్‌లో నిర్వహించిన సంగీత ప్రదర్శన సంగీతాభిమానులను ఆకట్టుకుంది. విదుషి రత్నశ్రీ అయ్యర్ తబలా వాదన, పండిత్ అరవింద్ ముళగావ్కర్, ఉస్తాద్ అమీర్ హుసేన్‌ఖాన్, మధుసూదన్ భట్ హార్మోనియం, సిద్ధార్థ బెళమను ఆలాపన, నిఖిల్ పటవర్ధన్ సితార్ వాదన అభిమానుల వీనులకు విందుచేసింది. పాటలు, సంగీతం, జుగల్ బందీతో కళాకారులు రెండు గంటలకు పైగా ప్రదర్శనతో అభిమానులను అలరించారు.

ప్రదర్శనలో సితారతో నిఖిల్ పటవర్ధన్

హోసూరు కబుర్లు

వైభవంగా బెట్టదమ్మ కుంభాభిషేకం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-డెంకణీకోట తాలూకాల సరిహద్దులోని కలుగొండపల్లి గ్రామ దేవత బెట్టదమ్మ ఆలయ మహా కుంభాభిషేకం వేద పండితులు మార్గదర్శకంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. సమీప గ్రామాల నుంచి మహిళలు పిండి దీపాలు, మేళతాళాలతో ఊరేగింపుగా బెట్టదమ్మ ఆలయాన్ని చేరుకున్నారు. ఆలయానికి అధిక సంఖ్యలో వాహనాల్లో రావడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించింది. ఆలయంలో మహిళల భక్తిపాటలు అలరించాయి. హోసూరు, తళి ఎమ్మెల్యేలు ప్రకాశ్, రామచంద్రన్, కెలమంగలం ఛైర్మన్ జయప్రకాశ్, బూదరానం పాకాల ఛైర్మన్ శేఖర్, బెంగళూరు న్యూటౌన్‌లెస్ పాకాల ఛైర్మన్ వేణుగోపాల్, మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి, బత్తలపల్లి గోపాల్, ప్రముఖులు శ్రీనివాస్, కృష్ణప్ప, రమేశ్, శ్రీనివాసరెడ్డి, టి.వి.ఎస్.యాజమాన్య ప్రతినిధులు ఎన్.విజయకుమార్, పాల్ ఎస్.నారాయణ్, కె.నంజేగౌడు పాల్గొన్నారు. ఎన్.విజయకుమార్ తన స్వంత ఖర్చుతో భక్తులకు మూడు రోజుల పాటు భోజనసౌకర్యాలు ఏర్పాటు చేశారు. పోలీసులు గట్టి భద్రత కల్పించారు. వేద పండితులు మణికంఠ, ఆలయ ప్రధాన అర్చకుడు నాగరాజ్ నేతృత్వంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగాయి.

పూలకరగ ఊరేగింపులో భక్తజనం

లోతట్టు ప్రాంతాల్లో పూడిక తొలగింపు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగరంలో కురుస్తున్న వర్షాలతో ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాల్లో వాననీటి కాలువల్లో పూడిక తొలగింపు పనులను పాలికె చేపట్టింది. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన పణత్తూరు, తుబరహళ్లి, కుందనహళ్లి, మంజునాథ్‌నగర, మారతహళ్లి, బాణకెరె, సాయిలేఅవుట్, వర్తూరు తదితర లోతట్టు ప్రదేశాల్లో వాననీటి కాలువలు పూడికతో నిండాయి. దీంతో వాననీరు కాలువల్లో ప్రవహించకుండా నివాసాల్లోకి వస్తున్నాయి. ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు రాత్రంతా జాగరం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్తూరులోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి వాననీరు వచ్చి నిలబడింది. అందుకు కారణాలు గుర్తించిన అధికారులు అపార్ట్‌మెంట్ చుట్టు పక్కల ఉన్న వాననీటి కాలువల్లో పూడిక తొలగించే పనులు ప్రారంభించారు. మట్టితో మూసుకుపోయిన కాలువలను ఉన్న రాళ్లను యంత్రాలతో తొలగిస్తున్నారు. తొలగించిన పూడిక మట్టిని అప్పటికప్పుడు వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాలువపై తొలగించిన రాళ్లను మళ్లీ వేస్తున్నారు. చిన్న సందుల్లో కూడా కాలువల్లో పూడిక తొలగిస్తున్నారు. వాన నీరు బయటకు వెళ్లక పోవడంతో ఆయా ప్రదేశాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించారు. చిన్న కాలువలు.. పెద్ద కాలువల్లో కలిసే విధంగా నిర్మాణ పనులు చేపట్టారు. చిన్నపాటి వానకు ముంపునకు గురవుతున్న ప్రాంతాలపై ఎక్కువ దృష్టిసారించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షం వల్ల ఏ ప్రదేశాల్లో ఇలాంటి సమస్యలు తలెత్తాయో గుర్తించడానికి చర్యలు చేపట్టారు. సెప్టెంబరు, అక్టోబరులో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందు వల్ల ముంపు ప్రాంతాల్లో ముందస్తుగా కాలువలను శుభ్రం చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

కుందనహళ్లిలో కాలువను పరిశీలిస్తున్న అధికారులు

తుబరహళ్లిలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చలు

తుమకూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారని, నిధుల కొరతపై ముఖ్యమంత్రితో చర్చిస్తున్నారని హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ తెలిపారు. తుమకూరులో ఆధునిక హంగులతో రూపుదిద్దుకొంటున్న జిల్లా మత్స్యశాఖ కేంద్రాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగడనూరు వంతెన ప్రారంభోత్సవానికి ఎవరి వ్యతిరేకత లేదని, ఇది కేంద్ర ప్రభుత్వం పథకం కావడంతో వారే ప్రారంభించారన్నారు. ప్రారంభోత్సవానికి ఆహ్వానం వేయలేదని ముఖ్యమంత్రి లేఖ రాశారని, ప్రభుత్వ వ్యతిరేకత లేదన్నారు. ఆపరేషన్ కమలం ఏం లేదన్నారు. 53 మంది ఎమ్మెల్యేల జాబితా సిద్ధంగా ఉందని, పార్టీలో రాకపోతే మీపై ఐటీ, ఈడీ దాడుల తప్పవని కాషాయ వాదులను మంత్రి స్పందిస్తూ.. ఆ విషయం తనకు తెలియదని వారినే సమాధానం అడగాలన్నారు. పోలీస్ శాఖలో మూడు దశల్లో విధుల నిర్వహించే విషయంపై చర్చలు జరుగుతున్నాయని, కాలంకాపరంగా పరిశీలించి నిర్ణయిస్తామన్నారు. తుమకూరు నగరాన్ని విస్తరించడానికి 14 గ్రామ పంచాయతీలను మహానగర పాలికె పరిధిలో విలీనం అంశంపై చర్యలు చేపట్టినట్లు మంత్రి పరమేశ్వర్ వెల్లడించారు. ఎమ్మెల్యే జ్యోతిగణేశ్, జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పరమేశ్వర్, అధికారులు

ఆధునిక ఆసుపత్రి ప్రారంభం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-డెంకణీకోట రోడ్డు సీఎస్ఐ చర్చి ఎదురుగా కావేరి ఆసుపత్రి యాజమాన్యం నూతన ఆసుపత్రిని ప్రారంభించింది. పలువురు వైద్యులు సంయుక్తంగా ఆసుపత్రిని ప్రారంభించారు. శిశు సంరక్షణకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించినట్లు నిర్వాహక అధికారి విజయభాస్కర్ తెలిపారు. అత్యాధునిక పరికరాలు, పడకలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు.

జ్యోతి వెలిగిస్తున్న వైద్యులు

నిరూపిస్తే ప్రభుత్వానికి రాసిస్తా

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : తాను విదేశాల్లో భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టినట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని భాగ్యనగర ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి ఆరోపించారు. అలా తాను మదుపు చేసినట్లు నిరూపిస్తే తన ఆస్తి మొత్తాన్ని ప్రభుత్వానికి రాసిస్తానని స్పష్టం చేశారు. తన నివాసాలు, కార్యాలయాలపై గత గురువారం ఈడీ అధికారులు దాడి చేసి కొన్ని దస్త్రాలను తమతో తీసుకెళ్లారని చెప్పారు. ఈ నేపథ్యంలో తనను పరామర్శించేందుకు పలువురు నేతలు, కార్యకర్తలు వచ్చి వెళుతున్నారని తెలిపారు. తాను చేసే వ్యాపారాలకు పన్నులు చెల్లిస్తున్నానని చెప్పారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో తహసీల్దార్ మహేశ్‌పత్రి, ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ని, నాయకులు ఎ.శ్రీనివాస్, జీవీ రమేశ్, శ్రీనివాసరెడ్డి, హెచ్.నరేంద్ర తదితరులు ఉన్నారు.

పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ఎస్.ఎస్.కె ఎన్నికల్లో సిండికేట్ సభ్యులదే విజయం

గెలుపొందిన డైరెక్టర్లు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని శనిమహాత్ముడి దేవాలయ కమిటీలో 15 డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 142 మంది సభ్యులు ఉండగా 139 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. 15 డైరెక్టర్ల స్థానానికి 26 మంది పోటీలో నిలవగా, వారిలో 15 మంది సిండికేట్‌గా ఏర్పడి ఉమ్మడిగా ప్రచారం చేసుకొన్నారు. మిగతా 11 మంది సభ్యులు స్వతంత్రులుగా పోటీలో నిలిచారు. సిండికేట్‌గా ఏర్పడిన 15 మందిలో బాంక్ శీనప్ప మినహా 14 మంది గెలుపొందారు. 11 మంది స్వతంత్రుల్లో వైద్యుడు చక్కరరెడ్డి మినహా అందరూ ఓటమి పాలయ్యారు.

గెలుపొందిన డైరెక్టర్లు : ఓట్ల వివరాలు : జి.ఎస్.డి.అనిల్‌కుమార్ (113), జి.సి.అనిల్‌కుమార్ (106), వెంకటరమణప్ప(106), కె.వి.శ్రీనివాస్ (104), వెంకటరామరెడ్డి (103), ఎన్.ఆర్.అశ్వత్థకుమార్ (100), ఎం.ఎస్.రఘునందన్ (96), మను (94), వై.ఆర్.మోహన్‌కుమార్ (94), పి.వి.సుబ్బనరసింహ (89) సి.ఎన్.ఆనందరావు (86) హెచ్.సి.రాజగోపాల్ (80), ఎం.వి.కృష్ణకుమార్ (75), పి.కె.విజయ్‌కుమార్ (75), చక్కర్‌రెడ్డి (73) గెలుపొందినట్లు ఎన్నికల అధికారి సోమసుందర్ ప్రకటించారు. కొత్తగా మను, కృష్ణకుమార్, రాజగోపాల్ డైరెక్టర్లుగా ఎన్నికవగా.. మిగతా వారందరూ గతంలో డైరెక్టర్లుగా పనిచేసిన అనుభవం కలవారే. గెలుపొందిన డైరెక్టర్లను పలువురు అభినందించారు. ఆలయ కమిటీ అధ్యక్ష స్థానానికి ఎన్నిక జరగాల్సి ఉంది.

శక్తి పథకం విజయోత్సవం

తుమకూరు, న్యూస్‌టుడే : జన ప్రియమైన శక్తి పథకం విజయోత్సవాలను సోమవారం నగరంలోని డి.దేవరాజ అరసు బస్టాండ్‌లో నిర్వహించారు. హోంమంత్రి పరమేశ్వర్ ఆర్టీసీ బస్సుకు పూజలు చేసి ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు జీవనం సాగించడానికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బస్టాండ్‌లోని హోటళ్లను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పట్టు రైతుల సదస్సు : గుబ్బి వీరణ్ణ రంగమందిరంలో పట్టు రైతుల సదస్సును మంత్రి పరమేశ్వర్ ప్రారంభించి లబ్ధిదారులకు సౌకర్యాలు అందించి మాట్లాడారు. రామనగర జిల్లా పట్టు ఉత్పత్తిలో ఆసియా ఖండంలోనే ప్రసిద్ధి చెందిందన్నారు. శిర ఎమ్మెల్యే టి.బి.జయచంద్ర మాట్లాడుతూ జిల్లాలో పట్టు పంట ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పట్టుకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందన్నారు. నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్, జిల్లాధికారి శుభాకల్యాణ్, సీఈవో ప్రభు, ఎస్పీ అశోక్, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్లతో దళారులను నియంత్రిస్తాం

తుమకూరు, న్యూస్‌టుడే : ఏపీఎంసీ మార్కెట్లలో మధ్యవర్తుల బెడద, దళారుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, రైతులు, వ్యాపారుదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ తెలిపారు. తుమకూరులోని అంతరసనహళ్లి ఏపీఎంసీ ప్రాంగణంలో కూరగాయలు, పూలు, పండ్లు, తమలపాకు అమ్మకందారుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అభినందన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన రైతన్నలకు ఏ ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించలేదని, కొనుగోలు చేసిన పంటలకు ఏడాది దాటినా నగదు జమకాలేదని, సమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు. పార్కింగ్ సౌకర్యం, వ్యవసాయ ఉత్పత్తుల రక్షణకు పైకప్పులు నిర్మించాలని పాలికె కమీషనర్‌ను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో తుమకూరు రూరల్ ఎమ్మెల్యే సురేష్‌గౌడ మాట్లాడుతూ పరమేశ్వర్ గొప్ప నాయకుడని, ఆయన ముఖ్యమంత్రి కావాలన్నదే తమ ఆశయమన్నారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్, జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ అశోక్, జడ్పీ సీఈవో ప్రభు, ఎస్.నాగన్న, వ్యాపారవేత్తల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పరమేశ్వర్‌ను ఘనంగా సత్కరించారు.

బస్సుకు జెండా ఊపుతున్న మంత్రి పరమేశ్వర్, అధికారులు

సమాజ సేవకురాలి కన్నుమూత

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని పెనుకొండ రోడ్డు మారెమ్మ దేవాలయం సమీపంలో ఒంటరిగా నివసిస్తున్న కర్ణాటక రక్షణ వేదిక తాలూకా అధ్యక్షురాలు, సంఘ సేవకురాలు అన్నపూర్ణమ్మ(46) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేస్తూ కుప్పకూలింది. రాత్రంతా తలుపులు తెరుచుకొని, దీపాలు వెలుగుతూ, ఫంకా తిరుగుతున్నా ఎవరూ గమనించలేక పోయారు. సోమవారం ఉదయం ఎదురింట్లో ఉన్న కూతురు సంధ్య గమనించి తల్లిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. భీమనకుంట పుట్టినిల్లు కాగా, కె.రాంపుర అత్తగారిల్లు. పదేళ్ళ క్రితం భర్త మరణించడంతో కుమారుడు శ్రీనివాస్, కూతురు సంధ్యకు పెళ్లిల్లు చేసి ఒంటరిగా ఉంటోంది. అన్నపూర్ణమ్మ మృతికి పలు సంఘ సంస్థ నాయకులు, రాజకీయ నేతలు, ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు. సోమవారం సాయంత్రం కె.రాంపురలో అంత్యక్రియలు నిర్వహించారు.

అన్నపూర్ణమ్మ

ఆటో డ్రైవర్‌కు కత్తిపోట్లు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లిన స్నేహితులు మధ్య జరిగిన గొడవ ఘర్షణకు దారి తీయడంతో నిందితులు ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడి చేసి పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చామరాజపేట పోలీసు ఠాణా పరిధిలో జరిగింది. గాయపడిన అంచేపాళ్య నివాసి తేజస్(24) ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాత్రి తేజస్ స్నేహితులతో కలిసి రుద్రప్పగార్డన్‌లో ఉన్న బార్‌కు వెళ్లాడు. మద్యం తాగుతున్న సమయంలో స్నేహితులు మధ్య గొడవ ప్రారంభమైంది. అందులో ఉన్న ఓవ్యక్తి కత్తితో ఆటో డ్రైవర్‌ను పొడిచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

డెలివరీ బాయ్‌పై దాడి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సిగ్నల్‌లో ద్విచక్రవాహనంపై నిలబడి ఉన్న ఫుడ్ డెలివరీ బాయ్‌పై కారులో సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి బసవేశ్వరనగర పోలీసుఠాణా జరిగింది. ఈమేరకు డెలివరీ బాయ్ ప్రేమ్‌జైన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన రాత్రి 11.30 గంటలకు మోదీ కూడలిలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

30 కిలోలు దాటితే రుసుము

బెంగళూరు (మల్లేశ్వరం) : ఆర్టీసీ బస్సుల్లో ఇకపై 30 కిలోల కన్నా ఎక్కువ లగేజ్ తీసుకువెళితే రుసుము చెల్లించాలని అధికారులు తెలిపారు. నాన్ ఏసీ బస్సులకు 1-5 స్టేజుల వరకు రూ.5, ఏసీ బస్సుల్లో రూ.10 చెల్లించాలని, బాలలకు 15 కిలోల వరకు మాత్రమే తమతో లగేజ్ తీసుకువెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. ఇకపై బస్సుల్లో టైర్లు, వాషింగ్ మిషన్లు, ఇనుప గొట్టాలు, గొలుసుతో కట్టిన ప్రాణులను కూడా తీసుకువెళ్లవచ్చని, వాటికి సూచించిన విధంగా ధర చెల్లించి టిక్కెట్లు తీసుకోవలసి ఉంటుందని అధికారులు వివరించారు. దివ్యాంగులకు ఉన్న పాస్‌ను ఆర్టీసీలోని నాలుగు కార్పొరేషన్లలో, బీఎంటీసీ, గ్రామీణ రవాణా బస్సుల్లో వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఏ కార్పొరేషన్ పరిధిలో పాస్ తీసుకుంటే, అక్కడ మాత్రమే సంచరించేందుకు అవకాశం ఉండేది.

విజయోత్సవంలో మహిళల ఆనందం

విజయోత్సవంలో బస్సుకు పూజ చేస్తున్న నాగరాజు, మహిళలు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : మహిళలు ఆర్థిక సమస్యలతో ఆలయాలు, పుట్టింటికి వెళ్లేందుకు ఇబ్బంది పడేవారని, శక్తి పథకంలో మహిళలు వివిధ జిల్లాలకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేసి ఆలయాలు, పర్యాటక కేంద్రాలను సందర్శిస్తున్నారని గ్యారంటీ పథకం అధ్యక్షుడు ఎన్.నాగరాజ్ తెలిపారు. సోమవారం జయనగర బీఎంటీసీ బస్టాండ్‌లో ఆయన మహిళలకు వాయనం, తీపిని పంచిపెట్టి బస్సుకు పూజలు చేశారు. శక్తి పథకం విజయోత్సవం ఘనంగా ఆచరిస్తున్నామని, రికార్డు స్థాయిలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీ పథకాలన్నీ సంపూర్ణంగా అమలు చేస్తున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో పాలికె మాజీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్

ముళబాగిలు, న్యూస్‌టుడే : డీసీసీ, కోముల్ పాల సమాఖ్యలో జరిగిన అవినీతి, అక్రమాలపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తితో విచారణ చేయించాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ముళబాగిలులోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్ల రూపాయల కుంభకోణం జరిగినా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆరోపణలపై లోకాయుక్త సుమోటో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయాలన్నారు. కార్యక్రమంలో మరగల్ శ్రీనివాస్, ఈకంబళ్లి మంజునాథ్, మంగసంద్ర తిమ్మణ్ణ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరువాసి అనుమానాస్పద మృతి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని గోవిందపల్లి పంచాయతీ రాఘవేంద్ర కాలనీ శివారులో తడకలేరు వాగులో దేవరాజు(56) అనే వ్యక్తి మృతదేహాన్ని బుక్కరాయసముద్రం పోలీసులు గుర్తించారు. తడకలేరు వంతెన కింద కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం లభించిన ప్రదేశం అనంతపురం వన్‌టౌన్, త్రీటౌన్, బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ సరిహద్దు ప్రాంతం కావడంతో మూడు పోలీస్‌స్టేషన్ల అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చివరకు బుక్కరాయసముద్రం పరిధిలోకి వస్తుందని తేల్చారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు వివరాల ప్రకారం మృతుడి పేరు దేవరాజుగా గుర్తించారు. దేవరాజు బెంగళూరులోని నాగసంద్ర ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడా? లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చామని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని సీఐ పుల్లయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : దేవనహళ్లి తాలూకా విశ్వనాథపుర వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించారు. హొసకోటె నుంచి దాబస్‌పేటకు బైకుపై వెళుతున్న వీరిని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరూ కిందపడి అక్కడికక్కడే మరణించారు. నిందితుని కోసం విశ్వనాథపుర ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులు

బెళగావి : సవదత్తి తాలూకా హోలికట్టి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ట్యాంకు నుంచి వచ్చిన నీరు తాగి 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు చేసుకుని పడిపోయిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. తాగునీటిలో కీటకనాశని కలిపారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సవదత్తి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నవ వివాహితుడికి గుండెపోటు

బెంగళూరు (మల్లేశ్వరం) : ప్రేమించి 22 రోజుల క్రితమే వివాహం చేసుకున్న సిద్దేశ్ (23) అనే యువకుడు గుండెపోటుతో మరణించాడు. గుబ్బి తాలూకా ఆరేహళ్లి గ్రామానికి చెందిన ఇతను చిక్కనాయకనహళ్లిలోని తన అక్క ఇంట్లో భోజనం చేసి ఇంటికి వస్తూ ఛాతీలో నొప్పితో పడిపోయాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా తుదిశ్వాస విడిచాడు.

ఈత పోటీల్లో సరికొత్త రికార్డు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక ఈత సంఘం నిర్వహిస్తున్న రాష్ట్ర సబ్ జూనియర్ ఈత పోటీల బాలుర విభాగంలో బసవనగుడి ఈత సెంటర్‌కు చెందిన ఎస్.దర్శన్ కొత్త రికార్డును నెలకొల్పాడు. బాలికల విభాగంలో డాల్ఫిన్ ఈత సెంటర్‌కు చెందిన **తనీషాగుప్తా** నెట్‌కల్లప్ప ఈత సెంటర్‌కు చెందిన ఎన్.హితశ్రీ, బెంగళూరు ఈత అకాడమీకి చెందిన సోనాక్షి సత్యనారాయణ గెలుపొందారు.

ఆసక్తికరంగా మహిళల క్రికెట్ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న కేఎస్‌సీఏ మహిళల క్రికెట్ పోటీల్లో విజయా క్రికెట్ జట్టు 154 పరుగుల తేడాతో సిటీ జింఖానా జట్టుపై విజయం సాధించింది. సోమవారం జరిగిన ఈ పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన విజయా జట్టు నిర్ణిత 29 ఓవర్లలో 238 పరుగులు సాధించింది. మూడో మ్యాచ్‌లో విశ్వేశ్వరపురం జట్టు ఏడు వికెట్లతో బెంగళూరు అకేషనల్స్‌పై నెగ్గింది.

శక్తి పథకంతో మహిళలకు ఆర్థిక బలం

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి చేస్తున్న వ్యయాన్ని ఆదా చేయడం ద్వారా వారికి ఆర్థికంగా బలం చేకూర్చినట్లయిందని ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర తెలిపారు. సోమవారం ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పంచ గ్యారంటీల్లో ఒకటైన శక్తి పథకం కింద రెండేళ్లలో కోట్లాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. మహిళలు, విద్యార్థినులు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్యారంటీ పథకం సమితి అధ్యక్షుడు శివణ్ణ, ఆర్టీసీ డివిజన్ కంట్రోలర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మిఠాయిలు పంచుతున్న ఎమ్మెల్యే వీరేంద్ర

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వస్తున్న వారితోనే రాష్ట్రంలో నేరాలు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విపక్ష నేత ఆర్ అశోక్ ఆరోపించారు. అక్రమ వలసదారులను గురించి, వారి దేశానికి తిప్పి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బహిరంగ లేఖ రాశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించడంతో పాటు, ధార్మిక నమ్మకాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఇటీవల చిక్కమగళూరులో గర్భంతో ఉన్న ఆవును మాంసం కోసం చంపి తిన్న వారు కూడా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారేనని పేర్కొన్నారు. సింగదూరు వంతెన ప్రారంభోత్సవానికి ఆహ్వానించినా, తనను చివరి క్షణం వరకు ఆహ్వానించలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించడం హాస్యాస్పదమని అశోక్ వ్యాఖ్యలు చేశారు.

పేరు విషయంలో వివాదం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: గత శుక్రవారం నుంచి చిక్కమగళూరు-తిరుపతి మధ్య ప్రారంభమైన రైలుకు దత్తపీఠ లేదా దత్తాత్రేయ ఎక్స్‌ప్రెస్ అని పేరు పెడతామని ఎంపీ కోట శ్రీనివాస పూజారి ప్రకటించారు. ఆ పేరువద్దని బాబా బుడాన్ ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టాలని దర్గా శాఖాద్రి కుటుంబ సభ్యులు, స్థానిక ముస్లిం నేతలు డిమాండ్ చేశారు. ఇదే అంశమై రెండు వర్గాల మధ్య వాగ్యుద్ధం ప్రారంభమైంది. రైలుకు దత్తాత్రేయ ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టాలని ప్రధానిని కోరనున్నట్లు పూజారి తెలిపారు.

బానుముష్తాక్‌కు ఘన సన్మానం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ఇక్కడ వసంతనగరలోని మౌంట్‌కార్మెల్ కళాశాల పన్నెండో వార్షికోత్సవాలను అంతర్జాతీయ బుకర్ ప్రశస్తి విజేత, కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ ప్రారంభించారు. కళాశాల ఆవరణలో జరిగిన వేడుకల్లో బాను ముష్తాక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. 1948లో కొద్ది మందితో ప్రారంభమైన కళాశాల నేడు వేలాది మంది విద్యార్థులు ఆశ్రయం ఇచ్చేలా ఎదిగిందని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ముఖ్యులు భానుముష్తాక్‌ను సత్కరించారు. ప్రిన్సిపల్ సిస్టర్ అల్విన, ప్రిన్సిపల్ డాక్టర్ లేఖాజార్జ్, సిస్టర్ అనెట్, అయోనా, కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ సుమాసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న భానుముష్తాక్, కళాశాల ముఖ్యులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

నిమ్మ పండును తదేకంగా చూస్తున్న సిద్ధరామయ్య

నిమ్మకు లాభాల నీరు

విజయపుర, న్యూస్‌టుడే : ఇండిలో ఏర్పాటు చేసిన నిమ్మ అభివృద్ధి మండలిని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ప్రారంభించారు. స్థానికంగా పండిన ఒక నిమ్మకాయను అక్కడి నేతలు ఆయనకు అందించారు. దాన్ని చాలా సమయం చేత్తో పట్టుకుని దీర్ఘాలోచనలో పడిన సీఎం మధ్యమధ్యలో దాని సువాసన ఆఘ్రాణిస్తూ వేదికపై కూర్చున్నారు. మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ తన జేబులో, చేతిలో నిమ్మకాయ లేకుండా ఇంటి గడపదాటరు. నిమ్మకాయ పట్టుకుంటే తానూ మూఢనమ్మకాలను ఆచరిస్తున్నట్లు కాదని ఇటీవలే సీఎం ఒక సందర్భంలో వ్యాఖ్యలు చేశారు.

మఠం ఆధ్వర్యంలో సమ్మేళనం

పూజ చేస్తున్న సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగళ్

మాన్వి, న్యూస్‌టుడే : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో దాస సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు మంత్రాలయం సుబుదేంద్రతీర్థ శ్రీపాదంగళ్ పేర్కొన్నారు. పట్టణంలో ఉన్నతీకరించిన రాఘవేంద్రస్వామి మఠాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయన సోమవారం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మాన్వికి మంత్రాలయం మఠానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. బ్రాహ్మణ, ఆర్యవైశ్య సముదాయం ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ పయనం.. ప్రగతిదాయకం

టికెట్.. టికెట్ అంటూ సిద్ధు, డీకే సందడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ సోమవారం కొంత సమయం బీఎంటీసీ కండక్టర్లుగా మారిపోయారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు శక్తి పథకం కింద బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని హామీనిచ్చి.. అమలు చేశారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి విజయవంతంగా కొనసాగుతోంది. ఆలయాలకు, పుట్టిళ్లకు, దూరప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులను కలిసేందుకు ఈ ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు వినియోగించుకుంటున్నారు. ఆధార్ కార్డు చూపించి, తాము వెళ్లవలసిన గమ్యస్థానం వివరాలు చెబితే కండక్టర్ జీరో టికెట్ ఇస్తారు. ప్రారంభంలో మహిళలు ప్రయాణాలకు పోటీ పడడంతో పురుషులకు బస్సులో ప్రయాణించేందుకు, సీట్లలో కూర్చునేందుకే అవకాశం లభించలేదు. తదుపరి కొద్ది నెలలకే సమస్య నియంత్రణలోకి వచ్చింది. ఆర్టీసీ, బీఎంటీసీల్లో ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. ఇప్పటి వరకు 500 కోట్ల జీరో టికెట్లను రవాణా శాఖ వితరణ చేసింది. కుమారకృపరోడ్డు విండ్సర్ మ్యానర్ వద్ద బీఎంటీసీ బస్సులో ముఖ్యమంత్రి ఒక ప్రయాణికురాలికి 500 కోటి జీరో టికెట్‌ను అందించి.. ఆనందాన్ని పంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌తో కలిసి ఆ ప్రయాణికురాలిని సత్కరించారు. ఆ తర్వాత టికెట్లు తీసుకున్న కొందరు ప్రయాణికురాళ్లకు శివకుమార్, సిద్ధరామయ్య బహుమతులు అందించి అభినందించారు.

బస్సులో మహిళకు టికెట్ అందిస్తున్న సిద్ధరామయ్య

ఓ ప్రయాణిరాలికి బహుమతి అందిస్తున్న డీకే శివకుమార్

నర్సులకు ప్రత్యేక లాకర్ వ్యవస్థ

శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు, న్యూస్‌టుడే: నర్సులకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని నమోదు చేసేందుకు దేశంలో తొలిసారిగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక డీజీ లాకర్ వ్యవస్థను మంగళవారం ఆవిష్కరిస్తామని వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాష్ పాటిల్ వెల్లడించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాజీవ్ గాంధీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం, కర్ణాటక నర్సింగ్ పరీక్షా మండలి సంయుక్తంగా రూపొందించినట్లు తెలిపారు. ఆధార్‌కార్డుకు ఈ-కేవైసీని అనుసంధానం చేసి నర్సుల ఫోటో, వ్యక్తిగత వివరాలు, ఇంటి చిరునామా, విద్యార్హత దాఖలాలను లాకర్‌లో పొందుపరుస్తారని వివరించారు. కర్ణాటక, ఇతర రాష్ట్రాల్లో నర్సింగ్ కోర్సు అభ్యసించిన వారు బెంగళూరు నర్సింగ్ మండలిలో నమోదు చేసేందుకు, ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఇక నుంచి తిరగాల్సిన అవసరం లేదన్నారు. విద్యా ప్రమాణ పత్రాలను నేరుగా తీసుకోవచ్చని, పరీక్షా ఫలితాలను తెలుసుకోవచ్చని వివరించారు. నకిలీ విద్యా పత్రాల మంజూరుకు అడ్డుకట్టు వేయవచ్చని మంత్రి వివరించారు.

శక్తి పథకానికి రూ.353 కోట్ల చెల్లింపు

రాయచూరు, న్యూస్‌టుడే : రెండేళ్లుగా శక్తి పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణించిన మహిళల సంఖ్య 500 కోట్లకు చేరిన నేపథ్యంలో రాయచూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజలు సంబరాలు చేసుకున్నారు. బస్సులకు రిబ్బన్లు, బెలూన్లు, మామిడి కొమ్మలతో తోరణాలు కట్టి, పూలమాలలు వేసి సింగారించారు. మిఠాయిలు పంపిణీ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా గ్యారంటీ పథకాల అమలు సమితి జిల్లా అధ్యక్షుడు పామయ్య మురారీ మాట్లాడుతూ కర్ణాటకలో శక్తి పథకానికి ఇంత వరకూ రూ.12,669 కోట్లు వ్యయం చేశారని వివరించారు. రాయచూరు జిల్లాలో నిత్యం సగటున 1.16 లక్షల మంది ప్రయాణించారని, ఇందుకు ప్రభుత్వం రవాణాశాఖకు రూ.353.23 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయచూరు ఆర్టీసీ విభాగం నియంత్రణాధికారి చంద్రశేఖర్, జిల్లా ఉపాధి కల్పనా కేంద్రం అధికారి నవీన్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి అధికారి హుడేదా, జడ్పీ చీఫ్ అకౌంటెంట్ విజయశంకర్, నగరపాలక సంస్థ అధ్యక్షుడు సాజీద్ సమీర్, ఆర్‌డీఏ అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున, గ్యారంటీ సమితి ఉపాధ్యక్షుడు హనుమంతప్ప, రాయచూరు తాలూకా సమితి అధ్యక్షుడు పవన్‌పాటిల్ పాల్గొన్నారు.

మాన్వి బస్టాండులో మహిళలకు తీపి అందిస్తున్న హంపయ్యనాయక్

మహిళలకు మిఠాయి తినిపిస్తున్న మురారీ, తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షం

మాన్వి, న్యూస్‌టుడే : దేశంలో సామాజిక న్యాయానికి కట్టుబడి పేదల పక్షాన నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన శక్తి యోజన విజయోత్సవంలో ఆయన మహిళలకు తీపి తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేదల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు లక్ష్మీవీరేశ్, గ్యారంటీ అమలు సమితి అధ్యక్షుడు అమరేశప్ప, నాయకులు గఫూర్‌సాబ్, లక్ష్మీదేవి, రాజా శుభాశ్చంద్రనాయక్, శివరాజ్‌నాయక్, పురపాలక సంఘం సభ్యులు, సిరివార బస్టాండ్‌లో శక్తి పథకం విజయోత్సవం జరిపారు. గ్యారంటీ సమితి అధ్యక్షుడు బ్రిజేష్‌పాటిల్, రమేష్ దర్శనకర్, శశిధర్ స్వామి మహిళలు పాల్గొన్నారు.

హట్టిలో సమస్యలపై మంత్రికి వినతి

మంత్రికి వివరిస్తున్న ప్రతినిధులు

రాయచూరు : జిల్లాలోని లింగసూగూరు తాలూకా హట్టిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని 'ఎస్ఎఫ్ఐ' ప్రతినిధులు ఆదివారం పర్యటనకు విచ్చేసిన మున్సిపల్‌శాఖ మంత్రి రహింఖాన్‌కు మనవి చేశారు. తాలూకా కార్యదర్శి రమేష్ వీరాపూరు నేతృత్వంలో పెంపలయ్య, వెంకోబా, నింగప్ప తదితరులు మంత్రికి వినతి పత్రం అందజేసి సమస్యలను ఏకరువు పెట్టారు. దేశంలో బంగారాన్ని ఉత్పత్తి చేసే అతి పెద్ద గనుల కంపెనీలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నివసిస్తున్న హట్టిలో కనీస వసతులు కొరవడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశుభ్రమైన తాగునీటి వ్యవస్థ లేదని, రహదారులు దారుణంగా మారాయని, వీధి దీపాలు వెలగడం లేదని, డిగ్రీ కళాశాల లేదని తెలిపారు.

ఆంజనేయ ఆలయ ట్రస్టు సభ్యుల పిటిషన్

బెంగళూరు (గాంధీనగర) : చరిత్ర ప్రసిద్ధ గాళి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోవడాన్ని ప్రశ్నిస్తూ ఆలయం ట్రస్టు ప్రతినిధులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ట్రస్టు నిర్వహణలో పారదర్శకత లేదని, హుండీలోని కానుకలను కొట్టేస్తున్నారని ఆరోపిస్తూ వేసుకున్న అర్జీని మంగళవారం విచారిస్తామని జస్టిస్ సునీల్ దత్ తెలిపారు.

అభినయ సరస్వతికి కన్నీటి నివాళి

అభినేత్రి సరోజాదేవి (పాతచిత్రం)

బెంగళూరు (మల్లేశ్వరం): బహుభాషా నటి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత బి సరోజాదేవి (87) సోమవారం ఉదయం కన్నుమూశారనే సమాచారం కన్నడ చిత్రసీమను దిగ్భ్రాంతికి గురిచేసింది. వయోసహజ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఆమెను మల్లేశ్వరం మణిపాల్ ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. అభిమానుల ఆదరాభిమానాలను అందుకున్న ఆమె ఆరు దశాబ్దాల పాటు చిత్ర పరిశ్రమలో కళాసేవ చేసి కన్నడ, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఓ మెరుపు మెరిసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. రామనగర జిల్లా చెన్నపట్టణ తాలూకా దశవార గ్రామంలో తన భర్త శ్రీహర్ష సమాధి పక్కన ఒక్కలిగ సముదాయ సంప్రదాయాలకు అనుగుణంగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ బొమ్మై, యడియూరప్ప, సదానందగౌడ, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. వెండితెర ప్రముఖులు శివరాజ్ కుమార్, ఉపేంద్ర, తార, దర్శన్, యశ్ తదితరులు ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా, 45వ జాతీయ సినీ అవార్డుల విజేతగా, 53వ జాతీయ సినీ అవార్డుల న్యాయనిర్ణేతల్లో ఒకరిగా ఆమె అందించిన సేవలను అందరూ స్మరించుకున్నారు. కర్ణాటక ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అధ్యక్షురాలిగా కూడా ఆమె వ్యవహరించారు.

విషాదవదనంతో నటుడు శివరాజ్ కుమార్

భౌతికకాయం వద్ద సీనియరు నటి, మాజీ ఎమ్మెల్సీ తారా అనూరాధ

'బాంబు' బూచి వెనుక కుట్ర?

మైసూరులో దొరికిన నిందితుడు

కార్వార, న్యూస్‌టుడే : ఉత్తర కన్నడ జిల్లా భట్కళను బాంబులతో పేల్చి వేస్తానని వరుసగా రెండు రోజులు పోలీసులకు ఈ-మెయిళ్లు పంపిన తమిళనాడుకు చెందిన కణ్ణన్ గురుస్వామి అనే వ్యక్తిని మైసూరులో సోమవారం అరెస్టు చేశారు. ఈ-మెయిల్ తాను పంపించలేదని, తన నుంచి ఫోన్ తీసుకున్న వ్యక్తి తన దృష్టికి రాకుండానే మెయిల్ పంపించాడని అతను వాదిస్తున్నాడని జిల్లా ఎస్పీ ఎం.నారాయణ్ తెలిపారు. భట్కళను పేల్చి వేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి గతంలో మైసూరు, బళ్లారి, కేరళ తదితర ప్రాంతాల్లోనూ పేలుళ్లకు పాల్పడతానని బెదిరింపులకు పాల్పడ్డాడని గుర్తించారు. ఆ ఉగ్రవాదికీ-కణ్ణన్‌కు ఏమైనా సంబంధాలు ఉన్నాయా లేదా అని గుర్తించవలసి ఉందని నారాయణ్ చెప్పారు. మైసూరు, బళ్లారి, కేరళ పోలీసులు కూడా అతన్ని విచారించాలని సిద్ధం కాగా, మైసూరు నుంచి కార్వారకు కణ్ణన్‌ను తీసుకువచ్చి విచారణ చేస్తున్నామని ఎస్పీ వివరించారు.

పోలీసులపై నిందితుడి దాడి

ఉడుపి, న్యూస్‌టుడే : మహజరు సమయంలో పోలీసులపై దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన పోక్సో కేసులో నిందితుడు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ దానిశ్ (29) అనే నిందితునిపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి నియంత్రించారు. నిందితుడి దాడిలో గాయపడిన కానిస్టేబుల్ రితేశ్, నిందితుడు మహ్మద్ దానిష్‌ను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. కానిస్టేబుల్‌ను ఉడుపి ఎస్పీ హరిరాం శంకర్ పరామర్శించారు. ఉడుపి మహిళా ఠాణా పరిధిలో ఎనిమిదేళ్ల బాలికపై నిందితుడు గత శుక్రవారం లైంగిక దౌర్జన్యానికి పాల్పడగా, శనివారం అతన్ని అరెస్టు చేశామని ఇన్‌స్పెక్టర్ రామచంద్ర నాయక్ తెలిపారు. అతనికి సహకరించిన ఆరోపణలపై శామి, మౌసిన్, అబిదా అనే వారిని కూడా అదుపునకు తీసుకుని విచారణ చేస్తున్నామని చెప్పారు.

మద్యం మత్తులో హత్య

బెళగావి, న్యూస్‌టుడే : నగర శివార్లలోని ఒక తోటలో ఆదివారం రాత్రి చేసుకున్న మద్యం పార్టీ హత్యతో ముగిసింది. చిన్న విషయంలో గొడవ పడిన స్నేహితులు.. వినోద్ మళశెట్టి (30) అనే వ్యక్తిని పొడిచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. నలుగురు అనుమానితులను యరగట్టి ఠాణా పోలీసులు అదుపునకు తీసుకుని విచారణ చేపట్టారు.

ధర్మస్థల ఘటనలపై

'సిట్' ఏర్పాటుకు వినతి

మంగళూరు, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక కేంద్రం ధర్మస్థల చుట్టుపక్కల రెండు దశాబ్దాలుగా హత్యలు, హత్యాచారాలు, అసహజ మరణాలు ఎక్కువయ్యాయని వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలను వెలికి తీసేందుకు ప్రత్యేక దర్యాప్తు దళాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. తానే పలు మృతదేహాలను రహస్యంగా సాగించి, అంత్యక్రియలు చేశానని ఒక వ్యక్తి ఇప్పటికే జిల్లా ఎస్పీకి లేఖ రాయడం, బెళ్తంగడిలోని న్యాయస్థానం ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చిన నేపథ్యంలో ఈ కేసుల విచారణకు సిట్ అవసరమని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన వ్యక్తి ధర్మస్థలలో పారిశుధ్య కార్మికునిగా సేవలు అందించి పదవీ విరమణ చేశాడు. అతను లేఖ రాసిన అనంతరం తీసుకున్న చర్యలు, దర్యాప్తు ప్రారంభం తదితర అంశాలకు సంబంధించి వివరణ ఇవ్వాలని కోరుతూ దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీకి లేఖ రాశానని ఆమె తెలిపారు.

కాంగ్రెస్ గూటికి చేరిన పలువురు నేతలు

దానప్పకు జెండా కప్పుతున్న శాంతప్ప

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురు పార్టీలో చేరారు. దళ్(ఎస్) నాయకుడు దానప్ప యాదవ్, న్యాయవాది ఈరణ్ణ, వినయకుమార్, ప్రతాప్‌రెడ్డి, ప్రహ్లాద కులకర్ణి, అశోక నాయక్, వీరేశ్, లక్ష్మిరెడ్డి, ఉదయ్, వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజుకు కేపీసీసీ ప్రధాన కార్యదర్శి కె.శాంతప్ప కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాంతప్ప మాట్లాడుతూ సిద్ధరామయ్య సర్కారు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. వీరి రాకతో రాయచూరులో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ అధ్యక్షుడు సాజీద్ సమీర్, కౌన్సిలర్లు బి.రమేష్, తిమ్మారెడ్డి, మహ్మద్ శాలం, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు తీరుపై పోరాటానికి ప్రణాళిక

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలో అధికార పార్టీ ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య ఆరోపించారు. నగరంలో వాహన రద్దీ సమస్య నియంత్రించేందుకు సొరంగ మార్గం పేరిట కొత్త కుంభకోణానికి ప్రభుత్వం తెరతీసిందని విమర్శించారు. నగరంలో 18 కి.మీ. సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేస్తే గంటకు 600 నుంచి 1600 మంది మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదే రహదారిపై ద్విచక్ర వాహనదారులను అనుమతిస్తే 7500 మంది, అదే మార్గంలో మెట్రో ఏర్పాటు చేస్తే గంటకు పాతిక వేల మంది ప్రయాణించవచ్చని వివరించారు. సొరంగ మార్గం పథకాన్ని కేవలం శ్రీమంతుల కోసమే చేపట్టినట్లు ఉందని దుయ్యబట్టారు. బ్రాండ్ బెంగళూరులో కనీస మౌలిక సదుపాయాలను కల్పించకుండా, విస్తరించుకుంటూ వెళితే ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. పథకానికి సంబంధించిన నివేదిక రూపొందించేందుకు ఒక కంపెనీకి ప్రభుత్వం రూ.9.5 కోట్లు కేటాయించిందన్నారు. అన్ని అంశాలూ ముందుంచుకుని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. అవైజ్ఞానికంగా చేపట్టే నిర్మాణాలు, పనులను అడ్డుకుంటామని తెలిపారు.

డ్రైవరుపై స్థానికుల దాడి

బీదర్, న్యూస్‌టుడే : బీదర్ సమీపంలోని చిక్కపేట్‌కు చెందిన ఒక విద్యార్థి తన స్టాప్ వద్ద బస్సు పూర్తిగా ఆగకుండానే డోరు తీసుకుని కిందకు దూకాడు. అలా చేయడం సరికాదని డ్రైవరు ఉమేశ్ బస్సు దిగి వెళ్లి ఆ విద్యార్థికి హితవు పలికారు. ప్రమాదవశాత్తు కిందపడి తలకు గాయాలైతే ప్రాణాపాయం సంభవిస్తుందని చెబుతున్న సమయంలో గ్రామస్థులు అందరూ అక్కడకు చేరుకుని డ్రైవరుపై దాడి చేసి వెళ్లారు. మూర్ఛపోయిన బాధితుడ్ని ఇతర ప్రయాణికుల సాయంతో కండక్టర్ విజయకుమార్ ఆసుపత్రికి తరలించారు. బీదర్ గ్రామీణ ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మంత్రి చెప్పిన సహాయవాణి ఏమైంది?

బెంగళూరు (కృష్ణరాజపుర), న్యూస్‌టుడే : మహిళలు, యువతులు తమపై దౌర్జన్యం జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఇటీవల పిలుపునిచ్చారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే సైబర్ క్రైమ్ కాల్ సెంటర్‌కు వెళుతోందని కవితా రెడ్డి అనే మహిళ అభ్యంతరం తెలిపింది. తన కాల్ రికార్డును సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సైబర్ క్రైమ్ సహాయవాణికి చెందిన సిబ్బంది హిందీలో మాట్లాడుతున్నారని, పలు ప్రాంతాల్లో మహిళలకు ఆ భాష రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు సరైన నంబరును ప్రకటించాలని ఆమె మంత్రిని కోరారు.

శాంతించిన కృష్ణమ్మ

రాయచూరు, న్యూస్‌టుడే : ఉగ్ర స్వరూపిణిగా మారి తీర ప్రాంతాల ప్రజలను హడలెత్తించిన జలవేణి కృష్ణవేణి శాంతి రూపాన్ని దాల్చింది. మరాఠా ప్రాంతం, చుట్టు పక్కల ప్రదేశాల్లో వరుణ దేవుడు నెమ్మదించడంతో కృష్ణమ్మ ప్రవాహ ఉద్ధృతికి కళ్లెం పడింది. ఫలితంగా ముఖ్య ఆనకట్టల్లోకి చేరే వరద నీరు, దిగువకు వదిలే నీటి ప్రమాణం తగ్గింది. సోమవారం ఉదయం ఆలమట్టిలోకి ఇన్‌ఫ్లో 63,859 వేలు, అవుట్ ఫ్లో 20 వేలు, నారాయణపుర ఇన్‌ఫ్లో 20 వేలు, అవుట్‌ఫ్లో మూడు వేల క్యూసెక్కులకు పతనమైంది. ఆదివారం గణాంకాలను పరిశీలిస్తే ఆలమట్టిలో (నీటి మట్టం 95.474 టీఎంసీలు)కి వస్తున్న, పోతున్న నీటిని బాగా కుదించారు. నారాయణపుర(తాజా నీటి నిల్వ 28.944)లో ఎలాంటి మార్పులేదు. ఆలమట్టిలో మూడు టీఎంసీలకు పైగా, నారాయణపురలో స్వల్పంగా నీరు చేరాయి.

జనం మెచ్చేలా శ్రమదానం

చెట్టు కొమ్మను కత్తిరిస్తూ శ్రమదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నాడగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: స్థానిక వనసిరి ఫౌండేషన్, అఖండ భూమి ఫౌండేషన్ ప్రతినిధులు పట్టణ జనం మెచ్చే కార్యానికి నాంది పలికారు. ఇటీవల కురిసిన వర్షాలకు అనేక వీధుల్లో చెట్లు ఏపుగా అడ్డదిడ్డంగా పెరిగిపోయి సంచరించడానికి ఇబ్బందిగా మారింది. గమనించిన వనసిరి, అఖండభూమి ప్రతినిధులు సోమవారం శ్రమదానానికి దిగారు. అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరిస్తూ వీధులను అందంగా మార్చుతున్నారు. ఆదర్శకాలనీలో మాజీ మంత్రి నాడగౌడతో కార్యక్రమాన్ని ఆరంభించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రోజూ ఈ పనులు జరిపి వీధులను అందంగా మార్చుతామని వనసిరి అధ్యక్షుడు అమరేగౌడ, అఖండభూమి అధ్యక్షుడు నెక్కంటి సురేశ్ తెలిపారు.

అదుపు తప్పిన కారు

హాసన, న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి మంగళూరుకు వెళుతున్న పర్యాటకుల కారు అదుపు తప్పి రహదారి పక్కన చిన్న పల్లంలోకి బోల్తా కొట్టింది. మలుపులో నియంత్రణ సాధ్యం కాక, మినీ జలపాతం వద్ద గుంతలోకి పడిపోయింది. స్థానికులు వారిని రక్షించి ఆసుపత్రిలో చేర్పించారు. బాధితులకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సకలేశపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇతిహాసాన్ని అధ్యయనం చేయాలి


ప్రసంగిస్తున్న శివానంద, అధ్యాపకులు

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడ సాహిత్యాన్ని ఆధారంగా చేసుకుని చరిత్ర విద్యార్థులు ఇతిహాసాన్ని లోతుగా అధ్యయనం చేయాలని మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ శివానంద కెళగనమని సూచించారు. చరిత్ర, పురాతత్వ విద్యార్థులకు సోమవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉప కులపతి మాట్లాడుతూ భారత ఇతిహాసాన్నే కాక ప్రపంచంలోని ఇతర దేశాల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. జ్ఞాన సంపాదన వృద్ధి చెంది ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ చెన్నప్ప ఉపన్యాసం చేస్తూ చరిత్ర గ్రంథాలను తరచూ చదవాలని సలహా ఇచ్చారు. ఉప రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన తర్వాత పరిశోధనలు చేయడం మానుకోవద్దని సూచించారు. కళాశాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు సుయిమీంద్ర కులకర్ణి, అతిథి అధ్యాపకురాలు పద్మజా దేసాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

మంగళూరు, న్యూస్‌టుడే : బెళ్తంగడి తాలూకా కొయ్యూరు గ్రామంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రమ్య (32) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుడు లతీశ్‌ను ఆమె రెండేళ్ల కిందటే వివాహం చేసుకుంది. ఆరోగ్యం బాగోలేదని బెళ్తంగడిలోని తల్లి వద్దకు వచ్చి ఉరి వేసుకుంది. బెళ్తంగడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చెరువులో పడి యువకుడి గల్లంతు


నాగరాజ్

మాన్వి, న్యూస్‌టుడే : మాన్వి పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీకి చెందిన నాగరాజ్ భోవి (22)అనే యువకుడు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం రబ్బణకల్ క్యాంపునకు వెళ్లాడు. అక్కడికి సమీపంలోని చెరువులో ఈతకొట్టేందుకు ముందుగా నాగరాజ్ దూకాడు. నీట మునిగిన నాగరాజ్ ఎంత సేపటికీ బయటికి రాలేదు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపకదళం సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

పంచ గ్యారంటీలే ప్రభుత్వానికి శక్తి

సింధనూరు ప్రయాణ ప్రాంగణంలో మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: యావత్ దేశానికే ఆదర్శంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పంచ గ్యారంటీలు అమలుపర్చి విజయవంతంగా నిర్వహిస్తుండటం మన్ననలు అందుతున్నాయి.. దీన్ని మరిన్ని రాష్ట్రాలు ఆదర్శంగా మలుచుకుంటుండటం మన గొప్పతనమని ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి హర్షం వ్యక్తం చేశారు. పంచ గ్యారంటీల్లో ఒకటైన మహిళల ఉచిత బస్సు ప్రయాణ 'శక్తి యోజన' అమలు చేసిన రెండేళ్లలో 500 కోట్ల మంది మహిళా ప్రయాణికులు లబ్ధి పొందడాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన స్థానిక ప్రయాణప్రాంగణంలో మహిళా ప్రయాణికులను సత్కరించారు. తొలుత అయిదు వందల కోట్ల ఒకటో ప్రయాణికురాలికి టికెట్ అందించి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ప్రాధికార నూతన అధ్యక్షుడు బాబూగౌడ బాదర్లి ప్రయాణప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం జరిపి మహిళా ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు. పంచ గ్యారంటీల అమలు సమితి తాలూకా అధ్యక్షుడు అనిల్, డిపో మేనేజర్ హొన్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం లేకుంటే..జరిమానా తప్పదు

అంబేడ్కర్ కూడలిలో పనిచేయని సిగ్నల్స్

ఎస్పీ పుట్ట మాదయ్య

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణాన్ని (హెల్మెట్) ధరించడం మంగళవారం నుంచి అనివార్యం కానుంది. వేసవి కాలం దృష్ట్యా నాలుగు మాసాల క్రితం నిలిపివేసిన తనిఖీలను పోలీసులు తిరిగి చేపడతారు. ప్రజల సురక్షత కోసం తీసుకున్న నిర్ణయానికి సహకరించాలని ఎస్పీ పుట్ట మాదయ్య విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేస్తే రూ.500 చలానా చెల్లించేందుకు సిద్ధంగా ఉండాల్సిందే. గతేడాది మధ్యలో జిల్లాలో తొలిసారిగా హెల్మెట్‌ను తప్పనిసరి చేశారు. ధరించేందుకు పోలీసులు గడువు ఇచ్చారు. అయినా సంచార నియమాన్ని పాటించని వారికి వెయ్యి రూపాయలు జరిమానా వేశారు. దీంతో 90 శాతం మందికి పైగా వాహనదారులు పెట్టుకున్నారు. విక్రయాలు ఒకసారిగా ఊపందుకున్నాయి. ప్రముఖ రహదారుల్లో హెల్మెట్ దుకాణాలు వెలిశాయి. ఆరంభంలో ధరించేందుకు చోదకులు కాస్త ఇబ్బంది పడినా.. కొన్ని రోజులకు అలవాటు పడ్డారు. ప్రాణాలను కాపాడేందుకు పోలీస్ శాఖ చేపట్టిన చర్యలకు వాహనాదారులు సమర్థించారు. రహదారులను బాగు చేసిన తర్వాతనే అమలు చేయలని కొందరు సూచించారు. మార్చిలో ఎండలు తీవ్రం కావడంతో తనిఖీలు చేయలేదు. దీని ఫలితంగా నగరాలు, పట్టణాల్లో హెల్మెట్ పెట్టుకున్న వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. అప్పట్లో చెవిలో చరవాణి ఉంచుకుని వాహనాన్ని నడిపే వారిపై గతంలో కఠినంగా వ్యవహరించారు. దీని వల్ల కొంత మార్పు వచ్చింది. ఆ తర్వాత పట్టించుకోక వదిలేయడంతో కొందరికి చరవాణిలో మాట్లాడుతూ ప్రయాణించడం సర్వ సాధారణంగా మారిపోయింది. ద్విచక్ర వాహనదారులు చరవాణిని పెట్టుకుంటే సంచార పోలీసులు హెచ్చరించి వదిలేస్తున్నారు. ఇబ్బంది పెట్టే వారిపై జరిమానా విధిస్తే దారిలోకి వస్తారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. సంచార నియంత్రణకు రద్దీగా ఉండే స్టేషన్, అంబేడ్కర్ కూడళ్లలో సంచార సిగ్నల్స్ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

(c) eenadu

వీధికి చేరని వినతుల పరిష్కారం

● మున్సిపాల్టీల్లో మొక్కుబడిగా పీజీఆర్ఎస్

వీధి దీపం వెలగడం లేదు.. మంచినీరు రావడం లేదు.. ఆస్తి పన్నులో తేడా ఉంది.. శునకాలు భయపెడుతున్నాయి.. పట్టణ వాసులను ఇబ్బంది పెడుతున్న ఇలాంటి చిన్న సమస్యలనూ పుర అధికారులు పట్టించుకోవడం లేదు. పురపాలక సంఘాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మొక్కుబడిగా మారింది. ఒకరిద్దరే వచ్చి అర్జీలు తీసుకుంటున్నారు. వినతులు తీసుకున్నా పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు.

–న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక, ఎమ్మిగనూరు, ఆదోని పురపాలకం,

కర్నూలు నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కమిషనర్ పి.విశ్వనాథ, ఆయా విభాగాల అధికారులు

పరిశీలన

● కర్నూలు నగరంలోని 52 వార్డుల పరిధిలో 6.5 లక్షల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. ప్రతి సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నగర వాసుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారే తప్ప పరిష్కారం చూపడం లేదు. నెల రోజుల వ్యవధిలో 101 వినతులు స్వీకరించారు. ఇందులో సగం సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం చూపకపోవడం గమనార్హం. ప్రతి మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొంది.

చర్యలకు వెరసి.. 'యాప్' ప్రచారం మరచి

● పుర ప్రజలకు మేలు చేసేలా 'కూటమి' ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 15న పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పురపాలక సంఘాల్లోని ప్రజలు తమ సమస్యలు ఈ యాప్‌లో నమోదు చేయడం ద్వారా పరిష్కారం పొందే అవకాశం కల్పించింది. సమస్యల తీవ్రత తెలిసేలా ఫొటోతీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సంబంధిత అధికారులు స్పందించి మూడు రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపడతారు.

● పురమిత్ర యాప్ సీఎం డాష్ బోర్డుకు అనుసంధానమై ఉంటుంది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు దీనిని పర్యవేక్షిస్తుంటారు. చిన్న సమస్యలు 24 గంటలు, పెద్దవైతే 3 నుంచి 15 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంది. సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించని వారిపై చర్యలు ఉంటాయి. సకాలంలో సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటారన్న భయంతోనే కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా పురమిత్ర యాప్‌పై అవగాహన కల్పించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల గైర్హాజరు

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక నగరపాలక సంస్థ, తొమ్మిది పురపాలక సంఘాలు ఉన్నాయి. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌ను 'న్యూస్‌టుడే' పరిశీలించగా పలు లోపాలు వెలుగుచూశాయి.

● డోన్ మున్సిపాలిటీలో ఉదయం కమిషనర్, మేనేజర్ కార్యక్రమానికి హాజరై 11.55 గంటలకు వెళ్లిపోయారు. ఇతర విభాగాల అధికారులెవరూ హాజరుకాలేదు.

● నంద్యాలలో మూడు వినతులొచ్చాయి. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, ఇతర విభాగాల అధికారులు గైర్హాజరయ్యారు. ఎమ్మిగనూరులో మూడు వినతులొచ్చాయి. కమిషనర్ ఒక్కరే హాజరయ్యారు. ఆదోనిలో ఐదు వినతులొచ్చాయి.

గురుకులాల్లో ప్రవేశాలకు 16న కౌన్సెలింగ్

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : అంబేడ్కర్ గురుకులాల్లో పదో తరగతి, సీనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 16న చిన్నటేకూరులోని గురుకులంలో ఉదయం 9.30కి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త శ్రీదేవి సోమవారం తెలిపారు. 9వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని వెల్లడించారు. అరికెరలోని కళాశాలలో సీఈసీ చదివేందుకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ఎరువు.. ఎక్కడ

రైతులకు యూరియా ఇక్కట్లు తప్పడం లేదు. పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలకు చెందిన రైతులు ఎమ్మిగనూరు డీసీఎంఎస్ కేంద్రం వద్ద సోమవారం బారులు తీరారు. రైతు సేవా కేంద్రాలకు నిల్వలు రాకపోవడం, సహకార సంఘాల అధికారులు సరిగా తెప్పించకపోవడంతో ఇక్కడకు వరుస కడుతున్నారు. రైతులుభారీగా రావడంతో పోలీసుల బందోబస్తు మధ్య పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

17న ఆదోనిలో ఉద్యోగ మేళా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉద్యోగమేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. 11 ప్రైవేటు కంపెనీల్లో 450 ఉద్యోగాలు ఖాళీలు భర్తీ చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆదోని పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహిస్తారన్నారు. 18- 35 ఏళ్లలోపు ఉండి పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు హాజరవ్వాలని సూచించారు. అర్హులైన వారు /Rnypunyam.ap.gov.in/ యూజర్ రిజిస్ట్రేషన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9985496587, 9703993995 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మీ కోసం

తిరుమల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తిరుమల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్లు డీవీఎం జి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఒక్కొక్కరికి కర్నూలు నుంచి రూ.2,670, నంద్యాల నుంచి రూ.2,470 ఛార్జీ తీసుకుంటామన్నారు. ఐదేళ్ల పిల్లలకు ఉచితం.. ప్రత్యేక ప్రవేశ దర్శనం, నాన్ ఏసీ వసతి సౌకర్యం, శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం, తిరుచానూరు ఆలయాల సందర్శన ఉంటుంది.. మంగళవారం, శుక్రవారాల్లో యాత్ర మొదలవుతుంది.. మరిన్ని వివరాలకు కర్నూలు ఏపీ టూరిజం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాల కింద ముగ్గురు కార్యాలయ సహాయకులకు సోమవారం కేంద్రాలు కేటాయించారు.

రైతేరాజు 8లో

గుడ్డు చిన్నబోయింది

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న పౌష్టికాహారంలో నాణ్యత లోపిస్తోంది. కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లను గుత్తేదారు మింగేస్తున్నారు. 50 గ్రాముల బరువున్న గుడ్లనే అందించాలి.. కానీ గుత్తేదారు చిన్నవి సరఫరా చేస్తున్నారు. నందవరం మండలం రాయచోటి అంగన్‌వాడీ కేంద్రానికి తక్కువ పరిమాణం కలిగిన గుడ్లను సరఫరా చేయడంతో గర్భిణులు, బాలింతలు మండిపడ్డారు.

– న్యూస్‌టుడే, నందవరం

నేటి నుంచి అధ్యాపకుల పోస్టులకు పరీక్షలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఈనెల 15 నుంచి 23 వరకు ఏపీపీఎస్సీ లెక్చరర్ పోస్టుల పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఆర్వో వెంకటనారాయణమ్మ తెలిపారు. వీటితో పాటు మరో రెండు నోటిఫికేషన్లకు ఇవే తేదీల్లో కంప్యూటర్ బేస్డ్ ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షలు జరగనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో 6,351 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని డీఆర్వో వివరించారు.

అవినీతి పగుళ్లు

● మూడో ఐచ్ఛికం పేరుతో దోపిడీ | ● విజిలెన్సు విచారణలో వెలుగులోకి

గత వైకాపా ప్రభుత్వం ఆప్షన్-3 ద్వారా అందరికీ నాణ్యమైన గృహాలు నిర్మించి ఇస్తామని మభ్యపెట్టింది. చివరకు ఆ పార్టీ నాయకులే గుత్తేదారుల అవతారమెత్తి.. ముందస్తుగా రూ.కోట్లలో అడ్వాన్సులు తీసుకుని యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కొందరు నాణ్యతను గాలికొదిలేస్తే.. మరికొందరు నిర్మాణాలే ప్రారంభించకుండా ఇనుము, సిమెంటు, నిధులు స్వాహా చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వందల కోట్లు వ్యయం చేసినా వంద నిర్మాణాలు పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న కాలనీల్లో జరిగిన మోసాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విచారణను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించగా.. గృహ నిర్మాణశాఖ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి చిత్రాలు తీసి అందులో నిక్షిప్తం చేసే ప్రక్రియను ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం, ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరులో నిర్మించిన ఇళ్లు

గోడకు నెర్రెలు

● ఆప్షన్-3 కింద మంజూరు చేసినవి	: 10,566
● 2024 మే 31 నాటికి పూర్తయినవి	: 57
● 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు పూర్తయినవి	: 4,352
● పూర్తయ్యే దశలో ఉన్నవి	: 327
● కూటమి ప్రభుత్వంలో పూర్తయినవి	: 4,679
● గత ప్రభుత్వంతో కలిపి, ఇప్పటి వరకు కట్టినవి	: 4,736
● ఇంకా గుత్తేదారులు నిర్మించాల్సినవి	: 5,830

ఒక్కటీ పూర్తిచేస్తే ఒట్టు

● గతేడాది అక్టోబరులో బోయిళ్ల కన్‌స్ట్రక్షన్, బోయిళ్ల జనార్దన్, ఆర్టా వెంచర్స్ సంస్థలు 6,954 ఇళ్ల నిర్మాణం చేపడతామని నాలుగేళ్ల కిందట ఒప్పందం చేసుకున్నాయి.

● 2024 అక్టోబరు వరకు ఈ మూడు సంస్థలు ఒక్కటీ పూర్తి చేయలేదు. వీటికి రూ.77.31 కోట్ల బిల్లులు చెల్లించారు.

● ఆయా సంస్థలు వైకాపా నేతలకు సంబంధించినవి కావడంతో గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించకుండానే ముందే బిల్లులు తీసేసుకున్నాయనే విమర్శలు ఉన్నాయి.

● ఆలూరులో ఆర్టా వెంచర్స్ సంస్థకు 309 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు మూడేళ్ల కిందటే ప్రభుత్వం రూ.2.20 కోట్లు అడ్వాన్స్ రూపంలో చెల్లించింది. మరో మండలంలో 115 ఇళ్ల నిర్మాణ బాధ్యతలు దీనికే అప్పగించారు. ఇప్పటి వరకు ఒక్కటీ పూర్తి చేయలేదు.

25 సంస్థలకు అప్పగింత

ఆప్షన్-3 కింద ఆదోని, ఆలూరు, చిప్పగిరి, దేవనకొండ, గోనెగండ్ల, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు గ్రామీణ, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాల్టీల్లో 10,566 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు 25 గుత్తేదారు సంస్థలకు పనులు అప్పగించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వైకాపా నేతలే బోయిళ్ల, బోయిళ్ల జనార్దన్ సంస్థల పేరుతో పనులు దక్కించుకున్నారు. గతేడాది జూన్ వరకు వంద ఇళ్లను కూడా పూర్తి చేయలేదు.

అడ్వాన్సుల పేరుతో రూ.కోట్లు దోచిపెట్టారు

● బోయిళ్ల జనార్దన్ సంస్థ ఎమ్మిగనూరు మండలంలో 125, ఎమ్మిగనూరు పురపాలక సంస్థలో 1,022, మంత్రాలయంలో 397 ఇళ్లను నిర్మించేందుకు ముందస్తుగా రూ.19.16 కోట్లు అడ్వాన్సు రూపంలో తీసుకుంది.

● బోయిళ్ల కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆదోని పురపాలక సంస్థలో 4,970 ఇళ్లు నిర్మించేందుకు ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థకు అడ్వాన్సుల రూపంలో మూడేళ్ల కిందటే రూ.55.95 కోట్లు చెల్లించారు.

● నెల్లూరు జిల్లాకు చెందిన ఓ వైకాపా నేత జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ పేరుతో ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాల్టీలు, ఎమ్మిగనూరు రూరల్, మంత్రాలయం మండలంలో కలిపి 6,530 ఇళ్లు నిర్మించుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటి వరకు 3,981 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇక మరో 2,549 నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది.

● మరో 22 గుత్తేదారు సంస్థలు 1,857 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది.

నాణ్యత ప్రశ్నార్థకం

ఆప్షన్-3 పేరుతో గుత్తేదారు సంస్థలు నిర్మిస్తున్న గృహాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. వైకాపా ప్రభుత్వంలో ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు, మరో రూ.35 వేలు కలిపి రూ.2.15 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. గుత్తేదారులు తొమ్మిది అడుగుల లోతులో పునాదులు తీయాల్సి ఉండగా.. నాలుగైదు అడుగులే తీసి నాసిరకంగా పిల్లర్లు నిర్మిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన హౌసింగ్ ఇంజినీర్లు తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. గుత్తేదారులకు బిల్లులు, సామగ్రికి కలిపి రూ.200 కోట్ల చెల్లింపులు జరిగాయి. ప్రస్తుతం పూర్తయిన ఇళ్లు మూడునాలుగేళ్లు నిలవడం కూడా కష్టమేనని కొందరు ఇంజినీర్లు చెబుతున్నారు. గుత్తేదారుల దోపిడీపై ప్రస్తుత ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టి సమగ్ర విచారణ జరిగేలా చూస్తేనే అక్రమాలు వెలుగులోకి వస్తాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

ఉద్యోగులు సంక్షేమమేనా

కర్నూలు బిర్లా గేట్ సమీపంలో ఉన్న జిల్లా సంక్షేమ భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు, సన్‌షేడ్లు కాంక్రీటు పెచ్చులూడి ఊచలు కనిపిస్తున్నాయి. జిల్లాస్థాయి అధికారులంతా ఈ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా గిరిజన, సాంఘిక సంక్షేమ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ అధికారుల కార్యాలయాలన్నీ ఇందులోనే కొనసాగుతున్నాయి. రెండంతస్తుల భవనం చాలాచోట్ల దెబ్బతింది. పనిచేసే సమయంలో ఎప్పుడు పెచ్చులూడి తలపై పడతాయోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరగకముందే భవనానికి మరమ్మతులు చేయించాలని వారంతా కోరుతున్నారు. – ఈనాడు, కర్నూలు

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అధికారులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సమస్యలపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

దిగువ పనులు జలార్పణం



సరిహద్దుకు చేరిన నీరు

కొనసాగుతున్న లైనింగ్ పనులు

తుంగభద్ర జలాలు సరిహద్దుకు చేరాయి. దిగువ కాల్వ ఆధునికీకరణ పనులు కొనసాగాయి. నీళ్లువస్తున్న వేళ లైనింగ్ పనులు మమ అనిపిస్తున్నారు. ఎల్లెల్సీ కింద 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 32 జలాశయాలకు సాగునీరు అందుతోంది. కాల్వ పరిధిలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు సాగు, తాగునీటికి దిగువ కాల్వే ఆధారం. చివరి ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యంతో లైనింగ్ పనులు చేపట్టింది. బోర్డు పరిధిలోని 0 కి.మీ నుంచి 250 కి.మీ. వరకు ప్యాకేజీలుగా విభజించారు. జిల్లా పరిధిలోని 135 కి.మీ. నుంచి 250 కి.మీ. వరకు రూ. 448 కోట్లతో చేపట్టిన పనులు రెండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి.

– న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం, హాలహర్వి

గుత్తేదారుల ఇష్టారీతి

● దిగువ కాల్వ ఆధునికీకరణ పనుల్లో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఏదో అలా చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. కాల్వ పనుల్లో నాణ్యత డొల్లతనం బయటపడింది.

● 136 కి.మీ. నుంచి 138 వరకు జరిగిన లైనింగ్ పనుల్లో అప్పుడే చీలికలు వచ్చాయి. లైనింగ్ పనులు తూతూమంత్రంగా చేయడంతో వర్షం కురిస్తే నీరు కాల్వలోకి చేరే సమయంలో లైనింగ్ దెబ్బతినే ప్రమాదం ఉంది.

● బెడ్డింగ్ పనుల్లో ఇష్టం వచ్చినట్లుగా చేశారు. లోపల భాగంలో ఉండాల్సిన ఇనుప కడ్డీ బయటనే కనిపిస్తోంది. దీనిని పరిశీలిస్తే లైనింగ్ పనులు ఎలా జరిగాయో అర్థమవుతుంది.

ఓ వైపు నీళ్లు.. మరో వైపు పనులు

● తుంగభద్ర జలాశయం నుంచి దిగువ కాల్వకు నీరు వదిలారు. శుక్రవారం నాటికి ప్రాజెక్టులో 76.031 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఓ వైపు కాల్వకు నీరు వదిలినా.. మరో గుత్తేదారులు కాల్వ పనులు యథావిధిగా చేస్తూనే ఉన్నారు.

బావాబామ్మర్దులు.. బైకు చోరీల్లో ఆరితేరారు

● 24 వాహనాల స్వాధీనం ● ముగ్గురి అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను కర్నూలు మూడో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్, పెద్దమండెం మండలం గుడిసెలచెరువుకు చెందిన షేక్ దాదాపీరా (37), కడప నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన చౌడగుండ్ల అనీష్ (22)లను కర్నూలు నగర శివారులో అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సోమవారం తెలిపారు. మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శేషయ్య, ఎస్సై చంద్రలతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశం డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. జులాయిగా తిరిగే షేక్ దాదాపీరా చెల్లెలిని ఆటోడ్రైవర్ షేక్ బాబాఫక్రుద్దీన్ వివాహం చేసుకున్నాడు. బావా బామ్మర్దులైన వీరిద్దరు జల్సాల కోసం బైకు చోరీలకు అలవాటుపడ్డారు. వీరితో చౌడగుండ్ల అనీష్ జతకట్టాడు. తర్వాత పోలీసులు దృష్టి మరల్చేందుకు బావాబామ్మర్దులు కుటుంబాలతో సహా అనంతపురం జిల్లాలోని గుంతకల్లుకు మకాం మార్చి నేరాలు ముమ్మరం చేశారు. వీరికి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు తయారు చేసే నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాలతో పరిచయమైంది. తస్కరించిన వాహనాలకు వారితో నకిలీ ఆర్‌సీ పత్రాలు తయారు చేయించి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయించేవారు. ఈ ఏడాది మే 22న గూడూరుకు చెందిన తెలుగు చంద్రకుమార్ పల్సర్ వాహనంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆ వాహనాన్ని బావాబామ్మర్దులు అపహరించారు. కడపకు తీసుకెళ్లి ఓ వ్యక్తికి విక్రయించారు. అతను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి కడప పోలీసులకు పట్టుబడటంతో చోరీల బాగోతం బయటపడింది. సమాచారం అందుకున్న కర్నూలు పోలీసులు అప్రమత్తమై కర్నూలు శివారులోని అరుంధతీనగర్‌లో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 24 బైకులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఎనిమిది పల్సర్ వాహనాలున్నాయి. పరారీలో ఉన్న నంద్యాలకు చెందిన సుభాన్, షాపీరాల కోసం గాలింపు చేపట్టారు.

హంద్రీనీవాకు నీటి విడుదల వాయిదా

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటి విడుదల వాయిదా పడింది. మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఇంజినీర్లు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలో ప్రధాన కాలువలో కొన్ని పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం కావాలని అక్కడి ఇంజినీర్లు కోరారు. దీంతో నీటి విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని హంద్రీనీవా కర్నూలు ఎస్ఈ పాండురంగయ్య తెలిపారు. కాలువకు నీటి విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈఈ ఎన్.ప్రసాదరావు సోమవారం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. శ్రీశైలం వెనుక జలాల ప్రవాహం, పంపింగ్ ఏర్పాట్లను చూశారు. నీటి విడుదలకు ప్రభుత్వం ఎప్పుడు అనుమతిచ్చినా సిద్ధంగా ఉండాలని ఇంజినీర్లకు సూచించారు.

దస్త్రం.. లోపభూయిష్టం

● 39 గ్రామాల ఆర్ఎస్ఆర్ గల్లంతు
● 43 మండలాలకు పటాలు లేవు

'భూ' వివాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. హత్యలు, ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవి ఎక్కువ భూ సమస్యలే కావడం గమనార్హం. భూ వివాదాలకు కారణం శాశ్వత దస్త్రాలు(రికార్డు) లేకపోవడం.. గ్రామానికి తల్లిలాంటి శాశ్వత 'ఏ' రిజిస్టర్(ఆర్ఎస్ఆర్)ను రెవెన్యూ శాఖ మరిచిపోవడంతో ఇబ్బందులు నిత్యకృత్యమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 39 గ్రామాల్లో ఇవి కానరాకపోవడంతో 'భూ' సమస్యలు పరిష్కరించడం అధికారులకు సవాలుగా మారింది.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఎప్పుడు.. ఎన్ని

● ఆర్ఎస్ఆర్ అంటే రీసెటిల్‌మెంట్ రిజిస్టర్..తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉంటుంది. బ్రిటీష్ పాలకులు రూపొందించారు. దీన్ని తెలుగులో శాశ్వత 'ఏ' దస్త్రం అంటారు. దీని ఆధారంగానే అడంగల్, 1బి, నెంబరు-4, నెంబరు-1, నెంబరు-3 రిజిస్టర్ లెక్కలు తయారు చేయవచ్చు. వీటితోనే పట్టా డీకేటీ, ప్రభుత్వ, దేవాదాయ తదితర భూములు ఎంత విస్తీర్ణంలో ఎక్కడ ఉన్నాయో తెలుస్తాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 917 రెవెన్యూ గ్రామాలున్నాయి. 1984లో కొన్ని, 2007 మరికొన్ని, వైకాపా హయాంలో చేపట్టిన భూ రీసర్వే సమయంలో మరికొన్ని మాయమయ్యాయి. కర్నూలు జిల్లాలోని 16 మండలాల పరిధిలోని 27 గ్రామాలు, నంద్యాల జిల్లాలో 07 మండలాల్లో 12 గ్రామాల్లో ఆర్ఎస్ఆర్ పుస్తకాలు గల్లంతయ్యాయి.

గ్రామ పటాలు ఏమైనట్లు

కర్నూలు జిల్లాలో 22 మండలాల్లో 371 సర్వే నంబర్లకు ఎఫ్ఎంబీ (గ్రామ పటాలు) గల్లంతయ్యాయి. నంద్యాల జిల్లాలో 21 మండలాల్లో 996 సర్వే నంబర్లకు ఎఫ్ఎంబీలు (గ్రామ పటాలు) మాయమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మండలాల్లో.. 1,367 సర్వే నంబర్లకు ఎఫ్ఎంబీలు లేవు. దీంతో విస్తీర్ణాల్లో కచ్చితమైన భూమి కొలతలు రావడం లేదు. ఆయా సర్వే నంబర్లలోని భూ విస్తీర్ణాల్లో తేడాలుండటంతో భూయజమానులకు మధ్య నిత్యం వివాదాలు వస్తున్నాయి.

మూలాలు చెరిపేసిన వైకాపా

● వందేళ్లకు పైబడి భూములకు సంబంధించి సర్వే నంబర్లు, అడంగల్, ఆర్ఎస్ఆర్, 10(1), ఆర్వోఆర్ రిజిస్టర్లు ఉన్నాయి. ఒక వ్యక్తికి భూమి ఎలా సంక్రమించింది. వారసత్వంగా వచ్చిందా? లేదా? మరెలా వచ్చింది తదితర అంశాలను లింక్ డాక్యుమెంట్లు, ఆర్వోఆర్, ఆర్ఎస్ఆర్ తదితరాల ఆధారంగా రికార్డులు పరిశీలించి నిర్ధారిస్తారు.

● ఆంధ్రప్రదేశ్ భూయాజమాన్య హక్కు చట్టం అమలు అంటూ గత వైకాపా ప్రభుత్వం భూ రీసర్వే చేపట్టింది. దశాబ్దాలుగా ఉన్న ఆర్వోఆర్, అడంగల్, ఆర్ఎస్ఆర్, 10 (1), ఆర్ఎస్ఆర్, సర్వే నంబర్లు కనుమరుగయ్యాయి.

● దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. సర్వే నంబర్లు ఒక వ్యక్తికి ఒక్కటే.. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. ఐదారుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం నంబరు కేటాయించి భూ సమస్యలు పెంచారు. కల్లూరు మండలం ఉలిందకొండలో 6,744.76 ఎకరాల భూమి ఉంది. ఆర్ఎస్ఆర్ ప్రకారం సర్వే నంబరు 620లో 1,273.60 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం రీసర్వే చేసిన తర్వాత 1,195.43 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. రీసర్వే చేసిన తర్వాత కచ్చితమైన భూ విస్తీర్ణం రావాల్సింది పోయి.78.17 ఎకరాలు గల్లంతైంది.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

BAMS ADMISSION
KPSVS AYURVEDIC MEDICAL COLLEGE
MANVI - 584123, RAICHUR Dist., Karnataka
94481 62595 / 77953 62970
✓ Experienced & dedicated team of teaching Doctors.
✓ Separate Hostel for Boys & Girls.
✓ Personal Care for every student for the best academic results.
✓ Hands on clinical experience in 60 Bedded Hospital & Monthly Medical Camps.
✓ Curricular & Co-Curricular Activities like Monthly tests, Seminars, Quiz, Sports.

https://aayurvediccollegemanvi.org

(c) eenadu

మక్క లాభాలు పక్కా

ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు మొక్కజొన్న సాగుపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు.. ఖరీఫ్ సీజన్‌లో జులై నెలాఖరు వరకు విత్తుకోవడానికి అవకాశం ఉంది.. రబీలో అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు విత్తితే ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. సాగు సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు సాధించొచ్చని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త జి.ధనలక్ష్మి పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, బనగానపల్లి

సాగు చేసిన మొక్కజొన్న పంట

అనుకూలమైన నేలలు

- నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు.
- చౌడు భూములు, నీరు నిల్వ ఉండే భూములు పనికిరావు.
- ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 ఉన్న నేలలు అనుకూలంగా ఉంటాయి.
- విత్తుకు ముందు మూడు, నాలుగుసార్లు నాగలితో దున్నాలి.
- ఎకరాకు సుమారు 10 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలి.
- తరువాత బోదె నాగలితో బోదెలు, కాలువలు చేసుకోవాలి.

విత్తనశుద్ధి.. విత్తేదూరం

- కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం లేదా కేప్‌స్టోన్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుంది.
- సంకర రకాలు ఎకరాకు 8 కిలోలు వేయాలి. సాళ్ల మధ్య 60 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య 20 సెం.మీ్లు ఉండాలి.
- తీపి మొక్కజొన్నకైతే ఎకరాకు 4 కిలోలు వాడాలి. సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 20 సెంటీ మీటర్లు.
- పేలాల మొక్కజొన్న ఎకరాకు 5కిలోల విత్తనాలు విత్తాలి. సాళ్ల మధ్య 60, మొక్కల మధ్య 20 సె.మీ.
- బేబీకార్న్ రకం ఎకరాకు 10 కిలోల విత్తనాలు వేయాలి. సాళ్ల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 20 సెం.మీ.
- పశుగ్రాస మొక్కజొన్న ఎకరాకు 16 కిలోల విత్తనం అవసరం. సాళ్ల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ ఉండాలి.

జి.ధనలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త

రైతేరాజు

కలుపు యాజమాన్యం

- మొదట బోదె నాగలితో బోదెలు చేసుకోవాలి. తర్వాత విత్తనాన్ని బోదెకు పైనుంచి ఒకటి బై మూడో వంతు ఎత్తులో విత్తినట్లయితే నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది. మొలకెత్తిన 10 రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కను తీసి వేయాలి.
- విత్తిన తర్వాత రెండు, మూడు రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును తేలిక నేలలో ఎకరాకు 800 గ్రాములు, బరువు నేలలో అయితే ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. దీంతో వెడల్పాటి కొన్ని గడ్డి జాతి కలుపును నివారించొచ్చు.

సందేహాలు సమాధానాలు

సమస్య: మొక్కజొన్నలో ఆకులు పసుపు రంగులో మారి పోతున్నాయి. నివారణ తెలపండి.

- సుబ్బారెడ్డి, పాతపాడు

సమాధానం: ఇది రసం పీల్చే తెగులు. పేనుబంక, చిగురనల్లి పురుగులు ఆశించడం వల్ల వస్తుంది. పురుగులు అధికంగా ఉంటే మోనోక్రోటోపాస్ ఎకరానికి 320 మి.లీ, లేదా డైమిథోమిట్ 400 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసి నివారించే అవకాశం ఉంటుంది. - న్యూస్‌టుడే, బనగానపల్లి

వేరుసెనగకు సస్యరక్షణ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో జులై ఆఖరి వరకు వేరుసెనగను విత్తుకోవచ్చని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి రైతులకు సూచించారు. కలుపు నివారణ చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

అనువైన విత్తన రకాలు : కదిరి-6, టీసీజీఎస్-1694(విశిష్ట), టీఏజీ-73, కదిరి-9, ప్రగతి రకాలు.

- వర్షాధారంగా ఖరీఫ్‌లో వేరుసెనగ చదరపు మీటరుకు 38 మొక్కలు ఉండేలా మొక్కల సాంద్రత పాటించాలన్నారు.
- **ఎరువులు:** ఎకరాకు బాగా మాగిన నాలుగు టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఆఖరి దుక్కిలో 27 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు చల్లుకోవాలి. మిగిలిన 9 కిలోల యూరియాను పైపాటుగా విత్తిన 30-35 రోజుల సమయంలో చల్లాలి. ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఫాస్పేట్ ఎరువులతో కలపకుండా చివరి దుక్కిలో వేసుకోవాలి. ఎకరాకు 200 కిలోల చొప్పున జిప్సంను పూత, ఊడ దిగే సమయంలో మొదళ్ల దగ్గర వేయాలి. కాయలు ఊరడానికి, నూనె శాతం పెరగడానికి దోహదపడుతుంది.
- **కలుపు నివారణ :** విత్తిన మూడు రోజుల్లో ఎకరానికి 1లీటరు పెండిమిథాలిన్ మందు 200 లీటర్ల నీటిలో కలిపి తడి నేలపై పిచికారీ చేయాలన్నారు. విత్తిన 20-30 రోజుల్లోపు పైరుపై ఇమజిథాపిర్ 300మి.లీ లేదా క్విజలోఫాప్ ఇథైల్ 400మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

సాగుకు డ్రోన్ దోస్తు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు.. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి డ్రోన్‌ను అనుసంధానం చేయాలని కేంద్రం నిర్ణయించింది.. డ్రోన్లు వ్యవసాయంలో వినియోగించుకోవడంతో యువతకు ఉపాధి లభిస్తుంది. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం రాయితీపై ఇస్తున్నాయి.

ఎవరు అర్హులంటే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్‌ను తీసుకునే రైతుమిత్ర గ్రూపులకు రాయితీని అందిస్తోంది. ఒక్కో గ్రూప్‌లో ఐదు లేక ఆరుగురు రైతులు ఉండాలి. వారందరికీ భూమి ఉండాలి. ఒక వేళ భూమి లేకపోతే వారిని పైలెట్‌గా నియమించుకునే అవకాశం ఉంది. గ్రూపు సభ్యులంతా తీర్మానం చేసి స్థానిక మండల వ్యవసాయాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి కలెక్టర్ ఆమోదం పొందితే 20 రోజుల శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో ఉచితంగా ఆహారం, పెట్టుకున్న ఖర్చులు అందజేస్తారు. పరీక్ష నిర్వహిస్తారు. డ్రోన్ ఆపరేట్ చేసే అనుమతిపత్రం అందజేస్తారు. ఇందుకోసం ఇంటర్ పూర్తి చేసుకున్న యువతకు అర్హత ఉంటుంది.

80 శాతం రాయితీ : 10 లీటర్ల సామర్థ్యం పిచికారీ చేయగలిగిన డ్రోన్ ధర రూ. 9,80,000. ప్రభుత్వం రాయితీ రూ. 7,84,000 ఇవ్వగా, లబ్ధిదారుడి వాటా రూ. 1,96,000 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం డ్రోన్, 10 బ్యాటరీలు, రెండు చార్జింగ్ కేబుళ్లు అందజేశారు. 10 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రోన్ ఎకరాకు పిచికారీ చేసే వీలు కల్పిస్తుంది. ఒక ఎకరాను పూర్తి చేసేందుకు 15 నుంచి 20 నిమిషాలు పడుతుంది. ప్రతి రోజు 20 ఎకరాలకు పైగా పిచికారీ చేసుకోవచ్చని డ్రోన్ పైలెట్ గోపాల్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ సహకారంతో డ్రోన్ తీసుకోవడానికి రుణసదుపాయం కల్పించారన్నారు.

నలుగురిపై కేసు నమోదు

తుగ్గలి, న్యూస్‌టుడే: మద్యం అమ్మకాలపై శభాష్‌పురం గ్రామంలో రెండు వర్గాలు గొడవకు దిగాయి. ఇరువర్గాలకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు జొన్నగిరి పోలీసులు సోమవారం తెలిపారు. మద్యం అమ్మకాల విషయంలో విపక్ష, అధికార పార్టీ మద్దతుదారులు గొడవకు దిగారు. పికెట్‌లో ఉన్న పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. ఇరువర్గాలను పత్తికొండ గ్రామీణ సీఐ పులిశేఖర్ పత్తికొండ సర్కిల్ కార్యాలయంకు పిలిపించి హెచ్చరించారు.

MUNICIPAL OFFICE, ADONI

EOI No.13/ADN/Mplty/2025-26 **Date: 14-07-2025**

NOTICE INVITING EXPRESSION OF INTEREST

Expression of Interest (E.O.I) is invited for Preparation of Detailed **Project Report for 3110 ML Capacity Basapuram SS Tank in Adoni Municipality.**

The Interested Consultants may furnish necessary documents along with financial offer in terms of Percentage on the value of finalized project cost with proof of Registration of Firm. GST and Experience along with Demand Draft **Rs.20,000/-** in favour of the Commissioner, Adoni Municipality so as to reach on or before 5.00 PM on **22-07-2025.** For further details contact Cell: 98499 05859.

All rights to cancel, reject or postpone and to fix up any Special Conditions for the above work on Administrative grounds are reserves with the Commissoner.

Sd/- COMMISSIONER, Adoni Municipality

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్: 50/760/114ఎ, శ్రీ విజయ దుర్గా ఆటోమోటివ్స్, గాయత్రి ఎస్టేట్, గూటి రోడ్డు, కర్నూలు-518002.

(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, చెన్నైలోని ఎన్‌సిఎల్‌టి యొక్క ఆర్డర్ ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం చేయబడిందని సమాచారం. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరు ది. 30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా అమలులోకి వచ్చేలా మార్చబడినది. ది. 30-11-2022 నాటి పేరు మార్పుకు సంబంధించిన ఇన్‌కార్పోరేషన్ సర్టిఫికేట్‌ను చూడగలరు) మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: **1. మారెప్ప సెరావతి,** తండ్రి: పెద్ద బుగ్గయ్య ఎస్, హెచ్ నెం.1-3480, రాఘవేంద్ర కాలనీ, ఎమ్మిగనూరు, కర్నూలు-518360. **2. సాలమ్మ సెరావతి,** భర్త: ఎస్. మారెప్ప, హెచ్ నెం. 1-3480, రాఘవేంద్ర కాలనీ, ఎమ్మిగనూరు, కర్నూలు-518360. **3. సురేంద్ర ఈబుడి,** తండ్రి: ఈ. సుంకన్న, హెచ్ నెం.7-2-26-12-3, ప్రభాకర్ రెడ్డి నగర్, డోన్, కర్నూలు జిల్లా. వ్యాపారం: శ్రీ మల్లికార్జున హోమ్ అప్లయన్స్, డోన్, కర్నూలు వారి లోన్ అగ్రిమెంట్ నెం. **KURN4TF2011050006** తాలూకు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 23,44,978/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల నలభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)** వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది. **22-08-2022**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం **కర్నూలు వద్ద గౌరవనీయ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కమ్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, Crl.MP.No.09/2025** వారు ఆమోదించిన ఉత్తర్వులు ద్వారా సదరు చట్టములోని సెక్షన్ 14 కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 9 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 12-07-2025**న భౌతికంగా స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 23,44,978/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల నలభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)** ఇప్పటి వరకు వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ ఛార్జీలు ఇతర కాస్టులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జికి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు సబ్ జిల్లా, ఎమ్మిగనూరు మండలం, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ, ఎమ్మిగనూరు గ్రామ ఖాతాలు, డ్రై సర్వే నెం. 276బి, ప్రస్తుతం సర్వే నెం.276/బి1, వార్డు నెం.1, పంపన్న గౌడ్ కాలనీ, ప్లాట్ నెం.68, ఇంటి డి.నెం.1/3477-10 గల ఆస్తికి హద్దులు: **తూర్పు:** పెద్ద బుగ్గయ్య ప్లాట్ నెం.65లోని స్థలం, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** ఆర్. సుంకన్న మరియు ఆర్. మారెప్ప ప్లాట్ నెం.69లోని స్థలం, **దక్షిణం:** ఆర్. లక్ష్మి మరియు ఆర్. బజారే ప్లాట్ నెం. 67లోని స్థలం. ఈ స్థలం తూర్పు నుండి పడమరకు 45 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 30 అడుగులు కొలతలు కలిగి, మొత్తం 1350 చ.అ.లు లేదా 150 చ.గ.ల విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన జింక్ షీట్ రూఫ్డ్ ఇల్లు, దానిలోని అన్ని అమరికలు మరియు అనుబంధ స్థలంతో సహా.

తేది: 12-07-2025
ప్రదేశం : కర్నూలు

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

చదరంగంతో ఆలోచనా శక్తి మెరుగు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : చదరంగం క్రీడ సాధన చేస్తే ఉద్యోగుల్లో ఆలోచనా శక్తి మెరుగవుతుందని, మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని క్లస్టర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు డా.కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని క్లస్టర్ విశ్వవిద్యాలయంలో సోమవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ఉద్యోగులకు చదరంగం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు 'ఈనాడు- ఈటీవీ' పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 19 మంది ఉద్యోగులు పోటీపడ్డారు. ఫిజిక్స్ అధ్యాపకుడు డా.మహమ్మద్ వాజిద్ 4-4 సెట్లు గెలిచి ట్రోఫీ కైవసం చేసుకున్నారు. హిందీ అధ్యాపకుడు డా.దివాకర్ 4-3 సెట్లు సాధించి రన్నర్‌గా నిలిచారు. విజేతలకు రిజిస్ట్రారు వెంకటేశ్వర్లు ట్రోఫీలు అందజేశారు.

ఈనాడు ఛాంపియన్స్

విజేతలతో రిజిస్ట్రారు డా.కట్టా వెంకటేశ్వర్లు

కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ ఉద్యోగులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఖాళీ ప్లేట్లతో కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆందోళనకారులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేర రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కర్నూలు కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు కలెక్టరేట్ ముఖ ద్వారం వద్ద ఆందోళనకారులు లోపలికి వెళ్లకుండా ఇనుప కంచె ఏర్పాటు చేశారు. ఖాళీ ప్లేట్లతో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఏఐవైఎఫ్ నాయకులను అడ్డుకున్నారు. అనంతరం వారు గాంధీ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా బైఠాయించి ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బిసన్న అధ్యక్షతన జరిగిన ఆందోళనలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రమేష్, నాయకులు పెద్దయ్య, అజిత్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కల్లూరు మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏడీఏ బి.రమేష్‌బాబు, విజిలెన్స్ అధికారి (సీఐ) నారాయణప్ప, మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోదాలు చేశారు. శ్రీరామ అగ్రి జెనిటిక్స్ సంస్థలో పత్తి విత్తనాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. పరమేశ్వర ఏజెన్సీస్‌లో రూ.46,400 విలువ చేసే సూక్ష్మ పోషకాల విక్రయాలను నిలుపుదల చేశారు. ఎరువుల దుకాణాల్లో యూరియా, డీఏపీ వివిధ రకాల ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. శ్రీహరికృష్ణ ఏజెన్సీస్, చైతన్య ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రికార్డులను సరిచూశారు. విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీరామ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పత్తి విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏడీఏ రమేష్‌బాబు

తితిదే డీఈఈని వెంటనే తొలగించాలి

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తితిదే ఇంజినీరింగ్ విభాగంలో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఇలియాజర్‌ను వెంటనే తొలగించాలని భాజపా తిరుపతి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కర్నూలులోని తితిదే కల్యాణ మండపంలో జరుగుతున్న పనుల పర్యవేక్షణకు క్రైస్తవ మత ప్రచార స్టికర్ ఉన్న వాహనంలో వెళ్లడమే కాకుండా చేతిలో బైబిల్ పట్టుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. తితిదే ఈవో స్పందించి వెంటనే అన్యమతస్తులను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు.

మరో విద్యుత్తు ఉద్యమం చేపడతాం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయకపోతే మరో విద్యుత్తు ఉద్యమం చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కర్నూలు నగరంలోని విద్యుత్తు భవన్ ముందు సీపీఎం నాయకుడు రాముడు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సర్దుబాటు ఛార్జీలు, సర్‌ఛార్జీల పేరుతో ఏడాదిలోనే ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం వేశారన్నారు. అనంతరం డీఈటీ ఓబులేసుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మల, నాయకులు రాజశేఖర్, అలివేలమ్మ, నగేష్, గురుశేఖర్, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు భవన్ ముందు ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

అనుసంధాన దారికి అడుగులు

జాతీయ రోడ్ల వెంట నిర్మాణం ● నిధులివ్వనున్న కేంద్రం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాల అనుసంధాన రోడ్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. వాటి అభివృద్ధికి వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల-చిత్తూరు(ఎన్‌హెచ్-40), కర్నూలు-గుంటూరు (340సీ), సోమయాజులపల్లె-డోన్ (340బీ), ఎన్‌హెచ్ 167, ఎన్‌హెచ్-44, చెన్నై-సూరత్ 150సీ జాతీయ రహదారులు ఉన్నాయి. వాటి వెంట గతంలో బైపాస్ రోడ్లు ఏర్పాటుచేశారు. దశాబ్దాలుగా ఇవి అభివృద్ధికి నోచుకోలేదు. నిధులివ్వాలని కేంద్రం నిర్ణయించడంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు.

ఎన్‌హెచ్-167 రహదారి

ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు

- ఎన్‌హెచ్-40 పరిధిలో నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో బైపాస్ రహదారులు నిర్మించారు. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇంజినీర్లు ఇటీవల సర్వే చేసి రూ.10 కోట్ల వరకు అవసరమవుతుందని అంచనా వేశారు.
- 340బీ సోమయాజులపల్లె-డోన్ రహదారి మార్గంలో బేతంచెర్ల, డోన్ ప్రాంతాల్లో బైపాస్ రహదారులు ఉన్నాయి. కర్నూలు-గుంటూరు 340సీ రహదారిపై కర్నూలు సమీపంలోని నన్నూరు టోల్‌ప్లాజా వద్ద బైపాస్ రహదారి మార్గం ఉంది. ఈ రెండు రహదారులకు సంబంధించి ఇటీవలే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలిచ్చారు.
- బళ్లారి-రాయచూరు ఎన్‌హెచ్ 167కు సంబంధించి కర్నూలు జిల్లాలో హాలహర్వి-మాధవరం వరకు 58 కి.మీ. పొడవునా ఉంది. ఆదోని వద్ద బైపాస్ ఉంది. ఈ రహదారికి రూ.5 కోట్ల వరకు అవసరమని అంచనా వేశారు.
- ఎన్‌హెచ్-44 బెంగళూరు-హైదరాబాద్ రహదారికి సంబంధించి రూ.10 కోట్లు అవసరమని తేల్చారు.
- చెన్నై-సూరత్ 150సీ రహదారి 25 కి.మీ.ల పొడవునా ఉంది. సంబంధిత అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి రూ.10 కోట్లు అవసరమని అంచనా రూపొందించారు.

మురుగు కాల్వల నిర్మాణం

జాతీయ రహదారుల నుంచి బైపాస్ మార్గాలకు వెళ్లే ప్రాంతాల్లో వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నీళ్లు నిలిచిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాల్వలు లేకపోవడంతో మురుగు నిలుస్తోంది. 'మురుగు' రహదారికి ముప్పు తెచ్చిపెడుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించనున్నారు.

ఆమె చేతితో పల్లె స్వచ్ఛత

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పల్లెల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం సమగ్ర నిర్వహణకు కూటమి సర్కారు పొదుపు సంఘాలకు బాధ్యతను అప్పగించనుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసి చెత్త సంపద కేంద్రాలను నిర్వహించనున్నారు. 2019 హయాంలో తెదేపా ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసింది. గ్రామ జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్ల (క్లాప్ మిత్ర)ను నియమించారు. వారి ద్వారా చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి అక్కడ ఎరువుగా మార్చేవారు. వైకాపా వచ్చిన తర్వాత 'చెత్త'శుద్ధిని మరిచింది.

చెత్తను సేకరిస్తున్న హరిత రాయబారులు

రెండు పంచాయతీలు ఎంపిక

కర్నూలు జిల్లాలో పెద్దటేకూరు, నంద్యాలలో కౌలూరును ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ఎస్‌హెచ్‌జీలకు అప్పగించనున్నారు. ఆయా సంఘాలు క్లాప్‌మిత్రలతో సమన్వయం చేసుకుని చెత్తను సంపద కేంద్రాలకు తరలించనున్నారు. పొదుపు సభ్యులు చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించి చెత్తను సంపదగా మార్చనున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే ఈ విధానాన్ని ఇతర పంచాయతీలకు విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు.

విద్యార్థుల ప్రవేశాలు ఏమైనట్లు

☛ ఉద్యోగి తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

హొళగుంద, న్యూస్‌టుడే: మద్యం తాగి విధులకు హాజరై, విద్యార్థుల తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించిన హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగి తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కళాశాల కార్యాలయంలో వాగ్వాదానికి దిగారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్ పనిచేస్తున్న శ్రీనివాసులు మద్యం తాగి విధులకు హాజరవుతున్నారన్నారు. గత నెల జూన్ 14వ తేదీన ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలు ఇంత వరకు నమోదు చేయలేదని, దీంతో తల్లికి వందనం అర్హత పొందలేకపోయామన్నారు. మద్యం మత్తులో విద్యార్థులపై ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపల్ ప్రవీణను నిలదీశారు. ఉద్యోగి ప్రవర్తన బాగలేదని, ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రిన్సిపల్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు అశోక్, గాదిలింగప్ప, ఎర్రిస్వామి ఏసీడీపీఐ నాయకులు హమీద్, సలాం, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు అసిస్టెంట్‌తో వాగ్వాదానికి దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌డీపీఐ నాయకులు

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : దోపిడీ కేసులో నిందితులైన కర్నూలు వాసవీనగర్‌కు చెందిన పల్లెపు రమేష్ (20), మరో ఇద్దరు మైనర్లను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక కర్నూలు తాలూకా సర్కిల్ స్టేషన్‌లో కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ సోమవారం సీఐ చంద్రబాబునాయుడు, నాగలాపురం పోలీసుస్టేషన్ ఎస్సై శరత్‌కుమార్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం తెర్నెకల్‌కు చెందిన జొహరాపురం నూర్‌బాషా ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చారు. స్వగ్రామానికి వెళ్లేందుకు బళ్లారి చౌరస్తాలో నిల్చుని ఉండగా నిందితులు కారులో వచ్చి అతని వద్ద ఆపారు. తాము బళ్లారికి వెళ్తున్నామని చెప్పడంతో కరివేముల వద్ద దిగుతానని రూ.100 ఇస్తానని చెప్పి బాధితుడు కారు ఎక్కారు. పెద్దపాడు వద్ద ముగ్గురూ అతన్ని చంపుతామని బెదిరించి రూ.6,500 నగదు, చరవాణి, ఏటీఎంకార్డు, క్రెడిట్‌కార్డు లాక్కొన్నారు. ఫోన్‌పే పిన్ నంబరు తెలుసుకుని అతని ఖాతాలోని రూ.11,593 ఇతర ఖాతాలకు బదిలీ చేసుకుని నెరవాడ పరిధిలో సాయిబాబా ఆలయం వద్ద కారు నుంచి తోసేసి కర్నూలువైపు వెళ్లిపోయారు. బాధితుడు కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి రూ.11,800 నగదు, ఏటీఎం, క్రెడిట్‌కార్డు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కారును జప్తు చేశారు. నిందితులు తాగుడు, జల్సాలకు అలవాటుపడి నేరాలకు పాల్పడ్డారని, ఇంకా విచారించాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.

నిందితుడిని చూపుతున్న డీఎస్పీ బాబూప్రసాద్, సీఐ చంద్రబాబునాయుడు, ఎస్సై శరత్‌కుమార్‌రెడ్డి

బాధితులకు న్యాయం చేస్తాం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై విచారణ జరిపించి చట్టం పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ చెప్పారు. కర్నూలు నగరంలోని కొత్తపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 102 మంది బాధితులు ఫిర్యాదు పత్రాలను సమర్పించారు. విద్యాంజలి పథకం కింద ఉమ్మడి జిల్లాలోని జడ్పీ పాఠశాలలో ఫ్యాకల్టీ, అటెండర్, వంటమనిషి, వాచ్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని వెల్దుర్తికి చెందిన ప్రశాంతిబాబు రూ.లక్ష చొప్పున వసూలు చేసి మోసగించాడని వేర్వేరు ప్రాంతాలకు చెందిన నాగమణి, నారాయణ, అక్బర్, రాజేశ్, సుజాత, వెంకటేష్, మద్దిలేటి ఫిర్యాదు చేశారు. కర్నూలులోని వెంకటరమణకాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసగించాడని ఇందిరాగాంధీనగర్‌కు చెందిన మహేశ్ విన్నవించారు. హైదరాబాద్‌లో ఉంటున్న తన అక్కకు లక్ష్మీపురంలో ఉన్న స్థలానికి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొందరు బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించాలని కర్నూలులోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన అనితారాణి విన్నవించుకున్నారు. తనకు క్షయవ్యాధి రావడంతో వెటర్నరీ డాక్టర్‌గా, ఏఈలుగా పనిచేసే తన ఇద్దరు కుమారులు ఇంటి నుంచి తరిమేశారని కోడుమూరు మండలం మెరుగుదొడ్డికి చెందిన హనుమంతు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Need Monthly good Returns? Good Investment & good Profits & Good Earnings, sharing 70:30. Safe & Secure. ✆ 6301859174

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల, పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ, నేషనల్, హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

MARRIAGE SERVICES

అన్ని కులాల, మతాల వారికి తగిన వివాహ సంబంధాలకై సంప్రదించండి. Heaven Marriages. Contact: 97058 20660.

JOBS

WANTED Marketing Executives for Reputed Company, No Targets, Permanent Salary: 10,000/- to 15,000/- & Good Incentives. ✆ 93912 50272.

THE EENADU WAY CLASSIFIEDS

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మైనార్టీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని మైనార్టీ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, మురికి కాల్వల సమస్యలు పరిష్కరించాలని ఆవాజ్ పట్టణ కమిటీ కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్‌సాబ్, అజీంఖాన్ పేర్కొన్నారు. సోమవారం పురపాలక కమిషనరును కలిసి వినతి పత్రం అందించారు.

నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

ఆర్ఎస్ పెండేకల్లు(తుగ్గలి), న్యూస్‌టుడే: మారెల్ల అశోకా సహకార సంఘం ఛైర్మన్‌గా వైవీ ప్రభాకర్‌రెడ్డి, సభ్యులుగా రాంపల్లి శ్రీనివాసులు, బొందిమడుగుల మోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆర్ఎస్ పెండేకల్లులోని సహకార సంఘం కార్యాలయంలో సీఈవో మనోహర్‌నాయుడు నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. రైతులు అభివృద్ధికి పాటుపడతామని నూతన పాలకవర్గం ప్రకటించారు.

ఇంటి కొలతల వివరాల సేకరణ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఇంటి కొలతల వివరాలు సేకరిస్తున్నట్లు పంచాయతీ ఈవో లక్ష్మినాథ్ అన్నారు. వీటిని అంతర్జాలంలో నమోదు చేస్తామన్నారు. గ్రామస్థులు సహకరించాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం: ?: ఆదోని పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు కూడలి నుంచి మాధవరం వెళ్లే రహదారి మొత్తం గుంతలు పడింది. - నరసింహ, ఆదోని

✔: గుంతలు పూడ్చి రహదారి ప్రమాదాలు నివారిస్తాం. - శేఖర్, సహా ఇంజినీరు, జాతీయ రహదారుల విభాగం

మద్దికెర: ?: మద్దికెర ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద సీసీ రహదారి నిర్మించి అలాగే వదిలేశారు. దిగే చోట మట్టి కూడా వేయలేదు. - చంద్రశేఖరగౌడ్, మద్దికెర

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని గిడ్డయ్య వీధిలో నిర్మించిన కాల్వలు శిథిలమై మురుగు బయటకు వస్తోంది. - రాఘవేంద్ర, మద్దికెర

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - సుహాసిని, సర్పంచి, మద్దికెర

తుగ్గలి: ?: గిరిగెట్ల నుంచి అమీనాబాద్ గ్రామానికి వెళ్లే దారిలో లింగాలవాగుపై ఉన్న వంతెన కొట్టుకు పోయింది. తాత్కాలిక వంతెనపై రాకపోకలకు సమస్యగా ఉంది. - రంగస్వామి, అమీనాబాద్

✔: ప్రతిపాదనలు పంపాం. - శివరుద్రకుమార్, డీఈ రహదారులు భవనాలు శాఖ, పత్తికొండ

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని గిడ్డయ్య వీధిలో నిర్మించిన కాల్వలు శిథిలమై మురుగు బయటకు వస్తోంది. - రాఘవేంద్ర, మద్దికెర

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - సుహాసిని, సర్పంచి, మద్దికెర

తుగ్గలి, న్యూస్‌టుడే: ?: గిరిగెట్ల నుంచి అమీనాబాద్ గ్రామానికి వెళ్లే దారిలో లింగాలవాగుపై ఉన్న వంతెన కొట్టుకు పోయింది. తాత్కాలిక వంతెనపై రాకపోకలకు సమస్యగా ఉంది. - రంగస్వామి, అమీనాబాద్

✔: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. - శివరుద్రకుమార్, డీఈ రహదారులు భవనాలు శాఖ, పత్తికొండ

పురుగు మందుల దుకాణాలపై దాడులు

దేవనకొండ, న్యూస్‌టుడే: మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుదర్శన్ రాజు, వెంకటప్రసాద్, ఏడీఏ విజయ్ తదితరులు తనిఖీ చేపట్టారు. మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మల్లికార్జున ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.25,13,700 విలువైన ఎరువులు, మందుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశించారు. మండల కేంద్రంలో సోమవారం పలు దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో ఉషారాణి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని పలు ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన కేవి సుదర్శనరాజు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటప్రసాద్ నేతృత్వంలో పట్టణంలోని ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి సంబంధిత దస్త్రాలు పరిశీలించారు. అమ్మకాల సమయంలో రైతులకు సంబంధిత రశీదులు అందజేయాలన్నారు. వారి వెంట పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటరాముడు, ఇతర వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

తరుచూ వృథా.. తప్పని వ్యథ

✦ అదనపు సిబ్బంది నియమకానికి ఆమోదం

✦ లీకేజీల మరమ్మతుల్లో వేగం పెరిగేనా!

ఆదోని పట్టణంలో నీటి లీకేజీ నివారణ పనులు చేస్తున్న సిబ్బంది

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణవాసుల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దీర్ఘకాలిక సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నారు. ఇదివరకే పలు పథకాల అమలు కోసం ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఆదోని పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్ విభాగంలో పొరుగు సేవల కింద అదనపు సిబ్బంది నియమాకానికి ఆటంకాలు తొలగాయి. 53 మంది సిబ్బందిని నియమించేందుకు పురపాలక కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో ఇంజినీరింగ్ విభాగంలో సిబ్బంది కొరత కష్టాలు తొలగుతాయని భావించారు. ప్రధానంగా నీటి సరఫరా ఉద్యోగులకు ఒత్తిడి తగ్గనుంది. పట్టణంలో ఎక్కడికక్కడ పైపులైన్ లీకేజీలు అరికట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జనాభా లెక్కల ప్రకారం

పట్టణం: ఆదోని	వార్డులు: 42
జనాభా: 2 లక్షలు	
పట్టణ విస్తీర్ణం: 38.16 చ.కి.మీ.	
పైపులైన్ పొడవు: 167 కి.మీ.	

పురపాలికలోని ఇంజినీరింగ్ విభాగంలో నిజానికి ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక ప్రజారోగ్యేతర సిబ్బంది (నాన్ పీహెచ్ వర్కర్) ఉండాలి. 2011 జనాభా ప్రకారం 1.66 లక్షలు జనాభాకు 166 మంది సిబ్బంది ఉండాలి. 28 మంది శాశ్వత, 85 మంది పొరుగు సేవల సిబ్బంది, మొత్తం 113 మంది ఉన్నారు. కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ప్రస్తుతం 53 మంది నియామకం చేపట్టారు.

సేవలు మెరుగయ్యేనా..

పట్టణం విస్తరిస్తోంది. ప్రజలకు అందించాల్సిన సేవలు పెంచాల్సి ఉంది. కొత్తగా సిబ్బంది నియామకంతో నీటి గొట్టాల లీకేజీల నివారణ, పంపింగ్ మైన్స్, పైపులైన్ మరమ్మతులు, పవర్ బోర్లు, చేతిపంపులు, ఉపరితల ట్యాంకుల నిర్వహ, రహదారి విభాగినుల మధ్య మొక్కల పెంపకం, సంరక్షణ, వీధి దీపాల నిర్వహణ వంటి పనులు సాఫీగా సాగనున్నాయి. ఈ మార్పులు జరిగితే.. పుర ప్రజలు సంతోషిస్తారు.

విస్తరిస్తున్న శివారు

ఆదోని పట్టణానికి ఆనుకుని మండగిరి, సాదాపురం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ జనాభా సుమారు లక్ష. పట్టణ జనాభా రెండు లక్షలు. మొత్తం మూడు లక్షల జనాభాకు ప్రస్తుతం నీటి సరఫరా 26 ఎం.ఎల్.డి. అంటే, 22-23 ఎం.ఎల్.డి. నీరు సరఫరా చేస్తున్నారు. ఎప్పటికైనా పై రెండు పంచాయతీలతో పాటు మరో మూడు ఆదోని పట్టణంలో విలీనమయ్యే అవకాశాలున్నాయి. అప్పటికి నీటి సరఫరా చేయాలంటే సామర్థ్యం కాని పని, అందుకు ముందుచూపుగానే నీటి వనరులు పెంచుకుంటే ఇప్పటికి ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిని ఏకంగా రోజుకు 49 ఎం.ఎల్.డి. నీటిని సైతం శుద్ధి చేయగలిగేలా ఉండాలనేది సంకల్పం. నీటి వినియోగంతో మురుగు పెరుగుతాయి. శుద్ధి సామర్థ్యం 32 ఎం.ఎల్.డి.కి పెంచాలనే ఆలోచనతో పైపనులు తెరపైకి తెస్తున్నారు.

చెక్‌డ్యాంలు చెదరగొడుతున్నారు

నీటిపారుదలశాఖతో పాటు, ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాల కింద నిర్మించిన చెక్‌డ్యాంలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయని రైతులు వాటిని పడగొడుతున్నారు. వారి అనుమతి లేకుండా అవసరం లేని చోట వీటిని నిర్మించి, బిల్లులు తీసుకున్నారు. మద్దికెరలోని ఓ రైతు పొలంలో చెక్‌డ్యాం నిర్మించారు. వర్షాలు కురిసిన సమయంలో ఇక్కడ నీరు నిలిచి ఆ ప్రాంతం సాగుకు పనికిరాకుండా పోతోంది. ఎలాంటి సమాచారం లేకుండా కొందరు వారి పని వారు చేసుకొని వెళ్తున్నారని, వీటి వల్ల ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చిన్న నీటిపారుదల శాఖ నిధులతో వీటిని చేపట్టారు. ఆ తర్వాత పడగొట్టారు. – న్యూస్‌టుడే, మద్దికెర

ఎండా కాలం నిండుగా.. ఇప్పుడు నిండక

హాలహర్వి మండల పరిధిలో చింతకుంట పథకం నుంచి 13 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. మే నెలలో మండే ఎండలకు సైతం నిండుకుండలా ఉన్న జలాశయం ప్రస్తుతం అడుగంటింది. నీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు సిబ్బంది వంతుల వారీగా నీటి విడుదల చేస్తూ వచ్చారు. చివరికి చెరువులో నీరు అడుగంటడంతో కొన్ని గ్రామాలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఒకటి, రెండు రోజుల్లో దిగువ కాల్వ నీరు వస్తుందంటే పంపింగ్ ప్రారంభిస్తే.. సమస్య తీరనుంది. – న్యూస్‌టుడే, హాలహర్వి

మే నెలలో నిండుగా ఉన్న చింతకుంట జలాశయం

ప్రస్తుతం నీరు లేక అడుగంటిందిలా..

రెప్పపాటులో తప్పిన ప్రమాదం

నిత్యం రద్దీ ఉంటే ప్రాంతం.. ఇతర మండలాల్లో సంత రోజులైతే ఈ దారి మరింత ఇరుకుగా మారుతుంది. మద్దికెర బస్టాండులో ఆర్టీసీ బస్సు- పత్తికొండ సంత నుంచి గేదెలతో వస్తున్న టెంపో స్వల్పంగా ఢీకొన్నాయి. గుంతకల్లు నుంచి పత్తికొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సును స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రాంతంలో ఢీకొట్టింది. బస్సు సైడ్ మిర్రర్ విరిగిపోయింది. మలుపు ఉండడంతో పాటు, రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు అధికంగా పార్క్ చేయడం వల్ల ఇబ్బంది తలెత్తింది. బస్సును గమనించకుండా టెంపో వేగంగా రావడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్షంగా చూసిన వారు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, మద్దికెర

మారెల్ల.. నీరు తాగేదెలా

మారెల్ల గ్రామంలోని పురాతన ట్యాంకు లీకేజీల బారిన పడింది. నీరు వృథా కావడంతో పాటు ట్యాంక్ బయటి గోడలు పాచి పట్టాయి. కుళాయిల్లో వచ్చే నీటికన్నా లీకేజీ నీరే ఎక్కువగా కారిపోతోందని గ్రామస్థులు పేర్కొన్నారు. నీటి ట్యాంకుకు మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేదంటే కొత్తగా ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మారెల్ల (తుగ్గలి)

దివ్యాంగులకు బియ్యం కార్డులు ఇవ్వాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు అంత్యోదయ, అన్నయోజన బియ్యం కార్డులు మంజూరు చేయాలని సిద్ధార్థ దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు మొట్టి.శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పత్తికొండలోనే సదరం శిబిరం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆర్డీవో భరత్‌నాయక్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు.

ఖాళీ బిందెలతో ఆందోళన

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని బెస్త వీధిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. సోమవారం పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్లగా.. అక్కడ ఎవరూ లేక పోవడంతో నేరుగా సర్పంచి సుహాసిని ఇంటికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం వీధి ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టారు. వెంటనే నీరందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని సర్పంచి హామీ ఇచ్చారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: రోగులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య టాస్క్‌ఫోర్స్ టీం డీపీఎం డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు అన్నారు. దేవనకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. నేలతలమర్రిలోని సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌భాస్కర్, అరుణజ్యోతి, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చిప్పగిరి, న్యూస్‌టుడే : మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ జంజన్న సోమవారం తెలిపారు. వినియోగదారులు గుర్తించుకోని దానికి తగ్గట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.

జూదరులు అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణ శివారు ఇస్వీ రహదారి సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదోని ఒకటో పట్టణ సీఐ శ్రీరామ్ దాడులు చేశారు. ఈ దాడుల్లో 15 మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.17,100, ఆరు మోటారుసైకిళ్లు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

క్రికెట్ తెచ్చిన తంట

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన తిరుమల అనే బాలుడిపై అదే గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి అనే వ్యక్తి కొడవలితో దాడి చేసినట్లు బాలుడి కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. తిరుమలతో పాటు గ్రామానికి చెందిన వెంకి మరికొందరు కలిసి క్రికెట్ ఆడుతూ తిరుమల, వెంకి గొడవ పడ్డారు. ఆ తర్వాత విషయం తెలుసుకున్న వెంకి తండ్రి తిమ్మారెడ్డి బాలుడు తిరుమలపై కొడవలితో దాడి చేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి తీవ్రగాయాలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఢణాపురం సమీపంలో సోమవారం కారు బోల్తా పడటంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఆలూరు మండలం మూసానపల్లికి చెందిన ప్రహ్లాద, కవిత, చిన్నహోతూరుకు చెందిన ఉపేంద్రలు కారులో వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు తరలించారు.

ప్రజల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



ఆదోని పట్టణం నారాయణగుంత కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని పలువురు ప్రముఖులు అన్నారు. తెదేపా ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఆదోని, మద్దికెర మండలం పెరవలి, పత్తికొండ, తుగ్గలి మండలం మారెల్ల గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పర్యటించారు. – న్యూస్‌టుడే, బృందం

తుగ్గలి: మారెల్ల గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వివరిస్తున్న మహిళలు

మద్దికెర: పెరవలిలో ప్రచార పత్రాలు అందజేస్తూ..

హొళగుంద: కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

మంత్రి లోకేశ్ దృష్టికి ఆదోని సమస్యలు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని కోరుతూ సోమవారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌ను తెదేపా ఆదోని నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి కలిసి విన్నవించారు.

స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని ధర్నా

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ సోమవారం ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబంధిత విద్యుత్తు శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. – న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలనీ, ఆలూరు, ఆస్పరి, పత్తికొండ గ్రామీణం, హొళగుంద

ఆదోని విద్యుత్తు శాఖ డీఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించండి

అర్జీలు స్వీకరిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: కార్యాలయాల్లో ప్రజలు అందించే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీవో తిమ్మక్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఆఫ్ సర్వేయరు వేణు సూర్య, శ్రీనివాసరాజు, ఆర్టీసీ డీఎం మహమ్మద్ రఫిక్, వ్యవసాయ శాఖ ఏడీ బాలవర్ధిరాజు, ఉప తహసీల్దారు బాబు, రుద్రగౌడు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదం: ఎంపీ బస్తిపాటి నాగరాజు

చిప్పగిరి, న్యూస్‌టుడే: వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1942 కోట్ల అంచనాతో మంత్రి వర్గం ఆమోదించిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు సోమవారం తెలిపారు. చిప్పగిరి తెదేపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలూరు రైతుల ఆశాజ్యోతి వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తే నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు, వంద గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. నగరడోణ జలాశయం, హంద్రీ కాల్వలకు ఏబీసీ తూము సాధించి తీరుతామన్నారు. ఆలూరు నియోజకవర్గానికి భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును పరిశీలకుడిగా చంద్రబాబు నియమించారని ఆయన చెప్పారు. అనంతరం చిప్పగిరి మండల గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు పూల నాగరాజు, జడ్పీటీసీ జిల్లా సంఘం మాజీ అధ్యక్షుడు ఏరూరు మీనాక్షినాయుడు, బీసీ నాయకురాలు బొజ్జమ్మ, ఏబీసీ డీసీ అధ్యక్షుడు క్రిష్టప్ప, తెదేపా నాయకులు యల్లంకి రజనీ, తిమ్మయ్య, షేక్షావలి, రవి యాదవ్, సన్నప్ప, కొండా గోవిందప్ప, సావిత్రమ్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.

చిప్పగిరి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

వర్గ విభేదాలు లేకుండా చేస్తాం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గంలో వర్గ విభేదాలకు తావివ్వకుండా అందరినీ సరిచేస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు పూలనాగరాజు అన్నారు. ఆలూరులోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలు, 2029సార్వత్రికల ఎన్నికల్లో తెదేపా జెండా ఎగురవేద్దామన్నారు.

శ్రీనాథ్‌గుప్తాకు ఉత్తమ అధ్యక్ష పురస్కారం

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే: ఆవోపా ఆదోని పట్టణ అధ్యక్షుడు వంకదారి శ్రీనాథ్‌గుప్తా ఏపీ రాష్ట్ర ఆవోపా వారి నుంచి ఉత్తమ అధ్యక్ష పురస్కారం అందుకున్నట్లు సోమవారం ఆయన తెలిపారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో అఖిల భారత ఆర్యవైశ్య నిత్యాన్నపూర్ణ క్షేత్రంలో అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగిందన్నారు. రాష్ట్ర మెప్మా మిషన్ డైరెక్టరు, ఐఏఎస్ అధికారి తేజ్‌భరత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పురస్కారం అందుకుంటున్న ఆదోని ఆవోపా అధ్యక్షుడు వంకదారి శ్రీనాథ్‌గుప్తా

పొగాకు రైతుల ఆందోళన

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: పొగాకు పంట దిగుబడులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండు చేస్తూ.. రైతులు ఆందోళన చేపట్టారు. ఢణాపురం గ్రామ సమీపంలోని పొగాకు కొనుగోలుదారులతో రైతులు సోమవారం వాగ్వాదానికి దిగారు. కర్నూలు, ఓర్వకల్లు, తెలంగాణ ప్రాంతానికి చెందిన రైతులు సుమారు 800 క్వింటాళ్ల పొగాకు దిగుబడులు విక్రయానికి తీసుకురాగా.. కొనుగోలుదారులు ధరలు ఒక్కసారిగా తగ్గించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగుబడులు క్వింటాలు రూ.18500 చొప్పున కొనుగోలు చేస్తామని సంస్థ వారు చెప్పడంతో తాము సాగు చేశామన్నారు. తీరా దిగుబడులు తెకొస్తే.. నాణ్యత లేదని చెబుతూ క్వింటాలు పొగాకు రూ.3వేలు నుంచి రూ.4వేలకు మించి ఇవ్వమని చెబుతున్నారని.. ఇదేక్కడి న్యాయమని రైతులు పెంచికలపాడుకు చెందిన తిమ్మప్ప, ఉప్పలపాడుకు చెందిన నాగప్ప వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

గోదాం వద్ద కొనుగోలుదారులతో వాగ్వాదానికి దిగిన పొగాకు రైతులు

ప్రహరీలు కానరావు.. భద్రత కరవు

☛ అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు

☛ ఆవరణలో పశువులు, కుక్కల సంచారం

ఆలూరు, ఆదోని విద్య, పత్తికొండ గ్రామీణం, ఆస్పరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణాలు, మరమ్మతులకు గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద శ్రీకారం చుట్టింది. చాలా పాఠశాలల్లో ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే కొన్ని పాఠశాలలు గ్రామానికి దూరంగా ఉండటానికి తోడు ప్రహరీ లేకపోవడంతో భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులు, జంతువులు, విష పురుగులు సంచరిస్తున్నాయి. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు ఆకతాయిలు పాఠశాలలోకి చొరబడే అవకాశం లేకపోలేదు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆస్పరి మండలం శంకరబండ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రహరీ లేక ఇలా

ఇదీ పరిస్థితి..

● ఆలూరు నియోజకవర్గంలో 173 ప్రాథమిక, 26 ప్రాథమికోన్నత, 54 ఉన్నత, ఆదోని నియోజకవర్గంలో 101 ప్రాథమిక, 35 ఉన్నత, పత్తికొండ నియోజకవర్గంలో 151 ప్రాథమిక, 40 ప్రాథమికోన్నత, 63 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. చాలా పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరి కొన్నింటికి పనులు మధ్యలోనే నిలిపివేశారు. గతంలో భవనాలు నిర్మించినా ప్రహరీలు మాత్రం నిర్మించలేకపోయారు.

అసంపూర్తిగా వదిలేశారు

పాఠశాలలకు ప్రహరీలు లేక కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రిళ్లు కొంత మంది పాఠశాలల ఆవరణలోనే మద్యం తాగి సీసాలతో పాటు గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు అక్కడే వేసి వెళ్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి పరికరాలు ఎత్తుకెళ్లిన సందర్భాలూ లేక పోలేదు. కొన్ని చోట్ల పాఠశాల సమయంలోనే పశువులు, కుక్కలు, పందులు వంటివి ఆవరణలో సంచరిస్తున్నాయి. ప్రహరీలు అసంపూర్తిగా ఉండటంతో విష పురుగుల భయం నెలకొంది. అధికారులు స్పందించి పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రహదారి పక్కనే..

చాలా గ్రామాల్లో పాఠశాలలు ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో విద్యార్థులు ప్రమాదకర స్థితిలో ఉన్నారు.

● ఆలూరు మండలంలోని హుళేబీడు, హత్తిబెళగల్ ఉన్నత, మొలగవల్లి కొట్టాల, మొలగవల్లి ఆదిఆంధ్ర, కరడిగుడ్డం, అరికెర తండా, గోనేహాలు, కాత్రికి, పెద్దహోతూరు ఆదిఆంధ్ర, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. ఆలూరులోని కోయనగర్ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రహరీ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

● ఆదోని మండలంలోని సంతెకూడ్లూరు ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేదు. అలసందగుత్తి, ఢణాపురం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల నిర్మాణం మధ్యలోనే నిలిపివేశారు.

● పత్తికొండ మండలం నలకదొడ్డి ఉన్నత, దేవనబండ, అటికెలగుండు, గుండుతండా, బుగ్గతండా ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు నిర్మించలేదు. దూదేకొండ, హోసూరు ఉన్నత పాఠశాలల ప్రహరీల నిర్మాణం అసంపూర్తిగానే మిగిలింది.

● ఆస్పరి మండలంలోని ఆస్పరి ఎస్‌డబ్ల్యూఎస్, కొత్త ప్రాథమిక, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, చెన్నంపల్లి, చొక్కనహళ్లి, కలపరి, హలిగెర ఎస్‌డబ్ల్యూఎస్ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. హలిగెరలోని ఉన్నత, పుటకలమర్రి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల ప్రహరీ మధ్యలోనే నిలిచిపోయింది.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

క్లినిక్‌లో మందులు పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టరు రఘు సూచించారు. మండలంలోని బైలుప్పల ఆరోగ్య క్లినిక్‌ను ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న మందుల స్టాకును పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌తో సరిపోల్చారు. అనంతరం గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్య సిబ్బంది దీప, హేమలత, లక్ష్మీదేవి, ఖలీల్ తదితరులు ఉన్నారు.

నది తీరంలో భద్రత ఏర్పాట్లపై సమీక్ష

మంత్రాలయం, న్యూస్‌టుడే: తుంగభద్ర నది తీర ప్రాంతంలో భద్రత ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులు సమీక్షించారు. సోమవారం ఎస్సై శివాంజల్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, శ్రీమఠం మీడియా ఇన్‌ఛార్జి శ్రీనిధి, సర్పంచి భీమయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర తదితరులు భద్రత ఏర్పాట్ల గురించి చర్చించారు. ఆగస్టు 8 నుంచి 14 వరకు రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఎమ్మిగనూరు గ్రామీణం	కోసిగి
80085 73794	9550434095

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: గాంధీనగర్‌లో విద్యుత్తు నియంత్రికకు రక్షణ వలయం లేదు. చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. - రాజు, స్థానికుడు

✔: విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. - శరత్, ఏఈ

?: శాంతినగర్ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. - ప్రసాద్, కాలనీవాసి

✔: కాల్వలో చెత్త తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: లక్ష్మణ్‌టాకీస్ ప్రాంతం ఐదో లైన్‌లో రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - రంగన్న

✔: రహదారికి మరమ్మతులు చేయిస్తాం. - శరత్, ఏఈ

?: కొత్త ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి వదిలేశారు. - సోమప్ప, కాలనీవాసి

✔: సీసీ రోడ్డుకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో పనులు చేపడతాం. - మదన్, ఏఈ

?: సోగనూరు రోడ్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కోసం ఇబ్బందులు పడుతున్నాం. - రాముడు, కాలనీవాసి

✔: తాగునీటి సమస్య తీరుస్తాం- శరత్, ఏఈ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: వర్షాకాలం కావడంతో గ్రామంలోని పలు వీధుల్లో నీరు నిలిచి దుర్గంధం నెలకొంటోంది. - ఈరన్న, కడివెళ్ల

?: గ్రామంలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. - రామాంజనేయులు, పార్లపల్లి

✔: కడివెళ్లలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - జయలక్ష్మి, ఈవోపీఆర్డీ

పనుల వద్ద సమాచార బోర్డులు లేవు

గొల్లలదొడ్డి, కొండాపురం (సి.బెళగల్): మండలంలోని గొల్లలదొడ్డి, కొండాపురం గ్రామాల్లో సోమవారం సామాజిక తనిఖీల్లో భాగంగా ఆయా గ్రామ సర్పంచులు రామలింగమ్మ, జయరత్నమ్మ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. డీఆర్పీలు లక్ష్మన్న, బాలాజీ ఉపాధి

గొల్లలదొడ్డిలో సామాజిక గ్రామసభకు హాజరైన అధికారులు, కూలీలు

పనుల్లో జరిగిన అవకతవలపై సభాముఖంగా నివేదికలు చదివి వినిపించారు. గొల్లలదొడ్డిలో 34 పనులకు రూ. 32,84,600 వెచ్చించగా... పనుల దగ్గర ఎలాంటి సమాచార బోర్డులు ఏర్పాటు చేయలేదు. మస్టర్లు, కొలతల్లో తేడాలు గుర్తించనట్లు వెల్లడించారు. కొండాపురంలో చేపట్టిన పనుల్లో గుర్తించిన అవకతవకలపై డీఆర్పీ బాలాజీ నివేదికలు చదివి వినిపించారు. గ్రామంలో 56 పనులు కోసం రూ. 81,32,000 వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, ఎస్ఆర్‌పి వెంకటేశ నాయక్, పంచాయతీ కార్యదర్శులు జగదీశ్, రాజేష్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కంప్యూటరు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత విద్యకు ఎన్నికైన ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు బకాయిలు ఉంటే వెంటనే చెల్లించాలని న్యాయవాది తిమ్మప్ప డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించిన సీట్లకు ఫీజులు పెండింగ్‌లో ఉంచా

ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

రన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఆన్‌లైన్‌లో చూపించకుండా వదిలేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలందర్, రవి, ఎల్లప్ప, పురుషోత్తం, అబ్దుల్, జయరాం, మోషే, విజయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జయతీర్థుల వేడుకల్లో పీఠాధిపతి

మంత్రాలయం, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం ఆనెగుందెలో కొలువైన పూర్వ పీఠాధిపతి జయతీర్థుల ఆరాధనలో శ్రీమఠం పీఠాధిపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధార్మిక పర్యటనలో భాగంగా పీఠాధిపతి సోమవారం కర్ణాటకలోని మాన్వీలో రాఘవేంద్ర స్వామి మఠం, హోసపేటలోని ఆనెగుందెలో జయతీర్థుల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం తుంగభద్ర నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు.

పారదర్శకంగా పథకాల అందజేత

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో కేంద్రం ప్రభుత్వ పథకాలు పేదలకు పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్

ఇంటింటికి కరపత్రాలు ఇస్తున్న భాజపా నాయకులు

దయాసాగర్, భాజపా నాయకుడు లలిత్ కుమార్‌జైన్ తెలిపారు. పట్టణంలోని 26వ వార్డులో సోమవారం ఎన్‌డీఏ ప్రభుత్వం కేంద్రంలో అమలు చేస్తున్న పథకాలపై ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. 11 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో పలు రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. నాయకులు నాగరాజు, జట్టెప్ప, శివ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ముగిసిన ప్రవేశాలు

మంత్రాలయం: కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏప్రిల్ 25 నుంచి ప్రారంభించిన ప్రవేశాలు ముగినట్లు ప్రిన్సిపాల్ శాంతి తెలిపారు. మండలోని చిలకలదోణ గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు 90 మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించారు.

మొక్కలు నాటి మమ..

■ డివైడర్లపై పచ్చదనం మాయం

■ నిర్వహణ లోపంతో ఎండిపోతున్న వైనం

కర్నూలు బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఇదీ పరిస్థితి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేతపురిని పచ్చదనంతో హరిత వనం చేస్తామని అధికారులు పదేపదే చెబుతున్నా.. ప్రధాన రహదారుల్లో పచ్చదనం కనుమరుగైంది. రూ.లక్షల నిధులు ఖర్చు చేసినా నిర్వహణ లోపంతో మొక్కలు ఎండిపోయి డివైడర్ల మధ్య ఖాళీ ప్రదేశం దర్శమిస్తోంది.

ఏటా రూ.10 లక్షల కేటాయింపు

పట్టణంలో గతేడాది 10 వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రోడ్లు, కాలనీలో మొక్కలు నాటేందుకు దాదాపు రూ. 10 లక్షలు కేటాయించగా ఇందులో రూ. 6.50 లక్షలు ఖర్చు చేశారు. కాలనీలో గుంతల తవ్వడానికి, నాటేందుకు, నీరు పోసేందుకు నిధులు ఖర్చు పెట్టారు. మొక్కలు నాటినప్పుడు నుంచి నిర్వహణ తూతూ మంత్రంగా చేపట్టడంతో మొక్కలు ఎండిపోయాయి. మైనారిటీ కాలనీలో అప్పట్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా మొక్కలు నాట్టారు. నీళ్లు లేక అవి కాస్తా ఎండిపోయాయి. శివ సర్కిల్ నుంచి కర్నూలు బైపాస్ రోడ్డు వరకు వేసిన ఈత మొక్కలు, వివిధ రకాల మొక్కలది అదే పరిస్థితి. ఆదోని బైపాస్ రోడ్డులో మొక్కలు నాటిన ప్రాంతం ఇప్పుడు పశువులకు ఆవాసంగా మారింది. మంత్రాలయం రోడ్డులోనూ మొక్కలు ఎండిపోయి మట్టి మిగిలింది.

ఎమ్మిగనూరు పట్టణ విస్తీర్ణం: 14.50 చదరపు కిలోమీటర్లు
జనాభా: 1.35లక్షలు, వార్డులు: 34, ప్రధాన రహదారులు : ఎమ్మిగనూరు, కర్నూలు, ఆదోని, మంత్రాలయం.
రహదారుల డివైడర్లు వీటి పొడువు: 6.5 కిలోమీటర్లు

త్వరగా నాటితే మేలు

వానాకాలంలో మొక్కలు నాటితే పచ్చదనం సంతరించుకుంటుంది. ఏటా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మొక్కలు నాటి మమ అనిపిస్తున్నారు. ఈసారైనా అధికారులు చొరవ చూపి మొక్కలు పెంపకానికి శ్రీకారం చుడితే చేనేతపురిలో పచ్చదనం పరుచుకుంటుంది.

ప్రతిపాదలు సిద్ధం చేశాం

– గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

మొక్కలు నాట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కడియం, బనవాసి పారం నుంచి మొక్కలు కొసం సిద్ధం చేశారు. మొక్కలు వచ్చిన వెంటనే డివైడర్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతాం.

సుపరిపాలనే ..ప్రభుత్వ ధ్యేయం

కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బి.దస్తగిరి

చింతమానుపల్లె, తిమ్మందొడ్డి (సి.బెళగల్) న్యూస్‌టుడే : ఏడాది పాలనలో అభివృద్ధి సంక్షేమం అంశాల్లో ఎన్నో విజయాలు సాధించామని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బీసీ చిన్న తిమ్మప్ప వీరన్నగౌడ, నీటిసంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, తెదేపా కన్వీనర్ బి.చంద్రశేఖర్ వేణుగోపాల్ స్వామి, కర్రెన్న కొండన్న రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా బాధ్యుడు రామచంద్రారెడ్డి, తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రామకాంతరెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న పేర్కొన్నారు. మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, రామకాంతరెడ్డి

గోనెగండ్ల, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, తిమ్మారెడ్డి, సర్పంచి బాషా పేర్కొన్నారు. అల్వాల గ్రామంలో మండల తెదేపా కన్వీనర్ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు కార్యకర్తలతో కలిసి సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

బసవరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి పట్ల బసవరాజు అంకిత భావంతో పని చేసి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి అన్నారు. చరిత్ర ఉపాధ్యాయుడు బసవరాజు పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ఉత్తమ ఉపాధ్యాయుడిగా బసవరాజు ఎన్నో అవార్డులు అందుకున్నారన్నారు. నవోదయ విద్యాలయం పదిలో కర్ణాటక రాష్ట్ర ఏకీకరణ అవార్డు గ్రహీతగా పేరు సంపాదించారన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు.

ఆర్వో పనిచేయక.. కుళాయి నీరు తాగలేక

మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా మారాయి. విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో నాడు-నేడు పథకం కింద ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. మొదట్లో బాగా పనిచేసినా తర్వాత నిర్వహణ కొరవడి మూడేళ్లుగా యంత్రం మూలనే పడి ఉంది. పాఠశాలలో 592 మంది విద్యార్థులు చదువుతుండగా.. వారందరూ కుళాయి నీరే తాగుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – కనకవీడు(నందవరం), న్యూస్‌టుడే

నిలువునా కూలుతున్నాయ్...

పట్టణంలో డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు విరిగిపోతున్నాయి. సెంట్రల్ లైటింగ్ కోసం వేసిన స్తంభాలు తుప్పు పట్టి గాలికి కూలిపోయేలా ఉన్నాయి. పెద్ద పార్కు రోడ్డులో రెండు స్తంభాలు విరిగాయి. అంతేకాకుండా స్టేట్‌బ్యాంకు, పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఆంజనేయ స్వామి గుడి, గాయత్రి సర్కిల్, మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ మార్కెట్ సమీపంలోనూ స్తంభాలు విరిగాయి. పట్టణంలో దాదాపు 15కి పైగానే స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలను పరిశీలించి తుప్పు పట్టిన వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా?

మండలంలోని బెళగల్ పంచాయతీ పరిధిలో ఉన్న దొడ్డి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎదుట సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. విద్యార్థులు సైతం బడి లోపలికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో గుత్తేదారు సరిగా లెవలింగ్ చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు లెవలింగ్ చేసి వర్షపు నీరు కాలువలోకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోసిగి

ఆ బడికి ముళ్లకంపే ప్రహరీ..

మండల పరిధిలోని బూదూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ ప్రమాదకరంగా మారింది. నాడు-నేడు పనుల్లో భాగంగా పిల్లర్లు వేశారు. గోడ నిర్మించడం మరిచారు. దాంతో ముళ్లకంపను ప్రహరీగా నిర్మించాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైకాపా హయాంలో నాయకుల బాధ్యతారాహితంగా వహించారు. పాఠశాలలో అరకొరగా పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వగరూరు(మంత్రాలయం)

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకుర్తిలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ నెల 11వ తేదిన దుకాణం ఎదుట పార్కింగ్ చేసి లోపల పని చేసుకుంటుండగా తన ద్విచక్రవాహనం కనిపించకుండా పోయిందని అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఈ నెల 17న విజయవాడలో నిర్వహించే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి నాయకుడు లక్ష్మన్న కోరారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తెదేపా నాయకుడి మాచాని సోమ్‌నాథ్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలో ఆయన కేక్ కట్ చేశారు. ప్రజలకు సేవలు చేసేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని సోమ్‌నాథ్ తెలిపారు.

ఎమ్మిగనూరు: పురపాలక కమిషనర్ గంగిరెడ్డిని బీసీ సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. బీసీ శ్మశాన వాటికలో రహదారిని రద్దు చేసినందుకు గాను ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ పట్టణంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

సి.బెళగల్: సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు వెంకటలక్ష్మీ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కారిక వేదిక నిర్వహించారు. పలువురు సమస్యలపై ఆమెకు అర్జీలు అందజేశారు.

గూడూరు గ్రామీణం: మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వెంకటేష్ నాయక్ పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

గూడూరు గ్రామీణం: పట్టణంలోని సింగనగేరి కాలనీలో గల భువనేశ్వరి, నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: డప్పు కళాకారుల పెన్షన్ వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు భగవంతు అధ్యక్షతన సోమవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో డప్పు కళాకారుల సమావేశం నిర్వహించారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని బైలుప్పల గ్రామంలో తెదేపా కార్యకర్త కె.బాలముని (33) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి స్థానిక నాయకులు సంతాపం తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : మండలంలోని కల్లుకుంట గ్రామంలో పీర్ల ఊరేగింపు సందర్భంగా చిన్నారుల పులి వేశాలు వేశారు. పులి వేశాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామంలో పురాతన కాలం నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతున్నట్లు తెలిపారు.

క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరి

కోడుమూరు గ్రామీణం: 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. ముడుమలగుర్తిలో సోమవారం ఏర్పాటు చేసిన సంచార చికిత్స వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ముందస్తు క్యాన్సర్ పరీక్షలతో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.

రెవెన్యూ సిబ్బందికి చికిత్స

మంత్రాలయం, న్యూస్‌టుడే : రెవెన్యూ సిబ్బందికి ఫిజియోథెరఫీ చికిత్స చేయించినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. కర్నూలు నుంచి వచ్చిన ఫిజియోథెరఫీ వైద్యులు సోమవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవితో పాటు సిబ్బందికి చికిత్స నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని 18వ వార్డు షాదీఖానా సమీపంలో రహదారిలో మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తోందని... సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. కమిషనర్ గంగిరెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అర్జీ ఇచ్చిన వారిలో రంగ, లక్ష్మి, సోమ్‌శేఖర్ ఉన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో గొలుసు దుకాణాలపై దాడులు నిర్వహించినట్లు పట్టణ ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న గోపాల్, వీరేశ్, మల్లికార్జున, షరీపుద్దీన్‌లపై కేసు నమోదు చేసి 48 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు రాము

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకుడు రాము అన్నారు. ఫెడరేషన్ నాయకులతో కలిసి సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యను వ్యాపారంగా మార్చిందని విమర్శించారు. కొన్ని పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యా రంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తామన్నారు.

కాలనీల్లో.. సమస్యల తిష్ఠ

● శివారులో సౌకర్యాలు కరవు

❍ కోసిగి 9వ వార్డు గాంధీనగర్ చివరి నాలుగు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవు. దాంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం గ్రామంలో సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించడంలో విఫలమయ్యిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 3వ వార్డులోని వాల్మీకి నగర్ కాలనీలో నాలుగు వీధుల్లో గత తెదేపా ప్రభుత్వంలో సీసీ రోడ్లు నిర్మించాలని కాల్వలు ఏర్పాటు చేసింది. ఎన్నికలు రావడంతో పనులు అసంపూర్తిగా నిలిచాయి.

మురుగును శుభ్రం చేస్తున్న వృద్ధురాలు

కోసిగి, న్యూస్‌టుడే : కోసిగి మండలంలోని కాలనీలు దాదాపు 20 ఏళ్లగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. గత వైకాపా హయాంలో అధ్వానంగా మారిన కాలనీలను తెదేపా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైకాపా హయాంలో పట్టించుకోలేదు..

కోసిగి 9వ వార్డు గాంధీనగర్ షాదిఖానా సమీపంలోని కాలనీలో గత వైకాపా హయాంలో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని పాలకులకు విన్నవిస్తే ఈ కాలనీవాసులందరూ తెదేపాకు మద్దతు ఇస్తారని అందుకే రోడ్లు నిర్మించామన్నారు. కనీసం పారిశుద్ధ్యం పనులు కూడ చేయలేదు.

రాకపోకలకు ఇబ్బందులు

కాలనీలో మురుగు నీరు మట్టి రోడ్డులోనే పారడంతో నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, చిన్న పిల్లలు రాకపోకలకు ఇబ్బందులకు పడుతున్నారు. తాగునీటి సమస్య కూడ తీవ్రంగా ఉంది. గత వైకాపా హయాంలో అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలే సొంతంగా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి కాలనీ సమస్యలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అదనపు భారం

వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంత్రాలయం, న్యూస్‌టుడే : స్మార్ట్ మీటర్లను బిగించడంతో ప్రజలపై అదనపు భారం పడుతుందని ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం మానుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంత్రాలయంలో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కార్యవర్గ సభ్యులు అంజిబాబు, మండల కార్యదర్శి జయరాజు రైతులతో కలసి విద్యుత్తు శాఖ ఉప కేంద్రం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్తు కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ మీటర్ల విధానం వల్ల పేదప్రజలపై భారం పడుతుందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆనంద్‌బాబు పేర్కొన్నారు. గోనెగండ్లలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు విద్యుత్తు ఉపకేంద్రం వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రామాంజనేయులు, సీపీఎం గోవిందు, రాముడు, రమేష్, అబ్దుల్లా, లక్ష్మీనరసయ్య,


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణ, రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే : సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్తు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం విద్యుత్తు శాఖ డీఈ జి.జేషన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్లా, మండల కార్యదర్శి రాజు, సీపీఎం మండల నాయకుడు జీపీ. వీరన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Senior Civil judge: Adoni
E.P.No. 57/2018 in Dispute No. 16/2016
Between:- M/s Margadarsi Chit Fund (P) Ltd., Arundal Pet Branch, Guntur. **- Decree holder**
and
A.G.Gopinath & others **- JDR's**
వేలంపాట ప్రకటన
Decree holder Company తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం పైన JDR No. 5 [illegible] 01-08-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు [illegible]
షెడ్యూలు
కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు తాలూకా, కల్లుగొట్ల గ్రామము, District Registrar, Sub Registrar, Yemmiganur, [illegible] Survey No. 223 లోని 5 ఎకరా పొలము.
ఇందుకు హద్దులు : East: Tholla Rajak Sab land, West: Lingappa land, **North : Abdul Sattar Sab land, South:** Vahab land, Ranganna land.
DHR విలువ : 5 లక్షలు, Market Value : 5 లక్షలు
Ameena Value : 7 లక్షలు
Smt. S.Bala Triveni, Advocate for DHR, Adoni. Cell No: 92465 77201.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సమస్యలు తెలుసుకుంటున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర వాసులు ఇచ్చే వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు 22 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యాధికారి విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులు, టీకాఫా రేషన్ అంశాలపై నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఈవోఆర్డీలు, సీడీపీవోలు తదితరులతో కలెక్టర్ సోమవారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని డీపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ సీఈవో నాసర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌రావు, డీపీవో భాస్కర్, మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

టెలీ కాన్ఫరెన్సు నిర్వహిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నగరంలో విద్యుత్తు అంతరాయం నేడు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా స్టాంటన్‌పురం, బాలాజీనగర్, మమతానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీ-1 సెక్షన్ ఏడీఈ నాగప్రసాద్ వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణ : 85010 05406, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: వెంకటరమణ కాలనీ సాయిసదన్ బహుళఅంతస్తు సమీపంలో ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. తొలగించాలి. - స్థానికులు

?: సోమిశెట్టినగర్, ధనలక్ష్మీనగర్లలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలి. - స్థానికులు

✔: సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. -శానిటేషన్ అధికారులు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : ?: గొందిపర్ల పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో కంపచెట్లు పెరగడంతో పాములు, విష పురుగుల సంచారం పెరిగింది. - రవి యాదవ్

✔: త్వరలో కంపచెట్లు తొలగిస్తాం. - అంకాలప్పనాయుడు, పంచాయతీ కార్యదర్శి

రూ.36 లక్షలు నొక్కేసి.. పనులు నాసి

■ పర్యవేక్షణ లేక.. పూర్తిగా తొలగని పూడిక ■ నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుందన్న ధీమా

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో ప్రవహిస్తున్న కేసీ కాలువ నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. జిల్లా కేంద్రంలో సీఈ, ఎస్ఈ స్థాయి అధికారులున్నా పర్యవేక్షణ కొరవడింది. తుంగభద్ర జలాల విడుదలకు ముందే కాలువలో పేరుకుపోయిన పూడిక, పెరిగిన పిచ్చిమొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉంది. ఐదుకోసుల రూ. లక్షల వ్యయంతో పనులు చేపట్టినా.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక పైపైనే చేశారు. పలు ప్రాంతాల్లో కాలువలో మట్టి, చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. నీటి ప్రవాహంలో దిగువకు కొట్టుకుపోతాయిలే అన్న ధోరణిలో అధికారులు, గుత్తేదారులు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

నిధులు నీళ్లపాలు

కర్నూలులోని కేసీ కాలువలో పూడిక తొలగించేందుకు రూ.36 లక్షల వ్యయంతో పనులు మంజూరు చేశారు. వీటిని ఆరు ప్యాకేజీలుగా విభజించి సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిపై అప్పగించారు. ఒక్కో ప్యాకేజీకి రూ.6 లక్షలు కేటాయించారు. పొక్లెయిన్ యంత్రం ద్వారా పూడిక తొలగించి, ట్రాక్టర్ల ద్వారా తరలించాలి. ఆ నిబంధనలున్నాయి. ఏదైనా రెగ్యులర్ డీఈఈలు లేరు. దీంతో పనులపై ఇంజినీర్ పర్యవేక్షణ లేదు. ఇదే అదనుగా గుత్తేదారులు పైపైనే పూడిక తీసి మమ అనిపిస్తున్నారు.

★ నగర పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కాలువ నుంచి తీసిన పూడిక, చెత్తను ట్రాక్టర్లలో తరలించకుండా అక్కడే వదిలేశారు. ఈ పనులను గతనెల 26న ప్రారంభించి ఈనెల 12వ తేదీన ముగించారు. 16 రోజుల్లో పనులన్నీ ముగించామని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో కాలువను చూస్తే వారి మాటల్లో ఎంత నిజముందో అర్థమవుతుంది. చాలాచోట్ల పనులు అసంపూర్తిగా వదిలేశారు.

నగర పరిధిలో కేసీ కాలువలో తొలగించని పిచ్చిమొక్కలు, మట్టిదిబ్బలు

అన్నదాతల ఆగ్రహం

★ సుంకేసుల నుంచి ఆదివారం కేసీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 3-4 రోజుల్లో నీటి ప్రవాహం పెరిగితే కాలువలో పేరుకున్న మట్టి, చెత్తకుప్పలు దిగువకు కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఎలాగూ నీటితో పాటు చెత్త కొట్టుకుపోతుందన్న ధీమాతో అధికారులు, గుత్తేదారులు ఇష్టానుసారం పనులు చేశారన్న విమర్శలున్నాయి. ప్రవాహంలో చెత్త కొట్టుకుపోయాక కాలువలో ఎక్కడ అడ్డుకుపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పనులు నిర్లక్ష్యంగా జరిగినా, నిధులన్నీ వ్యయం చేశామని సంబంధిత ఇంజినీర్లు ఎం.బుక్‌లో నమోదు చేస్తారని రైతులు పేర్కొంటున్నారు. రూ.లక్షల విలువచేసే పనులు నిర్లక్ష్యంగా వదిలేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మానుకోవాలి

ఓర్వకల్లులో ఆందోళన చేస్తున్న నాయకులు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఓర్వకల్లులోని విద్యుత్తు కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. నాయకులు నాగన్న, మద్దిస్వామి, సుధాకర్, రామకృష్ణ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

దారంతా కంకర.. కష్టాలు కనరా

అమ్మ ఆసుపత్రి నుంచి ఏపీఎస్పీ కాలనీ-1 మీదుగా ఏపీఎస్పీ కాలనీ-2 వరకు ఉన్న దాదాపు 3 కిలోమీటర్ల ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ దారిలో 50 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దారంతా కంకర వేసి వదిలేశారు. దీంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ వాహనాలు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రహదారి నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.- న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

నీటి వృథా.. కట్టడి పట్టదా

కర్నూలు నగరంలోని రామలింగేశ్వరనగర్ పక్కన ఉన్న ఏపీ పర్యాటక హోటల్ వెనకవైపు సీతారాంనగర్, ఎస్టీబీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి చెంతన తాగునీటి పైపులైన్ కొన్ని రోజులుగా లీకవుతోంది. నిత్యం పెద్దఎత్తున నీరు వృథాగాపోతోంది. తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు నగరపాలక అధికారులను కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నడకదారి.. అడుగు పెట్టేదెలా మరి

నగరంలోని బళ్లారిచౌరస్తా నుంచి బాబా బృందావన్ నగరకు వెళ్లే దారిలో ఫుట్‌పాత్ అధ్వానంగా మారింది. దారికి ఇరువైపులా మట్టిదిబ్బలు పేరుకుపోయాయి. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగాయి. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు పక్కనే నడకదారి దారుణంగా మారినా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

వేడుకల వేళ.. రక్షణ ఎలా?

నగరంలోని వినాయక ఘాట్ నుంచి స్వామిరెడ్డి నగర్‌కు వెళ్లే మార్గంలో ప్రజలు కేసీ కాలువలోకి దిగకుండా మెట్ల వెంట రక్షణగా ఇనుప చట్రం ఏర్పాటు చేశారు. దీనికి ఊతంగా కాంక్రీటు దిమ్మెలు నిర్మించారు. వాటిలో కొన్ని దిమ్మెలు ప్రస్తుతం ఊడిపోయాయి. దీంతో ఇనుప చట్రం ఒరిగిపోయింది. వచ్చే నెలలో ఇక్కడ జరిగే గణేశ్ నిమజ్జనోత్సవాల వేడుకల దృష్ట్యా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు దిమ్మెలను సరిచేసి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తి

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి, నాయకులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్సీ బీటీ నాయుడు పేర్కొన్నారు. నగరంలోని బుధవారపేటలో 14వ వార్డు ఇన్‌ఛార్జి రాజు ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పార్లమెంటు తెదేపా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, కార్పొరేటర్ జకియా అన్సారి, పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాగేంద్ర (ఆర్యవైశ్య), కొంకతి లక్ష్మీనారాయణ (బోయ సరపరాల), పి.రవికుమార్ (మాల కార్పొరేషన్), ధరూర్ జేమ్స్ (మాదిగ కార్పొరేషన్), తెలుగునాడు వాణిజ్య విభాగం.. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నంది మధు తదితరులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు.

70 శాతం హామీల అమలు

కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న మల్లెల రాజశేఖర్, పెరుగు పురుషోత్తంరెడ్డి, పాణ్యం తెదేపా నాయకులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 70 శాతం అమలు చేశారని నంద్యాల పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు, తితిదే బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. వైకాపాకు రాబోయే ఎన్నికల్లో గతంలో వచ్చిన 11 సీట్లు కూడా రాని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్‌లో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డితో కలిసి పర్యటించిన సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు గుర్తించామని చెప్పారు. వాటిని పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు.

పెద్దపాడులో సుపరిపాలనలో తొలి అడుగు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దపాడులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెదేపా సంఘ్యా జిల్లా అధ్యక్షుడు, తితిదే బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

అలజడులు సృష్టించేందుకు వైకాపా కుట్రలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గుడివాడలో సభ పేరుతో కులాల మధ్య అలజడులు సృష్టించేందుకు వైకాపా నాయకులు కుట్రలు పన్నుతున్నారని డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ ఆరోపించారు. నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, బీసీ సెల్ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, పార్టీ నాయకులు మందలాకుర్తి భాస్కర్‌రెడ్డి, ఆదాం‌తో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తుంటే చూసి ఓర్వలేని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి తెదేపాలోని బీసీలను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రపన్నుతున్నారని ధ్వజమెత్తారు. గుడివాడలో ఘర్షణలు జగన్‌రెడ్డి ప్రణాళిక ప్రకారమే జరిగాయని పేర్కొన్నారు.

రైతులకు బీమా పథకాలు వర్తింపజేయాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను రైతులకు వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ బ్యాంకు అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీఆర్వో ఛాంబర్‌లో బీమా కంపెనీలు, బ్యాంకు అధికారులతో పంటల బీమా పథకం అమలుపై జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన నగరపాలక కమిషనర్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నగరాభివృద్ధిపై కమిషనర్‌తో చర్చించారు.

కాల్వబుగ్గ ఆలయానికి రూ.2.96 లక్షల ఆదాయం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కాల్వబుగ్గ ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఏడాదికి సంబంధించి రూ.2.96 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో మద్దిలేటి తెలిపారు.

నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు మద్దికెరలో 4.2 మిల్లీమీటర్లు, ఆలూరు 3.2, తుగ్గలి 1.6, కర్నూలు రూరల్‌లో 1.2 కలిపి నాలుగు మండలాల్లో 10.2 మి.మీ వర్షం కురిసింది.

'ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడిని తొలగించాలి'

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లా ఏపీ ఎన్జీవో సంఘంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై చర్యలు తీసుకొంటూ.. ఎన్నికలపై నిషేధం విధిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వి. రమణ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి తన స్వలాభం కోసం రాష్ట్ర సంఘం ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ సభ్యత్వ రుసుమును సంఘం ఖాతాకు జమ చేయకుండా, ఓటరు జాబితాలను వెల్లడించకుండా ఉమ్మడి జిల్లాలోని అన్ని తాలూకాల్లో ఎన్నికలు నిర్వహించడం దారుణమన్నారు. అక్రమంగా ఎన్నికలు నిర్వహించి, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వెంగళ్‌రెడ్డిని జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని ఆయన జిల్లా కలెక్టర్, రాష్ట్రం సంఘం నాయకులను కోరారు.

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డా.త్రినాథ్

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 20 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో జరుగనున్న జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు కర్నూలు నగరానికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు డా.త్రినాథ్ సోమవారం తెలిపారు. ఏప్రిల్ 5, 6 తేదీల్లో నగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గెలిచిన సుజిత్, హరి, కల్యాణ్, అశోక్, జయకల్యాణ్, ఉపేంద్ర, ఉప్పరి హరిచంద్రప్రసాద్, మురళీమోహన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ వ్యాయామ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుధీర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రోజావీధిలో సోమవారం మున్సిపల్ వ్యాయామ అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో రోజా మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్, స్కూల్ అసిస్టెంట్ రెడ్డిపోగు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్

జీవో 21ను రద్దు చేయాలి

ఏపీజీడీఏ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న వైద్యులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : బోధనాసుపత్రుల్లో ఆచార్యులు, సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ జీవో 21ను వెంటనే రద్దు చేయాలని ఏపీజీడీఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బ్రహ్మాజీ, డాక్టర్ రామ్‌శివనాయక్ డిమాండ్ చేశారు. పాత సీఎల్‌జీ ఎదుట ఏపీజీడీఏ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. జీవోను రద్దు చేసి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో వైద్యులు ధమ్మం శ్రీనివాసులు, డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : తమకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోడుమూరు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునియప్పతో కలిసి కార్మికులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి ఏపీ కోడుమూరు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లా కార్యదర్శి మునెప్ప, కోడుమూరు ఏఐటీయూసీ మండల కార్యదర్శి రాముడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కోడుమూరు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 3 నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, కోడుమూరు మండల కార్యదర్శి రాముడు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలోని 15వ వార్డు, బుధవారపేటలోని దళితవాడ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకుడు ఎన్.జి.కృష్ణ కోరారు. శ్మశానంలో మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన నిధులు ఎక్కడికెళ్లాయని ఆయన అధికారులను ప్రశ్నించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కేజీబీవీ, గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపే ప్రతి విద్యార్థికి సీటు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, సహాయ కార్యదర్శి అమర్, రామకృష్ణలు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని.. సెకి ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలంటూ సోమవారం కర్నూలు విద్యుత్తు డివిజన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు సీపీఎం కర్నూలు మండల కార్యదర్శి హుసేనయ్య, రాఘవేంద్ర, మృత్యుంజయుడు తెలిపారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.8.91 లక్షల విలువైన ఆర్థికసాయం చెక్కులను మాధవనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష కోరారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం ఆయన్ను కలిసి తమ పోరాటానికి మద్దతివ్వాలని కోరారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను సత్కరించారు. కాలనీలో అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను కాపాడి ఉద్యానవనం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సరకులిస్తారా.. చేతులెత్తేస్తారా

◆ నగర పరిధిలో గాడితప్పిన రేషన్ పంపిణీ ◆ ఒక్కరోజులో 8 వేల మందికి ఇవ్వగలరా..?

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీ అధ్వానంగా మారింది. జూన్ నుంచి కార్డుదారులకు చౌకధరల దుకాణాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. కర్నూలు అర్బన్‌లో 170 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,12,226 మంది కార్డుదారులున్నారు. రేషన్ పంపిణీ చేపట్టి 14 రోజులు పూర్తయింది. ఇప్పటి వరకు 1,04,226 మంది కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేశారు. ఇంకా 8 వేల మందికి రేషన్ అందలేదు. అంటే 7.1 శాతం మంది కార్డుదారులకు నిత్యావసర సరకులు అందుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వడ్డెగేరిలోని 40వ చౌకదుకాణంలో కార్డుదారులతో వేలిముద్రలు వేయిస్తున్న డీలరు. ఈ దుకాణంలో సరకులు అయిపోయాయి. అరవు తెచ్చి పంపిణీ చేస్తారా.. లేక కార్డుదారులతో వేలిముద్రలు తీసుకుని పంపించేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చౌక దుకాణం నంబరు	కార్డు దారులు	సరకులు తీసుకున్నవారు	శాతం
043	452	136	30.1
083	346	117	33.8
016	466	167	35.8
059	599	198	33.1
072	533	213	40.0
086	408	198	48.5
047	249	102	41.0
051	332	183	55.1
068	626	354	56.5
160	851	441	51.8

ఆ దుకాణాల్లో సగం మందికి నిరాశే

★ మంగళవారంతో పక్షం రోజుల గడువు ముగుస్తుంది. 129వ చౌకదుకాణంలో 1,159 మంది కార్డుదారులుండగా 732 మందికి మాత్రమే ఈనెల బియ్యం, చక్కెర పంపిణీ చేశారు. మరో 427 మందికి ఎదురు చూపులు తప్పడం లేదు. నగరంలోని పదకొండు చౌకదుకాణాల పరిధిలో పంపిణీ అధ్వానంగా ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రెండు వారాలైనా సగం మందికి కూడా సరకులు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఇదే సమయంలో కల్లూరు పరిధిలో, శివారు ప్రాంతాల్లోని 55 చౌకదుకాణాల్లో 100 నుంచి 112 శాతం రేషన్ పంపిణీ చేయడం గమనార్హం.

★ నగరం పరిధిలో 1.12 లక్షల మంది కార్డుదారులకు 95 శాతం రేషన్ పంపిణీ జరగాల్సి ఉండగా.. 92.9 శాతానికే నిలిచిపోయింది. రెవెన్యూ, పౌర సరఫరాల అధికారుల పర్యవేక్షణ చేయకపోవడం వల్లే కొందరు డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆకతాయిలకు పోలీసుల మంత్రణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగరంలో వేర్వేరు చోట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న 20 మంది ఆకతాయిలను సోమవారం కర్నూలు రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ వద్ద నారాయణ కళాశాల, కేవీఆర్ కళాశాల, భాగ్యనగర్‌లోని శ్రీచైతన్య కళాశాల వద్ద పోలీసుల మఫ్టీలో నిఘా ఉంచారు. ఇక్కడ విద్యార్థులు ఆకతాయి చేష్టలకు పాల్పడుతుండగా పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి వారి సమక్షంలో సీఐ నాగరాజారావు విద్యార్థులకు మంత్రణం చేశారు. మరోసారి ఇలాంటి పనులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి పంపారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : భాజపా నాయకుడు మధుగౌడుపై దాడిచేసిన కానిస్టేబుల్ రఫీపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పోలంకి రామస్వామి డిమాండ్ చేశారు. సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న మధుగౌడును సోమవారం ఆయన పరామర్శించారు. కానిస్టేబుల్ రఫీ, అతని సోదరుడు మధుపై దాడిచేసినా పోలీసు అనే కారణంతో తాలూకా సీఐ అతన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జాతీయ బీసీ కమిషన్, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. భాజపా నాయకులు బిజి జగదీశ్, విక్కీ వెంకటేశ్వర్లు, నాగేంద్ర, శ్రీనివాస ఆచారి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు, విజయవాడ

వేలం ప్రకటన

Lr. No. KNL/AEI/01/2016, తేదీ.14-07-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వారి నిర్వహణలో ఉన్న అంజుమన్-ఇ-ఇస్లామియా, కర్నూలు వక్ఫ్ సంస్థకు చెందిన తడి వక్ఫ్ భూములు ఈ క్రింద కనపరచిన గ్రామ సర్వే నంబర్లలోని వక్ఫ్ భూములను మూడు సంవత్సరాల కాలమునకు వేలమును మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కార్యాలయం, మౌర్య హోటల్ ఎదురుగా, కర్నూలు నందు శనివారం అనగా 19-07-2025 ఉదయం 11:00 గంటలకు బహిరంగంగా వేలం వేయడము జరుగును. ఆసక్తి గలవారు బహిరంగ వేలములో పాల్గొనవలెనని కోరడమయినది. భూముల వివరాలు: కిమ్స్ ఆసుపత్రి వెనుక ఉన్న కల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నెం.931/D2 A, B & C, 931/F1, 931/H వెరసి మొత్తము ఎ. 17-34 సెంట్లు మరియు నిడ్జూరు గ్రామ పరిధిలోని సర్వే నెం.261, 261/1, 262/A, B & C, 263/1&2 వెరసి మొత్తము ఎ. 12-85 సెంట్లు. భూములు మరియు ఇతర వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్ : 93928 03103.

ఈ వేలం వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు ఈ క్రింది అధికారులకు పూర్తి అధికారము కలదు.

Sd/- Executive Officer, Anjuman-e-Islamiah, Kurnool.

(c) eenadu

ఈనాడు
నంద్యాల
మంగళవారం జులై 15, 2025

అనుసంధాన దారికి అడుగులు

జాతీయ రోడ్ల వెంట నిర్మాణం • నిధులివ్వనున్న కేంద్రం

ఎన్‌హెచ్‌-167 రహదారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాల అనుసంధాన రోడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. వాటి అభివృద్ధి కోసం వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల-చిత్తూరు(ఎన్‌హెచ్‌-40), కర్నూలు-గుంటూరు (340సి), సోమయాజులపల్లె-డోన్ (340బి), ఎన్‌హెచ్ 167, ఎన్‌హెచ్‌-44, చెన్నై-సూరత్ 150సి జాతీయ రహదారులు ఉన్నాయి. వాటి వెంట గతంలో బైపాస్ రోడ్లు ఏర్పాటుచేశారు. దశాబ్దాలుగా ఇవి అభివృద్ధికి నోచుకోలేదు. నిధులివ్వాలని కేంద్రం నిర్ణయించడంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు.

ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు

- ఎన్‌హెచ్‌-40 పరిధిలో నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో బైపాస్ రహదారులు నిర్మించారు. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి రూ.10 కోట్ల వరకు అవసరమవుతుందని అంచనా వేశారు.
- 340బి సోమయాజులపల్లె-డోన్ రహదారి మార్గంలో బేతంచెర్ల, డోన్ ప్రాంతాల్లో బైపాస్ రహదారులు ఉన్నాయి. కర్నూలు-గుంటూరు 340సి రహదారిపై కర్నూలు సమీపంలోని నన్నూరు టోల్‌ప్లాజా వద్ద బైపాస్ రహదారి మార్గం ఉంది. ఈ రెండు రహదారులకు సంబంధించి ఇటీవలే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలిచ్చారు.
- బళ్లారి-రాయచూరు ఎన్‌హెచ్ 167కు సంబంధించి కర్నూలు జిల్లాలో హాలహర్వి-మాధవరం వరకు 58 కి.మీ. పొడవునా ఉంది. ఆదోని వద్ద బైపాస్ ఉంది. ఈ రహదారికి రూ.5 కోట్ల వరకు అవసరమని అంచనా వేశారు.
- ఎన్‌హెచ్‌-44 బెంగళూరు-హైదరాబాద్ రహదారికి సంబంధించి రూ.10 కోట్లు అవసరమని తేల్చారు.
- చెన్నై-సూరత్ 150సి రహదారి 25 కి.మీ.ల పొడవునా ఉంది. సంబంధిత అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి రూ.10 కోట్లు అవసరమని అంచనా రూపొందించారు.

మురుగు కాల్వల నిర్మాణం

జాతీయ రహదారుల నుంచి బైపాస్ మార్గాలకు వెళ్లే ప్రాంతాల్లో వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నీళ్లు నిలిచిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాల్వలు లేకపోవడంతో మురుగు నిల్వ ఉంటోంది. 'మురుగు' రహదారికి ముప్పు తెచ్చి పెడుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించనున్నారు.

తెలిసినా.. మన్నుకుంటున్నారు

మహానంది మండల పరిధిలోని గాజులపల్లె అంకిరెడ్డి చెరువు, బసవాపురం చెరువుల్లోకి చుక్కనీరు చేరడం లేదు. దీంతో మట్టిమాఫియా ఆయా చెరువులపై కన్నేసింది. పెద్ద ఎత్తున ఎర్రమట్టిని తవ్వేస్తున్నారు. నల్లమల అడవిని, నంద్యాల-ప్రకాశం జిల్లాలను కలిపే ప్రధాన రహదారిని ఆనుకుని గాజులపల్లె అంకిరెడ్డి చెరువు ఉంది. గతంలో 567 ఎకరాలకు సాగు నీరు అందేది. ప్రస్తుతం ఎర్రమట్టి తవ్వకాలకు నిలయంగా మారింది. పలువురు మట్టిని అమ్ముకుని రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఈ చెరువులోకి నీరు రాకుండా అడవి ఆనుకుని సుమారు 30 నుంచి 40 అడుగుల మేర తవ్వేసి మట్టిని తరలించేశారు. ఫలితంగా వర్షం నీరు చెరువులోకి రావడం లేదు. బసవాపురం చెరువు కింద గతంలో 448 ఎకరాలకు సాగు నీరు అందేది. నేడు చుక్క నీరు చేరడం లేదు. ఫలితంగా వందలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. –న్యూస్‌టుడే, మహానంది

వీధికి చేరని వినతుల పరిష్కారం

- **మున్సిపాలిటీల్లో మొక్కుబడిగా పీజీఆర్ఎస్**
- **పురమిత్ర యాప్‌ను మరుగుకు నెట్టారు**

వీధి దీపం వెలగడం లేదు.. మంచినీరు రావడం లేదు.. ఆస్తి పన్నులో తేడా ఉంది.. శునకాలు భయపెడుతున్నాయి.. పట్టణ వాసులను ఇబ్బంది పెడుతున్న ఇలాంటి చిన్న సమస్యలనూ పుర అధికారులు పట్టించుకోవడం లేదు. పురపాలక సంఘాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మొక్కుబడిగా మారింది. ఈ కార్యక్రమానికి అధికారులంతా హాజరు కావడం లేదు. ఒకరిద్దరే వచ్చి అర్జీలు తీసుకుంటున్నారు. వినతులు తీసుకున్నా పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. మరోవైపు పురమిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం లేదు.

– న్యూస్‌టుడే, డోన్ పట్టణం, నంద్యాల రైతునగరం

పరిశీలన

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పురపాలిక కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కీలక అధికారులు పాల్గొనలేదు. కేవలం కమిషనర్, మేనేజర్, టీపీవో పాల్గొన్నారు. ఇంజినీరింగ్, పారిశుధ్య, రెవెన్యూ విభాగాల బాధ్యులు పాల్గొనలేదు. ఐదుగురు మాత్రమే సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

అధికారుల గైర్హాజరు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక నగరపాలక సంస్థ, తొమ్మిది పురపాలక సంఘాలు ఉన్నాయి. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌ను 'న్యూస్‌టుడే' పరిశీలించగా పలు లోపాలు వెలుగుచూశాయి.
- డోన్ మున్సిపాలిటీలో ఉదయం కమిషనర్, మేనేజర్ కార్యక్రమానికి హాజరై 11.55 గంటలకు వెళ్లిపోయారు. ఇతర విభాగాల అధికారులెవరూ హాజరుకాలేదు.
- నంద్యాలలో మూడు వినతులొచ్చాయి. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, ఇతర విభాగాల అధికారులు గైర్హాజరయ్యారు. ఎమ్మిగనూరులో మూడు వినతులొచ్చాయి. కమిషనర్ ఒక్కరే హాజరయ్యారు. ఆదోనిలో ఐదు వినతులొచ్చాయి.

చర్యలకు వెరసి.. 'యాప్' ప్రచారం మరచి

- పుర ప్రజలకు మేలు చేసేలా 'కూటమి' ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 15న పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పురపాలక సంఘాల్లోని ప్రజలు తమ సమస్యలు ఈ యాప్‌లో నమోదు చేయడం ద్వారా పరిష్కారం పొందే అవకాశం కల్పించింది. సమస్యల తీవ్రత తెలిసేలా ఫొటోతీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సంబంధిత అధికారులు స్పందించి మూడు రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపడతారు.
- పురమిత్ర యాప్ సీఎం డాష్ బోర్డుకు అనుసంధానమై ఉంటుంది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు దీనిని పర్యవేక్షిస్తుంటారు. చిన్న సమస్యలు 24 గంటలు, పెద్దవైతే 3 నుంచి 15 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంది. సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించని వారిపై చర్యలు ఉంటాయి. సకాలంలో సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటారన్న భయంతోనే కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా పురమిత్ర యాప్‌పై అవగాహన కల్పించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిష్కారం అంతంతే

నగరంలోని 52 వార్డుల పరిధిలో 6.5 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ప్రతి సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో 101 వినతులు స్వీకరించారు. ఇందులో సగం కూడా శాశ్వత చూపకపోవడం గమనార్హం. ప్రతి మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొంది.

రోడ్డెక్కిన పొగాకు రైతులు

గడివేముల, న్యూస్‌టుడే : పొగాకుకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. గడిగరేవుల గ్రామం వద్ద జీపీఐ కంపెనీ పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. ఆళ్లగడ్డ, చాగలమర్రి, వైఎస్సార్ కడప జిల్లాలోని పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల నుంచి రైతులు సోమవారం పొగాకు తీసుకొచ్చారు. క్వింటా కేవలం రూ.3 వేల ధర వేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ఎదుట నంద్యాల-నందికొట్కూరు ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. క్వింటా రూ.18,500కు కొనుగోలు చేస్తామని కంపెనీ నిర్వాహకులు ఒప్పందం చేసుకున్నారని.. ప్రస్తుతం దిగుబడులు తీసుకొస్తే కేవలం రూ.3 వేలు మాత్రమే ధర వేశారని చెప్పారు. పొగాకు బేళ్లు కట్టి తీసుకొచ్చేందుకే రూ.3 వేలు ఖర్చైందని.. మరి పెట్టుబడులు ఎలా వస్తాయని నిలదీశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.12 వేలైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు ఏపీ రైతు సంఘం మద్దతు తెలిపింది. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు మాట్లాడారు. తహసీల్దారు వెంకటరమణ, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని ధర పెంచేలా కంపెనీ ప్రతినిధులను ఒప్పించడంతో రైతులు ఆందోళన విరమించారు.

పొదుపు సొమ్ముకు టోకరా

• రూ.40 లక్షలు స్వాహాచేసిన ఆర్పీ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలోని పొదుపు సంఘాలకు ఓ మహిళా రిసోర్సు పర్సన్(ఆర్పీ) రూ.40 లక్షలకు టోకరా పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో నియామకమైన ఆమె సభ్యురాళ్ల రుణ కంతులు బ్యాంకులో చెల్లించకుండా సొంతానికి వాడారు. ఆమె పరిధిలో పది గ్రామైక్య సంఘాల్లోని వంద మంది సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించడం.. బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయించడం.. కొత్త సభ్యులను చేర్పించడం.. తొలగించటం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ఆర్పీల విధి. ఈ క్రమంలో సదరు రిసోర్సు పర్సన్ పొదుపు సంఘాల సభ్యుల నుంచి పొదుపు సొమ్ముతోపాటు రుణం కంతులు వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు సంఘాల్లో సభ్యుల తొలగింపు, చేరికలకు అవకాశం కల్పించటంతో ఆర్పీ మోసం బయట పడింది. దీనిపై కొందరు పొదుపు మహిళలు మెప్మా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై మెప్మా టీఎంసీ వెంకటేశ్‌ను వివరణ కోరగా దీనిపై ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు పరిశీలిస్తామన్నారు.

ఆమె చేతితో పల్లె స్వచ్ఛత

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పల్లెల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం సమగ్ర నిర్వహణకు కూటమి సర్కారు పొదుపు సంఘాలకు బాధ్యతను అప్పగించనుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసి చెత్త సంపద కేంద్రాలను నిర్వహించనున్నారు. 2019 హయాంలో తెదేపా ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసింది. గ్రామ జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్ల (క్లాప్ మిత్ర)ను నియమించారు. వారి ద్వారా చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి అక్కడ ఎరువుగా మార్చేవారు. వైకాపా వచ్చిన తర్వాత 'చెత్త'శుద్ధిని మరిచింది.

రెండు పంచాయతీలు ఎంపిక

కర్నూలు జిల్లాలో పెద్దటేకూరు, నంద్యాలలో కౌలూరును ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ఎస్‌హెచ్‌జీలకు అప్పగించనున్నారు. ఆయా సంఘాలు క్లాప్‌మిత్రలతో సమన్వయం చేసుకుని చెత్తను సంపద కేంద్రాలకు తరలించనున్నారు. పొదుపు సభ్యులు చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించి చెత్తను సంపదగా మార్చనున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే ఈ విధానాన్ని ఇతర పంచాయతీలకు విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు.

చెత్తను సేకరిస్తున్న హరిత రాయబారులు

టిడ్కో ఇళ్లు.. సమస్యల గూళ్లు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఇల్లు అలకగానే పండగ కాదన్న సామెత అక్షర సత్యమని ఆళ్లగడ్డ పట్టణంలోని టిడ్కో గృహాలను చూస్తే అర్థం అవుతుంది. గత ప్రభుత్వం ప్రచార్భాటం కోసం ఎన్నికల ముందుగా హడావుడిగా గృహ ప్రవేశాలు చేయించారు. మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లు లేకపోవడంతో ఇళ్లలో చేరిన లబ్ధిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొందరైతే ఇళ్లలో ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోయారు.

- ఏడేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం రూ.72.63 కోట్లతో 30 ఎకరాల విస్తీర్ణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. వైకాపా హయాంలో 1392 గృహాలను నిర్మించారు. మురుగు నీటి శుద్ధ కేంద్రం రూ.2.71 కోట్లతో నిర్మించారు. తుది పనులు పూర్తికాకపోవడంతో నిరుపయోగంగా మారింది.

వృథాగా మురుగు శుద్ధి కేంద్రం

- తాగు నీటి కోసం నిర్మించిన నీటితొట్టె వృథాగా ఉంది. శుద్ధ జలం అందించే క్లోరినేషన్ ప్లాంట్ ఉపయోగంలోకి రాలేదు.

మొత్తం గృహాలు	: 1392
మొత్తం విస్తీర్ణం	: 30 ఎకరాలు
గృహ ప్రవేశాలు	: 1300
ఖాళీ చేసి వెళ్లిన వారు	: 130

- గృహ సముదాయాల్లో తప్పకుండా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, ప్రార్థనాలయాలు ఉండాలి. ఇవి ప్రారంభమేకాలేదు. పచ్చదనం ఎక్కడా కన్పించని స్థితి ఉంది.
- మొత్తం ప్రాజెక్టు వ్యయంలో రూ.72.63 కోట్లు కాగా ఇప్పటికే రూ.70.14 కోట్ల మేర ఖర్చుచేశారు. మిగిలిన రూ.2.49 కోట్లలో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వెలుగోడులో విజిలెన్స్ దాడులు

• రూ.13 లక్షల విలువైన ఎరువుల అమ్మకాల నిలిపివేత

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు జరిపారు. దుర్గాభవాని ఎరువుల దుకాణంలో రూ.13 లక్షల విలువైన ఎరువులకు సంబంధించి విక్రయాలను ఆపేసినట్లు ఏవో స్వామి తెలిపారు. అనుమతులు లేని ఎరువులు, మందులు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు ప్రసాద్, శ్రీనివాసులు, ఆత్మకూరు ఏడీఏ శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని స్కిల్ హబ్ కేంద్రంలో 'అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్' షార్ట్ టర్మ్ టెక్నికల్ కోర్సుకు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ప్రసాద రెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి కోర్సు ప్రారంభమవుతుందని, కాల వ్యవధి మూడు నెలలు ఉంటుందన్నారు. ఎనిమిదో తరగతి ఆపై విద్యార్హత కలిగి 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కె.గోపీనాథ్(9542643747)ను సంప్రదించాలని సూచించారు.

మీ కోసం

21న ఉద్యోగ మేళా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ఈనెల 21న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ షాదీఖానాలో నిర్వహించే మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఉద్యోగ మేళాకు సంబంధించిన కరపత్రాలను కలెక్టరేట్‌లో ఆమె సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, డీఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

దస్త్రం.. లోపభూయిష్టం

- **39 గ్రామాల ఆర్ఎస్ఆర్ గల్లంతు**
- **43 మండలాలకు పటాలు లేవు**

'భూ'వివాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. హత్యలు, ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవి ఎక్కువ భూ సమస్యలే కావడం గమనార్హం. భూ వివాదాలకు కారణం శాశ్వత దస్త్రాలు(రికార్డు) లేకపోవడం.. గ్రామానికి తల్లి లాంటి శాశ్వత 'ఏ' రిజిస్టర్(ఆర్ఎస్ఆర్)ను రెవెన్యూ శాఖ మరిచిపోవడంతో ఇబ్బందులు నిత్యకృత్యమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 39 గ్రామాల్లో ఇవి కానరాకపోవడంతో 'భూ' సమస్యలు పరిష్కరించడం అధికారులకు సవాలుగా మారింది.
– న్యూస్‌టుడే, సచివాలయం

ఎప్పుడు.. ఎన్ని

- ఆర్ఎస్ఆర్ అంటే రీసెటిల్‌మెంట్ రిజిస్టర్.. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉంటుంది. బ్రిటీష్ పాలకులు రూపొందించారు. దీన్ని తెలుగులో శాశ్వత 'ఏ' దస్త్రం అంటారు. దీని ఆధారంగానే అడంగల్, 1బి, నెంబరు-4, నెంబరు-1, నెంబరు-3 రిజిస్టర్ లెక్కలు తయారు చేయవచ్చు. వీటితోనే పట్టా డీకేటీ, ప్రభుత్వ, దేవాదాయ తదితర భూములు ఎంత విస్తీర్ణంలో ఎక్కడ ఉన్నాయో తెలుస్తాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 917 రెవెన్యూ గ్రామాలున్నాయి. 1984లో కొన్ని, 2007 మరికొన్ని, వైకాపా హయాంలో చేపట్టిన భూ రీసర్వే సమయంలో మరికొన్ని మాయమయ్యాయి. కర్నూలు జిల్లాలోని 16 మండలాల పరిధిలోని 27 గ్రామాలు, నంద్యాల జిల్లాలో 07 మండలాల్లో 12 గ్రామాల్లో ఆర్ఎస్ఆర్ పుస్తకాలు గల్లంతయ్యాయి.

గ్రామ పటాలు ఏమైనట్లు

కర్నూలు జిల్లాలో 22 మండలాల్లో 371 సర్వే నంబర్లకు ఎఫ్ఎంబీ (గ్రామ పటాలు) గల్లంతయ్యాయి. నంద్యాల జిల్లాలో 21 మండలాల్లో 996 సర్వే నంబర్లకు ఎఫ్ఎంబీలు (గ్రామ పటాలు) మాయమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మండలాల్లో.. 1,367 సర్వే నంబర్లకు ఎఫ్ఎంబీలు లేవు. దీంతో విస్తీర్ణాల్లో కచ్చితమైన భూమి కొలతలు రావడం లేదు. ఆయా సర్వే నంబర్ల లోని భూ విస్తీర్ణాల్లో తేడాలుండటంతో భూయజమానులకు మధ్య నిత్యం వివాదాలు వస్తున్నాయి.

మూలాలు చెరిపేసిన వైకాపా

- వందేళ్లకు పైబడి భూములకు సంబంధించి సర్వే నంబర్లు, అడంగల్, ఆర్ఎస్ఆర్, 10(1), ఆర్‌వోఆర్ రిజిస్టర్లు ఉన్నాయి. ఒక వ్యక్తికి భూమి ఎలా సంక్రమించింది. వారసత్వంగా వచ్చిందా? లేదా? మరెలా వచ్చింది తదితర అంశాలను లింక్ డాక్యుమెంట్లు, ఆర్‌వోఆర్, ఆర్ఎస్ఆర్ తదితరాల ఆధారంగా రికార్డులు పరిశీలించి నిర్ధారిస్తారు.
- ఆంధ్రప్రదేశ్ భూయాజమాన్య హక్కు చట్టం అమలు అంటూ గత వైకాపా ప్రభుత్వం భూ రీసర్వే చేపట్టింది. దశాబ్దాలుగా ఉన్న ఆర్‌వోఆర్, అడంగల్, ఆర్ఎస్ఆర్, 10 (1), ఆర్ఎస్ఆర్, సర్వే నంబర్లు కనుమరుగయ్యాయి.
- దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. సర్వే నంబర్లు ఒక వ్యక్తికి ఒక్కటే.. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. ఐదారుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం నంబరు కేటాయించి భూ సమస్యలు పెంచారు. కల్లూరు మండలం ఉలిందకొండలో 6,744.76 ఎకరాల భూమి ఉంది. ఆర్ఎస్ఆర్ ప్రకారం సర్వే నంబరు 620లో 1,273.60 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం రీసర్వే చేసిన తర్వాత 1,195.43 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. రీసర్వే చేసిన తర్వాత కచ్చితమైన భూ విస్తీర్ణం రావాల్సింది పోయి.78.17 ఎకరాలు గల్లంతైంది.

అదుపు తప్పితే పాతాళంలోకే

శ్రీశైలం ఆనకట్ట మలుపుల వద్ద రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా లోయలో పడిపోయే పరిస్థితి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి భక్తులు, సందర్శకులు పోటెత్తుతున్నారు. శ్రీశైలం జలాశయం ఒక రేడియల్ క్రస్ట్ గేటు ద్వారా నీరు విడుదలవుతుండడంతో ఈ దృశ్యాన్ని తిలకించేందుకు వస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలోని దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు వాహనాలతో రద్దీగా ఉంటోంది. లింగాల గట్టు ప్రాంతం నుంచి సున్నిపెంట వరకు రహదారుల మలుపుల వద్ద రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది. –న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆప్యాయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పునాది
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
మీ ఋణం తీర్చుకోలేం మా యదలోతుల్లో
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

అభాగ్యులు.. ఆదరించరు

• సాయం కోసం వేడుకోలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: వారందరూ రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు. న్యాయబద్ధంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం కోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. బాధితులు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చి జిల్లా అధికారులకు తమ గోడు వినిపించారు.

పింఛను తొలగించారు
– బొజ్జన్న, మిడుతూరు

నాకు 63 ఏళ్లు. నాకు మూడేళ్ల కిందట పింఛను మంజూరు చేశారు. ఆ తర్వాత కొన్ని నెలలకు తొలగించారు. నాకు భూమి గానీ.. ఎలాంటి స్థలం లేదు. మరి.. పింఛను ఎందుకు తొలగించారని అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. కొన్ని నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా పట్టించుకోవడం లేదు. వృద్ధాప్య సమస్యలతో శరీరం సహకరించడం లేదు. చివరికి కూలీ పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నా భార్య ఏసమ్మ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. స్పందించి పింఛను మంజూరు చేయాలి.

బధిరులు.. బాధను పట్టించుకోరు

నంద్యాల మండలం గుంతనాలకు చెందిన నాగేంద్ర పుట్టుకతోనే మూగ, చెవుడు. ఆయనకు నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలూ పుట్టుకతోనే మూగ, వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. నంద్యాలలోని బధిరుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న సుమలతకు ధ్రువీకరణ సమస్య వచ్చిపడింది. సదరమ్ పత్రం ఉన్నప్పటికీ హైదరాబాద్‌కు వెళ్లి 'బెరా' పరీక్ష చేయించుకుని తీసుకురావాలని చెబుతున్నారు.. తమ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే.. అంతదూరం వెళ్లలేం.. మా కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు మూగ, వినికిడి సమస్యతో బాధపడుతున్నా పింఛను రావడం లేదు.. అధికారులు ఆదుకోవాలని ఆయన విన్నవించారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా
– నిర్మల, పెద్దికోట, కొలిమిగుండ్ల మండలం

నా భర్త రోశన్న అనారోగ్యంతో మూడేళ్ల కిందట చనిపోయారు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశా. నాకు సెంటు భూమి కూడా లేదు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. పనులు దొరకకుంటే పస్తులుండాల్సిందే. అనారోగ్యానికి గురైతే చివరికి వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేవు. వితంతు పింఛను కోసం రెండేళ్ల కిందట సచివాలయంలో దరఖాస్తు చేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదు. కనీసం సొంతిల్లు కూడా లేదు. పింఛను మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

BAMS ADMISSION
KPSVS AYURVEDIC MEDICAL COLLEGE
MANVI - 584123, RAICHUR Dist., Karnataka
94481 62595 / 77953 62970
✓ Experienced & dedicated team of teaching Doctors.
✓ Separate Hostel for Boys & Girls.
✓ Personal Care for every student for the best academic results.
✓ Hands on clinical experience in 60 Bedded Hospital & Monthly Medical Camps.
✓ Curricular & Co-Curricular Activities like Monthly tests, Seminars, Quiz, Sports.

https://aayurvediccollegemanvi.org

(c) eenadu

మక్క లాభాలు పక్కా

ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు మొక్కజొన్న సాగుపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు.. ఖరీఫ్ సీజన్‌లో జులై నెలాఖరు వరకు విత్తుకోవడానికి అవకాశం ఉంది.. రబీలో అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు విత్తితే ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. సాగు సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు సాధించొచ్చని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త జి.ధనలక్ష్మి పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి

సాగు చేసిన మొక్కజొన్న పంట

అనుకూలమైన నేలలు

- నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు.
- చౌడు భూములు, నీరు నిల్వ ఉండే భూములు పనికిరావు.
- ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 ఉన్న నేలలు అనుకూలంగా ఉంటాయి.
- విత్తుకు ముందు మూడు, నాలుగుసార్లు నాగలితో దున్నాలి.
- ఎకరాకు సుమారు 10 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలి.
- తరువాత బోదె నాగలితో బోదెలు, కాలువలు చేసుకోవాలి.

- కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం లేదా కేప్‌స్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుంది.
- సంకర రకాలు ఎకరాకు 8 కిలోలు వేయాలి. సాళ్ల మధ్య 60 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య 20 సెం.మీ. ఉండాలి.
- తీపి మొక్కజొన్నకైతే ఎకరాకు 4 కిలోలు వాడాలి. సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 20 సెంటీ మీటర్లు.

విత్తనశుద్ధి.. విత్తేదూరం

- పేలాల మొక్కజొన్న ఎకరాకు 5కిలోల విత్తనాలు విత్తాలి. సాళ్ల మధ్య 60, మొక్కల మధ్య 20 సెం.మీ.
- బేబికార్న్ రకం ఎకరాకు 10 కిలోల విత్తనాలు వేయాలి. సాళ్ల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 20 సెం.మీ.
- పశుగ్రాస మొక్కజొన్న ఎకరాకు 16 కిలోల విత్తనం అవసరం. సాళ్ల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ ఉండాలి.

జి.ధనలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త

రైతేరాజు

కలుపు యాజమాన్యం

- మొదట బోదె నాగలితో బోదెలు చేసుకోవాలి. తర్వాత విత్తనాన్ని బోదెకు పైనుంచి ఒకటి బై మూడో వంతు ఎత్తులో విత్తినట్లయితే నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది. మొలకెత్తిన 10 రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కను తీసి వేయాలి.
- విత్తిన తర్వాత రెండు, మూడు రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును తేలిక నేలలో ఎకరాకు 800 గ్రాములు, బరువు నేలలో అయితే ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. దీంతో వెడల్పాటి కొన్ని గడ్డి జాతి కలుపును నివారించొచ్చు.

వేరుసెనగకు సస్యరక్షణ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో జులై ఆఖరి వరకు వేరుసెనగను విత్తుకోవచ్చని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్.రాఘవేంద్రచౌదరి రైతులకు సూచించారు. కలుపు నివారణ చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

- వర్షాధారంగా ఖరీఫ్‌లో వేరుసెనగను చదరపు మీటరుకు 38 మొక్కలు ఉండేలా మొక్కల సాంద్రత పాటించాలన్నారు.

అనువైన విత్తన రకాలు : కదిరి-6, టీసీజీఎస్-1694(విశిష్ట), టీఏజీ-73, కదిరి-9, ప్రగతి రకాలు.

- **ఎరువులు:** ఎకరానికి బాగా మాగిన నాలుగు టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఆఖరి దుక్కులో 27 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు చల్లుకోవాలి. మిగిలిన 9 కిలోల యూరియాను పైపాటుగా విత్తిన 30-35 రోజుల సమయంలో చల్లాలి. ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఫాస్ఫేట్ ఎరువులతో కలపకుండా చివరి దుక్కులో వేసుకోవాలి. ఎకరానికి 200 కిలోల చొప్పున జిప్సంను పూత, ఊడ దిగే సమయంలో మొదళ్ల దగ్గర వేయాలి. కాయలు ఊరడానికి, నూనె శాతం పెరిగేందుకు దోహదపడుతుంది.
- **కలుపు నివారణ :** విత్తిన మూడు రోజుల్లో ఎకరానికి 1లీటరు పెండిమిథాలిన్ మందు 200 లీటర్ల నీటిలో కలిపి తడి నేలపై పిచికారీ చేయాలన్నారు. విత్తిన 20-30 రోజుల్లోపు పైరుపై ఇనజీతాఫిర్ 300మి.లీ. లేదా క్విజాలోఫాస్ ఇథైల్ 400మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

సందేహాలు సమాధానాలు

సమస్య: మొక్కజొన్నలో ఆకులు పసుపు రంగులో మారి పోతున్నాయి. నివారణ తెలపండి.
– సుబ్బారెడ్డి, పాతపాడు

సమాధానం: ఇది రసం పీల్చే తెగులు. పేనుబంక, చిగురనల్లి పురుగులు ఆశించడం వల్ల వస్తుంది. పురుగులు అధికంగా ఉంటే మోనోక్రొటోఫాస్ ఎకరానికి 320 మి.లీ, లేదా డైమిథోమిట్ 400 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసి నివారించే అవకాశం ఉంటుంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి

సాగుకు డ్రోన్ దోస్తు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు.. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి డ్రోన్‌ను అనుసంధానం చేయాలని కేంద్రం నిర్ణయించింది.. డ్రోన్లు వ్యవసాయంలో వినియోగించుకోవడంతో యువతకు ఉపాధిని లభిస్తుంది. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం రాయితీపై ఇస్తున్నాయి.

ఎవరు అర్హులంటే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్‌ను తీసుకునే రైతుమిత్ర గ్రూపులకు రాయితీని అందిస్తోంది. ఒక్కో గ్రూప్‌లో ఐదు లేక ఆరుగురు రైతులు ఉండాలి. వారందరికీ భూమి ఉండాలి. ఒక వేళ భూమి లేకపోతే వారిని పైలెట్‌గా నియమించుకునే అవకాశం ఉంది. గ్రూపు సభ్యులంతా తీర్మానం చేసి స్థానిక మండల వ్యవసాయాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి కలెక్టర్ ఆమోదం పొందితే 20 రోజుల శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో ఉచితంగా ఆహారం, పెట్టుకున్న ఖర్చులు అందజేస్తారు. పరీక్ష నిర్వహిస్తారు. డ్రోన్ ఆపరేట్ చేసే అనుమతిపత్రం అందజేశారు. ఇందుకోసం ఇంటర్ పూర్తి చేసుకున్న యువతకు అర్హత ఉంటుంది.

80 శాతం రాయితీ : 10 లీటర్ల సామర్థ్యం పిచికారీ చేయగలిన డ్రోన్ ధర రూ. 9,80,000. ప్రభుత్వం రాయితీ రూ. 7,84,000 ఇవ్వగా, లబ్ధిదారుడి వాటా రూ.1,96,000 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం డ్రోన్, 10 బ్యాటరీలు, రెండు ఛార్జింగ్ కేబుళ్లు అందజేశారు. 10 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటిని డ్రోన్‌తో ఎకరాకు పిచికారీ చేసుకోవచ్చు. ఒక ఎకరాను పూర్తి చేసేందుకు 15 నుంచి 20 నిమిషాలు పడుతుంది. ప్రతి రోజు 20 ఎకరాలకు పైగా పిచికారీ చేసుకోవచ్చని డ్రోన్ పైలెట్ గోపాల్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ సహకారంతో డ్రోన్ తీసుకోవడానికి రుణసదుపాయం కల్పించారన్నారు.

రక్షణ లేని వంతెన

బనగానపల్లి మండలం బనగానపల్లి-ప్యాపిలి రహదారిలో దద్దనాల చెరువు సమీపంలో వాగుపై నిర్మించిన చిన్న వంతెనకు రక్షణ గోడల ఎత్తు తక్కువగా ఉంది. తక్కువ ఎత్తులో ఉండటంతో వాహన ప్రమాదం జరిగితే వాగులో పడే అవకాశముంది. సంబంధిత అధికారులు రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

కుందూకు జలకళ

క్రిష్టిపాడు (దొర్నిపాడు), న్యూస్‌టుడే: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారులో కుందూ నది జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఖరీఫ్ సాగు చేసుకుంటున్న వరి, పత్తి, మినుము రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కుందూ పరివాహక ప్రాంతాల్లో నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

మహానందీశునికి పల్లకి ఉత్సవం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి సోమవారం రాత్రి పల్లకి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను అలంకార మండపంలో పండితులు వేదోక్తంగా పూజలు జరిపారు. అనంతరం భక్తుల శివపంచాక్షరీ మంత్ర పఠనం నడుమ పల్లకిసేవ జరిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి పర్యవేక్షకులు పి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లకి సేవలో భక్తులు, పండితులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత పెంచి బాధితులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం వినతులు స్వీకరించారు. మొత్తం 326 వినతిపత్రాలు అందాయి. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతిపత్రం పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

అభిషేకం చేయిస్తానని టోకరా

◆ భక్తుల నుంచి రూ.15 వేలు వసూలు ◆ తిరిగి ఇప్పించిన దేవస్థానం అధికారులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులకు అభిషేకం చేయిస్తానని డబ్బులు వసూలు చేసి మోసగించిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దీపక్, ముఖేష్ అనే భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం దర్శనానికి వచ్చారు. స్థానిక కొత్తపేట కాలనీకి చెందిన యువకుడు పవన్ వారిని కలిసి గర్భాలయ అభిషేకం చేయిస్తానని చెప్పి రూ.15 వేలు వసూలు చేశాడు. వారికి రూ.150 దర్శనం టికెట్లు ఇప్పించి ఆలయంలోకి పంపాడు. చివరికి తాము మోసపోయినట్లు భక్తులు గుర్తించారు. అక్కడే ఉన్న ఏఈవో హరిదాస్ వారిని విచారించారు. గర్భాలయ అభిషేకం చేయిస్తానని చెప్పి మోసం చేసినట్లు ఏఈవోకు వివరించారు. వారి నుంచి ఫిర్యాదు తీసుకున్న దేవస్థానం అధికారులు మోసం చేసిన యువకుడిని గుర్తించి రూ.15 వేలను తిరిగి ఇప్పించారు. దేవస్థానం ముఖ్య భద్రతాధికారి మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.

వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం వెండి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో వెండి రథాన్ని అలంకరించి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. భక్తుల శివ నామస్మరణల మధ్య వెండి రథోత్సవం జరిగింది. అంతకుముందు స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ నేత్రశోభితంగా నిర్వహించారు. శివునికి సోమవారం ప్రీతికరమైన రోజు కావడంతో లోకకల్యాణార్థం పంచమఠాల్లోని శివలింగాలు, దేవతామూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెండి రథంపై ఉత్సవమూర్తులు

విధుల్లో అంకితభావం అవసరం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి భక్తులకు సేవలందించాలని ఈవో ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. దేవస్థానం పరిపాలన భవనంలో అన్ని విభాగాల ఏఈవోలు, ఈఈలు, డీఈలు, పర్యవేక్షకులతో సోమవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రసాదాలను భక్తులు ఎంతో పవిత్ర భావంతో స్వీకరిస్తారన్నారు. ప్రసాదాల తయారీని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. దిట్టం ప్రకారం ప్రసాదాలు తయారు చేయాలన్నారు. అన్నప్రసాదం రుచికరంగా అందించాలని ఆదేశించారు. సుందరీకరణలో భాగంగా అవకాశం ఉన్నచోట్ల ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసరావు

ఫిర్యాదులు పునరావృతం కానీయొద్దు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా బాధితులకు పరిష్కార మార్గం చూపాలని ఏఎస్పీ యుగంధర్‌బాబు ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 130 వినతులు వచ్చాయి. ఆయన వాటిని స్వీకరించి సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో చరవాణిలో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : జలాశయాలు, కాలువల కింద ఉన్న ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గోరుకల్లు జలాశయం నుంచి సోమవారం నీటిని విడుదల చేశారు. గేట్లు ఎత్తి కాలువకు నీరు వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం గోరుకల్లు జలాశయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. జలాశయానికి మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శుభకుమార్, ఈఈ కృష్ణన్న, నాయకులు గంగనారాయణ, రాంపుల్లారెడ్డి, రవి, సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

20 వేల క్యూసెక్కుల నీటి విడుదల

నందికొట్కూరు, న్యూస్‌టుడే : జూపాడుబంగ్లా మండలం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్ల నుంచి 20 వేల క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఎంసీకి విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు నుంచి ప్రధాన కాల్వ ద్వారా వచ్చే నీటిని పాములపాడు మండలం బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్ వద్ద కర్నూలు-కడప, తెలుగు గంగ గేట్లు తీయడంతో కాల్వలకు గ్రావిటీపై నీరు వెళుతోంది.

పోతిరెడ్డిపాడు వద్ద ఎస్ఆర్ఎంసీలో ప్రవహిస్తున్న నీరు

లైనింగ్ పనుల నేపథ్యంలో..

పోతిరెడ్డిపాడు వద్ద ఈనెల 6 నుంచి నీటి విడుదల ప్రారంభమైంది. ప్రతిరోజూ 20 వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీకి విడుదల చేస్తున్నారు. బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్‌కు వచ్చిన నీటిని వచ్చినట్లు గేట్ల సాయంతో కర్నూలు-కడప కాల్వకు 5 వేల క్యూసెక్కులు, తెలుగు గంగ కాల్వకు 15 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎస్సార్బీసీలో లైనింగ్ పనులు జరుగుతుండటంతో నీటి విడుదల ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. బనకచర్ల నుంచి గోరుకల్లు రిజర్వాయర్ సుమారు 56 కి.మీ. దూరంలో ఉంది. ఇప్పటివరకు బనకచర్ల నుంచి ఎస్సార్బీసీకి నీటి విడుదల కాలేదు. ఈ వారంలో విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

హంద్రీనీవాకు నీటి విడుదల వాయిదా

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటి విడుదల వాయిదా పడింది. మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఇంజినీర్లు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలో ప్రధాన కాలువలో కొన్ని పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం కావాలని అక్కడి ఇంజినీర్లు కోరారు. దీంతో నీటి విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని హంద్రీనీవా కర్నూలు ఎస్ఈ పాండురంగయ్య తెలిపారు. కాలువకు నీటి విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈఈ ఎన్.ప్రసాదరావు సోమవారం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. శ్రీశైలం వెనుక జలాల ప్రవాహం, పంపింగ్ ఏర్పాట్లను చూశారు. నీటి విడుదలకు ప్రభుత్వం ఎప్పుడు అనుమతిచ్చినా సిద్ధంగా ఉండాలని ఇంజినీర్లకు సూచించారు. అనంతరం కేసీ కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. సుంకేసుల జలాశయం నుంచి 1500 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగుతోందని, 92 కి.మీకు నీరు చేరుకున్నట్లు ఇంజినీర్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను యాంత్రీకరణ వైపు అడుగులు వేయిస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. రాయితీపై మంజూరైన డ్రోన్ పిచికారీ యంత్రాన్ని నందికొట్కూరు మార్కెట్ యార్డులో సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి డ్రోన్ పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. మొదట బ్యాంకు నుంచి రూ.4.90 లక్షలు, అన్నదాతలు రూ.4.90 లక్షలు కలిపి రూ.9.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.7.84 లక్షల వరకు రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని, కలెక్టర్ అనుమతితో ప్రభుత్వం మరిన్ని డ్రోన్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, ఏడీఏ గిరీశ్, వివిధ మండలాల ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్: 50/760/114ఎ, శ్రీ విజయ దుర్గా ఆటోమోటివ్స్, గాయత్రి ఎస్టేట్, గూటి రోడ్డు, కర్నూలు-518002.

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, చెన్నైలోని ఎన్‌సిఎల్‌టి యొక్క ఆర్డర్ ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం చేయబడిందని సమాచారం. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరు ది. 30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా అమలులోకి వచ్చేలా మార్చబడినది. ది. 30-11-2022 నాటి పేరు మార్పుకు సంబంధించిన ఇన్‌కార్పోరేషన్ సర్టిఫికేట్‌ను చూడగలరు) మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: **1. మారెప్ప సెరావతి,** తండ్రి: పెద్ద బుగ్గయ్య ఎస్, హెచ్ నెం.1-3480, రాఘవేంద్ర కాలనీ, ఎమ్మిగనూరు, కర్నూలు-518360. **2. సాలమ్మ సెరావతి,** భర్త: ఎస్. మారెప్ప, హెచ్ నెం. 1-3480, రాఘవేంద్ర కాలనీ, ఎమ్మిగనూరు, కర్నూలు-518360. **3. సురేంద్ర ఈబుడి,** తండ్రి: ఈ. సుంకన్న, హెచ్ నెం.7-2-26-12-3, ప్రభాకర్ రెడ్డి నగర్, డోన్, కర్నూలు జిల్లా. వ్యాపారం: శ్రీ మల్లికార్జున హోమ్ అప్లయన్స్, డోన్, కర్నూలు వారి లోన్ అగ్రిమెంట్ నెం. **KURN4TF2011050006** తాలూకు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 23,44,978/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల నలభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)** వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది. **22-08-2022**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం **కర్నూలు వద్ద గౌరవనీయ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కమ్ ప్రిన్సిపల్ సినియర్ సివిల్ జడ్జి, Crl.MP.No.09/2025** వారు ఆమోదించిన ఉత్తర్వుల ద్వారా సదరు చట్టములోని సెక్షన్ 14 కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 9 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని తేది. **12-07-2025**న భౌతికంగా స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 23,44,978/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల నలభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)** ఇప్పటి వరకు వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ ఛార్జీలు ఇతర కాస్టులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జీకి లోబడి ఉందునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు సబ్ జిల్లా, ఎమ్మిగనూరు మండలం, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ, ఎమ్మిగనూరు గ్రామ ఖాతాలు, డ్రై సర్వే నెం. 276బి, ప్రస్తుతం సర్వే నెం.276/బి1, వార్డు నెం.1, పంపన్న గౌడ్ కాలనీ, ప్లాట్ నెం.68, ఇంటి డి.నెం.1/3477-10 గల ఆస్తికి హద్దులు: **తూర్పు:** పెద్ద బుగ్గయ్య ప్లాట్ నెం.65లోని స్థలం, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** ఆర్. సుంకన్న మరియు ఆర్. మారెప్ప ప్లాట్ నెం.69లోని స్థలం, **దక్షిణం:** ఆర్. లక్ష్మి మరియు ఆర్. బజారే ప్లాట్ నెం. 67లోని స్థలం. ఈ స్థలం తూర్పు నుండి పడమరకు 45 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 30 అడుగులు కొలతలు కలిగి, మొత్తం 1350 చ.అ.లు లేదా 150 చ.గ.ల విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన జింక్ షీట్ రూఫ్డ్ ఇల్లు, దానిలోని అన్ని అమరికలు మరియు అనుబంధ స్థలంతో సహా.

తేది: 12-07-2025
ప్రదేశం : కర్నూలు

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగినేని గోవిందు అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు ఉద్యమాలు చేసేందుకు అన్ని వాల్మీకి సంఘాల నాయకులు కలిసి రావాలని కోరారు. గత పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలతో మోసం చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. త్వరలో విజయవాడలో లక్ష మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా చిన్నరెడ్డెప్ప, రాష్ట్ర ఉద్యోగ సంఘం గౌరవాధ్యక్షుడిగా బి.ఈశ్వరయ్య, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా భాగ్యలక్ష్మీ, అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలిగా నల్లబోతుల అనసూయ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూమిక, మదనపల్లె అధ్యక్షుడిగా పిల్లి చంద్ర ఎన్నికయ్యారు. వీరికి కర్నూలు జిల్లా అధ్యక్షుడు యల్లార్తి అర్జున్ నియామకపత్రాలు అందజేశారు.

మల్లన్న సేవలో పూర్వ ఎన్నికల కమిషనర్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం పూర్వ భారత ఎన్నిక కమిషనర్ రాజీవ్ కుమార్ సోమవారం శ్రీశైలం వచ్చారు. భ్రమరాంబ అతిథిగృహం వద్దకు చేరుకున్న ఆయనకు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు స్వాగతం పలికారు. సాయంత్రం ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు జేసీ విష్ణుచరణ్, ఈవో, ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ కుమార్ స్వామివారి మహా మంగళహారతి సేవలో పాల్గొన్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. ఆయన వెంట ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం తహసీల్దారు కె.వి.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కుటుంబసభ్యులతో కలిసి దర్శనానికి వస్తున్న రాజీవ్‌కుమార్

ఇద్దరు మహిళల ఆత్మహత్య

గడివేముల, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఎల్‌కేతండా గ్రామానికి చెందిన నిర్మలాబాయి (21) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు. నిర్మలాబాయికి నాలుగేళ్ల కిందట శ్రీకాంత్ నాయక్‌కు ఇచ్చి వివాహం చేశారని.. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారని ఎస్సై చెప్పారు. నిర్మలాబాయి నగలను అత్తింటివారు బ్యాంకులో తాకట్టు పెట్టి విడిపించలేదని.. దీనినితోడు భర్త, ఆమె కుటుంబసభ్యుల వేధింపులతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈనెల 7న పురుగుల మందు తాగారని వివరించారు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున చనిపోయారని తెలిపారు. భర్త శ్రీకాంత్‌నాయక్, అత్త బోడెమ్మబాయి, మామ మంగె నాయక్, ఆడపడుచు శాంతిబాయి వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లి బుజ్జిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అనారోగ్యంతో బాధపడుతూ..

కౌతాళం, న్యూస్‌టుడే : జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకొని మృతి చెందారని కౌతాళం పోలీసులు తెలిపారు. ఈ ఘటన కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొల్లి అమరేష్ భార్య కొల్లి గంగమ్మ(42) కొన్ని ఏళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఉండేది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై మంచినూనె పోసుకుని నిప్పంటించుకొని మరణించింది. ఈ విషయం తెలుసుకున్న కౌతాళం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుందూలో పడి మహిళ దుర్మరణం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: రూపనగుడి- ఉయ్యాలవాడ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కుందూ నదిలో పడి ఓ మహిళ మృతి చెందారు. సంజామల మండలం కమలపురి గ్రామానికి చెందిన దాసరి వెంకటలక్ష్మమ్మ(57) పెద్ద కుమారుడు బాలవెంకటేశ్వర్లుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం రాత్రి 10.30 గంటలకు రూపనగుడి సమీపంలోని నది వంతెన దాటుతుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి నదిలో ఇద్దరూ పడిపోయారు. బాలవెంకటేశ్వర్లు స్వల్ప గాయాలతో ఈదుకుంటూ బయటపడ్డారు. వారి వెంట మరో ద్విచక్రవాహనంలో వస్తున్న రెండో కుమారుడు తిరుపతయ్య ప్రమాదాన్ని గుర్తించి తల్లిని ఒడ్డుకు చేర్చారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వెంకటలక్ష్మమ్మను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస వదిలినట్లు ఉయ్యాలవాడ ఏఎస్సైలు సుదర్శనరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటలక్ష్మమ్మ (పాత చిత్రం)

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

దొర్నిపాడు, న్యూస్‌టుడే: వాహనంపై నుంచి కిందపడి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఆళ్లగడ్డ మండలం నలగట్ల గ్రామానికి చెందిన లక్ష్మీ నారాయణ, అతని భార్య లచ్చమ్మ ఆదివారం ద్విచక్రవాహనంలో వెళ్తూ చాకరాజు వేముల గ్రామంలోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు తప్పించబోయి వాహనం అదుపు చేయలేక కింద పడ్డారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Need Monthly good Returns? Good Investment & good Profits & Good Earnings. sharing 70:30. Safe & Secure. ✆ 6301859174

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు, పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ. నేషనల్ హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

JOBS

WANTED Marketing Executives for Reputed Company, No Targets, Permanent Salary: 10,000/- to 15,000/- & Good Incentives. ✆ 93912 50272.

EENADU THE WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

MARRIAGE SERVICES

అన్ని కులాల, మతాల వారికి తగిన వివాహ సంబంధాలకై సంప్రదించండి. Heaven Marriages. Contact: 97058 20660.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం నిర్వహించే పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో రామునాయక్ పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో వివిధ అధ్యాపకుల పోస్టులకు పరీక్షలు జరుగుతాయని.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 8.45 గంటల లోపు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తాని చెప్పారు.

సమీక్షిస్తున్న డీఆర్వో రామునాయక్

15న పరికరాల పంపిణీ

గడివేముల, న్యూస్‌టుడే : ఏఐడీపీ పథకం ద్వారా దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేస్తామని తెదేపా విభిన్న ప్రతిభావంతుల విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 15న పాణ్యం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బ్యాటరీ ట్రైసైకిళ్లు, చేతితో నడిపే ట్రైసైకిళ్లు, చేతికర్రలు తదితరాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

సున్నిపెంట సర్కిల్ : ?: సున్నిపెంటలో అంబేద్కర్ సర్కిల్ నుంచి బస్టాండ్ వెళ్లే మార్గంలో వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **ప్రకాష్**

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపి రహదారిపై నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకుంటాం.
- బాలునాయక్, పంచాయతీ కార్యదర్శి

సున్నిపెంట సర్కిల్ : ?: సున్నిపెంటలో పది రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. కనీసం రెండు, మూడు రోజులకోసారైనా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. - **సుశీలమ్మ**

✔: ఫిల్టర్‌హౌస్‌లో సిబ్బంది కొరత ఉంది. దీనికితోడు మోటార్లకు సంబంధించిన బేరింగులు దెబ్బతినడంతో మరమ్మతులు చేయించాం. ప్రస్తుతం కాలనీకి అవసరమైన నీటి సరఫరా చేస్తున్నాం. - **చిట్టిబాబు ఏఈ**

ఆత్మకూరు పట్టణం: ?: నీలితొట్ల వీధిలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద వీధి దీపం వెలగటం లేదు. రాత్రి వేళలో చీకటిగా ఉంటోంది. తగిన చర్యలు అవసరం. - **రబ్బానీ**

✔: దీపానికి మరమ్మతులు చేయిస్తాం. ఇబ్బందులు తొలగిస్తాం. - **షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

ఆత్మకూరు పట్టణం: ?: కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలో పాత చెక్‌పోస్టు వద్ద వర్షం నీరు నిలుస్తోంది. వాహనదారులు నిత్యం అదుపు తప్పి కిందపడిపోతున్నారు. - **నారాయణ, స్థానిక వ్యాపారి**

✔: తాత్కాలికంగా కాలువ తవ్విస్తాం. జనం సమస్యను పరిష్కరిస్తాం. - **రమేష్‌బాబు, కమిషనరు**

పగిడ్యాల : ?: పాలమర్రి గ్రామంలోని పలు కాలనీల్లో అక్కడక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. - **సుదర్శన్**

✔: వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్యలు పరిష్కరిస్తాం. - **ఉపేంద్రరెడ్డి, గ్రామ కార్యదర్శి**

వెలుగోడు : ?: పట్టణంలోని సీపీ నగర్‌లో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - **బాషా**

✔: మరమ్మతులు చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. - **నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

పాములపాడు, న్యూస్‌టుడే: గోదావరి జలాలను బనకచర్లకు తరలించి రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. లింగాల ఎత్తిపోతల పథకం వద్ద సోమవారం బటన్ నొక్కి సాగునీరు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీపై పరికరాలు ఇస్తోందని.. ఉద్యాన తోటల సాగుకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని చెప్పారు.

బటన్ నొక్కి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

ఇంటింటికి సుపరిపాలన : ఎమ్మెల్యే

పాములపాడు, న్యూస్‌టుడే: పాఠశాలలో చదివే అర్హులైన ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం వర్తిస్తుందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మద్దూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

హద్దు మీరొద్దు.. ప్రాణాలతో ఆటలొద్దు

☛ యథేచ్ఛగా వాహనాలు నడుపుతున్న మైనర్లు ☛ తనిఖీలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు

మంత్రణం చేస్తున్న అధికారులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. కానీ కొందరు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేనివారు, మైనర్లు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు గత కొన్ని నెలలుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాలు నడిపే మైనర్లపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా ఆదివారం రోజున డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు.

నంద్యాల పట్టణంలో ప్రతి రోజూ 2 లక్షలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ పోలీసులు గత కొన్ని నెలలుగా తనిఖీలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా వాహనాలు నడిపే మైనర్లతోపాటు పెద్దఎత్తున డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు జరుపుతున్నారు. మైనర్లకు సంబంధించి గత నాలుగు నెలల కాలంలో 200కుపైగా కేసులు నమోదవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తున్నారు.

నెల	కేసులు
మార్చి	29
ఏప్రిల్	95
మే	26
జూన్	44
జులై (ఇప్పటి వరకు)	47

రూ.12.05 లక్షల జరిమానా విధింపు

మైనర్ల డ్రైవింగ్‌పై దృష్టి పెట్టిన ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించడంతోపాటు వారి తల్లిదండ్రులు, వాహన యజమానిని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మైనర్లు ప్రమాదాలు చేస్తే యజమానులకు శిక్ష పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.12.05 లక్షల వరకు జరిమానా విధించారు. అయినప్పటికీ కొందరు మాత్రం మారడం లేదు.

కఠిన చర్యలు తప్పవు

- మంద జావళి ఆల్ఫోన్స్, ఏఎస్పీ, నంద్యాల

మైనర్లకు వాహనం ఇచ్చే యజమానిపై కఠిన చర్యలు ఉంటాయి. మైనర్లు ప్రమాదాలు చేస్తే యజమానులకు శిక్ష పడుతుంది. ఇప్పటివరకు పెద్దఎత్తున కేసులు నమోదు చేసి జరిమానా విధించాం. గతంలో చాలాసార్లు అవగాహన సదస్సులు నిర్వహించాం. అయినప్పటికీ కొందరు మారడం లేదు. అర్హులైన వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలి. అప్పుడే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

నడినెత్తిన మృత్యుపాశం

పట్టణంలో కిషన్‌సింగ్ వీధి నుంచి కొత్తపేట వరకు ఉన్న విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధాన రహదారి మీదుగా తీగలు వెళుతున్నాయి. ఈ మార్గంలో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. లారీలు లోడుతో వెళ్లే సమయంలో తగులుతూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. వెంటనే వీటిని సరి చేయాలని పలువురు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

ప్రాణాలు చువ్వమంటాయ్

నంద్యాల పట్టణంలోని ప్రధాన రహదారులపై ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లపై ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేసుకోకుండానే ఇనుప కడ్డీలను తరలిస్తున్నారు. పట్టణంలో అసలే ఇరుకు దారులు. వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఇనుప కడ్డీలు పొడవుగా ఉండటంతో వెనుక వచ్చే వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె తదితర మార్గాల్లో ఇలాంటి వాహనాలు నిత్యం వెళుతున్నాయి. పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

పట్టు జారితే.. ప్రాణాలు పైకే

కూలీ పనుల కోసం జాతీయ రహదారి 340సిపై పలువురిని వాహనాల్లో ప్రమాదకరంగా తరలిస్తున్నారు. పట్టణంలోని మారుతి నగర్ కాలనీకి చెందిన సుమారు 40 మందిని ఒకే వాహనంలో కుక్కేసి తీసుకెళ్లడ మేకాక రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నందికొట్కూరు

కలుపు తీసే యంత్రం.. తగ్గనున్న భారం

మొక్కజొన్న పంటలో కలుపు తొలగించేందుకుగాను బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన యువ రైతు కుమార్ యంత్రాన్ని వినియోగిస్తున్నారు. రూ.10 వేలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని.. లీటరు పెట్రోలుతో 1.50 ఎకరాల్లో కలుపు తీస్తున్నట్లు చెప్పారు. అదే ఆరుగురు కూలీలకు రూ.1,800 ఖర్చు వస్తుందని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

కూటమి పాలనలో ప్రగతి బాట

వెలుగోడు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెలుగోడులోని ఇందిరానగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలోనే తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛను పెంపు తదితరాలను ప్రజలకు అందించినట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శేషిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఖలీలుల్లాఖాన్, వీరభద్రుడు, డా.జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

నిబంధనల ప్రకారమే విక్రయాలు

పాములపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విక్రయాలు సాగించాలని తిరుపతి ఏడీఏ ప్రసాద్, ఆత్మకూరు ఏడీఏ శశి ఆదేశించారు. పాములపాడులోని సుమంత్ ట్రేడర్స్‌ను ఆయన సోమవారం తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. మందులు కొన్న ప్రతి రైతు బిల్లులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పరస్పరం రాజీ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుంటే

మాట్లాడుతున్న న్యాయవాది విజయలక్ష్మి

అంతిమ తీర్పు అవార్డు పొందవచ్చని న్యాయవాది విజయలక్ష్మి తెలిపారు. నందికొట్కూరు కోర్టు ఆవరణలో సోమవారం బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులు, బ్యాంకు లీగల్ అడ్వైజర్లకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న న్యాయవాదులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ ఇరుపక్షాల సమ్మతితో రాజీ కుదుర్చుకుంటే మధ్యవర్తిత్వ అవార్డు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటరమణ, సీనియర్ న్యాయవాది యుగంధర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16వ తేదీ నుంచి మైండ్ స్పార్క్స్ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.శశికళ సోమవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 96187 17566 నంబరును సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. నంద్యాల కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏఐవైఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీకుమార్, రమేశ్, లక్ష్మయ్య, మహేశ్, ప్రవీణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదరికం లేని సమాజ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక 12వ వార్డులో సోమవారం ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు

సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఫిరోజ్

అమలవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్, సురేశ్, మల్లికార్జున, గోవిందనాయుడు, రవి, నాగప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ఖలీల్ సిద్ధిఖి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో పదో తరగతి 2004-05 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. పూర్వ విద్యార్థి సంఘం నాయకులు నాగ నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ ముస్తాక్, ప్రధానోపాధ్యాయులు సిద్ధిఖీ అస్మద్దీన్, ఉపాధ్యాయులు నాగేశ్వరరెడ్డి, మస్తాన్, ఖదీర్, అంజద్‌బాషా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతోపాటు గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థులు మురళి, సుబ్బరాయుడు, యూనస్, ఖాన్, పవన్, సంజీవ, శ్రీరామ్, రమణ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

కష్టపడినవారికి సముచిత స్థానం

పగిడ్యాల, న్యూస్‌టుడే: పగిడ్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్‌గా తెదేపా నాయకుడు దామోదర్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. సింగిల్ విండో డైరెక్టర్లుగా ప్రతాప్, నెహ్రూనగర్ గ్రామానికి చెందిన కొట్టం శంకర్‌రెడ్డి, గంగాధర్ నియమితులయ్యారు. సర్పంచి శేషమ్మ, తెదేపా నాయకులు మహేశ్వర రెడ్డి, బుసిగౌడు, నాగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

అతివేగం.. అత్యంత ప్రమాదకరం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: వాహనాలను అతివేగంగా నడపడంతో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా అన్నారు. స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాల వద్ద యువతకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది యువకులు వాహనాలను మితిమీరిన వేగంతో నడపడంతోపాటు శిరస్త్రాణం ధరించడం లేదని చెప్పారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మండలంలోని కొండజూటూరు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. పాణ్యం నుంచి దుర్వేశి వరకు రూ.5 కోట్లతో రహదారి నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గంగ నారాయణ, పుల్లయ్య, కేశన్న, యాకోబు, జయరాంరెడ్డి, లాయర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

నాలుగు తులాల బంగారం చోరీ

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన కామిరెడ్డి రాధకు సంబంధించి నాలుగు తులాల బంగారం చోరీకి గురైందని ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. బాధితురాలు తన భర్త మురళీమోహన్‌రెడ్డితో కలిసి కర్నూలులో నివాసం ఉంటుందన్నారు. జూన్ 30న కర్నూలు నుంచి పెసరవాయికి తల్లి పుణ్యవతితో కలిసి బస్సులో వచ్చారని చెప్పారు. బంగారాన్ని పర్సులో పెట్టి పర్సును టిఫిన్‌బాక్సులో ఉంచి బ్యాగులో పెట్టుకున్నారని తెలిపారు. ఇంటికి వచ్చి చూసేసరికి బంగారం ఉంచిన పర్సు కనిపించలేదని చెప్పారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల, న్యూస్‌టుడే : అదనపు కట్నం కోసం వేధించిన భర్త, బావ, అత్తామామలపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. నంద్యాలకు చెందిన వెంకటశివభరత్‌తో కృష్ణవేణికి గతేడాది వివాహం జరిగింది. రూ.20 లక్షల నగదు, 20 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. అదనపు కట్నం ఇవ్వాలని భర్తతోపాటు అత్త సుబ్బలక్ష్మమ్మ, మామ గోపాల్, బావ రమణకుమార్ వేధిస్తుండటంతో బాధితురాలు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

భరోసా ఇచ్చేదెన్నడో!

☛ స్పౌజ్ పింఛన్లకు బాధితుల ఎదురుచూపు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : లబ్ధిదారుడు మృతి చెందితే అతని భార్యకు తదుపరి నెల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద పింఛను అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారి జీవనానికి భరోసా కల్పించింది. చనిపోయిన వ్యక్తి వివరాలు, మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రం, భార్య వివరాలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల మందికి స్పౌజ్ పింఛను మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు.

జాబితా విడుదల చేసినా..

నియోజకవర్గం	మంజూరైన పింఛన్లు
నంద్యాల	382
నందికొట్కూరు	490
శ్రీశైలం	331
పాణ్యం (పాణ్యం, గడివేముల)	148

- అర్హులైన వారి నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మేలో జాబితా విడుదల చేశారు. వీరికి రూ.4 వేల మేర పింఛను ఇవ్వాల్సి ఉంది. వాస్తవానికి జూన్‌లో ఇవ్వాలని నిర్ణయించారు. జులై గడుస్తున్నా ఇప్పటివరకు బాధితులకు పింఛను అందడం లేదు. దీనిపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.
- స్పౌజ్ పింఛన్ల కోసం పాణ్యం, నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల పరిధిలో 1,351 మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గ్రామాలవారీగా అర్హుల జాబితా సిద్ధం చేసి నెలలు గడుస్తున్నా నేటికీ అందడం లేదని పలువురు పేర్కొంటున్నారు. పింఛను కోసం ఆశతో బాధితులు ప్రతి నిత్యం సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- ఈ విషయమై పాణ్యం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ స్పౌజ్ పింఛన్లకు సంబంధించి అర్హుల జాబితా సిద్ధం చేశామని తెలిపారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేస్తున్నామని.. ప్రభుత్వం నుంచి ఆదేశాల వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : పురపాలక ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పురపాలక కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 36 ప్రకారం కార్మికులకు రూ.21 వేల వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, రామాంజనేయులు, రంగనాథ్, బాలదుర్గన్న తదితరులు పాల్గొన్నారు.

పురపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రతిరోజూ వివరాలు నమోదు చేయాలి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఎరువులు, విత్తనాల నిల్వలను ప్రతిరోజూ బోర్డులో నమోదు చేయాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, అనంతపురం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. పట్టణంలోని ఎరువులు, పురుగుల మందులు, విత్తన దుకాణాలను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్, డైరెక్టర్ ఆదేశాలమేరకు సోమవారం తనిఖీ చేపట్టారు. వివిధ ఏజెన్సీలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో తాత్కాలికంగా ఎరువుల విక్రయాలు ఆపేసినట్లు అధికారులు చెప్పారు.

గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

అందుబాటులోకి యూరియా

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. ఎం.తిమ్మాపురంలోని వ్యవసాయ పరపతి సంఘంలో సోమవారం యూరియా నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన వారందరికీ ఎరువులు అందజేస్తామన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి

సంక్షిప్త సమాచారం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు పీ4 గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సయ్యద్‌ఉమర్ సోమవారం తెలిపారు.

మహానంది, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం పదిలమని కేసీ కాలువ నంద్యాల ప్రాజెక్టు ఛైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. గోపవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాణ్యం, నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: భూపనపాడు గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకొంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి మంజులాబాయి పేర్కొన్నారు. ఆమె సోమవారం అధికారులతో కలిసి గ్రామంలోని బీసీ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే : వర్షం కోసం సప్తనదుల సంగమేశ్వరం ఆలయ ప్రాంగణంలో గంగమ్మదేవికి ఎర్రమఠం గ్రామస్థులు సోమవారం పూజలు చేశారు. 101 బిందెలతో జలాభిషేకం చేశారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన నగదును చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు కోరారు. వారు సోమవారం డీఈవో కార్యాలయంలో డీఈవో జనార్దన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

మహానంది : మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా గాజులపల్లెకు చెందిన షేక్ షంషీర్‌బాషాను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనరసింహయాదవ్ ఉత్తర్వులు అందజేశారు.

మహానంది, న్యూస్‌టుడే: బెంగుళూరు నుంచి మహానందీశ్వరుని దర్శనానికి వచ్చిన అప్పయ్య అనే భక్తుడు బుధవారం తప్పిపోయాడు. బయట తిరుగుతుండగా గమనించిన లాడ్జీ ఓనర్ రమణ అతడిని పిలిచి సమాచారం తెలుసుకుని పోలీసులకు తెలిపారు. పోలీసులు అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జనరల్ నోటీసు

నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం మరియు బేతంచెర్ల గ్రామ కాపురస్తుడైన గౌరీ స్వామి రెడ్డి గారి కుమారుడు గౌరీ లక్ష్మి రెడ్డి గారి ద్వారా సరియైన సూచనలు పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నంద్యాల జిల్లా, నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామ కాపురస్తురాలైన మాడెం రాజశేఖర్ రెడ్డి గారి భార్య మాడెం మీనా దేవి గారు దిగువ షెడ్యూల్ ఇంటి స్థలములను, నా క్లయింట్‌కు విక్రయించి ఒక విక్రయ ఐరారు వ్రాయించి ఇచ్చి వుండినది.

తదుపరి సదరు ఇంటి స్థలములను ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నించుచున్నట్లు తెలిసి, నా క్లయింటు నంద్యాల ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో O.S.23/2025 కేసు దాఖలు చేసి ఉన్నారు. అంతేకాక దిగువ షెడ్యూల్ ఇంటి స్థలములను కేసు తీర్మానం అయ్యేవరకు ఇతరులకు విక్రయించకుండ I.A.66/2025 ద్వారా ఇంజంక్షన్ ఉత్తర్వులు తీసుకొని ఉన్నారు.

కావున ఈ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ నోటీసు షెడ్యూల్ ఇంటి స్థలముల గురించి ఎవరైనా ఏదైనా లావాదేవీలు జరిపిన ఎడల అవి చెల్లనేరవు. అంతేగాక అట్టి లావాదేవీలు జరిపిన వారిపై నా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు వారు బాధ్యులు అగుదురని హెచ్చరించడమైనది.

షెడ్యూల్: నంద్యాల జిల్లా, నంద్యాల సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల మండలం అయ్యలూరు గ్రామ పరిధిలో సర్వే నెం. 1097 మరియు 1101 పైకి గల ప్లాట్ నెంబర్ 12 & 13ల వివరము మరియు

హద్దులు: Sy.No: 1097 pyki } Ac 0.11
Sy.No: 1101 pyki } cents

హద్దులు: తూర్పు : 40 అడుగుల వెడల్పు గల రస్తా, **పడమర:** మాడెం చంద్రశేఖర్ రెడ్డి గారి భూమి, **ఉత్తరం:** ప్లాట్ నెం 11, **దక్షిణం:** ప్లాట్ నెం 14.

అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు
అడ్వకేట్, నంద్యాల. 94402 90132

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

పేదరిక నిర్మూలనపై అవగాహన సదస్సు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పొదుపు మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించేందుకు అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని డీఆర్‌డీఏ డీపీఎం హనుమంతునాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని పొదుపు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో 10 మండలాలకు చెందిన ఏపీఎం, సీసీలకు గ్రామ పేదరిక నిర్మూలన ప్రణాళికపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

డోన్, న్యూస్‌టుడే: ఏపీఈఆర్‌సీ విద్యుత్తు వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవాలని, ఇందుకు 50 శాతం రాయితీ ఉంటుందని ఈఈ కమలాకర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ డోన్ సబ్‌డివిజన్ పరిధిలో 1384 మంది వినియోగదారులు రూ.17.06లక్షలు చెల్లించి లోడు క్రమబద్ధీకరించుకున్నారన్నారు.

గవర్నర్ నియామకంపై హర్షం

బనగానపల్లి, న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా తెదేపా సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు నియామకంపై రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మంత్రి బీసీ ఓ ప్రకటనలో మాట్లాడుతూ తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ కేంద్ర మంత్రిగా ఆయన ఎనలేని సేవ చేశారని కొనియాడారు. రాజకీయ విలువలకు, విశ్వసనీయతకు ఆయన మారుపేరుగా నిలిచారన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)	
ఆళ్లగడ్డ:	8008 574916
డోన్ పట్టణం:	94408 57790
బనగానపల్లె:	80085 73763

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: శ్రీనివాసనగర్‌లో దత్త ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - సుదర్శన్, శ్రీనివాసనగర్.

✔: సిబ్బందితో ముళ్లకంపలు తొలగింపజేస్తాం.

?: బేతంచెర్ల సర్కిల్‌లో ప్రధాన రహదారి పక్కనున్న కాల్వలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. - మల్లికార్జున, కొండపేట.

✔: సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేసి పరిశుభ్రం చేయిస్తాం.(పై రెండు సమస్యలకు ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి హనుమంతరెడ్డి సమాధానాలు ఇచ్చారు.)

బనగానపల్లి, న్యూస్‌టుడే: ?: స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ప్యాపిలి వెళ్లే రహదారిలో రోడ్డు పక్కనే గుంత ప్రమాదకరంగా మారింది. - మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసి.

✔: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - సతీష్‌కుమార్‌రెడ్డి, ఈవో.

అవుకు, న్యూస్‌టుడే: ?: మెట్టుపల్లె గ్రామంలో ప్రధాన వీధిలో చాలా చోట్ల విద్యుద్దీపాలు వెలగడంలేదు. - గ్రామస్థులు

✔: దీపాలు లేని స్తంభాలను గుర్తించి దీపాలను అమరుస్తాం. - దినేష్, పంచాయతీ కార్యదర్శి, మెట్టుపల్లె.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: ?: దొర్నిపాడు గ్రామంలోని శ్మశాన వాటిక పక్కన ఉన్న కాల్వలో చెత్త చేరి అధ్వానంగా మారింది. -రాజు, దొర్నిపాడు.

✔: పంచాయతీ సిబ్బందితో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - శివప్రసాద్, ఈవోపీఆర్డీ, దొర్నిపాడు.

ఆర్.కృష్ణాపురం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆర్.కృష్ణాపురం గ్రామంలో బీసీ కాలనీలో రోడ్డుపై మురుగు పారుతోంది. - షరీఫ్, ఆర్.కృష్ణాపురం.

✔: పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. -అశ్విన్, ఈవోపీఆర్డీ.

రైతు సంక్షేమానికి కృషి చేస్తా

ఎల్లాగౌడ్‌ను సన్మానిస్తున్న తెదేపా నాయకులు

డోన్, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని డోన్ మండల వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా ఎంపికైన ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. సోమవారం కొట్లవారిపల్లె వద్ద ఉన్న సహకార సొసైటీ కార్యాలయంలో సంఘం ఛైర్మన్‌గా ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మల సహకారంతో రైతులకు సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. సొసైటీ ద్వారా ప్రభుత్వ రాయితీలు, రుణాలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తామన్నారు. తెదేపా ప్రభుత్వంలోనే అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే అమలవుతుందన్నారు. సభ్యులుగా ఓబులాపురం గ్రామానికి చెందిన సుంకన్న, గోసానిపల్లెకు చెందిన మల్లికార్జునలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అర్జున్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, ఆంజనేయులుగౌడ్, శ్రీను, ఓంప్రకాశ్, రంజిత్, గోవిందరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడి ఎంపిక

ఉన్నం పాల చంద్రశేఖర్

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు ఉన్నం పాల చంద్రశేఖర్ మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు.

చినుకు లేక.. కునుకు రాక

నష్టపోయిన అన్నదాతలు

జూనూతలలో జీవాలకు వదిలేసిన మినుము పంట

అవుకు, న్యూస్‌టుడే: ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన పైరు వానల్లేక పనికి రాకుండా పోతోంది. విధిలేని పరిస్థితుల్లో విలువైన పంటను పశువులు, మేకలకు ఆహారంగా వదిలేసిన ఘటన అవుకు మండలంలో కొండమీది గ్రామాల్లో చోటు చేసుకుంది. మే నెలలో ఆశించిన మేర వానలు కురవడంతో మండలంలోని కొండమనాయునిపల్లె, జూనూతల, పిక్కిళ్లపల్లెతండా, ఉప్పలపాడు, కునుకుంట్ల గ్రామాల పరిధిలో దాదాపు 400 ఎకరాల్లో మినుము, 100 ఎకరాల్లో ఉల్లి పంటలు సాగు చేశారు. సాగు కోసం మొత్తంగా రూ.90లక్షల మేర పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం పైసా దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

దిగుబడులపై ప్రభావం

జులైలో కనీస వానలు కురవకపోవడంతో పైరుకు కష్టకాలం వచ్చింది. సాగుచేసిన పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఎంత చేసినా నష్టాలే మిగిలాయి. వానలు కురుస్తాయన్న ఆశతో సాగుచేసిన పైరుకు దూరప్రాంతంలోని బోర్ల నుంచి గొట్టాల ద్వారా నీటితడిని అందించారు. ప్రస్తుతం వానలు రాక బోర్లలో నీళ్లు లేకపోవడంతో పిందె, కాయ దశలో పైరు ఎండిపోయింది. కనీసం ఒక్క వాన కురిసినా దిగుబడులు అందేవని రైతులు వాపోతున్నారు.

పశువులకు ఆహారంగా పైరు

పొలంలో ఎండిపోయిన పైరును తొలగించడానికి అదనపు ఖర్చు భరించలేని రైతులు వేలకు వేల రూపాయలు పెట్టుబడులుగా పెట్టి సాగు చేసిన పైరును మేకలకు, పశువులకు వదిలేశారు. మినుము సాగు కోసం ఎకరానికి రూ.20 వేలు, ఉల్లి సాగునకు ఎకరానికి రూ.30 వేల మేర ఖర్చుచేశారు. సగటున కొండమీది గ్రామాల్లో దాదాపు రూ.90 లక్షల మేర పెట్టుబడులుగా ఖర్చు చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

– సిద్ధయ్య, రైతు, జూనూతల

నేను మూడెకరాల్లో మినుము సాగు చేసేందుకు రూ.60 వేలు ఖర్చుచేశాను. ప్రస్తుతం ఒక్క పైసాకూడా వచ్చే పరిస్థితి లేదు. ఎండిన పంటను పొలం నుంచి తొలగించడానికి అయ్యే అదనపు ఖర్చులను భరించలేక జీవాలకు వదిలేశాను.

ఎదుగుదల ఆగిపోయింది

– నాగశేషుడు, రైతు, జూనూతల

ముందస్తు సాగుతో మంచి దిగుబడి ఉంటుందన్న ఆశతో ఉల్లి సాగు చేశాను. ప్రస్తుతం నీటి తడులు లేక పైరు ఎదుగుదల ఆగిపోయింది. ఒక్కసారిగా బోర్లు ఒట్టిపోవడాన్ని తొలిసారిగా చూస్తున్నాం. వానకురిస్తే తప్ప గడ్డను పొలంలో నుంచి తీయడానికి వీలుకాదు.

వివరాలు సేకరిస్తాం –ఖలీమున్నీసా, వ్యవసాయాధికారిణి, అవుకు

వర్షాల్లేక కొండమీది గ్రామాల్లో పంటలకు నష్టం జరిగింది. ఏ మేరకు జరిగిందనే విషయాన్ని పరిశీలిస్తాం. నష్టం అంచనాలను ఉన్నతాధికారులకు వివరిస్తాం.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

రాజోలి(చాగలమర్రి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలియజేశారు. చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కాల్వకు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో 500 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది జులై 14న కేసీకి నీటి వదలడం సంతోషకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1.6కోట్లతో మరమ్మతు పనులను చేపట్టామన్నారు.


కేసీ కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

మొక్కే కదా అని మూలనపడేశారు

చాగలమర్రి పట్టణంలోని ఎంఈవో కార్యాలయ సమీపంలో ఓ మూలన మొక్కలు చేరాయి. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు మొక్కలను అందజేశారు. మిగిలిన మొక్కలను ఎంఈవో కార్యాలయ సమీపంలో మూలన పడేశారు. మిగిలిన మొక్కలను కూడా ఏదైనా పాఠశాలల్లో నాటిస్తే ప్రయోజనం ఉంటుందని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చాగలమర్రి

కలప కోసం అక్రమ మార్గం

ఆళ్లగడ్డ పట్టణంలో భారీ వృక్షాలను కలప కోసం ప్రమాదకరంగా మారినట్లు చూపించి అక్రమంగా నరికేస్తున్నారు. కలప కొనుగోలుదారులు ఏదైనా ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్టును సొంతం చేసుకోవాలంటే ఆ చెట్టు మొదలులో ఎవరూ చూడని సమయంలో నిప్పు పెడతారు. కూలిపోతే ప్రమాదకరమని దాన్ని తొలగిస్తారు. నరికేసిన చెట్టుకు అంతో ఇంతో చలానా కట్టి కలప వ్యాపారులు సొంతం చేసుకుంటారు. ఇలాంటి చర్యల్లో భాగంగానే సంత మార్కెట్‌లో ఓ చెట్టును నేల కూల్చారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

పంకాలు ఉన్నా.. లేనట్లే!

డోన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ పంకాలను ఏర్పాటు చేసింది. పంకాలు తిరగాలంటే స్విచ్‌లు వేయాల్సి ఉంది. ఆర్టీసీ సిబ్బంది స్విచ్‌లు వేయకపోవడంతో పంకాలు తిరగడం లేదు. తద్వారా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. టీవీలు ఉన్నా.. అందులో ఏదీ ప్రసారం కాక నిరుపయోగంగా ఉండిపోయాయి. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

రాళ్ల వ్యర్థాల తొలగింపు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలోని ఖాజీవాడ మసీదు పక్క వీధిలో రహదారి మధ్యలో రాళ్ల వ్యర్థాలు ఉండటంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. దీనిపై ఈ నెల 12న 'ఈనాడు'లో 'మేమున్నాం- మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. ఈవో సతీష్‌కుమార్ రెడ్డి స్పందించారు. సోమవారం పంచాయతీ సిబ్బందితో రాళ్లను తొలగించారు.

కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్ఎల్‌వీ థియేటర్ వెనుక వీధి, బీసీ బాలుర వసతి గృహం సమీపంలో మురుగు కాల్వలు తరుచూ పొంగి రహదారి అధ్వానంగా మారుతోంది. సమస్య తెలియజేస్తూ జూన్ 19వ తేదీన 'ఈనాడు'లో మేమున్నాం- మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కాలనీలో నూతన కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించారు.

'సంక్షేమం, అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం'

గొరుమానుకొండ, జి.తండా, బేతంచెర్ల, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం గొరుమానుకొండ, జి.తండా, బేతంచెర్ల పట్టణంలోని 5, 6 వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైకాపా నేతలు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, బాలకృష్ణ, అంజి, కృష్ణయ్య, రవీంద్రనాయక్, జాకీరుల్లా బేగ్, తిరుమలేష్ చౌదరి, ఉన్నం సుధాకర్ పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మెప్మా అధికారులు కృషి చేసి సంఘాల పురోగతిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ అతిథి గృహంలో మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, మెప్మా అధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బందికి, డ్వాక్రా ఆర్పీలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం 20 మంది ఆర్పీలకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో తెదేపా మాజీ ఎంపీటీసీ సభ్యులు బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, భీమేష్‌రెడ్డి, నాగమోహన్, కౌశిక్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పూజలందుకున్న ఉమామహేశ్వరుడు

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో వర్షం కారణంగా పల్లకి సేవ కార్యక్రమం సోమవారం రద్దు చేశారు. అయితే పల్లకిలో ఉత్సవ విగ్రహాలుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులున్నారు.

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి అనంతపురానికి చెందిన శివ, శైలజ దంపతులు రూ.25వేలు విరాళాన్ని ఆలయ అర్చకులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతలను అర్చకులు సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

డోన్, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని పాతపేట శివాలయంలో సోమవారం భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అలంకరణలో అమ్మవారు

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని రామలింగేశ్వరాలయంలో సోమవారం పార్వతీదేవిని భక్తులు శాకంబరిదేవిగా అలంకరించారు. స్థానిక ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని బందార్లపల్లె గ్రామంలో వర్షం కోసం నంది, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యం స్వాములకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్‌తో నైపుణ్యాల మెరుగు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఐటీఐ పాసైన అభ్యర్థులు అప్రెంటిషిప్‌తో నైపుణ్యాలను మెరుగు పరచుకోవచ్చని ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ ఎస్. ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం జాతీయ అప్రెంటిషిప్ మేళా కార్యక్రమాన్ని టీవో నాగకేశాలు అధ్యక్షతన నిర్వహించారు. అప్రెంటిషిప్ నైపుణ్యాలతో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. మేళాకు 31 మంది విద్యార్థులు హాజరుకాగా 10 మంది ఎంపికయ్యారు. నంద్యాల, కర్నూలు, డోన్ ప్రాంతాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాలల టీవోలు ధర్మాకర్, సూర్యశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వరప్రసాద్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కన్వీనర్ ఎస్.ప్రసాదరెడ్డి

సంక్షిప్త సమాచారం

రాజనగరం (శిరివెళ్ల), న్యూస్‌టుడే: రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థి సాయిఈశ్వర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం తిరుపతిరెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాయిఈశ్వర్‌ను సత్కరించారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: గొరుమానుకొండ మెట్టవద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగ సురేంద్రయాదవ్ కోరారు. సోమవారం గొరుమానుకొండకు వచ్చిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సుబ్బరాయుడు అతడి సోదరులు బనగానపల్లి మండలం కాపులపల్లె గ్రామంలో కొలువైన పీర్లకు రెండు వెండి గొడుగులు అందించారు. అనంతరం వీరు ఫాతెహాలు నిర్వహించారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు మండలంలో నుంచి పలు మండలాలకు బదిలీపై వెళ్లిన అధికారులను తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మహిళను కర్రతో కొట్టి గాయపరిచినందుకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణంలోని బసిరెడ్డిబావి వీధిలో హసీనా అనే ఆమెను ట్యాంకు నీళ్లు తమ ఇంటి ముందుకు వస్తున్నాయని మల్లీశ్వరి, కిశోర్, మల్లిక గొడవ పడి కర్రతో తలపై కొట్టి గాయపరచడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: రసాయనిక ఎరువుల ఉత్పత్తుల కంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ఉత్పత్తులే ఆరోగ్యకరమని తహసీల్దార్ భారతి తెలిపారు. రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. భీమేష్, రామాంజనేయులు, చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు పీ4 గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో నాగరాజు సోమవారం తెలిపారు. ఆదర్శ కుటుంబాలుగా ఎంపికైన వారిని బంగారు కుటుంబాలు దత్తత తీసుకునే కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

దుకాణంలో సరకు వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ కమిషనర్ నియమించిన రాష్ట్రస్థాయి బృందం సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా సీతారామ, సత్యం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేకపోవడంతో రూ.5,38,000 విలువ చేసే సరకులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్సు అధికారులు నాగభూషణ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రసాదరావులు మాట్లాడుతూ రైతులకు ఎరువులు, మందులు అధిక ధరలకు అమ్మితే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. బిల్లులు సక్రమంగా ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఏవో సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

సమ్మెలోకి వెళ్తే ప్రభుత్వానిదే బాధ్యత

డోన్, న్యూస్‌టుడే: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఈనెల 16వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారని, దీనివల్ల కలిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ జిల్లా నాయకులు శివరాం, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు భాస్కర్ఆచారి పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులంతా న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారని, 16 నుంచి పారిశుద్ధ్య కార్మికులు వెళ్తారన్నారు. ఈ మేరకు కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దఎల్లయ్య, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు

సమస్యలివే.. పరిష్కారం చూపరూ..

బనగానపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కైప గ్రామంలో ఈ నెల 11న వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల మధుప్రియ మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూలరాజు మాదిగ ఆధ్వర్యంలో చిన్నారి కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.80 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు.

బనగానపల్లిలో తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని పేరుసోములలో శ్మశానవాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మిద్దె వెంకటరాముడు కోరారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం తహసీల్దారు అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం కలెక్టరు వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలు శాఖల అధికారులు హాజరయ్యారు. అంతర్జాల సౌకర్యం లేకపోవడంతో వచ్చిన అధికారులు వారివారి చరవాణుల్లో వీడియోల ద్వారా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన పురిమేర దస్తగిరి, రవి, దూదేకుల దస్తగిరి, కుళ్లాయప్ప కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సువర్ణాదేవిని అభ్యర్థించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోకుల లక్ష్మి అధ్యక్షతన సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

పండ్ల మొక్కల పెంపకంతో లాభాలు

సంజామల, న్యూస్‌టుడే: రైతులు పండ్ల మొక్కల పెంపకంతో లాభాలు గడించవచ్చని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ సాంబశివరావు అన్నారు. మండలంలోని ఆల్వకొండ, రెడ్డిపల్లె, పేరుసోముల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల తీరును పరిశీలించటంతో పాటు పండ్ల తోటలను, మొక్కల పెంపక కేంద్రాలను ఏపీడీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలను నిబంధనల మేరకు పని దినాలు కల్పించటంతో పాటు నిర్ణీత దినసరి కూలీ వర్తించేలా క్షేత్రసహాయకులు చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయండి

విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ సూచించారు. యర్రగుంట్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వేమారెడ్డి, నరసింహులు, దత్తన్న, సరోజినీదేవి, పూర్వ విద్యార్థులు నాగేశ్వరరెడ్డి, శ్రీహరిరెడ్డి, మహేశ్వరరెడ్డి, పుల్లయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఫోర్ వీలర్ ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ కోరారు. కోవెలకుంట్లలోని గ్రామపంచాయతీ పార్కులో ఫోర్ వీలర్ ఆటో కార్మికులకు సీఐటీయూ యూనియన్ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రఘు, రాజు, మద్దిలేటి, భూషణం, నడిపెన్న, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడి వంట.. చేయాలంటే తంట!

ప్యాపిలి, డోన్ పట్టణం, బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఇందు కోసం రూ.కోట్లు వెచ్చించి వంట గదులను నిర్మించింది. డోన్ నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలకు వంటగదులు లేక.. మరి కొన్ని చోట్ల ఉన్నా.. అవి ఎందుకూ పనికిరాక వృథాగా ఉండిపోయాయి. కేవలం వంట చెరకు, నిత్యావసర సరకులను నిల్వ చేసుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. వంట గదులు లేని బడుల్లో చెట్లు, షెడ్ల కింద వంట తయారు చేసి పిల్లలకు వడ్డిస్తున్నారు.

చెట్లు, షెడ్ల కింద చేస్తూ..

డోన్ నియోజకవర్గంలో పాఠశాలలు మొత్తం 198 ఉండగా.. 23,977 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వంటగదులు 182 ఉన్నాయి. కొన్ని చోట్ల వంట గదులు లేక ఇళ్ల వద్ద ఏజెన్సీ నిర్వాహకులు వంటలను తయారు చేసుకుని పాఠశాలల్లో వడ్డిస్తున్నారు. అధికార లెక్కల ప్రకారం 16 చోట్ల గదుల్లేవు. పాఠశాలల్లో వంటగదులు అధ్వానంగా ఉండటంతో ఇటు ఏజెన్సీ నిర్వాహకులు, అటు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. చెట్లు, షెడ్ల కింద వంట చేస్తుండటంతో వ్యర్థాలు, దుమ్మూధూళి పడే ప్రమాదం ఉంది.

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	వంట గదులు ఉన్నవి	లేనివి
ప్యాపిలి	64	6150	59	05
డోన్	78	10,685	75	03
బేతంచెర్ల	56	7,142	48	08

బేతంచెర్ల ఆదర్శ పాఠశాలలో ఆరుబయటే వంట చేస్తున్న నిర్వాహకులు

సమస్యలున్న పాఠశాలలు ఇవే..

★ ఎన్.రంగాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వంట గది లేదు. దీంతో వంట నిర్వాహకులు ఇంటి వద్ద నుంచి చేసుకొని పాఠశాలకు తీసుకొని వస్తున్నారు. ఇక్కడ 45మంది విద్యార్థులు ఉన్నారు.

★ ఏనుగుమర్రి, చిన్నపూదెళ్ల ఉన్నత పాఠశాలల్లో వంట షెడ్లు ఉన్నా చిన్నగా ఉండటంతో చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి. ఏనుగుమర్రిలో 350 మంది, చిన్నపూదెళ్ల పాఠశాలలో 110 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

★ తిరునాంపల్లి, ఆవులదొడ్డి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులను నిర్మించలేదు. ఫలితంగా ఏజెన్సీ నిర్వాహకులు ఇళ్ల వద్దే వంటలను తయారు చేస్తున్నారు. చాలా పాఠశాలల్లో వంట గదులు ఉన్నప్పటికీ వాటిల్లో వంటలను తయారు చేసేందుకు ఉపయోగపడటం లేదు.

★ బేతంచెర్ల ఏపీ ఆదర్శ పాఠశాలలో 750 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వంటగది లేకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయటే వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హనుమాన్ నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 412 మంది విద్యార్థులు చదువుతున్నా.. వంటగది లేక ఏజెన్సీ మహిళలు అవస్థలు పడుతున్నారు.

(c) eenadu

యంత్రాంగం అప్రమత్తం

అత్యవసర శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన అల్పపీడనం కొద్ది గంటల్లోనే వాయుగుండంగా మారినట్లు వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అధికారులు విపత్తుల నివారణ శాఖకు తెలియజేశారు. మంగళవారం పశ్చిమ ఒడిశా, ఉత్తరకోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. మహానది, వైతరణి, బ్రాహ్మణి, సువర్ణరేఖ, బుడాబొలంగ నదుల పరివాహక ప్రాంతాలకు వరద ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో రెవెన్యూ, విపత్తు నివారణ శాఖల మంత్రి సురేష్‌పూజారి అత్యవసర శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) దేవ్ రంజన్‌కుమార్ సింగ్ తదితరులతో సమీక్షించారు. ఆయా జిల్లాల పాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2x47 కంట్రోల్‌రూంలు ప్రారంభించాలని, వరదలు వస్తే లోతట్టు ప్రాంతాల ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఆయాచోట్ల ఆహార పదార్థాలు, మంచినీరు, మందులు తదితరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్న మంత్రి ఓడ్రాఫ్, అగ్నిమాపక సిబ్బందినీ అప్రమత్తం చేశారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

పశ్చిమ, కోస్తా జిల్లాలకు ఐఎండీ భారీ వర్ష సూచన

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో దక్షిణ, తూర్పు దిశలో పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ సరిహద్దులో సోమవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం కొన్ని గంటల్లో వాయుగుండంగా మారినట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పరదీప్, ధమ్రా ఓడరేవుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని, తదుపరి ఆదేశాల వరకు మత్స్యకారులు సముద్రంపైకి వేటకు వెళ్లరాదని హెచ్చరించామన్నారు. గడిచిన 24 గంటల్లో పశ్చిమ ఒడిశా ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని, మంగళవారం (15న) పశ్చిమంలో అతి భారీ వానలకు అవకాశం ఉందన్నారు. 15న మయూర్‌భంజ్, కేందుఝర్, సుందర్‌గఢ్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనాతో 'రెడ్' హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఢెంకనాల్, దేవ్‌గఢ్ జిల్లాలకు 'ఆరెంజ్', సంబల్‌పూర్, ఝార్సుగుడ, సోన్‌పూర్, బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపడ, నయాగఢ్, కటక్, ఖుర్దా, పూరీ, జగత్సింగ్‌పూర్, కలహండి, కొంధమాల్, కొరాపుట్ జిల్లాలకు 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు. గడిచిన 24 గంటల్లో సుందరగఢ్‌లో అత్యధిక వర్షపాతం 22 సెంటీమీటర్లు నమోదు కాగా, కేంద్రపడలో 14, భద్రక్‌లో 12, జాజ్‌పూర్‌లో 9, ఢెంకనాల్‌లో 9, ఇతర కేంద్రాల్లో 5 నుంచి 7 సెం.మీ. నమోదైనట్లు మూర్తి చెప్పారు.

ఉక్కు నగరంలో వరదలు

రవుర్కెలాలోని రైల్వేకాలనీ ప్రాంతంలో..

సెక్టార్-6 ప్రాంతంలో నిలిచిన వరద నీరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం సుందర్‌గఢ్ జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. ఈ జిల్లాలోని రవుర్కెలా ఉక్కు నగరంలోకి వరద నీరు ప్రవేశించింది. రైల్వేస్టేషన్, సెక్టార్ 4, 6, 8 ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. అత్యవసరమైనా బయటకు వెళ్లలేక అవస్థలు పడ్డారు. నగరపాలక యంత్రాంగం వివిధచోట్ల పంపుసెట్లు పెట్టి నీరు తోడించింది.

రాయ్‌రంగపూర్ జలమయం

18వ వార్డులో ఇలా..

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మయూర్‌భంజ్ జిల్లా రాయ్‌రంగపూర్ పట్టణంలో సోమవారం భారీ వర్షాలు కురవడంతో అన్ని వార్డుల్లో నీరు నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపాలిటీ యంత్రాంగం పంపుసెట్ల ద్వారా నీటిని తోడించింది.

ప్రేమ జంటకు వింత శిక్ష

ప్రేమికులను నాగలికి కట్టి ఊరేగిస్తున్న గ్రామస్థులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రేమ వివాహం చేసుకున్నందుకు నాగలికి ఎద్దుల్లా కట్టి, ఆచారం పేరుతో శిక్షించిన ఘటన కొరాపుట్ జిల్లా నారాయణ పట్నం సమితి పెద్దఇటికి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రాయగడ జిల్లాలో ఇలాంటి సంఘటన మరువక ముందే ఇప్పుడు ఇక్కడ జరగడం సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దఇటికి గ్రామానికి చెందిన ఒకే వంశానికి చెందిన యువతి యువకులు (వరసకు అన్నాచెల్లెలు) ప్రేమించుకొని ఇటీవల కిందట గ్రామాన్ని విడిచి వెళ్లిపోయారు. ఇద్దరూ పెళ్లి చేసుకుని జీవిస్తుండగా, కుటుంబ సభ్యులు గ్రామంలో అందరి సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని పిలిపించారు. పెళ్లికి గ్రామ పెద్దలు అంగీకరించలేదు. ఒకే వంశంలో వివాహం చేయడం తగదని అభ్యంతరం చెప్పి గ్రామ శిక్షకు కట్టుబడి ఉండాలని ఇద్దరికీ ఆదివారం సాయంత్రం నాగలికి ఎద్దుల్లా కట్టి పొలంపించి గ్రామమంతా ఊరేగించారు. అనంతరం శుద్ధి చేయించారు. దీనిపై నారాయణ పట్టణం ఠాణా అధికారి ప్రమోద్ కుమార్ నాయక్ వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం లేదని, అయినా గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేస్తామన్నారు.

రాజకీయం తగదు

- విద్యార్థి ఆత్మహత్యాయత్నం ఘటనపై విపక్షాలకు ధర్మేంద్ర హితవు

బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ధర్మేంద్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పవిత్రమైన గురు, శిష్య సంబంధాలు పతనమయ్యాయని, బాలేశ్వర్‌లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటన ఈ విషయాన్ని రుజువు చేస్తోందని, ఈ ఘటన ఆవేదనకు గురి చేసిందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సోమవారం భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం ధర్మేంద్ర విలేకర్లతో మాట్లాడుతూ బాధితురాలికి దిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రి తరహాలో ఇక్కడ చికిత్స అందుతోందని, భువనేశ్వర్ వైద్యులు హస్తినలోని నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ చికిత్సలు అందిస్తున్నారన్నారు. బాధితురాలు కోలుకోవాలని జగన్నాథునికి ప్రార్థిస్తున్నామన్నారు. దీనిపై విపక్షాలు రాజకీయాలు చేయడం తగదన్నారు.

నిర్లక్ష్యం చేశారు

దిల్లీలో కేంద్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలకా లంబా విలేకర్లతో మాట్లాడుతూ బాధితురాలి మొరను ఎవరూ వినలేదన్నారు. తనను అధ్యాపకుడు లైంగికంగా వేధిస్తున్నాడని విద్యాశాఖ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, పాలనాధికారి, ఎస్పీ, ప్రిన్సిపల్‌లకు లిఖత పూర్వకంగా ఆ విద్యార్థిని తెలిపినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ ఘటనకు పూర్తి జవాబుదారీ రాష్ట్ర ప్రభుత్వమని, ఒడిశాలో మహిళలకు రక్షణ లేదని, శాంతిభద్రతలు క్షీణించిపోయాయన్నారు. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల వద్ద రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. రాస్తారోకో చేశాయి.

బాలేశ్వర్‌లో కాంగ్రెస్ ఆందోళన

సీఎస్ అత్యవసర సమావేశం

దీనిపై భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహూజా ఉన్నత విద్య, మహిళా-శిశు సంక్షేమం, హోంశాఖ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

కళాశాల ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న వివిధ సంఘాలు

దిగజారుడు రాజకీయాలు తగవు

ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ విపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, బాధితురాలికి మెరుగైన చికిత్సలు అందిస్తూ మరోవైపు దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ సమయంలో రాజకీయ వ్యాఖ్యలు తగవన్నారు.

విషమంగానే విద్యార్థిని ఆరోగ్యం

48 గంటల వరకు ఏమీ చెప్పలేమన్న వైద్యులు

బాధితురాలి తండ్రితో మాట్లాడుతున్న భక్తచరణ్, ఇతర నాయకులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ఇంకో 48 గంటల వరకు ఏమీ చెప్పలేమని ఎయిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥దిలీప్ పరిడ సోమవారం విలేకర్లకు చెప్పారు. బాధితురాలికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ నేతల పరామర్శలు

రాజకీయ పార్టీల నేతలు ఆసుపత్రికి వస్తున్నారు. బాధితురాలి తల్లిదండ్రుల్ని పరామర్శిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన జరిగిందని, తనను అధ్యాపకుడు లైంగికంగా వేధిస్తున్నాడని బాధితురాలు అందరికీ విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. మరోవైపు బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల ఎదుట బిజద నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. విద్యార్థినికి న్యాయం చేయలేకపోయిన ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్‌లు నైతిక బాధ్యత వహించి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న దర్యాప్తు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనకు సంబంధించి ఉన్నత విద్యాశాఖ సంచాలకుడు కాళీప్రసాద్ నాయక్, సహాయ కార్యదర్శి మౌసుమినాయక్, భువనేశ్వర్ బీజేబీ కళాశాల ప్రిన్సిపల్ ఝుంకి రథ్‌లను దర్యాప్తు కమిటీగా నియమించింది. ఈ ముగ్గురు సోమవారం కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మరోవైపు క్రైంబ్రాంచ్ అధికారులూ దర్యాప్తు చేస్తున్నారు.

సస్పెండైన ప్రిన్సిపల్ అరెస్టు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనలో సస్పెండైన బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య దిలీప్‌ఘోష్‌ను సోమవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. దిలీప్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ మేరకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఇంతకు ముందు విద్యార్థినికి లైంగికంగా వేధించిన అధ్యాపకుడు సమీర్‌సాహును పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

ఎఫ్.ఎం. కళాశాల వద్ద బిజద మహిళా విభాగం నేతల ఆందోళన

విద్యాశాఖ మంత్రితో మాట్లాడిన గవర్నరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ ఎఫ్.ఎం. కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై గవర్నరు కంభంపాటి హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని జగన్నాథునికి ప్రార్థిస్తున్నట్లు సోమవారం వార్తాపత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్‌తో మాట్లాడానని, మెరుగైన చికిత్స అందించాలని ఎయిమ్స్ సంచాలకున్ని ఆదేశించానని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు గవర్నరు తెలిపారు.

కౌన్సిలర్ గోపాలకృష్ణ ఆత్మహత్య

బడే గోపాలకృష్ణ (పాతచిత్రం)

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ ఎన్ఏసీ 3వ వార్డు కౌన్సిలర్, మత్స్యకార సంఘం నాయకుడు బడే గోపాలకృష్ణ (50) సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. బజారువీధిలో గల మార్కెట్ కాంప్లెక్సులోని తన వలల దుకాణంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. గోపాల్‌పూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో పట్టణంలో శోకఛాయలు అలముకున్నాయి.

అనాథ చిన్నారుల గుర్తింపునకు సర్కారు చొరవ

- రాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టిన ఇంటింటి సర్వేలు

ఓ ఇంటి వద్ద వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చిన్నారుల హక్కులు, సంక్షేమానికి రక్షణ కల్పించేందుకు సర్కారు చొరవ చూపుతోంది. ఇందుకోసం సర్వే చేపడుతోంది. తల్లిదండ్రులు లేని, ఇద్దరిలో ఒకరిని (సింగిల్ పేరెంట్) కోల్పోయిన అనాథ చిన్నారులను గుర్తించే ప్రక్రియ మొదలుపెట్టింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా సర్వే ప్రారంభించింది. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా నిర్వహిస్తున్న ఈ సర్వేలో చిన్నారులను గుర్తించే అంశంపై దృష్టిసారిస్తోంది. 40 శాతానికిపైగా అంగవైకల్యంతో జీవనోపాధికి పోరాడుతున్న దివ్యాంగ తల్లిదండ్రులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల సంరక్షణలో పెరుగుతున్న చిన్నారుల వివరాలను నమోదు చేస్తున్నారు. జూన్ 1, 2025న పుట్టినవారిని, అంతకు ముందు జన్మించిన 18 ఏళ్లలోపు బాలబాలికలను ఇందులో చేర్చుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 21 వరకు సర్వేలు కొనసాగనున్నట్లు సర్కారు పేర్కొంది.

'అమారిశిశు'లో అప్‌లోడ్

అన్ని జిల్లాల్లో అనాథ చిన్నారుల సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. దీనికి జిల్లాస్థాయిలో మాస్టర్ శిక్షకులకు, వారి ద్వారా క్షేత్రస్థాయి శిక్షకులు, అంగన్‌వాడీలకు సర్వే విధి విధానాలపై అవగాహన కల్పించినట్లు మహిళా శిశు, సంక్షేమశాఖ వెల్లడించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు సేకరించిన డేటాను సూపర్‌వైజర్లు పరిశీలించాక, జిల్లా చిన్నారుల సంరక్షణ కేంద్రానికి సమర్పించనున్నారు. అనంతరం ప్రతి చిన్నారి వివరాలను 'అమారిశిశు' (మా చిన్నారులు) అనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఆ శాఖ స్పష్టం చేసింది. ఒడిశా చిన్నారుల రక్షణ సొసైటీ ఈ డేటాను విశ్లేషించి సమగ్ర నివేదిక రూపొందించనున్నట్లు మహిళా, శిశు సంక్షేమశాఖ పేర్కొంది.

కంజమజోడిలో అధికారుల విచారణ

గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ జెనా, ఇతర అధికారులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రేమజంట మెడకి నాగలి కట్టి పొలం దున్నించిన ఘటనపై జిల్లా పాలనాధికారి ఫరుల్ పట్వారి ఆదేశాలతో సోమవారం సబ్ కలెక్టర్ రమేష్ జెనా నేతృత్వంలో అధికారుల బృందం కంచమజోడి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. వీరితో కల్యాణసింగుపూర్ ఏబీడీవో, తహసీల్దార్, సీడీపీవో, సమితి సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. కట్టుబాట్ల పేరుతో ఇలాంటి పనులు చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు గ్రామస్థులకు తెలిపారు. ప్రేమికులిద్దరిని గ్రామ కట్టుబాట్ల ప్రకారమే ఇలా చేశామని ఊరి ప్రజలు తమ చర్యలను వారి ఎదుట సమర్థించున్నారు. విచారణ సమయంలో బాధిత ప్రేమ జంట లకో సరక, కలియ సరకలు అక్కడే ఉన్నారు. అధికారుల గ్రామానికి వస్తున్న విషయం తెలుసుకొని ఈ కేసుతో సంబంధం ఉన్న వారు పరారైనట్లు పోలీసులు తెలిపారు. చట్ట ప్రకారం నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మునిగుడలో కేంద్ర బృందం పర్యటన

కార్యాలయంలోకి వెళుతున్న కేంద్ర బృందం సభ్యులు

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా మునిగుడ సమితిలో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. కుముదబలి పంచాయతీకి చేరుకున్న అధికార బృందం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించారు. వీటిలో భాగంగా ఉపాధి హామీ, పీఎంఏవై, పీఎంజీఎస్‌వై, డీడీయూ-జీకేవై తదితర అంశాలపై పనుల పురోగతి గురించి ఆరా తీశారు. బృందంలో ఏఎఫ్‌సీ ప్రాజెక్టు అధికారి, ప్రాజెక్టు అసిస్టెంట్ ప్రసన్నపాడి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కోడలిపై పెట్రోలు పోసి నిప్పుపెట్టిన అత్తింటివారు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కోడలిపై అత్తింటివారు పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటన గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని కన్హెయిపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఆమె కేకలు విని వచ్చిన గ్రామస్థులు ఆరతి పరిడాను కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. కన్హెయిపూర్ గ్రామానికి చెందిన ఆకాశ్ పరిడా రెండేళ్ల కిందట ఆరతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన కొన్ని నెలల తర్వాత ఆయన ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఆ తర్వాత నుంచి వరకట్నం కోసం ఆరతిని అత్తింటివాళ్లు వేధిస్తూ వచ్చారని బాధితురాలి తండ్రి విలేకరులకు చెప్పారు. ఆదివారం రాత్రి ఆకాశ్ తల్లి కోడలితో ఘర్షణకు దిగిందని, ఈ క్రమంలో సోమవారం వేకువన తమ కుమార్తెపై అత్తింటివారు పెట్రోల్ పోసి నిప్పంటించి హత మార్చేందుకు ప్రయత్నించారని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

బ్రహ్మపురలో 'బైక్ పెట్రోలింగ్' ప్రారంభం

గస్తీ వాహనాలకు జెండా ఊపుతున్న నితీ శేఖర్. పక్కన శరవణ వివేక్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లా ఆధ్వర్యంలో 'బైక్ పెట్రోలింగ్'కు సోమవారం శుభారంభం జరిగింది. మధ్యాహ్నం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దక్షిణ మండల పోలీసు ఐజీ నితీ శేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గస్తీ వాహనాలకు జెండా ఊపారు. కార్యక్రమంలో బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు. మొత్తం 15 గస్తీ వాహనాలకు ప్రత్యేకంగా సైరన్, బ్లింకర్స్, మెగా ఫోన్స్ అమర్చి ఉన్నాయని ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ ఠాణా పరిధిలో అయిదు బైక్‌లు, టౌన్, గుసానినువాగాం, బి.ఎన్.పూర్, పెద్దబజారు, నిమ్మఖండి ఠాణాల పరిధుల్లో రెండేసి చొప్పున బైక్‌లు సేవలు అందిస్తాయన్నారు. ముఖ్యంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రహదారి పక్కన వాహనాల నిలిపివేత తదితరాలపై ప్రత్యేకంగా దృష్టిపెడతాయని చెప్పారు. ఆయా ఠాణాల పరిధిలో మారుమూల వీధుల్లో ఈ బైక్‌ల ద్వారా గస్తీ నిర్వహిస్తారని వివరించారు. రోడ్డు దుర్ఘటనలు, ఇతర అత్యవసర సమయాల్లోనూ ఈ గస్తీ వాహనాలు సేవలందిస్తాయని ఎస్పీ శరవణ వివేక్ తెలిపారు. ప్రజలంతా సహకరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

వైద్యం వృత్తి కాదు..వ్రతం

- భువనేశ్వర్ ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము

ప్రసంగిస్తున్న ద్రౌపదీముర్ము

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వైద్యం వృత్తి కాదని, ఇది వ్రతమని, వైద్యులు నారాయణులతో సమానమని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పేర్కొన్నారు. సోమవారం రాత్రి భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల 5వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేవుళ్లను ఎవరూ చూడలేదని, ఆయా చిత్రాలకు, విగ్రహాలకు మాత్రమే పూజలు చేస్తున్నారని, వైద్యులను మాత్రం దేవుళ్ల ప్రతినిధులుగా ప్రజలు ఆరాధిస్తున్నారని తెలిపారు. తన బాల్యం గురించి చెప్పిన ఆమె గ్రామాల్లో ప్రజలు వైద్యులను దేవుళ్లుగా పూజించిన తీరు స్వయంగా చూశానన్నారు. వైద్యో నారాయణో హరి అన్నది దీనికి నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విధులు నిర్వహిస్తారని, వైద్యులు మాత్రం అర్ధరాత్రి ఫోన్ చేసినా రోగుల సేవలకు హాజరవుతారని, అందుకే తాను వైద్యాన్ని వ్రతంగా చెబుతుంటానని వివరించారు. వ్రతం చేస్తున్న మీరంతా శ్రీమన్నారాయణుని ప్రతిరూపాలని పేర్కొన్నారు. ప్రజలు ఎక్కువగా గౌరవించేది వైద్యులకేనని, రోగుల ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వారి సమీప బంధువులు, రక్తసంబంధీకులు తెలిపే కృతజ్ఞతలు అసలైన పతకాలని చెప్పారు. ఇప్పుడు స్నాతకోత్సవంలో తాను ఇస్తున్న పసిడి పతకాలు, డిగ్రీలను వైద్యులు అల్మారాల్లో దాచుకుంటారని, ప్రజలు ఇస్తున్న ఆశీస్సులు వారికి సదా వెన్నంటి ఉండే పతకాలని చెప్పారు. ఇక్కడ డిగ్రీలు పొందిన వారు తమ రాష్ట్రానికి వెళ్లిపోకుండా ఒడిశాలో సేవలు చేస్తే తాను సంతృప్తి పొందుతానన్నారు. దివంగత మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయీ భువనేశ్వర్ ఎయిమ్స్ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారని, ఆ వేడుకలో నాటి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో కలిసి తాను పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. ఏడాది కాలంలో భువనేశ్వర్ ఎయిమ్స్ ఆసుపత్రిలో 10 లక్షల మందికి చికిత్సలు, 17 లక్షల పరీక్షలు, 25 వేల శస్త్రచికిత్సలు జరిగాయని తెలిసి ఆనందం కలిగిందన్నారు. భువనేశ్వర్ ఎయిమ్స్‌కు డబ్ల్యూహెచ్‌వో ప్రముఖ ఆసుపత్రిగా గుర్తింపునిచ్చిందని పేర్కొన్నారు. ఇక్కడ ఇదివరకు సంచాలకునిగా విధులు నిర్వహించిన డా॥అశోక్‌కుమార్ మహాపాత్ర్‌కు తాను పద్మశ్రీ అవార్డుతో సత్కరించిన వైనం గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం పసిడి పతకాలు, వైద్య డిగ్రీలు అందుకున్న వారిలో అమ్మాయిలు ఎక్కువగా ఉన్నారని, ఇది నారీశక్తికి నిదర్శనమని ప్రశంసించారు. సమీప భవిష్యత్‌లో మీరంతా ఎన్నో సవాళ్లను ఎదుర్కోనున్నారని, తాను అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, జగన్నాథుని అనుగ్రహం అందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె 31 మందికి పసిడి పతకాలు, 643 మందికి డిగ్రీలు అందజేశారు. కార్యక్రమంలో గవర్నరు కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి, కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, రాజ్యసభ ఎంపీ మమతా మహంతో, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ, ఎయిమ్స్ ఆసుపత్రి అధ్యక్షుడు శైలేష్‌కుమార్, సంచాలకుడు ఆచార్య అశుతోష్ బిశ్వాల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం తరువాత రాష్ట్రపతి ఎయిమ్స్‌లో కాలిన గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న విద్యార్థినిని చూసి అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడారు.

వైద్య విద్యార్థులతో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, గవర్నర్ హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్రమంత్రి ధర్మేంద్ర, ఇతర నేతలు

(c) eenadu

పథకాలు అర్హులందరికీ చేరాలన్నదే లక్ష్యం

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో సోమవారం స్థానిక సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల సభా మందిరంలో ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజులు పలు ప్రణాళికలు అమలు తీరు ప్రణాళికలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిబిరాన్ని కేంద్ర మంత్రి శోభా కరండ్లజే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రితో పాటు రాష్ట్రమంత్రులు గోకులానంద మల్లిక్, మంత్రి నిత్యానంద గొండ్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న ప్రణాళికల ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని, ప్రణాళికలు అమలు తీరుపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ చర్యలు చేపట్టాలని అన్నారు.

శిబిరాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి శోభా కరండ్లజే, పక్కనే రాష్ట్ర మంత్రులు గోకులనంద మల్లిక్, నిత్యానంద గొండ్

నందపూర్ పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కృషి

సువాయి జైన్ మందిరం సందర్శించిన సింగ్, కీర్తి తదితరులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ పర్యాటక కేంద్రాలు అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక విభాగ కమిషనర్ బల్వంత్ సింగ్ అన్నారు. జిల్లాలో పర్యటనలో భాగంగా సోమవారం సింగ్ నందపూర్ సమితిలో సందర్శించారు. అక్కడ ఉన్న గోపబంధు ఐటీఐ కేంద్రాన్ని సందర్శించి దాన్ని పనితీరు పరిశీలించారు. నందపూర్‌లో ఉన్న పర్యాటక కేంద్రాలు, సమీపంలో ఉన్న కాఫీ తోటలను సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడారు. సింగ్ వెంట జిల్లా పాలనాధికారి కీర్తివాసన్, జిల్లా పరిషత్ నిర్వాహక అధికారి వేణుధర్ సబర్, జిల్లా పర్యాటక అధికారిణి తాలిమా ప్రధాన్, నందపూర్ సమితి అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ దొర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

యూనియన్ క్లబ్ అధ్యక్షునిగా సంతోష్ కుమార్ ఎన్నిక

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో టౌన్ హాలు రోడ్డులోని 'యూనియన్ క్లబ్' కొత్త కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. క్లబ్ 2025-27 సంవత్సరాలకు నూతన అధ్యక్షునిగా వి.సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా బిద్యుత్ భూషణ్ పట్నాయక్ (గంపు), కార్యదర్శిగా సంతోష్ కుమార్ పాడి (పార్థో), సంయుక్త కార్యదర్శిగా లావేటి శ్రీనివాసరావు, కోశాధికారిగా జితేంద్ర కుమార్ గౌడ ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు రాత్రి స్థానిక గాంధీనగర్‌లోని బ్రహ్మపుర ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయంలో బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు.

సంతోష్ కుమార్‌ను అభినందిస్తున్న అనిల్ కుమార్. చిత్రంలో ఎన్నికైన క్లబ్ ప్రతినిధులు

పోలీసుల చొరవతో తల్లి ఒడికి చేరిన బిడ్డ

తల్లి సంగీతా ప్రమాణిక్‌తో కూతురు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై గురాపల్లి టోల్ గేట్ వద్ద గుర్తు తెలియని యువకుడు వదిలేసిన రెండేళ్ల బాలిక తల్లి సంగీతా ప్రమాణిక్ ఒడికి చేరుకుంది. ఖుర్దా జిల్లా బల్లుగావ్‌కు చెందిన సంగీతాకు చిన్నారిని ఆదివారం అప్పగించినట్లు కళ్లికోట ఠాణా అధికారి రమేష్ కుమార్ ప్రధాన్ రాత్రి విలేకరులకు చెప్పారు. బల్లుగావ్ రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంపై శనివారం రాత్రి సంగీతా తన రెండేళ్ల కుమార్తెను కూర్చోబెట్టి ఆహారం తెచ్చేందుకు వెళ్లింది. ఆ సమయంలో బాలికను గుర్తు తెలియని యువకుడు అపహరించాడు. దీంతో సంగీతా జీఆర్పీ ఠాణాలో ఫిర్యాదు చేసింది. మరోవైపు ఆదివారం వేకువన బాలికను యువకుడు గురాపల్లి టోల్ గేట్ వద్ద వదిలి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలతో బల్లుగావ్ జీఆర్పీ అధికారులు కళ్లికోట ఠాణా పోలీసులను సంప్రదించారు. వారు కాపాడిన బాలిక చిత్రాల్ని జీఆర్పీ అధికారులకు పంపించారు. తల్లి సంగీతా కుమార్తెను గుర్తించగా, కళ్లికోట ఠాణాలో బాలికను ఆమెకు అప్పగించామని ఠాణా ఐఐసీ ప్రధాన్ పేర్కొన్నారు. బాలికను అపహరించిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రాయగడలో నది ఒడ్డున పూజల్లో దీక్షాదారులు

గుణుపురం: వంశధార నది తీరంలో భక్తులు

సిమిలిగుడలో భక్తులు

గజపతి జిల్లాలో పూజలు

మార్మోగిన హరహర మహాదేవ్ నామస్మరణ

గుప్తేశ్వరుని శివలింగ దర్శనం

శ్రావణమాసం ప్రారంభం కావడంతో సోమవారం బోల్‌భం భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనేక మంది భక్తులు కాలినడకగా పవిత్ర పుణ్యక్షేత్రమైన గుప్తేశ్వరానికి బయలుదేరి వెళ్లారు. హరహర మహాదేవ్ నామస్మరణ చేస్తూ మహాదేవుడికి అభిషేకించి దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, మందులు, ఆహార పదార్థాలు అందజేశాయి. – న్యూస్‌టుడే బృందం

కొరాపుట్: పవిత్ర జలాన్ని సేకరిస్తున్న భక్తులు

జాతీయ రగ్బీలో ఒడిశాకు రజతం

ట్రోఫీ, రజత పతకంతో క్రీడాకారులు. చిత్రంలో కోచ్, మేనేజరు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: డెహ్రాడూన్‌లోని గంగా అథ్లెటిక్స్ మైదానంలో జరిగిన పదో జాతీయ జూనియర్ రగ్బీ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచారు. రాష్ట్ర క్రీడాశాఖ ఆ వివరాలను సోమవారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. పోటీల్లో ఆదివారం నిర్వహించిన బాలుర తుదిపోరులో రాష్ట్ర జట్టు క్రీడాకారులు బిహార్‌తో ఆడి ఓటమి పాలయ్యారు. జట్టుతో కోచ్, మేనేజరుగా ధిరేన్‌కుమార్ రౌత్, మున్నామూర్ములు వెళ్లారు. రజత పతకం కైవసం చేసుకున్న జట్టు బాలలను క్రీడా శాఖ అభినందించింది.

సహనీకప్ ఫుట్‌బాల్ పోటీల నిర్వహణపై సమావేశం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా శాఖ సౌజన్యంతో ఒడిశా ఫుట్‌బాల్ సంఘం తరపున ఈ నెల 16వ తేదీ నుంచి వివిధ జోన్లలో జరగనున్న 64వ సహనీ కప్-2025 పోటీల నిర్వాహక సమావేశం ఆదివారం జరిగింది. సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాసంఘాల కార్యదర్శులు, సంఘం ప్రతినిధులు, రిఫరీలకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. నాలుగు జోన్లలో జరగనున్న పోటీల మ్యాచులను ఎలా నిర్వహించాలి తదితరాలపై శిక్షణ కల్పించారు.

సన్నాహక సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు, అఫీషియల్స్

బ్రహ్మపురలో మొదటిసారి పోటీలు

రాష్ట్ర క్రీడాశాఖ, ఒడిశా ఫుట్‌బాల్ సంఘం సహకారంతో గంజాం జిల్లా అథ్లెటిక్ సంఘం (జీడీఏఏ) తరపున బ్రహ్మపురలో మొదటిసారి సహనీకప్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జీడీఏఏ ప్రధాన కార్యదర్శి జె.కామేశ్వర రావు చెప్పారు. స్థానిక మహాత్మాగాంధీ క్రీడామైదానంలోని క్రీడల వసతిగృహం ఇండోర్‌హాల్లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం జరిగింది. ఇందులో కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగుజోన్లు బ్రహ్మపుర, కేంద్రపడ, బౌద్ధ్, కేందుఝర్‌లలో నిర్వహిస్తున్న 64వ సహనీకప్ పోటీల్లో మొత్తం 33 జట్లు తలపడతాయని ఆయన చెప్పారు. బ్రహ్మపుర జోన్‌లో మ్యాచులు జరుగుతాయని, మొదటి సెమీఫైనల్ బ్రహ్మపురలోని మహాత్మాగాంధీ క్రీడామైదానంలో నిర్వహిస్తామని కామేశ్వరరావు తెలిపారు. 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇక్కడ రోజుకు రెండేసి మ్యాచులు చొప్పున నిర్వహిస్తామని, 23న మొదటిసెమీఫైనల్ జరుగుతుందని కామేశ్వరరావు పేర్కొన్నారు. సమావేశంలో జీడీఏఏ ప్రతినిధులు తరణిసామంత్రాయ్, మన్మథ్‌బాబు, అప్పారావు, మ్యాచుల కమిషనర్ సుజిత్‌పాత్ర్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు. చిత్రంలో మన్మథ్‌బాబు, సుజిత్, అప్పారావు తదితరులు

శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని కెవిటి వీధిలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. దివ్య తిరు నక్షత్రం క్రమంలో, సందర్భంగా రాత్రివేళలో సహస్రదీపాలంకరణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మందిర నిర్మాణానికి రూ.1.5 లక్షల విరాళం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని రాజా వీధిలో జగన్నాథ మందిర నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం పట్టణానికి చెందిన పద్మిని పట్నాయక్ రూ. 1.5 లక్షల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. మందిర నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని దాత పేర్కొన్నారు.

కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాత

జగన్నాథుని దర్శించుకున్న నూతన డీఐజీ

కువార్ విశాల్‌సింగ్‌కు స్వాగతం పలికిన మందిర ట్రస్టీ బాబాని శంకర్

కొరాపుట్, న్యూస్‌టుడే: దక్షిణ పశ్చిమ ప్రాంతాల నూతన డీఐజీగా నియమితులైన డా.కువార్ విశాల్‌సింగ్ కొరాపుట్ శ్రీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని దర్శించుకున్నారు. అతనికి మందిర కమిటీ అధ్యక్షుడు బాబాని శంకర్ స్వాగతం పలికారు.

మెగా మంచినీటి ప్రాజెక్ట్ ట్యాంక్ నిర్మాణానికి వ్యతిరేకత

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి బల్లాలో ఉన్న నాగేశ్వర్ పర్వతం సమీపంలో మెగా మంచినీటి ప్రాజెక్ట్ ట్యాంక్ నిర్మాణాన్ని స్థానికులు వ్యతిరేకించారు. సోమవారం నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో నాగేశ్వర్ సురక్ష సమితి ఆధ్వర్యంలో వ్యతిరేకత కనిపించింది. బల్లాలో ఉన్న నాగేశ్వర్ పర్వతాన్ని బాక్సైట్ తవ్వకాల లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆక్షేపిస్తూ వచ్చిన కాంట్రాక్టర్ అధికారులను ముట్టడించారు. పాడువా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని విడిపించి తీసుకువెళ్లారు. ఇక్కడ పనులు జరగనివ్వమని ఆందోళనకారులు తేల్చి చెప్పారు.

వాహనాన్ని అడ్డగించిన ప్రతినిధులు, ప్రజలు

వంట కార్మికులపై చిన్నచూపు తగదు

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వండి, వడ్డిస్తున్న తమపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని అఖిల ఒడిశా వంట కార్మికుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం సంఘం సభ్యులు ర్యాలీ నిర్వహించి కనీస వేతన చట్టం కింద వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నియామక పత్రాలు, గ్రూపు కార్డులు అందజేయాలని వినతిపత్రాన్ని బీఈవో గణేష్ సబరకు అందజేశారు.

గణేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వంట కార్మికులు

అమరవీరులకు కేంద్రమంత్రి శ్రద్ధాంజలి

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం ఖుర్దా ఐటీబీపీ ఆవరణలోని అమరవీరుల స్థూపాలను సందర్శించారు. స్వాతంత్ర్య సమరంలో, ఇండో-పాక్ యుద్ధాల్లో అమరులైన వారికి నివాళులర్పించారు. –న్యూస్‌టుడే, భువనేశ్వర్

కూలిన వృక్షం... రాకపోకలకు అంతరాయం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో భారీ వృక్షం రహదారికి అడ్డంగా కూలడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక డీపీసీ కార్యాలయ కూడలి సమీపంలో రింగు రోడ్డుపై ఆదివారం రాత్రి భారీ చెట్టు నేలకూలింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోగా, చెట్టు కింద ఉంచిన కారు ధ్వంసమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

సమీక్ష నిర్వహించిన జిల్లా నోడల్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాలో పర్యటించిన జిల్లా నోడల్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ స్థానిక సద్భావన సభా గృహంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పాలనాధికారి కీర్తివాసన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. నోడల్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ఆరోగ్యం, పర్యాటకరంగ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

బిజద ఆరోపణలు నిజం కావు: భాజపా

నవరంగపూర్, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి బాట పడుతుండటంతో ఓడిపోయిన బిజద పార్టీ నేతలు సహించుకోలేక ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని నవరంగపూర్ జిల్లా భాజపా అధ్యక్షుడు కుంజబిహారిదాస్ సోమవారం సర్క్యూట్ హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. ఇటీవల బిజద నేతలు ప్రదీప్‌మాఝి, మనోహర్ రంధారి నందహండి సమితిలో భాజపా నేతలు రూ.13 కోట్లకు అవినీతి చేశారని ఆరోపించారు. మరోవైపు అదే పార్టీకి చెందిన మరో గ్రూపు నేతలు అటువంటిది ఏమీ జరగలేదని పాలనాధికారికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. 21 స్థానాల్లో కేవలం 4 చెరువులు మాత్రమే తవ్వారని అన్నారు. 30 చెరువులు తవ్వించామని, చెరువుల వద్ద లబ్ధిదారులతో ఉన్న ఫొటోలను చూపించారు.

చెరువులకు సంబంధించిన ఫొటోలను చూపిస్తున్న నేతలు

గిరిజన సంస్కృతిపై పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు, రచయితలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం ఎస్ఆర్ మాల్‌లో గిరిజన సంస్కృతి నేపథ్యంలో రచించిన రెండు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన కొట్పాడ్, నవరంగపూర్ ఎమ్మెల్యేలు రూపుబొత్రా, గౌరీ శంకర్ మాఝి ప్రారంభించారు. సీనియర్ రచయిత్రి డా॥ప్రమోదిని హొత్తా రచించిన గిరిజన సాంస్కృతిక నేపథ్యం, డా॥దేవీప్రసాద్ రచించిన గిరిజన ప్రజల పురోగతి పుస్తకాలను విడుదల చేశారు. గిరిజన సంస్కృతిని సజీవంగా ఉంచడం ఎలా అన్నది పుస్తకాల నేపథ్యమని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

ప్రభావిత గ్రామాల్లో అతిసారంపై ప్రజా చైతన్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని దిగపొహండి, సన్నొఖెముండి పాత్రపురం సమితుల్లో అతిసారం ప్రభావిత గ్రామాల్లో జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌వో) కార్యాలయం అధికారులు, సిబ్బంది, వైద్య బృందాలు సమావేశాలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. మరగబెట్టి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. అతిసారంతో బ్రహ్మపురలోని ఎమ్కేసీజీ ఆసుపత్రిలో 19 మంది చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ సబ్ డివిజనల్ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు.

అతిసారంపై గ్రామస్థుల్ని చైతన్యపరుస్తున్న వైద్య బృందం

ఇద్దరు యువకుల దుర్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పొలసరా ఠాణా పరిధిలో చిరికిపడ శాసన గ్రామంలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి మా సింఘాసిని స్వాగత ద్వారాన్ని ఢీకొంది. ఈ దుర్ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. వారు బడ పంకలబాడి పంచాయతీలోని మంగళాపూర్ గ్రామానికి చెందిన దీపక్ నాయక్ (20), ఆరత నాయక్ (20)లుగా గుర్తించారు.

బోల్‌భం దీక్షాధారుల్ని ఢీకొన్న వాహనం

గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై లంగలేశ్వర వద్ద ఆదివారం రాత్రి బోల్‌భం దీక్షాధారుల్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ దుర్ఘటనలో బల్లుగావ్‌కు చెందిన మహిళా భక్తురాలు తీవ్రంగా గాయపడింది. ఆమెకు కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు.

చికిత్సలో నిర్లక్ష్యం: యువకుడి మృతి ఆరోపణలు

బ్రహ్మపుర బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతితో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బహలటికి చెందిన యువకుడికి రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైంది. ఎమ్కేసీజీలో చికిత్సకు చేరిన యువకుడ్ని అక్కడి వైద్యుడి సూచన మేరకు సంబంధిత ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు యువకుడి కుటుంబ సభ్యులు సోమవారం విలేకరులకు చెప్పారు. అక్కడ శస్త్రచికిత్సలో నిర్లక్ష్యం కారణంగా ఆదివారం రాత్రి యువకుడు మృతిచెందాడని, బాధ్యులైన వారిని శిక్షించి, తమకు న్యాయం చేయాలని డిమాండు చేశారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా సభ్యుల అరెస్టు

అరెస్టయిన అంతర్ జిల్లా ముఠా సభ్యులు. చిత్రంలో పోలీసులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం, గజపతి జిల్లాల్లో వివిధచోట్ల ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఆరుగురు సభ్యుల అంతర్ జిల్లా ముఠాను బ్రహ్మపుర టౌన్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్ని సోమవారం న్యాయస్థానానికి తరలించామని, వారి నుంచి పది చోరీ ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ముఠాలో మరికొందరు సభ్యులున్నారని, వారి కోసం గాలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న మూడు వాహనాల ఇంజిన్, ఛాసిస్ నెంబర్లను నిందితులు చెరిపేశారని చెప్పారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మునిగుడ రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిపిండా-డోయికల్లు స్టేషన్ల మధ్య మృతదేహం పడిఉందని, మృతుని వివరాలు తెలియలేదని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నవరంగపూర్, న్యూస్‌టుడే:రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన నవరంగపూర్ జిల్లా జోరిగావ్ ఠాణా పరిధిలో చకలపొదర పంచాయతీ బాసుదేవ్‌గూడ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలియా పంచాయతీ సాన్‌రామ్సా గ్రామానికి చెందిన ఖగపతిగౌడ్ (30) ఆదివారం సాయంత్రం వాహనంపై వెళుతూ చెట్టును ఢీకొని లోయలో పడిపోయాడు. స్థానికులు ఆయనను ఆసుపత్రికి తరలించగా, మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఒకే రాత్రి రెండిళ్లలో చోరీలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర సదర్ ఠాణా పరిధిలో కుకుడాఖండిలోని శాంతినగర్‌లో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీలు జరిగాయి. సోమవారం ఉదయం ఆయా ఇళ్లకు వేలాడుతున్న విరిగిన తాళాల్ని గమనించిన స్థానికులు పోలీసులకు తెలియజేశారు. వారు శాంతినగర్ చేరుకుని చోరీ జరిగిన ఇళ్లల్లో శాస్త్రీయ బృందంతో ఆధారాలు సేకరించారు. రెండిళ్ల యజమానులు ఊర్లో లేకపోవడం వల్ల ఏఏ సామగ్రి చోరీ జరిగిందన్న వివరాలు ఇంకా తెలియలేదు.

స్కూటీలో పాము కలకలం

రాయగడ, న్యూస్‌టుడే: అందరూ చూస్తుండగా రహదారి పక్కన నిలిపి ఉంచిన స్కూటీలో దూరిన పాము కలకలం రేపింది. ఆదివారం రాత్రి రైల్వే స్టేషన్ సమీపం రైల్ రెస్టారెంట్ వద్ద స్కూటీలో పాము దూరడంతో పాములు పట్టే ప్రదీప్ సేనాపతికి సమాచారం ఇచ్చారు. పామును పట్టుకొని సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

పోలీసుల స్వాధీనంలో నిందితులు, గంజాయి

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి పొరుగు రాష్ట్రానికి రవాణా చేస్తుండగా జయపురం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వోఐసీ శుభ్రత్ కేసరి హిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌స్పెక్టర్ శశికాంత్‌దత్తా నేతృత్వంలో జాతీయ రహదారి-326పై పాత్రపుట్ చౌక్ వద్ద ఆదివారం రాత్రి శాఖ తరపున తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండటం గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా, వారి వద్ద ఉన్న బస్తాలో 22 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లాకు చెందిన భోలే గోస్వామి(58), ముకాద్‌సింగ్(41)గా గుర్తించారు. గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చగా, జామీను మంజూరు కాకపోవడంతో జైలుకు తరలించారు.

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER
నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ళ, పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ, నేషనల్, హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు నరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసి ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బాలికల నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

సూచనలిస్తున్న చిత్తరంజన్ మిశ్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన లైవ్ ఫర్ అదర్స్ సంస్థ, డీసీబీ బ్యాంక్‌లు సంయుక్తంగా బాలికల నైపుణ్యాభివృద్ధిపై సోమవారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించాయి. పురపాలక సంస్థ అధ్యక్షులు రాజేంద్ర కుమార్ పాత్ర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ శిబిరాన్ని ప్రారంభించి శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్రాంతి అధ్యాపకులు చిత్తరంజన్ మిశ్ర, బ్యాంక్ ఉద్యోగి మనోజ్‌కుమార్ మండల్, స్నిగ్ధ రాణి మిశ్ర పాల్గొన్నారు. శిబిరంలో 66 మంది బాలికలు పాల్గొనగా బ్యాంక్ ద్వారా నైపుణ్య అభివృద్ధి కిట్‌లు అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

సమస్యల పరిష్కారానికి వినతులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుమ్మ సమితి మునిసింగ్ పంచాయతీ కార్యాలయంలో పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ అధ్యక్షతన సోమవారం వినతులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు చేరుకొని 69 వినతులు అందజేశారు. వీటిలో వ్యక్తిగతం 27 కాగా 42 గ్రామాల సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ సమావేశంలో ఎస్పీ జేకే పండా, జిల్లా పరిషత్తు కార్య నిర్వహణ అధికారి శంకర్ కెర్కెటా బెహరా తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిశీలిస్తున్న పాలనాధికారి దాస్, ఎస్పీ జేకే పండా

గుడారిలో వినతులు పరిశీలించిన కలెక్టర్ పరుల్ పట్వారి

వినతులు పరిశీలిస్తున్న పరుల్ పట్వారి తదితరులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి సమితి కేంద్రం గుడారి సమావేశపు హాల్‌లో సోమవారం కలెక్టర్ పరుల్ పట్వారి, ఎస్పీ స్వాతీ ఎస్ కుమార్ 47 వినతులు పరిశీలించారు. అందులో 38 వ్యక్తిగత వినతులు తొమ్మిది సామూహిక వినతులు. గుణుపురం సబ్‌కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహోతా, బీడీవో సుచిస్మితా బెహరా తదితరులు పాల్గొన్నారు.

నాగి వంతెనపై రాకపోకలు పునఃప్రారంభం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు కారణంగా జాతీయ రహదారి-39 ఉమ్మర్‌కోట్ సమితి దొడ్ర సమీపంలో నాగి నదిపై ఉన్న వంతెన కొట్టుకుపోయి దాదాపు 11 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. స్పందించిన గ్రామీణ రహదారి నిర్మాణశాఖ వెంటనే మరమ్మతులు చేపట్టగా సోమవారం నుంచి వంతెనపై రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

మొక్కలు నాటిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థ స్వీయ తరపున సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. సంస్థ సభ్యులు వినాయక్ మహాపాత్ర్, జీబీ రెడ్డి నేతృత్వంలో ఏకంబ పంచాయతీ గగనాపూర్ బాలుకేశ్వర్ ఆలయ ప్రాంగణంలో సభ్యులు మొక్కలు నాటారు.

మొక్కలు నాటుతున్న సంస్థ సభ్యులు

(c) eenadu

'పది' వరకు పర్లేదు.. ఆపై అవకాశం లేదు

ఉన్నత విద్యకు గిరిజన విద్యార్థులు దూరం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన బిడ్డలకు ఉన్నత విద్య కలగా మిగిలిపోతోంది. పది వరకు పూర్తి చేసినా.. తరువాత ఇంటర్, డిగ్రీ చదవాలంటేనే భారంగా మారుతోంది. సీతంపేట ఐటీడీఏ విభజనాంతరం సిక్కోలులో మిగిలిన 16 మండలాల పరిధిలో గిరిజన విద్యార్థులకు పెద్దమడి గురుకుల బాలురు, మెళియాపుట్టి ఏకలవ్య, మినహా ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఒక్కటీ లేకపోవడంతో విద్యకు దూరమైపోతున్నారు. మాజీ సీఎం జగన్ పాదయాత్ర చేసిన సమయంలో మెళియాపుట్టి మండలానికి ప్రత్యేకంగా మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటుతోపాటు మండలానికి ఒక డిగ్రీ కళాశాల పెడతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నెరవేర్చలేదు.

మంచి ఉత్తీర్ణత

సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరం జరిగిన పదో తరగతి పరీక్షలు 800 మందికిపైగా విద్యార్థులు హాజరుకాగా 600 మందికిపైగా ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో శ్రీకాకుళం, పాలకొండ వెళ్లి అద్దెగదుల్లో అవస్థలు పడుతూ చదువుకుంటున్నారు. 16 మండలాల్లో ఆశ్రమ ఉన్నత పాఠశాలల స్థాయి పెంచి ఇంటర్, డిగ్రీ వరకు పెంచితే విద్యార్థులకు వెసులుబాటు కలిగి చదువుకునేందుకు వీలుగా ఉంటుందని అంతా కోరుతున్నారు. 'ఐటీడీఏ పరిధిలో మహిళా జూనియర్ కళాశాలకు సంబంధించి ప్రతిపాదనలు గతంలో చేశాం. బాలిక ఆశ్రమ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదన పంపించాం అనుమతి వస్తే ఏర్పాటు చేస్తాం' అని సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నాదొర అన్నారు.

పవిత్ర నది జలంతో బోల్‌భం భక్తులు

లింగరాజు సన్నిధికి పోటెత్తిన భక్తులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'ఓం నమశ్శివాయ' అన్న పంచాక్షరి మంత్రోచ్చారణలతో భువనేశ్వర్‌లోని ప్రముఖ శైవక్షేత్రం లింగరాజ్ మార్మోగింది. శ్రావణ మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ముక్కంటి సన్నిధికి భక్తులు పోటెత్తారు. నెల రోజులు దీక్షలు చేపట్టిన బోల్‌భం భక్తులు మహానది నుంచి పవిత్ర జలం కావిళ్లతో మోసుకుంటూ స్వామి సన్నిధికి తెచ్చి జలాభిషేకాలు చేశారు. రద్దీని దృష్టిలో పెట్టుకున్న ఆలయ యంత్రాంగం గట్టి బందోబస్తు చేపట్టింది. పూరీలోని లోకనాథ్, ఢెంకనాల్‌లోని కపిలాస్, భద్రక్‌లోని అఖండల మణి, కటక్‌లోని ధవళేశ్వరంలోనూ అభిషేకాలు నిర్వహించారు.

తృణమూల్ కాంగ్రెస్ భారీ ర్యాలీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ తృణమూల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయం కౌసల్య వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతా, ధర్మతలా ప్రాంతంలో ఈ నెల 21న తృణమూల్ కాంగ్రెస్ షహీద్ దివస్ బహిరంగ సభ నిర్వహించనుంది. ఇందులో భాగంగా భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని నిర్ణయం తీసుకుందని పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాశరావు తెలిపారు. నాయకులు సుజయ్ హజ్రా, దినేన్‌రాయ్, కల్యాణి ఘోష్, రవిశంకర్‌పాండే తదితర నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు

బ్లీచింగ్ కొనేదెలా.. ఫినాయిల్ తెచ్చేదెలా?

- పంచాయతీల ఖాతాలు ఖాళీ
- పారిశుద్ధ్య పక్షోత్సవాలపై ప్రభావం

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రతి పల్లె శుభ్రంగా ఉండాలి.. కాలువలు శుభ్రం చేయాలి.. బ్లీచింగ్ చల్లాలి.. ట్యాంకుల క్లోరినేషన్ చేపట్టాలి. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పక్షోత్సవాలకు పంచాయతీలు సిద్ధం కావాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం బ్లీచింగ్, ఫినాయిల్, సామగ్రి కొనుగోలు చేసేందుకు సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ఎలా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

బలిజిపేట మెట్ట వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలు

రూ.10 కోట్లు రావాల్సి ఉంది..

గత ప్రభుత్వం సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వకపోవడంతోపాటు పంచాయతీల ఖాతాలు బ్లాక్ చేసి నిధులను వివిధ పథకాలకు మళ్లించింది. ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఈ కార్యక్రమాలు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఆర్థిక సంఘం నిధులు రూ.10 కోట్ల వరకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇవి వస్తేనే పారిశుద్ధ్యం, తాగునీటికి ఖర్చు చేసే వీలు కలుగుతుంది. చిన్న, గిరిజన పంచాయతీలు కావడంతో ఆదాయ వనరులు అంతంతమాత్రమే.

ఇవీ అవసరాలు..

◆ జిల్లాలో చాలా గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన జరుగుతోంది. 1.63 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండగా, మరో 25 వేలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఉన్నవారు సైతం అంతంతమాత్రంగానే వినియోగిస్తున్నారు. ◆ చెత్త సేకరణకు ఇంటింటికీ బుట్టలు ఇవ్వాలని గతంలో నిర్ణయించారు. 1.09 లక్షల మందికి అందజేయగా, మరో 2.95 లక్షల మందికి సమకూర్చాలి. ఇప్పటికీ సైతం ఎక్కడా వినియోగంలో లేవు. ◆ పలు గ్రామాలకు 1,024 ట్రై సైకిళ్లు ఇవ్వగా.. వినియోగంలో ఉన్నవి వందలోపే. స్వచ్ఛభారత్‌లో భాగంగా అందజేసిన చెత్త తరలింపు వాహనాలు ఇదే పరిస్థితి. ◆ గత ప్రభుత్వ పాలనలో పంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్లు తొట్టెలు లేక మూలన పడేశారు.

జిల్లాలో వివరాలు.. పంచాయతీలు: 451, గృహాలు: 2,13,755, జనాభా: 7,40,938

పనులకు ప్రణాళిక..

జిల్లాలో ఈ నెల 16 నుంచి నిర్వహించే పారిశుద్ధ్య పక్షోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించి, పల్లెల్లో శుభ్రత పనులు చేపడతాం. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయాలు భాగస్వామ్యం కానున్నాయి.

– టి.కొండలరావు, డీపీవో, పార్వతీపురం మన్యం జిల్లా

జలకళ కర్షకుల ఆనందహేల

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం/గ్రామీణం

ఖరీఫ్ కాలానికి ముందు రైతులందరూ చందాలు పోగు చేసుకుని శ్రమించి పంట కాలువలకు ఒక రూపు తెచ్చారు. ఇదంతా గత ప్రభుత్వ కాలంలో.. బాహుదానది ఆధారంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జరుగుతున్న పంటల సాగు, రైతుల దీనావస్థ.. వీటిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాహుదా గ్రోయిన్ల అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఆ మేరకు జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారి స్వయంగా పరిశీలించి ప్రతిపాదనలు చేశారు.

❖ ఈ లోగానే రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వ విప్ ప్రత్యేక నిధులుగా బెల్లుపడ చానల్‌కు రూ.4 లక్షలు, కేశుపురం కొత్త చానల్‌కు రూ.4 లక్షలు మంజూరు చేసి, ఆయా నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు జరిపించాలని సూచించారు. ఈమేరకు జలవనరుల శాఖ ఏఈ మధుసూదన పాణిగ్రహి పర్యవేక్షణలో రెండు ఛానళ్ల పనులు జరిగాయి. వీటిని పటిష్ఠపరిచేందుకు ముఖ్యమంత్రి సమకూర్చిన నిధులతో రాతికట్టు నిర్మాణం చేపట్టేలా సన్నాహాలు చేస్తున్నారు. కేశుపురం కొత్త చానల్ పరిధిలో 4 కిలోమీటర్ల కాలువను సిద్ధం చేశారు. నీరు రావాల్సి ఉంది. నదిలో నీరు లేకపోవడంతో, పాత ఛానల్ వైపు నీటిని మళ్లిస్తున్నారు. వర్షాలు పడిన తరువాత ఈ చానల్‌కు కూడా నీరు విడుదల చేస్తామని నీటి సంఘ అధ్యక్షుడు దక్కత కామేశ్వరరావు తెలిపారు. ఈ కాలువపై సుమారు 600 ఎకరాల పంట భూమితోపాటు 50 ఎకరాల చేపల చెరువులు, మరో 30 ఎకరాల తోటలు ఆధారపడి ఉన్నాయి. బెల్లుపడ ఛానల్ పరిధిలో సుమారు 1,800 ఎకరాలు వరిసాగు చేస్తున్నారు.

అభివృద్ధి చేసిన బెల్లుపడ ఛానల్‌లో నీరు

ఆనందంగా ఉంది..

దీనావస్థలో ఉండే పంట కాలువకు రూపు వచ్చింది. ఇప్పుడు కళకళలాడుతోంది. పూర్తిస్థాయి కాలువను అభివృద్ధి చేయడం ఎంతో ఆనందం.

– రంగాల జానకిరామ్‌రెడ్డి, రైతు, బెల్లుపడ

రాతికట్టుకు ప్రతిపాదించాం..

మట్టి పనులు పూర్తయ్యాయి. వర్షం పడితే కాలువలోకి నీరు చేరుతుంది. ఈ లోగా ముఖ్యమైన ప్రాంతాల్లో రాతి కట్టు కట్టేందుకు ప్రతిపాదించాం. అందుబాటులో ఉన్న నిధులతో పనులు జరిపిస్తాం. ఈ లోగా ముఖ్యమంత్రి కేటాయించిన నిధులు మంజూరైతే ఏ ఇబ్బంది ఉండదు. ముంపు భయం కూడా ఉండదు.

– దక్కత కామేశ్వరరావు, అధ్యక్షుడు, కేశుపురం నీటిసంఘం

క్రీడాకారులకు అభినందన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కవిటికి చెందిన మాదుగుల శేషు, అభిరామ్ జంట ఎంపికయ్యారు. జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీల్లో అండర్-19 విభాగంలో ఈ జంట ప్రథమ స్థానం సాధించింది. ఆగస్టులో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారికి ఉషోదయ యువజన సంఘం, ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్, క్రీడాభిమానులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన శేషు, అభిరామ్

మన్యం వణుకుతోంది

కాలానుగుణ వ్యాధుల విజృంభణ

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతంపేట, పాలకొండ, సాలూరు, జియ్యమ్మవలస

వారం పాటు ఎడతెరిపి లేని వర్షం.. తర్వాత వరుసగా రెండు రోజుల పాటు ఎండలతో కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వర బాధితులు కనిపిస్తున్నారు.

ఆసుపత్రులకు తాకిడి..

కేవలం జిల్లా ఆసుపత్రిలో మాత్రమే ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు 3,788 మంది ఓపీకి వచ్చారు. వీరిలో 250 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పాటు సీతంపేట ఆసుపత్రిలోనూ పరిస్థితి తీవ్రంగానే ఉంది. ఇక్కడ ఏకంగా 550 మందికి పైగా జ్వర బాధితులు చికిత్స పొందారు. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి సామాజిక ఆసుపత్రిలో కేసులు తక్కువ నమోదు కాగా, సాలూరు, పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రుల పరిధిలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మొత్తం 6 ఆసుపత్రుల్లో 12,696 ఓపీ రాగా 1,757 జ్వరాల కేసులు నమోదయ్యాయి.



పార్వతీపురం ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో జ్వరబాధితులు

ఆరు రోజుల్లో ఓపీ 12,696.. జ్వరాల నిర్ధారణ 1,757

ఈ నెల 5 నుంచి 10 మధ్య జిల్లాలోని ప్రధాన ఆసుపత్రుల్లో పరిస్థితి..

ఆసుపత్రి	ఓపీ	జ్వరాలు
పార్వతీపురం	3,788	250
సీతంపేట	1750	550
సాలూరు	1870	291
పాలకొండ	3,523	274
భద్రగిరి	1405	347
చినమేరంగి	360	45

కొత్త భవనాల పూర్తి ఎప్పుడు..

పార్వతీపురం ఆసుపత్రిని నాలుగేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేస్తూ పడకలు 100 నుంచి 150కి పెంచారు. దీంతో కొత్తగా 50 పడకల భవనం నిర్మాణానికి మూడేళ్ల క్రితం నాబార్డు నిధులు రూ.21 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రూ.18 కోట్లతో కొత్త భవనం, రూ.3 కోట్లతో పాత భవనం మరమ్మతులు చేయాలని నిర్ధారించారు. కానీ మూడేళ్లుగా మరమ్మతులే సాగుతున్నాయి. గత వైకాపా హయాంలో నిధుల విడుదలలో జాప్యంతో ఈ పరిస్థితి ఎదురైంది. గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పాలకొండ, సాలూరులోనూ ఇదే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు చెల్లింపులు చేయడంతో కొన్నిచోట్ల పనుల్లో వేగం పెరిగింది.

అదనపు పడకలు..

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జిల్లా ఆసుపత్రితో పాటు మిగిలిన చోట్ల ముందస్తుగా అదనపు పడకల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్న గదుల్లో మంచాలు వేసి సర్దుబాటు చేస్తున్నారు. పార్వతీపురంలో 150 పడకల ఆసుపత్రిలో 250 బెడ్లు అందుబాటులో ఉంచారు. ★ సాలూరు ఆసుపత్రిలో 56 పడకలు ఉండగా 130 మంది వరకు రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురికి సేవలు అందిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, సీతంపేటలోనూ ఇదే పరిస్థితి ఉంది.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం...:

ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులతో వస్తున్న వారి సంఖ్య పెరిగింది. దీనికి తగిన విధంగా జిల్లా ఆసుపత్రిలో మంచాలు ఏర్పాటు చేస్తున్నాం. గదులు చాలని పరిస్థితి ఉంది. కొత్త భవనం పనులు పూర్తి చేసి అప్పగించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లాం.

– నాగశివజ్యోతి, సూపరింటెండెంటు, జిల్లా ఆసుపత్రి

డిమాండ్లు నెరవేర్చకుంటే.. సమ్మె తప్పదు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: న్యాయమైన తమ డిమాండ్లను రెండు రోజుల్లోగా ఆమోదించకుంటే, 16వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటామని పుర కార్మికుల ప్రతినిధి ఎ.రమేష్ పట్నాయక్, కార్మికులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పుర కమిషనర్ నల్లి రమేష్‌ను సోమవారం కలుసుకుని, తమ ఆవేదనను వివరించారు. వర్షాలు కురిసే కాలంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకూడదని కమిషనర్ సూచించారు. డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తున్నందున సమ్మె యోచన సరికాదని, ప్రజల కోసం యోచించాలని హితవు పలికారు.

యువజన సంఘాలకు ఊతమేది..?

రెండేళ్లుగా ఊసే లేని వాలంటీర్ల నియామకం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ (పాతచిత్రం)

–న్యూస్‌టుడే, పొందూరు, జి.సిగడాం

దేశ ప్రగతిలో యువతను భాగస్వాములను చేసేందుకు కేంద్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌వైకే (నెహ్రూ యువ కేంద్రం) పేరును ఇటీవల 'మేరా యువ భారత్'గా మార్చారు. ఇందులో ఉండే వాలంటీర్లు ప్రజల్లో చైతన్యం నింపేందుకు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా నెహ్రూ యువ కేంద్రంలో వాలంటీర్ల వ్యవస్థ నియామకం నిలిచిపోవడంతో ఉన్న వారితో మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రజా చైతన్య కార్యక్రమాలు మందకొడిగా సాగుతున్నాయి.

వాలంటీర్ల విధులివే

వాలంటీరుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 18 నుంచి 29 మధ్య వయసు ఉండాలి. ఉన్నత విద్య, కంప్యూటర్ పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ తెలిసి ఉండి, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో పనిచేసిన వారికి ప్రాధాన్యమిస్తారు. ఈ దిశలో హరితహారం, రక్తదాన శిబిరాలు, పల్స్‌పోలియో, స్వచ్ఛభారత్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, క్రీడలు, మూఢనమ్మకాలపై అవగాహన, బాల్య వివాహాలు అరికట్టడం, స్వచ్ఛత తదితర సామాజిక కార్యక్రమాలు యువజన సంఘాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో వాలంటీర్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తారు. వాలంటీర్ వ్యవస్థ ఉద్యోగం కాదు. స్వచ్ఛందంగా సేవా భావంతో పనిచేయాలి. గౌరవ వేతనంగా రూ.5వేలు చెల్లిస్తారు. కూటమి ప్రభుత్వంలోనైనా కొత్తగా వాలంటీర్లను నియమించి సంఘాలకు ఊతం కలిగిస్తారని పలువురు కోరుతున్నారు.

● జిల్లాలో నిర్వహణలోని సంఘాలు: 150
● యువకులు: సుమారు 12 లక్షలు

సంయుక్తంగా సేవా కార్యక్రమాలు

జిల్లాలో నెహ్రూ యువజన సంఘం పరిధిలో 12 బ్లాక్‌లకు 24 మంది మాత్రమే వాలంటీర్లు పనిచేస్తున్నారు. దీంతో ఎన్ఎస్ఎస్, పలు సేవా సంస్థల సహకారంతో నెహ్రూ యువ కేంద్రం పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోంది. దీనికితోడు రెండేళ్లుగా ఆటల పరికరాలు కిట్లు యువజన సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అందించకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాలంటీర్ల నియామకం చేపట్టేందుకు చర్యలు చేపడతాం. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి నెహ్రూ యువజన సంఘం సంయుక్తంగా ప్రజా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త యు.వెంకట్ తెలిపారు.

శిథిలావస్థలో భవనం

కొజ్జిరియాలో 15 ఏళ్ల కిందట నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి వేరే ప్రాంతానికి వెళ్తున్న ప్రజలు చెట్టునీడన బస్సు, ఆటోల కోసం వేచి ఉంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హరిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

చెత్త కుప్పలు తొలగించరూ..

ఇచ్ఛాపురం మండలం బెనుగానిపేటలో ఇళ్లకు సమీపంలో చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ కృష్ణకు వివరణ కోరగా త్వరలోనే చెత్తను తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అంచున ప్రమాదం

ఇచ్ఛాపురం పట్టణ పరిధి బెల్లుపడ అచ్చెమ్మపేట సమీప రహదారి అంచులు తెగిపోయాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కన ఉన్న కాలువకు గోడలు నిర్మించి, రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు. పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ప్రారంభానికి ఇంకెన్నాళ్లో..

ఇసకలపాలెం పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీని నిర్మాణం తెదేపా హయాంలో ప్రారంభించగా వైకాపా పాలనలో సచివాలయంగా మార్చి పనులు పూర్తిచేశారు. బిల్లుల చెల్లింపులో నెలకొన్న ఇబ్బందులతో ఇది నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. చిన్నగదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సమస్యను సర్పంచి అంకమ్మ వద్ద ప్రస్తావించగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

తాగునీటికీ ఇబ్బందే...!

పలాస మండలం లొత్తూరులోని ప్రధాన వీధిలో తాగునీరు సరఫరా చేసే కుళాయిలు సుమారు పదిహేను రోజులుగా పని చేయట్లేదు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన కుళాయిలను బాగు చేసి, పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

రోడ్లు వేయరు.. కాలువలు తీయరు..

– న్యూస్‌టుడే, కంచిలి

కంచిలి పంచాయతీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ పంచాయతీ పరిధి కంచిలి, గొల్ల కంచిలి, మఠంకంచిలి, బలియపుట్టుగకాలనీ, అబ్దుల్ కలాంకాలనీ, బలియాపుట్టుగ, పెద్దపాత్రపడ, చిన్నపాత్రపడ, దాకరాపల్లి గ్రామాలున్నాయి. మండల కేంద్రమైన కంచిలిలో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు లేవు. వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరడంతోపాటు సోంపేట రైలు నిలయం, స్టేట్ బ్యాంకు పరిసరాల్లో నిత్యం నీరు నిల్వ ఉండి రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. కంచిలి, గొల్లకంచిలి, బలియాపుట్టుగ, పాత్రపడ గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలతో పాటు కాలువల సమస్య వేధిస్తోంది. అబ్దుల్ కలాం కాలనీకి మౌలిక సదుపాయాలు లేవు.

నిర్మాణానికి నోచుకోని కంచిలి జాతీయ రహదారి నుంచి దాకరాపల్లికి వెళ్లే రోడ్డు

కంచిలి, బలియాపుట్టుగ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సచివాలయం, రైతు సేవా, ఆరోగ్య ఉపకేంద్రాలకు భవనాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. వెలుగు, ఉపాధి హామీ శాఖల కోసం కడుతున్న భవనం రెండు దశాబ్దాలుగా నిర్మాణ దశను దాటడంలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేవు.

❖ స్థానిక సోంపేట రైలు నిలయానికి సోంపేట, కంచిలి, కవిటి మండలాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కంచిలి లోపలికి రాకుండా జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతుండటంతో ఆటోలు ఇతర వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒడియా విద్యార్థులకు ఇక్కడ అవకాశం లేకపోవడంతో సోంపేట వెళ్లి వ్యయప్రయాసలకు గురవుతున్నారు. మరి కొందరు తప్పక తెలుగు మాధ్యమంలో కొనసాగుతున్నారు. ఇక్కడి సమస్యలపై ఎంపీడీవో తిరుమలరావును వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయతీ: కంచిలి, జనాభా : సుమారు 10వేలు మంది, గృహాలు : 1,800పైగా

కొడుకు పెళ్లికి నిరాకరించాడని.. తల్లిదండ్రుల ఆత్మహత్య

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: సన్యాసి దీక్ష చేపట్టిన కొడుకు పెళ్లికి నిరాకరించాడని తీవ్ర మనస్తాపానికి గురైన తల్లిదండ్రులు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన గంజాం జిల్లాలో జరిగింది. ఆత్మహత్య చేసుకున్న ఇద్దరి మృతదేహాలు శనివారం బ్రహ్మపుర రైల్వే స్టేషన్ నాలుగో నెంబరు ప్లాట్‌ఫాం శివారున (ఖుర్దావైపు) కాలి పైవంతెన కింద వెలుగు చూశాయి. మృతులను తొలుత గుర్తు తెలియనివారుగా జీఆర్పీ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దిగపొహండి ఠాణా పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన ఎం.సుదర్శనదొర, ఎం.కుమారిదొరగా గుర్తించారు. ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో మృతదేహాలకు పరీక్షలు చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఠాణా అధికారి బికాస్ పొళాయి సోమవారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

కళ్లికోట వర్సిటీలో సౌకర్యాల పరిశీలన, సమీక్ష

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ విభాగీయ సంబంధిత స్టాండింగ్ కమిటీ-4 (2025-2026) రెండు రోజుల పర్యటనకు సోమవారం గంజాం జిల్లాకు చేరుకుంది. కమిటీ ఛైర్మన్, కళ్లికోట ఎమ్మెల్యే పూర్ణచంద్ర సెఠి నాయకత్వంలో కమిటీ ప్రతినిధులు సాయంత్రం స్థానిక కళ్లికోట వర్సిటీ ప్రాంగణం సందర్శించి, సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం రాత్రి వర్సిటీలో ఇన్‌ఛార్జి ఉపకులపతి (వీసీ) ఆచార్యిణి గీతాంజలి దాస్, ఇతర అధికారులతో సమావేశమైన కమిటీ ప్రతినిధులు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు ఇతర అంశాలపై సమీక్షించారు.

కళ్లికోట వర్సిటీ అధికారులతో సమావేశమైన స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ పూర్ణచంద్ర సెఠి. చిత్రంలో ఇతర ప్రతినిధులు, వర్సిటీ వీసీ ఆచార్యిణి దాస్

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
ప్రకటనలపై జనవరి 5% తగ్గింపు అదనం
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు
యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
80085 97609

(c) eenadu

ఉద్యాన పంటల సాగులో సందేహాలా?

నేడు ఆ శాఖాధికారితో ఫోన్ ఇన్

ఈనాడు మీతోడు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: ఉద్యాన పంటల సాగులో రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ఫోన్ ఇన్ కార్యక్రమం జరగనుంది. జిల్లా ఉద్యాన శాఖాధికారి వెంకటరావు కర్షకులు అడిగే ప్రశ్నలకు సమాధానమిస్తారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు? దరఖాస్తు విధానం, ఏయే ఉద్యాన పంటల సాగు లాభదాయకం? ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర విషయాలను తెలుసుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఫోన్ చేయడమే.

ఫోన్ చేయాల్సిన నంబరు: 79950 86775

తేదీ: మంగళవారం (15.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 1 వరకు

పురస్కార గ్రహీతకు సత్కారం

మురళిని సన్మానించిన కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పల్నాడు సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తూ జాతీయ ఉత్తమ నేత పురస్కారం అందుకున్న సత్తెనపల్లి వాసి కర్నాటి మురళిని కలెక్టరేట్లో సోమవారం కలెక్టర్ సత్కరించి అభినందనలు తెలిపారు. పల్నాడు జిల్లా మన మైన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లాలోని కళాకారులు మరిన్ని అవార్డులు, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చేనేత జౌళి పరిశ్రమల అధికారి ఉదయ్‌కుమార్, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం 554 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 554 అడుగులకు పెరిగింది. ఇది 218.6760 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 63,900 క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం నీటిమట్టం 883.40 అడుగుల వద్ద కొనసాగుతోంది. జూరాల, రోజాల నుంచి శ్రీశైలం జలాశయానికి 72,763 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

మూలకు చేరిన మలాథియాన్!

మలేరియా నియంత్రణ ఎలా సాధ్యం? ● బొల్లాపల్లిలో మొదలు కాని పిచికారీ

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా.. ప్రభుత్వం మలేరియా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఆచరణ కనిపించడం లేదు. మలేరియా పీడిత ప్రాంతాల్లో దోమల నివారణకు ఇంటింటా పిచికారీ చేసేందుకు మలాథియాన్ 25 శాతం డబ్ల్యూపీ పొడి మందు బస్తాలు, పిచికారీ యంత్రాలను సరఫరా చేసినా అధికారులు వినియోగించకుండా మూలన పెట్టారు. నెలరోజుల కిందట బొల్లాపల్లి మండలానికి వచ్చిన నిల్వలను మండల పరిషత్తు కార్యాలయంలోని గదిలో పెట్టి తాళం వేశారు. ఈ మండలంతో పాటు బొల్లాపల్లి అనుబంధ ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గిరిజన ఆవాస ప్రాంతాల్లో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ (ఐఆర్ఎస్) కార్యక్రమం జూన్ 18 నుంచి 45 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అమల్లో ఆలస్యం అవుతోంది.

వ్యాధులు	గత ఏడాది	ఈ సంవత్సరం (జులై 10 వరకు)
మలేరియా	2	0
డెంగీ	282	15
గన్యా	28	4

దోమ కాటుతో ఏటా వేల మంది అనారోగ్యం పాలవుతున్నారు. మలేరియా, డెంగీ, మెదడు వాపు, గన్యా, బోద వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో అపరిశుభ్రత, అవగాహన లేమితో సమస్య తీవ్రంగా ఉంటోంది. దీనిని అధిగమించేందుకు ఆయా ప్రాంతాల్లోని ప్రతి నివాస గృహంలో క్రిమినాశిని మందు పిచికారీ (ఐఆర్ఎస్) చేస్తారు. ఆ మందు గోడలకు అంటుకుని ఆరునెలలపాటు ఉంటుంది. మనిషిని కుట్టిన దోమ గోడను తాకగానే మందు ప్రభావంతో చనిపోతుంది. ఈ పద్ధతిలో దోమలను నియంత్రిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

బొల్లాపల్లి మండల కార్యాలయంలో ఉన్న మలాథియాన్ పొడి బస్తాల నిల్వలు

ఎక్కడెక్కడ.. ఐటీడీఏ గుర్తించిన మాచర్ల, కొప్పునూరు, శిరిగిరిపాడు, దుర్గి, ముటుకుల, కంభంపాడు, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు బొల్లాపల్లి మండలంలోని గిరిజన ఆవాస ప్రాంతాల్లో ఐఆర్ ఎస్ చేస్తున్నారు. మలేరియా విభాగం దీనిని పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వం మందు సరఫరా చేసి నెల రోజులు దాటినా ఇంకా పిచికారీ ప్రారంభం కాలేదు. ప్రత్యేక స్ప్రేయర్లతో పిచికారీ చేయాల్సి ఉండటం.. తగినన్ని అందుబాటులో లేకపోవడం, కూలీలకు అయ్యే ఖర్చుకు బడ్జెట్ ఇవ్వకపోవడం దీనికి కారణాలుగా చెబుతున్నారు.

సకాలంలో పూర్తి చేస్తాం.. 'గత ఏడాది జులై నాటికి 117 డెంగీ కేసులు నమోదు కాగా.. ఈ సంవత్సరం 15 మాత్రమే వచ్చాయి. గిరిజన గ్రామాల్లో ఐఆర్ఎస్ కార్యక్రమం సకాలంలో పూర్తి చేస్తాం' అని జిల్లా మలేరియా అధికారి రవీంద్రనాథ్ తెలిపారు.

పొదుపు మహిళలతో పౌర సేవలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

వేలిముద్ర స్కానర్లు అందుకుంటున్న డిజి లక్ష్మిలు

డిజి లక్ష్మి పేరిట సీఎస్‌సీల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 232 గుర్తింపు

పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు పౌరసేవల బాధ్యతలు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీ పూర్తి చేసిన ద్వాక్రా మహిళలతో డిజి లక్ష్మి పేరిట కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సేవలందించనున్నారు.

పట్టణాలు, నగర పంచాయతీల్లో ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో సీఎస్‌సీలు ఇప్పటికే నడుస్తున్నా.. అవి తక్కువగా ఉండటంతో ప్రతి పనికి మీ -సేవా కేంద్రాలు, ప్రైవేటు అంతర్జాల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. డిజి లక్ష్మిలతో పౌర సేవలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఉపాధి కల్పించనున్నారు. ఒక్కో సమాఖ్య పరిధిలో ఒక సీఎస్‌సీ కేటాయిస్తున్నారు.

జిల్లాలో 232 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పెట్టుబడికి రూ.2 లక్షలు బ్యాంకు రుణం అందిస్తారు. ఆ సొమ్ముతో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, అంతర్జాల సౌకర్యం సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే వేలిముద్ర స్కానర్లను ఎమ్మెల్యేల చేతుల మీదుగా డిజి లక్ష్మిల ఏర్పాటుకు ముందుకొచ్చిన మహిళలకు అందజేశారు. కేంద్రాల నిర్వహణపై రిసోర్సుపర్సన్లతో శిక్షణ ఇస్తున్నారు. సేవలు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. విద్యుత్తు బిల్లులు, ఎల్ఐసీ పాలసీలు, వ్యవసాయ బీమా, ఈ-శ్రమ్ కార్డుల్ని సీఎస్‌సీల ద్వారా పొందవచ్చు. అన్ని రకాల ధ్రువపత్రాలూ జారీ చేస్తారు.

ఉన్నతాధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా డిజి లక్ష్మి సీఎస్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా టీఎంసీలు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ కేంద్రాలతో పట్టణ ప్రజలకు సత్వర పౌర సేవలు అందుతాయన్నారు.

పట్టణం	సమాఖ్యలు	ఎంపిక చేసిన డిజి లక్ష్మిలు
సత్తెనపల్లి	33	26
చిలకలూరిపేట	67	47
మాచర్ల	32	24
నరసరావుపేట	78	55
పిడుగురాళ్ల	36	28
వినుకొండ	43	30
గురజాల	13	8
దాచేపల్లి	23	14

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో మరో 10 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జిల్లాలో 36 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు మొత్తం 46 సొసైటీలకు నియామక ప్రక్రియ పూర్తయింది. ఆయా సొసైటీల వారీగా అధ్యక్షుల వివరాలు.. నాదెండ్ల- నల్ల మోతు హరిబాబు, గణపవరం- పెంట్యాల శేషయ్య, చర్లగుడిపాడు- వీరేపల్లి రామారావు, దాచేపల్లి- లంగిళ్ల శ్రీనివాసరావు, పిడుగురాళ్ల - వడ్డవల్లి సర్వేశ్వరరావు, వినుకొండ - మక్కెన మల్లికార్జునరావు, నూజండ్ల- బచ్చు ఆంజనేయరెడ్డి, గుర్రపునాయుడు పాలెం ముంద్రు సుబ్బారావు, కారుమంచి- గోపాళం శివప్రసాద్, శావల్యాపురం - గడిపూడి విశ్వనాథం.

పొగాకు కొనుగోళ్లు నత్తనడక

ఖరారుకాని విక్రయ తేదీలు ● రైతుల ఇళ్ల వద్దే నిల్వలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ, యడ్లపాడు

జిల్లాలో పొగాకు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. చిలకలూరిపేట మార్కెట్ యార్డు, యడ్లపాడు మండలం మైదవోలులోని సుగంధ ద్రవ్యాల పార్కులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే 25 రోజుల కిందట రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకున్నా.. ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.

పొగాకు పంట కొనుగోలు చేయాలని రైతు సంఘాలు ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం స్పందించింది. యడ్లపాడు మండలం మైదవోలులోని సుగంధ ద్రవ్యాల పార్కులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అరుణ్ బాబు జూన్ 15న ప్రారంభించారు. రోజుకు 300 క్వింటాళ్ల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం చిలకలూరిపేట నియోజవర్గంలోని రైతుల వద్ద 99 వేల క్వింటాళ్లు ఉంది. ఇప్పటి వరకు 7,500 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఈ ప్రకారం కొనుగోళ్లు ఎప్పటికి పూర్తి చేస్తారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు క్వింటాకు రూ.12 వేల ధర దక్కకపోవడం.. గ్రేడ్‌ల బట్టి ఎక్కువగా రూ.9 వేలు, రూ.6 వేలకు కొనుగోలు చేస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆందోళనతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఇటీవల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని, అదనపు గోదాములు తెరవాలని అధికారులను ఆదేశించారు.

దాచుకోలేక ఇబ్బందులు.. పొగాకు విక్రయించాలనుకునే సాగుదారులు రైతు సేవా కేంద్రాల్లో ముందుగా పేరు నమోదు చేయించుకోవాలి. అలాంటి వారికి కొనుగోలు చేసే తేదీలు ఖరారు చేస్తారు. అలా నిర్ణయించిన తేదీల్లో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అయితే గతనెలలో నమోదు చేయించుకున్న రైతులకు ఇప్పటికీ తేదీలు ఖరారు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల ప్రాంగణాల్లో పంటను దాచుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

పొగాకు నాణ్యత పరీక్షిస్తున్న మార్క్‌ఫెడ్ సిబ్బంది

నెల రోజుల నుంచి ఎదురుచూస్తున్నా.. 'యడ్లపాడులో పదెకరాల్లో నల్లబర్లీ సాగు చేశా. 150 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. యడ్లపాడు రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేయించుకున్నా. ఇప్పటికీ కొనుగోలు తేదీ ఇవ్వలేదు. ఇంటి ప్రాంగణంలో ఉంచిన పొగాకు వర్షాలకు తడవకుండా పరదాలు కప్పి రక్షించుకుంటున్నా' అని యడ్లపాడు రైతు శ్రీధర్ తెలిపారు.

52 చెక్కులు తీసుకొస్తే 17 తిరస్కరించారు.. '70 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. సోమవారం 52 చెక్కులను యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. నాణ్యత పేరుతో సరాసరి క్వింటా ధర రూ.ఏడు వేలు మించలేదు. మరోవైపు కొర్రీలు పెట్టి 17 చెక్కులను తిరస్కరించారు' అని కమ్మవారిపాలెం రైతు పుల్లారావు వివరించారు.

పాఠశాలలకు విద్యా వాలంటీర్లు

ఈనాడు కథనానికి స్పందన

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచవరం మండలాల్లో ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు అసిస్ట్ ద్వారా 32 మంది విద్యా వాలంటీర్లను నియమించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడం.. విద్యా బోధన సాగకపోవడంపై 'ఈనాడు'లో ప్రచురితమైన వరుస కథనాలకు విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం బొల్లాపల్లి మండలంలో 16 మంది, మాచవరం మండలంలో ముగ్గురు, వెల్దుర్తి మండలంలో 12 మంది విద్యా వాలంటీర్లు విధులకు హాజరైనట్లు ఉన్నతాధికారులు తెలిపారు. వాలంటీర్లను నియమించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతేరాజు

పరికరం చిన్న.. ఉపయోగం మిన్న

6లో

పశువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

తరలుతున్న బియ్యం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తోంది. నాదెండ్ల మండలం చిరుమామిళ్లలో డీలర్ అక్రమంగా నిల్వ ఉంచిన 45 క్వింటాళ్ల బియ్యాన్ని మూడు రోజుల కిందట అధికారులు పట్టుకున్నారు. ఇటీవల ముప్పాళ్ల మండలం మాదలలోనూ మినీ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇలా చిలకలూరిపేట, సత్తెనపల్లితో పాటు నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల్లో రేషన్ మాఫియా దందా యథేచ్ఛగా సాగుతోంది.

జిల్లావ్యాప్తంగా 1289 రేషన్ దుకాణాల పరిధిలో 6,34,893 బియ్యం కార్డుదారులున్నారు. వీరికి ప్రతినెలా 88,012 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నారు. యాభై శాతానికి పైగా కార్డుదారులు బియ్యం తీసుకోకుండా వేలిముద్రలు వేసి.. కిలోకు రూ.10 చొప్పున డీలర్ నుంచి తీసుకుంటున్నారు. ఆ బియ్యాన్ని వారు కిలో రూ.18 చొప్పున అక్రమార్కులకు చేరవేస్తున్నారు. వారు జిల్లాలు దాటిస్తున్నారు. ఈ మొత్తం తంతు వెనుక ప్రతి నియోజకవర్గంలో రేషన్ మాఫియా రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ అధికారులు, ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లిస్తున్నారనే విమర్శలున్నాయి.

చిరుమామిళ్లలో పట్టుబడిన రేషన్ బియ్యం

ఎవరినీ ఉపేక్షించం.. 'రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా, తరలించినా ఎవరినీ ఉపేక్షించం. ప్రభుత్వం రాయితీతో రూ.1కే కిలో బియ్యం ఇస్తుంటే.. కార్డుదారులు అమ్మడం నేరం. వారిపైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమాలకు పాల్పడే వారి కార్డులు రద్దు చేస్తాం. డీలర్లపై నిరంతరం నిఘా పెడతాం. విస్తృతంగా తనిఖీలు చేపడతాం.

\- ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి

మూడులో మెరుగు.. ఆరు, తొమ్మిదిల్లో తరుగు

నరసరావుపేట, న్యూస్‌టుడే

అభ్యసన సామర్థ్యాల్లో మూడో తరగతికి సంబంధించి పల్నాడు జిల్లా మొదటి వరుసలో నిలిచింది. అదే ఆరు, తొమ్మిదో తరగతికి వచ్చేసరికి వెనుకంజలో ఉంది. కరోనాతో పాఠశాలలకు దూరమైన పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉండగా. . ఒకటి, రెండు తరగతులు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అన్నింటా మెరుగ్గా ఉన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) తాజాగా 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్' నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం పర్వాలేదన్నట్లుగా సామర్థ్యాలు ఉన్నా గుణాత్మక విద్యా బోధనతో రాబోయే రోజుల్లో జిల్లా విద్యార్థులు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని నివేదిక తేల్చింది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విద్యాలయాలు, ప్రైవేటు పాఠశాలల్లో 2024 డిసెంబరులో సర్వే నిర్వహించారు. పిల్లల అభ్యసన సామర్థ్యాల్ని మదింపు చేసి ఫలితాలకు అనుగుణంగా సూచనలు చేశారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్ని పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలు ప్రైవేటుతో సమానంగా, కొన్ని పాఠ్యాంశాల్లో అధికంగా ఉన్నాయి. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు మెరుగ్గా ఉన్నారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు ముందంజలో ఉండటం పరిశీలనాంశం. ● జిల్లాలో 114 పాఠశాలల్లో (మూడో తరగతికి 46, ఆరో తరగతికి 39, తొమ్మిదో తరగతికి 50 బడులు) సర్వే నిర్వహించారు. మొత్తం 3,407 మంది (మూడో తరగతి 963, ఆరో తరగతి 1,032, తొమ్మిదో తరగతి 1,412) విద్యార్థులు, 439 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధన అవసరం

పాఠశాలల్లో సామాజిక భాగస్వామ్యం (తల్లిదండ్రుల పాత్ర) పెంచాలి. డిజిటల్ భవిష్యత్తుకు అనుగుణంగా మూడో తరగతి నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన చేయాలి. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల్లా కొత్త విషయాల్ని నేర్చుకుని పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలి. డిజిటల్ విద్యా బోధనను అందిపుచ్చుకోవాలి. అన్ని తరగతుల విద్యార్థులకు దోహదపడే సమ్మిళిత సంస్కృతి, విలువైన, వైవిధ్య బోధన అందించాలి.

గుణాత్మక విద్యా బోధనతో సామర్థ్యాల పెంపు

వివిధ సబ్జెక్టుల్లో సగటు స్కోరు ఇలా..

తరగతి	పాఠ్యాంశం	జిల్లా	రాష్ట్రం	జాతీయ
మూడు	మాతృభాష	66	60	60
	గణితం	74	67	68
ఆరు	మాతృభాష	47	47	56
	గణితం	50	52	54
	ఈవీఎస్	34	35	44
తొమ్మిది	మాతృభాష	48	50	54
	గణితం	37	38	39
	సైన్సు	33	33	36
	సోషల్	32	34	32

కాలువ మరమ్మతులు 90 శాతం పూర్తి

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే: ఎన్నెస్పీ కాలువ మరమ్మతులు 90 శాతం పూర్తయ్యాయని ఎన్నెస్పీ మాచర్ల డివిజన్ ఈఈ టి. రమేష్ తెలిపారు. సోమవారం ఆయన క్రోసూరు, అచ్చంపేట సెక్షన్ల పరిధిలో కాలువ మరమ్మతులు పరిశీలించారు. కుడి కాలువ పరిధిలో 96 పనులు రూ.16 కోట్లతో చేపట్టినట్లు వివరించారు. త్వరలో కాలువలకు నీటి విడుదల చేయనున్నందున పనులు వేగంగా చేయిస్తున్నామన్నారు. కట్టలు పటిష్ఠపరచడం, పూడిక తీత, ముళ్లపొదలు తొలగించడం వంటి పనులు చేపట్టామన్నారు. లస్కర్ల కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. వారిని రోజువారీ వేతనంపై తీసుకునే అంశాన్ని ప్రతిపాదించామన్నారు. చింతపల్లి మేజర్, కస్తల మైనర్‌పై జరుగుతున్న పనులు పరిశీలించారు. ఆయన వెంట క్రోసూరు సబ్‌డివిజన్ డీఈఈ పి.పవన్, ఏఈలు పి.శ్రీనివాసరావు, భాస్కర్‌బాబు, క్రోసూరు, చామర్రు డీసీల అధ్యక్షులు సాంబశివరావు, పాపిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఈఈ రమేష్, డీసీల అధ్యక్షులు

అర్జీలకు సముచిత పరిష్కారం చూపండి: కలెక్టర్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలకు సముచిత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో మురళి, అధికారులు అర్జీలను స్వీకరించారు. పలువురు అర్జీదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మొత్తం 207 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

రైతుల ఇబ్బంది పట్టదా?.. వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో తారురోడ్డు మధ్య విద్యుత్తు స్తంభాలు వేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పొలం మధ్య నుంచి ప్రధాన లైన్లు వేయడంతో రైతులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. దీనిపై విద్యుత్తు అధికారులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

కోళ్లఫారాలు తరలించాలి.. నకరికల్లులోని పాతూరులో నివాసాల మధ్య కోళ్లఫారాల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, వాటిని తరలించాలని గ్రామస్థులు కోరారు. వ్యర్థాలు అక్కడే వేస్తుండటంతో దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఉందన్నారు.

ఒకే కుటుంబంలో ఆరుగురికి తల్లికి వందనం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఒకే కుటుంబంలో ఆరుగురు పిల్లలకు 'తల్లికి వందనం' జమైంది. వెల్దుర్తి మండలం పాపిరెడ్డికుంట తండాకు చెందిన కాండ్లవత్ సోమ్లా నాయక్, నాగేశ్వరబాయి దంపతులకు ఆరుగురు కుమార్తెలు, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. మొదటి విడతలో నలుగురి పిల్లలకు, ఈ నెల పదిన రెండో విడతలో మరో ఇద్దరికి పథకం నగదు జమైందని.. మొత్తం రూ.78,000 వచ్చాయని సోమ్లానాయక్, నాగేశ్వరబాయి తెలిపారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి లోకేశ్‌కు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సోమ్లా నాయక్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద ఒకరికి ఇస్తే.. కూటమి ప్రభుత్వం తమ ఆరుగురు అమ్మాయిలకు తల్లికి వందనం లబ్ధి అందించిందన్నారు.

అన్నింటికీ ఆధారం.. త్వరపడాల్సిన తరుణం

నవీకరణకు లక్షల మంది దూరం

● అర్హత ఉండి కూడా జిల్లాకు చెందిన సుమారు 4 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం మొదటి, రెండు విడతల్లో సాయం అందలేదు. ఏంటని ఆరా తీస్తే ఆధార్ నవీకరణ జరగలేదనే రిమార్కు వచ్చింది. దీంతో తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకుని ఆధార్ కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చింది.

● మాచర్లకు చెందిన బాలుడు శ్రీనివాస్‌ను ఒకటో తరగతిలో చేర్చేందుకు వెళ్లగా ఆధార్ లేకపోవడంతో చైల్డ్ ఇన్ఫోలో వివరాలు నమోదు కాలేదు. తల్లికి వందనం లబ్ధిదారుల జాబితాలో విద్యార్థి పేరు చేరలేదు. వందల మంది విద్యార్థులదీ ఇదే పరిస్థితి.

● అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులుగా జూన్ 30లోగా ఆధార్ నవీకరణ చేయించుకున్న రైతులనే ఎంపిక చేశారు. ఈకేవైసీ, ఆధార్ నవీకరణ లేక చాలామందికి అర్హుల జాబితాలో చోటు దక్కలేదు. ఫలితంగా వారు రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నరసరావుపేట, న్యూస్‌టుడే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ ప్రామాణికంగా మారింది. కొత్తగా ఆధార్ పొందడంతో పాటు ఎప్పుడో పొందిన దానిని నవీకరణ చేయించుకోవడంలో చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా అర్హత ఉన్నా సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారు. మ్యాన్‌డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్స్ (ఎంబీయూ) చేయించుకోనివారు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షలాది మంది ఉన్నారు. వీరికి ఆధార్ ఉన్నా నవీకరణ చేయించుకోకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు.

చిన్నారి ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

నవీకరించుకోవాల్సిన వారి వివరాలిలా...

జిల్లా	5 నుంచి 15 ఏళ్లలోపు	15 ఏళ్లకు పైబడిన వారు	మొత్తం
పల్నాడు	58,117	1,16,637	1,74,754
బాపట్ల	41,861	83,738	1,25,599
గుంటూరు	64,213	1,18,523	1,82,736

నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 18 వరకు.. మళ్లీ 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. పిల్లలైతే తల్లి లేదా తండ్రిని తీసుకుని, పెద్దలైతే స్వయంగా ఆధార్ కార్డుతో వెళ్లి వేలిముద్రలు వేస్తే నవీకరణ ప్రక్రియ పూర్తవుతుంది. దీనికి ఎటువంటి రుసుం వసూలు చేయరు. కొత్తగా ఆధార్ పొందేవారి నుంచి నిర్ణీత రుసుం వసూలు చేస్తారు.

పసుపులేరులో చెత్త పరిచేస్తున్నారు!

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ పురపాలక సంఘం అధికారుల అనాలోచిత నిర్ణయంతో పసుపులేరు వాగు డంపింగ్ యార్డులా మారుతోంది. పట్టణంలో పోగయ్యే చెత్త నిల్వకు ప్రత్యేక యార్డు ఏర్పాటు చేయకుండా మార్కాపురం రోడ్డులోని వాగులో పోస్తున్నారు. కుళ్లిన పదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాడైన పండ్లు, కూరగాయలు వాగు పరీవాహక ప్రాంతంలో పోస్తున్నందున నీరు.. నిప్పు పెడుతున్నందున గాలి కలుషితమవుతోంది. పట్టణంలో రోజూ 22 టన్నుల చెత్త సేకరించే సిబ్బంది అందులో 10 టన్నులు జిందాల్ ఫ్యాక్టరీ, వర్మికంపోస్టుకు తరలించి, మిగిలింది తెచ్చి ఆర్వోబీ పక్కనే వాగులో పోస్తున్నారు. మూడేళ్లుగా ఇదే పద్ధతి అనుసరిస్తుండటంతో వాగు పరీవాహక ప్రాంతంలో రెండు నుంచి మూడెకరాల మేర చెత్త పేరుకుపోయింది. వినుకొండ మండలం దొండపాడు వద్ద ప్రారంభమయ్యే వాగు అయిదు కి.మీ. ప్రవహించి నూజండ్ల మండలం తెల్లబాడు ఎగువన గుండ్లకమ్మ నదిలో కలుస్తుంది. పంట పొలాలకు సాగునీటి వనరుగా ఉపయోగపడుతుంది. ఇలాంటి వాగును వినుకొండ సమీపంలో డంపింగ్ యార్డుగా మార్చడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పట్టణ పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి ఇస్మాయిల్‌ను వివరణ కోరగా డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ శాఖకు లేఖ రాశామని తెలిపారు.

వాగులో కనుచూపు మేర చెత్తకుప్పలు

(c) eenadu

భూమి, ఆస్తి వివాదాలే అధికం

సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పోలీసు అధికారి కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బాధితుల నుండి ఆయన వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై 24, కుటుంబ, ఆస్తి తగాదాలు 20, నగదు వ్యవహారాలపై 18, ఇతరులు 14 అర్జీలు సమర్పించగా వారి సమస్యలు ఆలకించిన ఎస్పీ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రూ.15 లక్షలకు టోకరా

నా భర్త షేక్ నాగుల్ మీరా ఇటీవలే మరణించారు. ఆయన సెల్ నంబరు నేను వినియోగిస్తున్నాను. కొద్ది రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తనది బళ్లారి అని చెప్పాడు. తన దగ్గర బంగారం ఉందని తక్కువ ధరకు ఇస్తానని నమ్మబలికాడు. ముందుగా రెండు కాయిన్లు ఇచ్చాడు. అవి మేలిమి బంగారం కావడంతో నా చెల్లెలి భర్తతో కలిసి బళ్లారి వెళ్లి రూ.15 లక్షలు ఇచ్చి 250 గ్రాముల బంగారం కొన్నాం. వాటిని హైదరాబాద్‌లో పరీక్షించగా నకిలీ బంగారంగా తేలింది. తగిన న్యాయం చేయాలి. - **షేక్ జానీబేగం, దుర్గి**

ఇంటి రుణం విషయమై ఇబ్బందులకు గురి చేస్తున్నారు

2022 డిసెంబరులో నా భర్త ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ.1.60 లక్షలు ఇంటి రుణం తీసుకున్నాడు. ఇటీవల ఆయన మృతిచెందారు. నాకు ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా రుణం కట్టలేని పరిస్థితులో ఉన్నాను. అయినా ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది జానకిరామ్, క్రాంతి, గోపి అనే వారు రాత్రిళ్లు ఇంటి వద్దకు వచ్చి దుర్భాలాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. - **చెరుకూరి నాగలక్ష్మి, నాగవరం, క్రోసూరు మండలం**

లోన్ ఇప్పిస్తామంటూ మోసం

సత్తెనపల్లికి చెందిన జోగిపర్తి రవి కుమార్, వెంకటేష్, అనిల్ అనే ముగ్గురు ఇటీవల పరిచయమయ్యారు. ప్రభుత్వ కార్పొరేషన్ లోను ఇప్పిస్తామని విడతల వారీగా రూ.1.65 లక్షలు నగదు బదిలీ చేయించుకున్నారు. లోన్ ఇప్పించలేదు. డబ్బులు అడిగితే దౌర్జన్యానికి దిగి దాడి చేస్తున్నారు. - **కొత్త శివన్నారాయణ, పిడుగురాళ్ల**

బడి మానేసిన వారికి సదవకాశం: కలెక్టర్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో చదువు మధ్యలో మానేసిన వారు సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని దానిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సార్వత్రిక విద్యాపీఠంనకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు సమీపంలోని దూరవిద్య అధ్యయన కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి వరద సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

నూజండ్ల, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం కావడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా సమన్వయకర్త సైదయ్య అన్నారు. మండలంలోని అప్పాపురం, మారెళ్లవారిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రస్తుత వ్యవసాయ విధానాలతో భూమిలో కార్బన్ 05 శాతం కంటే తక్కువగా ఉందన్నారు. దీంతో పంటలకు చీడపీడలు సోకి, పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గి రైతులు నష్టాల పాలవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే పెట్టుబడులు తగ్గి లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రతి రైతు కుటుంబాలకు అవసరమైన ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి వేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారంతో కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. ప్రతి రైతు నవధాన్య విధానం అమలు చేయాలన్నారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. సీసీలు వెంకట్రావు, హనుమంతరావు, మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, యూనిట్ ఇన్‌ఛార్జి శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు కొనుగోలులో రైతులకు ఇబ్బంది రానీయొద్దు

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు చిత్రంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ఈనాడు-అమరావతి, గుంటూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గోదాములు నిండిన నేపథ్యంలో.. ప్రైవేటు గోదాములను అద్దెకు తీసుకుని పొగాకు అక్కడికి తరలించాలని, అందుకయ్యే ఖర్చులను మార్క్‌ఫెడ్ భరిస్తుందని హామీ ఇచ్చారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. 2024-25 సంవత్సరంలో 80 మిలియన్ కిలోల ఉత్పత్తిని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 22 పొగాకు కంపెనీలు 36 మిలియన్ కిలోల పంట కొనుగోలు చేశాయని వివరించారు. ఈ నెల 21 నుంచి సన్న, చిన్నకారు రైతుల దగ్గరున్న మొత్తం పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 1,276 రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని అచ్చెన్నాయుడు వివరించారు. రానున్న సీజన్‌లో రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలు వేయాలని, అందుకనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ ఎక్స్-అఫీషియో ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు ఎస్.ఢిల్లీరావు, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఆయా జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

यूनियन बैंक Union Bank of India — పసుమర్రు బ్రాంచ్, 1వ ఫ్లోర్, హరిహరసుత కాంప్లెక్స్, కళామందిర్ సెంటర్, పసుమర్రు, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా-522616. ఫోన్: 8928233030

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారునగలు **ది.31-07-2025, గురువారం సాయంత్రం గం॥ 4-00 లకు** మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది.31-07-2025 మధ్యాహ్నం 2.00 గం॥లలోపు తమ గుర్తింపుకార్డును చూపి రూ.10,000/-లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయిలు రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చుల కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్ర సం	ఋణ ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాములలో	నికర తూకం గ్రాములలో
1	330306540082909	ముత్యాల యావాలయ్య, తండ్రి : రామారావు, డి.నెం.6-62, కట్టుబడివారిపాలెం, యడవల్లి, పల్నాడు జిల్లా.	36.9	29
2	330306540076430	తన్నీరు నాగేంద్రం, భర్త : అంజయ్య, డి.నెం.12-1324, వడ్డెర కాలనీ, చిలకలూరిపేట.	20	18
3	330306540083106	చావలి వెంకటేశ్వర్లు, తండ్రి : వీరనారాయణ, 5-66,	12	10.5
4	330306540082115	సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు, ప్రకాశం.	62.9	52.5
5	330306540082855	ముత్యాల శ్రీనివాసరావు, తండ్రి : రామారావు, డి.నెం.6-62, కట్టుబడివారిపాలెం, యడవల్లి, పల్నాడు జిల్లా.	35.3	28
6	330306540081844	కర్నాటి ఆంజనేయులు, తండ్రి : చిన్న రామయ్య, డి.నెం.	13	12
7	330306540081842	7-76/1, కట్టుబడివారిపాలెం, యడవల్లి, పల్నాడు జిల్లా.	24	21
8	330306540082374	చావలి కిరణ్ నాగరాజు, తండ్రి : వీరనారాయణ, 5-66, సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు, ప్రకాశం.	63.7	53
9	330306540081196	దూర సుబ్బ రామయ్య, తండ్రి : వెంకటనారాయణ, డి.నెం.3-437/1, 8వ లైను, పండరీపురం, చిలకలూరిపేట.	30.5	25
10	330306540082298	కుమ్మరి హనుమంతరావు, తండ్రి : సుబ్బారావు, కొమ్మలపాడు, చెన్నుపల్లి, బల్లికురువ.	89	78.5

తేది: 14-07-2025, ప్రదేశం: పసుమర్రు సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పసుమర్రు బ్రాంచి, పల్నాడు జిల్లా.

ఏటీఎం సాగుతో నిరంతర ఆదాయం

బెల్లంకొండ, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం (ఎనీటైం మనీ మోడల్) పద్ధతుల్లో సాగు చేసే రైతులు నిరంతరం ఆదాయం పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం క్రోసూరు డివిజన్ ఎం.టి.జయలక్ష్మి అన్నారు. సోమవారం బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయ రైతు టి.శ్రీనివాసరెడ్డి 30 సెంట్లలో ఏటీఎం విధానంలో పంటలు సాగు చేశారు. 18 రకాల దుంప, తీగ, ఆకుకూరలు, కూరగాయలు, బోర్డర్ క్రాప్‌గా మొక్కజొన్న వేశారు. ఆ పంటలను ఆమె పరిశీలించి మాట్లాడుతూ రసాయనాలు లేకుండా పండించిన ఆహార ఉత్పత్తులు తింటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. యూనిట్ ఇన్‌ఛార్జులు కె.జ్యోతి, బి.శ్రీనివాసరెడ్డి, టి.మాధవి, సావిత్రి, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

పరికరం చిన్న.. ఉపయోగం మిన్న

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూపకల్పన

న్యూస్‌టుడే, బాపట్ల

బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యవసాయ యాంత్రీకరణ విభాగం ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే సామగ్రి తయారు చేసి అందుబాటులో ఉంచారు. చిన్న, సన్నకారు రైతుల కోసం వీటిని రూపొందించి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కళాశాలలో ఉత్పత్తి చేసిన పలు పరికరాల వివరాలను ఏడీ డీడీ స్మిత్ తెలిపారు.

కల్టివేటర్: ఒకసారి నేలను దున్నిన తర్వాత వదులైన మట్టిని గుల్లగా, చదును చేయటానికి, కలుపు మొక్కలు నివారించటానికి కల్టివేటర్ ఉపయోగపడుతుంది. నాణ్యమైన ఉక్కుతో పరికరాన్ని తయారు చేశారు. పరికరానికి ఉన్న కర్రులు దీర్ఘ కాలం అరిగిపోకుండా పని చేసేలా రూపొందించారు.

కర్రులదంతి: పంట సాళ్లలో, నేలపై మొలిచిన కలుపు మొక్కలను భూమిలో నుంచి పెకిలించి వేయటానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది. దీనికి కింద వైపున ఉన్న త్రిభుజాకార బ్లేడ్లు బలంగా నాటుకుని ఉన్న ముదురు కలుపును కూడా లాగేస్తుంది.

త్రిభుజాకార దంతి: ఈ పరికరం ఓ చిన్నపాటి గొర్రు లాగా పని చేస్తుంది. రైతులు, కూలీలు చేతితో లాగుతూ నేలను పెకిలించవచ్చు. మెట్ట భూముల్లో, పెరటి తోటల్లో, వరి సాళ్లలో కలుపు సులువుగా తీయటానికి అవకాశం ఉంటుంది.

నేలను చదును చేసే బ్లేడు: ట్రాక్టర్‌కు కలిపి పొలంలో బ్లేడు లాగితే నేలను చదును చేస్తుంది. లెవలర్‌గా, ట్రాక్టర్ రివర్స్ గేరులో నడిపినప్పుడు మట్టిని నెట్టడానికి బుల్డోజర్‌గా ఉపయోగపడుతుంది. భూ ఉపరితలంపై లోతైన గుంటలు నింపి చదును చేయటానికి పని చేస్తుంది. దీంతో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి మట్టి నెట్టుకొని వెళ్లి చదును చేయటానికి అవకాశం ఉంటుంది. బ్లేడు రెండు మీటర్ల పొడవు ఉంటుంది.

రైతేరాజు

విత్తన శుద్ధే మొక్కకు రక్షణ కవచం

పొన్నూరు, న్యూస్‌టుడే: విత్తనశుద్ధి మొక్కకు రక్షణ కవచమని పొన్నూరు మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. విత్తనశుద్ధి చేసుకునే విధానాన్ని వివరించారు. ఎంపిక చేసుకున్న విత్తనాల నుంచి చెత్త, చెదారం, తాలు, రాళ్లు, దుమ్ము వేరు చేయాలి. అనంతరం విత్తనాలను సూర్యరశ్మిలో ఆరబెట్టాలి. కిలో విత్తనానికి కార్బండిజమ్ 3 గ్రాములు లేదా సూడోమోనాస్ 10 గ్రాములను కలిపి ఆరబెట్టాలి. ఫలితంగా మొక్కకు తొలిదశలో ఆశించే చీడపీడలు నశిస్తాయి. రైతులు ఖర్చు తగ్గించుకునేందుకు వెదజల్లే పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు. గంజి లేదా నీరు లేనివిత్తనాలపై మందు కలిపి విత్తుకోవాలి. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్ల బెడద తగ్గి అధిక దిగుబడులు సాధించొచ్చు.

దానిమ్మ తోటల్లో తెగుళ్ల నివారణ చర్యలు



యడ్లపాడు, న్యూస్‌టుడే: దానిమ్మ తోటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా ఉద్యాన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని చిలకలూరిపేట ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. ❖ పక్షి కన్ను తెగులుతో దానిమ్మ చెట్ల ఆకులపై నల్లని మచ్చలు ఏర్పడి అవి క్రమంగా పెరిగి ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1.5 మి.లీ. స్ట్రెప్టోమైసిన్ 0.2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ❖ పండుకుళ్లు తెగులు సోకిన చెట్ల పండ్లు పక్వానికి రాక ముందే కుళ్లిపోయి రాలిపోతాయి. దీని నివారణకు వ్యాధి సోకిన చెట్ల కాయలను తొలగించాలి. కాపర్ ఆధారిత శిలీంద్ర నాశకాలు వాడాలి.

❖ బొబ్బర తెగులుతో చెట్ల బెరడు రాలిపోయి పగుళ్లు ఏర్పడతాయి. నివారణకు వ్యాధి సోకిన భాగాలను తీసివేసి సాఫ్ 2 గ్రా. లేదా స్ట్రెప్టోసైక్లిన్ 0.2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడల నివారించేలా..

❖ వేపనూనె, వేపపిండి, ట్రైకోడెర్మా, బోర్డో మిశ్రమం వంటివి వాడాలి. ❖ పొలం చుట్టూ గడ్డిని తొలగించి సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలి. ❖ మిత్రపురుగులను ఉపయోగించి పంటకు నష్టం చేసే పురుగులను అదుపులో ఉంచుకోవచ్చు. ❖ రసాయన ఎరువులను పరిమిత మోతాదులో వాడాలి.

పశువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు

డాక్టర్ డీవీ శివాజి

వినుకొండ, న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రభావం పశువుల ఆరోగ్యంపై ఎక్కువగా ఉంటుంది. అధిక తేమ, మట్టిలో ఉండే సూక్ష్మజీవులు, దోమలు, తడి వాతావరణంతో పలురకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నూజండ్ల పశు వైద్యాధికారి శివాజి తెలిపారు. వాటి నివారణ చర్యలను వివరించారు. ❖ దోమలు, ఈగల ద్వారా ముద్ద చర్మ వ్యాధి వస్తుంది. ఆవులపై దీనిప్రభావం అధికం. శరీరంపై పుండ్లు, జ్వరంతో పాటు ఆకలి కోల్పోతాయి. వైరల్ వ్యాధి కావడంతో పశువైద్యుని పర్యవేక్షణలో వ్యాధి నిరోధక శక్తి ఇచ్చే మందులు వాడి పశువును కాపాడుకోవాలి. ❖ బ్యాక్టీరియాతో సోకే గొంతువాపు వ్యాధి వల్ల పశువు గొంతు వాపుతో పాటు శ్వాస తీసుకోలేకపోవడం, అధిక జ్వరంతో కొన్ని సందర్భాల్లో చనిపోతాయి. లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యుని సూచనల మేరకు యాంటీబయోటిక్స్, యాంటీపైరెటిక్స్ వాడి కాపాడుకోవచ్చు. వర్షాకాలానికి ముందే టీకాలు వేయించాలి. ❖ మట్టి ద్వారా వ్యాపించే బ్యాక్టీరియాతో లెప్టోస్పైరోసిస్ సోకుతుంది. ఎర్రమూత్రం, జ్వరం, తల దించుకుని నిలబడటం వ్యాధి లక్షణాలు గుర్తించి పశువైద్యుని సూచన మేరకు యాంటీబయోటిక్స్ వాడాలి. మంచినీరు, శుభ్రత, వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు.

❖ ఆవులు, ఎద్దులకు సోకే జబ్బవాపుతో 105 డిగ్రీల జ్వరం, కాళ్లు లేదా భుజం ప్రాంతాల్లో వాపుతో కూడిన నొప్పి ఉంటుంది. పెన్సిలిన్స్, టెట్రాసైక్లిన్స్ వంటి మందులు వైద్యుల సూచన మేరకు వాడాలి. జూన్‌లో వ్యాక్సిన్ వేయడం మంచిది.

❖ బ్యాక్టీరియాతో పశువులు, జీవాల కాళ్లకు ఫుట్‌రాట్ వ్యాధి సోకుతుంది. దీనివల్ల గిట్టల్లో పుళ్లు, వాపు, నడవడానికి ఇబ్బంది ఉంటుంది. యాంటీబయోటిక్స్‌తో పాటు నొప్పి నివారణ మందులు వాడాలి. తేమ ఎక్కువ ఉన్న ప్రాంతంలో ఉంచకూడదు. గిట్టలు శుభ్రంగా ఉంచాలి. ❖ తడిసిన గడ్డి వేయడంతో జీర్ణవ్యవస్థ పాడై పొట్ట ఉబ్బరం, పారుడు వంటివి సంభవించే అవకాశం ఉంది. ఎండు గడ్డి, తగినంత మినరల్స్ వాడి నివారించుకోవచ్చు. ❖ వర్షాకాలంలో షెడ్ పొడిగా ఉంచాలి. షెడ్యూలు ప్రకారం హెచ్‌ఎస్, బీక్యూ, ఎఫ్‌ఎండీ, ఎస్‌డీని వేయించాలి. దోమలు, ఈగల నివారణకు ఫ్యూమిగేషన్, నెబులైజేషన్ చేయాలి. తడి లేకుండా ఎండిన పశుగ్రాసం ఇవ్వాలి. పశువును పరిశుభ్రంగా ఉంచాలి. వీటిని పాటించడం వల్ల పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.

తహసీల్దారు సంతకం ఫోర్జరీ చేసి బెదిరిస్తున్నారంటూ ఫిర్యాదు

నకరికల్లు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ లేఅవుట్-2లో తమ పేరుతో కేటాయించిన స్థలానికి కొందరు అక్రమార్కులు అప్పటి తహసీల్దారు సంతకం ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి బెదిరిస్తున్నారని హేస్సెన్‌బీ అనే మహిళ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా నకరికల్లు తహసీల్దారు పుల్లారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమకు ఉండటానికి ఇల్లు సరిగా లేదని అప్పటి ప్రజాప్రతినిధులను సొంత ఇంటి నిర్మాణం కోసం వేడుకున్నామన్నారు. అధికారులతో మాట్లాడి మండల పరిధిలోని తహసీల్దారు కార్యాలయం వెనుక జగనన్న కాలనీ లేఅవుట్-2లో స్థలం కేటాయించినట్లు తెలిపారు. అప్పటి తహసీల్దారు ప్రశాంతి తమకు ఇళ్ల పట్టాలు అందించారన్నారు. గత రెండు నెలలుగా కొందరు అక్రమార్కులు ఆ స్థలం తమదని అంటూ తహసీల్దారు సంతకం ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి బెదిరిస్తున్నారంటూ స్థలం ఇవ్వకపోతే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని తహసీల్దారు ముందు వాపోయారు. దీనిపై స్పందించిన తహసీల్దారు డిప్యూటీ తహసీల్దారు కొండారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ నిర్వహించి విచారణకు ఆదేశించారు. అర్హులైన పట్టాదారులకు ఇళ్ల స్థలాలు అందేలా చూస్తామని, ఫోర్జరీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని పుల్లారావు తెలిపారు. ఇంకా గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాల పంపిణీలో మోసపోయిన వారు ఉంటే స్వచ్ఛందంగా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

గుంటూరు వైద్యుడు హేమంత్‌కు రెండు ఫెలోషిప్‌లు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరుకు చెందిన న్యూరోసర్జన్ హేమంత్ ఉప్పుటూరి లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన జరిగిన సమారోహంలో ఫెలోషిప్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఎఫ్ఆర్‌సీఎస్), ఇంటర్నేషనల్ సర్జికల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఫెలోషిప్(ఐఎస్‌టీపీ) అందుకున్నారు. ఈమేరకు గుంటూరులో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనవివరాలు వెల్లడించారు. ఎఫ్ఆర్‌సీఎస్, ఐఎస్‌టీపీ రెండింటినీ ఒకేసారి అందుకున్న తొలి వ్యక్తిగా తనకు గుర్తింపు దక్కిందన్నారు. లండన్‌లో శిక్షణ సమయంలో నేర్చుకున్న నైపుణ్యాలతో స్థానిక రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించగలనని చెప్పారు. గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, వెల్లూరు క్రిస్టియన్ వైద్య కళాశాలలో న్యూరోసర్జరీ పూర్తి చేసి గుంటూరులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అమృత హాస్పిటల్స్, యాంజియో కేర్ హాస్పిటల్, న్యూరో క్యూర్ హాస్పిటల్, స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్ యాజమాన్యాలు, సిబ్బంది హేమంత్‌ను అభినందించారు.

పీబీసీ కాలువలోకి ట్రాక్టర్ బోల్తా

ఘటనా స్థలిలో గ్రామస్థులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: వాహనచోదకుడి నిర్లక్ష్యంతో అదుపు తప్పిన ట్రాక్టర్ సాగర్ కాల్వలో బోల్తా పడింది. మండలంలోని మైదవోలులోని మైనర్ ఇరిగేషన్ చెరువులో తవ్విన మట్టిని అదే గ్రామానికి చెందిన కటికల సురేష్ ట్రాక్టర్‌తో సొలస వద్ద పంట చేలకు సోమవారం తరలిస్తున్నాడు. లింగారావుపాలెం వారధి వద్ద ట్రాక్టర్‌ను అతి వేగంతో నడపటంతో అదుపు తప్పింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ సురేష్‌తో పాటు ఇంజిన్‌పై కూర్చున్న మరో వ్యక్తి వారధిపైకి దూకటంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ట్రక్కు నుంచి విడిపోయిన ట్రాక్టర్ వారధి నుంచి 10 అడుగుల లోతున ఉన్న పీబీసీ కాల్వలోకి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ ధ్వంసమైంది. గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను పైకి తీసుకొచ్చారు.

ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

ముసలయ్య (పాతచిత్రం)

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రామంలోకి వచ్చిన పాఠశాల వాహనం రివర్స్ చేస్తున్న సమయంలో వృద్ధుడిని ఢీకొట్టగా అతడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మాచర్లలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు రచ్చమల్లపాడు గ్రామంలో విద్యార్థులను ఎక్కించుకున్న అనంతరం రివర్స్ చేస్తుండగా బస్సు వెనుక ఉన్న తన్నీరు ముసలయ్య అనే వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన ముసలయ్య తల కణతకు గాయమైంది. బస్సు డ్రైవర్, అక్కడున్న మరికొంతమంది అతడిని దగ్గరలోని ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత బస్సు డ్రైవర్ వృద్ధుడికి బాగానే ఉందని, బస్సు తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే వృద్ధుడు మరణించాడు. దీనిపై కేసు నమోదు కాలేదు.

రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట రైల్వేస్టేషన్ పరిధిలో సంతమాగులూరు- శావల్యాపురం రైల్వేస్టేషన్ల మధ్య వెల్లలచెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నుండి జారిపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై శ్రీనివాసనాయక్ తెలిపారు. మృతుడికి సుమారు 35 నుండి 40 ఏళ్లు ఉండవచ్చని ఎరుపు రంగు అర చేతుల చొక్కా, సిమెంట్ రంగు స్వెట్టర్, నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి మెడలో సిలువతో కూడిన దండ ఉన్నట్లు తెలిపారు.

వాహనం అదుపు తప్పి మరొకరు.. చిలకలూరిపేట గ్రామీణ: మండలంలో ఈవూరివారిపాలెం నుంచి గోరంట్లవారిపాలెం వెళ్లే మార్గంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈవూరివారిపాలెం గ్రామానికి చెందిన ముద్దన సాంబశివరావు (60) పాల వ్యాపారం చేస్తుంటాడు. అందులో భాగంగా ద్విచక్రవాహనంపై మిట్టపాలెం వెళ్తుండగా మార్గంమధ్యలో గోరంట్లవారిపాలెం వద్ద చప్టాపై రహదారి సక్రమంగా లేకపోవడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కాల్వలో పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త దారపనేని శ్రీనివాసరావుపై గ్రామానికే చెందిన లాగా కోటయ్య, బొదిలవీడుకు చెందిన పంగులూరి బాబురావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మాచర్ల మాజీ మున్సిపల్ ఛైర్మన్ తురకా కిశోర్ మరికొంతమంది కలిసి పార్టీ మారలేదన్న నెపంతో మారణాయుధాలతో దాడి చేశారు. ఇటీవల బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. బాబురావు, శ్రీనివాసరావు, కోటయ్యలను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం మాచర్ల కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించింది.

వైకాపా నాయకుల్ని విచారించిన పోలీసులు

సత్తెనపల్లి: వైకాపా అధినేత జగన్ రెంటపాళ్ల పర్యటనలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై నమోదైన కేసులో వైకాపా నాయకులు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పురుషోత్తం, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ ఛైర్మన్ విజయభాస్కరరెడ్డి, కౌన్సిలర్ శివప్రసాద్, వెంకటేశ్వరరావు, మాధవ, నరసింహారావు సహా 10 మందిని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు సోమవారం విచారించారు. అనుమతి లేకుండా నిర్వహించిన ర్యాలీకి ఎంతమందిని సమీకరించారని ప్రశ్నించారు. రప్పా రప్పా ప్లకార్డుల ప్రదర్శన, ముద్రణ, డీజేతో నృత్యాలు, ట్రాఫిక్‌కు అవాంతరాలపై పలు విషయాలు రాబట్టి రికార్డు చేసుకున్నారు.

చిరుమామిళ్ల రేషన్ డీలర్‌పై 6ఎ కేసు

చిలకలూరిపేట గ్రామీణ: నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలో 38వ నెంబరు రేషన్ దుకాణంపై రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులు దాడులు చేశారు. 45 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డీలర్ పోతిరెడ్డి అంజిరెడ్డిపై 6ఎ కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, రిటైల్ ధర - 121, చికెన్ విత్‌స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200.

EENADU Classifieds

BUSINESS SERVICES | PEOPLE CARE | JOBS

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఫైనాన్స్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా సొమ్ముతో విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

BUSINESS OFFER

OLD AGE HOME — 82474 49042, 96404 96677. 99590 21122, 99590 31122.

Wanted DTP Operators with Telugu and English Typing. Contact: Don Bosco Printing Press, Guntur. Ph: 98661 13331, 83309 60969.

REAL ESTATE | LAND FOR SALE | HEALTH & CARE | GENERAL

డ్యూటీ డాక్టర్స్, రిసెప్షనిస్ట్, నర్సెస్ (MPHW), ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను. కొత్త వారికి కూడా ప్రాధాన్యత. అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 94941 31450.

98885 62228 | 93819 82818. 99635 21122, 99631 01122. 93916 41248, 83851 17531. Cont:- 80194 14262. 73307 11162, 73864 85962. Cell: 88854 14786, 88854 97786. 95059 77315. 85199 93945. 96491 61889.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం. పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9 FM Vijayawada — ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు — సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
మ్యూజిక్ నౌ	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

న్యాయమూర్తి ప్రవళికను సత్కరిస్తున్న కుమారస్వామి

జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తికి సత్కారం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రవళికను బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సోమవారం సత్కరించారు. బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు రెండోసారి ఎన్నిక కావటంతో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కుమారస్వామి, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయవాది దారా చెన్నయ్య న్యాయమూర్తి ప్రవళికను శాలువతో సత్కరించారు.

జాతీయ చేనేత అవార్డుకు ఎంపికైన డిజైనర్‌కు అభినందనలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : జాతీయ చేనేత అవార్డుకు ఎంపికైన పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ కర్నాటి మురళిని ఛత్రపతి కళా పరిషత్తు ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. రాష్ట్రపతి నుంచి వచ్చే నెల 7న మురళి అవార్డు తీసుకోనుండటం సత్తెనపల్లికి గర్వకారణమని వక్తలు చెప్పారు. వివిధ కళాసంస్థల బాధ్యులు ఆదినారాయణ, గోవిందు, వెంకోజీ, భవానిప్రసాద్, భానోజి, ఫిరోజి తదితరులు పాల్గొన్నారు.

మురళిని సత్కరిస్తున్న వివిధ సంస్థల బాధ్యులు

ఉద్యాన పంటలకు రాయితీ

ఆకులగణపవరం (రాజుపాలెం), న్యూస్‌టుడే: పండిన పంటను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేందుకు కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవటం వల్ల ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉండవచ్చని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యానశాఖ, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ లిమిటెడ్ సంయుక్తంగా సోమవారం ఆకులగణపవరంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ పదిహేను రకాల ఉద్యాన పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ ఇస్తున్నాయని, వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. జిల్లా ఉద్యానాధికారి వెంకట్రావు మాట్లాడుతూ నీరు సమృద్ధిగా ఉంటే ఆయిల్‌పామ్ సాగు ఆశాజనకంగా ఉంటుందని, పంట కుంటలు నిర్మించుకుంటే రూ.75వేలు రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. కంపెనీ ప్రతినిధి రామ్మోహనరావు మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకపోవటం వల్ల ప్రతి రూపాయి కర్షకుని ఖాతాలోనే జమ చేస్తామని, తద్వారా అధిక లాభం అందుతుందన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం తండాలో సిమెంటు రహదారిని, ఉప్పలపాడులో ఆయుష్మాన్ ఆరోగ్య భవన్‌ను ప్రారంభించి పాడిరైతులకు రాయితీపై దాణా అందజేశారు.

ఆయిల్‌పామ్ మొక్క నాటి మట్టి పోస్తున్న కన్నా

వైద్యుడి దయ.. రోగి ప్రాప్తం!

గ్రామీణ ప్రాంతాల్లో 24గంటల వైద్య సేవలు ఉత్తమాట

పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి పూట వైద్య సేవలకు వచ్చే వారికి వైద్యుడి దయ, రోగి ప్రాప్తం అనేలా ఉంది. 24 గంటలు వైద్య సేవలందించాలని ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలు సేవలు అందించడంలో విఫలమవుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న వేతనంతో పాటు అలవెన్సులు అందుకుంటున్న వైద్యులు, సిబ్బంది రాత్రి వేళ విధుల్లో ఉండటం లేదు. సాధ్యమైనంత వరకు రాత్రివేళ సేవలు వైద్య సిబ్బందిపై ఆధారపడి కొనసాగుతున్నాయి. రెగ్యులర్ డ్యూటీ డాక్టర్లు, కాల్ డ్యూటీ డాక్టర్లు అసలు కనిపించని పరిస్థితి. అత్యవసర వైద్య సేవలందించాల్సిన ఆసుపత్రులపైనా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, సేవలందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం రాత్రి ఈనాడు నెట్‌వర్క్ విభాగం పరిశీలనలో అత్యవసర వైద్యసేవలు వైద్యుడి దయ..రోగి ప్రాప్తంలా కనిపించింది.

రాత్రి వేళ ఖాళీగా అత్తలూరు పీహెచ్‌సీ

విధుల్లో స్టాఫ్ నర్స్ ఒక్కరే...

★ అమరావతి మండలం అత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో ఒక స్టాఫ్ నర్స్ నళిని మాత్రమే రాత్రి విధుల్లో ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 85 మంది రోగులు సేవలు పొందారు. నూతనంగా ఆసుపత్రి నిర్మించినా మంచాలపై బెడ్‌లు లేని పరిస్థితి. ఇన్‌పేషెంట్లు లేరు. గర్భిణులకు అత్యవసర సేవలు అవసరమైతే వైద్యులు ఎవరూ అందుబాటులో లేరు. సోమవారం రాత్రి ఇద్దరు దంపతులు రోడ్డు ప్రమాదం జరిగి వస్తే స్టాఫ్ నర్సే వారికి వైద్యం అందించి మందులు ఇచ్చి పంపేశారు. అత్యవసర వైద్యసేవలపై సిబ్బందిని అడిగితే వైద్యులు గుంటూరు నుంచి వస్తారని పేర్కొన్నారు.

★ 75త్యాళ్లూరు పీహెచ్‌సీ వైద్యులు ఆదిత్య రెండు నెలల క్రితం సెలవు నిమిత్తం వెళ్లారు. డీడీవో వెలుగొండారెడ్డి 104సేవలు, పీహెచ్‌సీ మీటింగ్‌లకు వెళ్లడంతో సేవలకు ఇబ్బంది కలుగుతుంది. అమరావతి కో-లోకేటెడ్ ఏరియా నుంచి వైద్యాధికారి మౌనిక 75త్యాళ్లూరు పీహెచ్‌సీలో ఇన్‌ఛార్జిగా సేవలందిస్తున్నారు. వైద్యాధికారి వెలుగొండారెడ్డి స్థానికంగా ఉండటం లేదు. గుంటూరు పట్టణం నుంచి విధులకు వస్తున్నారు. అత్యవసర కేసులు వస్తే 35 కిలోమీటర్ల నుంచి ప్రయాణం చేసి వచ్చేసరికి రోగి పరిస్థితి గాలిలో దీపంగా ఉంది. ఇక్కడ ఒకే స్టాఫ్ నర్స్ మమత, సెక్యూరిటీ విభాగం నుంచి ఒక మహిళ ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు.

★ అచ్చంపేట పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్, సెక్యూరిటీ విధుల్లో ఉన్నారు. డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండరని కాల్‌డ్యూటీలో వస్తారన్నారు.

★ బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం పీహెచ్‌సీ పరిధిలో స్టాఫ్ మేల్ నర్స్ ఒకరు విధుల్లో ఉన్నారు. వైద్యులు ప్రవీణ్‌కుమార్, దీపిక సాయంత్రం 6 గంటల తరువాత అందుబాటులో ఉండటం లేదు. స్థానికంగా వైద్య సిబ్బంది సైతం ఎవరూ స్థిర నివాసం ఉండటంలేదు.

టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వీరాంజనేయులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎన్‌ఎస్‌ఎఫ్) నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గొల్లపల్లి వీరాంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీఎన్‌ఎస్‌ఎఫ్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సత్కరించారు.

గవర్నర్‌గా అశోకగజపతిరాజు ఎంపికపై హర్షం

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి తెదేపా సీనియర్ నేత పి.అశోకగజపతిరాజును ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తెదేపా నేతలు మాజీ జడ్పీటీసీ బలరామకృష్ణంరాజు, ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డి.యోహాను హర్షం వ్యక్తం చేశారు. అపారమైన రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి అశోకగజపతిరాజు అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు.

నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణ పోలీసు స్టేషన్‌లో నూతన ఎస్సైగా జాజం శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాడేపల్లి ఎస్సైగా పనిచేసిన ఆయన వీఆర్ నుంచి పట్టణ ఎస్సైగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ నాగమల్లేశ్వరరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ అపర్ణ

రాజుపాలెం, న్యూస్‌టుడే: ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణదారులు వ్యవసాయశాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ కమిషనర్ కార్యాలయం విజిలెన్స్ సీఐ అపర్ణ సూచించారు. రాజుపాలెంలోని బాలాజీ ఎరువుల దుకాణాన్ని ఏడీఏ కన్నయ్యతో కలసి సోమవారం తనిఖీ చేశారు. నమోదు చేసిన నిల్వలకు భౌతిక నిల్వలకు వ్యత్యాసం ఉండటం, ఓ పత్రం లేకపోవడం, ఈ పోస్ యంత్రంలో నమోదు చేయకపోవటం వంటి అంశాలతో రూ.66,770ల విలువ చేసే 56 బస్తాలను జప్తు చేసి, దుకాణదారునిపై 6ఎ కేసు నమోదు చేశారు. అదే విధంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.58,962ల పురుగుమందుల అమ్మకాలను నిలిపివేయాలని సూచించారు.

అచ్చంపేట: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ ప్రత్యేక తనిఖీ అధికారి ఏడీఏ కె.కన్నయ్య, విజిలెన్స్ సి.ఐ అపర్ణ, ఏవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

దుర్గిలో ఎస్ఎస్‌జీ బృందం పరిశీలన

దుర్గి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

దుర్గి, న్యూస్‌టుడే : దుర్గిలో సోమవారం ఎస్ఎస్‌జీ (స్వచ్ఛ సర్వేక్షణ్ (గ్రామీణ్) బృందం సభ్యులు ఆరోగ్య కేంద్రాన్ని, జడ్పీ పాఠశాల, మండల పరిషత్తు పాఠశాలలను, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్ల వంటి వాటిని పరిశీలించారు. తడి పొడి చెత్త కేంద్రాలు వినియోగంలో ఉన్నాయా.. లేదా, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు వెళ్లి వారు మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బృందం లీడరు పల్నాడు జిల్లా డీడబ్ల్యూఎస్సీ కన్సల్టెంట్ జి.రమేష్, సమన్వయకర్త వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రెండు రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. సోమవారం పట్టణంలోని ఐలాండ్ సెంటరులో కార్మికులు మానవహారం నిర్వహించి అనంతరం జానపాడురోడ్డులో దీక్షా శిబిరంలో సమ్మె చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులను వెంటనే చర్చలకు పిలిచి పరిష్కారం చేయకపోతే సమ్మెను ఉద్ధృతం చేస్తామని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

మాచవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే, కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ అన్నారు. సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని తురకపాలెంలో నిర్వహించారు. నిఖిల్ వెంట మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, షేక్ మాబువలి తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, పెదకూరపాడు మండల తెదేపా అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్యలు పేర్కొన్నారు. సోమవారం పెదకూరపాడులోని పలు వార్డుల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

వెల్దుర్తి: తెదేపా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కుర్రి శివారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మిట్టమీదపల్లెలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.

తురకపాలెంలో కరపత్రాన్ని అందజేస్తున్న నిఖిల్

పెదకూరపాడులో..

రైతులకు బాట ఏర్పాటు చేయాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎర్రవాగు పరిసర ప్రాంత రైతుల భూములకు బాట మార్గం, పంట కాలువలు ఏర్పాటు చేయాలని పీడీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు జె.మధుబాబుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎర్రవాగు వద్ద ఉన్న బాటను కొందరు ఆక్రమించుకున్నారని, అధికారులు సర్వేచేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

పాలకవర్గ సభ్యులకు సత్కారం

ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, సభ్యులను సత్కరించిన మైనార్టీ నాయకులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని నందమూరి తారక రామారావు మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ సభ్యులను పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు సత్కరించారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరస్వామి, వైస్‌ఛైర్మన్ షేక్ మీరాసాహెబ్, సభ్యులను తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలీ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ సత్కరించారు. ఈసందర్భంగా అమీర్‌అలీ మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మన్ బీసీ వర్గానికి, వైస్ ఛైర్మన్ మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తులకు కేటాయించి ఆయా వర్గాలపై ఆయనకు ఉన్న అభిమానాన్ని చూపించారని తెలిపారు.

కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

మాట్లాడుతున్న తహశీల్దార్, వ్యవసాయాధికారి

కారంపూడి, న్యూస్‌టుడే : కౌలు రైతులందరూ ప్రభుత్వ గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీర్వోలు, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమీక్షా సమావేశం తహసీల్దారు వెంకటేశ్వర నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈమేరకు వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 17,11 కౌలు రైతు కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 282 కార్డులు మాత్రమే ఇచ్చామని, మిగిలిన కౌలు రైతులు కార్డుల కోసం వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరిసరాలు ఇలా ఉంటే రోగాలు రావా..?

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : ముప్పాళ్లలో మండల పరిషత్తు ఉర్దూ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, శివాలయం, పంచాయతీ ఆర్వో ప్లాంట్ మధ్య రోడ్డు పక్కనే పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. చెత్త, వ్యర్థాల్ని రోడ్డు పడేయడంతో మినీ డంపింగ్ యార్డులాంటి వాతావరణం నెలకొంది. పరిసరాలు ఇలా ఉంటే రోగాలు రావా.? అనే ప్రశ్న ఇక్కడి పరిస్థితుల్నిచూస్తే ఉత్పన్నమవుతుంది. పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులతోపాటు ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు కోరుకుంటున్నారు.

గుంత..చింత

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పాత అంబాపురం - గోగులపాడు రహదారిలోని కల్వర్టుపై గుంత ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నారు. అటుగా రైతులు నిత్యం రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి గుంతను సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అదుపుతప్పితే ఆసుపత్రిపాలే

పట్టణంలోని వావిలాల పార్కు ప్రధాన గేటుకు రోజూ రాత్రి 7 గంటలకు తాళం వేస్తున్నారు. ఆ తర్వాత గేటు దూకి పార్కులోకి ప్రవేశించేందుకు చిన్నారులు పీట్లు వేస్తున్నారు. ఎత్తయిన గేటును ప్రమాదకరంగా ఎక్కి లోపలకు దూకుతున్నారు. గేటు ఎత్తి దిగడంలో అదుపుతప్పితే ఆసుపత్రి పాలయ్యే ప్రమాదముంది. దీనికితోడు 7 గంటల తరువాత లైట్లు ఆఫ్ చేయడంతో లోపలకు వెళ్లినా చీకటి ఉంటుంది. ఆ సమయంలో విష పురుగుల కాటు పడితే జీవితమే ప్రమాదంలో పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతుంది. **-సత్తెనపల్లి, న్యూస్‌టుడే**

ప్రమాదకరంగా గేటు ఎక్కి లోపలకు దిగుతున్న చిన్నారులు

మహర్దశ అన్నారు.. అర్ధంతరంగా వదిలేశారు

నాడు.. నేడు భవనాలు పూర్తవక వెతలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పుకొని కీలకమైన అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టకుండానే అధికారం నుంచి దూరమైంది. సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే పూర్తికావాల్సిన పనులు ఇప్పటికీ సాగుతూ ఉండటంతో బోధనకు వెతలు తప్పట్లేదు. సరిపడా తరగతి గదుల్లేక చెట్ల కింద, వరండాలో, కళా వేదికల్లో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. అర్ధంతరంగా ఆగిపోయిన పనుల్ని కూటమి ప్రభుత్వం పూర్తిచేస్తే బడులకు ఎంతో మేలు జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

✦ ఈ నెల 10న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మెగా పీటీఎం 2.0 నిర్వహించారు. పాఠశాలలకు వచ్చిన తల్లిదండ్రులు అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు ఎప్పటికి పూర్తవుతాయా అనే ప్రశ్నను లేవనెత్తారు. తల్లిదండ్రుల కమిటీలతోనూ వారు మాట్లాడారు. సత్తెనపల్లి పట్టణం, మండలం, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల సమస్య తీవ్రంగా ఉంది. కొన్నాళ్ల క్రితం 80 శాతానికి పైబడి పనులు పూర్తయి ఉన్న వాటి పనులు చేపట్టేందుకు జిల్లాకు రూ.9 కోట్ల వరకు నిధుల్ని కూటమి ప్రభుత్వం కేటాయించింది. తల్లిదండ్రుల కమిటీలకు ఆ నిధులు మళ్లించి పనులు చేపట్టడంలో సమన్వయం కొరవడుతోంది.

✦ నాడు-నేడు రెండో విడతలో సత్తెనపల్లి పట్టణం, మండలంలో 56 పాఠశాలలు, ముప్పాళ్ల మండలంలో 23, నకరికల్లులో 32, రాజుపాలెం మండలంలో 40 పాఠశాలల్ని ఎంపిక చేశారు. వీటిలో అదనపు తరగతి గదులతో పాటు మౌలిక వసతుల కల్పన పనుల్ని చేపట్టేలా తొలివిడతలో రూ.20.19 కోట్లు విడుదల చేశారు. భవనాల నిర్మాణం కాకుండా మిగిలిన పనులు పూర్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు జడ్పీ సుగాలి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలు ప్రారంభించగా రెండుచోట్లా ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు. ముప్పాళ్ల మండలంలో మాదల, ముప్పాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. ఇక్కడా కొన్ని భవనాల నిర్మాణాలు ప్రారంభించినా పనులు పూర్తి చేయలేదు. రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. తల్లిదండ్రుల కమిటీల పర్యవేక్షణలో తరగతి గదుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని 'న్యూస్‌టుడే' బృందానికి ఎంఈవోలు తెలిపారు.

సత్తెనపల్లి జడ్పీ సుగాలి ఉన్నత పాఠశాలలో తుదిదశలో ఆగిన నాడు..నేడు పనులు

లాడ్జీలో వ్యభిచారం.. అయిదుగురి అరెస్టు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : మాచర్ల రింగు రోడ్డు కూడలిలోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారంతో పోలీసులు దాడి చేసి 5గురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై వెంకట రమణ తెలిపిన వివరాల ప్రకారం ఖచ్చితమైన సమాచారంతో దాడి చేసి ఒకే గదిలో మహిళతో కలిసి ఉన్న షేక్ జానీబాషా, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారిపై ఐటీపీ యాక్ట్ నమోదు చేశామన్నారు. ప్రస్తుతానికి వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించామని వివరించారు.

అవీ ఇవీ

చౌకధరల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

అచ్చంపేట న్యూస్‌టుడే: మండలంలోని చిగురుపాడు, వేల్పూరు గ్రామాల్లోని చౌకధరల దుకాణాలను సోమవారం మండల ఉప తహసీల్దారు సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్డుదారులకు బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. నిల్వలు పరిశీలించారు. వీఆర్వోలు వెంకయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ సంఘంలో మాచర్ల వాసులకు చోటు

మాచర్ల : రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం పదవుల్లో మాచర్లకు చెందిన ఇద్దరికి స్థానం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడిగా దండెంరాజు హనుమంతరావు, యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా యండపల్లి వెంకట సుబ్బారావులను ఎంపిక చేశారు. ఈమేరకు నియోజకవర్గ సంఘం సభ్యులు అభినందించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్ చేయండి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్లే ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో, మండలంలో కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా బస్సుల్లో విద్యార్థుల్ని ఎక్కువ మొత్తంలో ఎక్కిస్తున్నారని తెలిపారు. అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కె.సాయి, రోహిత్ కె.బెనర్జీ, నరేంద్ర కోరారు.

ఆత్మకూరు ఎస్సై ఆర్థికసాయం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని పిల్లుట్లరోడ్డులోని ఖబర్‌స్థాన్‌లో గుసుల్ ఖానా నిర్మాణానికి పట్టణానికి చెందిన షేక్ జిలానీ నెల్లూరు జిల్లా ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నారు. గుసుల్ ఖానా నిర్మాణానికి షేక్ జిలానీ రూ.40వేలు ఆర్థిక సహాయం చేశారు.

'ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం'

గురజాల, గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: వచ్చే ఎన్నికల్లో గురజాల నియోజకవర్గంలో వైకాపా జెండా రెపరెపలాడుతుందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి అన్నారు. గురజాల పట్టణంలోని వైకాపా పార్టీ కార్యాలయంలో సోమవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రజలను మోసగించారని విమర్శించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మాజీ షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మన్ పోలు వెంకటరెడ్డి విగ్రహాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆవిష్కరించారు.

నర్సరీలతో వ్యవసాయ కూలీలకు ఉపాధి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెంలో ఎకరా నర్సరీ భూమిలో రెండు లక్షల మొక్కల్ని పెంచుతున్నారు. ఇక్కడ 20 మంది వ్యవసాయ కూలీలు పనిచేస్తున్నారు. వారికి నెలన్నరగా రోజూ పని దొరుకుతోంది. రోజుకు రూ.300 నుంచి రూ.200 కూలీగా అందిస్తున్నారు. పనుల్లేని రోజుల్లో నర్సరీలు వ్యవసాయ కూలీలకు ఉపాధినిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వంలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో నర్సరీలు మూతబడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత సామాజిక అటవీ విభాగం, జిల్లా నీటి యాజమాన్య సంస్థల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటుచేసి వాటి ద్వారా రైతులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు మొక్కల్ని అందించే చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన నర్సరీల్లో సింహభాగం సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల పరిధిలోనే ఉన్నాయి. రాజుపాలెం మండలంలోని దేవరంపాడు, రాజుపాలెం, బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం, నకరికల్లు, పిడుగురాళ్ల మండలంలోని గుత్తికొండలో మొక్కల పెంపకానికి ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసింది. వచ్చే నెల వరకు ఇవి నడవనున్నాయి. దీంతో రైతులు, రైతు కూలీలకు ఉపాధి లభిస్తోంది. మరో నెల రోజుల వరకు వీటితో చేతినిండా పని ఉంటుందని కూలీలు చెబుతున్నారు.

పనులు చేస్తున్న కూలీలు

కృష్ణమ్మ చెంత.. నీటి కటకట

రూ.కోటి ఖర్చు చేసినా దిడుగు గ్రామానికి తీరని దాహార్తి

అమరావతి, న్యూస్‌టుడే : కృష్ణా తీరానికి అతి సమీపంలో ఉన్నా ఆ గ్రామ ప్రజలు ఏళ్లుగా తాగునీటి కష్టాలు అనుభవిస్తున్నారు. ఏటికేడు నీళ్లు వస్తున్నాయని ఎదురు చూస్తున్నారు తప్ప వారి దరికి మాత్రం చేరడం లేదు. అమరావతి మండల పరిధిలోని దిడుగు కృష్ణానది ఒడ్డున ఉంటుంది కానీ గ్రామానికి మాత్రం నీటి సరఫరా ఉండదు. గ్రామస్థులు బోర్లు, బావుల నుంచే నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఓవర్ హెడ్ ట్యాంకును పూర్తి చేసి నీటి విడుదల చేసినా 30 శాతం మందికి మించి నీరు అందని పరిస్థితి.

★ 2023లో జల్‌జీవన్ మిషన్ కింద గ్రామంలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరయ్యాయి. ఏడాది కాలంలోనే అవి పూర్తి చేయాల్సి వైకాపా హయాంలో పూర్తి కాలేదు. జల్‌జీవన్ మిషన్ కింద 1.10కోట్లు నిధులు ఖర్చు చేశారు. కానీ నీటి సరఫరా అందించలేక పోయారు. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, మైక్రో ఫిల్టర్లు, కృష్ణానది నుంచి తాగునీటి పైపులైన్లు వేసి చేతులు దులుపుకొన్నారు. అరకొర పనులు మిగిలి ఉంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్తి చేసి నీటి విడుదల చేశారు. కానీ గ్రామంలోని ఇళ్లకు మాత్రం కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. ప్రస్తుతం కనీసం 30 శాతం ఇళ్లకు మించి నీటి సరఫరా చేసే పరిస్థితి లేదు. స్థానిక ఎస్సీ కాలనీ వాసులకు గత కొన్నేళ్లుగా నీటి సరఫరా కావడం లేదని వాపోతున్నారు. దీంతో చేతి పంపులు కూడా పనిచేయని పరిస్థితి. ఒక్కో బావిలో పదుల సంఖ్యలో మోటార్లు వేసి నీరు వాడటం వల్ల నీరు కూడా అడుగంటుతున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు మాట్లాడుతూ నిధులు ఉన్న వరకు ఖర్చు చేశామని గ్రామం మొత్తానికి నీరు సరఫరా చేయాలంటే మరికొంత నిధులు కావాల్సి ఉందన్నారు.

సరిపడా నీరు అందించలేని ఓవర్ హెడ్ ట్యాంకు

నీటి కోసం బావిలో ఏర్పాటు చేసిన మోటార్లు

అప్పు విషయమై ఆత్మహత్యాయత్నం

దుర్గి, మాచర్ల, న్యూస్‌టుడే : అప్పు తీర్చమన్నందుకు వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన దుర్గి పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. దుర్గికి చెందిన భాజాపా మహిళా నాయకురాలు లక్ష్మీ సమీప బంధువైన అదే గ్రామానికి చెందిన సింగం శివకు గతంలో రూ. లక్షన్నర అప్పు ఇచ్చారు. అవి తిరిగి ఇవ్వకపోవడంతో ఆమె శివపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం అతన్ని పోలీసులు స్టేషనుకు పిలవగా పురుగుమందు డబ్బాలో పెట్రోలు పోసుకుని స్టేషనుకు వచ్చాడు. పోలీసుల ఎదుటే డబ్బా మూత తీసి నోట్లో పోసుకునే ప్రయత్నం చేయగా అప్రమత్తమైన పోలీసులు అడ్డుకొని అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

దుస్తులు ఆరేస్తూ వ్యక్తి మృతి

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంట్లో దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం ఇరిగేపల్లికి చెందిన జంగా లక్ష్మారెడ్డి(43) కొన్ని రోజులుగా ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ వెలిమినేడు లోనే అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం ఇంట్లో దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. సోమవారం మృతుడి తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

(c) eenadu

పట్టుదలతో చదవాలి

ఈపూరు: విద్యార్థులుపట్టుదలతో కష్టపడి చదవాలని బొగ్గరం హైస్కూలు ఓల్డ్ స్టూడెంట్స్ సంఘం (బాస్) ప్రధాన కార్యదర్శి లింగా ఆంజనేయులు అన్నారు. పాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో ప్రథమంగా నిలిచిన గడిపూడి అంకాళ పరమేశ్వరి, 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి వారికి నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలు అందజేశారు.

రోటరీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

వినుకొండ: సమాజంలో మార్పు కోసం రోటరీ సభ్యులు సమష్టిగా ముందుకు వెళ్లాలని క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ కోరారు. రోటరీ క్లబ్‌ఆఫ్ గ్రేటర్ వినుకొండ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. శివశక్తిలీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ జి.లీలావతి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు కోరినట్లు గ్రంథాలయం, సామాజిక భవనానికి స్థలం కేటాయించేందుకు సహకరిస్తామని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్ షకీల నూతన కమిటీని అభినందించారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

100 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో పలు వ్యాపార దుకాణాలపై మున్సిపల్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. నాలుగు బృందాలుగా ఏర్పడి పట్టణంలో పలు దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. 15 దుకాణాల నుంచి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు తదితర వస్తువులు 100 కిలోల వరకు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకుంటామని పురపాలక సంఘ కమిషనర్ శ్రీహరి హెచ్చరించారు.

నేటి నుంచి ఒక్కపూటే నీటి సరఫరా

నరసరావుపేట సెంట్రల్: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉన్నందున మంగళవారం నుంచి పట్టణంలో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు మంచినీటి సరఫరా జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. గ్రావిటీ సరఫరాలో ఎటువంటి మార్పు ఉండదని, యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె ముగిసిన తరువాత ఉదయం, సాయంత్రం మంచినీరు సరఫరా చేస్తామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని రామిరెడ్డిపేటలో పట్టణ పేదరిక నిర్మూలన కార్యాలయం ఎదుట డ్రెయినేజీలో మురుగు పేరుకుపోయింది. దుర్వాసన, దోమలతో అల్లాడుతున్నాం. **- కోటేశ్వరమ్మ**
✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ శుభ్రం చేయిస్తాం. **- రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి** – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? పట్టణంలో ఏఎంజీ చెక్‌పోస్టు వెనుక గ్యాస్ కంపెనీకి వెళ్లే రహదారి గుంతలతో నిండింది. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. **- రమేష్** ✔ రహదారిపై గుంతలు పూడ్చి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- అన్సర్, పురపాలక సంఘ ఏఈ** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? ములకలూరులో చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలు తీసుకెళ్లి ఎస్సీ కాలనీ సమీపంలో వేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. కుక్కలు ఎక్కువై అటుగా వెళ్లేవారిపై దాడికి పాల్పడుతున్నాయి. రాత్రిళ్లు ఆ వైపు వెళ్లాలంటే భయం వేస్తోంది. **- కోటేష్**
✔ వ్యర్థాలు ఎక్కడంటే అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం. అలా వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. కుక్కల సమస్య తలెత్తకుండా చూస్తాం. **- రవీంద్ర, పంచాయతీ కార్యదర్శి, ములకలూరు** – న్యూస్‌టుడే, నూజండ్ల

ఆక్రమణల తొలగింపు

స్పందనకు వందనం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరమని మరోసారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నడిగడ్డలో సచివాలయం ముందు స్థలాన్ని గ్రామంలో కొందరు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడానికి యత్నించారు. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు' అధికారుల దృష్టికి తేగా పంచాయతీ అధికారులు స్పందించారు. సచివాలయం ముందు ఆక్రమణలను తొలగించారు.

డ్రెయిజీలో రాయి.. **వినుకొండ:** స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో డ్రెయినేజీ కాల్వలో రాయిని తొలగించడంతో మురుగ నీరు సక్రమంగా పారుతోంది. మురుగు స్తంభించి అపరిశుభ్రంగా ఉందని అధికారుల దృష్టికి తేగా మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి బాగు చేయించారు.

ప్రమాదం దూసుకొస్తున్నా పట్టదా?

✤ రహదారి పక్కన వ్యాపారాలు ✤ తరచూ ట్రాఫిక్ సమస్యలు

నరసరావుపేట: ఇస్సపాలెంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

చిలకలూరిపేట: రోడ్డు పక్కనే విక్రయాలతో రాకపోకలకు ఇక్కట్లు

నరసరావుపేట సెంట్రల్, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేట, ప్రముఖ వాణిజ్య కేంద్రం చిలకలూరిపేట పట్టణాలు, శివారు గ్రామాల్లో కొందరు ప్రధాన రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధాన రహదారి వెంబడే.. నరసరావుపేట మండలం ఇస్సపాలెంలో మహంకాళి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయానికి నిత్యం భక్తులు పోటెత్తుతారు. ఈ గ్రామంలో ప్రధాన రహదారి (నరసరావుపేట-సత్తెనపల్లి) ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. తమ అవసరాల నిమిత్తం దుకాణాల వద్దకు వచ్చే వారు వాహనాలను నడిరోడ్డుపై నిలపడంతో రాకపోలకు అంతరాయం ఏర్పడుతోంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

✤ జొన్నలగడ్డ, ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం గ్రామాలు గుంటూరు-కర్నూలు రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉంటాయి. దీంతో కొందరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో పలుమార్లు వాహనాలు దుకాణాల్లోకి దూసుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి. అయినా దుకాణదారుల్లో మార్పు రావటం లేదు. ఈ మధ్య చికెన్ దుకాణాలు కూడా ఏర్పాటు చేశారు. గుంపులుగా ప్రజలు ఉన్న సమయంలో ఏదైనా వాహనం దూసుకొస్తే భారీ మూల్యం తప్పదని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

✤ చిలకలూరిపేట పట్టణం గడియార స్తంభం వద్ద మార్కెట్ ప్రాంతంలో రోడ్డు పక్కనే కొందరు చేపల విక్రయాలు చేస్తున్నారు. కొనుగోలుదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపేయడం, మార్కెట్‌లోకి వెళ్లేందుకు మూలమలుపు కావడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. చేపలు శుభ్రం చేసే నీరంతా రోడ్డుపైకి చేరి దుర్వాసన వస్తోంది.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

ప్రధాన రహదారులను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి ఆర్ అండ్‌బీ అధికారులతో నోటీసులు ఇప్పించి స్వచ్ఛందంగా తొలగించేలా చర్యలు తీసుకుంటాం. అయినా వినకుంటే పోలీస్ సిబ్బంది సాయంతో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- కిషోర్, గ్రామీణ సీఐ, నరసరావుపేట, రమేష్, అర్బన్ సీఐ చిలకలూరిపేట

సేవలోనే సంతృప్తి

జీవీ పుట్టినరోజు సందర్భంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు

జీవీ దంపతులను సన్మానిస్తున్న కొమ్మాలపాటి

వినుకొండ, వినుకొండ రూరల్, నరసరావుపేట అర్బన్, ఈపూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పుట్టినరోజు వేడుకలు జిల్లాలో పలుచోట్ల సోమవారం సందడిగా నిర్వహించారు. ఉదయాన్నే జీవీ భార్య లీలావతితో కలిసి శివాలయంలో పూజలు చేశారు. అనంతరం కొత్తపేటలోని ఆయన నివాసంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి దంపతులు పుష్పగుచ్ఛం అందజేశారు. అయిదు మండలాల పార్టీ నాయకులు, అధికారులు కేకులు తెచ్చి ఆయనతో కోయించారు. పట్టణంలో గంగినేని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలిసి జీవీ ప్రారంభించారు. ఈ తరహా శిబిరాలు ప్రతి మండలంలో రెండు నెలలకోసారి నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 లక్ష్యాన్ని శివశక్తి ఫౌండేషన్ ముందుండి ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు. కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ శివశక్తి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంచి మార్పునకు నాంది పలుకుతున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం వేలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం విఠంరాజుపల్లిలోని మానసిక దివ్యాంగ పాఠశాల విద్యార్థులతో కలిసి కేకు కోసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నేత నాగశ్రీను, మాజీ డీఎల్‌డీఏ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సొసైటీ అధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులు, వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు మందా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈపూరు మండలం దుష్మాన్‌పేటతండా ప్రాథమిక పాఠశాలలో గిరిజన విద్యార్థులకు ప్లేట్లు నోట్ పుస్తకాలు పెన్నులను మండల తెదేపా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, డీసీ అధ్యక్షుడు గడిపూడి వేణుగోపాలరావు, తెదేపా సీనియర్ నాయకులు పాల్గొన్నారు. నరసరావుపేటలోని జిల్లా తెదేపా కార్యాలయంలో కేక కోసి జీవీకి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా రాష్ట్ర వైద్యవిభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, తెలుగు రైతు నేత గొట్టిపాటి జనార్దన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రచారంలో భాగంగా పట్టణంలోని 23వ వార్డులో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పర్యటించారు. ఇంటింటికీ కరపత్రాలు పంచారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

డ్రోన్ పరిశీలిస్తున్న చదలవాడ, గోనుగుంట్ల తదితరులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్లకు చెందిన శ్రీ ప్రసన్నాంజనేయ గ్రూప్ సభ్యులకు రాయితీపై అగ్రికల్చర్ డ్రోన్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార మిషన్ ద్వారా కంది, మినుము మినీ కిట్లను స్థానిక మార్కెట్‌యార్డులో సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, రైతులకు అందించే డ్రోన్‌తో ఎకరాకు కేవలం ఆరు నుంచి పది నిమిషాల్లో పురుగుల మందు పిచికారీ చేయొచ్చని, తద్వారా పురుగు, తెగుళ్ల నివారణ సమర్థంగా చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రొంపిచర్ల, నరసరావుపేట మార్కెట్‌యార్డు ఛైర్మన్లు మొండితోక రాణి, పి.శ్రీనివాసరావు, నరసరావుపేట ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శివలలిత, మండల పార్టీ నేతలు జగ్గయ్య, నాగిరెడ్డి, సుబ్బారావు, ఆయా సొసైటీల అధ్యక్షులు రత్నారెడ్డి, రామారావు, కిషోర్, నరసింహారావు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయ్

శావల్యాపురం, న్యూస్‌టుడే : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు ఎం.ఆర్. నాయక్ తెలిపారు. ఇప్పటికే రీ సర్వే పూర్తయిన కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు కార్యాలయానికి చేరాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందగానే వీటిని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు అందజేస్తామని తెలిపారు.

ఈవోకు విరాళం అందిస్తున్న దాతలు

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని ఇస్సపాలెంలో మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన దివ్వెల రామకృష్ణ, త్రిపుర దంపతులు రూ.1,01,116 నగదును ఈవో మాధవి దేవికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ కేంద్రం పరిశీలన

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో చీరాల రోడ్డులో ఉన్న ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రాన్ని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కేర్ సపోర్ట్ ట్రీట్‌మెంట్ సంయుక్త డైరెక్టర్ అంకినీడు ప్రసాద్ సోమవారం సందర్శించారు. కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పల్నాడు జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీ బాషా, ఐసీటీసీ కౌన్సిలర్ హనుమంతరావు, సిబ్బంది వంశీ, ఉస్మాన్, పవన్‌కల్యాణ్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా రెండో రోజు కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమ్మెలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాభక్షు, సోమశేఖర్, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నకిలీ టీటీఈ పట్టివేత

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు(17215)లో ఓ వ్యక్తి టీటీఈగా చెప్పుకొని జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే రైలులో విధులు నిర్వహిస్తున్న గుంటూరు టీటీఈ జాన్ వెస్లీ గుర్తింపు కార్డు చూపించమని అడగ్గా వాదనకు దిగాడు. రైలు నరసరావుపేట చేరగానే దూకి పరారయ్యేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్పీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. విచారణలో అతని పేరు అవినాష్ గుప్తా, గుంటూరు అని తేలింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నకిలీ టీటీఈగా నిర్ధారించుకుని నరసరావుపేట రైల్వే పోలీసులకు ఆదివారం అప్పగించారు.

కార్లు తాకట్టు పెట్టి.. రూ.లక్షలతో ఉడాయించి..

తాడేపల్లి, న్యూస్‌టుడే: నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఓ వ్యక్తి ఇదివరకే కార్లు అద్దెకు తీసుకుని దాన్ని చెన్నైలో తాకట్టు పెట్టాడు. ఇదే తరహాలో మరి కొన్ని ఉన్నట్లు తెలిసింది. ఇదే తరహాలో హైదరాబాద్‌లోనూ ఫిర్యాదులు అందడంతో విచారణలో భాగంగా అక్కడి పోలీసులు విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో సోమవారం వివరాలు సేకరించి వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే హైదరాబాద్ పోలీసులు తమను సంప్రదించకుండానే కార్లు స్వాధీనం చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఆరా తీస్తున్నామని తాడేపల్లి పోలీసులు చెబుతున్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేయరూ!

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నాదెండ్ల మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని వైకాపా జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అదనపు ఎస్పీ జె.వి.సంతోష్‌ను కోరారు. ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు వేధింపులు గురిచేస్తున్నాడని, మరో గ్రామంలో బాలిక అమ్మమ్మ ఇంట్లో ఉంచినా అక్కడికీ వచ్చి వేధించడంతో బాలిక మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకుని బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన అదనపు ఎస్పీ నిందితుడిని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

కల్తీ కల్లు ప్రాణాంతకం

ఈపూరు, న్యూస్‌టుడే: కల్లులో రసాయనాలు కలిపితే ప్రాణాంతకంగా మారతాయని కల్లు తాగే వారు కల్తీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు సూచించారు. కల్తీ కల్లును అరికట్టేందుకు స్టేషన్ పరిధిలోని ఈపూరు, బొల్లాపల్లి, రొంపిచర్ల మండలాల్లో కల్లు గీసే, విక్రయించే ప్రాంతాల్లో సోమవారం తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. కల్లు కల్తీ చేయకుండా వారికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎక్కడైనా కల్తీ కల్లు ఉన్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నీళ్ల ట్యాంకర్ చోరీ

యడ్లపాడు, న్యూస్‌టుడే: పొలంలో ఉన్న నీళ్ల ట్యాంకరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి కథనం మేరకు. . మండలంలో ఉన్నవకు చెందిన సామినేని శ్రీనివాసరావు వంకాయలపాడు వద్ద 15 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. దానిలో నిర్మాణ పనుల నిమిత్తం వాటర్ ట్యాంకర్‌ను సోమవారం రాత్రి అక్కడ ఉంచాడు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ట్యాంకర్ కనిపించలేదు. ట్యాంకర్ విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని, ఘటనపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

పూర్వ విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం, న్యూస్‌టుడే : శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమావేశం ఉత్సాహంగా సాగింది. బాల్య స్మృతులు గుర్తుచేసుకుని కేరింతలు కొట్టారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను జ్ఞాపికలతో సత్కరించారు. ఇదే సందర్భంగా వారి బ్యాచ్‌లో చదివి ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్న శావల్యాపురానికి చెందిన జేడీమళ్ల విజయలక్ష్మి, కనమర్లపూడికి చెందిన మాణిక్యరావుకు రూ.50వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందచేశారు. తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసిన పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు నగదు అందచేశారు. పూర్వ విద్యార్థులు ముండ్రు సింగారావు, భార్గవ్, ఏడుకొండలు కార్యక్రమ ఏర్పాటుకు కృషి చేశారు. అప్పటి ఉపాధ్యాయులు హనుమంతరావు, చంద్రశేఖర్, రాంబాబు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక చేయూత

ఆర్వో ప్లాంట్ వద్ద హెచ్.ఎం విజయభారతి, దాతలు

యడ్లపాడు, న్యూస్‌టుడే: యడ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన రూ.13వేలు నిధులను యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం విరాళంగా ఇచ్చారు. అలాగే గతేడాది పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. తెదేపా నేత పోపూరి రాఘవయ్య పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభారతి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు రామారావు, ఆలోకం పెద్దబ్బయ్య, కాళహస్తి సుబ్బారావు పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందించాలన్న ఉద్దేశంతో, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు అంతర జిల్లాల వ్యవసాయాధికారులతో విస్తృత తనిఖీలు చేపట్టామని విజయవాడ, విజిలెన్స్ విభాగం సీఐ మహమ్మద్ ఉమర్, ఏలూరు జిల్లా కోట రామచంద్రాపురం ఏడీఏ బుజ్జిబాబు అన్నారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో నరసరావుపేట పట్టణం, చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల పరిధిలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్‌లు, నిల్వలు పరిశీలించారు. వారి వెంట స్థానిక వ్యవసాయాధికారులు నరసరావుపేట ఏడీఏ శ్రీనివాసరావు, ఏవోలు సుబ్బారెడ్డి (సత్తెనపల్లి), శాంతి, సరిత, శ్రీలత తదితరులు ఉన్నారు.

బనకచర్లపై తొందరపాటు నిర్ణయాలు తగదు

వినుకొండ, న్యూస్‌టుడే: పాలకులు ఆకాశంలో కాకుండా నేలపై నడిచినప్పుడే ప్రజలకు మేలు చేకూరుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆ పార్టీ పట్టణ, నియోజకవర్గ మహాసభలు కారంపూడి రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై హడావుడిగా కాకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. రాజధాని కోసం తొలివిడత భూ సమీకరణలో రైతులకు కేటాయించిన ప్లాట్లు అభివృద్ధి చేయకుండా మలివిడతకు వెళ్లడం తగదన్నారు. నూరు వసంతాలు నిండిన సీపీఐలో నవతరం ఉత్సాహంగా చేరుతుందని రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ కీలకంగా మారుతుందని చెప్పారు. జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 7, 8 తేదీల్లో జిల్లా మహాసభలు వినుకొండలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే పులుపుల వెంకటశివయ్య స్మారక స్థూపం వద్ద నాయకులు నివాళి అర్పించారు. మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి రాము, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, మున్సిపల్ మాజీ వైఎస్ ఛైర్మన్ సంద్రపాటి సైదా తదితరులు పాల్గొన్నారు.

జీతాల విడుదలకు వినతి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండ పార్కులో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 24 మంది కార్మికులు పార్కులో ఆయా విభాగాల్లో పనులు చేస్తున్నారు. నాలుగు నెలలు జీతాలు రాక బయట అప్పులు తెచ్చుకొని కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. వీరికి మొత్తం సుమారు రూ.8 లక్షల వరకు జీతాలు రావాల్సి ఉందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తమకు వెంటనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ మాధవరావును సంప్రదించగా ప్రభుత్వం నుంచి వారం రోజుల్లో నిధులు వస్తాయని, రాగానే జీతాలు అందజేస్తామన్నారు.



ప్రకటన

మహారాజశ్రీ 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్ట్, నరసరావుపేట.
OS.No.43/2017, IA No.935/2024 మరియు 936/2024, 937/2024
Between: ఆరెకట్ల చంద్రశేఖర్‌బాబు, Rep by next firned, daughter ఆరెకట్ల గౌతమి ... వాది/పిటీషనర్
V/S
1) ఆరెకట్ల నారయ్య (Died) మరియు 10 మంది ఇతరులు ... ప్రతివాదులు/రెస్పాండెంట్లు

పై దావాలో పై వాది పై కోర్టులో దావా దాఖలు చేయగా ఇందలి 11వ ప్రతివాది/11వ రెస్పాండెంట్‌కు అనేక పర్యాయములు నోటీసులు పంపినను సర్వోకానందున శ్రీ కోర్టు వారు ఇందలి 11వ ప్రతివాది/11వ రెస్పాండెంట్‌కు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ వేయడమైనది. కావున మీ నోటీసు నిమిత్తం ది.5-08-2025న వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల 11వ ప్రతివాది/11వ రెస్పాండెంట్ యొక్క పరోక్షమున కేసు తీర్మానం చేయబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.5-08-2025.

యం.ఆరోగ్యం చౌదరి, యం.శ్రీనివాసరావు, కె.వి.సుబ్రమణ్యం, న్యాయవాదులు, రామిరెడ్డిపేట, నరసరావుపేట.

ప్రతివాది/11వ రెస్పాండెంట్ అడ్రస్; ఆరెకట్ల ద్రాక్షాయమ్మ W/o (లేట్) నారయ్య, హిందువు, వయస్సు: 75 సం॥లు, గృహిణి, వ్యవసాయం, R/o గుదేవారిపాలెం గ్రామం, పసుమర్రు పోస్ట్, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా.

రోడ్డెక్కాలంటే మురుగు దాటాల్సిందే!

దోమల స్వైరవిహారంతో తప్పని జాగారం

చిలకలూరిపేటలోని ఓ కాలనీలో..



చిలకలూరిపేట: ఇళ్ల ముందు చేరిందిలా..

వినుకొండ: కొప్పుకొండలో..

న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం, వినుకొండ రూరల్

పట్టణం, పల్లెలనే తేడా లేకుండా మురుగు కాలువల్లో రోజుల తరబడి నీరు నిలుస్తోంది. ఇళ్ల ముందు మురుగు కాలువలు నీరు నిలిచి ఉండడంతో ఏదైనా పని మీద స్థానికులు బయటకు వెళ్లాలంటే మురుగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కాలువలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో రాత్రిళ్లు జాగారం తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. చిలకలూరిపేట పట్టణం రజకకాలనీ రెండో లైనులో శ్రీనిదానంపాటి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఎదుట రహదారుల్లో కాలువలు నిండి ఆ నీరంతా ఇళ్ల ముందుకు చేరుతోంది. ఇంటి ప్రహరీ పక్కనే మురుగు నీటి నిల్వతో గోడలు దెబ్బతింటున్నాయని ఆయా గృహయజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పారిశుద్ధ్య అధికారి రమణారావును సంప్రదించగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాలువల పూడికలు తొలగిస్తామని చెప్పారు.

✦ వినుకొండ మండలం కొప్పుకొండ ప్రధాన వీధిలో ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో కాలువలు వ్యర్థాలు, పూడికతో నిండి మురుగు ముందుకు కదలడం లేదు. పైగా కాలువ నుంచి పొర్లి సమీప ఇంటి స్థలంలోకి చేరుతోంది. ఆ ఇల్లు పాడుబడి ఉండటంతో పాటు యజమానులు విజయవాడలో స్థిరపడడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని నెలలుగా ఇలా మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని సమీప ఇళ్లలో నివాసం ఉండలేకపోతున్నామని ఆ వీధి ప్రజలు వాపోతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణను సంప్రదించగా రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

(c) eenadu

ఈఏపీసెట్‌కు వెబ్ ఆప్షన్ల నమోదు

పార్వతీపురం (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ఎమ్మార్‌నగరంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ ఈఏపీ సెట్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపల్ విజయం శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. 18 వరకు ప్రక్రియ కొనసాగుతుందని, 19న మార్చుకునే అవకాశం ఉందన్నారు. 22న జాబితా ప్రకటిస్తారని, 23 నుంచి 26 వరకు మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు.

ఈనాడు పార్వతీపురం మన్యం

మంగళవారం జులై 15, 2025

పేదల రాజుకు పట్టం

● గోవా గవర్నర్‌గా మన అశోకుడు ● వెల్లువెత్తిన అభినందనలు

రాజుల కుటుంబమైనా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు. పూసపాటి వంశస్థుడు ఆ దర్పాన్ని ఎక్కడా ప్రదర్శించలేదు. రూ.వేల కోట్ల ఆస్తులకు అధిపతైనా ధనబలాన్ని చూపలేదు. కేంద్ర మంత్రిగా పనిచేసినా సామాన్యుడిగానే తిరిగారు. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినా పేదల మధ్యనే నడిచారు. పేదల రాజుగా ఎదిగారు.. ప్రజలకు పెద్దన్నగా, పెద్దాయనగా నిలిచారు. ఆ వ్యక్తిత్వమే ఆయనను గవర్నర్ పదవికి పట్టాభిషిక్తుడిని చేస్తోంది. గోవా గవర్నర్‌గా వెళ్తున్న అశోక్ గజపతిరాజును అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. విషయం తెలియగానే సోమవారం కోటకు అంతా తరలివచ్చారు.

– ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, అర్బన్

జననం: 1951 జూన్ 26

తల్లిదండ్రులు: పూసపాటి కుసుమ గజపతిరాజు, విజయరామరాజు(పీవీజీ రాజు)

విద్యాభ్యాసం: గ్వాలియర్‌లో పాఠశాల, హైదరాబాద్ పబ్లిక్ పాఠశాల, విశాఖలో వీఎస్ కృష్ణా కళాశాల

★ **తొలి అడుగు...** 1978లో ఎమ్మెల్యేగా గెలుపు

★ **మరో ఆరుసార్లు..** 1983 నుంచి 2004 వరకు, 2009లో శాసనసభకు ఎన్నిక

★ 2014లో విజయనగరం ఎంపీగా 16వ లోక్‌సభకు ఎన్నిక

★ 2025 గోవా గవర్నర్‌గా ఎంపిక

★ తన తండ్రి పీవీజీ రాజు వారసత్వంగా వచ్చిన మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. 108 దేవాలయాలకు ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.



ప్రజాప్రతినిధిగా ప్రగతి పరుగులు: కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో నియోజకవర్గ పరిధిలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. జాతీయ రహదారులతో పాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలక, ఉడా పరిధిలో రోడ్లకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించారు. చెల్లూరు నుంచి రాజాపులోవ వరకు రూ.84 కోట్ల వ్యయంతో రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయించారు. రూ.425 కోట్లతో గొట్లాం, చెల్లూరు మధ్య బైపాస్ రోడ్డు, వంతెన నిర్మించారు.

అవినీతి మరకలేని ఆదర్శనేత: మానవతా విలువలు కలిగిన జయప్రకాశ్ నారాయణ్, జార్జి ఫెర్నాండెజ్, చంద్రశేఖర్ వంటి అగ్రనేతల ప్రేరణతో రాజకీయాల్లోకి వచ్చిన అశోక్ గజపతిరాజు 1978 నుంచి ఇంతవరకు ఎలాంటి అవినీతి మరకలేని ఆదర్శనేతగా గుర్తింపు పొందారు.

చిట్టి గురువులతో శ్రీకారం

తన పార్లమెంటరీ పరిధిలో ప్రతిఒక్కరూ అక్షరాస్యులుగా మారాలని కలలుగన్నారు. అందులో భాగంగా చిట్టి గురువులు పథకాన్ని ప్రారంభించారు. బాలలే తమ తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పే కార్యక్రమానికి నాంది పలికారు. జిల్లా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వేలాది మంది మహిళలను ఇందులో భాగస్వామ్యం చేశారు. దాదాపు 28 వేల మందిని అక్షరాస్యులుగా మార్చారు.

ఆ శాఖకే పైలట్ అయ్యారు..: పైలట్ అవ్వాలని రాజు గారి కోరిక. కానీ రాజకీయాలవైపు మళ్లారు. ఈక్రమంలో 2014లో కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. చివరికి విమానాలను నడిపించేస్థాయికే ఎదిగారు. పలు విమానాశ్రయాల పునరుద్ధరణతో పాటు 500 వరకు ప్రాంతీయ మార్గాలను ప్రవేశపెట్టారు.



అన్న ఎన్టీఆర్‌తో..

అశోక్ కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్న పండితులు

మంచి పనికి ముందు వరుసలో..

ప్రభుత్వ, ప్రజావసరాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున భూములు.. అక్షర అభివృద్ధికి ఊతమిచ్చేలా ఉదారత చాటుకున్నారు అశోక్ గజపతిరాజు. విదేశాల్లో రాజకుటుంబానికి ఉన్న భూములు, ఇతర కట్టడాలను సైతం అక్కడి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. 95 ఎకరాల్లోని అలకనందా ప్యాలెస్ స్థలాన్ని చింతలవలస అయిదో పోలీసు బెటాలియన్‌కు కేటాయించారు.

సాహో సైనిక అంటూ..

206 ఎకరాల భూములిచ్చి రాష్ట్రంలోనే తొలి సైనిక పాఠశాల కోరుకొండలో ఏర్పాటయ్యేలా సహకరించారు. సైనిక పాఠశాలల్లో బాలికలకు ప్రవేశాలు కల్పించాలని కేంద్రానికి లేఖ రాసి, విజయం సాధించారు.

దశ మారిన దత్తత గ్రామం: గజపతిరాజు ద్వారపూడి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అక్కడ తాగునీటి కోసం సోలార్ పంపింగ్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. తాగునీటి పైపులైన్లను మురుగు కాలువల నుంచి వేరుచేసి స్వచ్ఛమైన నీటిని అందించారు. బయో మరుగుదొడ్లు ప్రారంభించారు. ఇంటింటికీ ఇంకుడు గుంతలు తీయించారు. దీంతో ద్వారపూడి అప్పట్లో రాష్ట్రీయ గౌరవ గ్రామసభ పురస్కారాన్ని పొందింది.

స్ఫూర్తిబాట పరిచి..: ఉత్తరాంధ్రలోని ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూములిచ్చారు. గతానికి గుర్తుగా నిలిచిన కోటను సైతం విద్యా సంస్థల నిర్వహణకు అప్పగించి మరో ప్రదేశానికి వెళ్లిపోయారు. తాత, తండ్రుల నుంచి అందిపుచ్చుకున్న సేవా వారసత్వాన్ని కొనసాగించారు.

వారధిపై చెరగని సంతకం

విజయనగరం మీదుగా జాతీయ రహదారి-26 వెళుతోంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించేవి. దీంతో ట్రాఫిక్ సమస్య వేధించేది. ఎత్తు బ్రిడ్జి వద్ద పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయేవి. ఈ క్రమంలో వంతెన నిర్మాణానికి అశోక్ పూనుకొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి 8 వేల మంది సంతకాలతో లేఖలు పంపించారు. ఎట్టకేలకు కేంద్రం స్పందించి, వంతెన మంజూరు చేసింది. ఇది సంతకాల వంతెనగా పేరుగాంచింది.

అమ్మ దయతోనే..: అశోక్ గజపతిరాజుకు దైవభక్తి ఎక్కువ. కులదైవం పైడితల్లిని ఎక్కువగా ఆరాధిస్తారు. ఏటా జరిగే సిరిమానోత్సవాన్ని ముందుండి నడిపిస్తారు.

రాజ కుటుంబం.. సాధారణ జీవితం..: వేలాది ఎకరాల భూములు సహా రూ.వేల కోట్ల ఆస్తులు ఉన్న రాజ కుటుంబంలో పుట్టినా ఇప్పటికీ సాధారణ జీవితమే గడుపుతారు. పాత కాలం నాటి స్కూటర్, నానో కార్లలో తిరుగుతుంటారు. స్వయంగా ఆయనే వాహనాన్ని నడుపుతారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్తు వాహనాలను వాడాలని రెండు, మూడేళ్లుగా యువతకు పిలుపునిస్తున్నారు. అందులో భాగంగానే విద్యుత్తు ద్విచక్రవాహనం కొని, అవగాహన కల్పిస్తున్నారు.



రక్త పరీక్షల విభాగం వద్ద రద్దీ

ఓపీ 442.. జ్వరపీడితులు 94 మంది

సీతంపేట ప్రాంతీయాసుపత్రి రోగులతో రద్దీ

సీతంపేట ప్రాంతీయాసుపత్రి సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఒక్కరోజే 442 ఓపీ నమోదైనట్లు ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 94 మంది జ్వర పీడితులు ఉన్నారన్నారు. మలేరియా స్లైడ్ పాజిటివ్ కేసు ఒకటి, ఆర్డీటీ కేసులు 18 నమోదయ్యాయని, 49 మందిని ఇన్ పేషెంట్లుగా చేర్చామన్నారు.

– న్యూస్‌టుడే, సీతంపేట

వైద్య పరీక్షలకు నిరీక్షిస్తున్న రోగులు

ఎస్‌ఎఫ్‌ఐ నిరసన ర్యాలీలో విద్యార్థులు

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు..?

కలెక్టరేట్ ప్రాంగణం: ఇంటర్మీడియట్ ఫలితాలొచ్చి మూడు నెలలు అవుతున్నా డిగ్రీలో ప్రవేశాలు కల్పించడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.అఖిల్, రాజులు జేసీ శోభికకు వినతిపత్రం అందించారు. విద్యార్థులతో కలిసి సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. వీరఘట్టంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలన్నారు. పార్వతీపురం, పాలకొండ, కురుపాంలో పీజీ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమిస్తే విద్యార్థుల మరణాలు తగ్గుముఖం పడతాయన్నారు.

గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

పార్వతీపురం, న్యూస్‌టుడే: పీవీటీజీ గ్రామాల సమగ్రాభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న పీఎం జన్‌మన్ పథకం గడువు సమీపిస్తోందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి విభూనాయర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పథకం అమలుపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలతో సోమవారం దూరదృశ్య శ్రవణ సమావేశంలో మాట్లాడారు. జిల్లా నుంచి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పీవోలు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మంజూరు చేసిన పనులన్నీ సెప్టెంబరు 30లోపు పూర్తి చేయాలన్నారు. ఆదికర్మయోగి పథకంలో భాగంగా అన్ని శాఖల అధికారులు వారంలో రెండు సార్లు ప్రతి గ్రామాన్ని సందర్శించాలన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

రోడ్లేస్తాం.. నీరు అందిస్తాం.. : ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జిల్లాలో లక్ష్యాలను వివరించారు. సెప్టెంబరు నాటికి జిల్లాలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఆగస్టులో బహుళ ప్రయోజన కేంద్రాల నిర్మాణాలు, 9 నెలల్లో 19 రహదారులు, నవంబరు 15లోపు జల్‌జీవన్ పనులు చేపట్టేలా చూస్తామన్నారు. జిల్లాకు 190 సెల్‌టవర్లు మంజూరవగా, 137 పూర్తయ్యాయని పేర్కొన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



న్యూస్‌టుడే, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరు

గిరి శిఖర గ్రామాల్లో రహదారి సదుపాయం లేక డోలీ మోతలే దిక్కు. పలువురు గర్భిణులకు సకాలంలో వైద్యం అందక మాతాశిశు మరణాల ఘటనలూ గతంలో చోటు చేసుకున్నాయి. వీటిని నివారించేందుకు గత తెదేపా ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా 2018లో సాలూరు గిరిజన యువత శిక్షణ కేంద్రం(వైటీసీ)ల్లో గర్భిణులకు వసతి గృహం ఏర్పాటు చేసింది. ఇవి వారికి సంజీవనిలా మారుతున్నాయి. ఇక్కడ ఆశించిన ఫలితాలు రావడంతో సీతంపేట, గుమ్మలక్ష్మీపురం వైటీసీల్లోనూ ఏర్పాటు చేశారు.

మూడు వసతి గృహాల్లో సేవలు పొందిన వివరాలు..

వైటీసీ	పడకలు	ఇంతవరకు చేరినవారు	సుఖ ప్రసవాలు	సిజేరియన్‌లు
సీతంపేట	16	252	140	77
సాలూరు	40	1,902	1,578	313
గుమ్మలక్ష్మీపురం	50	2,284	1,986	259

అమ్మకు అండ.. బిడ్డకు భరోసా

సంజీవనిలా గర్భిణుల వసతి గృహాలు

గిరిజన ప్రాంతాల్లో అవగాహన లేమి, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక గర్భిణులు రక్తహీనత, జన్యుపరమైన లోపాలతో ఇబ్బందులకు గురవుతుంటారు. అటువంటి వారికి ఈ వసతి గృహాలు భరోసానిస్తున్నాయి. ప్రసవానికి నెల రోజుల ముందుగా వారిని ఇక్కడకు తీసుకువచ్చి ప్రసూతి వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు, వైద్యం అందిస్తారు. ప్రత్యేక పడకలు, పోషకాహారం, గాలి, వెలుతురూ అందేలా ఆహ్లాదకర వాతావరణం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంబులెన్సు అందుబాటులో ఉంటుంది. పరిస్థితి విషమించితే సకాలంలో ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో చేర్పించి ప్రసవాలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గర్భిణులతోపాటు వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రసూతి వైద్య నిపుణులు రెండు రోజులకోసారి పరీక్షించి, అవసరమైన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. ఈ వసతి గృహాల ద్వారా మాతాశిశు మరణాలు నివారించవచ్చు.

సీతంపేట వైటీసీలోని వసతి గృహంలో గర్భిణులు

ముందుగా గుర్తించి చేర్పిస్తున్నాం

గిరి శిఖర, మారుమూల గిరిజన గ్రామాల్లోని గర్భిణులను స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ముందుగా పరీక్షిస్తున్నారు. అత్యవసర సేవలు అవసరమైన గర్భిణులను గుర్తించి ప్రసవానికి నెల ముందుగానే వసతి గృహాల్లో చేర్పిస్తున్నాం. ముఖ్యంగా మాతా, శిశు మరణాల నివారణకు ఇవి తోడ్పడుతున్నాయి.

– కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఐటీడీఏ, సీతంపేట

అర్హత ఉంది.. ఆర్థిక ఆసరా కల్పించరూ..

పింఛను సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అధికారులు

పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: అర్హత ఉండి పింఛను సొమ్ము అందడం లేదని పలువురు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ మొర వినిపించారు. పలువురు మహిళలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీకి సంతృప్తి కలిగేలా పరిష్కారం చూపించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జేసీ శోభిక, సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణితో కలిసి 160 మంది నుంచి అర్జీలు స్వీకరించారు.

90 శాతం వైకల్యమున్నా.. : జియ్యమ్మవలస మండలం అల్లువాడకు చెందిన లక్ష్మి దివ్యాంగురాలు. సదరం ధ్రువపత్రంలో 90 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించినా రెండు నెలలుగా పింఛను రావడం లేదు. ఎందుకు నిలిచిపోయిందో ఎవరూ చెప్పడం లేదని, తనకు పింఛనే ఆధారమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

భూమి ఎప్పుడిస్తారు.. : గతంలో తాను వ్యవసాయ యంత్రం రూపొందించినపుడు ప్రభుత్వం రెండెకరాల స్థలాన్ని ఉద్యాన కళాశాల వద్ద కేటాయించినట్లు అధికారులు చెప్పారని పార్వతీపురానికి చెందిన బాబూరావు తెలిపారు. కానీ యంత్రాల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికీ భూమి అప్పగించలేదన్నారు.

నిధుల దుర్వినియోగంపై..: కొమరాడ సర్పంచి పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని పీజీఆర్ఎస్‌లో పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు నిర్వహించాలని ఎంపీడీవోను డీజీపీవో కొండలరావు ఆదేశించారు.

ఆసరా అందక..: పార్వతీపురం మండలంలోని సీతంపేట, తానవలస గ్రామాలకు చెందిన వితంతువులు తమకు అర్హత ఉన్నా ఏళ్లుగా పింఛన్లు అందడం లేదని విన్నవించారు. పిల్లలను భుజాన వేసుకొని కలెక్టరేట్‌కు చేరుకుని సమస్య అధికారులకు వివరించారు. జేసీ శోభిక వీరితో చర్చించారు.

మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నేడు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో అయిదో తరగతి నుంచి ఇంటర్‌లో మిగులు సీట్ల భర్తీకి మంగళవారం కొప్పెర్లలోని గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. ఇతర వివరాలకు 89858 83015, 63038 38657 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతేరాజు 6లో



(c) eenadu

నవతరం.. నైపుణ్య మంత్రం

సాంకేతిక పరికరాల తయారీలో ప్రతిభ

న్యూస్‌టుడే, పార్వతీపురం, వీరఘట్టం

ఆసక్తి.. ఆలోచన.. ఆవిష్కరణ.. ఇదే నేటి తరం మంత్రం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగే ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు. తమ ప్రతిభ.. నైపుణ్యాలకు మెరుగులద్ది.. రోబో, 3డీ ప్రింటింగ్, బ్యాటరీ వాహనాలు, వ్యవసాయ, ఇతర పరికరాలు రూపొందించి ప్రతిభ చాటుతున్నారు. **నేడు ప్రపంచ నైపుణ్య దినోత్సవం** సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనమిది.

గౌతమ్ తయారు చేసిన సౌరశక్తి ఆధారిత సాగునీటి పరికరం

రైతన్నకు మేలు చేసేలా..

గౌతమ్

పార్వతీపురానికి చెందిన గెంబలి గౌతమ్ విద్యార్థి దశ నుంచి ఆలోచనలకు పదును పెట్టాడు. తొలుత బ్యాటరీతో నడిచే చిన్న సైకిల్, దివ్యాంగులు నడిపించేందుకు అనువైన వాహనం తయారు చేశాడు. ప్రస్తుతం రైతులకు మేలు చేసే సౌరశక్తి పరికరాలను రూపొందిస్తున్నాడు. ఎక్కడ నీరుంటే అక్కడకు వాహనంతో వెళ్లి విద్యుత్తు అవసరం లేకుండా పొలానికి జలాలు మళ్లించే యంత్రాన్ని తయారు చేశాడు. స్ప్రేయర్లు, వ్యవసాయ పరికరాలు, గృహోపకరణాలు రూపొందించి కలెక్టర్‌తో పాటు పలువురి నుంచి ప్రశంసలు అందుకున్నాడు.

పైథాన్, సీప్లస్‌ప్లస్, సెర్వో మోటార్స్, ఎస్‌సీ-05 బ్లూటూత్ మాడ్యూల్ వంటి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ టూల్స్ వినియోగించి మార్క్ ఇన్ హ్యూమనోయిడ్ రోబోను రూపొందించారు అవంతీస్ విద్యార్థులు. భావి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరింత అభివృద్ధికి అనువుగా దీన్ని తయారు చేశారు. ఇది ఓ వ్యక్తి వాయిస్ అసిస్టెంటుగా, మానవ కదలికల ఆధారంగా నడిచే సామర్థ్యం కలిగిన యంత్రంగా పనిచేస్తుంది. మనమిచ్చే ప్రశ్నలకు సమర్థంగా జవాబులిచ్చే నైపుణ్యం, బ్లూటూత్ ద్వారా నియంత్రణ, ఇతర సాంకేతిక ప్రయోజనాలున్నాయి. దీని తయారీకి రూ.20 వేలు వెచ్చించారు.

తల్లిదండ్రుల కష్టం చూసి..

ల్యాబ్‌లో పనిచేస్తున్న అనంత్

వీరఘట్టం మండలం పాలమెట్టకు చెందిన ఉదయాన అనంత్ ఐటీఐ పూర్తి చేసి అంకురాల స్థాపనపై దృష్టిసారించాడు. తల్లిదండ్రులు పార్వతి, గణపతి వ్యవసాయ కూలీలు. పొలంలో వారి కష్టాలను దూరం చేసేందుకు కొత్తగా పరికరాల తయారీపై దృష్టి పెట్టాడు. సులభంగా మందులు పిచికారీ చేసేలా, కలుపు తీసేలా యంత్రాలు రూపొందించాడు. రూ.10తోనే పవర్ బ్యాంకు, రూ.50తో సెలైన్ ఎలర్టర్ తయారు చేశాడు.


రూపొందించిన శిరస్త్రాణం

మహిళలకు రక్షణ.. మహిళలకు రక్షణ కల్పించేలా ఉన్న దిశ యాప్‌ను పోలిన ఓ పరికరాన్ని రూపొందించాడు. దీనిలో ఓ లాకెట్ ఉంటుంది. దాడి జరిగే సమయంలో మూడు సార్లు దాన్ని పట్టుకుంటే 100 నంబరుకు లొకేషన్‌తో ఫోన్ వెళ్తుంది. వెంటనే పోలీసులు చేరుకునే అవకాశం ఉంది. ● బొగ్గు కార్మికులకు ఉపయోగపడేలా శిరస్త్రాణం తయారు చేశాడు. ద్విచక్ర వాహనాల్లో ఇంజిన్ ఆయిల్ పరీక్షలకు ఫైబర్ ఆప్టికల్ యంత్రం కనిపెట్టాడు.

ఉద్యోగం పేరిట మోసం.. అడిగితే బెదిరింపు

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.30 లక్షలు తీసుకొని మోసం చేశాడని, అడిగితే బెదిరిస్తున్నాడని డెంకాడ మండలానికి చెందిన నలుగురు యువకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 ఫిర్యాదులు అందాయి. భూ తగాదాలపై 8, కుటుంబ కలహాలపై 1, మోసాలపై 3, ఇతర అంశాలకు సంబంధించి 26 వినతులు వచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సకాలంలో బాధితులకు న్యాయం చేయాలని ఆయా స్టేషన్ల అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

★ తమ గ్రామం నుంచి నిత్యం పశువుల అక్రమ రవాణా సాగుతోందని, గంజాయి విక్రయాలు సైతం జరుగుతున్నాయని, యువత పక్కదారి పడుతోందని సారిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది వృద్ధులు అర్జీ ఇచ్చారు.

★ తమ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, అడిగితే తిరగబడుతున్నారని తెర్లాం మండలం పునుపువలస గ్రామానికి చెందిన వృద్ధురాలు పి.రమాదేవి వాపోయారు. ఇప్పటికే తెర్లాం, బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

★ కళాశాలకు వెళ్లకుండానే ఐటీఐ ధ్రువపత్రం ఇస్తామని, రెండేళ్లకు రూ.40 వేలు ఖర్చవుతుందని చెప్పి ఓ సంస్థ నిర్వాహకులు రూ.10 వేలు తీసుకుని మోసం చేశారని, స్పందించడం లేదని వైఎస్సార్ నగర్‌కు చెందిన మహిళ ఎస్పీ వద్ద బోరుమన్నారు.

శిక్షణ ప్రారంభం నేడు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని జోగింపేటలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు కోర్సు డైరెక్టరు నారాయణస్వామి తెలిపారు. ఈ నెల 19 వరకు ఉంటుందన్నారు. జిల్లాలోని 19 పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా విద్యాలయాలకు చెందిన నలుగురు విద్యార్థులు, ఒక గైడ్ టీచరు తర్ఫీదునిస్తామని, వీరు మిగిలిన వారికి నేర్పిస్తారని తెలిపారు. బాలికలకు కేజీబీవీలో, బాలురకు సాంఘిక సంక్షేమ గురుకులంలో బస ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సేవల కొనసాగింపు ఉత్తర్వులు

ఈనాడు కథనానికి స్పందన

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సేవలను పునరుద్ధరిస్తూ ఉన్నత విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025- 26 విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇంతవరకు ఒప్పంద అధ్యాపకుల సేవలను కొనసాగించలేదని ఈనెల 12న 'ఒప్పంద అధ్యాపకులు కొనసాగేనా' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

అరటి సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

నీటి వసతి ఉన్న ప్రాంతాలను సాగుకు సక్రమంగా వినియోగించుకుంటే అరటి పంటతో మంచి లాభాలు సాధించొచ్చని నిరూపిస్తున్నారు జియ్యమ్మవలస మండలంలోని రైతులు. పలు ప్రాంతాల్లో 2500 మంది అరటిపైనే ఆధారపడి సిరులు కురిపిస్తున్నారు. పెదకుదమ గ్రామానికి చెందిన రైతు ఏగిరెడ్డి మోహనరావు ఇందుకు నిదర్శనం.

గ్రామంలోని నాలుగు ఎకరాల్లో ముకిరీలు, కూర, దేశవాళీ రకం అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు 800-900 మొక్కలు వేశారు. పిలక మొక్క రూ.5, ముకిరీ రూ.10 కొనుగోలు చేశారు. మొత్తంగా రూ.20 వేలు ఖర్చు చేశారు. పొలం వద్దే తవ్విన బోరు ద్వారా పంటకు నీరందిస్తున్నారు. 20 రోజులకు ఒకసారి నీటి తడులు పెడుతున్నారు. రెండు నెలలు ఒకసారి మొక్క చుట్టూ గొప్పులు తవ్వాలి. 40-50 రోజులకు ఒకసారి పనికిరాని మొక్కలు తొలగించాలి. ఏటా ఎకరాకు సుమారు 700 గెలలు కాస్తాయి. డిమాండు బట్టి ముకిరీ గెల రూ.200-250, కూర రూ.250, దేశవాళీ రూ.100-120 వరకు ధర పలుకుతోంది. కూలీలు, గెలల కోత, నిర్వహణ, నీరు పెట్టడం మొత్తం పెట్టుబడులు పోగా ఎకరాకు రూ.50 వేలు ఆర్జించారు.

ఇతర రాష్ట్రాలకు రవాణా..

ఇక్కడ పండించిన అరటి గెలలను సీజన్‌లో రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వ్యాపారులకు విక్రయిస్తుంటారు. అరటి ఆకులను 50 ఒక కట్టగా కట్టి ఒక్కొక్కటి రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు.

పదేళ్ల పంట..



అరటి పంట ఎప్పటికీ లాభమే. సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి గెలలు పండుతాయి. ఒక్కోసారి డిమాండును బట్టి అధిక ధర వస్తుంది. ఒక్కసారి మొక్క వేస్తే పదేళ్ల వరకు పంట పొందొచ్చు.

- ఏగిరెడ్డి మోహనరావు, రైతు

రైతేరాజు

కీటక నివారణ.. పంటకు రక్షణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో పురుగులు, తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టిసారించడం వల్ల సాగుకు రక్షణ కల్పించి ఆశించిన దిగుబడులు సాధించొచ్చని కేవీకే సమన్వయకర్త ధ్రువ తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

ప్రశ్న: వరిలో పురుగులు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు చెప్పండి? **- శంకరరావు, భామిని**

సమాధానం: సాధారణ వరి సాగుతో పోల్చుకుంటే డ్రమ్ సీడర్ పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది. వరుసల్లో నాటడం లేదా నాటే యంత్రం ఉపయోగించడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు బాగా ప్రసరించి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. చీడపీడల నివారణకు సాధారణ వరి సాగు మాదిరిగానే సస్యరక్షణ చేపట్టాలి.

ప్రశ్న: ఉల్లికోడు నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- సత్యనారాయణ, రేగిడి**

సమాధానం: ఉల్లికోడు నారుమడి దశ నుంచి పిలక దశ వరకు నష్టపరుస్తుంది. అంకురం ఉల్లికాడ పొడుగుగా గొట్టం మాదిరి బయటకు వస్తుంది. కంకి వేయదు. నివారణకు ఒక సెంటు నారుమడికి 160గ్రా. కార్బోఫ్యూరాన్, 3% సీజీ గుళికలు, విత్తిన మొలకెత్తిన 10 నుంచి 15 రోజుల్లోపు వేయాలి. నాటిన 10 నుంచి 15 రోజులకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3% సీజీ 10 కిలో గుళికలు వాడాలి.

పాలీకల్చర్‌తో నష్టాల నివారణ!

వాతావరణ మార్పుల ప్రభావంతో రొయ్యలు, చేపలు తెగుళ్ల బారిన పడి అధిక సంఖ్యలో మృత్యువాత పడుతుంటాయి. ఫలితంగా ఆక్వారైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పాలీకల్చర్ (రొయ్యలు, చేపలు) విధానంలో ఒకే చెరువులో కలిపి సాగు చేయడంతో లాభాలు ఆర్జించవచ్చని ఆక్వా నిపుణుడు ఎస్.మహేశ్వరరావు తెలిపారు. వర్షాల ప్రభావంతో వనామీ రొయ్యలకు వైరస్, బ్యాక్టీరియా తెగులు సోకి మృత్యువాత పడుతుంటాయి. చేపలతో కలిసి రొయ్యలు సాగు చేయడంతో తెగుళ్ల సోకే అవకాశం తక్కువగా ఉంటుంది.

సాగు విధానం ఇలా...

ఎకరాకు వేయి నుంచి రెండు వేల వరకు శీలావతి, కట్ల రకం చేప పిల్లలను వదలాలి. అదే చెరువులో 20 వేల నుంచి 30 వేల వరకు వనామీ రొయ్య పిల్లలను వేయాలి. వాటికి ప్రత్యేకంగా మేత వినియోగించే అవసరం ఉండదు. చేప పట్టుబడి దశకు చేరుకునే సరికి వనామీ రొయ్యలను రెండు, మూడు పట్టుబడులు చేయొచ్చు. ఎకరాకు టన్ను నుంచి రెండు టన్నుల వరకూ చేపల దిగుబడికి అవకాశం ఉంటుంది. దీంతో ఆక్వారైతులు లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందని తెలిపారు. **- కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే**

ఫోన్ కొట్టు.. సలహా పొందు

వర్షాలు ప్రారంభమైన తరుణంలో జీడి, మామిడి, పామాయిల్, అరటి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, మొక్కలు నాటడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూరగాయల సాగులో మెలకువలు, సలహాల కోసం 81791 06780 నంబరును సంప్రదించాలని పాలకొండ డివిజన్ ఉద్యానశాఖ అధికారిని జయశ్రీ సూచించారు.

పచ్చిరొట్టతో భూసారం

కురుపాం గ్రామీణం, వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: పచ్చిరొట్టతో భూసారం పెరగడంతో ఎరువులు, పురుగుమందుల ఖర్చు తగ్గుతుందని విజయనగరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆ వివరాలు ఇవీ..

విత్తనాలు: జనుము ఎకరానికి 15 కిలోలు, జీలుగ 12, పిల్లి పెసర 8 కిలోల విత్తనాలు అవసరం. వీటి ద్వారా వరుసగా 6, 10, 4 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది.

పోషకాలు: టన్ను జీలుగలో నత్రజని 5-7 కిలోలు, భాస్వరం 1-1.5, పొటాషియం 7-8 కిలోలు లభిస్తుంది. జనుములో నత్రజని 6-9, భాస్వరం 1-2, పొటాషియం 7-10 కిలోలు లభిస్తుంది. పిల్లి పెసరలో నత్రజని 9-11, భాస్వరం 1.5-2, పొటాషియం 8-10 కిలోలు లభిస్తుంది.

సాగు విధానం-లాభాలెన్నో..: ప్రధాన పంట కోతకు ముందు నేలలో తేమ ఉండగానే విత్తనాలను చల్లుకోవాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. పంట దిగుబడి 15 నుంచి 20 శాతం పెరుగుతుంది. పంట నాణ్యంగా ఉంటుంది. నేల గుల్లగా మారి, నీరు ఇంకే గుణం పెరుగుతోంది. కలుపు మొక్కలను అదుపు చేస్తుంది. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతోంది.

రేషన్ సరకులను సద్వినియోగం చేసుకోవాలి

పరిశీలిస్తున్న భారత ఆహార సంస్థ సీజీఎం రాజగోపాల్

రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ సరకులను సద్వినియోగం చేసుకోవాలని భారత ఆహార సంస్థ సీజీఎం ఎ.రాజగోపాల్ సూచించారు. రామభద్రపురం చొక్కాపు వీధిలోని రేషన్ డిపోను సోమవారం తనిఖీ చేసి, కార్డుదారులతో మాట్లాడారు. పక్కాగా సరకులు అందుతున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. వెనుకబడిన జిల్లాల్లో సరకుల పంపిణీ తీరును పరిశీలిస్తున్నామని, తొలుత ఉమ్మడి విజయనగరం జిల్లాలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కొత్త రేషన్ కార్డులు అందించాలని పలువురు ఆయన్ను కోరారు. అనంతరం బాడంగి మండలం డొంకినవలసలోని ఎఫ్‌సీఐ గోదామును ఎ.రాజగోపాల్ తనిఖీ చేశారు. రికార్డులు, బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కాపు రామారావు, ఏజీఎం సందీప్, డీఎంలు సునీల్‌కుమార్, నరేష్‌కుమార్, డీఎస్‌వో మధుసూదనరావు తదితరులున్నారు.

వేరుశనగకాయలు కొన్న బొబ్బిలి రాజు

ఆడంబరాలకు దూరంగా ఉండే బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మరోసారి అలానే సాధారణ వ్యక్తిలా చిరు వ్యాపారితో మాట్లాడారు. సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం కోసం తెర్లాం మండలం ఎం.ఆర్.అగ్రహారం వెళ్లిన ఆయన కారు దిగి వేరుశనగకాయలు కొనుగోలు చేశారు. 'రోజుకు ఎన్ని కుంచాలు అమ్ముతున్నావు, ఎక్కడి నుంచి కాయలు తెస్తున్నావు' అని అడిగి తెలుసుకున్నారు. అయితే ఆయన బొబ్బిలి రాజు, ఎమ్మెల్యే అని చిరు వ్యాపారికి తొలుత తెలియలేదు. తర్వాత విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. **- న్యూస్‌టుడే, తెర్లాం**

960 మంది పోలీసులకు ఆరోగ్య పరీక్షలు

పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న 960 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం సంబంధిత శిబిరం ప్రారంభమైంది. తొలిరోజు విజయనగరం, శ్రీకాకుళం ఆసుపత్రుల్లో 50, 25 చొప్పున 75 మందికి జరిగాయన్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సేవలను ఎస్పీ పర్యవేక్షించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

GK గోల్డ్ లోన్ బ్యాంకు/ ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక ఋణం ఇప్పించబడును. ✆ 8897731257.

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician
ఆదివారం నుండి శుక్రవారం వరకు ఉ 9 గం. నుండి సా 6 గం. వరకు
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు, VZM
FOR APPOINTMENT : 63054 71147

INDUSTRY

Godown Wanted: 4000-5000 Sft. Container Road Access, Electricity connection. Call: 9959977727.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీగాయత్రీ జ్యోతిష్యం, గత 25 సం॥లు విజయనగరంలో స్థిరపడిఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం మీకు ఎటువంటి సమస్యలున్నా.. జ్యోతిష్యం చెప్పబడును సెల్: 9701778711.

REAL ESTATE

FLAT FOR SALE

3 BHK 1450 Sft Flat for sale. 4th floor newly construction Haimavathi Sadhan, Kamma Veedhi, VZM. Car Parking, Lift with all facilities. C : 9177400008.

South India shoping mall backside 3 BHK, 1325 Sft 4th floor new flat for sale. Car parking, Lift with all facilities. C : 9177400008.

HOUSE FOR SALE

ఇండివిడ్యువల్ ఇల్లు G+1 లో గ్రౌండ్ ఫ్లోర్ అమ్మకానికి కలదు. తహశీల్దార్ ఆఫీసు దగ్గర, బొద్దుకూరపేట జంక్షన్, బీసీ వీధి, విజయనగరం. డైరెక్ట్ పార్టీలు మాత్రమే సంప్రదించండి 9666339227, 9666210415.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PLOT FOR SALE

విజయనగరం, రామవరం రోడ్, కలెక్టరేట్ దగ్గర, వాసవీనగర్ లేఅవుట్ నందు 220 చ॥గ॥ దక్షిణ ముఖం గల ఇంటి స్థలం అమ్మకం నకు కలదు. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే ✆ 9700112125, 9597467913.

JOBS

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ టీం లీడర్స్ కావలెను. అర్హతలు 10th to Degree. జీతం : 21,000/- నుండి 45 వేల వరకు. Contact : 9704107303, 8008574616.

Male House Keeping Boy for House Food and Accomodation Available. Contact: 8897663366.

2021 మోడల్, 50 HP Johndeere Front Bucket 5310 4WD ట్రాక్టర్, సింగిల్ ఓనర్, మంచి రన్నింగ్ కండీషన్, హెవీ డ్యూటీ ఆపరేషన్, V16 ఇంజన్ ట్రాక్టర్ అమ్మకానికి. 8341695672, 9550750150.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

కష్టాలు కనండి.. దారి చూపండి

సీతంపేట, కొమరాడ, భామిని, వీరఘట్టం, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే

జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న కొండ వాగులు, నదులపై వంతెనలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులు, నదులు ఉప్పొంగుతూ బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఈక్రమంలో ప్రమాదకరంగా రాకపోకలు చేయాల్సిన పరిస్థితి ఎదరవుతోంది. గర్భిణులు, రోగులను డోలీలు కట్టి వాగుల్లోనే తీసుకెళ్లిన ఘటనలెన్నో. నిధులు మంజూరై అర్ధాంతరంగా నిలిచిపోయిన వారధులు కొన్నైతే.. నిధులు కోసం వేచి చూస్తున్నవి మరికొన్ని. వర్షాలు పెరిగేలోగా తమకు ఓ దారి చూపాలని బాధితులు కోరుతున్నారు.

భామిని మండలం కొరమ వద్ద తాత్కాలిక వంతెనపై ప్రమాదకరంగా రాకపోకలు

నిధులున్నా సాగని వైనం..

కొమరాడ మండలం పూర్ణపాడు- లాబేసు మధ్య నాగావళి నదిపై రూ.6.6 కోట్లతో వంతెన నిర్మాణానికి 2006లో శంకుస్థాపన చేశారు. 2017లో అదనంగా రూ.4 కోట్లు జోడించారు. పిల్లర్లు, 9 బోర్ల నిర్మాణం వరకు పనులు జరిగాయి. తర్వాత నిలిచిపోయాయి. 2019లో వైకాపా వచ్చిన తర్వాత మరో రూ.5 కోట్లు మంజూరు చేసినా ప్రక్రియ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం రూ.4 కోట్లు కేటాయించింది. టెండర్ల ప్రక్రియ జరగాల్సి ఉంది. నదీ పరివాహక ప్రాంతంలో 9 పంచాయతీలకు చెందిన 27 వేల మంది మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పూర్తయితే వీరితోపాటు గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం మండల వాసులకు ఉపయుక్తంగా ఉంటుంది.

లోతుగా ఉండడంతో అవస్థలు...

సీతంపేట మండలం రేగులగూడ-వెంపలగూడ మధ్య కొండవాగుపై ఉన్న వారధి తిత్లీ తుపానుకు కూలిపోయింది. కొత్త నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టినా, తర్వాత వచ్చిన వైకాపా 20 శాతం లోపు పనులను రద్దు చేయడంతో ఆగిపోయింది. కొన్నాళ్లకు రూ.2 కోట్లకు పైగా మంజూరు చేశారు. వీటితో ఈతమానుగూడ- వెంపలగూడ తారు రహదారి, వారధి నిర్మాణం చేపట్టారు. పిల్లర్లు, రోడ్డు పనులకు మెటల్ మిక్స్ వేసి వదిలేశారు. వర్షాలు పెరిగితే వాగు ఉప్పొంగుతోందని, రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గొయిది, కుసిమి రోడ్డులోని మల్లి, దోనుబాయిలో చంద్రమ్మతల్లి గుడి, చిన్నబగ్గ-బొండి మధ్య, కీసరజోడు వద్ద, బగ్గామర్రిపాడు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

పిల్లర్లతో పనులు సరి

వీరఘట్టం మండలం దశమంతపురం వద్ద వట్టిగెడ్డపై వంతెన శిథిలావస్థకు చేరుకుంది. హుద్‌హుద్ తుపాను సమయంలో రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు చేతులు దులిపేసుకున్నారు. వానా కాలంలో వాగులో నీటి ప్రవాహం పెరిగితే అవస్థలు తప్పడం లేదు. ★ సాలూరు మండలం సారిక పంచాయతీ కేంద్రం నుంచి సొంపిగాం వరకు పీఎంజీఎస్‌వై కింద 2022లో రూ.3.50 కోట్లతో కొండవాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పిల్లర్ల వరకు పనులు జరిగాయి. అనంతరం వదిలేశారు.

ఏళ్లుగా తప్పని తిప్పలు..

భామిని మండలం కొరమ సమీపంలోని బగ్గామర్రిపాడు గెడ్డపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన 2002లో కూలిపోయింది. ప్రత్యామ్నాయంగా రూ.16 లక్షలతో 2003లో కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. ప్రధాన వంతెన లేక భారీ వర్షాలు కురిస్తే వాగు ఉద్ధృతంగా ప్రవహించి రాకపోకలు చేయలేని పరిస్థితి. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

పెదమానాపురంలో 230 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి విశాఖకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా సభ్యులు దత్తిరాజేరు మండలం పెదమానాపురం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 230 కిలోల సరకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసు వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఒడిశాకు చెందిన ఘాసిరాం హంతల్, కరన్ ఖిలో, సురేష్ అడకాటియా, అనిలా, జున్నేష్ ఇటీవల రెండు కార్లలో విశాఖకు బయలుదేరారు. పెదమానాపురం రైల్వే గేటు వద్ద స్థానిక పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా.. వారిని చూసి పారిపోయేందుకు నిందితులు ప్రయత్నించారు. ఎస్సై జయంతి, ఇతర సిబ్బంది వెంబడించి హంతల్, ఖిలోను పట్టుకున్నారు. మిగిలిన ముగ్గురూ పరారయ్యారు. నిందితుల నుంచి 44 సంచుల్లో ఉన్న 230 కిలోల గంజాయి, రూ.700, మూడు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అడకాటియా కీలకమైన నిందితుడిగా గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామన్నారు.

దొరికినంత దోచాడు.. ఏసీ రైలెక్కాడు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతిలోని నాయుడుపేటలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రూ.37.44 లక్షల విలువైన 416 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు వెల్లడించారు. ఈ నెల 5న మూగాంబిక దేవాలయ వీధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన పార్వతీపురం జిల్లాకు చెందిన చందక మణికంఠ(28) ఏసీ రైలులో ఊరెళ్తుండగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. తడ, శ్రీసిటీ, నాయుడుపేట పరిధిలో అయిదు కేసులతోపాటు విశాఖపట్నం, మువ్వలవారిపాలెం, ద్వారక పీఎస్ పరిధిలో మొత్తం 14 దొంగతనం కేసులు అతనిపై నమోదయ్యాయన్నారు. పార్వతీపురం నుంచి రేణిగుంటకు ఒక్కడే చేరుకుని స్థానికంగా అద్దెకు తీసుకున్న గదిలో ఉంటూ పగటిపూట నాయుడుపేట పరిసర ప్రాంతాలకు చేరుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైందన్నారు. ఎవరైనా గుర్తిస్తే ఇల్లు అద్దెకు కావాలని బుకాయించేవాడని ఎస్పీ వివరించారు.

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ సేధు మాధవన్

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని జేసీ సేధు మాధవన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజల నుంచి 225 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూశాఖకు సంబంధించి అత్యధికంగా 110 ఫిర్యాదులు వచ్చాయి. డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీ, ప్రమీలా గాంధీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి..

గత 15 సంవత్సరాలుగా నివాసముంటున్నా రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గరివిడి మండల కొండపాలెం పంచాయతీ ఇందిరమ్మకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించాలని కోరారు.

★ తమ గ్రామంలో తాగునీరు కలుషితమైందని గజపతినగరం మండలం పిడిశీల గ్రామ మాజీ సర్పంచి పోలిపిల్లి అప్పలనాయుడు, కర్రోతు గురుమూర్తి, బోడసింగి శంకర్రావు, సుంకరి పైడిపినాయుడు తదితరులు అర్జీ అందజేశారు.

★ రైతు సాధికార సంస్థలో భాగంగా సహజ వ్యవసాయ కార్యక్రమంలో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న బొండపల్లి, గంట్యాడ మండలాలకు చెందిన 8 మందిని స్థానిక రాజకీయనేతలు తొలగించడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	90	150	160

రాత్రయితే భయం.. భయం

పాలకొండ ప్రధాన రహదారిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు చీకట్లు అలుముకున్నాయి. గాయత్రీనగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆనుకుని నివాసం ఉంటున్నవారు, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. వీధి దీపాలు వెలగక రాత్రివేళల్లో ఆందోళన చెందుతున్నారు. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తామని కమిషనర్ సర్వేశ్వర్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఇక్కడ విశ్రాంతి తీసుకునేదెలా..?



జియ్యమ్మవలస మండలంలోని కొండచిలకాం కూడలిలోని ప్రయాణికుల విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొండచిలకాం, చినవోదూరు, బ్రాహ్మణ తదితర 20 గ్రామాల ప్రజలకు ఈ భవనమే దిక్కు. లోపలి భాగం, స్లాబ్, గోడలు పూర్తిగా పాడయ్యాయని, బాగు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

30 ఏళ్లుగా మట్టి రోడ్డే దిక్కు

సాలూరు పట్టణంలోని రామాకాలనీ ఏర్పాటై మూడు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ చాలా వీధుల్లో మట్టి రోడ్లే ఉన్నాయి. సీసీ రహదారి వేయాలని పలుమార్లు కాలనీ ప్రజలు కోరారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డు చెరువును తలపిస్తోంది. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తామని కమిషనర్ ప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు

వంతెన కూలితే అంతే సంగతి

పాచిపెంట మండలంలోని గొగాడవలస, మాతుమూరు గ్రామం వద్ద ఒకటిన్నర దశాబ్దం క్రితం నిర్మించిన మినీ వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రక్షణ గోడలు పాడయ్యాయి. ఈ వంతెన కూలకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పెద్దగెడ్డ ఇంజినీరింగ్ అధికారులు రాత పూర్వకంగా తెలియజేస్తే మినీ వంతెనల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తామని ఆర్.డబ్ల్యూ.ఎస్. జేఈ విజయకుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాచిపెంట

ధూళిభద్రకు డబుల్ ధమాకా

కొఠియా వివాదాస్పద గ్రామాల్లో అభివృద్ధి పనులు పెరుగుతున్నాయి. ధూళిభద్రలో ఇప్పటికే ఆంధ్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజాగా ఒడిశా ప్రభుత్వం అక్కడ జియో టవర్ నిర్మాణానికి పనులు ప్రారంభించింది. గ్రామంలో దాదాపు 45 కుటుంబాలుండగా, రెండు ప్రభుత్వాలు బడులు, విద్యుత్తు దీపాలు, తాగునీరు, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నాయి. గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో చెత్త వేస్తున్నారు. - ఎ.హిమ ★ చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వరరావు, డిపో మేనేజరు – పాలకొండ గ్రామీణం

? కొసలి, కీసరలో రోడ్లు ఇరుకైపోయి చెత్త వేయడంతో దుర్వాసన వస్తోంది. - చక్రధర్ ★ పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. - కృష్ణారావు, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, భామిని

? పనసభద్రలో ట్యాంకు నిర్మాణం పూర్తయినా ఇంటింటి కుళాయి నుంచి నీరు సరఫరా కావడంలేదు. - పి.రాము ★ కుళాయిల నుంచి నీరు సరఫరా చేస్తాం. - బసవరాజు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ – పార్వతీపురం గ్రామీణం

? కురుపాం మండలంలోని ఉదయపురం నుంచి కొత్తగూడ వెళ్లే రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా మారింది. - రామకృష్ణ ★ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు వస్తే పనులు చేస్తాం. - నాగేశ్వరరావు, పీఆర్ జేఈ – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? అప్పయ్యపేట రామమందిరం వీధి శివారున కాలువలు పూడికతో నిండిపోయాయి. - రామారావు ★ మురుగు పోయే మార్గం చూపుతాం. - సురేష్, ఈవో – సీతానగరం

5,600 ఎకరాలకు నీరేదీ..?

- ఎత్తిపోతల పథకం లేక అవస్థలు
- వృథాగా పోతున్న నదీ జలాలు

భామిని, న్యూస్‌టుడే: వంశధారలో కలుస్తున్న కొండ వాగుల వరద నీరు భామిని మండలంలో సుమారు 35 కి.మీ. ప్రవహిస్తున్నా స్థానిక రైతులకు ఉపయోగపడటం లేదు. ఎత్తిపోతల పథకాలు లేక దిగువ ప్రాంతానికి నీరు వృథాగా పోతుండడం, ఏటా వర్షాభావ పరిస్థితులతో నష్టాలు చవి చూస్తున్నారు.

ఆరేళ్లుగా ఇదే పరిస్థితి..

గత తెదేపా హయాంలో మండలంలో పాలవలస, వడ్డంగి గ్రామాల వద్ద ఎత్తి పోతల పథకాల ఏర్పాటుకు నిర్ణయించారు. వడ్డంగి సమీపంలోని గజపతి సాగరం వద్ద రూ.33కోట్లతో పథకం ఏర్పాటు చేసి నేరడి, సుఖబోధి, వడ్డంగి గ్రామాలకు చెందిన సుమారు 3,300 ఎకరాలకు, కాట్రగాడ(బి) సమీపంలోని వంశధార వద్ద రూ.18.10 కోట్లతో ఏర్పాటు చేసి మనుమకొండ, పాలవలస, బొమ్మిక, కాట్రగాడ(బి) గ్రామాలకు చెందిన 2300 ఎకరాలకు సాగు నీరిచ్చేలా అంచనాలు తయారు చేశారు. పరిపాలన ఆమోదం పొందిన తర్వాత 2019లో అప్పటి మంత్రి

వడ్డంగి గజపతి సాగరంలో చుక్క నీరు లేని దృశ్యం

కిమిడి కళావెంకటరావు శంకుస్థాపన చేశారు. ఆ పనులు ప్రారంభించేలోపే ఎన్నికల కోడ్ రావడం, తర్వాత వైకాపా అధికారంలోకి రావడంతో జరగలేదు. దీంతో వడ్డంగి, పట్టు గ్రామాల్లోని 5 వేల ఎకరాలకుపైగా ఏటా బీడు భూములుగా మారుతున్నాయి. వర్షాలు అరకొరగా పడుతుండడంతో గజపతి సాగరంలో చుక్క నీరు కనిపించడం లేదు.

పాడైన వాటి ఊసే లేదు..

భామిని మండలంలోని వంశధార నదీ ప్రాంతంలో బత్తిలి, బిల్లుమడ, కాట్రగాడ(బి), పసుకిడి, లివిరి, తాలాడ, బాలేరు, సోలికిరి, గ్రామాల వద్ద ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి రైతులకు సాగు నీరు ఇచ్చేలా ప్రతిపాదించారు. వాటిలో 2001-02లో పసుకిడి, లివిరి వద్ద రూ.7కోట్లతో రెండింటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చే తరుణంలో వంశధారలో వరదల కారణంగా కొట్టుకుపోయాయి. నేటికీ వాటి పరిస్థితిని అధికారులు కన్నెత్తయినా చూడలేదు.

కొత్తగా అంచనాలు పంపిస్తాం

గత తెదేపా హయాంలో రూ.33 కోట్లతో ప్రారంభించిన పథకం ప్రభుత్వం మారడంతో ఆగిపోయింది. వైకాపా హయాంలో రూ.37.50 కోట్లతో ప్రతిపాదనలు పంపినా అనుమతులు రాలేదు. కొత్త అంచనాలతో మళ్లీ పంపిస్తాం. - కామరాజు, ఏపీఎస్ఐడీసీ, డీఈ, ఎత్తిపోతల పథక విభాగం, శ్రీకాకుళం.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తా

వడ్డంగి ఎత్తి పోతల పథకం పూర్తికాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కోరుతాం. - నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ.

అభివృద్ధి పనులు అడ్డుకోవడం సరికాదు

పాచిపెంట, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు అడ్డుకోవడం సరికాదని మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. కేసలిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎగువ కుమ్మరివలస బీటీ రోడ్డు పనులకు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. గ్రామసభ నిర్వహించి సంతకాలు, తీర్మానాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెదేపా మండలాధ్యక్షుడు యుగంధర్, ఏఎంసీ అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు పి.భాస్కరరావు, ఎ.శ్రీనివాసరావు, చిన్న శ్రీనివాసరావు, సాయికుమార్, లోకేశ్, బలరాం, ఎంపీడీవో పాత్రో, తహసీల్దారు రవి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ.. సాలూరు: సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను లబ్ధిదారులకు మంత్రి సంధ్యారాణి అందజేశారు. కె.సావిత్రికి రూ.2.81 లక్షలు, టి.భారతికి రూ.61,572, డి.త్రినాథకు రూ.1.10 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు.

మహిళలకు కరపత్రాలు అందిస్తున్న సంధ్యారాణి

నూతన సాగు పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో పాటు సాగులో నూతన పద్ధతులు అవలంబిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని అధికారిణులు జి.అన్నపూర్ణ, సీహెచ్.శారద సూచించారు. సోమవారం మండలంలోని దురిబిలిలో వెద పద్ధతిలో తాడు వినియోగిస్తూ వరి, మినుములు, పెసర, గోంగూర, తోటకూర, బెండ మొదలైన విత్తనాలు విత్తుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది ప్రసాద్, దాశరథి, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని చినతోలుమండగూడ, నీలకంఠాపురంలో పార్టీ మండలాధ్యక్షుడు జె.భుజంగరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బి.సురేష్, తెదేపా నాయకులు డి.లక్ష్మణరావు, డి.రామకృష్ణ, పి.రాంబాబు, నరేష్, ఎం.సత్యంనాయుడు, సర్పంచి యు.చంటి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందిస్తున్న విప్ జగదీశ్వరి

ప్రకృతి వ్యవసాయ సాగులో ఎమ్మెల్యే

వీరఘట్టం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సొంత గ్రామం ఎం.రాజపురంలో సోమవారం ప్రకృతి సాగును ప్రారంభించారు. తన వ్యవసాయ క్షేత్రంలో వరి విత్తనాలు బీజామృతంతో శుద్ధి చేశారు. అనంతరం నీడలో ఆరబెట్టి పొలంలో చల్లారు. గులిరాగి శ్రీ కల్టివేషన్ పద్ధతిలో సాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేయడంతో భూమి సారవంతమై నీటి ఎద్దడిని తట్టుకునే శక్తి కలుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు లభిస్తాయన్నారు. రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని, రైతులు ఈ విధానం పాటించాలన్నారు.

పొలంలో విత్తనాలు చల్లుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సమస్యలు చెప్తే.. నిధులిస్తా: ఎంపీ

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు అభివృద్ధికి పాటుపడాలని ఎంపీ జి.తనూజారాణి సూచించారు. సోమవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాలని, ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తేనే గిరిజనుల సమస్యలపై చర్చించేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లాకు తరలించే ప్రయత్నం చేయొద్దన్నారు. మన్యంలో విద్యుత్తు సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే ఎంపీ లాడ్స్ నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో ప్రమాదాలు పెరుగుతున్నాయని, వాటిని నివారించే ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డిని ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి సన్మానించారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, డీడీ అన్నాదొర, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహనరావు, ఏఎంవో పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి, చిత్రంలో పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

‘వ్యక్తిగత విమర్శలు తగదు’

కొమరాడ, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం నియోజకవర్గంలో గత వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యమని, కూటమి వచ్చాక ఏడాదిలోనే రోడ్లు వేశారని తూర్పుకాపు సంఘం రాష్ట్ర సభ్యుడు ఎస్.శేఖర్‌పాత్రుడు అన్నారు. మాదలింగిలో ఆయన మాట్లాడుతూ.. పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణానికి రూ.5.25 కోట్లతో టెండర్లు పిలిచినట్లు చెప్పారు. రూ.9 కోట్లతో తోటపల్లి- గుణుపూర్ రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిపై ఇటీవల మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ పువ్వల లావణ్య, అరకు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు భరత్ అన్నారు. కురుపాంలో వారు మాట్లాడారు. గత అయిదేళ్లు పూర్తిగా అభివృద్ధిని పక్కన పెట్టి, ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

శ్రీనిధి మేనేజరుగా శ్రీనివాసరావు

సాలూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ శ్రీనిధి ప్రబంధకుడిగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి సంధ్యారాణిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుపేద మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి, వ్యవసాయం, వ్యాపారం, కుటీర, చిన్నతరహా పరిశ్రమలు నిర్వహించే వారికి రుణాలు మంజూరు చేయాలని మంత్రి సూచించారు.

గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడిగా తమ్మయ్య

కొమరాడ, న్యూస్‌టుడే: గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఉలిపిరి మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి.తమ్మయ్య ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఆయన చెప్పారు. గౌరవాధ్యక్షుడిగా జి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జె.మణికుమార్ ఎంపికైనట్లు చెప్పారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని సభ్యులు పేర్కొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం (బాలికలు), కురుపాం (బాలురు) జ్యోతిబా ఫులే గురుకులాల్లో 5, 6, 7, 8, 9 తరగతుల్లోని ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జి.భార్గవదేవి తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మూడు రోజుల్లో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

వసతులు కల్పించాలని డిమాండు

కురుపాం గ్రామీణం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బి.అనిల్ డిమాండ్ చేశారు. మండలంలోని ఉదయపురం, నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు.

షరతులు లేకుండా పథకాలు అందించాలి

పాలకొండ: మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని సిటు జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు అన్నారు. పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిబ్బంది మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు.

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో.. రూపాయిల్లో..) **టమాటా:** 32, **వంకాయలు:** 44, **బెండ:** 28, **బీర:** 40, **చిక్కుడు:** 34, **పచ్చిమిర్చి:** 94, **కాకర:** 34, **క్యారెట్:** 40, **బీట్‌రూట్:** 40, **ఉల్లి:** 23, **బంగాళదుంపలు:** 20, **అల్లం:** 60, **వెల్లుల్లి:** 80, **క్యాప్సికమ్:** 80, **అరటి కాయ:** 5, **ఆనప కాయ:** 14 – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

తెరపై ఈనాడు

పార్వతీపురం: **శ్రీ వీరభద్ర సినిమా:** కన్నప్ప, సూపర్‌మ్యాన్ ★ **టీబీఆర్:** ఓ భామ.. అయ్యోరామ, కుబేర ● **పాలకొండ: రామకళామందిర్**- 3 బీహెచ్‌కే ★ **వెంకటగౌరి (స్క్రీన్1)** - తమ్ముడు, **(స్క్రీన్2)** - ఓ భామ.. అయ్యోరామ ● **సాలూరు: శ్రీరామ**- తమ్ముడు, **లక్ష్మి**- కుబేర, **శ్రీలక్ష్మి**- కన్నప్ప – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

నాట్యమయూరి పురస్కారం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పూర్ణిమ నృత్య కళాశాల నృత్యకారిణి ఎస్.పూర్ణిమకు నాట్యమయూరి పురస్కారం దక్కింది. కూచిపూడి, భరతనాట్యంలో ఆమె చేసిన కృషికి గాను వరంగల్‌కు చెందిన తెలుగు సంస్కృతి సేవా ట్రస్టు రెండు రోజుల క్రితం జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

విద్యాసామగ్రి అందజేత

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తోణాం పంచాయతీ మెట్టవలస ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు బేతేల్ సోషల్ ఆర్గనైజేషన్ సభ్యులు పెన్నులు, పుస్తకాలు ఇతర సామగ్రి అందించారు. సాలూరు పరిసర ప్రాంతాల్లో గత 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు సువార్తరావు తెలిపారు. సంస్థ కోశాధికారి విద్య, ఎలిషా, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతుల జోరు.. నిరసనల హోరు

కలెక్టరేట్ ప్రాంగణం, పార్వతీపురం, న్యూస్‌టుడే: ఐటీడీఏ పరిధిలో షెడ్యూల్ ప్రాంత గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండు చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద కమిటీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. టీఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లోవరాజు మాట్లాడుతూ.. జీవో 3కు బదులు కొత్త చట్టం తీసుకువచ్చి గిరిజనులకు వంద శాతం ఉద్యోగాలు కల్పించేలా చూడాలన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

మరికొన్ని అర్జీలు..: ★ కొమరాడ మండలం పూడేసు పంచాయతీ గుమ్మడంగి గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి కోరారు. ★ గుమ్మలక్ష్మీపురం మండలంలో పాడైన వంగర ఘాట్‌రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

సీతంపేట ఐటీడీఏలో..

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి 95 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను పీవో ఆదేశించారు.

వచ్చిన వినతులు.: ★ సీతంపేట మండలం రేగులగూడ వద్ద వంతెన తిత్లీ తుపానుకు కూలిపోయిందని, తర్వాత ప్రారంభించిన పనులు ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పులిపుట్టి సర్పంచి ఎస్.బాజన్న, రాజ్‌కుమార్ చెప్పారు. ★ గ్రామంలో వరద రక్షణ గోడ నిర్మించాలని కిల్లాడకు చెందిన ఆనందరావు, దుగ్గికూడలి -రాయిలంకకు తారు రహదారి, కొత్తకోట నుంచి తంకిడిభద్రకు గ్రావెల్ రోడ్డు మంజూరు చేయాలని సోమయ్య, కె.గంగారావు తదితరులు పీవోకు వినతులు అందజేశారు.

ఎస్పీ కార్యాలయంలో..

పార్వతీపురం పట్టణం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఆస్తి వివాదాలు, అత్తారింటి వేధింపులకు సంబంధించిన 13 ఫిర్యాదులను ఎస్పీ మాధవరెడ్డి స్వీకరించారు. సంబంధిత ఠాణాల ఎస్సైలతో మాట్లాడి అర్జీలు పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆగుతున్న అంబులెన్సులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కొండలపై గ్రామాల ప్రజలకు వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ఫీడర్ అంబులెన్స్ వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. అంబులెన్సు వాహనాలు వెళ్లలేని గ్రామాల్లో సేవలు అందించేందుకు వీటిని తీసుకొచ్చారు. ప్రస్తుతం నిర్వహణ కరవై ఇవి వినియోగానికి దూరంగా ఉంటున్నాయి.

మూలకు చేరిన 104 ఫీడర్ అంబులెన్స్

2017 నుంచి సేవలు..

శిఖరాగ్ర గ్రామాల్లోని రోగులను మైదాన ప్రాంతాలకు తీసుకు వచ్చేందుకు 2017-18లో మండలానికి 3, 4 చొప్పున వాహనాలు అందించారు. ఇవి 24 గంటలూ సేవలు అందించేవి. జిల్లాలో ఇలా 24 వాహనాలు పనిచేస్తున్నాయి. ఫోన్ చేస్తే ఆయా గ్రామాలకు వెళ్లి రోగులను తీసుకుని సమీప ఆసుపత్రికి చేర్చేవారు. దీంతో రహదారి సౌకర్యం లేని గ్రామాల్లోనూ నాణ్యమైన సేవలు అందేవి.

అయిదేళ్లలో నిర్లక్ష్యం..

వైకాపా పాలనలో వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పాడైన వాటిని బాగు చేసేందుకు నిధులు విడుదల చేయకపోవడంతో చాలా వాహనాలు మూలకు చేరాయి. జీతాలు, పెట్రోల్ అలవెన్సులు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. దీంతో సాలూరు మండలంలో దొర్లతాడ్డివలస, మావుడి, మక్కువ మండలం దుగ్గేరు, పాచిపెంట మండలం రాయిగుడ్డివలస, కేరంగి, వేటగానివలసలో వాహనాలు పాడయ్యాయి. కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పార్వతీపురంలోనూ ఇదే పరిస్థితి.

పీవోతో చర్చిస్తాం..

వాహనాలు మరమ్మతులకు గురైన విషయం మా దృష్టికి రాలేదు. వివరాలు సేకరించి ఐటీడీఏ పీవోతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. – పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

పారిశుద్ధ్య పక్షోత్సవాలు

సీతానగరం, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో ఈ నెల 15 నుంచి పారిశుద్ధ్య పనులు తప్పకుండా చేపట్టాలని డీఎల్‌పీవో నాగభూషణరావు ఆదేశించారు. సీతానగరంలో కార్యదర్శులకు సూచనలు చేశారు. ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో కుమారవర్మ పాల్గొన్నారు. ● గ్రామాల్లో పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించాలని జియ్యమ్మవలసలో కార్యదర్శులకు ఎంపీడీవో కె.ధర్మారావు సూచించారు.

సారా రహిత గ్రామంగా పెదవంగర

పాలకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పెదవంగరను సారా రహిత గ్రామంగా గుర్తించినట్లు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఇటీవల గ్రామంలో నవోదయం కార్యక్రమం నిర్వహించి గ్రామస్థుల్లో చైతన్యం తీసుకువచ్చినట్లు చెప్పారు. పాలకొండ మండల పరిధిలో పాత కేసులతో సంబంధం ఉన్న ఆరుగురిపై బైండోవర్‌లు నమోదు చేశామన్నారు.

పెదమేరంగిలో ఏనుగుల బీభత్సం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద సోమవారం ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. స్థానిక బియ్యం మిల్లులో కిటికీలు, రతాలమ్మ జ్యూస్ దుకాణంలో షట్టర్లు పాడు చేశాయి. కూరగాయల దుకాణంలో నాలుగు డబ్బాల్లో అమ్మకానికి ఉంచిన టమాటాలు తినేశాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం బాసంగి, గదబవలస, నిమ్మలపాడు సమీపంలో సంచరిస్తున్నాయి.

16 నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

పాలకొండ, న్యూస్‌టుడే: ఈ నెల 16 నుంచి పాలకొండలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు సిటు జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు పేర్కొన్నారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, అనంతరం వచ్చే ప్రయోజనాలు తక్షణమే ఇవ్వాలని, సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మృతి చెందితే రూ.5 లక్షలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్.సంజీవి, సురేష్, శ్రీదేవి, విమల, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాలకొండలో ధర్నా చేస్తున్న కార్మికులు

నాయకత్వ లక్షణాలు అవసరం

మాట్లాడుతున్న ఏపీసీ తేజేశ్వరరావు

సీతానగరం, న్యూస్‌టుడే: పాఠశాలల నిర్వహణకు నాయకత్వ లక్షణాలు అవసరమని, ప్రతి ఉపాధ్యాయుడు అలవర్చుకోవాలని సమగ్ర శిక్షా ఏపీసీ తేజేశ్వరరావు సూచించారు. మండలంలోని మరిపివలసలో తొలి విడత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఇక్కడ నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీసీ చెప్పారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 250 మంది పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అన్ని విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో కోటేశ్వరరావు, కోర్సు డైరెక్టరు వెంకటరమణ, ఎంఈవో సూరిదేముడు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జగన్నాథ ట్రేడర్స్‌లో పురుగు మందుకు సంబంధించి అనుమతి లేకపోవడంతో విక్రయించొద్దని ఆదేశించారు. పలు దస్త్రాలు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. విజిలెన్స్ సీఐ రమణయ్య, విజయనగరం వ్యవసాయ సహాయ సంచాలకుడు చంద్రరావు, సాంకేతిక నిపుణుడు రవీంద్ర, ఏవో శిరీష పాల్గొన్నారు.

నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఒప్పందాలు అమలు చేయాలి

నినాదాలు చేస్తున్న కార్మికులు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: గత సమ్మె కాలం నాటి ఒప్పందాలు అమలు చేయాలని పుర కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం పార్వతీపురం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిటు నాయకుడు జి.వెంకటరమణ మాట్లాడుతూ.. గతంలో ఉద్యోగ, కార్మిక సంఘాలు 17 రోజులు సమ్మె చేయగా.. ప్రభుత్వం కొన్ని ఒప్పందాలు చేసుకుందని, వాటిని అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య అధికారి కె.పకీరురాజుకు సంఘ నాయకులు ఎన్.శంకరరావు, సీహెచ్.సింహాచలం, ఎం.శివ, టి.రాజేష్ వినతిపత్రం అందజేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

సీతంపేట, పాలకొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మండల తెదేపా అధ్యక్షుడు ఎస్.తోటముఖలింగం, ఏపీటీపీసీ సభ్యుడు ఎస్.మాలయ్య అన్నారు. గొయిది పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మంగయ్య, తిక్కమయి, సరస్వతి, మిన్నారావు పాల్గొన్నారు. ● పాలకొండ మండలంలోని లుంబూరులో తెదేపా మండల అధ్యక్షుడు జి.రామినాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది.

లతల తొలగింపు

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రావికోన పంచాయతీ అడ్డూరివలస సమీపంలో విద్యుత్తు నియంత్రిక, స్తంభాలపై లతలను సిబ్బంది తొలగించారు. ఇక్కడ నియంత్రిక పరిసరాలు అధ్వానంగా మారడంపై ఈనెల 7న ‘ఈనాడు’లో వార్త ప్రచురితమైంది. ట్రాన్సుకో గ్రామీణ ఏఈ రామారావు స్పందించి శుభ్రత పనులు చేయించారు.

(c) eenadu

క్వారీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

చీమకుర్తి,న్యూస్‌టుడే: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్‌తో కలిసి సోమవారం ఆయన చీమకుర్తి పోలీసు స్టేషన్‌ను సందర్శించి వివిధ దస్త్రాలు పరిశీలించారు. కేసుల పురోగతిపై చర్చించారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. ఉపాధి కోసం క్వారీల్లో పనిచేసేందుకు వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆనంద్ గ్రానైట్, కృష్ణసాయి గ్రానైట్ పరిశ్రమలను ఆయన సందర్శించారు. క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ, డ్రోన్ కెమేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, ఎస్సైలు కృష్ణయ్య, హరిబాబు, శివరామయ్య పాల్గొన్నారు.

క్వారీలో గ్రానైట్ బండను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి

పొగాకు రైతులకు ఇబ్బంది రానీయొద్దు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి, గుంటూరు (జడ్పీ), న్యూస్‌టుడే: హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గోదాంలు నిండిన నేపథ్యంలో ప్రైవేటు గోదాములను అద్దెకు తీసుకుని పొగాకు తరలించాలని, అందుకయ్యే ఖర్చులను మార్క్‌ఫెడ్ భరిస్తుందని హామీ ఇచ్చారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. 2024-25 సంవత్సరంలో 80 మిలియన్ కిలోల ఉత్పత్తిని అంచనా వేయగా, ఇప్పటివరకు 22 పొగాకు కంపెనీలు 36 మిలియన్ కిలోల పంట కొనుగోలు చేశాయని వివరించారు. ఈ నెల 21వ తేదీ నుంచి సన్న, చిన్నకారు రైతుల దగ్గరున్న మొత్తం పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అమృత్-2 నిధులు కేటాయింపులు (రూ.కోట్లలో)	ఒంగోలు	మార్కాపురం	పొదిలి	దర్శి
	424.42	63.14	126.17	130.61

అమృత్ ఘడియలొచ్చాయ్!

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

- ఒంగోలు నగరానికి రూ.424.42 కోట్లు మంజూరు
- మార్కాపురం, పొదిలి, దర్శి పట్టణాలకు మహర్దశ

ఒంగోలు నగరంతోపాటు జిల్లాలోని మరో మూడు పట్టణాల దాహార్తి తీర్చడానికి అమృత్-2 పథకం కింద నిధులు మంజూరయ్యాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పథకం కింద అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మార్గదర్శకాల ప్రకారం సవరించిన అంచనాల మేరకు నిధులు కేటాయించారు. ఈ నెల 30వ తేదీ లోపు అర్హులైన వారు టెండరు దాఖలు చేయాలని కోరారు. 2055 నాటికి పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. టెండర్లు పూర్తి అయితే రెండేళ్లలోపు పనులు పూర్తి చేయాలనే ఒప్పందం చేసుకుంటారు. దీంతో ఒంగోలు నగరంలో ప్రతిరోజు ప్రజలకు తాగునీరందించడానికి అవకాశం కలుగుతుంది.

● అమృత్-2 పథకం కింద జిల్లాలో ఒంగోలు నగరంతోపాటు మార్కాపురం, పొదిలి, దర్శి పట్టణాలకు నిధులు మంజూరు చేశారు. వీటికి సంబంధించిన నీటి వనరు (సోర్స్)ను ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. అమృత్ నిధులను మూడు విభాగాలుగా ఖర్చుచేయాలని పేర్కొన్నారు. తాగునీరు, మురుగునీటి నిర్వహణ, ఐండిపెండెంట్ కుళాయిలు ఇవ్వడం చేయాల్సి ఉంది.

రామతీర్థం జలాశయం

కేంద్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థ వాటా కింద 70 శాతం కేటాయించాలి. అన్ని నిధులు సమకూర్చే శక్తి లేనందున రాష్ట్ర ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పనులు చేయడానికి కేంద్రం నుంచి అనుమతి తీసుకుంది.

కొత్తగా వచ్చే సౌకర్యాలు

అమృత్-2 పథకం కింద ఒంగోలు నగరానికి రెండు ప్యాకేజీల కింద రూ.424.42 కోట్లు మంజూరు చేశారు. మొదటి ప్యాకేజీ కింద తాగునీటి అవసరాలకు రూ.381.70 కోట్లు మంజూరు కాగా, దానిలో నిర్మాణ పనులకు రూ.320.05 కోట్లు, పర్యవేక్షణ నిర్వహణకు రూ.61.25 కోట్లు కేటాయించారు. దీని ద్వారా 18 ఓవర్‌హెడ్ ట్యాంకులు, మూడు ఫిల్టరేషన్ ప్లాంట్లు, 535 కిలోమీటర్ల మేర పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీ కింద రూ.42.72 కోట్లు మంజూరయ్యాయి. వీటితో ఒక ఫిల్టరేషన్ ప్లాంటు, 35 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మిస్తారు. నిర్మాణాలకు రూ.34.68 కోట్లు, నిర్వహణకు రూ.8.04 కోట్లు కేటాయించారు. రెండు ప్యాకేజీలు తాగునీటి అవసరాల కోసమే అయినప్పటికీ వేర్వేరుగా టెండర్లు పిలవనున్నారు.

మరో మూడు పట్టణాలకు...

అమృత్-2 పథకం నిధులు మార్కాపురం, పొదిలి, దర్శి పట్టణాలకు మంజూరయ్యాయి. వెలిగొండ ప్రాజెక్టు గొట్టిపడియ సోర్సు ద్వారా మార్కాపురానికి నీరందిస్తారు. ఇందుకోసం రూ.63.14 కోట్లు కేటాయించారు. పొదిలికి రూ.126.17 కోట్లు, దర్శికి 130.61 కోట్లు మంజూరయ్యాయి. నెల్లూరు సర్కిల్ పరిధిలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు కలిపి ఒకే ప్యాకేజీ కింద టెండర్లు ఆహ్వానించారు. నీటి వనరులను ఇటీవల జిల్లా ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంజయ్ పరిశీలించారు.

ఓ పట్టాన ప్రకటించరే!

- డిగ్రీ ప్రవేశాలకు విద్యార్థుల ఎదురుచూపులు
- ఏకేయూ పరిధిలో మొదలుకాని కౌన్సెలింగ్

భవిష్యత్తులో డిగ్రీ పట్టా అందుకోవాల్సిన విద్యార్థులు కోర్సుల్లో ప్రవేశానికి ఎదురు చూస్తున్నారు. జులై మొదటి వారానికి డిగ్రీ ప్రవేశాలు పూర్తయి తరగతులు మొదలుకావాలి. సగం రోజులు పూర్తికావొస్తున్నా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నుంచి కౌన్సెలింగ్ ప్రకటన వెలువడలేదు. ఓవైపు ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఏర్పాట్లు జరుగుతుండగా, డిగ్రీ ప్రవేశాలపై ఇంతవరకు ఎలాంటి కదలిక లేకపోవడం గమనార్హం. ఏ కోర్సులో చేరాలి.... అందుబాటులో ఉన్న డిగ్రీ కళాశాలలో కోరుకున్న సీటు దక్కుతుందో లేదోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఈనాడు, ఒంగోలు

జిల్లాలోని 88 డిగ్రీ కళాశాలల్లో పది వేల వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఆన్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి డిగ్రీ ప్రవేశాలు పూర్తి చేశారు. ఈ ఏడాది ఆన్ లైన్‌లో చేయాలా.. నేరుగా చేయాలనే దానిపై కొంత కాలంగా తర్జనభర్జన పడుతున్నారు. మరోవైపు డిగ్రీలో సబ్జెక్టుకు సంబంధించి సింగిల్ మేజరా.. డబుల్ మేజరా.. అనే దానిపైనా చర్చ నడుస్తోంది. ఈ రెండింటిపై ఇంత వరకు ఉన్నత విద్యామండలి నుంచి స్పష్టత రాలేదు. ఈ ప్రభావం డిగ్రీ ప్రవేశాలపై కూడా ఉంది. డిగ్రీలో చేరేందుకు ధ్రువపత్రాలు సిద్ధం చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రకటన ఎప్పుడు వస్తుందా.. అని నిరీక్షిస్తున్నారు. ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో చేరేందుకు ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులకు డిగ్రీనే ఆధారం. ఓ వైపు కళాశాలకు వెళుతూనే సాయంత్రం సమయంలో ట్యూషన్లు వంటివి చెప్పుకొంటూ పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ చదివేవారూ ఉన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు తాము నివాసం ఉండే ప్రాంతంలోని డిగ్రీ కళాశాలలో సీటు దక్కుతుందో లేదోనని తర్జనభర్జన పడుతున్నారు. ఇలాంటి వారంతా ఇంత తక్కువ సమయంలో కౌన్సెలింగ్ ప్రకటన వెలువడితే డిగ్రీలో ఏ సబ్జెక్టు ఎంపిక చేసుకోవాలి.. కళాశాల ఉండే ప్రాంతంలో వసతి సౌకర్యం ఎలా..అన్న దానిపై ఆందోళన చెందుతున్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే ప్రాధాన్యం

గత కొంత కాలంగా ప్రవేశాల తీరును పరిశీలిస్తే... డిగ్రీ కోర్సుల్లో చేరేవారిలో 50 శాతం కంప్యూటర్ సైన్స్ కోర్సులకే ప్రాధాన్యమిస్తున్నారు. డిగ్రీలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మల్టీమీడియా.. తదితర కోర్సులు అందుబాటులోకి రావడంతో వాటి వైపు మొగ్గుచూపుతున్నారు. సాధారణ బీకాం డిగ్రీ కన్నా, కంప్యూటర్స్‌లో చేరేవారే ఎక్కువ. బీసీఏ (బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) కోర్సులకు ఆదరణ బాగానే ఉంది. కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కోరుకున్న సీటు దక్కుతుందో లేదోనని మదన పడుతున్నారు.

మేం సిద్ధంగా ఉన్నాం

డిగ్రీలో సబ్జెక్టుల విషయమై ఉన్నత విద్యామండలి నుంచి ప్రకటన రావాల్సి ఉన్నందున నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం. డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి విశ్వవిద్యాలయం పరిధిలో మేం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం. విధానపరమైన ఆదేశాలు రాగానే కౌన్సెలింగ్‌కు ప్రకటన ఇచ్చి ప్రవేశాలు చేపడతాం.

– డీవీఆర్ మూర్తి, ఉప కులపతి, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం

అద్విక, యుపిక్స్ బాధితులకు త్వరలో న్యాయం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట: ఇటీవల విజయవాడ కేంద్రంగా వెలుగు చూసిన ఆర్థిక మోసాల్లో బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. యుపిక్స్, అద్విక ట్రేడింగ్ మోసాలకు సంబంధించి లావాదేవీలను పరిశీలిస్తున్నారు. రావాల్సిన దాని కన్నా ఎక్కువ మొత్తం తీసుకున్న ఏజెంట్లు, డిపాజిటర్లను గుర్తించి వారి నుంచి ఆ మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అద్విక ట్రేడింగ్ కంపెనీ కుంభకోణంలో అన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. దాదాపు 16 ఖాతాలకు సంబంధించి మూడేళ్లలో 25 వేల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. మొత్తం 43 మంది ఏజెంట్లు ఉండగా, వీరిలో 35 మంది రూ.100 కోట్ల మేర లాభపడినట్లు తేల్చారు. పరారీలో ఉన్న ఏజెంట్ల ఖాతాలను కూడా చూస్తున్నారు. అనుచిత లబ్ధి పొందిన వారిని పిలిపించి ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని చెబుతున్నారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో జరిగిన యుపిక్స్ కుంభకోణానికి సంబంధించి పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. దాదాపు రూ.400 కోట్లు చెల్లింపులు చేయకుండా కిరణ్ బోర్డు తిప్పేశాడు. కేసులో 153 మంది రూ.120 కోట్ల మేర ప్రయోజనం పొందగా, 196 మంది రూ.195 కోట్ల మేర నష్టపోయారు. రూ.75 కోట్ల మేర ఏజెంట్లకు కమీషన్, నిందితుడు సొమ్మును దారి మళ్లించినట్లు అనుమానిస్తున్నారు.

నీరందక దప్పిక... నిరసించింది గొంతుక!

యర్రగొండపాలెం పట్టణంలోని వేగినాటి కోటయ్యనగర్‌లో గత పది రోజులుగా తాగునీరు రావడంలేదని మహిళలు ఆందోళనకు దిగారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వారంతా ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు.. స్థానిక నాయకులు రోజుకు రెండు ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేవారని, పది రోజులుగా సరఫరా చేయకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. –న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

మట్టిలో అక్రమార్కులు!

బేస్తవారపేట మండలం పందిళ్లపల్లి టోల్‌గేట్ సమీపంలోని జగనన్న కాలనీ సమీప కొండల నుంచి అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తరలించుకుపోతున్నారు. మోక్షగుండంలో జాతీయ రహదారిని ఆనుకుని ఓ నూతన రెస్టారెంట్ నిర్మాణానికి వందల ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు మార్కాపురం భూగర్భ గనుల, ఖనిజాభివృద్ధి శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం అధికారులు, సిబ్బంది 3 ట్రాక్టర్లు, 3 జేసీబీలను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రూ.36వేలు అపరాధ రుసుం విధించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కొద్దిసేపటికే మట్టి తరలిస్తున్న వ్యక్తులు వచ్చి అపరాధ రుసుం చెల్లించి వాహనాలను తీసుకెళ్లిపోయారు. తిరిగి రాత్రి నుంచి మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు కొనసాగించడం గమనార్హం. –న్యూస్‌టుడే, బేస్తవారపేట

నాణ్యమైన విద్యుత్తుకు విప్లవాత్మక మార్పులు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

తాళ్లూరు, కురిచేడు, కనిగిరి, న్యూస్‌టుడే : నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. కురిచేడు మండలం కల్లూరు, కనిగిరి పట్టణంలోని గార్లపేటలలో రూ.7.60 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలతోపాటు రూ.1.80 కోట్లతో చేపట్టనున్న దేకనకొండ- మర్లపాలెం రహదారి నిర్మాణానికి సోమవారం ఆయన మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కొన్ని బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నిధులు రూ.35 లక్షల విలువైన మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కనిగిరి, మార్కాపురం ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, విద్యుత్తుశాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి, పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తలలు నరుకుతామంటే ఎలా సమర్థించారు? : 'రప్పా, రప్పా' అంటూ మాట్లాడడం, తలలు నరుకుతామంటున్న వైకాపా వర్గీయుల మాటలను మాజీ సీఎం జగన్ సమర్థించడం సబబు కాదని మంత్రులు పేర్కొన్నారు. పరామర్శల కోసం జగన్ జనంలోకి వస్తే ముగ్గురు మృతి చెందారని, అయినా వారికేమీ బాధ లేదన్నారు. ముఖ్యంగా జగన్, వైకాపా ప్రధాన నాయకులు రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ ఉన్న కారు కింద పడి ఒకరు మృతిచెందితే కనీసం పక్కకు తీసి సాయం అందించకుండా పక్కన పడేసి వెళ్లడమేమిటని దుయ్యబట్టారు. తన తండ్రిపై అభిమానంతో నాడు అధికారంలోకి వచ్చాడని, గత ఐదేళ్లలో జగన్ చేసిన పాపాలను ప్రజలు గుర్తించారని, అందువల్లే పదకొండు సీట్లకు ప్రజలు పరిమితం చేశారన్నారు. రానున్న 30 సంవత్సరాల్లో అధికారంలోకి రాలేరన్నారు.

కల్లూరులో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు గొట్టిపాటి, డోలా, నాయకులు

ఆటలకేదీ శిక్షణ.. ఆరోగ్యానికేదీ రక్షణ?

న్యూస్‌టుడే, కంభం

విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. ఉన్నత పాఠశాల వరకు ఆడిపాడిన వారికి కళాశాలలకు వచ్చేసరికి ఆటలు ఆడించేందుకు శిక్షకుల్లేక శిక్షణే లేకుండాపోయింది. దీంతో క్రీడలపై ఆసక్తి ఉన్నా శిక్షణనిచ్చేవారు లేకపోవడంతో ఆటల్లో రాణించడం కష్టమవుతోంది. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా నియామకాలు చేపట్టకపోవడం, ఉద్యోగోన్నతులు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా వ్యాయామ అధ్యాపకుల కొరత నెలకొంది. జిల్లాలో మద్దిపాడు, సింగరాయకొండ జూనియర్ కళాశాలల్లో మాత్రమే పీడీలున్నారు. కొత్తగా ఏర్పడిన ఒంగోలు, పెద్దారవీడు కళాశాలలకు పోస్టులే మంజూరు చేయలేదు. జిల్లాలో రెండు ఎయిడెడ్ కళాశాలలుండగా, పీడీలు ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందారు. ఈ విషయమై డీఐఈవో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీలున్న మాట వాస్తవమేనన్నారు. పోస్టులు భర్తీ చేయాలని పీడీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌కు విన్నవించారని, కొత్త నియామకాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	24
ఎయిడెడ్ కళాశాలలు	02
విద్యార్థులు	4,667
పీడీ పోస్టుల ఖాళీలు	20
పనిచేస్తున్నవారు	02

బంగారు బాల్యానికి బాటలు!

అంగన్‌వాడీ కేంద్రాలకు నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్

చిన్నారులు బాల్య దశలో ఎదగడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలు రూపొందించింది. మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు పంపిణీ చేశారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి ప్రణాళికబద్ధంగా సిలబస్‌ను రూపొందించారు. చిట్టి కథలు, హావభావాలతో వివరణ, ఆసక్తి కరమైన బొమ్మలు ప్రచురితం చేశారు. నశ చేతన పుస్తకంలో పసిబిడ్డలు పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకూ ఎలా చూసుకోవాలో వివరించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి రెండేళ్లలోపు 90 శాతం మెదడు ఎదుగుదల ఉంటుంది. కొత్తగా నవచేతన ద్వారా బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నెలలు, ఏడాది పిల్లలతో కుటుంబసభ్యులు ఏవిధంగా ప్రవర్తించాలో రూపొందించారు. చరవాణి ఉపయోగించకుండా ఆటపాటలతో వారిని ఆడించడం, రంగులు, చిన్న కథలను తల్లులు ఎలా చెప్పాలో కేంద్రాలకు వచ్చే తల్లులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారు. తల్లితో పాటు బిడ్డ ఎదుగుదల ఏ విధంగా జరుగుతోంది, రోజువారీ దినచర్య, తీసుకోవాల్సిన పోషకాహారాన్ని వివరిస్తారు. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టడానికి కావాల్సిన విషయాలు తల్లి పూర్తిగా పాఠాల ద్వారా నేర్చుకుంటారు.

ఒంగోలులోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మొత్తం ఐసీడీఎస్ ప్రాజెక్టులు	13
అంగన్‌వాడీ కేంద్రాలు	2,903
మూడేళ్లలోపు చిన్నారులు	63,457
3-6 ఏళ్లలోపు పిల్లలు	43,390
గర్భిణులు: 10,916 బాలింతలు	10,085

ఆధార్ శిలలో..: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు కొత్త విషయాలపై శ్రద్ధ చూపిస్తారు. వారు ఇంటి బాట పట్టకుండా ఉండేందుకు వినోదాత్మకంగా పాఠాలు బోధిస్తారు. కథలు, పద్యాలు, అంకెలుంటాయి. వారంలో రెండు రోజులు కథలు, అంకెలు, మంచి అలవాట్లు వివరిస్తారు. ఆటపాటలతోనే విషయాలు గ్రహించే కృత్యాలు బోధిస్తారు. సంభాషణ చేస్తూ మధ్యలో ప్రశ్నలు వేస్తారు. భాషా నైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించే కథలుంటాయి.

విధుల్లోకి కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం తిరిగి విధుల్లోకి వచ్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు ఆమె సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి జేసీ రోణంకి గోపాలకృష్ణ ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా కొనసాగారు.

1,700 పొగాకు బేళ్ల తిరస్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం 1,700 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,543 బేళ్లు రాగా 967, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 4,869 బేళ్లు రాగా 733 బేళ్లు తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.150 చొప్పున పలికింది.

రైతేరాజు 6వ పేజీలో

(c) eenadu

న్యాయవాదుల సహకారంతో కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బార్ అసోసియేషన్ న్యాయవాదుల సహకారంతో అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ కోరారు. మీడియేషన్ ఫర్ నేషన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు చిట్టెం వెంకటేశ్వర్లు, ఎస్.సత్యశ్రీనివాసులు, పి.సంజీవరెడ్డి, ఎస్.శేఖర్ రావు, ఎన్.సుబ్బారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రావినూతల బ్రాంచ్, గాంధీ రోడ్డు, రావినూతల గ్రామం మరియు పోస్టు, కొరిసపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 523213

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లో రూలు 8 ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి తనఖా పెట్టిన / ఛార్జ్‌చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావినూతల బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్)కు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతిలో తేది. 30.07.2025న ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. ధరావత్తు & రిజర్వు ధర వివరములు దిగువన తెలుపబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 30.07.2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1) M/s. సాయి రమణ షీప్ ఫామ్స్, ప్రొప్రయిటర్ : శ్రీ సంకు వెంకట రమణ, తండ్రి : శ్రీ మధుసూదన రావు, డి నెం.4-4-166, 5/2 లేన్ చంద్రమౌళి నగర్, కీర్తి టవర్స్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. 2) శ్రీ సంకు వెంకట రమణ, తండ్రి : శ్రీ మధుసూదన రావు, డి నెం.4-4-166, 5/2 లేన్ చంద్రమౌళి నగర్, కీర్తి టవర్స్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. 3) శ్రీమతి సంకు ఉమా దేవి, భర్త : సంకు వెంకట రమణ, డి నెం.4-4-166, 5/2 లేన్ చంద్రమౌళి నగర్, కీర్తి టవర్స్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007.

డిమాండ్ నోటీసు తేది : 13.12.2021 | స్వాధీనత నోటీసు తేది: 19.02.2022

బకాయి మొత్తం : రూ. 44,12,064/- (అక్షరాల నలభై నాలుగు లక్షల పన్నెండు వేల అరవై నాలుగు రూపాయలు మాత్రమే) + తదుపరి జమకూడు వడ్డీ, కాస్ట్స్ మరియు వ్యయాలతో సహా & CCAGR of ₹10,55,068.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్థి వివరములు : గుంటూరు జిల్లా, గుంటూరు, చంద్రమౌళి నగర్, 5/2వ లేన్, కొత్త డోర్ నెం.25-4-166, పాత డోర్ నెం. 4-4-166 నందు విస్తీర్ణం 100.00 చ॥గ॥లులోని శ్రీ సంకు వెంకట రమణ గారి పేరున ఉన్న భూమి & రెసిడెన్షియల్ భవనం. హద్దులు : ఉత్తరం : ప్రగతి అపార్ట్‌మెంట్ యొక్క ప్రహరీ గోడ, దక్షిణం : మున్సిపల్ రోడ్డు, తూర్పు : టి ఎన్ పి వి ప్రభావతి గారి ఆస్తి, పడమర : సంకు నాగార్జున రావు గారికి చెందిన ఆస్తి. (రిజిష్టర్డ్ సెటిల్‌మెంట్ డీడ్ 2248/2011 తేది.26.02.2011 ప్రకారం) (లాటిట్యూడ్ : 16.3136 & లాంగిట్యూడ్: 80.4263)

రిజర్వు ధర: రూ. 54,02,000/- ధరావత్తు: రూ. 5,40,200/- బిడ్ పెంపుదల: రూ. 54,020/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింకును దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 07.07.2025
స్థలం: రావినూతల

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావినూతల బ్రాంచ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు,
ఆంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్, 2వ లేన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

వీరి నుండి
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు తరుపున
SARFAESI యాక్ట్ 54/2002 క్రింద
దిగువ వారికి

విషయం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలిసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54/2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు దిగువ తెలిపిన తేదీలలో డిమాండ్ నోటీసును జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 6/8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి దిగువ తెలిపిన తేదీలలో లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలిసిన బకాయి మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కావున, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

ఋణగ్రహీతలు/సహ-పూచీదారులు/హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

కందుకూరు మెయిన్ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్: శ్రీ పెద్దిరెడ్డి సురేష్ రెడ్డి ఫోన్ నెం. 9159916991

1 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). మెస్సర్స్. బత్తిన బ్యాగ్స్, ప్రొప్రయిటర్. శ్రీమతి. బత్తిని ప్రసన్న, భర్త: బి అశోక్ బాబు, సర్వే నెం. 234, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా. (2). శ్రీమతి. బత్తిని ప్రసన్న, భర్త: బి అశోక్ బాబు, 1-21-3, అనంత సాగరం, కందుకూరు, ప్రకాశం జిల్లా. (3). శ్రీ. బత్తిని అశోక్ బాబు, తండ్రి: బి నరసింగ రావు, 1-21-3, అనంత సాగరం, కందుకూరు, ప్రకాశం జిల్లా-523105. (4). శ్రీ. పోలినేని కోటేశ్వరరావు, తండ్రి: బ్రహ్మయ్య, 1-121, నరిశెట్టివారి పాలెం, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 15.12.2022, స్వాధీనత నోటీసు తేది : 28.02.2023
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, కందుకూరు మండలం, అనంతసాగరం గ్రామం, సర్వే నెం. 172, డి.నెం. 1-21-3, అసెస్‌మెంట్ నెం.178, శ్రీ. బత్తిని అశోక్ బాబు, తండ్రి: నరసింగ రావు పేరున గల 240 చ॥గ॥ రెసిడెన్షియల్ స్థలం మరియు అందులోని ఆర్.సి.సి ఏరియా 878 చ॥అ॥ (ప్లాన్ ప్రకారం) గల బిల్డింగ్ యావత్తు ఆస్తికి హద్దులు: ఉత్తరం: ఉమ్మడి దారి, తూర్పు: ఉన్నం మాలకొండయ్య ఇంటి యొక్క ప్రహరీ గోడ, దక్షిణం: బత్తిన మాల్యాద్రి యొక్క స్థలం, పడమర: పంచాయతీ రోడ్డు.

2 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). మెస్సర్స్. రాధాకృష్ణ ఫర్నీచర్ మ్యాసుఫ్యాక్చరింగ్, ప్రొప్రయిటర్: శ్రీ. కుమ్మర శ్రీనివాసులు, మెయిన్ రోడ్డు, అనంతసాగరం గ్రామం, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105. (2). శ్రీ. కుమ్మర శ్రీనివాసులు, తండ్రి: కుమ్మర నారయ్య, పాత ఉప్పలూరు గ్రామం, చింతలదేవి పోస్టు, కొండాపురం మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా. (3). శ్రీ. దేగ కోటేశ్వర రావు, తండ్రి: వెంకట కృష్ణయ్య, హెచ్.నెం. 19-2-99, కాలిదాసు వారి వీధి, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 09.05.2022, స్వాధీనత నోటీసు తేది : 28.02.2023
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా-523105, కందుకూరు టౌన్ & మున్సిపాలిటీ, యర్ర వడ్డిపాలెం, వార్డు నెం: 16, బ్లాక్ నెం: 6, సమీప డి.నెం. 16-6-9, ఎస్.నెం.866/1ఎ1ఎ2ఎ1 సందు శ్రీ. కుమ్మర శ్రీనివాసులు పేరున గల 64.11 చ॥గ॥ విస్తీర్ణంలోని ఓపెన్ రెసిడెన్షియల్ స్థలం యావత్తు ఆస్తికి హద్దులు: ఉత్తరం: వై. చిన యల్లమంద యొక్క ఎసిసి ఇంటి గోడ – 38.6 అ॥, తూర్పు: గొప్పిపాటి బాల ఆంజనేయులు యొక్క స్థలం – 15 అ॥, దక్షిణం: తోకల కృష్ణా రావు యొక్క ఇంటి గోడ – 38.6 అ॥, పడమర: మున్సిపాలిటీ రోడ్డు.

3 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). శ్రీ. గొర్రిపాటి పూర్ణ చంద్ర శేఖర రెడ్డి, తండ్రి: కోటి రెడ్డి, డి.నెం. 3-50ఎ, లింగసముద్రం గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా. (2). శ్రీమతి. గొర్రిపాటి అరుణ కుమారి, భర్త: గొర్రిపాటి పూర్ణ చంద్ర శేఖర రెడ్డి, డి.నెం. 3-50ఎ, లింగసముద్రం గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా.
డిమాండ్ నోటీసు తేది : 01.08.2018, స్వాధీనత నోటీసు తేది : 25.10.2018
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, కందుకూరు, మహదేవపురం పంచాయతీ, ఒ వి రోడ్డు మరియు ఒ వి రోడ్డు హెచ్‌పి పెట్రోలు బంక్ వెనుకవైపు, సర్వే నెం. 505/2, ఫ్లాట్ నెం. 8, 'సాయి గ్రూప్ హౌసెస్', 970 చ॥అ॥ విస్తీర్ణం (కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి) గల 2వ అంతస్తులోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం. 201 శ్రీ. గొర్రిపాటి పూర్ణ చంద్ర శేఖర రెడ్డి పేరున గలదు (కందుకూరు ఎస్.ఆర్.ఒ, డాక్యుమెంట్ నెం. 2105/2014). హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.202, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: 3 అ॥ వెడల్పు ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం.

4 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). శ్రీ. నల్లమల్లి విజయ కుమార్ (ఋణగ్రహీత/తనఖాదారు), తండ్రి: వెంకటేశ్వర్లు, డి.నెం.1-8-73, వాసవి నగర్, కందుకూరు, ప్రకాశం జిల్లా-523105. (2). శ్రీమతి. నల్లమల్లి వెంకట సుజాత (సహ-ఋణగ్రహీత), భర్త: నల్లమల్లి విజయకుమార్, డి.నెం.1-8-73, వాసవి నగర్, కందుకూరు, ప్రకాశం జిల్లా-523105. (3). శ్రీ. రాజనీష్ మద్దాలి (హామీదారు), తండ్రి: లక్ష్మి నారాయణ, డి.నెం.15-4-15, పెద్ద బజారు, వినాయక గుడి ప్రక్కన, కందుకూరు, ప్రకాశం జిల్లా.
డిమాండ్ నోటీసు తేది : 04.06.2018, స్వాధీనత నోటీసు తేది : 06.08.2018
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, కందుకూరు, మహదేవపురం గ్రామం, ఒ వి రోడ్డు మరియు ఒ వి రోడ్డు హెచ్‌పి పెట్రోలు బంక్ వెనుకవైపు, సర్వే నెం. 505/2, ఫ్లాట్ నెం. 8, 'సాయి గ్రూప్ హౌసెస్', 1వ అంతస్తులోని 970 చ॥అ॥ విస్తీర్ణం గల రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం. 102, శ్రీ. నల్లమల్లి విజయకుమార్ పేరున గలదు. హద్దులు: ఐటెం-1: ఫ్లాట్ నెం.102 కార్పెట్ ఏరియా - 789 చ॥అ॥. ఉత్తరం: 4 అ॥ ఉమ్మడి వరండా, తూర్పు: ఫ్లాట్ నెం.103, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఫ్లాట్ నెం.101. ఐటెం-2: 33.33 చ॥గ॥ (మొత్తం స్థలం 400 చ॥గ॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటా): ఉత్తరం: 18 అ॥ వెడల్పు రోడ్డు, తూర్పు: ఫ్లాట్ నెం. 14, దక్షిణం: ఘట్టమనేని సుబ్బారావు యొక్క స్థలం, పడమర: 18 అ॥ వెడల్పు రోడ్డు.

సింగరాయకొండ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్: శ్రీ శాంతను మహాకుడ్ ఫోన్ నెం. 9853143606

5 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1) శ్రీ ఇంకొల్లు రమేష్, తండ్రి: ఇంకొల్లు ఆంజనేయులు, డి.నెం. 36-1-40, రామనగర్, ఒంగోలు-523101. (2) శ్రీమతి అంబటి అరుణ, భర్త: సుధాకర్‌రావు, డి నెం: 2-8, మూలగుంటపాడు, సింగరాయకొండ.
డిమాండ్ నోటీసు తేది : 08.01.2018, స్వాధీనత నోటీసు తేది : 17.04.2018
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, సింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామం, 2వ వార్డు, డోర్ నెం. 2-8 దగ్గర, సర్వే నెం. 108 లో 224.00 చ॥గ॥ల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలం శ్రీమతి అంబటి అరుణకు చెందినది మరియు హద్దులు. తూర్పు: శ్రీనివాసుల యొక్క మిగిలిన స్థలం, విస్తీర్ణం 42 అ॥ల, పడమర: అంబటి కోటయ్య యొక్క ఆస్తి, విస్తీర్ణం 42 అ॥ల, ఉత్తరం: బజార్ అమ్మకందారుని యొక్క కుటుంబానికి ఎడమవైపు చెందినది, విస్తీర్ణం 48 అ॥ల, దక్షిణం: నన్నెబోయిన అనుసుయమ్మ యొక్క స్థలం, విస్తీర్ణం 48 అ॥ల.

6 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1. శ్రీ సయ్యద్ హబీబ్ బాషా, తండ్రి: సయ్యద్ ఇస్మాయిల్ బాషా, ఇంటి నెం.: 12-216, బంగాబావి సెంటర్, సింగరాయకొండ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. 2. శ్రీ సయ్యద్ అల్తాఫ్, తండ్రి : సయ్యద్ ఇస్మాయిల్ బాషా, ఇంటి నెం. 12 - 216, బంగాబావి సెంటర్, సింగరాయకొండ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. 3. శ్రీ నల్లపుల రవికుమార్, తండ్రి : వెంకట సుబ్బయ్య, మూలగుంటపాడు, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా-523101.
డిమాండ్ నోటీసు తేది : 04.07.2019, స్వాధీనత నోటీసు తేది: 19.12.2019
స్థిరాస్తి వివరములు: యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, కొండముడుసుపాలెం గ్రామం, ఫ్లాట్ నెం.224 మరియు 225, (ఒక్కొక్క ఫ్లాట్ 120.00 చ॥గ॥ లేదా 1080 చ॥అ॥) సర్వే నెం. 91 సందు విస్తీర్ణం 240.00 చ॥గ॥లులోని ఖాళీ స్థలం శ్రీ సయ్యద్ హబీబ్ బాషా గారికి చెందినది. హద్దులు: ఫ్లాటు నెం.224 నకు హద్దులు : తూర్పు : ఫ్లాటు నెం. 225, దక్షిణం : నల్లపుల రవికుమార్ గారి మిగిలిన స్థలము, పడమర : 18 అ॥ల రోడ్డు, ఉత్తరం : ఫ్లాటు నెం.223. ఫ్లాటు నెం.225 నకు హద్దులు : తూర్పు : 15 అడుగులు రోడ్డు, దక్షిణం : నల్లపుల రవికుమార్ గారి మిగిలిన స్థలము, పడమర : ఫ్లాటు నెం. 224, ఉత్తరం : ఫ్లాటు నెం.226. (లాటిట్యూడ్: 15.1959N & లాంగిట్యూడ్: 79.8965E).

7 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1. శ్రీమతి తన్నీరు మంగమ్మ యొక్క చట్టపరమైన వారసులు, భర్త: టి. వెంకటేశ్వర్లు, ఊళ్లపాలెం కట్టింగ్ రోడ్డు, సింగరాయకొండ గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా-523101. 2. శ్రీ తన్నీరు వెంకట ప్రతాప్, తండ్రి: టి. వెంకటేశ్వర్లు, 7-378, శ్రీరామ్‌నగర్, వడ్డేపాలెం, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా-523101.
డిమాండ్ నోటీసు తేది : 30.09.2023, స్వాధీనత నోటీసు తేది: 12.01.2024
స్థిరాస్తి వివరములు: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, 2వ బ్లాక్, 7వ వార్డు, డి.నెం: 7-2-111, సర్వే నెం. 769/1, ఫ్లాట్ నెం.16 మరియు 17 లో 240 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ ఇంటి స్థలం శ్రీమతి తన్నీరు మంగమ్మ గారికి చెందినది. హద్దులు : తూర్పు : 20 అ॥ల వెడల్పు బజార్, విస్తీర్ణం 54 అ॥లు, పడమర : ఫ్లాట్ నెం.12 యొక్క స్థలం కొంతవరకు మరియు ఫ్లాట్ నెం.13 యొక్క స్థలం కొంతవరకు, విస్తీర్ణం 13 అ॥లు, ఉత్తరం : ఫ్లాట్ నెం.15 యొక్క స్థలం, విస్తీర్ణం 40 అ॥లు, దక్షిణం: ఫ్లాట్ నెం.18 యొక్క స్థలం, విస్తీర్ణం 40 అ॥లు.

8 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1) లేటు తంగెళ్ల వెంకట సుబ్రహ్మణ్యం యొక్క చట్టబద్ధమైన వారసులు: (i) శ్రీ తంగెళ్ల వెంకట సాయి మనోజ్ కుమార్, తండ్రి: లేటు తంగెళ్ల వెంకట సుబ్రహ్మణ్యం, సమీప డి.నెం: 1-87/6, విద్యానగర్, 6వ లేను, మూలగుంటపాడు గ్రామం & గ్రామ పంచాయతీ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. (ii) శ్రీ. తంగెళ్ల ఉత్తేజ్ కుమార్, తండ్రి: లేటు తంగెళ్ల వెంకట సుబ్రహ్మణ్యం, సమీప డి.నెం: 1-87/6, విద్యానగర్, 6వ లేను, మూలగుంటపాడు గ్రామం & గ్రామ పంచాయతీ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. (2) శ్రీమతి తంగెళ్ల వెంకట లక్ష్మి, భర్త: లేటు తంగెళ్ల వెంకట సుబ్రహ్మణ్యం సమీప డి.నెం: 1-87/6, విద్యానగర్, 6వ లేను, మూలగుంటపాడు గ్రామం & గ్రామ పంచాయతీ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101.
డిమాండ్ నోటీసు తేది : 03.10.2024, స్వాధీనత నోటీసు తేది: 01.01.2025
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, మూలగుంటపాడు గ్రామం, సర్వే నెం. 108/3, అసెస్‌మెంట్ నెం.1684, డోర్ నెం: 1-87/6 నందు శ్రీ. లేటు తంగెళ్ల వెంకట సుబ్రహ్మణ్యం పేరున గల 280.9 చ॥గ॥ విస్తీర్ణంలోని ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు ఆస్తి హద్దులు: తూర్పు: 9 లింకుల బజారు - 38 అ॥, పడమర: లింగారెడ్డి రాఘవ రెడ్డి యొక్క ప్రహరీ గోడ - 37.09 అ॥, ఉత్తరం: నల్లపరెడ్డి మల్లిఖార్జున రెడ్డి యొక్క స్థలం - 67.0 అ॥, దక్షిణం: యరజాల శ్రీను యొక్క స్థలం - 66.6 అ॥.

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావు లేకుండా నాణ్యతతో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, ఎస్డీసీలు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, పార్వతీదేవి పాల్గొన్నారు; జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు విశేష స్పందన

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో అర్జీదారులు హాజరయ్యారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 94 మంది వినతిపత్రాలు అందజేశారు. భూ వివాదాలు, ఉద్యోగాల పేరిట మోసాలు, కుటుంబ సమస్యలు, ఇతరత్రా సమస్యలపై ఫిర్యాదు లందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, మహిళా పీఎస్ డీఎస్పీ రమణకుమార్, ఎస్సీ ఎస్టీ విభాగం సీఐ దుర్గాప్రసాద్, డీటీసీ సీఐ సమీఉల్లా పాల్గొన్నారు.

ఎంపీపీ, జడ్పీటీసీలకు శిక్షణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లాలోని మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులకు స్థానిక దక్షిణ బైపాస్‌లోని పాత జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో బి.చిరంజీవి తెలిపారు. గత నెల 24 నుంచి 26వ తేదీ వరకు బాపట్ల ఈటీసీలో జరిగిన శిక్షణకు హాజరు కాని ఉమ్మడి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

నారుమడి.. జాగ్రత్తలతో మేలైన దిగుబడి

వరి సాగులో మేలైన దిగుబడులు సాధించాలంటే నారుమడిలో జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని పీసీపల్లి వ్యవసాయాధికారి రంగకృష్ణ సూచించారు. నారుమడి సాగు చేసే ముందు పొలాన్ని బాగా దున్నుకోవాలి. ఎకరానికి 2 నుంచి 5 టన్నుల వరకు పశువుల ఎరువు, వర్మి కంపోస్ట్ చల్లి, మట్టి గడ్డలు లేకుండా కలియదున్నాలి. కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. విత్తనాలు ఎకరానికి 20 నుంచి 25 కిలోల వరకు వేసుకోవాలి.

▶ **విత్తన శుద్ధి తప్పనిసరి..:** మొలకలు కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. కిలో విత్తనానికి 2.5 గ్రా. కార్బెండిజమ్ కలిపి 24 గంటల తర్వాత తేలిక నాలు వేయాలి. వీటి ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రా. ట్రైకోడెర్మా విరిడి లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2 శాతం క్లోరిపైరిఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. అలా చేస్తే నారుమడిలో ఆకులు తినే పురుగులను అరికట్టవచ్చు. నారు మడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా ఉండేలా గట్టు ఎత్తుగా వేసుకోవాలి. రెండు మడుల నడుమ 20 సెంటీమీటర్ల వెడల్పుతో కాలువలు తీసుకోవాలి.

▶ **సస్య రక్షణ..:** విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రా. చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2 మి.లీ నీటికి కలిపి విత్తిన 10, 17 రోజులకు పిచికారీ చేయాలి. నారు నాటడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

▶ **ఎరువుల వినియోగం..:** సెంటు నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, పొటాష్ ఇచ్చే ఎరువులు దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి. నారు పూర్తిగా పుంజుకునే వరకు ఉదయాన్నే నీరు తీసివేసి తాజాగా నీరు పెట్టాలి. తల్లి పురుగుల గుడ్డు కోసం తెలుసుకుని వేరుచేయాలి. కాల్షియం, నారు నాటే సమయంలో కొనలు తుంచి వేసి నాటాలి. ఇలా చేస్తే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంది. -న్యూస్‌టుడే, కంభం

వ్యాధుల కాలం..
పశువులను రక్షించుకుందాం

ఈ ఏడాది వేసవిలో సైతం వర్షాలు పడ్డాయి. మళ్లీ ఇప్పుడు ఎండలు ముదురుతున్నాయి. అప్పుడప్పుడు జల్లులు కురుస్తున్నాయి. ఇలాంటి వాతావరణ పరిస్థితుల్లో పాడిపశువులు వ్యాధులకు గురవుతుంటాయి. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పశువుల ఆరోగ్యం, పాల దిగుబడి తగ్గకుండా ఉంటాయి. వర్షాకాలంలో పశువుల్లో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టంగుటూరు పశువైద్యశాల ఏడీ డాక్టర్ సుధీర్‌బాబు పలు సూచనలు చేశారు. -న్యూస్‌టుడే, టంగుటూరు

▶ **ముందస్తు టీకాలు..**

శుభ్రత అవసరం: వర్షాకాలం పాడిపశువుల పునరుత్పత్తికి, పాలదిగుబడికి మంచి అనుకూలమైన కాలం. ప్రస్తుతం కురుస్తున్న తొలకరి జల్లులతో వచ్చే లేత గడ్డిని పశువులు తినడం వల్ల జబ్బువాపు, గొంతువాపు, గాలికుంటు వ్యాధులు వస్తుంటాయి. సకాలంలో టీకాలు అందిస్తే పశువులను కాపాడవచ్చు. అరనెలకు ఒకసారి టీకాలు వేయిస్తే పశువుల రోగాల బారిన పడకుండా ఉంటాయి. పశువుల పాకలో నేల పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. లేని పక్షంలో పొదుగు వాపు వ్యాధి వస్తుంది. దీని నివారణకు పొడి సున్నం, బ్లీచింగ్ కలిపి చల్లుకోవాలి. పశువుల పాకలో వర్షపు నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలి. దీనికి తోడు ఫైనెల్ ద్రావణంతో శుభ్రపరుచుకోవాలి. దీనివల్ల దోమలు, ఈగలు వ్యాప్తి అరికట్టవచ్చు. వీటితో పాటు బాహ్య పరాన్న జీవు లైన పేలు, గోమార్లు నివారణకు నీటిలో కలుపుకొని పశువులపై పిచికారీ చేయాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు పశువైద్యుల సహాయంతో ఆల్బెండజోల్, ఆక్సీక్లోజ్ వంటి మందులను వాడాలి. వైద్యుల సూచనలతో వీటిని చేపట్టడం వల్ల గేదెలు, ఇతర జంతువులను జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

మద్దిపాడులో మహిళా పాడిరైతుకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

మీ కోసం

రైతేరాజు

సమస్య - పరిష్కారం

▶ **సమస్య :** ఖరీఫ్ సీజన్‌లో మా ప్రాంతంలో ఎక్కువగా కందిపంట సాగు చేయాలనుకుంటున్నాం. దుక్కులు, విత్తనాల రకాలు తెలుపగలరు. -శ్రీను కమ్మవారిపల్లి

సమాధానం: కందిపంట వేసేముందు నాగలితో ఏటవాలుకు అడ్డంగా లోతుగా దుక్కులు దున్నాలి. దీనివల్ల నీటి నిల్వ శాతం పెరుగుతుంది. గత పంట అవశేషాలతో ఉన్న పురుగు లార్వా, ప్యూపా దశలను నాశనం చేయవచ్చు. ఎల్‌ఆర్‌జీ-52 రకం 180 రోజుల కాలంలో పంట వస్తుంది. ఎకరానికి 4 కిలోల విత్తనాలు వేయాలి.

▶ **సమస్య :** దానిమ్మ మొక్కలను రెండేళ్ల క్రితం నాటాం. అధిక దిగుబడులు రావాలంటే ఏం చేయాలి? -వెంకటేశ్వర్లు, రైతు పెదకూరపాడు

సమాధానం: చెట్లు మొదలు బాగాని సేంద్రియ ఎరువులు వేయాలి. నెలరోజుల తరువాత పైభాగాన ఎండు కొమ్మలు కత్తిరించాలి. పూతపూసే ఆకు రాలేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మొగ్గలు ఇగురు వచ్చిన తరువాత ప్రతి రోజూ బిందు సేద్య పరికరాల ద్వారా నీరు అందించాలి. వ్యవసాయ, ఉద్యాన అధికారుల సూచనలతో ఎరువులు, పురుగు మందులు వినియోగించాలి. -న్యూస్‌టుడే, పీసీపల్లి

రంగకృష్ణ
వ్యవసాయాధికారి
పీసీపల్లి

కరివేపాకు సాగు..
లాభాలు బాగు

ముండ్లమూరు మండలం పసుపుగల్లు గ్రామానికి చెందిన వి.సుబ్బారెడ్డి అనే రైతు తొమ్మిది సంవత్సరాల క్రితం రెండెకరాల్లో కరివేపాకు సాగు చేపట్టారు. లాభదాయకంగా ఉండటంతో ఏటా విస్తీర్ణం పెంచుతూ ప్రస్తుతం ఎనిమిది ఎకరాల్లో తోటలు వేశారు. ఏటా ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తున్నట్లు రైతు తెలిపారు. మరిన్ని వివరాలను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. గుంటూరు జిల్లా వద్ద మూడి నుంచి కరివేపాకు విత్తనాలు తీసుకొచ్చి సాగు ఆరంభించాను. అప్పట్లో ఎకరాకు రూ.యాభై వేల వరకు పెట్టుబడి కాగా, ప్రస్తుతం రూ.80 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. సంవత్సరంలో మూడు నుంచి నాలుగు కోతలు కోయవచ్చు. మూడు కోతలైతే కర్షకులకు పుష్కలంగా డబ్బులు వస్తుంటాయి. ఏటా జనవరి, ఏప్రిల్, ఆగస్టు నెల్లో కోతలు కోసి విక్రయిస్తున్నాం. ఏడో ఒక సీజన్‌లో తప్పకుండా మంచి ధరలు దక్కుతున్నాయి. ఎక రాకు మూడున్నర టన్నులకుపైగా ఆకు కోతకు వస్తుంది. ప్రస్తుతం టన్ను ధర రూ.మూడువేల మాత్రమే ఉంది. ధర బాగున్న సమయాన్ని గుర్తించి ఆ సీజన్‌లో కోతలు పూర్తి చేస్తే ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వర్షాలు సంభవించే సమయంలో తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. వాటి నివారణపై అవగాహన కల్పించుకొని అధిగమిస్తే కరివేపాకు సాగు లాభదాయకంగానే ఉంటుంది. విత్తనాలను సైతం ప్రస్తుతం మేమే సొంతంగా తయారు చేస్తున్నాం.

-న్యూస్‌టుడే, తాళ్లూరు, ముండ్లమూరు



ముండ్లమూరు వద్ద సాగులో ఉన్న తోట

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో ఓబులేసు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో సోమవారం సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధ్యాపకుల పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు; మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు కొనసాగనున్న పరీక్షకు మొత్తం 1950 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. దేవరాజుగట్టులోని కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మార్కాపురంలోని శామ్యూల్ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, రైజ్ కృష్ణసాయి ప్రకాశం, రైజ్ కృష్ణసాయి గాంధీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియాలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ విభాగం అధికారి విజయకుమార్, డీపీవో జీవీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

పామూరు: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..వగ్గంపల్లికి చెందిన షేక్ రసూల్(28) కనిగిరి మసీదులో పనిచేస్తున్నారు. ఆయనకు పామూరుకు చెందిన యువతితో ప్రేమ వివాహం కాగా, రెండేళ్లుగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. శనివారం రసూల్ కనిగిరి వెళుతున్నానని తల్లి మస్తాన్‌బీకి చెప్పి బయలుదేరారు. అయితే ఆయన ఆచూకీ లేకపోవడంతో ఆదివారం మస్తాన్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రావిగుంటపల్లి వద్ద చెట్టుకు రసూల్ మృతదేహం వేలాడుతుండగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

గంజాయి తరలింపుదారుల అరెస్టు... భారీగా సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 3.1 కేజీల గంజాయితో పాటు రూ.9.6 లక్షల విలువైన సొత్తును జరుగుమల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం సీఐ హజరత్తయ్య వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మోయిన్‌పూర్‌కు చెందిన ముకేష్‌కుమార్ నాలుగేళ్ల నుంచి మద్దిపాడు మండల కేంద్రంలో నివాసముంటూ అక్రమంగా డీజిల్ వ్యాపారం చేస్తున్నాడు. గత కొంతకాలంగా అతను ఒడిశా రాష్ట్రంలోని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి స్థానిక యువకులకు విక్రయిస్తున్నాడు. ఇటీవల గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలేనికి చెందిన ఒడ్డమాను శివారెడ్డి, ఒంగోలు పట్టణం గుర్రం జాషువానగర్‌కు చెందిన ట్రంకు కార్తీక్‌లకు గంజాయి విక్రయిస్తానని లావాదేవీలు జరిపాడు. ఈ మేరకు సోమవారం స్థానిక వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద వారికి గంజాయి విక్రయించాడు. వారు తరలించేందుకు సిద్ధపడుతుండగా పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులను విచారించగా..శివారెడ్డిపై పలు పోలీసు స్టేషన్ల పరిధిలో 75 కేసులున్నట్లు గుర్తించారు. అనంతరం వారి వద్ద నుంచి 9 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 కేజీల వెండితో పాటు ద్విచక్ర వాహనం, బంగారం కరిగించే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.9.6 లక్షలుంటుందని చెప్పారు. నిందితులను న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు. చాకచక్యంగా పట్టుకున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా లారీ ఢీకొని ఒకరు తీవ్రంగా, మరో అయిదుగురు స్వల్పంగానూ గాయపడ్డారు. ఈ సంఘటన టంగుటూరు మండలం శివపురం 16వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ఆచంట రత్నాకర్ (38) కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి అరుణాచలం దైవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణమై వస్తుండగా, శివపురం వద్ద వారు ప్రయాణిస్తున్న కారును లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో వెనుక కూర్చున్న రత్నాకర్ కాలికి తీవ్ర గాయం కాగా.. మిగతా అయిదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు రత్నాకర్‌ను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు వివరాలు సేకరించి టంగుటూరు స్టేషన్‌కు సమాచారం అందించారు. దీనిపై టంగుటూరు ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్స్ ఒంగోలు గ్రామ కాపురస్తులు లేట్ కంటు రాజశేఖర్‌గారి భార్య కవిత వారి ఇరువురు కుమార్తెలు సాహితి మరియు నాగబ్రహ్మిణి ఇచ్చిన సంజాయిషి మేర ఈ పబ్లిక్ నోటీసు ఇవ్వడమైనది.

ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తి నా క్లయింట్స్ 2, 3 వారి పిత్రార్జితపు ఆస్తులు అయి ఉన్నవి. ఒకటవ వారి భర్త ఎలాంటి వ్రాతలు లేకుండా చనిపోయినందున వలన నా క్లయింట్స్‌కు ఈ క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తులలో 1/3వ భాగము హక్కు కలిగియున్నారు. నా క్లయింట్స్‌కి తెలియుటలో వారికి గల హక్కులను మభ్యపెట్టి కంటు శివరామయ్య మరియు వారి భార్య నారాయణమ్మ దగ్గర నుండి షెడ్యూలు ఆస్తులను పొందవలనని కొంత మంది ప్రయత్నించుచున్నట్లుగా తెలియచున్నది. కావున నా క్లయింట్స్ పరోక్షములో ఎలాంటి లావాదేవీలు జరిగిన యెడల అవి నా క్లయింట్స్ హక్కులను బద్ధపరచజాలవు.

షెడ్యూల్:

1. ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, చెరుకూరు గ్రామం, సర్వే నెం. 211/1 నందు 2 ఎకరాల 21 సెంట్లు, సర్వే నెం. 217/2 నందు 0-96 సెంట్లు, మరియు పొన్నలూరు గ్రామ సర్వే నెం. 647లో 0-93 సెంట్లు.
2. ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం పెళ్ళూరు గ్రామం సర్వే నం. 209/3 నందు 29 గదులు
3. ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, ముక్తినూతలపాడు గ్రామం, సర్వే నెం. 163 నందు 36 గదులు
4. ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం మరియు గ్రామం నందు ఫ్లాట్ G3 ప్రశాంతి నిలయం, ఆశ్రమం దగ్గర, మంగమూరు డొంక.
5. ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, పెళ్ళూరు గ్రామం సర్వే నెం. 78/6ఎ, 78/7, Plot నంబర్ 8, పోస్టల్ కాలని.

మొలకలపల్లి అజయ్‌బాబు, అడ్వకేట్ & Ex GP
రాజపానగల్ రోడ్, ఒంగోలు. 98668 96439.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 102, రిటైల్ లైవ్ - 124, చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్- 205

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం, ఒంగోలు. కోర్సులు: M.Sc ఫుడ్ & న్యూట్రిషన్, M.Sc మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, M.Sc బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్. డిగ్రీ: B.A. B.Com, B.Com కంప్యూటర్స్. సంప్ర॥ ప్రకాశం అకాడమీ, ఒంగోలు. 70936 21555.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA, వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 82474 49042, 96404 96677.

REAL ESTATE

PLOT FOR SALE

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో మంగమూరురోడ్డు, హైదరాబాద్ స్కూల్ దగ్గరలో 59 1/2 గదుల స్థలం అమ్మబడును. గది కేవలం 30వేలు మాత్రమే. సంప్ర॥ సెల్: 94940 96261.

TO LET

COMMERCIAL

దర్శి, కురిచేడురోడ్ చెట్టు క్రింద బడిఎదురుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంక్ క్రింద గ్రౌండ్ ఫ్లోర్ 3500 S.F.T. హాస్పిటల్‌కి ఆఫీసులకు అన్ని వసతులతో అద్దెకు ఇవ్వబడును. ✆ 98489 85007.

JOBS

క్యారెట్‌లేన్ జ్యూవెలరీ స్టోర్ (తనిష్క్)లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. జీతం : SE 15K to 18K+ ఇన్సెంటీవ్స్. సంప్ర: సస్య గ్రూప్, ఒంగోలు. Cell: 92814 52802.

చీరాలలో 157 సం|| విశ్వాసం కలిగిన కంపెనీతో కొత్త బ్రాంచ్‌లో పనిచేయుటకు మేనేజర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్స్, VRS, గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్ Loan/ MF/ Tax Cons ఎక్కువ డబ్బు సంపాదించాలనుకునే వారు. Age: 30-65 సం||. ✆ 93916 41248, 89851 17531.

సింగరాయకొండ శ్రీచైతన్య స్కూల్ నందు పనిచేయుటకు P.E.T, హిందీ టీచర్లు (Primary) మరియు ఆఫీసు స్టాఫ్ కావలెను. సెల్ : 96038 45549.

ఒంగోలు, మంగమ్మ కాలేజీ పక్కన, క్యాన్సర్ హాస్పిటల్ ఎదురుగా గీత ఫిల్లింగ్ స్టేషన్‌లో పనిచేయుటకు పంప్ బాయ్స్ కావలెను. జీతం: 14000+ రాత్రి భోజనం కలదు. సంప్ర: ✆ 84980 10783, 98487 58885.

ఒంగోలు ఫర్నిచర్ షాపులో పనిచేయుటకు లేడీస్ స్టాఫ్ కావలెను. వయస్సు (18-35) సం॥లోపు. జీతం : 12,000. సెల్ : 90305 90855.

మంగలపాలెం NH-16 పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం 12,000/- నుండి 14,000/- వరకు, 8 గం॥ డ్యూటి. సంప్రదించగలరు. Cell: 98854 14786, 98854 97786.

WWW.RXWALA.COM మా సంస్థ నందు పనిచేయుటకు ఫార్మాశిస్టులు, RMP నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. Cell: 6300923212.

ఒంగోలు పట్టణంలోని ప్రముఖ లిమిటెడ్ ఫరమ్‌కు GST, TALLY, Income Tax పనులలో అనుభవం కలిగిన అకౌంటెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఆఫీసు కొరకు అనుభవం గల కారు డ్రైవర్స్ కావలెను. Cont: 7095916669, 8897277442.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి.
వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

వేతనాలు పెంచాలంటూ ధర్నా

మార్కాపురం పట్టణం, గిద్దలూరు పట్టణం, న్యూస్టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలంటూ సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ● గిద్దలూరు పురపాలకలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు 2వ రోజు సమ్మెలో భాగంగా మోకాళ్లపై కూర్చొని తమ నిరసన తెలియజేశారు

మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ ఒప్పంద ఉద్యోగులు

పరిశుభ్రత పాటించడం తప్పనిసరి

కంభం, రాచర్ల, న్యూస్టుడే : పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా సహాయ మలేరియా అధికారి రంగనాయకులు పేర్కొన్నారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకొని స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం డెంగీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ● రాచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరపత్రాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల బస్టాండ్ సెంటర్ నుంచి విరసలగుండం వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారి గుంతలో నీరు నిలిచిపోయి వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించండి. - గురవయ్య, స్థానికుడు

✓: మరమ్మతులు చేపట్టి, నీరు నిల్వ కుండా చర్యలు తీసుకుంటాం. - శ్రీదేవి, ఈవోఆర్డీ

?: రాచర్లమండలంలోని జేపీ చెరువు గ్రామంలో తాగునీటికి ఇబ్బందిగా ఉంది. 5 రోజులకో సారి 7, 8 బిందెల నీరు మాత్రమే వస్తోంది. వ్యయప్రయాసలకు ఓర్చి దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. సమస్య పరిష్కరించండి. - వినాయక్, స్థానికుడు

✓: గ్రామ పరిధిలో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. కొన్ని బోర్లకు తక్కువగా జలం వస్తోంది. త్రీఫేజ్ మోటారు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - వీరగురుడు, పంచాయతీ కార్యదర్శి, జేపీ చెరువు

- కొనకనమిట్ల, రాచర్ల, న్యూస్టుడే

కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరా?

మార్కాపురం, కంభం, త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్టుడే: భూ సమస్యల పరిష్కారానికి కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరా అంటూ అర్జీదారులు ఉప కలెక్టర్ బి.సహాధిత్ వెంకట త్రివినాగ్ ఎదుట వాపోయారు. సోమవారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. భూ సమస్యలపై 30 దరఖాస్తుల వరకు వచ్చాయి. ● మార్కాపురం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 18 దరఖాస్తులు అందాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ● కంభం రెవెన్యూ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి మండల స్థాయి అధికారుల్లో చాలా మంది హాజరుకావడంలేదని, అందరూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ● మా గ్రామంలోని చేసిన రీస్వే తప్పుల తడకగా ఉందని, సమస్యలు పరిష్కారం కాకపోగా.. జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఎం)తో నానా అవస్థలు పడుతున్నామని, స్థానిక తహశీల్దారు కార్యాలయంలో దరఖాస్తుచేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని, మీరైనా న్యాయం చేయని త్రిపురాంతకం మండలం దువ్వలి గ్రామస్థులు, రైతులు ఒంగోలు కలెక్టరేట్‌లో జేసీని కలిసి తమ సమస్యను విన్నవించారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉప కలెక్టర్ సహధిత్ వెంకట త్రివినాగ్

ప్రతిపాదనలతోనే సరి

❑ మండలానికి ఒక్కటే పీహెచ్‌సీ
❑ ప్రజలకు అందని వైద్య సేవలు

కంభం, తర్లుపాడు, న్యూస్టుడే:

ప్రజలకు విద్య, వైద్యం తప్పనిసరి. అందుకు అనుగుణంగా ప్రతి మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ కంభం, తర్లుపాడు మండలాల్లో ఒక్కటి చొప్పున మాత్రమే పీహెచ్‌సీలు ఉన్నాయి. దీంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. వైద్య సిబ్బంది సమావేశాలు, వ్యాక్సిన్, చిన్నారుల టీకాలు, వాటి పరిధిలోని ఉపకేంద్రాల నిర్వహణ చూసుకోవడం వైద్యులకు ఇబ్బందికరంగా మారుతోంది. కంభం మండలంలో 47,212 మంది జనాభా ఉన్నారు. రావిపాడులో 4,500 మంది నివాసం ఉంటున్నారు. ఆ గ్రామ సమీపంలో పలు సచివాలయాలు, గ్రామాలు ఉన్నాయి. కంభం -2, 3, 4, కందులాపురం -1, 2, 3, జంగంగుంట్ల, ఎల్.కోట, లింగోజీపల్లి, సూరేపల్లి, తెల్లదిన్నె, ఔరంగాబాద్, నడింపల్లి, తదితర గ్రామాల వారికి బేస్తవారపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు సేవలు అందించాల్సి వస్తోంది. మండలాలు వేరుకావడంతో వైద్య సిబ్బంది, ప్రజలు అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, బాలింతలు సుమారు 13 కిలో మీటర్ల దూరంలోని బేస్తవారపేటకు వెళ్లాల్సి వస్తోంది. గర్భిణి నమోదు కార్డు కోసం, ప్రతి నెలా పరీక్షల కోసం అక్కడికే వెళ్తున్నారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అంతదూరం రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోంది. రెండు మండలాల్లోని ప్రతిపాదించిన గ్రామాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రావిపాడులోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

● ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొత్తగా 28 పీహెచ్‌సీలు ఏర్పాటు చేసేందుకు 2020లో ప్రతిపాదనలు పంపించారు. వాటిల్లో 18 మాత్రమే మంజూరు చేశారు. కానీ వెనుకబడిన ప్రాంతంలో ఏర్పాటు చేయలేదు. కంభం మండలంలో తురిమెళ్లలో మాత్రమే పీహెచ్‌సీ ఉంది. మరో పెద్ద పంచాయతీ అయిన రావిపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. మంజూరు మాత్రం చేయలేదు. తర్లుపాడుమండలంలోనూ ఒక్కటే పీహెచ్‌సీ ఉంది. చెన్నారెడ్డిపల్లిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు.

మళ్లీ పంపుతాం

కంభం మండలంలోని రావిపాడు, తర్లుపాడు మండలాల్లో పీహెచ్‌సీల ఏర్పాటుకు గతంలో పంపించిన ప్రతిపాదనలు మరోసారి పరిశీలిస్తాం. ప్రస్తుతం పీహెచ్‌సీలో వస్తున్న ఓపీలు, ఇతర విషయాల ఆధారంగా ప్రతిపాదనలను కమిషనర్‌కు పంపించేందుకు చర్యలు తీసుకుంటాం. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ల్లో మెరుగైన సేవలు అందించాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

- టి. వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో, ఒంగోలు

ఐటీఐలో ప్రవేశాల గడుపు పెంపు

మార్కాపురం పట్టణం: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ బి.వాసుబాబు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత: పొదిలి: పొదిలిలో మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ మోహన్‌రెడ్డి తెలిపారు. కొత్తూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని నవాబుమిట్ట, తూర్పుపాలెం, పడమటిపాలెం, నిర్మలాకాన్వెంట్‌వీధి, బ్రహ్మయ్యతోట, పాతూరు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కేంద్ర బృందం పర్యటన: మార్కాపురం: తర్లుపాడు మండలంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ-2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందానికి చెందిన సభ్యులు రవివర్మ, సందీప్‌లు అధికారులతో కలిసి పర్యటించారు. మండలంలోని తుమ్మలచెరువు, చెన్నారెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి పారిశుద్ధ్య తీరుపై వివరాలు సేకరించారు.

ప్రతి హామీని అమలు చేస్తాం : ఎమ్మెల్యే

కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం పట్టణం : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా త్వరలో సాకారం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వెదురు పెంపకంపై శిక్షణ

బేస్తవారపేట: వెదురు పెంపకం ద్వారా రైతులకు స్థిర ఆదాయం సమకూరుతుందని ఇండస్ట్రీ ఫౌండేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రసంగి పేర్కొన్నారు. బేస్తవారపేట లోని స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెదురు పెంపకంపై మండల వీవోఏలు, సీసీలకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యాత్రికులకు అన్నదానం

త్రిపురాంతకం గ్రామీణం: పల్నాడు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ల ఆరేపల్లికి చెందిన 30 మంది భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు శ్రీశైలానికి కాలినడక బయలుదేరారు. వీరికి యర్రగొండపాలెం తెదేపా నాయకులు సోమవారం మేడపి టోల్‌ప్లాజా వద్ద అన్నదానం నిర్వహించి ఆకలి తీర్చారు.

అవినీతి ఆరోపణపై సబ్ కలెక్టర్ విచారణ

బాలిక ఉన్నత పాఠశాలలో స్టాక్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం అర్బన్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకంలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి, ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు విచారణ చేపట్టారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి బియ్యం, కోడిగుడ్లు అమ్ముకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం పాఠశాలకు వచ్చి రికార్డులను తనిఖీచేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సరకులు స్టాక్‌ను పరిశీలించగా 1214 కేజీల బియ్యం ఎక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోడిగుడ్లు 887, చిక్కీలు 921 అదనం ఉన్నట్లు తహసీల్దార్ చిరంజీవి తెలియజేశారు. ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల ఆహారం పెట్టాల్సి ఉండగా కేవలం 90 గ్రాములు మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు గుర్తించారు. విద్యార్థినిలకు పంపిణీ చేయాల్సిన మెనూ సంక్రమంగా అమలు చేయకపోవడంపై సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన నివేదికను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ చిరంజీవి తెలియజేశారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది గిద్దలూరు మండలం ముండ్లపాడు పంచాయతీ వెంకటాపురం ఎస్టీ కాలనీ సమీపంలో విద్యుత్తు స్తంభాలకు అల్లుకుపోయిన తీగలు. పరివర్తకానికి సంబంధించిన ఫీజు క్యారియర్ల వద్ద తీగలు అల్లుకుపోయినా విద్యుత్తు శాఖ సిబ్బంది తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. గాలికి, వర్షానికి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- గిద్దలూరు పట్టణం, న్యూస్టుడే

రహదారికి అడ్డంగా...

గిద్దలూరు పురపాలక లోని రెవెన్యూ చావడి వద్ద విద్యుత్తుశాఖ అధికారులు విద్యుత్తు లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయని ఆదివారం కూలీలతో కొట్టించి రహదారిపై వేశారు. రెవెన్యూ చావడి వద్ద చెట్ల కొమ్మలు నరికి పక్కా కాలువపై పడేశారు. రహదారి మధ్యలో చెట్ల కొమ్మలు అలాగే వదిలేయడంతో పట్టణం మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ చెట్ల కొమ్మలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది.

- న్యూస్టుడే, గిద్దలూరు పట్టణం

ఘనంగా సారె సమర్పణ

ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని మల్లికార్జున స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో మహిళా భక్త బృందం సోమవారం సారె సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయాలైన మల్లికార్జున, సత్యనారాయణ, లక్ష్మీచెన్నకేశవస్వామి, మార్కండేశ్వర స్వామి, పోలేరమ్మ ఆలయాల్లో సారెను సమర్పించారు. మార్కాండేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రెంటచింతల, ఉమామహేశ్వరశర్మ, మధుసూదన శర్మ దంపతులు కల్యాణం నిర్వహించారు.

- న్యూస్టుడే, మార్కాపురం పట్టణం,

రాళ్ల వాగుకు మళ్లీ కొలతలు

యర్రగొండపాలెం పట్టణం: యర్రగొండపాలెం లోని సర్వేనంబర్ 28లో రాళ్లవాగు భూమికి మరోసారి జిల్లా అధికారులు సోమవారం కొలతలు వేశారు. వాగు భూమిని అప్పటి మాజీ వైకాపా మంత్రి, ఆయన అనుచరులు ఆక్రమించారని వై.పాలెంకు చెందిన సాలమ్మ, లక్ష్మీనారాయణలు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే వాగుభూమిని వెలిగొండ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి ఆధ్వర్యంలో కొలతలు వేశారు. ఇటీవల ఇన్‌స్పెక్టర్‌ఆఫ్ సర్వే శ్రీనివాసరావు మరోసారి కొలతలు వేశారు. మళ్లీ కలెక్టర్ ఆదేశాల మేరకు మూడోసారి బీకేవీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కళావతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పరిశుద్ధరావు యర్రగొండపాలెం వచ్చారు. రాళ్ల వాగు ప్రభుత్వ పోరంబోకు భూమిని, రికార్డులు పరిశీలించి అనంతరం సర్వేయర్లతో కొలతలు తీయించారు. ఈ కొలతలో కొంత భూమి రియల్ ఎస్టేట్ చేతిలో ఉన్నట్లు తేల్చి, ట్రెంచర్లు వేసి బోర్డు పెట్టాలని తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డిని ఆదేశించారు. దీంతో అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ట్రెంచర్ల వేయవద్దని బోర్డు మాత్రమే పెట్టాలని కోరారు. దీంతో కలెక్టర్ ముందే ఫిర్యాదు దారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొంత వాదోపవాదాలు జరిగాయి. ప్రభుత్వ భూమి ఎంత వరకు ఉందో ట్రెంచర్ వేయాలని స్థానిక అధికారులను డిప్యూటీ కలెక్టర్ ఆదేశించారు.

కొలతలను చూస్తున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కళావతి

వివాహిత ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు పట్టణం : అత్త, ఆడపడుచు వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించారు. స్థానిక గణేష్‌నగర్‌కు చెందిన యగటీల లక్ష్మీప్రశాంతి సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న భర్త రంగనాయకులు గమనించి 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ఆమెకు చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం సీసాల స్వాధీనం : బేస్తవారపేట: మండలంలోని పాత మల్లాపురంలో అక్రమంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి, సిబ్బందితో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలో ఓ వ్యక్తి నల్ల సంచితో అనుమానాస్పదంగా తిరుగుతూ ఎక్సైజ్ సిబ్బందిని చూసి ఆ సంచిని అక్కడే వదిలేసి పారిపోయాడు. సిబ్బంది ఆ సంచిలోని 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పారిపోయిన వ్యక్తి గ్రామానికి చెందిన కె.దావీదుగా గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ● సింగరపల్లి అక్రమంగా మద్యం బెల్ట్ దుకాణాన్ని నిర్వహిస్తున్న నారు పేరయ్యను, అక్కపల్లిలో గంజాయి కేసులో నిందితుడైన గోవిందారెడ్డిని తహసీల్దార్ జితేంద్రకుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ: పొదిలి: పొదిలిలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, గోడౌన్లలో ఉన్న నిల్వలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గూడు కట్టుకున్న ఆవేదన!

❑ పెరిగిన ధరలతో భారమంటున్న లబ్ధిదారులు

జగనన్న కాలనీలో వివిధ దశల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

పొదిలి, న్యూస్టుడే:

గత వైకాపా ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన అవి గ్రామాలకు దూరంగా ఉండటంతో వాటిలో నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. పొదిలి మండలంలో 18 లేఅవుట్లలో 1690 గృహాలు మంజూరు చేశారు. వాటిలో 987 మాత్రమే పూర్తయ్యాయి. అస్సలు ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పొదిలి పట్టణానికి దూరంగా ఉండటం, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, అక్కడి నివాసితులకు భద్రత కొరవడటంతో అక్కడ ఉండేందుకు సైతం ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ ఒత్తిడితో ప్రైవేటు గుత్తేదారులతో 985 గృహాలను నిర్మించారు. వాటిల్లోను 752 పూర్తయ్యాయి. ప్రైవేటు గుత్తేదారులు నిర్మించిన ఇళ్లలో బయట సున్నం కొట్టి, డోరు బిగించి పూర్తయిందనిపించారు. లోపల పూర్తిస్థాయిలో ప్లాస్టింగ్, ఇతర పనులు చేయలేదు. కనీసం టాయిలెట్ బేసిన్ సైతం బిగించకపోవడం గమనార్హం.

కూటమి ప్రభుత్వం ప్రోత్సహకాలు ...

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ఎస్సీ, బీసీ సామాజికవర్గాల వారికి రూ.1.80లక్షలతోపాటు అదనంగా రూ.50,000 మంజూరు చేస్తోంది. ఎస్టీలకు రూ.70,000, చెంచు సామాజికవర్గానికి రూ.లక్ష రూపాయల వరకు అదనంగా కేటాయించింది. దీంతో మధ్యలో నిర్మాణాలు నిలిపేసిన వారు కొంతమంది కట్టుకోవడానికి ముందుకొస్తున్నారు. అన్నిరకాల ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు అదనంగా రూ.నాలుగు నుంచి రూ.అయిదు లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని లబ్ధిదారులు అంటున్నారు. అంత ఖర్చుచేసినా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అక్కడ ఉండే పరిస్థితి లేదని, కాలనీలో శివారు ప్రాంతాల్లో మరింత ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై పొదిలి గృహ నిర్మాణశాఖ ఏఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ మధ్యలో ఆపిన లబ్ధిదారులను కట్టుకోమని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే అదనపు నిధులను సద్వినియోగం చేసుకోవాలని చైతన్యపరుస్తున్నామని చెప్పారు.

శ్రావణ మాసం లోపు పూర్తి చేయండి

కొమరోలు గ్రామీణం, న్యూస్టుడే: శ్రావణ మాసం వచ్చే లోపు అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయాలని గిద్దలూరు గృహ నిర్మాణ శాఖ డీఈఈ షేక్.ఖాదర్ బాషా తెలిపారు. కొమరోలులోని పలువురి లబ్ధిదారుల వద్దకు సోమవారం వెళ్లి మాట్లాడారు. గృహాలను త్వరగా నిర్మించుకుంటే అదనపు ఆదాయం పొందుతామని తెలిపారు. మండలంలో 210 గృహాలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 59 గృహాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈయన వెంట ఏఈ కృష్ణా రెడ్డి, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకురాలు రమ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈఈ ఖాదర్ బాషా

వ్యక్తికి జైలుశిక్ష : కంభం : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి గిద్దలూరు ఫస్టు క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి భరత్‌చంద్ర సోమవారం 30 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client, The Branch Manager, Shriram Finance Limited, Giddalur Branch of Prakasam District, I -issued the following **PUBLIC NOTICE** to the General Public.

One, **Satteli Krishnaiah S/o Lingaiah** Bestavari Peta Village and Mandal, Prakasam District **intended to borrow loan** and create Equitable Mortgage of his Schedule Property in favour of my Client for the loan to be borrowed by him. As such if anyone has any claims, Charges, Mortgages, Sale Agreements, Court ,attachments, Court disputes etc., should be informed by them to me within Seven days from the date of this Public Notice, Otherwise later objections will not bind my Client in this regard.

SCHEDULE: Prakasam District, Cumbum Sub-Registrar Registration, Bestavari Peta Mandal, Chetticherla Panchayat area Hamlet of Pusalapadu Village, Sy. No. 42, Vacant site in Plot No.s 4(7 feet) and 5(Full extent) to the extent of 108 Sq.yards. Bounded by **East:** Remaining exent of the Vendor in Plot No.4, **South:** Site of Ramana Reddy, **West:** site of Plot No.6, **North:** 14 1/2 feet width road ie., Admeasuring that East to West : 27 feet, North to South: 36 feet in total 108 Sq. Yards or 90.72 Sq.mts. Vacant site.

Sd/- BODDU PRAKASH, Advocate,Giddalur, 9393456730
Giddalur Date: 12-07-2025

మధ్యవర్తిత్వంతో కేసుల రాజీ: మార్కాపురం: కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో రాజీ చేసుకోవడం ఉత్తమమని ప్రముఖ న్యాయవాది షేక్ యూసుఫ్ అలీ పేర్కొన్నారు. ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు మార్కాపురంలో సోమవారం మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సహకార సంఘ సభ్యుల నియామకం: గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నియోజకవర్గంలోని పలు సహకార సంఘాలకు ఛైర్‌పర్సన్, సభ్యులను నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొమరోలు సహకార సంఘం ఛైర్ పర్సన్‌గా ముత్తుముల సంజీవరెడ్డి, గిద్దలూరు సహకార సంఘం ఛైర్‌పర్సన్‌గా దుత్తా బాల ఈశ్వరయ్య, కొమరోలు మండలం ఇడకల్లు సహకార సంఘం ఛైర్ పర్సన్‌గా బిజ్జం రవీంద్రా రెడ్డి, అర్ధవీడు సహకార సంఘం ఛైర్ పర్సన్‌గా కె.వెంకటరంగారెడ్డిని, సభ్యును నియమించారు.

అధికారులకు సన్మానం: రాచర్ల: స్థానిక బీసీ భవనం వద్ద సోమవారం బదిలీ అయిన ఎంఈవో -1 వెంకటేశ్వరరావు, నూతన విద్యాశాఖ అధికారి -1 మొయినుద్దీన్, ఎంఈవో-2 లను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో-2 గిరిధరశర్మ పాల్గొన్నారు.

బొలారో వాహనం ఢీ కొని.. అయిదుగురికి గాయాలు

పొదిలిగ్రామీణం, పొదిలి న్యూస్టుడే: బొలెరో వాహనం ఆటోను ఢీకొని అయిదుగురికి గాయాలైన సంఘటన పొదిలి-గిద్దలూరు రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. .కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామం నుంచి ప్రయాణికులతో ఆటో పొదిలి వస్తోంది. పోతవరం గ్రామంవద్ద వెనుక నుంచి వచ్చిన బొలెరో ఆటోను ఢీకొట్టింది. ఆటో బోల్తా పడి అందులో ఉన్న ప్రయాణికులైన బాల రోశయ్య, కె.రమణమ్మ, కె.నారాయణమ్మ, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ప్రైవేటు వాహనంలో పొదిలి సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు బాలరోశయ్య కాలు విరిగిందని ఒంగోలు రిఫర్ చేశారు. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయని చెప్పారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేఘమా.. వర్షించుమా!

☛ పశ్చిమంలో పడిపోతున్న భూగర్భజలాలు ☛ ఎండిపోతున్న పంటలు



వై.పాలెంలో వాడిపోతున్న సజ్జ పంట

యర్రగొండపాలెం, న్యూస్టుడే:

జిల్లాలో కరవు ఛాయలు అలముకుంటున్నాయి. జులై నెలలోనూ 38 డిగ్రీల ఎండలు కాస్తుండడం పరిస్థితి అద్దం పడుతోంది. ఖరీఫ్ ప్రారంభమై నెలగడుస్తున్నా పంటలసాగు ఊపందుకోలేదు. సాగర్ ఆయకట్టు పరిధిలో మినహా వర్షాధారంగా సాగుచేసే ప్రాంతాల్లో 20శాతమూ సాగవలేదు. పశ్చిమంలో ఈపరిస్థితి ఎక్కువగా ఉండగా.. వై.పాలెం, మార్కాపురం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో తీవ్రరూపం దాల్చుతోంది. దుక్కులు దున్ని భూమి సిద్ధం చేసుకున్న రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మే నెలలో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవగా.. జూన్ నుంచి ముఖం చాటేశాయి. దీని ప్రభావం ఖరీఫ్ పంటలపై పడింది. వివిధ దాన్యాలు, పశుగ్రాసం, పత్తి వంటి పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ● జిల్లాలో సాధారణ వర్షపాతం 89.7 మి.మీ కాగా నమోదైంది..59.7 మి.మీ మాత్రమే. మొత్తం మండలాలు 38 కాగా అందులో సాధారణ వర్షపాతం నమోదైనవి 7 మండలాలు కాగా, వై.పాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లోని 28 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ముండ్లమూరు, తాళ్లూరు, మద్దిపాడు మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. గతేడాది జూన్‌కి ఈఏడాది జూన్‌కి జిల్లాలోని చాలా మండలాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. తాగునీటికి కష్టంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. వీటిలో వై.పాలెం నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ తాగునీటి బోర్లు అడుగంటడంతో నీటి కొరత వేధిస్తోంది.

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన

పొదిలి : ప్రభుత్వం విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. సోమవారం పొదిలిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర, బాలికల వసతిగృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది రూ.143 కోట్లతో వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టామన్నారు. పొదిలిలో రెండు వసతి గృహాలకు రూ.79 లక్షలు మంజూరు చేశామన్నారు. అనంతరం వసతిగృహాల్లో భద్రపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్లాస్టిక్ సర్జరీ డే శుభాకాంక్షలు
డా॥ వై. సునీల్ కిషోర్ గారి ఆధ్వర్యంలో
గత 10 సంవత్సరాలుగా నడపబడుచున్న
ప్రకాశం జిల్లాలో ఏకైక ప్లాస్టిక్ సర్జరీ హాస్పిటల్
"ఉషా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్"
డా॥ వై. సునీల్ కిషోర్ M.S.,(Gen)., M.Ch(Plastic) Plastic & Cosmetic Surgeon Fellow in hand & Micro Surgery
మా వద్ద డయాబెటిక్ ఫుట్, అల్సర్‌కి అత్యాధునికమైన వైద్య సదుపాయాలు కలవు
షుగర్ ఉన్న వాళ్ళకి కాళ్లకు గాయాలు పడకుండా మిషన్ ద్వారా స్క్రీనింగ్ చేయబడును.
మా వద్ద షుగర్ చెప్పులు లభించును.
USHA Plastic Surgery & Cosmetic Clinic
ఉషా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
అంజయ్య రోడ్, ఒంగోలు, సెల్: 9293949335, 9059949335
Web: drsuneelkishore.com
మార్కెటింగ్ మేనేజర్: కొండ్రాజు సాయికృష్ణ, సెల్: 6303653004

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయస్వామి, పక్కనే మంత్రి గొట్టిపాటి రవికుమార్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు వైకాపా రకరకాల కుట్రలు చేస్తోందని వాటిని తెదేపా శ్రేణులు సమర్థంగా తిప్పి కొట్టాలని సాంఘిక శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం కనిగిరి పట్టణంలోని అమరావతి మైదానంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధ్యక్షతన కుటుంబ సాధికార సభ్యుల సమావేశం (కెఎస్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి పనులను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. విద్యుత్ శాఖామంత్రి గొట్టి పాటి రవికుమార్ మాట్లాడుతూ కెఎస్ఎస్ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడారు.

కల్లూరుతో గొట్టిపాటి కుటుంబం అనుబంధం

తాళ్లూరు: కొత్త కల్లూరుకు ప్రజల వినతి మేరకు 1997లో తమ తాత దివంగత గొట్టిపాటి హనుమంతరావు విద్యుత్ సౌకర్యం కల్పించారు. తాజాగా గత ఎన్నికల్లో చెప్పిన మేరకు విద్యుత్ ఉపకేంద్రం మంజూరు చేయించామని ఆయన మనుమరాలు దర్శి నియోజకవర్గానికి తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. కల్లూరు మంత్రుల సభలో ఆమె మాట్లాడారు.

రూ.వేయి అందించిన మంత్రి డోలా..

కురిచేడు, న్యూస్‌టుడే: మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సోమవారం కురిచేడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. కొందరు విద్యార్థులు పాదరక్షలు లేవని వాపోవడంతో తన జేబులో నుంచి రూ.వెయ్యి తీసి ఉపాధ్యాయులకు అందజేశారు. ◗ సోలార్ పార్కు ఏర్పాటు చేసి కురిచేడు మండల అభివృద్ధికి సహకరించాలని పడమర వీరాయపాలెం మాజీ సర్పంచి రావిపాటి శ్రీనివాసులు మంత్రి గొట్టిపాట్టి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

513 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి వేలం కేంద్రంలో సోమవారం 327 పొగాకు బేళ్లను తిరస్కరించినట్లు నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని ధర్మవరం, వెంకటకృష్ణాపురం, కోయవారిపాలెం, తాటాకులపాలెం, ముక్కోడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు కేంద్రానికి 1124 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 797 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.220.39 పలికిందన్నారు.

◗ టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 186 బేళ్ల తిరస్కరించారు. తూమాడు, జమ్ములపాలెం గ్రామానికి చెందిన రైతులు 865 బేళ్లను తీసుకురాగా..679 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.220 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

చెత్త రహిత పట్టణమే లక్ష్యం

● కనిగిరి నూతన కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి

మున్సిపల్ కార్యాలయంలో వృథాగా చెత్త డబ్బాలు

ముఖాముఖి

కనిగిరి పట్టణం అన్ని విధాలా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని, పారిశుద్ధ్యం నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని కనిగిరి మున్సిపాలిటీ కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల కనిగిరి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన 'న్యూస్‌టుడే' 'ముఖాముఖి'లో మాట్లాడారు.. -న్యూస్‌టుడే, కనిగిరి

?: ప్రశ్న: రెండు నెలలుగా కంపాక్టర్ వాహనం మరమ్మతులకు గురవడంతో పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త సేకరణ డబ్బాలు రెండు నెలలుగా కార్యాలయంలోనే వృథాగా పడి ఉన్నాయి.

✓: జవాబు: ప్రస్తుతం కాంపాక్టర్ వాహనానికి నర్సరావుపేటలో మరమ్మతులు చేయిస్తున్నాం. వాహనం లేక పోవడంతో చెత్త సేకరణ ఆలస్యమవుతోంది.

?: మురుగు వ్యవస్థ అధ్వానంగా ఉంది. మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.

✓: వాస్తవమే. అందుకే నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నాను. ఉదయం 5 గంటల నుంచే కొన్ని ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తున్నా.

?: కొందరు ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండటంలేదనే విమర్శలున్నాయి. ఈ విషయంలో మీ ఆలోచనలేమిటి?

✓: ఈ విషయంపై నాకూ ఫిర్యాదులొచ్చాయి. అందుకే ఉదయం విధులకు వచ్చినపుడు నాకు కన్పించాలి. సాయంత్రం వెళ్లే సమయంలో ఏ పనులు చేశారో నాకు తెలపాల్సి ఉంటుందని సూచించాను.

?: మున్సిపాలిటీ ఆదాయం అంతా నీళ్ల ట్యాంకర్లకు సరిపోతోందని, అవసరం లేకున్నా ఎక్కువగా నీళ్లు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి కదా..

✓: నీటి ట్యాంకర్ల సరఫరా సంఖ్యను తగ్గిస్తున్నాం.. ఇప్పటికే గుత్తే దారుడికి చెప్పాను. ఎక్కడ అవసరమైతే అంతవరకే పంపిస్తాం.

?: ప్లాస్టిక్ నిషేధానికి, కుక్కల దాడుల నియంత్రణకు ఏంచేస్తారు?

✓: ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు పరుస్తాం. 120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటాం.. కుక్కలు, పందులు, ఆవులు విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తాం.

?: మీ కుటుంబ నేపథ్యం..

✓: మా సొంతూరు పొన్నలూరు మండలం చెరువు కొమ్ముపాలెం. బాల్యం అంతా కనిగిరి లోనే.. నేను చదువుకుంది. పట్టణంలోనే.. 2018లో గ్రూపు-2 పరీక్షల్లో విజయంసాధించాను. నాన్న పేరు పిల్లి రఘురామిరెడ్డి. కనిగిరి మండలం లింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. అమ్మ వరలక్ష్మి గృహిణి, నా సతీమణి గంగిరెడ్డి నిఖితారెడ్డి అమరావతి సచివాలయంలో ఏఎస్‌వో. నేను కూడా అమరావతి సచివాలయం నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చాను.

సమస్యల పరిష్కారానికి అర్జీలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చాయని డిప్యూటీ తహసీల్దారు ఆర్.శ్రీకాంత్ తెలిపారు. ◗ హనుమంతునిపాడు: మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు అర్జీలు అందాయని తహసీల్దారు నాగుల్‌మీరా తెలిపారు. వీటిలో భూమికి సంబంధించినవి, వ్యక్తిగత సమస్యలకు చెందినవి ఉన్నాయి.

త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం మండలంలోని ముప్పాళ్లపాడు సంగమేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు భారీగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

లోకోస్ యాప్ లావాదేవీలు, వినియోగంపై శిక్షణ

సి.ఎస్.పురం: లోకోస్ యాప్‌లో లావాదేవీలపై వెలుగు అకౌంటెంట్లు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పూర్తిస్థాయిలో చక్కని అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సీఆర్పీలు మొబీనా, జి.ఈశ్వరిలు అన్నారు. వెలుగు కార్యాలయంలో సి.ఎస్.పురం, కనిగిరి, పామూరు మండలాల అకౌంటెంట్లు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు లోకోస్ యాప్‌లో రుణాలు, ఇతర లావాదేవీల నిర్వహణ, నమోదుపై సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎంలు లక్ష్మినారాయణ, అశోక్, విద్యాసాగర్, సీసీలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ

కనిగిరి: మధ్యవర్తిత్వంపై పోలీసులు, న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కనిగిరి మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి బి. రూపశ్రీ తెలిపారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం పాత్ర, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

'వైకాపాలో ఇమడలేం'

పార్టీకి రాజీనామాలు ప్రకటిస్తున్న శానంపూడి నాయకులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి కొండపి వైకాపా ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్, మండల నాయకులు నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారని, పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వడం లేదని పలువురు వైకాపా కార్యకర్తలు రాజీనామాలకు సిద్ధమయ్యారు. సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలోని వైయస్సార్ కూడలి వద్ద సోమవారం కొందరు పార్టీ సభ్యత్వానికీ, పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ కన్వీనర్ మాదాల శంకర్ తీరు సరిగా లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ వైకాపా మాజీ కన్వీనర్ నారాయణ, సచివాలయ మాజీ కన్వీనర్ శ్రీరాములు, వార్డు మెంబరు నరసింహారావు, ఎంపీటీసీ భర్త కొండయ్య, యువనేత మాదాల శివ తదితరులు పాల్గొన్నారు.

40 మంది రోగులకు వైద్యసేవలు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: హనుమంతునిపాడు మండలంలోని వాలిచెర్లలో శుక్రవారం పీహెచ్‌సీ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో వైద్యాధికారులు లక్ష్మీభార్గవి, సందీప్‌లు 40 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు పాటించాలని క్లోరినేషన్ చేసిన నీటిని వాడుకోవాలని ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సూచనలిచ్చారు. గ్రామంలో ప్రతి వారం ఏర్పాటు చేసే వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని వైద్యులు కోరారు.

సీహెచ్‌సీలో స్నేహ హస్తం అన్నదానం

కనిగిరి: కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో స్నేహహస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రోగులకు, గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ రోగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం సీహెచ్‌సీలో ఉచిత భోజనం అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి వేంపాడు సమీపంలో బాబుమియా పాల శీతలీకరణ కేంద్రం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన కిరణ్ ద్విచక్ర వాహనంపై పెదఉల్లగల్లు గ్రామం నుంచి ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవానం అదుపు తప్పి కింద పడటంతో గాయాలు అయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

సారూ..కోతుల సంగతి చూడండి

పొన్నలూరు: ఒకటి, రెండు కోతులు వస్తేనే అవి పోయేంతవరకు తలుపులు, కిటికీలు వేసుకుంటాం. అవి వెళ్లేంతవరకు రకరకాల శబ్దాలు చేస్తాం. అలాంటిది వందల సంఖ్యలో ఉంటే ఆ గ్రామం పరిస్థితి ఏమిటి? మండల కేంద్రమైన పొన్నలూరులో కోతుల దెబ్బకు దుకాణదారులు, గృహాల నివాసితులు బెంబేలెత్తిపోతున్నారు. కంటికి కనిపించిన ప్రతి వస్తువును, తినుబండారాలను నాశనం చేసే వరకు వదిలిపెట్టడం లేదని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని కోతులను పట్టుకొని దూర ప్రాంతాల్లో వదిలేలా చూడాలన్నారు. ఈ విషయంపై పొన్నలూరు పంచాయతీ కార్యదర్శి నారాయణను వివరణ కోరగా సిబ్బందిని ఏర్పాటు చేసి కోతులను పట్టుకుంటాం అన్నారు.

పొన్నలూరు పోలీస్ స్టేషన్ వద్ద గెంతుతున్న కోతులు

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: మండలంలోని చిమట ఎస్సీ కాలనీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. పారిశుద్ధ్యపనులు చేయించాలి. – కృపారావు, ఎస్సీకాలనీ.

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. – నాగూర్‌వలి, డిప్యూటీ ఎంపీడీవో.

?: మండలంలోని చౌటపల్లిలో విద్యుత్తు తీగలు తెగి రెండు రోజులుగా నివాస గృహాలకు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోగలరు. –ప్రసాద్, సుబ్బారావు, స్థానికులు.

✓: విద్యుత్తు అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. – రాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో, పీసీపల్లి మండలం.

?: దొనకొండలోని శివాజీనగర్‌లో ఉన్న ఎన్ఏపీ ట్యాంక్ కూలే దశకు చేరి ఆందోళన కలిగిస్తోంది. నీరు పట్టుకొనేటప్పుడు ట్యాంక్ కనుక పడిపోతే ప్రజల ప్రాణాలు పోతాయని అధికారులు పరిశీలించి దాన్ని కూల్చి వెంటనే కొత్తది నిర్మించాలి. – శివకృష్ణ, శివాజీనగర్.

✓: ట్యాంక్‌ను పరిశీలించి కాలం తీరి ఉంటే అది ఉపయోగించకూడదని ప్రజలకు చెప్పి పక్కనే కుళాయిలు వెంటనే ఏర్పాటు చేయిస్తాం. – కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ.

- న్యూస్‌టుడే, మర్రిపూడి, పీసీపల్లి, దొనకొండ

మురుగుతోనే వ్యాధుల వ్యాప్తి

పీసీపల్లి, న్యూస్‌టుడే: నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వల వల్ల దోమలు చేరి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, కాబట్టి మురుగు లేకుండా చూసుకోవాలని పీసీపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు అన్నారు. సోమవారం డెంగీ తదితర వ్యాధుల నివారణపై మండలంలోని పెదఇర్లపాడు, గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో సాధారణ వాడుకలో ఉండే తొట్లు, పాత టైర్లు, పూల కుండీలు, పాత కూలర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే ప్రాణాంతక దోమలు చేరి ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పెదఇర్లపాడు, గుంటుపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుబాన్, లక్ష్మీనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషక ఆహారం తీసుకోవాలి

కురిచేడు, న్యూస్‌టుడే: విద్యార్థులు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి అనిల్ అన్నారు. సోమవారం బోధనంపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాగే నీటిలో ఫ్లోరిన్ అధికంగా ఉంటే దంతాలు, ఎముకలు బలహీనంగా మారతాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ సూపర్‌వైజర్ అంజిరెడ్డి, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రవితేజకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సలహాలు, సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి అనిల్

రైతుల అభ్యున్నతికి కృషి

దర్శి ఏఎంసీలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న దారం నాగవేణి, వైస్ ఛైర్మన్ మస్తాన్‌రావు

దర్శి, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దారం నాగవేణి అన్నారు. సోమవారం దర్శి ఏఎంసీలో ఛైర్మన్‌గా తెదేపా నాయకులు సుబ్బారావు సతీమణి నాగవేణి, వైస్ ఛైర్మన్‌గా కొడిగ మస్తాన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఏఎంసీ కార్యదర్శి మస్తాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగవేణి మాట్లాడుతూ ఏఎంసీలో నిలిచిన శీతల గిడ్డంగా నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇలా తొలగించారు.. అలా వేశారు

కురిచేడు, న్యూస్‌టుడే: అధిక వేగంతో వెళ్లే విద్యుత్తు రైళ్లకు అనువుగా లేని బ్రిటిష్ కాలంనాటి ఇనుప వంతెనను సోమవారం కురిచేడు మండలంలోని కాటంవారిపల్లె సమీపంలో రైల్వే అధికారులు తొలగించారు. ఈ వంతెన స్థానంలో వెంటనే సిమెంటు వంతెను ఏర్పాటు చేసి రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. దీనిపై 'న్యూస్‌టుడే' రైల్వే డీఈ భరత్‌కుమార్‌ను వివరణ కోరగా అప్పటికాలం రైళ్లకు అనుగుణంగా ఇనుప వంతెనను నిర్మించారని, నేడు అధిక వేగంతో నడిచే విద్యుత్తు రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. ఈ రైళ్లకు అనుగుణంగా ఇనుప వంతెనను తొలగించి, సిమెంటు వంతెనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కూటమి పాలనతోనే ప్రశాంతత

కనిగిరి, న్యూస్‌టుడే: కూటమి పాలనతోనే రాష్ట్రం ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కనిగిరి మున్సిపాలిటీలోని కాశిరెడ్డినగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నామనీ, సహకరించాలనీ కోరారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయం

సి.ఎస్.పురం: మద్యం దుకాణాల్లో మద్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని కనిగిరి ఎక్సైజ్ సీఐ ఆర్.విజయ భాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని పెదగోగులపల్లి, సి.ఎస్.పురం గ్రామాల్లోని మద్యం దుకాణాలను సోమవారం ఆయన తనిఖీచేసి మాట్లాడారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

పామూరు: ఒంగోలులో ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్డీ.మౌలాలి కోరారు. స్థానిక గుజ్జుల ఎలమందారెడ్డి సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు.

డాక్యుమెంట్ పోయినది

పమిడి నారాయణ తండ్రి సుబ్బయ్య, పొందూరు, టంగుటూరు మండలం గారికి సంబంధించిన డాక్యుమెంట్ నెం.2803/1995 పొందూరు నుండి నిడమాలూరు లోని బ్యాంకుకు వెళ్లుచుండగా మార్గం మధ్యలో పై డాక్యుమెంట్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరని కోరుచున్నాము.

పమిడి వెంకటేశ్వర్లు తండ్రి నారాయణ పొందూరు. సెల్: 94935 17125

పేరు మార్పు

పాలెం చిన్నమ్మాయి W/o పాలెం రవీంద్రరెడ్డి, నివాసం 11-6, రమణాలవారిపాలెం గ్రామం, తాళ్ళూరు మండలం, ప్రకాశం జిల్లా, పిన్ కోడ్ 523 264, ఆంధ్రప్రదేశ్. పాలెం శివలీల అను నా పేరును 12.7.25 నుండి పాలెం చిన్నమ్మాయిగా భవిష్యత్ ప్రయోజనాల కోసం మార్చుకున్నాము.

విద్యాభివృద్ధికి దాతల చొరవ అభినందనీయం

సి.ఎస్. పురం విద్యార్థులకు సామగ్రిని పంపిణీచేస్తున్న ప్రధానోపాధ్యాయులు డేవిడ్, దాత ఖాజామస్తాన్

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతలు చూపిస్తున్న చొరవ అభినందనీయమని సి.నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.డేవిడ్ అన్నారు. మండలంలోని సి.నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థి, కోమటిగుంట్ల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బెల్లంకొండ ఖాజామస్తాన్, నాగూర్‌బీ దంపతులు 250 మంది విద్యార్థులకు సొంత నిధులతో సోమవారం విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని ముండ్లపాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గుడిపాటి వెంకటరెడ్డి, లక్ష్మీరెడ్డిల ఆర్థిక సాయంతో 60 మంది విద్యార్థులకు సామగ్రి అందజేశారు.

పీఏసీఎస్ అధ్యక్షుల నియామకం

పామూరు, సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ల అధ్యక్షులు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పామూరు సొసైటీ ఛైర్మన్‌గా పామూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, సభ్యులుగా షేక్ రహీముల్లా, కొండిశెట్టి వెంకటరమణయ్య, సి.ఎస్.పురం సొసైటీ అధ్యక్షుడిగా ఉప్పలపాడు తెలుగు యువత నాయకుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సభ్యులుగా తోట నారాయణ, దేవెండ్ల నాగరాజులను ఎంపికచేసి జారీ చేసిన ఉత్తర్వులు వీరికి అందాయి.

మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు

తాళ్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఆవులు, గేదెల షెడ్ల యజమానులు అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకోవాలని, మత్తు పదార్థాలకు తావిస్తే షెడ్ల యజమానులపై కఠినచర్యలు చేపడతామని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి షెడ్ల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో పాటించాల్సిన నిబంధనల గురించి తెలియజేశారు.

పిల్లల తప్పులకు పెద్దలదే బాధ్యత

మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనుక్

పొన్నలూరు, న్యూస్‌టుడే: పిల్లలు చేసే ప్రతి తప్పునకు పెద్దలే బాధ్యత వహించాలని ఎస్సై అనుక్ తెలిపారు. సోమవారం పొన్నలూరు స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో హెల్మెట్, వాహన పత్రాలు లేకుండా ఎక్కువగా మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు.

మురుగు కూపం... వెలగని దీపం

● బీకేపాడులో సమస్యలు తిష్ట

కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

న్యూస్‌టుడే, తాళ్లూరు

తాళ్లూరు మండలంలో శివారు ప్రాంతం బొద్దికూరపాడు గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలతో ఆ ప్రాంత ప్రజలు పలు విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి సమస్యలు గురించి పలు సందర్భాల్లో అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకు వచ్చినా అదిగో, ఇదిగో చేస్తామని చెబుతున్నా పరిష్కరించడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు పది నెలల నుంచి హరిత రాయబారులకు వేతనాలు అందజేయక పోవడంతో వారు విధులకు రావడం మానేశారు. ఫలితంగా గ్రామంలోని పలు వీధుల్లో చెత్తా, చెదారాలు పేరుకుపోయి అధ్వాన పరిస్థితులు నెలకొంటున్నాయి.

సిమెంటు బల్లలు వేయించక పోవడంతో..

మసీదు బజారులోని మురుగునీటి కాలువ దుస్థితికి చేరింది. దానిపై ఏర్పాటు చేసిన రాళ్లు కూడా పగిలి పోయాయి. రాత్రివేళ రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ సిమెంటు కాంక్రీటు బల్లలు వేయించి సమస్య పరిష్కరించాలని పలువురు ప్రజలు విన్నవిస్తున్నారు. దేవుళ్ల ఊరేగింపు నిర్వహించే బజారు వద్ద కాలువల్లేక పోవడంతో మురుగునీరంతా ఆప్రాంతంలో నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ◗ వీరభద్రస్వామి ఆలయం ఎదురువైపున విద్యుత్తు పరివర్తకంవైపున్న రహదారి పూర్తిగా బురదమయంగా తయారైంది.

రామాలయం బజారు నుంచి..

ప్రధాన వీధిలో ఉన్న రామాలయం బజారు నుంచి పోలంరెడ్డి వారి బజారుకు వెళ్లే రహదారిలోని బోరింగు, మసీదువద్ద ఉన్న బోరింగులు పని చేయక పోవడంతో ఇబ్బందులు అధికమయ్యాయి. వీధి దీపాలు కూడా ఆ ప్రాంతంలో వెలగడం అంతంతమాత్రమే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆగ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీఓ దారా హనుమంతరావును వివరణ కోరగా వెంటనే అక్కడి సమస్యలపై విచారించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.



(c) eenadu

ఒంగోలు
• ఒంగోలు • సంతనూతలపాడు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సభలో ప్రసంగిస్తున్న మంత్రి స్వామి, వేదికపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: అయిదేళ్ల పాలనలో వైకాపా విధ్వంసం సృష్టిస్తే... గత ఏడాదిగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. చీమకుర్తి పట్టణం రామ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు... ఇంటింటికీ తెదేపా' కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ముసి వాగుకు సాగర్ జలాలు మళ్లించేలా తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం వద్ద రూ.20 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ... అయిదేళ్లుగా నిలిచిపోయిన చీమకుర్తి సమగ్ర మంచి నీటి పథకం పనులు రూ.73 కోట్లతో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు రూ.2.50 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కందిమళ్ల గంగాధరరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, క్లస్టర్ బాధ్యుడు రమణయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమయ్య, సుబ్బారావు, రామబ్రహ్మం, రమాదేవి కోటేశ్వరరావు, అంజని, రాంబాబు, శేషారావు, జి.పార్వతి, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు. మంత్రి స్వామికి పలు సమస్యలపై స్థానికులు అర్జీలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరంలోని 28, 29వ డివిజన్లలో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలన' కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాదిగా ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరు, పారిశుద్ధ్య సమస్యలను పలువురు తెలియజేయగా... పరిష్కారానికి హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు యక్కల తులసీరావు, పి.వెంకటేశ్వరరెడ్డి, తూము సుబ్బారావు, కొల్లిపల్లి సురేష్, తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్ల ఎంపిక

మద్దిపాడు, న్యూస్‌టుడే: నందిపాడు, పెద కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌లుగా మద్దిపాడు మాజీ సర్పంచి ఉప్పుగుండూరి నాగేశ్వరావు, ఏడుగుండ్లపాడు మాజీ సర్పంచి మండవ హరిప్రసాద్ ఎంపికయ్యారు. నందిపాడు సొసైటీ సభ్యులుగా అన్నంగికి చెందిన బోడపాటి సుబ్బారావు, బసవన్నపాలేనికి చెందిన తుమ్మల వీరాంజనేయులు, పెద కొత్తపల్లి సభ్యులుగా నల్లూరి సంజీవరావు, సన్నపురెడ్డి రమేష్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

23న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు స్థాయీ సంఘాల సమావేశాన్ని జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 23న నిర్వహించనున్నట్లు సీఈవో చిరంజీవి తెలిపారు. జిల్లా అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

దారుల విస్తరణ.. నగర సుందరీకరణ

• కీలక మార్గాల అభివృద్ధికి కార్యాచరణ

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

మంగమూరు రోడ్డు

జనాభా విస్తృతి, వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో ఒంగోలు నగరంలోని కీలక రహదారులను విస్తరించేందుకు నిర్ణయించారు. అందుకు అవసరమైన కార్యాచరణ సైతం సిద్ధమైంది. తాజాగా మంగమూరు రోడ్డును సైతం అభివృద్ధి చేయాలని నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించారు.

■ **ఇదీ ప్రణాళిక... :** మంగమూరు రోడ్డులో షాపింగ్ మాళ్లు, విద్యాసంస్థలు, బహుళ అంతస్తుల సముదాయాలు పెరగడంతో ట్రాఫిక్ పెరిగి... తరచూ ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ మార్గాన్ని విస్తరించాలని నిర్ణయించారు. ప్రధాన కూడలి నుంచి ఒంగోలు పబ్లిక్ స్కూలు వరకు 80 అడుగులు... అక్కడ నుంచి ఆశ్రమం దాటి నగర హద్దు వరకు వంద అడుగులు ఉండేలా పనులు చేపట్టనున్నారు. ఆ మేరకు త్వరలో మార్కింగ్ ఇవ్వనున్నారు. ట్రంకు రోడ్డును వంద అడుగులకు విస్తరించేందుకు ఇప్పటికే మార్కింగ్ ఇచ్చారు. ఈ విషయమై అక్కడి వ్యాపారులతో రెండుసార్లు చర్చలు నిర్వహించారు. ఓ వ్యాపారి అభ్యంతరం తెలియజేస్తూ కోర్టును ఆశ్రయించినప్పటికీ కార్పొరేషన్‌కు అనుకూలంగానే ఉత్తర్వులొచ్చాయి. త్వరలో మరోసారి చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయంతో పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. కొత్తపట్నం బస్టాండ్ రోడ్డును మస్తాన్ దర్గా నుంచి విస్తరించాలని ప్రతిపాదించారు.

పచ్చదనం పెంపునకు చర్యలు...

నగరంలోని ప్రధాన మార్గాల వెంబడి పూల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అధికారులు... ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో చర్చించారు. ట్రంకు రోడ్డు, కర్నూలు రోడ్డు, గుంటూరు రోడ్డు, కొప్పోలు రోడ్డు, పాత బైపాస్, మంగమూరు రోడ్డులోని డివైడర్లపై మొక్కలు నాటి... వాటి సంరక్షణ బాధ్యతను కళాశాలలకు అప్పగించనున్నారు. విద్యార్థులతోనే మొక్కలు నాటించి వారి పేరిటే ట్యాగ్ వేసేలా చర్యలు తీసుకోనున్నారు. మరో రెండు నెలల్లో ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

ప్రకృతి సాగు విధానాలతో మేలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: రైతులంతా ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించేలా సిబ్బంది కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి పేర్కొన్నారు. కొత్తపట్నంలో సోమవారం నిర్వహించిన ఆరు గ్రామ సంఘాల వార్షిక ప్రణాళికల తయారీ సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ విధానంలో మన ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సేద్యం ఖర్చు తగ్గుతుందని వివరించారు. కిచెన్ గార్డెన్ ఆవశ్యకతను తెలియజేశారు. సిబ్బంది నరసింహులు, రెడ్డప్ప, ప్రవీణ్, సురేష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ రాధాదేవి పేర్కొన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని సోమవారం సందర్శించారు. పోషక విలువలు ఎక్కువగా ఉండే బెల్లం, వేరుశనగ, కొబ్బరి వంటి పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మండల కార్యదర్శి ఎన్.మాలతి, శిక్షకురాలు సీహెచ్ అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ ఛైర్లు అందజేత

బాలాజీనగర్ పాఠశాల విద్యార్థులతో ఫ్యామిలీ క్లబ్ సభ్యులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బాలాజీనగర్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు ఫ్యామిలీ క్లబ్ సభ్యులు స్టడీ ఛైర్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని బంకా లక్ష్మీప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం 34 మందికి రూ.30 వేలు విలువ చేసే కుర్చీలు పంపిణీ చేశారు. పాఠశాలకు శాశ్వత దాతలుగా ఉండేందుకు ముందుకొచ్చారు. క్లబ్ అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు ప్రతి సంవత్సరం పది పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.10,116, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి కార్పొరేటర్ నాగభూషణం రూ.5,116, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి ఆర్‌ఎస్ ఫ్యాషన్స్ అధినేత శ్రీనివాసరావు రూ.2,116 అందజేస్తామని ప్రకటించారు. సభ్యులు కూనంశెట్టి చక్రవర్తి, సీహెచ్ సురేష్, తాతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలతో ఫిర్యాదులా!

• వైకాపా తీరుపై తెదేపా నాయకుల ధ్వజం

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా కార్పొరేటర్లు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పాత మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వైకాపా కార్పొరేటర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడాన్ని తెదేపా నాయకులు ఖండించారు. మేయర్ ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, తెదేపా కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, గిరిజాశంకర్ శాండిల్య, అంబూరి శ్రీనివాస్, చింతపల్లి గోపి, టి.రవితేజ మాట్లాడారు. నిబంధనలకు లోబడి తాత్కాలిక నిర్మాణాలకు పాత మార్కెట్‌లో ఓ వ్యక్తికి అనుమతులు ఇచ్చారని... గతంలోనే వాటిని రద్దు చేశామని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ఆరోపణలతో బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించేది కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. నగరాన్ని అత్యున్నతంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కృషి చేస్తున్నారని తెలిపారు. రహదారుల నిర్మాణం, విస్తరణ, రోజూ నీరిచ్చేందుకు చేస్తున్న పనులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి

సుబ్బారావును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బొగ్గవరపు సుబ్బారావు తెలిపారు. ఆర్యవైశ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అంతా కలసికట్టుగా సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు... సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి నూతన అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు పల్లపోతు వెంకటేశ్వరరావు, కోట హనుమంతరావు, శిద్దా పాండురంగారావు, జి.భాస్కరరావు, ఎం.నాగేశ్వరరావు, కూరపాటి సత్యనారాయణ, మోదుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆయనను ఘనంగా సత్కరించారు.

రైతులతో మాట్లాడుతున్న జేడీఏ జగత్ శ్రీనివాసరావు

గ్రాసం పెంపకంతో పోషకులకు ప్రయోజనం

మద్దిపాడు, న్యూస్‌టుడే: పశుగ్రాసం పెంపకంతో మంచి లాభాలు ఆర్జించవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు జగత్ శ్రీనివాసరావు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల ముగింపు సందర్భంగా కొలచనకోటలో సోమవారం నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏక, బహు వార్షిక గ్రాసం సాగు, ప్రయోజనాలను వివరించారు. గ్రామంలోని పశు క్షేత్రాలను సందర్శించారు. ఏడీఏ కిషోర్‌కుమార్, హర్ష్య శ్రీ, సిబ్బంది పాల్గొన్నారు. * మల్లవరంలో ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకా శిబిరం నిర్వహించి... అక్కడి గోశాలలోని ఆవులకు జేడీఏ ఆధ్వర్యంలో టీకాలు వేశారు.

గ్రాప్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో రామనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. భాను, స్నేహ, జ్యోత్స్న, నివానిక, సారిక, హోసన్న ప్రతిభ చూపి రెండు బంగారు, నాలుగు రజత పతకాలు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు శర్మ, ప్రైమరీ హెచ్‌ఎం కె.ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యతోనే గౌరవప్రదమైన జీవితం

మద్దిపాడు, న్యూస్‌టుడే: చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి పంచాయతీ నర్సాయపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఎంసీ ఛైర్మన్ హనమంతరావు అధ్యక్షతన విద్యా సామగ్రి, రాతపుస్తకాలు, అట్టలు, జామెట్రీ బాక్సులు అందజేశారు. కమ్యూనిజం పత్రిక మాజీ సంపాదకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతోనే గౌరవప్రదమైన జీవితం లభిస్తుందన్నారు. లింగంగుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముచ్చు రామారావు, స్థానిక హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరావు, ఎం.శోభారాణి, ప్రజానాట్యమండలి గాయకుడు అంజయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఒంగోలు కర్నూల్ రోడ్డు : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: ఒంగోలు కర్నూలు రోడ్డు: సుజాతనగర్ పదో లైన్‌లో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి అటుగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – సుబ్బారావు, స్థానికుడు

✓: వెంటనే సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. – వెంకటేశ్వరరావు, నగర పాలక సంస్థ కమిషనర్

?: ఒంగోలు అర్బన్: పేర్నమిట్ట కమ్మపాలెం సమీపంలో ఇంటింటి చెత్త సేకరించక రహదారిపై పారబోస్తున్నారు.
– వెంకటేశ్వర్లు, గ్రామస్థుడు

✓: అక్కడి వ్యర్థాలు తొలగించి... ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూస్తాం.
– షేక్ బాబ్జి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

తొలగిన వ్యర్థాలు



ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: ఒంగోలు - కొత్తపట్నం రహదారిలో ఇందిరమ్మ కాలనీ సమీపంలో వ్యర్థాలను కుప్పగా పోసి వదిలేశారు. కుక్కలు, పశువులు అక్కడ చేరి చెల్లాచెదురు చేస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్న విషయం... 'చెత్తతో చిక్కులు' శీర్షికన ఈ నెల 11న 'ఈనాడు'లో ప్రచురితమైంది. అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

వెలిగిన వీధి దీపాలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: బీరంగుంటలో రెండు నెలలుగా వీధి దీపాలు వెలగక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న విషయం... ఈ నెల 9న 'ఈనాడు - మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. అధికారులు స్పందించి దీపాలకు మరమ్మతులు చేశారు.

ఇదీ ప్రజలపై చిత్తశుద్ధి!

నిరుపయోగంగా ఉన్న సీపీడబ్ల్యూఎస్ మైక్రో ఫిల్టర్ బెడ్

రక్షిత పథకాల నిర్వహణ సరిగా లేక ఆ పరిధిలోని గ్రామాలకు తాగు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పలు ప్రాంతాలకు శుద్ధి చేయని జలాలే అందుతున్నాయి. సంతనూతలపాడు చిన్న చెరువులో పుష్కలంగా నీరున్నా... ఇక్కడి సీపీడబ్ల్యూ పథకం మైక్రో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు గురవ్వడంతో శుద్ధి చేయని జలాలే సరఫరా చేస్తున్నారు. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని తాగు నీటి పథకానిదీ ఇదే తీరు. ఇక్కడి మోటార్లు తరచూ మొరాయిస్తుండడంతో అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, కనపర్తి, చీర్వానుప్పలపాడు తదితర గ్రామాలకు సరిగా నీరందడం లేదు. మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు, దొడ్డవరం, తెల్లబాడు గ్రామాల్లోనూ సమస్య ఉంది. యంత్రాంగం దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, సంతనూతలపాడు

దారంతా మురుగు.. పడేదెలా అడుగు

ఒంగోలు నగరం భాగ్యనగర్ రెండో లైన్‌లో పరిస్థితి ఇది. వ్యర్థాలతో కాలువ పూడిపోయి మురుగంతా రోడ్డు పైకి చేరుతోంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా మురుగంతా రహదారిపైనే నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. కాలువ బాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

కలెక్టరేట్ వద్ద ఆందోళనలు

మూగ జీవాలపై హింసను ఖండిస్తూ నిరసన

నిరుద్యోగ భృతి అమలుకు డిమాండ్ : ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్, నాయకులు కరుణానిధి, రాంబాబు, గోపి, మత్తయ్య, శ్యాంబాబు, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మూగ జీవాల సంరక్షకులపై దాడి తగదు: ఒంగోలు కలెక్టరేట్: మూగ జీవాల సంరక్షకులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పీపుల్స్ ఫర్ యానిమల్స్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. కమిటీ సభ్యుడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. భాగ్యనగర్ నాలుగో లైన్‌లో కుక్కలకు అన్నం పెడుతున్నారన్న కారణంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడి చేయడాన్ని ఖండించారు. సంఘం నాయకులు రాకేష్, వాసు, చక్రవర్తి, రవి, రమేష్ పాల్గొన్నారు.

సీఐపై చర్యలు కోరుతూ... : ఒంగోలు కలెక్టరేట్: చీమకుర్తి సీఐ సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలంటూ ప్రకాశం జిల్లా పర్యావరణ విముక్తి కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. గ్రానైట్, లిక్కర్ మాఫియాకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. కాట్రగడ్డ రఘుపతి ఆధ్వర్యంలో జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

మార్కెట్‌లో నిర్మాణాలపై ఫిర్యాదు : ఒంగోలు గ్రామీణం,: పాత కూరగాయల మార్కెట్ ఆవరణలో తాత్కాలిక అనుమతులు తీసుకుని శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపిస్తూ పలువురు వైకాపా కార్పొరేటర్లు జేసీ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు.

మున్సిపల్ కార్మికుల నిరసన : చీమకుర్తి, న్యూస్‌టుడే: సమ్మెకాలం ఒప్పందాలు అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్తు చౌర్యం... రూ.15 లక్షల జరిమానా

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి సెక్షన్ పరిధిలో విద్యుత్తు విజిలెన్స్ బృందాలు సోమవారం తనిఖీలు నిర్వహించాయి. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి... మొత్తంగా రూ.15.50 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఈఈ మాకినేని హరిబాబు తెలిపారు. అధికారులు, సిబ్బంది 45 బృందాలుగా ఏర్పాటై తనిఖీలు చేపట్టారు. వివిధ రూపాల్లో అతిక్రమణలకు పాల్పడుతున్న వారిపై 326 కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఈఈ హైమావతి, డీఈఈలు మోహన్‌రావు, పాండురంగారావు, కె.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కె.కోటయ్య, బి.కోటేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో ఉచిత వైద్య శిబిరం

సంతనూతలపాడు: ఉపాస్, గాయత్రి వైద్యశాలల సహకారంతో గంగవరంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ తానిపర్తి మదన్ తెలిపారు. వివిధ విభాగాల వైద్యనిపుణులు సేవలందిస్తారని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరాన్ని విద్యార్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్గదర్శకుల కోసం అన్వేషణ

• ఒంగోలు, ఎస్.ఎన్.పాడులో 19,114 బంగారు కుటుంబాల గుర్తింపు

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) అమల్లో భాగంగా అన్ని పురపాలక, గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి మార్చి 5 వరకు సచివాలయ ఉద్యోగులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ వివరాల ఆధారంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించారు. వీరి జీవన ప్రమాణాల మెరుగుకు అండగా నిలిచేలా ఆర్థికంగా బాగున్న కుటుంబాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.

గ్రామ సభల్లో పునఃపరిశీలన...

పీ-4 సర్వే ఆధారంగా జిల్లాలో ఎనిమిది శాతం కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వీటిలో ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని ఆరు మండలాల్లో మొత్తం 19,114 కుటుంబాలు ఉన్నాయి. ఈ వివరాలను సచివాలయాలకు పంపి... గ్రామసభల ద్వారా పునఃపరిశీలన చేశారు. వీరికి 'బంగారు కుటుంబం'గా నామకరణం చేశారు. వీరికి ఆర్థిక, ఉపాధి తదితర రంగాల్లో సహకారం అందించేలా ఆర్థికంగా బాగున్న కుటుంబాలను గుర్తిస్తున్నారు. వీరికి 'మార్గదర్శి'గా పేరు పెట్టారు. ఆగస్టు 15 నుంచి పీ-4 కార్యక్రమం అమలు చేయనున్న నేపథ్యంలో ఈలోగా మొత్తం ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండలం	కుటుంబాలు
ఒంగోలు	8,560
చీమకుర్తి	2,777
కొత్తపట్నం	2,192
మద్దిపాడు	1,836
నాగులుప్పలపాడు	2,386
సంతనూతలపాడు	1,363


ఒంగోలు మండలం ఉలిచిలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అద్దెలు చెల్లించని దుకాణాల జప్తు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో దీర్ఘకాలంగా అద్దెలు చెల్లించని దుకాణాలను కార్పొరేషన్ సిబ్బంది జప్తు చేశారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి సిబ్బందితో వెళ్లి బకాయిలు అధికంగా ఉన్న పది దుకాణాలను సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు. ఒక్కో దుకాణదారు రూ.7 లక్షలు నుంచి రూ.11 లక్షల వరకు బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో ముగ్గురు కొంత జమ చేయడంతో వారికి మరికొంత సమయం ఇచ్చి దుకాణాలు అనుమతించారు. రెవెన్యూ అధికారి విజయ్‌భాస్కర్, ఆర్ఐలు కల్యాణి, శ్రీనివాసులు, క్రాంతి, నిరూప్ పాల్గొన్నారు.



(c) eenadu

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం జులై 15, 2025

విజేతలతో వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, ఏడీఏ సుమలత.. చెస్ ఆడటంలో నిమగ్నమైన ఉద్యోగులు

క్రీడలతో ఒత్తిడి దూరం

ఉత్సాహంగా 'ఈనాడు ఛాంపియన్ చెస్' పోటీలు

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్): విధి నిర్వహణలో ఉద్యోగులపై ఒత్తిడి ఉంటుందని.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా దాన్ని అధిగమించొచ్చని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి అన్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో 'ఈనాడు ఛాంపియన్ చెస్' పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ఉద్యోగులు చక్కటి ప్రతిభ కనబరిచారు. విజేతలుగా నిలిచిన జేడీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించాలనే ఆలోచన చేసి.. శ్రీకారం చుట్టిన 'ఈనాడు' యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

విజేతలు వీరే...

మహిళా విభాగంలో టైపిస్టు జి.సుధీష్ణ(కొడవలూరు మండలం రాజుపాలెం) ప్రథమ, బి.శ్రావణి(వ్యవసాయ విస్తరణాధికారి ఇందుకూరుపేట) ద్వితీయ స్థానంలో నిలవగా- పురుషుల విభాగంలో బి.శ్రీనివాస చక్రవర్తి(వ్యవసాయ అధికారి, నెల్లూరు), ఎం.ప్రసన్నకుమార్ రెడ్డి (గ్రామ వ్యవసాయ సహాయకులు, తాళ్లపూడి రైతు సేవా కేంద్రం) వరుస స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ స్వర్ణ, ఏడీఏలు సుమలత, నర్సోజీరావు తదితరులు పాల్గొన్నారు. ఆర్బిటర్లుగా అబ్దుల్ అజీజ్, బషీర్, విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవహరించారు.

ఆత్మవిశ్వాసంతో విజయం

మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన సుధీష్ణకు పుట్టుకతోనే కంటిచూపు లేదు. అయినా ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. డిగ్రీ వరకు చదువుకున్న ఈమె.. 2019లో వ్యవసాయశాఖలో ఉద్యోగం సాధించారు. ప్రాథమిక విద్యాభ్యాసం సమయంలో చెస్ నేర్చుకున్నారు. ఎక్కడ పోటీలు జరిగినా.. పాల్గొంటూ బహుమతులు సొంతం చేసుకుంటున్నారు.

ఏపీఎల్‌కు కావలి యువకుడి ఎంపిక

కావలి, న్యూస్‌టుడే: ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) పోటీల్లో పాల్గొనేందుకు కావలి క్రికెటర్ భార్గవ్ ఎంపికయ్యాడు. ఇతడిని కాకినాడ కింగ్స్ జట్టు కొనుగోలు చేసింది. గత ఏడాది అండర్ 19 అంతర్ రాష్ట్ర పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ఆడి ప్రతిభ చాటాడు. కావలి క్రికెట్ సంఘం (కేసీఏ) ప్రతినిధి సిద్ధు, కోచ్ రాజశేఖర్ భార్గవ్‌ను అభినందించారు.

రైతేరాజు
నానో యూరియా.. రైతుకు మేలు ...6

అయ్యా.. నేను బతికే ఉన్నా!

ఇన్‌ఛార్జి ఏడీఏ శేషారెడ్డిని వివరాలు కోరుతున్న రైతు శివరామయ్య

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: 'అయ్యా నేను బతికే ఉన్నా.. నాకు అన్నదాత- సుఖీభవ పథకం సాయం అందేలా చూడండి' అంటూ వలేటివారిపాలెం మండలం శామీర్‌పాలేనికి చెందిన రైతు గంగాడి శివరామయ్య వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈయన పేరు అర్హుల జాబితాలో లేదు. కారణం ఏమిటా అని పరిశీలిస్తే.. చనిపోయినట్లు నమోదు చేసి అనర్హుడిగా చూపించారు. సోమవారం సచివాలయానికి వెళితే వీఏఏ లేరు. దాంతో మండల కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఏవోగా ఉన్న శేషారెడ్డి అదనపు బాధ్యతలతో ఏడీఏగా కందుకూరులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే కందుకూరు వెళ్లి ఆయనకు విషయం తెలిపారు. పరిశీలించిన అధికారులు 'నువ్వు మృతి చెందినట్లు సీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైందని, సచివాలయానికి వెళ్లి సరిచేయించుకోవాలని సూచించగా.. మళ్లీ అక్కడికే వెళ్లాల్సి వచ్చింది.

అర్జీ.. ఆవేదనతో సరి!

పరిష్కరించకుండానే మూసేస్తున్నారంటూ ఆందోళన

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, న్యూస్‌టుడే: కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్య.. సమస్యగానే మిగిలిపోతోంది తప్ప.. పరిష్కారం కావడం లేదన్న ఆవేదన కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీదారుల నుంచి వ్యక్తమవుతోంది. 'సమస్యలను వేగవంతంగా.. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించినా.. పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. హేతుబద్ధంగా లేక పరిష్కరించలేని పక్షంలో సంబంధిత అధికారుల ద్వారా వివరించే ప్రయత్నమూ చేయకపోవడం అర్జీదారుల ఆవేదనను రెట్టింపు చేస్తోంది.

తిరిగి.. తిరిగి.. అక్కడికే

మండల కేంద్రాల్లోనూ కార్యక్రమం జరుగుతున్నా.. సక్రమంగా పట్టించుకోకపోవడం.. సేవల్లో జాప్యం తదితరాలతో ప్రజలు కలెక్టరేట్ బాట పడుతున్నారు. ఇక్కడ అర్జీల స్వీకరణకు జిల్లా స్థాయి అధికారులే ఉన్నా.. కలెక్టర్‌ను కలిసేందుకే ఆసక్తి చూపుతున్నారు. ప్రతి సోమవారం సగటున 350 అర్జీలు వస్తుండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 500 దాటుతోంది. గత ఏడాది జూన్ 15వ తేదీ నుంచి 45,351 అర్జీలు రాగా.. వాటిలో 41,809 పరిశీలించినట్లు, 3,542 పరిశీలన దశలో ఉన్నట్లు చెబుతున్నారు. వచ్చిన వారే.. పదేపదే వినతులతో వస్తుండటం.. సమాధానాలు ఇచ్చిన ఫిర్యాదుల్లో 20 శాతం వరకు అధికారులే తిరిగి తెరుస్తుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

వివరాలివీ!

శాఖ	వచ్చిన అర్జీలు	పరిష్కారం	చేయాల్సినవి
రెవెన్యూ	19,608	17,262	2,346
సర్వే	10,055	9,690	365
పోలీసు	3,931	3,775	156
పంచాయతీరాజ్	2,256	2,017	149
పురపాలకశాఖ	2,164	2,089	75
సివిల్ సప్లయిస్	1,013	992	21
హౌసింగ్	745	740	5
విద్యుత్తు	466	426	40
సాగునీటిశాఖ	440	393	47

'1100'కు ఫిర్యాదు చేయొచ్చు

20 శాతానికే సంతృప్తికర పరిష్కారాలు చూపుతూ.. 50 శాతానికి పైగా అరకొర సమాధానాలతో సరిపెడుతూ.. మరో 30 శాతం పరిష్కారం వైపే దృష్టిసారించడం లేదనే అపవాదు ఉంది. కొన్ని సందర్భాల్లో అర్జీదారులకు తెలియకుండానే.. పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం '1100' టోల్‌ఫ్రీ నంబరుకు అవకాశం కల్పించింది. దీని ద్వారా తామిచ్చిన అర్జీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులను చెప్పుకొనే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 873 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

మరో కేసులో... కాకాణికి జులై 28 వరకు రిమాండ్

ఈనాడు, నెల్లూరు: ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం నిల్వ చేసిన కేసులో నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తిరుపతి జిల్లా గూడూరు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఎన్నికల సమయంలో పొదలకూరు మండలం విరువూరు సమీపంలో అక్రమంగా ఉంచిన మద్యం నిల్వలను సెబ్ అధికారులు పట్టుకున్నారు. దానిపై అదే రోజు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అధికార పార్టీ మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రోద్బలంతోనే అది జరిగిందన్న అభియోగాలపై కేసులో ఏ9గా ఆయన్ను చేర్చారు. ఈ కేసులో పొదలకూరు ఎక్సైజ్ అధికారులు పీటీ వారెంట్ ద్వారా గూడూరులోని ఒకటో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి సులోచనరాణి ఈ నెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించారు. నిందితుడిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఇప్పటికే పలు కేసుల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి అదే జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

భూసేకరణకు.. ప్రత్యేక యూనిట్లు!

భూముల మ్యాప్‌లు పరిశీలిస్తున్న అధికారులు (పాతచిత్రం)

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: రామాయపట్నం ఓడరేవు అనుబంధ పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేక కలెక్టర్‌తో ఒక యూనిట్, అయిదుగురు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లతో అయిదు యూనిట్లు ఏర్పాటు చేస్తూ పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకంగా నియమితులైన ఈ యూనిట్లు(బృందాలు) రైతులకు అవగాహన కల్పించడం.. గ్రామసభలు నిర్వహించడం.. రెవెన్యూ దస్త్రాల పరిశీలన తదితరాలు చేసి.. ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూస్తాయి.

55 మంది.. రెండేళ్ల కాలపరిమితి

మొదటి యూనిట్‌కు ఒక ప్రత్యేక కలెక్టర్(ఎస్‌జీడీసీ), తహసీల్దారు, ఇద్దరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయరు, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు ఉంటారు. మిగిలిన అయిదు యూనిట్లకు అయిదుగురు డిప్యూటీ కలెక్టర్లు, అయిదుగురు డీటీలు, అయిదుగురు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, పది మంది గ్రామ సర్వేయర్లు ఉంటారు. మొత్తంగా ఆరు యూనిట్లకు 55 మందిని నియమించారు. రెండేళ్ల కాలపరిమితితో సేవలందిస్తారు. ఈ 55 మందిని జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి నియమించే అవకాశం ఉంది. ఈ యూనిట్లకు అయ్యే ఖర్చును భూసేకరణ కోసం వచ్చిన డిపాజిట్ల నుంచి సేకరించనున్నారు.

20వేల ఎకరాల సేకరణ

రామాయపట్నం ఓడరేవుకు.. అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే బీపీసీఎల్, ఇండోసోల్ వంటి భారీ పరిశ్రమల నిమిత్తం ఆయా కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. వీటి కోసం గుడ్లూరు మండలం రావూరు, చేవూరు గ్రామాలతో పాటు కావలి నియోజకవర్గం పరిధిలోని అనెమడుగు, చెన్నాయిపాలెం ప్రాంతాల్లో భూములు సేకరించేలా నోటిఫికేషన్లు జారీ చేశారు. ఇండోసోల్ పరిశ్రమకు 8,300 ఎకరాలు అవసరమని గుర్తించి.. ఇటీవల ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో 4,500 ఎకరాల భూసేకరణకు ప్రకటన ఇచ్చారు. ఈ రెండింటితో పాటు మరికొన్నింటిని నెలకొల్పేందుకు మొత్తం 20 వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భూసేకరణ వేగవంతానికి ఆరు ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసింది.

త్వరలోనే నియామకం..

భూసేకరణ వేగవంతానికే 6 ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. త్వరలోనే కొందరు అధికారులు, సిబ్బందిని సంబంధిత యూనిట్లలో నియమిస్తారు. – టి.శ్రీపూజ, సబ్‌కలెక్టర్, కందుకూరు

కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు, రైతులు

ఇండోసోల్ అనుమతులు రద్దు చేయాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కరేడు గ్రామసభ ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవించి ఇండోసోల్ కంపెనీకి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక, రైతు కూలీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏడాదిలో మూడు పంటలు పండే భూములను ఇచ్చేది లేదని రైతులు ఆందోళన చేస్తుంటే.. ప్రభుత్వం పెడచెవిన పెట్టడం దుర్మార్గమన్నారు. సీపీఐ కార్యదర్శి బి.సురేష్, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.ఎ.గౌస్‌బాషా తదితరులు మాట్లాడారు. సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం ఉలవపాడు కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్, నాయకులు పి.మాలకొండయ్య, జాన్, ఆర్.మోహన్, కె.నాంచార్లు, రాజేశేఖర్, పాలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయానికి ఉషాస్సు!

పూర్తి కావస్తున్న పరీక్షా భవన్

వెంకటాచలం, న్యూస్‌టుడే: ఏటా పెరుగుతున్న కోర్సులు, పరిశోధనలు, విద్యార్థుల సంఖ్య.. వెరసి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో వసతుల అవసరాలు అధికం కాగా- ఆయా సమస్యల నుంచి ఉపశమనం కలిగించేలా ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. దాంతో వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

కేటాయింపులు ఇలా..

విశ్వవిద్యాలయంలో వసతుల ఏర్పాటుకు పీఎం ఉషా(ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) కింద రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో విద్యార్థినుల వసతిగృహానికి రూ. పది కోట్లు, ఆన్‌లైన్ పరీక్షా కేంద్రానికి రూ. 2.76 కోట్లు, ల్యాబ్ పరికరాలకు రూ. 2.24 కోట్లు, సెమినార్ హాల్, అకడమిక్ భవనాల మెరుగుదలకు రూ. 2 కోట్లు కేటాయించారు. విద్యార్థులు, ఆచార్యులు, బోధనేతర సిబ్బందికి సెమినార్లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు రూ. 3 కోట్లు కేటాయించాలని నిర్ణయించారు.

రూ. 9.30 కోట్లతో పరీక్షా భవన్

వీఎస్‌యూలో పరీక్షా కేంద్రానికి సరైన భవనం లేక.. తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో ప్రాంగణంలో రూ. 9.30 కోట్లతో ప్రత్యేకంగా ఓ భవన నిర్మాణం చేపట్టారు. పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఈ నెల చివరికల్లా అందుబాటులోకి రానుంది. వీటితో పాటు రూ. 16.38 కోట్లతో చేపట్టిన పరిపాలనా భవనం, గ్రంథాలయం, తరగతుల నిర్వహణకు అవసరమైన మూడు బ్లాక్‌లతో పాటు సెమినార్ హాల్ నిర్మాణాలు ఇటీవల పూర్తయి.. వినియోగంలోకి వచ్చాయి. పీఎం ఉషా నిధుల్లో రూ. పదికోట్లు కేటాయించిన నేపథ్యంలో విద్యార్థినులకు వసతి సమస్య తీరుందని హర్షం వ్యక్తమవుతోంది.

త్వరలో పనులు ప్రారంభం

విశ్వవిద్యాలయంలో అదనపు భవన నిర్మాణాలు, వసతుల కల్పనకు ప్రణాళికలు పంపగా.. పీఎం ఉషా పథకం కింద రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో నిర్దేశిత పనులు ప్రారంభమవుతాయి. వసతులు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. – ఆచార్య సునీత, రిజిస్ట్రార్

స్నేహితులే హంతకులు

హేళన చేస్తున్నాడని.. అంతమొందించారు

నెల్లూరు(నేర విభాగం), పొదలకూరు, న్యూస్‌టుడే: కారు అద్దెకు తీసుకుని నగదు ఇవ్వకపోగా.. వ్యక్తిగత అంశాలతో హేళన చేస్తున్నాడని కక్ష పెంచుకుని స్నేహితుడినే అంతమొందించిన దుర్ఘటన పెన్నానది సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు గ్రామీణ మండలం యలమవారి దిన్నె ప్రాంతానికి చెందిన కాయల మోహన్‌చందు(21).. స్నేహితుడైన తరుణ్‌కుమార్‌రెడ్డి కారును రోజూ అద్దెకు తీసుకుంటూ ఉంటారు. ఆ క్రమంలో రోజుకు రూ. 2వేల చొప్పున నెలకు రూ. 60వేలు, గతంలో తీసుకున్న రూ. 62వేల నగదు.. మొత్తం రూ. 1.22 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడం లేదు. తరుణ్‌కుమార్‌రెడ్డికి వివాహం కాగా.. భార్య విడిగా ఉంటున్నారు. చందు నిత్యం ఫోన్‌లో అమ్మాయిలతో వీడియో కాల్ మాట్లాడుతుండటాన్ని గమనించిన తరుణ్‌కుమార్‌రెడ్డి.. ఆ విషయమై ప్రశ్నించగా.. చందు అతడి వైవాహిక విషయాలను ప్రస్తావిస్తూ.. చులకనగా మాట్లాడేవాడు. దాంతో అతడిపై కక్ష పెంచుకున్న తరుణ్‌కుమార్‌రెడ్డి.. చందును అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. తనకు ఇవ్వాల్సిన నగదు ఇచ్చేయాలని, లేదంటే అద్దె కార్లు తీసుకువస్తే వాటి విడిభాగాలు విక్రయిస్తే నగదు వస్తాయని నమ్మబలికాడు. దాంతో చందు నగరంలో ఉన్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన రెండు కార్లను తీసుకుని.. ఈ నెల 5న విరువూరు పెన్నానది వద్దకు వెళ్లాడు. అప్పటికే తరుణ్‌కుమార్‌రెడ్డి తన బంధువులు, స్నేహితులైన సోమశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు, శ్రీధర్‌ను తీసుకుని అక్కడికి వెళ్లాడు. అక్కడే రాత్రి వరకు ఉన్నారు. ఆ సమయంలో కూడా అమ్మాయితో వీడియో కాల్ మాట్లాడుతూ తరుణ్‌కుమార్‌రెడ్డిని హేళనగా మాట్లాడుతుండగా.. కారులో తెచ్చుకున్న ఇనుప రాడ్డు, కత్తితో చందును చంపేశారు. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడే పూడ్చి పరారయ్యారు. సోదరుడు ఇంటికి రావడం లేదని హతుడి అన్న నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి స్నేహితులపైనే అనుమానం ఉందని చెప్పారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. విషయం వెలుగులోకి వచ్చింది. అదృశ్యం కేసును హత్య కేసుగా మార్చినట్లు నెల్లూరు గ్రామీణ ఇన్‌స్పెక్టర్ జి.వేణు తెలిపారు.

ధాన్యం ధరలు నేలచూపు

అల్లూరు : పురుల్లో నిల్వ ఉంచిన ధాన్యం

అల్లూరు, న్యూస్‌టుడే: సీజన్‌లో ధరలు లేకపోవడంతో కొందరు రైతులు ధాన్యాన్ని చేలలోనే పురులు కట్టి నిల్వ చేశారు. ధర పెరిగితే నాలుగు డబ్బులు వస్తాయని ఆశించారు. రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఇంతా చేసినా.. పైసా కూడా పెరగకపోగా.. మరింత దిగజారాయి. వారి ఆశలు అడియాసలయ్యాయి. మరోవైపు ఎడగారు పంట కోతకు రావడంతో.. ధరలు మరింత తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మొదటి పంట జిలకర మసూర ధర పుట్టి రూ. 19వేలు మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే సమయంలో రూ. 24 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రధాన సీజన్‌లో అల్లూరు పరిసర ప్రాంతాల్లో ఏటా 40వేల ఎకరాలకుపైగానే వరి సాగు జరుగుతుంది. సీజన్ ముగిశాక ఏటా ధరలు పెరుగుతుండటంతో.. పొలాల్లోనే పురులు కట్టి నిల్వ చేశారు. ఇప్పుడు తీవ్ర వేదనకు గురవుతున్నారు. కొందరు ఎంటీయూ 1010 రకం సాగు చేశారు. దీన్ని ప్రభుత్వం కొనుగోలు చేయదు. బహిరంగ మార్కెట్‌లో దళారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సిందే. ప్రభుత్వం కొనుగోలుకు అవకాశం కల్పించాలని, తెలంగాణ రకానికీ ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి పీ4 పథకం గ్రామసభలు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో పీ4 పథకం అమలులో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాల పునఃధ్రువీకరణకు ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మార్చిలో పీ4 సర్వే నిర్వహించి.. జిల్లా వ్యాప్తంగా గృహాలను గుర్తించిందని, పథకాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు గ్రామ, వార్డు సభలను నిర్వహించి బంగారు కుటుంబాల తుది జాబితాను నవీకరిస్తామన్నారు. జడ్పీ సీఈవో, పంచాయతీ అధికారి, జిల్లా కోఆర్డినేటర్ జీఎస్‌డబ్ల్యూ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. అంతకు ముందు కలెక్టర్ తన ఛాంబర్‌లో ఇదే అంశంపై అధికారులతో సమీక్షించారు. ఇంజినీరింగ్ విభాగాలు కనీసం 500 మందిని, పెద్ద శాఖలైన డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖ, రోడ్లు భవనాలు, ఏపీఎస్పీడీసీఎల్, పరిశ్రమలు, విద్య తదితర శాఖలు వారి పరిధిలో కనీసం రెండు వేలకుపైగా మార్గదర్శకులను నాలుగైదు రోజుల్లోపు గుర్తించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఆగస్టు 15 నాటికి జిల్లాలో 60వేల మందిని నియమించాలని తెలిపారు.

ప్రార్థనా మందిరాల్లో నిఘా కన్ను

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

ప్రతి ప్రార్థనా మందిరం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు శాఖ సిద్ధమైంది. ఇప్పటికే ప్రధాన ఆలయాలు, దర్గాల వద్ద ఉన్నా.. తాజాగా చిన్నచిన్న మందిరాలు, ఆలయాల్లోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో అన్ని సబ్ డివిజన్లలోనూ ఈ ప్రక్రియ కొనసాగనుంది.

సర్వే ఆధారంగా...

జిల్లా పోలీసులు గతంలో సర్వే నిర్వహించి 11 సర్కిళ్లు, 54 పోలీసు స్టేషన్ల

ఎస్పీ ఆధ్వర్యంలో రంగంలోకి పోలీసులు

పరిధిలోని ప్రార్థనా మందిరాల వివరాలు సేకరించారు. వాటిని గూగుల్ మ్యాప్‌లో లాటిట్యూడ్ ఆధారంగా జియో ట్యాగింగ్ చేశారు. దాదాపు 75 శాతం పూర్తయినట్లు సమాచారం. ఆ వివరాల ఆధారంగానే ప్రస్తుతం పోలీసులు తమ చర్యలు ప్రారంభించారు. ప్రసిద్ధ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, నెల్లూరులోని రంగనాయకుల స్వామి, దర్గామిట్ట రాజరాజేశ్వరి, మూలాపేట ఇరుకళల పరమేశ్వరీ, మూలాపేటలోని శివాలయం, వేణుగోపాలస్వామి, బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, జొన్నవాడ కామాక్షితాయి, నరసింహ కొండ ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాలు, దర్గాలు, చర్చిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే కొన్నిచోట్ల ఏర్పాటు చేయగా.. మిగిలిన చోట్ల త్వరితంగా పెట్టాలని స్పష్టం చేశారు. శాంతి కమిటీలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండేలా చూస్తున్నారు.

ప్రక్రియ దాదాపు పూర్తి

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చింది. మిగిలినవీ త్వరలో పూర్తి చేస్తాం. సీసీ కెమెరాలు ఉంటే నేరాలు జరగకుండా అరికట్టవచ్చు. – జి.కృష్ణకాంత్, ఎస్పీ

ఆలయాలు ఇలా...

జిల్లా వ్యాప్తంగా ఆలయాలు: 1300 | ప్రధానమైనవి: 13 | వక్ఫ్‌బోర్డు పరిధిలోని దర్గాలు: 6 | ఇతర దర్గాలు: 615 | మసీదులు: 706 | చర్చిలు: 880

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY & SCIENCES: TIRUPATI
(AUTONOMOUS)
(Accredited by NAAC in "A" grade, All Eligible UG Programs Accredited by NBA, New Delhi)
Venkatapuram (V), Karakambadi Road, Renigunta (M), Tirupati - 517 520, Chittoor (A.P)
APEAPCET/ECET/ICET/PGECET COUNSELING CODE: AITT
Category- B Seats Admissions -2025
A few seats are available in 1st year B.Tech. / M. Tech. /MBA / MCA under Management Quota at this Institute.
B.Tech Courses - CSE, AIML, AIDS, CSE (Data Science), CSE (Cyber Security), CSIT, ECE, EEE, Mech Engg, and Civil Engg,. Eligible and interested candidates can approach the College office immediately along with relevant certificates.
For details Contact: 9701591084
Date: 14-07-2025
Sd/- PRINCIPAL

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

యువకులు.. సేవల్లో ప్రథములు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: వారంతా చిన్నతనం నుంచి సేవాభావం అలవర్చుకున్నారు. ఉన్నంతలో అభాగ్యులకు తోచిన సాయం చేస్తున్నారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, పేద మహిళల వివాహాలకు అండగా నిలుస్తున్నారు. స్ఫూర్తిపథంలో నడుస్తున్నారు.

విద్యార్థులకు అండగా..

ఏఎస్‌పేటకు చెందిన **దుగ్గిశెట్టి హరికృష్ణ** చిరు వ్యాపారి. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, సామగ్రి అందిస్తుంటారు. రూ.40 వేలు ఖర్చు చేసి విద్యార్థులు కూర్చునేందుకు అవసరమైన బల్లలు తయారు చేయించి అందజేశారు. ప్రతి ఒక్కరూ చదువుకోవలనే ఉద్దేశంతో సాయం చేస్తున్నానని తెలిపారు.

వివాహాలకు ఆర్థికసాయం

ఏఎస్‌పేటకు చెందిన **షేక్ అఫ్జల్** స్థానికంగా హోటల్ నడుపుతున్నారు. పేద ముస్లిం కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ఆర్థికసాయం చేస్తున్నారు. మంచాలు, బీరువాలు వంటి సామగ్రిని అందిస్తుంటారు. సుమారు 30 వివాహాలకు సాయం అందించారు. మతిస్థిమితం లేని వారికి అన్నదానం చేస్తుంటారు.

అల్పాహారం అందిస్తూ..

హసనాపురానికి చెందిన **శ్రీహరి** ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. రోడ్ల పక్కల ఉన్న అభాగ్యులకు ఆహారం అందిస్తున్నారు. పేద విద్యార్థులకు పుస్తకాలు,మెటీరియల్ అందజేస్తున్నారు. పర్యావరణంపై పిల్లలకు అవగాహన కల్పిస్తుంటారు. వారితో పాఠశాలల వద్ద మొక్కలు నాటిస్తుంటారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సందానీ

పేదలకు బాసటగా..

అనుమసముద్రానికి చెందిన సయ్యద్ సందానీ చిన్న పాటి వ్యాపారం చేస్తున్నారు. క్రిస్మస్, ఉగాది, వినాయక చవితి పండగ దినాల్లో పేదలకు అన్నవితరణ చేస్తుంటారు. ఆర్థికసాయం చేస్తున్నారు. పేదలకు మంచాలు, దుప్పట్లు పంపిణీ చేస్తుంటారు. మతిస్థిమితం లేనివారికి దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. పిల్లలకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి అందిస్తుంటారు. గత విద్యాసంవత్సరంలో పదిలో ఏఎస్‌పేటలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తుంటారు.

భూములకు హద్దులు చూపాలని డిమాండ్

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: వలేటివారిపాలెం మండలం రామచంద్రాపురంలో గతంలో దళితులకు ఇచ్చిన భూములను రీ సర్వే చేసి హద్దులు చూపాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాయకులు జీవీబీ కుమార్, దువ్వూరి జాన్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో 270 ఎకరాలు 42 మంది దళితులకు అప్పటి ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టాలిచ్చినా హద్దులు చూపలేదన్నారు. ఇప్పుడైనా హక్కులు కల్పించాలని కోరారు. సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజకు వినతిపత్రం ఇచ్చారు.

సమస్యలపై వినతి

వరికుంటపాడు : గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రారంభించాలని, ఇంటిపై ఉన్న విద్యుత్తు తీగలను తొలగించాలని ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం కందుకూరులో సబ్‌కలెక్టర్ శ్రీపూజకు సర్పంచి కొండిపోగు దిలీప్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రేటింగ్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న సుమన్

ఫిడే రేటింగ్‌లో ఏడుగురు చిన్నారులు

నెల్లూరు(క్రీడా విభాగం), న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చదరంగం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం ఆర్‌ఎల్ చెస్ అకాడమీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చదరంగ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ ఇటీవల బెంగళూరు, హైదరాబాద్, అనకాపల్లిలో అంతర్జాతీయ చెస్ రేటింగ్ టోర్నమెంటు పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో ఆర్‌ఎల్ అకాడమీకి చెందిన విద్యార్థులు బి.సూర్య నివాస్, పి.హేమల్, వి.హరేంద్ర రెడ్డి, పి.జెనిషా, ఎ.ప్రీతమ్, ఎన్.జితేంద్ర రెడ్డి, సీహెచ్ తరుణ్‌కుమార్ ప్రతిభతో చెస్ క్రీడలో రేటింగ్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్, డైరెక్టర్లు రామ్, లక్ష్మణ్‌లను అభినందించారు. క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేయాలని నిరసన

తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సీతారామపురం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి 167బి విస్తరణలో వ్యవసాయ బావి పోయిందని, నష్టపరిహారం చెల్లించాలని మండలంలోని గుండుపల్లికి చెందిన పలువురు రైతులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దారు వెంకటకృష్ణారెడ్డికి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో గుండుపల్లి సర్పంచి చప్పిడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని..

ఉదయగిరి: ఉపాధి పనులు కల్పించాలని స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కుర్రపల్లి బీసీ కాలనీ వాసులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాలు, కాలనీల్లో పనులు చేస్తున్నా మాకు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. ఎంపీడీవో అప్పాజీకి వినతిపత్రం అందజేశారు.

ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.9,445
(3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	
సవర ధర:	రూ.75,560
వెండి (గ్రాము :	రూ.120.40

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	105
రిటైల్	127
లేయర్	112
బ్రాయిలర్స్	184
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	210
లేయర్ మాంసం	190
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	116
లేయర్	112
బ్రాయిలర్స్	210
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

నెల్లూరు(కలెక్టరేట్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీజీఆర్ఎస్, ఇళ్ల నిర్మాణం, ఉపాధిహామీ పనులు, పీ4 తదితర అంశాలపై సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్తుశాఖ ఎస్ఈ విజయన్, డీఈవో బాలాజీరావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమశిలకు 2,863 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయానికి సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 2,863 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.998 టీఎంసీలకు 28.280 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 298.839 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్ స్లూయిస్ ద్వారా 30, ఆలో గ్రస్ట్ గేట్ ద్వారా 620, పవర్ టన్నెల్ ద్వారా 2,100 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నార్త్‌ఫీడర్ దక్షిణ కాలువకు 400, ఉత్తర కాలువకు 375 క్యూసెక్కులు వదులుతున్నారు.

పెన్నానదిలో ఒకరి గల్లంతు

పొదలకూరు, పొదలకూరు రూరల్: పడవ ఇంజిన్ పేలిపోవడంతో ఒకరు గల్లంతు కాగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని సూరాయపాలెం పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై హనీఫ్ వివరాల మేరకు కె. శివనాగరాజు.. మరో వ్యక్తితో కలిసి పెన్నానదిలో గతంలో ఇసుక తవ్వకాల కోసం నదిలో వేసిన ఉన్న సిమెంటు పైపులు తొలగించేందుకు పడవలో వెళ్లారు. ఒక్కసారిగా ఇంజిను పేలడంతో శివనాగరాజు నీటిలో పడి గల్లంతయ్యారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 31.07.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 31.07.2025, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 30.07.2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీత: (1) M/s రజని ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి. పులి రజని, సర్వే నెం.35, 34/8, C/o మారుతి మోడ్రన్ రైస్ ఇండస్ట్రీ, మద్దూరుపాడు గ్రామం, కావలి మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-524201. (2) శ్రీమతి. పులి రజని, భర్త: పి చక్రపాణి, హెచ్.నెం.1-147, కావలి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-524201 మరియు హామీదారులు: (3) పులి సుబ్బారాయుడు, తండ్రి: బయలు పులి, మద్దూరుపాడు గ్రామం & పోస్టు, కావలి మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-524201. (4) M/s మారుతి మోడ్రన్ రైస్ ఇండస్ట్రీ, మద్దూరుపాడు గ్రామం, కావలి మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-524201.
బకాయి మొత్తం రూ.10,31,86,842.83/- తేది 30.06.2025 నాటికి + తేది 01.07.2025 నుండి వర్తించు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

ఆస్తుల వివరములు :

ఆస్తి నెం-1: ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-524201, కావలి మండలం, మద్దూరుపాడు గ్రామం, సర్వే నెం. 31, హెచ్‌ఎస్‌సి నెం. 718, భూమి అసెస్‌మెంట్ నెం. 456, పులి సుబ్బారాయుడు పేరున గల 578 అంకణములు (కాని వాస్తవంగా 503.61 అంకణములు) విస్తీర్ణంలోని ఎసిసి రూఫ్డ్ బిల్డింగ్. డీడ్ నెం. 1703/2005 ప్రకారం హద్దులు: తూర్పు: పులి పుల్లయ్య ఆస్తి, పడమర: నేషనల్ హైవే, ఉత్తరం: కొంతమేర పులి యనదమ్మ ఆస్తి, కొంతమేర రోడ్డు మరియు పులి కోటయ్య, ఇతరుల ఆస్తి, దక్షిణం: పులి కోటయ్య ఆస్తి.
రిజర్వు ధర: రూ. 1,45,00,000/- | ధరావత్తు సొమ్ము: రూ. 14,50,000/-

ఆస్తి నెం-2: ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-524201, కావలి మండలం, మద్దూరుపాడు గ్రామపంచాయతీ, మద్దూరుపాడు మజారా, ఆదవిరాజుపాలెం గ్రామం, సర్వే నెం. 217, 218, ప్లాట్ నెం. 16, డి.నెం. 1/175, పులి సుబ్బారాయుడు పేరున గల 30.41 అంకణములు (వాస్తవికంగా 26.60 అంకణములు) విస్తీర్ణంలోని క్రింది & మొదటి అంతస్తు కలిగిన ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ బిల్డింగ్. డీడ్ 5274/2009 ప్రకారం హద్దులు: తూర్పు: రోడ్డు - 33' 3", పడమర: ప్లాట్ నెం. 22 స్థలం - 33' 6", ఉత్తరం: వెజిళ్ల కృష్ణంరాజు యొక్క స్థలం - 65' 8", దక్షిణం: లక్కరాజు తులసమ్మ స్థలం - 65' 5".
రిజర్వు ధర: రూ. 21,00,000/- | ధరావత్తు సొమ్ము: రూ. 2,10,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com
తేది: 14.07.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

చెట్టును ఢీ కొట్టిన కారు- ఒకరి దుర్మరణం

గుడ్లూరు, న్యూస్‌టుడే: కారు చెట్టును ఢీకొనడంతో అందులో ఉన్న తూమాటి లక్ష్మయ్య(48) దుర్మరణం చెందారు. గుడ్లూరు ఎస్సై వెంకటరావు వివరాల ప్రకారం.. మండలంలోని పరకొండపాడుకు చెందిన తూమాటి లక్ష్మయ్య కారులో చోదకుడు చెరుకూరి మాధవతో కలిసి ఆదివారం అర్ధరాత్రి దాటాక తెట్టు వైపు వెళుతున్నారు. పోట్లూరు దాటాక కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ముందు సీట్లో కూర్చున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను కందుకూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం లక్ష్మయ్య మృతి చెందాడు. మెరుగైన చికిత్సకు మాధవను ఒంగోలుకు తీసుకెళ్లారు.

పొలాల్లో యువకుడు అనుమానాస్పద మృతి

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని వీర్నకొల్లు పరిధిలో కొత్త పెట్రోలు బంకు సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. పొలాలకు వెళ్లిన రైతులు నీటి కుంట సమీపంలో గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై ఉమాశంకర్ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. శరీరంపై గాయాలు కనిపించలేదని, కారణాలు తెలియరాలేదన్నారు. మృతుడికి సుమారు 30 ఏళ్లు ఉంటాయన్నారు. కుడిచేతిపై సత్యవతి, వంశీ, కల్యాణి అనే పచ్చబొట్లు ఉన్నట్లు తెలిపారు. అతను ఆదివారం మద్యం మత్తులో రోడ్డు పక్కన పడిపోయి ఉన్నట్లు ఆ ప్రాంత రైతులు కొందరు చెబుతున్నారు. వీఆర్వో హజరత్తయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఆత్మకూరు మార్చురీకి పంపామన్నారు.

తెగుళ్లు నివారిస్తేనే రాబడి

రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త లోకేష్‌బాబు

సీతారామపురం,న్యూస్‌టుడే: వరిలో తెగుళ్లను సకాలంలో గుర్తించి మందులు వాడితే దిగుబడి పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త ఎస్.లోకేష్‌బాబు సూచించారు. లేకుంటే నష్టం తప్పదని హెచ్చరించారు. ప్రస్తుతం ఆకుముడత, ఆకునల్లి ఉద్ధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని వివరించారు. గొంగళి పురుగు ఆకులో ఉండి పత్రహరితాన్ని తినడంతో ఆకులు తెల్లబడతాయి. పోటాకు దశలో ఆకుముడత తెగులు సోకడంతో నష్టం కలుగుతుంది. పిలక దశలో గుర్తిస్తే క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరు పొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆకునల్లి: ఇది ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీలుస్తోంది. ఈ కారణంగా ఆకులు పసుపు రంగులోకి మారి పైరు ఎండినట్లు కనిపిస్తోంది. బెట్ట పరిస్థితుల్లో పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. దీనికి నీటిలో కరిగే గంధకం పొడి మూడు గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ రెండు మి.లీ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఈ మందు కొట్టాలి.

కంకినల్లి : కంకినల్లి (నల్లకంకి) కంటికి కనపడని సూక్ష్మ సాలీడు వర్గానికి చెందిన పురుగు. ఇది ఆశించిన ఆకులపై పసుపు రంగు చారలు ఏర్పడి క్రమేపీ ఆకు తొడిమలు, లోపల ఈనెలపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి తాలు గింజలు ఏర్పడతాయి. దీని నివారణకు 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు ప్రొఫెనోఫాస్ రెండు మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా స్పైరోమోసిఫెన్ మందు లీటరు నీటిలో 1 మి.లీ చొప్పున కలిపి వాడాలి.

రైతేరాజు

మినుము చేలో పుల్లయ్య

మినుము.. పండిందిలే!

వింజమూరు, న్యూస్‌టుడే: మినుము సాగులో అధిక దిగుబడి సాధించి లాభాలు పొందారు మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన అంకి పుల్లయ్య. మూడెకరాల్లో గత ఏడాది వేసవిలో వీబీఎన్-8 రకం బోరు బావి ఆధారంగా వేశారు. సేద్యం, విత్తనాలు, కూలీలు, క్రిమి సంహారక మందుల పిచికారీ, కోత, నూర్పిడికి ఎకరానికి సుమారు రూ. 20 వేలు ఖర్చు చేశారు. గత ఏడాది వచ్చిన దిగుబడి ప్రకారం ఈ ఏడాది ఎకరానికి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా. గత ఏడాది ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. నాడు క్వింటాల్ ధర రూ. 8 వేలు ఉండగా ఈ ఏడాది ధర రూ. 7-8 వేలుగా ఉంది. ఈ లెక్కన ఈ సారి ఎకరానికి రూ. 42 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మూడెకరాలకు రూ.60 వేలు ఖర్చులు పోగా రూ.లక్షకు పైగా 85 రోజుల్లో మిగలనుంది. వింజమూరు వ్యవసాయాధికారి వాసు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బోర్ల ఆధారంగా వేసవిలో మినుము సాగు రబీలో కంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.

నానో యూరియా.. రైతుకు మేలు

జహీర్

కలిగిరి, న్యూస్‌టుడే: యూరియా కొరత వేధిస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవడం మేలని కలిగిరి మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. నత్రజనిని మొక్కలకు నేరుగా అందించేందుకు ప్రభుత్వం దీన్ని తీసుకొచ్చింది. ఇది ద్రవ రూపంలో లభిస్తోంది. ఇందులో 80 శాతానికి పైగా నత్రజని ఉంటుంది. బస్తా సాధారణ యూరియాలో ఉండే పోషకాలు అరలీటరు నానో యూరియాలో ఉంటాయి. దీనికి రవాణా ఖర్చు లేదు. ఎకరానికి అరలీటరు సరిపోతుంది. 125 లీటర్ల నీటిలో కలిపి ఎకరంలో పిచికారీ చేయవచ్చు. ఇందులో ఇతర మందులు కలపకూడదు. దీని ధర రూ. 240. బస్తా సాధారణ యూరియా రూ.267. డ్రోన్లతో త్వరగా పిచికారీ చేయవచ్చు. సంప్రదాయ యూరియాను మొక్కలకు వేసినప్పుడు దాని ప్రభావం మూడు రోజులు ఉంటుంది. పైగా కొంత ఆవిరి రూపంలో, మరికొంత భూమిలో మిగిలిపోయి పూర్తిగా మొక్క వినియోగించుకోదు. ఇది ఆకులపై పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పిచికారీ చేస్తే పత్ర రంధ్రాల ద్వారా మొక్కకు అవసరమైనప్పుడు అందుతుంది. దీని ప్రభావం 10 రోజుల వరకు మొక్కలపై ఉంటుంది. అన్ని పంటలకు వేసుకోవచ్చు.

వేరుసెనగ.. కలిసొచ్చిందిగా..

అల్లూరు, న్యూస్‌టుడే : వేసవిలో సాగు చేసిన వేరుసెనగ రైతుకు కలిసొచ్చింది. మండలంలోని నార్తుఆములూరుకు చెందిన రవికుమార్ నాలుగెకరాల్లో వేసి లాభాలు దక్కించుకున్నారు. సాగుకు ముందు ఎకరాకి రెండు ట్రక్కుల చొప్పున పశువుల ఎరువు వేసి కలియదున్నారు. రైతుల నుంచి విత్తనాలు సేకరించి యంత్రం ద్వారా విత్తారు. కలుపు మందులు వినియోగించడంతో ఈ సమస్య తగ్గింది. దీంతో కూలీల ఖర్చు ఆదా అయింది. బెట్టకు రాకుండా నీరు పెట్టారు. అవసరం మేరకు సూక్ష్మ పోషకాలు అందించారు. దీంతో పైరు బాగా పెరిగింది. అధికారుల సూచనలతో మందులు వాడడంతో తెగుళ్ల తీవ్రత తగ్గింది. ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. నాలుగెకరాలకు 160 బస్తాల వరకు దిగుబడి రాగా.. బస్తా రూ.మూడు వేలు చొప్పున విక్రయించారు. నాలుగెకరాలపై రూ.4.80 లక్షల రాబడి వచ్చింది. ఇందులో పెట్టుబడి రూ.2.80 లక్షలు పోగా, రూ. రెండు లక్షలు ఆదాయంగా వచ్చినట్లు రైతు రవికుమార్ వివరించారు.

సాగులో వేరుసెనగ

సమస్య సమాధానం

సమస్య: వరిలో పాము పొడ తెగులు నివారణకు ఏంవాడాలి?– **రాము, అల్లూరు**
జవాబు : హెక్సాకెనజోల్ లేదా వాలిడాసిన్ మందు వాడాలి.
? నల్లి నివారణకు మందులు ఎప్పుడు పిచికారీ చేయాలి ?
– **శివకుమార్, అల్లూరుపేట**
✓ ప్రస్తుతం ఎండ ఎక్కువగా ఉంది. ఈ సమయంలో పైరును పరిశీలించి పిచికారీ చేసుకోవాలి.
? మట్టి నమూనా పరీక్షలు ఎక్కడ చేయించుకోవాలి ?
– **వెంకటయ్య, అల్లూరుపేట**
✓ స్థానిక వ్యవసాయ సహాయకులతో చేయించుకోవచ్చు.
? పచ్చి రొట్ట విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయా ? – **బాబు, అల్లూరు**
✓ ప్రస్తుతం లేవు. రాగానే సమాచారం ఇస్తాం.
(రైతుల సందేహాలకు అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సమాధానాలు ఇచ్చారు.)
– న్యూస్‌టుడే, అల్లూరు

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నేటి నుంచి నిర్వహణ

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబరులో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మూడు నోటిఫికేషన్లకు సంబంధించి నిర్వహిస్తున్న పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని మూడు కేంద్రాలను ఏపీపీఎస్సీ ఎంపిక చేసిందన్నారు. నెల్లూరు ముత్తుకూరులోని ఇంజినీరింగ్ కళాశాల, ఆయాన్ డిజిటల్ జోన్, కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఉదయం 9, మధ్యాహ్నం 2 గంటల తర్వాత అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు ప్రసాద్‌కుమార్, ఎం.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్వో హుస్సేన్‌సాహెబ్

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

తీర గ్రామాల భూములు తీసుకోం: ఎమ్మెల్యే

ఉలవపాడు: తీర గ్రామాల భూములను పరిశ్రమలకు ప్రభుత్వం తీసుకోవడం లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాలెంలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఇందులో మాట్లాడుతూ భూసేకరణ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడామన్నారు. ఈసందర్భంగా పలువురు మహిళలు ఈప్రాంతాన్ని వీడి వెళ్లమని కన్నీటి పర్యంతమయ్యారు. మా భూములు తీసుకోకపోతే రుణపడి ఉంటామని తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంకయ్య, రామదాసు, శీను, యానాది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక బ్యాంకులో అగ్ని ప్రమాదం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని బృందావనంలో ఉన్న కర్ణాటక బ్యాంకులో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. బ్యాంకు లోపల నుంచి పొగలు రావడంతో గుర్తించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. బ్యాంకులో ఇన్వర్టర్ బ్యాటరీ గదిలో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. రూ.3.5 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఇన్‌ఛార్జి ఏడీఎఫ్‌వో బాలాజీ గురుప్రసాద్, కె.చంద్రశేఖర్, మల్లికార్జున, మధు, డ్రైవర్ రియాజ్ పాల్గొన్నారు.

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం: ఎస్పీ

నెల్లూరు(నేర విభాగం) : జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రతి సమస్యను చట్ట పరిధిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 118 మంది తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు, న్యాయ సలహాదారు శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

వినతులు ఇలా.. ఫిలిప్పిన్స్‌లో మెడికల్ సీటు ఇప్పిస్తామని బాల రవితేజ రూ.17లక్షలు తీసుకున్నాడని, స్టూడెంట్ వీసా ఇప్పించకుండా విజిటింగ్ వీసా ఇప్పించి మోసగించాడని, అతనిపై చర్యలు తీసుకోవాలనిపొదలకూరు రోడ్డుకు చెందిన ఓ వ్యక్తి కోరారు.● తన కుమార్తెకు యూరప్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మున్వర్ అతని అల్లుడు ఇంతియాజ్, కుమార్తె సబీనాలు రూ.6లక్షలు తీసుకున్నారని.. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని సంతపేటకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ● తనకు నగరానికి చెందిన సంపత్‌తో వివాహం నిశ్చయమైందని, అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో పెళ్లి రద్దు చేసుకున్నామని, తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో ఇబ్బందులు పెడుతున్నాడని నెల్లూరుగ్రామీణ మండలానికి చెందిన ఓ యువతి తెలిపింది. ● ముదివర్తికి చెందిన వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పలుమార్లు బంగారు, నగదు తీసుకున్నారు. ఇంకా ఇవ్వాలని లేదంటే ఇన్‌స్టాలో వ్యక్తిగత ఫొటోలు పెడతానని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని విడవలూరుకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES
BUSINESS OFFER

నేషనల్ లైవ్‌స్టాక్, మిషన్, ప్రాజెక్ట్స్ టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ, నేషనల్, హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

హోమ్‌కేర్ & పర్సనల్ కేర్ ప్రొడక్ట్సును ఎగ్జిక్యూటివ్స్ / సేల్స్ టీమ్ ద్వారా మార్కెటింగ్ చేయించుటకు స్త్రీ / పురుషులు, టీమ్ లీడర్లు కావలెను. భవిష్యత్ గొప్పగా ఉండాలని కోరుకునే వారు మాత్రమే ✆ 79830 48868

WWW.RXWALA.COM మా సంస్థ నందు పనిచేయుటకు ఫార్మాశిస్టులు, RMP నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. Cell: 6300923212.

విజయ కేర్ హాస్పిటల్. విజయమహల్ గేట్ దగ్గర, నెల్లూరు నందు పనిచేయుటకు (GNM, ANM, B.Sc., నర్సింగ్ అనుభవం) మరియు ఆయమ్మలు కావలెను. Cell: 99894 33567

TO LET
COMMERCIAL

Commercial Showroom for rent 1st, 2nd & 3rd floors (4500 sft), Underground Parking, Lift Available, Opp: MGB Mall, Nellore. ✆ 98498 02947

JOBS

శుభలక్ష్మి పసుపు సంస్థకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ -2, కలెక్షన్ బాయ్స్-3 కావలెను. పోలిరెడ్డిపాళెం. V ప్రభాకర్ ✆ 92478 88909

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు.. నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.పద్మజ హెచ్చరించారు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్కానింగ్ కేంద్రాల నిర్వహణ పరిశీలించి పలు సూచనలు చేశారు.

స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ

(c) eenadu

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

కూరగాయల స్టాళ్ల ఏర్పాటు

ఉదయగిరి, సీతారామపురం, కొండాపురం, న్యూస్‌టుడే: ఉదయగిరి, సీతారామపురం, కొండాపురం మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం స్టాళ్లు ఏర్పాటు చేసి కూరగాయలు విక్రయించారు. వీటిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన టొమాటా, గోంగూర, కాకర, మునగ, కరివేపాకు, నిమ్మకాయలు, జామకాయలు, పసుపు విక్రయించారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల ప్రదర్శన

కావలి, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో న్యాయవాదులు ప్రదర్శన చేశారు. సోమవారం కోర్టు సముదాయం నుంచి ఉదయగిరి వంతెన కూడలి వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మి, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి :80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: కావలి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి కొరత ఏర్పడుతోంది. - బి.వసంతరామయ్య, వెంగళరావునగర్

సమాధానం: బాగు చేయించాం. ఇబ్బందులు లేకుండా చేశాం. - సాయివిరెల్, డైరెక్టర్, కావలి ప్రభుత్వాసుపత్రి కమిటీ - కావలి

? మండలంలోని పోట్లూరులో ఆర్వో ప్లాంటు మరమ్మతులు గురవడంతో తాగునీటికి ఇబ్బందిగా ఉంది. - శరణ్య, స్థానికురాలు

✓ మరమ్మతులు చేయించి తాగునీరు అందుబాటులోకి తెచ్చాం. - లక్ష్మీలత, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, గుడ్లూరు

? కొండముడుసుపాలెం సమీపంలో అలుగు వాగు దగ్గర చెత్త తగలబెడుతున్నారు. పొగతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - మోహనరావు, వాహనచోదకుడు

✓ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - రత్నజ్యోతి, ఎంపీడీవో - న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

? అల్లూరు నుంచి కావలి వెళ్లే మార్గంలో పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు గుంతలుగా మారింది. - హరి, సింగపేట

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈ, ఆర్‌.అండ్‌.బి - న్యూస్‌టుడే, అల్లూరు

ఎన్నికల విధులపై శిక్షణ

జలదంకి: వివాదాలకు తావు లేకుండా బీఎల్వోలు ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.ప్రమీల సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమం జరిగింది.

ఖాళీ జాగా.. మాదేగా!

పట్టణంలో కబ్జాదారుల బరితెగింపు

ఈ చిత్రంలో కనిపించేది వెంగళరావు నగర్ నవవికాస్ కేంద్రంలో పురపాలక స్థలంలో చేస్తున్న నిర్మాణం. 50 అంకణాల చుట్టూ గోడలు నిర్మిస్తున్నారు. దీని విలువ ఎంత లేదన్నా రూ.కోటికి పైమాటే.

న్యూస్‌టుడే, కావలి

ఖాళీ స్థలం కనిపిస్తే అక్రమార్కులు గద్దల్లా వాలిపోతున్నారు. అది రహదారైనా, కాలువైనా, శ్మశానమైనా సరే పాగా వేస్తున్నారు. పక్కా నిర్మాణాలు చేస్తున్నారు. వీరితో స్థలాలు కనుమరుగవుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు యినా లేదు. వీటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పురపాలక అధికారులు పరిశీలించి వెళుతున్నారే కాని నియంత్రించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం వెంగళరావునగర్‌పాలెంలో అక్రమ నిర్మాణంపై సమాచారం అందడంతో పట్టణ ప్రణాళిక అధికారి వివేక్ వెళ్లి పరిశీలించారు.

వెంగళరావునగర్ ప్రాంతం యాభై ఏళ్ల క్రితం వరకు అటవీ భూమి. ఆ తరువాత డీనోటిఫికేషన్‌తో జనావాసాలు వెలిశాయి. ఆసమయంలో వివిధ సర్వే నంబర్లలో 27 చోట్ల వివిధ అవసరాలకు రిజర్వ్ చేశారు. 2092-1 సర్వే నంబరులో 41 సెంట్లలో రిజర్వ్ చేసిన నవవికాస్ కేంద్రం కూడా ఒకటి. అందులో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఆలయాలు ఉన్నాయి. ఇప్పుడు గోడలు నిర్మిస్తూ పైవేటీకరణ చేసుకుంటున్నారు. అదేరీతిలో కొత్త శివాలయం, తదితర ప్రాంతాల్లో ఇటీవల ఆక్రమణలు జరిగాయి. నకిలీ పత్రాలను సృష్టించి దాని ఆధారంగా పాగా వేస్తున్నారు. కొందరు ఆ దస్త్రం ఆధారంగా ఇళ్ల పట్టాలు పొందుతున్నారు. అధికారులు ఒక్కొక్క సారి స్థలం జాబితాలో పేర్లు నమోదు చేయించుకుంటూ యాజమాన్య హక్కులు పొందుతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్‌ను అడగ్గా నవవికాస్ కేంద్రం వద్ద నిర్మాణం విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేస్తున్నామని వివరించారు.

కాలువల్లేక.. మురుగు పారక

మండలంలోని కాంచెరువు ఎస్సీ కాలనీలో కాలువలు లేక పోవడంతో రోడ్డుపైనే మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పాదచారులు ముక్కులు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. - న్యూస్‌టుడే, వరికుంటపాడు

నిర్మాణాలు పూర్తయ్యేనా !?

ఇది పట్టణంలోని కచ్చేరి బాలికల విద్యాలయం. శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి కొత్తగా నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో నాడు-నేడు పథకంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 300 మంది వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇటీవల విద్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పనులు పూర్తి చేయాలని డిప్యూటీ డీఈవో హరిప్రసాద్, ఎంఈవో వెంకటసుబ్బయ్యకు సూచించారు. - న్యూస్‌టుడే, కావలి

సంపద తయారీ కేంద్రానికి దారేదీ?

మండలంలోని రంగనాయుడుపల్లి ఎస్సీ కాలనీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి దారి లేని పరిస్థితి నెలకొంది. జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా కేంద్రానికి వెళ్లే మార్గంలో కాలువ నిర్మించారు. పైగా మట్టికుప్పలు పోశారు. దీంతో కేంద్రానికి ఏ వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. - న్యూస్‌టుడే, సీతారామపురం

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు: ఎమ్మెల్యే

తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, కలిగిరి, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరు తహసీల్దార్ హమీద్‌పై అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో పాల్గొన్నారు. హైవేలో రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని పక్కాగా ఎందుకు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. తెదేపా నాయకులు కొందరు ఈ విషయమై తహసీల్దారుతో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, తెదేపా మండల కన్వీనర్ జి.నరసారెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మాల్యాద్రి, జూపల్లి రాజారావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. **కలిగిరి :** సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజల అవసరాలను గుర్తించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పంచాయతీలోని పోతూరులో నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ బి.కృష్ణారెడ్డి, నాయకులు సి.హెచ్.సుబ్బారెడ్డి, ఎస్.సురేష్, కె.వెంకట్రావు, కె.మహేష్, పి.వెంగనాయుడు, పాల్గొన్నారు.

భక్తి భావనతో మెలగాలి: కృష్ణారెడ్డి

కావలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భక్తి భావనతో మెలగాలని ఎమ్మెల్యే దీవీ కృష్ణారెడ్డి సూచించారు. వచ్చే నెల 27 నుంచి జరగనున్న వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నదని ప్రశంసించారు. ఉత్సవాలపై కరపత్రాలను సోమవారం ఎమ్మెల్యే తన ఇంట్లో ఆవిష్కరించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కత్తితో దాడి.. వ్యక్తికి గాయాలు

లింగసముద్రం: ఓ వ్యక్తిపై మరొకరు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మొగిలిచర్లలో సోమవారం జరిగింది. చుండూరి పోతులూరయ్య, గోరంట్ల రాజేష్ మధ్య కొంత కాలంగా వివాదాలు ఉన్నాయి. సోమవారం వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న రాజేష్‌పై పోతులూరయ్య కత్తితో దాడి చేశారు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు పింఛనర్ల సమస్యలపై ధర్నా

కావలి: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పింఛనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు చెప్పారు.

సత్యా షోరూమ్ ప్రారంభం

షోరూమ్ ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పామూరు రోడ్డులో సత్యా ఎలక్ట్రానిక్ షోరూమ్‌ సోమవారం ప్రారంభమైంది. సత్య ఏజెన్సీస్ సేల్స్ హెడ్ సెంథిల్, డీజీఎం సురేష్, ఉద్యోగులు దీన్ని ప్రారంభించారు. 'సెంథిల్ మాట్లాడుతూ కందుకూరులో ఏర్పాటుచేసిన షోరూమ్ ఏపీలో 62వదని తెలిపారు. డీజీఎం మాట్లాడుతూ రాయితీ, ప్రతి కొనుగోలు పై బహుమతి ఉంటుందన్నారు. రూ.30 వేలకు పైగా కొనుగోలు చేసిన వారికి బంగారు నాణెం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.ఆశోక్, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గృహోపకరణాలపై 50 శాతం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కావలిలో సీపీఎం నిరసన

కావలి, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయవద్దని సీపీఎం కావలి పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం కావలి ట్రంకు రోడ్డులోని ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణమోహన్, మధుసూదన్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, ఏసోబ్ అమీర్‌బాషా, తిరుపాలు, మస్తాన్ పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకోనివ్వడం లేదని మహిళ ఆవేదన

కావలి, న్యూస్‌టుడే: కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకు అందరూ స్థలం తనదేనని నిర్ధారించినా, ఇల్లు కట్టుకోనివ్వకుండా గ్రామంలో కొందరు అడ్డుపడుతున్నారని కావలి మండలంలోని పాముగుంటపాలెంకు చెందిన ఉత్తర్ల పద్మ ఆరోపించారు. సోమవారం ఈ విషయమై బాధితురాలు కావలి ఆర్డీవో ఎం.సన్యాసిశ్వరస్వకు వినతిపత్రం అందజేశారు. కావలి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.

కుట్టు శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

న్యూస్‌టుడే, కలిగిరి

మహిళలకు స్వయం ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక స్వావలంబన కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కలిగిరిలోని రైతు సేవా కేంద్రంలో 144 మందికి కుట్టుపనిలో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 72 మంది వంతున ఉదయం, సాయంత్రం తర్ఫీదు ఇస్తున్నారు. 90 రోజుల శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నారు. శిక్షణ పొందిన మహిళలు ఇళ్ల దగ్గరే దుస్తులు కుడుతూ జీవనోపాధి పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వీరందరికీ పూర్తిస్థాయిలో తర్ఫీదు ఇస్తున్నట్లు శిక్షకురాలు ఎస్.కుమారి తెలిపారు. మహిళలు యువతులను కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎంపీడీవో ప్రత్యూష, అధికారులు తెలిపారు.

మెలకువలు నేర్చుకుంటున్న మహిళలు

మాకెంతో ఉపయోగం: కె.సత్యశిరీష, వీర్లకొల్లు

పిల్లల చదువులు, పెరుగుతున్న ఇంటి అవసరాలతో చాలా ఇళ్లలో యజమాని సంపాదన సరిపోవడం లేదు. మాలాంటి మహిళలకు గొప్ప అవకాశమిది. శిక్షణ సద్వినియోగం చేసుకొని ఆదాయం సంపాదిస్తాం. మన్న ధైర్యం వచ్చింది. వివిధ మోడల్స్‌లో దుస్తులు తయారు చేసేలా శిక్షణ దోహదపడుతుంది.

ఆర్థికాభివృద్ధికి అవకాశం: ఎ.రాజ్యలక్ష్మి, కృష్ణారెడ్డిపాలెం

చేతివృత్తిని చేసుకోవాలన్న స్ఫూర్తి దీంతో కలిగింది. ధ్యేయంతో శిక్షణ తీసుకుంటున్నా. మూడు నెలల్లో మెలకువలు నేర్చుకుంటాం. ఉపాధి పొందేందుకు ఉపయోగంగా ఉంటుంది. కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది.

కుటుంబ పోషణకు తోడ్పాటు: ఎ.నాగమణి, అనంతపురం

ఇంట్లో ఖాళీగా ఉండే బదులు ఇలాంటి శిక్షణతో అదనపు ఆదాయం పొందేందుకు యోగావకాశం. ఇంటి వద్దే నెలకు వచ్చే ఆదాయం కుటుంబానికి ఉపయోగపడుతుంది. ఇంటి వద్దే దుస్తులు కుట్టి ప్రతిరోజూ కొంత సొమ్ము సంపాదించవచ్చు. కుటుంబ పోషణ తోడ్పాటు అందుతుంది.

ఎన్నో విషయాలు నేర్చుకున్నా: వి.రమాదేవి, జిర్రాజారిపాలెం

శిక్షణతో ఇంటి వద్దే నెలకు కనీసం రూ.10 వేలకు తక్కువ కాకుండా ఆదాయం పొందేందుకు అవకాశం లభించింది. శిక్షణ సద్వినియోగం చేసుకుంటాం. దుస్తుల తయారీలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా.

జాతీయరహదారిపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జలదంకి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు. సోమవారం తొమ్మిదోమైలు సెంటర్‌లోని 167 బీజీ జాతీయ రహదారిపై పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేలా సిబ్బందితో కలసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండలంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే గ్రామ కూడళ్లలో వేగనియంత్రికలు ఏర్పాటుచేయించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై హరిబాబు, సిబ్బంది శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రావినూతల బ్రాంచ్, గాంధీ రోడ్డు, రావినూతల గ్రామం మరియు పోస్టు, కొరిసపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 523213

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లో రూలు 8 ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావినూతల బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్)కు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతిలో తేది. 30.07.2025న ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. ధరావత్తు & రిజర్వు ధర వివరములు దిగువన తెలుపబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 30.07.2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పాడిగింపుతో)

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1) M/s. సాయి రమణ షీప్ ఫామ్స్, ప్రొప్రయిటర్ : శ్రీ సంకు వెంకట రమణ, తండ్రి : శ్రీ మధుసూదన రావు, డి నెం.4-4-166, 5/2 లేన్ చంద్రమౌళి నగర్, కీర్తి టవర్స్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. 2) శ్రీ సంకు వెంకట రమణ, తండ్రి : శ్రీ మధుసూదన రావు, డి నెం.4-4-166, 5/2 లేన్ చంద్రమౌళి నగర్, కీర్తి టవర్స్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. 3) శ్రీమతి సంకు ఉమా దేవి, భర్త : సంకు వెంకట రమణ, డి నెం.4-4-166, 5/2 లేన్ చంద్రమౌళి నగర్, కీర్తి టవర్స్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007.

డిమాండ్ నోటీసు తేది : 13.12.2021 స్వాధీనత నోటీసు తేది: 19.02.2022

బకాయి మొత్తం : రూ. 44,12,064/- (అక్షరాల నలభై నాలుగు లక్షల పన్నెండు వేల అరవై నాలుగు రూపాయలు మాత్రమే) + తదుపరి జమకూడు వడ్డీ, కాస్ట్స్ మరియు వ్యయాలతో సహా & CCAGR of ₹10,55,068.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు : గుంటూరు జిల్లా, గుంటూరు, చంద్రమౌళి నగర్, 5/2వ లేన్, కొత్త డోర్ నెం.25-4-165, పాత డోర్ నెం. 4-4-166 నందు విస్తీర్ణం 100.00 చ॥గ॥ లలోని శ్రీ సంకు వెంకట రమణ గారి పేరున ఉన్న భూమి & రెసిడెన్షియల్ భవనం. హద్దులు : ఉత్తరం : ప్రగతి అపార్ట్‌మెంట్ యొక్క ప్రహరీ గోడ, దక్షిణం : మున్సిపల్ రోడ్డు, తూర్పు : టి ఎస్ పి వి ప్రభావతి గారి ఆస్తి, పడమర : సంకు నాగార్జున రావు గారికి చెందిన ఆస్తి. (రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ డీడ్ 2248/2011 తేది.26.02.2011 ప్రకారం (లాటిట్యూడ్ : 16.3136 & లాంగిట్యూడ్: 80.4263)

రిజర్వు ధర: రూ. 54,02,000/- ధరావత్తు: రూ. 5,40,200/- బిడ్ పెంపుదల: రూ. 54,020/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింకను దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 07.07.2025
స్థలం: రావినూతల

సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావినూతల బ్రాంచ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు,
ఆంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్, 2వ లేన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

వీరి నుండి
ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు తరుపున
SARFAESI యాక్ట్ 54/2002 క్రింద
దిగువ వారికి

విషయం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలిసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54/2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు దిగువ తెలిపిన తేదీలలో డిమాండ్ నోటీసును జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 6/8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి దిగువ తెలిపిన తేదీలలో నిర్మాణాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలిసిన బకాయి మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కావున, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

ఋణగ్రహీతలు/సహ-పూచీదారులు/హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

కందుకూరు మెయిన్ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్: శ్రీ పెద్దిరెడ్డి సురేష్ రెడ్డి ఫోన్ నెం. 9159916991

1 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). మెస్సర్స్. బత్తిన బ్యాగ్స్, ప్రొప్రయిటర్. శ్రీమతి. బత్తిని ప్రసన్న, భర్త: బి అశోక్ బాబు, సర్వే నెం. 234, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా. (2). శ్రీమతి. బత్తిని ప్రసన్న, భర్త: బి అశోక్ బాబు, 1-21-3, అనంత సాగరం, కందుకూరు, ప్రకాశం జిల్లా. (3). శ్రీ. బత్తిని అశోక్ బాబు, తండ్రి: బి నరసింగ రావు, 1-21-3, అనంత సాగరం, కందుకూరు, ప్రకాశం జిల్లా-523105. (4). శ్రీ. పోలినేని కోటేశ్వరరావు, తండ్రి: బ్రహ్మయ్య, 1-121, నరిశెట్టివారి పాలెం, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 15.12.2022, స్వాధీనత నోటీసు తేది : 28.02.2023
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, కందుకూరు మండలం, అనంతసాగరం గ్రామం, సర్వే నెం. 172, డి.నెం. 1-21-3, అసెస్‌మెంట్ నెం.178, శ్రీ. బత్తిని అశోక్ బాబు, తండ్రి: నరసింగ రావు పేరున గల 240 చ॥గ॥ రెసిడెన్షియల్ స్థలం మరియు అందులోని ఆర్.సి.సి ఏరియా 878 చ॥అ॥ (ప్లాన్ ప్రకారం) గల బిల్డింగ్ యావత్తు ఆస్తికి హద్దులు: ఉత్తరం: ఉమ్మడి దారి, తూర్పు: ఉన్నం మాలకొండయ్య ఇంటి యొక్క ప్రహరీ గోడ, దక్షిణం: బత్తిన మాల్యాద్రి యొక్క స్థలం, పడమర: పంచాయతీ రోడ్డు.

2 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). మెస్సర్స్. రాధాకృష్ణ ఫర్నీచర్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రొప్రయిటర్: శ్రీ. కుమ్మర శ్రీనివాసులు, మెయిన్ రోడ్డు, అనంతసాగరం గ్రామం, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105. (2). శ్రీ. కుమ్మర శ్రీనివాసులు, తండ్రి: కుమ్మర నారయ్య, పాత ఉప్పలూరు గ్రామం, చింతలదేవి పోస్టు, కొండాపురం మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా. (3). శ్రీ. దేగ కోటేశ్వర రావు, తండ్రి: వెంకట కృష్ణయ్య, హెచ్.నెం. 19-2-99, కాలిదాసు వారి వీధి, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 09.05.2022, స్వాధీనత నోటీసు తేది : 28.02.2023
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా-523105, కందుకూరు టౌన్ & మున్సిపాలిటీ, యర్ర వడ్డిపాలెం, వార్డు నెం: 16, బ్లాక్ నెం: 6, సమీప డి.నెం. 16-6-9, ఎస్.నెం.865/1ఎ1ఎ2ఎ1 నందు శ్రీ. కుమ్మర శ్రీనివాసులు పేరున గల 64.11 చ॥గ॥ విస్తీర్ణంలోని ఓపెన్ రెసిడెన్షియల్ స్థలం యావత్తు ఆస్తికి హద్దులు: ఉత్తరం: వై. చిన యల్లమంద యొక్క ఎసిసి ఇంటి గోడ – 38.6 అ॥, తూర్పు: గొప్పిపాటి బాల ఆంజనేయులు యొక్క స్థలం – 15 అ॥, దక్షిణం: తోకల కృష్ణా రావు యొక్క ఇంటి గోడ – 38.6 అ॥, పడమర: మున్సిపాలిటీ రోడ్డు.

3 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). శ్రీ. గొర్రిపాటి పూర్ణ చంద్ర శేఖర రెడ్డి, తండ్రి: కోటి రెడ్డి, డి.నెం. 3-50ఎ, లింగసముద్రం గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా. (2). శ్రీమతి. గొర్రిపాటి అరుణ కుమారి, భర్త: గొర్రిపాటి పూర్ణ చంద్ర శేఖర రెడ్డి, డి.నెం. 3-50ఎ, లింగసముద్రం గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా.
డిమాండ్ నోటీసు తేది : 01.08.2018, స్వాధీనత నోటీసు తేది : 25.10.2018
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, కందుకూరు, మహదేవపురం పంచాయతీ, ఒ వి రోడ్డు మరియు ఒ వి రోడ్డు హెచ్‌పి పెట్రోలు బంక్ వెనుకవైపు, సర్వే నెం. 505/2, ప్లాట్ నెం. 8, 'సాయి గ్రూప్ హౌసెస్', 970 చ॥అ॥ విస్తీర్ణం (కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి) గల 2వ అంతస్తులోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం. 201 శ్రీ. గొర్రిపాటి పూర్ణ చంద్ర శేఖర రెడ్డి పేరున గలదు (కందుకూరు ఎస్.ఆర్.ఓ., డాక్యుమెంట్ నెం. 2105/2014). హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.202, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: 3 అ॥ వెడల్పు ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం.

4 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1). శ్రీ. నల్లమల్లి విజయ కుమార్ (ఋణగ్రహీత/తనఖాదారు), తండ్రి: వెంకటేశ్వర్లు, డి.నెం.1-8-73, వాసవి నగర్, కందుకూరు, ప్రకాశం జిల్లా-523105. (2). శ్రీమతి. నల్లమల్లి వెంకట సుజాత (సహ-ఋణగ్రహీత), భర్త: నల్లమల్లి విజయకుమార్, డి.నెం.1-8-73, వాసవి నగర్, కందుకూరు, ప్రకాశం జిల్లా-523105. (3). శ్రీ. రాజనీష్ మద్దాలి (హామీదారు), తండ్రి: లక్ష్మి నారాయణ, డి.నెం.15-4-15, పెద్ద బజారు, వినాయక గుడి ప్రక్కన, కందుకూరు, ప్రకాశం జిల్లా.
డిమాండ్ నోటీసు తేది : 04.06.2018, స్వాధీనత నోటీసు తేది : 06.08.2018
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, కందుకూరు, మహదేవపురం గ్రామం, ఒ వి రోడ్డు మరియు ఒ వి రోడ్డు హెచ్‌పి పెట్రోలు బంక్ వెనుకవైపు, సర్వే నెం. 505/2, ఫ్లాట్ నెం. 8, 'సాయి గ్రూప్ హౌసెస్', 1వ అంతస్తులోని 970 చ॥అ॥ విస్తీర్ణం గల రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం. 102, శ్రీ. నల్లమల్లి విజయకుమార్ పేరున గలదు. హద్దులు: ఐటెం-1: ఫ్లాట్ నెం.102 కార్పెట్ ఏరియా - 789 చ॥అ॥. ఉత్తరం: 4 అ॥ ఉమ్మడి వరండా, తూర్పు: ఫ్లాట్ నెం.103, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఫ్లాట్ నెం.101. ఐటెం-2: 33.33 చ॥గ॥ (మొత్తం స్థలం 400 చ॥గ॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటా): ఉత్తరం: 18 అ॥ వెడల్పు రోడ్డు, తూర్పు: ఫ్లాట్ నెం. 14, దక్షిణం: ఘట్టమనేని సుబ్బారావు యొక్క స్థలం, పడమర: 18 అ॥ వెడల్పు రోడ్డు.

సింగరాయకొండ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్: శ్రీ శాంతను మహాకుడ్ ఫోన్ నెం. 9853143606

5 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1) శ్రీ ఇంకొల్లు రమేష్, తండ్రి: ఇంకొల్లు అంజనేయులు, డి.నెం. 36-1-40, ఈమనిపాలెం, ఒంగోలు-523101. (2) శ్రీమతి అంబటి అరుణ, భర్త: సుధాకర్‌రావు, డి నెం: 2-8, మూలగుంటపాడు, సింగరాయకొండ.
డిమాండ్ నోటీసు తేది : 08.01.2018, స్వాధీనత నోటీసు తేది : 17.04.2018
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, సింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామం, 2వ వార్డు, డోర్ నెం. 2-8 దగ్గర, సర్వేనెం. 108 లో 224.00 చ॥గ॥ల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలం శ్రీమతి అంబటి అరుణకు చెందినది మరియు హద్దులు. తూర్పు: స్థిరనివాసుల యొక్క మిగిలిన స్థలం, విస్తీర్ణం 42 అ॥ల, పడమర: అంబటి కోటయ్య యొక్క ఆస్తి, విస్తీర్ణం 42 అ॥ల., ఉత్తరం: బజార్ అమ్మకందారుని యొక్క కుటుంబానికి ఎడమవైపుకు చెందినది, విస్తీర్ణం 48 అ॥ల, దక్షిణం: సన్నెబోయన అనుసుయమ్మ యొక్క స్థలం, విస్తీర్ణం 48 అ॥ల.

6 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1. శ్రీ సయ్యద్ హబీబ్ బాషా, తండ్రి: సయ్యద్ ఇస్మాయిల్ బాషా, ఇంటి నెం.: 12-216, బుంగబావి కేంద్రం, సింగరాయకొండ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. 2. శ్రీ సయ్యద్ అల్తాఫ్, తండ్రి : సయ్యద్ ఇస్మాయిల్ బాషా, ఇంటి నెం. 12 - 216, బుంగబావి సెంటర్, సింగరాయకొండ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. 3. శ్రీ నల్లపుల రవికుమార్, తండ్రి : వెంకట సుబ్బయ్య, మూలగుంటపాడు, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా-523101.
డిమాండ్ నోటీసు తేది : 04.07.2019, స్వాధీనత నోటీసు తేది: 19.12.2019
స్థిరాస్తి వివరములు: యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, కొండముదుసుపాలెం గ్రామం, ప్లాట్ నెం.224 మరియు 225, (ఒక్కొక్క ప్లాట్ 120.00 చ॥గ॥ లేదా 1080 చ॥అ॥) సర్వే నెంబ. 91 నందు విస్తీర్ణం 240.00 చ॥గ॥లులోని ఖాళీ స్థలం శ్రీ సయ్యద్ హబీబ్ బాషా గారికి చెందినది. హద్దులు: ప్లాటు నెం.224 నకు హద్దులు : తూర్పు : ప్లాటు నెం. 225, దక్షిణం : నల్లపుల రవికుమార్ గారి మిగిలిన స్థలము, పడమర : 18 అ॥ల రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెం.223. ప్లాటు నెం.225 నకు హద్దులు : తూర్పు : 15 అడుగులు రోడ్డు, దక్షిణం : నల్లపుల రవికుమార్ గారి మిగిలిన స్థలము, పడమర : ప్లాటు నెం. 224, ఉత్తరం : ప్లాటు నెం.226. (లాటిట్యూడ్: 15.1959N & లాంగిట్యూడ్: 79.8965E).

7 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1. శ్రీమతి తన్నీరు మంగమ్మ యొక్క చట్టపరమైన వారసులు, భర్త: టి. వెంకటేశ్వర్లు, ఊళ్లపాలెం కట్టింగ్ రోడ్డు, సింగరాయకొండ గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా-523101. 2. శ్రీ తన్నీరు వెంకట ప్రతాప్, తండ్రి: టి. వెంకటేశ్వర్లు, 7-378, శ్రీరామ్‌నగర్, పద్దేపాలెం, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా-523101.
డిమాండ్ నోటీసు తేది : 30.09.2023 స్వాధీనత నోటీసు తేది: 12.01.2024
స్థిరాస్తి వివరములు: ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, 2వ బ్లాక్, 7వ వార్డు, డి.నెం: 7-2-111, సర్వేనెం. 769/1, ప్లాట్ నెం.16 మరియు 17 లో 240 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ ఇంటి స్థలం శ్రీమతి తన్నీరు మంగమ్మ గారికి చెందినది. హద్దులు : తూర్పు : 20 అ॥ల వెడల్పు బజార్, విస్తీర్ణం 54 అ॥లు, పడమర : ప్లాట్ నెం.12 యొక్క స్థలం కొంతవరకు మరియు ప్లాట్ నెం.13 యొక్క స్థలం కొంతవరకు, విస్తీర్ణం 13 అ॥లు, ఉత్తరం : ప్లాట్ నెం.15 యొక్క స్థలం, విస్తీర్ణం 40 అ॥లు, దక్షిణం: ప్లాట్ నెం.18 యొక్క స్థలం, విస్తీర్ణం 40 అ॥లు.

8 ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): (1) లేటు తంగెళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం యొక్క చట్టబద్ధమైన వారసులు: (i) శ్రీ తంగెళ్ళ వెంకట సాయి మనోజ్ కుమార్, తండ్రి: లేటు తంగెళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం, సమీప డి.నెం: 1-87/6, విద్యానగర్, 6వ లేను, మూలగుంటపాడు గ్రామం & గ్రామ పంచాయతీ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. (ii) శ్రీ. తంగెళ్ళ ఉత్తేజ్ కుమార్, తండ్రి: లేటు తంగెళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం, సమీప డి.నెం: 1-87/6, విద్యానగర్, 6వ లేను, మూలగుంటపాడు గ్రామం & గ్రామ పంచాయతీ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101. (2) శ్రీమతి తంగెళ్ళ వెంకట లక్ష్మి, భర్త: లేటు తంగెళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం సమీప డి.నెం: 1-87/6, విద్యానగర్, 6వ లేను, మూలగుంటపాడు గ్రామం & గ్రామ పంచాయతీ, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా-523101.
డిమాండ్ నోటీసు తేది : 03.10.2024 స్వాధీనత నోటీసు తేది: 01.01.2025
స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, మూలగుంటపాడు గ్రామం, సర్వే నెం. 108/3, అసెస్‌మెంట్ నెం.1684, డోర్ నెం: 1-87/6 నందు శ్రీ. లేటు తంగెళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం పేరున గల 280.9 చ॥గ॥ విస్తీర్ణంలోని ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు ఆస్తి హద్దులు: తూర్పు: 9 లింకుల బజారు – 38 అ॥, పడమర: లింగారెడ్డి రాఘవ రెడ్డి యొక్క ప్రహరీ గోడ – 37.09 అ॥, ఉత్తరం: నల్లపరెడ్డి మల్లిఖార్జున రెడ్డి యొక్క స్థలం – 67.0 అ॥, దక్షిణం: యరజాల శ్రీను యొక్క స్థలం – 66.6 అ॥.

సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.280

మర్రిపాడు, న్యూస్‌టుడే: డి.సి పల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన పొగాకు అమ్మకాల్లో గరిష్ఠ ధర కిలో రూ.280 పలికింది. వేలం కేంద్రానికి రైతులు అమ్మకానికి 787 బేళ్లను తీసుకు రాగా.. పరిశీలించి 689 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 98 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కాగా కనిష్ఠ ధర కిలో రూ.159 పలికింది.

ప్రకృతి సాగు... ఆరోగ్యం బాగు

విడవలూరు: ప్రకృతి సాగులో పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిదని ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆ పద్ధతిలో పండించిన కూరగాయలను ప్రదర్శించారు. ఈసందర్భంగా రైతులకు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

మెరుగైన వైద్యసేవలందించడమే కర్తవ్యం

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడమే మన విధి కావాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. సోమవారం చిరమన, ఏఎస్‌పేట పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీలో సిబ్బంది, వైద్యుడికి మధ్య ఉన్న వివాదం సద్దుమణిగించనున్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: విడవలూరు మండలం ముదివర్తిలో పలుచోట్ల మురుగు కాలువలు నిండి దుర్గంధం, దోమలబెడదతో ఇబ్బందులు పడుతున్నాం.- స్థానికులు

సమాధానం: పరిశీలించి పరిష్కరిస్తాం. - తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? సంగం మండలం చెర్లోవంగల్లో సచివాలయ భవన సమీపంలో మట్టిరోడ్డు రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. - పెంచలయ్య

✓ పరిశీలించి సూచికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - అన్వేష్‌రెడ్డి, ర.భ శాఖ ఏఈ

? అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో రోడ్లపైనే వ్యర్థాలు, మేడ దిబ్బలు వేస్తున్నారు. - పెంచలయ్య, గ్రామస్థుడు

✓ వేయకుండా చర్యలు తీసుకుంటాం - పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు రూరల్ పరిధిలోని మర్రిపల్లిలో పలు వీధి దీపాలు మరమ్మతులకు గురై ఐదారు రోజులుగా వెలగడం లేదు. - రాజా, స్థానికుడు

✓ సిబ్బందికి చెప్పి సరి చేయిస్తాం. - యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు మండలం అయ్యగారిపాలెం చెరువులో అక్రమంగా యంత్రాలతో మట్టి తవ్వి తరలిస్తున్నారు. - వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓ చర్యలు తీసుకుంటాం. - శివకృష్ణయ్య, తహసీల్దారు

? చేజర్ల మండలం దిగువపాలెం- కాలయాపాలెం రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. - కాలాయపాలెం గ్రామస్థులు

✓ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం - హరీష్, ఏఈ పంచాయతీరాజ్

? బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని కట్టుబడిపాళెం లేఅవుట్‌లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. - రఫీ, స్థానికుడు

✓ పరిశీలించి సిబ్బందికి తెలిపి దీపాలు ఏర్పాటు చేస్తాం. - బాలకృష్ణ, కమిషనర్

ప్రతి పొలంలో కంపోస్టు గుంత

చేజర్ల, న్యూస్‌టుడే: - డ్వామా పీడీ ప్రతాపరెడ్డి

సుస్థిర అభివృద్ధి, భూసార పరిరక్షణ, అపారిశుధ్య నిర్మూలనకు ఉపాధి హామీ పథకంలో బహుళ పథకాలు అమలు చేస్తున్నట్లు డ్వామా పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పథకం కింద గ్రామాభివృద్ధికి చేపట్టే అంశాలను ఆయన ముఖాముఖిలో వివరించారు. ఆ విషయాలు వారి మాటల్లోనే..

150 మందికి మంజూరు

పొలాల్లో చెత్తను కంపోస్టుగా మార్చేందుకు పొలాల్లో కంపోస్టు గుంతలు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తొలి విడతగా గ్రామానికి 150 మందికి మంజూరు చేశాం. మనిషి మీటరు పరిమాణంలో తవ్వుతారు. గతంలో ఇంటి పరిసరాల్లో మంజూరు చేసే గుంతలు.. ప్రస్తుతం పొలాల్లో తవ్వుకునేలా మార్పు చేశారు.

మురుగు సమస్య పరిష్కారానికి

మురుగునీరు వీధుల్లో ప్రవహించ కుండా ప్రతి ఇంట్లో గుంతలు తవ్వుకునేందుకు ఉపాధి పథకంలో అవకాశం ఉంది. మండలానికి మూడు గ్రామాలను ఎంపిక చేసి.. ఇళ్లలోని వాడుక నీరు అందులో ఇంకిపోయేలా చేస్తాం. ప్రతి కుటుంబం దీన్ని వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం.

దీర్ఘకాలిక ఉపాధికి

సన్న, చిన్నకారు రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం సాయం అందిస్తోంది. నిమ్మ, మామిడి, బత్తాయి సాగుకు మూడేళ్ల పాటు రైతులకు ఆర్థిక సాయం అందిస్తోంది. భూగర్భ జలాల పెంపునకు ప్రతి తోటలో పంటకుంట నిర్మాణం పూర్తి చేస్తాం. ఏడాది ఒక పంట కాలువలో పూడికతీత పనులు చేసి.. సాగునీటి సరఫరా మెరుగుపరుస్తాం.

రహదారుల అభివృద్ధికి..

గ్రామాల్లో రహదారుల వెంట పెరిగిన కంపచెట్ల తొలగింపునకు అవకాశం ఉంది.కొత్తగా రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

సంపద సృష్టి ఒట్టిదే..?

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు ఉద్దేశించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఐదేళ్ల అధికారులు, ప్రజాప్రతినిధులు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టారు. ఆరంభ శూరత్వం తప్ప సంపద సృష్టి లేదని ప్రజలు అంటున్నారు. దీనిపై పరిశీలనాత్మక కథనం. - ఆత్మకూరు నియోజకవర్గ న్యూస్‌టుడే బృందం

పరిశీలన

మండలం	పంచాయతీలు	సంపద కేంద్రాలు	అసంపూర్తి నిర్మాణాలు	వినియోగంలో ఉన్నవి
ఏఎస్‌పేట	19	13	1	1
చేజర్ల	26	19	0	6
అనంతసాగరం	25	15	2	6
మర్రిపాడు	24	17	2	0
సంగం	20	9	0	7
ఆత్మకూరు గ్రామీణం	21	17	4	17

నిర్వహణ లేక..

నిర్వహణ సరిగా లేకపోవడంతో అనంతసాగరం మండలంలోని సంపద కేంద్రాలు ముళ్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. అనంతసాగరం శివారుల్లో తాజాగా లక్షలతో నిర్మించిన కేంద్రం పూర్తిగా రూపును కోల్పోయింది. కామిరెడ్డిపాడులో అధ్వానంగా ఉంది. హరిత రాయబారులకు పంచాయతీ నిధుల నుంచే వేతనాలను అందిస్తున్నారు. ఇది కష్ట భారంగా మారడంతో కొన్ని ప్రాంతాల్లో సర్పంచులు ఒప్పుకోవడం లేదు. వేతనాలు ఇవ్వలేక అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

చూపించేందుకు మాత్రమే..

మర్రిపాడు మండలంలో చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. కొన్ని కేంద్రాల్లో అధికారులు సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నట్లు తొట్టెల్లో స్థానికంగా దొరికే ఎరువులు పోసి పెట్టారు. ఉన్నతాధికారులు వస్తే ఇక్కడ తయారు చేసినట్లు చూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

నామమాత్రంగానే చెత్త సేకరణ

ఏఎస్‌పేట మండలంలో 13 కేంద్రాలకు 54 మంది గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు. వీరికిచ్చిన మూడుచక్రాల ట్రైసైకిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చాలా చోట్ల గ్రామాలకు దూరంగా నిర్మించడం వల్ల చెత్త తరలింపు కష్టంగా మారింది. ఒక్క జమ్మవరంలో వర్మికంపోస్టు తయారు చేస్తున్నారు. చేజర్ల మండలంలో ప్రతి రోజూ చెత్త సేకరించే కేవలం రెండే గ్రామాలు ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులను నియమించి వేతనాలిచ్చే ఆర్థిక వనరులేక కేంద్రాల వినియోగం నామమాత్రంగా మారింది.

ఏడు చోట్ల మాత్రమే

సంగం మండలంలో తొమ్మిది కేంద్రాలుండగా మర్రిపాడు,జంగాల కండ్రిక మినహా మిగిలిన చోట్ల ఎరువు తయారీ జరుగుతుంది. కోలగట్లలో ఇటీవలే క్వింటాళ్ల మేర తయారీ కావడంతో పాటు, రూ. మూడు వేలకు ఒక క్వింటాలుకు రైతులకు విక్రయించారు. ఆత్మకూరు మండలంలో చెత్త సంపద వృద్ధి కేంద్రాల్లో అరకొరగా వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఫరూన్ రఫీ ఖాన్ స్పందిస్తూ.. వర్మికంపోస్ట్ అమ్మకానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులకు విక్రయాలు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులో అక్రమ లేఅవుట్లపై పురపాలక అధికారులు చర్యలు చేపట్టారు. పురపాలక పరిధిలో దాదాపు 10 ప్రాంతాల్లో 13 చోట్ల అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణంలోని ముంబయి రహదారికి ఇరువైపులా ఉన్న అయిదు లేఅవుట్లలో ప్లాట్లకు హద్దులుగా వేసిన రాళ్లు, మురుగు కాలువలు తొలగించారు. రోడ్డుకు అడ్డుగా కాలువ తీశారు. అమ్మకాలు చేయకుండా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోని వాటిపై చర్యలు చేపడుతున్నామని కమిషనర్ అన్నారు.

మురుగుకాలువలు తొలగిస్తున్న యంత్రం

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

కొడవలూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నార్తురాజుపాళెంలో భారీగా మహిళలు నిరసన చేపట్టారు. మండల తెదేపా అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు మాట్లాడుతూ మహిళలను అనుచితంగా మాట్లాడిన వారికి భవిష్యత్తు ఉండదన్నారు. ఎమ్మెల్యేకి వస్తున్న మంచిపేరుచూసి ఓర్వలేక అనుచితవ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నాయకురాలు రమ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో మహిళలు, తెదేపా శ్రేణుల భారీ ర్యాలీ

శాకంబరిగా పార్వతీదేవి

రాపూరు,న్యూస్‌టుడే: ఆషాఢ మాసం మూడో సోమవారం రావడంతో రాపూరు శివాలయంలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. పార్వతీ దేవి శాకంబరిగా అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివపార్వతులకు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం

మనుబోలు: స్థానిక వెంకయ్యస్వామి ఆలయం వద్ద సోమవారం జనవిద పృథ్వి కూకారుల సంఘం, తిరుపతి రమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శశిరేఖ రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి, నాయకులు రాజారెడ్డి, దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

అందుబాటులోకి యూరియా

విడవలూరు కోవూరు, న్యూస్‌టుడే: జిల్లాలో రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి అన్నారు. సోమవారం కోవూరు మండలం పడుగుపాడులోని రేక్ పాయింట్ వద్ద యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 47,588 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 32,714 మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేశామన్నారు. ఆమె వెంట కోవూరు ఏడీఏ జి.అనిత ఉన్నారు.

పంపిణీ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

ఆదమరిస్తే అంతే..

శ్రీహరి కాలనీలో తాగునీటి విడుదల కోసం ఏర్పాటు చేసిన వాల్వు గుంత ప్రమాదకరంగా ఉంది. రోడ్డు నిర్మాణ సమయంలో పట్టించుకోకపోవడంతో అంచులు దిగువకు పూడి కనిపించకుండా ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ప్రమాదకరంగా రహదారి

ఉప్పలపాడు జాతీయ రహదారి వద్ద పెన్నా నది వంతెనను ఆనుకుని ఉన్న రక్షణ అడ్డంకులు విరిగి పడిపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అదుపుతప్పిన వాహనాలు పొలాల్లోకి వెళ్లి.. పెద్ద ప్రమాదాలు జరుగకుండా వీటిని ఏర్పాటు చేశారు. అలాంటి బారియర్స్‌ను ఇంకా సరి చేయకపోవడంతో పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అనంతసాగరం

వ్యర్థాలమయం.. పశువైద్యశాల ఆవరణం

విడవలూరులోని పశువైద్యశాల ఆవరణం వ్యర్థాలతో నిండి డంపింగ్ యార్డును తలపిస్తోంది. నిర్వహణ కొరవడటంతో పలువురు స్థానికులు శిథిలమైన ఇళ్ల రాళ్లు, వ్యర్థాలు, ఇతర సామగ్రి ఇష్టారీతిన అక్కడ పడేస్తున్నారు. దాంతో వైద్యశాలకు వచ్చే పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విడవలూరు

వసతి గృహం వినియోగించరూ..

కలువాయిలోని బీసీ బాలుర వసతి గృహం గత రెండేళ్లుగా విద్యార్థులు చేరక ఖాళీగా దర్శనమిస్తోంది. గత ఏడాది ఎస్సీ బాలికల వసతి భవనంగా ఉపయోగానికి సంబంధిత అధికారులు అనుమతులు కోరినా.. ఇవ్వకపోవడంతో నిరుపయోగంగానే మారుతోంది. ఈ సంవత్సరం కూడా ఎవరూ చేరకపోవడంతో.. పాడైపోతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కలువాయి

గరిమెళ్లకు నివాళి

అనంతసాగరం, న్యూస్‌టుడే: మాకొద్దీ తెల్ల దొరతనము అంటూ గళమెత్తిన జాతీయ కవి గరిమెళ్ల సత్యానారాయణ జయంతిని సోమవారం చిలకలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ భక్తి గీతాలను రచించి ప్రజల్లో చైతన్యం కలిగించారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ

సైదాపురం, న్యూస్‌టుడే: భవననిర్మాణ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మోటార్‌బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. నాయకులు పోలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని మృతి

పొదలకూరు : సూరాయపాలెంలో సోమవారం రాత్రి ఎదురెదుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నసంఘటనలో చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారానికి చెందిన టి.వెంకటేశ్వర్లు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నీటమునిగి దుర్మరణం

సంగం, న్యూస్‌టుడే: బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందిన సంఘటన చెర్లోవంగల్లులో వెలుగుచూసింది. గ్రామస్థుల కథనం మేరకు పి.శ్రీనివాసులు(50) ఆదివారం సాయంత్రం దువ్వూరు చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. సోమవారం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మనుబోలు, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న కారును ఢీకొంది. స్థానిక వైఎస్సార్ కూడలి సమీపంలోని జాతీయ రహదారిపై లారీని అధిగమించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి.

మండల సమాఖ్య అకౌంటెంట్‌పై ఫిర్యాదు

విడవలూరు : విడవలూరు వెలుగు కార్యాలయంలోని ఎంఎస్‌ఏ (మండల సమాఖ్య అకౌంటెంట్)పై తెదేపా నాయకుడు పురంధర్‌రెడ్డి ఏపీఎం వెంకమ్మకుసోమవారం ఫిర్యాదు చేశారు. పొదుపు గ్రూపు మహిళలకు అందుబాటులో ఉండరని, విధుల్లో అలసత్వం వహిస్తున్నారని ఆమెపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మనవడే.. గెంటేశారయ్యా

విడవలూరు, కోవూరు, న్యూస్‌టుడే: మలి వయసు అని కనికరం లేకుండా మనవడే ఇంటినుంచి గెంటేశారని, తన ఇల్లు తనకు ఇప్పించాలని ఓ వృద్ధురాలు సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినంలో తహసీల్దారును సుబ్బయ్యకు వేడుకుంది. బాధితురాలి కథనం మేరకు కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బకు చెందిన నెల్లూరు రమణమ్మ భర్తను కోల్పోగా ఆమె కుమారుడు, కోడలు కొంతకాలం క్రితం చనిపోయారు. ఈ క్రమంలో మనవడు.. భార్యతో సహా కొద్ది నెలల కిందట ఆమె ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఇటీవల వారిని గెంటేశారు. స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

రమణమ్మ

చెరువు మట్టి అక్రమ తవ్వకాలు అరికట్టాలి

పొదలకూరు, న్యూస్‌టుడే: అయ్యగారిపాళెం చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం ఉప తహసీల్దారు సురేఖకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరు: స్థానిక ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల మైదానానికి చెరువు మట్టి తరలింపులో అక్రమాలు జరిగాయని రైతు సంఘం నాయకుడు ఎల్‌కె ప్రసాద్ ఆరోపించారు. ఆ మేరకు ఆర్డీవో పావనికి వినతి పత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికివేతపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: జమ్మవరంలోని అగ్రిగోల్డ్ భూముల్లో కొందరు అక్రమంగా జామాయిల్ నరికి తీసుకువెళుతున్నట్లు అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దారు అనిల్‌కుమార్‌కు, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి వివరాల మేరకు మినగల్లుకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా జామాయిల్ కర్రను కొట్టిస్తున్నట్లు చెప్పారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. సభ్యులు జమీర్‌బాషా, చౌడయ్య, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక విద్యకు భరోసా

కస్తూర్బా విద్యాలయాలకు అదనపు హంగులు

మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యాలయాల్లో బాలికలకు మరిన్ని సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేసేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. గత ప్రభుత్వం విద్యాలయాల హోదా పెంచినా అవసరమైన వసతుల కల్పనను గాలికొదిలేసింది. దాంతో వరండాలు, అసంపూర్తి భవనాల కిందనే బోధన కొనసాగింది. నాడు-నేడు కింద కొన్ని భవనాలను మంజూరు చేసినా నిధులు విడుదల చేయడంలో కాలయాపన చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంది.

నిర్మాణంలో అదనపు తరగతి గదులు

చకచకా పనులు

ఆత్మకూరు నియోజకవర్గంలో మర్రిపాడు, ఏఎస్‌పేట మండలాల్లో కేజీబీవీలున్నాయి. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 480 మంది వరకు విద్యార్థినులు ఉన్నారు. తరగతి గది, వసతి ఒకే చోట ఉండడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై దృష్టిసారించినా.. ప్రభుత్వం అదనపు భవనాల కోసం ఒక్కో విద్యాలయానికి రూ.1.50 కోట్లు వెచ్చించింది. ప్రస్తుతం పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రతి పాఠశాలలో ఆరు గదులు, రెండేసి మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. వీటితో పాటు అధునాతన గ్రంథాలయం, ల్యాబ్‌ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి సుమారు రూ.35 లక్షల వరకు మంజూరయ్యాయి.

ఇబ్బందులు తొలగుతాయి

ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గతంలో తరగతి, వసతి ఒకే చోట ఉండేది. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థినులకు ఇబ్బందులు ఉండవు.

- లక్ష్మీదేవి, ప్రిన్సిపల్, కేజీబీవీ మర్రిపాడు

సాగునీటి దుర్వినియోగం.. చర్యలు శూన్యం

గతనెలలో జలవనరుల శాఖ ఎస్.ఈ దేశినాయక్ సంగం మండలంలో పర్యటించారు. గాంధీజనసంఘం సమీపంలో కనిగిరి జలాశయం ప్రధాన కాలువ, దువ్వూరు కాలువల నుంచి చేపల చెరువులకు సాగునీటిని తరలించడాన్ని స్వయంగా గమనించారు. సిబ్బందితో కలిసి నీటిని తరలించే పంపుసెట్ల విద్యుత్తు కనెక్షన్‌లను కత్తిరించారు. ఎడగారు సాగు జరుగుతున్న తరుణంలో నీరు దుర్వినియోగం, వృథా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మరసటి రోజు నుంచే యథాతథంగా పంపుసెట్ల ద్వారా అక్రమంగా నీటిని తరలించేస్తుండడం గమనార్హం.

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో ఎడగారు వరి పంట సాగవుతోంది. సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయానికి అనుగుణంగా సోమశిల జలాశయం నుంచి సరఫరా జరుగుతుంది. అసలు కన్నా, కొసరు ఎక్కువ అన్నట్లుగా నీటి వృథా, దుర్వినియోగం అధికంగా ఉంటోంది. ఈమేరకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ ప్రకటనలు ఉత్తుత్తిగా మిగిలాయి.

దువ్వూరు కాలువ నుంచి చేపల చెరువుకి నీటి తరలింపు

చేపల చెరువులకు..

ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల్లో చేపల చెరువుల సాగు ఎక్కువగా ఉంది. దాదాపు 70వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటికి వ్యవసాయ భూములకు తీసుకువెళ్లే నీటిని విద్యుత్తు పంపుసెట్ల ద్వారా మళ్లిస్తున్నారు. సంగం మండలంలోని 15వేల ఎకరాలకు కనిగిరి జలాశయం ప్రధానకాలువ, దువ్వూరు కాలువ ద్వారా తరలిస్తున్నారు. దాంతో పొలాలకు అరకొరగా సరఫరా అవుతున్నాయి.

వృథాగా నీరు

ఇదే సమయంలో కాలువల్లో సాగునీటి నియంత్రణ చేసే రెగ్యులేటర్లు పలు చోట్ల దెబ్బతిన్నాయి. వాటిలో షట్టర్లు పాడయ్యాయి. కొత్తవి ఏర్పాటు చేయలేదు. ఫలితంగా నీరు కాలువల్లో వృథాగా వెళుతుంది. తరుణవాయి గ్రామ సమీపంలో పడమటి పాళెం కాలువ రెగ్యులేటరు దెబ్బతిని రెండేళ్లయింది. ఇప్పటి వరకు మరమ్మతులు లేనందున దాన్ని తెరవడం లేదు. అయినా అందులో నుంచి భారీగా నీరు తరలిపోతోంది.

లెక్కల్లో తేడా..

నీటి దుర్వినియోగం, వృథా కారణంగా సోమశిల జలాశయంలో విడుదల చేసే నీటికి, ఆయకట్టు వినియోగానికి మధ్య లెక్కల్లో తేడాలు వస్తున్నాయి. దీనిపై పరిశీలనచేసేందుకు జలవనరుల శాఖ ఎస్.ఈ దేశినాయక్ క్షేత్రస్థాయిలో పర్యటించినా ఫలితం అంతంతమాత్రంగా ఉంది. ఇప్పటికైనా జలవనరుల శాఖాధికారులు కఠినంగా వ్యవహరించి సజావుగా నీటిని పొలాలకు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెం డీఈఈ మాట్లాడుతూ పరిశీలించి వెంటనే చర్యలు చేపడతామన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా

మనుబోలు, న్యూస్‌టుడే : పక్కాగా ఓటర్ల జాబితాను రూపొందించాలని ఉప తహసీల్దారు ప్రదీప్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఓటర్ల జాబితాపై బీఎల్‌వోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఓటర్ల గుర్తింపు, మార్పులు, చేర్పులు, తొలగింపులు ఎలా చేయాలో వివరించారు. శిక్షకుడు అన్సారి, ఏఎస్‌వో గాయత్రి, ఆర్ఐ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయింపు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పెనుబల్లి మజరా సాల్మానాంబాపురం గ్రామంలో శ్మశాన స్థలాన్ని కేటాయించారు. తహసీల్దారు సోమవారం అడంగల్‌ను గ్రామస్థులకు అందించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు

రాపూరు : కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని జడ్పీ ఉపాధ్యక్షురాలు చిగురుపాటి ప్రసన్న అన్నారు. సోమవారం మండలంలోని పోకూరుపల్లి, తానంచెర్ల, సంక్రాంతిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తమది పేదల ప్రభుత్వమన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, అశోక్‌రెడ్డి, రామయ్య, హరనాథ్ తదితరులు ఉన్నారు.

మనుబోలు : అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని నీటి సంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు.

కేంద్ర బృందం సందర్శన

రాపూరు : రాపూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, రాపూరు ప్రభుత్వాసుపత్రిని కేంద్ర బృందం సందర్శించింది. పారిశుద్ధ్యం నిర్వహణను పరిశీలించింది. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సభ్యులు తెలిపారు.

In The Court of the Senior Civil Judge, Kovur
E.A.No: 29/2024
E.P.No: 61/2017
O.S.No: 176/2016
Boggavarapu Padma Narayana .. Petitioner / J.D.R.
Vs
Mallu Venkata Reddy ..Respondent / D.H.R.
Notice to Respondent / D.H.R.
Mallu Venkata Reddy
S/o. Chinnapa Reddy, Kaluvai Village and Mandal, SPSR Nellore District.
పై నెంబరు కేసులో పిటిషనరు / జె.డి.ఆర్. మీ మీద పై వారి కోర్టులో E.A 29/2024 పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తేది: 31-07-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసింది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
Kareti Dayakar, B.A., B.L., Advocate, Kovur.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

హోటళ్లలో తనిఖీ

తనిఖీలు చేస్తున్న ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార కల్తీ నియంత్రణ శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. నగరంలోని హోటళ్లలో నాసిరకం వంటలు, అపరిశుభ్రతపై 'ఈనాడు'లో కథనం రాగా అధికారులు స్పందించారు. సోమవారం పలు హోటళ్ల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గది, స్టోర్ రూములను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు వెల్లడించారు.

వృద్ధులకు ఇళ్లవద్ద రేషన్ ఇవ్వడం లేదు

నగర తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ప్రజలు సోమవారం నెల్లూరు నగర, గ్రామీణ తహసీల్దార్లను కోరారు. 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగులు, నడవలేని వారికి కొంత మంది డీలర్లు ఇంటికివెళ్లి రేషన్ ఇవ్వడం లేదని.. వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు నగర తహసీల్దార్‌కు 14, 16 డివిజన్ల కార్పొరేటర్లు ప్రతాప్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ● నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ మట్టెంపాడు గ్రామంలో ప్రజలు రాకపోకలు సాగించే బాటతో పాటు 20ఎకరాల భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రూరల్ తహసీల్దార్‌కు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలన్నారు.

అసత్య ప్రచారంపై పోలీసులకు జనసేన ఫిర్యాదు

నెల్లూరు(నేర విభాగం): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు ఆదివారం రాత్రి బాలాజీనగర్, సోమవారం వేదాయపాలెం పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షల ఖర్చు.. నాణ్యత తీసికట్టు

దర్గాలో పది రోజులకే దెబ్బతిన్న టైల్స్

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

పూర్తిస్థాయిలో టైల్స్‌కు నోచుకోని మెట్లదారి

నివాస గృహాల్లో ఒకసారి వేసిన టైల్స్ దాదాపు 20 ఏళ్లకు పైగా ఉపయోగపడతాయి. కానీ బారా షహీద్ దర్గా ఘాట్‌లో పది రోజులకే ఊడిపోతున్నాయి. ఇది విచిత్రం. నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉదాసీనత కారణంగా ప్రజాధనం వృథా అవుతోంది. నెల్లూరు బారా షహీద్ దర్గాలో రొట్టెల పండగను పురస్కరించుకుని స్వర్ణాల చెరువు ఘాట్‌లో రూ.10లక్షలతో టైల్స్ మరమ్మతు పనులు చేపట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఘాట్‌తో పాటు మెట్లదారిలో మరమ్మతు పనులు చేశారు. చెరువులో నీరు అధికం కావడంతో గుత్తేదారుడు అక్కడక్కడా దెబ్బతిన్న టైల్స్

ఘాట్‌లో

కొన్ని టైల్స్ మార్చి చేతులు దులుపుకొన్నారు. అవి నాసిరకం కావడంతో పది రోజులకే దెబ్బతిన్నాయి. మెట్లదారిలో పూర్తిగా టైల్స్ వేయలేదు. పర్యవేక్షించాల్సిన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ముందస్తు ఒప్పందం కారణంగా చూసీచూడనట్లుగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.10లక్షల ప్రజాధనం ఖర్చు పెడితే.. కనీసం పది రోజులు కూడా నాణ్యతగా లేకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

ఏటా రూ.10 లక్షలు

బారా షహీద్ దర్గా స్వర్ణాల చెరువులో ఘాట్‌ను నిర్మించి పదేళ్లు కావస్తోంది. కానీ ఏటా పండగ సమయంలో మరమ్మతుల కోసం రూ.10లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఒకే గుత్తేదారుడికి టైల్స్ మరమ్మతుల పనులు అప్పగిస్తుండటం గమనార్హం. చెరువు ఘాట్‌ను ఆధునికీకరణ పేరుతో ప్రతి సంవత్సరం మరమ్మతులు చేయడం పది రోజులకే ఊడిపోవడం పరిపాటిగా మారింది. నాసిరకంగా పనులు చేసినా.. గత కొన్నేళ్లుగా ఒకే గుత్తేదారుడికి పనులు అప్పగిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

ఆర్థిక సహకారం అందించాలి

నెల్లూరు(మార్కెట్ సెంటర్): ఉపాధి నిమిత్తం ఎనిమిది నెలల క్రితం సౌదీ వెళ్లిన కలువాయి మండలం కుల్లూరుకు చెందిన నజీర్ అక్కడ అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ ఆనంద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన కేంద్ర అధికారులను సంప్రదించి, సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడి నజీర్‌ను స్వగ్రామం తీసుకొచ్చారు. బాధితుడు సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సంజయ్‌కుమార్, మల్లికార్జున్, నరేష్ అధికారులకు ధన్యవాదాలు తెలిపి, నజీర్ జీవనోపాధికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

బీఎల్‌వోలకు శిక్షణ

నెల్లూరు(నగరపాలకసంస్థ): ఎన్నికల నిర్వహణలో బూత్‌లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పని చేయాలని నెల్లూరునగర నియోజకవర్గం ఎలక్ట్రల్ రిజిస్ట్రేషన్ అధికారి వైవో నందన్ తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏఈఆర్‌వో షేక్ షమీమాలిక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నవాబుపేట నాయీ బ్రాహ్మణ కాలనీలో నగరపాలకసంస్థ తాగునీరు రావడం లేదు. కుళాయిల్లో నీరు రాకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. శ్రీధర్

సమాధానం: పరిశీలించి తాగునీరు సరఫరా చేస్తాం. – రామమోహనరావు, ఎస్ఈ

? ఎన్టీఆర్‌నగర్ సరస్వతీనగర్‌లోని జే13/2/2 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రి యితే చీకటిగా ఉంటోంది. – పద్మజ

✓ విద్యుద్దీపం వెలిగేలా చర్యలు చేపడతాం. – వైవో నందన్, కమిషనర్

? నవాబుపేట కుమ్మరివీధిలో చెత్తను తీసుకెళ్లడం లేదు. వారం రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. – వెంకటేశ్వర్లరావు

✓ ప్రతిరోజూ వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపడతాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? ముత్తుకూరు రోడ్డు కృష్ణాపట్నం సెంటర్ వెంబడి ఆక్రమణలు జరుగుతున్నాయి. అధికారులు చర్యలు చేపట్టాలి. – సురేష్

✓ ఆక్రమణలు అడ్డుకుంటాం. – వైవో నందన్, కమిషనర్

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

సమష్టి కృషితోనే మొదటి స్థానం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. . కార్యకర్తలు, నాయకులు, ఇన్‌ఛార్జులు సమష్టి కృషితోనే మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. 12రోజులు కష్టపడి గడప గడపకు తిరిగారని.. రూరల్ నియోజకవర్గంలో పార్టీకి అపూర్వ స్పందన లభించిందన్నారు. రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమన్నారు. రూరల్ నియోజకవర్గంలో పార్టీలోని అందరూ అభివృద్ధిలో భాగం కావాలని కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ.. కష్టపడి పనిచేశారంటూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజా నాయుడు, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనులు గుత్తేదారులకు అప్పగించొద్దు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ రూరల్ కార్యదర్శి కె.పెంచలనరసయ్య తెలిపారు. సోమవారం ఇంజినీరింగ్ విభాగంలో పని చేసే కార్మికులు విధులను బహిష్కరించి నగరపాలకసంస్థ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నెల్లూరు నగరపాలకసంస్థలో కార్మికులు చేసే పనిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు తొమ్మిది వార్డుల్లో టెండర్లు పిలిచారన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహోన్నతమైన మూడు సూత్రాలు పాటించండి

ఆనందస్వామి ఆశ్రమంలో బౌద్ధ భిక్షువులు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: కలియుగంలో అరాచకాలు, అశాంతి రాజ్యం ఏలుతున్నాయని విదేశాల నుంచి సోమవారం నెల్లూరుకు వచ్చి ఆశ్రమాల్ని సందర్శించిన బౌద్ధ భిక్షువులు ఆందోళన చెందారు. మనశ్శాంతిగా బతికేందుకు ప్రతి ఒక్కరూ దైవ నామం చేయడం, ఎక్కువ మౌనం పాటించడం, నిత్యం ధ్యాన సాధన చేయడం అనే మూడు సూత్రాలు పాటించాలని పిలుపు నిచ్చారు. శ్రీలంక నుంచి వచ్చిన రెవరెండ్ కొవనే పాలిత థెరో, జపాన్‌కు చెందిన రెవరెండ్ యుషి షిమాద, భారత్‌కు చెందిన రెవరెండ్ బోధి హీన్ తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. పొదలకూరురోడ్డులో కొత్తూరులో ప్రభుత్వగోదాముల వెనుక ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమానికి చేరుకున్నారు. అక్కడ ఆశ్రమస్థాపకులు ఆనందస్వామి ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికారు. అక్కడ వారు భక్తులకు బోధ చేశారు.

రీ కౌన్సెలింగ్‌లో ఏఎన్‌ఎంలకు అన్యాయం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-3కి చెందిన 289 మంది ఏఎన్‌ఎంలకు నాలుగు నెలల క్రితం గ్రేడ్-2 ఏఎన్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించి పీహెచ్‌సీలలోని సబ్ సెంటర్లకు బదిలీ చేశారని, అధికారులు మేనేజ్ చేసి పట్టణ ప్రాంతాల్లోని సచివాలయాల్లోనే కొనసాగుతున్నారని ఏఎన్‌ఎం అసోసియేషన్ నాయకురాలు సుకన్య ఆరోపించారు. ఒకసారి కౌన్సెలింగ్ చేసి బదిలీ చేయగా.. మళ్లీ ఉన్నతాధికారుల ఆదేశాలంటూ రీ కౌన్సెలింగ్‌లో తీవ్ర అన్యాయం చేయాలంటూ సచివాలయాల గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తేజ, భారతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు

పరిశ్రమలకు వ్యవసాయ భూముల సేకరణ తగదు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉలవపాడు మండలం కరేడులో 8,348 ఎకరాల రైతుల భూములను ఇండోసోల్ సోలార్ కంపెనీకి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం రైతులు, రైతుకూలీ, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సేకరించే భూమిలో ఏడాదికి రెండుమూడు పంటలు పండుతాయని తెలిపారు. కంపెనీ స్థాపనతో ప్రజల ప్రధాన జీవనాధారమైన వ్యవసాయం దెబ్బతింటుందని తెలిపారు. భూమిని పరిశ్రమలకు సేకరించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య, కేవీపీఎస్ కార్యదర్శి ఆలూరు తిరుపాలు, నాయకులు కోటిరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నిజ నిర్ధారణ కమిటీ పేరుతో డబ్బు డిమాండ్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న సిబ్బంది ఇబ్బందులకు గురవుతూ ఉద్యోగాలు చేస్తున్నామని పథకం ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర నారాయణ, పీవీ కృష్ణారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇటీవల ఓ వ్యక్తి నిజ నిర్ధారణ కమిటీ పేరుతో తమ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. ప్రతి మండలంలో ఉద్యోగుల నుంచి రూ.5వేలు, ఎఫ్ఏవో నుంచి రూ.2వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ పథకం సిబ్బంది

ఇది పంట కాలువే

నగరంలోని వాహబ్‌పేటలోని ప్రధాన కాలువలో మురుగు పారక నిలిచిపోతోంది. ఇక్కడ గత కొన్ని సంవత్సరాలుగా మురుగు పారుదల సవ్యంగా జరగడంలేదు. చెత్త, థర్మాకోల్ షీట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువ నిండిపోయింది. ఇవి భారీగా పేరుకుపోవడంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు విపరీతంగా ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంట కాలువగా ఉండగా.. నేడు మురుగునీరు పారుతోంది. –న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

గుంతలు విస్మరించారు

ఇటీవల ర.భ.శాఖ అధికారులు నగరంలోని మూలాపేట ప్రాంతంలో బట్వాడిపాలెం సెంటర్ నుంచి పొదలకూరు రోడ్డు వరకు తారుతో రహదారి నిర్మించారు. బట్వాడిపాలెం కూడలి నుంచి శాంతినగర్‌కు వెళ్లే ముందు రోడ్డు చెదిరిపోయి గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. గుంత పూడ్చకపోవడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి... మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఇలా ఉంటే దోమలకు ఆవాసమే కదా!

నగరంలోని భక్తవత్సల నగర్‌లో మినీ బైపాస్ ఆనుకుని ఉన్న ప్రధాన మురుగు కాలువ అధ్వానంగా తయారైంది. దీనికి ఇరువైపులా గోడలు లేక మురుగు రోడ్డుమీదకు చేరుతోంది. నెలల తరబడి పూడికతీతకు నోచుకోవడం లేదని స్థానికులు తెలిపారు. దుర్వాసన వస్తోందని, దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి కాలువలో పూడిక తీయించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

కార్పొరేషన్‌లో 57 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ చెన్నుడు

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు సూచించారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ విభాగాల వారీగా ఆప్కాస్ 4, ఇంజినీరింగ్ 10, టిడ్కో హౌసింగ్ 21, రెవెన్యూ 2, పట్టణ ప్రణాళిక విభాగం 10, పబ్లిక్‌హెల్త్ 8, జీఎస్‌డబ్ల్యూఎస్ 2 మొత్తం 57 వినతులను అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, ఎస్ఈ రామమోహనరావు, ఈఈ రహంతుజానీ, ఏసీపీ రఘునాథ్, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పర్యవేక్షణ తప్పనిసరి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, నాణ్యతను పర్యవేక్షించాలని కమిషనర్ వైవో నందన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంతపేట బుజ్జమ్మరేవులోని పంప్‌హౌస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పైపులైన్లకు డ్రైనేజీ లైను అనుసంధానం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. బుజ్జమ్మరేవు ప్రాంతంలోని ప్రజలతో మాట్లాడి తాగునీటి స్వచ్ఛత గురించి విచారించారు. అనంతరం పొర్లుకట్ట ప్రాంతంలోని బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహించేందుకు అనుమతులు, తయారీ విధానంలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహనరావు, ఈఈ రహంతుజానీ, డీఈ రఘురామ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: వైకాపా

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం వైకాపా నేతలు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతమ్మ కోవూరులో గెలిచి ఏడాది కాలం అయినా.. ఒక్కసారి కూడా తాను ఆమెను ఎక్కడా ఒక్కమాట అనలేదని, తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని తెలిపారు. ఇలా మాట్లాడిన ఆమెపై తాను కొన్ని వాస్తవాలు మాట్లాడానన్నారు. ఎక్కడా వ్యక్తిగతంగా మాట్లాడలేదని చెప్పారు. దాడిలో ముఖ్యపాత్ర వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిదే అన్నారు. మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, అనిల్ బాబు, వీరి చలపతి, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, షేక్ సిద్దిక్, హంజా హుస్సేనీ, మహేష్, మల్లి నిర్మల, మొయిళ్ల గౌరీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

నెల్లూరు (విద్య): విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శి భరత్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని ఆదిత్య కళాశాలలో నెల్లూరు నగర కమిటీని ఎంపిక చేశారు. నగర కార్యదర్శిగా కె.మౌనిష్, సహాయ కార్యదర్శులుగా ఆదిత్య మాధవ్, సంజిత్, వీరశంకర్, జోనల్ ఇన్‌ఛార్జులు గణేష్, మనోహర్, మనోజ్, హాస్టల్ కన్వీనర్ సుకుమార్ ఎంపికయ్యారు.

యూరియా బ్లాక్ మార్కెట్ అరికట్టాలి

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలోని రైతులందరికీ యూరియాను అందించి, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలురైతు సంఘాల జిల్లా కార్యదర్శులు మూలి వెంగయ్య, గంగపట్నం రమణయ్య కోరారు. సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. యూరియా కొరత కారణంగా రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద బస్తా

సంక్షిప్త సమాచారం

రూ.100కు పైగా అదనంగా చెల్లించి కొనాల్సి వస్తోందన్నారు. అధికారులు రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. నాయకులు చిరసాని కోటిరెడ్డి, రమేష్, బుజ్జయ్య, శ్రీనివాసులు, ఎస్కే బాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు మాయం

నెల్లూరు(నేర విభాగం): నగరంలోని వెంకటరెడ్డి నగర్‌లో మాలిని తన కుమారుడు విద్యాధరణ్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 11న రాత్రి తల్లీ కుమారుడు తలుపునకు గడియపెట్టుకుని నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేవగా తలుపులు తెరచి ఉండి.. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 9 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. పెద్ద కుమారుడు జయధరణ్‌కు మాలిని తెలియజేసింది. ఆయన సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని కోటమిట్టకు చెందిన జలీల్(32), రేష్మ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. ఇటీవల దంపతుల మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9న రాత్రి రేష్మ పిల్లలను తీసుకుని ఖుద్దూస్ నగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. చనిపోవాలని ఉందంటూ జలీల్ భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. రేష్మ అన్నదమ్ములతో కలిసి భర్త ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా జలీల్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు ఈ నెల 11న చెన్నైలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసన్నా తీరుమార్చుకో: డిప్యూటీ మేయర్

నెల్లూరు(మార్కెట్ సెంటర్): మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి నీతి వ్యాఖ్యలు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ విమర్శించారు. జిల్లా తెదేపా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగ సభలో ప్రసన్న చేసిన వ్యాఖ్యలను కొంతమంది నాయకులు సమర్థించడం సిగ్గుచేటన్నారు. ఇంటిపై దాడి జరిగితే దానిని ఎగ్జిబిషన్‌గా చేసి పెద్ద మొత్తంలో వసూలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయలను దిగజార్చేలా మాట్లాడిన ప్రసన్నపై వైకాపా నాయకులు కూడా సానుభూతి చూపడం లేదన్నారు. వేమిరెడ్డి దంపతులను విమర్శిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్‌పై మండిపడ్డారు. నగర డిప్యూటీ మేయర్ తహసీన్, ఇంతియాజ్, కార్పొరేటర్లు నాగమణి, మైనుద్దీన్, సుజాత పాల్గొన్నారు.

వినతుల వెల్లువ.. చూపాలి చొరవ

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: పింఛను అందించి ఆదుకోవాలని వృద్ధులు, దివ్యాంగులు సోమవారం పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలివచ్చారు. భూ సమస్యలపై రైతులు, ఇళ్ల స్థలాల కోసం మహిళలు ఇలా జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చి అర్జీలు అందించారు. జిల్లా స్థాయిలో న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

ఆధారం లేదు.. ఆదుకోండి

వెంకటాచలం మండలం గొలగమూడికి చెందిన **మస్తానయ్య**కు కాళ్లు వంకర పోయి నడవలేని పరిస్థితి. గతంలో కూలీ పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం వెళ్లలేక పోతున్నారు. ఎటువంటి ఆధారం లేదు. చూసుకునే వారు ఎవరూ లేరు. కనీసం బస్సు ఛార్జీలకు డబ్బులు లేకపోవడంతో ఇతరుల ద్విచక్రవాహనంలో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అధికారులు పింఛను ఇప్పించి ఆదుకోవాలని మస్తానయ్య వేడుకున్నారు.

రెండేళ్లుగా తిరుగుతున్నా..

మనుబోలు మండలం ముద్దమూడి గ్రామానికి చెందిన **తాటిపర్తి రాజమ్మ** భర్త చనిపోయి రెండేళ్లయింది. వితంతు పింఛను మంజూరు చేయాలని రెండేళ్లుగా సచివాలయం చుట్టూ తిరుగుతోంది. ఎన్నిసార్లు తిరిగిన స్పందించడం లేదని వాపోయారు. వృద్ధాప్యం కారణంగా ఏ పని చేసుకోలేకపోతోంది. అధికారులు స్పందించి పింఛను అందించి ఆదుకోవాలని ఆమె కోరింది.

వృద్ధాప్యంలో అండ కరవై..



విడవలూరు మండలం ముదివర్తికి చెందిన **కందుకూరి రమణయ్య** భార్య చనిపోయింది. వయసు మీద పడటంతో ఏ పని చేసుకోలేకపోతున్నారు. ఇద్దరు కొడుకులు ఉన్నా.. పట్టించుకోవడం లేదని.. పింఛను ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.

భూమి ఉన్నా.. పథకాలు అందక..



ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం చెందిన **పెద్ద హజరత్తయ్య**, రత్నమ్మకు సర్వే నంబరు 53లో నాలుగు ఎకరాల భూమి ఉంది. దాదాపు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, తమ అనుభవంలో ఉన్న భూమికి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు మంజూరు కావడం లేదన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రావడం లేదని న్యాయం చేయాలని కోరారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

నెల్లూరు(జడ్పీ) : గీతావైభవ ట్రస్ట్ ఛైర్మన్ గురూజీ నజీర్‌బాషా సోమవారం మూలాపేటలోని కోనేటిమిట్ట, చిరంజీవి ప్లాజా తదితర అపార్ట్‌మెంట్లకు వెళ్లి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలవికాస్ డిప్యూటీ ఛైర్మన్ సుభాషిణి, భాగ్యలక్ష్మి, అరుణమ్మ, సుమలత, లక్ష్మీప్రసన్న, పద్మావతి, ప్రసాద్, సుమలత పాల్గొన్నారు.

హెచ్చరిక నోటీసు

నా కక్షిదారురాలు అయిన **శ్రీమతి బక్క పార్వతమ్మ భర్త లేట్ జయరామ్, నివాసం, గుడిపల్లిపాడు, నెల్లూరు రూరల్ మండలం,** ప్రస్తుతం నెల్లూరు నగరం, అనువారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారురాలు య. 0-97ట్లు మాగాణి భూమిని సర్వే నెం. 87 & 87-B, గుడిపల్లిపాడు గ్రామం, స్వాధీన విక్రయ అగ్రిమెంట్ **తే. 19-03-2001ది** ద్వారా **రావినూతల ప్రకాశం మరియు అతని భార్య అయిన రావినూతల సుగుణమ్మ** అనువార్ల వద్ద నుండి కొనుగోలు చేసి, అప్పటి నుంచి స్వాధీనానుభవంలో ఉంటువున్నది. తదుపరి సదరు **రావినూతల ప్రకాశం మరియు రావినూతల సుగుణమ్మ** అనువార్లు రిజిష్టర్డు విక్రయపత్రం నా కక్షిదారురాలి పేర రిజిష్టర్ చేయుటకు నిరాకరించినందున, నా కక్షిదారురాలు **శ్రీ గౌరవనీయ నెల్లూరు ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో O.S.No. 685/2009** అను దావాను వేసి డిక్రీ పొందియున్నారు. తదుపరి తన పేర సదరు గౌరవనీయ కోర్టు వారి నుండి **తే. 01-08-2022దిన,** రిజిష్టర్ విక్రయ పత్రమును పొందివున్నారు. సదరు అగ్రిమెంటు ఫోర్స్‌లో ఉండగా **రావినూతల సుగుణమ్మ తే. 03-06-2009దిన** పై **య. 0-97ట్లులో య. 0-30ట్లు** భూమిని దురుద్దేశంతో **మాగాటి చంద్రమోహనాచారి** అను వారిపేర ఒక రిజిష్టర్ విక్రయపత్రం సృష్టించినారు. తదుపరి **27-01-2017** తేదిన సవరణ పత్రం కూడా సృష్టించినారు. తదుపరి **మాగాటి చంద్రమోహనాచారి, గౌరవనీయ నెల్లూరు Iవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో** మా కక్షిదారురాలుపై **O.S.No. 452/2019** అను దావాను దాఖలు చేసి, పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వమని కోరివున్నారు. సదరు దావా ఇంకను పెండింగ్ ఉన్నది. పై విషయములు తెలిసిన మా కక్షిదారురాలు, సదరు **మాగాటి చంద్రమోహనాచారి** పై **గౌరవనీయ నెల్లూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో** సదరు **మాగాటి చంద్రమోహనాచారి**పై పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ కొరకు దావాను **O.S.No. 213/21** దాఖలు చేసి, **I.A.No. 65/2021** లో టెంపరరీ ఇంజక్షన్ ఉత్తర్వులును తేది **27-02-2021**న పొందివున్నారు. సదరు ఇచ్చిన ఉత్తర్వులు ఇంకనూ అమలులో ఉన్నది. కావున సదరు **మాగాటి చంద్రమోహనాచారికి** పై చెప్పిన **య. 0-30ట్లు** భూమిని అన్యాక్రాంతము చేయుటకు ఏవిధమైన హక్కు అధికారం లేదు. ప్రస్తుతం **మాగాటి చంద్రమోహనాచారి,** సదరు **య. 0-30ట్లు** భూమిని ఇతరులకు అమ్మజూపినారు అని రూఢీగా తెలియుచున్నది. అతనికి సదరు భూమిని అమ్ముటకు హక్కు అధికారం లేదు. కాబట్టి సదరు భూమిని ఎవ్వరు అయిన కొనుగోలు చేయుటకు అధికారం లేదు అని హెచ్చరించడం అయినది. హెచ్చరికను అతిక్రమించి సదరు భూమిని కొనుగోలు చేసిన యెడల అవి ఏ మాత్రం నా కక్షిదారురాలుపై బద్ధగించజాలవు. వారిపై నా కక్షిదారురాలు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు అని హెచ్చరించడమైనది.

షెడ్యూలు

SPSR నెల్లూరు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ ఇలాకా ఇందుకూరుపేట సబ్-రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు రూరల్ మండలం - ప్రస్తుతం నెల్లూరు నగరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో - **గుడిపల్లిపాడు గ్రామం, సర్వే నెం. 87-B లో య. 0-30ట్లు మాగాణి భూమికి హద్దులు. తూర్పు :** రావినూతల రమణయ్య గారి భూమి, **దక్షిణం :** డొంక, **పడమర :** రావినూతల చిన్నయ్య గారి భూమి కొంత వరకు, రావినూతల ప్రకాశం భూమి కొంత వరకు మరియు రావినూతల పోలయ్య మరియు వగైరాల భూమి కొంత వరకు. **ఉత్తరం :** రావినూతల యానాదయ్య భూమి కొంత వరకు మరియు రావినూతల వెంకట సుబ్బయ్య మరియు రావినూతల రమణయ్య గార్ల భూమి కొంతవరకు.

ఎన్.శ్రీనివాసులురెడ్డి, B.Sc., B.L.,

అడ్వకేట్, 3వ వీధి, జగదీష్‌నగర్, చిల్డ్రన్స్ పార్కు రోడ్డు, నెల్లూరు-2. సెల్: 98854 48010

(c) eenadu

పావని.. కుటుంబాన్ని బాగా చూసుకో..

భార్య, పిల్లలతో మురళి

■ ఫోన్‌లో భార్యతో మాట్లాడుతూ తుపాకీతో కాల్చుకున్న జవాన్
■ ఛత్తీస్‌గఢ్‌లో జిల్లా వాసి బలవన్మరణం

"పావని ఏమి చేస్తున్నారు.. భోజనం చేశారా.. పిల్లలు తిన్నారా.. నాన్న ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. బాగా చూసుకోవాలి.. చెల్లికి మంచి సంబంధం చూసి పెళ్లి చేయాలి. అందమైన ఇల్లు కట్టుకుందాం.. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేద్దాం.. ఇప్పటికే రూ.34 లక్షలు అప్పు చేశా.. నువ్వు మన కుటుంబానికి అండగా ఉండి బాగా చూసుకోవాలి.."

అంటూ సీఆర్‌పీఎఫ్ జవాన్ కంచుకుంట మురళి.. తన భార్యకు ఆదివారం రాత్రి 10 గంటలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈక్రమంలో కాసేపటికే ఇక సెలవు అంటూ తన చేతిలోని తుపాకీతో కాల్చుకున్నాడు. భార్య హలో.. హలో ఏమండీ అంటున్నా స్పందనలేదు. అక్కడ సమీపాన ఉన్న తోటి జవాన్ శబ్దం విని వచ్చి చూడగా అప్పటికే నేలకొరిగాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్- రాయ్‌పూర్‌లోని 65వ బెటాలియన్‌లో చోటుచేసుకుంది.

కనగానపల్లి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం శివపురంకొట్టాలకు చెందిన ముత్యాలన్న, నాగలక్ష్మీ దంపతులకు కుమారుడు కంచుకుంట మురళి (30) సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా 2017లో ఎంపికయ్యారు. ఆయన అనంతపురం నగరానికి చెందిన లోకపావనిని ఐదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల కుమారుడు తారక్‌రామ్, రెండేళ్ల కుమార్తె మహి ఉన్నారు.

తండ్రి వైద్యానికి అప్పు చేసి..

మురళి తండ్రి ముత్యాలన్నకు చర్మసంబంధ క్యాన్సర్ సోకడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇందుకు సుమారు రూ.30 లక్షల వరకు అప్పు చేశారు. తన సోదరికి పెళ్లి చేయాల్సి ఉంది. మరోవైపు నాలుగు నెలల కిందట మురళి కారును మిత్రుడు తీసుకెళ్తుండగా పెనుకొండ సమీపంలో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారు. కారు నంబరు ఆధారంగా మురళిని.. కేసు రాజీ అయ్యేందుకు మృతుడి కుటుంబసభ్యులు రూ.15 లక్షలు డిమాండ్ చేశారు. తండ్రి వైద్యం కోసం దాచుకున్న రూ.4 లక్షలను ముట్టజెప్పారు. ఇలా.. మొత్తం రూ.34 లక్షల దాకా అప్పు చేశారు. తండ్రి ఆరోగ్యం క్షీణిస్తుండటంతో 15 రోజుల కిందట బెంగళూరుకు వచ్చిన మురళి.. తిరిగి బెటాలియన్‌కు వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి ఆత్మహత్యకు ఒడిగట్టారు. ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసుల వర్గాలు పేర్కొన్నాయి. నేడు శివపురంకొట్టాలలో జవాన్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ధర్మవరం చేనేత పట్టు చీరకు జాతీయ గుర్తింపు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ధర్మవరం చేనేత పట్టు చీర 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డుకు ఎంపికైంది. సోమవారం దిల్లీ భారత్ మండపంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్‌చేతన్ అవార్డును అందుకున్నారు. ధర్మవరం చేనేత పట్టు చీరలకు ఈ గౌరవం దక్కినందుకు జిల్లా ప్రజలకు, మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్

స్వీకరణ సరే.. పరిష్కారం ఎన్నడో?

ఫిర్యాదుదారులకు తప్పని ప్రదక్షిణలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: తమ సమస్యల పరిష్కారానికి వ్యయప్రయాసలతో కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. తహసీల్దార్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఇదే పరిస్థితి. నెలలు గడుస్తున్నా సమస్యలు అలాగే ఉన్నాయని అర్జీదారులు వాపోతున్నారు. కింద స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యకు కలెక్టరేట్ వరకు వస్తున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథి కలిసి 281 ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఈ సందర్భంగా జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారు సమస్యను ఆలకిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పింఛను కోసం తిరుగుతున్నా..

కాలు కోల్పోయా.. నాలుగేళ్లుగా కార్యాలయం చుట్టూ పింఛను కోసం ప్రదక్షిణలు చేస్తున్నానని సోమందేపల్లి మండలం మేకలపల్లి గ్రామానికి చెందిన **రామాంజి** వాపోయారు. కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేసేందుకు రూ.300 ఖర్చు వస్తోంది. నా భార్య కూలి పనులకు వెళుతున్నా కుటుంబ పోషణ భారమైంది. పింఛను మంజూరు చేయాలని కన్నీరుమున్నీరు అయ్యారు.

రెండేళ్లుగా ఇదే తీరు

భూసమస్య పరిష్కారానికి రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని తాడిమర్రి అగ్రహారానికి చెందిన రైతు **బాషా** వాపోయారు. సర్వే నంబరు 282-1, 2 భూమి ఉంది. స్థానిక రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సిన సమస్య జేసీ కోర్టు వరకు వచ్చింది. ఏడాదిన్నరగా తిరుగుతున్నా నేటికి పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

యల్లనూరు రోడ్డులో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

ఇసుక తరలింపు.. ప్రమాదముప్పు!

● మితిమీరిన వేగంతో వెళ్తున్న ట్రాక్టర్లు
● నిర్లక్ష్యంగా అధికారులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పరిసరాల్లోని పెన్నానది నుంచి గుట్టుగా రాత్రిపగలు అన్న తేడా లేకుండా ట్రాక్టర్లు కొద్ది ఇసుక తరలిపోతోంది. ఈక్రమంలో ప్రధాన రహదారుల్లో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారు. ఆమార్గంలో వెళ్లే జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

● తాడిపత్రి పరిసరాల్లో సుమారు 12 కిలోమీటర్ల మేర పెన్నానది ప్రవహిస్తోంది. నందలపాడు, వరాలుపేట, కొత్త, పాత పెన్నా వంతెనల వద్ద నుంచి రోజు 60 ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరును రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు ఒక్కో ట్రాక్టర్ 4 (ట్రిప్పులు) పైగానే ఇసుకను నదిలో నుంచి అక్రమంగా తరలిస్తున్నారు.

● అక్రమార్కులు రాత్రి సమయాల్లో పెన్నానది నుంచి ఇసుకను తెచ్చుకుని ఉదయం పూట ఇళ్ల నిర్మాణాల వద్దకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఎవరైనా అధికారులు చూస్తారని అతివేగంతో ప్రధాన దారుల గుండా వెళ్తున్నారు. దీంతో పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. రెండు వారాల క్రితం మున్సిపల్ షాదీఖానా వద్ద అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొనడంతో డ్రైవర్‌కు కాలు విరిగింది.

● నంద్యాల రోడ్డులో ఇటీవల అక్రమంగా ఇసుకను పట్టణంలోకి తీసుకొస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం

-సాయిప్రసాద్, సీఐ, తాడిపత్రి సీఐ

తాడిపత్రిలోని పెన్నానది, యల్లనూరు మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తాడిపత్రిలోకి తీసుకొచ్చే వారిపై ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణా, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

వానప్పా.. ఒక్కసారి వాలప్పా!

■ అదును తప్పుతోందని అన్నదాతల ఆందోళన

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం: వర్షాధారంపైనే ఆధారపడిన శ్రీసత్యసాయి జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ. వేసవి దుక్కులు దున్ని.. సాగుకు సిద్ధం చేసుకుని వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నకు తీవ్ర నిరాశే ఎదురైంది. మేలో కురిసిన వర్షాలతో మురిసిన అన్నదాత సాగుకు సిద్ధమయ్యారు. జూన్‌లో మొదలయ్యే ఖరీఫ్ సీజన్ సమయానికి విత్తనం సిద్ధం కాలేదు. అదేనెల 20 తర్వాత రైతులకు పంపిణీ చేశారు. అందులోనూ కే6 రకం విత్తనంలో కదిరి లేపాక్షి 1812, గుజరాత్ గోల్డ్ తదితర రకాలు కలిసి ఉన్నాయని రైతులు అంటున్నారు

కేవలం 7.7 మి.మీ వర్షపాతమే..

జూన్‌లో సాధారణ వర్షపాతం 66.6 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా.. 34.8 మి.మీ. మాత్రమే నమోదైంది. జులై 14 వరకు 33.8 మి.మీ.కు గాను ఇప్పటి వరకు కేవలం 7.7 మి.మీ. వర్షపాతం నమోదు కావడం గమనార్హం. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. అప్పు చేసి పెట్టుబడులు సమకూర్చుకుని సాగుకు సిద్ధమైతే చినుకు జాడ లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికే పంటలతో కళకళలాడాల్సిన పొలాలు బీడుగా దర్శనమిస్తున్నాయి.

ఇప్పటికే పది శాతమే..

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 2,69,167 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 24,332 హెక్టార్లలో (9శాతం) మాత్రమే వివిధ పంటలు సాగు చేశారు. వేరుసెనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,51,824 హెక్టార్లకు గాను ఇప్పటిదాకా 15,807 హెక్టార్లలో (10 శాతం) మాత్రమే సాగైంది. కదిరి డివిజన్‌లో 96,818 హెక్టార్లు, ధర్మవరం 70,910, మడకశిర 24,015, పెనుకొండ 20,010, హిందూపురం 5,571 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది.

మూడెకరాలు సిద్ధం చేశా..

- నరసింహులు, హర్యాన్‌చెరువు, చెన్నేకొత్తపల్లి మండలం

వేరుసెనగ సాగు కోసం మూడెకరాల పొలాన్ని సిద్ధం చేశా. దాదాపు రెండు నెలలు కావస్తున్నా వరుణుడు కరుణించక పోవడంతో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. ఈనెల 20లోపు వర్షం వస్తేనే విత్తనం పడినట్లు. ఆలస్యమైతే దిగుబడి తగ్గడమేగాక వెనుకటి వర్షాలకు పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.

ఈనెలాఖరు వరకు విత్తుకోవచ్చు

- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

జులై నెలాఖరు దాకా వేరుసెనగ విత్తుకోవచ్చు. ఆగస్టులో మొక్కజొన్న, కంది పంటసాగుకు అవకాశం ఉంటుంది. జులై ఆఖరి వరకు వర్షం రాకపోతే ఆగస్టు మొదటి వారంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రతిపాదనలు పంపి రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తాం.

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు రూ.3.83 కోట్లు విడుదల

● వెంటనే విధుల్లోకి చేరకుంటే ఎస్మా

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల వేతనాల కోసం రూ.3.83 కోట్లు విడుదల అయ్యాయని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వేతనాలు రాలేదని ఏప్రిల్ 6 నుంచి కార్మికులు సమ్మెలో వెళ్లారు, సోమవారం ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్ ఖాతాలోకి సొమ్ము జమ అయిందన్నారు. కార్మికులు మంగళవారం నుంచి విధుల్లోకి హాజరు కావాలని, లేనిపక్షంలో ఎస్మా చట్టం ప్రయోగించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శిరీష పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, రెవెన్యూ అధికారులు

జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు భూముల పరిశీలన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు అవసరమైన భూములను పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ వద్ద స్థలాన్ని జడ్జితోపాటు తహసీల్దార్ కల్యాణ్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. జిల్లా కోర్టు సామూహిక భవనాలకు 10 నుంచి 12 ఎకరాల భూమి అవసరమని, ఆ దిశగా కేటాయించాలని జడ్జి సూచించారు. దేవాదాయశాఖ భూమి కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి అనుగుణంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, లెక్కల యదుభూషణ్, చల్లా శేఖర్, భారతిరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు అక్రమ వినియోగదారులకు షాక్!

● అపరాధ రుసుం విధింపు, కేసుల నమోదు

✦ రాయదుర్గంలోని ఓ శుద్ధజల కేంద్రం నిర్వాహకుడు విద్యుత్తు సర్వీసు ఉన్నా అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్నాడు. గత నెల 13న విజిలెన్స్ అధికారులు గుర్తించి రూ.1.99 లక్షలు అపరాధ రుసుం విధించారు.

✦ ఇటీవల రాప్తాడులో ఓ చిన్న పరిశ్రమను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కేటగిరీ-3 కింద సర్వీసు తీసుకుని కేటగిరీ-2 కింద విద్యుత్తు వాడుతున్నట్లు గుర్తించారు. రూ.71 వేలు జరిమానా విధించారు.

పిండిమిషన్‌కు తీసుకున్న సర్వీసు మీటర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ విభాగం అధికారులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: అక్రమంగా విద్యుత్తు వినియోగంపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. కొందరు అనుమతి లేకుండా పెద్దఎత్తున నష్టం కలిగిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేయటంతో పాటు అపరాధ రుసుం విధిస్తున్నారు. మీటర్ తీసుకోకుండా నేరుగా స్తంభం నుంచి వాడుకోవటం... స్తంభం నుంచి మీటర్‌కు వేసుకున్న తీగకు మధ్యలో మరో తీగ ఏర్పాటు చేసుకుని వినియోగించడం ద్వారా యూనిట్లు తగ్గించుకుంటున్నారు. సర్వీసు తీగలను మధ్యలో ట్యాప్ చేసి త్రీఫోర్ స్విచ్‌ను ఏర్పాటు చేసుకుని వాడుకుంటున్న తీరు అధికారుల తనిఖీల్లో వెలుగుచూశాయి. అనుమతి పొందిన దానికంటే అధికలోడు వినియోగిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు.

గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈఏడాది జూన్ 30 వరకు కేసుల వివరాలు

మీటరు లేకుండా విద్యుత్తు వినియోగించిన వారు : 1,905
విధించిన అపరాధ రుసుం: రూ.61.76లక్షలు
మీటరు ఉన్నా అక్రమంగా వాడకం: 2,295
అపరాధ రుసుం: రూ.1.41 కోట్లు
అధికలోడు వినియోగం: 2631
రుసుం: రూ.1.34కోట్లు

నిబంధనలు పాటించాల్సిందే.. - శేషాద్రిశేఖర్, ఎస్ఈ, అనంతపురం

అక్రమ విద్యుత్తు వినియోగదారులపై చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారం సర్వీసు తీసుకోవాలి. లోడు అధికమైతే పలు సమస్యలు తలెత్తుతాయి. నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నాం.

ఘాటెక్కిన పచ్చిమిర్చి కిలో రూ.80

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పచ్చిమిర్చి ధర ఘాటెక్కింది. అనంతపురం పాతూరు కూరగాయల మార్కెట్లో కిలో మిర్చి ధర రూ.80 పలుకుతోంది. వారం రోజుల కిందట రూ.25 పలికింది. కొన్ని నెలల కిందట పచ్చిమిరపను సాగు చేసిన రైతులు వాటిని ఎండబెట్టి మార్కెట్‌కు తీసుకెళ్లారు. అక్కడ ధర లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో మిరప సాగుకు రైతులు ముందుకు రాకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో అనంతపురం మార్కెట్‌కు రోజుకు వెయ్యి క్వింటాళ్ల పచ్చిమిరప కాయలు సరఫరా అయ్యేవి. ప్రస్తుతం 250 క్వింటాళ్లకు మించి సరకు రావడం లేదు. మిర్చిని కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం, హోసూరు నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతున్నామని, అవసరాలకు తగినంత సరకు సరఫరా లేకపోవడం, రవాణా ఖర్చుల కారణంగా మిరప ధర పెరిగిందని టోకు డీలర్లు చెబుతున్నారు.

కారు అద్దం పగలగొట్టి రూ.7లక్షల అపహరణ

■ గోరంట్ల పోలీస్‌స్టేషన్ సమీపాన ఘటన

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలో రద్దీగా ఉన్న కదిరి ప్రధాన రహదారి అది. మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయం.. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో నిలిపి ఉన్న కారు అద్దం పగులగొట్టి రూ.7లక్షల నగదు అపహరించిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గోరంట్ల మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన బ్రాంచ్‌పోస్టుమాస్టర్ రామచంద్రరావు కుమారుడు నాగతేజ వివాహం త్వరలో జరగాల్సి ఉంది. గోరంట్లలో బంగారు కొనుగోలు చేయడానికి సోమవారం ఉదయం కారులో రామచంద్రరావు తన కుమారుడు, సోదరుడు విశ్రాంత ఉపతహసీల్దార్ వసంతరావుతో కలిసి ఎస్‌బీఐకి వచ్చారు. 11.45 నిమిషాలకు రూ.7లక్షలు డ్రా చేసుకుని బంగారు దుకాణం వద్దకు వెళ్లారు. కాస్త ఆలస్యం అవుతుందని దుకాణదారు చెప్పడంతో కళ్యాణమండపం చూడటానికి బయలుదేరారు. వాసవీమహల్ వద్దకు చేరుకుని.. ప్రధాన రహదారిపైనే ఆపి నగదు సంచి అందులోనే ఉంచి లాక్‌చేసుకొని లోపలికి వెళ్లారు.

పగిలిన కారు అద్దం

పరిశీలించి వచ్చేలోపు..

వాసవీమహల్‌లోని మూడు మండపాలను 20 నిమిషాల పాటు పరిశీలించిన అనంతరం వారంతా బయటకు వచ్చారు. అప్పటికే కారు ముందుభాగం అద్దం పగిలి ఉంది. తండ్రీకొడుకులు పరుగున వచ్చి చూసి నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కల్యాణమండపం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయక పోవడం చోరులకు కలిసొచ్చినట్లైంది. ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు విచారిస్తున్నారు. పథకం ప్రకారం నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాల్లో బ్యాంకు నుంచే వెంబడించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు.

పెనుకొండ మీద నగరవనం

● రూ. కోట్లతో పనులు ప్రారంభించిన అటవీశాఖ ● పర్యాటక అభివృద్ధికి శ్రీకారం

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ పర్యాటక అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రభుత్వం గతేడాది అటవీశాఖ ఆధ్వర్యంలో కొండమీద నగరవనం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసింది. అక్కడ నీటి సౌకర్యం లేకపోవడంతో పనుల ప్రారంభానికి ఆలస్యమైంది. ప్రస్తుతం నగరవనంలో భాగంగా కొండమీద పర్యావరణ విద్యా కేంద్రం, ఫుడ్‌కోర్ట్ భవనాల నిర్మాణం ఇటీవల ప్రారంభించారు. వారాంతంలో పెనుకొండకు పర్యటనకు వచ్చే బైకర్లు కొండమీద కనీసం తాగునీరు, తేనీరు, అల్పాహారం లభించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోటను చూసేందుకు బెంగళూరు నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే యాత్రికులకు ఇక్కడ ఏమీ సౌకర్యాలు లేకపోవడం శోచనీయం. నగరవనం పూర్తవ్వగానే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతోపాటు, అల్పాహారం, వసతి అందుబాటులోకి వస్తాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారులు పాలకులు ప్రత్యేక చొరవచూపి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

కొండమీద శ్రీఘనగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు 8 కిలోమీటర్ల మేరకు ఘాట్‌రోడ్డులో తిరుపతి మలుపులను తలపించేలా రెండు వరుసల రహదారి నిర్మించడంతో వారాంతంలో కర్ణాటకలోని బెంగళూరు, చిక్కబళ్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఇప్పటికే ఇస్కాన్ మందిరానికి ప్రభుత్వం దాదాపు 5 హెక్టార్ల భూమి కేటాయించింది. 108 అడుగుల శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహం నిర్మించడం కోసం కొంతకాలంగా భూమి చదును పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగర సామ్రాజ్యం వేసవి విడిది, రెండోరాజధాని పెనుకొండలోని అలనాటి రాచరికపు పాలను అద్దం పట్టే పురాతన కట్టడాలకు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మెరుగులు దిద్దితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. గతంలో కొండ మీదికి రోప్‌వే మంజూరైనప్పటికీ గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిధులు సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పర్యాటక అభివృద్ధితో ఈప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. రోప్‌వే నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొండ మీదకు వెళ్లేందుకు నిర్మించిన ఘాట్‌రోడ్డు

కొండమీద నిర్మాణంలో ఉన్న పర్యావరణ విద్యా కేంద్రం

త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తాం

-శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఆర్వో, అటవీశాఖ, పెనుకొండ

గతంలో కొండమీద నీటి సౌకర్యం లేకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం కొండమీద ఉన్న కోనేరులోని నీటిని భవనాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయించి, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.

అర్జీదారులకు న్యాయం జరిగేలా చూస్తాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ జరిపి తగు సమయంలో బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ రత్న హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ప్రజల నుంచి 61 వినతులు స్వీకరించారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ప్రజలను ఆప్యాయంగా పలకరించి, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారిపట్ల నిర్లక్ష్యం, దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

జేఎన్‌టీయూలో కొత్త కోర్సు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో 2025-26 సంవత్సరానికి నూతన కోర్సు మంజూరైందని ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు తెలిపారు. బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సు మంజూరైందన్నారు. ఇందులో 66 సీట్లు ఉంటాయన్నారు. దీంతోపాటు కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో అదనంగా 66 సీట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాదని పేర్కొన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి

మధ్యవర్తిత్వంతోనే సులభంగా న్యాయం

అనంతపురం(మూడోరోడ్డు), న్యూస్‌టుడే: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంతో సులభంగా న్యాయం లభిస్తుందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి అన్నారు. బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సోమవారం 'దేశం కోసం మధ్యవర్తిత్వం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యవాణి మాట్లాడుతూ అన్ని కోర్టుల నుంచి మధ్యవర్తిత్వానికి కేసులను పంపుతున్నారన్నారు. వాటి విచారణకు ముందే ఏదైనా మధ్యవర్తిత్వంలోనే ఇరువర్గాలు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. దీంతో కక్షిదారులకు సులభంగా, సత్వర న్యాయం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్లుగా వానర సేవలో..!

నీటిని నింపుతున్న కృష్ణ.. దాహం తీర్చుకుంటున్న కోతులు

తొట్టిలో నీళ్లు పోస్తున్న ఈయన కృష్ణ. నార్పల మండలం నాయినిపల్లి క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. గతంలో ఆటో నడిపేవారు. ప్రస్తుతం చిన్న వ్యాపారం చేసుకుంటున్నారు. గతంలో ముచ్చుకోట అటవీ ప్రాంతం మీదుగా ఆటోలో వెళ్తున్నప్పుడు నీళ్ల కోసం కోతులు ఇబ్బందులు పడటం చూశారు. వాటి దాహం తీర్చేందుకు ప్లాస్టిక్ డబ్బాల్లో నీటిని తీసుకెళ్లి రోడ్డు పక్కన ఉంచేవారు. ఆ తర్వాత సొంత డబ్బులతో ఒక్కో నీళ్ల తొట్టిని రూ.700 చొప్పున 14 తొట్టిలు (ఒక్కో దాంట్లో 30 లీటర్ల నీరు పడుతుంది.) కొనుగోలు చేసి అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన అక్కడక్కడ ఏర్పాటు చేశారు. ఆటోలో రోజూ 300 లీటర్ల నీళ్లు తీసుకెళ్లి ఎనిమిది కి.మీ. దూరంలో ఉన్న తొట్టిల్లో నింపుతున్నారు. ఆ నీటిని కోతులు తాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి. గత ఇరవై సంవత్సరాలుగా కృష్ణ కోతుల దాహం తీరుస్తుండటం విశేషం. - **ఈనాడు, అనంతపురం**

దానిమ్మకు తొడుగు.. రాబడికి అడుగు

■ ఆశాజనకంగా దిగుబడి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : సాగు చేసిన దానిమ్మ పంట చుట్టూ ప్రత్యేకంగా వేసే నెట్ రక్షణగా ఉంటోంది. ఫలితంగా కీటకాల బెడద తప్పి అధిక దిగుబడులు, లాభాలు గడిస్తున్నారు కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన మహిళా రైతు గోవిందమ్మ. ఎవరైనా చెట్టుచెట్టుకు రక్షణ తొడుగులు వేస్తే ఈమె మాత్రం పంటకు మొత్తం రక్షణ ఏర్పాట్లు చేసి సత్ఫలితాలు సాధిస్తున్నారు.

పంట చుట్టూ ఏర్పాటు చేసిన నెట్

రూ.10 లక్షలతో పెట్టుబడి

★ రెండున్నర ఎకరాల్లో భగవాన్ రకం దానిమ్మ పంటను నాలుగేళ్ల కిందట సాగు చేశారు. విజయవాడ నుంచి ఒక్కో మొక్క రూ.43 చొప్పున 1,050 మొక్కలకు రూ.45,150 వెచ్చించి తీసుకొచ్చారు. డ్రిప్ పైపులకు, కర్ణాటక చిక్‌బల్లాపురం నుంచి 35 కిలోల నెట్ రూ.1.10లక్షతో పాటు కూలీలకు, పురుగు మందులకు దాదాపుగా రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కంటికి రెప్పలా పంట కాపాడుకొంటూ వచ్చారు.

★ పంట మొదటి కోతలో 10 టన్నులు, రెండో కోతలో 15 టన్నుల దిగుబడి రాగా విక్రయిస్తే రూ.25 లక్షలు లాభం వచ్చింది. మూడో కోత రెండు నెలల్లో రానుంది. 25 టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనా. మార్కెట్ ధర బట్టి రూ.20 లక్షల - రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుందని మహిళా రైతు చెబుతున్నారు. బెంగళూరు మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

నెట్ ప్రయోజనాలివిగో!

పంట రక్షణతో పాటు వివిధ రకాల పక్షుల నుంచి రక్షణగా ఉంటుంది. పంటకు వైరస్ నుంచి రక్షణ ఉంటుంది. దీంతో దానిమ్మ కాయల పరిమాణం ఎక్కువగా ఉంటుంది. ఎరువుల వాడకం తగ్గుతుంది. పంట చేతికొచ్చే సమయంలో కాయలు ఒకేసారి పక్వానికి వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఒక్కో కాయ 15- 20 ఎంఎం వరకు ఉండటంతో పాటు రుచికరంగా ఉంటాయి. ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు పంట కాలం ఉంటుంది. తెలుపు, ఆకుపచ్చ రంగులో ఉన్న నెట్ పంటను రక్షణగా వేసుకొంటే మంచి దిగుబడులు, అధిక ఆదాయాన్ని పొందేందుకు అనుకూలంగా మారుతుంది.

దిగుబడికి సులువైన మార్గం

- గోవిందమ్మ, మహిళా రైతు, దొడగట్ట గ్రామం

పంటకు రక్షణ తొడుగు వల్ల మొదటి, రెండో కోతల్లో మంచి దిగుబడులతోపాటు లాభాలు వచ్చాయి. పంటను రక్షించుకోవడంతో పాటు పక్షుల బెడద ఉండదు. పంట విషయంలో ఎలాంటి భయం ఉండదు. అనుకున్న దానికంటే ఎక్కువ స్థాయిలో దిగుబడులు ఉంటాయి.

సౌర విద్యుత్తు ప్రాజెక్టు మడకశిరకు తలమానికం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: నవయుగ అనుబంధ కంపెనీ చింత గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో మడకశిర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న 2వేల మెగా వాట్ల సౌరవిద్యుత్తు ప్రాజెక్టు మడకశిర నియోజకవర్గానికి తలమానికమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో సోమవారం సౌరవిద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటుపై ఇండోసోల్ సంస్థ ప్రతినిధులు సుబ్బారావు, నిరీక్షకుమార్‌తో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర అభివృద్ధికి ఎంతో సహాయ సహకారం అందిస్తున్నారని, అధికంగా వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకువచ్చి ఆదాయాన్ని పెంచేందుకు ఆలోచిస్తున్నారన్నారు. సౌర ప్రాజెక్టుకు భూమలిచ్చిన ఒక్కో రైతుకు ఎకరానికి ఏడాదికి ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.31వేల ఆదాయం వస్తుందన్నారు. ప్రతి రెండేళ్లకు అదనంగా 5 శాతం రాయితీ కల్పిస్తారని, దీని ప్రకారం ఎకరానికి రూ.1500 అదనంగా వస్తుందన్నారు. సౌరప్రాజెక్టు ఏర్పాటైతే ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కొంత మంది రైతులు సంస్థ ప్రతినిధులతో నేరుగా మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రెవెన్యూ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ హసీనాసుల్తాన్, ఆర్‌ఐ సోమశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగరాజు, మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా అనంత

జట్టును అభినందిస్తున్న ఫుట్‌బాల్ సంఘం సభ్యులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను అనంతపురం కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో అనంతపురం జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 5-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అనంతపురం ఆటగాళ్లు అద్భుతంగా ఆడి ప్రతిభ కనబరిచారు. విజయంతో తిరిగొచ్చిన జిల్లా జట్టును సోమవారం ఓటీఆర్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి క్రీడాకారులను అభినందించారు. ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మల్లేశ్, సీఐ విశ్వనాథచౌదరి, మైభారత్ ప్రోగ్రాం అధికారి జి.శ్రీనివాస్, సభ్యులు రుద్ర, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రత్నమయ్య తదితరులు హాజరై క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయిలో కూడా ఇదే ప్రతిభ చాటి రాష్ట్ర జట్టును గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

మిరప సాగుతో.. కష్టాలు గట్టెక్కి!

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : వాణిజ్య పంటలతో తీవ్రంగా నష్టపోయి కూరగాయల సాగుతో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. ముదిగుబ్బ మండలంలోని దామానుపల్లి గ్రామానికి చెందిన రైతు **రాజారెడ్డికి** 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో ఏప్రిల్‌లో మిరప పంట సాగు చేశారు. అంతకు ముందు భూమిని ఐదు మడకలతో బాగా దుక్కిచేయించారు. సూపర్, యూరియా, పొటాషియం మందులు దుక్కిలో కలిపారు. ఇలా చేయడం ద్వారా భూమి మరింత సారవంతంగా ఉంటుంది. తర్వాత రెండుసార్లు రోటావేటర్‌తో, ఒకసారి టిల్లరుతో భూమిని కలియదున్నించి బోదులు ఏర్పాటు చేయించారు.

★ డ్రిప్పు పద్ధతిలో ఎకరాకు రూ.40 వేల చొప్పున మొత్తం 80 వేలు మొక్క నాటించారు. ఒక మొక్క రూ.60 పైసలతో ముదిగుబ్బలోని నర్సరీలో కొనుగోలు చేశారు.

గుంటూరు మార్కెట్‌లో విక్రయాలు

మిరపలో ప్రధానంగా బ్లాక్ త్రిప్స్, బింగి వంటి వైరస్‌లు వ్యాపించాయి. వీటి నివారణకు ప్రొఫెన్ క్విన్‌జోన్, స్పైనోసాడ్ మందును నిర్దేశిత కొలతతో నీటిలో కలిపి పిచికారీ చేశారు. మొక్క కొనుగోలు నుంచి సేద్యం, ఇతర ఖర్చులన్నీ కలిపి పెట్టుబడికే రూ.3 లక్షలు పెట్టారు. సాగు చేసిన 75 రోజులకు పంట కోతకొచ్చింది. మొదటి కోతలో 50 కిలోల బస్తాలు 215 దిగుబడి రాగా బస్తా రూ.850తో విక్రయించారు. రెండో కోతలో 235 బస్తాల దిగుబడి రాగా బస్తా రూ.1400తో విక్రయించారు. అనంతపురం జిల్లాలో తక్కువ ధరలు పలకడంతో తెలిసిన వ్యక్తుల ద్వారా గుంటూరు మార్కెట్‌కు తరలించి విక్రయించారు. మొత్తం 450 బస్తాలు (22,500 కిలోలు) విక్రయించగా రూ.4.70లక్షలు రాబడి వచ్చింది. పెట్టుబడి పోయి రూ.1.70 లక్షలు లాభం మిగిలింది. ఇంకా రెండు నుంచి మూడు కోతల దిగుబడి వస్తుందని, ధరలు ఇలానే కొనసాగితే మరో రూ.2లక్షలకుపైగా ఆదాయం వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగులో ఉన్న మిరప పంట

సమస్య - సమాధానం

రైతేరాజు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటల సాగులో రైతుల సందేహాలకు రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త **నారాయణస్వామి** చరవాణి : 62812 84235 నంబరుకు ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆముదం సాగు చేయాలనుకుంటున్నాం. అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు తెలపండి. **-నరసింహులు, గొల్లపల్లి.**

సమాధానం. ఆముదం సాగుచేసుకోవాలనుకునే రైతులకు జులై 30వ తేదీ వరకు అవకాశం ఉంది. డీసీహెచ్-519, ఐసీహెచ్-5, జీసీహెచ్-4 రకం విత్తనాలతో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

సమస్య : బొప్పాయి తోటలో ఆకుముడత తెగులు వ్యాపించింది. ఈ తెగులు నివారణకు మార్గం తెలపండి. **-సత్యనారాయణ, బి.పప్పూరు**

సమాధానం. అసిఫేట్ 1.5 గ్రాములు, ఒబెరాన్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

టమాటాలో యాజమాన్య పద్ధతులు భేష్

చిట్కా

బుక్కరాయసముద్రం వద్ద సాగవుతున్న టమాటా పంట

నార్పల, న్యూస్‌టుడే : జిల్లాలో టమాటా పంట సాగు చేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. పంటకు ఆశించే పచ్చపురుగులు, కాయ తొలుచు పురుగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు రైతులు పైరాక్లోస్ట్రోబిన్ ఒక గ్రాము, ప్రొఫెనోఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగుళ్ల ఉద్ధృతి తగ్గించవచ్చన్నారు.

నగదుతో బంగారం వ్యాపారి పరారీ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని 17వ వార్డు చౌడమ్మ గుడి ప్రాంతంలో అందరూ కూలీ పనులు చేసుకొనేవారే. పైసా పైసా కూడబెట్టి ఒక్కొక్కరు మూడు, నాలుగు తులాల వరకు బంగారు కోసం వ్యాపారి నూరుల్లాకు డబ్బులు ఇచ్చారు. ఆ నగదు తీసుకొని నూరుల్లా కనిపించకుండా పోయాడని బాధితులు సోమవారం సాయంత్రం అతని దుకాణం వద్ద నిరసన తెలిపారు. దీనికి తోడు మరికొందరితో చీటీ వేయించుకున్నాడని బాధితులు తెలిపారు. సోమవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అక్కడ సీఐ మస్తాన్ సెలవుల్లో ఉండటంతో ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. రెండు నెలల కిందటే పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

లబోదిబోమంటున్న బాధితులు

నూరుల్లా దుకాణం వద్ద బాధితులు

త్వరలో సరఫరాదారులకు సొమ్ము జమ చేస్తాం

ఏపీసీడ్స్ గోదాములో వేరుసెనగ నిల్వలను పరిశీలిస్తున్న ఛైర్మన్ సుబ్బారెడ్డి, డీఎం సుబ్బయ్య తదితరులు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత రబీలో పప్పుసెనగ, ప్రస్తుత ఖరీఫ్‌లో వేరుసెనగ విత్తన బకాయిలను సరఫరాదారులకు (ఏజెన్సీ) త్వరలో చెల్లించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఏపీసీడ్స్ సంస్థ కార్యాలయం, గోదాములను ఆయన తనిఖీ చేశారు. ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్యతో కలిసి గోదాములోని వేరుసెనగ విత్తనకాయలు, కంది విత్తనాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ భవనంలో సరఫరాదారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా ప్రధానం. జిల్లా నుంచే ఏటా రూ.200 కోట్లు టర్నోవర్ జరగ్గా.. అందులో 46 శాతం ఒక్క అనంతపురం నుంచే వస్తోందని, నాణ్యమైన విత్తనం సకాలంలో రైతులకు అందాలంటే ఆర్థిక పరమైన సమస్యను పరిష్కరించాలని డీఎం సుబ్బయ్య కోరారు. అనంతరం రాష్ట్ర ఛైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏమి జరిగిందో తెలియదు. అప్పట్నుంచి విత్తన పంపిణీలో ఆర్థిక సమస్య వెంటాడుతోందని, సరఫరాదారులకు బకాయిలు చెల్లించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో గత రబీలో పప్పుసెనగ విత్తనాలకు రూ.30 కోట్లు, ప్రస్తుత ఖరీఫ్‌లో వేరుసెనగ విత్తనకాయలకు రూ.53 కోట్లు సరఫరాదారులకు చెల్లించాల్సి ఉందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బకాయిల విడుదలకు సత్వరమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

130 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఏడీఏ సాల్‌రెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్రభూపతి స్థానిక అధికారులతో కలిసి సోమవారం అనంతపురంలోని రసాయన ఎరువుల గోదాములను తనిఖీ చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర, ఎన్‌డీఆర్, సిరిగుప్ప ఆగ్రోస్ ఏజెన్సీ గోదాముల్లో తనిఖీలు చేశారు. జీరో ఫారం లేకపోవడంతో సుమారు రూ.35 లక్షల విలువ చేసే 130 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామని ఏడీఏ తెలిపారు. తనిఖీలు ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం గ్రామీణం ఏవో వెంకట్‌కుమార్, జేడీఏ కార్యాలయ సాంకేతిక వ్యవసాయాధికారి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరువాసి అనుమానాస్పద మృతి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గోవిందపల్లి పంచాయతీ రాఘవేంద్ర కాలనీ శివారులో తడకలేరు వాగులో దేవరాజు(56) అనే వ్యక్తి మృతదేహాన్ని బుక్కరాయసముద్రం పోలీసులు గుర్తించారు. తడకలేరు వంతెన కింద కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం లభించిన ప్రదేశం అనంతపురం వన్‌టౌన్, త్రీటౌన్, బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ సరిహద్దు ప్రాంతం కావడంతో మూడు పోలీస్‌స్టేషన్ల అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చివరకు బుక్కరాయసముద్రం పరిధిలోకి వస్తుందని తేల్చారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు వివరాల ప్రకారం మృతుడి పేరు దేవరాజుగా గుర్తించారు. దేవరాజు బెంగళూరులోని నాగసంద్ర ప్రాంతానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడా? లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చామని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని సీఐ పుల్లయ్య తెలిపారు.

ఆగమేఘాలపై తాడిపత్రికి జేసీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: సింగపూర్‌కు విహారయాత్ర నిమిత్తం వెళ్లిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఆగమేఘాలపై తాడిపత్రికి చేరుకున్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి నాలుగు రోజుల కిందటే వెళ్లారు. మంగళవారం వైకాపా చేపట్టిన 'చంద్రబాబు రీకాల్ మ్యానిఫెస్టో' కార్యక్రమానికి పెద్దారెడ్డి వస్తున్నాడని సమాచారం అందడంతో జేసీ ప్రత్యేక ఛార్టెడ్ ఫ్లైట్‌లో హైదరాబాద్‌లో దిగారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తాడిపత్రికి చేరుకున్నారు. ఇప్పటికే పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రానివ్వమని మున్సిపల్ కౌన్సిలర్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. జేసీ సైతం అడ్డుకుంటానని సామాజిక మాధ్యమాల్లో పలుమార్లు ప్రకటించారు. ఈనేపథ్యంలో తాడిపత్రిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, పెద్దారెడ్డి నివాసం వద్ద పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దారెడ్డి రాకకు పోలీసుల అనుమతి నిరాకరణ

తాడిపత్రి, అనంత నేరవార్తలు: తాడిపత్రిలో నిర్వహించనున్న 'చంద్రబాబు రీకాలింగ్ మ్యానిఫెస్టో' కార్యక్రమానికి హాజరు కావడానికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తాడిపత్రి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ మేరకు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి వైకాపా జిల్లా పార్టీ అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డికి లేఖ రాశారు. ఇదే రోజు వీరాపురంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటున్నారు. రెండు పార్టీలు భారీగా సభలు నిర్వహిస్తే శాంతి భద్రతలకు ఆటంకం కలగవచ్చని వైకాపా కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని నోటీసులో పేర్కొన్నారు.

రైలు ఢీకొని రైతు దుర్మరణం

రామాంజనేయులు

అమిదాలకుంట (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని రైతు దుర్మరణం చెందిన ఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని అమిదాలకుంట గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే జమేదార్ మురళి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు (43) ఆదివారం రాత్రి పొలంలో మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. తెల్లవారుజామున ఇంటికి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ ఢీకొని దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య శమంతకమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న వ్యక్తి అకాల మరణంతో ఆ కుటుంబ సభ్యులు విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు జమేదార్ పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో నమ్మించి.. మోసం చేసిన వీఆర్వో

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: అతను వీఆర్వో మహమ్మద్‌వలి. ఇది వరకే పెళ్లైంది. తన మాయమాటలతో మరో అమ్మాయిని నమ్మించి రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెను గర్భిణి చేసి ఇప్పుడు తనకొద్దంటున్నాడు. తనకు న్యాయం చేయాలని సోమవారం బాధితురాలు గుంతకల్లులోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. గుంతకల్లులోని ఓ వీధికి చెందిన బాధితురాలికి ఇది వరకే పెళ్లి కాగా 2023లో భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈమెకు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. కుమారుడి పేరును రేషన్‌కార్డులో ఎక్కించాలని భాగ్యనగర్‌లోని 24వ సచివాలయం వీఆర్వో మహమ్మద్‌వలి దగ్గరకు వెళ్లింది. అలా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. వీఆర్వో ఒక రోజు ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటాను నమ్మించాడు. అనంతపురానికి తీసుకెళ్లి ఓ దర్గాలో ఆమెను వివాహమాడాడు. తర్వాత గుంతకల్లులోనే ఓ కాలనీలో కాపురం పెట్టాడు. 7 నెలల తరువాత వీఆర్వో పెద్ద భార్య, కుటుంబ సభ్యులు వచ్చి యువతిని కొట్టారు. కాపురం చేస్తే చంపేస్తామంటూ వీఆర్వో అన్న, వదినలు బెదిరించారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదుసార్లు పంచాయితీ పెట్టినా బాధితురాలికి న్యాయం జరగలేదు. తను ఏడు నెలల గర్భిణి అని, న్యాయం చేయాలని ఆమె పోలీసులను వేడుకుంటున్నారు. వీఆర్వోపై కేసు నమోదు చేశామని సీఐ మనోహర్ తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయాలని మద్దతు తెలుపుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి పార్టీ డివిజన్ కార్యదర్శి సురేశ్ నిరసన తెలిపారు.

11 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం సుబ్బరావుపేటకు చెందిన 11 మందిపై సోమవారం ధర్మవరం గ్రామీణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పీర్ల ఊరేగింపులో ఎస్సీ కాలనీవాసులు పాల్గొనకుండా రహదారిపై ముళ్ల కంచెను అడ్డుగా వేయడం, శనివారం రాత్రి డప్పు వాయిస్తున్న చిన్న గంగన్నను మొద్దులు తీసుకెళుతున్న ఆటోతో ఢీ కొట్టించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు సుబ్బరావుపేటకు చెందిన రంగనాయకులు, బాలు, విశ్వనాథ్, రమణ, అజయ్, నరేంద్ర, శశిధర్, నంద, విజయ్, రాజు, ఓబులేశుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్ తెలిపారు. సుబ్బరావుపేట ఘటనపై ఎస్సీలను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంఘాల నాయకులు డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ళు, పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ. నేషనల్ హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

EDUCATION

GNM అడ్మిషన్స్: ఇంటర్మీడియట్‌లో Any Group పాస్ స్టూడెంట్స్‌కి G.N.M (Nursing)కి గవర్నమెంట్ సీట్స్ కలవు. అనంతపురం నందు గల గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. G.మురళి Cell: 9030661651, ATP.

అడ్మిషన్స్: APNCET (నర్సింగ్ సెట్)లో క్వాలిఫై కానీ స్టూడెంట్స్‌కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపి)కి గవర్నమెంట్ సీట్స్‌కు అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont: G.Murali, 9030661651. అనంతపురం.

REAL ESTATE

PLOT FOR SALE

ATP నుండి తాడిపత్రి - NH 544D South, North Corner 3, 4 AHUDA approval Layout 66x106= 16 Cents Main Road Plots అమ్మకానికి కలవు. సెల్: 6303444456/ 9866782918.

JOBS

Bhagya Lakshmi Agencies Ceat Tyres కంపెనీ గోడౌన్‌లో పనిచేయడానికి హెల్పర్లు మరియు డ్రైవర్ కావాలి. సంప్రదించండి: 9390088099.

Wanted APTITUDE Trainer: Required Aptitude Trainer to Train Engineering Graduates, Experienced Candidates Preferred. Salary Negotiable for Deserving Candidates. Contact: Corporate Training (&) Placement Officer. 7799797555.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బెల్ ఇన్‌ఫ్రా ATP నందు పనిచేయుటకు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్ జీతం ఇవ్వబడును. ATP. Cell: 9989452444.

ప్రముఖ E-Kart's, వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత: 10th, డిగ్రీ. జీతం: 18000 నుంచి కలదు. 81976 59359.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE cum CHIEF JUDICIAL MAGISTRATE :: AT MEDCHAL

O.S. No. 12 of 2025

Between:
State Bank of India, CRPF Group Centre Branch ... Plaintiff
And
M. Kiran Kumar S/o. P. Rami Reddy, H.No.3-473, Reddi Vari Street, Post: Gangampalli, Gorantla, Sri Satyasai District, (erstwhile Ananthapur Dist.,) Andhra Pradesh-515231.
O/o. The Officer Commanding 'B' Co.B/99, BN RAF, GC-CRPF Campus, Near BITS Pilani, Hakimpet, Secunderabad-500078. ...Defendant

NOTICE

Take notice that the plaintiff bank filed the above suit for recovery of amount against the defendant and the said suit is stands posted for your appearance on **14.08.2025.** Hence your are hereby directed to appear before the said court on **14.08.2025** at 10.30 AM personally or through an advocate failing which the matter will be heard in your absence.

// By order of the Court //

A.S.N.SURESH, Advocate
Cell No. 98484 53022, Plot No. 28, Flat No. 302, III rd Floor, Sri Balaji Residency, Sridevi Kalyan Estates, Yapral, Medchal / Malkajgiri District.

WALK IN INTERVIEW — 20 MICRONS® LIMITED

WALK IN WITH YOUR CV & WALK OUT WITH AN OFFER!
20 Microns Limited a Leading Company in Industrial Minerals & Specialty Chemicals is hiring for multiple positions!

Open Position: Location: Anantapur

Purchase and Soursing Executive
- Any Graduate
- Good Experience in Sourcing or Procurement of minerals.

Walk-In Details:
Date : 17 & 18th July 2025 Time: 12:00 PM - 4:00 PM
Venue: Sy. No. 43/1, Near Tractor Nagar, Garladinne, Obulapuram Village, Anantapur, Andhra Pradesh, India - 515731. Contact: 9036774857

Can't attend? No worries! Send your CV to Talent@20microns.com

JOIN US AND BE PART OF A GROWING TEAM!

పుట్టపర్తి పురపాలక సంఘము "ఇ" ప్రొక్యూర్‌మెంట్

టెండరు నోటీసు నెం. 19/2025/E1, తేది: 14-07-2025

క్రింద తెలిపిన పనులకు అర్హులైన వారి నుండి టెండర్లు పిలువడమైనది.

పని పేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తం
సాధారణ నిధులు	3 నెం.	రూ. 52.80 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ ప్రారంభ తేది: 16-07-2025 ఉ॥ 10-30 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ చివరి తేది: 31-07-2025 సా॥ 05-00 గం॥లకు
బిడ్ తెరిచే తేది: 31-07-2025 సా॥ 05-30 గం॥లకు

తదుపరి వివరములకు **https://tender.apeprocurement.gov.in** "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా: కమిషనర్, పుట్టపర్తి పురపాలక సంఘము. ఫోన్ నెం: 9515133115

Note: Any Addendum/Corrigendum/Bid Clarification/Time extension shall be issued on the website only. No separate process Notification shall be issued.

సం/- కమిషనర్, పుట్టపర్తి మునిసిపాలిటి

విద్యార్థులతో ర్యాలీగా వెళుతున్న న్యాయవాది ప్రభాకరరెడ్డి

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని లేఖలు

పెనుకొండ: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం న్యాయవాది ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వందలాదిగా ర్యాలీగా వెళ్లి పట్టణంలోని పోస్టాఫీసు వద్ద కార్డులు డబ్బాల్లో వేశారు. ఈనెల 26వ తేదీ వరకు జిల్లాలోని 63 మండలాల్లో ప్రతి మండలం నుంచి 1600 కార్డులు పంపుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం : సీపీఐ

లేపాక్షి: ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పేద ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. స్థానిక పిల్లిగుండ్ల కాలనీలో సోమవారం మండల కార్యదర్శి శివప్ప ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల పక్షాన పోరాడిన పార్టీ సీపీఐ అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గౌతమ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, వెంకటేశులు, సభ్యులుగా శివప్ప, రామ్మోహన్, గంగాధర్, గోవిందు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు బాలస్వామి, పట్టణ అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు రాజగోపాల్, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సోమందేపల్లిలో నాకాబంది

సోమందేపల్లి: సోమందేపల్లిలోని పలు కాలనీల్లో సోమవారం ఉదయం సీఐ రాఘవన్ ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ రత్న, డీఎస్పీ నరసింగప్ప ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మండలాల నుంచి ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది చేరుకొని అనుమానితులైన పలు గృహాల్లో అణువణువూ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో గంజాయి, ఇతర వస్తువులు లభించలేదని ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. ఎస్సైలు వెంకటేశ్వర్లు, రంగడు యాదవ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఎస్సై రమేశ్‌బాబు, పోలీస్ సిబ్బంది

నియంత్రిక ధ్వంసం.. తీగల అపహరణ

గోరంట్ల, న్యూస్‌టుడే: గౌనివారిపల్లి సమీపంలో పెట్రోల్‌బంకు కోసం ఏర్పాటుచేసిన విద్యుత్తు నియంత్రికను దొంగలు ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఈమేరకు నరసింహారెడ్డి అనే వ్యక్తి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒక్కో నియంత్రికలో సుమారు 60 కిలోల వరకు తీగలు ఉంటాయని రూ.40వేలకు పైగా నష్టం జరిగినట్లు తెలిపారు.

బీడు భూముల్లో సౌరపార్కు

● 10వేల ఎకరాల్లో ఏర్పాటుకు శ్రీకారం
● ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ అమోఘమని ఈ ప్రాంత ప్రజలు ప్రశంసిస్తున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి మొట్టమొదటిసారిగా మడకశిర పర్యటన చేసిన సందర్భంగా ఇక్కడి ప్రజల స్థితిగతులు, నిరుద్యోగ యువత ఉపాధి కోసం పడుతున్న అవస్థలు, రైతుల కష్టాలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంతో సానుకూలంగా విన్న ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు శ్రీకారం చుట్టారు.

యువతకు స్థానికంగా ఉద్యోగాల కల్పన

మారుమూల మడకశిర ప్రాంతం నుంచి ఉపాధి కోసం దాదాపు 40 వేల మంది బెంగళూరుకు వలసలు వెళ్లారు. అక్కడ వేల బాడుగలు చెల్లించి చాలీచాలని జీతంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అలాంటి ఇబ్బందులు లేకుండా మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, గుడిబండ మండలాల్లో 10వేల ఎకరాల్లో సౌరపార్కు, ఆర్. అనంతపురం సమీపంలో డిఫెన్స్ కర్మాగారం ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

మడకశిర మండలం బి.రాయాపురం వద్ద బీడుగా మారిన భూమి

రైతుకు తీరనున్న కష్టాలు

జింకలు, నెమళ్ల బెడద అధికమై మడకశిర మండలంలోని ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, చందకచర్ల, బుళ్లసముద్రం, కల్లుమర్రి, వైబీహళ్లి, హరేసముద్రం తదితర గ్రామాల్లో దాదాపు 8 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయక బీడుగా వదిలేశారు. ఈ భూముల్లోనే సౌరవిద్యుత్ పార్కులు నెలకొల్పనుంది. సౌరపార్కుకు భూములు ఇచ్చిన రైతులకు కంపెనీవారు ఏడాదికి ఎకరాకు రూ.30వేలు లీజు చెల్లించనున్నారు. బీడుగా ఉన్న భూములకు ఎకరాకు రూ.30వేలు చెల్లించనుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

15 ఏళ్లుగా ఏ పంట వేయలేదు

- శివలింగప్ప, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

మాకు ఐదెకరాల పొలం ఉంది. మా గ్రామ పరిసరాల్లో జింకల బెడద అధికం. ఏ పంట వేసినా చేతికందడం లేదు. దీంతో 15 ఏళ్లుగా బీడుగా వదిలేశాం. ఇలాంటి తరుణంలో ఎకరాకు ఏడాదికి రూ.30వేలు లీజు చెల్లించి మా భూముల్లో సౌరపార్కు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉంది.

కష్టాల్లో ఉన్న మాలాంటివారికి ఎంతోమేలు

-శివకుమార్, రైతు, మణూరు, మడకశిర మండలం

వేల పెట్టుబడులు పెట్టి సరైన వర్షాలు లేక పంటలు చేతికందడం లేదు. పంటలు సాగుచేసినా జింకలు దాడులు చేసి నష్టపరుస్తున్నాయి. దీంతో పదేళ్లుగా ఐదెకరాల పొలాన్ని బీడు పెట్టాం. కష్టాల్లో ఉన్న రైతుకు ఏడాదికి ఎకరాకు రూ.30వేలు చెల్లించడంతో కష్టం తీరనుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కెంచయ్యపాళ్యంలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం **- దాసప్ప**
సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం. **-జయమ్మ, సర్పంచి, శంకగరల్లు**

సమస్య: నాచేపల్లి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. చోదకులు ఇబ్బంది పడుతున్నారు. **-విశ్వేశ్వర**
సమాధానం: హరితరాయబారుల ద్వారా తొలగిస్తాం.- **తిప్పేస్వామి, సర్పంచి, మోరుబాగల్**
-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: పట్టణంలోని పరిగి రోడ్డు నుంచి బెంగళూరు రోడ్డుకు వెళ్లే రహదారిలో, పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి వెళ్లే రహదారి నుంచి సూరప్పకుంటకు వెళ్లే రహదారిలో కాలువలు శుభ్రం చేయడం లేదు.. **-రవిశంకర్, సత్యనారాయణ**
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం.. శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.

సమస్య: సింగిరెడ్డిపల్లిలో మురుగుకాలువల పక్కనే తొలగించిన చెత్తను కుప్పలుగా వేస్తున్నారు. **- గోవిందప్ప**
సమాధానం: సిబ్బందిచే తొలగించేలా చూస్తాం. **- శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య : పూలకుంట పంచాయతీలోని మరవపల్లిలో వీధిదీపాలు వెలగడం లేదు. -అలివేలమ్మ
సమాధానం: రెండు రోజుల్లో కొత్త దీపాలను ఏర్పాటు చేస్తాం. **- మంజునాథ్, సర్పంచి**

స్వచ్ఛతపై ఇంటింటా కేంద్ర బృందం పరిశీలన

రొద్దం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా ప్రజా ఆరోగ్య అవసరాల కోసం వినియోగించే శుద్ధ జల నీటితో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల పరిశుభ్రతపై కేంద్ర బృందం ఇంటింటికీ వెళ్లి పరిశీలించింది. మండలానికి ఒక గ్రామ పంచాయతీని గుర్తించి స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా వాటి శుభ్రతను వారు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సానిపల్లి గ్రామం మాత్రమే ఎంపికైందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించకుండా ఆరుబయట విసర్జన చేస్తే అనారోగ్యానికి గురవుతారని వారు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లతో పాటు పంచాయతీకి సంబంధించిన సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

సానిపల్లిలో తడి, పొడిచెత్తను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఘనంగా సీపీఐ మండల మహాసభలు

గోరంట్ల, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ మండల నాల్గవ మహాసభలు గోరంట్లలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు సమీపంలో పార్టీ జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, పెనుకొండ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతు, కార్మిక సంక్షేమం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో మండల నాయకులు రామకృష్ణ, సుధాకర్, బాలస్వామి, ఆంజనేయులు, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మండల నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పతాకావిష్కరణ చేస్తున్న జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

జీతాలు చెల్లించాలని మహిళల ఆందోళన

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర పట్టణ సమీపంలోని బేగార్లపల్లి గోల్డెన్ థ్రెడ్ గార్మెంట్ పరిశ్రమలో పనిచేసే మహిళలు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని సోమవారం సాయంత్రం రోడ్డుపై ధర్నా చేశారు. అరగంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో మడకశిర, అమరాపురం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ పరిశ్రమలో 250 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ఛార్జీలు పెట్టుకుని వచ్చి పనులు చేస్తున్నామని, మూడు నెలలైనా జీతాలు చెల్లించకపోతే కుటుంబాలు గడిచేదెలాగని మండిపడ్డారు. గార్మెంట్ యజమాని వచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదలమని భీష్మించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని యజమాని ప్రభాకర్‌తో మాట్లాడారు. రెండు రోజుల్లో ఖాతాలకు జీతం డబ్బులు వేస్తామని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రోడ్డుపై బైఠాయించిన మహిళలు

సమస్యలు పరిష్కరించారు

హిందూపురం గ్రామీణం : గ్రామాల్లోని ప్రజలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం..మీకుతోడుగా' దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులు స్పందించి వాటికి పరిష్కారమార్గం చూపారు. సి.చెర్లోపల్లి సమీపంలో ఆర్డీటీ సంస్థ నిర్మించిన పక్కాగృహాలకు వీధుల్లో సిమెంటు కాలువలు లేవని ఈనెల 12న ప్రచురితం కావడంతో ఎంపీడీవో సరస్వతీ కాలనీని పరిశీలించి మండల నిధులతో కాలువలు నిర్మించేలా చూస్తామన్నారు. కగ్గల్లు పంచాయతీలోని సుబ్బిరెడ్డిపల్లిలో దోమలు, పందుల బెడద తీవ్రంగా ఉందని ప్రచురితం కావడంపట్ల ఈవోఆర్డీ శివకుమార్ స్పందించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఊరికి దూరంగా ఉంచాలని పందుల యాజమానులకు నోటీసులు జారీ జేశారు.

స్పందనకు వందనం

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని అబాద్ పేట, సూగూరు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కాలనీల్లో పర్యటించారు. రోడ్లు, కాలువల నిర్మాణం చేపడతామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో త్వరలో విడుదల కానున్న రూ.92కోట్ల నిధులతో వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కౌన్సిలర్ ఇర్షాద్‌అహ్మద్, తెదేపా పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేశ్‌కుమార్

వేరుసెనగ విత్తనం పంపిణీ తీరుపై ఆగ్రహం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో వేరుసెనగ విత్తనం కాయ పంపిణీ తీరుపై వ్యవసాయ అధికారిణి విజయభారతిని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు నిలదీశారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ నిర్వహించారు. ముందుగా ఏవో మాట్లాడుతూ మండలంలో 1,370 మంది రైతులకు 850 క్వింటాళ్ల విత్తనం కాయను పంపిణీ చేశామన్నారు. అయితే తమ గ్రామాల్లో అనేక మంది రైతులకు విత్తనం కాయ అందక ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు కిష్టప్ప, జిలాన్, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు నాగప్ప, రఫీక్‌ఖాన్, అంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచి నరసింహులు జోక్యం చేసుకొని ముందుగా పేర్లు నమోదు చేసుకొన్న రైతులకే విత్తనం కాయను అధికారులు, సిబ్బంది పంపిణీ చేశారన్నారు. దీంతో సభ్యులు, సర్పంచులు వారితో వాగ్వాదానికి దిగడంతో ఎంపీడీవో, ఏవోలు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని వచ్చాక అందరికీ ఇస్తామని చెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేలో తప్పిదాలు, ఆధార్ నెంబర్ల నమోదులో పొరపాట్లు కారణంగా పలు గ్రామాల్లో భూమి లేని వారికి పదెకరాలు, ఆపై పొలాలు ఉన్నట్లు రికార్డుల్లో నమోదు కావడంతోనే తల్లికి వందనం పథకానికి అనర్హులుగా మారినట్లు చెప్పారు. అవి మార్చి అందరికి అందేలా చూస్తామన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అధికారులు రెడ్డిశేఖర్, సీడీపీవో శాంతలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, రవికుమార్,రామాంజనేయులు,మహేంద్ర, పరమేశ్వర్‌రెడ్డి, శుభారాణి పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిణిని ప్రశ్నిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

హిందూపురం: హిందూపురం పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రామాంజనేయులు(45) కుటుంబ సమస్యలతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ ఒకటో పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి రెండో విడత అడ్మిషన్లకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మురళీధర్ తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు ఈనెల 22వ తేదీ మధ్యాహ్నంలోపు తమ ధ్రువపత్రాలు పరిశీలించుకోవాలని, వెరిఫికేషన్ చేయించుకొన్న దరఖాస్తులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అనుమతిస్తారని తెలిపారు. కౌన్సెలింగ్ ఈనెల 24వ తేదీన శ్రీకంఠపురంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో కొనసాగుతుందన్నారు. వివరాలకు 9705855937 నంబరుకు సంప్రదించాలన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిలమత్తూరు, న్యూస్‌టుడే: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు.. చిలమత్తూరు సింగిల్‌విండో అధ్యక్షురాలిగా చెన్నమ్మ, సోమఘట్ట సింగిల్ విండో అధ్యక్షుడిగా బయప్పరెడ్డి సోమవారం రాత్రి ఎంపిక చేశారు. గత కొన్ని ఏళ్లుగా పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేశారు. కష్టాన్ని గుర్తించిన అధిష్ఠానం తమకు పదవులు ఇచ్చిందని, వాటిని ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం చేయమన్నారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చెన్నమ్మ

బయప్పరెడ్డి

సీసీ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

అమరాపురం: అమరాపురం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు స్థల పరిశీలన చేశారు. ఈనెల 8న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు హాజరుకాగా స్థానికులు కొద్దిపాటి వర్షం వస్తే బురదమయం అవుతుందని వారి దృష్టికి తీసుకెళ్లారు. సీసీ నిర్మాణం కోసం ఎంపీ నిధులు అందిస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఈనెల 16న భూమిపూజ చేస్తామని చెప్పడంతో స్థలాన్ని పరిశీలన చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

బ్యాంకులో ఒకే కౌంటర్‌తో అవస్థలు

గుడిబండ: గుడిబండ బ్యాంకులో ఒకే ఒక్క కౌంటరు ఉండడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే వినియోగదారులతో పాటు ప్రస్తుతం పంట రుణాల నవీకరణ జరుగుతుండడంతో బ్యాంకు నిండిపోతోంది. డబ్బులు కట్టడం, తీసుకోవడం లాంటి ప్రక్రియలు చేసేందుకు గంటల తరబడి నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. రెండు కౌంటర్లు ఏర్పాటుచేయాలని మాజీ సర్పంచి సత్యనారాయణ, హనుమంతరాయప్ప, రంగనాథ్, నాగరాజు తదితరులు కోరారు.

కిక్కిరిసిన ఖాతాదారులు

సమష్టి కృషితోనే ఏదైనా సాధ్యం

చిలమత్తూరు : తెదేపా కుటుంబ సభ్యులు అందరూ కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధ్యమని మండల తెదేపా కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. కన్వీనర్ ఇంటి సమీపంలో బూత్ కన్వీనర్లు, యూత్ ఇన్‌ఛార్జీలు, తెలుగు యువత తదితర అనుబంధ సంస్థల వారితో సమావేశం నిర్వహించారు. సుపరిపాలనలో తొలి అడుగు సంబంధించి మాట్లాడినట్లు వివరించారు. కార్యక్రమంలో గంగప్ప, రఫీక్, సురేంద్రయాదవ్, నాగరాజు, గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు

మెనూ ప్రకారం కోడిగుడ్లు పంపిణీ చేయాలి

పరిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం వారానికి ఐదు రోజులు విద్యార్థులకు కోడిగుడ్లు పంపిణీ చేయాలని జైభీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగరాజు, ఎంఎస్ఎఫ్.జిల్లా నాయకులు రవికుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం పరిగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలో విద్యార్థులకు అందిస్తున్న కోడి గుడ్లను పరిశీలించారు. కోడి గుడ్డు 50 గ్రాములు బరువు ఉండాలని అయితే గుత్తేదారు పంపిణీ చేస్తున్న కోడి గుడ్లు 30 గ్రాములు బరువు తూగుతున్నాయని ఆరోపించారు. గుడ్లు సరఫరా చేస్తున్న గుత్తేదారుపై తగు చర్యలు తీసుకోవాలని ఎంఈవో 2 శేషాచలంతో డిమాండు చేశారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. డిప్యూటీ తహసీల్దార్ హనుమంతుకు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రమేష్, నరసింహులు, మూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: మహిళలు, అమ్మాయిలు, చిన్నపిల్లల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పోలీసుశాఖ ఏర్పాటు చేసిన శక్తి బృందం సభ్యులు శ్రీనివాసనాయక్, వెంకటేశ్వర్లు, రేణుకా పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌ఏపీఎస్ ఎయిడెడ్ జూనియర్, కమ్మలవాండ్లపల్లి సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో సోమవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వాడకంతో ఎదురయ్యే సమస్యలు, ట్రాఫిక్ నియమావళి, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన యాప్‌ల ద్వారా క్షణాల్లో సమాచారం పోలీసులకు చేరవేయవచ్చన్నారు. ప్రిన్సిపల్ డా.సూర్యనారాయణ, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నలభై ఏళ్లనాటి మాటాముచ్చట

వారంతా 40 ఏళ్ల క్రితం (1984-85) దేమకేతేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. సోమవారం ఒక చోట కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు బోధించిన ఉపాధ్యాయులు దస్తగిరి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగభూషణంను ఘనంగా సన్మానించుకున్నారు. నాడు చేసిన అల్లరి పనులు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు.
- న్యూస్‌టుడే, చిలమత్తూరు

ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ

పెనుకొండ,న్యూస్‌టుడే: ఎన్నికల జాబితా నిర్వహణపై బీఎల్వోలకు సోమవారం ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. బీఎల్వోలకు విధులపై శిక్షణ, ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే పై తీసుకోవాల్సిన చర్యల పై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 44 మందికి గుర్తింపు పత్రాలు అందజేశారు.

అలనాటి కోనేటికి పూర్వ వైభవం

● ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపల్లిలోని సజ్జగంట రంగనాథస్వామి ఆలయం కోనేరులో పూడికతీత పనులను ఉపాధి హామీ పథకం కింద అధికారులు చేపట్టారు. పూర్వం నిర్మించిన ఈకోనేరు దెబ్బతినడంతో పాటు మురుగు, వర్షపు నీరు చేరినా అటు దేవాదాయ శాఖ, ఇటు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పట్టించుకోక పోవడంతో చుట్టూ ముళ్లకంపలు, పిచ్చి మొక్కలతో మురికికూపంగా మారింది. దీంతో ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వసంతోత్సవాలకు గ్రామంలోని రైతుల వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో చాకార్లపల్లి వైమానిక దళం విశ్రాంత అధికారి ఆర్ సీ రెడ్డి కుటుంబ సభ్యులు ముందుకొచ్చి రూ.10 లక్షల వ్యయంతో కోనేరు పునర్నిర్మాణానికి కృషి చేశారు. అయితే చివర్లో ఈవిషయం వివాదంగా మారడంతో కోనేరు మళ్లీ అపరిశుభ్రంగా తయారైంది. అంతేగాక ఈకోనేరు పక్కనే ఉన్న ఆలయం స్థలం 83 సెంట్లు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు కఠిన చర్యలు చేపట్టకుండా, తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఏపీవో సోమశేఖర్‌రెడ్డి, ఈసీ అన్నపూర్ణ, సాంకేతిక, క్షేత్ర సహాయకులు శేఖర్, కిషోర్ తదితరులు స్పందించి గ్రామ కూలీలతో ఆలయం కోనేరులో పూడికతీత పనులతో పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. పదిరోజులుగా పనులు చేస్తున్నారు.

కోనేరు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

చుట్టుపక్కల పూల మొక్కలు

పూడికతీత పనుల అనంతరం కోనేరు చుట్టుపక్కల పలు రకాల పూల మొక్కలు, ఇతర మొక్కలు నాటించి, కూలీల ద్వారా చక్కగా సంరక్షిస్తాం.
-వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీవో, సోమందేపల్లి

కంకర పరిచారు.. రోడ్డు మరిచారు

● దుమ్మూధూళితో ఇబ్బందులకు గురవుతున్న గ్రామీణులు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: పరిగి మండలంలోని కొన్ని గ్రామాలకు రహదారులు ఇప్పటికీ పూర్తికాలేదు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో రహదారులను బాగు చేసేందుకు లక్షలాది రూపాయల వ్యయంతో కంకర వేసి పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. అంతలోనే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి నుంచి ఐదేళ్లు రహదారుల బాగోగులు పట్టించుకొన్న పాపాన పోలేదు. ప్రస్తుతకూటమి ప్రభుత్వమైనా స్పందించి అసంపూర్తిగా ఆగిన రహదారులను బాగు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వాన రహదారులున్న గ్రామాలు: బీచిగానపల్లి నుంచి పాత్రగానిపల్లికి వెళ్లే రహదారి, మోదా, బందార్లపల్లి, యు.బసవనపల్లి, దాసిరిపల్లి, ఊటుకూరు, అక్కంపల్లికి, మధుగిరికి రోడ్డు నుంచి పుట్టగూర్లపల్లికి, శాసనకోట నుంచి బాలిరెడ్డిపల్లి మీదుగా హిందూపురం వెళ్లే రహదారి, పరిగి నుంచి శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లికి వెళ్లే రహదారులు గుంతలు మయంగా మారి ప్రయాణానికి అనువుగా లేవు. వాహన చోదకులు తరుచూ ప్రమాదాల భారినపడుతున్నారు. రహదారులు అధ్వానంగా ఉండటంతో బస్సుల రాకపోకలు లేవు. దీంతో ప్రజలు ద్విచక్రవాహనాలు, ఆటలలో పరిగికి తరలి వస్తున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరు నాగన్న దృష్టికి తీసుకెళ్లగా మండలంలో ఉన్న గ్రామీణ రహదారులను ఆర్ అండ్‌బీకి అనుసంధానం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా ఆగిన రహదారుల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మోదా నుంచి బందారపల్లికి వెళ్లే రహదారి దుస్థితి

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి

ఆర్మీ అటాచ్ క్యాంపునకు ఎంపిక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 8 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఆర్మీ అటాచ్ క్యాంపునకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని తెలిపారు. సికింద్రాబాద్‌లోని 76 ఇన్ఫాంట్రీ బ్రిడ్జి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు క్యాంపు ఉంటుందన్నారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మన్న, నిఖిల్, సాయినిఖిల్, బాల ఓబులేశు, వెంకటసాయికృష్ణ, తృతీయ సంవత్సరం చదువుతున్న పోతిరెడ్డి, ధనుశ్, అహమ్మద్‌లు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

చెరువును పరిరక్షించాలని వినతి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన సాగునీటి చెరువును ఏటా కొంతమేరకు పూడ్చి చదును చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక తెదేపా నాయకుడు వాల్మీకి పెద్దన్న రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 282 ఎకరాల ఆయకట్టు కలిగిన చెరువులోకి కొందరు మట్టిని తరలించి పూడ్చుతున్నారని తహసీల్దారు బాలాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. స్థానికులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. వంగపేరుకు హంద్రీనీవా కాలువ నీటి విడుదల చేయడానికి తూము ఏర్పాటు చేయాలని వంగంపల్లి, కొడపగానిపల్లి, ఇరగంపల్లి, పోతులకుంట గ్రామాలకు చెందిన పలువురు రైతులు నాగేంద్ర, శ్రీరాములు ఆధ్వర్యంలో తహసీల్దారుకు వినతిపత్రం అందించారు.

డిగ్రీ కోర్సులతో ఉపాధి అవకాశాలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: డిగ్రీ కోర్సులతో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆర్జేడీ నాగలింగారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎఫ్ఆర్ఎస్, టీఎల్ఎఫ్, టీచింగ్ డైరీ అంశాలపై అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అనేక మౌలిక వసతులను కల్పిస్తోందని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు చిట్టెమ్మ, త్రివేణి, షమీవుల్లా, పావని పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక

కదిరి: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గంలోకి కదిరి వాసులను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా శివరాం, ఉపాధ్యక్షుడిగా కె.నరసింహమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. కదిరి బ్రాహ్మణ నేతలు బాబుప్రకాశ్, హరిప్రసాద్, పాపయ్యశాస్త్రి, ప్రసాద్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

హాకీలో బాలికల సత్తా

తల్లిదండ్రుల సహకారంతో ప్రతిభ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఒకప్పుడు హాకీ క్రీడ అంటే బాలికలకు భయం. శిక్షణలో ఎక్కడ హాకీ స్టిక్ తగిలి గాయపడతారేమోనని తల్లిదండ్రులు పంపేవారు కాదు. కానీ నేడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. చిన్నారుల నుంచి బాలికల దాకా ఆసక్తి పెంచుకుని చక్కగా రాణిస్తున్నారు. ఈ కోవకు చెందిన వారే ధర్మవరం మండలం, పట్టణానికి చెందిన పలువురు బాలికలు. ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు శ్రీ సత్యసాయి జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించారు. మరొకరు కేరళ హాకీ జట్టుకు ఎంపికయ్యారు.

క్రీడలో రాణించి ఉన్నత ఉద్యోగం సాధిస్తా

పెనుకొండ మండలం సోమందేపల్లికి చెందిన మధురిమా బాయి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు రేణుకా బాయి, పూజారి రవీంద్రానాయక్ తమ కుమార్తెకు హాకీలో శిక్షణ ఇప్పించారు. సబ్ జూనియర్ పోటీలకు జిల్లా జట్టులో స్థానం దక్కించుకుని అత్యధిక గోల్స్ సాధించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ సంఘం సభ్యులు ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ముంబయిలోని సాయ్, ఎన్‌సీఓఈ(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ) అకాడమీలో శిక్షణ పొందుతోంది. హాకీలో గొప్పగా రాణించి, క్రీడా కోటలో ఉన్నత ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని తెలిపింది.

-మధురిమా బాయి

భారత జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యం

ధర్మవరం మండలం వసంతపురం గ్రామానికి చెందిన మందల వైష్ణవి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. చిన్నప్పటి నుంచి హాకీపై ఆసక్తి పెంచుకుంది. తల్లిదండ్రులు నాగరాజు, శివమ్మ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి సహకారంతో పాఠశాల స్థాయిలోనే హాకీ క్రీడపై పట్టు సాధించింది. ప్రస్తుతం లక్నోలోని సాయ్, ఎన్‌సీఓఈ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ) అకాడమీలో శిక్షణ పొందుతోంది. భవిష్యత్తులో ఇండియా జట్టుకు ఎంపికై దేశానికి మంచి పేరు తేవాలన్నదే తన ఏకైక లక్ష్యమని తెలిపింది. -మందల వైష్ణవి

కోచ్ కావాలని ఉంది

ధర్మవరానికి చెందిన రమావత్ వర్ష ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. తల్లి మేనకా బాయి ధర్మవరంలో అంగన్‌వాడీ కార్యకర్తగా, తండ్రి రమేశ్ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. 6వ తరగతి నుంచే హాకీ నేర్చుకుని అనేక పోటీల్లో పతకాలు సాధించింది. పట్టణానికి చెందిన హాకీ అసోసియేషన్ సభ్యులు సూర్యప్రకాశ్, శ్రీనివాసులు, అరవింద్‌గౌడ్‌లు ప్రతిభను గుర్తించి సాయ్ హాకీ కోచ్ అయినా హుసేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం కర్ణాటక మడికెరిలోని సాయ్, ఎన్‌సీఓఈ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ) అకాడమీలో శిక్షణ పొందుతోంది. భవిష్యత్తులో ఇండియా మహిళా హాకీ జట్టుకు ఎంపిక కావాలని ఉందని వర్ష తెలిపింది. -రమావత్ వర్ష

జాతీయ స్థాయిలో సత్తా చాటడమే ధ్యేయం

ధర్మవరం మండలం వసంతపురానికి చెందిన తలారి హేమ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు అనసూయమ్మ, రమేశ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాయ్ శిక్షణలో రాణించడంతో కేరళ సబ్ జూనియర్ జట్టుకు ఎంపికైంది. ప్రస్తుతం కర్ణాటక మడికెరిలోని సాయ్, ఎన్‌సీఓఈ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ) అకాడమీలో శిక్షణ పొందుతోంది. జాతీయ స్థాయిలో హాకీ పోటీల్లో సత్తాచాటి గొప్ప క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలన్నదే లక్ష్యమని హేమ తెలిపింది. -తలారి హేమ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: ముదిగుబ్బలోని కదిరి రోడ్డు పెట్రోలు బంకు నుంచి బస్టాండ్ కూడలి వరకు ఆర్టీసీ బస్సులు అతివేగంగా వస్తున్నాయి. బ్యాంకు, దుకాణాల ముందు ఉన్న ప్రజలు అటు, ఇటు దాటుకునే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

సమాధానం: వేగనిరోధకాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- శివరాముడు, ముదిగుబ్బ పట్టణ సీఐ**

సమస్య: ముదిగుబ్బ తహసీల్దారు కార్యాలయానికి వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ నవీకరణ కోసం చిన్నపిల్లలతో వచ్చే తల్లిదండ్రులు కూడలిలోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. **- రమణమ్మ**

సమాధానం: తాగునీటి వసతి కల్పిస్తాం. **- నారాయణస్వామి, తహసీల్దారు**

సమస్య: ముదిగుబ్బలోని కస్తూర్బా కాలనీలో సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. **- బాషా**

సమాధానం: రోడ్లు నిర్మించేలా ప్రతిపాదిస్తాం. **- మారుతి, పీఆర్ ఏఈ**

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

సమస్య: మండలంలోని పాత పాళ్యం రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు వ్యాపించి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. **- రాధాకృష్ణ, స్థానికుడు**

సమాధానం: ముళ్లపొదలను తొలగిస్తాం. **- మోహన్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: రాంపురం రోడ్డుకు ఆనుకొని ఎరువు దిబ్బెల నిల్వతో అటుగా వెళ్లే బాటసారులు ముక్కుమూసుకునే పరిస్థితి నెలకొంది. **- శివ, స్థానికుడు**

సమాధానం: రోడ్డుకు ఆనుకొని నిల్వ చేసిన ఎరువు దిబ్బెలను తొలగిస్తాం. **- జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కనగానపల్లి

ప్రజలే తిప్పికొడతారు: ఎమ్మెల్యే కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై క్యూఆర్ కోడ్‌తో వెళ్తున్న వైకాపా నాయకులను ప్రజలే తిప్పికొడతారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం కదిరిలోని 27వ వార్డులో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సాగు, తాగునీటి ప్రాజెక్టులను ఉన్నత ప్రాధాన్యం ఇచ్చి పూర్తిచేస్తున్నారన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి క్యూఆర్ కోడ్‌తో నాయకులను గ్రామాల్లోకి పంపుతున్నట్లు విమర్శించారు. తమకిలాంటి అభ్యంతరం లేదని, జనమే తిప్పికొడతారని హెచ్చరించారు. కదిరిలో ఎంఐఎంఎస్ (మద్యం, మెడికల్) కుంభకోణం ఉందని వైకాపా నాయకులు ఉద్దేశించి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ దిల్దార్ సిస్సా, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, బహావుద్దీన్, బాబయ్య, కృష్ణమూర్తి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రాయలవారిపల్లిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట, నాయకులు

పుట్టపర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

రూ.1.65 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి పట్టణంలో సీసీ రోడ్లు, పుడా పార్కుల అభివృద్ధి, నూతన బోర్లు, వీధి దీపాల ఏర్పాటుకు రూ. 1.65 కోట్లతో చేపట్టిన పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. సత్యసాయి శత జయంతి వేడుకలకు నూతన శోభ తీసుకొస్తామని చెప్పారు. ప్రస్తుత పట్టణంలో రూ. 75 లక్షలతో సీసీ రోడ్లు, రూ. 10 లక్షలతో వీధి దీపాల ఏర్పాటు, బోరుబావులకు రూ. 5 లక్షలు, ప్రశాంతి నిలయం పడమర రహదారి రూ. 88 లక్షలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ క్రాంతికుమార్, డీఈ నరసింహమూర్తికి ఆదేశించారు.

బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి: సీపీఐ

ధర్మవరం పట్టణం: పట్టణంలోని 650-2 సర్వే నంబరులో ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్‌కు కేటాయించిన రెండెకరాల భూమిని కొంత మంది అక్రమార్కులు దొంగ పట్టాలు సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. సోమవారం పుట్టపర్తిలో జరిగిన పీజీఆర్ఎస్ దినోత్సవంలో సీపీఐ, ఏఐటీయూసీ, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్ యూనియన్ నాయకులు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూసీ కార్యదర్శి రమణ, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్ యూనియన్ అధ్యక్షుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నంబులపూలకుంట (గాండ్లపెంట), న్యూస్‌టుడే: ఎన్పీకుంట మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శివకుమార్, శివన్నలు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాకు పరిశీలించి, అనుమతి పొందిన పీసీలను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఏవో లోకేశ్వరరెడ్డి, దుకాణ నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రావణమాస మహోత్సవాలు విజయవంతం చేద్దాం

కదిరి, న్యూస్‌టుడే: నల్లచెరువు పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణమాస మహోత్సవాలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. సోమవారం కదిరిలోని తన నివాసంలో మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈనెల 26న శ్రావణ తొలి శనివారంతో ఉత్సవాలు మొదలై ఆగస్టు 19న ముగుస్తాయన్నారు. తెదేపా మండల కన్వీనర్ రాజశేఖర్, ఆలయ కమిటీ, అధికారులు పాల్గొన్నారు.

బుక్కపట్నం తెదేపా అధ్యక్షుడి ఎన్నిక

బుక్కపట్నం, న్యూస్‌టుడే: బుక్కపట్నం తెదేపా పట్టణ అధ్యక్షుడిగా కేశప్పను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

'ఇంజినీరింగ్ కార్మికుల వంటావార్పు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పురపాలక శాఖ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న దీక్ష సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు శిబిరంలోనే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. పలువురు యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు అత్యవసర సేవలు పూర్తిగా బంద్ చేస్తామన్నారు. యూనియన్ నాయకులు ఓబుళపతి, లింగరాజు, రామాంజనేయులు, సాయినాథ్, సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'కుమార్తె హత్యపై విచారణ జరపండి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : తన కుమార్తె హత్యపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఓ తండ్రి మీడియాను ఆశ్రయించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన కె.వెంకటరమణ.. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తన కుమార్తె దీపిక (21) డిగ్రీ చదివి, బెంగళూరులోని ఓ మెడికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో పుట్టపర్తికి చెందిన వ్యక్తి ప్రకాష్.. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని తన కుమార్తెను మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధపడగా.. తన కుమార్తె ప్రశ్నించిందని చెప్పారు. దీంతో అతడు.. తన బాబాయితో మాట్లాడదామని చెప్పి, ఊరు తీసుకెళ్లి పండ్ల రసంలో విషం కలిపి హత్య చేశాడని ఆరోపించారు. తన కుమార్తె మృతికి కారణమైన ప్రకాష్, అతని బాబాయిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనితకు వెంకట రమణ విజ్ఞప్తి చేశారు.

దూసుకొచ్చిన భారీ వాహనం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద సోమవారం బెంగళూరు నుంచి తాడిపత్రి వెళ్తున్న భారీ వాహనం రాంగ్ రూట్‌లో దూసుకొచ్చింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఆటో చోదకులు హడలెత్తారు. ఎదురుగా పాఠశాల బస్సు వస్తున్నప్పుడు భారీ వాహన చోదకుడు రాంగ్ రూట్‌లో రావడంతో వాహనదారులు ప్రమాదాన్ని పసిగట్టి గట్టిగా కేకలు వేయడంతో నిలిపివేశాడు. భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములు కూడలి వద్ద భారీ వాహనంతో వాహనదారుల ఇక్కట్లు

బకాయి వేతనాలు చెల్లించకపోతే సమ్మె

గాండ్లపెంట, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల బకాయి వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని ఆయా గ్రామాల అధికారులకు 15వ ఆర్థిక సంఘం నిధులు సాకు చూపుతూ జాప్యం చేస్తున్నారని రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, ఖాదర్‌బాషా అన్నారు. వెంటనే చెల్లించకపోతే తిరిగి సమ్మె చేపడతామని సోమవారం కార్మికులు అక్కులప్ప, బాలకృష్ణ, కదిరప్ప, వెంకటరమణులతో కలిసి ఎంపీడీవో వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెంటనే పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో తిరిగి సమ్మె కొనసాగింపు దిశగా కార్యాచరణ చేసుకుంటామని తెలిపారు.

ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీ అర్బన్ ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకు చుట్టూ మురుగు పేరుకుపోయింది. వ్యర్థాలు వేయడంతో అపరిశుభ్రంగా మారింది. వృథానీరు వెళ్లే మార్గం లేకుండా అడ్డుగా మట్టి వేయడంతో నిల్వ ఉంటున్నాయి. దీంతో దోమలు వృద్ధిచెంది రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోయారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజుబాబును వివరణ కోరగా.. వెంటనే ట్యాంకు చుట్టు ఉన్న అపరిశుభ్రత తొలగించి, వృథానీరు కాలువలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, కదిరి పట్టణం

విద్యుదాఘాతానికి గురైన బాలిక

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శారదానగర్‌లో సోమవారం వెంకటేశ్వరి 11 ఏళ్ల బాలిక విద్యుదాఘాతానికి గురైంది. ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు ఒంగోలుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు హరి కుటుంబ సభ్యులతో వచ్చాడు. పనులు జరుగుతున్న ఇంటిపైకి వెళ్లిన బాలిక నిర్మాణానికి వినియోగించిన ఇనుపచువ్వను తాకడంతో విద్యుత్తుఘాతానికి గురైందని స్థానికులు తెలిపారు. గాయపడిన బాలికను వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండో పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మహిళా కార్యకర్త నాగరత్నమ్మ కుటుంబానికి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ రూ. 40 వేలు ఆర్థికసాయం అందించారు. సోమవారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేశ్‌చౌదరి ఆమె భర్త వెంకటేశ్‌కు నగదును అందజేశారు. నాయకులు పురుషోత్తం గౌడ్, షరీఫ్, విజయ్, మహిళా నాయకురాలు బీబీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంజీవ్ తీవ్రంగా గాయపడ్డాడు. సంజీవ్ హమాలీ పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా కొండకమర్ల నుంచి ఓడీసీకి వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడ్ని ప్రైవేటు వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. బాధితుడి సోదరుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపటినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

విద్యుత్తు నియంత్రిక ధ్వంసం

కొండకమర్ల (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: కొండకమర్ల పంచాయతీలోని గంగిరెడ్డిపల్లికి చెందిన శివారెడ్డి పొలంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్తు నియంత్రికను ధ్వంసం చేశారు. అందులోని రాగి తీగలను దొంగలించారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన శివారెడ్డి ఈ విషయాన్ని గమనించి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువతొట్లిపల్లికి చెందిన కె.కుమార్ (60) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపి తెలిపిన మేరకు వివరాలిలా.. ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నా అతన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిలు అయ్యాయి. వారికున్న ఎకరం భూమిలో పంటల సాగు కోసం అప్పులు చేశారు. వాటిని తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య కమలశశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి నుంచి ముష్టికోవెలకు వెళ్లే దారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో ప్రయాణం నరకప్రాయమైంది. ఈ దారిపై నిత్యం ఏడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. న్యామద్దల గ్రామ చెరువు కట్టకింద, సమీపంలోని హంద్రీనీవా కాలువ, అక్కడి నుంచి కొంత దూరంలో రోడ్డు శిథిలమై గుంతలు ఏర్పడ్డాయి. సుబ్బరాయునిపల్లి సమీపంలో సైతం దారిపై తారు చెదిరి కంకర తేలడంతో వాహనదారులు, ప్రయాణికులు అపసోపాలు పడుతున్నారు. ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈ అబ్దుల్ ఖాదర్ దృష్టికి తీసుకుపోగా ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు చేపడతామన్నారు.

తాగునీటి కొరత.. తీరేదెన్నడో?

కార్మికులు నిలిపివేసిన మోటార్లు

ఇబ్బందుల్లో గ్రామీణులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: కాలం ఏదైనా ముదిగుబ్బలో తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, విద్యుత్తు కోతలు, మోటార్ల మరమ్మతులు, వేతనాల కోసం కార్మికుల నిరసనలు వెరసి ప్రజలకు తాగునీటి కొరత వేధిస్తోంది. ముదిగుబ్బ మండలంలో 25 పంచాయతీలు, 86 గ్రామాలున్నాయి. 62 వేలకుపైగా జనాభా ఉన్నా సరిపడా నీరు సరఫరా కావడం లేదు. ఫలితంగా వేసవి, వర్షాకాలంలోనూ తాగునీటికి అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

నిర్వహణ సక్రమంగా లేక..

ముదిగుబ్బ మేజర్ పంచాయతీలో సత్యసాయి నీరు వారానికి ఒకరోజు సరఫరా అవుతోంది. అందులోనూ చివరి కాలనీవాసులకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని వాపోతున్నారు. ముదిగుబ్బలోని చిన్నకోట్ల సమీపంలోని చిత్రావతి జలాశయం నీరు ప్రధాన ఆధారం. అక్కడి నుంచి దొరిగల్లు, ముదిగుబ్బ పంప్‌హౌస్‌కు నీరు సరఫరా అవుతోంది. ఇక్కడి నుంచి తలుపుల, కదిరి, నల్లమాడ, తదితర ప్రాంతాలకు సత్యసాయి నీరు సరఫరా అవుతోంది. నిత్యం విద్యుత్తు అంతరాయాలు, మోటార్ల మరమ్మతులకు గురవుతుండటంతో నీరు పూర్తిగా సరఫరా కావడం లేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి.

చేతిపంపులే ఆధారం..

సీపీడబ్ల్యూ పథకం కింద ఉప్పలపాడు నుంచి సరఫరా అయ్యే నీరు సక్రమంగా రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు చేతిపంపులపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు వేతనాలు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు తాగునీటి సరఫరా నిలిపివేసి ఈనెల 9వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించారు. మోటార్లు నిలిపివేయడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. చేతిపంపులు, మోటార్ల దగ్గర నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

అడుగంటిన పాతాళగంగా..

తలుపుల: పొలతలవాండ్లపల్లి పంచాయతీ తురకవాండ్లపల్లి, కాశీలోపల్లి గ్రామాల్లోని తాగునీటి పథకాల్లో పాతాళగంగా అడుగంటిపోవడంతో నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం పది నుంచి పదిహేను బిందెల నీరు మాత్రమే వస్తుందని తురకవాండ్లపల్లి గ్రామస్థులు చెబుతున్నారు. బోరు 420 అడుగులు లోతు ఉంటే, 400 అడుగుల వరకు పైపులు అమర్చినట్లు తెలిపారు. కాశీలోపల్లిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి మధును వివరణ కోరగా.. ఇటీవల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో రెండు బోర్లు వేయిస్తే నీళ్లు పడ్డాయన్నారు. మోటార్లు బిగించాల్సి ఉందని, ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఇబ్బందులు లేకుండా చేస్తాం

వేతనాల కోసం కార్మికులు చేపట్టిన సమ్మె, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వేతనాలు చెల్లించేలా కృషి చేస్తున్నాం. తాగునీటి నిర్వహణ సక్రమంగా చేపట్టి సకాలంలో తాగునీటి సరఫరా అయ్యేలా చూస్తాం.

- ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ముదిగుబ్బ

మంత్రి చొరవతో సమస్య పరిష్కారం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సిద్ధయ్యగుట్ట కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక దిమ్మె సమస్యను సోమవారం పరిష్కరించారు. విద్యుత్తుశాఖ అధికారులు కొత్త దిమ్మె ఏర్పాటు చేశారు. పట్టణంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నిర్వహించిన పాదయాత్రలో సమస్యను ప్రజలు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు కొత్త దిమ్మె నిర్మాణం పూర్తయినట్లు భాజపా పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. పట్టణంలోని తిక్కస్వామినగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ అనే యువకుడికి మెరుగైన వైద్యం అందేలా తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లేందుకు ఆర్థిక సాయం చేసినట్లు వివరించారు.

'చంద్రబాబు మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికలకు నెల ముందే వచ్చి పోటీ చేసి గెలిచిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గానికి చుట్టపుచూపుగా వచ్చిపోతున్నాడని.. తప్పు అతడిది కాదని, ఓట్లేసిన ప్రజలదని వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని మారుతి రాఘవేంద్ర కల్యాణ మండపంలో చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైకాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని తెలిపారు. వైకాపా కార్యకర్తలు, నాయకులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని, చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

నంబులపూలకుంట (గాండ్లపెంట): ఎన్పీకుంట మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైకాపా నాయకులు మగ్బూల్ అహమ్మద్, పూల శ్రీనివాసులరెడ్డిలు మండలస్థాయి సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనట్లు ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. మండల కన్వీనర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం

ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట.. పచ్చని పల్లె.. 90 శాతం మంది వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగించే ప్రజలు.. కొన్నేళ్లుగా ఆ గ్రామంలో వ్యక్తిగత కక్షలు, వర్గ, ప్యాక్షన్ రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. వర్గపోరుతో హత్యలు, ప్రతిదాడులతో అట్టుడుకుతోంది. రాజకీయ పరిణామాలు మారినప్పుడల్లా నివురుగప్పిన నిప్పులా ఉన్న కక్షలు బయటపడుతున్నాయి. యువత సైతం తగాదాల్లో తలదూర్చుతూ బంగారు జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తాజాగా గ్రామ పరిధిలో మరో హత్యఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది.

పచ్చని పల్లెలో కక్షల రాజ్యం..!

- ఫరీదుపేటలో ఆగని వర్గ రాజకీయాలు
- దాడులు, హత్యలతో ప్రజలు బెంబేలు

ఫరీదుపేట గ్రామంలో పోలీసు పహారా

జిల్లాలో అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఫరీదుపేట ఒకటి. 1,500 కుటుంబాలు, సుమారు ఆరువేల మంది జనాభా నివసిస్తున్నారు. కేవలం రెండు వర్గాల్లోని 20 మంది వ్యక్తుల కారణంగా కక్షలు, కొట్లాటలు, హత్యలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. హత్యా రాజకీయాల్లో రెండు వర్గాల్లో కొద్దిమందికి మాత్రమే ప్రమేయముంటున్నా ఫలితం అందరూ అనుభవించాల్సి ఉంటోందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రశాంతత కోల్పోతున్నామంటున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో అన్నిరకాల సదుపాయాలున్నాయి. గ్రామాభివృద్ధిలో దూసుకుపోవాల్సిన పల్లెలో రాజకీయ ఆధిపత్య పోరులో నలిగిపోతోంది.

★ వర్గాల వారీగా ఏటా గౌరీ పౌర్ణమి ఉత్సవాలు గ్రామంలో నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కిందట నుంచి కొంతమంది మైనారిటీలను మూడోవర్గంగా ఓ వ్యక్తి ఏర్పాటు చేశారు. మూడువర్గాలు పండగను పోటాపోటీగా నిర్వహిస్తున్నాయి. ఈ సమయంలో కొట్లాటలు జరుగుతున్నాయి. మూడువర్గాల్లో ఏ వర్గం అధికారంలో ఉంటే వారికి వ్యతిరేకంగా ఉన్నా, పాత కక్షల కారణంగా అర్హులకు సైతం ప్రభుత్వ పథకాల్లో అన్యాయం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

నలుగురి బలి

◆ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉపఎంపీపీగా ఉన్న కోటిపాత్రుని పోలినాయుడును హత్య చేశారు. వ్యక్తిగత, వర్గ రాజకీయాలతో ఘటన జరిగింది. ఇందుకు కారకుడిగా భావించి రాంబాబు అనే వ్యక్తిని కొన్ని నెలల వ్యవధిలోనే చంపేశారు.

◆ వైకాపా పాలనలో కక్షపూరితంగా తెదేపా వర్గీయులపై దాడులు జరిగాయి. ప్రధాన నాయకులు కొన్నేళ్లు గ్రామాన్ని విడిచి వెళ్లిపోయారు.

◆ తెదేపా నేత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొత్తకోట అమ్మినాయుడుపై హత్యాయత్నం జరగ్గా త్రుటిలో తప్పించుకున్నారు.

◆ కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో కూన ప్రసాద్ అనే వ్యక్తిని హతమార్చారు. ఇందుకు కారణం రాజకీయ కక్షలే. ◆ ఈనెల 13న ఓ కీలకనేత అనుచరుడిగా పేరున్న సత్తారు గోపిని హత్య చేశారు.

రౌడీషీటర్లు ఎక్కువే..

ఎచ్చెర్ల మండలం, జిల్లాలో గ్రామస్థాయిలో అత్యధిక రౌడీషీటర్లు ఉన్న గ్రామంగా ఫరీదుపేటకు పేరుంది. 8 మందిపై రౌడీషీట్లు నమోదయ్యాయి. మరో 10 మందికి అన్నిరకాల తగాదాల్లో ప్రమేయం ఉంది. గ్రామానికి చెందిన వారిపై ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో 114 కేసులు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చిన్న గొడవ జరిగినా వందల మంది పోలీసులు పహారా కాయాల్సిన పరిస్థితులుంటాయి.

పలాస జీడిపప్పునకు జాతీయ పురస్కారం

ఒక జిల్లా..ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) కింద పలాస జీడిపప్పునకు దక్షిణ జాతీయ పురస్కారాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం దిల్లీలో కేంద్రమంత్రులు పియూష్ గోయల్, జితిన్ ప్రసాద్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్త, రాష్ట్ర మంత్రి ఎస్.సవిత చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి పురస్కారం తీసుకున్న విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలాస జీడిపప్పునకు జాతీయ పురస్కారం రావడం జిల్లాకు దక్కిన గౌరవమని అన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

రూ.15 లక్షల విలువైన ఎరువుల జప్తు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురంలో గౌతం (ట్రేడర్స్) హోల్‌సేల్ ఎరువుల దుకాణంలో నిల్వ వివరాలు పుస్తకాల్లో నమోదు చేయకపోవడాన్ని గుర్తించామని ఏడీఏ బి.విజయప్రసాద్, విజిలెన్స్ సీఐ ఆదారి సంతోష్‌కుమార్ తెలిపారు. 15 రోజుల పాటు దుకాణం అనుమతులు రద్దు చేయాలని సిఫార్సు చేయడంతో పాటు రూ.15 లక్షల విలువైన ఎరువులు జప్తు చేశామని చెప్పారు. సుమారు 71.02 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపివేశామన్నారు. తనిఖీల్లో ఏవో నవీన్, వ్యవసాయ శాఖాధికారి సురేష్ పాల్గొన్నారు.

దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

అడ్డగోలుగా తవ్వకాలు.. అడ్డుచెప్పని అధికారులు..!

లావేరు మండలం జాతీయ రహదారి బెజ్జిపురం కూడలి సమీపంలోని గొరివాని చెరువులో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి యంత్రాలతో సేకరించి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. చెరువు సమీపంలోని లేఅవుట్ స్థలాల ఎత్తు పెంచుకునేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు పాల్పడుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఇంత జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అడ్డుకోవాలని కోరుతున్నారు. సుమారు 300 లోడ్ల మట్టి తీసేసినట్లు సమాచారం. ఉపాధి పథకంలో భాగంగా చెరువులో గతేడాది రూ.10 లక్షలతో పూడికతీత పనులు చేపట్టారు. అమృత్ సరోవర్ పథకంలో ఎంపిక చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి చెరువు గర్భం అస్తవ్యస్తంగా మారిపోయింది. ఇన్‌ఛార్జి తహసీల్దారు డి.శ్రీనివాసరావును ఈ విషయమై వివరణ కోరగా వీఆర్వోను పంపించి మట్టి తవ్వకాలు అడ్డుకుని చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

ఓ లేఅవుట్ వద్ద వేస్తున్న మట్టి

ఎడమ కాలువకు మళ్లీ గండి

10 రోజుల వ్యవధిలో రెండోసారి

హిరమండలం, న్యూస్‌టుడే: వంశధార ఎడమ ప్రధాన కాలువకు సోమవారం మళ్లీ గండి పడింది. ఐదో కిలోమీటరు వద్ద గండి పడటంతో వరి వెద పొలాల్లోకి నీరు ప్రవహించింది. పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు ఇలా జరగడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విషయాన్ని అంబావల్లి నీటి సంఘ సభ్యులు, రైతుల ద్వారా తెలుసుకున్న వంశధార నరసన్నపేట డివిజన్ ఈఈ మురళీమోహన్, గొట్టా బ్యారేజీ ఏఈఈలు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కాలువలో 1,300 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉండటంతో వెంటనే గేట్లు దించి 500 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. పొక్లెయిన్లతో మరమ్మతులు చేయించారు. రాతి కట్టు పేర్పు చెదిరి పోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు రైతులు చెబుతున్నారు. దాదాపు 50 ఎకరాల్లో నీరు చేరి, ఇసుక మేటలు వేశాయి. ఎడమ ప్రధాన కాలువ 1977లో నిర్మించింది కావడంతో ఏటా ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి. ఆధునికీకరణతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నదాతలు చెబుతున్నారు. రూ.1,800 కోట్ల అంచనా వ్యయంతో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని వంశధార ఎస్ఈ స్వర్ణకుమార్ చెప్పారు.

వంశధార ఎడమ ప్రధాన కాలువకు పడిన గండి

–న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, ఆమదాలవలస పట్టణం

రైలు నిలయాలకు వెళ్లే ప్రయాణికులు వసతుల లేమితో అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ఏ రైల్వేస్టేషన్ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. ఆదాయం ఆశించినంత వస్తున్నా... సౌకర్యాల కల్పనకు రైల్వేశాఖ ముందడుగు వేయడం లేదు. ఇచ్ఛాపురం, సోంపేట (కంచిలి), పలాస, నౌపడా, తిలారు, ఆమదాలవలస(శ్రీకాకుళం), పొందూరు వంటి ప్రధాన రైలు నిలయాలతో పాటు జాడుపూడి, బారువ, మందస, సుమ్మాదేవి, పూండి, దండుగోపాలపురం, కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, ఉర్లాం, దూసి, బాతువలాంటి చిన్న స్టేషన్లు సమస్యలకు నిలయాలుగా కనిపిస్తున్నాయి.

న్యూస్‌టుడే పరిశీలన

దయచేసి వినండి..

సౌకర్యాలు కల్పించడం లేదండి..!

- రైలు నిలయాల్లో సమస్యల తిష్ఠ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఎండకు ఎండాలి.. వానకు తడవాలి

☛ ఆమదాలవలస
★ 3,800
● రూ.3.5 లక్షలు

శ్రీకాకుళం రోడ్డు రైలు నిలయం(ఆమదాలవలస) జిల్లాకే తలమానికం. 1, 3, 4 ప్లాట్‌ఫాంపై మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పైకప్పులు లేకపోవడంతో ఎండ, వానకు బాధలు పడుతూ రైళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. టికెట్ కౌంటర్ దూరంగా ఉండటంతో వెళ్లాలంటే ఆయాసం తప్పడం లేదు.

పనులు నత్తనడకన

☛ పలాస
★ 3 వేలు
● రూ.3.12 లక్షలు

తూర్పుతీర రైల్వే పరిధిలోని ఒడిశాలో ఖుర్దారోడ్డు డివిజన్‌లో ఆఖరిగా పలాస రైల్వేస్టేషన్ ఉంది. అమృత్ పథకంలో అభివృద్ధికి నిధులు కేటాయించగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. లిఫ్ట్ ఏర్పాటుకు గోతులు తవ్వి వదిలేయడంతో ప్రయాణికులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. గుర్తింపు కలిగిన స్టేషన్ అయినప్పటికీ 14 రైళ్లు నిలిపివేతకు అనుమతి ఇవ్వలేదు. పలు రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసిన సౌత్‌ఈస్ట్‌కోస్ట్ డివిజన్‌లో విలీనం చేస్తే అభివృద్ధి జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పలాసతోపాటు పూండి, మందస స్టేషన్ల రైలు నిలయాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపివేసేందుకు రైల్వేశాఖకు ఎమ్మెల్యే గౌతు శిరీష పలుమార్లు వినతి పత్రాలు అందించారు.

పలాస రైలు నిలయంలో 2వ ప్లాట్‌ఫాంపై ప్రమాదకరంగా ఉన్న గోతులు

సంక్రాంతి, దీపావళి, దసరా వేళల్లో ఈ స్టేషన్లకు రెట్టింపు ఆదాయం వస్తుంది

☛ రైలు నిలయం : సోంపేట
★ రోజువారీ ప్రయాణికులు: 2 వేల మంది
● ఆదాయం: రూ. 1.50 లక్షలు

పట్టాలు దాటి.. ప్రమాదకరంగా

సోంపేటలోని కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరడంతో రైలు పట్టాలు దాటి ప్రయాణికులు ప్రమాదకరంగా ప్లాట్‌ఫాంపైకి చేరుకుంటున్నారు. కొత్తగా వంతెన నిర్మించి, లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఫలక్‌నుమా, పూరీ అహ్మదాబాద్ వంటి రైళ్లు ఆపాలని కోరుతున్నారు.

ఒడిశాకు వెళ్లాల్సిందే

☛ ఇచ్ఛాపురం
★ 2 వేలు
● రూ.3.12 లక్షలు

ఇచ్ఛాపురంలో ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్లాట్‌ఫాంపై పైకప్పులు లేవు. కొన్ని చోట్ల ఒకటీ అరా ఉన్నా.. అవి శిథిలమై వర్షం పడితే కారిపోయి నీరు ప్రయాణికులపై పడుతోంది. ప్యాసింజర్లు, కోణార్క్, ఫలక్‌నుమా, విశాఖ, తిరుపతి వంటి రైళ్ల హాల్ట్ తప్ప ఇతర సూపర్ ఫాస్ట్‌లు ఆపకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు పలాస లేదంటే ఒడిశాలోని బ్రహ్మపుర వెళ్లిపోతున్నారు. విశ్రాంతి భవనాలు, కూర్చునేందుకు కుర్చీలు లేవు. ముఖద్వారం వద్ద తలుపులు లేకపోవడంతో పశువులు లోపలకు వచ్చేస్తున్నాయి. ఉదయం 6 గంటలకు ఇచ్ఛాపురం- విశాఖపట్నం రైలు అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో 22 మందికి జ్వరాలు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 22 మందికి విద్యార్థులకు జ్వరాలు రావడంతో సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియజేశారు. డీఎంహెచ్‌వో కె.అనితకు సమాచారం అందడంతో సోమవారం ఉదయం ఆమె వసతిగృహాన్ని సందర్శించారు. గంగువాడ, బొంతు, చాపర, మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే సిబ్బందిని వసతి గృహానికి రప్పించి పరీక్షలు నిర్వహించారు. 22 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారికి అవసరమైన మందులు అందించారు. అనంతరం పాఠశాల, వసతి గృహంలో డీఎంహెచ్‌వో తనిఖీలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి చెప్పారు.

హడావుడి నిర్మాణం.. ఆలోచన లేని వైనం

పోలాకి మండల పరిధి మబగాం పంచాయతీకి సంబంధించి వైకాపా హయాంలో వెల్‌నెస్, రైతు సేవా కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిని యుద్ధ ప్రాతిపదికన నిర్మించి ఏడాదిన్నర కిందట ప్రారంభించారు. అంత వరకు బాగున్నా ఈ కేంద్రాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయలేదు. భవనాలకు ముందు పొలం ఉండటంతో సిబ్బంది అక్కడికి వెళ్లకుండా సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా దాదాపు రూ.40 లక్షలతో నిర్మించిన భవనాలు అలంకారప్రాయంగా మారాయి. ఈ విషయాన్ని ఎంపీడీవో రవికుమార్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, పోలాకి

ఆగాకర సాగుతో లాభాలు ఆర్జిస్తున్న రైతు, తెగుళ్లు, కలుపు నివారణకు శాస్త్రవేత్త చేసిన సూచనలు, ఏ పద్ధతి పాటిస్తే ఎండాకు తెగులు నివారించొచ్చు ఇలా భిన్న అంశాల సమాహారం..

న్యూస్‌టుడే–ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస పురపాలిక సంఘంలో అన్ని వార్డులకు కుళాయిలు ఉండవు. ఉన్న చోట్ల కొంతమంది మోటార్లు బిగించి నీటిని లాగేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాలకు నీరు రావడం లేదు. వచ్చినా.. సన్నని ధారతో ఒక బిందె నిండేందుకు ఎంతో సమయం పడుతుంది.

గొంతెండినా చలించం..

చుక్కనీరు మిగల్చం..!

కుళాయిలకు మోటార్లు బిగించి తోడేస్తున్న ఘనులు

పట్టణంలోని ఓ వీధిలో కుళాయికి బిగించిన మోటారు (పాత చిత్రం)

నీటి చౌర్యం జరిగే ప్రాంతాలు

కొత్తకోటవారి వీధి, మోనింగివారి వీధి, గణేష్‌నగర్, డాబాలవారి వీధి, పూజారిపేట, పాతినవారి వీధి, మెయిన్ రోడ్డు, ఎమ్మార్వో కార్యాలయం రహదారి, బొడ్డేపల్లిపేట, మెట్టక్కివలస, గేటు, ఐజేనాయుడుకాలనీ, వెంగళరావుకాలనీ, లక్ష్ముడుపేట, వెంకయ్యపేట మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతోంది.

★ ఆమదాలవలస పురపాలికగా ఏర్పడి 30 సంవత్సరాలు అయింది. చాలా ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు కావడంతో తరచూ లీకులు, మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఏదో ఒక వార్డుకు రోజూ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

తెలిసినా.. తెలియనట్లు

పుర పరిధిలో 8 వందలకుపైగా కుళాయిలకు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. స్థానిక నాయకులు, పెద్దమనుషులుగా చలామణి అవుతున్నవారు, ఉద్యోగులు, బడా నేతల బంధువులు ఉండటంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. దీంతో సామాన్య ప్రజలకు గొంతెండుతోంది. బోర్లు, బావుల జలం తాగుతున్నారు. తామంతా పురపాలికకు పన్నులు కడుతున్నా.. మౌలిక వసతుల్లో ప్రధానమైన నీటిని అధికారులు అందించడం లేదని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. చౌర్యాన్ని అరికడితే పుష్కలంగా నీరు అందుతుందని తెలిపారు.

★ పురపాలికకు నాగావళి, వంశధార నదుల్లోని కొత్తవలస, అలమాజీపేట రెండు చోట్ల ఏర్పాటు చేసిన పంపుహౌస్‌లు ద్వారా నీటిని అందిస్తారు. రెండు నదుల్లో ఇసుకను అక్రమంగా తవ్వేస్తుండటంతో నీటి నిల్వలు అడుగంటి వేసవిలో దాహం కేకలు మిన్నంటుతున్నాయి.

ప్రత్యేక బృందంతో సీజ్ చేయిస్తాం: పుర పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక నిఘా పెడతాం. నీటి చౌర్యం చేస్తున్న వారిని గుర్తించి మోటార్లు సీజ్ చేసి, కుళాయి కనెక్షన్ తొలగిస్తాం. **-జాన్సన్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస**

పురపాలికలో వార్డులు:	జనాభా:	కుళాయిలు:	నీటి చౌర్యం జరుగుతున్న కుళాయిలు:	రోజుకు నీటి అవసరం:	అందిస్తోంది:
23	49 వేల మంది	3,968	800పైనే	5.3 మిలియన్ లీటర్లు	4.6 మిలియన్ లీటర్లు

మీరే పెంచుకోండి.. ఆదాయం పంచుకోండి..!

- ఉద్యాన తోటల పెంపకానికి ప్రభుత్వం శ్రీకారం
- మహిళా సంఘాలకు సంరక్షణ బాధ్యతలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో కార్మికులు, మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. వీరంతా స్థిరమైన ఆదాయం అందుకోవడమే లక్ష్యంగా సమాలోచనలు చేసింది. కార్మికులకు ఇంతవరకు చెరువుల్లో మట్టి, కాలువల్లో పూడిక, నీటికుంటలు ఇతర పనులు అప్పగించేది. ఈ జాబితాలో ఉద్యానతోటల పెంపకాన్ని చేర్చింది.

కొంగరాంలో చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు నాటుతున్న వేతనదారులు

2,500 ఎకరాలు లక్ష్యం: ఉద్యానతోటల పెంపకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2,500 ఎకరాల్లో మొక్కలు పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 1450 ఎకరాల్లో కొబ్బరి తోటలు పెంచేందుకు నిర్ణయించారు. చెరువులు, జలాశయాల గట్లతోపాటు పంచాయతీల పరిధిలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు. ఈ నెల 10న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొంటున్నారు. ఎకరాకు 60 మొక్కలు చొప్పున నాటుతున్నారు.

ధర సర్కారు నిర్ణయమే

మొక్కలు నాటేంత వరకు చేసే పనుల్లో ఉపాధి కూలీలను భాగస్వాములను చేయనున్న అధికారులు.. వాటి సంరక్షణ బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించనున్నారు. అవి పెరిగి దిగుబడి రాగానే వాటిపై వచ్చే ఆదాయాన్ని సభ్యులందరూ పంచుకునేలా ప్రణాళిక రూపొందించారు. మొక్కలను ప్రభుత్వం నిర్వహిస్తున్న నర్సరీల నుంచి తెప్పించి నాటేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు నిర్ణయించారు. ఒక్కో మొక్క కొనుగోలు ధర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఒకవేళ లబ్ధిదారులే మొక్కలు కొనేందుకు ముందుకొస్తే ప్రభుత్వం ధర చెల్లిస్తుంది. 'ఉద్యాన తోటల పెంపకం వల్ల కొన్నేళ్ల తరువాత ఆదాయం వచ్చి ఆర్థిక బలోపేతానికి ఉపయోగపడుతుంది. జిల్లా వ్యాప్తంగా 85 వేలకు పైగా కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నాం' అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ బి.సుధాకరరావు తెలిపారు.

లక్ష్యం ఇలా..		ఎంత ఇస్తారంటే..	
నియోజకవర్గం	విస్తీర్ణం (ఎకరాల్లో..)	మొక్క	ఒక్కోదాని ధర (రూ. లలో)
ఎచ్చెర్ల	446	కొబ్బరి	90
ఆమదాలవలస	233	(పోలి బ్యాగులో)	
ఇచ్ఛాపురం	271	కొబ్బరి సీడిలింగ్	60
నరసన్నపేట	300	జీడిమామిడి	40
పలాస	283	మామిడి	40
పాతపట్నం	579	మునగ	08
శ్రీకాకుళం	125	చింత	55
టెక్కలి	263	సీతాఫలం	40
మొత్తం	2500	పనస	08

అర్జీలు పునరావృతమవకుండా చర్యలు

మీకోసంలో 140 వినతులు

శ్రీకాకుళం నగరం, శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కోరారు. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం-ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించారు. 140 వినతులు అందాయని అధికారులు తెలిపారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు.

సమస్యలు తెలుసుకుంటున్న సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

★ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వినతులు స్వీకరించారు. 65 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.

చెరువు ఆక్రమణ

గార మండలం అంపోలు రెవెన్యూ పరిధిలో బరాటం చెరువు ఆక్రమణకు గురైందని, తొలగించి రైతులకు న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన రుప్ప లక్ష్మి సంయుక్త కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పాఠశాలను కొనసాగించాలి..

ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇటీవల ప్రభుత్వం బడిని మూసివేయడంతో మత్స్యకార సామాజికవర్గానికి చెందిన పిల్లలు చదువుకు దూరమయ్యారని వెంటనే పునః ప్రారంభించాలని గ్రామానికి చెందిన డి.లలిత తదితరులు జేసీకి అర్జీ అందించారు. పింఛన్లు మంజూరు చేయాలని.. భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ జీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

జ్ఞాపకాల మదిలో...

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభ్యున్నతికి వేసిన పునాదు.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా గుండెల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..

నిర్యాణం, వర్ధంతి, జయంతి

ఈనాడు ద్వారా తెలియజేయండి

ఈనాడు ప్రకటనల విభాగం

80085 97609

(c) eenadu

నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే ఆందోళన

రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించకుంటే ఆందోళన చేపడతామని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. యుగంధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. మీకోసంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కె.శ్రీనివాస్, నాయకులు వేణు, వసంతరావు, అన్నాజీ, రామోజీ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

కదలదు.. వదలదు

వంశధార ప్రధాన ఎడమ కాలువ నుంచి నరసన్నపేట బ్రాంచ్ కెనాల్‌కు నీరు వెళ్లే మార్గంలో గుర్రపు డెక్క అడ్డుగా ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలుమూరు సమీపంలో పరిస్థితి ఇలా ఉండటంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగించాలని కోరుతున్నారు. దీనిపై వంశధార జేఈఈ అప్పలరెడ్డి మాట్లాడుతూ.. చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

పేదల రాజుకు పట్టం

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

రాజుల కుటుంబమైనా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు. పూసపాటి వంశస్థుడిననే దర్పాన్ని ఎక్కడా ప్రదర్శించలేదు. రూ.వేల కోట్ల ఆస్తులకు అధిపతైనా.. కేంద్ర మంత్రిగా పని చేసినా ఆయనకు సాధారణ జీవనమే మక్కువ. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినా పేదల మధ్యే ఉంటూ ఆయా వర్గాలకు రాజుగా ఎదిగారు. ప్రజలకు పెద్దన్నగా, పెద్దాయనగా ఉన్నారు. ఆ వ్యక్తిత్వమే ఆయన్ను గవర్నర్ పదవికి ఎంపికయ్యేలా చేసింది. గోవా గవర్నర్‌గా వెళ్తున్న తెదేపా నేత, విజయనగరం జిల్లాకు చెందిన పూసపాటి అశోక్ గజపతిరాజును అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. విషయం తెలియగానే సోమవారం కోటకు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు.



కేంద్ర, రాష్ట్ర మంత్రుల అభినందనలు..

అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి ప్రకటనతో జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడు అశోక్ అని కొనియాడారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అశోక్‌కు మిఠాయి తినిపించి సత్కరించారు.

అశోక్‌కు మిఠాయి తినిపిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

గవర్నర్‌గా అశోక్ నియామకంపై హర్షం

మంచి పనికి ముందు వరుసలో..

ప్రభుత్వ, ప్రజావసరాలకు, అక్షరాభివృద్ధికి ఊతమిచ్చేలా అశోక్ గజపతిరాజు ఉదారత చాటుకున్నారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో రహదారుల నిర్మాణానికి పెద్దఎత్తున భూములిచ్చారు. గతానికి గుర్తుగా నిలిచిన కోటను సైతం విద్యాసంస్థల నిర్వహణకు అప్పగించారు. తాత, తండ్రి నుంచి అందిపుచ్చుకున్న సేవా వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. తన తండ్రి పీవీజీ రాజు వారసత్వంగా వచ్చిన మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. 108 దేవాలయాలకు ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర మంత్రిగా పని చేసిన సమయంలో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలక, ఉడా పరిధిలో రోడ్లకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

శివాజీ (పాత చిత్రం)

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం బెజ్జిపురం కూడలి సమీపంలోని హైవే విశ్రాంతి భవనంలో వాచ్‌మేన్‌గా పని చేస్తున్న సబ్బి శివాజీ (54) సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం గ్రామానికి చెందిన శివాజీ గత కొన్నేళ్లుగా వాహనచోదకుల విశ్రాంతి భవనం(ఎన్‌హెచ్ఏఐ రెస్ట్‌హౌస్)లో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులకు వెళ్లాడు. ఆయన కుమారుడు శ్యామ్‌లాల్ భోజనం అందించి వచ్చేశాడు. సోమవారం ఉదయం శ్యామ్‌లాల్ రెస్ట్‌హౌస్‌కు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో వరండాలో ఉన్న తండ్రి ఇంకా నిద్రలేవకపోవడంతో కంగారుపడి కేకలు వేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై జి.లక్ష్మణరావు, సిబ్బంది అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. శివాజీ భార్య ఆదిలక్ష్మి, పెద్ద కుమారుడు పవన్ కల్యాణ్ ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన కుక్కకాటు

బొడ్డ అజయ్

లావేరు, (మురపాక), న్యూస్‌టుడే: కుక్క కాటుకు టీకా వేయించుకోకపోవడంతో ఓ నిండు ప్రాణం బలైన ఘటన లావేరు మండలం మురపాకలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యువకుడు బొడ్డ అజయ్(24)కు రెండు నెలల కిందట స్థానిక వీధిలో కుక్కకాటు వేసింది. వెంటనే రేబిస్ టీకా వేయించుకోకుండా నిర్లక్ష్యం వహించాడు. సోమవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న అజయ్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు యువకుడిని వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేబిస్ వ్యాధి కారణంగానే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. డిగ్రీ పూర్తి చేసిన అజయ్ గ్రామంలో ఓ చిన్న పశువుల దాణా దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. చేతికందివచ్చిన పెద్దకుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు మల్లిబాబు, రమణమ్మ, సోదరుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి

నరసన్నపేట, న్యూస్‌టుడే: రావాడపేట కూడలి వద్ద సోమవారం పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావుపై జమ్ము గ్రామానికి చెందిన కొందరు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలాకి మండలం జడూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు సారవకోట మండలం బుడితి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో జమ్ము గ్రామానికి చెందిన కొందరు ఆయనపై దాడికి పాల్పడ్డారు. విధులకు వెళ్తున్న జలుమూరు ఎస్సై అశోక్‌బాబు ఘటనాస్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాకుళం గ్రామీణ ఎస్సైపై విచారణ

స్పందనకు వందనం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రౌడీషీటర్‌తో సన్నిహితంగా ఉంటూ సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో ఈ నెల 12న 'ఖాకీ దాదా.. రౌడీకి దండ' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందకు సోమవారం బాధ్యత అప్పగించారు. ఈ వ్యవహారంలో శ్రీకాకుళం గ్రామీణ పోలీసుస్టేషన్ ఎస్సైపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కువ 'సెల్ ఫోన్'లో మాట్లాడిన రెండో పట్టణ క్రైం కానిస్టేబుల్ శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.

రాజకీయ హత్యగా పరిగణించండి

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో ఇటీవల చోటుచేసుకున్న వైకాపా కార్యకర్త సత్తారు గోపి హత్యను రాజకీయ హత్యగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆమదాలవలస, టెక్కలి నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పి.తిలక్, చింతాడ రవికుమార్, బాధిత కుటుంబ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ వైకాపా కార్యకర్తల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. గోపి హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు రాజకీయ హత్యగా పరిగణించకుండా కుటుంబ తగాదాగా మార్చేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. నిజాయతీగా పని చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	100	155	175

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 23 వరకు జిల్లాలో ఏపీపీఎస్సీ నిర్వహించనున్న పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మెరిసిన బాడీబిల్డర్లు

ఇటీవల కడపలో నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా దేహదారుఢ్య పోటీల్లో జిల్లాకు చెందిన బాడీ బిల్డర్లు మెరిశారు. దివాకర్ (ఆమదాలవలస) 60 కిలోల కేటగిరీలో కె.అవినాశ్ (పలాస) మిస్టర్ ఆంధ్రా ర్యాంప్ వాక్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఎన్.రాజు (శ్రీకాకుళం నగరం) 90 కిలోల కేటగిరీలో ద్వితీయ, వైకుంఠరావు (శ్రీకూర్మం) 55 కిలోల విభాగంలో నాలుగో, కె.దిలీప్ (శ్రీకాకుళం) 50 కిలోల కేటగిరీలో పోటీ పడి ఐదో స్థానం అందుకున్నారు. విజేతలను ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, కార్యదర్శి శంకర్, సభ్యులు అభినందించారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్



ఉత్తరాంధ్రను కాపాడుకోవడానికి ఉద్యమాలే శరణ్యం

థర్మల్ అమరులకు నివాళులర్పిస్తున్న ఆర్.నారాయణమూర్తి, ప్రజాకవి జయరాజు తదితరులు

సోంపేట, న్యూస్‌టుడే: విధ్వంసకర అభివృద్ధికి ప్రయోగశాలగా మారుతున్న ఉత్తరాంధ్రను ఉద్యమాలతోనే కాపాడుకోవాలని విప్లవ చిత్రాల నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. సోంపేట మండలం బారువలో సోమవారం డాక్టర్ వై.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన థర్మల్ అమరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ ఉద్యమాలకు సోంపేట ప్రజలు కొత్త దారి చూపారని, పర్యావరణం, జీవావరణం, జీవించేహక్కు కోసం ప్రాణాలొడ్డి పోరాటాలు సాగించిన స్ఫూర్తి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. పోలవరం డ్యాం ఎత్తు 45 అడుగులు తగ్గకుండా నిర్మించితేనే ఉత్తరాంధ్ర సస్యశ్యామలం అవుతుందన్నారు. విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణ చేయమని కేంద్రప్రభుత్వం స్పష్టం చేయాలని, విశాఖ రైల్వేజోన్ ప్రయోజనకరంగా మార్చాలని డిమాండ్ చేశారు. చిత్తడి నేలలను కాపాడుకోకపోతే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. జీవో 329 రద్దు చేయాలని, మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పంట భూములను రైతులకు అప్పగించాలని కోరారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ ప్రకృతికి మించిన జ్ఞానవంతులు లేరని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేలతల్లి పాటలతో అలరించారు. మానవహక్కుల తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో విస్తరించిన వేలాది చిత్తడి నేలల రక్షణకు సోంపేట ఉద్యమం కారణమైందన్నారు. మానవహక్కుల వేదిక జిల్లా సమన్వయకర్త జగన్నాథరావు, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధి సూరాడ చంద్రమోహన్, వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. అంతకుముందు బీలలో అమరుల స్థూపం వద్ద నివాళులర్పించి మొక్కలు నాటారు.

కార్పొరేట్, కాపీయింగ్ చదువులపై సమరమే 'యూనివర్సిటీ'

కార్పొరేట్ చదువులు, కాపీయింగ్‌తో సామాన్యులు ఎలా నష్టపోతున్నారనే అంశం ఆధారంగా యూనివర్సిటీ చిత్రాన్ని తీశానని ఆర్.నారాయణమూర్తి తెలిపారు. సోంపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ సినిమా గురించి వివరాలు తెలిపారు. ప్రజా యుద్ధనౌక గద్దర్, ఇతర ప్రజా కవులు రాసిన పాటలకు మంచి స్పందన వచ్చిందన్నారు. మాల్ ప్రాక్టీస్, పేపర్ లీకేజీ ఇతర అంశాలు చర్చించినట్లు పేర్కొన్నారు. విద్య వ్యాపారంగా మారడంతో నెలకొనే పరిణామాల గురించి వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ చిత్రం ఉద్దేశమన్నారు.

APSRTC పల్లె వెలుగు

టెండరు ప్రకటన

శ్రీకాకుళం జిల్లా పరిధిలోని (i) వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్లలో స్టాళ్లు/ షాపులు, ఖాళీ స్థలములు ... వ్యాపారములు చేసుకొనుటకు (ii) గ్యారేజీలలో వివిధ రకాల పనులు ... నిర్వహణకు ... టెండర్లు కోరబడుచున్నవి. ... 16-07-2025 నుండి 24-07-2025 వరకు ... 25-07-2025 ... 16-07-2025 నుండి 28-07-2025 వరకు ... 29-07-2025 ... పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో Tenders ను చూడగలరు. ... APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. P2/437(03)/2025-DPTO/SKLM, తేది:11-07-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, శ్రీకాకుళం.

ఐటెప్ కోర్సు సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్య కోర్సు (ఐటెప్) ఒకటి, మూడో సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సోమవారం విడుదల చేశారు. ఒకటో సెమిస్టర్‌లో బీఏ బీఈడీ కోర్సులో తొమ్మిది మంది హాజరై ఎనిమిది మంది, బీఎస్సీ బీఈడీ కోర్సులో 33 మంది హాజరై 29 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడో సెమిస్టర్‌లో బీఏ బీఈడీ కోర్సులో హాజరైనా ముగ్గురు, బీఎస్సీ బీఈడీలో 25 మంది హాజరై 18 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. ఎలాంటి సందేహాలున్నా 15 రోజుల్లోగా పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రైతేరాజు

ఆగాకర సాగు.. ఆదాయం బాగు

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

జి.చిట్టిబాబు

తెగుళ్లు, పురుగు కలుపును నివారించుకుంటే అధిక దిగుబడులు సాధించొచ్చని ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానం ఇచ్చారు.

కత్తెర పురుగు ఆశిస్తే.. మొక్కజొన్న ఆకులపై రంధ్రాలు!

? ప్రశ్న: కొబ్బరి మొక్కలు పెంచుతున్నాం. వాటికి ఏ విధంగా ఎరువులు అందజేయాలో తెలియజేయండి. **-బి.తిరుపతి(రెడ్డి) కవిటి**

☛ సమాధానం: కొబ్బరి మొక్కలకు సిఫార్సు చేసిన ఎరువుల మోతాదు 1.3 కిలోల యూరియా, 2.0 కిలోల సూపర్ ఫాస్పేట్, 2.0 మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను రెండు సమాన భాగాలుగా విభజించి జూన్, జులై, నవంబరు, డిసెంబరు నెలల్లో రెండు సార్లు వేసుకోవాలి.

? : మొక్కజొన్న ఆకులపై రంధ్రాలు కనిపిస్తున్నాయి. నువ్వు పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. **-పి.తవిటినాయుడు, రణస్థలం**

☛ : మొక్కజొన్న విత్తిన పది రోజుల నుంచి కత్తెర పురుగు ఆశించి లేత ఆకులపై రంధ్రాలు చేస్తోంది. అలాగే మొవ్వు పూర్తిగా కొరికేయడం వల్ల పంటకు నష్టం కలుగుతుంది. నివారణకు తొలిదశలో వేపనూనె లీటరుకు 5 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడి సాధించొచ్చు.

? : వరి నారుమడి తెల్లగా పాలిపోయినట్లుగా కనిపిస్తోంది. నివారణకు చర్యలు తెలపండి. **-కె.లక్ష్మీనారాయణ, గార**

☛ : వరిలో ఇనుప ధాతు లోపం ఉంటే ఆకులపై తెల్లని చారలు ఏర్పడతాయి. మొక్క ఎదుగుదల మందగిస్తుంది. నివారణకు 5 గ్రాములు అన్నభేదిని, 1 గ్రాము నిమ్మ ఉప్పు ఒక లీటరు నీటికి కలిపి నారుమడుల్లో పిచికారీ చేసుకుంటే నివారించొచ్చు.

– న్యూస్‌టుడే, జలుమూరు

ఆగాకర పండించి సారవకోట మండలం కోపిరిగూడ గ్రామానికి చెందిన రైతు బురుజువాడ సోమేశ్వరరావు మంచి ఆదాయం పొందుతున్నారు. ఎకరన్నర విస్తీర్ణంలో ఈ ఏడాది పంట వేసి సంతృప్తికరమైన దిగుబడులు సాధించారు. ఈ సాగులో పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. మొక్కలు సైతం విక్రయిస్తుండటంతో అదనంగా కొంత ఆదాయం సమకూరుతుందన్నారు. విత్తనం, పందిరి వేయడం, నీటి తడులు అందించడం, ఎరువులు, పురుగు మందులు ఇలా పంట చివరి వరకు రూ.33 వేల వరకు పెట్టుబడి పెడతారు. నాటిన 40 రోజుల నుంచి పంట చేతికి అందుతుంది. అక్కడ నుంచి మరో రెండు నెలల పాటు పంట చేతికి వస్తుందని వివరించారు. వాతావరణం అనుకూలిస్తే పంట చివరి నాటికి 700 కిలోల ఆగాకర కాయల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.150 ధర పలుకుతుంది. ఈ ధర ప్రకారం.. రూ.1,05,000 పంట వస్తుంది. పెట్టుబడి పోనూ రూ. 72,000 ఆదాయం గడించొచ్చని వెల్లడించారు.

కోపిరిగూడ వద్ద పందిరిపై ఆగాకర పంట

సస్యరక్షణ చర్యలు ఇలా

ఆగాకర పంట రైతులకు లాభదాయకమే. సస్యరక్షణ చర్యలు చేపడితే మరింత దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇది తీగజాతి పంట మొక్కకు మొక్కకు రెండు నుంచి మూడు అడుగుల దూరం ఉండాలి. వాటికి అనువుగా పందిరి ఏర్పాటు చేయాలి. ఎక్కువగా ఆకు కుళ్లు, వేరు కుళ్లు తెగులు ఆశిస్తుంది. వేరు కుళ్లు తెగులు నివారణకు శాఫ్ - 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి వేరు తడిసేలా పోయాలి. ఆకు కుళ్లు తెగులు నాశనానికి ప్రొపినోఫాస్ - 2 ఎంఎల్, శాఫ్ - 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే బాగుంటుంది. అలాగే పిందె దశలో రసం పీల్చే పురుగు ఆశిస్తుంది వాటి నివారణకు ఇమిడిక్లోప్రిడ్ - 0.3 ఎంఎల్, శాఫ్ - 2 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖ అధికారిని మంగమ్మ తెలిపారు.

పొలం వద్దే కొనుగోలు చేస్తారు

ఆగాకర పంట మూడేళ్లుగా పండిస్తున్నాను. శాశ్వత పందిరి ఏర్పాటు చేసుకున్నాను. కొండపై నాటు ఆగాకర విత్తనాలు తీసుకువచ్చి మొక్కలుగా తయారు చేసి వరుస పద్ధతిలో నాటి వాటిని పందిరిపైకి పాకేలా ఏర్పాట్లు చేస్తాం. 40 రోజుల నుంచి పంట చేతికి అందుతుంది. తనకు ఉన్న 50 సెంట్ల విస్తీర్ణంతో పంట వేశాను. వ్యాపారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. సమీపంలోని మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటాం.

- బురుజువాడ సోమేశ్వరరావు, రైతు (కోపిరిగూడ)

ఫోన్ కొట్టు.. సలహా పొందు

వచ్చే వారం సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు, పంటను ఆశిస్తున్న తెగుళ్లను ఎలా నివారించుకోవాలో తెలుసుకునేందుకు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష 9493838010ను చరవాణి నంబరులో సంప్రదించాలి.

ఎండాకు తెగులు ఇలా నివారించాలి

సారవకోట, న్యూస్‌టుడే: మామిడి మొక్కలకు ఎండాకు తెగులు సోకితే ఆకులు పత్రహరితం కోల్పోయి, పెరుగుదలకు అవరోధం కలుగుతుందని మండల ఉద్యానవన శాఖాధికారిణి మంగమ్మ తెలిపారు. ఈ తెగులు సోకిన మొక్కలను గుర్తించి, లీటరు నీటిలో 2 గ్రాముల కార్బండిజం పొడిమందును కలిపి మొక్క మొదళ్లలో వేయాలన్నారు. మొక్కల చుట్టూ పశువుల గెత్తం లేదా వానపాముల గెత్తం వేసి అవసరం మేర నీటి తడులు అందించాలని సూచించారు. గెత్తం లేకపోతే కొద్దిపాటి యూరియా, డీఏపీ ఎరువును మొక్కల మొదళ్లకు కొద్ది దూరంలో వేసి నీటి తడులు అందిస్తే తెగులు నాశనమవుతుందన్నారు.

ఎండాకు తెగులు సోకిన మామిడి మొక్క

దేవుడు అన్యాయం చేశాడని విగ్రహాల ధ్వంసం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: దేవుడి వల్లే తనకు అన్యాయం జరిగిందని భావించిన ఓ వ్యక్తి ఇనుప గొట్టంతో నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేసిన ఉదంతమిది. జి.సిగడాం మండలం దాలెమ్మరాజువలస గ్రామంలోని శివాలయంలో ఈ నెల 11న రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విలేకరులకు తెలిపారు. 'దాలెమ్మరాజువలసకు చెందిన వేముల రామకృష్ణ మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ నెల 12న అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. అతనికి 2019లో వివాహం కాగా.. ఆ దంపతులు ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారు. వారిద్దరూ అనారోగ్య కారణాలతో చనిపోవడంతో రామకృష్ణ మద్యానికి బానిసయ్యాడు. ఆమె 2022లో అతణ్ని విడిచి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పట్నుంచి దేవుణ్ని నిందిస్తూ అతిగా మద్యం తాగేవాడు. ఈ నెల 11న వడ్రంగి పనికి వెళ్లి యజమాని నారాయణరావు వద్ద రూ.300 తీసుకున్నాడు. ఆ సొమ్ముతో మద్యం సీసా కొనుగోలు చేసి శివాలయం వద్ద తాగాడు. ఆ తరువాత ఆలయంలో నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి అరెస్టు చేశాం' అని ఎస్పీ వివరించారు.

★ ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ పరిధి ఫరీదుపేటను అత్యంత సమస్యాత్మక గ్రామంగా గుర్తించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇటీవల జరిగిన హత్య కేసుకు సంబంధించి భిన్నమైన కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని.. ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు దంపతుల వివాదంతో రెండు వర్గాలు కొట్లాటకు దిగాయని వివరించారు. హత్యకు గల కారణాలు అన్వేషిస్తున్నా మన్నారు.

కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, చిత్రంలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, పోలీసు అధికారులు

12 మందిపై కేసు

మద్యం మత్తులో ఓ వ్యక్తి విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనను మత విద్వేషాలు రెచ్చగొట్టే రీతిలో పలువురు సామాజిక మాధ్యమాల్లో అదే పనిగా విష ప్రచారం చేశారని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి 12 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని చెప్పారు. జిల్లాలో వివిధ మతాలకు చెందిన ప్రార్థనా మందిరాలు 3,300 ఉన్నాయని.. వాటి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర ప్రార్థనా మందిరాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు అవతారం (జేఆర్ పురం), పైడపునాయుడు (వన్‌టౌన్), ఇమాన్యుయేల్‌రాజు (స్పెషల్ బ్రాంచి), ఎస్సైలు పాల్గొన్నారు.

గొలుసు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి హయాతీనగరంలో ఈ నెల 9న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు కాజేసిన కేసులో ఎచ్చెర్ల మండలం కొత్త కూర్మినాయుడిపేటకు చెందిన పాత నేరస్థుడు జీరు సురేష్ అలియాస్ నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హయాతీనగరానికి చెందిన పొడుగు ఆరుద్రమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకున్న నిందితుడు తాగడానికి నీరు కావాలని అడిగాడు. ఆమెతో మాట్లాడుతూ ఇంట్లోకి ప్రవేశించి మెడలోని సుమారు 2 తులాల బంగారు గొలుసు చోరీ చేశాడు. బాధితురాలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ పైడపునాయుడు, ఎస్సై హరికృష్ణ గాలిస్తుండగా సోమవారం అదే ప్రాంతంలో చిక్కడంతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అతని వద్ద రెండు తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, అవతారం, ఇమాన్యుయేల్‌రాజు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU eClassifieds

BUSINESS SERVICES

GK గోల్డ్ లోన్ బ్యాంకు/ ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక ఋణం ఇప్పించబడును. ✆ 8897731257.

INDUSTRY

Godown Wanted: 4000-5000 Sft. Container Road Access, Electricity connection. Call: 9959977727.

JOBS

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ టీం లీడర్స్ కావలెను. అర్హతలు 10th to Degree. జీతం : 21,000/- నుండి 45 వేల వరకు. Contact : 9704107303, 8008574616.

Male House Keeping Boy for House Food and Accomodation Available. Contact: 8897663366.

2021 మోడల్, 50 HP Johndeere Front Bucket 5310 4WD ట్రాక్టర్, సింగిల్ ఓనర్, మంచి రన్నింగ్ కండిషన్, హెవీ డ్యూటీ ఆపరేషన్, V16 ఇంజిన్ ట్రాక్టర్ అమ్మకానికి. 8341695672, 9550750150.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

బీలలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం లేదు

బీలలో అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్, నారాయణమూర్తి, ఇతర ప్రముఖులు

సోంపేట, న్యూస్‌టుడే: విశిష్ట చిత్తడి నేలల ప్రాంతం బీలలో ఎలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం లేదని, బీలను సంరక్షించే విషయమై ప్రభుత్వం అటవీశాఖ ఇతర అధికారులతో చర్చిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోమవారం ఆయన బీలలో అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తూ అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమరుల స్తూపం పరిసరాల్లో ప్రజా కళాకారుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి, పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం బీలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు థర్మల్ విద్యుత్తు కేంద్రం అనుమతులు రద్దు చేశామని, ఆందోళనకారులపై కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రిని కోరానని వివరించారు. బీలలో ఏకో టూరిజం అభివృద్ధికి ప్రయత్నాలు సాగిస్తున్నామన్నారు. బీల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖాధికారులు తనతో చర్చించారని పేర్కొన్నారు. నీటినిల్వల కేంద్రాలు నాశనం చేసే పరిస్థితి ఉత్పన్నం కాదన్నారు.

జీవావరణం, పర్యావరణం రక్షణకు కంకణం

సందిబట్టి వద్ద మొక్కలు నాటుతున్న బీసీ సంఘాల ప్రతినిధులు

సోంపేట, న్యూస్‌టుడే: జీవావరణం, పర్యావరణం రక్షణకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీన ఢిల్లీరావు పిలుపునిచ్చారు. బీల విజయదినం కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజా సంఘాల ప్రతినిధులతో పలాసపురం సందిబట్టి గట్టుపై మొక్కలు నాటించారు. 2015 నుంచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని సంఘం చేపడుతుంది. అమరులకు నివాళులర్పించిన తర్వాత జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ బీలను సంరక్షించేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తామన్నారు. కామేశ్వరరావు, వెంకట రమణ, భాస్కరరావు, శ్రీను, వరప్రసాద్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, జోగారావు సోంపేట బాప్టిస్టు చర్చి పాస్టర్ అబ్రహం, అరుణ, విజయలక్ష్మి, తులసి, రాజేశ్వరి, చామంతి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు హేమారావు అన్నారు. నగరంపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థి నాయకుడి ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఇందులో 501 విద్యార్థులు ఎన్నికలో పాల్గొనగా.. తొమ్మిదో తరగతి విద్యార్థులు బి.సుమన్, ప్రవీణ్, వైష్ణవి, జ్యోత్స్న పోటీ పడ్డారు. సుమన్‌కు అత్యధిక ఓట్లు రాగా అతనితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యాయులు రమణ, కమలకుమారి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ప్రజాస్వామ్యం గొప్పతనం, ఎన్నికల విశిష్టతపై అవగాహన కల్పించారు. పీఎంసీ ఛైర్మన్ లక్ష్మీపతి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ప్రధాన రోడ్డు.. పార్కింగ్ చోటు..

కేటీ రహదారిలో భారీగా నిలుపుతున్న వాహనాలు

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

కాశీబుగ్గ నుంచి పలాస వరకు ఉన్న కేటీ రహదారి పార్కింగ్ ప్రాంతంగా తయారైంది. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రహదారిని విస్తరించినప్పటికీ ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో స్థానికులు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు, పుర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ మూడు రహదారుల కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు, జీడి పిక్క బొమ్మ నుంచి ఇందిరా చౌక్ వరకు వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దుకాణాల ముందు పార్కింగ్ స్థలం లేనందున కొనుగోలుకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపై నిలుపుదల చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి గుండా ఉండే షాపింగ్ మాల్స్, హోటళ్లకు సైతం సరైన పార్కింగ్ లేదు. రాత్రి వేళలో సమస్య మరింత జటిలంగా ఉంటోంది. పాదచారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

❖ కాశీబుగ్గలో శ్రీనివాస లాడ్జీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతంలో జన సంచారంతోపాటు వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. పోలీసులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై సీఐ సూర్యనారాయణను వివరణ కోరగా సమస్యపై ఇప్పటికే దృష్టి కేంద్రీకరించామని, సాయంత్రం వేళలో ప్రత్యేక పోలీస్ సిబ్బందితో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	9063144707
పలాస గ్రామీణం	7386408926
కంచిలి గ్రామీణం	9063144708

?: కవిటి మండలం కపాసుకుద్దిలో ప్రమాదకరంగా ఉన్న శిథిల తుపాను భవనాలు తొలగించాలి. - **గ్రామస్థులు** ❖ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **ఎం.కృష్ణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్, కవిటి** –న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

?: ఇచ్ఛాపురం పుర పరిధి పాత బజారువీధి కూడలిలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. - **బి. సుమంత్‌రెడ్డి, ఇచ్ఛాపురం** ❖ పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు చేస్తాం. - **రమేష్, పుర కమిషనర్** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: పలాస మండలం లొత్తూరులో కుళాయిల ద్వారా సరిపడా నీరు సరఫరా కావడం లేదు. - **స్థానికులు** ❖ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. - **రాజకుమార్, పంచాయతీ కార్యదర్శి, లొత్తూరు** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

రక్షణ గోడ నిర్మించండి సారూ...

పలాస మండలం హిమగిరిలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విష కీటకాలు స్కూల్ ఆవరణలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి-2 సత్యం వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

నమ్మండి.. ఇది తారురోడ్డే..!

మందస మండలం జాతీయ రహదారి నుంచి కొండలోగాం మీదుగా ఎంఎం రోడ్డును కలుపుతూ ఉన్న తారు రోడ్డు ఇది. కుసుమాల, టంగరపుట్టి మధ్య తారు లేచిపోయి మట్టి రోడ్డును తలపిస్తోంది. రాళ్లు తేలి గోతులు ఏర్పడి అసౌకర్యంగా మారింది. పట్టులోగాంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఈ దారే ఆధారం. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులొస్తే పనులు ప్రారంభిస్తామని ఐటీడీఏ డీఈఈ కృష్ణకుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

చెత్తశుద్ధి లేదు..

వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం అసంపూర్తిగా వదిలేశారు. ఆరేళ్లుగా పునాదులు దాటడం లేదు. ప్రభుత్వం కేంద్రాల నిర్వహణ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నా అధికారుల ఆచరణలో చిత్తశుద్ధి కొరవడిందని దానికి ఇదే నిదర్శనం. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీలత వద్ద ప్రస్తావించగా పనులు ప్రారంభించేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

నిత్యం వెలుగులే..

కంచిలి మండలం పెద్దశ్రీరాంపురంలో వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వెలుగుతున్నాయి. దీంతో అధిక విద్యుత్తు వినియోగంతో పాటు దీపాలు త్వరగా పాడవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ఎదురొస్తే ఆగాల్సిందే..

ఇచ్ఛాపురం సంతపేట మలుపు సమీపంలో పాత వంతెన వద్ద చెట్టు ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన, కాలువ గట్టుపైనా ఏపుగా ఎదిగిన చెట్ల కొమ్మలు రోడ్డుపైకి విస్తరిస్తున్నాయి. దీంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఇరుకు వంతెన కావడంతో, ఒక వాహనం దాటే వరకు, ఎదురుగా వచ్చే వాహనం ఆగాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ ఏఈ విక్రమ్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పరిష్కారాలు వేగంగా చూపాలి

పలాస, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలకు పరిష్కారాలు వేగంగా చూపించాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు కోరారు. పురపాలక సంఘంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జనన, మరణ ధ్రువపత్రాలు 5, తల్లికి వందనం 2, ఆస్తిపన్ను పేరు మార్పిడి 2 పబ్లిక్ కుళాయిలు 3 చొప్పున 12 దరఖాస్తులు అందాయని కమిషనర్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి డొంకూరు విద్యార్థి ఎంపిక

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన ఆర్జీకేయూటీ ట్రిపుల్ ఐటీ రెండో విడత ఎంపిక జాబితాలో డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.నితిన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.హేమకుమారి తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థిని పాఠశాల సిబ్బందితోపాటు గ్రామస్థులు అభినందించారు. పాఠశాల ఛైర్మన్ కె.జానకిరావు, కూర్మారావు, గురుమూర్తి, వెంకటరమణ, గోవిందరావు, కమలాకర్ పాల్గొన్నారు.

మహిళలకు గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస సమీప నెమలి-నారాయణపురం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన రేణుకాదేవి గాయాలపాలయ్యారు. తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై కోటబొమ్మాళి వెళ్తుండగా చక్రాలకు చీర చుట్టేయడంతో రహదారిపై బోల్తా పడ్డారు. దీంతో రేణుకాదేవికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ❖ పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఓ యువకుడు ద్విచక్ర వాహనంతో స్కూటీని ఢీకొనడంతో పురుషోత్తపురానికి చెందిన మహిళ గాయాలపాలైంది. అనంతరం స్థానికులు ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు.

బ్రహ్మపుర-లింగంపల్లి రైలు నడపండి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాల్లోని వలస కార్మికులు రాకపోకలు సాగించేందుకు బ్రహ్మపుర నుంచి విశాఖపట్నం మీదుగా లింగంపల్లికి రైలును నడపాలని ఉత్తరాంధ్ర రైలు ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు, డీఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ కార్యాలయంలో జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ కె.పద్మజ, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ బి.రవిచందర్‌లను సోమవారం కలిశారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను లింగంపల్లి వరకు పొడిగించాలని, దీంతోపాటు బ్రహ్మపుర నుంచి లింగంపల్లికి ప్రత్యేక రైలును నడపాలని భువనేశ్వర్-విశాఖపట్నం వరకు నడుస్తున్న వందేభారత్‌ను కాకినాడ వరకు పొడిగించాలని కోరారు.

నేడు టిడ్కో ఛైర్మన్ పర్యటన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: టిడ్కో ఇళ్ల సముదాయాలు, మౌలిక సదుపాయాలను సమీక్షించేందుకు ఏపీ టిడ్కో అధ్యక్షుడు అజయ్‌కుమార్ మంగళవారం ఇచ్ఛాపురం రానున్నారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు తెలిపారు. అజయ్‌కుమార్‌ను స్వాగతం పలికేందుకు ఉదయం 10 గంటలకు లొద్దపుట్టి కూడలి ధనరాజ తులసమ్మ ప్రాంగణానికి జనసేన నాయకులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. టిడ్కో అధ్యక్షుడి పర్యటన విషయమై పుర కమిషనర్ నల్లి రమేష్ ఓ ప్రకటన విడుదల చేశారు.

అసంతృప్తి నేతలతో భేటీ!

పలాస గ్రామీణం: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు వ్యతిరేక వర్గం నాయకులతో పుర మాజీ కౌన్సిలర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్, పురాధ్యక్షుడు బళ్ల గిరిబాబు సమావేశమయ్యారు. కొత్తపూరులో సోమవారం పైల తిరుమలరావు, జానకీరామ్, ధనంజయ తదితర వైకాపా అసంతృప్తి నాయకులకు మీకు అండగా మేమున్నామంటూ భరోసానిచ్చారు. అప్పలరాజు ఆగడాలు, ఒంటెద్దు పోకడలను జిల్లా నాయకుల దృష్టిలో పెట్టామని, త్వరలోనే అధిష్ఠానం దృష్టికీ తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి లక్ష్యం

హరిపురం (మందస), వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం బహాడపల్లిలో సోమవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంకా అమలు చేయబోయే పథకాల గురించి చెప్పారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

బహాడపల్లిలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

తెదేపా మండలాధ్యక్షుడు బి.దుర్యోధనరావు పాల్గొన్నారు. ❖ గోవిందపురంలో అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ ఈశ్వరరావు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి రమణ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచి గోపి, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా తనను నియమించినందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు కణితి సురేష్ చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం సభ్యులు రాపాక శాంతారావు, కొత్తూరు అప్పారావుతోపాటు ఆమెను సత్కరించారు. ఈనెల 17న జరిగే ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెదేపా మండలాధ్యక్షుడు మోహనరావు, ఉమామహేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది రాక.. పనులు జరగక

పూర్తి సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కార్యాలయం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం ఉప తపాలా కార్యాలయంలో ఐదారు రోజులుగా సిబ్బంది సక్రమంగా హాజరు కాకపోవడంతో కార్యకలాపాలు స్తంభించాయి. సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో వచ్చినవారికి ఎవరూ సరైన సమాచారం ఇవ్వడంలేదు. ఖాతాదారులు ఆందోళన చేస్తుండటంతో నెట్‌వర్క్ లేదంటూ ముఖద్వారానికి చిన్న బోర్డు పెట్టి ఊరుకుంటున్నారు. సేవల కోసం అడిగితే, పురుషోత్తపురంలో నెట్‌వర్క్ బాగుందని, అక్కడ శాఖకు వెళ్లి సేవలు పొందాలని ఉచిత సలహా ఇస్తున్నారు. వచ్చిన ఖాతాదారులకు సిబ్బంది రోజుకో సమాధానం చెబుతున్నారు. ప్రింటర్ లేదని, శ్రీకాకుళం నుంచి రానుందని, అది వచ్చిన వెంటనే సొమ్ము కావాల్సిన వారికి ఇస్తామని చెబుతున్నారని ఖాతాదారులు వాపోతున్నారు. రోజూ వందల ఖాతాలు నిర్వహించే కార్యాలయంలో ప్రింటర్ లేకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పోస్టుమాస్టర్ రాకపోవడంతో సమాధానం చెప్పేవారు కరవయ్యారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం: వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కవిటి యువకులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కవిటికి చెందిన మాడుగుల శేషు, అభిరామ్ జంట ఎంపికయ్యారు. జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీల్లో అండర్-19 విభాగంలో ఈ జంట ప్రథమ స్థానం సాధించింది. ఆగస్టులో విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా వారికి ఉషోదయ యువజన సంఘం, ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్, క్రీడాభిమానులు అభినందించారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో ఆంధ్ర స్వాభిమాన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులకు సోమవారం ఎన్నికల అధికారి కర్రి ఉమాశంకర్ ధ్రువీకరణ పత్రాలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దుర్యోధనరావు, ఉపాధ్యక్షుడు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు, ఉప కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఈశ్వరరావు, ఇతర సభ్యులతో ప్రమాణం చేయించారు. ప్రవాసాంధ్రుల తెలుగు సామాజిక అభ్యున్నతికి పాటుపడనున్నట్లు వారు తెలిపారు. ఎంఎస్ రావు, నీలాధర్, మోహన్, చిన్నారావు, తుంబనాథం, భాస్కరరావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వ్యతిరేకిస్తేనే భవిష్యత్తు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: కార్గో విమానాశ్రయం ఏర్పాటు విషయమై వ్యతిరేకిస్తేనే భవిష్యత్తు ఉంటుందని మానవ హక్కుల వేదిక సభ్యుడు వీఎస్ కృష్ణ అన్నారు. మందస మండలం రాంపురంలో బాధిత రైతులతో సోమవారం మాట్లాడారు. విమానాశ్రయం ఏర్పాటులో పచ్చని తోటల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పోరాటాలకు సంఘీభావం తెలిపారు. వేదిక సభ్యుడు వీఎస్ జగన్నాథం పాల్గొన్నారు.

రాంపురంలో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక సభ్యుడు కృష్ణ

డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె తప్పదు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: న్యాయమైన తమ డిమాండ్లను రెండు రోజుల్లోగా ఆమోదించకుంటే, 16వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటామని పుర కార్మికుల ప్రతినిధి ఎ.రమేష్ పట్నాయక్, కార్మికులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పుర కమిషనర్ నల్లి రమేష్‌ను సోమవారం కలుసుకుని, తమ ఆవేదనను వివరించారు. వర్షాలు కురిసే కాలంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకూడదని కమిషనర్ సూచించారు. డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తున్నందున సమ్మె యోచన సరికాదని, ప్రజల కోసం యోచించాలని హితవు పలికారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించండి

ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు సోమవారం ఎంఈవో ధనంజయకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతాలు సకాలంలో పెట్టాలని, సర్వీస్ రిజిష్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏకోపాధ్యాయులు సెలవులు, ఆన్‌లైన్ పనులపై ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా చూడాలని, ఒరియా ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, కార్యదర్శి ఎం.మురళీప్రకాష్, జిల్లా సీపీఎస్ కో కన్వీనర్ జి.జానకీరావు, వెంకటరమణ, పి.రవికుమార్, సూర్యం, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పుర పరిధిలో అభివృద్ధికి నోచుకోని 11వ వార్డులో కాలువల వ్యవస్థకు ఒక రూపం తీసుకురావాలని వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ డా.బెందాళం అశోక్‌కు వినతి పత్రం అందించారు. వార్డులో సరైన రోడ్లు లేవని, దీంతోపాటు మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కొండ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆపన్నహస్తం

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం: కవిటి మండలం బైరిపురానికి చెందిన నర్తు బాలకృష్ణ ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేసుకోవడంతోపాటు భార్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న రైజ్ సంస్థల అధినేత డాక్టర్ పుల్లట ప్రవీణ్ ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం రూ.10 వేలు గ్రామస్థుల ద్వారా అందజేశారు. ❖ ఇచ్ఛాపురం మండలం కేశుపురం గ్రామానికి చెందిన సూరు తాతయ్య అనారోగ్యంలో బాధపడుతున్న విషయం తెలుసుకొని కాళీమాత సేవా సమితి ప్రతినిధులు చేయూతనిచ్చారు. మొత్తం రూ.20వేలు ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందించారు. సేవా సమితి ప్రతినిధులు రమేష్, ప్రకాష్, ధర్మరాజు, నరేంద్ర, యువరాజ్ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి చేద్దాం

హరిపురం(మందస), న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో-2 సుందర్ సోలోమన్ సూచించారు. కిల్లోయి, హంసరాలి, డిమిరియా పాఠశాలలను సోమవారం సందర్శించారు. విద్యార్థుల రాత పుస్తకాలు తనిఖీ చేశారు. ప్రార్థన అనంతరం విద్యార్థులతో మాట్లాడించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సమస్యల వలయం.. అభివృద్ధికి దూరం!

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండలంలోని బాతుపురం పంచాయతీ పరిధిలో పెదవంక, గోపాలదొరపూరు, రిట్టపాడు అనుబంధ గ్రామాలున్నాయి. బాతుపురంలో కాలువ వ్యవస్థ లేకపోవడంతో రామ మందిరం వీధి ఆనుకొని రాజాం వైపు వెళ్లే వీధి రహదారి పొడవునా నిత్యం మురుగు నీరు పారుతోంది. ఉపాధి పథకం కింద చేపడుతున్న సచివాలయం, ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పాత పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహించాల్సి వస్తుంది. జల్‌జీవన్ మిషన్ కింద పైపులైన్ల పనులు జరగకపోవడంతో కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా కావడం లేదు. పాత మంచినీటి ట్యాంకు ప్రమాదపు టంచున ఉంది.

పంచాయతీ:	బాతుపురం
గృహాలు:	దాదాపు 920
జనాభా:	సుమారు 3,200

ప్రధాన రహదారిపైకి మురుగు నీరు

పంచాయతీలోని పెండింగ్ సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పనులు చేసేలా చర్యలు చేపట్టాం. బీటీ రోడ్డు, కొన్ని సీసీ రోడ్లు, ఇతర భవనాలు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం.

– యాదవరాజు, పంచాయతీ కార్యదర్శి

❖ రాజాం నుంచి బాతుపురం మధ్య రోడ్డు, ఇటీవల ప్రారంభించిన తీర బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. వంతెన కింద రహదారి సీసీ రోడ్డుకు నోచుకోవడం లేదు. చెత్తతో సంపద కేంద్రం వినియోగానికి దూరంగా ఉంది. డిజిటల్ గ్రంథాలయం, పాల కేంద్రం పనులు జాడ లేదు. నాడు-నేడు కింద తలపెట్టిన ఉన్నత పాఠశాల అదనపు భవనాలు పనులు నత్తనడకగా సాగుతున్నాయి. తుపాను భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పురాతన సామాజిక భవనంలో నిర్వహించాల్సి వస్తోంది. కొద్ది రోజులుగా వీధి దీపాలు సరిగా పనిచేయడం లేదరు. అనుబంధ గ్రామాలు సుమారు 8 కి.మీ దూరంలో ఉండటంతో సకాలంలో పౌర సేవలు అందుకోలేకపోతున్నారు. రిట్టపాడులో తుపాను రక్షిత భవనం, వ్యవసాయ పరపతి భవనం శిథిలావస్థకు చేరుకున్నాయి.

నివాళులు.. సంతాపాలు

సోంపేట, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: సర్దార్ గౌతు లచ్చన్న అనుచరుడు, సీనియర్ తెదేపా నాయకుడు దేవు చిట్టిబాబు (88) మృతి చెందడం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. తెదేపా ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పార్టీలో ఉంటూ చిత్తశుద్ధి గల కార్యకర్తగా ఆయన సేవలందించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, తెదేపా నాయకులు చిత్రాడ శ్రీను, సూరాడ చంద్రమోహన్, మడ్డు కుమార్, శేఖర్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మాజీ మంత్రి గౌతు శివాజీ సంతాపం తెలిపారు. ❖ కవిటి మండలం సిలగాం ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాడు బాబూరావు (52) ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈ మేరకు సోమవారం విద్యార్థులు, మండలంలోని ఉపాధ్యాయులు నివాళులర్పించి, సంతాపం తెలిపారు. మృతుడికి భార్య శ్రీదేవి (ఉపాధ్యాయురాలు), ఇద్దరు కుమార్తెలున్నారు.

జడ్పీ అధ్యక్షురాలిపై దాడి దారుణం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా జడ్పీ అధ్యక్షురాలు ఉప్పాల హారికపై జరిగిన దాడి బాధాకరమని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి ఇదే నిదర్శనమని వైకాపా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దాడికి పాల్పడిన దుండగులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, తహసీల్దార్ ఎన్.వెంకటరావుకు వినతి పత్రం అందించారు.

ఇచ్ఛాపురం తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైకాపా నాయకులు

(c) eenadu

టెక్కలి
•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం నౌగాం నుంచి మదనాపురం వరకు సుమారు 2 కి.మీ. బీటీ రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మరమ్మతులైనా చేయించాలి. - **మడపాల ఖగేశ్వరరావు, మదనాపురం**

★ ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్డు బాగు చేయిస్తాం. - మోహన్, ఏఈ, పీఐయూ శాఖ, నందిగాం - న్యూస్‌టుడే, నందిగాం

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు- శ్రీకాకుళం రహదారిలో మురుగు కాలువలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవతో రూ.28 లక్షలు నిధులు మంజూరవడంతో సోమవారం పనులు ప్రారంభించారు. తహసీల్దార్ కె.బాలకృష్ణ, తెదేపా మండలాధ్యక్షుడు ఎ.మాధవరావు, నాయకులు ఎ.అరుణ్‌కుమార్, మాతల గాంధీ, సర్పంచి ప్రతినిధి పడాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

కాలువ పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజల చెంతకు సంక్షేమ ఫలాలు

నరసన్నపేట, పోలాకి, ఎల్ఎన్‌పేట, సారవకోట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల చెంతకు సంక్షేమ ఫలాలు చేరవవుతున్నాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట మేజర్ పంచాయతీలో సోమవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పోలాకి మండలం గజపతినగరం గ్రామంలో తెదేపా ఉత్తరాంధ్ర సమన్వయకర్త పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కలిసి రమణమూర్తి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించారు. ★ ఎల్ఎన్‌పేట మండలం పూశాంలో తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నాయకులు శివ్వాల కిశోర్‌బాబు, వెంకునాయుడు, సూర్యనారాయణ, తంగి అప్పన్న పాల్గొన్నారు. ★ సారవకోట మండలం అలుదు గ్రామంలో చల్ల ఆనందరావు ఆధ్వర్యంలో కరపత్రాల ప్రదర్శన చేపట్టారు. తెదేపా శ్రేణులు పాల్గొన్నాయి.

ఎల్ఎన్‌పేట: పూశాంలో కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో..

పోలాకి: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఎట్టకేలకు పారిశుద్ధ్య పనులు

సారవకోట, న్యూస్‌టుడే: కిన్నెరవాడ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల వీధిలో మురుగు సమస్యను ఎట్టకేలకు పరిష్కరించారు. దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తోందని, దోమల బెడదతో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారని స్థానికులు తెలియజేయడంతో

స్పందనకు వందనం

'ఈనాడు'లో ఈనెల 13న 'దుర్వాసన, దోమల బెడద' శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో ఈవోపీఆర్డీ ప్రభాకరరావు స్పందించారు. ఆయన సూచనల మేరకు సర్పంచి పద్మావతి సిబ్బందితో మురుగునీరు దిగువకు ప్రవహించే విధంగా పనులు చేయించారు.

చేను ఎండుతోంది.. గుండె మండుతోంది

– న్యూస్‌టుడే, సారవకోట, నరసన్నపేట, పోలాకి, జలుమూరు

వరుణుడు ముఖం చాటేయడంతో వరి చేను ఎండిపోతోంది. తడులు అందించడానికి చెరువుల్లో సైతం నీరు లేక రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. జూన్ నెలలో కురిసిన తేలిక పాటి వర్షాలకు నరసన్నపేట నియోజకవర్గంలో అధిక శాతం మంది వెద రూపంలో సాగు చేపట్టారు. పది రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటుందే తప్ప చినుకు రాలడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఎండలు కాస్తుండటంతో పొలాల్లో నీటి తడి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గం వివరాలు

మండలం	వ్యవసాయ భూమి (ఎకరాల్లో)	చెరువులు, వర్షాధారంగా సాగు
సారవకోట	16,275	11,900
నరసన్నపేట	18,272	950
పోలాకి	17,200	1,870
జలుమూరు	20,100	250

వాబ సమీపంలో ఎండుతున్న వరిచేను

చుక్క నీరులేని గొర్రిబంద సమీపంలోని కోనాకం చెరువు

ఏం చేయాలో తెలియడం లేదు

10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. రెండు వారాలుగా వర్షాలు కురవడం లేదు. పొలాల్లోని చేను ఎండిపోతుండటంతో ఏం చేయాలో తెలియడం లేదు. మొదట కురిసిన వానలకు కలుపు నివారణ మందులు పిచికారీ చేశాం. ప్రస్తుతం పంట పసుపు వర్ణంలోకి మారుతోంది.

– గొద్దు మాధవరావు, రైతు, గొర్రిబంద

జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్ట భూముల్లో పైరు ఎండిపోతున్న మాట వాస్తవమే. అవకాశం ఉన్న రైతులు తడులు అందించాలి. నారు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. త్వరలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

– వెంకటరావు, చిరంజీవి, ఏవోలు, సారవకోట, పోలాకి

వెంటాడుతున్న గత పాలకుల వైఫల్యాలు

సారవకోట పరిధిలో సగానికి పైగా భూముల్లో చెరువులు, వర్షాధారంగా సాగు చేపడుతున్నారు. 2018లో తెదేపా హయాంలో మండలంలోని 11,700 ఎకరాలను సాగునీరందించాలనే ఆలోచనతో బొంతు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని రూ.180.22 కోట్లు నిధులు మంజూరు చేశారు. మహేంద్రతనయ నది నీటితో సస్యశ్యామలం చేయాలని నిర్ణయించారు. పనులు పూర్తిచేయడానికి రెండేళ్ల కాలపరిమితిని అప్పటి పాలకులు విధించారు. సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి అధికారంలోకి రావడంతో నిర్మాణం ఊపందుకుంది. అయినా ఈ ఖరీఫ్‌కు నీరందే అవకాశం లేదు. నరసన్నపేట మండలంలో జమ్ము, తామరాపల్లి, పోతయ్యవలస, గొట్టిపల్లి పంచాయతీల్లోని మెట్ట భూములు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నాయి. జలుమూరు, పోలాకి మండలాల్లో అధిక శాతం భూములకు వంశధార ఎడమ కాలువ నీరందుతుంది.

నేడు నీలమణిదుర్గ ఆవేటి వారాలు

విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నంలో వెలసిన నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆవేటి వారాలు జరగనున్నాయి. అమ్మవారిని ప్రత్యేక ఆభరణాలతో, ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పశువుల అక్రమ రవాణా

నందిగాం, న్యూస్‌టుడే: సోంపేటకు చెందిన ఇప్పిలి దేవరాజు, మార్పు సందీప్ రెండు వ్యాన్లలో సోంపేట నుంచి శ్రీకాకుళం వైపు అక్రమంగా పశువులు తరలిస్తుండగా నందిగాం గురుకుల పాఠశాల సమీపంలో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరాజు 5 ఎద్దులు, సందీప్ 9 ఎద్దులు తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మూగజీవాలను కొత్తవలస గోశాలకు తరలించినట్లు చెప్పారు.

తరచూ ప్రమాదాలు.. తెరవరా కళ్లు

నరసన్నపేట మండలం ముసిడిగట్టు గ్రామానికి వెళ్లే మార్గంలో పాలకొండపేట వద్ద పనికిరాని మొక్కలు పెరిగిపోయి, రోడ్డు మీదకు వ్యాపించాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

నిర్వహణ లోపం.. వృథాగా జలం

నందిగాం మండలం పెద్ద తామరాపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో చిన్న తరహా రక్షిత మంచి నీటి పథకం కుళాయిల బిరడాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బాగు చేయించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ చెప్పారు. – న్యూస్‌టుడే, నందిగాం

శ్రద్ధ పెడితే సద్వినియోగం

కొత్తూరు మండలంలోని మహసింగి ఆర్అండ్ఆర్ కాలనీలో పాలసేకరణ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గ్రామంలోని పాడి రైతుల నుంచి సేకరించిన పాలను ఇక్కడ నుంచి ప్రధాన కేంద్రానికి పంపించేవారు. కొన్ని నెలలుగా వినియోగానికి దూరంగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పశువైద్యాధికారి టి.హరికృష్ణ వద్ద ప్రస్తావించగా.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

పాలకులకు పట్టదు.. ప్రజలకు తప్పదు

ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలోని రోటరీనగర్ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలువల్లో పూడిక పేరుకు పోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా.. కనీసం పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరే దారి లేక సోమవారం కుమ్మరి వీధి ప్రజలు కాలువలు శుభ్రం చేసుకున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

చివరి దశలో చేతులెత్తేశారు

నరసన్నపేట మండలం తోటాడ- బాడాం రహదారిని గతంలో అభివృద్ధి చేశారు. నిధుల లేమితో బాడాం కాలనీ సమీపంలోని సుమారు 100 మీటర్ల మార్గాన్ని అలాగే వదిలేశారు. వర్షాల సమయంలో గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ప్రాజెక్ట్స్ ఏఈ శంకరరావు వద్ద ప్రస్తావించగా.. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా దీన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

నరసన్నపేట, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారమవుతాయని జూనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. సోమవారం నరసన్నపేట కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి ఆమె ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ★ పెండింగ్‌లో ఉన్న కేసుల్ని మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి బి.నిర్మల కోరారు. టెక్కలి సబ్ కోర్టు ఆవరణలో కక్షిదారులతో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జులై నుంచి 90 రోజుల పాటు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివాహ, గృహహింస, చెక్ బౌన్స్, సివిల్ కేసులతో పాటు రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామని తెలిపారు.

నరసన్నపేటలో ర్యాలీలో పాల్గొన్న జడ్జి వాణి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

టెక్కలి పట్టణం: కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల

జైలు పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

నరసన్నపేట, పాతపట్నం, న్యూస్‌టుడే: జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. నరసన్నపేట ఉపకారాగారాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి వాణి పాల్గొన్నారు. అనంతరం పాతపట్నంలోని పలు పాఠశాలలు, వసతి గృహాలను, ఉపకారాగారాన్ని హరిబాబు సందర్శించారు. బెడ్ల కొరత ఉన్నట్లు పాతపట్నం నవజీవన్ వసతి గృహంలోని బాలికలు ఆయనకు తెలియజేశారు. ఆ తరువాత ఎ.ఎస్.కవిటిలోని ఎస్‌హెచ్ఐ చర్చి మినిస్ట్రీస్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తాగునీరు, ఇతర సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు. ప్రతి నెల తనిఖీలు చేసేందుకు వైద్యులు వచ్చేలా చూడాలని పిల్లలు కోరారు.

నరసన్నపేట ఉప కారాగారంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు, చిత్రంలో జడ్జి వాణి

సమర్థంగా బంగారు కుటుంబాల గుర్తింపు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పీ-4 ప్రక్రియలో భాగంగా బంగారు కుటుంబాల గుర్తింపు సమర్థంగా చేపట్టాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా, ఈవోపీఆర్డీ తారకేశ్వరి పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: తప్పుడు ధ్రువపత్రాలతో విద్యుత్తు మీటర్లు పొందిన వారిపై చర్యలు చేపట్టాలని నిర్వాసిత గ్రామాల నాయకుడు బూర్లె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో సోమవారం తహసీల్దార్ కె.బాలకృష్ణ, ఎంపీడీవో నీరజకు సమస్య వివరించారు.

కంచాల వితరణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: గోపినాథపురం ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు పొట్నూరు వెంకటరావు రూ.6వేల విలువైన కంచాలను సోమవారం వితరణగా అందజేశారు. ఆయన కుమార్తె పి.అనురాధ గతంలో ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పాతపట్నం, న్యూస్‌టుడే: తెంబూరులో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సహకారంతో శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. 42 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. బి.చంద్రమౌళి, సాయిరోహిత్, సంతోష్‌కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అవే కొర్రీలు.. తీరని సమస్యలు

సారవకోట, న్యూస్‌టుడే: అలుదు పంచాయతీకి చెందిన 93 మందికి తొలి విడతలో తల్లికి వందనం నగదు జమ కాలేదు. నాలుగు చక్రాల వాహనాలు, భూములు ఉండడంతో పాటు ఎక్కువ మొత్తంలో విద్యుత్తు బిల్లులు వస్తున్నాయని అధికారులు కారణం చూపారు. వాస్తవ పరిస్థితి తెలియజేస్తూ ధ్రువపత్రాలు సమర్పించి, స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన రెండో విడత జాబితాలోనూ అదే పరిస్థితి తలెత్తడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అలుదు సచివాలయంలో సంక్షేమ సహాయకురాలు శైలజ వద్ద సమస్య వివరించారు. ఇదే పరిస్థితి సారవకోట, కిన్నెరవాడతో పాటు చాలా గ్రామాల్లో నెలకొన్నట్లు తెలిసింది. ఎంఈవో వెంకటరమణ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా.. పథకం వర్తించని వారు సచివాలయాల్లో వివరాలు అందించాలన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీఐ అంబటి విజయ్‌కుమార్ కోరారు. లింగాలవలసలో సోమవారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానికులకు అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని తెలిపారు.

బాలికలకు సైకిళ్ల వితరణ

నందిగాం, న్యూస్‌టుడే: దేవళభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నిరుపేదలైన ముగ్గురు బాలికలకు గుంటూరు జిల్లాకి చెందిన వసుధైక కుటుంబం ఫౌండేషన్ సోమవారం సైకిళ్లను అందజేసింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో- 2 చిన్నారావు, ప్రధానోపాధ్యాయుడు గుణశేఖర్, మళ్ల బాలకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల కుళాయిలు చోరీ

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం ఉర్లాం ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల తాళాలు పగలగొట్టి కుళాయిలు, గొట్టాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ప్రధానోపాధ్యాయిని భారతి సోమవారం తెలిపారు. వీటి విలువ సుమారుగా రూ.40 వేలు వరకు ఉంటుందని చెప్పారు. పోలీసులకు సమాచారమివ్వగా.. పరిశీలించారని పేర్కొన్నారు

బాధ్యతల స్వీకరణ

టెక్కలి పట్టణం, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఏపీఈపీడీసీఎల్ టెక్కలి డివిజన్ ఈఈగా నర్సింహకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ నుంచి ఈయన బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన జి.శంకరరావు జిల్లా కేంద్రానికి వెళ్లారు. నూతన ఈఈని విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ★ టెక్కలి పంచాయతీ కార్యదర్శిగా ఎ.వెంకటశ్రీనివాసరావు విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన వెంకటరావు రాజాం మండలానికి బదిలీపై వెళ్లారు. టెక్కలిలో పారిశుద్ధ్య మెరుగుకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు నూతన కార్యదర్శి తెలిపారు. పలు వీధుల్లో పర్యటించిన ఆయన చెత్తకుప్పలు, పూడికతో పేరుకుపోయిన కాలువల్ని గుర్తించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ★ కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ ఈవోగా హరికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరెడ్డి సంతబొమ్మాళి మండలానికి బదిలీ కాగా హిరమండలం మేజర్ పంచాయతీ నుంచి హరికృష్ణ ఇక్కడకు వచ్చినట్లు ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు. ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు వారికి అందుబాటులో ఉంటానని హరికృష్ణ స్పష్టం చేశారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

పాతపట్నం, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: పాతపట్నం క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 12, 13వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. డబుల్స్ విభాగంలో వంజరాపు ప్రవీణ్, సాయి విజేతలుగా నిలిచారు. మడ్డు ప్రకాశ్, శివ రెండో స్థానం దక్కించుకున్నారు. వంజరాపు ప్రవీణ్ స్వగ్రామం పాతపట్నం, ప్రకాశ్ పాతపట్నం మండలం కొరసవాడ గ్రామ వాసి. క్రీడాకారులను ఆయా గ్రామస్థులు అభినందించారు. టెక్కలి పట్టణానికి చెందిన నానుబోలు తాన్విశ్రీ అండర్ 13 విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో విజేతగా నిలిచింది.

పీఏసీఎస్ అధ్యక్షుడికి సన్మానం

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు బైరి భాస్కరరావును సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. రైతులకు ఉత్తమ సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్, వీఆర్వో ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పీఎంజేఏవై పథకంపై అవగాహన

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకంపై అవగాహన అవసరమని ఎన్‌సీసీ కెప్టెన్ జి.రవికుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

పాఠశాలకు టీవీ అందజేత

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: బిర్లంగి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన మోహనరావు భార్య సుగుణమ్మ జ్ఞాపకార్థం రూ.45 వేల విలువైన ఎల్ఈడీ టీవీ వితరణగా సోమవారం అందచేశారు. హెచ్ఎం త్రినాథ, నూక సత్యరాజ్, అప్పన్న, కృష్ణమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పొడుగుపాడు సమీపంలో సోమవారం సాయంత్రం కోటబొమ్మాళి- నరసన్నపేట మార్గంలో ఆగి ఉన్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో టెక్కలి మండలం విక్రంపురం గ్రామానికి చెందిన ద్విచక్రవాహన దారుడు లక్ష్మీప్రసాద్, ఆటోలో ఉన్న ఆమదాలవలసకు చెందిన నాగమణి గాయపడ్డారు. వీరిని నరసన్నపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

రక్షక భటులకు రక్షణ కరవు

– న్యూస్‌టుడే, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట

నరసన్నపేట సర్కిల్ పరిధిలో పోలీసుల నివాసాలతో పాటు స్టేషన్ల పరిస్థితి దారుణంగా మారింది. దీంతో రక్షక భటులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా నరసన్నపేట పోలీసు స్టేషన్ పరిస్థితి అధ్వానంగా మారింది. పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో ఇక్కడ పనిచేయడం కత్తిమీద సాముగానే చెప్పవచ్చు. 1992 నవంబరు 1న దీన్ని ప్రారంభించగా, కొద్ది కాలంలోనే ఈ భవనాలు శిథిలావస్థకు చేరాయి.

శిథిలమైన సిబ్బంది గృహాలు

వినియోగానికి దూరంగా నివాసాలు

నరసన్నపేట సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీసు స్టేషన్ల సిబ్బందిని నివాసాల సమస్య వెంటాడుతోంది. నరసన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సైతో పాటు ముగ్గురు ఏఎస్ఐలు, ఆరుగురు హెచ్‌సీలతో పాటు 17మంది కానిస్టేబుళ్లున్నారు. పోలీసు స్టేషన్‌కు ఆనుకుని వీరి కోసం నిర్మించిన క్వార్టర్లు దశాబ్ద కాలం కిందట శిథిలావస్థకు చేరాయి. జలుమూరు, పోలాకి, సారవకోటలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు

చర్యలు తీసుకుంటాం

నరసన్నపేట పోలీసు స్టేషన్ భవనం మరమ్మతులకు చర్యలు చేపడుతున్నాం. శిథిలావస్థకు చేరిన సిబ్బంది నివాసాల గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీనివాసరావు, సీఐ, నరసన్నపేట

నరసన్నపేట పోలీస్‌స్టేషన్ పైకప్పు పరిస్థితి

పనికిరాని మొక్కల తొలగింపు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ర.భ., పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారులకు ఇరువైపులా పనికిరాని మొక్కలను సోమవారం ఉపాధిహామీ వేతనదారులు తొలగించారు. రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచనల మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో 30 మండలాల్లో ఒక్క రోజులోనే 186 రహదారుల్లో 143.07 కి.మీ. మేర పనులు చేపట్టారు. సుమారు 8,600 మంది వేతనదారులు పనుల్లో పాల్గొన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎకరాకు 5 టన్నుల దిగుబడి

సారవకోట మండలం అక్కివలస గ్రామపరిధిలో సర్పంచి బమ్మిడి లక్ష్మి రెండు ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేస్తున్నారు. సదరు క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ నియోజకవర్గ మాస్టర్ శిక్షకుడు తోట రమణ ఆధ్వర్యంలో సోమవారం దిగుబడి ప్రయోగం చేపట్టారు. ఎకరా విస్తీర్ణంలో 5 టన్నుల దిగుబడి వచ్చినట్లు సిబ్బంది అంచనా వేశారు. నవ ధాన్యాల సాగు వల్ల వరి, ఇతర పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయని చెప్పారు. – న్యూస్‌టుడే, సారవకోట

(c) eenadu

శాకంబరిగా కాశీవిశాలాక్షి

పొందూరులోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో కాశీవిశాలాక్షి అమ్మవారు ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిగా సోమవారం భక్తులు దర్శనమిచ్చారు. ఏటా ఈ మాసంలో వారాహిమాత, శాకంబరి అమ్మ వార్లకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

తెరపై ఈనాడు

● కిన్నెర : ఓ భామా... అయ్యో రామా..! ● కీర్తన : జురాసిక్ వరల్డ్ రీబర్త్ ● కీర్తిక : 3బీహెచ్‌కే ● మారుతి : దీ 100 ● సూర్యమహల్: కన్నప్ప ● ఎస్వీసీ (రామలక్ష్మణ): కుబేరా ● సన్ మాక్స్: తమ్ముడు ● సరస్వతి : సూపర్ మ్యాన్ –న్యూస్‌టుడే, పాతబస్టాండ్,

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

ఓటర్ల జాబితా తయారీపై అవగాహన అవసరం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: బూత్ లెవల్ అధికారులకు ఓటర్ల జాబితా తయారీపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష అన్నారు. నగరంలోని రెవెన్యూ అతిథి గృహంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాసరావు, శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయ పర్యవేక్షకుడు చక్రవర్తి, ఏఈఆర్‌వోలు జానకి, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం: కూన రవి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు, ఇంటింటికీ తాగునీరు పూర్తిస్థాయిలో అందించేదుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఆమదాలవలస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాగునీటి కాలువల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ.12 కోట్లు నిధులు తెచ్చామన్నారు. నారాయణపురం ఎడమ, కుడికాలువతో పాటు నియోజకవర్గంలో అన్ని కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నారాయణపురం ప్రాజెక్టు ఛైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, ఎంపీడీవో ఆర్.వెంకటరావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

డీఆర్‌వలసలో విగ్రహాల ధ్వంసంపై పరిశీలన

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండలంలోని డీఆర్‌వలస శివాలయంలో నవగ్రహ విగ్రహాలు ధ్వంసమైన ప్రాంతాన్ని సోమవారం ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, సాధుపరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానందసరస్వతి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విగ్రహాలను ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. శ్రీనివాసానందసరస్వతి మాట్లాడుతూ హిందువుల ఆలయాలకు రక్షణ అవసరమని పేర్కొన్నారు. తెదేపా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, సాధుపరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

మధ్యవర్తిత్వంతో కేసుల రాజీ

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని, దీనికి సంబంధించి ముగ్గురు న్యాయవాదులకు పూర్తిగా శిక్షణ ఇచ్చి వారికి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పొందూరు సివిల్ కోర్టు జడ్జి బి.జోత్స్న తెలిపారు. దీంతో కేసులు సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు.

ఆటల్లేవ్.. ఆడుకోవడాల్లేవ్!

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడామైదానాలు ఏర్పాటుచేశారు. కొన్ని స్కూళ్లలో అందుకు తగ్గ వసతులు లేక విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులున్నా ఆశించిన ఫలితాలు కనబడటం లేదు. ఆట స్థలాలు అభివృద్ధి చెందితే గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

● క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
● ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని మైదానాల అభివృద్ధి

అభివృద్ధికి నోచుకోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

నియోజకవర్గంలో క్రీడామైదానాల పరిస్థితి

మండలం	జడ్పీహెచ్‌ఎస్	ఆటస్థలాలు	
		ఉన్నవి	లేనివి
సరుబుజ్జిలి	07	04	03
ఆమదాలవలస	07	07	00
పొందూరు	08	03	05
బూర్జ	08	06	02

నిబంధనలు ఇలా..

విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవడానికి విధిగా ఆట స్థలాలు ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రాథమిక పాఠశాలలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2 ఎకరాలు, జడ్పీహెచ్‌ఎస్‌లకు 4 ఎకరాల విస్తీర్ణంలో ఆట స్థలం ఉండాలి. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పూర్తి స్థాయిలో క్రీడా మైదానాలు కరవయ్యాయి.

ఇదీ పరిస్థితి.. ● నియోజకవర్గంలో 30 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 24 స్కూళ్ల క్రీడా మైదానాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మరి కొన్నిచోట్ల ఆట స్థలాలే లేవు. గోనెపాడు, చిన్న కాకితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు క్రీడా మైదానాలు లేక అవస్థలు పడుతుండగా, కొత్తకోట, సరుబుజ్జిలిలో ఆట స్థలాలు ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం నిర్వహించే మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థులకు ఆసక్తి ఉన్నా పాఠశాల స్థాయిలో శిక్షణ లేకపోవడంతో మిన్నకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం.. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల అభివృద్ధి పనుల కోసం కృషి చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను జిల్లా అధికారులకు తెలియజేశాం. ఉపాధి నిధులతో ఆటస్థలాలు అభివృద్ధి చేస్తామని అధికారులు పేర్కొన్నారు.
– డి.బాలరాజు, రాజేంద్రప్రసాద్, శ్రీరాములు, శ్యామసుందరరావు నియోజకవర్గ ఎంఈవోలు

26న పారా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో ఈ నెల 26న దివ్యాంగ క్రీడాకారుల జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రాము, డి.అచ్యుతరావు ఓ ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు ఈ నెల 24 లోగా వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు ప్రతిభ ఆధారంగా 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారన్నారు. వివరాలకు 93813 68209, 80081 62432, 91776 93836 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆదిత్యాలయంలో పార్కింగ్ వేలం ఖరారు

శ్రీకాకుళం నగరం: ఆదిత్యాలయంలో పార్కింగ్, చెప్పుల స్టాండ్ నిర్వహణ ఇతర అంశాలకు సంబంధించి ఈవో ప్రసాదరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. చెప్పుల స్టాండ్ రూ.2.19 లక్షలకు, పార్కింగ్ రూ.2.05 లక్షలకు లీజు హక్కులు అప్పగించారు.

ఈత కొలను మూసివేత తగదు

పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ఈత కొలను మూసివేత నిర్ణయం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, చందు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్టోబరులో పాఠశాల క్రీడల పోటీలు ఉంటాయని. .ఆగస్టులో మూసివేయడం ఏంటని ప్రశ్నించారు.

ఏటీఎంలో అపరిశుభ్రత

ఆమదాలవలస పట్టణం కంచ్రపేటలోని ఎస్‌బీఐ ఏటీఎం అపరిశుభ్రంగా ఉండటంతో వినియోగదారులు అందులోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. నిర్వహణ లేక దుర్వాసన వ్యాపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యను స్థానిక ఎస్‌బీఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఏటీఎం నిర్వహణ బాధ్యత ఏజెన్సీలు చూస్తాయని, వారికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

సంపదకు దూరం..

సరుబుజ్జిలి మండల కేంద్రంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం తొట్టెల్లో పనికిరాని మొక్కలు పేరుకుపోయాయి. దీంతో అందులో చెత్తను నిల్వ చేసేందుకు వీలు లేకుండా పోయింది. అధికారులు స్పందించి పనికిరాని మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ రామారావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ఇక్కడొక కాలువ ఉండాలే!

ఆమదాలవలస పట్టణంలోని ప్రధాన కాలువలతోపాటు అనుబంధ కాలువల్లో పనికిరాని మొక్కలు కప్పేయడంతో పూడిక తొలగించేందుకు అవకాశం లేకపోయింది. దీంతో వర్షాలు కురిసే సమయంలో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుందని స్థానికులు వాపోతున్నారు. దోమలు బెడద ఎక్కువగా ఉందని పుర అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు. సమస్యపై ఇన్‌ఛార్జి పుర కమిషనర్ జాన్సన్ మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పునాదులకే పరిమితం..

పొందూరు వెలుగు శ్రీశక్తి భవనం పునాదులకే పరిమితమైంది. తెదేపా హయాంలో ప్రారంభించిన ఈ భవన నిర్మాణపనులను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వెలుగు సిబ్బంది, గ్రామైక్య సంఘాల సభ్యులు ఇరుకుగదిలో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. మహిళా సంఘాలతో సమావేశాల కోసం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ విషయంపై వెలుగు ఏపీఎం సింహాచలం వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు

చెత్తశుద్ధి లేదు

ఆమదాలవలస మండలం గోపీనగరం కొత్త రోడ్డు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో నివాసితులు చెత్తను తెచ్చి రోడ్డు పక్కన పడేయడంతో గాలులకు ప్రయాణికులపై ఎగిరిపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఈవోపీఆర్డీ గోపాలరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, గోపీనగరం(ఆమదాలవలస గ్రామీణం)

ఘనంగా గరిమెళ్ల జయంతి

ఎచ్చెర్ల, శ్రీకాకుళం సాంస్కృతికం, శ్రీకాకుళం నగరం: స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సంపాదకులు, జాతీయ ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతి వేడుకలు సోమవారం శ్రీకాకుళం, ఎచ్చెర్ల ప్రాంతాల్లో పలువురు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ వర్సిటీలో గరిమెళ్ల చిత్రపటానికి నివాళి

ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్సు రద్దు


ఎరువుల గోదాం తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఎరువుల కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా వారి లైసెన్సులు రద్దు చేస్తామని సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాలు, గోదాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ వస్తున్నారనే సమాచారంతో ముందుగా కొందరు రిటైల్ వ్యాపారులు తమ దుకాణాలకు తాళాలు వేసి వెళ్లిపోవడంతో స్థానిక వ్యవసాయ అధికారులు తీరుకు అద్దం పడుతుందని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి, వ్యవసాయ సహాయ సంచాలకులు రజని పాల్గొన్నారు.

యువత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి: ఎమ్మెల్యే

పాతబస్టాండ్, శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: యువత భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేటు సంస్థలు 457 ఖాళీలకు అభ్యర్థుల ఎంపికలు చేపట్టారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ పాల్గొన్నారు. క్రీడలకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం చింతాడలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. తుదిపోరులో చింతాడ-11 జట్టుపై నేతాజీ-11 టీం విజయం సాధించింది. తుది పోరులో పాల్గొన్న ఇరుజట్లకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండదాసు నాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

సుపరిపాలనే కూటమి ధ్యేయం

ఆమదాలవలస పట్టణం: రాష్ట్రంలో సుపరిపాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో పట్టణంలోని 8వ వార్డులో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

తెదేపా మండలాధ్యక్షుడికి సత్కారం

జి.సిగడాం: తెదేపా జి.సిగడాం మండలాధ్యక్షుడిగా నియమితులైన కుమరాపు రవికుమార్‌ను పలువురు మండలాధికారులు సన్మానించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ చరిత, ఎంపీడీవో రామకృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు సన్మానం

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత హోంగార్డు ఎల్వీఆర్ మూర్తిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సత్కరించారు. తక్షణ సాయంగా రూ.5 వేల చెక్కు అందజేశారు. పరిపాలనాధికారి సీహెచ్ గోపీనాథ్, ఆర్ఐ(వెల్ఫేర్) వెంకటరమణ పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం

మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు గ్రేడింగ్ టెస్ట్

పాతబస్టాండ్: నగరంలోని ఏడు రోడ్ల కూడలి సమీపంలోని ఓ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో గ్రేడింగ్ టెస్ట్ ప్రకారం విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని గ్రాండ్ మాస్టర్ మండా శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, కిక్ బాక్సింగ్ కోచ్ డి.హరీష్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ నటుకుల మోహన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్, బరాటం సంతోష్ క్రీడాకారులను అభినందించారు.

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష

రణస్థలం: పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో ఈశ్వరరావు అన్నారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రొయ్యల చెరువులకు విద్యుత్తు నిలిపివేయండి

శ్రీకాకుళం గ్రామీణం: శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అంబటి నిర్మల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీజీపేటలో రొయ్యల చెరువులతో అవస్థలు తప్పడం లేదని.. వాటికి వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో బి.శైలజ, ఏవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

పాతబస్టాండ్: బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ఎస్టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నబాబు, మల్లేసు, గోవిందరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

సమాజంపై సామాజిక మాధ్యమాల ప్రభావం

ఎచ్చెర్ల: సమాజంలో సామాజిక మాధ్యమాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని కశ్మీరు సెంట్రల్ యూనివర్సిటీ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం అధ్యాపకులు కె.జాన్‌బాబు అన్నారు. ఎచ్చెర్ల డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రీసెర్చి ఫోరమ్ ఆధ్వర్యంలోనిర్వహించిన లెక్చర్ సిరీస్ సమావేశంలో ఆయన ప్రత్యేక వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.ఆర్.రజని జాన్‌బాబును సన్మానించారు.

ఆదిత్యుని సేవలో గొండు శంకర్

శ్రీకాకుళం నగరం: అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఎమ్మెల్యే గొండు శంకర్, తెదేపా జోనల్ ఇన్‌ఛార్జి పి.శ్రీనివాసరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు.

గుర్తు తెలియని వృద్ధుడి దుర్మరణం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న గుర్తు తెలియని వృద్ధుడిని ఆదివారం రాత్రి ఓ కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో స్థానికులు సర్వజనాసుప్రతికి తరలించారు. అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయారని ట్రాఫిక్ ఎస్సై మెట్ట సుధాకర్ తెలిపారు. యాచకుడిగా జీవిస్తున్న అతనికి సుమారు 70 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. మృతుని వివరాలు తెలిసిన వారు 96946 94956, 63099 90809 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అరసవల్లి వాసి అదృశ్యం

శ్రీకాకుళం గ్రామీణం న్యూస్‌టుడే: అరసవల్లి ఆదిత్యానగర్ కాలనీకి చెందిన గిడుతూరి శివశంకర్ భార్యతో గొడవపడి గత నెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయారని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని శ్రీకాకుళం గ్రామీణ పోలీసుస్టేషన్ ఎస్సై కె.రాము సోమవారం తెలిపారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 94905 33820ను సంప్రదించాలన్నారు

పశువుల పట్టివేత

రణస్థలం,: జేఆర్‌పురం జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలిలో వద్ద వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 18 పశువులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డాయని, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి చెప్పారు.

సాంకేతిక అంశాలపై నైపుణ్యం పెంచుకోండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతిక అంశాలపై నైపుణ్యాలు పెంచుకోవాలని శివానీ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు వై.శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐ.సి.టి అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫినిషింగ్ స్కూల్ ఆఫ్ ఎంప్లాయిబులిటి అనే అంశంపై శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఐ.సి.టి అకాడమీ, చెన్నై ప్రాజెక్టు హెడ్ ఈ.దినేష్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, బెంగళూరు శిక్షకుడు శశికాంత్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.టి.చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యుడు ఎస్.వి.ఎన్.సునీల్‌కుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

డీమత్స్యలేశంలో మెరైన్ అధికారుల పల్లె నిద్ర

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని డీమత్స్యలేశం గ్రామంలో మెరైన్ అధికారులు సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళింగపట్నం మెరైన్ ఎస్సై జి.హరికృష్ణ, సిబ్బంది గ్రామంలో మత్స్యకారులకు తీవ్రవాదులు, దేశ వ్యతిరేకులతో వచ్చే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు తీరం వెంబడి రవాణాచేస్తే కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్‌ఫ్రీ నెంబర్ 1093, 93929 14712 లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోండి

గార, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సేవాగుణం పెంపొందాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను, సమాజాన్ని గౌరవించడం జీవితంలో భాగం కావాలని సత్యసాయి విద్యాజ్యోతి జిల్లా బాధ్యుడు ఎం.జనార్దనరావు అన్నారు. గారలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రతినిధి అప్పలాచార్యులు, సత్యసాయి విద్యాజ్యోతి కన్వీనర్ పండి వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా బాధ్యుడు జనార్దనరావు

కాలువలు శిథిలం.. వరదొస్తే భయం

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస పురపాలక ఏర్పడి 30 ఏళ్లు పూర్తవుతున్న నేటికీ అప్పటి కాలువలపై ఆధార పడి మురుగునీరు ప్రవహించడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అవి శిథిలావస్థకు చేరడం, కొన్ని చోట్ల ఆక్రమణలకు గురికావడంతో వార్డుల్లో వస్తున్న మురుగనీరు లోతట్టు ప్రాంతాల్లోని రహదారులు, ఇళ్లల్లోకి చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని పట్టణ వాసులు వాపోతున్నారు.

వర్షాకాలంలో పురవాసులకు తప్పని అవస్థలు

చింతాడ ప్రధాన కాలువ కప్పేయడంతో నిలిచిన మురుగు

బరితెగించిన ఆక్రమణ దారులు..!

పట్టణంలోని ప్రధాన కాలువ కృష్ణాపురం నుంచి ఓవర్ బ్రిడ్జి వరకూ రహదారికి ఆనుకుని ఉండటంతో కొందరు ఆక్రమణ దారులు వాటిపై సిమ్మెంటు పలకలు వేసి, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంకొంత మంది ఇంటి కోసం ప్రధాన కాలువపైనే మెట్లు కట్టడంతో అవి పూర్తిగా పాడైపోయాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గమ్మునుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

పురపాలక జనాభా: 49 వేలు
మొత్తం ఇళ్లు: 11,414
వార్డులు : 23
కాలువల పొడవు : సుమారు 26 కి.మీ
ఒక రోజు చెత్త: 26 మెట్రిక్ టన్నులు
సిబ్బంది తొలగిస్తుంది: 22 మెట్రిక్ టన్నులు
పారిశుద్ధ్య నిర్వహణ ఖర్చు: రూ.2.04 కోట్లు

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కృషి

పట్టణంలో పురాతన డ్రైనేజీ వ్యవస్థ ఉంది. కొన్ని చోట్ల ప్రధాన కాలువలు ఆక్రమణలు జరిగాయి. వాటిని తొలగించి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో చర్యలు తీసుకుంటాం.
- కూన రవికుమార్ ఎమ్మెల్యే, ఆమదాలవలస

పక్కాగా సామాజిక తనిఖీలు

లావేరు: ఉపాధి పథకంలో భాగంగా 2024-25 మధ్యకాలంలో చేపట్టిన పనులకు సంబంధించి ప్రతి గ్రామంలో సామాజిక తనిఖీలు పక్కాగా నిర్వహిస్తున్నామని ఎస్ఆర్‌పీ బి.సూర్యనారాయణ అన్నారు. అప్పాపురం పంచాయతీలో స్థానిక సర్పంచ్ జె.నాగరత్నం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రూ.57.81 కోట్లతో చేపట్టిన వివిధ రకాల పనులకు జరిగిందన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై భూ పరిశీలన

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన పి.జగదీశ్వరరావు తన భూమిని కొంతమంది ఆక్రమించి కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారని ఇటీవల లోకయుక్తలో ఫిర్యాదు చేశారు. దీనిపై కర్నూలు నుంచి వచ్చిన లోకాయుక్త అధికారి శ్రీనివాసు సమక్షంలో ఆ భూమిని పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ సరిత జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు.

ముగిసిన హరికథా మహోత్సవం

శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళా మందిరంలో సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో దివంగత డా.పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం నిర్వహించిన నవరాత్రి హరికథా మహోత్సవాలు సోమవారం ముగిశాయి. తిరుపతికి చెందిన ప్రసిద్ధ హరికథా భాగవతారిణి మద్దిపట్ల ఉషారాణి శ్రీకృష్ణరాయబారంపై హరికథాగానం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆమెను సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకర శర్మ, మండవిల్లి రవి, కేసీరెడ్డి రాజేశ్వరి, వరలక్ష్మి సత్కరించారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

(c) eenadu

వైభవోపేతం.. తిరుప్పరకుండ్రం ఆలయ కుంభాభిషేకం

▸ రాజగోపుర కలశాలను పుణ్య జలాలతో అభిషేకిస్తున్న దృశ్యం ▸ పాల్గొన్న భక్తజనం

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై జిల్లా తిరుప్పరకుండ్రం మురుగన్ ఆలయ కుంభాభిషేకం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో రూ.2.36 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. పనులు ముగియడంతో 14 ఏళ్ల తర్వాత సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వెలుపల వళ్లి దేవస్థాన కల్యాణ మండపం, షష్టి మండపాల్లో 75 యాగశాలలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వేడుకలో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి మీనాక్షి అమ్మన్ ఆలయం నుంచి మీనాక్షి, సుందరేశ్వరర్ పరివార దేవతలతో బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున తిరుప్పరకుండ్రం చేరుకున్న మీనాక్షి, సుందరేశ్వరర్‌కి తిరుప్పరకుండ్రం 16 స్తంభాల మండపంలో స్వాగతం పలికే కార్యక్రమం జరిగింది. అనంతరం రాజగోపురం పైనున్న ఏడు కలశాలకు, అమ్మవారి సన్నిధిలో ఒక కలశం, గణపతి ఆలయంలో ఒక కలశం తదితర తొమ్మిది కలశాలను పవిత్ర జలాలతో అభిషేకించారు. ఉత్సవాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులపై పవిత్ర జలాలను డ్రోన్‌ల సాయంతో చల్లారు. మంత్రులు శేఖర్‌బాబు, మూర్తి, ఎమ్మెల్యే రాజన్ చెల్లప్ప, జిల్లా కలెక్టరు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా
మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ

జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ

జస్టిస్ కేఆర్ శ్రీరామ్

ప్యారిస్, న్యూస్‌టుడే: మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ రాజస్థాన్ హైకోర్టుకి బదిలీ అయ్యారు. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఈయన గతేడాది ఫిబ్రవరిలో రాజస్థాన్ హైకోర్టుకు సీజేగా బదిలీపై వెళ్లారు.

ఆన్‌లైన్ జూదంపై నిషేధం వ్యవహారం
హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో స్టే పొందాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ జూదంపై నిషేధం విషయంలో హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో స్టే పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మదురై జిల్లాకు చెందిన చిన్నసామి అనే వ్యక్తి ఆన్‌లైన్ జూదంలో నగదు కోల్పోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం తెచ్చిన ఆన్‌లైన్ జూద నిషేధ చట్టం చెల్లదని మద్రాసు హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాతే గత 20 నెలల్లో 31 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో స్టే పొందేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ● ఇదిలా ఉండగా పీఎంకే శ్రేణులకు అన్బుమణి రాసిన లేఖలో.. వన్నియర్లకు అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించి 1200 రోజులైందని, అయితే ఇంతవరకు డీఎంకే ప్రభుత్వం దీన్ని అమలు చేయలేదని తెలిపారు. డీఎంకే ప్రభుత్వ సామాజిక అన్యాయాన్ని బహిర్గతం చేయటం ద్వారా, రామదాస్ మార్గదర్శకంలో గతంలో చేసినట్లు ఆందోళనలు చేయడం ద్వారా వన్నియర్లకు రిజర్వేషన్ సాధించొచ్చని పేర్కొన్నారు. ఆ ప్రకారం వన్నియర్ సంఘం ప్రారంభమైన జులై 20న విళుపురంలో అతిపెద్ద ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఇందులో పీఎంకే అన్ని విభాగాల నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్టాలిన్ సర్కార్‌పై వ్యతిరేకతాస్త్రం

- బాధితులను ఏకం చేసేందుకు యత్నం
- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న విజయ్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓట్లుగా మార్చుకోవాలని భావిస్తున్న డీఎంకేను గట్టి దెబ్బ కొట్టేందుకు టీవీకే అధ్యక్షుడు విజయ్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ చర్యలతో నష్టపోయిన, ఇబ్బంది పడుతున్న ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వంపై ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకతను బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యతిరేకతను వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మలచుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఇటీవలి పరిణామాలు ఈ విషయానికి అద్దం పడుతున్నాయి.

- న్యూస్‌టుడే, చెన్నై

సీఎం చర్యలకు అడ్డుకట్ట

డీఎంకే హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని బాహాటంగా ప్రకటిస్తున్న స్టాలిన్ చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు విజయ్ ప్రయత్నిస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు, పలుచోట్ల ఉన్న కనీస వసతుల కొరత, సమస్యలు వంటివాటిని గుర్తించి అక్కడి ప్రజలను ఏకం చేయాలని, సమస్యల పరిష్కారానికి వారితో కలిసి ఆందోళనలు చేయాలని ఇప్పటికే పార్టీ శ్రేణులకు సూచించారు. దీని ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేక భావనతో ఉన్న ప్రజలను తనవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో ప్రజలకు కనీస వసతులను కల్పించలేదని, ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదనే సంకేతాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజా సమస్యలపై ఆందోళనలు ఉద్ధృతం చేయడం ద్వారా డీఎంకే ప్రభుత్వ అభివృద్ధి ప్రచారాన్ని సమర్థవంతంగా అడ్డుకోవచ్చనీ భావిస్తున్నారు.

బాధితులకు అండగా..

డీఎంకే ప్రభుత్వ హయాంలో నష్టపోయిన ప్రజలకు విజయ్ సంఘీభావం ప్రకటిస్తున్నారు. ఇప్పటికే పరందూర్ విమానాశ్రయం వ్యవహారంలో నిరసనకారులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు. నిరసనకారులకు మద్దతుగా ముఖ్యమంత్రికి లేఖ రాశారు. లాకప్ డెత్‌కు గురైన అజిత్‌కుమార్ వ్యవహారంలోనూ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అన్నాడీఎంకే హయాంలో సాత్తాన్‌కుళం ఘటనను నాటి ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే ఉద్ధృతం చేసినట్లే ప్రస్తుతం అజిత్‌కుమార్ లాకప్ డెత్ ఘటనను ఉద్ధృతం చేయాలని భావిస్తున్నారు. డీఎంకే హయాంలో జరిగిన లాకప్‌డెత్ మరణాలన్నిటినీ ఆదివారం జరిగిన భారీ ఆందోళనలో విజయ్ ప్రస్తావించారు. డీఎంకే హయాంలో పోలీసుశాఖ చర్యలతో 24 మంది మరణించారనే విషయాన్ని వెల్లడించి లాకప్ మరణాల తీవ్రతను పెంచే ప్రయత్నం చేశారు. దీని ద్వారా డీఎంకే ప్రభుత్వ హయాంలో లోపాలను ఎండగట్టే ప్రయత్నం చేయడం పాటు బాధితులకు అండగా ఉన్నాననే సంకేతాలూ పంపారు.

డీఎంకే మిత్రపక్షాలతో మంతనాలు

వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి డీఎంకే కూటమిలోని పార్టీలనూ తన వైపు ఆకర్షించడానికి విజయ్ ప్రయత్నిస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అధికారంలో భాగస్వామ్యం వ్యవహారంలో కూటమి అధిష్ఠానంపై ఆ పార్టీల్లో నెలకొన్న అసంతృప్తి, వ్యతిరేకతను ఆయన వాడుకోవడానికి చూస్తున్నట్లు సమాచారం. దీని కోసం పార్టీ ఎన్నికల ప్రచార విభాగం ప్రధానకార్యదర్శి ఆదవ్ అర్జునాను ఆయన రంగంలోకి దించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. డీఎంకేపై అసంతృప్తిలో ఉన్న పార్టీల నేతలతో మంతనాలకు రంగం సిద్ధమైందని, అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని, ఎక్కువ సీట్లు ఇస్తామనే అంశాలతో మంతనాలకు తెర లేపనున్నారని ప్రచారం జరుగుతోంది.

ప్రచారంతో మరింత దూకుడు

రాష్ట్రవ్యాప్త ప్రచారం ద్వారా మరింత దూకుడు పెంచాలని విజయ్ ప్రణాళిక రూపొందిస్తున్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టనున్న నేపథ్యంలో తాను పర్యటించే ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను అస్త్రాలుగా మలచుకోవాలని డీఎంకే ప్రభుత్వంపై ఎక్కుపెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లోని సమస్యల జాబితా, బాధితుల జాబితాను టీవీకే శ్రేణులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యాయి.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు జనరల్ కేటగిరీ కౌన్సెలింగ్ ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకుగాను కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. తమిళనాడులో అన్నా వర్సిటీ పరిధిలోని 417 ఇంజినీరింగ్ కళాశాలల్లో 90,160 ప్రభుత్వ కోటా సీట్లు ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్‌ను సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఆన్‌లైన్‌లో జరుపుతోంది. ఆ ప్రకారం ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు 3.02 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 7న కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జనరల్ కేటగిరీ అభ్యర్థులకు సోమవారం నుంచి ప్రారంభమైంది. 26వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో 39,145 మంది పాల్గొననున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలను జులై 16వ తేదీలోగా ఎంపిక చేసుకోవాలి. ఇందుకు సంబంధించిన అదనపు వివరాలకు https:///www.tneaonline.org వెబ్‌సైట్‌ను చూడాలని అధికారులు తెలిపారు.

డీఎంకే పదవి నుంచి ఎంపీ కల్యాణసుందరం తొలగింపు

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే పదవి నుంచి ఎంపీ కల్యాణసుందరాన్ని పార్టీ అధిష్ఠానం తొలగించింది. డీఎంకే తంజావూర్ ఉత్తర జిల్లా కార్యదర్శిగా ఉన్న ఎంపీ కల్యాణసుందరాన్ని ఆ పదవి నుంచి తొలగించి ఆయన స్థానంలో ఎమ్మెల్యే సాకోట్టై అన్బళగన్‌ను నియమిస్తున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమాచార సంబంధాలశాఖ అధికారుల నియామకం

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర సమాచార సంబంధాలశాఖ అధికారులుగా నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని కీలక సమాచారం, పథకాలను సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలకు సకాలంలో చేరవేసేందుకు, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు రాష్ట్ర విద్యున్మండలి ఛైర్మన్ డాక్టర్ జె. రాధాకృష్ణన్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ అదనపు ప్రధానకార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేడీ, హోం, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అదనపు ప్రధానకార్యదర్శి ధీరజ్‌కుమార్, రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ అదనపు ప్రధానకార్యదర్శి అముదను ప్రభుత్వం నియమించింది. వారికి కొన్ని శాఖలూ కేటాయించింది.

అజిత్‌కుమార్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ కుటుంబానికి మంత్రి పెరియకరుప్పన్ రూ.7.50 లక్షల ఆర్థికసాయం అందజేశారు. నగల చోరీ కేసులో పోలీసుల దర్యాప్తు సమయంలో మృతిచెందిన శివగంగై జిల్లా తిరుభువనం ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ కుటుంబానికి ముఖ్యమంత్రి సూచనల మేరకు సోమవారం మంత్రి పెరియకరుప్పన్ రూ.7.50 లక్షల ఆర్థికసాయం చెక్కుని అందజేశారు. వెంట జిల్లా కలెక్టరు పొర్కొడి, ఎమ్మెల్యే తమిళరసి రవికుమార్ తదితరులు ఉన్నారు.

అజిత్‌కుమార్ తల్లికి చెక్కు అందజేస్తున్న మంత్రి పెరియకరుప్పన్

ప్రేమలత తొలి విడత
పర్యటన ఆగస్టు 8న

చెన్నై, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలత ఆగస్టు 8న తొలివిడత పర్యటన చేపట్టనున్నారు. తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి శాసనసభ నియోజకవర్గం నుంచి తన పర్యటనను ప్రారంభించనున్న ఆమె నామక్కల్, కరూర్, కడలూర్ తదితర జిల్లాల్లో పర్యటించి విళుపురంలో పూర్తి చేయనున్నారు.

పలు జిల్లాలకు భారీవర్ష సూచన

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పలు జిల్లాల్లో మంగళవారం నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. పశ్చిమ గాలుల వేగంలో మార్పు కారణంగా మంగళవారం రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదేవిధంగా ఒకటి రెండుచోట్ల గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, నీలగిరి జిల్లాలో ఒకటి రెండుచోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. 16వ తేదీ కోయంబత్తూరు కొండ ప్రాంతాలు, నీలగిరి, విళుపురం, చెంగల్పట్టు జిల్లాల్లో ఒకటి రెండుచోట్ల భారీవర్షాలు, 17న నీలగిరి జిల్లాలో ఒకటి రెండుచోట్ల భారీ నుంచి అతిభారీవర్షాలు, కోయంబత్తూరు జిల్లాలోని కొండ ప్రాంతాలు, తేని, దిండుక్కల్, తిరువళ్లూర్, రాణిపేట, కాంచీపురం జిల్లాల్లో భారీ వర్షానికి అవకాశం ఉందని వివరించింది. 18న నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీవర్షాలు, తేని, తెన్‌కాశి, తిరువళ్లూరు, కాంచీపురం, తిరువణ్ణామలై, విళుపురం, కళ్లకురిచ్చి, కడలూరు, పుదుచ్చేరిలో భారీవర్షం, 20న నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీవర్షం, తేని, తెన్‌కాశి జిల్లాల్లో భారీవర్షానికి అవకాశం ఉందని తెలిపింది. చెన్నైలో మంగళవారం ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల తేలికపాటి వర్షానికి అవకాశం ఉందని, 18వ తేదీ వరకు దక్షిణ తమిళనాడు సముద్రతీర ప్రాంతాలు, గల్ఫ్ ఆఫ్ మన్నార్, కన్నియాకుమరి సముద్ర ప్రాంతాల్లో గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో మధ్యలో 65 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, కావున జాలర్లు ఆ ప్రాంతాలకు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

ఉంగళుడన్ స్టాలిన్ విప్లవాత్మక పథకం: ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: ఓ విప్లవాత్మక పథకం మంగళవారం ప్రారంభమవుతుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... 'ప్రభుత్వ కార్యాలయాలకు మీరు వెళ్లొద్దు. మీ ఇళ్ల వద్దకే దరఖాస్తులను తీసుకొచ్చి అందించి - వాటిని పొంది పరిష్కారించడమే 'ఉంగళుడన్ స్టాలిన్' పథకం. పదివేల శిబిరాలు జరగనున్నాయి' అని తెలిపారు.

ఈ పుస్తకం కాషాయ కపటధారులను ఖండించే ఖడ్గం

చెన్నై: కాషాయ కపటధారులను ఖండించే ఖడ్గం, డాలుగా 'వళ్లువర్ మరై - వైరముత్తు ఉరై' పుస్తకం ఉంటుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు.

పుస్తకాన్ని స్టాలిన్ ఆవిష్కరించగా పి.చిదంబరం స్వీకరిస్తున్న దృశ్యం

ప్రముఖ సినీ గేయరచయిత, కవి వైరముత్తు 'వళ్లువర్ మరై - వైరముత్తు ఉరై' పేరిట తిరుకురళ్‌కు రాసిన వ్యాఖ్యానం పుస్తకావిష్కరణ కార్యక్రమం తేనాంపేటలోని కామరాజర్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగింది. పుస్తకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించగా దానిని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం స్వీకరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి ఇరైయన్బు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, తమిళ భాషావేత్తలు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీలో... హిమాలయాలకు శాలువా కప్పే ప్రయత్నం, తిరుకురళ్‌కు వ్యాఖ్యానం రాయడం ఒకటేనని కరుణానిధి చెప్పారని గుర్తు చేసుకున్నారు. అయినా ఈ ప్రయత్నాలను మానుకోలేదని, ఆ వరుసలో వైరముత్తు కూడా చేరారని తెలిపారు. సామాజిక న్యాయ కవి తిరువళ్లువర్‌ను అపహరించడానికి ప్రయత్నించే కాషాయ కపటధారులను ఖండించే ఖడ్గం, డాలుగా 'వళ్లువర్ మరై - వైరముత్తు ఉరై' ఉంటుందని వెల్లడించారు.

చెన్నై ట్రిప్లికేన్‌లోని లేడీ విల్లింగ్టన్ పాఠశాల తరగతి గదిలో విద్యార్థులను సోమవారం 'యూ' ఆకారంలో కూర్చోబెట్టిన దృశ్యం

ఉద్యోగాలను శాశ్వతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చెన్నైలోని డీపీఐ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తాత్కాలిక ఉపాధ్యాయులను అరెస్టు చేస్తున్న పోలీసులు

తిరుచ్చి పట్టణం వరగనేరిలో కార్పొరేషన్ తరఫున రూ.26.60 లక్షల వ్యయంతో నిర్మించిన ఫ్రాన్సిస్ గ్రంథాలయాన్ని సోమవారం ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్. చిత్రంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేశ్ ఉన్నారు.

- ప్యారిస్, న్యూస్‌టుడే

▸ కొత్త ట్రాక్ నిర్మిస్తున్న సిబ్బంది, కార్మికులు ▸ విద్యుత్తు లైన్‌కు మరమ్మతులు చేస్తూ...

తిరువళ్లూరు మార్గంలో
రైళ్ల సేవలు పునరుద్ధరణ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయం నుంచి ఆదివారం తెల్లవారు జామున వాలాజా రోడ్ సైడింగ్‌కు ముడిచమురు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు తిరువళ్లూరు సమీప పెరియకుప్పంలో అగ్ని ప్రమాదానికి గురైంది. మొత్తం 52 వ్యాగన్లు ఉండగా 18 వ్యాగన్లు పట్టాలు తప్పాయి. దీంతో పట్టాలు, చక్రాల మధ్య ఏర్పడిన రాపిడితో నిప్పురవ్వలు చెలరేగి వ్యాగన్లకు మంటలంటుకున్నాయి. దీంతో తిరువళ్లూరు-చెన్నై, తిరువళ్లూరు-అరక్కోణం మధ్య రైళ్ల రాకపోకలను అధికారులు రద్దు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు 10 గంటలపాటు శ్రమించి మంటలు అదుపు చేశారు. ఘటనలో 4 పట్టాలు 500 మీటర్ల మేర కరిగిపోయాయి. 300 మందికి పైగా సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి వాటిని సరిచేశారు. సోమవారం 500 మీటర్ల దూరానికి కొత్త ట్రాక్ నిర్మించారు. ఒక లైన్‌లో సబర్బన్ రైళ్ల సేవలను పునరుద్ధరించారు. ఒకటి రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయోగాత్మకంగా తక్కువ వేగంతో నడిపారు. మంగళవారం రాత్రికల్లా పూర్తిస్థాయిలో రైళ్లు నడపనున్నట్లు రైల్వేశాఖాధికారులు తెలిపారు. లోకోపైలట్ మద్యం తాగి రైలు నడిపాడా? అని కనిపెట్టేందుకు రక్తం, మూత్ర పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

బాధితులకు పరిహారం అందజేయాలి

రెడ్‌హిల్స్: ప్రమాదం జరిగిన ప్రాంతంలో సుమారు 2 వేల మందికి పైగా నివాసం ఉంటున్నారు. వీరిలో అత్యధికులు రైతు కూలీలే. ఆదివారం వేకువజామున అగ్నిప్రమాదం సంభవించడంతో వీరు ఇళ్ల నుంచి పరుగులు తీసి పొరుగు ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో కూలీ పనులకు వెళ్లేందుకు వీలుకాలేదు. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే మాజీ మంత్రి రమణ సోమవారం బాధితులను పరామర్శించారు. పూర్తిగా ఉపాధి కోల్పోయిన కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలన్నారు.

సమైక్యంగా సాగుతున్న అన్నాడీఎంకే కూటమి: ఈపీఎస్

● పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పళనిసామి ● వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న దృశ్యం

సేలం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే కూటమి సమైక్యంగా ముందుకు సాగుతోందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధిస్తుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సేలం జిల్లా నెడుంజాలై నగర్ సమీపంలో కొత్తగా నిర్మించిన పార్టీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే కూటమిలో ఐక్యత లేదని, త్వరలో చీలిక ఏర్పడే అవకాశముందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎంకే కూటమిలోనే అభిప్రాయభేదాలు చోటుచేసుకున్నట్లు తెలిపారు. వారి కూటమిని వారు స్థిరపరుచుకోవాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి హెచ్చుమీరిందన్నారు. ఖనిజ సంపద దోచుకుంటున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే అన్నాడీఎంకే ప్రతినిధులతో పాటు విలేకర్లపై కూడా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎంకే నేతల అవినీతిని వెలికితీసి తగిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆయన స్థానికంగా ఉన్న పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ముందుగా వరసిద్ధి వినాయకుడి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

లాకప్ మరణాలను అడ్డుకోవాలి

సైదాపేట: లాకప్ మరణాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని పళనిసామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... 2024 మార్చిలో శంకరన్‌కోవిల్‌లో పోలీసుల దాడిలో మురుగన్ అనే వ్యక్తి మృతి చెందాడని, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఆదేశించిందని తెలిపారు. అయితే ఇంతవరకు ఆమెకు ఉద్యోగం కల్పించలేదన్నారు. తిరుభువనం అజిత్‌కుమార్ కుటుంబానికి మీరు ఇచ్చిన పని, స్థలం మాకు తగినవి కాదని ఆ కుటుంబం చెబుతోందన్నారు. లాకప్ మృతుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇసుక దోపిడీ హెచ్చుమీరుతోందని, తద్వారా సహజ వనరులు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయని పేర్కొన్నారు. సెయ్యారు సిప్కాట్‌లోని పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించకుండా వేరే రాష్ట్రాల వారికి పని కలిస్తున్నట్లు తెలుస్తోందని, దీన్ని ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. ఇందుకు నిరసనగా 19వ తేదీ అన్నాడీఎంకే తరఫున ఆందోళన చేయనున్నట్లు ప్రకటించారు.

బేషరతుగా అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధం

- సెప్టెంబర్ 4న మదురైలో మహానాడు
- మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్

సమావేశానికి వస్తున్న ఓ పన్నీర్‌సెల్వం

సైదాపేట, న్యూస్‌టుడే: విలీనానికి అవకాశం ఉంటే బేషరతుగా అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధమని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ సమన్వయకర్త పన్నీర్‌సెల్వం తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఒంటరిగా పోటీ చేయగా ఎన్డీయే కూటమిలో ఓపీఎస్, టీటీవీ దినకరన్‌లు చేరారు. ఇదిలా ఉండగా వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు భాజపా, అన్నాడీఎంకే కూటమిగా పోటీ చేస్తున్నాయి. అలాగే తమిళనాడులో ఎన్డీయే కూటమికి అన్నాడీఎంకే నేతృత్వం వహిస్తుందని అమిత్‌షా ప్రకటించారు. విజయం సాధిస్తే కూటమి ప్రభుత్వమని కూడా ఇటీవల తెలిపారు. మరోపక్క అన్నాడీఎంకే సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఈపీఎస్ చెబుతూ వస్తున్నారు. ఇదిలా ఉండగా పన్నీర్‌సెల్వం తన తదుపరి చర్యలు, రానున్న అసెంబ్లీ ఎన్నికల గురించి తన మద్దతుదారులతో సోమవారం ఆలోచనలు జరిపారు. చెన్నై కీళ్‌పాక్కంలో జరిగిన ఈ సమావేశానికి బన్రుట్టి రామచంద్రన్ నేతృత్వం వహించారు. ఇందులో ఎడప్పాడిని విమర్శించొద్దని మద్దతుదారులకు ఓపీఎస్ సూచించినట్లు సమాచారం. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే కార్యకర్తలంతా ఏకమవ్వాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. విలీనానికి ఈపీఎస్ ఒప్పుకుంటే ఎలాంటి షరతులు లేకుండా చేరేందుకు సిద్ధమని పేర్కొన్నారు. తనకు ఎలాంటి పదవి అవసరం లేదన్నారు. అయితే తనతో ఉండేవారికి వారి అర్హత మేరకు పదవులు ఇప్పించడం తన బాధ్యత అని చెప్పారు. మదురైలో 4వ తేదీ తన నేతృత్వంలో మహానాడు జరగనున్నట్లు తెలిపారు. ఇది చరిత్రలో నిలిచిపోయే సమావేశం అవుతుందన్నారు. దీనికి శశికళ, టీటీవీ దినకరన్‌లను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. విజయ్ రాజకీయ కదలికలు ఇప్పటివరకు బాగున్నాయని, రానున్న రోజుల్లో ఆయన రాజకీయ నిర్ణయాలు ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నాయో? లేదో? చూసి ఆయనకు తమ నైతిక మద్దతు ప్రకటిస్తామని చెప్పారు.

(c) eenadu

మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమాకు డాక్టర్ ఆఫ్ లెటర్స్ డిగ్రీ అందిస్తున్న పాల్ దినకరన్

కారుణ్యలో ఘనంగా స్నాతకోత్సవం

వడపళని, న్యూస్‌టుడే: కారుణ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కేఐటీఎస్)లో శనివారం 31వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంకేతికతపరంగా అభివృద్ధిని సాధిస్తూ విద్యారంగంలో కారుణ్య అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. సాంకేతిక ఆవిష్కరణలో వర్సిటీ చేస్తున్న కృషి గురించి కులపతి డాక్టర్ పాల్ దినకరన్ వివరించారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా మిజోరం ముఖ్యమంత్రిని ‘డాక్టర్ ఆఫ్ లెటర్స్’ డిగ్రీతో కులపతి పాల్‌దినకరన్ సత్కరించారు.

వృద్ధుడు జారవిడుచుకున్న బంగారు గాజును అప్పగించిన పోలీసులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై అరుంబాక్కంకి చెందిన కేశవన్ ఈనెల 10వ తేదీ తన ఇంట్లోని రెండు బంగారు గాజులను తీసుకెళ్లాడు. అందులో ఒక దానిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టాడు. తద్వారా వచ్చిన నగదుని పక్కనే ఉన్న బ్యాంకులో చెల్లించి తిరిగి ఇంటికి వెళ్లి చూడగా తన వద్ద ఉన్న మరో బంగారు గాజు కనిపించలేదు. కేశవన్ ఫిర్యాదు మేరకు అరుంబాక్కం క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేశారు. రోడ్డుపై జారవిడుచుకున్నట్లు గుర్తించారు. గాజుని తీసిన వ్యక్తి వివరాలు సేకరించి అతని నుంచి గాజుని స్వాధీనం చేసుకొని కేశవన్‌కి అప్పగించినట్లు పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

‘మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం’

ఆందోళనలో జయకుమార్ తదితరులు

తిరుత్తణి, న్యూస్‌టుడే: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ ఆరోపించారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో మాజీ ఎంపీ హరి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. గత అన్నాడీఎంకే హయాంలో తిరుత్తణిలో ప్రవేశపెట్టిన ఉమ్మడి తాగునీటి పథకాన్ని డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్కడి చేనేత కార్మికులకు జౌళి పార్కు, ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ప్రజలను కలవని తిరుత్తణి డీఎంకే ఎమ్మెల్యే చంద్రన్ ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లోకెళ్లి వారితో కలిసి భోజనాలు చేస్తూ మోసం చేస్తున్నారన్నారు. డీఎంకే వారిని ప్రజలు నమ్మబోరన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎడప్పాడి పళనిసామి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఆందోళనలో పార్టీ కార్యకర్తలు భారీగా పాల్గొని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పగిలిన పైపులు.. ఎండిన చెరువులు

- రోడ్డు వెడల్పు పనుల్లో ధ్వంసం
- నిరుపయోగంగా అత్తిక్కడవు-అవినాశి ప్రాజెక్టు

- న్యూస్‌టుడే, విల్లివాక్కం

అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే చెరువులు, కుంటలు తదితర జలవనరులలో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అవినాశి-అత్తిక్కడవు-మేట్టుపాలయం నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో అవినాశి ప్రాజెక్ట్ నీటి పైపులు పగిలిపోవడంతో చెరువుల నీటి ప్రవాహానికి అవాంతరాలు ఏర్పడుతున్నాయి. కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్ జిల్లాల భూగర్భ జల రీఛార్జి ప్రాజెక్ట్‌గా అవినాశి ప్రాజెక్ట్‌ని అమలుచేశారు. తద్వారా గత కొన్ని నెలలుగా పలు ప్రాంతాలలో భూగర్భ జలమట్టం పెరిగింది. ఫలితంగా వ్యవసాయ భూములు పచ్చగా మారాయి.

64 చిన్న చెరువుల నుంచి..

గత కొన్ని నెలలుగా అవినాశి-మేట్టుపాలయం రహదారి వెడల్పు ప్రాజెక్ట్ కోసం భూమిని సేకరించి రోడ్డు వెంబడి ఉన్న చెట్లను తొలగించారు. ఆక్రమణలను కూడా తొలగిసున్నారు. కొన్నిచోట్ల వంతెనలు, కల్వర్టులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ ప్రాజెక్ట్‌లో భాగంగా నంబియంపాలయంలో వంతెనలు నిర్మిస్తున్నారు. నంబియంపాలయం బస్టాప్ వద్ద, అనంతగిరి ముందు అత్తిక్కడవు-అవినాశి ప్రాజెక్ట్ పైపులు పగిలిపోయాయి. సేవూర్ సమీపంలోని అసనల్లిపాలయం ప్రధాన వాల్వ్ నుంచి నంబియంపాలయం, పుదుపాలయం, వాంచిపాలయంలోని 64 చిన్న చెరువుల నుంచి ఈ నీరు ప్రవహిస్తుంది. కానీ వంతెన నిర్మాణానికి పైపులను పగులగొట్టడంతో నీరు నిలిచిపోవడంతో చెరువుల నీటిమట్టం తగ్గడం ప్రారంభించింది.

పగిలిన పైపులు

రైతుల పరిస్థితి ప్రశ్నార్థకం

దీని గురించి అత్తిక్కడవు-అవినాశి ప్రాజెక్ట్ నిరసన కమిటీ నిర్వాహకుడు అనంతగిరి వసంతకుమార్ మాట్లాడుతూ.. మేట్టుపాలయం నాలుగు వరుసల రోడ్డు ప్రాజెక్ట్ పనులలో పలుచోట్ల పైపులు పగులగొట్టారని, నంబియంపాలయం ప్రాంతంలో గత నెల రోజులుగా పైపులను అనసంధానించలేదని పేర్కొన్నారు. అందువల్ల చెరువుకు నీరు తరలించడంలో జాప్యమేర్పడుతుందని తెలిపారు. దీనిపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్న రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. అత్తిక్కడవు-అవినాశి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అధికారులు మాట్లాడుతూ.. రోడ్డు వెడల్పు పనుల సమయంలో అత్తిక్కడవు పైపులకు జరిగిన నష్టాన్ని అంచనా వేశామని చెప్పారు. ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే ముందే హైవేస్ విభాగానికి వివరాలు పంపామని గుర్తుచేశారు. దెబ్బతిన్న పైపులకు హైవేస్ శాఖ మరమ్మతులు జరపాల్సి ఉందన్నారు. తమిళనాడు హైవేస్‌శాఖ తిరుప్పూర్ డివిజినల్ ఇంజినీరు రత్నసామిని సంప్రదించగా.. తిరుప్పూర్ జిల్లా సరిహద్దులో 13 కి.మీ వరకు 15 ప్రాంతాలలో కల్వర్టులు నిర్మిస్తున్నారని, పనుల సమయంలో దెబ్బతిన్న పైపులకు మొత్తం పరిహారం నాలుగు నెలల క్రితమే ప్రాజెక్ట్ విభాగానికి అందజేసినట్టు తెలిపారు.

స్టార్ హోటల్‌లో ఎలుగుబంటి సంచారం

హోటల్ బాల్కనీలో ఎలుగుబంటి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీలోని ఓ స్టార్ హోటల్‌లో ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో వైరలవుతున్నాయి. ఊటీ అటవీ ప్రాంతం నుంచి పట్టణ రోడ్లపైకి వచ్చి సంచరిస్తున్న ఎలుగుబంట్లను చూసి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఓ స్టార్ హోటల్‌లోకి చొరబడిన ఎలుగుబంటి పైఅంతస్తులో దర్జాగా సంచరించింది. దీని ద్వారా ప్రజలకు ప్రమాదం ఉందని, ఈ లోగా అటవీ శాఖవారు దానిని పట్టుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

వెనక్కి వచ్చిన ఇండిగో విమానం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత ఏర్పడటంతో అత్యవసర పరిస్థితుల్లో విమానం వెనుదిరిగింది. సోమవారం ఉదయం 6.00 గంటలకు బే-54 నుంచి విమానం 164 మంది ప్రయాణికులతో హైదరాబాద్ బయలుదేరింది. టేకాఫ్ చేసే సమయంలో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురవడంతో వైద్య సేవలు అవసరమయ్యాయి. పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్‌కు సమాచారం తెలిపి విమానాన్ని వెనక్కి మళ్లించారు. విమానం బే-54 మీదకు 6.15కు వచ్చింది. వైద్యులు ప్రయాణికుడిని పరీక్షించి ప్రయాణం చేయడానికి వీల్లేదన్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ అధికారులు అతని టిక్కెట్టు రద్దు చేసి, లగేజీని కూడా విమానం నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతరం విమానం గంట ఆలస్యంగా 7 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లింది.

తాగునీటి సీసాలో బల్లి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పుళల్ సమీపం కదిర్‌వేడుకు చెందిన బాబు చిరు వ్యాపారి. ఈయన భార్య సంగీత చెన్నై కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్. బాబు తన కుటుంబ సభ్యులతో సింగిలిమేడు గ్రామంలోని ఆలయానికి సోమవారం వెళ్లారు. అక్కడున్న ఓ దుకాణంలో తాగునీటి సీసా కొనుగోలు చేశారు. దాని మూత తీసి తాగడానికి చూడగా అందులో బల్లి కనిపించింది. వెంటనే సమీపంలోని తాగునీటి ప్లాంట్ వద్దకు వెళ్లి తాగునీరు ఉత్పత్తి చేస్తున్న వారితో వాగ్వాదానికి దిగాడు. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో బాబు ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.



సీసాలో చనిపోయి ఉన్న బల్లి

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంబత్తూరు, తిల్లై గంగానగర్, వేళచ్చేరి, సేలైయూరు, తిరుముడివాక్కం, పల్లికరణై, షోలింగనల్లూరు, కోయంబేడు మార్కెట్టు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్తుశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. **రెడ్‌హిల్స్:** పెరియపాళ్యం టీఎన్‌ఈబీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుంది. వెంగల్, ఎర్నాంకుప్పం, పాగల్‌మేడు, కాదర్‌వేడు, సెంబేడు, కోట్టకుప్పం, మేట్టుపాళ్యం తదతర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని అధికారులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్‌ఎల్‌సీలో ముగిసిన పుస్తక ప్రదర్శన

వడపళని, న్యూస్‌టుడే: ఎన్‌ఎల్‌సీలో పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎన్‌ఎల్‌సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి, ఫంక్షనల్ డైరెక్టర్ సురేష్‌చంద్ర సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ.. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్‌ఎల్‌సీ పుస్తక ప్రదర్శన నిర్వహించినందుకు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాల విద్యార్థులను ఉచిత రవాణా ద్వారా ప్రదర్శనకు తీసుకురావడానికి ఎన్‌ఎల్‌సీ ప్రయత్నాలు చేపట్టిందన్నారు. అనంతరం ప్రసన్నకుమార్ మోటుపల్లి మాట్లాడుతూ.. గవర్నరు జిష్ణుదేవ్ వర్మ రాజకీయ నాయకుడే కాదని, సాహిత్యకారుడు, నిష్ణాతుడైన కవి అని, పలు పుస్తకాలు రాసిన ఆయన తమ కార్యక్రమానికి హాజరవడం ఆనందంగా ఉందన్నారు. 2030 నాటికి పునరుత్పాదక శక్తిని ఎనిమిది రెట్లు పెంచాలనే లక్ష్యంగా ఎన్‌ఎల్‌సీ ప్రణాళికలు రచిస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కువ మంది సందర్శించిన పుస్తక ప్రదర్శనలలో నైవేలి ప్రదర్శన రెండో స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా ఈ-సావనీర్ విడుదల చేశారు. గనులు, పీ అండ్ పీ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌చంద్ర సుమన్(అదనపు బాధ్యతలు) మాట్లాడుతూ.. ఈ ఏడాది 1.75 లక్షల మందికి పైగా ప్రదర్శనను తిలకించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానికులకు వివిధ పోటీలు, వినోద కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎల్‌సీ సీనియర్ అధికారులు, గుర్తింపు ఉన్న ట్రేడ్ ధోముసా, అన్నా థో ముసా, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య, ఓబీసీ సంఘం, గ్రాడ్యుయేట్ ఇంజినీర్ల సంఘం తదితర పలు సంఘాలకు చెందిన ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ-సావనీర్ విడుదల చేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో ఎన్‌ఎల్‌సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి, ఇతర ఉన్నతాధికారులు

పంచముఖ ఆంజనేయునికి తిరుమంజనం

అలంకరణలో స్వామివారు

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం తిరువెళ్లైవాయల్‌లోని ప్రసిద్ధ పంచముఖ వీరాంజనేయస్వామి ఆలయంలో ఏటా ఆణి మాసం చివరిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు పది రోజుల క్రితం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన ఘట్టమైన స్వామివారి తిరుమంజనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

19న ఎన్టీఆర్ జయంత్యుత్సవాలు

టీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ దివంగత సినీనటుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంత్యుత్సవాలను నిర్వహించనున్నారు. చెన్నై టీనగర్‌లోని జీఎన్ శెట్టి రోడ్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ‘విశ్వవిఖ్యాతుని మధుర స్మృతులు’ పేరిట ఆ రోజు సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ముఖ్య అతిథిగా సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, ప్రత్యేక అతిథిగా ఆచార్య విస్తాలి శంకరరావు, గౌరవ అతిథిగా జనని సాంఘిక సాంస్కృతిక సమితి ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య పాల్గొననున్నారు.

మీ కుమారుడి కోసం నన్ను ద్రోహి అంటున్నారా?

వైగోను ఉద్దేశించి మల్లై సత్య వ్యాఖ్య

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మీ కుమారుడి కోసం నన్ను ద్రోహి అంటున్నారా? అని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగోను ఉద్దేశించి ఆ పార్టీ డిప్యూటీ కార్యదర్శి మల్లై సత్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో.. ఇప్పటివరకు ఎండీఎంకేలో కొనసాగాలనే తనకు ఆలోచన ఉన్నదని, కానీ, పార్టీలో తలెత్తిన అసాధారణ పరిస్థితికి తాను బాధ్యత వహించనని స్పష్టం చేశారు. ఈ నెల 9వ తేదీ తాను ప్రాణంగా ప్రేమించిన ద్రావిడ రత్నం వైగో ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఎల్‌టీటీఈ నేత వేలుపిళ్లై ప్రభాకరన్‌ను మత్తయ్య మోసం చేసినట్టు మల్లై సత్య తనని మోసం చేశాడని పేర్కొనడం తనను బాధించిందన్నారు. తాను మత్తయ్య లాంటి ద్రోహినా? అని ప్రశ్నించారు. వైగో తన ప్రియ కుమారుడు దురై వైగో రాజకీయ లబ్ధి కోసం 32 ఏళ్లు నిజాయతీగా, విశ్వాసంగా, కుటుంబాన్ని సైతం మరచి పార్టీ శ్రేయస్సు కోసం శ్రమించిన తనని ద్రోహి అని నింద మోపడంతో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు 5 రాత్రులు తాను నిద్రపోలేకపోయానని బాధపడ్డారు. భవిష్యత్తులో ఏ కార్యకర్తనూ ద్రోహి అని సంబోధించడం సరికాదన్నారు. కాలమంతా మీకు, ఎండీఎంకేకు రుణపడి ఉంటానని, మీరు తన రాజకీయ చిరునామా అని, మీలాంటి వ్యక్తి తనకి నాయకుడిగా ఉండడం తన అదృష్టమని తెలిపారు.

ఇటీవల జరిగిన ఓ సమావేశంలో దురై వైగో, మల్లై సత్య మధ్య సయోధ్య కుదిర్చి కరచాలనం చేయిస్తున్న వైగో

పెరియపాళ్యం భవాని అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపం పెరియపాళ్యంలో ప్రసిద్ధ శ్రీ భవాని అమ్మవారి ఆలయం ఉంది. ఇక్కడ ఏటా ఆడి మాసం సందర్భంగా 14 వారాలపాటు శని, ఆదివారాల్లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దీంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ఆ మేరకు ఆడి మాసం ఈనెల 17న ప్రారంభం కానుంది. ఈ క్రమంలో భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్ల గురించి ఉన్నతాధికారుల సమావేశం పెరియపాళ్యం బీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ యువరాజ్ అధ్యక్షత వహించారు. వడమదురై, కూట్టుసాలై, ఆత్తుపాక్కం, రాళ్లపాడిలో తాత్కాలిక బస్టాండ్లు, వంద ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అదే విధంగా పెరియపాళ్యం, ఊత్తుకోట మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించేందుకు పోలీసులను ఆదేశించారు. తాగునీటి తొట్టెలు, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. భక్తులు వర్షం పడితే తడవకుండా 10 ప్రాంతాల్లో భారీ గూడారాల ఏర్పాటుకు నిర్ణయించారు. తహసీల్దారు రాజేష్, బీడీవోలు మణిశేఖర్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస పెరుమాళ్ ఆలయానికి వెళ్తున్న భక్తులు

కనులపండువగా కుంభాభిషేకం

ప్యారిస్, న్యూస్‌టుడే: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సమీపంలోని తిరువణ్ణామలై శిఖరంపై ఉన్న శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలో 36 ఏళ్ల తర్వాత సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయాన్ని దక్షిణ తిరుపతిగా పిలుస్తారు. ఈ క్షేత్రంలో 2023 డిసెంబరులో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. పనులు ముగియడంతో ఈనెల 12న యాగశాల పూజలతో కుంభాభిషేక వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజామున ఆలయ గోపుర కలశాలను పుణ్య జలాలతో అభిషేకించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **కాంచీపురం:** కాంచీపురం సమీపం గోవిందవాడి అగరం గ్రామంలోని పురాతన అఖిలాండేశ్వరి సమేత కైలాసనాథర్ దక్షిణామూర్తి ఆలయం ఉంది. ఈ క్షేత్రంలో చేపట్టిన పునరుద్ధరణ పనులు ముగియడంతో సోమవారం మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల పూజలు జరిపారు. సోమవారం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పుణ్య జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ గోపుర కలశాలపై అభిషేకించారు. వేడుకలో ఎంపీ జి.సెల్వం, ఎమ్మెల్యేలు కె.సుందర్, ఎళిలరసన్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కాంచీపురం: కైలాసనాథర్ ఆలయంలో..

ప్యారిస్: కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నేడు మరైమలై అడిగళార్ జయంత్యుత్సవం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్ర తమిళాభివృద్ధి శాఖ తరపున మరైమలై అడిగళార్ 149వ జయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమిళ ఉద్యమ నేత మరైమలై అడిగళార్ 149వ జయంతిని పురస్కరించుకొని చెంగల్పట్టు జిల్లా పల్లావరంలో ఆయన నివసించిన గృహంలో విగ్రహానికి మంగళవారం ఉదయ 10 గంటలకు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యకమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, తాంబరం మేయర్, పలువురు అధికారులు పాల్గొని అంజలి ఘటిస్తారని వెల్లడించారు.

21 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు కౌన్సెలింగ్

వడపళని, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్‌ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్ అనంతరం మొదటి బ్యాచ్ తరగతులు సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమవుతాయి. నీట్-యూజీలో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను కమిటీ శనివారం విడుదల చేసింది. అభ్యర్థులకు సెంట్రల్ వర్సిటీ, డీమ్డ్ వర్సిటీలు, అఖిల భారత కోటాలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య కళాశాలల్లో 15శాతం సీట్లను కేటాయించనుంది. అభ్యర్థులు తమ అభీష్టం మేరకు కళాశాలలను ఎంపిక చేసుకుని జులై 22 నుంచి 28వ తేదీ రాత్రి 11.55 గంటలలోగా లాక్ చేసుకోవాల్సి ఉంటుంది. జులై 29 నుంచి కమిటీ సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించి ఫలితాలను 31వ తేదీన ప్రకటిస్తుంది. అభ్యర్థులు వారికి కేటాయించిన కళాశాలల్లో ఆగస్టు 1 నుంచి 6వ తేదీలోగా చేరేందుకు కావలసిన ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. రెండో విడత ఆగస్టులో 12 ప్రాంతాల్లో జరుగుతుందని, కేటాయించిన కళాశాలల్లో ఆగస్టు 29లోగా చేరాల్సి ఉంటుందని కమిటీ పేర్కొంది. మూడో విడత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ సెప్టెంబరు 3న ప్రారంభమవుతుంది. సెప్టెంబరు 18వ తేదీలోగా కళాశాలల్లో చేరాలి. ఇంకా ఖాళీలుంటే సెప్టెంబరు 22న కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. అక్టోబరుకల్లా కళాశాలల్లో చేరాలి. రాష్ట్ర కోటా కింద ప్రభుత్వ, స్వయం ప్రతిపత్తి, ప్రయివేటు వర్సిటీల్లో మొదటి విడత కౌన్సెలింగ్ అయిన వారికి ప్రవేశాలకు జులై 30 తాత్కాలిక తేదీ (టెన్‌టేటివ్)గా రాష్ట్ర సెలక్షన్ కమిటీ పేర్కొంది. ఆగస్టు 12లోగా అభ్యర్థులు కళాశాలల్లో చేరాలి. రెండో విడత రాష్ట్ర కౌన్సెలింగ్ ఆగస్టు 19న ప్రారంభమవుతుంది. సెప్టెంబరు 4వ తేదీలోగా చేరాలి. మూడో విడత సెప్టెంబరు 9న ప్రారంభమవుతుంది. యూజీ కోర్సులకు 2024లో 43,063 దరఖాస్తులందగా ఈసారి రాష్ట్ర సెలక్షన్ కమిటీకి 72,743 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 5,050 సీట్లుండగా రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో కలిపి 11,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. స్వయం ప్రతిపత్తి కళాశాలలు 22, ప్రయివేటు వర్సిటీలు నాలుగు, 13 డీమ్డ్ వర్సిటీలు ఉన్నాయి.

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER
నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, ప్రాజెక్ట్స్, టి.ఎం.ఆర్. గొర్రెలు, మేకలు, నాటుకోళ్ళు, పందులు, ఫామ్స్, కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ. నేషనల్, హార్టికల్చర్, ప్రాజెక్ట్స్, కోల్డ్‌స్టోరేజ్ కన్‌స్ట్రక్షన్స్ సబ్సిడీ సంప్ర॥ 98491 61889.

హైకోర్టులో హాజరైన నయినార్ నాగేంద్రన్

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎన్నికల కేసులో క్రాస్ ఎగ్జామినేషన్‌కి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ మద్రాసు హైకోర్టులో హాజరయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరునెల్వేలి నియోజకవర్గంలో రాబర్ట్ బ్రూస్ గెలుపు చెల్లదని ప్రకటించాలని కోరుతూ ఆ నియోజకవర్గంలో పోటీ చేసిన నయినార్ నాగేంద్రన్ మద్రాసు హైకోర్టులో కేసు వేశారు. అదే విధంగా రాబర్ట్ బ్రూస్‌కి సంబంధించిన కేసు వివరాలు, ఆస్తి వివరాలను దాచినట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు రెండుసార్లు విచారణకు వచ్చినప్పుడు నాగేంద్రన్ కోర్టులో హాజరయ్యారు. అప్పుడు ఆయన వద్ద రాబర్ట్ బ్రూస్ ఆస్తి, కేసుకి సంబంధించిన ఆరోపణల గురించి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో సోమవారం మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ జరగడంతో నాగేంద్రన్ హైకోర్టులో హాజరయ్యారు.

ఇళయరాజా పాట కాపీరైట్ కేసు

నటి వనితా విజయకుమార్ జవాబివ్వాలి: మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: సంగీత దర్శకుడు ఇళయరాజా దాఖలు చేసిన కేసులో నటి వనితా విజయకుమార్ జవాబివ్వాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. సంగీత దర్శకుడు ఇళయరాజా దాఖలు చేసిన పిటిషన్‌లో... వనితా విజయకుమార్, డ్యాన్స్ మాస్టర్ రాబర్ట్ తదితరులు నటించిన ‘మిస్ అండ్ మిస్టర్’ సినిమాలో తాను సంగీతం అందించిన ‘మైఖెల్ మదన కామరాజన్’ సినిమాలోని ‘శివరాత్రి’ పాటను అనుమతి లేకుండా ఉపయోగించారని, ఇది కాపీరైట్ ఉల్లంఘన అని తెలిపారు. ఈ కేసు జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి ముందు సోమవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఇళయరాజా తరపున.. ‘మిస్ అండ్ మిస్టర్’ సినిమాలో తన అనుమతి లేకుండా తన పాటను వాడటంతో పాటు సినిమా ప్రమోషన్స్‌లో తన పేరుని కూడా అనుమతి లేకుండా ఉపయోగించారన్నారు. కాబట్టి అందుకు నిషేధం విధించాలని వాదించారు. వనితా విజయకుమార్ తరపున.. సంబంధిత పాటను ‘ఎకో’ సంస్థ అనుమతితో ఉపయోగించామని, పిటిషనరుకి, ఎకో సంస్థకి మధ్య కాపీరైట్‌కి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఇరు తరపు వాదనలు విన్న న్యాయమూర్తి.. నటి వనితా విజయకుమార్ వారం రోజుల్లోగా జవాబివ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు.

అరెస్ట్ వారెంట్ కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?

నివేదిక దాఖలు చేయాలని డీజీపీకి హైకోర్టు ఆదేశాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అరెస్ట్ వారెంట్ జారీ అయిన కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే విషయమై డీజీపీ, చెన్నై పోలీసు కమిషనరు నివేదిక దాఖలు చేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నై అల్లికుళం కోర్టులో విచారణలో ఉన్న ఓ కేసులో నిందితుడైన రాజరాజచోళన్‌పై జారీ అయిన అరెస్ట్ వారెంట్‌ని అమలుచేయాలని జమున శివలింగం అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ వేల్‌మురుగన్... ఈ కేసులో గత జనవరిలో జారీచేసిన అరెస్ట్ వారెంట్‌ని పోలీసులు ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. అదేవిధంగా పలు కేసులు అరెస్ట్ వారెంట్ జారీ చేసే దశలో ఉన్నాయన్నారు. మేజిస్ట్రేట్, జిల్లా కోర్టులు జారీచేసే అరెస్ట్ వారెంట్ల ప్రాతిపదికన సకాలంలో నిందితులను పట్టుకొని సంబంధిత కోర్టులలో హాజరుపరచాలని తెలిపారు. లేదంటే వారెంట్‌ని అమలుచేయకపోవడం గురించి సంబంధిత కోర్టులలో నివేదిక దాఖలు చేసి, కొత్తగా వారెంట్ జారీచేసేలా కోరాలని సూచించారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టకుండా వారెంట్‌లను పెండింగ్‌లో ఉంచుకొనేందుకు పోలీసులకి అధికారం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ వారెంట్ జారీ అయిన కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే విషయమై రాష్ట్ర డీజీపీ, చెన్నై పోలీసు కమిషనరు 23వ తేదీ నివేదిక దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసి విచారణను 24వ తేదీకి వాయిదా వేశారు.

ఆగస్టులో అంతర్జాతీయ సాహితీ సదస్సు

సమాచార పత్రాన్ని చూపిస్తున్న విస్తాలి శంకరరావు తదితరులు

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆగస్టు 28, 29 తేదీలలో ‘భువనచంద్ర సాహితీ సాగరం - సృజనాత్మక హరివిల్లు’ అనే అంశంపై అంతర్జాతీయ సాహితీ సదస్సు నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన సమాచార పత్ర ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం చెన్నై మెరీనా తీరంలో జరిగింది. మద్రాసు వర్సిటీ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఎల్బీ శంకరరావు, ఆచార్యులు లింగమనేని సుజాత, డా.తిరుమల ఆముక్తమాల్యద, డా.ఎలిజబెత్ జయకుమారి, జనని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

17న ఆడి మాసం ప్రారంభం

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళ మాసాల్లో అతి పవిత్రమైన ఆడి మాసం(ఆషాఢం) ఈనెల 17వ తేదీ ప్రారంభం కానుంది. ఈ నెలలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. పూర్వీకులకు అమావాస్య రోజున తర్పణాలు వదులుతుంటారు. ప్రజలు అమ్మవారి ఆలయాల్లో నెల రోజులపాటు నిత్యం పూజలు నిర్వహించి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. విరాళాలు పోగు చేసి రాత్రి వేళల్లో అమ్మవారి ఊరేగింపులు వైభవంగా జరుపుతారు. అంతేకాకుండా ఆడి మాసం ప్రారంభం రోజునే సూర్యుడి దక్షిణాయనం ప్రారంభమవుతుంది ఆడి మాసం ఆగస్టు 16 వరకు ఉంటుంది. ఈ నెలలో అన్ని రోజులు మంచి రోజులే. శుక్ర, మంగళవారాలు అమ్మవారి ఆలయాలకు మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అమ్మవారి ఆలయాలు ఆడి మాస ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి.

తమిళం చిత్రానికి సంగీతం సమకూరుస్తున్న వేడన్

చెన్నై, న్యూస్‌టుడే: విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న కొత్త చిత్రంలో భరత్, ఆరి అర్జునన్, అమ్ము అభిరామి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ద్వారా మలయాళ ర్యాప్ గాయకుడు వేడన్ తమిళంలో సంగీత దర్శకుడిగా పరిచయం కానున్నారు. విజయ్ మిల్టన్, వేడన్ ఉన్న ప్రత్యేక పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది.

ఎన్నికల నేపథ్యంలో జరిగే క్రైమ్ కథాంశమే సరెండర్

● దర్శకుడు గౌతమన్ గణపతి

చిత్రంలోని ఓ సన్నివేశంలో దర్శన్

చెన్నై, న్యూస్‌టుడే: బిగ్‌బాస్ ఫేమ్ దర్శన్ ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'సరెండర్'. ఇందులో లాల్, సుజిత్ శంకర్, మన్సూర్ అలీఖాన్, మునీశ్‌కాంత్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో నిజాయతీపరుడైన పోలీసు అధికారి కథాంశంతో రూపొందిన ఈ చిత్రానికి గౌతమన్ గణపతి దర్శకత్వం వహించారు. వీఆర్వీ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు గౌతమన్ గణపతి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ఇది ఎన్నికల నేపథ్యంలో జరిగే క్రైమ్ కథాంశంతో కూడిన చిత్రమన్నారు. కనిపించకుండా పోయిన పెద్దమొత్తంలోని డబ్బును వెతుక్కుంటూ వెళ్లే ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన సన్నివేశాలు ఉత్కంఠభరితంగా ఉంటాయని తెలిపారు. చిత్రంలో పశుపతిని ఎంపిక చేయాలని భావించినా అనివార్య కారణాలతో ఆయనకు బదులు లాల్‌ను ఎంపిక చేశామని పేర్కొన్నారు. చిత్రంలో పాటలు లేవన్నారు. పోలీస్‌స్టేషన్ సన్నివేశాలు వాస్తవికతను తలపింప చేస్తాయని తెలిపారు. చిత్రంలోని కథ ప్రేక్షకులను ఆద్యంతం చూసేలా చేస్తోందని పేర్కొన్నారు.

అలనాటి గ్లామర్ క్వీన్ బి.సరోజాదేవి

● తమిళ వెండితెరపై ఆమెది చెరగని ముద్ర ● 50, 60వ దశకాల్లో యువకుల కలల రాణిగా కీర్తి

బి.సరోజాదేవి (పాత చిత్రం)

చెన్నై, న్యూస్‌టుడే: చూపు తిప్పుకోనీయని అందం, మైమరిపించే నవ్వు, ఆకట్టుకునే అభినయం, హావభావాలను పలికించే కళ్లకు చిరునామా బి.సరోజాదేవి. 50, 60వ దశకాల్లో వెండితెరపై ఓ వెలుగు వెలిగి నాటి యువతరానికి స్వప్నసుందరిగా మారి అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వయోభిక ఆరోగ్య సమస్యలతో సరోజాదేవి(87) సోమవారం కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా ఆమె వెండితెర ప్రస్థానం పరిశీలిస్తే... జెమిని గణేశన్, సావిత్రి తదితరులు నటించిన 1956లో విడుదలైన 'తిరుమణం' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు బి.సరోజాదేవి పరిచయమయ్యారు. ఆ చిత్రంలో డ్యాన్సర్ కథాపాత్రను పోషించిన ఆమె మరుసటి ఏడాది విడుదలైన 'తంగమలై రగసియం' చిత్రంలో సహాయ నటిగా చేశారు. 1958లో విడుదలైన 'మణమ్మై మరుతాం' చిత్రం ద్వారా తమిళ చిత్రపరిశ్రమలో నాయికగా మారారు. ఎంజీఆర్ సరసన నటించి అదే ఏడాది విడుదలైన 'నాడోడి మన్నన్' చిత్రం ఆమెకు ఎనలేని గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ మరుసటి ఏడాది విడుదలైన 'కల్యాణ పరిసు' చిత్రం కూడా సూపర్ హిట్ కావడంతో స్టార్ హోదాను పొందారు. ఆమె కన్నడకు చెందినవారు కావడంతో 'కన్నడత్తు పైంకిళి' (కన్నడ రామచిలుక)గా అభిమానులు పిలుచుకున్నారు.

అప్పటి అగ్ర హీరోల సరసన..

అలనాటి అగ్ర హీరోలైన ఎంజీఆర్, జెమిని గణేశన్, ఎస్.ఎస్.రాజేంద్రన్, ముత్తురామన్, ఏవీఎం రాజన్, రవిచంద్రన్ తదితరులతో సరోజాదేవి నటించారు. ఎంజీఆర్‌తో అత్యధిక చిత్రాల్లో నటించిన హీరోయిన్లలో జయలలిత తర్వాతి స్థానంలో సరోజాదేవి ఉన్నారు. ఎంజీఆర్‌తో జయలలిత 28 చిత్రాల్లో నటించగా బి.సరోజాదేవి 26 చిత్రాల్లో నటించారు. శివాజీ గణేశన్‌తో 22 చిత్రాల్లో నటించారు. కేఆర్ విజయ, జయలలిత ఆగమనం వరకు తమిళ చిత్రసీమలో ఆమె హవా కొనసాగింది. వివాహం తర్వాత భర్త అనుమతితో మళ్లీ నటించడం మొదలుపెట్టారు. 'పెరి ఎంట్రాల్ పెణ్' ఆమె 100వ చిత్రం. తమిళంలో ఆమె ఆఖరి చిత్రం 2009లో విడుదలైన 'ఆదవన్'. ఆ చిత్రంలో న్యాయమూర్తికి తల్లి పాత్రలో నటించారు.

ప్రముఖుల సంతాపం

బి.సరోజాదేవి మృతికి సినీ, రాజకీయ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన సంతాప ప్రకటనలో... 'నాన్ పేస నినైప్పదెల్లాం నీ పేసవేండుం', 'కల్లిలాం మాణిక్కం కల్యాణం', 'ఉన్నై ఒండ్రు కేట్పేన్', 'లవ్ బర్డ్స్, లవ్ బర్డ్స్', 'తొట్టాల్ పూమలరుం', 'రాజా విన్ పార్వై రాణియిన్ పక్కం' వంటి ఎన్నో మధురమైన పాటలకు తన అభినయంతో బి.సరోజాదేవి వన్నె తెచ్చి తమిళ ప్రజల హృదయాల్లో చోటు పొందారని తెలిపారు. సుమారు 200 చిత్రాల్లో నటించి భారతీయ చిత్రసీమకు అందించిన సేవలకుగాను పద్మశ్రీ, పద్మభూషణ్, కేంద్ర ప్రభుత్వ జీవిత సాఫల్య పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ 'కలైమామణి' పురస్కారం వంటివి పొందారన్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో, మధురమైన మాటలతో కనిపించే ఆమె మృతి తీరని లోటని తెలిపారు. కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్న మహానటి సరోజాదేవి ఇప్పుడు మనతో లేరని నటుడు రజనీకాంత్ పేర్కొన్నారు. సినిమా స్వర్ణయుగం ముగింపునకు వస్తుందని, బి.సరోజాదేవి అన్ని కాలాల్లోనూ ఉత్తమ నటి అని నటి ఖుష్బూ తెలిపారు. మరే నటికి ఆమెకున్నంత పేరు, ప్రతిష్ఠలు లేవని, ఆమెను కలవకుండా తన బెంగళూరు పర్యటన పూర్తి కాదని పేర్కొన్నారు. సరోజాదేవి స్వరం అభిమానులను ఆయస్కాంతం మాదిరిగా ఆకర్షించిందని, కన్నడ నటిగా ఉన్నా తమిళం చాలా అందంగా మాట్లాడతారని సంగీత దర్శకుడు శంకర్ గణేశ్ తెలిపారు. తమిళ సినిమా ఎందరో నటిమణులను చూసినా బి.సరోజాదేవి మాత్రం వారిలో ప్రత్యేకమని దర్శకుడు చిత్ర లక్ష్మణన్ పేర్కొన్నారు. 'పొన్‌మన చెల్వాన్' చిత్రంలో విజయకాంత్‌కు అమ్మ పాత్రలో బి.సరోజాదేవి నటించారని, కళా రంగం రాణిగా ఆమె జీవించారని, ఆమె లోటు సినీ రంగానికి తీర్చలేదని డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలత తెలిపారు. ఏవీఎం నిర్మించిన 'అన్బేవా' చిత్రానికి సహాయ దర్శకుడిగా బి.సరోజాదేవితో కలిసి పనిచేసినట్లు దర్శకుడు ఎస్పీ ముత్తురామన్ గుర్తు చేసుకున్నారు. నటులు రాధికా శరత్‌కుమార్, రోహిణి, విక్రమ్ ప్రభు, కరుణాస్ తదితరులూ తమ సంతాప ప్రకటనలు విడుదల చేశారు.

అందుకున్న పురస్కారాలు

'కులవిళక్కు' చిత్రానికి 1969లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 1993లో ఎంజీఆర్ పురస్కారం, 1997లో సినిమా చెన్నై ఎక్స్‌ప్రెస్ నుంచి, 2003లో దినకరన్ దినపత్రిక నుంచి 'అచీవర్' పురస్కారాలు, ఛారిటబుల్ ట్రస్ట్, చెన్నై రోటరీ క్లబ్ నుంచి 2007లో రోటరీ శివాజీ పురస్కారం, 2010లో రాష్ట్ర ప్రభుత్వ 'కలైమామణి' పురస్కారం అందుకున్నారు.

అజిత్‌కుమార్ కేసు దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ

మదురై ధర్మాసనంలో పత్రాలు తీసుకోవడానికి వచ్చిన సీబీఐ అధికారులు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ మృతి కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. శివగంగై జిల్లా మడపురం ఆలయ కాపలదారుడు అజిత్‌కుమార్‌ని నగల చోరీ కేసులో పోలీసులు దర్యాప్తుకి తీసుకెళ్లిన నేపథ్యంలో పోలీసుల దాడిలో అతను మృతిచెందాడు. ఈ కేసుని సీబీఐకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం అజిత్‌కుమార్ మృతి కేసుతో పాటు అతనిపై నమోదైన చోరీ కేసుని దర్యాప్తు చేయాలని ఆదేశించింది. అనంతరం సీబీఐ దర్యాప్తు అధికారిగా మోహిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ క్రమంలో సీబీఐ అధికారులు శనివారం రాత్రి మదురైకి చేరుకున్నారు. సోమవారం ఉదయం మదురై ధర్మాసనానికి చేరుకుని, రిజిస్ట్రార్ వద్ద కేసుకి సంబంధించిన పత్రాలు, సీసీ కెమెరాల రికార్డులు ఉన్న పెన్‌డ్రైవ్ మొదలైన వాటిని తీసుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టరు ప్రవీణ్ కుమార్‌ని కలిసి దర్యాప్తునకు అవసరమైన వాహనం, సిబ్బంది మొదలైన వసతులు కల్పించాలని కోరారు.

పురాతన మురుగన్ రాతి విగ్రహం లభ్యం

వెలుగుచూసిన విగ్రహం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా శూలగిరి సమీపంలోని దుర్రై చెరువు తీరంలో 1,000 ఏళ్ల పురాతన మురుగన్ రాతి విగ్రహాన్ని అరం చరిత్ర పరిశోధన కేంద్రం గుర్తించింది. దీని గురించి కేంద్ర చీఫ్ కృష్ణన్ విడుదల చేసిన ప్రకటనలో.. కృష్ణగిరి జిల్లా శూలగిరి-బేరిగై సాలైలో 2 కిలోమీటర్ల దూరంలో దుర్రై చెరువు తీరం ఉందని, దాని పక్కన ఒట్టర్‌పాలయం వెళ్లే మార్గంలోని ఎండిన చెట్టు కింద మురుగన్ రాతి విగ్రహం ఉన్నట్టు కణ్ణన్ అనే వ్యక్తి సమాచారం అందించారని తెలిపారు. అక్కడికి తాను, సిబ్బంది వెళ్లి పరిశీలించామని పేర్కొన్నారు. అది బేరిగై జమీందారులు అధికంగా ఉన్న ప్రాంతమని, ఇప్పటికీ వారు నివవాసం ఉన్న గృహాలు ఉన్నాయని తెలిపారు.

ఈపీఎస్‌కు వ్యతిరేకంగా డీఎంకే ఆందోళన

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామికి వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం సోమవారం కోయంబత్తూరులో ఆందోళన చేపట్టింది. పళనిసామి గతవారం కోయంబత్తూరులో పర్యటించిన సమయంలో మాట్లాడుతూ.. ఆలయాల నిధులతో కళాశాలలు నిర్మించటాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కోయంబత్తూరులో సోమవారం డీఎంకే విద్యార్థి విభాగం తరపున ఆందోళన జరిగింది. ఇందులో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ, డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దివ్య ప్రబంధ పారాయణం

సైదాపేట, న్యూస్‌టుడే: మహామంత్ర భజన మండలి ఈ నెల 10 నుంచి నిర్వహిస్తున్న శ్రీ షోషడనామ అఖండ సంకీర్తన సప్తాహంలో భాగంగా సోమవారం భక్తులు అనేకులు నాలాయిర దివ్య ప్రబంధం (సంగ్రహ సేవ) బృంద పారాయణం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తెలుగు తరుణి బృంద సభ్యుల గేయాలాపన భక్తిభావాన్ని పెంచింది. మండలి అధ్యక్షులు వీరబొమ్మల జనార్ధనరావు ఉత్సవ ఉభయదారులను, కళాకారులను సత్కరించారు. కార్యదర్శి కొత్తబాల నరసింహులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెరవళ్లూర్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో గాయపడి చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఎస్సై మురళీధరన్ కుమారుడు సంతోశ్‌కుమార్‌ను సోమవారం పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై నగరంలో సోమవారం జరిగిన మాజీ న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణన్ కుమారుడు అరవింద్ షణ్ముగనాథన్-క్రిస్టిన్ మరియా వివాహ వేడుకలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రొఫెసర్ డాక్టర్ కె.కె.రామలింగం 90వ జన్మదినం సందర్భంగా చెన్నై నగరంలో ఆదివారం రాత్రి జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం. చిత్రంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, సుప్రీంకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి, కేరళ మాజీ గవర్నర్ సదాశివం తదితరులు ఉన్నారు. -న్యూస్‌టుడే, చెన్నై

ప్రారంభానికి నోచుకోని బస్టాండ్‌లో మరుగుదొడ్లు

మూసి ఉన్న ఉచిత మరుగుదొడ్లు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి బస్టాండ్‌లో మూసి ఉన్న ఉచిత మరుగుదొడ్లను కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినా అందుబాటులోకి తీసుకురాలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో మధ్య, దక్షిణ జిల్లాల నుంచి హోసూర్, బెంగళూరు వెళ్లే బస్సులు ధర్మపురి మార్గంగా నడుస్తాయి. అందువల్ల ధర్మపురి బస్టాండ్ ప్రాముఖ్యత సంతరించుకుంది. అదే విధంగా నగర బస్టాండ్ నుంచి జిల్లా వ్యాప్తంగా బస్సులు నడుపుతున్నారు. బస్టాండ్ ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగానే ఉంటుంది. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌లో ఉచిత మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వాటిని వినియోగించుకుంటున్న నేపథ్యంలో పునరుద్ధరణ పేరుతో నాలుగు నెలల ముందు మూసేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన కలెక్టర్ సతీష్ మరుగుదొడ్లను పరిశీలించి వెంటనే ప్రాంగణాన్ని శుభ్రం చేసి ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఇప్పటివరకు వాటి గురించి పట్టించుకోలేదని, దీంతో బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులు డబ్బులు చెల్లించి మరుగుదొడ్లను ఉపయోగించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం దారుణం: అన్నామలై

సైదాపేట, న్యూస్‌టుడే: పుదుకోట్టై జిల్లా తేక్కాట్టూరు పంచాయతీ నమనసముద్రం కాలనీలో ఉన్న పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్లు శుభ్రం చేసే దృశ్యాలు దిగ్భ్రాంతి కలిగించాయని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. ముందే పాఠశాలల్లో కనీస వసతులు లేవని, పరిశుభ్రమైన తాగునీరు, సరిపడా ఉపాధ్యాయులు లేరని ఆరోపించారు.

నాటక కళాకారుడి ఆత్మహత్య

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా షోలింగర్‌లోని నరికుల్లమేటు ప్రాంతానికి చెందిన జయకరన్(28) వీధి నాటకాలు వేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు మండలం అరతల ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభరత మహోత్సవంలో నాటకాల నిమిత్తం ఆ నాటక బృందాన్ని రప్పించారు. ఆ బృందంలో ఉన్న జయకరన్ హాస్య పాత్రతో ప్రజల్ని నవ్వించారు. రెండ్రోజుల క్రితం అతడు సొంత గ్రామానికి వెళ్లొచ్చారు. ఆదివారం రాత్రి కూడా నాటకం వేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఆలయ సమీపంలోని మామిడి తోటకు వెళ్లి ఓ చెట్టుకు తన లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అతడి ఆత్మహత్యపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నట్లు సమాచారం. బీఎన్ఆర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల రాస్తారోకో

రోడ్డుపై ధాన్యం పోసి బైఠాయించిన రైతులు

అరక్కోణం, న్యూస్‌టుడే: వరి ధాన్యం సేకరణ కేంద్రాన్ని తెరవాలని డిమాండ్ చేస్తూ రాణిపేట జిల్లా నెమిలి సమీపంలోని కీళ్‌వీధి గ్రామ రైతులు నెమిలి-బాణావరం రోడ్డుపై సోమవారం ధాన్యం పారబోసి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు, తహసీల్దారు రాజ్యలక్ష్మి అక్కడకు చేరుకుని రైతులతో చర్చించారు. ధాన్యాన్ని సేకరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కారణంగా ఆ మార్గంలో మూడు గంటలపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.

డీఎంకే సభ్యత్వ నమోదు

శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా శోళింగర్ సమీపం కేశవనాంకుప్పం పంచాయతీకి చెందిన కేశవనాంకుప్పం, చిన్నకేశవనాంకుప్పం, ఎస్ఎంకండ్రిగ, మేట్టుకుప్పం తదితర గ్రామాల్లో డీఎంకే సభ్యత్వ నమోదు కార్యక్రమాలు సోమవారం జరిగాయి. కార్యక్రమానికి డీఎంకే పడమర యూనియన్ కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. పార్టీ ప్రముఖులు తమిళరసన్, తాండవన్, సత్యమూర్తి, సెల్వం తదితరులు పాల్గొన్నారు. ఒక్కరోజులో 460 మంది సభ్యులను చేర్చారు.

గుర్తింపు కార్డు అందజేస్తున్న యూనియన్ కార్యదర్శి కృష్ణమూర్తి

పీఎంకే కార్యకర్తల సమావేశం

శోళింగర్, న్యూస్‌టుడే: పీఎంకే రాణిపేట జిల్లా శోళింగర్ పట్టణ కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి శరవణన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వన్నియర్‌లకు కేటాయించిన 10.5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీ విళుపురంలో జరిగే ఆందోళనలో పాల్గొనాలని తీర్మానించారు.

కాంచీపురం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రారంభించిన వాహనాలను గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు అందజేస్తున్న కలెక్టర్ కలైసెల్వి - కాంచీపురం, న్యూస్‌టుడే

చెత్త సమస్య పరిష్కరించాలి

వేలూర్, న్యూస్‌టుడే: పాలారు నదీ తీరాన చెత్త పడేస్తుండటంతో పరిసరవాసులు అనారోగ్యాల పలవుతున్నారని వేలూర్ నగరపాలక సంస్థ భాజపా కార్పొరేటర్ సుమతి మనోహరన్ పేర్కొన్నారు. చెత్త పడేస్తున్న ప్రాంతాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. వేలూర్‌లోని 60 డివిజన్లలో సేకరిస్తున్న చెత్తను కార్పొరేషన్ శుభ్రతా కార్మికులు తీసుకొచ్చి వేలూర్ ఎస్పీ కార్యాలయం వెనుక వైపు పాలారు నదీ తీరంలో పడేస్తున్నారని ఆరోపించారు. ఆ చెత్తను అప్పుడప్పుడు తగలబెడుతున్నారని, ఆ పొగ కారణంగా పరిసరాల్లోని నివాసులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామన్నారు.

చెత్త పడేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుమతి

బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

బస్సు డ్రైవర్ల తీరుతో విద్యార్థులకు వెతలు

వేలూర్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాపుల వద్ద డ్రైవర్లు బస్సులను ఆపకుండా వెళ్తున్నందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం వేలూరు నుంచి ఒడుక్కతూర్ వైపుగా బయల్దేరిన ప్రభుత్వ బస్సు మార్గమధ్యలో మరమ్మతుకు గురై ఆగిపోయింది. దీంతో అందులోని విద్యార్థులు సుమారు కిలోమీటరు దూరం నడిచి మరో బస్టాపు వద్దకెళ్లారు. అక్కడ డ్రైవర్లు బస్సులను ఆపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాంటి బస్సు డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు చేపట్టాల్సిందిగా విద్యార్థులు కోరుతున్నారు.

ఊయల చీర మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక బాలుడి మృతి

కిరణ్ (పాత చిత్రం)

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కీళ్‌నెడుంగల్ గ్రామానికి చెందిన నాగరాజ్, జ్యోతి దంపతులకు ప్రేమలక్ష్మి (16) అనే కుమార్తె, కిరణ్ (14) అనే కుమారుడు ఉన్నారు. కిరణ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం తల్లిదండ్రులు బంధువుల పెళ్లికి వెళ్లారు. ఇంటి వరండాలో ఉన్న ఇనుప కొక్కీకి కిరణ్ చీరతో ఊయల కట్టి ఊగుతుండగా చీర మెడకు చుట్టుకుంది. ఊపిరాడక ఇబ్బంది పడతుండగా ఇరుగుపొరుగువారు కాపాడి పొదట్టూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్టు

అరెస్టయిన నవీన్‌కుమార్, శరత్, సురేందర్

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై షావుకారుపేటకి చెందిన సుమేర్‌సింగ్ రిచ్చి స్ట్రీట్‌లో సెల్‌ఫోన్ విడిభాగాల విక్రయ దుకాణం నడుపుతున్నాడు. ఈ నెల 12వ తేదీ తెల్లవారుజామున ఎన్ఎస్సీ బోస్ రోడ్డులో వెళ్తుండగా కొంతమంది కిడ్నాప్ చేశారు. తర్వాత రూ. 50 లక్షలు ఇవ్వాలని సుమేర్‌సింగ్ తండ్రి కాలుసింగ్‌కి ఫోన్‌చేశారు. వెంటనే కాలుసింగ్ పోలీసు కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి కిడ్నాప్‌కు పాల్పడిన నవీన్‌కుమార్, శరత్, సురేందర్ తదితరులను అరెస్టు చేశారు. దర్యాప్తులో.. సలీం అనే వ్యక్తి నుంచి రూ.50 లక్షలు తీసుకున్న సుమేర్‌సింగ్ తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో మధ్యవర్తులుగా ఉండి సలీం నుంచి డబ్బులు ఇప్పించిన నవీన్‌కుమార్, శరత్, సురేందర్‌లు కలిసి డబ్బులు రాబట్టుకోవడానికి సుమేర్‌సింగ్‌ని కిడ్నాప్ చేసినట్లు తేలింది. అనంతరం ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మత్తుమాత్రలు విక్రయిస్తున్న ముగ్గురు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపం కాట్టుపాక్కంలో కొందరు మత్తుమాత్రలు విక్రయిస్తున్నారని ఎస్పీ శ్రీనివాస పెరుమాల్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు సీఐ శబరినాథన్ నేతృత్వంలో పోలీసులు సోమవారం తనిఖీ నిర్వహించారు. మత్తుమాత్రలు విక్రయిస్తున్న కోవిలంపాక్కానికి చెందిన అయ్యప్పన్, కన్నన్, శ్యామ్‌సుందర్ అనే వ్యక్తులను అరెస్టు చేసి 1100 మత్తు మాత్రలు, ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయితో ఉన్న రైతు...

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లా కుండ్రి కొండ గ్రామాలలో గంజాయి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కడంబూర్ ఎస్సై ప్రభాకరన్ నేతృత్వంలోని పోలీసులు కుండ్రి రోడ్డులో ఆదివారం వాహన తనిఖీ చేపట్టారు. అప్పుడు ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా నిలబడి ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేశారు. ఆయన బర్గూర్‌కు చెందిన రైతు మహదేవన్(32) అని, గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని మహదేవన్‌ని అరెస్టు చేశారు.

రైళ్లోంచి గర్భిణిని తోసేసిన కేసులో దోషికి జీవిత ఖైదు

సైదాపేట, న్యూస్‌టుడే: గర్భిణిని రైళ్లోంచి తోసేసిన కేసులో దోషికి కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ తిరువళ్లూరు జిల్లా కేవీకుప్పం వద్ద వెళ్తున్న రైల్లో ప్రయాణిస్తున్న గర్భిణిని తోటి ప్రయాణికుడు లైంగికంగా వేధించాడు. తర్వాత తలుపు వద్ద కిందకు తోసేయంతో మహిళ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో హేమరాజ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ తిరుప్పత్తూరు జిల్లా కోర్టులో సోమవారం ముగిసింది. నేరం రుజువు కావడంతో హేమరాజ్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పొగాకు ఉత్పత్తుల స్వాధీనం



మణి, తంగమారియప్పన్

ప్యారిస్: చెన్నై మైలాపూర్ పోలీసులకి అందిన సమాచారం మేరకు ఆదివారం స్థానికంగా ఉన్న దుకాణంలో తనిఖీ చేశారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం దుకాణదారుడు ప్రభాకరన్‌ని అరెస్టు చేసి 8 కిలోల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు మణి అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేశారు. వారికి సరఫరా చేసిన తంగమారియప్పన్‌ని అరెస్టు చేశారు. అదేవిధంగా అతను దాచి ఉంచిన 398 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడానికి, గుట్కా దాచిన భవనానికి సీల్ వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

క్రైం కార్నర్

పాఠశాల నీళ్ల ట్యాంకులో మానవ మలం కలిపిన దుండగులు

వేళచ్చేరి: తిరువారూర్ సమీపం కరియాంగుడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 30 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం వంట సిబ్బంది అల్పాహారం తయారు చేయడానికిరాగా వంట గదిలోని వస్తువులు కింద చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. తాగునీటి ట్యాంకు పగిలి ఉంది. అందులో మానవ మలం ఉండటాన్ని గుర్తించారు. దుండగులు కొబ్బరి చెట్ల నుంచి కాయలు కోసుకుని పాఠశాల ఆవరణంలో మాంసాహారం వండుకొని తిని మిగిలిన వస్తువులను అక్కడే వదిలేసి వెళ్లినట్లు గుర్తించారు. దిగ్భ్రాంతి చెందిన వంట సిబ్బంది విషయాన్ని ప్రధానోపాధ్యాయిని అన్బుసెల్వికి తెలియజేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి దర్యాప్తు జరిపారు. మద్యం మత్తులో అలా చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి తిరువారూర్ జిల్లా కలెక్టర్ మోహనచంద్రన్ మాట్లాడుతూ. . పాఠశాల ప్రాంగణంలోని తాగునీటి ట్యాంకులో మలం వేసిన ఘటన దారుణమన్నారు. నిందిలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

కడవరకు జీవన పోరాటమే

కూలి పనుల్లోనే ముగిసిన జీవితం

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), వెంకటగిరి, రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పేదరికంలో పుట్టి పొట్టకూటి కోసం వలస కూలీలుగా నిత్యం జీవన పోరాటం చేస్తూ తనువు చాలించారు ఆ కార్మికులు. స్థానికంగా పనులు లేకపోవడంతో మామిడికాయలు తెంపేందుకు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీకాలనీలోని బంధువుల చెంతకు చేరారు. మామిడికాయలు తెంపితే వచ్చే సంపాదనతో జీవితం సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కళ్లెదుటే భార్య, భర్త, కొడుకు మృతదేహాలు, ప్రాణాలతో కొట్టిమిట్టాడుతున్న పిల్లలు.. ఇదీ ప్రమాద ఘటనలోని హృదయ విదారక దృశ్యాలు. సమాచారం తెలుసుకున్న స్థానికులు దేవుడా.. పేద బతుకులపై చిన్నచూపేలా అని బోరున విలపించారు. ఈ ఘటనతో వెంకటగిరి మండలం వల్లివేడు, శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి, కలవగుంట, చుక్కల నిడిగల్లు ఎస్టీ కాలనీల్లో విషాదం నిండింది.

ఐదుగురు బిడ్డల తల్లి చిట్టెమ్మ

కలవగుంట ఎస్టీకాలనీకి చెందిన చిట్టెమ్మ(35) మొదటి భర్త మృతి చెందడంతో శివయ్యను రెండో పెళ్లి చేసుకుంది. ఈమెకు ఐదుగురు సంతానం. కూలి పనులకు వెళ్లి వారిని పోషిస్తోంది. ప్రమాదంలో చిట్టెమ్మ మృతిచెందడంతో పిల్లల పరిస్థితి ఏంటని స్థానికులు కంటతడి పెట్టడం కలచివేసింది. కళ్లెదుటే భార్య మృతిచెందడంతో శివయ్య శోకసంద్రంలో మునిగారు.

వలస కూలీగా వెళ్లి.. విగతజీవిగా మారి

శ్రీకాళహస్తి మండలంలోని గుండ్లపల్లికి చెందిన శ్రీను(25) తండ్రి దశాబ్దాల కిందటే శెట్టిగుంట ఎస్టీకాలనీ నుంచి ఇక్కడికి వలస వచ్చారు. స్థానిక యువతి విజయలక్ష్మితో శ్రీనుకు వివాహమైంది. వీరికి వైష్ణవి(5), చంద్రిక(6) సంతానం. స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మామిడి సీజన్ వస్తే రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీకాలనీకి వెళ్లిపోతారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో శ్రీను మృతి చెందగా విజయలక్ష్మి, పిల్లలు గాయపడ్డారు. మామ వెంకటయ్యకు చెయ్యి విరిగింది. అత్త పోలమ్మ పరిస్థితి విషమంగా ఉంది. శ్రీను మృతదేహానికి అంత్యక్రియలు చేసే వారు లేక గ్రామస్థులే చేపట్టారు.

ఫోన్ చేసిన కొద్దిసేపటికే..

మునిచంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు

మునిచంద్ర (పాత చిత్రం)

వెంకటగిరి మండలం వల్లివేడుకు చెందిన మునిచంద్ర(19) బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు. కుమారుడు, కూతురికి ఎలాంటి కష్టం రానీయకుండా పెంచింది తల్లి సిద్ధమ్మ. ఇంటర్ వరకు చదివిన మునిచంద్ర రాజంపేట సమీపంలో బంధువుల వద్దకు రెండు నెలలు క్రితం వెళ్లాడు. అక్కడే రోజూవారీ కూలీగా సంపాదిస్తూ తల్లికి నగదు పంపేవాడు. వారం క్రితం ఇంటికొచ్చి వెళ్లాడు. ప్రమాదానికి ముందు కాయలు కోసి లోడ్ చేశామని, రైల్వేకోడూరుకు వెళ్తున్నామని ఫోన్‌లో చెప్పాడని, కొంతసేపటికే కుమారుడి మరణ వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని తల్లి విలపించింది.

● **శవపరీక్ష తర్వాత తరలింపు..** మృతదేహాలకు రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో పోలీసులు శవపరీక్ష చేయించారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం తర్వాత స్వగ్రామాలకు తరలించారు. ముందుగా బాధిత కుటుంబాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మంత్రి జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. తక్షణ సాయం కింద రూపానంద రెడ్డి ఫౌండేషన్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున అందజేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు.

భార్య, కుమారుడి మృతి

రాధ, జాని (పాతచిత్రం)

చుక్కలనిడిగల్లు ఎస్టీకాలనీకి చెందిన రమణయ్య దినసరి కూలిగా జీవనం సాగిస్తుంటారు. కొన్ని రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలసి శెట్టిగుంట ఎస్టీకాలనీకి వెళ్లి అక్కడి బంధువులతో పనులకు వెళ్లేవారు. లారీ ప్రమాదంలో రమణయ్య తీవ్రంగా గాయపడగా భార్య రాధ (35), కుమారుడు జాని(18) మృతి చెందడంతో కాలనీలో విషాదం నెలకొంది. కళ్లెదుటే మృతి చెందిన భార్య, కుమారుడిని చూసి రమణయ్య బోరున విలపించాడు.

గాడినపడని.. పోషణ్ ట్రాకర్

అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల ఫొటో తీస్తున్న కార్యకర్త

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టేలా తీసుకొచ్చిన యాప్‌లను సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. సాంకేతిక సమస్యలతో కార్యకర్తలు, లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకున్న ముఖ ఆధారిత గుర్తింపు వివరాలు సరకులు అందించేటప్పుడు సరిపోలడం లేదని, రెండు యాప్‌లు కాకుండా ఒకే యాప్‌లో వివరాలు నమోదు చేసేలా వెసులుబాటు కల్పిస్తే పరిస్థితి చక్కబడే అవకాశం ఉందని కార్యకర్తలు విన్నవిస్తున్నారు.

■ **పంపిణీ సమయంలో సాంకేతిక సమస్యలు**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బియ్యం, గుడ్లు, నూనె, పాలు, రాగులు, అటుకులు, బెల్లం, ఖర్జూరం వంటి పోషకాహారాన్ని ప్రభుత్వం ప్రతినెలా లబ్ధిదారులకు అందిస్తుంది. పంపిణీ తీరును పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌లను తీసుకొచ్చాయి. సర్వర్, సాంకేతిక సమస్యల కారణంగా కేంద్రాల్లో సరకులు నిల్వలున్నా లేనట్టు చూపడం, రిజిస్ట్రేషన్ సకాలంలో పూర్తికాకపోవడం, బాల సంజీవని యాప్‌లో పోషకాహార వివరాలు నమోదుచేసి లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపునకు యత్నిస్తే 'కాంటాక్ట్ సిస్టం అడ్మిన్' చూపుతూ మొరాయిస్తున్నట్టు చెబుతున్నారు. ప్రతినెల 15వ తేదీలోపు యాప్‌లో నమోదైన పంపిణీ వివరాల ప్రకారం మరుసటి నెలలో ఆయా కేంద్రాలకు సరకులు కేటాయిస్తారు. సర్వర్ ఇతర సమస్యల కారణంగా పంపిణీ జరగకపోతే మరుసటి నెలలో సమస్యలు తలెత్తుతున్నట్లు కార్యకర్తలు వాపోతున్నారు. కేంద్రం జులై నుంచి ముఖఆధారిత గుర్తింపు తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఈ తరహా సాంకేతిక సమస్యలు లేకుండా అధికారులు చూడాల్సిన అవసరం ఎంతో ఉంది.

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు : 12
అంగన్‌వాడీ కేంద్రాలు : 2,492
7నెలలు - 3 ఏళ్లలోపు పిల్లలు : 52,380
బాలింతలు: 5,895 | గర్భిణులు: 9,998

● **పరిష్కారం చూపుతాం..** జిల్లాలోని కేంద్రాలకు ప్రభుత్వం కొత్త చరవాణులు త్వరలో అందించనుంది. అందులో సమాచారం మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. తదనంతరం సాంకేతికపరమైన సమస్యలు అధిగమించే వీలుంది. - వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ, తిరుపతి జిల్లా

బడి తరలించొద్దని ఆందోళన

తడ: తడ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను తడకండ్రిగ పంచాయతీలోని మోడల్ పాఠశాలలో విలీనం చేశారని, అక్కడకు తమ పిల్లలను పంపమని తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు.

42 విలీన పాఠశాలలపై నివేదిక

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో విలీన పాఠశాలల అంశం తలనొప్పిగా మారింది. ఎక్కడికక్కడ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతున్నారు. దీనిపై విద్యాశాఖ జిల్లా యంత్రాంగం స్పందించి 42 పాఠశాలల జాబితాను రాష్ట్ర డైరెక్టర్‌కు పంపినట్లు సమాచారం. కలెక్టర్ అనుమతితో వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చ నడుస్తోంది. దీనిపై రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

చేనేతకు జాతీయ పురస్కారం

కేంద్ర మంత్రి నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో మంత్రి సవిత

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో చేనేత, హస్తకళల విభాగంలో జిల్లాకు మొదటి స్థానం దక్కడం గర్వకారణమని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం దిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జాతీయ స్థాయిలో వెంకటగిరి చీరలకు పురస్కారం దక్కింది. మంత్రి సవిత, జిల్లా చేనేత అధికారి రాచపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి సోమవారం రద్దీ కొనసాగుతోంది. భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డులోని శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి 16 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 80,193 మంది దర్శించుకోగా రూ.4.43 కోట్ల హుండీ కానుకలు లభించాయి. ● శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. అష్టదళ పాదపద్మారాధన సేవను తితిదే రద్దు చేసింది.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని ఆరు కేంద్రాల్లో మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు వివిధ అధ్యాపక పోస్టుల భర్తీకి సంబంధించి ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు దఫాలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. 6,412 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు 5,519 మంది దరఖాస్తు

తిరుపతి (విద్య): ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఎస్వీయూలోని పాత ఎంబీఏ భవనంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేయగా.. ఇప్పటివరకు 3,005 మంది ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించారు. మరికొందరు నేరుగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని కేంద్రంలో 2,514 మంది వివరాలు సమర్పించారు. రెగ్యులర్ కోర్సులకు రూ.42,000, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో రూ.1,62,000 నిర్ణయించారు.

మాజీ మంత్రి కాకాణికి జులై 28 వరకు రిమాండ్

● ఎన్నికల సమయంలో మద్యం అక్రమ నిల్వ కేసులో విధించిన న్యాయస్థానం

కోర్టు నుంచి కాకాణిని తీసుకెళ్తున్న పోలీసులు

గూడూరు పట్టణం: ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం నిల్వ చేసిన కేసులో నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి గూడూరు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఎన్నికల సమయంలో పొదలకూరు మండలం విరువూరు సమీపంలో అక్రమంగా ఉంచిన మద్యం నిల్వలను సెబ్ అధికారులు పట్టుకోగా.. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రోద్బలంతోనే అది జరిగిందన్న అభియోగాలపై కేసులో ఏ9గా ఆయన్ను చేర్చారు. ఈ కేసులో పొదలకూరు ఎక్సైజ్ అధికారులు పీటీ వారెంట్ ద్వారా గూడూరులోని ఒకటో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి సులోచనరాణి ఈ నెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించారు. నిందితుడిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

అన్నదాత సుఖీభవలో 476 మందికి ఒకరే తండ్రి

బాలాయపల్లి, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ లబ్ధి పొందడానికి తండ్రి పేరు పొరపాటుగా జాబితాల్లో చేరింది. ఒకరిద్దరికి కాదు ఏకంగా మండలంలో 44 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 476 మంది పట్టాదారులకు తండ్రి చిన వెంకటసుబ్బరాజుగా తప్పు దొర్లింది. ఆధార్ కార్డు వంటి ఇతర సాంకేతిక సమస్యలతో కలిపి మొత్తం 2 వేల మందికి అన్నదాత సుఖీభవ సొమ్ము పడేందుకు అడ్డంకిగా ఉందని 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తెదేపా నాయకులు తెచ్చారు. ఆయన స్థానిక తహసీల్దారు విజయలక్ష్మిని ప్రశ్నించగా.. సవరించడానికి తమ పరిధిలో లాగిన్ అందుబాటులో లేదన్నారు. జాబితాలో తప్పులు దొర్లడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సరిచేయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గోవిందా.. బిడ్డల చదువులెట్లా?

■ తితిదే కళాశాలల్లో ప్రవేశాలు దొరక్క పాట్లు

స్పాట్ ప్రవేశాల తేదీలు ఖరారు కాలేదని కళాశాల ముందు ఏర్పాటు చేసిన బ్యానర్

తిరుపతి (ఎస్వీయూ, మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: బిడ్డల చదువుల కోసం నిరుపేద తల్లిదండ్రులు తితిదే జూనియర్ కళాశాలల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నామమాత్రం రుసుముతో నాణ్యమైన విద్యనందించడంతోపాటు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తుండటంతో ఈ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రైవేటు కళాశాలల కంటే అధికంగా మార్కులు సాధిస్తుండటంతో రాయలసీమ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు దేవుడా నీవే దిక్కంటూ వేడుకుంటున్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకుగాను ఎస్వీ జూనియర్ కళాశాలలో 792, పద్మావతి కళాశాలలో 968 సీట్లు ఉండగా ఈ విద్యా సంవత్సరంలో 15 వేల దరఖాస్తులు వచ్చాయి. జూన్ 9-30 వరకు మూడో విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. ప్రస్తుతం 15 రోజులు కావస్తున్నా స్పాట్ అడ్మిషన్ల అంశం తేల్చకపోవడంతో తల్లిదండ్రులు ఆయా కళాశాలల వద్దకు చేరుకుని వాపోతున్నారు. 500కు పైగా మార్కులు సాధించినా కౌన్సెలింగ్‌లో తమ కుమార్తెకు సీటు రాలేదంటూ కళాశాలలకు వరుస కడుతున్నారు. మిగిలిన సీట్లకు స్పాట్ ప్రవేశాలైనా నిర్వహించి కేటాయించాలని ప్రాధేయపడుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి సిఫారసు లేఖలు తెస్తున్నారు. దరఖాస్తుల సమయంలో చేసిన పొరపాట్లతో కొందరికి సీట్లు వచ్చి ఉండవని, త్వరలో స్పాట్ ప్రవేశాల తేదీలు ప్రకటించి న్యాయం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

మగువ మెచ్చే.. వెంకటగిరి చీర

రాచరికపు రీవితో రాజ్యమేలిన వెంకటగిరి చీరలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్ని చీరలున్నా ఒకటైనా వెంకటగిరి చీర ఉండాలని కొని మురిసిపోయే మహిళలున్నారు. దేశవిదేశాల్లో అతివలందరూ మెచ్చే వెంకటగిరి జరీ చీరలకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) జాతీయ పురస్కారానికి వెంకటగిరి జరీ చీర ఎంపికైంది. - న్యూస్‌టుడే,వెంకటగిరి

☛ ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి జాతీయ పురస్కారానికి ఎంపిక

మగ్గంపై జరీ చీర నేస్తున్న మహిళ

● **పోటీలో గెలిచి:** రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన చేనేత, హస్తకళా ఉత్పత్తులు ఈ పోటీలో నిలిచాయి. కేంద్ర బృందం ఆయా ఉత్పత్తులను పరిశీలించి వాటిలో ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులను ఎంపిక చేసింది. ఈ పోటీలో వెంకటగిరికి చెందిన జరీ చీర ఎంపికైంది. గతంలో కేంద్ర బృంద సభ్యులు పర్యటించి వెంకటగిరి చీరను పరిశీలించారు. నాడు వెంకటగిరి జరీ చీర ఎంపిక కాలేదు. నేటి కూటమి పాలనలో వెంకటగిరి జరీ చీరకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఎంపిక చేశారు.

చెక్కుచెదరని చేనేత రంగం

వందల ఏళ్ల క్రితమే సన్నని నూలుపోగుతో తయారు చేసే ఈ వస్త్రాలను రాజకుటుంబీకులు ధరించేవారు. 120, 100 నంబర్ నూలుదారంలో చీరలు తయారు చేసేవారు. పూర్తిగా చేతితోనే అనేక డిజైన్లు నేసి మగువలకు అందించేవారు. కాలానుగుణంగా చేనేత రంగంలో పెనుమార్పులు తెచ్చారు. అధునాతన పద్ధతితో జరీ చీరలతో పాటు తక్కువ తూకంతో, మెరుగైన డిజైన్లతో పట్టు చీరలు తయారు చేస్తున్నారు. వెంకటగిరి ప్రాంతానికి చెందిన 14 మంది చేనేత కళాకారులకు చేనేత జాతీయ పురస్కారాలు దక్కడమే కాకుండా, ఇద్దరు సంత్‌కబీర్ అవార్డులు పొందారు.

రైతేరాజు 8లో

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY & SCIENCES: TIRUPATI
(AUTONOMOUS)
(Accredited by NAAC in "A" grade, All Eligible UG Programs Accredited by NBA, New Delhi)
Venkatapuram (V), Karakambadi Road, Renigunta (M), Tirupati - 517 520, Chittoor (A.P)
APEAPCET/ECET/ICET/PGECET COUNSELING CODE: AITT

Category- B Seats Admissions -2025

A few seats are available in 1st year B.Tech. / M. Tech. /MBA / MCA under Management Quota at this Institute.
B.Tech Courses - CSE, AIML, AIDS, CSE (Data Science), CSE (Cyber Security), CSIT, ECE, EEE, Mech Engg, and Civil Engg,. Eligible and interested candidates can approach the College office immediately along with relevant certificates.
For details Contact: 9701591084
Date: 14-07-2025
Sd/- PRINCIPAL

ఇక మ్యాజిక్ డ్రెయిన్లు..!

● భూగర్భ జలాల వృద్ధికి ప్రత్యేక ఏర్పాట్లు
● మురుగు సమస్యకు పరిష్కారం

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భూగర్భ జలాల వృద్ధితో పాటు మురుగు నీటి సమస్య పరిష్కారానికి ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో కాలువలు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో నిత్యం మురుగు నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నమూనా విధానంలో కచ్చా డ్రెయిన్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరంలో నిర్మించింది. ఆశించిన ఫలితం రావడంతో వీటి నిర్మాణంపై ప్రతి జిల్లా నుంచి ఇంజినీరింగ్, సాంకేతిక, క్షేత్ర సహాయకులకు ఇటీవల విజయవాడలో శిక్షణ ఇచ్చారు.

● తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరులో 250 మీటర్ల కచ్చా డ్రెయిన్ నిర్మించేందుకు గుర్తించారు.

● చిత్తూరు జిల్లాలో ఇంకా ఏ గ్రామంలో నిర్మించాలనే దానిపై స్పష్టత రాలేదు. ఒకట్రెండు రోజుల్లో చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టే గ్రామం ఏదనేది తేలనుంది.

మురుగు సమస్య ఉండదు.. ఈ తరహా నిర్మాణాలతో నీరు ఎప్పటికప్పుడు ఇంకిపోవడంతో మురుగు, దోమల సమస్య ఉండదు. దీనికితోడు భూమిలో నీరు ఇంకడం వల్ల భూగర్భ జలాల వృద్ధికి అవకాశం ఉంటుంది. - శ్రీనివాస ప్రసాద్, పీడీ, డ్వామా

నిర్మాణమిలా..

● సాధారణంగా 150 మీటర్ల ఈసీ డ్రెయిన్‌కు రూ.1.50 లక్షల ఖర్చవుతుంది. ఈ విధానంలో నిర్మిస్తే రూ.75 వేలకే పూర్తవుతుంది.

● 150 మీటర్ల పొడవు, 0.5 మీటర్ల వెడల్పుతో తొలి 50 మీటర్లు 0.4 మీ లోతు, తరవాత 0.5 మీ. చివర 50 మీటర్లు 0.6 మీటర్ల మేర తవ్వి మట్టి తొలగించాలి.

● కాలువలో ప్రతి 30 మీటర్లకు ఒక చోట 1.2 మీ మేర ఇంకుడు గుంత తవ్వాలి. కాలువ తవ్విన ప్రాంతంలో ఇళ్ల వైపు అడ్డుగా నాపరాళ్లు ఏర్పాటు చేసి తొలుత 225, చివరిగా 10 ఎంఎం మెటల్ వేయాలి. ఇంకుడు గుంతల్లోనూ ఇదే విధానంలో నిర్దేశిత పరిమాణంలో రాయి, మెటల్ నింపాలి.

ఎక్స్‌రేనా.. రేపు రండి

రుయా ఓపీ విభాగం సోమవారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన రోగులతో కిటకిటలాడింది. ఇక్కడే ప్రధాన ద్వారం పక్కన ఉన్న డిజిటల్ రేడియోగ్రఫీ గది వద్ద ఎక్స్‌-రే కోసం రోగులు బారులు తీరారు. మధ్యాహ్నం ఒంటి గంటయినా రద్దీ తగ్గకపోవడంతో 1:15 నిమిషాల సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది మిషన్ పనిచేయడం లేదు.. రేపు ఉదయం 9 గంటలకు రండి అని చెప్పడంతో చేసేది లేక రోగుల ఉసూరుమంటూ వెళ్లారు. సిబ్బంది తీరుపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. - ఈనాడు, తిరుపతి



104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

■ 416 గ్రాముల బంగారం స్వాధీనం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తాళం వేసిన ఇళ్లకు కన్నం వేసే 74 మంది దొంగలను జిల్లాలో ఇప్పటివరకు గుర్తించి.. సుమారు రూ.75 లక్షలు రికవరీ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. తాజాగా నాయుడుపేటలో జరిగిన చోరీ కేసులో ఓ నిందితుడిని అరెస్టు చేసి రూ.37.44 లక్షల విలువైన 416 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం వెల్లడించారు. ఈ నెల 5న నాయుడుపేట మూగాంబిక దేవాలయ వీధిలో తాళం వేసిన గంగినేని హరీంద్ర ఇంట్లో ఈ ఆభరణాలు చోరీకి గురికాగా, ప్రత్యేక బృందం నిఘాపెట్టి సాంకేతిక సహకారంతో నిందితుడిని గుర్తించినట్లు చెప్పారు.

దొరికినంత దోచాడు.. ఏసీ రైలెక్కాడు

స్వాధీనం చేసుకున్న నగలు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పార్వతీపురం జిల్లాకు చెందిన చందక మణికంఠ (28)గా నిర్ధారించుకుని ఏసీ రైలులో ఊరెళ్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. తడ, శ్రీసిటీ, నాయుడుపేట పరిధిలో ఐదు కేసులతో పాటు విశాఖపట్నం, మువ్వలవారిపాళెం, ద్వారక పీఎస్ పరిధిలో మొత్తం 14 దొంగతనం కేసులు అతనిపై నమోదయ్యాయన్నారు. పార్వతీపురం నుంచి రేణిగుంటకు ఒక్కడే చేరుకుని స్థానికంగా అద్దె గదిలో ఉంటూ పగటిపూట నాయుడుపేట ప్రాంతాలకు చేరుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైందన్నారు. ఎవరైనా గుర్తిస్తే ఇల్లు అద్దెకు కావాలని బుకాయించేవాడని ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్సై ఆదిలక్ష్మి, హెచ్‌సీ రామ్మోహన్‌రాజు, పీసీ దయాకర్, భానుతేజ, హెచ్‌జీ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యంలకు నగదు రివార్డు అందజేశారు.

(c) eenadu

రైతేరాజు

ఆదాయం పట్టు

మల్బరీ సాగుతో మంచి లాభాలు

కల్లూరు, న్యూస్‌టుడే: పట్టు పురుగుల పెంపకంతో ప్రతినెలా నికర ఆదాయం పొందుతున్నారు పశ్చిమ మండలాల్లోని కొందరు రైతులు. కొన్ని మెలకువలు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని చెబుతున్నారు. పెంపకం వివరాలివి.

- **రకాలు:** పట్టు పురుగుల్లో బైవోల్టిన్, బొంబాక్సీ మోరి, ఎరి, ముగా, టసార్ రకాలున్నాయి.
- **మల్బరీ సాగు:** పురుగులకు మల్బరీ ఆకులను మేతగా అందించాలి. అరెకరాలో పురుగులను పెంచితే ఎకరాలో మల్బరీ మొక్కలు పెంచాలి.
- **లార్వా దశ:** ఒక షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. నేల నుంచి కనీసం రెండు అడుగుల ఎత్తు ఉండేలా బెడ్లు సిద్ధం చేసుకోవాలి. గుడ్ల నుంచి గూడు దశకు చేరుకోవడానికి సుమారు 22 రోజులు పడుతుంది. గుడ్డు నుంచి లార్వా బయటకు రాగానే మల్బరీ ఆకులను తింటూ 17-20 రోజులకు 7-8 సెంటీమీటర్ల పొడవు పెరుగుతాయి. లార్వా దశలో ఉన్నప్పుడు పురుగులు వాటి బరువు కంటే ఎక్కువ ఆహారాన్ని తింటూ గూడు దశకు తమని సిద్ధం చేసుకుంటాయి.
- **సేకరణ, విక్రయం:** పట్టు పురుగుల చుట్టూ గూడు పూర్తిగా ఏర్పడ్డాక వీటిని వేడి నీళ్లలో మరిగిస్తే గూడు లోపల ఉన్న పురుగు మరణిస్తుంది. వేడి నీటికి గూడులో ఉన్న జిగురు వంటి పదార్థం కరిగి పట్టు సేకరణకు అనువుగా మారుతుంది. సేకరించిన పట్టును మార్కెట్లో విక్రయిస్తారు. కేజీ బట్టీ కిలో పట్టుకు రూ.650-700 వరకు ఆదాయం లభిస్తుంది.

నెలకు రూ.50 వేలు: నేను రెండెకరాల పైగా అరెకరా షెడ్డులో పురుగుల పెంపకం, ఎకరాలో మల్బరీ సాగు చేపడుతున్నా. పురుగులను చిత్తూరు, కర్ణాటకలోని కోలార్, రాయల్‌పేట, చీలట్పిన్న చాకీ సెంటర్లో తెచ్చుకుంటా. రెండో జర్గంలో ఉన్నప్పుడు బైవోల్టిన్ అనే రకం 80 పురుగులు రూ.3200 పడతాయి. రవాణా, ఇతర ఖర్చులతో కలిపి రూ.4500 అవుతుంది. తరువాత 2 నుంచి 3, 4 దశల వరకు మల్బరీ ఆకులను పురుగులు 15 రోజులు ఆహారంగా తింటాయి. గూడు అల్లుతాయి. 4 రోజుల తరువాత నేలకు నుంచి గూళ్లు తీసుకుని పలమనేరు మార్కెట్‌కి తీసుకెళ్తా. కిలో రూ.650తో విక్రయిస్తా. అలా వంద కిలోల రూ.65 వేలకు విక్రయించాక ఖర్చు రూ.పదిహేను వేలు పోనూ ప్రతి నెలా రూ.50 వేల ఆదాయం లభిస్తుంది. **- వై.సురేష్, పాతపేట గ్రామం, పులిచెర్ల మండలం**

వరి నారు పెంపకంలో సూచనలు

పుంగనూరు, న్యూస్‌టుడే: నాటిన వరి పైరు త్వరగా కుదురుకోవాలన్నా, ఎక్కువ పిలకలు వచ్చి బలంగా ఆరోగ్యవంతమైన నారు నాటడం ద్వారానే సాధ్యమని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. నాణ్యమైన నారు పెంపకానికి పలు సూచనలు చేశారు. ముందుగా నారుమడిని వారం వ్యవధిలో మూడు సార్లు దున్నాలి. నీరు పారించి దానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలు తీసుకుని విడిగా విత్తనశుద్ధి చేసి 24 గంటల పాటు శుభ్రమైన నీటిలో నానబెట్టాలి. తర్వాత గోనె సంచిలో నిల్వ చేయాలి. ఎక్కువ గుబ్బగా కాకుండా విత్తనాలు పరస్పరం దూరంలో ఉండాలి. నారుమడిలో మంచి నీటి నిల్వ సామర్థ్యం ఉండాలి. నీరు నిలిచే స్థలాలు కాకూడదు. సులభంగా నీరు పోయేలా కాలువ, సూర్యకాంతి బాగా పడే స్థలం కావాలి. మొలక వచ్చిన తర్వాత నారుమడిలో విత్తనాన్ని చల్లే ముందు మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. విత్తనాలను సమానంగా చల్లాలి.

ఎరువుల వాడకం

ఎకరా నర్సరీకి యూరియా 20 కిలోలు, సూపర్‌ఫాస్ఫేట్ 40 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 15 కిలోలు దుక్కిలోనే చల్లాలి. నారు ఆకు విప్పినవే వరకు అరుతడులు ఇవ్వాలి. తర్వాత నారుమడిలో పలుచగా నీరు నిలబెట్టాలి. రాగి, మడి, తక్కువ మొలకలు వంటి సమస్యలు వచ్చినట్లైతే ఫంగిసైడ్లు వాడాలి. తేనేటి పురుగులు, తామర పురుగులు వంటివి ఉంటే తగిన ఇన్సెక్టిసైడ్లు వాడాలి. సాధారణంగా మొలకలు వచ్చిన 20-25 రోజుల్లో నాటాలి. ఎర్ర మట్టి భూముల్లో 25-30 రోజుల వయసు నారు నాటాలి.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే:

ప్రశ్న: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఏమిటి? కౌలు రైతుల పరిస్థితి ఎలా? **-రైతు రామచంద్ర, కరకంబాడి, రేణిగుంట మండలం**

జవాబు: వెబ్‌ల్యాండ్‌లో భూమి కలిగి జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వే చేయించుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు ఈ పథకానికి అర్హులు. కౌలు రైతులు సమీప రైతుసేవా కేంద్రంలో కౌలు గుర్తింపు పత్రం పొందితే వారికి లబ్ధి చేకూరుతుంది. **-సునీల్ కుమార్‌రెడ్డి, రేణిగుంట వ్యవసాయాధికారి**

పోషకాల మేతతో సత్ఫలితాలు



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పోషక విలువలు మెండుగా ఉండే పరిపూర్ణ మేతను గొర్రెలు, మేకలకు అందుబాటులో ఉంచడంతో పశుపోషకులు సత్ఫలితాలు సాధించవచ్చని అంటున్నారు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ భాస్కర్.

- పంట అవశేషాలైన వరి, జొన్న, పొద్దుతిరుగుడు పువ్వు, రాలిపోయిన చెట్ల ఆకులను యంత్రాల సహాయంతో పొడి చేసుకోవాలి.
- వంద కిలోల పొడిలో యాభై శాతం వరకు వాడుకోవచ్చు. మిగిలిన యాభై శాతానికి మొక్కజొన్న, సజ్జ, జొన్న, నూనె తీసిన వేరుసెనగ పిండి, పొద్దుతిరుగుడు పిండి, వరి, గోధుమ తవుడు తదితర వాటిని కలిపి సంపూర్ణ మేతగా సిద్ధం చేసుకోవాలి.
- సంపూర్ణ మేతను గొర్రెలు, మేకలకు అందించడం వల్ల పోషకాలు సమృద్ధిగా జీవాలకు అందడంతో ఎదుగుదల బాగుంటుంది.
- వ్యాధినిరోధక శక్తి మరింతగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

నమ్మకంతో వచ్చాం.. న్యాయం చేయండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వేడుకోలు

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ శుభం భన్సల్, చిత్రంలో డీఆర్వో నరసింహులు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఇక్కడైనా న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో ఇంత దూరం వచ్చాం.. స్పందించి సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు అర్జీదారులు ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. జేసీ శుభం భన్సల్, డీఆర్వో నరసింహులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, రోజ్‌మాండ్ ప్రజల నుంచి 301 వినతులు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 136 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పొలానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు

బాలాయపల్లి మండలం నిండలి గ్రామంలోని సర్వేనెం. 192లో సుమారు రెండు సెంట్ల భూమి ఉంది. పక్కనే ఉన్న భూయాజమానులు అందులోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. ప్రశ్నిస్తే బెదిరించడంతోపాటు దాడికి దిగుతున్నారు. అనేకసార్లు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- కుటుంబ సభ్యులతో విజయమ్మ, నిండలి, బాలాయపల్లి

ప్రభుత్వ పథకాలు అందడం లేదు

తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో 29 మంది ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నాం. కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు ఒకటీ అందడం లేదు. జీతాలు అంతంత మాత్రంగానే ఇస్తుండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించాలి.

- శిల్పారామం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

విద్యుత్తు లేక చీకట్లో గడుపుతున్నా

తీర్థపాడులోని కోలితోట శివాలయం వీధిలో నివాసం ఉంటున్నా. ఆలయ పూజారిగా పనిచేస్తూ నాభర్త పెంచల సుబ్బరామయ్య మృతిచెందారు. ప్రస్తుత రేకుల ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నా. విద్యుత్తుశాఖ అధికారులను అనేకసార్లు కలిసి విద్యుత్తు మీటర్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కొన్ని సంవత్సరాలుగా చీకట్లో గడుపుతున్నా. స్పందించి విద్యుత్తు మీటర్ మంజూరు చేయాలి. **- పెంచలకాంతమ్మ, తీర్థపాడు, డక్కిలి**

తప్పుడు పత్రాలతో భూమి అమ్మేశారు

తిరుపతి గ్రామీణ మండలం కుంట్రపాకంలోని సర్వేనెం. 105, 197/11లో దాదాపు 105 అంకణాల భూమి ఉంది. సమీప బంధువులు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని అమ్మేశారు. ఇటీవల చదును చేసేందుకు వెళ్లగా కొంతమంది అడ్డుకున్నారు. తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- డి.పూజిత, ఎన్టీఆర్ కాలనీ, రాజంపేట, అన్నమయ్య జిల్లా

'అన్యమత ప్రచారం చేస్తున్న తితిదే డీఈఈని తొలగించాలి'

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తితిదే ఇంజినీరింగ్ విభాగంలో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఇలియాజర్‌ను వెంటనే తొలగించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కర్నూలులోని తితిదే కల్యాణ మండపంలో జరుగుతున్న పనుల పర్యవేక్షణకు క్వాలిటీ కంట్రోల్ అధికారిగా వెళ్లిన ఇలియాజర్ క్రైస్తవ మతాన్ని ఆరాధించాలని చెప్పే ప్రచార స్టిక్కర్ ఉన్న వాహనంలో ప్రయాణించడమే కాకుండా చేతిలో బైబిల్ పట్టుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. తితిదే ఈవో స్పందించి వెంటనే అన్యమతస్థులను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. తితిదేలో పనిచేసే అన్యమత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, వారి కోసం ముసలి కన్నీరుకార్చే కరుణాకరరెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులపై స్పందించకుంటే చర్యలు

తిరుపతి(నేరవిభాగం): మీకోసం - ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు స్పందించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. డీపీవోలో సోమవారం 113 ఫిర్యాదులు అందాయి. సమస్యల పరిష్కారంలో సిబ్బంది జవాబుదారీతనం ప్రదర్శించాలని, వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

ఎర్రచందనం దొంగపై పీడీ యాక్ట్

తిరుపతి (నేరవిభాగం): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతూ.. మరికొందరిని ఆ దిశగా ప్రోత్సహిస్తున్న తమిళనాడు రాష్ట్రం బోడినాయుడు కండ్రిగకు చెందిన అజిత్ బాబు (29)పై పీడీ యాక్టు కింద జైలులోనే ఉంచాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు ఇచ్చారు. కడప కేంద్ర కారాగారంలోనే ఏడాదిపాటు నిర్బంధంలో ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. దీంతో పీడీ యాక్టు నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ విన్నపం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఆర్యవైశ్యులు ఆత్మగౌరవంతో ముందుకెళ్లాలి

మాజీ ఎంపీ టి.జి.వెంకటేష్

మాట్లాడుతున్న టీజీ వెంకటేష్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు ఆత్మగౌరవంతో ముందుకు వెళ్లాలని మాజీ ఎంపీ టి.జి.వెంకటేష్ సూచించారు. నగరంలోని సత్యనారాయణపురం సర్కిల్ సమీపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన సత్రం భవనాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి సోమవారం ప్రారంభించారు. క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సీతమ్మ ట్రస్ట్ భూమికి సంబంధించి కొన్ని వివాదాలు ఉన్నాయని, వాటిని పాలకుల సహకారంతో పరిష్కరించి త్వరలోనే అప్పగిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడారు. సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్, సూర్యప్రకాష్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, సుజాత పాల్గొన్నారు.

సహకార సంఘాలకు పీఐసీల నియామకం

చిత్తూరు నగరం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంఘానికి ఛైర్మన్, ఇద్దరు సభ్యుల్ని నియమించారు.

చిరుధాన్యాలపై సంపూర్ణ అవగాహన అవసరం

తిరుపతి (వ్యవసాయం): చిరుధాన్యాల పంటలపై రైతులకు సంపూర్ణ అవగాహన అవసరమని శాస్త్రవేత్తలు సూచించారు. పెరుమాళ్లపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో సోమవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డా.వి.సుమతి మాట్లాడుతూ చిరుధాన్య పంటల ఆవశ్యకతను వివరించారు. శాస్త్రవేత్త డా.ఎస్. కలీముల్లా అండుకొర్రలు, సామలు, కొర్ర పంటలకు పొట్టుతీసే యంత్రాలు, వాటి పనితీరు గురించి వివరించారు.

యాప్ పరిధిలోకి హోమ్‌స్టేలు, లాడ్జీలు

తిరుపతి (నేరవిభాగం): జిల్లాలోని హోమ్‌స్టేలు.. లాడ్జీలను ప్రత్యేక యాప్ పరిధిలోకి తెచ్చినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. 'హోమ్‌స్టేలుగా నివాసగృహాలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి స్పందించారు. రాష్ట్రంలోనే మొదటగా ప్రత్యేక యాప్ రూపొందించి.. అందులోకి 261 హోమ్‌స్టేలు.. 304 లాడ్జీలను తెచ్చామన్నారు. ఆధార్‌కార్డు, ఫొటో తీసుకుని గదులు అప్పగించి, వారి వివరాలు యాప్‌లో పొందుపరచాలని వాటి నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

తెలుగుగంగ ఎస్‌ఈగా రాధాకృష్ణమూర్తి

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టుల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా డి.రాధాకృష్ణమూర్తి సోమవారం తిరుపతిలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

నైపుణ్య వెలుగులు

- స్కిల్‌హబ్ శిక్షణలతో ఉపాధి
- రాణిస్తున్న యువత, మహిళలు

✷ పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన డెసాల్ట్ శిక్షణ కేంద్రంలో 10,600 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. కొందరు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు సొంతంగా వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారు.

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెదేపా ప్రభుత్వం నిరుద్యోగ యువతతో పాటు, ఇంజినీరింగ్, యూనివర్సిటీ స్థాయిలో పీజీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు గతంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు, సీమెన్స్ కేంద్రాలతో పాటు సీఎంఎస్‌ఈ కేంద్రాలు, డెసాల్ట్, ఈఎస్‌సీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వేలాది మంది యువత శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సీమెన్స్ కేంద్రాలు మూతపడటంతో యువత భవిత అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తెస్తే వృత్తి నైపుణ్యాలు సాధించడంతోపాటు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉంది. మంగళవారం ప్రపంచ యువ నైపుణ్యం దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్‌లో కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న యువత

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్కిల్ హబ్, సీఎంఎస్‌ఈ, ఈఎస్‌సీ కేంద్రాల్లో శిక్షణ పొందిన యువత నాలుగు వేల మంది పైచిలుకు ఉద్యోగాలు సాధించారు. వృత్తివిద్యలో శిక్షణ పొందిన యువత, మహిళలు చేతివృత్తుల్లో ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు అధునాతన టెక్నాలజీలో శిక్షణ పొంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి తమ కాళ్లపై నిలబడి జీవిస్తున్నారు.

చంద్రగిరిలో శిక్షణ పొందిన యువతకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్

ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని స్కిల్ హబ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రతి బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నాం. తద్వారా ఎంతో మందికి ప్రయోజనం కలుగుతోంది. నిరుద్యోగ యువత స్కిల్ హబ్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి.

- ఆర్.లోకనాథం, గుణశేఖర్, తిరుపతి, చిత్తూరు జిల్లాల నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

జిల్లాలో స్కిల్ హబ్‌లు: 8 | సీఎంఎస్‌ఈ కేంద్రాలు: 9 | డెసాల్ట్ కేంద్రాలు: 9 | ఈఎస్‌సీ కేంద్రాలు: 34

నూతన కాటేజీ విధానంపై బ్లూప్రింట్ సిద్ధం చేయండి

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులకు వసతి కల్పించేందుకు నూతన కాటేజీ విధానాన్ని రూపొందించాలని అధికారులకు తితిదే ఈవో జె.శ్యామలరావు సూచించారు. స్థానిక పరిపాలనా భవనంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా దాతలు కాటేజీలు నిర్మించేందుకు అవసరమైన బ్లూప్రింట్ తయారు చేయాలన్నారు. నిర్దేశిత సమయానికి దాతలు కాటేజీలు నిర్మించి తితిదేకు అప్పగించడం, వారికి కేటాయించిన ప్రివిలేజెస్ దుర్వినియోగం కాకుండా చూడటం, దాతల ఎంపికలో విధివిధానాలు, బాధ్యతలు తదితర అంశాలు పారదర్శకంగా ఉండేలా నిబంధనలు రూపొందించాలన్నారు. అంతకుముందు విధానపరమైన అంశాలపై అదనపు ఈవో వర్చువల్ ద్వారా ఈవోకు వివరించారు. రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడితోనే ఆరోగ్య సమస్యలు: ఎస్పీ

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, చిత్రంలో ఆస్పత్రి ఎండీ గౌరినేని రమాదేవి

రేణిగుంట, న్యూస్‌టుడే: యూనిఫాం సర్వీసు ఒత్తిడితో కూడుకున్నదని, ఆ కారణంగా అనారోగ్య సమస్యలు వస్తాయని, నిపుణుల సూచనలు పాటిస్తే అధిగమించవచ్చని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. సోమవారం కరకంబాడి అమరరాజ ఆడిటోరియంలో అమర ఆసుపత్రి, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, అమరరాజ గ్రూప్ సహకారంతో పోలీసులకు ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన అమర ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేనితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పోలీసులకు కుటుంబాలు ఉన్నాయని ప్రజలతో పాటు వారి కుటుంబాలను సక్రమంగా చూసుకునే బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. దీర్ఘకాలిక సమస్యలను ఇలాంటి వైద్య శిబిరాల్లో ముందస్తుగా గుర్తించి చికిత్స తీసుకునే అవకాశముందన్నారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ సీఐ జయచంద్ర పాల్గొన్నారు.

అమ్మమ్మ ఇంటికెళ్లి.. శవమై తేలి

సొనకాలువలో పడి యువకుడి మృతి

అవినాష్ (పాత చిత్రం)

చిల్లకూరు: అమ్మమ్మ ఇంటికెళ్లిన ఓ యువకుడు కాలువలో శవమై తేలిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు మండలం తిక్కవరం దళితవాడకు చెందిన గార అవినాష్ (25) ఆదివారం రాత్రి మండలంలోని కాకువారిపాలెంలో ఉన్న అమ్మమ్మ ఇంటికెళ్లాడు. బహిర్భూమికి పోయి కాళ్లు శుభ్రం చేసుకునేందుకు సమీపాన ఉన్న మామిడి సొనకాలువలోకి దిగాడు. పట్టుతప్పి అందులో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఉదయాన్నే అటుగా వెళ్లిన స్థానికులు కాలువలో మృతదేహం ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి అవినాష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ కెఆర్‌టి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్,
శ్రీ వేదనారాయణ స్వామి దేవాలయం, నాగలాపురం
టెండరు ప్రకటన
శ్రీ వేదనారాయణస్వామి దేవాలయం, నాగలాపురంవారికి నశ్వర వస్తువులు అనగా పాలు, పెరుగు, అరటి పండ్లు, తమలపాకులు, నిమ్మకాయలు మరియు కొబ్బరి బోండాల సరఫరా కొరకు సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు జారీ 15-7-2025 నుండి ప్రారంభం మరియు టెండరు దాఖలుకు చివరి తేదీ: 30-7-2025 మ.3.00 గం.లు. ఏవేని తదుపరి వివరాలకు టెండరుదారు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయం, శ్రీ కెఆర్‌టి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్, టిటిడి పాత ఎస్.వి. ఉన్నత పాఠశాల భవనం, ప్రకాశం రోడ్, తిరుపతివారిని సంప్రదించగలరు. సంప్రదించవలసిన నెంబరు: 9985043990.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No:135), Dt: 14-07-2025 కార్యనిర్వహణాధికారి

భద్రతా లోపాలెన్నో..!

- రైల్వే యార్డ్‌లో అగ్నిప్రమాదం
- బోగీ పూర్తిగా తగలబడ్డాకే మంటలు అదుపులోకి
- ఆలస్యంగా అగ్నిమాపక వాహనం

బోగీ నుంచి వ్యాపిస్తున్న మంటలు

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి రైల్వే యార్డులో భారీ అగ్నిప్రమాదం కలవరపెట్టింది. హిసార్- తిరుపతి ఎక్స్‌ప్రెస్ (04717) యార్డ్ నుంచి పిట్‌లైన్‌కి వెళ్తున్న క్రమంలో జనరల్ బోగీలో అకస్మాతుగా మంటలు చెలరేగడంతో స్థానికులు, ప్రయాణికులు, అధికారులు ఉలిక్కిపడ్డారు.

హిసార్- తిరుపతి ఎక్స్‌ప్రెస్ (04717) సోమవారం ఉదయం 9:15 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సి ఉండగా 11:52 గంటలకు అంటే 02:37 గంటలు ఆలస్యంగా వచ్చింది. అనంతరం స్టేషన్ నుంచి యార్డుకు బయలుదేరింది. మధ్యాహ్నం 1:15 గంటల ప్రాంతంలో జనరల్ బోగీలో మంటలు చెలరేగడంతో సమీప ప్రజలు, రైల్వే అధికారులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చినా ఫలితంగా లేకపోయింది. అదే సమయంలో గాజులమండ్యం పారిశ్రామికవాడలో బాయిలర్ పేలడంతో సిబ్బంది అక్కడికి వెళ్లారు. దీంతో బోగీ పూర్తిగా కాలిపోయింది. వందేభారత్ రైలు పక్క నుంచే రాకపోకలు సాగించింది.

మంటలు ఆర్పుతున్న సిబ్బంది

గుర్తించని లోకో పైలెట్

స్టేషన్ నుంచి యార్డ్‌లోకి వస్తున్న క్రమంలో చివరిలో ఉన్న బోగీలో మంటలు రావడాన్ని ముందున్న లోకో పైలెట్ గమనించలేదు. తీవ్రస్థాయిలో చెలరేగాక సిబ్బంది సమాచారం అందించారు. స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, మేనేజర్ చిన్నప్పరెడ్డి, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్ఆర్పీ హర్షిత, ఆర్పీఎఫ్ రేణిగుంట అదనపు సెక్యూరిటీ కమిషనర్ రాజుగోపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పరిశీలించారు. సాధారణంగా యార్డ్ ఉన్న ప్రాంతంలో ఆకతాయిలు, భిక్షాటన చేసేవారు సంచరిస్తుంటారు. ఆ సమయంలో భద్రతా సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆలస్యంగా రాయలసీమ ఎక్స్‌ప్రెస్..

అగ్నిప్రమాద ఘటనతో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని జనరేటర్ బోగీ పాక్షికంగా దెబ్బతింది. దీంతో రైలును గ్యారేజ్‌కి తీసుకెళ్లి అదనంగా ఉన్న మరో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి 45 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. తిరుపతి నుంచి హిసార్‌కు బయలుదేరిన రైలులో బోగీ అగ్నికి ఆహుతి కావడంతో ఆ స్థానంలో గ్యారేజ్‌లో అదనంగా ఉన్న జనరల్ బోగీను ఏర్పాటు చేశారు.

రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవు

యార్డ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంతో రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించాయని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, మేనేజర్ చిన్నప్పరెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు	
వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	100
రిటైల్	122
లేయర్	112
బ్రాయిలర్	177
బ్రాయిలర్ స్కిన్ లెస్	201
లేయర్ మాంసం	190

రైలు దోపిడీ దొంగల అరెస్టు

రెండు కత్తులు, కట్టర్ల స్వాధీనం

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: రైల్వే సిగ్నల్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రైలు ప్రయాణికులను దోచుకునే మహారాష్ట్రకు చెందిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్టు చేశారు. చిత్తూరు పోలీసు అతిథిగృహంలో గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ రాహుల్ మీనా మీడియాకు వివరాలు వెల్లడించారు. 'చిత్తూరు గ్రామీణ మండలం సిద్ధంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జూన్ 26న చామరాజనగర్ ఎక్స్‌ప్రెస్ దోపిడీ ఘటనను సవాలుగా తీసుకుని రెండు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టాం. దొంగలు మామండూరు, ముంగిలిపట్టులో రెండుసార్లు, తాడిపత్రి, సిద్ధంపల్లి వద్ద దోపిడీకి పాల్పడ్డారు. పూతలపట్టు, మంత్రాలయం, అలంపూర్‌లో విఫలయత్నం చేశారు. పక్కా సమాచారంతో నిందితులను ఆదివారం రేణిగుంటలో అరెస్టు చేశారు. వీరిని మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాకు చెందిన జలిందర్ మహిర్యా పవార్(50), పుణే జిల్లాకు చెందిన కోహినూర్ నవనత్ పవార్(24)గా గుర్తించాం. విచారణలో పదుల సంఖ్యలో దోపిడీలకు పాల్పడినట్లు తేలింది. రైలు సిగ్నల్ ట్యాంపరింగ్‌తో పాటు చైన్ లాగి రైళ్లను ఆపి కత్తులు చూపి ప్రయాణికులను దోచుకున్నట్లు వారు అంగీకరించారు. వీరి ద్దరి నుంచి రెండు వైర్ కట్టర్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నాం. దోపిడీ ముఠాలో మరికొందరు ఉన్నారు' అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసు ఛేదనకు కృషి చేసిన తిరుపతి డీఎస్పీ హర్షిత, రేణిగుంట, కడప ఇన్‌స్పెక్టర్లు యతీంద్ర, సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు ప్రవీణ్ కుమార్, రవి, గోపాల్, ధర్మేంద్రరాజు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

EENADU Classifieds

HEALTH & CARE
శ్రీ విష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: Dr. K. కీర్తన గారిచే పురిటి బిడ్డల & చిన్నపిల్లల వైద్యనిపుణులు 24x7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి. ✆ 63035 53359.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దగ్గర TCL కంపెనీకి ఎదురుగా ఇంటి నిర్మాణానికి అనువైన అన్ని వసతులతో TUDA అప్రూవ్డ్ ప్లాట్స్ తక్కువ ధరకు కలవు. ✆ 82470 75857, 94943 92069.
అతి తక్కువ ధరల్లో, 46 సులభ వాయిదాల్లో, తుడా / డిటిసిపి అప్రూవ్డ్, స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు: 91145 61456.
వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో తిరుపతి రోడ్డుకి Tuda అప్రూవల్ లేఅవుట్‌లో Plots, 1 Sq.ft కమర్షియల్ Rs.1650, రెసిడెన్షియల్ Rs.1125. Contact: 99660 66111.

LEASE/ RENT
GENERAL
తిరుపతి - బైరాగిపట్టెడ, 1170 sft, గ్రౌండ్ ఫ్లోర్, ఆఫీసెస్/ SPA/ ఏజెన్సీస్/ స్టాకిస్ట్‌లకు అనువుగా ఉంటుంది. Opp: సారా హాస్పిటల్. Cont: ✆ 91002 98051. Available from Oct-2025.

JOBS
WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. ✆ 93925 13633.
తిరుపతిలో శ్రీ లక్ష్మీనరసింహ గ్యాస్ ఏజెన్సీ, ఆవిలాల టూవీలర్ వెహికల్ ఉండి గ్యాస్ డెలివరీ చేయుటకు బాయ్స్ (Sal: 18K to 25K) ఆటో డ్రైవింగ్ తెలిసినవారు గ్యాస్ డెలివరీ చేయుటకు కావలెను & Office Staff కావలెను. Cont: ✆ 91333 31415, 97052 25444.
తిరుపతిలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు మేనేజర్, ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. Salary Negotiable. ✆ 97015 10490.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు పలు కళాశాలల్లో మాదకద్రవ్యాల నిరోధకంపై విద్యార్థులకు అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ ప్రతులను సోమవారం ఆవిష్కరించారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విభాగం డైరెక్టర్ డా.మురళీధర్, కోఆర్డినేటర్ డా.పత్తిపాటి వివేక్ తెలిపారు. ఇందుకు కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ

తిరుమల: శ్రీవారిని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిమూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో ఎంపీ బైరెడ్డి శబరి

డ్వాక్రా సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల పేరుతో బ్యాంకు నుంచి కోట్లాది రూపాయల సొమ్ము స్వాహా చేసిన ఆర్పీ లతపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బైరాగిపట్టెడలోని ఇండియన్ బ్యాంకు ఎదుట సీపీఐ, వైకాపా సంయుక్త ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు ధర్నా నిర్వహించారు. ఏడాదిగా ఆర్పీ లత సంఘాల పేరుతో రుణాలు తీసుకొని చెల్లించకపోవడంతో సభ్యులు చెల్లించిన నగదును సైతం బ్యాంకు సిబ్బంది సహకారంతో స్వాహా చేశారన్నారు. బ్యాంకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో లక్షలాది రూపాయలు సొంతానికి వాడుకున్నట్లు ఆరోపించారు. ఆమె స్వాహా చేసిన నగదును బ్యాంకు అధికారులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రజలందరి సంక్షేమమే తెదేపా లక్ష్యం

పాకాల, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమమే తెదేపా లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా సోమవారం మండలంలోని పంటపల్లి పంచాయతీ జయదేవపురం కాలనీలో పర్యటించారు. అనంతరం కుందేటిపల్లికి వెళ్లి అధికారుల సమక్షంలో ప్రజల సమస్యలపై చర్చించారు. తెదేపా మండల కన్వీనర్ నాగరాజనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షురాలు సావిత్రి, ఏఎంసీ అధ్యక్షుడు సుధాకరయ్య, మాజీ ఎంపీపీ చాముండేశ్వరి పాల్గొన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటుకు కె.వడ్డేపల్లి రెవెన్యూ గ్రామం, ఆదెనపల్లి పంచాయతీ పరిధిలో సుమారు 60 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దారు సాయిసంతోష్ పాల్గొన్నారు.

ఆదెనపల్లి వద్ద స్థల పరిశీలనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని

నేడు ఎమ్మెల్యే పర్యటన.. యర్రావారిపాలెం : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా యల్లమంద, ఉస్తికాయలపెంట గ్రామాల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం పాల్గొంటారని ఎంపీడీవో మదనమోహన్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన నాయకుడు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆయన్ని సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

మంత్రి నారా లోకేశ్‌కు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న హేమాంబరధరరావు

నగరపాలిక కమిషనర్‌కు 43 వినతులు

తిరుపతి(నగరపాలిక): నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం 43 వినతులు అందాయి. కమిషనర్ ఎన్.మౌర్య ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిలో 90 శాతం అక్కడికక్కడే పరిష్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి మోడరన్ పెంటథ్లాన్ లేజర్ రన్ 2025-26 ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. నరసరావుపేటలోని కోడెల శివప్రసాద్ స్టేడియంలో ఈనెల 12, 13న పోటీలు జరిగాయి. తిరుపతికి చెందిన జి.పవన్‌కల్యాణ్, కె.పుణీత్, కె.మోహిత్ రజతాలు సాధించారని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనిక తెలిపారు. వీరు ఆగస్టులో బిహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

గజగజ.. వణుకుతున్న గ్రామాలు

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా వైపు వెళ్లిన ఏనుగుల గుంపు నుంచి విడిపోయిన ఒంటరి ఏనుగు ప్రస్తుతం తలకోన పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండంతో సమీప గ్రామాల ప్రజలు బేంబేలెత్తిపోతున్నారు. పొలాల వైపు వెళ్లడానికి సంకోచిస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఆవులయ్యగారిపల్లి, కోటకాడపల్లి, వలసపల్లి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు సెక్షన్ అధికారి మునస్వామి నాయక్ తెలిపారు. రాత్రిపూట ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని రైతులకు సూచించారు.

బాలుర కళాశాలలో ఘర్షణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో సోమవారం విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. వాలీబాల్ ఆడుతుండగా ఇరు జట్లు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తిరుపతి గ్రామీణ మండలం పుదిపట్ల పంచాయతీకి చెందిన ఓ విద్యార్థి.. తమపై కొందరు దాడి చేశారంటూ తన అన్న గోపాలకృష్ణకు ఫోన్ చేయగా అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతను కళాశాలలోకి ప్రవేశించి హల్‌చల్ చేశారు. అడ్డొచ్చిన అధ్యాపకులు, విద్యార్థులపై వీరంగం సృష్టించారు. కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీప్రకాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కళాశాలకు చేరుకుని గొడవలకు పాల్పడిన గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

చంద్రగిరి, న్యూస్‌టుడే: తొండవాడ సమీపంలోని స్వర్ణముఖినది వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వాహన చోదకుడు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. బెంగళూరు నుంచి తిరుపతికి స్టీల్ సామగ్రి లోడుతో వస్తున్న వాహనం టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి జాతీయ రహదారుల మధ్యన ఉన్న డీవైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కనుమ రహదారిలో..

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: భాకరాపేట కనుమ రహదారిలో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తల్లీకుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతి నుంచి భాకరాపేటకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మదనపల్లి నుంచి తిరుపతికి వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలానికి చేరుకునే సమయానికే క్షతగాత్రులు ద్విచక్ర వాహనంతో వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్ ఢీకొనడంతో విరిగిపోయిన నియంత్రిక

నియంత్రికను ఢీకొన్న టిప్పర్

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: చిగురువాడ వద్ద టిప్పర్ ఢీకొనడంతో సోమవారం నియంత్రిక కూలిపోయింది. ఉదయం టిప్పర్ మట్టి లోడ్డుతో వస్తూ గ్రామ ముఖద్వారం వద్ద ఉన్న నియంత్రికను ఢీకొనడంతో స్తంభం రెండుగా విరిగి కిందపడిపోయింది. ఆ సమయంలో ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు కూపుచంద్రపేట ఉపకేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సరఫరా ఆపేశారు. డ్రైవర్‌కు అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరగలేదు. రాత్రి 8 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు

తిరుపతి (లీగల్): నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ముగ్గురు వాహన చోదకులకు రెండురోజుల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. ట్రాఫిక్ డీఎస్పీ పర్యవేక్షణలో వాహన తనిఖీలు చేపట్టగా 17 మంది చోదకులు మద్యం తాగినట్లు గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. మిగిలిన 14 మంది నిందితులకు రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

తుడా స్పందిస్తేనే కష్టాలు తీరేది

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: మంగళం పరిధిలో కీలకమైన తుడా క్వార్టర్స్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. తిరుమలనగర్ పంచాయతీలో భాగమైన శ్రీవేంకటేశ్వర హిల్‌వ్యూ తుడా ఫ్లాట్లు రెండు విడతల్లో నిర్మించారు. ప్రతి ఫేజ్‌లో ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ కాలనీలు ఉన్నాయి. పంచాయతీకి ఇంటిపన్ను, రిజిస్ట్రేషన్ల రూపంలో పెద్దఎత్తున ఆదాయం సమకూరుతున్నా గత పాలకులు పట్టించుకోకపోవడంతో స్థానికులు వాపోతున్నారు.

తుడా క్వార్టర్స్‌లో ప్రధాన భూమికను పోషించే ఎంఐజీ, హెచ్ఐజీ క్వార్టర్స్ పాలకులు, అధికారుల విస్మరణకు గురయ్యాయి. రెండింటిలో సుమారు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్నాయి. ఏకాలనీలో చూసినా సీసీరోడ్లు, కాలువల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. కంకరతేలి ముళ్లకంపలతో నిండి ఉన్నాయి. స్థానికంగా రెండేళ్లుగా ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. పెద్దస్థాయిలో బహుళ నివాస సముదాయాల నిర్మాణం జరుగుతోంది. ఎక్కువగా పీజీలు ఏర్పాటు చేశారు. విశ్రాంత ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, తితిదే ఉద్యోగులు ఉన్నారు. కొందరు అధికారులు పట్టుబట్టడంతో టీటీరోడ్లు వేసినా సీసీరోడ్లు, కాలువల నిర్మాణం విస్మరించారు. సచివాలయాలు, పంచాయతీ కార్యాలయం ఇక్కడే ఉండటం గమనార్హం.

వరద నీటితో సతమతం

వర్షాకాలం వచ్చిందంటే తుడా క్వార్టర్స్‌లో ఆందోళన మొదలవుతుంది. ఎత్తయిన ప్రాంతంలో ఉన్నప్పటికీ శేషాచలం నుంచి వచ్చే వరదనీరు వీధుల్లో భారీగా ప్రవహిస్తుంది. మూడు కాలనీల్లో తుడా వెంచర్లు ఏర్పాటు చేసిన సమయంలో నిర్మించిన వరద కాలువలు పూర్తిగా కనుమరుగయ్యాయి. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుని వరదకాలువల మరమ్మతు, పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానికులు ఇదే విషయాన్ని ఎమ్మెల్యే పులివర్తినాని దృష్టికి తీసుకుని వచ్చారు. తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డికి విన్నవించిన నేపథ్యంలో అధికారులు స్పందించాల్సి ఉంది.

ఎంఐజీలో పక్కా రోడ్డుకు నోచుకోని వీధి

స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారంపై అభినందనలు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే : స్వచ్ఛ సర్వేక్షన్- 2024 పోటీల్లో నగరం స్వచ్ఛ సూపర్ లీగ్ విభాగంలో పురస్కారం సాధించడంపై నగరపాలిక ఉపమేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్ నరసింహచారి హర్షం వ్యక్తం చేశారు. నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్యను సోమవారం అభినందించి సత్కరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నగరంలో పరిశుభ్రతను పెంపొందిస్తున్నారని కొనియాడారు.

కమిషనర్ మౌర్యను అభినందిస్తున్న ఉపమేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ తదితరులు

ప్రతి కుటుంబంలో సంతోషం

కరపత్రాలతో సుగుణమ్మ, పనబాక లక్ష్మి తదితరులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని తెదేపా నేతలు పనబాక లక్ష్మి, ఎం.సుగుణమ్మ అన్నారు. సోమవారం 44వ డివిజన్ సుందరయ్య నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

వెండి యజ్ఞోపవీతం వితరణ

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారి అనబంధ ఆలయమైన శ్రీసూర్యనారాయణ స్వామివారికి సోమవారం విజయనగరానికి చెందిన ధనలక్ష్మీ జ్యువెలరీస్ తరపున వెండి యజ్ఞోపవీతం, పంచపాత్రలను కానుకగా అందజేశారు. ఏఈవో దేవరాజులు, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకుడు బాబుస్వామికి దాత తన కుటుంబ సభ్యులతోకలిసి అందజేశారు. వాటి ఖరీదు రూ.1.60 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

ఏఈవో దేవరాజులు, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు పంచపాత్రలు అందజేస్తున్న దాత

ఆలయ నిర్వహణపై వివాదం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీనివాసమంగాపురంలోని శ్రీఒస్కోటాలమ్మ (శ్రీకనకదుర్గమ్మ) ఆలయ వివాదం సోమవారం కొనసాగింది. స్థానికులు అమ్మవారికి పొంగళ్లు పెట్టడం, సారెలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో చందాలు వేసుకుని జాతర నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం రంగులు వేయిస్తుండగా తిరుపతి నుంచి వచ్చిన సింగ్‌వంశస్థులకు చెందిన మహిళలు పనులు అడ్డుకుని గేటుకు తాళాలు వేయడంతో స్థానికులు నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ ఇమ్రాన్‌బాషా, ఎస్సై అనితలు ఇరువర్గాల వారిని సముదాయించి తాళాలు తెరిపించారు. సమస్యపై మంగళవారం డీఎస్పీ ప్రసాద్ సమక్షంలో చర్చించాలని నిర్ణయించారు.

ప్రవీణ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న స్విమ్స్ సంచాలకులు, వైద్యులు

అత్యవసర వైద్యుల సేవలు వెలకట్టలేనివి

తిరుపతి (వైద్యవిభాగం): ఆపత్కాలంలో చికిత్సకు వచ్చే రోగులకు సేవలందించే ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వైద్యుల కృషి వెలకట్టలేనిదని లెఫ్టినెంట్ కర్నల్, ప్రజారోగ్య నిపుణులు డా.ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్విమ్స్ - ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్వీ కుమార్, డీన్ అల్లాడి మోహన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వనజాక్షమ్మ, ఎంఎస్ రామ్, ప్రిన్సిపల్ ఉషాకళావత్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్-15 ఓపెన్, బాలికల చదరంగం పోటీల్లో తిరుపతికి చెందిన క్రీడాకారిణి వంటి శ్రీగురువర్షిణి ప్రతిభ కనబరిచింది. ఈనెల 12, 13న విశాఖపట్నం వేదికగా జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో 7 రౌండ్లకు 6 పాయింట్లతో నాలుగో స్థానం సాధించి రూ.5వేల నగదు బహుమతి, ట్రోఫీ అందుకుంది. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనుంది.

క్రీడా పాఠశాలకు ఎంపికలు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ పేర్కొన్నారు. జిల్లా నుంచి మొత్తం 16 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా స్థానిక ఎస్వీయూ స్టేడియంలో ఎంపిక పోటీలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకర బ్యానర్ తొలగింపు

ఈనాడు, తిరుపతి: ఎమ్మార్‌పల్లి పోలీసు స్టేషన్ వద్ద అవిలాల కూడలిలో స్తంభానికి ఏర్పాటు చేసిన ప్రచార బ్యానర్‌ను సిబ్బంది తొలగించారు. రహదారిలో వాలిపోయి ప్రమాదం పొంచి ఉండగా ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి తొలగించే ఏర్పాటు చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

ఒంటిమిట్టలో అన్నప్రసాద వితరణకు చర్యలు: ఈవో

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి ఆలయంలో భక్తులకు పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు చర్యలు చేపట్టాలని తితిదే ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. స్థానిక తితిదే పరిపాలనా భవనంలో జేఈవో వీరబ్రహ్మంతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆలయం వద్ద తాత్కాలికంగా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేసి ఆగస్టు నుంచి అన్నప్రసాదాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్, అన్నప్రసాదాల విభాగం అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

హమ్మయ్య.. జీతాలు పడ్డాయి

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: గత మాసం జీతం ఎప్పుడెప్పుడు వస్తుందా అంటూ ఎదురుతెన్నులు చూసిన ఎస్వీయూ ఉద్యోగులకు ఎట్టకేలకు ఊరట లభించింది. సోమవారం విశ్రాంత, టైంస్కేల్, శాశ్వత ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు నగదు జమకావడంతో ఉద్యోగుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.45 కోట్ల గ్రాంటు విడుదల కావడంతో ఉద్యోగుల జీత భత్యాల నిమిత్తం రూ.18 కోట్లు చెల్లించారు. దీంతో జులై జీతం సకాలంలో చెల్లించేందుకు ఢోకా లేదని వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: వినాయక సాగర్‌లో వెలసిన సంకల్పసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ పురోహితుడు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త కొండే చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్, నాదమునరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శాంతిప్రియ పాల్గొన్నారు.

ఆర్సీపురం తహసీల్దారుగా మధుసూదనరావు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఆర్సీపురం ఇన్‌ఛార్జి తహసీల్దారుగా కలెక్టరేట్లో డి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న యు.మధుసూదన్‌రావుని నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. తెదేపా నాయకులు, పలువురు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

చేతివృత్తులతోనే ఆర్థికాభివృద్ధి

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: చేతివృత్తులతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని రాస్ జన్‌శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ మోహన్ పేర్కొన్నారు. శివజ్యోతినగర్‌లో సోమవారం మహిళలకు బ్యూటీషియన్ కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభించారు. అనంతరం శిక్షణకు కావాల్సిన ముడిసరకులు అందించారు. రాస్ ఫీల్డ్ ఆఫీసర్ బాలాజీ, డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డి, గీత, రాజేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

In The Court of the prl. Junior Civil Judge, Tirupati.
E.A.No.108/2024,
O.E.P.No. 42/2022

R.Dasaradharami Reddy (died) & Others ...D.Hr
Vs
K.Geetha ...J.Dr

Notice to the J.Dr

K.Geetha W/o K.Venkatamuni Achari, D.No.1-61, Thanapalli Village, Tirupati Rural Mandal, Tirupati (Dist).

పై కనిన పిటిషన్‌లో J.Drకు నోటీసు నిమిత్తం తేది. 22.07.2025 ఉ॥10.30 గం॥లకు పై కనిన J.Dr పై కనిన కోర్టులో హాజరై సమాధానం చెప్పుకోవలసి నదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రానియెడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 22.07.2025

P.PRABHAKAR NAIDU
Advocate, Tirupati

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! నా క్లయింట్స్ 1) వి.వినోద్ చైతన్య S/o వి.భరత్‌నాథ్‌రెడ్డి 2) ఇ.వైష్ణవి W/o వినోద్ చైతన్య, తిరుపతి అనువారు క్రింద షెడ్యూలు దాఖలా ఆస్తిని 1) డి.ఇందుమతి W/o డి.గోవర్ధన నాయుడు 2) డి.బిందుమాధవి D/o డి.గోవర్ధన నాయుడు 3) రుక్మిణమ్మ W/o లేట్ బి.చెంగల్రాయ నాయుడు, శ్రీనివాసపురం, తిరుచానూరు రోడ్ & పోస్ట్, తిరుపతి రూరల్ మండలం అనువారల దగ్గర కొనుగోలు చేయుటకు అగ్రిమెంట్ పొందియున్నారు. సదరు ఆస్తిని నా క్లయింట్స్ కొనుగోలు చేయుటలో ఎవ్వరికైననూ ఏలాంటి అభ్యంతరములు వున్న యెడల 7 రోజులలోగా తమ అభ్యంతరముల ను క్రింది అడ్రసుకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. ఆ తర్వాత వచ్చు అభ్యం తరములు పరిగణలోనికి తీసుకొనబడవు.

షెడ్యూలు: తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామ లెక్కదాఖలా 1) సర్వే నెం.418/2ఎలో ఎ. 0-62½, 2) సర్వే నెం. 418/3ఎ&బిలో ఎ. 0-09, 3) సర్వే నెం. 418/4లో ఎ. 0-14, 4) సర్వే నెం. 418/5బిలో ఎ. 0-30, 5) సర్వే నెం. 418/6లో ఎ. 0-42, 6) సర్వే నెం. 418/7లో ఎ. 0-46 మొత్తం 2-03½ సెంట్లు.

ఎల్.మధుసూధన్‌రెడ్డి
అడ్వకేట్,
డి.నెం.9-432జి, లింగేశ్వర్ నగర్, అవిలాల, తిరుపతి
సెల్: 9848175467, 9848075467



తలనీలాల వేలంలో రూ.5.81 లక్షల ఆదాయం

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాది వ్యవధికి ఆలయంలో తలనీలాలు సేకరించు కునేందుకు హిల్‌పేటకు చెందిన శరవణ పెరుమాళ్ రూ.5.81 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. పార్కింగ్, దుకాణాల నిర్వహణ రుసుముల వేలం వాయిదా పడింది. వేలాన్ని గుడిమల్లం ఆలయాధికారి రామచంద్రారెడ్డి, ఈవో హేమచంద్రరావులు పర్యవేక్షించారు.

మండలాధ్యక్షుడిగా రవిరాయల్

పిచ్చాటూరు: రాయల్ పీపుల్ ఫ్రంట్ పిచ్చాటూరు మండలాధ్యక్షుడిగా రవిరాయల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ ఎన్నికలను సోమవారం ఆర్పీఎఫ్ వ్యవస్థాపకుడు రెడ్డిరాజశేఖరరాయల్ అధ్యక్షతన కాలనీలో నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షునిగా మురళిరాయల్, రాజశేఖరరాయలు ఎన్నికయ్యారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

పట్టాలు పంపిణీ చేయాలి

శ్రీకాళహస్తి(గ్రామీణ)(ఏర్పేడు): యానాదులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) కార్యదర్శి హరికృష్ణ తెలిపారు. ఎల్లంపల్లి ఎస్టీ కాలనీలో సోమవారం సమావేశం నిర్వహించారు. 28ఏళ్లుగా ఎస్టీలు భూములను సాగుచేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి(గ్రామీణ)(ఏర్పేడు), న్యూస్‌టుడే: సమస్య: శ్రీకాళహస్తి మండలంలోని బీవీపురం పరిసర ప్రాంతంలో విద్యుత్తు కోతలు అధికంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనధికార కోతలతో పంటలు ఎండుతున్నాయి. అధికారులు స్పందించాలి. - వెంకటేష్, గొల్లపల్లి

సమాధానం: తీగలు మరమ్మతులకు గురికావడంతో విద్యుత్తు సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడింది. ఇకపై ఇలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - సుబ్రహ్మణ్యం, విద్యుత్తుశాఖ ఏడీఈ

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని వెల్లూరు కండ్రిగ గ్రామంలో మురుగు నీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలువల్లో వ్యర్థాలు తొలగించడం లేదు. మురుగు అక్కడే నిలిచి దుర్గంధంతో పాటు దోమల బెడద పెరిగింది. - పట్టాభి, స్థానికుడు

సమాధానం: వెంటనే పరిశీలించి కాలువలు శుభ్రం చేయిస్తాం. నీరు పారుదల జరిగేలా చర్యలు తీసుకుంటాం. -అరుణ, ఎంపీడీఓ, నారాయణవనం

మీటల ఏర్పాటు

నారాయణవనం, న్యూస్‌టుడే: వీధిదీపాలు నిరంతరం వెలుగుతుండగా ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. మండలంలోని చిత్తూరు కండ్రిగ ఎస్టీకాలనీలోని ఈ సమస్యపై 'ఈనాడు'లో మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి మురళి, విద్యుత్తు శాఖ అధికారులు వెంటనే మీటలు ఏర్పాటు చేశారు.

కాలువ శుభ్రం

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పంచాయతీలోని వేణుగోపాలపురం వద్ద ఉన్న పెద్ద కాలువను పంచాయతీ అధికారులు సోమవారం శుభ్రం చేయించారు. ఇక్కడి కాలువ దుస్థితిపై సోమవారం 'ఈనాడు'లో 'అస్తవ్యస్తంగా మురుగు కాలువ' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దుష్ప్రచారాలపై చర్యలు తీసుకోండి

డీఎస్పీ నరసింహమూర్తికి వినతి పత్రాన్ని అందజేస్తున్న తెదేపా నేతలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై కొందరు సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలంటూ తెదేపా శ్రేణులు సోమవారం తెదేపా మీడియా సమన్వయకర్త దుర్గాప్రసాద్ నేతృత్వంలో పలువురు నేతలు డీఎస్పీ నరసింహమూర్తిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బాలాజీరెడ్డి, ఖాదర్, వినయ్, సాయి పాల్గొన్నారు. రేణిగుంట: కోట వీధుల, ఆమె ఫ్రెష్ కోట చంద్రబాబు చేసిన దుష్ప్రచారాలను ప్రచారం చేస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని తెదేపా నాయకులు కోరారు. సోమవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. మునిచంద్రశేఖర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి ఉన్నారు. ఏర్పేడు: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేయడం తగదని మండల తెదేపా నాయకులు ఏర్పేడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షులు నాగరాజునాయుడు, పొన్నారావు, ధనంజయులునాయుడు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి(గ్రామీణ)(ఏర్పేడు), న్యూస్‌టుడే: పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లి చెరువు వద్ద ఆదివారం అర్ధరాత్రి లారీ బోల్తాపడిన ఘటనలో మృతిచెందిన కూలీల కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ తెలిపారు. గుండ్లపల్లి, కంచరగుంట ఎస్టీకాలనీకి చెందిన శ్రీను, చిట్టెమ్మ మృతదేహాలకు సోమవారం నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించి మాట్లాడారు. ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మురుగునీటిని పరిశీలిస్తున్న తెదేపా నేతలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెదేపా పట్టణ కమిటీ అధ్యక్షులు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డు బృందమ్మ కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని మురుగు సమస్యను గృహస్థులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంఠా రమేష్, భాస్కర్‌గౌడ్, ఆనంద్, నాగరాజు పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

సాగు జలాలు ఇక భద్రం

రామాపురం చెరువుకు గత వర్షాకాలంలో పడ్డ భారీ గండి

తాజాగా రివిట్‌మెంట్‌తో పనులు పూర్తి చేసిన జలవనరుల శాఖ అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో చెరువుల బాగోగులు పూర్తిగా గాలికి వదిలిపెట్టేశారు. అంతేకాకుండా అప్పట్లో అదుపు లేకుండా మట్టి తరలింపు చేపట్టడంతో చెరువు కట్టల పటిష్ఠత ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు శ్రీకాళహస్తి మండలం రామాపురం చెరువుకు పెద్ద గండి పడింది. చెరువు నిండా నీళ్లు చేరడంతో కట్ట తెగిపోయింది. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

మొదట తాత్కాలిక మరమ్మతులు

చెరువు నిండుగా చేరిన నీళ్లన్నీ వృథా అవుతాయని, పంటలు పండించుకోవడానికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో రోజుల వ్యవధిలో జలవనరుల శాఖ అధికారులు ఆయకట్టు రైతుల సహకారంతో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా ఉంగరపు కట్ట ఏర్పాటు చేసి నీటిని ఒడిసిపట్టారు. దాదాపు 450 ఎకరాలు ఆయకట్టు రైతులు రైతులు ఇక్కడి జలాలతో సాగు పూర్తి చేసుకున్నారు.

శాశ్వత పనులతో

చెరువులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో శాశ్వతంగా కట్టను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే ఇచ్చిన సూచనలతో జలవనరుల శాఖ ఈఈ శివారెడ్డి, ఏఈ రాఘవేంద్రల సంయుక్త పర్యవేక్షణలో శాశ్వత పనులకు శ్రీకారం చుట్టారు. రూ.7 లక్షలతో శాశ్వతంగా గండి పడిన చోట పక్కా రివిట్‌మెంట్ చేపట్టారు. లీకేజీలకు అవకాశం లేకుండా పనులు చేపట్టడం పట్ల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సన్నిధివీధిలో ముక్కంటి ఆలయానికి వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఆర్చీ

ద్వారం బోసిపోయిన వైనం

శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది రాహుకేతు పూజల కోసం వచ్చిన వారే. గతంలో ఇక్కడి నుంచి దిగువ సన్నిధి వీధి గుండా ముక్కంటి ఆలయ దర్శనార్థం వెళ్లేవారు. గతంలో ఇక్కడ ఒకే ఆర్చీ ఉండేది. అయితే గతేడాది నవంబరులో కురిసిన వర్షాలకు ఆర్చీ దెబ్బతినడంతో పూర్తిగా తొలగించారు. మళ్లీ నెలలు గడుస్తున్నా కనీసం ఆలయానికి వెళ్లే మార్గం అన్న సూచిక కూడా లేకుండా పోయింది. ఇదే అదనుగా ప్రైవేటుగా ఇక్కడ సూచిక ఏర్పాటు ఎక్కువైపోతోంది. భక్తులు ఆలయానికి వెళ్లేందుకు వీలుగా ఆర్చీ సూచికలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఆర్చీ లేక బోసిపోయిన దిగువ సన్నిధివీధి

విభూదీశునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

సంకటహర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

విభూదీశునికి విశేషాభిషేకాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోకొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగానికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సంకల్పపూజలు జరిపారు. ధూప, దీప, నివేదనాది కైంకర్యాలు చేపట్టారు. శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంకటహర హోమాన్ని ఆగమోక్తంగా జరిపారు. విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలోని అంజిఅంజి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం సంకల్ప పూజలు నిర్వహించారు

ఎస్టీలకు ఇంటి పట్టాల అందజేత

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని పట్టాభి ఎస్టీకాలనీకి చెందిన 20 మందికి తహసీల్దారు శ్రీదేవి సోమవారం ఇంటి నివేశన పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకునేందుకు పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనతంరం అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ పథకానికి అర్హత పొందేందుకు 526 మందికి ఆధార్ సరిగా లేవని, 579 మంది చనిపోయిన వారికి బదులుగా వారి వారసులు తగిన పత్రాలు సమర్పించి నమోదు చేయించుకోవాలన్నారు. వీఆర్వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మహాకుంభాభిషేకం

నాగలాపురం: కస్తూరినాయుడుకండ్రిగలో నూతనంగా నిర్మించిన వినాయకుని ఆలయ మహాకుంభాభిషేకాన్ని సోమవారం వేడుకగా నిర్వహించారు. పవిత్ర జలాలను సంప్రోక్షణ చేశారు. కలశాలతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అర్చకులతో కలిసి ఆలయ ప్రదక్షిణ చేశారు. ఏర్పాట్లను గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

గ్రీవెన్సు డేలో దివ్యాంగుడి కష్టాలు

సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్సుడేకు వరదయ్యపాళెం మండలం సంతవేలూరు హరిజనవాడకు చెందిన కాంబాకం కోటేశ్వరరావు వచ్చారు. అతను దివ్యాంగుడు. రెండు కాళ్లు పనిచేయవు. దాంతో మొదటి అంతస్తులో ఉండే కార్యాలయానికి వెళ్లేందుకు మెట్లు ఎక్కలేక అవస్థలు పడ్డారు. ఈలోగా అటుగా వస్తున్న ఇరువురు అతను ఎక్కేందుకు సాయమందించారు. తనకు కువ్వాకుల్లి రెవెన్యూ పరిధిలో 1.83 ఎకరాలు ఉందని, ఆ భూమికి సంబంధించి వన్‌బీ రావడం లేదని, ఆ విషయాన్ని చెప్పుకొనేందుకు వచ్చినట్లు ఆయన వివరించారు. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

కేంద్రసహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలేతో ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీ, అధికారులు

మౌలిక సదుపాయాలు పెంపొందించండి

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ(ఐసర్)లో మౌలిక సదుపాయాలు పెంపొందించాలని రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలేకు విన్నవించారు. సోమవారం దిల్లీలో మంత్రిని కలసి తితిదే తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఐసర్‌లో ఇప్పటికే ఉన్న వసతులతో పాటు మరికొన్ని విద్యా, పరిశోధన మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు పర్యావరణ మంత్రిత్వశాఖ సహకారం అవసరమని కోరారు.

పక్కకు వెళ్తే.. ప్రమాదమే

నియోజకవర్గంలో పలు రహదారులు, వంతెనలు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులలో చలనం కరవైంది. మండల కేంద్రంలో కడూరు కర్ణానదిపై వంతెనకు రక్షణ గోడ ఇటీవల కూలింది. ఓ భారీ వాహనం అదుపు తప్పి గోడను ఢీకొట్టడంతో రక్షణ లేకుండా పోయింది. అదృష్టవశాత్తు ఆ వాహనం నదిలో పడలేదు. నిత్యం రద్దీ ఉండే రహదారి కావడంతో రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. - న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

పడిపోతుంది.. పట్టించుకోండి

విద్యుత్తు స్తంభం ఓ పక్కకు ఒరిగిపోయి పడిపోయే స్థితిలో దర్శనమిస్తోంది. మండలంలోని చోడవరం గ్రామంలోని దేశమ్మ ఆలయం సమీపంలో పంట పొలాల మీదుగా 33కేవీ విద్యుత్తు సరఫరా లైను వెళ్తుంది. ఇందులో ఓ స్తంభం ఒరిగిపోయింది. వర్షాలకు కూలితే ప్రాణ నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. దాంతో పాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం తలెత్తుతుంది. అధికారులు స్తంభాన్ని పక్కాగా నిలబెట్టి పురుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొట్టంబేడు

నిర్మించారు.. వదిలేశారు

మండలంలోని ఈశ్వర ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్డి ప్రారంభించలేదు. స్థానిక అధికారుల నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీన్ని వినియోగించకుండా తాళం వేయడంతో చిన్నారులు మలమూత్ర విసర్జనకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నారాయణవనం

సత్యవేడులో అన్న క్యాంటీన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

తెదేపాతోనే పేదల అభ్యున్నతి

సత్యవేడు, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతి కోసమే ఆవిర్భవించిన తెదేపా పాలనతోనే సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నాంది పలికిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం స్థానిక ఆత్మ కార్యాలయ సమీపంలో నూతనంగా మంజూరైన అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్నారు. అనంతరం దళవాయి అగ్రహారంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. తహసీల్దారు రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పార్టీ పదవిలో ఉన్నవారికి అధికారులు ప్రోటోకాల్ పాటించడం, సెల్యూట్ కొట్టడమేంటని అధికారులు, పోలీసుల తీరుపై మండిపడ్డారు. తెదేపా పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్ రెడ్డిని నియమించిందని, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించలేదని అన్నారు.

డీలరుపై చర్యలకు తీసుకోవాలి

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పంచాయతీలో వృద్ధుల ఇళ్ల వద్దకు రేషన్ పంపిణీని డీలరు చేయటం లేదని పల్లికొండేశ్వరాలయ ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు నాగేశ్వరరావు ఆరోపించారు. 74 సంవత్సరాల వయసులో పలువురు వృద్ధులకు డీలరు రేషన్‌ను ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వృద్ధులకు అందించిన సదావకాశాన్ని డీలరు నియంతృత్వ పోకడలతో నాశనం చేస్తున్నారన్నారు. డీలరుపై చర్యలు తీసుకుని వృద్ధుల ఇండ్ల వద్దకు రేషన్ సరఫరా చేయాలని ఆయన కోరారు.

క్రీడల్లో సత్తా చాటాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: క్రీడల్లో యువత జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని తెదేపా మండల ఉపాధ్యక్షుడు విష్ణు కోరారు. మండలంలోని తొండూరులో నాలుగు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంటు పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 15 జట్లు పాల్గొనగా, తుది పోటీల్లో రూల్స్ బ్రేకర్స్ జట్టు విజేతగా నిలిచి రూ.20 వేల నగదు బహుమతి అందుకుంది. తొండూరు జట్టు రూ.15వేల బహుమతితో ద్వితీయస్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో టీసీసీ నాని లెవన్ జట్టు రూ.10 వేల బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు దాత విష్ణు, సర్పంచి ఎలావూరు రమణ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.

బహుమతి అందిస్తున్న దాత విష్ణు, సర్పంచి రమణ

సర్వీసు నిబంధనలు వర్తింపజేయండి

శ్రీకాళహస్తి: విద్యుత్తు శాఖ ఎనర్జీ అసిస్టెంట్ జూనియర్ లైన్‌మెన్‌కు పాత సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మునిహరికృష్ణ, సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య కోరారు. ఉద్యోగుల అసోసియేషన్ తరఫున సోమవారం డిస్కం గ్రామీణ ఏడీఈ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు వివరించారు. అశోక్, శ్రీనాథ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

సీఐ గోపికి వినతి పత్రం అందజేస్తున్న జనసేన ఉమ్మడి జిల్లాల నాయకులు

శ్రీకాళహస్తి: సామాజిక మాధ్యమాల్లో ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ జనసేన నేతలు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి నేతృత్వంలో పలువురు నాయకులు సోమవారం పట్టణ సీఐ గోపికి వినతి పత్రాన్ని అందజేశారు. పార్టీ ప్రతిష్ఠను దిగజార్చుతూ జరిగిన దురదృష్ట ఘటనలు పవన్ కల్యాణ్‌కు ఆపాదించడం సరికాదన్నారు. కుమార్, మహేష్, చంద్ర, కవిత, చిరంజీవి పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ అడ్డగింత

డీఈఈ ప్రకాష్‌రావు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

తొట్టంబేడు: తొట్టంబేడు మండలం చోడవరం పంచాయతీ పెద్దగుంట సర్వే నంబరు 27లో 25 ఎకరాల చెరువు ఉంది. స్థానిక నాయకుడొకరు కొన్నాళ్ల కిందట ఆక్రమించి సాగు చేపట్టగా రైతుల పోరాటంతో వెనక్కితగ్గారు. ఈ క్రమంలో సోమవారం ముళ్లచెట్లను జేసీబీతో తొలగించి శుభ్రం చేస్తుండగా గ్రామస్థులు, మహిళలు అడ్డుకున్నారు. ఎవరికి చెప్పుకొంటారో చెప్పుకోండని పనులు ఆపేదిలేదంటూ సదరు నాయకుడు తమను దుర్భాషలాడి బెదిరించారని వారు ఆరోపించారు. దీనిపై జలవనరుల శాఖ, పోలీసులకు ఫిర్యాదు చేయగా.. స్పందించిన డీఈఈ ప్రకాష్‌రావు పోలీసులతో చేరుకుని పనులు అడ్డుకున్నారు. యంత్రాన్ని అక్కడి నుంచి పంపివేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

సత్యవేడు,న్యూస్‌టుడే: మండలంలోని వెంకటరాజుల కండ్రిగ వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగలాపురం అరుణా నది నుంచి ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు నిఘా వేసి వాహనాలు తనిఖీలు చేశారు. అదే సమయంలో రెండు ట్రాక్టర్లు ఇసుకను తమిళనాడు వైపుగా తరలిస్తుండటంతో పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.

పల్లెటూరి పిల్లలు.. చిచ్చర పిడుగులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయబృందం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని పాపానాయుడుపేట జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటారు. రెండు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించిన క్రీడల్లో వివిధ పాఠశాల విద్యార్థులతో పోటీపడి ఉత్తమ ప్రతిభతో స్వర్ణ, రజిత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలో విద్యార్థులు విజేతలుగా నిలవడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది.

ఆమె కృషితో పతకాల పంట

ఇటీవల కాలంలో పాఠశాలకు బదిలీపై వచ్చిన వ్యాయామ సంచాలకులు పుష్పవాణి కృషి ఫలించింది. ఆమె ఏ పాఠశాలలో పనిచేసినా విద్యార్థులు క్రీడల్లో రాణిస్తారు. గత కొన్నేళ్లుగా పల్లం జడ్పీఉన్నత పాఠశాలలో పనిచేయడంతో ఇక్కడ విద్యార్థులు జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో వందల మంది విద్యార్థులు రాణించడం అభినందనీయం. అదే విధంగా పాపానాయుడుపేట పాఠశాలకు వచ్చిన నెలల వ్యవధిలోనే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా

ఆనందంగా ఉంది

చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. అయితే బయట ప్రాంతాల్లో జరిగే టోర్నమెంట్లలో పాల్గొనలేదు. మా మేడం క్రీడల్లో మెలకువలు నేర్పింది. అంతే కాకుండా తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించారు. దీంతో నేను సులభతరంగా స్వర్ణ పతకం గెలిచాను. నాతో పాటు కుటుంబ సభ్యులూ ఆనంద పడుతున్నారు.
- కాజల్, ఏడోతరగతి విద్యార్థిని

జాతీయ స్థాయిలో రాణిస్తా

ఎప్పటికైనా జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించాలన్నది లక్ష్యం. నిత్యం పాఠశాలలో కొంత సమయం శిక్షణకు కేటాయిస్తాం. దీంతో రాటుతేలి క్రీడల్లో రాణించేందుకు సులభంగా ఉంది. గ్రాప్లింగ్ పోటీల్లో మొట్టమొదటి సారి రజిత పతకం సాధించడం ఆనందంగా ఉంది. ఇదే విధంగా రాణిస్తూ లక్ష్యాన్ని సాధిస్తా.
- విశాలి, ఏడో తరగతి విద్యార్థిని

పోటీతత్వం పెరిగింది

ఇప్పటి వరకు చదువుల్లోనే తోటి విద్యార్థుల్లో పోటీపడేవాళ్లం. ఇక నుంచి క్రీడల్లోనూ ఇలాంటి పోటీ ఉంటుంది. పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై జిల్లా తరుపున పాల్గొన్నాం. 38కిలోల విభాగంలో పోటీపడి కాంస్య పతకం సాధించడం ఆనందంగా ఉంది. ఇదేరీతిలో మరింత పోటీతత్వంతో క్రీడల్లో, చదువుల్లో రాణిస్తా.
- నీలగౌరి, ఏడోతరగతి విద్యార్థిని

సత్వరమే స్పందించిన అగ్నిమాపక శాఖ

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేణిగుంట: గాజులమండ్యం పారిశ్రామిక వాడలోని ఔషధ పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో అగ్నిమాపక శాఖ, పోలీసులు వెంటనే స్పందించారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కిరణ్‌రెడ్డి నేతృత్వంలో సిబ్బంది రెండు వాహనాలతో అక్కడికి చేరుకుని యుద్ధప్రతిపాదికన సహాయక చర్యలు ప్రారంభించారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు. ● పరిశ్రమలో భద్రతా పరికరాలు లేవని, స్థానికంగా మరో పరిశ్రమ నుంచి పరికరాలు తెచ్చి మంటలు అదుపు చేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు.

మర్రిగుంత కూడలిలో ప్రమాదం

రేణిగుంట, న్యూస్‌టుడే: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని మర్రిగుంత కూడలి వద్ద ప్రమాదాలు తగ్గడం లేదు. సోమవారం రాత్రి ఈ కూడలిలో రెండు కార్లు ఢీకొన్నాయి. తాడేపల్లిగూడెం నుంచి తిరుపతికి వస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసులుకు చెందిన కారును వెనుక నుంచి వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ కారులోని బెలూన్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. అయితే ప్రమాద సమయంలో బొలిశెట్టి శ్రీనివాసులు కారులో లేరని పోలీసులు తెలిపారు.

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

హైవేపై భారీ వాహనం.. ట్రాఫిక్‌కు అంతరాయం

చిల్లకూరు, న్యూస్‌టుడే: శ్రీసిటీ నుంచి కృష్ణపట్నం పోర్టుకు ఇనుప ట్యాంకరును తీసుకెళ్లే భారీ వాహనం సోమవారం చిల్లకూరు సమీపాన జాతీయ రహదారిపై చేరుకుంది. దీంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారి పైనుంచి వెళ్తున్న విద్యుత్తు తీగలను తప్పించేందుకు వాహన సిబ్బంది చర్యలు చేపట్టారు. వాహనం సాఫీగా వెళ్లేందుకు వీలుగా పోలీసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు
రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	116
లేయర్	112
బ్రాయిలర్స్	210
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

నేటి నుంచి గ్రామ సభలు
నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి 15 రోజుల పాటు పీ4 సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఇందులో బంగారు కుటుంబాలను ఎంపిక చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. చిట్టమూరు మండలం ఉప్పలమర్తి, మెట్టుల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సామూహిక శ్రీమంతాల్లో పాల్గొన్నారు.

ఉప్పలమర్తిలో రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తదితరులు

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ ముందుకెళ్తోందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కొటపోలూరు, ఆబాక, సామంతమల్లం గ్రామాల్లోనూ, పురపాలక సంఘంలోని కసిరెడ్డిపాళెం, వీఎస్‌ఆర్ నగర్, దొంక, వైజంక్షన్ ప్రాంతాల్లో సోమవారం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఆబాక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతాలు చేశారు.

గొడుగులతో విద్యార్థులు, ఎమ్మెల్యే విజయశ్రీ, సుధాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు

✦ పట్టణంలోని బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థినులకు పట్టణ తెదేపా అధ్యక్షుడు ఆకుతోట రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు సమకూర్చిన గొడుగులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కొక్కు, శంకరయ్య, మురళీరెడ్డి, సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రెడ్డి, ఏజీ కిషోర్, పచ్చవ మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్ మృతికి నివాళి

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని సాలెవీధికి చెందిన యోగా మాస్టర్ బద్రి రాజు సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ భూమి పేదలకు పంచాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: డక్కిలి మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గిరిజనులకు పంచాలని జిల్లా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లికార్జునరావు కలెక్టరేట్‌లో జేసీ శుభం భన్సల్‌కు సోమవారం విన్నవించారు. గూడూరు సబ్ కలెక్టర్‌ను కలవాలని జేసీ సూచించారు.

వేనాడులో పర్యాటకాభివృద్ధి అంతేనా?

తడ, న్యూస్‌టుడే: మతాలకు అతీతంగా వెలుగొందుతున్న వేనాడు దర్గా ప్రాముఖ్యత రాష్ట్రం నలుమూలలకే గాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వ్యాపించింది. క్రమేపి భక్తుల రాక ఏటికేడు పెరుగుతోంది. మరోవైపు శివకేశవులు ఒకే ప్రాంగణంలో అరుదుగా ఉండే పురాతన శృంగీశ్వర శ్రీరంగపెరుమాళ్ దేవస్థానం ఇక్కడే కొలువై ఉంది. పులికాట్ సరస్సును చీల్చుకుంటూ మధ్యలో వేనాడుకు చేరుకునే రహదారి పర్యాటకులను మరింతగా ఆకట్టుకుంటుంది. కాలుష్యానికి దూరంగా ఎంతో ఆహ్లాదకరంగా ఉండే వేనాడు దీవిని పర్యాటక ప్రదేశంగా మార్పు చేయాలని 2018లో తెదేపా శ్రీకారం చుట్టింది. ఆ దిశగా ప్రయత్నాలు మొదలెట్టి తొలుత రూ.2.50కోట్ల వ్యయంతో టూరిజం రెస్టారెంటు నిర్మాణం చేపట్టింది. 2019లో ప్రభుత్వం మారి వైకాపా అధికారం రావడంతో ఆ ప్రయత్నానికి గండి పడింది.

✦ వేనాడు దర్గా సందర్శనకు వచ్చే భక్తులకు అందుబాటులో ఉండేలా దాదాపు 10 ఎకరాల స్థలం పర్యాటక శాఖకు కేటాయించారు. అందులో భక్తులు భోజనం చేసేందుకు అనువుగా హోటల్, వంటగది, 100 మంది దాకా సేదతీరేందుకు రెండు డార్మెటరీలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశారు. రెస్టారెంటుకు వెళ్లేందుకు రోడ్ల వసతి, సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు.

వినియోగంలోకి రాని టూరిజం రెస్టారెంటు

ప్రస్తుత పరిస్థితి

✦ వైకాపా ఐదేళ్ల కాలంలో పట్టించుకోకపోవడంతో రెస్టారెంటు పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అద్దాలు పగులగొట్టేశారు. నీటి పైపులు విరగ్గొట్టి, మోటార్లు దొంగలు ఎత్తుకుపోయారు. సోలార్ దీపాలు కొన్ని పాడయ్యాయి. మరికొన్ని చోరుల పాలయ్యాయి. భవనాలు నిరుపయోగంగా మారాయి.

✦ అటకానితిప్ప నుంచి వేనాడుకు దాదాపు 12 కి.మీల మేర సరస్సు మధ్యలో సాగే మట్టి రోడ్డు గోతుల మయంగా మారింది. చినుకు పడితే పరిస్థితి దుర్భరంగా ఉంటోంది. ఆర్టీసీ సర్వీసులు రద్దవుతున్నాయి. విద్యార్థులు, కార్మికుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డు బాగుకు గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం.

పులికాట్ సరస్సు మధ్యలో వెళ్లే వేనాడు రోడ్డు

కలెక్టరు హామీ అమలయ్యేనా?

ఆర్నెళ్ల క్రితం జరిగిన పక్షుల పండుగ సమయంలో వేనాడు రోడ్డు సందర్శించిన కలెక్టరు వెంకటేశ్వర్ ప్రజల ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. అటకానితిప్ప నుంచి వేనాడుకు రోడ్డు ఏర్పాటుకు నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టరు హామీ అమల్లోకి వస్తే నిజంగా వేనాడు ప్రజలకు పండుగే. కూటమి ప్రభుత్వంలోనైనా వేనాడుకు రోడ్డు వసతి కల్పించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే: సమస్య: ఎప్పుడూ రద్దీగా ఉండే స్థానిక ర.భ ప్రధాన మార్గంలో ఇరువైపులా భారీ వాహనాలు పార్కింగ్ చేసి నిబంధనలకు వ్యతిరేకంగా దుస్తులు, ఇతర వస్తువుల అమ్మకాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు. **- కామేశ్వరరావు, వాహనచోదకుడు**

సమాధానం: వెంటనే నియంత్రణ చర్యలు తీసుకొంటాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తాం. **-పవన్‌కుమార్, ఎస్సై**

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని ఆనేపూడి ఎస్టీ కాలనీలో తాగునీటి పథకం పనిచేయకపోవడంతో వారం రోజుల నుంచి తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. **-వెంకటరమణయ్య**

సమాధానం: ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **-గోవర్ధన్, ఎంపీడీవో**

సమస్య: దొరవారిసత్రం జాతీయ రహదారి ఏకొల్లు వద్ద రహదారి నిర్వహణ అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **-ఉదయకుమార్, మాజీ ఎంపీటీసీ**

సమాధానం: జాతీయ రహదారి నిర్వహణ అధికారులకు సమస్య తెలియజేస్తాం. **-రామయ్య, పంచాయతీ కార్యదర్శి**

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమస్య: తడకండ్రిగలో రైల్వే స్టేషన్ సమీపాన చర్చికి వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. **-కృష్ణయ్య, తడకండ్రిగ**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- గాబ్రియెల్, పంచాయతీ కార్యదర్శి**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పూలతోటలో కాలువల్లో మురుగు పారడం లేదు. **-వినయ్, గూడూరు**

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

ఒకటిన పుష్పయాగం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు ఒకటిన పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఈవో ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. ఆమె సోమవారం ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆషాఢ మాసంలో బహుళ అష్టమి రోజును పురస్కరించుకుని ఈనెల 18న అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. ఇందుకు భక్తులు ఈనెల 16వ తేదీ సాయంత్రంలోగా పండ్లు, కూరగాయలు తెచ్చి, ఆలయంలో ఇవ్వచ్చని తెలిపారు. అలాగే వచ్చే నెల 22న ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పరిశీలించి.. పరిష్కరించి

స్పందనకు వందనం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఇటీవల ప్రజలు తమ సమస్యలను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. వీటిని వెంటనే 'న్యూస్‌టుడే' ప్రతినిధి ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెంటనే స్పందించి పరిష్కరించారు. అవేంటంటే.. ✦ సూళ్లూరుపేట పురపాలకలోని నాగరాజాపురంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన స్తంభానికి వీధి దీపం వెలిగేలా కమిషనర్ చిన్నయ్య చర్యలు చేపట్టారు. ✦ డిస్కం డీఈఈ శేఖర్ సూళ్లూరు కాపువీధిలో డిస్కం సబ్ డివిజన్ కార్యాలయం ముందు రోడ్డుపై నీటిని తొలగించారు. ✦ పునర్విహ వృత్తి విద్యా జూనియర్ కళాశాల, పద్మావతి ఆసుపత్రి రోడ్డులో రెండు స్తంభాలకు వీధి దీపాలు వెలిగేలా చేశారు. ✦ షార్ ఉద్యోగుల నివాస కాలనీ పినాకినీనగర్(డీఆర్‌డీఎల్) ఎదురుగా రోడ్డుపై, వంతెన కింద రైల్వే లైను వరకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ✦ జాతీయ రహదారిపై హోలీక్రాస్ కూడలిలో హైమాక్స్ దీపాలు వెలిగేలా చేశారు. ✦ డేగవారికండ్రిగ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో సరఫరాలో అంతరాయాలు లేకుండా సిబ్బందికి సూచనలిచ్చారు. ✦ పురపాలక సంఘంలోని బజారు వీధులు, గాండ్లవీధి ప్రాంతాల్లో కుళాయిల్లో నీటి సరఫరా పునరుద్ధరించారు. ✦ చిన్నసత్రం వద్ద తాగునీటి పైపులైన్‌ను బాగు చేశారు. ✦ **గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** కోర్టు ప్రాంతంలో వ్యర్థాలను కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో తొలగించారు. ✦ **నాయుడుపేట, న్యూస్‌టుడే:** గొట్టిప్రోలు బీసీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్లను సర్పంచి రామిరెడ్డి మరమ్మతు చేయించారు. ✦ తుమ్మూరు సమీపంలో 71 నంబరు జాతీయ రహదారిపై గుంతలను ఎన్‌హెచ్‌ఏ సిబ్బంది సరిచేశారు. సూచికలు ఏర్పాటు చేశారు. ✦ **బాలాయపల్లి, న్యూస్‌టుడే:** ఎట్టకేలకు పీజీఆర్‌ఎస్‌కు వివిధ శాఖల అధికారులు సోమవారం హాజరయ్యారు. తహసీల్దారు ఒక్కరే హాజరయ్యారని 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారుల్లో కదలిక వచ్చింది. ✦ జయంపు గాంధీ బొమ్మ కూడలిలో రోడ్డు మార్జిన్‌లోని చిరు వ్యాపారుల వాహనాలు రాకపోకలకు అడ్డుగా లేకుండా ఎస్సై గోపి సమస్య పరిష్కరించారు.

స్తంభం పడిపోయినా స్పందించరు

చెన్నప్పనాయుడుపేట పొలాలల్లో విద్యుత్తు స్తంభం కొన్ని రోజుల క్రితం ఈదురుగాలుల వర్షానికి పడిపోయింది. దీని ద్వారా రైతులు వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్తు సరఫరా జరుగుతుంది. ప్రమాదకరంగా పొలాలు గట్లు మీద పడిపోయిన విద్యుత్తు స్తంభాన్ని సరిచేసి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలంటూ రైతులు డిస్కం అధికారులకు విన్నవించారు. అయినా స్పందించకపోవడంతో కర్రల మీదుగా విద్యుత్తు కేబుల్ తీసుకుని పంపుసెట్లకు విద్యుత్తు వినియోగించుకుంటున్నారు. ఉన్నతాధికారులు విద్యుత్తు స్తంభం సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, పెళ్లకూరు**

ప్రమాదకరంగా విద్యుత్తు కేంద్రం

జువ్వలపాళెం మండబైలు ఎస్టీ కాలనీ సమీపంలో ఉన్న విద్యుత్తు ఉప కేంద్రం చుట్టూ కంచె లేకుండా ఉండడంతో ప్రమాదకరంగా మారింది. గతంలో ఉన్న కంచె పూర్తిగా దెబ్బతింది. తరువాత ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీనికి తోడు కంపచెట్లు, ఇతర చెట్లు, మొక్కల తీగలు ఉప కేంద్రం విద్యుత్తు తీగల మీదుగా అల్లుకుని అధ్వానంగా ఉంది. పశువులు, మనుషులు పొరపాటున కేంద్రం లోపలికి వెళితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలకు అవకాశం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నాయుడుపేట**

సీసీ రోడ్డు తవ్వి వదిలేశారు

సూళ్లూరుపేట పురపాలక సంఘంలో పైపులైన్లు వేసేందుకు పలు చోట్ల సిమెంటు రోడ్లను తవ్వారు. తర్వాత వాటిని మట్టితో పూడ్చి సరిపెట్టేశారు. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా వాహనాలు అందులో ఇరుక్కుపోతున్నాయి. గాండ్లవీధిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక వీధి 12 అడుగుల వెడల్పు మాత్రమే ఉంది. ఇందులో పైపులైన్ల కోసం సగం రోడ్డును తవ్వేశారు. పనులు అయిన తర్వాత మళ్లీ రోడ్డు వేయలేదు. దాంతో ప్రస్తుతం పచ్చిక పెరిగి, అధ్వానంగా కనిపిస్తోంది.
- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

వంతెన నిర్మాణం ఎప్పుడో?

గోవిందపల్లిపాళెం- గోవిందపల్లి ర.భ రోడ్డు మార్గంలో ఉప్పుకాలువపై నిర్మించిన లోలెవల్ వంతెన దెబ్బతింది. దీంతో ఉప్పుకాలువ ప్రవహిస్తే రాకపోకలు స్తంభించిపోతాయి. వరదలొస్తే అంతే సంగతులు. వంతెన నిర్మాణానికి పదేళ్లుగా ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. అయినా నిధులు మంజూరు కాలేదు. గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామం బంగాళాఖాతం అంచున ఉంది. గ్రామస్థులు మత్స్యసంపదను రోడ్డు మార్గంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తారు. ఈ మార్గంలో ఉప్పుటేరు రోడ్డుకు అడ్డంగా పారుతుంది. **-న్యూస్‌టుడే, కోట**

పైపులైన్ల మరమ్మతులతో తాగునీటి కష్టాలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట స్వర్ణముఖి నది నుంచి వచ్చే పైపులైన్ల మరమ్మతులతో పాగొట్టంకాలనీ, కాలువగట్టు, శంకరాపురం, జైహింద్ కాలనీ, బాలాజీ గార్డెన్, బ్రాహ్మణవీధి, ఇతర ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఆగింది. ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు.

మునీశ్వరుడికి పొంగళ్ల సమర్పణ

తడ, న్యూస్‌టుడే: చేనిగుంటలో పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా గ్రామస్థులు సోమవారం మునీశ్వరుడికి సామూహికంగా పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రీవెన్సు డేలో దివ్యాంగుడి కష్టాలు

సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్సు డేకు వరదయ్యపాళెం మండలం సంతవేలూరు హరిజనవాడకు చెందిన కాంబాకం కోటేశ్వరరావు వచ్చారు. అతను దివ్యాంగుడు. రెండు కాళ్లు పనిచేయవు. దాంతో మొదటి అంతస్తులో ఉండే కార్యాలయానికి వెళ్లేందుకు మెట్లు ఎక్కలేక అవస్థలు పడ్డారు. ఈలోగా అటుగా వస్తున్న ఇరువురు అతను ఎక్కేందుకు సాయమందించారు. తనకు కువ్వాకుల్లి రెవెన్యూ పరిధిలో 1.83 ఎకరాలు ఉందని, ఆ భూమికి సంబంధించి వన్‌బీ రావడం లేదని, ఆ విషయాన్ని చెప్పుకొనేందుకు వచ్చినట్లు ఆయన వివరించారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

మేగనూరులో ఫ్యాక్టరీ నిర్మాణ ప్రయత్నాలు ఆపండి

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

గూడూరు పట్టణం న్యూస్‌టుడే: గూడూరు మండలం మేగనూరు గ్రామంలో ఉన్న మేత పోరంబోకు భూముల్లో ఫ్యాక్టరీ నిర్మాణాలు చేపట్టాలని చేస్తున్న ప్రయత్నాలు ఆపాలని గ్రామస్థులు కోరారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేసి సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వే నం.1లో 260 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉందని, అందులో గ్రామస్థులు పశువులు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు అక్కడ ఫ్యాక్టరీ నిర్మిస్తే పాడి రైతులు ఇబ్బందులు పడతారని, అందువల్ల ఫ్యాక్టరీ నిర్మాణ ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. సర్పంచి జి.విజయ, ఎంపీటీసీ ఉమామహేశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిష్కారం కాక.. కలెక్టరేట్‌కు పరుగు

● ఇదీ గూడూరులో పీజీఆర్ఎస్ తీరు

హాజరైన డివిజన్ స్థాయి అధికారులు

అర్జీ తీసుకుంటున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు కోట మండలానికి చెందిన ఓ రైతు వచ్చాడు. ఇప్పటివరకు మూడుసార్లు తన సమస్యను సబ్ కలెక్టర్‌కు అర్జీ రూపంలో విన్నవించానని, ప్రతిసారీ సమస్య కొత్తగా చెప్పుకోవాల్సి వస్తోంది తప్ప పరిష్కారం కావడం లేదని వాపోయారు. దీంతో కలెక్టర్‌కైనా విన్నవించుకుంటానని తెలిపారు. ఇలా ఎంతో మంది అర్జీదారులు ఇక్కడ సమస్యలు పరిష్కారం కాక వ్యయప్రయాసల కోర్చి తిరుపతి కలెక్టరేట్‌కు పరుగులు తీస్తున్నారు. రెండు మూడుసార్లు విన్నవించినా, నెలలు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం వారం అర్జీ ఇచ్చేందుకు వచ్చే వారి సంఖ్యా తగ్గిపోతోంది. గతంలో అర్జీలు వందల సంఖ్యలో వచ్చేవి. సోమవారం 30 అర్జీలే వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో కార్యాలయం ఆవరణ బోసిపోయింది.

అధికారులు అరకొరగానే హాజరు

ప్రతి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ జరుగుతోంది. అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు వారి సిబ్బందిని పంపుతుండటం గమనార్హం. ఈ విషయమై సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను వివరణ కోరగా.. ప్రతి అర్జీకి సమయం పడుతోందని, దాంతో సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతున్నట్లు చెప్పారు. అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు నుంచి మిట్టాత్మకూరు మీదుగా గిద్దలూరు వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి సోమవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో సిలికా అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టాలని కోరారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ ఎంవో చైతన్యభాను వైద్య సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు చైతన్య, తరుణ్‌సాయి కుమార్, నవీన్, హరిత పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగరమాల రోడ్డు పనుల పరిశీలన

కోట, న్యూస్‌టుడే: మండలంలో జరుగుతున్న సాగరమాల రోడ్డు పనులను ఎన్‌హెచ్ అథారిటీ బృంద అధికారులు షాహీరామ్, రాజ్‌కుమార్‌నగర్‌వాల్ సోమవారం తనిఖీ చేశారు. చెందోడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు వరకు రోడ్డు పనులు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు.

పరిహారం చెల్లించాలంటూ నిరసన

కోట, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం వీపీ అగ్రహారానికి చెందిన సాగరమాల రోడ్డు నిర్మాణ భూనిర్వాసితులు పరిహారం చెల్లించాలంటూ ఆందోళన చేపట్టారు. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్, ఎస్సై పవన్‌కుమార్‌కు వినతులు అందజేశారు. పరిహారం ఇవ్వకపోతే పనులు అడ్డుకొంటామని హెచ్చరించారు. జేసీ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందజేస్తామని తహసీల్దారు అన్నారు.

ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

ఎల్ఐసీకి నగదు చెల్లింపు

నాయుడుపేట: పట్టణంలో ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో గత నెల్లో ఒక పాలసీదారునికి చెల్లించాల్సిన సొమ్మును మరో బ్యాంకు ఖాతాకు జమ చేసిన ఘటనకు సంబంధించిన రూ.20 లక్షలను సోమవారం ఆరూరు జ్ఞానేంద్ర అనే వ్యక్తి ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయానికి వచ్చి తిరిగి చెల్లించారు. పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన ఆరూరు వెంకటేశ్వర్లుకు పాలసీ కాలపరిమితి అనంతరం చెల్లించాల్సి సొమ్ము ఇదే పేరుతో ఉన్న ఆరూరు వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి వీరి కుమారుడు జ్ఞానేంద్ర ఇచ్చిన పత్రాల మేరకు చెల్లించారు. దీనిపై పత్రాలు తారుమారు చేశారన్న విమర్శలు వ్యక్తం కావడం తెలిసిందే. ఈ ఘటనపై పది రోజులుగా ఎల్ఐసీ సిబ్బంది, అధికారులు, ఏజెంట్లు తర్జనభర్జన పడి విచారణ చేశారు. ఎట్టకేలకు జ్ఞానేంద్ర అనే వ్యక్తి తన తండ్రి ఖాతాలో జమ చేసిన రూ.20 లక్షలు వడ్డీతో తిరిగి చెల్లించారు.

అశోక్ గజపతిరాజుకు రాజాల శుభాకాంక్షలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించడంతో వెంకటగిరి సంస్థానం రాజకుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర అభినందనలు తెలిపారు. సోమవారం అశోక్ గజపతిరాజుతో చరవాణిలో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా గజపతిరాజుకు అభినందనలు తెలిపారు.

21 నుంచి క్రికెట్ పోటీలు

వెంకటగిరి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి మనోహర్ తెలిపారు. అండర్-14 విభాగంలో 21 నుంచి రెండు రోజులు డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్- 14 బాలికల విభాగానికి ఆగస్టు 1న పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 94902 52821 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

శ్మశాన స్థలం కబ్జాపై ఫిర్యాదు

వెంకటగిరి: వల్లివేడు పంచాయతీ పరిధిలోని బుసపాళెం గ్రామానికి చెందిన గిరిజనుల శ్మశానస్థలం దారి కబ్జా చేశారంటూ గిరిజనులు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గనులు లీజుకివ్వాలి

నాయుడుపేట. న్యూస్‌టుడే: కంకర, సిలికా, ఇసుక గనులను ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాలు నుంచి కూటమి నాయకులు ఇసుక అక్రమంగా చెన్నైకు తరలిస్తున్నారన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, నాయకులు వెంకటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, నాయకుల నిరసన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల రద్దును ఆపాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. సూళ్లూరుపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలిపారు.

పనికెళ్లడం లేదని ప్రశ్నించిన భార్య.. భర్త ఆత్మహత్య

తడ, న్యూస్‌టుడే: పనికి వెళ్లడం లేదని భార్య ప్రశ్నించిందని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పెరియవట్టు పంచాయతీకి చెందిన కారు డ్రైవర్ ఎస్‌డీ సాధిక్ బాషా(34)కు పెళ్లయి ఒక కుమారుడు ఉన్నాడు. నాలుగు నెలలుగా బాషా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. దాంతో అతని భార్య సంధ్య పనికి వెళ్లకపోతే కుటుంబం ఎలా గడవాలని ప్రశ్నించింది. దాంతో శనివారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన బంధువులు అతన్ని హుటాహుటిన చెన్నై స్టాండ్లీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కొండప నాయుడు తెలిపారు.

చరవాణి దుకాణాల్లో చోరీ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గడియార స్తంభం ప్రాంతంలో ఉన్న రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయగా, మరో రెండు దుకాణాల్లో చోరీ యత్నం చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ద్రౌపదీ దేవి కాంప్లెక్స్‌లో ఉన్న మొబైల్ దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు పైకప్పు తొలగించి రెండింటిలో రూ.2 వేలు నగదు, 4 సెల్‌ఫోన్లు అపహరించారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

చిల్లకూరు, న్యూస్‌టుడే: బూదనం సమీపాన జాతీయ రహదారిపై సోమవారం కారు దగ్ధమైంది. తిరుపతి ప్రాంతానికి చెందిన కొందరు నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్‌కి వెళ్లి జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ డెయిరీ వద్ద శీతల పానీయాల కొనుగోలు నిమిత్తం కారు నిలిపి దిగారు. వెంటనే ఇంజిన్‌లో నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదు.

(c) eenadu

ఈనాడు విశాఖపట్నం
మంగళవారం 15 జులై 2025 సిటీ 5

సమస్యల్ని 'పురమిత్ర'కు చెబుదాం..!

కార్పొరేషన్, న్యూస్‌టుడే : పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'పుర మిత్ర' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానిక సంస్థల సమస్యలతో పాటు, ఇతర సమస్యల్ని యాప్ ద్వారా తెలియజేస్తే... సంబంధిత సిబ్బంది స్పందించి, పరిష్కార చర్యలు చేపడతారు.

★ మహా విశాఖ నగర పాలక సంస్థకు సంబంధించి ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, పరిపాలన, ఇంజినీరింగ్, వీధి దీపాలు, రెవెన్యూ వంటి అంశాలను ఫిర్యాదుల విభాగంలో ఉంచారు. చెత్త సేకరించకపోవడం, కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, నీటి సరఫరాలో ఇబ్బందులు, పైపులైన్ల లీకేజీలు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, వెలగని వీధి దీపాలు... తదితరాలపై ఫిర్యాదు చేయొచ్చు. ఆ సమాచారం వార్డు సచివాలయం కార్యదర్శికి చేరుతుంది. సమస్య తీవ్రతను బట్టి రెండు రోజుల నుంచి వారంలోపు పరిష్కారం చూపుతారు.

కేంద్ర మంత్రికి జ్ఞాపిక

నగరంలో సోమవారం పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు జ్ఞాపిక అందిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు –న్యూస్‌టుడే, వన్‌టౌన్

ఏం జరుగుతోంది..కారాగారంలో!?

పర్యవేక్షణ తీరుపై విమర్శల వెల్లువ

ఈనాడు–విశాఖపట్నం: విశాఖ కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారులను వివాదాలు చుట్టుముడుతున్నాయి. అసలు విశాఖ సెంట్రల్ జైల్లో ఏం జరుగుతుంది? అనేది కొన్ని రోజులుగా రాష్ట్రంలోని ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బూటు కాళ్లతో తన్ని: ఈ నెల 11న ఓ ఖైదీతో ములాఖత్‌కు వచ్చిన మహిళ బ్యాగ్ కనిపించలేదు. అందులో రెండు సెల్‌ఫోన్లతో పాటు కొంత నగదు ఉన్నట్లు మహిళ అక్కడే ఉన్న వార్డర్‌కు చెప్పడంతో విచారణ చేపట్టారు. ములాఖత్‌కు వచ్చిన మరో వ్యక్తి ఆ బ్యాగు తీసుకెళ్లినట్లు గుర్తించి అతన్ని తీసుకురావాలని సిబ్బందికి జైల్లోని ఓ అధికారి ఆదేశించినట్లు సమాచారం. బ్యాగు తీసుకెళ్లిన వ్యక్తిని ఇంటర్వ్యూ వార్డర్ కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. మహిళకు బ్యాగ్ అందించిన తర్వాత... అతన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలి. అలా కాకుండా అతన్ని కిందపడేసి బూటు కాళ్లతో సదరు అధికారి తన్నినట్లు ఆరోపణలొచ్చాయి. ఖైదీలు చిన్న తప్పు చేసినా చితకబాదడం ఆ అధికారికి కొత్తేమీ కాదని, ఈ ఘటనంతా మెయిన్ గేటు వద్ద జరిగిందని ఉదయం నుంచి సాయంత్రం వరకు నమోదైన సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

ఖైదీల ఫిర్యాదులు: కొన్ని నెలల కిందట గంజాయి, సెల్‌ఫోన్లు కేంద్ర కారాగారంలో దొరకడం సంచలనమైంది. అదే సమయంలో వార్డర్లను తనిఖీ చేసిన తీరును నిరసిస్తూ వార్డర్లు, కుటుంబ సభ్యులు జైలు ఎదుట ధర్నాకు దిగారు. కొందరు పర్యవేక్షణాధికారులపై పలువురు ఖైదీలు ఫిర్యాదు చేయడమూ చర్చనీయాంశమవుతోంది. విశాఖ కేంద్ర కారాగారంలోని ఓ అధికారి తనని వ్యక్తిగతంగా దూషించారంటూ ఓ ఖైదీ మే నెలలో న్యాయమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఖైదీలకు ఉచితంగా ఇచ్చే అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం నాణ్యతగా లేవని, చపాతీలు, గారెలు, బజ్జీలు, దోశలు, ఇతర పిండివంటకాలతో క్యాంటీన్ అమ్మకాలు పెంచుకుంటున్నారని, అందులో సైతం ఆదాయం పక్కదారి పడుతుందని కొందరు ఖైదీలు ఆరోపించారు. ఇటీవల జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ విశాఖ కేంద్ర కారాగారంలో బ్లాకులను సందర్శించి ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో క్యాంటీన్, రేషన్ విషయంలో జరుగుతున్న అవినీతి, వేధింపుల గురించి కొందరు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలా ఫిర్యాదు చేశారని జీవితకాల శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీని కొట్టి సింగిల్ సెల్‌లో వేయడంతో తీవ్ర వేదనకు గురై నిరాహార దీక్ష చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో రావడం గమనార్హం.

గజానికో గజదొంగ!!

★ నగరంలో ప్రభుత్వ స్థలాలు కబ్జా ★ 'ఫేకర్ లేఅవుట్' పార్కుకు ఎసరు

ఫేకర్ లే అవుట్‌లో ఖాళీ స్థలం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో వీలు చిక్కితే చాలు ఉద్యానవనాల స్థలాలు స్వాహా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గత ఏడాదిగా జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలు, పార్కులే లక్ష్యంగా కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. విలువైన స్థలాలను పరిరక్షించాల్సిన జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు కళ్లు మూసుకొని వారికి మేలు చేస్తున్నారు. ఇటీవల పలు చోట్ల ఇవి బయటపడ్డాయి. అదే రీతిగా మరో చోట అక్రమార్కులు పంజా విసిరారు.

వాల్తేరు ప్రాంతంలోని 28వ వార్డులో 'ఫేకర్ లే అవుట్' ఉంది. ఇక్కడ ఓపెన్ స్పేస్ స్థలం తమదని, అందులో జీవీఎంసీ పార్కు నిర్మాణం చేపడుతున్నందున టీడీఆర్ విడుదల చేయాలని, లేదంటే స్థలం అప్పగించాలని కోరుతూ అధికారులకు ఓ దరఖాస్తు వచ్చింది. ఈ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారంతా నిబంధనల మేరకు జీవీఎంసీకి 'ఓపెన్ స్పేస్'గా 4,500 గజాల స్థలాన్ని గిఫ్ట్‌డీడ్ చేశారు. అనంతరం జీవీఎంసీ దానిని పార్కుగా అభివృద్ధి చేయడానికి రూ.1.60 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. అయితే అదే స్థలంలో ఓ వ్యక్తి దర్జాగా షెడ్డు వేయడంతోపాటు, దానికి అవసరమైన విద్యుత్తు కనెక్షన్‌ను తీసుకున్నాడు. జీవీఎంసీ నియంత్రణలో ఉన్న అత్యంత విలువైన స్థలంలో రేకుల షెడ్డు వేసి, విద్యుత్తు మీటరు ఏర్పాటు చేసే వరకూ అధికారులు ఎందుకు అడ్డుకోలేదనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

నిర్మించిన ప్రహరీ

ఇంజినీరింగ్ పనుల్లోనూ...

ఈ ఓపెన్ స్పేస్‌లో పార్కు నిర్మాణానికి ఒక్కొక్కటి రూ. 20 లక్షల చొప్పున ఎనిమిది పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. నడక మార్గం, కారు పార్కింగ్, షెడ్డు నిర్మాణం, ఫౌంటెయిన్, ప్రహరీ వంటివి ఇందులో ఉన్నాయి. అయితే గుత్తేదారు, ఇంజినీరింగ్ అధికారులు కలిసి కేవలం ఎల్ ఆకారంలో ప్రహరీ నిర్మించి వదిలేశారు. దానికి చేసిన వ్యయం రూ. 40 లక్షలే ఉంటుందని అంచనా. ప్రతిపాదనలు ఒక రకంగా.. చేసిన పనులు మరో రకంగా ఉన్న తీరుపై విచారణ చేపట్టాల్సి ఉంది.

ఫిర్యాదుల వెల్లువ

నగరంలో పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై పత్రికల్లో వరుసగా కథనాలు వస్తున్న నేపథ్యంలో సోమవారం పీజీఆర్ఎస్‌కు పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

» 8వ వార్డు షిప్‌యార్డు లే అవుట్‌లో బింద్రానగర్ సర్వే నెంబరు 281/8,9,10లో... 81 సెంట్ల పార్కులో షెడ్ల నిర్మాణం జరిగింది. దీని విలువ రూ.20కోట్లు ఉంటుంది. గత ఐదారేళ్లలో దశలవారీగా కబ్జా చేశారు. స్థానికులు దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

» నరవలో సర్వే నెంబరు 53, 54లో ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లో రెండు పార్కు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. 400 గృహాలిక్కడ ఉండగా, వారు వినియోగించడానికి కేటాయించిన పార్కు స్థలాల్లో 23 సెంట్లలో ఓ వాణిజ్య సముదాయం నిర్మాణం చేపట్టగా, మరో పార్కు 1200 గజాల స్థలం ఆక్రమణకు గురైంది, అందులో షెడ్లు, పాకలు వేయడం గమనార్హం.

భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

'ఏం బాబూ.. భోజనం ఎలా ఉంది..?'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : 'ఏం బాబూ...భోజనం ఎలా ఉంది' అంటూ జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రశ్నించారు. సోమవారం ఆయన కేజీహెచ్ సమీప అన్న క్యాంటీన్‌కు వెళ్లారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడి, ఆహార పదార్థాల నాణ్యత, రుచి, శుభ్రత.. తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం క్యాంటీన్‌కు అవసరమైన వసతులు కల్పించాలని నిర్వాహకులు కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో జెడ్సీ మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యమే ఇక మీ తోడు!

పరిశ్రమల అవసరాలు.. పాలిటెక్నిక్‌తో సాకారం..

'ఇండస్ట్రీ కనెక్ట్'తో యువతకు ప్రత్యేక శిక్షణ

ఎలక్ట్రానిక్ పరికరాలపై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక ఆసరా కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ప్రభుత్వం విశాఖను ఆర్థిక రాజధానిగా చేసే సంకల్పంతో ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేస్తోంది. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. అయితే పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలున్న అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుతో పాటే పారిశ్రామిక అవసరాలకు తగిన నైపుణ్యాలను నేర్చుకునేలా పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అడుగులు వేస్తోంది.

రూ.35 లక్షలతో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు: ఆటోనగర్‌కు చెందిన లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ సంస్థ కార్పొరేట్ బాధ్యతలో భాగంగా పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమేషన్ సెంటర్‌ను నెలకొల్పింది. ఆ క్రమంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రూ.35 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ యంత్ర పరికరాలను ఏర్పాటు చేశారు. ఈసీఈ, ఈఈఈ డిప్లొమా విద్యార్థులకు ఈ ఆటోమేషన్ సెంటర్ ద్వారా శిక్షణ అందించి ప్రతి బ్యాచ్‌లో పది మందికి తమ సంస్థలో ఉద్యోగం కల్పిస్తోంది. ఆ మేరకు పాలిటెక్నిక్ కళాశాల లోటస్ సంస్థతో మూడేళ్ల క్రితం ఎంవోయూ చేసుకుంది. ఇప్పటికే ఒక బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకోగా పలువురు ఉద్యోగాలు చేస్తున్నారు.

▸▸ **రాష్ట్రంలో మొట్టమొదటి ఆటోమేషన్ సెంటర్:** రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 'ఇండస్ట్రీ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా ఈ సెంటర్ ద్వారా పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లుగా శిక్షణ అందిస్తున్నాం. పరిశ్రమ వాతావరణంలోనే శిక్షణ పొందడం వల్ల ఉద్యోగంలో చేరిన తర్వాత పని సులభమవుతుంది. ఈ ఏడాది 30 మందికి సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఇలాంటివి విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేస్తాయి.

- డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ప్రిన్సిపల్



▸▸ **శ్రద్ధతో నేర్చుకుంటే సులభంగా ఉద్యోగం:** పెందుర్తి పాలిటెక్నిక్‌లోని ఆటోమేషన్ సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇక్కడ చదువుతున్న సమయంలోనే నేను శిక్షణ పొందాను. ఇప్పుడు అసోసియేట్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాల వల్ల విధి నిర్వహణ కూడా సులభమైంది.

– పాలాడ ధనలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థిని

వాణిజ్య సముదాయాల్లో సౌకర్యాల కల్పనకు ప్రణాళిక

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థకు చెందిన వాణిజ్య సముదాయాల్లో సౌకర్యాల కల్పనకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడారు. వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారు అద్దెతో సంబంధం లేకుండా, మొత్తం ఖర్చులో 75 శాతం నిధులు ఇవ్వడానికి అంగీకరిస్తే, మిగిలిన 25 శాతం నిధులను జీవీఎంసీ మంజూరు చేసి, పనులు చేయిస్తుందన్నారు. వాణిజ్య సముదాయాల అద్దె బకాయిలు వెంటనే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు.

➤ నగరంలో నివాస సంక్షేమ సంఘాలు ముందుకొస్తే... పార్కుల్లో కనీస వసతుల కల్పనకు అవసరమైన సామగ్రి సమకూర్చాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయా సంఘాలు 75 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటుందని, మిగిలినవి జీవీఎంసీ ఇస్తుందన్నారు.

➤ మహా విశాఖ నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న న్యాయ వివాదాలు పరిష్కారానికి జోనల్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో న్యాయవిద్య అభ్యసించిన వారు, లేక చట్టాలపై అవగాహన ఉన్న వారిని ఎంపిక చేసి కోర్టు కేసుల కోసం నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. కోర్టుల్లో చాలా కేసులకు జీవీఎంసీ తరఫున కౌంటర్ దాఖలు చేయడం లేదని, ఇకపై అన్ని కేసులకు కౌంటర్ దాఖలు చేయాలన్నారు.

విసుగు లేకుండా ఓటేయొచ్చు!!

★ పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ! ★ 1,200 ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటుకు కసరత్తు

ఈనాడు, విశాఖపట్నం : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగానికి ఎంతో ప్రాధాన్యముంది. అయితే..ఎన్నికల వేళ చాంతాడంత వరుసల్లో నిల్చొని చాలా మంది విసిగిపోతుంటారు. అలా కాకుండా ఓటరు ప్రశాంతంగా ఓటు వేసేందుకు అనువైన పరిస్థితులు ప్రభుత్వం కల్పించాలి. ఇందులో భాగంగానే ప్రతి పోలింగ్ కేంద్రానికి 1,200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరించాలని ఎన్నికల సంఘం ఇటీవల స్పష్టం చేసింది. ప్రస్తుతం 1500 మందికి ఒక కేంద్రం ఉండేలా ఏర్పాట్లున్నాయి. తాజా మార్పు అమలయ్యేలా యంత్రాంగం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. దీంతో జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగనుంది.

▸▸ **కార్యాచరణలోకి:** పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ఆయా నియోజకవర్గాల్లోని కేంద్రాల పరిస్థితిని గత నెలాఖరు నుంచే ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఈఆర్వో, ఏఈఆర్వోలు క్షేత్రస్థాయిలో ఆ కేంద్రాలను తనిఖీ చేసి ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నారు.



★ ఈ నెల 17వ తేదీలోగా కొత్త కేంద్రాల గుర్తింపు, వాటి హద్దుల వివరాలతో నివేదిక ఇవ్వాలి. ఇప్పటికే వీటన్నింటిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు.

★ ఏడు నియోజకవర్గాల్లోని ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్వోల పోస్టులు ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో తెలపాలి. మొత్తం 42 మందికి 36 మంది ఉండగా ఆరుగుర్ని నియమించాలి. ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత విభాగాలకు సమాచారం ఇచ్చి వెంటనే వాటిని భర్తీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నేపథ్యంలో అవసరమయ్యే కొత్త బీఎల్వోలను నియమించుకోవాలి.

● **అవి 567 కేంద్రాలు:** జిల్లాలో భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమం, దక్షిణం, ఉత్తరం, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో మొత్తం 1,980 పోలింగ్ కేంద్రాలుంటే వాటిల్లో 1200 మంది ఓటర్ల కన్నా ఎక్కువ ఉన్నవి 567. ఇప్పటికే ఏ నియోజకవర్గంలో ఎన్ని ఉన్నాయో అధికారులు గుర్తించారు. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో వెయ్యి ఓటర్ల వరకు 916 కేంద్రాలుంటే... 1001 నుంచి 1149 వరకు 137, 1150 నుంచి 1199 వరకున్నవి 360.

★ పోలింగు కేంద్రాలను పెంచనున్న నేపథ్యంలో కొన్ని అపార్టుమెంట్ల కమ్యూనిటీ హాళ్లు, కాలనీ సంఘాల కార్యాలయాలు, అందరూ వినియోగించుకునే భవనాలను ఓటింగ్ కోసం ఉపయోగించాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

యువ క్రికెటర్లకు కాసుల పంట..!

వేలంలో పాల్గొన్న యాజమాన్య ప్రతినిధులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : యువ క్రికెటర్ల పంట పండింది. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో పాల్గొనే జట్లలో ఆడేందుకు అవకాశం వచ్చింది. ప్రతిభ చూపే క్రీడాకారుల్ని వేలంలో సొంతం చేసుకునేందుకు ఆయా జట్ల యాజమాన్య ప్రతినిధులు పోటీ పడ్డారు. సోమవారం నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్లో నిర్వహించిన వేలం పాటలో పలువురు క్రీడాకారులకు అధిక ధర పలికింది.

రూ.10 లక్షలు, ఆపై ధర పలికిన వారిలో అవినాష్, రిక్కీభుయ్, గిరినాథ్‌రెడ్డి, హనుమవిహారి, అశ్విన్ హెబ్బార్, రషీద్, నితీష్‌కుమార్‌రెడ్డి, భరత్ ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో పి.వి. సత్యనారాయణ రాజు (రూ.9.80 లక్షలు), ఎర్రా పృథ్వీరాజ్ (రూ.8.5 లక్షలు), టి.విజయ్ (రూ.7.55 లక్షలు), సీహెచ్.స్టీఫెన్ (రూ.7లక్షలు), ఎం.ధీరజ్‌కుమార్ (రూ.6.5 లక్షలు), కె.వి.శశికాంత్ (రూ.5 లక్షలు) ఉన్నారు. అతి తక్కువ ధర పలికిన వారిలో వై.సందీప్ (రూ.1.75 లక్షలు), కె.సాయితేజ (రూ.1.25 లక్షలు) ఉన్నారు.

పోటీ పడే జట్ల వివరాలు

రాయల్స్ ఆఫ్ రాయలసీమ (అక్షర ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్), భీమవరం బుల్స్ (మార్లిన్ గ్లోబల్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్), సింహాద్రి వైజాగ్ లయన్స్ (స్టీల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్), తుంగభద్ర వారియర్స్ (విజేత సూపర్ మార్కెట్ ప్రైవేటు లిమిటెడ్) , విజయవాడ సన్‌షైనర్స్ (మైత్రి మూవీ మేకర్స్), కాకినాడ కింగ్స్ (ఆర్.కె.స్టోర్స్), అమరావతి రాయల్స్ (అపర్ణ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్).

ప్రతిభకు గుర్తింపు..!

క్రికెటర్లను ఎంపిక చేసే సమయంలో ఆయా జట్ల యాజమాన్య ప్రతినిధులు ఆచితూచి వేలం పాట పాడారు. క్రీడాకారుల క్రీడాచరిత్ర పూర్తిగా పరిశీలించారు. ఎవరు ఎన్ని పరుగులు సాధించారు..? ఎన్ని వికెట్లు తీశారు..? ఆల్‌రౌండర్‌గా ఎవరు రాణిస్తున్నారు..? తదితర అంశాలపై బేరీజు వేసుకుని కొనుగోలు చేసుకున్నారు. వేలం పాటలో మొత్తం 520 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతి జట్టు 18 నుంచి 20 మంది క్రీడాకారులను కొనుగోలు చేసింది. వేలంలో పర్స్‌మనీ రూ.45 లక్షలుగా నిర్ణయించారు.

'970' ఓపీ.. విమ్స్ చరిత్రలో రికార్డు..!

ఆసుపత్రి ఓపీ విభాగం వద్ద రోగులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విమ్స్ ఆసుపత్రికి సోమవారం రికార్డు స్థాయిలో రోగులు వచ్చారని డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ విభాగాలైన గుండె, వినాళగ్రంధులు, నరాల వ్యాధులు, జీర్ణకోశ వ్యాధులు, ప్లాస్టిక్ సర్జరీ, క్యాన్సర్ విభాగాలకు 317 మంది వచ్చారన్నారు. సాధారణ విభాగాలైన జనరల్ మెడిసిన్, శ్వాసకోశ వ్యాధులు, చిన్నపిల్లల విభాగం, జనరల్ సర్జరీ, ఎముకల విభాగం, చెవి ముక్కు గొంతు, దంత, కంటి, వెన్నెముక వైద్య విభాగాలకు 653 మంది వచ్చారన్నారు. అన్ని విభాగాల నుంచి 970 ఓపీ నమోదైందని, విమ్స్ ప్రారంభించినప్పటి నుంచి ఇదే అత్యధికమన్నారు. అందులో క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసిన రోగులు 575 మంది ఉన్నారన్నారు. మరింత మంది వచ్చినా వైద్యులు, సిబ్బంది సహకారంతో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

'తల్లికి వందనం' అర్హులు ఖాతాలు తెరవాలి..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా తల్లికి వందనం పథకం అమలు చేయాలని నిర్ణయించిందని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా తెరిచి, దాన్ని ఆధార్ కార్డుకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. పోస్టాఫీసులలో ఖాతాలు తెరవడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారన్నారు. బ్యాంకు ఖాతా పుస్తకాలను సచివాలయాల్లో కార్యదర్శులకు అందించాలని, వారు వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు.

పాఠశాలలిలా... పాఠాలెలా!?

అసంపూర్తిగా పి.ఎం.పాలెం ఆర్.హెచ్.కాలనీ ప్రాథమిక పాఠశాల

ఆర్.హెచ్. కాలనీ పాఠశాలలో గదులు లేక ఫర్నీచర్ ఇలా... వాంబే కాలనీ జిల్లా పరిషత్ పాఠశాలలో అసంపూర్తిగా..

జిల్లాలో కొన్ని పాఠశాలల్లో సగం మంది విద్యార్థులే బల్లలపై కూర్చుంటారు. కొన్ని తరగతులే గదుల్లో జరుగుతాయి. ఎందుకీ పరిస్థితంటే భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచినందునే. గత వైకాపా ప్రభుత్వంలో ఆరంభించిన 'నాడు-నేడు' పనులు సకాలంలో పూర్తి కాలేదు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో గదులు చాలక చాలా మంది కిందే కూర్చొని పాఠాలు వినాల్సి వస్తోంది. వరండాల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. సర్కారు పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో నిధులు విడుదల చేసి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.– ఈనాడు, విశాఖపట్నం

ఏటికొప్పాక బొమ్మలకు జాతీయ పురస్కారం

కేంద్ర మంత్రి పియూష్ గోయల్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టరేట్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: అందానికి, కళాకారుల నైపుణ్యానికి పేరొందిన ఏటికొప్పాక లక్కబొమ్మలకు అవార్డు దక్కింది. 'ఒక జిల్లా .. ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో మెరుగైన ఫలితాలు సాధించడంతో దిల్లీలోని ప్రగతి మైదానంలో సోమవారం కేంద్ర మంత్రి పియూష్ గోయల్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఈ అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఏటికొప్పాక లక్కబొమ్మలకు అవార్డు రావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

(c) eenadu

నమూనాల నిధి... విజ్ఞాన గని..!

ఏఎంసీ అనాటమీ మ్యూజియానికి జాతీయస్థాయి గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే

ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) అనాటమీ విభాగం మ్యూజియంలో భద్రపర్చిన వివిధ నమూనాలు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. అవన్నీ వైద్య విద్యార్థులు, వైద్య పరిశోధకులు, పీజీలకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఇప్పుడు ఆ 'మ్యూజియం' జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

భద్రపర్చిన అస్థిపంజరాలు

చోటు దక్కిందిలా..!

★ ఇటీవల కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్ మ్యూజియమ్స్ అండ్ సైన్స్ సెంటర్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది.

★ మానవ, వివిధ జంతువుల అవయవాలకు సంబంధించి సుమారు 700 నమూనాలు మ్యూజియంలో ఉన్నాయి.

★ దేశంలోనే అతి పురాతన వైద్య కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఆంధ్ర వైద్యకళాశాలలో అనాటమీ విభాగం వైద్యవిద్య బోధనలో కీలక పాత్ర పోషిస్తుంది.

★ మానవ శరీర నిర్మాణ క్రమాన్ని ఇక్కడే వైద్య విద్యార్థులకు బోధిస్తారు. పార్థివదేహాల ఆధారంగా వైద్యపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తుంటారు.

భద్రతకు ప్రాధాన్యం

దేశ, విదేశాల్లో గుర్తింపు పొందిన మ్యూజియంలో నమూనాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ విభాగం అభివృద్ధికి కళాశాల పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందిస్తున్నారు.

అరుదైన ద్వితీయ ఉదర గర్భం

విదేశాల్లోనూ బోధన..!

★ ఇక్కడ ఉన్న కొన్ని నమూనాలను ఇప్పటికే పలుమార్లు విదేశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్య విద్యార్థులకు వివిధ అంశాలపై బోధన, అవగాహన కల్పించి.. తిరిగి తీసుకొస్తుంటారు. ★ ఏనుగు దంతం, రోజ్‌వుడ్‌తో తయారు చేసిన అస్థి పంజరాలు, ఖడ్గమృగం పుర్రె, తిమింగలం వెన్నుపూస, ద్వితీయ ఉదర గర్భం, ఒకే కాన్పులో ఆరుగురు జననం.. వంటి నమూనాలు మ్యూజియంలో కొలువుదీరి ఉన్నాయని అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్రకిషోర్ తెలిపారు.

తిమింగలం వెన్నుపూస

పోర్టులో కీలక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు

హాజరైన కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, శాంతనూ ఠాకూర్

ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, శాంతనూ ఠాకూర్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, షిప్పింగ్ కార్యదర్శి టీకే.రామచంద్రన్, పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే

విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో పూర్తి చేసిన కీలక ప్రాజెక్టులకు సోమవారం కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, శాంతనూ ఠాకూర్ ప్రారంభోత్సవాలు చేశారు. అదే సమయంలో మరికొన్ని నూతన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు విశాఖ పోర్టు సాధిస్తున్న ప్రగతిని కొనియాడారు. పోర్టు ఛైర్‌పర్సన్ కృషిని ప్రశంసించారు.

★ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, ప్రతి 50 కిలోమీటర్లకు ఓడరేవు ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు వివరించారు. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోర్టులో కాలుష్య నియంత్రణ చర్యలు అమలవుతున్నాయని, స్థానిక అంశాలపై పోర్టు ప్రతినిధులు సకాలంలో స్పందిస్తూ, పరిష్కారాలు చూపుతున్నారన్నారు. పోర్టు సాధించిన ప్రగతి వివరాలను ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర షిప్పింగ్ కార్యదర్శి టీకే.రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వచ్చినవి : ★ నూతన ఆయిల్ రిఫైనరీ బెర్త్-2 (రూ.42 కోట్లు), ఓఎస్‌టీటీపీ బెర్త్ వద్ద ఫైర్ ఫైటింగ్ సదుపాయాలు (రూ.27 కోట్లు), ఆర్-10 ప్రాంతంలో కవర్డ్ స్టోరేజ్ షెడ్ (రూ.22.50 కోట్లు), డబ్ల్యూక్యూ-5 జంక్షన్ నుంచి ఎస్సార్ జంక్షన్ వరకు రోడ్డు అభివృద్ధి (రూ.19.69 కోట్లు), కస్టమ్స్ కార్యాలయ రక్షణ గోడ విస్తరణ (రూ.7.17 కోట్లు), ఆర్ఎఫ్ఐడీ టేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (రూ.15 కోట్లు), నూతన పోర్టు ఆపరేటింగ్ సిస్టమ్ (రూ.10.77 కోట్లు), వెసల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (వీటీఎంఎస్) (రూ.15.83 కోట్లు).

★ వీటీఎంఎస్ ఈనెల 10 నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలోని రాడార్ సాయంతో ఇది పని చేస్తుంది. పోర్టు పరిధిలోని అన్ని నౌకల చలనాన్ని ఇది పర్యవేక్షిస్తుంది. ఇది ఐవీటీఎస్ ఫార్మాట్ డేటాను నొయిడాలోని ఎన్ఎండీఏసీకి చేరవేస్తుంది.

శంకుస్థాపనలు జరిగినవి : ★ పోర్టు ఏరియాలో బి-ర్యాంప్ నిర్మాణం (రూ.33.49 కోట్లు), చేపలరేవులో ఫింగర్ జెట్టీ, విప్ నిర్మాణం (రూ.20.87 కోట్లు), ఓఎస్‌టీటీ వద్ద రెండు అదనపు బ్రీస్టింగ్ డాల్ఫిన్ల నిర్మాణం (రూ.20.87 కోట్లు), క్రూయిజ్ టెర్మినల్ సమీపంలో నూతన నిర్మాణం (రూ.15.90 కోట్లు), అంబేడ్కర్ శతాబ్ది ఫ్లైవంతెన నుంచి ఎల్-17 కారిడార్ వరకు అదనపు ర్యాంపు (రూ.8.31 కోట్లు), పోర్టు ప్రాంతంలో 15 ప్రదేశాల్లో ప్రజల కోసం మరుగుదొడ్ల నిర్మాణం (రూ.5.50 కోట్లు).

నిర్ణీత సమయంలో సమస్యలకు పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) వివిధ సమస్యలపై వినతులు అందిస్తున్న అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడి... బాధితుల సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 384 మంది వద్ద కలెక్టర్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, సీపీవో ధనుంజయరావుతో పాటు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఇక్కడ ప్రతి బుధ, గురువారం అర్జీదారులతో ఆయన నేరుగా ఫోన్‌లో మాట్లాడి, సమస్య పరిష్కారం ఆరా తీస్తానని కలెక్టర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

వెంకట కిశోర్‌కుమార్ (పాతచిత్రం)

ఆనందపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆనందపురం-విశాఖపట్నం రోడ్డులో వేములవలస సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. గంభీరం పంచాయతీ దుక్కవానిపాలెం గ్రామానికి చెందిన సత్తాల శివ, అప్పలకొండ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు సత్తాల వెంకట కిశోర్ కుమార్ (25)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. అతడు మధురవాడ డివిజన్ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా విభాగంలో పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆటో నడుపుతూ తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున మధురవాడ వెళ్లేందుకు ఇంటి నుంచి ఆటోలో బయలుదేరాడు. ఆనందపురం కూడలి దాటాక వేములవలస సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అకస్మాత్తుగా నెమ్మదించడంతో ఆటో ఆ వాహనాన్ని ఢీకొంది. దీంతో ఆటో ముందు భాగం దెబ్బతినడంతో అతడు అందులో ఇరుక్కుపోయాడు. ప్రమాదానికి కారణమైన వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంట్యాడ సంతోష్ వెల్లడించారు.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోనల్ ఆఫీస్, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రపదేశ్-520007.

అద్దె ప్రాతిపదికన ఆవరణ కావలెను

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విశాఖపట్నం & అనకాపల్లి జిల్లాలో తమ నూతన శాఖల కోసం అద్దె ప్రాతిపదికన స్థానిక / మున్సిపల్ అధికారుల నుండి ఖచ్చితంగా వాణిజ్య అనుమతులు కలిగి ఉన్న ప్రాంగణానికై బిడ్‌లను ఆహ్వానిస్తుంది.

వ.నెం.	బ్రాంచ్ తరహా	ప్రాధాన్యతగల ప్రదేశం (పిన్‌కోడ్)	సుమారు కార్పెట్ ఏరియా (చ.అ.)
1	రెగ్యులర్ బ్రాంచి ATMతో	వేపగుంట జంక్షన్-530047	1400-1500 చ.అ.
2	రెగ్యులర్ బ్రాంచి ATMతో	మల్కాపురం-530011	1400-1500 చ.అ.
3	రెగ్యులర్ బ్రాంచి ATMతో	కూర్మానపాలెం-530012	1400-1500 చ.అ.
4	రెగ్యులర్ బ్రాంచి ATMతో	పరవాడ-531021	1000-1200 చ.అ.

ప్రతిపాదిత ఆవరణము ఏటియమ్ గదితో విడివిడిగా ప్రవేశం కలిగి ఉండి క్రింద అంతస్థులో (తగినంత పార్కింగ్ స్థలముతో) అద్దె ప్రాతిపదికపై నూతన శాఖను ఏర్పాటు చేయుటకు వీలుగా ఉండవలెను. ఈ ఆవరణము చాలినంత విద్యుత్ సామర్థ్యము, బ్యాంక్ వారి యొక్క అవసరములు మరియు ప్రమాణములు అనుసరించి ఇతర మౌలిక సదుపాయములు కూడా కలిగి ఉండవలెను. ఆవరణము వెంటనే స్వాధీనం చేసికొనుటకు సిద్ధముగానూ లేదా బ్యాంక్ యొక్క అవసరములకు లోబడి 10 నుండి 15 రోజులలోగా సిద్ధముగా ఉండవలెను. కావున ఆసక్తి కలిగియున్న పార్టీలు / వ్యక్తులు బ్యాంక్ యొక్క సంబంధిత నమూన దరఖాస్తు ద్వారా వారి ఆఫర్లను "టెక్నికల్ బిడ్" మరియు "కమర్షియల్ బిడ్"గా తెలియజేసి రెండు విడివిడిగా కన్‌సీల్డ్ కవర్ల యందు ఉంచి, కవరుపై "టెక్నికల్ బిడ్" / కమర్షియల్ బిడ్‌గా పేర్కొని, **జోనల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, 1వ అంతస్థు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం. 59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007** వారి కార్యాలయము నందు **తేది.25.07.2025, సాయంత్రం గం. 5.00 లోగా** సమర్పించవలసినదిగా కోరుచున్నాము.

ఈ సంబంధిత దరఖాస్తులు పై చిరునామా వద్ద కార్యాలయము పనివేళలయందు వ్యక్తిగతముగా పొందవచ్చును. మరియు మా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: **www.bankofmaharashtra.in** లో "టెండరు" విభాగము క్రింద ఈ టెండరు ప్రకటనతో పాటుగా డౌన్‌లోడ్ చేసుకొనగలరు. కారణం ఏదైనప్పటికినీ తెలియచేయు అవసరం లేకుండా ఏ ఆఫరునైనా రద్దు/ తిరస్కరించు పూర్తి అధికారము / హక్కు బ్యాంక్ వారు కలిగియున్నారు. ఏవిధమైన బ్రోకరేజీ చెల్లించబడదు. అసంపూర్తిగా ఉన్న మరియు ఆలస్యముగా అందిన అనగా **తేది.25.07.2025, సాయంత్రం గం. 5.00** ల తరువాత వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించబడవు. అదనపు వివరముల కొరకు **pln_vjd@mahabank.co.in, gad_vjd@mahabank.co.in, ఫోన్: 08662480133, 7013388468** సంప్రదించగలరు.

ఉద్యోగుల నియామకాల్లో రిజర్వేషన్ తప్పనిసరి

మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ, వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగుల నియామక ప్రక్రియలో ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు ఆదేశించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సోమవారం ఆయన పర్యటించి అధికారులు, ఎస్టీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎస్టీ ఉద్యోగుల నియామకంలో రిజర్వేషన్ల అమలు తీరును తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో బోధన, బోధనేతర, ఒప్పంద, పొరుగు ఉద్యోగుల నియామకాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు. ఏయూలో చదివే గిరిజన విద్యార్థులకు కంప్యూటర్, వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏ.ఎ. తెలుగు విద్యార్థిని సరోజ మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలకు వెళ్లేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. బీటెక్ విద్యార్థి పవన్ మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో చదువుకొనేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు. దూరవిద్యా కేంద్రం ప్యాకల్టీ విద్యార్థులు మాట్లాడుతూ పర్యాటకం పేరుతో గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి వనరుల ధ్వంసం చేస్తున్నారని, అక్కడి సంస్కృతి కూడా దెబ్బతింటుందని తెలిపారు. ఎస్టీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్యులు జర్రా అప్పారావు, కంజా నాగేశ్వరరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు పంచకర్ల సందీప్, తదితరులు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు సోమవారం విశాఖలోని భీమిలి పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం సందీప్ మీడియాతో మాట్లాడుతూ అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తి భీమిలి నియోజకవర్గంలోని మధురవాడ పరిసర ప్రాంతానికి చెందిన వైకాపా సామాజిక మాధ్యమ ప్రతినిధిగా తాము ప్రాథమికంగా గుర్తించామన్నారు. పోస్టులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు, కంటెంట్‌లను, ఇతర ఆధారాలను పోలీసులకు సమర్పించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో జనసేన భీమిలి మండల శాఖ అధ్యక్షులు నక్కా శ్రీధర్, నాయకులు కృష్ణయ్య, భువనేశ్వరి, అనురాధ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సమష్టి కృషి

మాట్లాడుతున్న సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, చిత్రంలో డైరెక్టర్ సూర్యప్రకాశ్, ఉన్నతాధికారులు

గురుద్వారా, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకం అమలుకు బ్యాంకులు, సోలార్ విద్యుత్తు సంస్థలు సమష్టిగా కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) ఇమ్మడి పృథ్వీతేజ్ సూచించారు. గ్రీన్‌పార్కు కాలనీ దరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం సోలార్ వెండర్లు, బ్యాంకులు, సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విశాఖలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాల ద్వారా పీఎం సూర్యఘర్ పథకం గురించి ప్రజలకు వివరించి సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సిరిపురం, సీతమ్మధార, ఎంవీపీకాలనీ, మద్రిపాలెం, కంచరపాలెం, ఎన్ఎస్‌టీఎల్, మధురవాడ, ఎండాడ, గోపాలపట్నం, గాజువాక వంటి ప్రాంతాల్లో లక్ష్యానికి అనుగుణంగా సోలార్ యూనిట్ల ఏర్పాటు చేయించలేకపోయారని ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అతి తక్కువ వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ రుణాలను వినియోగదారుల నుంచి విద్యుత్తు బిల్లులు ద్వారా నెలవారీ పద్ధతిలో బ్యాంకుల తరఫున వసూలు చేసేందుకు ఈపీడీసీఎల్ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాశ్, సీజీఎం బి.సులేఖరాణి, ఎస్ఈ శ్యాంబాబు, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీజీబీ ప్రాంతీయ మేనేజర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ యంత్రాలతో సాంకేతిక లోపాల గుర్తింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విద్యుత్తు ఇంజిన్ రైళ్లలో ఎదురయ్యే విద్యుత్తు సంబంధించి సమస్యల్ని గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు వీలుగా మెజరింగ్, రికార్డింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఎంఆర్ఐ) స్కాన్ యంత్రాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విద్యుత్తు లైన్లలో భద్రత, సామర్థ్యంపై తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ అధునాతన పరికరాలను భారతీయ రైల్వే అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. వాల్తేర్ రైల్వే పరిధిలో నూతన వ్యవస్థను వినియోగిస్తామని ఆయన తెలిపారు. డీఆర్ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ... నిత్యం నిర్వహించే వివిధ తనిఖీల్లో గుర్తించే లోపాలను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే వీలుంటుందన్నారు. నూతన విధానం అమలుతో రైళ్లు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతాయన్నారు.

ఇంటర్వ్యూలకు 34మంది హాజరు

అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జిల్లా వృత్తివిద్య అధికారి మజ్జి ఆదినారాయణ తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టుల పోస్టుల్లో అతిథి (గెస్టు) అధ్యాపకులను నియమించడానికి సోమవారం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించామని జిల్లా వృత్తివిద్య అధికారి మజ్జి ఆదినారాయణ తెలిపారు. భౌతికశాస్త్రం 1, జంతుశాస్త్రం 2, వృక్షశాస్త్రం 1, ఫిజియోథెరపి 1, మొత్తం ఐదు పోస్టులకు 34 దరఖాస్తులు వచ్చాయన్నారు. అభ్యర్థులకు ఉదయం ఇంటర్వ్యూలు, మధ్యాహ్నం కళాశాలలో డెమో తరగతులు నిర్వహించామన్నారు. ఎంపికైన వారికి రెండు రోజుల్లో సమాచారం తెలియజేస్తామని పేర్కొన్నారు.

సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన తప్పనిసరి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, చిత్రంలో గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ వెంకట్రావు

సబ్బవరం, న్యూస్‌టుడే: నేటి తరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ముందుకు సాగాలని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వెంకట్రావు సూచించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ)లో చేరే 3, 5 ఏళ్ల లా కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ముగ్గురు తల్లులను గుర్తుపెట్టుకోవాలని.. ఇందులో మొదటిది జన్మనిచ్చిన తల్లి, రెండోది చదువుకున్న విశ్వ విద్యాలయం, మూడోది భారత మాత అని పేర్కొన్నారు. ఈ మూడింటిని గౌరవించినప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలమని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిలా ఉంటూ అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూలో మంచి సౌకర్యాలు, పచ్చదనాన్ని అందిస్తున్న అధికారులను అభినందించారు. తొలుత డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒక న్యాయ విద్యార్థికి సమాజం మీద పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టాలను సులభంగా అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు. లాయర్‌గా ప్రతి విద్యార్థి సామాజిక, ఆర్థిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ (ఇన్‌ఛార్జి) డాక్టర్ మాదాసు విశ్వచంద్రనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి చికిత్స

చికిత్స జరిగిన మహిళతో వైద్యాధికారులు, సిబ్బంది

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో నగరానికి చెందిన పి.లక్ష్మి(39)కికిడ్నీ మార్పిడి చికిత్స విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారిణి డాక్టర్ ఐ.వాణి తెలిపిన వివరాల ప్రకారం... తీవ్రమైన కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బాధితురాలు కొంతకాలంగా కేజీహెచ్ డయాలసిస్ విభాగంలో చికిత్స పొందుతోంది. బాధితురాలి తల్లి కిడ్నీ దానం చేసేందుకు ముందుకు రావడంతో ఈనెల 2న కిడ్నీ మార్పిడి చికిత్స నిర్వహించారు. బాధితురాలు కోలుకోవడంతో సోమవారం ఇంటికి పంపించారు. ఏ ఖర్చూ లేకుండా ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నామని, అవసరమైన వారు వైద్యసేవల్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వాణి సూచించారు. నెఫ్రాలజీ, యూరాలజీ, ఎనస్థీషియాలజీ వైద్య నిపుణులు రాధాకృష్ణన్, రత్నప్రభ, సింధూర్, నాగబాబు, నిషాకుమారి, జయశ్రీలక్ష్మి, దివ్య, సంతోష్ తదితరులను ఆసుపత్రి సూపరింటెండెంట్ అభినందించారు. కిడ్నీ దాత ఎం.లక్ష్మిని వైద్యాధికారులు సత్కరించారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

ప్రాణాలు కోల్పోయిన యువకుడు

శెట్టి ఎల్లాజీ (పాతచిత్రం)

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మద్యం మత్తులో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన నిందితుడు పరారవగా, బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సోమవారం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి. పాతనగరం ఎల్లమ్మతోటలో నివాసం ఉంటున్న శెట్టి ఎల్లాజీ(20), అతడి స్నేహితుడు అయ్యప్ప(21) ఆదివారం అర్ధరాత్రి వరకు జగదాంబకూడలి సమీపంలో మద్యం తాగారు. రాత్రి 12.30 గంటలకు ఎవరికి వారు ఇళ్లకు బయలుదేరారు. ఆ తర్వాత ఒంటి గంట సమయంలో అల్లిపురం సమీప కెప్టెన్ రామారావు కూడలి వద్ద అయ్యప్పకు ఇంకొందరు యువకులకు గొడవ జరిగింది. అయ్యప్ప వెంటనే ఎల్లాజీకి ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఎల్లాజీ అక్కడకు చేరుకుని, గొడవ పడుతున్న యువకులకు నచ్చజెప్పి పంపించేశాడు. వాళ్లను కొట్టకుండా ఎందుకు పంపించావని ఎల్లాజీని అయ్యప్ప ప్రశ్నించాడు. అయ్యప్ప మాటలు పట్టించుకోకుండా ఎల్లాజీ ఇంటికి బయలుదేరాడు. ఆగ్రహించిన అయ్యప్ప మరో ఇద్దరు స్నేహితుల్ని పిలిచి డాబాగార్డెన్స్ వైపు వెళ్తున్న ఎల్లాజీపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎల్లాజీ స్నేహితులు అక్కడకు చేరుకుని, బాధితుడిని కేజీహెచ్‌కు తరలించారు. ఎల్లాజీ అక్కడే చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నారు. ★ ఎల్లాజీ ఆసుపత్రికి చేరేటప్పుడు ఓ కత్తి వీపు భాగంలో గుచ్చుకుని ఉంది. మరోకత్తి అతడి జేబులో ఉంది. ఎల్లాజీ స్థానికంగా పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. అతడి తల్లి పార్వతీపురంలో ఉంటున్నారు. మృతదేహానికి శవపరీక్షలు పూర్తి చేసి, మంగళవారం ఉదయం అప్పగిస్తామని వైద్యులు తెలిపారు.

మందలించినందుకు కానిస్టేబుల్‌పై దాడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతవెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన మహిళ (32) 10ఏళ్ల కిందట భర్తతో విడిపోయి వేరుగా ఉంటోంది. 9ఏళ్ల కిందట వై.దేముడు అనే వ్యక్తితో ఆమెకు పరిచయమైంది. ప్రేమగామారి ఇద్దరూ సహజీవనం ప్రారంభించారు. రెండేళ్లుగా దేముడు ఆమెపై అనుమానం పెంచుకుని తరచూ కొడుతున్నాడు. దీంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. దేముడు ఆదివారం అక్కడికెళ్లి వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ యోగేశ్వరరావు అతనింటికి వెళ్లి మందలించారు. ఆగ్రహంతో దేముడు ఆయనపై దాడి చేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తీవ్ర విషాదంలోనూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు

లోకేశ్ (పాతచిత్రం)

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: చనిపోయిన తర్వాత అవయవదానం చేసి ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడో వ్యక్తి. రాష్ట్ర అవయవదాన కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన టి.లోకేశ్ (36) ఆదివారం సాయంత్రం ఎల్.కోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు దెబ్బతగిలి విపరీతంగా రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అంబులెన్స్‌లో విశాఖలోని విమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఆరోగ్యం మెరుగుపడకపోవటంతో సోమవారం బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. దీంతో కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో మృతుడి నుంచి జీవస్థితిలో ఉన్న రెండు మూత్రపిండాలు(కిడ్నీ), కాలేయం తీసి జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం ఆసుపత్రులకు కేటాయించామని డాక్టర్ రాంబాబు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కు మరణించి తీవ్ర విషాదంలో ఉన్నా.. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చి ఔదార్యం చాటుకున్న కుటుంబసభ్యులను సన్మానించి అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు.

చంకలో బిడ్డతో తల్లి ఆత్మహత్య

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రెండేళ్ల చిన్నారిని చంకలో పెట్టుకొని తల్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని దిమిలిరోడ్డు సమీపంలో పాతవీధికి చెందిన రాజు కాయగూరల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య జి.రూప (22), మూడున్నరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. సోమవారం రాత్రి మేడపై గదిలోకి వెళ్లిన రూప కుమార్తెను చంకలో పెట్టుకొని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉరి మెడకు బిగుసుకున్నాక రూప చేతిలోంచి బిడ్డ జారి కాళ్లవద్ద పడి ఏడవడం ప్రారంభించింది. ఏడుపు విని స్థానికులు మేడపైకి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందింది. దీంతో వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరవాడ డీఎస్పీ, స్థానిక పోలీసులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పెళ్లి ఇష్టం లేదని తన కుమార్తె చెబుతుండేదని తల్లి సలాది నూకరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	70
లైవ్	103	90
డ్రెస్‌డ్	149	150
స్కిన్‌లెస్	170	160

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆఫర్ మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీనిధి గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆఫర్ మార్కెట్ రేటుకు కొనబడును. అధిక ధరలు ఇవ్వబడును. ✆ 9908545224.

REAL ESTATE

FLAT FOR SALE

SUJATHANAGAR

2 BHK Dream Home Sapthagiri Nagar, Chinamushidiwada (Beside Maseedu) East Facing 1090 Sq. Ft. Spacious, well-lit, and perfect for families ✆ Call now: 8886702221

PLOT FOR SALE

GENERAL

VUDA Plot 340 Sq.yds. North and East Corner in Vizag City. ✆ 9490436614.

PERSONAL CLASSIFIEDS

LOST

Lost my Original Sale Deed (Document No.8346/94) while travelling from Peda Waltair to Siripuram by Auto on 09.07.2025. If found, please contact my mobile no: 9912960936

WANTED

GENERAL

WANTED Godown For Rent
Sree Murali Mohana Boiled & Raw Rice Mill Private Unlimited (BELL BRAND RICE)
Location: Visakhapatnam City
Facing: North, East, North East Block
SIZE: 2000 SFT Approximately
Contact: 9490564901

JOBS

Wanted Courier Pick up Boys for International Couriers, Vizag (Salary + Petrol) Ph: 9966052040, 9703999808

Wanted Chief Managers for a reputed long standing company Vizag. Any qualification, Full / Part Time working, Rtd. M/F, Age: 30+, Yearly Package decide at the time of Interview. Con: B. Chandrasekhar - GM. ✆ 9246674326

TO LET

COMMERCIAL

GENERAL

Commercial Warehouse (3500 Sq.Ft) for rent with all amenities. Ph: 9440878300/ 7981741475

Wanted for Vizag 1) B.Tech Civil with 1Yr. Exp. 2) DCE with 2Yrs Exp. Firm: Sir MVITS IND Pvt Ltd. ✆ 9849957401, 9177598545.

WANTED STAFF
SALES GIRLS AND BOYS well experienced in silver counter sales
Age: 25 to 40 years
Salary: 15,000 to 25,000/-
ANNAPURNA SILVER PALACE
B.C. ROAD, NEW GAJUWAKA
Ph: 9391919261

FACULTY/ TEACHERS

Wanted CBSE Accountancy teacher for a reputed residential school in Anandapuram-Visakhapatnam. Contact: 9493887644

ACCOUNTING

Wanted Tally operator, Qualif: Tally certificate. Salary 14000/-, Exp: 0-2 years. Call: 9866048888.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారుల విశ్వసనీయత లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏదైనా డబ్బును వసూలు చేయుట, డబ్బును వసూలు చేసే ప్రకటనకర్త బ్యాంక్- వివరాలు పత్రికలో ఉంచే నిమిత్తం మరియు/ లేదా అతనిపై చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి ఉంది.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తి, న్యూస్‌టుడే
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - **సూపర్ మ్యాన్ (2డీ తెలుగు)**
స్క్రీన్-2 - **ఓ భామ.. అయ్యో రామ**

బిల్లులు చెల్లించాలని నిరసన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మా కంపెనీ ఎదుట సోమవారం మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టుకు చెందిన ప్రతినిధులు నిరసన చేపట్టారు. ప్రధానద్వారం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. కంపెనీలో చేసిన ఫ్యాబ్రికేషన్ పనులకు చెందిన బిల్లులను కంపెనీ యాజమాన్యం చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రతిభా పురస్కారాలకు యాదవ సామాజికవర్గ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి డొక్కరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులకంటే ఎక్కువ సాధించిన, జేఈఈ, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాలులో పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఇతర వివరాలకు 81434 46565 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 94వ వార్డు రవినగర్‌లో 6బి/8/2, 6బి/8/3 వీధి దీపాలు నెల రోజులుగా వెలగడం లేదు. – శ్రీలక్ష్మి, రవినగర్ ✓: వీధి దీపాలను మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. – హరిబహదూర్, వీధి దీపాల నిర్వహణ అధికారి

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్ఆర్ఎం కాలనీలోని వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు ✓: కాలనీలో పరిశుభ్రత పనులు చేపట్టడానికి చర్యలు చేపడతాం. – ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం మెయిన్ రోడ్డులో దీపాలు వెలగడం లేదు. ఫలితంగా రాత్రుళ్లు రోడ్డుకు మీద వెళ్లాలంటే భయమేస్తోంది. వెంటనే దీపాలు వెలిగించాలి. – సబ్బవరం, గ్రామస్థులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – అశోక్‌కుమార్, ఏఈ

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాహనాలను వెంబడిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. వెంటనే వాటిని పట్టి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాలి. – వై.రామునాయుడు, సబ్బవరం ✓: కుక్కలను పట్టుకునే ఏర్పాటు చేస్తాం. – వై.రాజేశ్వరరావు, కార్యదర్శి, సబ్బవరం

నిర్వహణ కొరవడి.. నిరుపయోగంగా మారి..
గ్రామాల్లో పడకేసిన ఆర్వో ప్లాంట్లు

దేవాడలోని ప్లాంటు చుట్టూ పెరిగిన ముళ్ల చెట్లు

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే అందించాలనే ఉద్దేశంతో కొన్నాళ్ల క్రితం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో పరిసర గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లను నిర్మించింది. ఒక్కో దానికి సుమారు రూ.10 లక్షల పైనే ఖర్చు చేసింది. వీటిని ప్రారంభించిన తర్వాత జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. కొన్నాళ్లు బాగా పనిచేసినా జీవీఎంసీ సిబ్బంది నిర్వహణను గాలికొదిలేయడంతో పడకేశాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెం, దేవాడ, చినపాలెం గ్రామాలతో పాటు 79వ వార్డులోని దేశపాత్రునిపాలెంలోని శుద్ధినీటి ప్లాంటు గతకొన్నాళ్లుగా నిరుపయోగంగా మారి దిక్కులు చూస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. వీటిని మంచి లక్ష్యంతో నిర్మించినప్పటికీ మూతపడటంతో సీఎస్ఆర్ నిధులు వృథా అవుతున్నాయని వాపోతున్నారు.

పరిశీలన

శుద్ధి నీటికి ఇక్కట్లు పడుతున్న ప్రజలు: ★ పిట్టవానిపాలెంలో బోరు మూలకు చేరడంతో ప్లాంటును మూసివేశారు. ఇక్కడ సుమారు 1500లకు పైగా జనాభా నివసిస్తున్నారు. పరిశ్రమల కారణంగా భూగర్భజలాలు కలుషితం కావడంతో శుద్ధి నీటికి అవస్థలు పడుతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

★ దేవాడ, చినపాలెంలోని ప్లాంట్లు పడకేయడంతో వీటిచుట్టూ ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. ఆర్వో యంత్ర సామగ్రి తుప్పుపట్టాయి. గతంలో రెండు గ్రామాల్లో 2 వేలకు పైగా జనాభా వీటిని వినియోగించుకునేవారు. వ్యయప్రయాసలు పడుతూ సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. చినపాలెంలో విద్యుత్తు కనెక్షన్ లేదు.

★ దేశపాత్రునిపాలెంలో భూగర్భ జలాలు అడుగంటాయనే కారణంతో ప్లాంటును మూసివేశారు. బోరులోని విద్యుత్తు మోటారును అధికారులు బయటకు తీసి వదిలేశారు. ప్రస్తుతం ఆ మోటారు ఎక్కడుందో తెలియని పరిస్థితి. గ్రామంలోని సుమారు 5 వేల మంది వినియోగించే ఈ ప్లాంటు మూతపడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, పాలకులు స్పందించి ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చినపాలెంలో నిరుపయోగంగా ఆర్వో యంత్ర సామగ్రి

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ నుంచి విజయరాంపురం మధ్య సుమారు 2 కిలోమీటర్ల పొడవు గల గుంతల రహదారి కూటమి ప్రభుత్వంలో అద్దంలా రూపుదిద్దుకుంది. గత వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పట్టించుకోకపోవడంతో రహదారి పొడుగునా పెద్దపెద్ద ప్రమాదకర గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. వర్షం పడితే గుంతలు నీటి కుంటలను తలపించడంతో పాటు రహదారి మొత్తం చిత్తడిగా మారడంతో అటుగా రాకపోకలు సాగించడానికి వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రోడ్డును నూతనంగా నిర్మించడంతో పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన చోదకులకు న్యాయస్థానం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై నరసింగరాజు తెలిపారు. సోమవారం 8 మందిని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.80 వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

16 నుంచి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 16 నుంచి 19 వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు **వడ్డేపల్లి రామచందర్** విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 16న రాత్రి 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో విశాఖ చేరుకుని, హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. 17న ఉదయం 10 గంటలకు మిందిలోని బీహెచ్ఈఎల్ ప్లాంట్‌ను సందర్శించి, అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో సమావేశమవుతారు. 18న ఉదయం హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంట్‌ను సందర్శించి, వివిధ అంశాలపై అధికారులతో మాట్లాడతారు. సాయంత్రం విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్, సీపీ, ఇతర అధికారులతో సమావేశమై వివిధ పథకాల అమలుపై చర్చిస్తారు. 19న రాత్రి బయలుదేరి దిల్లీ వెళ్తారు.

గణనాథుడి సన్నిధిలో సంకష్టహర చతుర్థి పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే: సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని పెందుర్తి మండలంలోని పలు వినాయక ఆలయాల్లో సోమవారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. పెదగాడి గ్రామంలోని స్వర్ణాకర్షక కాలభైరవ ఆలయ ప్రాంగణంలో కొలువైన సంకటహర గణపతికి విశ్వసాయి గురూజీ ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు జరిపారు. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని సంపత్ వినాయక ఆలయంలో గణనాథుడికి అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వేంపరాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పండితులు వైదిక కార్యక్రమాలు జరిపారు.

పెదగాడిలో పూజలందుకున్న వినాయకుడు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

వేపగుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, నియోజకవర్గం పరిశీలకుడు కోరాడ రాజబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేపగుంట ముత్యమాంబ కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. టిడ్కో ఇళ్లకు డీడీలు తీసినా ఇళ్లు రాలేదని, సెంటు స్థలాలను గత ప్రభుత్వం ఇస్తానని చెప్పి ఇవ్వలేదని వాపోయారు. ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని నేతలు చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ

పీజీఆర్ఎస్‌కు 11 అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు స్వీకరించారు. లక్ష్మీపురంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని జనచైతన్య లేఅవుట్, జ్యోతీనగర్, గొల్లవిల్లివానిపాలెంలో యూజీడీ, రోడ్లు కాలువలు నిర్మించాలని, చీమలాపల్లిలో పందులు, శేషాద్రినగర్‌లో పిచ్చిమొక్కల సమస్యలను పరిష్కరించాలని, బుచ్చిరాజుపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలని, నరసింహనగర్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పరవాడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ మల్లికార్జునరావు సూచించారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని అనుమానితులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తు పదార్థాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అతివేగంతో వాహనాలను నడపరాదని, శిరస్త్రాణాలు తప్పకుండా ధరించాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదన్నారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పచ్చదనం, పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పెందుర్తి శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ తారకేశ్వరరావు సూచించారు. 'గ్రీన్ ఇండియా - క్లీన్ ఇండియా' పేరుతో సోమవారం పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముగిసిన ఓటరు నమోదు శిక్షణ శిబిరం

పెందుర్తి, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు చేపట్టిన ఓటరు నమోదు శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. నియోజకవర్గంలోని 299 మంది బీఎల్‌వోలకు ఈ నెల 7వ తేదీ నుంచి బ్యాచ్‌ల వారీగా పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. చివరి బ్యాచ్‌కు శిక్షణ పూర్తవడంతో ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ అర్జునరావు బీఎల్‌వోలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

బీఎల్‌వోలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎన్నికల విభాగం డీటీ అర్జునరావు

సయాంక్ ఫార్మాకు టెక్ ట్రాన్స్‌ఫార్మర్ పురస్కారం

పరవాడ, న్యూస్‌టుడే: ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు నిర్వహించిన పోటీల్లో పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని సయాంక్ ఫార్మా సంస్థకు టెక్ ట్రాన్స్‌ఫార్మర్-2025 పురస్కారం వరించిందని కంపెనీ డైరెక్టర్లు జెట్టి సుబ్బారావు, డి.శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ ఉన్నతాధికారుల చేతులమీదుగా పురస్కారం అందుకున్నామన్నారు. ఈ మేరకు సయాంక్ ఫార్మాలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం రావడానికి కృషి చేసిన కంపెనీ సిబ్బందిని అభినందించారు.


అవార్డులను చూపుతున్న కంపెనీ డైరెక్టర్లు సుబ్బారావు, శ్రీకాంత్, చిత్రంలో ఉద్యోగులు

త్వరితగతిన 'పీ-4' మార్గదర్శకుల గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీ-4'కు సంబంధించి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'పీ-4' అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కనీసం పది వేల మంది ఔత్సాహికుల్ని గుర్తించి, బంగారు కుటుంబాలను అనుసంధానం చేయాలన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. గెజిటెడ్ ర్యాంకు కలిగిన ప్రతి అధికారి కనీసం ఓ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. దత్తత తీసుకోలేని వారు ఆర్థికంగా సాయం చేయాలన్నారు. 'పీ-4'లో చేరినా, తోడ్పాటు అందించిన వారికి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో భవానీశంకర్, సీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో జేసీ

నేడు రాష్ట్రమంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం విశాఖ రానున్నారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ భవనం, 11.15 గంటలకు పెదవాల్తేర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మధ్యాహ్నం 12.30 గంటకు గీతం వైద్య కళాశాలలో పలు పథకాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. రాత్రికి రైల్లో బయలుదేరి విజయవాడ వెళ్తారు.

పార్కు స్థలం ఆక్రమణకు యత్నం

వేపగుంట, న్యూస్‌టుడే: కాలనీల్లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. సచివాలయాలకు కూతవేటు దూరంలో ఉన్నా కార్యదర్శులు ఏమీ పట్టనట్లు ఉండిపోతున్నారు. స్థానికులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేసినా సరైన సమాధానాలు చెప్పడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో 23 సెంట్ల పార్కు స్థలంలో కొందరు రేకుల షెడ్లు వేశారు. పార్కు స్థలంలో ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ నిధులను కాలనీలో గుడికి, బడికి కేటాయించిన స్థలాన్ని పార్కుగా చూపించేసి అందులో ఈ నిధులతో ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎల్‌జీనగర్‌లోని పార్కు

ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

సబ్బవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నాయకత్వ శిక్షణ కార్యక్రమం సోమవారం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని.. తద్వారా తమ పాఠశాలల్లో ఉత్తమ ప్రమాణాలు కలిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి బి.అప్పారావునాయుడు పేర్కొన్నారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర పర్యవేక్షకులు డాక్టర్ శేషగిరి, ఎంఈవో ఎం.జే రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డా.జయప్రకాష్, అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ కజియా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

పార్కులు, ఖాళీ స్థలాల పరిరక్షణపై దృష్టి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థకు చెందిన పార్కులు, ఖాళీ స్థలాలను పరిరక్షించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రణాళికాధికారులతో సమావేశమయ్యారు. పార్కులు, ఖాళీ స్థలాలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నట్టు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉంటూ జీవీఎంసీ ఆస్తులు పరిరక్షణ కోసం పని చేయాలన్నారు. జీవీఎంసీ పార్కులపై ప్రణాళిక అధికారులు అరకొర సమాచారం ఇచ్చారని, మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి వివరాలు సమర్పించాలని మేయర్ సూచించారు. ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

'సమన్వయంతో పని చేయండి'

విభాగాధిపతులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. సోమవారం ఆయన ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగే సమయంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, ఆయా చోట్ల భవిష్యత్తులో చేపట్టబోయే పనులపై ఆరా తీయాలన్నారు. ప్రజలకు అవసరమైన నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీసీలు డీవీ.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, సీసీపీ ప్రభాకర్, వ్యయ పరిశీలకులు వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

ఇంటర్ కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: గాజువాక ఆర్కే ఆసుపత్రి వెనుక ఉన్న ఓ ఇంటర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురంకాలనీలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేశారు. 'ప్రథమ సంవత్సరం విద్యార్థులు రూ.10వేలు చెల్లించి కళాశాలలోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. కొంతమంది ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వద్ద ఆ పుస్తకాలు తీసుకుంటే అదనంగా ఫీజు వసూలు చేస్తామని బెదిరిస్తున్నార'ని విద్యార్థులు వాపోయారు. దీనిపై ఇంటర్ బోర్డు ఆర్.ఐ.ఓ. మురళీధర్ మాట్లాడుతూ తక్షణమే కళాశాలను సందర్శించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా విశాఖ వాసి విక్రమ్

రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీల్లో విజేత, రన్నరప్‌లతో బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని శ్రీసాయి శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి 185 మంది బాడీబిల్డర్లు పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విశాఖకు చెందిన విక్రమ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా నిలువగా.. రన్నరప్‌గా తణుకుకు చెందిన నాగేంద్ర నిలిచారు. విక్రమ్‌కు రూ.40,000, నాగేంద్రకు రూ.20,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ధ్రువపత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచిన బాడీబిల్డర్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందించారు.

పాఠశాల భవనంలోనే వసతి గృహం
ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు అష్టకష్టాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థుల సంఖ్య ఏటా పెరగడం, ఉన్న గదులు చాలకపోవడంతో పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించారు. అయితే దీన్ని చదువు కోసం కాకుండా బీసీ వసతి గృహంగా వినియోగించడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. తాత్కాలిక వసతి కోసం కేటాయించిన ఈ భవనంలో ఎనిమిదేళ్లుగా విద్యార్థులు ఉంటున్నారు. వీరికి శాశ్వత భవనం సమకూరకపోవడంతో సరైన సౌకర్యాలు లేక వసతి గృహం విద్యార్థులు.. గదులు సరిపోక పాఠశాల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం కథ ఇది.

● **తాత్కాలికంగా వచ్చి.. శాశ్వతంగా తిష్ఠ..:** 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.42 లక్షలతో రెండు అంతస్తుల్లో అదనపు తరగతి గదులను నిర్మించింది. అదే సమయంలో బీసీ వసతి గృహం నిర్మాణాన్ని ప్రారంభించడంతో అక్కడి విద్యార్థులను తాత్కాలికంగా పాఠశాలలో నిర్మించిన భవనంలోకి తీసుకొచ్చారు. అనంతరం నూతనంగా నిర్మించిన వసతి గృహాన్ని పోస్టుమెట్రిక్ విద్యార్థులకు కేటాయించడంతో ప్రీమెట్రిక్ వారికి భవనం లేకుండా పోయింది. అప్పటినుంచి ఈ రెండు అంతస్తులను బీసీ వసతి గృహంగానే వినియోగిస్తున్నారు. ఇందులో ప్రస్తుతం 120 మంది విద్యార్థులున్నారు. ఇరుకైన గదుల్లో మంచాలు ఉండడంతో గాలి సక్రమంగా రాక ఒక్కోసారి ఊపిరాడని పరిస్థితి నెలకొంటోందని పిల్లలు చెబుతున్నారు. మరుగుదొడ్లు సరిపడినన్ని లేకపోవడంతో పాటు డైనింగ్ హాల్ లేక ఆరు బయటే భోజనం చేయాల్సిన దుస్థితి.

వసతి గృహంగా కొనసాగుతున్న పాఠశాల భవనం

ఇరుకు గదిలో ఉంచిన మంచాలు

● **సుమారు 1300 మంది పిల్లలు..:** పాఠశాల భవనాన్ని బీసీ వసతి గృహంగా వినియోగించడంతో సాధారణ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాల పీఎంశ్రీ పథకం కింద ఎంపికైంది. ఇందులో భాగంగా సబ్జెక్టుల వారీగా ల్యాబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేగాకుండా జిల్లాలోనే సుమారు 1300 మంది విద్యార్థులు రెండో అతిపెద్ద పాఠశాలగా ఉంది. ఈ నేపథ్యంలో తరగతుల నిర్వహణ, ల్యాబ్‌ల ఏర్పాటుకు గదులు చాలడం లేదు. అంతేగాకుండా వసతి గృహం భవనం నిర్వహణ భారం కూడా పాఠశాలపైనే పడింది. ప్రత్యేక వసతి గృహం కాకపోవడంతో రాత్రివేళ ఇతరులు లోనికి ప్రవేశిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టిసారించి వసతి గృహానికి నూతన భవనం సమకూర్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్: ఓ భామ అయ్యో రామ
రామలక్ష్మి: వర్జిన్ బాయ్స్
శాంతి: కుబేర
స్వప్నగిరి: 3బీహెచ్‌కే

ట్రిపుల్‌ఐటీకి మరో విద్యార్థి ఎంపిక

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అల్లం జశ్వంత్ ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు తెలిపారు. రెండవ జాబితాలో ఈ అవకాశం వచ్చిందన్నారు. తల్లి స్పందన గృహిణి, తండ్రి కరుణాకర్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. సోమవారం పాఠశాలలో జశ్వంత్‌ను అభినందించారు. ఏం ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని జశ్వంత్ తెలిపాడు.

మెప్మాలో పారదర్శకతకు శ్రీకారం

కొమ్మాది, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు మెప్మాలో డిజిటల్ విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని తెదేపా 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత పేర్కొన్నారు. జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం తెదేపా కార్యాలయంలో సోమవారం ఆర్పీలకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో ఉన్న స్వయం సహాయ సంఘాల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి సేవలు మెరుగుపరిచే దిశగా ఈ ట్యాబ్‌లను ప్రభుత్వం అందించిందని, సక్రమంగా ఆర్పీలంతా వాటిని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, సీవో పాపారావు, తెదేపా వార్డు కార్యదర్శి ఈగల రవికుమార్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు

ఎండాడ, న్యూస్‌టుడే: ?: తగరపువలసలో బాస్కర్ కాలనీకు వెళ్లే దారి గోతులమయంగా ఉంది. - తగరపువలస వాసులు, ✓: త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం. - సురేష్, ఏఈ

?: భీమిలి మండలం కల్యాణి కృష్ణ లేఅవుట్ (తగరపువలస)లో వీధి దీపాలు వెలగడం లేదు. - కళ్యాణి కృష్ణ లేఅవుట్ వాసులు, ✓: విద్యుద్దీపాలకు మరమ్మతులు చేపడతాం. - సురేష్, విద్యుత్ ఏఈ

?: జాతీయ రహదారి (ఎండాడ) కూడలిలో ఆటోలు అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. - ప్రయాణికులు, ✓: కూడలిలో నిలిపేస్తున్న ఆటోలపై కేసులు నమోదు చేస్తాం. - కె.వి.ఎన్.ఎన్.ప్రసాద్, ఆరిలోవ ట్రాఫిక్ సీఐ

?: రుషికొండ కూడలిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలు పెడుతున్నారు. - రుషికొండ వాసులు, ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - కనకమహాలక్ష్మి, జోన్-2 కమిషనర్

?: గొల్లల ఎండాడలో వెంకన్న ఆలయం దగ్గర మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. - గొల్లల ఎండాడ వాసులు, ✓: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

దీపాలు వెలిగాయి

ఎండాడ, న్యూస్‌టుడే: తులసీనగర్ (మధురవాడ)లో వీధి దీపాలు వెలగక నిత్యం అంధకారం నెలకొంటోందని 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ గాయత్రీ తమ సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు.

ఎట్టకేలకు మొక్కల తొలగింపు

ఆనందపురం, న్యూస్‌టుడే: శొంఠ్యాం సర్వే నెం.01 ప్రభుత్వ భూమిలోని గుర్తు తెలియని వ్యక్తులు నాటిన నీలగిరి మొక్కలను రెవెన్యూ సిబ్బంది ఎట్టకేలకు తొలగించింది. సోమవారం 'ఈనాడు'లో 'అస్పష్టత బోర్డు.. తొలగించని మొక్కలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి తహసీల్దార్ శ్రీనుబాబు స్పందిస్తూ సర్వే నెం.01లో నాటిన మొక్కలను తొలగించామని.. ప్రభుత్వ భూమి వివరాలతో స్పష్టమైన బోర్డును త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

కొమ్మాది, న్యూస్‌టుడే

మధురవాడలో రూ.లక్షలు వెచ్చించి జీవీఎంసీ వాణిజ్య సముదాయం నిర్మించింది. 13 ఏళ్లు కావస్తున్నా నేటికీ వినియోగంలోకి రాలేదు. దీంతో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. పరిశుభ్రత ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

నిరుపయోగంగా వాణిజ్య దుకాణ సముదాయం

★ జీవీఎంసీ 5వ వార్డు మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీ వద్ద 2012 ఫిబ్రవరిలో రూ.73 లక్షల నిధులతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు. ఇక్కడ 167 బ్లాకుల్లో 5344 గృహాలుండగా 16 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరందరి సౌకర్యార్థం ప్రభుత్వం మినీ మార్కెట్ రూపంలో సముదాయాన్ని నిర్మించింది. రోడ్డుపై వ్యాపారాలు సాగించకుండా చిరు వర్తకులకు ఇక్కడ 36 దుకాణాలు ఏర్పాటు చేసింది. ఆపైన నిర్వహణకు మూడు గదులను నిర్మించింది. మరుగుదొడ్లు సైతం ఉన్నాయి. ఇన్ని కల్పించినా దుకాణాలను మాత్రం వినియోగంలోకి తీసుకురాలేదు.

★ ఇక్కడ నిర్మించిన సముదాయం కన్నా రైతుబజారు మాదిరిగా గోడలు లేకుండా బహిరంగంగా విక్రయాలు చేపట్టేలా ఉండటం, సరైన ప్రణాళిక లేకపోవడం, జీవీఎంసీ అధికారులు లీజు రూపంలో ఒక్కరికే ఈ దుకాణాలు కేటాయిస్తామని చెప్పడం, ఎక్కువ నిర్ణీత రుసుము పెట్టడంతో గుత్తేదారులెవరూ ముందుకు రావడం లేదు. దీంతో దుకాణాలన్నీ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

★ నెలవారీ అద్దెకు ఇవ్వాలి: ఏళ్ల నుంచి నిరుపయోగం, అధ్వానంగా ఉన్న దుకాణాలను కూటమి ప్రభుత్వంలోనైనా ఆదుకోవాలి. చిరు వర్తకులకు నెలవారీ అద్దెకు దుకాణాలను కేటాయించాలి. దీంతో జీవీఎంసీకి ఆదాయం సమకూరడంతో పాటు వర్తకులు, కొనుగోలుదారులకు ఉపయుక్తంగా ఉంటుంది. ట్రాఫిక్ సమస్యగా ఉండదు. పలుమార్లు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశాం. పాలకులు స్పందించాలి. - డి.అప్పలరాజు, సీపీఎం నాయకులు

★ వినియోగంలోకి తెస్తాం: జీవో 56 ప్రకారం సర్కారు వారి వేలం పాటలో ఎక్కువ నిర్ణీత రుసుము పెట్టడం వల్ల గుత్తేదారులు ముందుకు రావడం లేదని అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో పాటు కౌన్సిల్‌లో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. ఇంజినీరింగ్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆధునికీకరణకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. తదుపరి చర్యలు చేపడతాం. - కె.కనకమహాలక్ష్మి, జెడీ, జోన్-2

సేవలు అభినందనీయం

కొమ్మాది, న్యూస్‌టుడే: విశాఖ బక్కన్నపాలెంలో ఉన్న ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది ఆర్‌ఐగా చిత్తూరు జిల్లా 8వ బెటాలియన్‌కు బదిలీపై వెళ్తున్న జగన్‌ను సోమవారం సత్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కమాండెంట్ సీహెచ్.వి.ఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ ఏపీఎస్పీ బెటాలియన్‌కు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఇన్‌ఛార్జ్ కమాండెంట్ పి.సత్యం, సహాయ కమాండెంట్ ఎస్.మురళీధర్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐగా పదోన్నతి పొందిన జగన్‌ను అభినందిస్తున్న కమాండెంట్ పద్మనాభరాజు

మధ్యవర్తిత్వంతో మేలైన పరిష్కారం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: కోర్టుల్లో ఉన్న కేసులకు సంబంధించి రాజీకి అవకాశమున్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ముందుకు రావాలని భీమిలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి డి.సౌజన్య పేర్కొన్నారు. ఈ మేరకు కోర్టు ప్రాంగణంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కోర్టులోని సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి సమయం వృథా కాకుండా తక్కువ సమయంలో పరిష్కరించుకోవడానికి ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

భీమిలి కోర్టులో కక్షిదారులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి డి.సౌజన్య

అట్టడుగు వర్గాల అభ్యున్నతే తెదేపా ధ్యేయం

ఆనందపురం, న్యూస్‌టుడే: తెదేపా పుట్టిందే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పాలవలస పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అనాడే ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. వారి ఆశయాల సాధనలో అనేక పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. మెగా డీఎస్సీతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాత్రాబు అప్పారావు, బీఆర్‌బీ.నాయుడు, పాండ్రంగి అప్పలరాజు, శ్రీకాంత్ రాజు, నిమ్మల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ఆరో వార్డు తెదేపా అధ్యక్షుడు, రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీఎంపాలెం హౌసింగ్‌బోర్డు కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు అందించి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, నొడగల జానకీరామ్, కంచర్ల సర్వదేవుళ్లు, షేక్ సుభాని, ఉమాశంకర్‌వర్మ, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నేడు పాదాలమ్మ పండగ

అడివివరం, న్యూస్‌టుడే: సింహగిరి పురవీరావు కాలనీ గోశాల లేఅవుట్ నివాసితుల ఆరాధ్య దైవం శ్రీఉమామహేశ్వరీ పాదాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవం సందర్భంగా సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, పసుపు కుంకుమల సమర్పణ జరుగుతుందన్నారు. పండగ సందర్భంగా కాలనీలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పీజీఆర్‌ఎస్‌లో వినతుల స్వీకరణ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జెడ్సీ కె.కనకమహాలక్ష్మి వినతిపత్రాలను స్వీకరించారు. బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్‌ల నుంచి పీఎంపాలెం బిట్స్‌వైజాగ్ కళాశాల వరకు రహదారి అధ్వానంగా ఉందని, వీధిదీపాలు ఏర్పాటుచేయాలని సీఆర్‌పీఎఫ్ అధికారులు వినతిపత్రం అందించారు. రూ.20 లక్షల నిధులతో రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, పనులు త్వరలో చేపడతామని ఈఈ శాంతిరాజు బదులిచ్చారు. మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీలో బ్లాకు నెంబర్ 120 వద్ద మురుగుకాలువ నిండి ఉందని, కొమ్మాది చైతన్యనగర్‌లో 2019లో మంచినీటి పైపులైను ఏర్పాటు చేసినా కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదని, పీఎంపాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డుకాలనీలో ఎల్ఐజీ-1లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇళ్లల్లోకి మురుగు వ్యర్థాలు వచ్చేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. 6వ వార్డు లక్ష్మీవానిపాలెంలో అంతర్గత రహదారిపై పశువులు, కోళ్లఫారంను నడుపుతున్నారని, దాని వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఓ వృద్ధుడు పేర్కొన్నారు. బక్కన్నపాలెం, కొమ్మాదిలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సీపీఐ నాయకులు వి.సత్యనారాయణ విన్నవించారు. సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈఈ శాంతిరాజు, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీకి విన్నవిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

జీవీఎంసీ కమిషనర్ అభివృద్ధి పనుల పరిశీలన

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రోడ్లు, కల్వర్టులు, మురుగుకాలువలు, ఫుట్‌పాత్‌లు తదితర అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం ఇంజినీర్ పల్లమరాజు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మితో కలిసి 8వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా సన్ కళాశాల రోడ్డు నుంచి వైఎల్పీలేఅవుట్ మీదుగా ఎండాడ 100 అడుగుల రహదారి వరకు అభివృద్ధి చేసిన రోడ్లును, ప్రతిపాదిత విస్తరణ రోడ్డును, వైఎల్పీలేఅవుట్ నుంచి శాంతినగర్‌ను కలిపే రోడ్డు అభివృద్ధి, 60 అడుగుల రహదారిలోని కల్వర్టు పనులను పరిశీలించారు. సన్‌కళాశాల రోడ్డు నుంచి వైఎల్పీలేఅవుట్ వరకు ఉన్న దారిని త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్డు విస్తరణకు అవసరమగు చర్యలు తక్షణమే చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజును, ఏసీపీ తిరుపతిరావును ఆదేశించారు. అనంతరం అక్కడున్న క్లాప్ వాహనాన్ని పరిశీలించి మైక్ ప్రకటన పని చేయకపోవడంపై క్లాప్ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న శివాజీ

రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్యదర్శిగా శివాజీ

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ వాసి, టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఏపీ, తెలంగాణకు సంబంధించిన సంఘం కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా సోమవారం నియామకపత్రం అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీల అభ్యున్నతికి నిరంతర కృషి చేయాలని, వారికి ఎదురయ్యే సమస్యలను సంఘం ప్రతినిధులతో కలిసి ఐక్యంగా పోరాడాలని నేతలు సూచించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావుయాదవ్, రాష్ట్ర ఇన్‌ఛార్జి మహిళా అధ్యక్షురాలు యలగాల నూకాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీకేలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి నేరెళ్లవలసలోని రాజీవ్ గృహకల్ప(ఆర్జీకే) కాలనీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని భీమిలి డివిజన్ సిటూ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జెడ్సీ వి.అయ్యప్పనాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. నాయకులు ఎ.నర్సింగరావు, షేక్ ముంతాజ్, పి.విజయకుమార్ పాల్గొన్నారు. అలాగే భీమిలి మూడో వార్డు రెల్లివీధి, బోయివీధి, కృష్ణాకాలనీలో సామాజిక మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, సామాజిక భవనాలను నిర్మించాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వినతిపత్రం సమర్పించారు.

భీమిలి జెడ్సీ అయ్యప్ప నాయుడుకు వినతిపత్రాన్ని అందిస్తున్న సిటూ నాయకులు

విద్యార్థులకు నగదు పురస్కారాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పూర్వ విద్యార్థి ఐ.ఆర్.ఎస్.అధికారి వి.ఎం.మహీధర్ ఆర్థిక తోడ్పాటుతో సోమవారం నగదు పురస్కారాలను అందించారు. ఎస్సీ, బీసీ, ఓసీ విభాగాల్లో ప్రథమ శ్రేణికి రూ.5 వేలు, ద్వితీయ శ్రేణికి రూ.3 వేలు, తృతీయశ్రేణికి రూ.2 వేల చొప్పున కేటాయించారు. పాఠశాల శతాబ్ది ఉత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు చేతుల మీదుగా నగదు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు పి.రమణ, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ, కె.ఎస్.నాయుడు, టి.భీమారావు, పాల్గొన్నారు.

నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

మేయర్, కమిషనర్‌లకు కార్పొరేటర్ల వినతి

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ ఆర్టీసీ డిపో నుంచి వాంబే కాలనీకి వెళ్లే మార్గంలో 'నార్త్‌స్టార్' పేరుతో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన సముదాయంపై అనుమతి లేకుండా అదనపు అంతస్తు వేస్తున్నారని ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ ఆరోపించారు. ఈ మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లను కలిసి వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. సంబంధిత భవనానికి 8 అంతస్తులకు అనుమతి ఉండగా అదనంగా 9వ అంతస్తు వేస్తున్నారన్నారు. తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అడివివరం, న్యూస్‌టుడే: సింహాచలం బీఆర్టీఎస్ రహదారి విస్తరణలో భాగంగా నిర్మాణాలు, స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్‌ల మంజూరుపై సమగ్రమైన నివేదిక కోరుతూ ప్రభుత్వం నియమించిన కమిటీ తక్షణమే సమావేశం నిర్వహించాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కోరారు. సోమవారం ఆయన నగరంలోని జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. అడివివరంలో టీడీఆర్‌ల సమస్య పరిష్కారానికి గత నెల 17న ఉన్నతాధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం గుర్తు చేశారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డులో వీధిదీపాలు, తాగునీరు సమస్యను పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్, మేయర్‌లకు వార్డు తెదేపా కార్పొరేటర్ మొల్లి హేమలత వినతిపత్రాలను అందించారు. కొత్తగా ఏర్పడిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, ఎన్టీఆర్ హుద్‌హుద్ కాలనీల్లో వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉందన్నారు. ప్రధాన కూడళ్లలో రింగ్‌లైట్లు వేయాలన్నారు. తదితర సమస్యలపై విన్నవించారు. తెదేపా రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION): AT VISAKHAPATNAM.
IP No 15/2025

Between:
Mr. SENAPATHI ESWARA RAO ...Petitioner
and
Mr. Kanakala Srinu & others ...Respondents/Creditors

PUBLIC NOTICE

It is to inform that the above Petitioner i.e., Sri Senapathi Eswara Rao, S/o. Ramu, Door No.1-47, Samayyavalasa Village, Pandringi Panchayathi, Padmanabham Mandal, Visakhapatnam District, filed above insolvency petition against one Mr. Kankala Srinu & others under Insolvency Act., and same is stands posted to 28-07-2025.

If any person who have interest in the matter or wish to raise any objections in the above petition are hereby informed to appear and file their objections in writing before the Hon'ble Court on 28-07-2025 at 10-30 A.M., otherwise treated as no objections and matter will be proceed for further hearing.

PALAVALASA RAMBABU, Advocate
47-11-1/9, Flat No.4, Eswara Arcade, Dwaraka Nagar Lane-1, Visakhapatnam-16. Mobile No. 9848202060

శ్రీపాలప్పలార్య పీఠాధిపతి శివైక్యం

చేపలుప్పాడ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు కాపులుప్పాడ రెడ్డిలపాలెంలోని ఆద్విరాట్ అవదూత పరమహంస శ్రీపాలప్పలార్య ఆశ్రమ పీఠాధిపతి **వాసుపల్లి రామన్న గురువర్యులు** (84) ఎంవీపీ కాలనీలోని సెక్టార్-6లోని స్వగృహంలో సోమవారం శివైక్యం చెందారు. విశాఖ పోర్టుట్రస్ట్‌లో అధికారిగా పని చేసిన ఆయన 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. యుక్త వయసు నుంచి ఆధ్యాత్మిక రంగంలో ఉన్న ఆయన శ్రీపాలప్పర్యుని మరణానంతరం ఆయన 1985లో ఆ పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. సాయంత్రం స్వగ్రామం చేపలుప్పాడకు ఆయన పార్థివదేహాన్ని తీసుకువచ్చి అప్పలార్య ఆధ్యాత్మిక పీఠం సంప్రదాయాల ప్రకారం సమాధి చేశారు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి

మధురవాడ, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపొద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో ఏడోవార్డు కళానగర్ తదితర కాలనీల్లో సోమవారం నిరసన చేపట్టారు. అధికారం చేపట్టిన తర్వాత హామీలను మరచి ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మధురవాడ సీపీఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, ఎం.ఎస్.పాత్రుడు, ఎన్.త్రినాథ్, పాల్గొన్నారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల పెంపు దారుణమని సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు అన్నారు. తగరపువలసలోని జీఆర్‌భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీలు వంటి నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు మోర అప్పలరాజు, గోవిందరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

కళానగర్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

కూచిపూడి నృత్య నిలయానికి ఫాబ్ ప్రోత్సాహం

ఆర్.కృష్ణవేణిని సత్కరిస్తున్న ఫాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రాంతంలో కూచిపూడి నృత్యకళను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోన్న కృష్ణ కూచిపూడి నృత్య నిలయానికి స్థానిక ఫ్రెండ్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాబ్) తరపున రూ.10 వేల నగదు ప్రోత్సాహం అందించారు. ఈ నృత్యనిలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నృత్యనిలయం వ్యవస్థాపకురాలు ఆర్.కృష్ణవేణిని సత్కరించారు. కార్యక్రమంలో ఫాబ్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాస్, విజ్జపు సత్యనారాయణ, కట్టమూరి అశోక్ పాల్గొన్నారు.

అభినందన సత్కారం

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం పీఏసీఎస్ అధ్యక్షుడుగా ఎంపికైన మొకర అప్పలనాయుడును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం సత్కరించారు. పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన మొకర అప్పలనాయుడు నగరంలోని గంటా నివాసంలో మండల తెదేపా నాయకులతో వెళ్లి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడును అభినందిస్తూ ఎమ్మెల్యే సత్కరించారు. నాయకులు కశిరెడ్డి దామోదరరావు, కె.రమణ, కె.ఎర్నాయుడు, పైల శ్రీను, కురిమిన అనిల్, పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అప్పలనాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

నీటి వృథాకు అడ్డుకట్ట

పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ఈనాడు కథనానికి స్పందన

పద్మనాభం, న్యూస్‌టుడే: గత నెల రోజులుగా పద్మనాభం-నీళ్లకుండీల మార్గంలో పద్మనాభం ప్రాథమిక పాఠశాల సమీపంలో ఎంవీఎస్ పథకం పైపులైనుకు రంధ్రం పడి తాగునీరు వృథాగా పోవడంపై 'నీటి బొట్టు ప్రాధాన్యం.. పట్టని వైనం' శీర్షికతో 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటి సరఫరా సిబ్బంది మరమ్మతులు చేపట్టి తాగునీటికి అడ్డుకట్ట వేశారు. అలాగే రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చటం వల్ల ప్రయాణికులకు ఇబ్బంది తప్పింది.

10వ వర్ధంతి

చెరగని చిరునవ్వుతో ప్రేమాభిమానాలతో మా హృదయంలో చిరస్థాయిగా నిలిచావు. నీవు దైవసన్నిధికి చేరి నేటికి 10 సం॥లు అయిననూ నీ జ్ఞాపకాలు సదా పదిలం. నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పిళ్లా భరత్‌కుమార్ (నాని)
జననం: 08-03-1994 మరణం: 15-07-2015
S/o పిళ్లా వెంకటరావు
రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగ కార్యనిర్వాహణ కార్యదర్శి

తండ్రి: పిళ్లా వెంకటరావు
రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగ కార్యనిర్వాహణ కార్యదర్శి
తల్లి: పిళ్లా మంగమ్మ
GVMC 7వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు
చెల్లి: పోతిన సాయిప్రియ,
బావ: పోతిన వినయ్‌కుమార్
మేనమామ: పోతిన నాయుడు,
వెంకటసాయి ఫాల్ జీ బ్రిక్స్
మేనత్త: పోతిన పద్మ
పోతిన మనోజ్‌కుమార్ & పోతిన మధుకర్

(c) eenadu

విశాఖ తూర్పు

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రతిభా పురస్కారాలకు యాదవ సామాజికవర్గ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి డొక్కల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులకంటే ఎక్కువ సాధించిన, జేఈఈ, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాలులో పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఇతర వివరాలకు 81434 46565 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: గాజువాక ఆర్కే ఆసుపత్రి వెనుక ఉన్న ఓ ఇంటర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురంకాలనీలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. 'ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.10వేలు చెల్లించి కళాశాలలోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. కొంతమంది ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వద్ద ఆ పుస్తకాలు తీసుకుంటే అదనంగా ఫీజు వసూలు చేస్తామని బెదిరిస్తున్నార'ని విద్యార్థులు వాపోయారు. దీనిపై ఇంటర్ బోర్డు ఆర్.ఐ. మురళీధర్ మాట్లాడుతూ తక్షణమే కళాశాలను సందర్శించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ.10 నుంచి మ.ఒంటి గంట మధ్య
ఎంవీపీ కాలనీ: 8008574768
మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 22వ వార్డు న్యూరేసపువానిపాలెం ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి పడితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. -బి.వి.ప్రసన్న, న్యూరేసపువానిపాలెం ✓: తక్షణమే సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - ఆశ, వర్క్ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: పెదగదిలి శివాలయం పక్క వీధిలో పైప్‌లైను లీకవుతోంది. మంచినీరు పెద్దఎత్తున వృథా అవుతోంది. - రామారావు పెదగదిలి. ✓: సిబ్బందిని పంపించి లీకేజీలను వెంటనే మరమ్మతులు చేయిస్తాం. - వి.రాజేష్, లైన్‌ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఆరిలోవ రెండో సెక్టార్ భరత్‌నగర్‌లో కుళాయిల నుంచి నీటిధార సన్నగా వస్తోంది. తాగునీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నాం.- అనసూయ, భరత్‌నగర్ ✓: మీ ప్రాంతంలోని కుళాయిలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - నీటి సరఫరా విభాగ ఏఈ

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : ?: పదోవార్డు ఇందిరానగర్‌లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రుళ్లు దాడులు చేస్తున్నాయి. – దొంత రమణ, ఇందిరానగర్. ✓: వాహనాన్ని పంపించి కుక్కలను పట్టుకుని తరలిస్తాం. – డాక్టర్ ఎన్. కిషోర్, పశువైద్యాధికారి

స్పందనకు వందనం

ఎట్టకేలకు చెత్త తరలింపు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 17, 18 వార్డుల పరిధిలోని ఎంవీపీకాలనీ, ఆదర్శనగర్, అప్పుఘర్, తి.తి.దే కల్యాణ మండపం రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.

రహదారులను బాగు చేశారు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ సెక్టార్-9 మత్స్యకార కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రహదారిని తవ్వి వదిలేయడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని సోమవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు గుత్తేదారు సోమవారం పనులు ప్రారంభించారు. యూజీడీ గుంతలకు మరమ్మతులు చేయిస్తున్నారు. నెల రోజులుగా పడుతున్న అవస్థలు తీరాయని స్థానికులు తెలిపారు.

వ్యాధుల వల.. జనాలు విలవిల..!

● విమ్స్‌కు పెరుగుతున్న బాధితులు ● తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: వాతావరణ మార్పుల కారణంగా నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా వైరల్ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. విమ్స్ ఆసుపత్రి జనరల్ వార్డుకు నెల రోజులుగా రోగుల తాకిడి పెరగడం పరిస్థితిని తెలియజేస్తోంది. ప్రస్తుతం రోజుకు సగటున 120 నుంచి 150 మంది వరకు వస్తున్నారు. ఓపీలో 50 మంది వరకు చికిత్స పొందుతున్నారు. దోమల వృద్ధి, తాగునీరు కలుషితం, శుభ్రత పాటించకపోవడం తదితరాలు వ్యాధులు ప్రబలడానికి కారణాలని వైద్యులు చెబుతున్నారు.

విమ్స్ ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

ఆసుపత్రిలో 50 పడకలు ఏర్పాటు

ప్రతి ఏడాది జూన్ నెల నుంచి ఆగస్టు వరకు ప్రజలు కాలానుగుణ వ్యాధుల బారిన పడుతుంటారు. వీరి కోసం విమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఒక వార్డు కేటాయించారు. ఇక్కడ 50 పడకలు సిద్ధం చేశారు. జ్వర తీవ్రత ఎక్కువ ఉన్న వారికి ఆక్సిజన్ అందించడంతోపాటు వెంటిలేటర్, డీహైడ్రేషన్‌తో వచ్చే వారికి సెలైన్ సీసాలు ఎక్కిస్తున్నారు. 24 గంటలు సేవలందించేందుకు ఐదుగురు వైద్యులు, 12 మంది సహాయ సిబ్బంది ఉన్నారు.

ఓపీకి వచ్చిన రోగులు ఇలా..	
ఏప్రిల్	1765
మే	2130
జూన్	2530
ఇన్‌పేషెంట్ల వివరాలు	
ఏప్రిల్	114
మే	117
జూన్	165

నెలకు వస్తున్న బాధితులు(సగటున) ఇలా..

ఆసుపత్రికి నెలకు సగటున విషజ్వరాలతో బాధపడుతూ 80 మంది, మలేరియా 10, డెంగీ 20, టైఫాయిడ్ 10, అతిసారం 10, తీవ్ర జలుబు, గొంతునొప్పి, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు 50, కండరాల నొప్పితో 20 మంది వస్తున్నారు. సీజన్ ప్రారంభంలోనే మలేరియా, డెంగీ కేసులు నమోదు కావడం కలవరం కలిగిస్తోంది. జ్వర బాధితుల్లో పిల్లలు ఎక్కువగా ఉంటున్నారు.

★ ఇవీ కారణాలు: వర్షాకాలంలో ఇళ్ల పరిసరాల్లో వాన నీరు నిల్వ ఉండటం, ఇంట్లో వాడుక నీటిని డ్రమ్ముల్లో రోజుల తరబడి నిల్వ ఉంచడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా డెంగీ దోమలు మంచినీటిలో వృద్ధి చెందుతున్నాయని, ఈ కాలంలో ఎట్టి పరిస్థితుల్లో నీటిని నిల్వ ఉంచవద్దని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వాతావరణంలో వైరస్, బ్యాక్టీరియా వృద్ధి చెందుతున్నాయి. మురికి వాడల్లో శుభ్రత పాటించకపోవడంతో ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉందని చెబుతున్నారు.

★ ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలి: వర్షాకాలంలో దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో అంటు వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. డెంగీ, మలేరియా, గన్యా లాంటి జ్వరాలు ఈ సమయంలో విజృంభిస్తుంటాయి. వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవుల కారణంగా టీబీ, అతిసారం తదితర వ్యాధులు వస్తాయి. కాచి వడబోసిన నీరు తాగడం, వ్యక్తిగతంతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం చాలా అవసరం. బయట తిండి, నిల్వ ఉన్న ఆహారం తిన కూడదు. విమ్స్‌లో అందిస్తున్న సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలి. - డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన సిబ్బంది

ఆరిలోవ, న్యూస్‌టుడే: పైనాపిల్‌కాలనీ, దరాపాలెం శివారు ప్రాంతాల్లోని ఆక్రమిత భూముల్లో ఎట్టకేలకు అధికారులు హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రభుత్వ పోరంబోకు భూమిని పలువురు ఆక్రమించుకుంటున్నారని ఈనెల 9న 'ఆక్రమార్కుల పాగా' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విశాఖ రూరల్ తహసీల్దారు కార్యాలయ అధికారులు స్పందించారు. ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నెంబరు 15/12లోని 3.07 ఎకరాల్లో కొంత భాగం గత ఏడాది ఆక్రమణలకు గురైంది. అప్పటి వైకాపా నాయకుల అనుచరులు ఇష్టారాజ్యంగా కబ్జా చేశారు. అధికారులు లోపాయకారిగా వారికి సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు పక్కాగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీసీసీ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ఆరా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు ఆరా తీశారు. విశాఖ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన గిరిజన సహకార సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ జీఎం సంధ్యారాణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీసీసీ తయారు చేసిన ఉత్పత్తుల గురించి వివరించారు. శంకరరావు మాట్లాడుతూ డిమాండ్‌కు అనుగుణంగా అరకు కాఫీని మరింత అభివృద్ధి చేయాలన్నారు. జీసీసీ నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో ఉత్పత్తుల నిల్వకు కోల్డ్‌స్టోరేజీల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారిణి ఉమాదేవి, జీఎం (ఫైనాన్స్) నిర్మలమ్మ, త్రినాథరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు

పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం

నేడు ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన యూపీహెచ్‌సీ (పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)కి ఎట్టకేలకు మోక్షం కలిగింది. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ఉదయం దీన్ని ప్రారంభించనున్నారు. వారం రోజులుగా భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ. 1.38కోట్ల వ్యయంతో దీని నిర్మాణం ప్రారంభించారు. జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్తంగా ఆయా నిధులు కేటాయించాయి. నాడు పనులు పూర్తికాకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు.

★ ప్రారంభంలో రామ్‌నగర్ ప్రాంతంలోని పార్కు స్థలంలో యూపీహెచ్‌సీ నిర్మించాలని జీవీఎంసీ నిర్ణయించింది. పార్కుల స్థలంలో ఏర్పాటు చేయడానికి స్థానికులు అభ్యంతరం తెలపడంతోపాటు నిరసనలు చేపట్టడంతో చివరికి మానసిక ఆసుపత్రి ఆవరణలో నిర్మించాలని నిర్ణయించారు.

పెదవాల్తేరులో నిర్మించిన యూపీహెచ్‌సీ భవనం

నగరంలో అన్ని ప్రాంతాల్లో యూపీహెచ్‌సీల నిర్మాణం పూర్తయి మూడేళ్ల కిందటే ప్రారంభమయ్యాయి. పెదవాల్తేరులో మాత్రమే పూర్తికాలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అసంపూర్తి పనులను పూర్తి చేయించింది. వైద్యుల గదితోపాటు సెమినార్ హాల్, రోగులకు 11 పడకలు, రక్తపరీక్షల కోసం ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఇది అందుబాటులోకి వస్తే మద్దిలపాలెం, పెదవాల్తేరు, శ్రామికనగర్, శివాజీపాలెం ప్రాంతాల్లోని పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

ఆటోమోటివ్(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం 16వ వార్డు ఇసుకతోట, అంబేడ్కర్‌కాలనీ ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పింఛను పెంపు పథకాలను అమలు చేశారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాలు అమల్లోకి వస్తాయన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు మొల్లి శంకర్, జి.అప్పన్న, ముగడ వాసు, మొల్లి శోభ, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకతోటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు

దారులు ధ్వంసం.. బాగు చేయకుంటే కష్టం

ఆరిలోవ, న్యూస్‌టుడే: బీఆర్టీఎస్ మార్గంలో నడకదారులు దెబ్బతిన్నాయి. పెచ్చులూడటంతో పాదచారులు అటుగా రాకపోకలు సాగించలేని దుస్థితి. వర్షపు నీరు కాలువలోకి వెళ్లే మార్గాలు ఛిద్రమయ్యాయి. రోడ్డు, నడకదారికి మధ్య పెద్ద గోతులు ఏర్పడ్డాయి. బీఆర్టీఎస్ రోడ్డుపై పాదచారులు ద్విచక్రవాహనదారులు ఏమరుపాటుగా వెళ్తే గొయ్యిలో పడే ప్రమాదం ఉంది. జి-20 సన్నాహక సదస్సులో భాగంగా బీఆర్టీఎస్‌కు మరమ్మతులు చేశారు. రెండేళ్లకే అవన్నీ ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

దర్పణం

కొమ్మలు కొట్టి.. నడకదారిపై వదిలేసి..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ రోప్‌వే దగ్గర నుంచి తెన్నేటిపార్కు వరకు వీధి దీపాలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలు తొలగించి నడకదారిపై పడేశారు. రెండు రోజులైనా తొలగించక పోవటంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం నడకకు వచ్చేవారు రోడ్డుపై వెళ్లాల్సి వస్తోంది. తరచూ వాహనాలు ఢీకొట్టి వెళ్లిపోతుండడంతో పాదచారులు గాయపడుతున్నారని నడకసంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నడకదారులపై కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

క్లిక్ టుడే

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గిరిధర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నల్లాన వెంకటకృష్ణ గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల హక్కులను పరిరక్షించాలని, బీసీలకు రాజ్యాధికారం దక్కేవరకు ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. సంఘం అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఏపీ ఇన్‌ఛార్జి నూకానమ్మ పాల్గొన్నారు.

వెంకట కృష్ణ గిరిధర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

❖ 18న గురుదత్ ప్యాసా సినిమా ప్రదర్శన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 5.30గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో హిందీ అగ్ర నటుడు గురుదత్ నటించిన ప్యాసా సినిమాను ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1957లో విడుదలైన ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలో ఒక క్లాసిక్‌గా నిలిచిందని పేర్కొన్నారు.

❖ సిద్ధి గణపతికి ప్రత్యేక పూజలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: సంకట హర చతుర్థి సందర్భంగా చినగదిలి సిద్ధార్థనగర్ బీసీకాలనీలోని సిద్ధి గణపతి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, విఘ్నేశ్వర పూజ, విశేష హోమం నిర్వహించామని అర్చకులు దార్లపూడి సురేష్ శర్మ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

❖ ఆటో కార్మికుల సంఘం నూతన కమిటీ ఎంపిక

ఆరిలోవ, న్యూస్‌టుడే: జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం సి.ఐ.టి.ఐ.యు. మద్దిలపాలెం జోన్ కమిటీ మహాసభ సోమవారం తోటగరువు ఎర్ని దుర్గమాంబ కల్యాణ మండపంలో జరిగింది. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, రాయితీపై డీజిల్ ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.సత్యం, కోశాధికారిగా ఎస్.గురునాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా చిన్నారావు, రాయపురెడ్డి, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులు పి.జగన్ పరిశీలకులుగా వ్యవహరించారు. సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, వెంకటరావు, అప్పలరాజు, గోపి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

❖ 16 నుంచి ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 19 వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 16న రాత్రి 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో విశాఖ చేరుకుని, హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. 17న ఉదయం 10 గంటలకు మిందిలోని బీహెచ్‌ఈఎల్ ప్లాంట్‌ను సందర్శించి, అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో సమావేశమవుతారు.

త్వరితగతిన 'పీ-4' మార్గదర్శకుల గుర్తింపు

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో జేసీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీ-4'కు సంబంధించి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'పీ-4' అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కనీసం పది వేల మంది ఔత్సాహికుల్ని గుర్తించి, బంగారు కుటుంబాలను అనుసంధానం చేయాలన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. గెజిటెడ్ ర్యాంకు కలిగిన ప్రతి అధికారి కనీసం ఓ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. దత్తత తీసుకోలేని వారు ఆర్థికంగా సాయం చేయాలన్నారు. 'పీ-4'లో చేరినా, తోడ్పాటు అందించిన వారికి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో భవానీశంకర్, సీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక, పద్యనాటక పోటీలు

వీరబాహుడు పాత్రలో వంకాయల మారుతీప్రసాద్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌరాణిక, పద్యనాటక పోటీలు నిర్వహించారు. పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన కళాకారులు లచ్చయ్య, నారాయణరావులు రామాంజనేయ యుద్ధం, విశాఖపట్నంకు చెందిన గొర్లె మురళీనాయుడు, చినలక్ష్మీ చింతామణి నాటకం, విజయనగరానికి చెందిన కళాకారులు హుస్సేన్, సత్యశ్రీ సత్యహరిశ్చంద్ర నాటకం, విశాఖపట్నంకు చెందిన ఎం.ఎస్.నాయుడు, ఎం.సత్యనారాయణ గయోపాఖ్యానం నాటకాల్లోని పలు సన్నివేశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కళాకారులు అల్లు సావిత్రి, నాగిరెడ్డి సింహాచలం, నాగిరెడ్డి సీతంనాయుడు కృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు పాత్రలను పోషించారు. పట్నాల నరసింహారావు, సుర్రాపు నారంనాయుడు హరిశ్చంద్ర, నక్షత్రకుడి పాత్రలు పోషించారు. సంస్థ నిర్వాహకులు వంకాయల మారుతీప్రసాద్ వీరబహుడు పాత్ర పోషించి ఆకట్టుకున్నారు. విజయనగరం మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

భారత రాజ్యాంగ ప్రతిరూపం బహూకరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగ పూర్వ విద్యార్థి డాక్టర్ కె.అనిల్ కుమార్ భారత రాజ్యాంగం ప్రతిరూపాన్ని బహూకరించారు. సోమవారం విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందను కలిసి రాజ్యాంగ ప్రతిని అందజేశారు. ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ రాజ్యాంగ ప్రతిరూపాన్ని విభాగ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామన్నారు. వర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇందులో భారత రాజ్యాంగ రచనా కమిటీ సభ్యుల సంతకాలు పొందుపర్చారని తెలిపారు. డాక్టర్ అనిల్‌కుమార్ కె.ఎల్. వర్సిటీలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

ఆచార్య పేటేటి ప్రేమానందంకు రాజ్యాంగ ప్రతిని బహూకరిస్తున్న డాక్టర్ కె.అనిల్ కుమార్

కొనసాగుతున్న ఒప్పంద ఆచార్యుల 'నోవర్క్.. నో పే'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూలో పనిచేస్తున్న ఒప్పంద సహాయ ఆచార్యులు 'నో వర్క్ నో పే' విధానం పాటిస్తున్నారు. ఈనెల 1వ తేదీ వర్సిటీ పునః ప్రారంభమైనప్పటి నుంచి వారు తరగతులకు వెళుతున్నా బోధన చేయడం లేదు. అగ్రిమెంట్‌పై సంతకాలు చేయాలని అధికారులు విధించిన నిబంధనను వారు వ్యతిరేకించారు. సంతకాలు చేయకపోవడంతో విధుల్లో చేరలేదని తెలిసింది. దీంతో 'నో వర్క్ నో పే' అన్న విధానం నడుస్తున్నట్లు సమాచారం.

వ్యాయామ విద్య ఫ్యాకల్టీ ఛైర్మన్‌గా ఆచార్య విజయమోహన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ వ్యాయామ విద్యా సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్‌ను వ్యాయామ విద్య ఫ్యాకల్టీ ఛైర్మన్‌గా నియమిస్తూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ విశ్వవిద్యాలయాల చట్టం ప్రకారం అకడమిక్ సెనేట్‌లో క్లాస్ వన్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా వ్యవహరించనున్నారు. ఆయనకు ఏయూ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, డీన్‌లు, డైరెక్టర్లు అభినందనలు తెలిపారు.

తాత్కాలిక అధ్యాపకుల నియామకాల్లో నిబంధనల ఉల్లంఘన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తాత్కాలిక అధ్యాపకుల నియామకాల్లో జరుగుతున్న ఉల్లంఘనలపై ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకోవాలని అతిథి అధ్యాపకులు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావును కలిసి వినతిపత్రం అందించారు. ఏయూలో విభాగాల వారీగా రిజర్వేషన్ రోస్టర్ అమలు చేయడం లేదన్నారు. దీనిపై వివిధ సందర్భాలలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను వినతి పత్రంలో ఉదహరించారు. వర్సిటీలో నిబంధనల ఉల్లంఘన ఎలా జరుగుతుందో వివరించారు. దీనిపై తాను అధికారులకు తగు ఆదేశాలు ఇస్తానని కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకరరావు హామీ ఇచ్చారు. అలాగే ఏయూలో అన్ని విభాగాల్లో దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్ కల్పించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ సురేష్ మీనన్ కోరారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

★ ఏపీ గిరిజన గురుకుల శిక్షణ సంస్థలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభించాలని ఏయూ న్యాయ కళాశాల గిరిజన విద్యార్థులు కోరారు. సోమవారం ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

డాక్టర్ డీవీజీ శంకరరావుతో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ మీనన్

పోర్టు కలాసీలకు టైంస్కేల్ వేతనాలివ్వాలని వినతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పోర్టు పూల్ కలాసీలకు టైం స్కేల్ నాలుగో తరగతి ఉద్యోగుల వేతనాలు అమలు చేయాలని కలాసీల సంఘం గౌరవాధ్యక్షులు హేమంత కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం బీచ్‌రోడ్డు నోవోటెల్ హోటల్‌లో సోమవారం సాయంత్రం కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పూల్ కలాసీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, ఆదుకోవాలని విన్నవించారు. కొమర రవిరాజ్, చింతపల్లి పోతురాజు, అప్పారావు, వాసుపల్లి రాము, గోవింద్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్‌కు వినతిపత్రం ఇస్తున్న పోర్టు కలాసీలు

పార్కులు, ఖాళీ స్థలాల పరిరక్షణపై దృష్టి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థకు చెందిన పార్కులు, ఖాళీ స్థలాలను పరిరక్షించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రణాళికాధికారులతో సమావేశమయ్యారు. పార్కులు, ఖాళీ స్థలాలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నట్టు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణ కోసం పనిచేయాలన్నారు. జీవీఎంసీ పార్కులపై ప్రణాళికాధికారులు అరకొర సమాచారం ఇచ్చారని, మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి వివరాలు సమర్పించాలని మేయర్ సూచించారు. ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు

ప్రణాళికాధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

జోన్-3 కార్యాలయానికి 17 వినతులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 వినతులు వచ్చాయి. జోన్-3 సహాయ వైద్యాధికారి ప్రసాదరావు వాటిని స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. రెవెన్యూ విభాగానికి 4, యూసీడీకి 1, పట్టణ ప్రణాళిక విభాగానికి 12 చొప్పున వినతులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ శ్రీలక్ష్మీ, ఏపీడీ రాము, ఆర్.ఒ. పైడిరాజు పాల్గొన్నారు.

జోన్-3 కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

కమిషనరేట్‌లో వినతుల స్వీకరణ

బాధితురాలితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 98 ఫిర్యాదులు అందాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ వినతులు స్వీకరించి, పరిష్కార చర్యల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-13 రామాలయం వెనుకవైపులో విద్యుత్ శాఖ నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించి ఎక్కడికక్కడ వదిలేశారు. కల్వర్టులో కొమ్మలు పడిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. - శేఖర్, వెస్ట్ ఎండ్ నగర్ ✓: మీ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. - విద్యుత్ ఏఈ, మురళీనగర్

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-4 పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అంధకారం నెలకొనడంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - ఎం.రమాదేవి, స్థానికురాలు ✓: తక్షణమే మా సిబ్బంది చేత పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తాం. - జీవన్, వీధి దీపాల, నిర్వాహకుడు

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

24వ వార్డులోని ఓ వీధిలో రాళ్లు తేలి ఇలా..

మైత్రి రెసిడెన్సీ - అంజనేయస్వామి ఆలయం మార్గంలో..

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రజలు మరిన్ని అవస్థలు పడుతున్నారు. ఉత్తర నియోజకవర్గంలోని జీవీఎంసీ 14, 24 వార్డుల్లో ఇటీవల 24 గంటల పైపులైన్, యూజీడీ పనుల నిమిత్తం రహదారులను ఇష్టానుసారం తవ్వేసి వాటిపై తూతూమంత్రంగా పెద్దపెద్ద కంకరరాళ్లు వేసి చేతులు దులిపేసుకున్నారు. వీరి నిర్లక్ష్యానికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కంకర రాళ్ల కారణంగా వాహనాలు జారిపడి గాయాలపాలవుతున్నారు. పాదచారులు రాళ్లపై నడవలేక నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు అటుగా వెళ్లాలంటే వెనుకడుగు వేస్తున్నారు. టీపీటీ కాలనీ మైత్రి రెసిడెన్సీ రహదారి, సీతమ్మధార సాయిబాబా మందిరం ఎగువ మూడో కూడలి వైపు ప్రాంతం, బాలయ్యశాస్త్రి లేఅవుట్ అభయాంజనేయస్వామి ఆలయం ఎగువన వెళ్లే మార్గం, హెల్త్‌సిటీ పార్కు పక్క రహదారులు ఇంత దారుణంగా మారాయి. ఎమ్మెల్యే నివాస ముంగిట్లో ఉన్న వార్డులోనే ఇంత దారుణంగా ఉన్నప్పటికీ నిర్మాణానికి నోచుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు గాయాలపాలవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారులకు మోక్షం కలిగించాలంటూ ఆయా ప్రాంతాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఆలయ స్థలం స్వాధీనం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పాతనగరం సూర్యాబాగ్ ప్రాంతంలో ఆక్రమణకు గురైన శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. స్థానికంగా ఉన్న 78 చదరపు అడుగుల స్థలం గత కొంత కాలం నుంచి ఆక్రమణదారుల చేతిలో ఉండటంతో.... కోర్టు ఆదేశాల మేరకు సోమవారం స్థలాన్ని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని జిల్లా దేవాదాయ శాఖ అధికారిణి టి.అన్నపూర్ణ తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మహిళల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, వారి కాళ్లపై వారు నిలబడాలనే ఉద్దేశంతో గతంలో సీఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కొనియాడారు. అక్కయ్యపాలెం పోర్టు కళ్యాణ మండపంలో ఉత్తర నియోజకవర్గంలోని ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆర్పీలకు ట్యాబ్‌ల వల్ల పని భారం తగ్గుతుందన్నారు. అనంతరం ఆయన చేతులమీదుగా 142 మంది ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేశారు. నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బి.గంగారావు, కార్పొరేటర్లు ముఖ్యులు, మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 41, 42వ వార్డుల్లో పసుపు ఆర్పీలకు దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సీతంపేటలోని జనసేన నగర కార్యాలయంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్పీల ద్వారా పొదుపు సంఘాలకు అందించే పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు వేగవంతంగా ప్రజలకు అందుతాయన్నారు. నాయకులు శివప్రసాద్, ముమ్మిన నాగమణి, అక్కిరెడ్డి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో జెడ్పీ రాము కూటమి నాయకులు

ఆగస్టు 15లోపు రైతుల వివరాలు నమోదు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రైతులకు వివిధ ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి పసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకానికి సంబంధించిన గోడపత్రికను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్ విడుదల చేశారు. వరి పండించే రైతులు, కౌలు రైతుల వివరాలు ఆగస్టు 15లోపు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మాట్లాడుతూ.. రైతులు ప్రతి హెక్టారుకు రూ.1050, ఎకరాకు రూ.420 చొప్పున చెల్లించి బీమా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గోడపత్రిక విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు

సమస్యల పరిష్కారానికి డిమాండ్

కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతులు అందించి, నిరసన తెలిపారు. * నగరంలోని బర్మాకాందిశీకులు దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. బర్మాకాందిశీకులకు కేటాయించిన భూములను పరిరక్షించాలని, ఇళ్లు లేని వారికి గృహాలు నిర్మించి ఇవ్వాలని సంఘం అధ్యక్షులు నారాయణరావు, ప్రధాన కార్యదర్శి ఎంకే కిషోర్ డిమాండ్ చేశారు. * జీవీఎంసీ 56వ వార్డు ఆర్పీపేట వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తరలించాలని శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బొజ్జిటి చిన్ని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. * విశాఖ జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీకి గత పదేళ్లుగా ఎన్నికలు జరగలేదని, ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గం ఎన్నికయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ప్రతినిధులు డి.వెంకట్రావు తదితరులు కోరారు.

నినాదాలు చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు

యూజీడీ పైపులైన్లను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

త్వరితగతిన భూగర్భ డ్రైనేజీ పనులు

అల్లిపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 32వ వార్డు పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. సోమవారం జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడు వార్డు పరిధి కృష్ణాగార్డెన్స్, అల్లిపురం ప్రధాన రహదారిలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ వివిధ సమస్యల్ని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు. * సూర్యాబాగ్ దరి జోన్-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జెడ్సీ మల్లయ్యనాయుడు పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఏఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణంరాజు, ఇతర అధికారులు హాజరయ్యారు. జోన్-5 కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్సీ బి.రాము పాల్గొని వినతులు స్వీకరించారు.

నేడు రాష్ట్రమంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం విశాఖ రానున్నారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనం, 11.15 గంటలకు పెదవాల్తేర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మధ్యాహ్నం 12.30 గంటలకు గీతం వైద్య కళాశాలలో పలు పథకాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. రాత్రికి రైల్లో బయలుదేరి విజయవాడ వెళ్తారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే: స్థానిక ఉమా రామలింగేశ్వరాలయంలో సోమవారం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకవార, రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం జరిపిన ప్రదోషకాల పూజలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మంచిలి భానుమూర్తి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు.

హుండీ ఆదాయం రూ.11 లక్షలు

అల్లిపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 41వ వార్డు ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 27 రోజులకు రూ.11,16,861 వచ్చినట్లు ఆలయ ఈఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. దుర్గాలమ్మ ఆలయ ఈఓ శిరీషారాణి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. లెక్కింపులో శ్రీహరి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన అప్రెంటిస్ మేళా

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న అప్రెంటిస్ మేళా సోమవారం ముగిసింది. స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాకు ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన సుమారు 213 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తివిద్యాధికారి ఏ.ఆదినారాయణ, ప్రిన్సిపల్ కె.విజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గురుద్వారా, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ బయట గల ఆటో స్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 35-40 ఏళ్ల గల ఓ వ్యక్తి ఆదివారం రాత్రి సమయంలో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేపట్టినా మృతుడి వివరాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 9440796012 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

మాధవధార, న్యూస్‌టుడే: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు కంచరపాలెం పోలీసులు. వివరాలు ఇవీ.. అన్నవరం ప్రాంతానికి చెందిన రమేశ్(4) తల్లి అరుణతో కలిసి గత కొన్ని రోజులు క్రితం రెడ్డి కంచరపాలెంలో ఉన్న బంధువుల ఇంటికొచ్చాడు. సోమవారం ఉదయం ఇంటినుంచి బయటకు ఆటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వెంటనే 112కు సమాచారం అందించారు. దీంతో సీఐ కె.రవికుమార్ సిబ్బందికి తెలియజేయడంతో అప్రమత్తమై దర్యాప్తు చేపట్టగా బాలుడు ఊర్వశి కూడలి వద్ద ఉన్నట్లు గుర్తించారు. అనంతరం స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

ఆహార పొట్లాల అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.సత్యనారాయణమూర్తి జయంతి సందర్భంగా సోమవారం ఏవీఎన్ కళాశాల సమీపంలోని ప్రేమసమాజం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవల్ని కొనియాడారు. అనంతరం లెప్రసీ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి ఆహార పొట్లాలు అందజేశారు. కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారిణి డాక్టర్ ఐ.వాణి, ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్.రవికుమార్, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాకెట్లు అందిస్తున్న డాక్టర్ వాణి, తదితరులు

దీపాలు వెలిగించి.. స్థలాలు పరిరక్షించండి

జీవీఎంసీలో 154 ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 154 ఫిర్యాదులు అందగా, వాటిలో జోన్-1కు 1, జోన్-2కు 21, జోన్-3కు 17, జోన్-4కు 15, జోన్-5కు 13, జోన్-6కు 22, జోన్-8కు 23, ప్రధాన కార్యాలయానికి 42 ఫిర్యాదులు వచ్చాయి.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్

'సమన్వయంతో పని చేయండి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగే సమయంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, ఆయా చోట్ల భవిష్యత్తులో చేపట్టబోయే పనులపై ఆరా తీయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీసీలు డీవీ.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, సీసీపీ ప్రభాకర్, వ్యయ పరిశీలకులు వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థకు చెందిన పార్కులు, ఖాళీ స్థలాలను పరిరక్షించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రణాళికాధికారులతో సమావేశమయ్యారు. పార్కులు, ఖాళీ స్థలాలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నట్లు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ జీవీఎంసీ ఆస్తులు పరిరక్షణ కోసం పని చేయాలన్నారు. జీవీఎంసీ పార్కులపై ప్రణాళికాధికారులు అరకొర సమాచారం ఇచ్చారని, మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి వివరాలు సమర్పించాలని మేయర్ సూచించారు. ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం మెయిన్‌రోడ్డులోని జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం ఆలయ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, దక్షిణం తెదేపా ఇంఛార్జి సీతంరాజు సుధాకర్, ఆలయ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవాల సమయంలో సేవలు అందించిన వివిధ సేవా సంస్థల సభ్యుల్ని సత్కరించి, ప్రశంసాపత్రాలు అందించారు.

కార్యక్రమంలో దక్షిణం తెదేపా ఇంఛార్జి సీతంరాజు సుధాకర్, ఈఓ రాజగోపాల్‌రెడ్డి తదితరులు

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 42వ వార్డు పరిధిలోని రైల్వేన్యూకాలనీ, ఇందిరాగాంధీ, దొండపర్తి ప్రాంతాల్లో సోమవారం దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటించారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి చాకలిపేటలో కూలిపోయిన రక్షణ గోడను పరిశీలించారు. గోడ కూలడంతో గెడ్డలోని నీరంతా పల్లపు ప్రాంతాలను ముంచెత్తిందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం మళ్లీ గోడ నిర్మించాలని జీవీఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దొండపర్తి నుంచి రైల్వేన్యూకాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జెడ్సీ బి.రాము, తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఆకిరెడ్డి జగదీశ్, వార్డు అధ్యక్షుడు కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే న్యూకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఘనంగా పాలిటెక్నిక్ కళాశాల ఆవిర్భావ దినోత్సవం

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఒకరు రక్తం దానం చేస్తే ముగ్గురు ప్రాణాలను కాపాడినట్లేనని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. కళాశాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఏయూ విశ్రాంత రిజిస్ట్రార్, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ప్రిన్సిపల్ రమణ, పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. మొత్తం 39 యూనిట్లు రక్తాన్ని సేకరించి లయన్స్ క్లబ్‌కు అందజేశారు.

రక్తదానం చేస్తున్న ప్రిన్సిపల్ రమణ, విద్యార్థులు

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED GAJUWAKA Branch, Gajuwaka, Visakhapatnam**, I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. MALLAVARAPU MOHAN KRISHNA** S/o M.Venkata Ramana by keeping the below mentioned schedule property of **Mr. MALLAVARAPU VENKATA RAMANA** S/o Late Merayya as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Visakhapatnam District, DwarakaNagar Sub-District, Greater Visakhapatnam Municipal Corporation Area, Dondaparthi Village Accounts, TD No. 214, S.No.36/1B1, Tatichetlapalem, Narendra Nagar Area, an extent of 125 Sq.yards or 104.51 Sq.meters of site together with RCC building consisting of ground, first, second and third floors measured and bounded by:
East: Property of Chinni Asirappadu - 35.00 Feet or 10.66 meters; **South:** CC Road-32.15 Feet or 9.79 Meters; **West:** Property of Pentakota China Abbai - 35.00 Feet or 10.66 Meters; **North:** Property Molleti Appa Rao -32.15 Feet or 9.79 Meters.

In between total extent an extent of 31.25 Sq.yards or 26.12 Sq.meters of undivided and unspecified share of land together with second floor South-West corner 338 Sft (Including common areas) portion, South-West corner 338 Sft (including common areas) and third floor South-West corner 338 Sft (Including common areas) bearing D.Nos. 44-45-7,8,9,10 are bounded by:

10.41 Sq.yards or 8.70 Sq.meters of undivided share together with **Second floor South-West corner portion** with plinth area of 338 SFT portion is bounded by:

East: Eastern side portion, **South:** Open space, **West:** Open space, **North:** Corridor and stair case.

10.41 Sq.yards or 8.70 Sq.meters of undivided share together with **second floor East-South corner portion** with plinth area of 338 SFT portion is bounded by:

East: Open space, **South:** Open space, **West:** Western side portion, **North:** Corridor and stair case.

10.41 Sq.yards or 8.70 Sq.meters of undivided share together with **Third floor South-West corner portion** with plinth area of 338 SFT portion is bounded by:

East: Easter side portion, **South:** Open space, **West:** Open space, **North:** Corridor and stair case.

KODURI SREENIVASA RAO
Smt. SIVA KUMARI JALADI
Advocates
Visakhapatnam S-2, Bharat Apartments, Seethammadhara,
Dt.12.07.2025 Visakhapatnam-13. Mobile No. 9885166648
Mail:sreenivaskoduri@gmail.com

16 నుంచి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఈనెల 16 నుంచి 19 వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 16న రాత్రి 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో విశాఖ చేరుకుని, హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. 17న ఉదయం 10 గంటలకు మిందిలోని బీహెచ్‌ఈఎల్ ప్లాంట్‌ను సందర్శించి, అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో సమావేశమవుతారు. 18న ఉదయం హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంట్‌ను సందర్శించి, వివిధ అంశాలపై అధికారులతో మాట్లాడతారు. సాయంత్రం విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్, సీపీ, ఇతర అధికారులతో సమావేశమై వివిధ పథకాల అమలుపై చర్చిస్తారు. 19న రాత్రి బయలుదేరి దిల్లీ వెళ్తారు.

వడ్డేపల్లి రామచందర్

అమరావతి విశ్వ సాహితీ సంస్థ ప్రత్యేక సమావేశం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-13 భరద్వాజ క్షేత్రంలో సోమవారం సాయంత్రం అమరావతి విశ్వసాహితీ సంస్థ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి సి.హెచ్.చినసూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాహితీవేత్త డి.వి.సూర్యారావు హాజరై కవిత రాయడం ఎలా? అనే అంశంపై మాట్లాడారు. అమరావతి విశ్వసాహితీ నివేదికను కోశాధికారి పి.ఓల్.వి.ప్రసాద్ చదివి వినిపించగా రచయిత పొలమరశెట్టి ఫ్రాన్సిస్ సభా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డి.వి.సూర్యారావును సభ్యులంతా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.కృష్ణ, సెల్వరాజ్, దేవులపల్లి పద్మజ, రామారావు, బాబు, వెంకటేశ్వరరావు, రాములు, రాంతాత, రమణమూర్తి, దుర్గాప్రసన్న పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం చిలకపేటలోని శివాలయం అభివృద్ధికి వివేకానంద సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.55 వేలు విరాళం అందించారు. దాతలు చేపల మసేను దంపతులు రూ.25వేలు, సూరాడ దానమ్మ రూ.12 వేలు, వివేకానంద సేవా సంస్థ సభ్యులు రూ.18 వేలు కలిపి రూ.55 వేలను ఆలయ అర్చకులకు అందజేశారు. సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు విరాళం అందజేస్తున్న సభ్యులు



నృత్య పోటీల్లో కళాకారుల ప్రతిభ

గురుద్వారా, న్యూస్‌టుడే: నాట్య రవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 13 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన 36వ ఆల్ ఇండియా మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పోటీల్లో సీతమ్మధార డాక్టర్స్ కాలనీకి చెందిన నాట్యం నాట్య కళా క్షేత్రం కళాకారులు విజేతలుగా నిలిచారు. భరతనాట్యం సీనియర్ సోలో విభాగంలో వి.హన్సిక(ప్రథమ), బి.యశస్వి(ద్వితీయ), బి.నిషిత, ఎస్.దేవాన్షి(తృతీయ), జూనియర్ విభాగంలో ఎస్.ఎల్.ఎస్ మాన్విత, టి.నిత్య, ఎం.మోక్షిత, ఎ.లలిత మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఆర్.కౌషిని, ఆర్.రాజశ్రీనిపుణ, టి.లలిత, వై.వి.సాయివర్ష ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. క్లాసికల్ గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని నాట్యగురువులు కె.వెంకట్ చిన్నారావు, నాట్య కళా క్షేత్రం డైరెక్టర్ డాక్టర్ కె.మాధవి ప్రత్యేకంగా అభినందించారు.

విజేతలుగా నిలిచిన కళాకారులు

'కొలిమి రాజేయాల్సిందే' పుస్తకావిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో సోమవారం విశాఖ పౌర గ్రంథాలయంలో పతివాడ నాస్తిక్ రచించిన 'కొలిమి రాజేయాల్సిందే' పుస్తకాన్ని యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఘర్షణ, నైరాశ్యం, వివక్షపై కవులు, రచయితలు లోతుగా విశ్లేషించి స్పందించాలన్నారు. కార్యక్రమానికి అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా ప్రముఖ కవి రెడ్డి రామకృష్ణ, చీకటి దివాకర్, అడపా రామకృష్ణ, హనుంతరావు, బసు పోతన తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.ఎస్.చలం తదితరులు

(c) eenadu

నమూనాల నిధి... విజ్ఞాన గని..!

ఏఎంసీ అనాటమీ మ్యూజియానికి జాతీయస్థాయి గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే

ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) అనాటమీ విభాగం మ్యూజియంలో భద్రపర్చిన వివిధ నమూనాలు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. అవన్నీ వైద్య విద్యార్థులు, వైద్య పరిశోధకులు, పీజీలకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఇప్పుడు ఆ 'మ్యూజియం' జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

భద్రపర్చిన అస్థిపంజరాలు

చోటు దక్కిందిలా..!

★ ఇటీవల కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ముద్రించిన డైరెక్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్ మ్యూజియమ్స్ అండ్ సైన్స్ సెంటర్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో అనాటమీ విభాగం మ్యూజియానికి చోటు దక్కింది.

★ మానవ, వివిధ జంతువుల అవయవాలకు సంబంధించి సుమారు 700 నమూనాలు మ్యూజియంలో ఉన్నాయి.

★ దేశంలోనే అతి పురాతన వైద్య కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఆంధ్ర వైద్యకళాశాలలో అనాటమీ విభాగం వైద్యవిద్య బోధనలో కీలక పాత్ర పోషిస్తుంది.

★ మానవ శరీర నిర్మాణ క్రమాన్ని ఇక్కడే వైద్య విద్యార్థులకు బోధిస్తారు. పార్థివదేహాల ఆధారంగా వైద్యపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తుంటారు.

విదేశాల్లోనూ బోధన..!

★ ఇక్కడ ఉన్న కొన్ని నమూనాలను ఇప్పటికే పలుమార్లు విదేశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్య విద్యార్థులకు వివిధ అంశాలపై బోధన, అవగాహన కల్పించి.. తిరిగి తీసుకొస్తుంటారు. ★ ఏనుగు దంతం, రోజ్‌వుడ్‌తో తయారు చేసిన అస్థి పంజరాలు, ఖడ్గమృగం పుర్రె, తిమింగలం వెన్నుపూస, ద్వితీయ ఉదర గర్భం, ఒకే కాన్పులో ఆరుగురు జననం.. వంటి నమూనాలు మ్యూజియంలో కొలువుదీరి ఉన్నాయని అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్రకిషోర్ తెలిపారు.

భద్రతకు ప్రాధాన్యం

దేశ, విదేశాల్లో గుర్తింపు పొందిన మ్యూజియంలో నమూనాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ విభాగం అభివృద్ధికి కళాశాల పూర్వ విద్యార్థులు తమవంతు సహకారం అందిస్తున్నారు.

అరుదైన ద్వితీయ ఉదర గర్భం

తిమింగలం వెన్నుపూస

పోర్టులో కీలక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు

హాజరైన కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, శాంతనూ ఠాకూర్

ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, శాంతనూ ఠాకూర్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, షిప్పింగ్ కార్యదర్శి టీకే.రామచంద్రన్, పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే

విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో పూర్తి చేసిన కీలక ప్రాజెక్టులకు సోమవారం కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, శాంతనూ ఠాకూర్ ప్రారంభోత్సవాలు చేశారు. అదే సమయంలో మరికొన్ని నూతన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు విశాఖ పోర్టు సాధిస్తున్న ప్రగతిని కొనియాడారు. పోర్టు ఛైర్‌పర్సన్ కృషిని ప్రశంసించారు.

★ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, ప్రతి 50 కిలోమీటర్లకు ఓడరేవు ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు వివరించారు. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోర్టులో కాలుష్య నియంత్రణ చర్యలు అమలవుతున్నాయని, స్థానిక అంశాలపై పోర్టు ప్రతినిధులు సకాలంలో స్పందిస్తూ, పరిష్కారాలు చూపుతున్నారన్నారు. పోర్టు సాధించిన ప్రగతి వివరాలను ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర షిప్పింగ్ కార్యదర్శి టీకే.రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వచ్చినవి : ★ నూతన ఆయిల్ రిఫైనరీ బెర్త్-2 (రూ.42 కోట్లు), ఓఎస్‌టీటీపీ బెర్త్ వద్ద ఫైర్ ఫైటింగ్ సదుపాయాలు (రూ.27 కోట్లు), ఆర్-10 ప్రాంతంలో కవర్డ్ స్టోరేజ్ షెడ్ (రూ.22.50 కోట్లు), డబ్ల్యూక్యూ-5 జంక్షన్ నుంచి ఎస్సార్ జంక్షన్ వరకు రోడ్డు అభివృద్ధి (రూ.19.69 కోట్లు), కస్టమ్స్ కార్యాలయ రక్షణ గోడ విస్తరణ (రూ.7.17 కోట్లు), ఆర్ఎఫ్ఐడీ టేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (రూ.15 కోట్లు), నూతన పోర్టు ఆపరేటింగ్ సిస్టమ్ (రూ.10.77 కోట్లు), వెసల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (వీటీఎంఎస్) (రూ.15.83 కోట్లు).

★ వీటీఎంఎస్ ఈనెల 10 నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలోని రాడార్ సాయంతో ఇది పని చేస్తుంది. పోర్టు పరిధిలోని అన్ని నౌకల చలనాన్ని ఇది పర్యవేక్షిస్తుంది. ఇది ఐవీటీఎస్ ఫార్మట్ డేటాను నొయిడాలోని ఎన్ఎండీఏసీకి చేరవేస్తుంది.

శంకుస్థాపనలు జరిగినవి : ★ పోర్టు ఏరియాలో బి-ర్యాంప్ నిర్మాణం (రూ.33.49 కోట్లు), చేపలరేవులో ఫింగర్ జెట్టీ, విప్ నిర్మాణం (రూ.20.87 కోట్లు), ఓఎస్‌టీటీ వద్ద రెండు అదనపు బ్రెస్టింగ్ డాల్ఫిన్ల నిర్మాణం (రూ.20.87 కోట్లు), క్రూయిజ్ టెర్మినల్ సమీపంలో నూతన నిర్మాణం (రూ.15.90 కోట్లు), అంబేడ్కర్ శతాబ్ది పైవంతెన నుంచి ఎల్-17 కారిడార్ వరకు అదనపు ర్యాంపు (రూ.8.31 కోట్లు), పోర్టు ప్రాంతంలో 15 ప్రదేశాల్లో ప్రజల కోసం మరుగుదొడ్ల నిర్మాణం (రూ.5.50 కోట్లు).

నిర్ణీత సమయంలో సమస్యలకు పరిష్కారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పీజీఆర్ఎస్) వివిధ సమస్యలపై వినతులు అందిస్తున్న అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడి... బాధితులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 384 మంది వద్ద కలెక్టర్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, సీపీవో ధనుంజయరావుతో పాటు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఇకపై ప్రతి బుధ, గురువారం అర్జీదారులతో ఆయన నేరుగా ఫోన్‌లో మాట్లాడి, సమస్య పరిష్కారం ఆరా తీస్తానని కలెక్టర్ పేర్కొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

రాష్ట్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా విశాఖ వాసి విక్రమ్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని శ్రీసాయి శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి 185 మంది బాడీబిల్డర్లు పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విశాఖకు చెందిన విక్రమ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా నిలువగా.. రన్నరప్‌గా తణుకుకు చెందిన నాగేంద్ర నిలిచారు. విక్రమ్‌కు రూ.40,000, నాగేంద్రకు రూ.20,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ధ్రువపత్రాన్ని అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచిన బాడీబిల్డర్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందించారు.

రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీల్లో విజేత, రన్నరప్‌లతో బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోనల్ ఆఫీస్, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007.

అద్దె ప్రాతిపదికన ఆవరణ కావలెను

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విశాఖపట్నం & అనకాపల్లి జిల్లాలో తమ నూతన శాఖల కోసం అద్దె ప్రాతిపదికన స్థానిక / మున్సిపల్ అధికారుల నుండి ఖచ్చితంగా వాణిజ్య అనుమతులు కలిగి ఉన్న ప్రాంగణానికై బిడ్‌లను ఆహ్వానిస్తుంది.

వ.నెం.	బ్రాంచ్ తరహా	ప్రాధాన్యతగల ప్రదేశం (పిన్‌కోడ్)	సుమారు కార్పెట్ ఏరియా (చ.అ.)
1	రెగ్యులర్ బ్రాంచి ATMతో	వేపగుంట జంక్షన్-530047	1400-1500 చ.అ.
2	రెగ్యులర్ బ్రాంచి ATMతో	మల్కాపురం-530011	1400-1500 చ.అ.
3	రెగ్యులర్ బ్రాంచి ATMతో	కూర్మన్నపాలెం-530012	1400-1500 చ.అ.
4	రెగ్యులర్ బ్రాంచి ATMతో	పరవాడ-531021	1000-1200 చ.అ.

ప్రతిపాదిత ఆవరణము ఏటీయమ్ గదితో విడివిడిగా ప్రవేశం కలిగి ఉండి క్రింద అంతస్థులో (తగినంత పార్కింగ్ స్థలముతో) అద్దె ప్రాతిపదికపై నూతన శాఖను ఏర్పాటు చేయుటకు వీలుగా ఉండవలెను. ఈ ఆవరణము చాలినంత విద్యుత్ సామర్థ్యము, బ్యాంక్ వారి యొక్క అవసరములు మరియు ప్రమాణములు అనుసరించి ఇతర మౌలిక సదుపాయములు కూడా కలిగి ఉండవలెను. ఆవరణము వెంటనే స్వాధీనం చేసేకొనుటకు సిద్ధముగాను లేదా బ్యాంక్ యొక్క అవసరములకు లోబడి 10 నుండి 15 రోజులలోగా సిద్ధముగా ఉండవలెను. కావున ఆసక్తి కలిగియున్న పార్టీలు / వ్యక్తులు బ్యాంక్ యొక్క సంబంధిత నమూన దరఖాస్తు ద్వారా వారి ఆఫర్లను "టెక్నికల్ బిడ్" మరియు "కమర్షియల్ బిడ్"గా తెలియజేసి రెండు విడివిడిగా కనసీల్డ్ కవర్ల యందు ఉంచి, కవరుపై "టెక్నికల్ బిడ్" / కమర్షియల్ బిడ్‌గా పేర్కొని, జోనల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం. 59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007 వారి కార్యాలయము నందు తేది.25.07.2025, సాయంత్రం గం. 5.00 లోగా సమర్పించవలసినదిగా కోరుచున్నాము.

ఈ సంబంధిత దరఖాస్తులు పై చిరునామా వద్ద కార్యాలయము పనివేళలయందు వ్యక్తిగతముగా పొందవచ్చును. మరియు మా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: www.bankofmaharashtra.in లో "టెండరు" విభాగము క్రింద ఈ టెండరు ప్రకటనతో పాటుగా డౌన్‌లోడ్ చేసుకొనగలరు. కారణం ఏదైనప్పటికినీ తెలియచేయు అవసరం లేకుండా ఏ ఆఫరునైనా రద్దు/ తిరస్కరించు పూర్తి అధికారము / హక్కు బ్యాంక్ వారు కలిగియున్నారు. ఏవిధమైన బ్రోకరేజీ చెల్లించబడదు. అసంపూర్తిగా ఉన్న మరియు ఆలస్యముగా అందిన అనగా తేది.25.07.2025, సాయంత్రం గం. 5.00 ల తరువాత వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించబడవు. అదనపు వివరముల కొరకు pln_vjd@mahabank.co.in, gad_vjd@mahabank.co.in, ఫోన్: 08662480133, 7013388468 సంప్రదించగలరు.

పారిశ్రామిక శిక్షణతో ఉపాధి అవకాశాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఏరోస్పేస్‌కు అవసరమైన వస్తువుల తయారీపై ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇచ్చిన శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, జీఈ ఏరోస్పేస్, ఎల్అండ్‌టీ డిఫెన్స్, మారుతి సుజుకి, మేధో సర్వో, రాయల్ ఎన్‌ఫీల్డ్, టాటా హిటాచీ తదితర కంపెనీల్లో ఉద్యోగాలు పొందినందుకు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ దిల్లీ చీఫ్ జనరల్ మేనేజర్ అనురాగ్‌శర్మ, మేనేజర్ శేఖర్ రెడ్డి, ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ డీజీఎం ప్రసాద్‌రెడ్డి, శిక్షణ అధిపతి మురళీకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి. రామకృష్ణతో ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. యూపీకి చెందిన అనుమోలు మిశ్రా అనే నిందితుడు 9.6 కిలోల గంజాయితో రైల్వే స్టేషన్ పరిసరాల్లో సంచరిస్తుండగా, పోలీసులు తనిఖీ చేసి సరకు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కొరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ నుంచి కిరండూల్ వెళ్లాల్సిన పలు రైళ్లు కొరాపుట్ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.

అవగాహన సదస్సుల నిర్వహణకు అనుమతులివ్వండి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెబుతూ జిల్లాలోని కళాశాలలు, యూనివర్సిటీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, అనుమతులు ఇవ్వాలని హ్యూమన్ రైట్స్ సెల్ సభ్యులు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని కోరారు. సోమవారం మధ్యాహ్నం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం అనుమతుల కోసం వినతిపత్రం సమర్పించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు కె.మంగయ్య నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం. నాయుడు, జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యనిర్వాహక అధ్యక్షులు జి.ఎస్.ఎన్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎన్.వి. విశ్వనాథం, ఉపాధ్యక్షుడు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీ శంఖబ్రత బాగ్చీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న హ్యూమన్ రైట్స్ సెల్ సభ్యులు

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సమష్టి కృషి

గురుద్వారా, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకం అమలుకు బ్యాంకులు, సోలార్ విద్యుత్తు సంస్థలు సమష్టిగా కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) ఇమ్మడి పృథ్వీతేజ్ సూచించారు. గ్రీన్‌పార్కు కాలనీ దరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం సోలార్ వెండర్లు, బ్యాంకులు, సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విశాఖలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాల ద్వారా పీఎం సూర్యఘర్ పథకం గురించి ప్రజలకు వివరించి సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సిరిపురం, సీతమ్మధార, ఎంవీపీకాలనీ, మద్దిపాలెం, కంచరపాలెం, ఎన్ఎస్‌టీఎల్, మధురవాడ, ఎండాడ, గోపాలపట్నం, గాజువాక వంటి ప్రాంతాల్లో లక్ష్యానికి అనుగుణంగా సోలార్ యూనిట్ల ఏర్పాటు చేయించలేకపోయారని ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అతి తక్కువ వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ రుణాలను వినియోగదారుల నుంచి విద్యుత్తు బిల్లులు ద్వారా నెలవారీ పద్ధతిలో బ్యాంకుల తరఫున వసూలు చేసేందుకు ఈపీడీసీఎల్ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాశ్, సీజీఎం బి.సులేఖరాణి, ఎస్ఈ శ్యాంబాబు, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీజీబీ ప్రాంతీయ మేనేజర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, చిత్రంలో డైరెక్టర్ సూర్యప్రకాశ్, ఉన్నతాధికారులు

స్కాన్ యంత్రాలతో సాంకేతిక లోపాల గుర్తింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విద్యుత్తు ఇంజిన్ రైళ్లలో ఎదురయ్యే విద్యుత్తు సంబంధించి సమస్యల్ని గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు వీలుగా మెజరింగ్, రికార్డింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఎంఆర్ఐ) స్కాన్ యంత్రాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విద్యుత్తు లైన్లలో భద్రత, సామర్థ్యంపై తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ అధునాతన పరికరాలను భారతీయ రైల్వే అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. వాల్తేర్ రైల్వే పరిధిలో నూతన వ్యవస్థను వినియోగిస్తామని ఆయన తెలిపారు. డీఆర్ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ... నిత్యం నిర్వహించే వివిధ తనిఖీల్లో గుర్తించే లోపాలను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే వీలుంటుందన్నారు. నూతన విధానం అమలుతో రైళ్లు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతాయన్నారు.

త్వరితగతిన 'పీ-4' మార్గదర్శకుల గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీ-4'కు సంబంధించి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'పీ-4' అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కనీసం పది వేల మంది ఔత్సాహికుల్ని గుర్తించి, బంగారు కుటుంబాలను అనుసంధానం చేయాలన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. గెజిటెడ్ ర్యాంకు కలిగిన ప్రతి అధికారి కనీసం ఓ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. దత్తత తీసుకోలేని వారు ఆర్థికంగా సాయం చేయాలన్నారు. 'పీ-4'లో చేరినా, తోడ్పాటు అందించిన వారికి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో భవానీశంకర్, సీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో జేసీ

సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన తప్పనిసరి

సబ్బవరం, న్యూస్‌టుడే: నేటి తరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ముందుకు సాగాలని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వెంకట్రావు సూచించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ)లో చేరే 3, 5 ఏళ్ల లా కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ముగ్గురు తల్లులను గుర్తుపెట్టుకోవాలని.. ఇందులో మొదటిది జన్మనిచ్చిన తల్లి, రెండోది చదువుకున్న విశ్వ విద్యాలయం, మూడోది భారత మాత అని పేర్కొన్నారు. ఈ మూడింటిని గౌరవించినప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలమని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిలా ఉంటూ అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూలో మంచి సౌకర్యాలు, పచ్చదనాన్ని అందిస్తున్న అధికారులను అభినందించారు. తొలుత డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒక న్యాయ విద్యార్థికి సమాజం మీద పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టాలను సులభంగా అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు. లాయర్‌గా ప్రతి విద్యార్థి సామాజిక, ఆర్థిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ (ఇన్‌ఛార్జి) డాక్టర్ మాదాసు విశ్వచంద్రనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, చిత్రంలో గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ వెంకట్రావు

కేజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి చికిత్స

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో నగరానికి చెందిన పి.లక్ష్మి(39)కి కిడ్నీ మార్పిడి చికిత్స విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారిణి డాక్టర్ ఐ.వాణి తెలిపిన వివరాల ప్రకారం... తీవ్రమైన కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బాధితురాలు కొంతకాలంగా కేజీహెచ్ డయాలసిస్ విభాగంలో చికిత్స పొందుతోంది. బాధితురాలి తల్లి కిడ్నీ దానం చేసేందుకు ముందుకు రావడంతో ఈనెల 2న కిడ్నీ మార్పిడి చికిత్స నిర్వహించారు. బాధితురాలు కోలుకోవడంతో సోమవారం ఇంటికి పంపించారు. ఏ ఖర్చూ లేకుండా ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నామని, అవసరమైన వారు వైద్యసేవల్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వాణి సూచించారు. నెఫ్రాలజీ, యూరాలజీ, ఎనస్తీషియాలజీ వైద్య నిపుణులు రాధాకృష్ణన్, రత్నప్రభ, సింధూర్, నాగబాబు, నిషాకుమారి, జయశ్రీలక్ష్మి, దివ్య, సంతోష్ తదితరులను ఆసుపత్రి సూపరింటెండెంట్ అభినందించారు. కిడ్నీ దాత ఎం.లక్ష్మిని వైద్యాధికారులు సత్కరించారు.

చికిత్స జరిగిన మహిళతో వైద్యాధికారులు, సిబ్బంది

మద్యం మత్తులో కత్తితో దాడి

ప్రాణాలు కోల్పోయిన యువకుడు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మద్యం మత్తులో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన నిందితుడు పరారవగా, బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సోమవారం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి. పాతనగరం ఎల్లమ్మతోటలో నివాసం ఉంటున్న శెట్టి ఎల్లాజీ(20), అతడి స్నేహితుడు అయ్యప్ప(21) ఆదివారం అర్ధరాత్రి వరకు జగదాంబకూడలి సమీపంలో మద్యం తాగారు. రాత్రి 12.30 గంటలకు ఎవరికి వారు ఇళ్లకు బయలుదేరారు. ఆ తర్వాత ఒంటి గంట సమయంలో అల్లిపురం సమీప కెప్టెన్ రామారావు కూడలి వద్ద అయ్యప్పకు ఇంకొందరు యువకులకు గొడవ జరిగింది. అయ్యప్ప వెంటనే ఎల్లాజీకి ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఎల్లాజీ అక్కడకు చేరుకుని, గొడవ పడుతున్న యువకులకు నచ్చజెప్పి పంపించేశాడు. వాళ్లను కొట్టకుండా ఎందుకు పంపించావని ఎల్లాజీని అయ్యప్ప ప్రశ్నించాడు. అయ్యప్ప మాటలు పట్టించుకోకుండా ఎల్లాజీ ఇంటికి బయలుదేరాడు. ఆగ్రహించిన అయ్యప్ప మరో ఇద్దరు స్నేహితుల్ని పిలిచి డాబాగార్డెన్స్ వైపు వెళ్తున్న ఎల్లాజీపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎల్లాజీ స్నేహితులు అక్కడకు చేరుకుని, బాధితుడిని కేజీహెచ్‌కు తరలించారు. ఎల్లాజీ అక్కడే చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నారు. ★ ఎల్లాజీ ఆసుపత్రికి చేరేటప్పుడు ఓ కత్తి వీపు భాగంలో గుచ్చుకుని ఉంది. మరోకత్తి అతడి జేబులో ఉంది. ఎల్లాజీ స్థానికంగా పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. అతడి తల్లి పార్వతీపురంలో ఉంటున్నారు. మృతదేహానికి శవపరీక్షలు పూర్తి చేసి, మంగళవారం ఉదయం అప్పగిస్తామని వైద్యులు తెలిపారు.

శెట్టి ఎల్లాజీ (పాతచిత్రం)

మందలించినందుకు కానిస్టేబుల్‌పై దాడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతవెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన మహిళ (32) 10ఏళ్ల కిందట భర్తతో విడిపోయి వేరుగా ఉంటోంది. 9ఏళ్ల కిందట వై.దేముడు అనే వ్యక్తితో ఆమెకు పరిచయమైంది. ప్రేమగామారి ఇద్దరూ సహజీవనం ప్రారంభించారు. రెండేళ్లుగా దేముడు ఆమెపై అనుమానం పెంచుకుని తరచూ కొడుతున్నాడు. దీంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. దేముడు ఆదివారం అక్కడికెళ్లి వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ యోగేశ్వరరావు అతనింటికి వెళ్లి మందలించారు. ఆగ్రహంతో దేముడు ఆయనపై దాడి చేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తీవ్ర విషాదంలోనూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: చనిపోయిన తర్వాత అవయవదానం చేసి ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడో వ్యక్తి. రాష్ట్ర అవయవదాన కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన టి.లోకేశ్ (36) ఆదివారం సాయంత్రం ఎల్.కోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు దెబ్బతగిలి విపరీతంగా రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అంబులెన్స్‌లో విశాఖలోని విమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఆరోగ్యం మెరుగుపడకపోవటంతో సోమవారం బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. దీంతో కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో మృతుడి నుంచి జీవస్థితిలో ఉన్న రెండు మూత్రపిండాలు(కిడ్నీ), కాలేయం తీసి జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం ఆసుపత్రులకు కేటాయించామని డాక్టర్ రాంబాబు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కు మరణించి తీవ్ర విషాదంలో ఉన్నా.. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చి ఔదార్యం చాటుకున్న కుటుంబసభ్యులను సన్మానించి అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు.

లోకేశ్ (పాతచిత్రం)

చంకలో బిడ్డతో తల్లి ఆత్మహత్య

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రెండేళ్ల చిన్నారిని చంకలో పెట్టుకొని తల్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని దిమిలిరోడ్డు సమీపంలో పాతవీధికి చెందిన రాజు కాయగూరల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య జి.రూప (22), మూడున్నరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. సోమవారం రాత్రి మేడపై గదిలోకి వెళ్లిన రూప కుమార్తెను చంకలో పెట్టుకొని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉరి మెడకు బిగుసుకున్నాక రూప చేతిలోంచి బిడ్డ జారి కాళ్లవద్ద పడి ఏడవడం ప్రారంభించింది. ఏడుపు విని స్థానికులు మేడపైకి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందింది. దీంతో వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరవాడ డీఎస్పీ, స్థానిక పోలీసులతో కలసి ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పెళ్లి ఇష్టం లేదని తన కుమార్తె చెబుతుండేదని తల్లి సలాది నూకరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	81	70
లైవ్	103	90
డ్రెస్డ్	149	150
స్కిన్‌లెస్	170	160

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

PERSONAL CLASSIFIEDS

LOST

Lost my Original Sale Deed (Document No.8346/94) while travelling from Peda Waltair to Siripuram by Auto on 09.07.2025. If found, please contact my mobile no: 9912960936

REAL ESTATE

FLAT FOR SALE

SUJATHANAGAR

2 BHK Dream Home Sapthagiri Nagar, Chinamushidiwada (Beside Maseed) East Facing 1090 Sq. Ft. Spacious, well-lit, and perfect for families ✆ Call now: 8886702221.

PLOT FOR SALE

GENERAL

VUDA Plot 340 Sq.yds. North and East Corner in Vizag City. ✆ 9490436614.

TO LET

COMMERCIAL

GENERAL

Commercial Warehouse (3500 Sq.Ft) for rent in Thalavalsa, Visakhapatnam all amenities. Ph: 9440878300/ 7981741475

WANTED

GENERAL

WANTED Godown For Rent
Sree Murali Mohana Boiled & Raw Rice Mill Private Unlimited (BELL BRAND RICE)
Location: Visakhapatnam City
Facing: North, East, North East Block
SIZE: 2000 SFT Approximately
Contact : 9490564901

JOBS

Wanted Courier Pick up Boys for International Couriers, Vizag (Salary + Petrol) Ph: 9966052040, 9703989808

Wanted Chief Managers for a reputed long standing company Vizag. Any qualification, Full / Part Time working, Rtd. M/F, Age: 30+, Yearly Package decide at the time of Interview. Con: B. Chandrasekhar - GM. ✆ 9246674326

Wanted for Vizag 1) B.Tech Civil with 1Yr. Exp. 2) DCE with 2Yrs Exp. Firm: Sir MVITS IND Pvt Ltd. ✆ 9849957401, 9177598545.

WANTED STAFF
SALES GIRLS AND BOYS
well experienced in silver counter sales
Age: 25 to 40 years
Salary: 15,000 to 25,000/-
ANNAPURNA SILVER PALACE
B.C. ROAD, NEW GAJUWAKA
Ph: 9391919251

Saradhi Pvt. Ltd.లో బ్రాంచ్ ఆఫీసర్‌గా పనిచేయుటకు యువకులు కావలెను. Qlf : Any డిగ్రీ. జీ|| 15K to 18K వ|| 21 to 35 సం|| ఆఫీసు అడ్రస్ 3rd లైన్ ద్వారకానగర్ వైజాగ్. ✆ 9063475816.

ద్వారకానగర్ కళ్యాణి మెస్‌లో పనిచేయుటకు *వెజ్ అసిస్టెంట్ కుక్స్ *వెజ్ చైనీస్ అసిస్టెంట్ కుక్స్ * పుల్కా తయారు చేయువారు కావలెను. జీతం+వసతి. Ct: 9912462673.

2021 మోడల్, 50 HP Johndeere Front Bucket 5310 4WD ట్రాక్టర్, సింగిల్ ఓనర్, మంచి రన్నింగ్ కండీషన్, హెవీ డ్యూటీ ఆపరేషన్, V16 ఇంజన్ ట్రాక్టర్ అమ్మకానికి. 8341695672, 9550750150.

ప్రముఖ కంపెనీలో ఫుల్/ పార్ట్ టైం చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), Retd. పర్సన్స్, ఈవెంట్స్ కండక్ట్ చేయుటకు (F) కావలెను. జీతం+ ఇన్‌సెంటివ్స్. ✆ 9985209038.

FACULTY/ TEACHERS

Wanted CBSE Accountancy teacher for a reputed residential school in Anandapuram-Visakhapatnam. Contact: 9493887644

ACCOUNTING

Wanted Tally operator, Qualif: Tally certificate, Salary 14000/-, Exp: 0-2 years. Call: 9866048888.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

చిన్నారి కళాకారులతో నాట్యాచార్యుడు సందీప్‌కుమార్ తదితరులు

బాలల ప్రతిభకు ప్రశంసలు

గాజువాక, న్యూస్‌టుడే : సింహాచలం గిరి ప్రదక్షిణలో భాగంగా గాజువాకకు చెందిన కళారాధన సంగీత, నృత్య అకాడమీ చిన్నారులు నృత్యవేడుకతో అలరించారు. వారికి దేవస్థానం అధికారులు ప్రత్యేక ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. నాట్యాచార్యుడు తాళ్లపాక సందీప్‌కుమార్ నేతృత్వంలో 22 మంది బాలికలు నృత్యాలు ప్రదర్శించారు. ప్రతిభ చూపిన వారిని సోమవారం పలువురు అభినందించారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో విజ్ఞానం

కైలాసగిరిపై వాతావరణ కేంద్రం వద్ద విద్యార్థినులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కాపుజగ్గరాజుపేట సమీప విజ్ఞాన్ మహిళా కళాశాల ఈసీఈ విద్యార్థులు సోమవారం విశాఖ కైలాసగిరిపై ఉన్న వాతావరణ కేంద్రం సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ఈసీఈ విభాగం అధ్యాపకులు పి.సంతోష్‌కుమార్, డి.పూర్ణిమ పాల్గొన్నారు.

రక్షణ గోడలు నిర్మించరూ..!

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక సమీప గోపాల్‌రెడ్డినగర్, గాంధీనగర్‌ను కలిపే ప్రధాన మురుగు గెడ్డకు రక్షణ గోడల నిర్మాణం లేక స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిర్మాణ పనులు చేపట్టాల్సిన జీవీఎంసీ అధికారులు తాత్సారం చేస్తుండడంతో నివాసితులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేస్తూ, మిగిలిన వాటిని పట్టించుకోకపోవడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 500 మీటర్ల మేర గెడ్డకు ఇరువైపులా గోడల నిర్మాణం లేదు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అధిక మొత్తంలో వ్యర్థాలు తీసుకొచ్చి గెడ్డలో పారబోస్తుండడంతో తరచూ మురుగు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిస్తే నీరంతా పొంగి ఇళ్ల మధ్యలోకి చేరుతోందని.. ఈ సమస్య పరిష్కరించేలా రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దర్పణం

వైద్యులు లేరు... బాధ్యులు ఎవరు..!

యూపీహెచ్‌సీల్లో రోగులకు అరకొర సేవలు

గాజువాక, న్యూస్‌టుడే : వాతావరణ మార్పుల నేపథ్యంలో గాజువాక పట్టణంలో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. ఈ సమయంలో మెరుగైన సేవలు అందించాల్సిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) వైద్యులు లేక దిక్కులు చూస్తున్నాయి. దిగువ స్థాయి సిబ్బంది ఇచ్చే మందులతో రోగులు కాలం గడుపుతున్నారు. కీలకమైన వైద్యుల పోస్టులు భర్తీకాక స్టాఫ్ నర్సులతో ఆయా కేంద్రాలను నడిపిస్తున్నారు.

ఎక్కడెక్కడ..!: ★ గాజువాక జోన్‌లో కొత్తగాజువాక, తుంగ్లాం, నరవ, లంకెలపాలెం, మింది, దువ్వాడలో యూపీహెచ్‌సీలు ఉన్నాయి. 30 వేల జనాభాకు ఒకటి చొప్పున అందుబాటులో ఉండేలా గతంలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల పేరిట ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆ తర్వాత యూపీహెచ్‌సీలుగా మార్చారు.

★ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఆసుపత్రుల్లో సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం పొరుగు సేవల కింద ఓ వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఓ ఫార్మాసిస్ట్, ఓ టెక్నీషియన్, ఓ సహాయకుడిని నియమించింది.

★ ఇటీవల కొత్తగాజువాక కేంద్రం వైద్యుడు రాజీనామా చేయడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. దువ్వాడ, నరవ యూపీహెచ్‌సీల్లోనూ పోస్టులు ఖాళీ అయ్యాయి.

★ ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో సేవలు అందించే బాధ్యతలను ఇతర ఆసుపత్రుల్లో వైద్యులకు అప్పగించారు. దీంతో రోజువారీ ఓపీ చూడడం కష్టంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. దీంతో అక్కడున్న స్టాఫ్‌నర్సులే సేవలు అందించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో యూపీహెచ్‌సీల్లో నామమాత్ర సేవలు అందుతున్నాయి.

కొత్తగాజువాకలో యూపీహెచ్‌సీ

కార్మికులకు సేవలు అందిస్తున్న సిబ్బంది

సంచార వాహనంతో సేవలు

★ ఇటీవల వాతావరణ మార్పులతో జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. యూపీహెచ్‌సీల్లో వైద్యుల కొరత కారణంగా బాధితులంతా గాజువాక, పెదగంట్యాడ పీహెచ్‌సీలతో పాటు, అగనంపూడి సీహెచ్‌సీల బాట పడుతున్నారు. దీంతో ఇటీవల ఆయా ఆసుపత్రుల్లో ఓపీ 150 దాటుతోంది. ★ జ్వరాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయా కాలనీల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌గా ఎన్టీఆర్ వైద్యసేవ సంచార చికిత్స వాహనం (104 మొబైల్ వాహనం) మురికివాడలు, శివారు కాలనీల్లో వైద్య సేవలు అందిస్తుందని పీహెచ్‌సీ వర్గాలు చెబుతున్నాయి. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు పేర్కొన్నారు.

పరికరాలు ఇలా... వ్యాయామం ఎలా..?

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే : గాజువాక పరిధిలోని పబ్లిక్ పార్కులు, క్రీడా మైదానాల్లో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామ పరికరాల నిర్వహణ చూసే వారు లేక... ఒక్కొక్కటీ మూలకు చేరుతున్నాయి. గాజువాక, చినగంట్యాడ, శ్రీనగర్, పెదగంట్యాడ, వుడాకాలనీ తదితర 12 చోట్ల బహిరంగ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిని కొందరు ఆకతాయిలు ఇష్టానుసారంగా ఉపయోగించడంతో చాలా వరకు పాడయ్యాయి. దీంతో నిత్యం ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని... ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: **సమస్య:** కార్పొరేషన్ సమీప అశోక్‌నగర్ రోడ్డు నంబర్-6లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. 76వ వార్డు శ్రీరామనగర్, బాలచెరువు పరిసరాల్లోనూ సమస్య తీవ్రత ఉంది. –అనురాధ, అశోక్‌నగర్, –ఆనందరావు, 76వ వార్డు. **సమాధానం:** సిబ్బందిని పంపి కుక్కల్ని పట్టిస్తాం. –డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంవోహెచ్

?: జీవీఎంసీ 73వ వార్డు ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. మింది సమీప కాశీరంగనగర్ కొండవాలు ప్రాంతంలో ఎల్ఈడీ దీపాలు మిణుకుమిణుకుమంటున్నాయి. –రేణుక, 73వ వార్డు, –సింహాచలం, కాశీరంగనగర్ ✓: పరిశీలించి, దీపాలకు మరమ్మతులు చేస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

దీపాలు వెలిగించారు...

స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే: వీధి దీపాల సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల్లో దీపాలకు మరమ్మతులు చేసి, విద్యుత్ వ్యవస్థను సరి చేశారు.

● మింది చెరువు పరిశీలన

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: మింది చెరువు అభివృద్ధికి సంబంధించి సోమవారం ఏపీ గ్రీన్ కో-ఆపరేషన్ సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడి... చెరువు విస్తీర్ణం, ప్రస్తుతం ఉన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీన్ కో-ఆపరేషన్ జెడ్ఎమ్ నరసింహారావు, ఏఈ కిశోర్, స్థానిక నాయకుడు లతీశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



వివరాలపై ఆరా తీస్తున్న సంస్థ అధికారులు

● నకిలీ మెసేజ్‌లు పంపిస్తే కఠిన చర్యలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో నకిలీ మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయొద్దని గోపాలపట్నం సీఐ ఎన్.వి.ప్రభాకరరావు సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 6న ఇందిరానగర్‌లోని రెండు గొలుసు దుకాణాలపై దాడి చేసి 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అయితే మద్యం సీసాలు మాయమైనట్లు ఓ వ్యక్తి నకిలీ మెసేజ్ పెట్టగా, సామాజిక మాధ్యమంలో పలువురు ఫార్వర్డ్ చేశారని, ఇది పూర్తిగా అసత్య ప్రచారమని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, అధికారులపై అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

● రూ.కోటితో బోర్‌వెల్ నిర్మాణం

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: దశలవారీగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఉపమేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డులో సుమారు రూ.కోటి నిధులతో చేపట్టిన బోర్‌వెల్ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. బోర్‌వెల్‌తో ప్రజల నీటి అవసరాలు తీరనున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ సుమన్, సన్యాసప్పారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● 16 నుంచి నిరసన దీక్షలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయాన్ని వెంటనే పునఃప్రారంభించాలని కోరుతూ ఈనెల 16 నుంచి పాఠశాల వద్ద నిరసన దీక్షలు చేపడతామని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ స్పందించాలని ఆయన కోరారు.

కాళికానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

కూటమితోనే ప్రజా సంక్షేమం సాధ్యం

మల్కాపురం, న్యూస్‌టుడే: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో నగరం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ఎమ్మెల్యే గణబాబు తనయుడు, తెదేపా యువ నాయకులు మౌర్య అన్నారు. 62వ వార్డు ప్రకాశ్‌నగర్‌లో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు.

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: కూటమి పాలనలోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జీవీఎంసీ 68వ వార్డులో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ తెదేపా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకాశ్‌నగర్‌లో మాట్లాడుతున్న మౌర్య

నిందితులకు జైలు శిక్ష

రాజమహేంద్రవరం: నకిలీ దస్త్రాలతో మోసం చేసిన ఇద్దరికి రెండున్నరేళ్ల జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం మూడో అదనపు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. పాత గాజువాకకు చెందిన వడ్లమూడి రామకృష్ణకు చెందిన ఆయిల్ ట్యాంకర్ కేసు 2018లో రాజమహేంద్రవరంలోని ఏడో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఉంది. దీనిని విడిపించడానికి రామకృష్ణ, రాజమహేంద్రవరంలోని కంబాలపేటకు చెందిన బట్టు కుమార్‌ను సంప్రదించారు. ఆయిల్ ట్యాంకర్ కేసులో అధికార సంతకాన్ని ఫోర్జరీ చేసి కోర్టుకు అందజేశారు. నకిలీ పత్రాలు సమర్పించినట్లు తేలడంతో కేసు నమోదైంది. నిందితులకు రెండున్నరేళ్ల జైలు, రూ.20 వేలు జరిమానా కోర్టు విధించింది.

సుస్థిర అభివృద్ధి దిశగా పరిపాలన

అగనంపూడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

అగనంపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి దిశగా కూటమి పాలన సాగుతోందని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్‌తో పాటు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి పాలన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. అనంతరం జీవీఎంసీ 79వ వార్డులో సుమారు రూ.3 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, 79, 85 వార్డుల తెదేపా అధ్యక్షులు కరణం జగదీశ్, కర్రి చంద్ర, తెదేపా నాయకులు కరణం సత్యారావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాలువలో పూడిక తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు బాజీ కూడలి నుంచి సుసర్లకాలనీకి వెళ్లే కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి సంబంధిత అధికారులు స్పందించారు. కాలువలో పేరుకుపోయిన పూడికను యంత్రం సాయంతో తొలగించారు. మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు.

తొలగించిన పూడిక వ్యర్థాలు

● శాకంబరిగా త్రిశక్తి అమ్మవారు

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే: చినగంట్యాడ కనకదుర్గ త్రిశక్తి ఆలయంలో అమ్మవారిని సోమవారం శాకంబరిగా అలంకరించి, పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

● వైద్య వృత్తికి ఆదరణ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సమాజంలో వైద్యవృత్తికి ఆదరణ ఎక్కువని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పెదగంట్యాడ పీహెచ్‌సీ నుంచి బదిలీపై వెళ్లిన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, ఫార్మసిస్ట్ వెంకటేశ్వరు, ఇతర హెల్త్ కార్యదర్శులకు సోమవారం వీడ్కోలు, అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లా చేతుల మీదుగా వారికి జ్ఞాపికలు అందించారు. వైద్యాధికారులు డాక్టర్ పి.హేమలత, డాక్టర్ ఎం.సంపత్‌బాబు, తెదేపా నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కులో పని చేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులుగా ప్రజా చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్న కె.సింహాచలం, కె.సత్యనారాయణ, వై.టి.దాసు జీవిత ఉద్యోగ విరమణ చేశారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజానాట్య మండలి స్టీల్ డివిజన్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. కార్మిక నాయకులు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

కళాకారులను సత్కరించిన ప్రజానాట్యమండలి ప్రతినిధులు

'పని చేసే వారికి తెదేపాలో చోటు'

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : తెదేపా బలోపేతానికి కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాస్ అన్నారు. సోమవారం 76వ వార్డు తెదేపా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం హౌసింగ్‌బోర్డుకాలనీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించారు. వార్డు అధ్యక్ష, కార్యదర్శులుగా జిత్తుగ రాజు, కొన చెంచెయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. సభ్యులు నాగు, శివ, సత్యారావు, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జి.శ్రీనివాస్, తదితరులు

సమస్యల పరిష్కారానికి విన్నపాలు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెం ప్రధాన రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ బాండ్లు మంజూరు చేయాలని 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ): ఆటోనగర్ ఎల్ఐజీ, ఎంఐజీ బ్లాక్‌లో నివాసం ఉంటున్న మహిళలు సోమవారం 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావును కలిసి కాలనీల్లో సమస్యలపై విన్నవించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం గుల్లలపాలెం జీవీఎంసీ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని సీపీఎం జిల్లా నాయకులు ఎం.జగ్గునాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

గాజువాక, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం సమృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గాజువాక జోనల్ కార్యాలయంలో పట్టణ డ్వాక్రా గ్రూపుల ఆర్పీలు 240 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పారదర్శక సేవలకు ట్యాబ్‌లు ఉపకరిస్తాయన్నారు. జెడ్సీ శేషాద్రి అధ్యక్షత వహించారు. డిప్యూటీ మేయర్ డి.గోవిందరాజు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, రాజాన రామారావు, తిప్పల వంశీరెడ్డి, జగన్, యూసీడీ అధికారులు పాల్గొన్నారు.



ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా, జెడ్సీ శేషాద్రి తదితరులు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

శ్రీనగర్ (గాజువాక), న్యూస్‌టుడే : కొండవాలు ప్రాంత కాలనీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని 72వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. సోమవారం వార్డు పరిధిలో మూడు చోట్ల కొత్తగా ఏర్పాటు చేసిన చేతిపంపుల్ని ఆయన ప్రారంభించారు. విశ్వేశ్వరాయనగర్‌లో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డులో రూ.6 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాయకులు శంకరరావు, నాయుడు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



చేతిపంపు ప్రారంభోత్సవంతో నాయకులు, స్థానికులు

ఐటీఐ ప్రవేశాల గడువు పెంపు

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల గడువు ఈనెల 20 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ కేవీఎస్ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

WANTED
Nausenabagh, Sindia ఏరియా గ్యాస్ ఏజెన్సీలో పనిచేయుటకు Hindi (Compulsory) English Knowledge కలిగినవారు స్థానికులు కావలెను. ఆకర్షణీయమైన జీతం
◆ RECEPTIONIST -1 (Male)
◆ RECEPTIONIST -2 (Female)
Married Preferable
Timings: 9 AM to 6PM
SVS GANESH GAS AGENCY
Malkapuram, Visakhapatnam
Ph: 9951137464

నూతన నిర్మాణానికి శంకుస్థాపన

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 87వ వార్డు కణితి యాదవ వీధి సామాజిక భవనం ఆవరణలో ఓపెన్ షెడ్ నిర్మాణానికి కార్పొరేటర్ బొండా జగన్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక భవనంలో నివాసితులు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు ఉపయోగపడేలా షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. వార్డు పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, దశల వారీగా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్, స్థానికులు

'సూర్యఘర్'తో విద్యుత్తు బిల్లు ఆదా

గాజువాక, న్యూస్‌టుడే : చినగంట్యాడ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధి, 70వ వార్డు శ్రీనివాసనగర్ ట్వింకిల్ కిడ్స్ పాఠశాల ఆవరణలో సోమవారం సూర్యఘర్ యోజన పథకంపై స్థానిక వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఈ రామకృష్ణ పర్యవేక్షవేక్షణలో సుమారు 32 మంది వినియోగదారుల పథకానికి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. విద్యుత్తు బిల్లుల భారం లేకుండా బ్యాంకు రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలపై ఏఈ వివరించారు. ట్వింకిల్ పాఠశాల డైరెక్టర్ డి.శ్యామ్ మాట్లాడుతూ పర్యావరణానికి సోలార్ విద్యుత్తు ఎంతో మేలు చేస్తుందన్నారు. విద్యుత్తు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో విద్యుత్తు అధికారులు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ సమీప నెల్లిముక్కు గ్రామ పంచాయతీల ఆరాధ్యదైవం కన్నేలమ్మ అమ్మవారి ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పెంటమాంబ ఆలయ ప్రాంగణంలోకి అమ్మవారి విగ్రహాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు పండాలని కోరుతూ అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూజలకు హాజరైన స్థానిక భక్తులు

DOCUMENT LOST
I, EATI RAJESH, S/o.Late E.Suryanarayana, residing at D.No.26-31-16, Chaitanya Nagar, Chinagantyada, Gajuwaka, Visakhapatnam Andhra Pradesh. I have lost my Bag, which contains my Original Sale Deed and Link Documents, bearing Original Document No. 725/2023, Dated 31-01-2023, purchased the same from T.Mohan Gurumurthy and Original Link Document Nos. 1674/2008, 1678/2015, 4829/2015, 4516/2016, 5501/2016, 8096/2022, 709/2023, while I am travelling by Bike from Kurmannapalem to my home Gajuwaka, on 01-07-2025. If found to anyone Please contact above address or Mobile No. 98498 95588

స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన

సింధియా, న్యూస్‌టుడే: అదానీ సంస్థకు చెందిన విద్యుత్తు స్మార్ట్ మీటర్లను ఇళ్లకు ఏర్పాటు చేయడం దారుణమని సీపీఎం, ఐద్వా ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం 58వ వార్డు గుల్లలపాలెంలో నిరసన తెలిపారు. ఐద్వా నాయకురాలు బి.మమత మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాదిరిగా విద్యుత్తు మీటర్ల రీఛార్జి విధానం సరి కాదన్నారు. ఇంటింటికీ వచ్చి మీటర్లు బిగిస్తున్న సిబ్బందిని మహిళలు అడ్డుకోవాలని సీపీఎం, ఐద్వా ప్రతినిధులు కోరారు. కె.నూకరాజు, శ్రీధర్, నిర్మల, వరలక్ష్మి, ఆదినారాయణ, లక్ష్మి, సీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం, ఐద్వా కార్యకర్తలు

త్వరలో కొత్త వాలంటీర్లకు శిక్షణ



సింహాచలాన్ని అభినందిస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు

సింధియా, న్యూస్‌టుడే: నూతన విద్యా సంవత్సరంలో జాతీయ సేవా పథకంలో నమోదైన కార్యకర్తలకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకురాలు, జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం ఏయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా నియమితులైన డి.సింహాచలంను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న వాలంటీర్ల పేర్లను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతామని చెప్పారు. అనంతరం సింహాచలాన్ని ఆమె సత్కరించారు.

క్రాంతినగర్‌లో కొండచిలువ కలకలం

మల్కాపురం, న్యూస్‌టుడే: 63వ వార్డు క్రాంతినగర్‌లో సోమవారం రాత్రి 10గంటల సమయంలో కొండచిలువ కనిపించడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు అక్కడికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు దాటి నేవీ ప్రహరీ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా కొండచిలువను బంధించినట్లు నాగరాజు తెలిపారు. దాన్ని జనసంచారం లేని ప్రాంతంలో వదలనున్నట్లు చెప్పారు.

కొండచిలువతో నాగరాజు

ఉక్కు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కులో ఓ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనపై కార్మికులు తెలిపిన వివరాలివి. ఈనెల 11న బి-షిఫ్ట్‌లో బ్లాస్ట్‌ఫర్నేస్‌కు ఐరన్‌ఓర్, సింటర్ సరఫరా చేసే కన్వేయర్ బెల్టు సాంకేతిక సమస్యతో ఆగిపోవడంతో అక్కడ ఇంఛార్జిగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్ బి.అప్పారావును బాధ్యుడ్ని చేస్తూ 48 గంటల పాటు సస్పెన్షన్ వేటు వేస్తూ ఆదివారం ఉక్కు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఉద్యోగిది ఎలాంటి తప్పు లేకపోయినా... ఉద్దేశపూర్వకంగానే వేటు వేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 13వ అదనపు జిల్లా జడ్జి వారికోర్టులో, గాజువాక
E.P. 3/2017 in O.S. 9/2016
బిట్వీన్:
శ్రీ గురు అప్పారావు ...డిక్రీ హోల్డర్
అండ్
శ్రీ వర్ధనపు సంజీవరావు ...జడ్జిమెంట్ డెటారు
వేలం ప్రకటన
పైనెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తిని తేది. 30-07-2025న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. 30-07-2025న ఉ॥గం॥10.30 ని॥ల నుండి సా॥గం॥5.00 మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తి గలవారు పైతేదిన, పైతెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.
షెడ్యూలు ఆస్తి వివరము
విశాఖపట్నం జిల్లా, జి.వి.యం.సి. పరిధి, మల్కాపురం గ్రామం, పట్టా నెం.84, సర్వే నెం. 9/15, వెంకన్నపాలెం ఏరియా అందలి డోర్ నెం. 61-4-11, మున్సిపల్ అసెస్‌మెంట్ నెం.77879 కరెంట్ మీటర్ నెం. 173, ప్లాటు నెం. 45రు గా అందలి విస్తీర్ణం 291 చ॥గ॥లు కలిగిన ఆర్.సి.సి స్లాబ్ ఇంటికి హద్దులు: తూర్పు: రాజేంద్రకుమార్ దాస్ గారి ఆస్తి, దక్షిణం: యన్. జాన్ గారి ఇల్లు, పడమర:యన్.అప్పారావు గారి ఇల్లు, ఉత్తరం:రోడ్డు
DHR విలువ : Rs. 37,70,000/-
Amin విలువ : Rs. 59,23,664/-
J.Dr Value not Furnished
V.V. APPA RAO & B. MEENA
Advocates
Visakhapatnam. Cell: 99129 54756

(c) eenadu

మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నేడు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని అంబేద్కర్ గురుకులాల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు మిగులు సీట్ల భర్తీకి మంగళవారం కొప్పెర్ల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. ఇతర వివరాలకు 89858 83015, 63038 38657 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

మనసున్న మారాజుకు మకుటం

● గోవా గవర్నర్‌గా మన అశోకుడు ● వెల్లువెత్తిన అభినందనలు

రాజుల కుటుంబమైనా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు. పూసపాటి వంశస్థుడు ఆ దర్పాన్ని ఎక్కడా ప్రదర్శించలేదు. రూ.వేల కోట్ల ఆస్తులకు అధిపతైనా ధనబలాన్ని చూపలేదు. కేంద్ర మంత్రిగా పనిచేసినా సామాన్యుడిగానే తిరిగారు. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినా పేదల మధ్యనే నడిచారు. పేదల రాజుగా ఎదిగారు.. ప్రజలకు పెద్దన్నగా, పెద్దాయనగా నిలిచారు. ఆ వ్యక్తిత్వమే ఆయనను గవర్నర్ పదవికి పట్టాభిషిక్తుడిని చేస్తోంది. గోవా గవర్నర్‌గా వెళ్తున్న అశోక్ గజపతిరాజును అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. విషయం తెలియగానే సోమవారం కోటకు అంతా తరలివచ్చారు.

– ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, అర్బన్

జననం: 1951 జూన్ 26

తల్లిదండ్రులు: పూసపాటి కుసుమ గజపతిరాజు, విజయరామరాజు(పీవీజీ రాజు)

విద్యాభ్యాసం: గ్వాలియర్‌లో పాఠశాల, హైదరాబాద్ పబ్లిక్ పాఠశాల, విశాఖలో వీఎస్ కృష్ణా కళాశాల

★ తొలి అడుగు... 1978లో ఎమ్మెల్యేగా గెలుపు

★ మరో ఆరుసార్లు.. 1983 నుంచి 2004 వరకు, 2009లో శాసనసభకు ఎన్నిక

★ 2014లో విజయనగరం ఎంపీగా 16వ లోక్‌సభకు ఎన్నిక

★ 2025 గోవా గవర్నర్‌గా ఎంపిక

★ తన తండ్రి పీవీజీ రాజు వారసత్వంగా వచ్చిన మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. 108 దేవాలయాలకు ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.



ప్రజాప్రతినిధిగా ప్రగతి పరుగులు: కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో నియోజకవర్గ పరిధిలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. జాతీయ రహదారులతో పాటు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలక, ఉడా పరిధిలో రోడ్లకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించారు. చెల్లూరు నుంచి రాజాపులోవ వరకు రూ.84 కోట్ల వ్యయంతో రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయించారు. రూ.425 కోట్లతో గొట్లాం, చెల్లూరు మధ్య బైపాస్ రోడ్డు, వంతెన నిర్మించారు.

అవినీతి మరకలేని ఆదర్శనేత: మానవతా విలువలు కలిగిన జయప్రకాశ్ నారాయణ్, జార్జి ఫెర్నాండెజ్, చంద్రశేఖర్ వంటి అగ్రనేతల ప్రేరణతో రాజకీయాల్లోకి వచ్చిన అశోక్ గజపతిరాజు 1978 నుంచి ఇంతవరకు ఎలాంటి అవినీతి మరకలేని ఆదర్శనేతగా గుర్తింపు పొందారు.

చిట్టి గురువులతో శ్రీకారం

తన పార్లమెంటరీ పరిధిలో ప్రతిఒక్కరూ అక్షరాస్యులుగా మారాలని కలలుగన్నారు. అందులో భాగంగా చిట్టి గురువులు పథకాన్ని ప్రారంభించారు. బాలలే తమ తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పే కార్యక్రమానికి నాంది పలికారు. జిల్లా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వేలాది మంది మహిళలను ఇందులో భాగస్వామ్యం చేశారు. దాదాపు 28 వేల మందిని అక్షరాస్యులుగా మార్చారు.

ఆ శాఖకే పైలట్ అయ్యారు..: పైలట్ అవ్వాలని రాజు గారి కోరిక. కానీ రాజకీయాలవైపు మళ్లారు. ఈక్రమంలో 2014లో కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. చివరికి విమానాలను నడిపించేస్థాయికే ఎదిగారు. పలు విమానాశ్రయాల పునరుద్ధరణతో పాటు 500 వరకు ప్రాంతీయ మార్గాలను ప్రవేశపెట్టారు.


అన్న ఎన్టీఆర్‌తో..

అశోక్ కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్న పండితులు

మంచి పనికి ముందు వరుసలో..

ప్రభుత్వ, ప్రజావసరాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున భూములు.. అక్షర అభివృద్ధికి ఊతమిచ్చేలా ఉదారత చాటుకున్నారు అశోక్ గజపతిరాజు. విదేశాల్లో రాజకుటుంబానికి ఉన్న భూములు, ఇతర కట్టడాలను సైతం అక్కడి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. 95 ఎకరాల్లోని అలకనందా ప్యాలెస్ స్థలాన్ని చింతలవలస అయిదో పోలీసు బెటాలియన్‌కు కేటాయించారు.

సాహో సైనిక అంటూ..

206 ఎకరాల భూములిచ్చి రాష్ట్రంలోనే తొలి సైనిక పాఠశాల కోరుకొండలో ఏర్పాటయ్యేలా సహకరించారు. సైనిక పాఠశాలల్లో బాలికలకు ప్రవేశాలు కల్పించాలని కేంద్రానికి లేఖ రాసి, విజయం సాధించారు.

దశ మారిన దత్తత గ్రామం: గజపతిరాజు ద్వారపూడి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అక్కడ తాగునీటి కోసం సోలార్ పంపింగ్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. తాగునీటి పైపులైన్లను మురుగు కాలువల నుంచి వేరుచేసి స్వచ్ఛమైన నీటిని అందించారు. బయో మరుగుదొడ్లు ప్రారంభించారు. ఇంటింటికీ ఇంకుడు గుంతలు తీయించారు. దీంతో ద్వారపూడి అప్పట్లో రాష్ట్రీయ గౌరవ గ్రామసభ పురస్కారాన్ని పొందింది.

స్ఫూర్తిబాట పరిచి..: ఉత్తరాంధ్రలోని ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూములిచ్చారు. గతానికి గుర్తుగా నిలిచిన కోటను సైతం విద్యా సంస్థల నిర్వహణకు అప్పగించి మరో ప్రదేశానికి వెళ్లిపోయారు. తాత, తండ్రుల నుంచి అందిపుచ్చుకున్న సేవా వారసత్వాన్ని కొనసాగించారు.

వారధిపై చెరగని సంతకం

విజయనగరం మీదుగా జాతీయ రహదారి-26 వెళుతోంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించేవి. దీంతో ట్రాఫిక్ సమస్య వేధించేది. ఎత్తు బ్రిడ్జి వద్ద పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయేవి. ఈ క్రమంలో వంతెన నిర్మాణానికి అశోక్ పూనుకొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి 8 వేల మంది సంతకాలతో లేఖలు పంపించారు. ఎట్టకేలకు కేంద్రం స్పందించి, వంతెన మంజూరు చేసింది. ఇది సంతకాల వంతెనగా పేరుగాంచింది.

అమ్మ దయతోనే..: అశోక్ గజపతిరాజుకు దైవభక్తి ఎక్కువ. కులదైవం పైడితల్లిని ఎక్కువగా ఆరాధిస్తారు. ఏటా జరిగే సిరిమానోత్సవాన్ని ముందుండి నడిపిస్తారు.

రాజ కుటుంబం.. సాధారణ జీవితం..: వేలాది ఎకరాల భూములు సహా రూ.వేల కోట్ల ఆస్తులు ఉన్న రాజ కుటుంబంలో పుట్టినా ఇప్పటికీ సాధారణ జీవితమే గడుపుతారు. పాత కాలం నాటి స్కూటర్, నానో కార్లలో తిరుగుతుంటారు. స్వయంగా ఆయనే వాహనాన్ని నడుపుతారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్తు వాహనాలను వాడాలని రెండు, మూడేళ్లుగా యువతకు పిలుపునిస్తున్నారు. అందులో భాగంగానే విద్యుత్తు ద్విచక్రవాహనం కొని, అవగాహన కల్పిస్తున్నారు.

చినుకమ్మా రాలవే..

చేనుకు నీరియ్యవే

ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తొలుత కురిసిన వర్షాలకు మురిసిన అన్నదాత.. తర్వాత వానలు ముఖం చాటేయడంతో ఆశలు ఎండిపోయాయి. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకు ఆయా ప్రాంతాల్లో రైతులు వరినారు వేసుకున్నారు. వరుణుడు కన్నెర్ర చేయడంతో ఎండలు మండిపోతున్నాయి. నీరులేక నారుమడి ఎండుతోంది. అన్నదాత గుండె బరువెక్కుతోంది. పంటను కాపాడుకునేందుకు సమీపంలోని వనరుల నుంచి నీటిని తోడి, మోసుకుని తెచ్చి మడులు తడిపేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గంట్యాడ మండలంలోని రామవరం గ్రామంలో రైతు కష్టాలివి.



– ఈనాడు విజయనగరం

మది ఫలకంపై మోగిన స్వరాలు

బొబ్బిలి వీణకు ప్రథమ పురస్కారం అందుకున్న కలెక్టర్

ఈనాడు, విజయనగరం: 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి'లో భాగంగా ఎంపికైన జిల్లాలోని బొబ్బిలి వీణ ప్రథమ స్థానం దక్కించుకుని సోమవారం కేంద్ర ప్రభుత్వం పురస్కారం అందుకుంది. రాష్ట్రం నుంచి ఏడు జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఈ పురస్కారానికి ఎంపికయ్యాయి. జిల్లా కేటగిరీలో మరో రెండింటితో కలిపి బొబ్బిలి వీణ సంయుక్తంగా ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఈ మేరకు దేశ రాజధాని దిల్లీ ప్రగతి మైదానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతులమీదుగా జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పురస్కారాన్ని అందుకున్నారు.

రైతేరాజు 6లో

ఆర్థిక భరోసా.. అందక అవస్థ

రెండేళ్లుగా కష్టాలు

నా పేరు **దాసు రాములమ్మ.** మాది కొత్తవలస మండలం ముమ్మనవానిపాలెం. భర్త సన్యాసిబాబు 2023 జనవరి 9న మృతి చెందాడు. అప్పటి నుంచి పింఛను కోసం ఎదురుచూస్తున్నా. కూటమి ప్రభుత్వం స్పౌజ్ పింఛను ప్రకటనతో ఎంతో ఆశపడ్డాను. రెండు నెలలైనా ఇవ్వకపోవడంతో ఖర్చులకు ఇబ్బందిగా ఉంది.

అధికారులను అడిగినా..

నా పేరు **పి.అచ్చయ్యమ్మ.** మాది తమన్న మెరక గ్రామం. నా భర్త పి.సింహాచలం గతేడాది జనవరి 20న చనిపోయారు. వృద్ధాప్యం పింఛను తీసుకునేవారు. ఆ పింఛను కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడిచినా ఇవ్వలేదు. అధికారులను అడిగినా స్పందించడం లేదు.

– న్యూస్‌టుడే, కొత్తవలస, భోగాపురం

స్పౌజ్ పింఛన్లకు 3,523 మంది ఎదురుచూపు

జిల్లాలో 3,523 మంది మహిళల వేదన ఇది. కుటుంబంలో సామాజిక పింఛను అందుకుంటున్న వ్యక్తి చనిపోయి నెలలు గడుస్తున్నా.. అర్హురాలైన అతని భార్యకు మాత్రం పథకం లబ్ధి చేకూరలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయాలంటూ ప్రకటించి రెండు నెలలైనా లబ్ధిదారులకు నగదు పంపిణీ ఇంకా జరగలేదు. 2023 డిసెంబరు నుంచి 2024 నవంబరు మధ్య ఈ కేటగిరీ కింద జిల్లాలో 3,523 మంది అర్హులున్నట్లు గుర్తించారు. వీరందరికీ 2025 మే నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సచివాలయాల వారీగా అర్హుల జాబితా సిద్ధం చేసి రెండు నెలలైంది. పింఛను చెల్లించలేదు.

ఈ నెల అంతా సిద్ధమైనా..

జూన్ 12న రాష్ట్ర ప్రభుత్వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పింఛన్లు అందజేయాలని నిర్ణయించినా కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈ నెలలో స్పౌజ్ పింఛన్ల పంపిణీకి నగదు విడుదల చేశారు. వీటిని పంపిణీచేసే సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి ఈ నగదును విత్‌డ్రా చేశారు. తీరా పంపిణీకి సిద్ధపడే సమయానికి స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేయొద్దని, ఆ డబ్బులు వెనక్కి కట్టేయాలని ఉన్నతాధికారులు సమాచారం పంపారు. దీంతో నగదు అందుతుందని ఎంతో ఆశపడ్డ మహిళలంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.

ప్రత్యేక కార్యక్రమంలో అందిస్తాం

ప్రత్యేక కార్యక్రమం పెట్టి స్పౌజ్ పింఛన్లు పంపిణీచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అందువల్లే ఈ నెలలో మంజూరైనా పంపిణీ చేయలేదు. జిల్లాకు స్పౌజ్ కోటాలో 3,523 పింఛన్లు మంజూరయ్యాయి. వీరందరికీ త్వరలో చెల్లింపులు జరిగే అవకాశం ఉంది.

– సావిత్రి, పీడీ(ఎఫ్ఏసీ) డీఆర్‌డీఏ

అన్నదాతకు దూరం.. అద్దెకు ద్వారం

● ఇదీ మార్కెటింగ్ కమిటీ యార్డుల తీరు ● గత ప్రభుత్వ నిర్వాకంతో తిప్పలు

న్యూస్‌టుడే– గరివిడి, వ్యవసాయ విభాగం

జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులు రైతు సేవలకు దూరమవుతున్నాయి. యార్డుల్లోని గోదాములను వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు వ్యక్తులకు అద్దెలకు ఇస్తున్నారు. పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేవరకు రైతులు గోదాముల్లో దాచుకునేవారు. వీటిపై 80 శాతం వరకు రుణాలను తక్కువ వడ్డీకి మార్కెటింగ్ శాఖ అందించేది. గత ప్రభుత్వ హయాంలో పంట ఉత్పత్తులపై పన్ను వసూళ్లు తప్ప సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో రైతులు కూడా వీటివైపు చూడడంలేదు. దీంతో ఖాళీగా ఉన్న గోదాములను వ్యవసాయేతర అవసరాలకు అద్దెలకు ఇస్తున్నారు.

పొలాల నుంచి పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చుకునేందుకు మార్కెట్ కమిటీ పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు, వంతెన నిర్మాణాలు గతంలో జరిగేవి. ఇందుకు రైతుల నుంచి వసూలు చేసిన పన్నుల మొత్తంలో 30 శాతం నిధులు కేటాయించేవారు. పశు సంతతి అధికంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి కమిటీల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించేవారు. వీటిన్నింటినీ వైకాపా ప్రభుత్వం నిలిపివేసింది.

చీపురుపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పౌరసరఫరాల శాఖకు అద్దెకిచ్చిన గోదాములు

మార్కెట్ కమిటీ	గోదాములు	సామర్థ్యం (మెట్రిక్ టన్నుల్లో)	అద్దెకు ఇచ్చినవి
విజయనగరం	8	5,690	7
బొబ్బిలి	7	3,950	5
గజపతినగరం	4	3,800	2
చీపురుపల్లి	4	2,400	2
పూసపాటిరేగ	3	3,060	-
మెరకముడిదాం	1	400	-
రాజాం	9	7,600	3

19 గోదాములు అలానే..

జిల్లాలో ఎనిమిది వ్యవసాయ మార్కెట్ యార్డులుండగా.. కొత్తవలస మినహా మిగతా ఏడింటి పరిధిలో మొత్తం 26,900 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల 36 గోదాములున్నాయి. మార్కెటింగ్ శాఖ వీటిలో 19 అద్దెలకు కేటాయించింది. మిగతా గోదాముల్లో కొన్ని శిథిలమై.. మరికొన్ని నిరుపయోగంగా ఉన్నాయి. పంట పన్నుల వసూళ్ల లక్ష్యం కూడా కమిటీలు ఆశించిన రీతిలో ఉండడం లేదు. 2023- 24లో లక్ష్యం రూ.12.85 కోట్లు కాగా.. రూ.7.11 కోట్లు, 2024-25 లక్ష్యం రూ.12.89 కోట్లకు గాను రూ.9 కోట్లు వసూలు చేయగలిగారు. ఈ క్రమంలో ఖాళీ గోదాములను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయంపై దృష్టిసారించారు.

సేవల మెరుగుకు కృషి..

నిలిచిపోయిన పథకాలను పునరుద్ధరించాలనే రైతుల కోరికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కమిటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నిర్వహణ లేక ఖాళీగా ఉన్న గోదాములను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూరుతోంది.

– రవికిరణ్, ఏడీ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ

సర్టిఫికెట్ కోర్సులతో యువతకు మేలు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సులతో యువతకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి అన్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించి సర్టిఫికేషన్ ఇన్ ఎమెర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై రూపొందించిన గోడప్రతులను సోమవారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐ, మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ తదితర కోర్సులకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతతో కూడిన అధునాతన బోధన అవసరమన్నారు. ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, ఫ్యాకల్టీ సమన్వయకర్త ఎం.హేమ తదితరులు పాల్గొన్నారు.

మరణించి.. మూడు జీవితాలను బతికించి..

లోకేశ్ (పాతచిత్రం)

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: చనిపోయిన తర్వాత అవయవదానం చేసి ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడో వ్యక్తి. రాష్ట్ర అవయవదాన కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన టి.లోకేశ్ (36) ఆదివారం ఎల్.కోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అంబులెన్స్‌లో విశాఖలోని విమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఆరోగ్యం మెరుగుపడకపోవటంతో సోమవారం బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో మృతుడి నుంచి జీవస్థితిలో ఉన్న రెండు మూత్రపిండాలు(కిడ్నీ), కాలేయం తీసి జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం ఆసుపత్రులకు కేటాయించామని డాక్టర్ రాంబాబు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కు మరణించి తీవ్ర విషాదంలో ఉన్నా.. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చి ఔదార్యం చాటుకున్న కుటుంబసభ్యులను సన్మానించి అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు.

పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి జిల్లాలో జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని, తగిన ఏర్పాట్లు చేయాలని జేసీ సేధు మాధవన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం నుంచి ఈనెల 23 వరకు పరీక్షలు జరుగుతాయని, ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలని, అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. అంతర్జాలం, విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలన్నారు.



సాగునీరు అందించడమే లక్ష్యం

మెరకముడిదాం, న్యూస్‌టుడే: రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి రామారావు, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు చీక్, మస్తాన్ అన్నారు. సోమవారం మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి రెవెన్యూలోని సదాశివుని చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, అధికారులు మాట్లాడారు. 2018లో చెరువు అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించామని, ఇప్పటివరకు రూ.25 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. మిగిలిన పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆయకట్టు రైతులు పండించిన పంటలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. డీపీఎం ఎన్.ఆనందరావు, డీహెచ్‌వో చంద్రశేఖర్‌రావు, ఏవో శ్రావణ్‌తేజ, హెచ్‌వో అనూష, నాయకుడు మండల రమణ మోహన్‌రావు పాల్గొన్నారు.

నవధాన్యాల ప్రదర్శన తిలకిస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు



(c) eenadu

వేరుశనగకాయలు కొన్న బొబ్బిలి రాజు

ఆడంబరాలకు దూరంగా ఉండే బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మరోసారి అలానే సాదాసీదా వ్యక్తిలా చిరు వ్యాపారితో మాట్లాడారు. సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం కోసం తెర్లాం మండలం ఎం.ఆర్.అగ్రహారం వెళ్లిన ఆయన కారు దిగి వేరుశనగకాయలు కొనుగోలు చేశారు. 'రోజుకు ఎన్ని కుంచాలు అమ్ముతున్నావు, ఎక్కడి నుంచి కాయలు తెస్తున్నావ్' అని అడిగి తెలుసుకున్నారు. అయితే ఆయన బొబ్బిలి రాజు, ఎమ్మెల్యే అని చిరు వ్యాపారికి తొలుత తెలియలేదు. తర్వాత విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. - న్యూస్‌టుడే, తెర్లాం

23 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విజయనగరం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్రస్థాయి టోర్నమెంటుకు ఎంపికలు జరగనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్, ఎమ్మెల్సీ రఘురాజు తెలిపారు. అండర్-19, 17, 15, 13, 11 విభాగాల్లో బాలబాలికలు, మెన్, ఉమెన్ పోటీలు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. 20వ తేదీలోగా ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు.

ప్రకటన

తేదీ 28-6-2025న ఈనాడులో ప్రచురించిన St. Ann's Girls Primary School, Cantonment, Vizianagaramకు సంబంధించి 2 - SGT Postలకు ఉద్యోగ ప్రకటన ఇవ్వబడినది. ప్రభుత్వం వారి సూచనల మేరకు Offlineతో పాటు Onlineలో కూడా cse.ap.gov.in వెబ్‌సైట్ నందు apply చేయవలెను.

పై రెండు పోస్టుల్లో ఒకటి SC కేటగిరి సంబంధించి SC-(A) Group-1 నకు కేటాయించబడినది.

చివరి తేదీ 18-7-2025.

ఇట్లు
కరస్పాండెంట్
సెల్ : 9440024907

33వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

VENKATA PADMA HOSPITAL
(Conception to Miracles)
Advanced Women & Child Care Centre
3 Lamps Junction, Vizianagaram
Ph: 08922-227131, 2257777, 9000267654

గత 33 సం॥లుగా విజయనగరం ప్రజలందరి ఆదరాభిమానాలు సంపాదించుకొని వైద్య రంగంలో విశిష్టమైన, మెరుగైన అత్యంత అధునాతన సేవలందిస్తున్న వెంకటపద్మ హాస్పిటల్ (Advanced Women & Child Care Centre) వార్షికోత్సవం జరుపుకొంటున్న శుభ సందర్భంగా జిల్లా ప్రజలకు, వైద్యులకు, వైద్య ఇతర సిబ్బందికి ధన్యవాదములు తెలుపుతూ... ఎప్పటివలే మాకు మీ సహాయ సహకారాలు అందిస్తారని మనసారా కోరుకుంటూ...

Dr. M. Venkateswara Rao
MD (Pediatrics), Gold Medalist

Dr. M. Padma Kumari
Senior Consultant
MD Obsterician & Gynaecologist

Dr. DEVI PRASAD
MBBS, Ex. House Physician Pediatrics (UCMS, Delhi), Superintendent

DR. K. JAGADISH
MD (Ped) Fellowship Neonatology

Round the Clock PEDIATRIC RESIDENTS
24/7 Emergency Service

DR. K. SRAVAN KUMAR MBBS, DNB
R. SUVETHA MBBS, DNB
DR. N. MAHENDER MBBS, DNB
DR. R. RISHIKA SAHU MBBS, DCH
DR. V. ANITHA MBBS, DNB
DR. G. VIJAYA HASINI MBBS, DCH
DR. V. DINESH REDDY, MBBS, DNB

మా వద్ద లభించు వైద్యసేవలు
★ నార్మల్ డెలివరీ మా ప్రాధాన్యత
★ NTR వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) సదుపాయం కలదు
★ అన్ని రకముల హెల్త్ కార్డు(ఇన్సూరెన్స్/T.P.A.)లు సదుపాయం కలదు.
★ అన్ని బ్యాంకులు (ప్రైవేట్ మరియు గవర్నమెంట్) ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కలదు.

అశోక్‌కు అభినందన మాల

గజపతిరాజుకు మిఠాయి తినిపిస్తున్న కలిశెట్టి

ఈనాడు, విజయనగరం: తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించినట్లు అందిన సమాచారంతో తెదేపా, జనసేన, భాజపా నాయకులు విజయనగరంలోని బంగ్లాకు పోటెత్తారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, తెదేపా నాయకులు కరణం శివరామకృష్ణ, ఐవీపీ.రాజు, బి.నర్సింగరావు, సువ్వాడ రవిశేఖర్, ప్రసాదుల వరప్రసాద్, కర్రోతు నర్సింగరావు, పీవీవీ.గోపాలరాజు, కె.త్రిమూర్తులురాజు, ఆనంపు విజయ్ తదితరులు పాల్గొన్నారు. ★ వేర్వేరు ప్రకటనల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, భాజపా నాయకుడు శివప్రసాద్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష, డీసీపీ శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఎస్సైలు అశోక్‌ను కలిశారు. ★ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అశోక్‌పై ఉన్న ప్రేమాభిమానాలతో విజయనగరం పైడితల్లి అమ్మవారిని దర్శించి, ఆయన పేరిట పూజలు చేశారు.

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

అధికారులతో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజల నుంచి 225 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూశాఖకు సంబంధించి అత్యధికంగా 110 ఫిర్యాదులు వచ్చాయి. డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీ, ప్రమీల గాంధీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి..

★ గత 15 సంవత్సరాలుగా నివాసముంటున్నా రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గరివిడి మండలం కొండపాలెం పంచాయతీ ఇందిరమ్మకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించాలని కోరారు. ★ తమ గ్రామంలో తాగునీరు కలుషితమైందని గజపతినగరం మండలం పిడిశీల గ్రామ మాజీ సర్పంచి పోలిపల్లి అప్పలనాయుడు, కర్రోతు గురుమూర్తి, బోడసింగి శంకర్రావు, సుంకరి పైడినాయుడు తదితరులు అర్జీ అందజేశారు. ★ రైతు సాధికార సంస్థలో భాగంగా సహజ వ్యవసాయ కార్యక్రమంలో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న బొండపల్లి, గంట్యాడ మండలాలకు చెందిన 8 మందిని స్థానిక రాజకీయనేతలు తొలగించడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

విజేత వచ్చేన్.. మోము విరిసెన్

రెడ్డి భవానిని సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

విజయనగరం క్రీడావిభాగం, గ్రామీణం, న్యూస్‌టుడే: కజకిస్థాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టర్ రెడ్డి భవానీ సత్తా చాటిన విషయం తెలిసిందే. బంగారు పతకాలు సాధించిన ఆమె సోమవారం స్వగ్రామం విజయనగరం మండలం కొండకరకం చేరుకోగా స్థానికులు ఘనంగా సత్కరించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, ఈ ప్రాంతం పేరును నిలబెట్టిందని పలువురు కొనియాడారు. శిక్షకులు ఆనంద్, ఆమె కుటుంబ సభ్యులు, నాయకులు పాండ్రంకి గౌరునాయుడు, ఆర్.రాంబాబు, కిలారి రాంబాబు పాల్గొన్నారు.

అరటి సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, జియ్యమ్మవలస: నీటి వసతి ఉన్న ప్రాంతాలను సాగుకు సక్రమంగా వినియోగించుకుంటే అరటి పంటతో మంచి లాభాలు సాధించొచ్చని నిరూపిస్తున్నారు జియ్యమ్మవలస మండలంలోని రైతులు. పలు ప్రాంతాల్లో 2500 మంది అరటిపైనే ఆధారపడి సిరులు కురిపిస్తున్నారు. పెదకుదమ గ్రామానికి చెందిన రైతు ఏగిరెడ్డి మోహనరావు ఇందుకు నిదర్శనం. గ్రామంలోని నాలుగు ఎకరాల్లో ముకిరీలు, కూర, దేశవాళీ రకం అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు 800-900 మొక్కలు వేశారు. పిలక మొక్క రూ.5, ముకిరీ రూ.10 కొనుగోలు చేశారు. మొత్తంగా రూ.20 వేలు ఖర్చు చేశారు. పొలం వద్దే తవ్విన బోరు ద్వారా పంటకు నీరందిస్తున్నారు. 20 రోజులకు ఒకసారి నీటి తడులు పెడుతున్నారు. రెండు నెలలకు ఒకసారి మొక్క చుట్టూ గొప్పులు తవ్వాలి. 40-50 రోజులకు ఒకసారి పరిశీలించి మొక్కలను తొలగించాలి. ఏటా ఎకరాకు సమారు 700 గెలలు కాస్తాయి. డిమాండు బట్టి ముకిరీ గెల రూ.200-250, కూర రూ.250, దేశవాళీ రూ.100-120 వరకు ధర పలుకుతోంది. కూలీలు, గెలల కోత, నిర్వహణ, నీరు పెట్టడం మొత్తం పెట్టుబడులు పోగా ఎకరాకు రూ.50 వేలు ఆర్జించారు.

ఇతర రాష్ట్రాలకు రవాణా..

ఇక్కడ పండించిన అరటి గెలలను సీజన్‌లో రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అరటి ఆకులను 50 ఒక కట్టగా కట్టి ఒక్కొక్కటి రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు.

పదేళ్ల పంట..

అరటి పంట ఎప్పటికీ లాభాలే. సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి గెలలు పండుతాయి. ఒక్కోసారి డిమాండును బట్టి అధిక ధర వస్తుంది. ఒక్కసారి మొక్క వేస్తే పదేళ్ల వరకు పంట పొందొచ్చు. - ఏగిరెడ్డి మోహనరావు, రైతు

రైతేరాజు

కీటక నివారణ.. పంటకు రక్షణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో పురుగులు, తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టిసారించడం వల్ల సాగుకు రక్షణ కల్పించి ఆశించిన దిగుబడులు సాధించొచ్చని కేవీకే సమన్వయకర్త ధృవ తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

ప్రశ్న: వరిలో పురుగులు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు చెప్పండి? - శంకరరావు, భామిని

సమాధానం: సాధారణ వరి సాగుతో పోల్చుకుంటే డ్రమ్ సీడర్ పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది. వరుసల్లో నాటడం లేదా నాటే యంత్రం ఉపయోగించడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు బాగా ప్రసరించి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. దీనివల్ల నివారణకు సాధారణ వరి సాగు మాదిరిగానే సస్యరక్షణ చేపట్టాలి.

ప్రశ్న: ఉల్లికోడు నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? - సత్యనారాయణ, రేగిడి

సమాధానం: ఉల్లికోడు నారుమడి దశ నుంచి పిలక దశ వరకు నష్టపరుస్తుంది. అంకురం ఉల్లికోడు పొడుగాటి గొట్టంగా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. నారుమడులు ఒక సెంటు నారుమడిలో 160గ్రా. కార్బోఫ్యూరాన్, 3% సీజీ గుళికలు, విత్తనం మొలకెత్తిన 10 నుంచి 15 రోజుల్లోపు వేయాలి. నాటిన 10 నుంచి 15 రోజులకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3% సీజీ 10 కిలో గుళికలు వాడాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

వర్షాలు ప్రారంభమైన తరుణంలో జీడి, మామిడి, పామాయిల్, అరటి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, మొక్కలు నాటడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూరగాయల సాగులో మెలకువలు, సలహాల కోసం 81791 06780 నంబరును సంప్రదించాలని పాలకొండ డివిజన్ ఉద్యానశాఖ అధికారిని జయశ్రీ సూచించారు.

పాలీకల్చర్‌తో నష్టాల నివారణ!

వాతావరణ మార్పుల ప్రభావంతో రొయ్యలు, చేపలు తెగుళ్ల బారిన పడి అధిక సంఖ్యలో మృత్యువాత పడుతుంటాయి. ఫలితంగా ఆక్వారైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పాలీకల్చర్ (రొయ్యలు, చేపలు) విధానంలో ఒకే చెరువులో కలిపి సాగు చేయడంతో లాభాలు ఆర్జించవచ్చని ఆక్వా నిపుణుడు ఎస్.మహేశ్వరరావు తెలిపారు. వర్షాల ప్రభావంతో వనామీ రొయ్యలకు వైరస్, బ్యాక్టీరియా తెగులు సోకి మృత్యువాత పడుతుంటాయి. చేపలతో కలిసి రొయ్యలు సాగు చేయడంతో తెగుళ్లు సోకే అవకాశం తక్కువగా ఉంటుంది.

సాగు విధానం ఇలా...

ఎకరాకు వేయి నుంచి రెండు వేల వరకు శీలావతి, కట్ల రకం చేప పిల్లలను వదలాలి. అదే చెరువులో 20 వేల నుంచి 30 వేల వరకు వనామీ రొయ్య పిల్లలను వేయాలి. వాటికి ప్రత్యేకంగా మేత వినియోగించే అవసరం ఉండదు. చేప పట్టుబడి దశకు చేరుకునే సరికి వనామీ రొయ్యలను రెండు, మూడు పట్టుబడులు చేయొచ్చు. ఎకరాకు టన్ను నుంచి రెండు టన్నుల వరకూ చేపల దిగుబడికి అవకాశం ఉంటుంది. దీంతో ఆక్వారైతులు లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందని తెలిపారు. – కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

పచ్చిరొట్టతో భూసారం

కురుపాం గ్రామీణం, వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: పచ్చిరొట్టతో భూసారం పెరగడంతో ఎరువులు, పురుగుమందుల ఖర్చు తగ్గుతుందని విజయనగరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆ వివరాలు ఇవీ..

విత్తనాలు: జనుము ఎకరానికి 15 కిలోలు, జీలుగ 12, పిల్లి పెసర 8 కిలోల విత్తనాలు అవసరం. వీటి ద్వారా వరుసగా 6, 10, 4 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది.

పోషకాలు: టన్ను జీలుగలో నత్రజని 5-7 కిలోలు, భాస్వరం 1-1.5, పొటాషియం 7-8 కిలోలు లభిస్తుంది. జనుములో నత్రజని 6-9, భాస్వరం 1-2, పొటాషియం 7-10 కిలోలు లభిస్తుంది. పిల్లి పెసరలో నత్రజని 9-11, భాస్వరం 1.5-2, పొటాషియం 8-10 కిలోలు లభిస్తుంది.

సాగు విధానం-లాభాలెన్నో..: ప్రధాన పంట కోతకు ముందు నేలలో తేమ ఉండగానే విత్తనాలను చల్లుకోవాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. పంట దిగుబడి 15 నుంచి 20 శాతం పెరుగుతుంది. పంట నాణ్యంగా ఉంటుంది. నేల గుల్లగా మారి, నీరు ఇంకే గుణం పెరుగుతోంది. కలుపు మొక్కలను అదుపు చేస్తుంది. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతోంది.

రేషన్ సరకులను సద్వినియోగం చేసుకోవాలి

పరిశీలిస్తున్న భారత ఆహార సంస్థ సీజీఎం రాజగోపాల్

రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ సరకులను సద్వినియోగం చేసుకోవాలని భారత ఆహార సంస్థ సీజీఎం ఎ.రాజగోపాల్ సూచించారు. రామభద్రపురం చౌక్కాపు వీధిలోని రేషన్ డిపోను సోమవారం తనిఖీ చేసి, కార్డుదారులతో మాట్లాడారు. పక్కాగా సరకులు అందుతున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. వెనుకబడిన జిల్లాల్లో సరకుల పంపిణీ తీరును పరిశీలిస్తున్నామని, తొలుత ఉమ్మడి విజయనగరం జిల్లాలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కొత్త రేషన్ కార్డులు అందించాలని పలువురు ఆయన్ను కోరారు. అనంతరం బాడంగి మండలం డొంకినవలసలోని ఎఫ్‌సీఐ గోదామును ఎ.రాజగోపాల్ తనిఖీ చేశారు. రికార్డులు, బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు రామారావు, ఏజీఎం సందీప్, డీఎంలు సునీల్‌కుమార్, నరేష్‌కుమార్, డీఎస్‌వో మధుసూదనరావు తదితరులున్నారు.

ఉద్యోగం పేరిట మోసం.. అడిగితే బెదిరింపు

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నరవ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.30 లక్షలు తీసుకొని మోసం చేశాడని, అడిగితే బెదిరిస్తున్నాడని డెంకాడ మండలానికి చెందిన నలుగురు యువకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విజయనగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 ఫిర్యాదులు అందాయి. భూ తగాదాలపై 8, కుటుంబ కలహాలపై 1, మోసాలపై 3, ఇతర అంశాలకు సంబంధించి 26 వినతులు వచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సకాలంలో బాధితులకు న్యాయం చేయాలని ఆయా స్టేషన్ల అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ★ తమ గ్రామం నుంచి నిత్యం పశువుల అక్రమ రవాణా సాగుతోందని, గంజాయి విక్రయాలు సైతం జరుగుతున్నాయని, యువత పక్కదారి పడుతోందని సారిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది వృద్ధులు అర్జీ ఇచ్చారు. ★ తమ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, అడిగితే తిరగబడుతున్నారని తెర్లాం మండలం పున్నవవలస గ్రామానికి చెందిన వృద్ధురాలు పి.రమాదేవి వాపోయారు. ఇప్పటికే తెర్లాం, బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ★ కళాశాలకు వెళ్లకుండానే ఐటీఐ ధ్రువపత్రం ఇస్తామని, రెండేళ్లకు రూ.40 వేలు ఖర్చవుతుందని చెప్పి ఓ సంస్థ నిర్వాహకులు రూ.10 వేలు తీసుకుని మోసం చేశారని, స్పందించడం లేదని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన మహిళ ఎస్పీ వద్ద బోరుమన్నారు.

పెదమానాపురంలో 230 కిలోల గంజాయి స్వాధీనం

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి విశాఖకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా సభ్యులు దత్తిరాజేరు మండలం పెదమానాపురం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 230 కిలోల సరకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసు వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఒడిశాకు చెందిన ఘాసిరాం హంతల్, కరన్ ఖిలో, సురేష్ అడకాటియా, అనిలా, జున్నేష్ ఇటీవల రెండు కార్లలో విశాఖకు బయలుదేరారు. పెదమానాపురం రైల్వే గేటు వద్ద స్థానిక పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా.. వారిని చూసి పారిపోయేందుకు నిందితులు ప్రయత్నించారు. ఎస్సై జయంతి, ఇతర సిబ్బంది వెంబడించి హంతల్, ఖిలోను పట్టుకున్నారు. మిగిలిన ముగ్గురూ పరారయ్యారు. నిందితుల నుంచి 44 సంచుల్లో ఉన్న 230 కిలోల గంజాయి, రూ.700, మూడు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అడకాటియా కీలకమైన నిందితుడిగా గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామన్నారు.

వ్యక్తిపై ట్రాక్టరుతో దాడి: కాలికి గాయాలు

డెంకాడ, న్యూస్‌టుడే: మట్టి తరలింపును ప్రశ్నించిన వ్యక్తిపై యువకుడు ట్రాక్టరుతో దాడి చేయడంతో కాలుకు తీవ్ర గాయాలైన ఘటన డెంకాడ మండలంలోని పేడాడ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... పేడాడకు చెందిన సిమ్మల చిరంజీవి సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై గొలగాం గ్రామం వెళ్లి తిరిగి పేడాడ వస్తున్నాడు. ఆ సమయంలో దారిలో గురడా చెరువులో కొందరు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తుండడం చూసి వారిని ప్రశ్నించాడు. దీంతో వారితో వచ్చిన వేరొక ట్రాక్టరు డ్రైవర్ పినతాడివాడ గ్రామానికి చెందిన పవన్ ట్రాక్టరుతో మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో చిరంజీవి కింద పడిపోయాడు. దీంతో కుడికాలు పాదం, ఎడమ చేయి బొటన వేలుపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం సుందరపేట ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేయాల్సి ఉందని డెంకాడ పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	90	150	160

ఆర్.ఓ.సి.నెం.2181/2022/యఫ్-3, తే: 11.07.2025ది.

నగరపాలక సంస్థ కార్యాలయము, విజయనగరం.

బహిరంగ వేలము నోటీసు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో రోజువారి ఉత్పన్నమగుచున్న చికెన్ మరియు మటన్ వ్యర్థాలను సెయింటిఫిక్ పద్ధతిలో తరలించుటకు నెలవారీ రుసుమును 12 నెలల కాలపరిమితికి గాను నిర్ణయించుటకు గాను బహిరంగ వేలము నిర్ణయించడమైనది.

బహిరంగ వేలము వేయు ప్రదేశము : నగరపాలక సంస్థ కార్యాలయం, విజయనగరం
బహిరంగ వేలము తేదీ మరియు సమయం : తే: 23.07.2025 దీన, బుధవారం ఉదయం 10.00 గం.లకు
దరఖాస్తు రుసుము : రూ. 1,000/-లు

వ.నెం	గుత్త వివరం	కాల పరిమితి	ధరావత్తు	దాఖలు చేయవలసిన బ్యాంకు గ్యారంటీ
1	విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో రోజువారి ఉత్పన్న మగుచున్న చికెన్ మరియు మటన్ వ్యర్థాలను సెయింటిఫిక్ పద్ధతిలో తరలించుటకు నెలవారి రుసుము నిర్ణయించుటకు	12 నెలలు (వేలము ఆమోదించిన తేదీ నుండి)	రూ.6,00,000/-లు	రూ.3,00,000/-లు

షరతులు: 1. ధరావత్తు కమిషనరు, విజయనగరం నగరపాలక సంస్థ వారి పేరున డి.డి. రూపేనా చెల్లించవలయును మరియు బ్యాంకు గ్యారంటీ సమర్పించవలెను.
2. నగరపాలక సంస్థకు ఏ రూపేనా బకాయి ఉన్న వేలంపాటకు అనర్హుడు.
3. తే : 22.07.2025ది నాడు వేలము పాటకు సంబంధించిన దరఖాస్తు రూ. 1,000/- లు కార్యాలయంలో జమచేసి పొందవలయును. మరియు అందలి పేర్కొన్న నిబంధనలును అంగీకరించి బహిరంగ వేలములో పాల్గొనవలెను.
4. ఏ కారణం చేతనైన బహిరంగవేలము నందు పాట ఖాయపరచుకొని తదుపరి వెనుకంజ వేసిన యెడల అట్టివారి ధరావత్తు, బ్యాంకు గ్యారంటీ తిరిగి చెల్లించబడవు.
5. బహిరంగవేలము నిర్వహణలో కమిషనరు వారికి పూర్తి అధికారం గలదు. వేలము పాట నందు అనుకున్నంత ఆర్థిక లబ్ధి రానట్లయిన అట్టి వేలమును నిలుపువేయుటకు కమిషనరు వారికి పూర్తి అధికారం గలదు.

సం/- కమిషనరు
విజయనగరం నగరపాలక సంస్థ.

EENADU Classifieds

BUSINESS SERVICES
GK గోల్డ్ లోన్ బ్యాంకు/ ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక ఋణం ఇప్పించబడును. ✆ 8897731257.

HEALTH & CARE
NEURO
నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
Dr.Nirmala Vangapandu
M.D.(Gen.Med) DM (Neuro) JIPMER
Specialist in Brain & Nerve Problems & General Physician
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
R.T.C.కాంప్లెక్స్ ఎదురు, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు,VZM
FOR APPOINTMENT : 63054 71147

INDUSTRY
Godown Wanted: 4000-5000 Sft. Container Road Access, Electricity connection. Call: 9959977727.

PROFESSIONAL SERVICES
ASTROLOGY
శ్రీగాయత్రీ జోతిష్యం, గత 25 సం॥లు విజయనగరంలో స్థిరపడిఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం మీకు ఎటువంటి సమస్యలున్నా.. జోతిష్యం చెప్పబడును సెల్: 9701778711.

REAL ESTATE
FLAT FOR SALE
3 BHK 1450 Sft Flat for sale. 4th floor newly construction Haimavathi Sadhan, Kamma Veedhi, VZM. Car Parking, Lift with all facilities. C : 9177400008.

South India shoping mall backside 3 BHK, 1325 Sft 4th floor new flat for sale. Car parking, Lift with all facilities. C : 9177400008.

HOUSE FOR SALE
ఇండివిడ్యువల్ ఇల్లు G+1 లో గ్రౌండ్ ఫ్లోర్ అమ్మకానికి కలదు. తహసీల్దార్ ఆఫీసు దగ్గర, బొడ్డువానిపేట జంక్షన్, పింగి వీధి, విజయనగరం. డైరెక్ట్ పార్టీలు మాత్రమే సంప్రదించండి 9666339227, 9666210415.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PLOT FOR SALE
విజయనగరం, రామవరం రోడ్, కలెక్టరేట్ దగ్గర, వాసవీనగర్ లేఅవుట్ నందు 220 చ॥గ॥ దక్షిణ ముఖం గల ఇంటి స్థలం అమ్మకం నకు కలదు. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే ✆ 9700112125, 9597467913.

JOBS
శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ టీం లీడర్స్ కావలెను. అర్హతలు 10th to Degree. జీతం : 21,000/- నుండి 45 వేలు వరకు. Contact : 9704107303, 8008574616.

Male House Keeping Boy for House Food and Accomodation Available. Contact: 8897663366.

2021 మోడల్, 50 HP Johndeere Front Bucket 5310 4WD ట్రాక్టర్, సింగిల్ ఓనర్, మంచి రన్నింగ్ కండిషన్, హెవీ డ్యూటీ ఆపరేషన్, V16 ఇంజన్ ట్రాక్టర్ అమ్మకానికి. 8341695672, 9550750150.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

బొబ్బిలి
•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

అర్హులందరికీ రేషన్‌కార్డులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: జిల్లాలో అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు అన్నారు. రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో కొత్తగా 37,751 మందిని తెల్ల రేషన్ కార్డులకు అర్హులుగా గుర్తించామన్నారు. 5,499 మంది దరఖాస్తులను తిరస్కరించినట్లు చెప్పారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో రెండో విడత కౌన్సెలింగ్‌కు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి.భాస్కరరావు తెలిపారు. ఈ నెల 20 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని, 22న కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలన్నారు. 23న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

మాట్లాడుతున్న జడ్జి శారదాంబ

రాజాం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతో ఇరువర్గాలను సమన్వయం చేసి కేసులు పరిష్కరించవచ్చని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. స్థానిక న్యాయస్థానంలో న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లతో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. మధ్యవర్తిత్వంపై 90 రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష తదితరులు పాల్గొన్నారు. ❖ బొబ్బిలి గ్రామీణం: రాజీకి అర్హత ఉన్న వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మేలని జూనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతి జానకీరామ్ అన్నారు. బొబ్బిలి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆనందకుమార్, పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

?: గొడియాడ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకపోవడంతో వ్యర్థాలతో అవస్థలు పడుతున్నాం. - ఎస్సీ కాలనీవాసులు ● పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - విజయ్, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

?: రామభద్రపురం మేజర్ పంచాయతీ చొక్కాపు వీధి ప్రధాన రహదారుల పక్కన చెత్త పోగులు పేరుకుపోయాయి. - స్థానికులు ● చెత్త తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. - రవ్వా ఈశ్వరరావు, సర్పంచి - న్యూస్‌టుడే, రామభద్రపురం

?: రాజాం పట్టణంలోని ఆసుపత్రి రహదారిలో కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి. - స్థానికులు ● కల్వర్టు నిర్మాణం పూర్తి చేశాం. వాహనాలు వెళ్లకుండా అడ్డు పెట్టాం. రాకపోకలకు ఇబ్బంది లేదు. - వెంకటరామరాజు, ఏఈ - రాజాం

?: పున్నపురెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం మంజూరు చేయాలి. - స్థానికులు ● ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. - ఆరుద్ర, సీడీపీవో - న్యూస్‌టుడే, గుర్ల

?: అలకనారాయణపురం- చిననడిపల్లి ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు లేవు. - వాహనదారులు ● హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - కె.మురళీ, ర.భ.శాఖ జేఈఈ - న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం

ఉన్నతి పొందినా.. వసతులు కరవేనా..?

న్యూస్‌టుడే, సంతకవిటి, రాజాం గ్రామీణం, వంగర, చీపురుపల్లి గ్రామీణం, గుర్ల

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు ఇటీవల, గతంలో కొన్ని ప్రాథమికోన్నత బడులను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు. స్థాయి పెరిగిందే తప్ప అందుకు తగ్గట్లు వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల వరండాల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక నాడు- నేడు పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్న నేపథ్యంలో వసతుల సమస్యలు తీర్చాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరండాల్లో చదువులు..

సంతకవిటి మండలం కొండగూడెంలో 1 నుంచి తొమ్మిదో తరగతి వరకు 139 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1 నుంచి 5 తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. 6 నుంచి తొమ్మిది తరగతులకు గదులు ఇరుకుగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆట స్థలం లేదు. అదనంగా ఆరు గదులు అవసరమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ❖ వంగర మండలం సంగాంలో 132 మంది చదువుతున్నారు. గదులు సరిపోక వరండాలో విద్యాబోధన చేస్తున్నారు. అదనంగా నాలుగు గదుల అవసరముంది. బాగంపేట పాఠశాలలో 122 మంది ఉండగా.. మూడు తరగతి గదులు ఏర్పాటు చేయాల్సిఉంది. ❖ రాజాం మండలంలోని పెనుబాకలో 153 మందికి ప్రస్తుతం సరిపడే తరగతి గదులు ఉన్నాయి. వచ్చే ఏడాది పదో తరగతి నిర్వహించేందుకు గది లేదు. గురవాంలో 157 మంది ఉండగా. . వసతితో పాటు ఆటస్థలం సమస్య ఉంది.

వంగర: సంగాం పాఠశాలలో వరండాలోనే తరగతులు

అసంపూర్తిగా నిర్మాణాలు..

చీపురుపల్లి మండలం పీకే పాలవలస ఉన్నత పాఠశాలలో నాడు- నేడు కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ మొత్తం 156 మంది చదువుతున్నారు. ఈ పాఠశాలకు సమీపంలోనే స్థలాన్ని పరిశీలించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. భవనాలు నిర్మిస్తే వసతి మోక్షం కలుగుతుంది. సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని ఎంఈవో ఎం.బూసినాయుడు తెలిపారు. ❖ గుర్ల మండలం కొండగండ్రేడు ఉన్నత పాఠశాలలో 150 మంది ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు కింద సుమారు రూ.కోటి వ్యయంతో అదనపు భవనాల నిర్మాణం ప్రారంభించారు. పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు వసతి సమస్య ఎదుర్కొంటున్నారు. గరికివలసలో కూడా ఇదే పరిస్థితి. ఉన్నతాధికారులకు చెప్పామని ఎంఈవో భానుప్రకాష్ అన్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..

ఇటీవల ప్రాథమికోన్నత స్థాయి నుంచి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలుగా మారిన చోట్ల వసతి సమస్య ఉండడం వాస్తవమే. అదనపు గదుల నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరుకాగానే చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అవసరమైన చోట గదులు నిర్మిస్తాం.
- కేవీ రమణ, డిప్యూటీ డీఈవో, చీపురుపల్లి

చర్చించకుండా సమావేశాలెందుకో..?

వ్యవసాయశాఖ ప్రగతి నివేదికను వివరిస్తున్న ఏవో సూర్యకుమారి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ప్రజా సమస్యలపై చర్చించకుండా 18 నిమిషాలకే సభను ముగించేశారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. వెలుగు, వ్యవసాయశాఖ ప్రగతి నివేదికలను సంబంధిత అధికారులు వివరించారు. వైకాపా పార్టీ సమావేశం గరివిడిలో ఉందని 11.18 నిమిషాలకు ఇక్కడ కార్యక్రమం ముగించేశారు. వైకాపా నాయకుల సూచనలకు అధికారులు సైతం వంతపాడారు. తెదేపాకు చెందిన ప్రజాప్రతినిధులు పూర్తిగా హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. సభ్యులకు వీలుకాకపోతే ముందుగానే వాయిదా వేయాలని, ఇలా ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సమంజసం కాదని పలువురు వాపోతున్నారు. సభ్యులకు వ్యక్తిగత పనులు ఉన్నాయని కోరడంతో ముగించామని ఎంపీడీవో సురేష్ సమాధానమిచ్చారు.

అశోక్ గజపతిరాజుకు అభినందనలు

గరివిడి, రాజాం, న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్ అభినందనలు తెలిపారు. గవర్నర్‌గా ఆయన నియామకం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ❖ గజపతినగరం: తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజును గజపతినగరం ఏఎంసీ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు, కొండపల్లి భాస్కరరావు తదితరులు కలిసి అభినందించారు. ❖ మాజీ మంత్రి, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ శుభాకాంక్షలు తెలిపారు.

తారు ఎప్పుడు వేస్తారు?

బొండపల్లి మండలం గొల్లుపాలెం నుంచి కొణిస గ్రామానికి వెళ్లే మార్గంలో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణం సగంలో ఆగిపోయింది. ఇక్కడ మట్టి రహదారితో స్థానికుల ఇబ్బందులు గుర్తించిన కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు చేపట్టిన గుత్తేదారు బిల్లుల సమస్యతో మధ్యలో వదిలేశారు. నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. త్వరలో తారు వేస్తామని పంచాయతీ ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు. - న్యూస్‌టుడే, బొండపల్లి

ఇళ్ల చుట్టూ మురుగే

ఎం.గుమడాం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కాలువల్లోని మురుగు ముందుకు పారడం లేదు. పూడిక నిండి దోమల వ్యాప్తికి ఆస్కారంగా మారాయి. మరికొన్ని వీధుల్లో కాలువలు అనుసంధానం చేయక ఇళ్ల మధ్య మురుగు నిలిచింది. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచి రాంబాబు తెలిపారు. - న్యూస్‌టుడే, గజపతినగరం

నిర్లక్ష్యం.. నిరుపయోగం

రేగిడి ఆమదాలవలసలోని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయ భవనం శిథిలమై నిరుపయోగంగా మారింది. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం గ్రామంలో ఇళ్లు అద్దెకు తీసుకుని కార్యాలయం నిర్వహిస్తున్నారు. వదిలేసిన భవనంపై పనికిరాని మొక్కలు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులకు నివేదించామని సంఘం కార్యదర్శి కామేశ్వరరావు అన్నారు. - న్యూస్‌టుడే, రేగిడి

తాగునీటి వృధా.. తీరని వ్యథ

వంగర మండలంలోని బాగెంపేట, మద్దివలస గ్రామాల్లో తాగునీరు వృధాగా పోతోంది. కుళాయిలకు మూతలు లేకపోవడంతో నీరు వృధా అవుతోందని, ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి చిన్నయ్య వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి కుళాయిలకు మూతలు ఏర్పాటు చేస్తామని, వృధాను అరికడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, వంగర

ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ల పట్టివేత

గజపతినగరం: మండలంలోని ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈనెల 9న 'సారూ.. ఇసుకాసురులను అడ్డేదెవరు?' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎం.గుమడాం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నట్లు తహసీల్దారు రత్నకుమార్ తెలిపారు. సీతారాంపురం గ్రామానికి చెందిన ఐ.గోవింద, ఎం.గుమడాంకి చెందిన ఎ.రాము, పి.తౌడుకు చెందిన ట్రాక్టర్లకు రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుము వసూలు చేసినట్లు చెప్పారు.

మద్దువలస కాలువల్లోకి సాగునీరు

ఈనాడు కథనానికి స్పందన

సంతకవిటి: వర్షాలు పడక.. మద్దువలస కాలువల నుంచి నీరు రాక వరి నారుమడులు ఎండిపోతున్నాయని ఈనెల 12, 13న 'అన్నదాత ఆశలకు బీటలు', 'అందని నీరు- ఆగని కన్నీరు' శీర్షికలతో ప్రచురితమైన కథనాలకు జిల్లా జలవనరుల శాఖ అధికారులు స్పందించారు. మద్దువలస కాలువలలో సాగునీరు విడుదల చేశారు. సోమవారం సంతకవిటి మండలంలోని 24ఎల్, 25ఎల్, 28ఎల్ కాలువల్లో నీరు వచ్చింది.

అడుగుకో గుంత.. అతుకుల బొంత

కొప్పరవలస సమీపంలో రోడ్డుపై గుంతల్లో నీరు

గత ప్రభుత్వ పాపం నేటికీ శాపంలా వెంటాడుతోంది. అయిదేళ్లు పట్టించుకోకపోవడంతో వంగర మండలంలో పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. తలగాం నుంచి రుషింగి వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి, కొప్పర- కొండచాకరాపల్లి రోడ్లలో అడుగుకో గుంత ఏర్పడింది. వర్షాల నీరు వాటిలో చేరి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మద్దివలస- పార్వతీపురం దారిలో కొప్పరవలస సమీపంలో అధ్వానంగా తయారైంది. కొప్పర- కొండచాకరాపల్లి రోడ్డు పాడైపోవడంతో 20 రోజులుగా రాజాం- కొప్పర బస్సు చివరి వరకు రావడంలేదు. కొప్పరవలస సమీపంలో రోడ్డుకు మరమ్మతులు చేపడతామని ఏఈ నాగభూషణరావు చెప్పారు. తలగాం- రుషింగి రహదారికి రూ.2.40 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, వంగర

ప్రమాదకరంగా కొప్పర- కొండచాకరాపల్లి రహదారి

పురుగు మందు దుకాణాల తనిఖీ

రామభద్రపురం, న్యూస్‌టుడే: ఆరికతోట, రామభద్రపురం గ్రామాల్లోని పురుగు మందు దుకాణాలను విజిలెన్స్ సీఐ టి.అప్పలనాయుడు, ఏపీపీ ఎం.రామారావు, ఏవో శివ సోమవారం తనిఖీ చేశారు. రెండుచోట్ల సరైన పత్రాలు లేకపోవడంతో విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మాలని సూచించారు. వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వెలగవలసలో కందకాలు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వెలగవలస, శివడవలస గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను కేంద్ర బృంద సభ్యులు సునీల్ బంట్, నాతూ సింగ్ సోమవారం పరిశీలించారు. సరిహద్దు కందకాలు, రింగ్ ట్రెంచ్‌లు, నీటి కుంటలు, సిమెంటు రహదారుల పనులు చూశారు. పంచాయతీ కార్యాలయంలో ప్రజలతో సమావేశమై పనుల తీరు, సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధి అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీడీవో రవికుమార్, ఏపీవో లక్ష్మీపతి రాజు, ఇంజినీరింగ్ అధికారి కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

బ్యాటరీ పేలి వాహనం దగ్ధం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సిరిపురపు వీధిలో సోమవారం ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీ పేలింది. రమేష్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట వాహనం పార్కింగ్ చేసి ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో స్కూటీకి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం పట్టణంలో జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా వారణాసి శ్రీహరి, కార్యదర్శిగా కె.శివకాంత్, కోశాధికారిగా డేవిడ్ జె.విక్టర్, గౌరవాధ్యక్షుడిగా టీఎస్ఎస్ కార్తీక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా శ్రీనివాసన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, సర్వీస్ ప్రాజెక్టు ఛైర్‌పర్సన్ సజ్జల అప్పలరాజు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రోటరీ జిల్లా ఛైర్మన్ జేసీ రాజు అంతర్జాతీయ రోటరీ సంస్థకు 100 డాలర్ల చెక్కును అందజేశారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

నూతన కార్యవర్గ సభ్యులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని జిల్లా పూర్వపు గవర్నర్ డీఎస్ఎస్‌వీ వర్మ సూచించారు. చీపురుపల్లిలో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కోరాడ శంకరరావు, కార్యదర్శిగా సూరు కిరణ్, కోశాధికారిగా కందుల నాగశంకర్ తదితరులతో పాటు డైరెక్టర్లుగా డి.సీతారామరాజు, సూరు రామకృష్ణ, ఎస్వీ దుర్గారావు, కందుల తవిటిరాజు ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ సభ్యులు ఎస్.సన్యాసిరావు, ఎస్.రాధాకృష్ణ, బి.వంశీకృష్ణ, పల్లా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయాలని నిరసన

రేగిడి, న్యూస్‌టుడే: బూరాడ- మద్దువలస ప్రధాన రహదారిలో ఉనుకూరు వద్ద పాడైన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు గ్రామస్థులతో కలిసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వాహనాలు వెళ్లే సమయంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి ధూళి వెళ్తోందని వాపోయారు. టి.సూర్యనారాయణ, త్రినాథ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డీలరుపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి గ్రామీణం: చిత్రకోటబొడ్డవలస పంచాయతీలోని నిమ్మలపాడు రేషన్ డిపో డీలరుపై చర్యలు తీసుకోవాలని కార్డుదారులు సీపీఐ నాయకులతో కలిసి ధర్నా చేశారు. సరకులు ఇవ్వకుండా ముందుగా వేలిముద్రలు వేసుకుని, తర్వాత వెళితే దురుసుగా మాట్లాడుతున్నారన్నారు. కార్డుపై 2 కిలోల బియ్యం తగ్గించి ఇస్తున్నారని తహసీల్దారు శ్రీనుకు ఫిర్యాదు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పాల్గొన్నారు.

ధాన్యం అదనంగా తీసుకోకుండా చూడండి

గజపతినగరం, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణలో రైతుల నుంచి గోనె సంచులకు ఇచ్చే చెల్లింపులు పెండింగ్, మిల్లర్లు తరుగు పేరుతో రైతుల వద్ద నుంచి అదనపు కిలోలు తీసుకోవడం నివారించాలని రైతులు ఏపీసీఆ అధికారులను కోరారు. సోమవారం గజపతినగరంలోని రైతుసేవా కేంద్రంలో ధాన్యం సేకరణ తీరుపై భారత ఆహార సంస్థ సీఎం ఎ.రాజగోపాల్ రైతులు, అధికారులతో మాట్లాడారు. మిల్లర్ల పనితీరుపై ఫిర్యాదులు ఉన్నాయని పీఏసీఎస్ సీఈవో నారాయణరావు తెలిపారు. అదనపు కిలోలు తీసుకుంటున్నారని రైతులు తెలపగా విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. డివిజనల్ మేనేజర్ సునీల్‌కుమార్, ఏఎంసీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందనలు



తెర్లాం, న్యూస్‌టుడే: మండలంలో అభివృద్ధి పనుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజా సమస్యలు తెలుసుకునే విధానం సంతృప్తికరంగా ఉందని సీఎంవో కార్యాలయం ప్రత్యేకాధికారి చిన్నారావు తహసీల్దారు జి.హేమంత్‌కుమార్‌ను అభినందించారు. ఫోన్ల ద్వారా సంప్రదించగా తెర్లాం మండల ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్లు చెప్పారు. సోమవారం కార్యాలయ ఉద్యోగులు తహసీల్దారును సన్మానించారు.

నియంత్రికల ఏర్పాటు.. రేగిడి: మండలంలోని ఆడవరంలో రూ.2,31,507, సోమరాజుపేటలో రూ.2,61,239.. జోడుబందరలో రూ.3,89,739 వెచ్చించి విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేసినట్లు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీర్చేందుకు ఇవి ఏర్పాటు చేశామన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

బొండపల్లి: బొండపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ డి.రాజేశ్వరరావు సిబ్బందిని పంపి, ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే ఊరుకోం

తెర్లాం: మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.సాగర్ బాబు హెచ్చరించారు. ఎస్ఐ బి.సాగర్ ఆదేశాలతో కూనాయవలస, జగ్గివలస, ఎం.ఆర్.అగ్రహారం, రంగప్పవలస గ్రామాల్లో దుకాణాలను తనిఖీ చేశారు.

డీడీఓ సచివాలయం తనిఖీ

బొబ్బిలి గ్రామీణం: చిత్రకోట బొడ్డవలస సచివాలయాన్ని డీడీవో కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం తప్పనిసరిగా జరగాలన్నారు. ప్రభుత్వం అప్పగించిన సర్వేలన్నీ సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో రవి కుమార్, ఈవోపీఆర్డీ భాస్కరరావు ఉన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

బొబ్బిలి గ్రామీణం: కడపలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన రమేష్ ద్వితీయ బహుమతి సాధించాడు. నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నాడు. ఇటీవల దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో పతకాలు సొంతం చేసుకున్నాడు.

కూటమితోనే ఉపాధి అవకాశాలు

మెంటాడ: కూటమి ప్రభుత్వంతోనే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెదేపా మండలాధ్యక్షుడు సీహెచ్.వెంకటరావు అన్నారు. గుర్రమ్మవలస, బడేవలసలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.

ఉద్యోగాలిస్తామని మోసం

గజపతినగరం: గజపతినగరానికి చెందిన కె.వి.సాయిరాం, సునీత, పైడిశెట్టి కేంద్ర ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.25 లక్షలు వసూలు చేసి మోసగించారని జె.జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలు

గజపతినగరం: గజపతినగరం-2, పురిటిపెంట-1 సచివాలయాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో బి.కల్యాణి తెలిపారు.

వైకాపా నాయకుల సమావేశం

గరివిడి, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు హామీలతో ప్రజల్లో ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మోసం చేశారని వైకాపా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం గరివిడిలో జరిగిన వైకాపా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నారని, అవసరం లేని ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని ఇబ్బందులు పెడుతుంటే ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు, తల్లికి వందనం పథకానికి దారి మళ్లించారని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైకాపా పార్లమెంట్ పరిశీలకుడు పిల్లి సత్యనారాయణ, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

పంచాయతీ నిధుల స్వాహా

సర్వే రాళ్లతో కోనేరు మెట్ల నిర్మాణం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశిందొరవలస పంచాయతీలో కోనేరు మెట్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయి. గట్టు ఎక్కడానికి, దిగడానికి కష్టంగా ఉందని స్థానికులు పలుమార్లు అధికారులు, గ్రామపెద్దల దృష్టికి తెచ్చారు. దీంతో వైకాపా మహిళా సర్పంచి అల్లుడు ముందుకొచ్చి గత ఏడాది మెట్లు ఏర్పాటు చేశారు. దీనికి పంచాయతీ నిధులు రూ.27 వేలు చెల్లించినట్లు దస్త్రాల్లో ఉన్నట్లు కార్యదర్శి పుణ్యవతి తెలిపారు. అప్పటి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ్‌కుమార్ రికార్డు చేసినట్లు ఉందన్నారు. అయితే గత ప్రభుత్వంలో రీసర్వేకు తెచ్చిన సరిహద్దు రాళ్లను మెట్లుగా ఉంచారు. ఖర్చు పెట్టకుండా పంచాయతీ నిధులు కాజేసిన వ్యవహారం తెలుసుకున్న స్థానికులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో అధికారుల దృష్టికి వెళ్లింది.



పీఏసీఎస్ అధ్యక్షురాలిగా అలివేణి.. దత్తిరాజేరు: మండలంలోని పోరలి అగ్రహారం పీఏసీఎస్ అధ్యక్షురాలిగా గొభ్యాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి వంగపండు అలివేణి, సభ్యులుగా ఎం.రామారావు, పి.తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చినట్లు తెలిపారు. అలివేణి మంత్రి కె.శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

మహిళలతో సెల్ఫీ దిగుతున్న బేబినాయన

తెర్లాం, బాడంగి, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం అరసబలగలో నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ ఎన్.వెంకటినాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ❖ బాడంగి మండలం ఎరుకుల పాకల గ్రామంలోనూ బేబినాయన పర్యటించారు. మహిళలతో ఎమ్మెల్యే సెల్ఫీ దిగారు. తెంటు రవిబాబు, ఎల్.సత్యం, త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కళా వెంకటరావు

మెరకముడిదాం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. సోమవారం మండలంలోని భైరిపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, కాలువలను ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను వివరించారు. నాయకులు కెంగువ ధనంజయ, తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు పాల్గొన్నారు. ❖ చీపురుపల్లి గ్రామీణం: తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు చిననడిపల్లి పంచాయతీలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు డి.రామచంద్రుడు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గరివిడి, న్యూస్‌టుడే: 'రీ-యూనియన్ ఆఫ్ గరివిడి' పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టి పట్టణానికి పూర్వవైభవాన్ని తీసుకొద్దామని పలు రంగాల ప్రముఖులు అన్నారు. సోమవారం సీనియర్ కార్మిక నేత ఎం.జగన్నాథరాజు ఆధ్వర్యంలో విశ్వభారత్ సేవా సంస్థ (విశాఖపట్నం) ఛైర్మన్ బలివాడ రమేష్ వివిధ వర్గాల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పట్టణానికి నాటి వైభవాన్ని తీసుకురావడమే ఉద్దేశమని వివరించారు. క్రీడా మైదానం, కమ్యూనిటీ హాలు, శ్మశానవాటిక అభివృద్ధితో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు సూచించారు. విశ్రాంత అధ్యాపకులు, ఉపాధ్యాయులు జీఏఎన్ రాజు, చంద్రమౌళి, కె.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం: 80089 02900
విజయనగరం గ్రామీణం: 80085 74317
ఎస్.కోట: 8008574326
భోగాపురం: 70959 54646

?: ఎస్.కోటలో ప్రభుత్వం ఇచ్చిన రెండు లేఅవుట్లలో రోడ్లు, కాలువలేక అవస్థలు పడుతున్నాం. - 1, 2 కాలనీ వాసులు
★ ప్రభుత్వానికి నివేదించాం. నిధులు రాగానే పనులు చేపడతాం. - పి.విజయకుమార్, పీఆర్ ఏఈ
?: సంతపేటలో విద్యుత్తు లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. - స్థానికులు, సంతపేట
★ లోవోల్టేజీ సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడతాం. - చప్ప సూరిబాబు, ఇన్‌ఛార్జి ఏఈ - న్యూస్‌టుడే, ఎల్.కోట
?: జామిలో తాగునీటి సరఫరా సకాలంలో సరఫరా కావడం లేదు. - వల్లి వెంకటరావు, చెంబువలవారి వీధి
★ రోజూ సక్రమంగా ఇస్తున్నాం. ఒక్కోసారి ఇబ్బంది అవుతోంది. - ప్రసాద్, ఈవో, - న్యూస్‌టుడే, జామి
?: తిప్పలవలసలో కాలువల్లో పూడిక పేరుకుపోయాయి. - స్థానికులు, చింతపల్లి
★ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పూడిక తీత తొలగిస్తాం. - ఈవోపీఆర్డీ, జ్ఞానేశ్వరరావు - న్యూస్‌టుడే, పూసపాటిరేగ
?: భోగాపురం మండలం చాకివలస వేల్దారిలో గుంతలతో ప్రమాదకరంగా ఉంది. - స్థానికులు, చాకివలస
★ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం, నిధులొస్తే మరమ్మతులు చేపడతాం. - పంచాయతీరాజ్ జేఈ, గణేష్
?: కొలువాడలోని వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. వృథా అరికట్టాలి. - స్థానికులు, కొలువాడ
★ పగటిపూట వెలగకుండా చర్యలు తీసుకుంటాం. - విద్యుత్ శాఖ ఏఈ - న్యూస్‌టుడే, భోగాపురం
?: అరిశాలం పంచాయతీలో సేకరించిన చెత్తను వేపాడ దారిలో వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. - మహేష్, స్థానికుడు
★ అరిశాలం పంచాయతీలో స్థల సమస్య కారణంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం మంజూరుకాలేదు. చర్యలు తీసుకుంటాం. - రవికుమార్, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, వేపాడ
?: వైష్ణవపేట, కంటోన్మెంట్, బాబామెట్ట, పూల్‌బాగ్ లక్ష్మీగణపతికాలనీ-3లో వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికులు
★ పరిశీలించి బాగు చేయిస్తాం. - ప్రవంతి, ఏఈ
?: దాసన్నపేట రైతుబజారు దారిలో రోడ్డు కుంగిపోయింది. - స్థానికులు
★ బాగుచేయిస్తాం. - కే.చిత్రపణీశ్వర్, డీఈఈ
?: బొండపల్లిగూడెంలో విద్యుత్తు తీగలపై చెట్ల కొమ్మలు పడుతున్నాయి. - స్థానికులు
★ కొమ్మలను తొలగిస్తాం. - ఎ.కిరణ్‌కుమార్, డీఈఈ - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మురుగు తొలగించారు

డెంకాడ: నాతవలసలోని ప్రధాన వీధిలో సీసీ కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహించడంపై 'కాలువలేక.. మురుగు పోదు' శీర్షికతో ఇటీవల 'ఈనాడు'లో ఇచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ విస్తరణాధికారి ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం మురుగు తొలగించారు.

మురుగుకు అడ్డుకట్ట

నెల్లిమర్ల: నెల్లిమర్ల దామస్‌పేట ప్రాంతంలో మురుగు సక్రమంగా వెళ్లేందుకు కాలువను ఏర్పాటు చేశారు. ఇక్కడి సమస్యపై ఈనెల 6న 'రోడ్డుపై మురుగు పరవళ్లు' శీర్షికతో ఈనాడులో ఇచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. రహదారిపైకి మురికినీరు రాకుండా అడ్డుకట్ట వేశారు.

దీపాలు వెలిగాయి

స్పందనకు వందనం

నెల్లిమర్ల: నెల్లిమర్ల గాంధీనగర్ కాలనీలో విద్యుత్తు దీపాలు మరమ్మతులకు గురవడంపై స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం మీకుతోడుగా'కు తెలపగా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులు చేయించి, అవసరమైనచోట కొత్త దీపాలు వేశారు.

బాగుపడిన కాలువలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల రామతీర్థం కూడలి సమీపంలో రోడ్డుపై మురుగు ప్రవహిస్తుండడంపై గత నెల 29న 'ఈనాడులో 'రహదారిపై మురుగు పరవళ్లు' శీర్షికతో ఇచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. కాలువ ఏర్పాటు చేసి మురికినీటిని మళ్లించారు.

వ్యర్థాల తొలగింపు

విజయనగరం పట్టణం: నగరంలోని గాయత్రీనగర్‌లో వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికుడు రమణమూర్తి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి డా.కె.సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

డీసీఎంఎస్ ఛైర్మన్ పరామర్శ

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని బానాదిలో ఇటీవల మృతి చెందిన గొంప దేముడమ్మ పెద్ద కర్మ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ సోమవారం నివాళులర్పించారు. ఆమె కుమారుడైన తెదేపా మండలాధ్యక్షుడు వెంకటరావు, కోడలు ఎంపీటీసీ సభ్యురాలు తులసీని పరామర్శించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని పుణ్యగిరి 11కేవీ ఫీడరు పరిధిలోని ఏవీ హోమ్స్, పందిరప్పన్న కూడలి, రామ్‌నగర్, పోలీసు స్టేషను ప్రాంతం, రైల్వేస్టేషను ప్రాంతం, సబ్‌స్టేషను ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరేనా!

న్యూస్‌టుడే, భోగాపురం

నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిపై కూటమి నాయకుల్లో ఉత్కంఠ వీడలేదు. గత వైకాపా పాలనలో మార్కెట్ కమిటీ పాలక వర్గాలు మున్నాళ్ల ముచ్చటగానే సాగాయి. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏఎంసీ ఛైర్మన్ పదవులను రద్దు చేశారు. అప్పటి నుంచి ఛైర్మన్ల నియామకాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నా పూసపాటిరేగలో మాత్రం నియమించలేదు. దీంతో నిర్వహణ సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పూసపాటిరేగ ఏఎంసీ కార్యాలయం

రసవత్తరంగా మారిన పోటీ

ఇక్కడి ఛైర్మన్ పదవిని ఈ ఏడాది జనవరిలో బీసీ జనరల్ రిజర్వేషన్ కల్పించారు. దీంతో నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కీలక నేతలు ఆ పదవి కోసం మంతనాలు జరిపారు.((గత ఎన్నికల సమయంలో ప్రస్తుత మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఎమ్మెల్యే టికెట్ ఆశించగా, అది జనసేనకు కేటాయించారు. దీంతో అతని సోదరుడు భోగాపురం తెదేపా అధ్యక్షుడు కె.సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసేందుకు సిద్ధ పడటంతో పార్టీ అధికారంలోకి వస్తే పూసపాటిరేగ ఏఎంసీ ఛైర్మన్‌గా నియమిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన విరమించుకున్నారు. ఇప్పుడు జనసేన పార్టీ నుంచి నాయకులు ఏఎంసీ పదవికి పోటీ పడుతుండడంతో రసవత్తరంగా మారింది. ఇంతలో ఏఎంసీ పదవికి బీసీ- జనరల్ రిజర్వేషన్‌ను బీసీ మహిళగా మార్పు చేశారు. దీంతో కొన్నాళ్లుగా తెదేపాకు చెందిన ముగ్గురు సీనియర్ మహిళా నాయకులు పోటీ పడ్డారు. ఇందుకు ఐవీఆర్ఎస్ కాల్స్ సర్వే నిర్వహించగా మరో కీలక నాయకుడి పేరు రావడంతో నేతల్లో గందరగోళం నెలకొంది.

జిల్లాలోనే అత్యధిక ఆదాయం

జిల్లాలోనే ఇది అత్యధికం ఆదాయం తెచ్చిపెడుతోంది. ఏటా సుమారు రూ.1.5 కోట్లు పైగా ఆదాయం వస్తోంది. ఏడాదిగా పాలక వర్గం ఏర్పాటు కాకపోవడంతో కారదర్శి, అసిస్టెంటుతో కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో పర్యవేక్షణలేక సేవలు అందక రైతులకు అవస్థలు తప్పడం లేదు.

కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలు

ఆడ్డతీగలో రైతులతో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

ఎస్.కోట: జిందాల్ నిర్వాసిత గ్రామాల్లో రైతుల సమస్యలను కలెక్టర్ అంబేడ్కర్ దృష్టికి తీసుకెళ్లామని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. సోమవారం ఆ పార్టీ నాయకులతో కలిసి కిల్తంపాలెం, చినఖండేపల్లి, పెదిపాలెం, మూలబొడ్డవర, ముషిడిపల్లి, ఆడ్డతీగ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పరిహారం ఇవ్వలేదని ఇతర సమస్యలు వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం చేసేలా యాజమాన్యం మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. నాయకులు కె.ప్రసాద్, గోపి, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు అవసరం

బాలలతో అశోక్ గజపతిరాజు, అదితి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ముందుకెళ్లాలని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు సూచించారు. తనకు వివిధ సందర్భాల్లో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అందించిన నోట్ పుస్తకాలు, పెన్నులను సోమవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి విజయనగరం మండలం మలిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలోని బాలలకు అందించారు. ప్రభుత్వం అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈవో సత్యవతి, నాయకులు బొద్దల నర్సింగరావు, ప్రసాదుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దర్మపురి జడ్పీ పాఠశాలలోనూ పుస్తకాలు అందించారు.

నేటి నుంచి వార్డు సభలు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందని, అందులో భాగంగా పీ4 విధానాన్ని రూపొందించిందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పేర్కొన్నారు. బంగారు కుటుంబాల తుది జాబితా తయారు చేసేందుకు ఈనెల 15 నుంచి వార్డు సభలను నిర్వహించాలని అడ్మిన్, వెల్ఫేర్, విద్య కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే 6776 మందిని ప్రామాణికంగా గుర్తించామన్నారు. టీడీఆర్లు సింహాచలం తదితరులు పాల్గొన్నారు. ★ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కమిషనర్ పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

మురుగు పారేదెలా?

డెంకాడ మండలంలోని జొన్నాడలో జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు కిందకు పారక రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు, దుకాణ యజమానులు వాపోతున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కాలువలు నిర్మించి దానిపై సిమెంటు పలకలు వేసి కప్పేయడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి డి.వాసు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సమస్యను జాతీయ రహదారి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, డెంకాడ

జాతీయ రహదారి పక్కనే వ్యర్థాలు

కొత్తవలస పట్టణంలో రైల్వే స్టేషన్ సమీపంలో విశాఖపట్నం-అరకు జాతీయ రహదారి పక్కనున్న చెత్త కుండీల్లో వ్యర్థాలు నిండిపోయి రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. ఆటుగా రాకపోకలు చేసే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహిస్తున్నా పోగవుతున్న చెత్తను సంపద సృష్టి కేంద్రానికి తరలించడంలో అలసత్వం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని పంచాయతీ కార్యదర్శి బి.శైలజ దృష్టికి తీసుకెళ్లగా గురుపౌర్ణమినాడు రెండు కుండీల్లో చెత్తను తీయించి బ్లీచింగ్ చల్లించామని చెప్పారు. మళ్లీ తీయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తవలస

లక్ష్యాలను నెరవేర్చాలి

పాలవలస యశస్వితో ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ తదితరులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆశయాలు పాటిస్తూ మార్కెట్ కమిటీ లక్ష్యాలను నెరవేర్చాలని తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి సూచించారు. విజయనగరం ఏఎంసీ ఛైర్మన్ కర్రోతు నర్సింగరావు, వైస్ ఛైర్మన్ చంద్రు నాయుడు సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 25న జరిగే ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ.. అన్నదాతలకు అండగా నిలవాలన్నారు. నాయకులు పి.చంద్రశేఖర్, రామకృష్ణ, ముత్యాలనాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ మేళాకు 484 మంది హాజరు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: నిరుద్యోగులు, విద్యావంతులైన యువతకు పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళాలు ఎంతో ఉపయోగపడతాయని విజయనగరంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ టి.వి.గిరి అన్నారు. సోమవారం ఐటీఐలో జరిగిన మేళాకు 484 మంది హాజరయ్యారు. ఇందులో 331 మంది ఈస్ట్‌కోస్ట్ రైల్వే అప్రెంటిస్‌కు అర్హత పొందారు. మెరిట్ జాబితా ఆధారంగా ముఖాముఖికి పిలుస్తామని సంబంధిత ప్రతినిధి జె.ప్రకాష్ తెలిపారు.

మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపల్ గిరి

నవ చేతన.. యువ ఆవిష్కరణ

న్యూస్‌టుడే, భోగాపురం

ఆసక్తి.. ఆలోచన.. ఆవిష్కరణ.. ఇదే నేటి తరం మంత్రం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగే ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు. తమ ప్రతిభ.. నైపుణ్యాలకు మెరుగులు దిద్ది.. రోబో, 3డీ ప్రింటింగ్, బ్యాటరీ వాహనాలు, వ్యవసాయ, ఇతర పరికరాలు రూపొందించి ప్రతిభ చాటుతున్నారు. **నేడు ప్రపంచ నైపుణ్య దినోత్సవం** సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనమిది.

ప్రాజెక్టు : మార్క్స్ ఇన్ హ్యూమనోయిడ్ రోబో
బృందం : సీఎస్‌సీ విద్యార్థులు
ప్రయోజనం : మానవ సూచనలతో పనిచేసే యంత్రం
ఆవిష్కరణ : పైథాన్, సీప్లస్‌ప్లస్, సెర్వో మోటర్స్, ఎస్‌సీ-05 బ్లూటూత్ మాడ్యూల్ వంటి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ టూల్స్ వినియోగించి ఈ రోబోట్‌ను విద్యార్థులు రూపొందించారు. భావి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరింత అభివృద్ధికి అనువుగా దీన్ని తయారు చేశారు. ఇది ఓ వ్యక్తి వాయిస్ అసిస్టెంటుగా, మానవ కదలికల ఆధారంగా నడిచే సామర్థ్యం ఉంది. మనమిచ్చే ప్రశ్నలకు సమర్థంగా జవాబులిచ్చే నైపుణ్యం, బ్లూటూత్ ద్వారా నియంత్రణ, ఇతర సాంకేతిక ప్రయోజనాలున్నాయి. దీని తయారీకి రూ.20 వేలు వెచ్చించారు

ప్రాజెక్టు : త్రీ వీలర్ బ్యాటరీ ఆధారిత కార్గో వాహనం
బృందం : ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు
ప్రయోజనం : తక్కువ ఖర్చుతో చిన్నపాటి సరకులను గమ్యస్థానాలకు చేర్చడం
ఆవిష్కరణ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సరకులను తక్కువ ఖర్చుతో రవాణా చేసేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుంది. పర్యావరణ హితంగా నడిచే బండిది. విద్యుత్తు బ్యాటరీ వినియోగంతో నడిచేలా దీన్ని రూపొందించారు. ఇనుము, బ్యాటరీ, పాత ఆటో విడిభాగాలను ఉపయోగించి తయారు చేశారు. ఇందుకు రూ.లక్ష వరకూ ఖర్చు చేశారు.

అశోక్‌కు పలువురు నాయకుల అభినందనలు

పూలమొక్క అందజేస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్

భోగాపురం, న్యూస్‌టుడే: గోవా రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజును మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు సోమవారం కలిసి అభినందించారు. పూల మొక్క అందజేసి, శాలువా వేసి శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

ఎస్.కోట, న్యూస్‌టుడే: పక్షపాతం లేని ఓ నిపుణుడి మధ్యవర్తిత్వంతో రెండు పక్షాల మధ్య వివాదాలు, కేసులను పరిష్కరించుకోవచ్చని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్ బి.కనకలక్ష్మి అన్నారు. సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మధ్యవర్తిత్వం-దేశం కోసం అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్.కోట కోర్టులో సుమారు 1300 వరకు కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. న్యాయవాదులు జీఎస్ దేముడు, రామారావు, మూర్తి పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై యువకుడి మృతి

భోగాపురం, న్యూస్‌టుడే: మద్యం తాగిన వ్యక్తి అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై పాపారావు వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన చోటు మాజీ (28) ఇక్కడి విమానాశ్రయ పనుల్లో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం బైరెడ్డిపాలెం వచ్చి దుకాణంలో మద్యం తాగాడు. తిరిగి పనికి వెళ్తుండగా ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై మృతి చెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించారు. మృతుడు చిన్నాన్న కొడుకు మహేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇరువర్గాల కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం: ఇరువర్గాల కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. పూసపాటిరేగ మండలంలోని తొత్తడాంకు చెందిన బొలుసు బంగారయ్య, కుమారుడు గోవింద్ సోమవారం తమ భూమిలో దుక్కులు చేస్తున్నారు. అప్పటికే వీరితో భూ వివాదం ఉన్న నీలాపు సత్యనారాయణరెడ్డి అక్కడికి వచ్చి గోవింద్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలైన అతన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. సత్యనారాయణ తన బంధువులతో కలిసి ఆసుపత్రికి వెళ్లి మరోసారి గోవింద్‌పై దాడి చేశారు. అతని వదిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

జామి: గజపతినగరం శాసనసభ నియోజకవర్గ పరిధిలో జామి మండలంలోని జనసేన కార్యకర్తల సమావేశం జామిలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల్లో కష్టపడినా గుర్తింపు లేదని, ఉనికి సాధించాలంటే వచ్చే ఎన్నికల్లో గ్రామాల్లో పోటీ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

ఇళ్ల స్థలాలు కోరుతూ ధర్నా

కొత్తవలస: విచారణ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి డేగల అప్పలరాజు డిమాండు చేశారు. కార్యాలయం ముందు ధర్నా చేసి తహసీల్దారు అప్పలరాజుకు వినతి పత్రం ఇచ్చారు.

'పోలీసుల తీరు దారుణం'

ఎస్.కోట: రైతుల తరపున పోరాడుతున్న నేపథ్యంలో తన రక్షణ కోసం వచ్చిన సిబ్బంది కోసం టెంటు ఏర్పాటు చేస్తే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తన అనుచరుడిపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేస్తే ఇప్పటికీ చర్యలు లేవన్నారు. విషయాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ సీఐకి దరఖాస్తు ఇచ్చానన్నారు. దీనిపై సీఐ నారాయణమూర్తి వివరణ కోరగా సెక్షను 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున ధర్నాలు, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరన్నారు.

నియామకపత్రం అందజేత

నేరవార్తా విభాగం: పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేసిన పి.శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్య సమస్యల కారణంగా మరణించారు. ఆయన కుమారుడు బాలాజీని హోంగార్డుగా నియమిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు అందజేశారు.

బాలికలకు సైకిళ్ల వితరణ

కొత్తవలస: కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పేదరికంలో ఉండి తల్లి/తండ్రి లేని అయిదుగురు బాలికలకు వీకే ఫ్యామిలీ సంస్థ ఉచితంగా సైకిళ్లు అందజేసింది. వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ఈశ్వరరావు సంబంధిత విద్యార్థులకు అందజేశారు.

స్కాట్స్ కోటాలో ఇద్దరికి ట్రిపుల్‌ఐటీ సీట్లు

కొత్తవలస: కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఈగల ఆకాష్, నంద బెనర్జీబాబుకి స్కాట్స్ కోటాలో శ్రీకాకుళం ఐఐఐటీ సీట్లు లభించాయని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండపై ఫిర్యాదు

ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

డెంకాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై డెంకాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని పోలీసుస్టేషన్లలో దళిత సంఘాలు, జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల పూతికపేటలో నిర్వహించిన సమావేశంలో దళితులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే నాగమాధవిపై తీవ్ర విమర్శలు చేయడం బాధాకరమన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వలేం

భోగాపురం, న్యూస్‌టుడే: భీమిలి మండలంలో నిర్మిస్తున్న ఓబరాయ్ హోటల్‌కు మా భూములు ఇవ్వబోమంటూ భోగాపురం మండలంలోని దిబ్బపాలెం గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు వినతి అందజేశారు. గ్రామం నుంచి రోడ్డును నిర్మించేందుకు 1.34 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకునేందుకు ఇటీవల జీవో ఇవ్వడంతో ఆర్డీవో కీర్తి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో చర్చించారు. సాగుభూములు కోల్పోతే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు.

గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతులు చూపుతున్న దిబ్బలపాలెం రైతులు

పారా స్పోర్ట్స్‌తో దివ్యాంగులకు అవకాశం

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నారాయణమూర్తి

ఎస్.కోటే: పారా క్రీడాకారులకు ప్రభుత్వాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని సీఐ నారాయణమూర్తి అన్నారు. సోమవారం పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పారా క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలకు సంబంధించిన కరపత్రులను ఆవిష్కరించారు. ఈనెల 20న విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరగనున్న పారా జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనాలన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీరాంపురంలో ఉన్న శ్రీరామా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఛైర్మన్ తెన్నేటి సుబ్బారావు, ట్రస్టు వ్యవస్థాపకుడు వేదుల సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవారం సుమారు రూ.1.30 లక్షలు విలువ చేసే విద్యాసామగ్రి విద్యార్థులకు అందజేశారు. కోనమసివానిపాలెం, శ్రీరాంపురం, రెల్లిగైరమ్మపేట, పోతంపేట, కొట్యాడ, వేపాడ మండలం బొద్దాం గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు అందజేశారు.

పుస్తకాలు అందజేస్తున్న ప్రతినిధులు



అడిగినంత అప్పు.. అన్నదాత మెప్పు

☛ రుణ పరిమితి పెంచిన ప్రభుత్వం
☛ ఈ ఖరీఫ్ నుంచే అమలు

ఈనాడు డిజిటల్, భీమవరం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పు అడిగితే పుట్టడం లేదు. ఏంచేయాలో తెలియక దిగాలు చెందుతున్న రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రుణ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్, రబీ సీజన్లకు పంటల వారీగా రుణాలు నిర్ణయిస్తూ బ్యాంకర్లకు దిశా నిర్దేశం చేసింది.

జిల్లాలోని 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంపు నిర్ణయం బ్యాంకులతో పాటు సహకార సంఘాలు అమలు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఉద్యాన పంటలతో పాటు చేపలు, రొయ్యల సాగుకు కూడా రుణపరిమితిని పెంచింది.



జిల్లాలో వరి 83,245 హెక్టార్లలో సాగవుతుండగా ఖరీఫ్‌లో 1.08 లక్షలు, రబీలో 1.20 లక్షల మంది రైతులు పండిస్తున్నారు.

రూ.5 వేల నుంచి పెంపు.. ప్రతి పంటకు ఎకరాకు గరిష్ఠంగా రూ.5 వేల వరకు రుణ పరిమితి పెరిగింది. జామకు రూ.45 వేల నుంచి రూ.97 వేలు, సపోటకు గరిష్ఠంగా రూ.43 వేలు మంజూరు చేయనున్నారు. ఆవుల కొనుగోలుకు రూ.35 వేల నుంచి రూ.42 వేలు, గేదెలు రూ.45 వేల నుంచి రూ.54 వేల వరకు పెంచింది. గొర్రెలు, మేకల మందకు (20+1) రూ.42 వేల నుంచి రూ.51 వేలు ఇస్తారు. పౌల్ట్రీ రంగానికి బ్యాచ్ (ఒక్కో కోడికి) రకం బట్టి రూ.10-20 వరకు అందిస్తారు.

పందిరి కూరగాయలు - 1.85 లక్షలు నుంచి 1.93 లక్షలు (వెయ్యి చదరపు మీటర్లకు)



కొర్రీలొద్దు.. వార్షిక పద్దులో వ్యవసాయానికి కేటాయించిన రుణాల్లో ప్రతి పైసా రైతుకు చేరాలని బ్యాంకర్లను ప్రభుత్వం ఆదేశించింది. రకరకాల నిబంధనలతో కొర్రీలు వేసే కార్యక్రమాలకు స్వస్తి పలకాలని.. సాధ్యమైనంత ఉదారంగా వ్యవహరించి రైతుకు అండగా నిలవాలని సూచించింది. గతేడాది జిల్లాలో వ్యవసాయ రుణాలు 85 శాతం, కూరగాయల సాగు, ఇతర పంటలకు 100 శాతానికి పైగా రుణాలు మంజూరు చేశాం. ఈ ఏడాది వంద శాతం ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాం.
- నాగేంద్ర ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్

జిల్లాలో ఈ ఏడాది రుణ లక్ష్యం: రూ.15,057 కోట్లు
ఉద్యాన పంటలు: రూ.496

లేసు అల్లికలకు దక్కిన గౌరవం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద నరసాపురం లేసు అల్లికలకు అవార్డు దక్కిన విషయం తెలిసిందే. దిల్లీలో

ఆ అవార్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ నాగరాణి అందుకున్నారు. ఈ గుర్తింపుతో వేల మందికి ప్రోత్సాహం ఇవ్వగలుగుతామని పేర్కొన్నారు.

మేమెంత సంక్షేమం అంటే

అధికారులు ఓ సారి చూస్తే తెలుస్తుంది

భీమవరంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో దోమలు గదుల్లోకి వెళ్లకుండా కిటికీలకు కట్టిన బరకాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వర్షా కాలం అనగానే వ్యాధులు విజృంభించే సమయం. తల్లిదండ్రులకు దూరంగా వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వాటి ఆవరణలు శుభ్రంగా ఉంచాలి. దోమల విజృంభణ లేకుండా ఏర్పాట్లు చేయాలి. కానీ.. పరిశీలిస్తే కొన్ని చోట్ల ఆ ఛాయలు లేవు. శాశ్వత ఉద్యోగులు లేరు. కనీసం తాత్కాలిక ప్రాతిపదికన కూడా సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న కొద్దిమందితోనే నెట్టుకొస్తున్నారు. వార్డెన్లు, ఆహార పదార్థాలు వండేందుకు కమాటీలు, వాచ్‌మెన్‌లు ఉండాలి. చాలా చోట్ల వారి జాడ లేదు.

జిల్లాలోని తణుకు, భీమవరంలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. రెండు చోట్లా కుక్, వాచ్‌మెన్, కమాటీలు లేరు. రోజువారీ సిబ్బందితో కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలో 35 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా 15 ఖాళీలు ఉన్నాయి. బీసీ హాస్టళ్లు 29 ఉండగా 18 చోట్ల మాత్రమే పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారు. మిగిలిన 11 వసతిగృహాల్లో తాత్కాలిక సేవలు కొనసాగుతున్నాయి. ఎస్సీ విభాగంలో 3, బీసీ వసతి గృహాల్లో 6 చోట్ల వార్డెన్లు లేరు. అక్కడికి సమీపంలోని వసతి గృహ పర్యవేక్షకులను పంపుతున్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలతో విద్యార్థులు గదుల్లో ఉపయోగించుకునేందుకు దోమ తెరలు సమకూర్చారు. కిటికీలకు, మెస్‌లకు దోమ తెరలు లేవు. వసతి గృహాల ఆవరణల్లో చెత్త గుట్టలు తొలగించకపోతే అవి దోమ లార్వా ఉత్పత్తి కేంద్రాలవుతాయి. ఈ విషయాలను ఎస్సీ, బీసీ సాధికారత అధికారులు రామాంజనేయరాజు, వెంకటేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ప్రైవేటు భవనాల్లోని వసతి గృహాల్లో మెస్‌లకు దోమ తెరలు కట్టించాలని సంబంధిత యజమానులకు సూచించినట్లు చెప్పారు. దుప్పట్లు, జింఖానాలు రావాల్సి ఉందని, పరిసరాలను వెంటనే శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు.

నర్సయ్య అగ్రహారంలోని బీసీ బాలుర వసతి గృహావరణలో చెత్త

రైతేరాజు
● కొత్త ఒరవడి.. లాభాల దిగుబడి
● తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం
6లో

మధ్యవర్తిత్వంతో సమయం, డబ్బు ఆదా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతో రాజీ పడితే విలువైన సమయాన్ని, డబ్బును కక్షిదారులు ఆదా చేసుకున్నట్లేనని భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. భీమవరంలో సోమవారం మధ్యవర్తిత్వంపై నిర్వహించిన అవగాహన ప్రదర్శన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలి నుంచి శ్రీరామపురంలోని బీఎస్ఎన్ఎల్ న్యాయసేవా కాంప్లెక్స్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, రెండో అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బెంచ్ మెజిస్ట్రేట్ నాగరాజు, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, ప్రిన్సిపల్ రఘురాం, న్యాయవాదులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో న్యాయమూర్తులు, పోలీసులు తదితరులు

రెండో విడత ప్రవేశాలకు 20 వరకు గడువు

ఉండి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన ఖాళీల భర్తీకి రెండో విడత ప్రవేశాల కోసం ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు పెంచినట్లు ఐటీఐల జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో https://iti.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులు 24వ తేదీ ఉదయం 9 గంటలకు ఉండిలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. పదో తరగతిలో అనుత్తీర్ణులైన విద్యార్థులు ఏడాది కోర్సున్న వెల్డర్ ట్రేడ్‌లో చేరే అవకాశముందని, అర్హులు ఉంటే ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బతికున్నా చంపేస్తాం.. ఆస్తులు రాసేస్తాం

నకిలీ ధ్రువపత్రాలతో కాజేత ● వృద్ధులు, ఒంటరి వారే లక్ష్యం

నా సోదరుడికి వివాహం కాలేదు. 2000లో మరణించాడు. ఓ వ్యక్తి అతని ఆస్తిపై కన్నేశాడు. కొంతమంది రెవెన్యూ అధికారులకు డబ్బులు ఇవ్వడంతో నా సోదరుడికి కుమారుడు ఉన్నట్లు 2023లో నకిలీ కుటుంబ ధ్రువపత్రం (ఎఫ్‌ఎంసీ) ఇచ్చారు. తద్వారా సదరు వ్యక్తి మా కుటుంబాన్ని మానసికంగా వేధించడమే కాకుండా ఆస్తిలో వాటా ఉందంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. న్యాయం కోసం ఏడాదికి పైగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాం. వృద్ధాప్యంలో ఈ మానసిక ఆందోళన ఏమిటో అర్థం కావడం లేదు. **- భీమవరంలో ఓ ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తి (85) ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.**

మా నాన్న ప్రభుత్వోద్యోగి. అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతి చెందారు. ఆయనతో పరిచయమున్న ఓ మహిళ భార్యనంటూ నకిలీ కుటుంబ ధ్రువపత్రం సృష్టించింది. ప్రభుత్వం తరఫున ఆయనకు రావాల్సిన ప్రోత్సాహకాలు.. ఇతర అన్నింటిలోనూ వాటా ఉందంటూ రచ్చకెక్కింది. మా అమ్మ మానసికంగా నలిగిపోతుంది. ఏడాదికి పైగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. **- నరసాపురంలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆవేదన**

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: మీరెవరు.. వారికి మీకు సంబంధం ఏమిటి.. అని పూర్వాపరాలు తెలుసుకోకుండా సొమ్ములు ఇస్తే చాలు నకిలీ కుటుంబ ధ్రువపత్రాలు ఇచ్చేస్తున్నారు కొందరు రెవెన్యూ అధికారులు. వాటిని అడ్డం పెట్టుకుని వృద్ధులు, ఒంటరిగా జీవిస్తున్న వారు, సంతానం విదేశాల్లో స్థిరపడిన వారి కుటుంబాల ఆస్తులను కాజేయడమే కాకుండా మానసికంగా కుంగదీస్తున్నారు.

జిల్లాలోని కొందరు రెవెన్యూ అధికారులు సొమ్ముల కోసం నకిలీ ధ్రువపత్రాలిచ్చేందుకు వెనుకాడటం లేదు. ఆస్తులు, భూముల వివరాల ఆధారంగా ఎఫ్‌ఎంసీ పత్రానికి ధర నిర్ణయిస్తున్నారు. అంతే కాకుండా విచారణ సమయంలో ఉన్నతాధికారులను వారు పక్కదోవ పట్టిస్తున్నారు. అలా చేసినందుకు మరికొంత తీసుకుంటున్నారు. ఆయా పత్రాలు కుటుంబాలను విచ్ఛిన్నం చేయడంతో పాటు తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇంటి పేరుమీదే ఆధార్ కార్డులు, ఇతర పత్రాలను సైతం సృష్టిస్తున్నారు. దీనిపై అధికారుల విచారణ ఏళ్ల తరబడి సాగుతుండటంతో న్యాయం చేయాలంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఎటువంటి విచారణ లేకుండా కుటుంబ ధ్రువపత్రాలు జారీ చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నకిలీ పత్రాలతో.. కొందరు తామే వారసులమని నమ్మబలికి, భూములు, ఆస్తులను నకిలీ పత్రాలతో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. వారిని నమ్మి కొనుగోలు చేసిన వారు నష్టపోతున్నారు. గతంలో నరసాపురం మండలంలో ఇదే విధంగా భూములు విక్రయించేందుకు సిద్ధమవగా కొనుగోలుదారులకు ఆఖరిలో విషయం తెలియడంతో అక్కడి నుంచి వారు జారుకున్నారు. మొగల్తూరులో ఓ వృద్ధ దంపతులకు అన్నీ తానేనంటూ నమ్మబలికిన దగ్గర బంధువు ఇంటిని, పొలాలను విక్రయించేందుకు సిద్ధమవగా.. వారసులకు విషయం తెలియడంతో అడ్డుకున్నారు.

ఆడుతూ.. పాడుతూ అభ్యసన!

అంగన్‌వాడీల్లో బోధనకు ప్రత్యేక పుస్తకాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: చిన్నారులకు ఓ క్రమపద్ధతిలో శిక్షణ ఇచ్చి ఉజ్వల భవితకు బాటలు వేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. దీనికి అనుగుణంగా బుజ్జాయిల మానసిక వికాసానికి దోహదపడేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రత్యేకంగా నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలను రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది.

అంగన్‌వాడీలకు అందించిన నవ చేతన పుస్తకంలో పసిపిల్లల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యుల బాధ్యతలను క్షుణ్నంగా వివరించారు. నేను నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం-రుచులు వంటి అంశాలను పాఠ్యాంశాలుగా ఇచ్చారు. కార్యకర్తలు మూడేళ్ల వయసులోపు వారికి వీటిని బోధించడంతో పాటు వారి తల్లిదండ్రులకు వివరిస్తారు. వారు ఇంటి వద్ద ఆయా అంశాలను అనుసరించాలి. చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించేలా కబుర్లు.. కథలు ఎలా చెప్పాలనేది ఈ పుస్తకంలో చిత్రాలతో సహా ఇచ్చారు.

వినోదాత్మకంగా.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎక్కువగా మూడు నుంచి ఆరేళ్లలోపు వయసు వారు ఉంటారు. వారికి పాఠ్యాంశాలను వినోదాత్మకంగా ఎలా బోధించాలనే అంశాలను ఆధార్ శిల పుస్తకంలో పొందుపరిచారు. వయసుల వారీగా బోధించాల్సిన అంశాలపై వేర్వేరు పాఠ్యాంశాలున్నాయి. అభ్యసన.. విసుగు లేకుండా ఆడుతూ పాడుతూ జరిగేలా ఈ పుస్తకాలను రూపొందించారు. చిన్నారుల్లో ఆలోచన, నైతిక విలువలను పెంపొందించేలా ఉప్పుకప్పురంబు తదితర నీతి పద్యాలను వీటిలో పొందుపరిచారు. కొత్త విధానంలో పాఠ్యాంశాల బోధనకు 'జ్ఞాన జ్యోతి' అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ ఇచ్చినట్లు మొగల్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బి.ఊర్మిళ చెప్పారు. ఈ సిలబస్‌ను సమర్థంగా బోధిస్తే చిన్నారుల భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు.

జిల్లాలో ఇలా..	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	07
అంగన్‌వాడీ కేంద్రాలు	1,626
చిన్నారుల సంఖ్య	64,200
బాలింతలు, గర్భిణులు	16,232

పద్దులన్నీ.. పక్కాగా!

● డ్వాక్రా సంఘాలకు ప్రత్యేక యాప్
● నమూనా ప్రాజెక్టుగా యలమంచిలి

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.లక్షల్లో రుణాలిస్తున్నాయి. వీటిని నెలవారీ వాయిదాల్లో మహిళలు తిరిగి చెల్లిస్తున్నారు. ప్రతి సంఘం రుణ వాయిదాలతో పాటు కొంత పొదుపు మొత్తాన్ని కూడా ప్రతి నెలా బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నాయి. పొదుపు నిల్వల ఆధారంగా రుణం ఎంత ఇవ్వాలనేది బ్యాంకర్లు నిర్ణయిస్తున్నారు. ఇదంతా పద్ధతి ప్రకారం జరుగుతున్నా కొందరు మహిళా సమాఖ్య నాయకులు, వీవోఏల కారణంగా సంఘాల్లో అక్రమాలు చోటు చేసుకుని సభ్యులు నష్టపోతున్నారు. వీటికి చెక్ పెట్టేలా మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా మన సంఘం- మన లెక్కలు పేరిట ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

☛ పాలకొల్లు మండలం లంకలకోడేరులో మూడేళ్ల కిందట ఓ డ్వాక్రా సంఘం సభ్యులు వాయిదా సొమ్ము చెల్లించినా సంబంధిత వీవోఏ బ్యాంకులో జమ చేయలేదు. కొంతకాలానికి బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో ఈ విషయం బయటపడింది. ఇలాంటి కేసులు తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఈ తరహా అక్రమాలను అరికట్టడంతో పాటు సంఘాల్లో ఆర్థిక కార్యకలాపాలన్నీ పారదర్శకంగా జరిగేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

దొడ్డిపట్లలో పుస్తకాల పరిశీలనలో రిసోర్స్ పర్సన్లు

వచ్చే నెల నుంచి అన్ని మండలాల్లో.. ఈ విధానం అమలుకు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా యలమంచిలి మండలాన్ని ఎంపిక చేశారు. దొడ్డిపట్ల, మట్లపాలెం, యలమంచిలి లంక, చింతదిబ్బ గ్రామాల్లోని సంఘాల కార్యకలాపాలను ఈ విధానంలో నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ 95 శాతం వరకు పూర్తికావొచ్చింది. వచ్చే నెల నుంచి జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న అన్ని సంఘాల్లో దీనిని అమలు చేయనున్నారు.

సమస్త సమాచారం నమోదు.. డ్వాక్రా సంఘం ఏర్పడిన నాటి నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలన్నింటినీ ఈ యాప్‌లో పొందుపరుస్తున్నారు. సంఘాల ఖాతాలున్న బ్యాంకులతో యాప్‌ను అనుసంధానం చేశారు. దీని వల్ల బ్యాంకు ఖాతాలో జమ, విత్‌డ్రా తదితర లావాదేవీలన్నీ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. తొలి దశలో మార్చి వరకు ఎంట్రీలు పూర్తి చేస్తారు. తర్వాత ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు లెక్కలను వరుసగా యాప్‌లో నమోదు చేయనున్నారు. మన సంఘం- మన లెక్కలు యాప్ వినియోగంతో పారదర్శకత పెరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు.

19 ఆలయ పాలకమండళ్లకు అనుమతులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: జిల్లాలో 19 ఆలయ పాలకమండళ్ల నియామకానికి అనుమతులు వచ్చినట్లు దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు. ఈ ఏడాది మే నెలలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో జిల్లాలో 129 ఆలయాలకు 69 దేవస్థానాల నుంచి దరఖాస్తులు చేయగా వాటిలో 19కి అనుమతులు ఇచ్చారు. మిగిలిన 50 ఆలయాలకు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు వచ్చాయి. అనుమతులు వచ్చిన వాటిలో మండలాల వారీగా.. ఆచంట-14, పాలకొల్లు-4, తణుకు-1 ఉన్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన ఆలయాల్లో భీమవరం పరిధిలో భీమేశ్వరస్వామి, దాసాంజనేయస్వామి, రామలింగేశ్వరస్వామి (సుబ్బరాయుడుగుడి), గునుపూడి గ్రామదేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ దేవస్థానాలు ఉన్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు.

నిలకడగా గోదావరి వరద

ఆచంట, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: మూడు రోజుల పాటు పెరుగుతూ వచ్చిన గోదావరి వరద సోమవారం కాస్త నెమ్మదించి నిలకడగా కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. లంక భూముల్లో పండించిన కూరగాయలను పడవలపై తీసుకువచ్చేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆచంట మండల పరిధిలో లంక గ్రామాల్లో పడవలు ఉంచే ప్రాంతాలు బురదగా తయారయ్యాయి. పెదమల్లం లంక, ఆనగర్లంక, కోడేరులంక, అయోధ్యలంక, మర్రిమూల, నడిగాడి, పుచ్చలలంక ప్రాంతాలకు చెందిన వారు అన్ని అవసరాలకు కోనసీమ జిల్లాకు పడవల్లో వెళ్తుంటారు. లంక గ్రామాల్లో రేవుల వద్ద పేరుకుపోయిన బురదలోంచి వీరు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆనగర్లంక వద్ద పడవ దిగి బురదలో నడుస్తున్న స్థానికులు

కాలు.. చేయి ఆడక స్ట్రెచర్‌పై వచ్చి..

● గంటలోనే కుదురుకున్న రోగి
● ఏలూరు బోధన ఆసుపత్రిలో అరుదైన వైద్యం

ఈనాడు-ఏలూరు: ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఓ రోగికి అరుదైన వైద్యం చేశారు. పక్షవాత లక్షణాలతో మూడు రోజుల క్రితం కాళ్లు, చేతులు బిగుసుకుపోయి స్ట్రెచర్‌పై ఆసుపత్రిలో చేరిన రోగికి 'థ్రాంబోలైసిస్' చేసి పక్షవాతం ముప్పు నుంచి కాపాడారు. పెదవేగికి చెందిన వెంకటేశ్వరమ్మ (60)కు ఈ నెల 12న ఉదయం 8 గంటలకు కుడి కాలు ఒకటి, కుడి చేయొకటి పనిచేయటం లేదు. కరెంటు షాకు తగిలి గుంజినట్లు, లాగేసినట్లు అనిపించిన స్థితిలో ఆమెను స్ట్రెచర్‌పై తీసుకొచ్చారు.

చకచకా పరీక్షలు చేసి.. చకచకా పరీక్షలు చేసిన వైద్యులు ఆమెకు పక్షవాతం వచ్చినట్లు నిర్ధారించుకున్నారు. లక్షణాలు బయటపడిన నాలుగు గంటల్లోపు దాని నివారణకు ఇంజెక్షన్ ఇస్తే ఫలితం ఉంటుందని వెంటనే ఆమెకు రూ.30-40 వేల ఖరీదు చేసే థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ చేశారు. అత్యవసర సేవల విభాగంలో ఆచార్య విద్యాసాగర్ పర్యవేక్షణలో జూనియర్, పీజీ వైద్యులు ఆమెకు సకాలంలో చికిత్స చేసి గంటలోపే ఆమె కాళ్లు, చేతులు ఆడించారు. స్ట్రెచర్‌పై వచ్చిన ఆమె సాయంత్రానికి బెడ్‌పై నుంచి లేవటం.. వార్డులో తిరగటం వంటివి చేశారని విద్యాసాగర్ తెలిపారు.

రోగితో మాట్లాడుతున్న విద్యాసాగర్, చిత్రంలో జూనియర్ వైద్యులు

54 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో 54 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా 122 సొసైటీలు ఉండగా ఈ నెల 8న ఉండి నియోజకవర్గంలోని కలవపూడి సంఘానికి త్రిసభ్య కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మిగిలిన 67 సొసైటీలకు సంబంధించిన త్రిసభ్య కమిటీల జాబితా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని జిల్లా సహకార అధికారి సంకు మురళీకృష్ణ తెలిపారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)ను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని, సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పలువురితో స్వయంగా మాట్లాడారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 235 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి దోసిరెడ్డి, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, వయోవృద్ధుల ట్రైబ్యునల్ సభ్యుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

అర్జీలను చట్టపరిధిలో పరిష్కరించండి: ఎస్పీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మీకోసం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో పరిష్కరించి, ఆ వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 12 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో భర్త, అత్తింటి వేధింపులు, ప్రేమపేరుతో మోసం, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, సీఐలు వి.పుల్లారావు, దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

23న ఉద్యోగ దిక్సూచి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నరసాపురం వైఎన్ కళాశాలలో ఈ నెల 23న ఉద్యోగ దిక్సూచి నిర్వహించనున్నట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దానికి సంబంధించిన గోడపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోక్‌మాన్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

వరదల వేళ.. తప్పని యాతన

లంకగ్రామాల వాసుల మొర

పి.గన్నవరం, ఆచంట, న్యూస్‌టుడే

ఆచంట మండల పరిధిలోని వివిధ లంకగ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం సరిహద్దులోని కోనసీమ జిల్లా పి.గన్నవరం వస్తుంటారు. గోదావరి వరదల సమయంలో రేవులు దాటి వీరంతా రాకపోకలు సాగించాలి. ప్రభుత్వ పరంగా మరపడవలు ఏర్పాటు చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఆర్థిక భారం భరించలేకపోతున్నామని వాపోతున్నారు. గోదావరికి మధ్యలో ఉన్న పెదమల్లంక, ఆనగార్లంక, కోడేరులంక, మర్రిమూల, అయోధ్యలంక వాసులు సొంతంగా మరపడవలు ఏర్పాటు చేసుకుని వాటి నిర్వహణ, పడవ నడిపే వ్యక్తికి అయ్యే ఖర్చులు భరిస్తూ నిత్యం రేవులు దాటుతున్నారు. సీజన్ తగ్గేవరకు కుటుంబానికి రూ.500 నుంచి రూ.600 చొప్పున నెలకు భరిస్తున్నామని సోమవారం 'ఈనాడు-ఈటీవీ' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా అధికారులు అక్కడి లంకగ్రామాల వారికి ఏర్పాటు చేసినట్లుగానే తమకూ పడవలు, ఇతర ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

మరపడవ దిగిన తరువాత ఇళ్లకు చేరుకునేందుకు ఆనగార్లంక వాసుల ఇక్కట్లు

మరపడవలు ఏర్పాటు చేయాలి

వశిష్ఠ గోదావరికి మధ్యలో ఉన్నాం. బెల్లంపూడి నుంచి రేవుదాటి మధ్యలో చిన్నపాటి పాయలో నడుము లోతు నీటిలో నడిచి ఇళ్లకు చేరుకుంటున్నాం. వరదల సమయంలో ఏటా సొంతంగా మరపడవలు ఏర్పాటు చేసుకుని నిర్వహణ ఖర్చులు భరిస్తూ రేవులు దాటుతున్నాం. ప్రభుత్వం మరపడవలు ఏర్పాటు చేయాలి. - **చీకరమిల్లి సురేష్, పెదమల్లంక**

చాలా నిర్లక్ష్యానికి గురవుతున్నాం

ఎవరూ పట్టించుకోవడం లేదు. అనేకమంది విద్యార్థులు చదువుల కోసం కోనసీమ జిల్లావైపు రాకపోకలు సాగిస్తుంటారు. కోనసీమ జిల్లావైపు లంకగ్రామాలకు ప్రభుత్వం మరపడవలు ఏర్పాటు చేసింది. మాకు మాత్రం ఏర్పాటు చేయలేదు. మేము చాలా నిర్లక్ష్యానికి గురవుతున్నాం. -**తవిటికి కృష్ణమూర్తి, ఆనగార్లంక**

ఆర్డీవో దృష్టికి తీసుకెళతాం

ఆచంటం మండల పరిధిలో గోదావరి నదికి మధ్యలో ఉన్న లంకగ్రామాలకు వరదల సమయంలో మరపడవలు ఏర్పాటు చేయడంలేదు. మా వద్ద లైఫ్‌జాకెట్లు లేవు. మంగళవారం వరద సమావేశం ఉంది. ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - **కనకరాజు, తహసీల్దార్, ఆచంట**

కొత్త ఒరవడి.. లాభాల దిగుబడి

పంట మార్పిడి విధానంలో సత్ఫలితాలు సాధిస్తున్న రమేశ్

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: సంప్రదాయ వ్యవసాయ పద్ధతిలో పంట మార్పిడి విధానాన్ని అవలంబించి సత్ఫలితాలు సాధిస్తున్నారు జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన రైతు సత్తెనపల్లి రమేశ్. ఆయన తండ్రి పండించే వరి, మొక్కజొన్న సాగు చేసే విధానాన్ని చిన్ననాటి నుంచే నిశితంగా పరిశీలించేవారు. చదువు పూర్తయ్యాక వ్యవసాయంపై మక్కువతో కుటుంబానికి ఆసరాగా నిలిచారు. తనకున్న నాలుగెకరాల వ్యవసాయ క్షేత్రంలో కొత్త రకాల వరి, మొక్కజొన్న విత్తనాలు వినియోగించి అధిక దిగుబడి సాధించేవారు.

పేరంపేటలో తోట

వ్యవసాయంలో మార్పు కోసం..

వరి, మొక్కజొన్న పంటలకు ఒక్కోసారి సరైన గిట్టుబాటు ధర రాకపోవడం, వర్షాల బారినపడకుండా ధాన్యం, మొక్కజొన్నలను కంటికి రెప్పలా కాపాడుకోవడం రమేశ్‌కు భారంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను వేయాలని నిర్ణయించుకున్నారు. సహచర రైతుల సూచనల మేరకు వేరుశనగ పంటను ఓ రెండెకరాల్లో ప్రయోగాత్మకంగా వేసి ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధించారు. ఆ స్ఫూర్తితో మరో పదెకరాలు కౌలుకు తీసుకుని అదే పంటను పండిస్తూ లాభాలు గడిస్తున్నారు.

పరికరాలతో..

వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి వాటిపైనా రమేశ్ ఆదాయం సంపాదిస్తున్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం మండలంలో వేరుశనగ సాగు విస్తరించడంతో యంత్రాలకు గిరాకీ పెరిగింది. దీనిని అందిపుచ్చుకున్న రమేశ్ రూ.3 లక్షలతో యంత్రాలు కొనుగోలు చేశాడు. తమ సొంత పనులకు వినియోగించుకున్నాక ఇతర రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చి అదనపు ఆదాయం పొందుతున్నారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తోందని రైతు రమేశ్ తెలిపారు. సాగులో ఒడుదొడుకులు అధిగమించాలంటే రైతులందరూ పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని ఆయన సూచిస్తున్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: ఖరీఫ్ కూరగాయల సాగులో సస్య రక్షణ చర్యలు తెలపండి ?
- సుదర్శనరావు, ద్వారకాతిరుమల

సమాధానం: బెండ మొక్కల మొదళ్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి. ఎండు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి మొదళ్లలోని మట్టి బాగా తడిచేలా పోయాలి. రసం పీల్చు పురుగు నివారణకు లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. కలిపి ఆకులు, కాండం తడిచేలా పిచికారీ చేయాలి. వంగలో కాండం తొలుచు పురుగు ఆశించకుండా 100 చ.మీ.కు నాటే ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 250 గ్రా. నేలలో కలియబెట్టాలి. పందిరి జాతి కూరగాయల ఆకుల పైభాగాన పసుపు రంగు, అడుగున ఊదా రంగు మచ్చలు ఏర్పడితే లీటరు నీటిలో మాంకోజెబ్ 2.5 గ్రా. కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు
✆ చరవాణి
73826 33692

రైతేరాజు

తేనెటీగల పెంపకంతో.. అదనపు ఆదాయం

పెనుగొండ, పోడూరు, న్యూస్‌టుడే: ఉద్యాన తోటల్లో తేనెటీగల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖాధికారిణి కె.ప్రియదర్శిని తెలిపారు. కొబ్బరి, పండ్ల తోటల్లో తేనె పెట్టెలను ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా రాయితీలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. తేనెతో పాటు ఉప ఉత్పత్తుల ద్వారా ఆదాయం ఆర్జించవచ్చని తెలిపారు.

సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)లో ఒక పెట్టెకు, తేనెటీగలకు కలిపి రూ.1,600 రాయితీ ఇస్తారు. ఒక రైతు కనిష్ఠంగా 8, గరిష్ఠంగా 50 పెట్టెలు రాయితీపై పొందవచ్చు. దీంతో పాటు తేనెటీగల పెంపకానికి ఉపయోగించే పరికరాలకు రూ.8 వేల రాయితీ విడిగా లభిస్తుంది.

ఉప ఉత్పత్తులు ఇవీ..

పుప్పొడి: దీనిలో ప్రోటీన్లతో పాటు ఔషధ గుణాలు ఉంటాయి. వివిధ ఔషధాలు, పోషకాల తయారీలో దీనిని వాడుతారు.

మైనం: కూలీ ఈగలు తయారు చేసే మైనం విలువ తేనె కంటే 10 రెట్లు ఎక్కువ. దీనిని సబ్బులు, క్రీములు, సౌందర్య సాధనాలు, లేపనాల తయారీలో ఉపయోగిస్తారు.

రాజహారం: కూలీ ఈగలు తయారు చేసే అత్యంత విలువైన పదార్థం ఇది. దీనిలో 14% చక్కెర, 66% నీరు, 5% కొవ్వు పదార్థాలు ఉంటాయి. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు కిలో రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతుంది.

ప్రోపోలిన్: దీనిలో యాంటీసెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి.

తేనెటీగల విషం: దీనిలో వివిధ రకాల పెప్టయిడ్లు, ఎంజైములు అధికంగా ఉంటాయి. కీళ్ల వ్యాధులు, నరాల నొప్పులు, పార్కిన్సన్, అల్జీమర్ తదితర వ్యాధుల చికిత్సలో ఉపయోగిస్తారు.

వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న మధుమతి, అధికారులు

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం రాక

కాళ్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సోమవారం కాళ్ల మండలం ఏలూరుపాడును సందర్శించింది. గ్రామంలో పాఠశాలలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, మురుగునీటి పారుదల, పచ్చదనం- పరిశుభ్రత అంశాలను బృంద సభ్యులు పరిశీలించారు. బృంద నాయకురాలు ఎం.మధుమతి గ్రామంలో పలువురి ఇళ్ల ఆవరణ, మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. సంపద కేంద్రంలో తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడం, వర్మీ కంపోస్టు తయారు చేసే విధానం పరిశీలించారు. బృంద సభ్యులు టీఎన్ రవికిరణ్, ఎం.సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వి.భాస్కరరావు, గ్రామ కార్యదర్శి ఎస్.అరుణదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యార్థులొచ్చారు!

కళకళలాడిన ట్రిపుల్ ఐటీ ప్రాంగణం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చిన విద్యార్థులకు మంగళవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ఆర్జీయూ కేటీ అధికారులు ప్రకటించారు. దీంతో సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు తరలి రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణం కిటకిటలాడింది. విద్యార్థులు తమకు కేటాయించిన వసతి గృహాల్లోకి వెళ్లేందుకు యత్నించడంతో రద్దీ నెలకొంది. టోకెన్ సిస్టం ద్వారా పేర్లు నమోదు తదితరాలను ట్రిపుల్ ఐటీ వార్డెన్లు ఇతర సిబ్బంది పరిశీలించి విద్యార్థులను వసతి గృహం లోపలికి పంపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల సమయం వచ్చే వరకు నేలపై సేద తీరారు. మరికొందరు చెట్ల కింద వేచి ఉన్నారు. కనీసం ఆయా వసతి గృహాల వద్ద కూర్చునేందుకు కుర్చీలను సైతం ఏర్పాటు చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

వసతి గృహం వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు

ఆరోగ్యంగా ఉంటేనే సేవలు చేయగలం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు సేవ చేయాలంటే ముందుగా పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. డీజీపీ హరీష్‌గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని 1,297 మంది పోలీసులకు మెగా వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయిస్తున్నామన్నారు. భీమవరంలోని మిత్ర మెడికేర్, వర్మ, తణుకులోని యాపిల్ ఆసుపత్రులు, పాలకొల్లులోని న్యూలైఫ్ ఎమర్జెన్సీ సూపర్ స్పెషాలిటీ యజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి అందుతున్న సేవలపై ఎస్పీ ఆసుపత్రులకు ఫోన్ చేసి ఆరా తీశారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీలు ఆర్.జి.జయసూర్య, ఎం.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, పోలీసు అధికారులతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ సంచాలకుడు ఎం.ఫణి కిశోర్ తెలిపారు. యువకులకు ఫోన్ల మరమ్మతులకు 30 రోజులు, యువతులకు జనపనార సంచుల తయారీలో 14 రోజులపాటు శిక్షణనిస్తామన్నారు. ఇతర వివరాలకు 99485 65256 నంబర్‌ను సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చేప పిల్లల రవాణాలో.. జాగ్రత్తలు తప్పనిసరి!

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: విత్తన చెరువు నుంచి చేప పిల్లలను రవాణా చేసే సమయంలో జాగ్రత్తలు పాటించకుంటే అవి మృత్యువాతపడి నష్టపోయే ప్రమాదం ఉంది. దీని నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని భీమవరానికి చెందిన ఆక్వా రంగ నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు. వివరాలు ఇలా..

● చేప పిల్లల మార్పిడికి మూడు రోజుల ముందు నుంచి మేతలు ఆపేయాలి. ఒక రోజు ముందు చేప పిల్లలను వలతో లాగి (తిరగవేత) మళ్లీ చెరువులో వదలాలి. ఆ సమయంలో ఎకరాకు 25 కిలోల చొప్పున సముద్ర ఉప్పు చల్లాలి. బుటాక్స్ లేదా కాపర్‌క్యూర్ వంటి రసాయనాలను చెరువు నీటిపై చల్లాలి. రవాణాను ఉదయం 7 గంటలకు ప్రారంభించి 10 గంటల లోపు పూర్తిచేయాలి. చేప పిల్లలను వలతో లాగే సమయంలో ఆక్సిజన్ అందేలా కాల్షియం లేదా మోనోపెర్సోరేట్ వంటి వాటిని నీటిలో చల్లి ఆక్సిజన్ స్థాయిని స్థిరీకరించాలి.

సైజుకు అనుగుణంగా..

సైజును బట్టి వ్యానుకు 200 నుంచి 500 కిలోల బరువు మించకుండా చేప పిల్లలు వేసి రవాణా చేయాలి. డ్రమ్ముల్లో రవాణా చేస్తే 150 నుంచి 300 కిలోలు మించకుండా చేయాలి. కొత్త చెరువులో చేప పిల్లలను వదిలిన వెంటనే ఐడోఫోర్-20 వంటి రసాయనాలను చెరువు నీటిపై ఎకరాకు 250 మి.లీ. చొప్పున చల్లాలి. రెండో రోజు నుంచి ప్రభుత్వ అనుమతి పొందిన వ్యాధి నిరోధ ఔషధాలను పచ్చితవుడుతో కలిపి టన్ను చేపలకు 15 గ్రాముల చొప్పున అందించాలి.

ఆగస్టు 19 నుంచి తణుకులో సీపీఐ జిల్లా మహాసభలు

తణుకు, న్యూస్‌టుడే: సీపీఐ జిల్లా సమితి 27వ జిల్లా మహాసభలు ఆగస్టు 19, 20 తేదీల్లో తణుకులో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వంకా సత్యనారాయణ సురాజ్య భవన్‌లో జరిగిన సీపీఐ తణుకు పట్టణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7, 8 తేదీల్లో ఉండిలో నిర్వహించాల్సిన పార్టీ జిల్లా మహాసభలు అనివార్య కారణాలతో రద్దు చేసి తణుకులో నిర్వహణకు నిర్ణయించినట్లు చెప్పారు. మహాసభల సందర్భంగా ఆగస్టు 19న తణుకు పట్టణంలో ప్రజా ప్రదర్శన - బహిరంగ సభ నిర్వహిస్తామని, 20న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. సీపీఐ పట్టణ సమితి సభ్యుడు మందుల ముత్తయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, పట్టణ సమితి సభ్యులు పి.దత్తాత్రేయ ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

సంతకం చేసి.. కుప్పకూలి

శిక్షణ విధులకు వెళ్లి.. గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

పాలకొల్లు గ్రామీణ, నల్లజర్ల, న్యూస్‌టుడే: శిక్షణ విధులకు హాజరైన పాలకొల్లు మండలం అరట్లకట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఆర్ మూర్తిరాజు (52) గుండెపోటుతో సోమవారం ఉదయం మృతి చెందారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాల పెంపుపై విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 4 రోజుల శిక్షణ తరగతులను తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణకు మూర్తిరాజు రిసోర్సు పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సోమవారం పాలకొల్లులో బయల్దేరి తాడేపల్లిగూడెం బస్టాండ్ వద్దకు వచ్చే సరికి అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో వైజ్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకొని హాజరుపట్టీలో సంతకం చేశాక ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీనిని గమనించిన సిబ్బంది ఆయన చికిత్స నిమిత్తం కారులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందారు. మృతదేహాన్ని పశ్చిమ గోదావరి డీఈవో నారాయణ అంబులెన్స్‌లో పాలకొల్లు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన మృతికి డీఈవోతో పాటు సమగ్రశిక్షా అభియాన్ అధికారి శ్యామ్‌సుందర్, పాలకొల్లు ఎంఈవోలు ఆర్ఎన్‌వీఎస్ శర్మ, జి.వీరాస్వామి సంతాపం తెలిపారు.

మూర్తిరాజు (పాతచిత్రం)

బోధనేతర పనులు రద్దు చేయండి: యూటీఎఫ్

యలమంచిలి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం తగదని.. తక్షణం వాటిని రద్దుచేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అరట్లకట్ట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మూర్తిరాజు శిక్షణ విధుల్లో ఉండగా గుండెపోటుతో మృతిచెందిన నేపథ్యంలో యూటీఎఫ్ నాయకులు మేడపాడు స్పెషల్ పాఠశాల వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. శిక్షణల పేరిట అధికారులు ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తున్నారని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ ఆరోపించారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9010680011, 9989371122.

పశ్చిమ గోదావరి [illegible]

PEOPLE CARE

OLD AGE HOME

[illegible] ✆ 99590 21122, 99590 31122

REAL ESTATE

LAND FOR SALE

[illegible] ✆ 99535 21122, 99631 01122

గమనిక [illegible]

JOBS

[illegible]

రామకృష్ణ ఓల్డేజ్ [illegible] ✆ 92814 52827, 92814 52843

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

మైన్స్ ఏడీ రవికాంత్ మృతి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక భూగర్భ గనుల శాఖ జిల్లా కార్యాలయంలో విజిలెన్స్ విభాగం ఏడీగా పని చేస్తున్న రవికాంత్(55) మృతి చెందారు. సత్రంపాడులోని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుకు గురై అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

బాలికపై లైంగిక దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏడో తరగతి చదువుతున్న బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట ప్రాంతానికి చెందిన 75 ఏళ్ల వయసున్న తిర్రి సూర్యనారాయణమూర్తి వారం రోజులుగా నగరానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. సదరు బాలిక రోజూ పాఠశాలకెళ్లి సాయంత్రం వేళ అమ్మమ్మ ఇంటికి వెళ్తుంటుంది. ఈ క్రమంలో వృద్ధుడు విద్యార్థిని మచ్చిక చేసుకొని. రోజూ కాసేపు ఇంటికి పిలిపించుకొని లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో.. ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సోమవారం కేసు నమోదు చేసి.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

బాధితురాలి బంధువుల ధర్నా.. పోలీసులు నిందితుడిని వదిలేశారంటూ పుకార్లు రావడంతో ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు సోమవారం రాత్రి రెండో పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. సీఐ అశోక్ కుమార్ నిరసనకారులతో మాట్లాడి సర్దిచెప్పారు. నిందితుడు తమ అదుపులోనే ఉన్నారని చెప్పడంతో.. వారు శాంతించారు.

108 వాహన సిబ్బందిపై..

ఎనిమిది మంది అరెస్టు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 108 వాహన సిబ్బందిపై కొందరు యువకులు దాడి చేసిన ఘటనపై కైకలూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన కోనాల లక్ష్మణరావు 108 వాహనంలో ఈఎంటీగా పనిచేస్తున్నారు. ఈనెల 12 శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై కైకలూరు విధులకు వస్తున్న సమయంలో గోపవరం రోడ్డులో రైల్వే గేటు వేయడంతో ఆగారు. గేటు తీసిన అనంతరం వాహనాలు రద్దీగా ఉండటంతో ముందుకు వెళ్లే వీలు లేక వేచి ఉన్నారు. ఈక్రమంలో వెనుక ఉన్న కొదమల హేమంత్ అనే యువకుడు ముందుకు వెళ్లాలని బండి హారన్ కొట్టాడు. ముందు వాహనాలు ఉంటే వెళ్లేది ఎలాని లక్ష్మణ్ సమాధానం ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో హేమంత్ తన స్నేహితులకు ఫోన్ చేసి రైల్వే గేటు వద్దకు రప్పించాడు. వచ్చీ రావడంతోనే యువకులంతా లక్ష్మణరావుపై విచక్షణారహితంగా దాడి చేశారు. క్షతగాత్రుడు విషయాన్ని ఫోన్‌లో 108 వాహన పైలెట్ నాగరాజుకు తెలపగా హుటాహుటిన అక్కడ చేరుకున్నాడు. అక్కడే వేచి ఉన్న యువకులు నాగరాజుపై కూడా దాడి చేసి గాయపరిచారు. ఇందులో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలవ్వగా.. కైకలూరు, అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు ఫిర్యాదుపై పట్టణ సీఐ కృష్ణ సీసీ కెమెరాలను పరిశీలించారు. దాడికి పాల్పడిన యువకులు మండలంలోని ఆటపాక పంచాయతీ పరిధిలోని జాన్‌పేటకు చెందిన వారుగా గుర్తించారు. దాడికి ప్రధాన కారకుడైన హేమంత్ మరో ఏడుగురిని సోమవారం అదుపులోకి తీసుకుని ఎస్సై ఆర్.శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన తోలేటి సత్యనారాయణ(60) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. రైటర్ మహేశ్ కథనం ప్రకారం.. సత్యనారాయణ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడన్నారు. మృతుని కుమారుడు దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

కాళ్లు అమర్చిన వారితో ట్రస్టు, హీల్ ప్రతినిధులు

కృత్రిమ కాళ్ల అమరికతో ఆత్మవిశ్వాసం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అమరికతో ఆత్మవిశ్వాసం పెంపొంది, దివ్యాంగ బాలలు విద్య కొనసాగించడానికి దోహదపడుతుందని చుండూరు కోటయ్య, రామశేషమ్మ ఛారిటబుల్ ట్రస్టు ముఖ్య బాధ్యుడు మధుసూదనరావు అన్నారు. తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో చుండూరు కోటయ్య, రామశేషమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 13 మందికి కృత్రిమ కాళ్లను సోమవారం అందజేశారు. హీల్ సీఈవో కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 729 మందికి కృత్రిమ కాళ్లను అందజేశామన్నారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, డైరెక్టర్ టి.భాస్కర్, ప్రముఖ సంఘ సేవకులు చుండూరు బుజ్జమ్మ, గవిర్నేని పద్మ, వీరపనేని రామారావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమిద్దాం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఒత్తిడిని అధిగమిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. ఒత్తిడి తగ్గించుకోవడంపై అవగాహన కార్యక్రమాన్ని భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించారు. ఎన్‌సీడీ- సీడీ కార్యక్రమ అధికారిణి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ మాధవి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి వాహనం.. యువకుడి మృత్యువాత

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోవడంతో యువకుడు మృతి చెందిన నగర శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఒకటో పట్టణం నవాబుపేటకు చెందిన కిరణ్(22) ఐటీఐ చదివారు. ఈ నెల 13 రాత్రి స్నేహితులతో కలిసి ఆశ్రం సమీప దాబాకు వెళ్లారు. ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా.. మార్గం మధ్యలోని తూర్పులాకుల వద్ద వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని స్నేహితులు వెంటనే సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలో మృతి చెందారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న కల్లుగీత కార్మికులు

గీత వృత్తిని కాపాడండి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కల్లుగీత వృత్తిని లేకుండా చేయాలనుకుంటే పాలకులకు భవిష్యత్తు లేకుండా చేస్తామని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి హెచ్చరించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కల్లుగీత వృత్తిని కాపాడాలని నినాదాలు చేశారు. పలువురు కార్మికులు మోకులు ధరించి ధర్నాలో పాల్గొన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొలుసు మద్యం దుకాణాలను ప్రభుత్వమే ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పాలకులు గీత వృత్తి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి, నాయకులు కడలి పాండు, బొక్కా చంటి, కాగిత రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

భీమవరం
•భీమవరం •ఉండి

సర్వే చేసి దారి చూపాలని వినతి

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్లలోని పంటకాలువ గట్టును సర్వే చేసి తమకు దారి చూపాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ జి.సుందర్‌సింగ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని మొండికోడు పంట కాలువ గట్టును కొంత మంది పూర్తిగా ఆక్రమించుకోవడంతో శివారు ప్రాంతంలో ఉన్న తమ పొలాలకు మార్గం లేకుండా పోయిందన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాళ్ల రైతులు

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన పెంపొందించుకుని కక్షిదారులకు తెలియజేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు అన్నారు. మధ్యవర్తిత్వంపై ఈ నెల 10 నుంచి 16 వరకు నిర్వహిస్తున్న అవగాహన తరగతుల్లో భాగంగా సోమవారం న్యాయమూర్తి సురేష్‌బాబు పాల్గొని న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లకు సూచనలు ఇచ్చారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి సురేష్‌బాబు

పొదల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: మొక్కలు, పొదలు పెరిగి విద్యుత్తు స్తంభాలు అధ్వానంగా ఉన్నాయంటూ 'అల్లుకుపోతా...చీకట్లు మిగులుస్తా' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి ఆ శాఖ ఏఈ వర్మ స్పందించి పొదలు, తీగజాతి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. స్తంభంతో పాటు పరిసరాలు శుభ్రపడ్డాయి.

కఠోర శిక్షణ.. పతకాల సాధన

టేబుల్ టెన్నిస్‌లో రాణిస్తున్న విద్యార్థులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని పురపాలక పాఠశాలలకు చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. టేబుల్ టెన్నిస్ ఆట అరుదైనా మెలకువలు ఇట్టే పట్టుకుంటున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలుస్తున్నారు. క్రీడా పరికరాలను శిక్షకులు సమకూర్చడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు.

● పేరు- ★ చదువు

ప్రతిభ- ఏఆర్‌కేఆర్ పురపాలక పాఠశాలలో చదువుతున్నా. ఆరో తరగతి నుంచి టేబుల్ టెన్నిస్‌పై మక్కువ పెరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా.

● పవన్ సత్యకుమార్
★ 9వ తరగతి

ప్రతిభ- రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు పతకాలు అందుకున్నా. ఈ ఏడాదిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నా. ఆటలకు సమయం కేటాయిస్తే ఆరోగ్యం బాగుంటుంది. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి.

● యశ్వంత్ రమణ
★ 10వ తరగతి

ప్రతిభ- అంతర్‌జిల్లాల ఆటల పోటీల్లో గత ఏడాది తొలిసారిగా పతకం అందుకున్నా. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలనేది లక్ష్యం. ఈ ఏడాది సెప్టెంబరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నా.

● భార్గవి
★ 9వ తరగతి

ప్రతిభ- టేబుల్ టెన్నిస్ ఆడుతున్న వారిని చూసి ఆసక్తి కలిగింది. శిక్షకుడు జీపీసీ శేఖర్‌రాజు దగ్గర మెలకువలు నేర్చుకున్నా. 2024 సెప్టెంబరు, ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రెండు పతకాలు సాధించా. ఆటలో మరింత పట్టుసాధించి క్రీడా కోటాలో ఉద్యోగం సంపాదించాలనుకుంటున్నా.

● హోమేష్ నారాయణరాజు
★ 9వ తరగతి

ప్రతిభ- ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకున్నాను. నంద్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొన్నా. అండర్-14 విభాగంలో పతకం అందుకున్నా. ఆటలో రాణించి మరిన్ని పతకాలు సొంతం చేసుకుంటా.

● శ్రీనివాసు
★ 8వ తరగతి

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

భీమవరం పట్టణం: 80085 74471	వీరవాసరం :80085 74475
భీమవరం మండలం:80085 74533	ఉండి :80085 74526
ఆకివీడు :80085 74525	పాలకోడేరు :80085 74467
కాళ్ల : 80085 74474	

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? విస్సాకోడేరు వంతెన నుంచి చినరంగనిపాలెం వరకు పైపులైన్లు మరమ్మతులతో నీరు రహదారిపైకి చేరుతోంది. - జి.శ్రీనివాసరావు, ప్రైవేటు ఉద్యోగి ? బస్టాండు ఎదురుగా ఉన్న రోడ్డులో పైపులైను మరమ్మతులకు గుంతలు తీసి కొన్ని నెలలుగా రహదారికి నీరు చేరి చిత్తడిగా ఉంటుంది - నాగేశ్వరరావు, భీమవరం
✔ పైపులైన్లను వెంటనే మరమ్మతులు చేస్తాం. - ఏ.త్రినాథరావు, పురపాలక ఏ.ఇ.

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు ఏసీ కాలనీ ప్రాంతంలో డ్రైనేజీలో ఆకులు పేరుకుని ఉండటంతో మురుగు పారుదలకు అవరోధంగా ఉంది. - వెంకట్రావు
✔ వెంటనే అవరోధాలు తొలగిస్తాం. - సాకేత్‌బాబు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్
? ఆకివీడు చినపల్లివీధిలో కుళాయి ద్వారా నీరు సరఫరా కావడం లేదు. ట్రాక్టర్ ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదు. - స్థానికులు
✔ చినపల్లివీధిలో కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేశారు. త్వరలో ప్రారంభిస్తాం. ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా పూర్తిస్థాయిలో నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. - సురేష్, ఏఈ

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? భీమవరం శ్రీనివాస థియేటర్ కూడలి, రైతు బజార్ రోడ్డు నుంచి జంక్షన్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి ప్రారంభంలో సుమారు 20 మీటర్ల మేర మార్గం గోతుల మయంగా మారింది. - ప్రయాణికులు, స్థానికులు
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - డి.దివాకర్, పురపాలక ఏఈ

ఉండి, న్యూస్‌టుడే: ? ఉండి శాఖ గ్రామంలోని ప్రాథమిక ఆసుపత్రి తూర్పు వైపున చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - సిహెచ్ మణి, గొడపేట, ఉండి
✔ ఆ ప్రాంతంలో చెత్త వేయొద్దని సూచిక బోర్డును ఏర్పాటు చేశాం. - అనిల్‌కుమార్, గ్రామ కార్యదర్శి

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 81/2023
Between:
Siva Sai Aqua Distributors rep. by its proprietor A.Satya Sivananda Kumar .. Plaintiff
And
M/s Sri Sai Aqua Feeds & Needs rep. by its proprietor G.Raju .. Defendant
To.
M/s Sri Sai Aqua Feeds & Needs rep. by its Proprietor. G.Raju, D.No. 8-12, Komarada Village, Bhimavaram Mandal BHVMJCJC
పై నెంబర్ దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు సమనులు పంపినను దావా సంగతులు తెలిసియుండి సదరు కోర్ట్ సమనులు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి 28-07-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం. 10.30 ని.లకు పై కోర్ట్‌లో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
తాడేపల్లిగూడెం సం/- పసుపులేటి శ్రీనివాస్
తేది: 10-7-2025 వాది తరపు అడ్వకేట్
సెల్: 98482 70282

విద్యార్థికి ఆర్థికసాయం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన గ్రంధి లక్ష్మీనారాయణ యశ్వంత్‌కి గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ తరఫున రూ.15 వేల ఆర్థిక సాయంతో పాటు ప్రశంసాపత్రాన్ని సోమవారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉషాబాల పవన్‌కుమార్ తరఫున సంస్థ కో-ఆర్డినేటర్ భానుమూర్తి సహకారం అందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: నరసాపురం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సోమవారం నిర్వహించారు. డీఎస్పీ శ్రీవేద ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

రక్తదాన శిబిరం

భీమవరం పట్టణం, ఆకివీడు, న్యూస్‌టుడే: నరసాపురం మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పుట్టిన రోజు సందర్భంగా భీమవరంలోని డీఎన్నార్ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారని ప్రిన్సిపల్ జి.మోజెస్ తెలిపారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు జి.పాండురంగరాజు తదితరులు పాల్గొని రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ★ 'నరేంద్ర మోదీ- గోకరాజు గంగరాజు' సేవా సమితి ఆధ్వర్యంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పుట్టిన రోజు వేడుకలు ఆకివీడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నేరెళ్ల పెదబాబు రోగులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు అందజేశారు. అనంతరం ఆయన కార్యాలయం వద్ద కేకు కోసి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎర్ర రఘు, రాంబాబు, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన విద్యార్థికి ధ్రువపత్రం ఇస్తున్న కళాశాల యాజమాన్యం

అల్లూరి విప్లవ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

పాలకోడేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు బ్రిటిష పాలకులపై చేసిన విప్లవ స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కుముదవల్లి కందుకూరి వీరేశలింగ కవి సమాజ గ్రంథాలయ ఛైర్మన్ భూపతిరాజు శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం గ్రంథాలయంలో మోగల్లు అల్లూరి స్మారక సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన అల్లూరి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు బుద్దరాజు బలరామరాజు, గ్రంథాలయ కార్యదర్శి నాగేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి చిత్రపటం ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, చిన్నారులు

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	తమ్ముడు
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	ది 100
కిషోర్ స్క్రీన్ 1	తమ్ముడు
కిషోర్ స్క్రీన్ 2	మార్గన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	ఓ భామ అయ్యో రామ
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సూపర్ మ్యాన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	జురాసిక్ వరల్డ్ 3డీ (తెలుగు)
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	3 బీహెచ్‌కే, ది 100
విజయలక్ష్మి స్క్రీన్	మార్గన్

మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి వాండ్రం మీదుగా కోపల్లె గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిని ఆ శాఖ ఏఈ కనుమూరి శ్రీహరిరాజు సోమవారం పరిశీలించారు. వాండ్రం - కోపల్లె గ్రామాల పరిధిలో వివిధచోట్ల గుంతలు పడి దెబ్బతిన్న మార్గంలో మురుగునీరు నిలిచిపోకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

'మీ కోసం'లో అర్జీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (మీ కోసం)లో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగు అర్జీలు అందాయని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.





ఆన్‌లైన్ వర్క్స్.. ఎంతవరకు..!

సోషల్ మీడియా మేనేజ్‌మెంట్

కొన్ని బేసిక్ టూల్స్ వినియోగాన్ని నేర్చుకోవడం ద్వారా చిన్న చిన్న వ్యాపారాలకు సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ చేసే వీలుంటుంది. ఇలాంటి సేవలే ఇన్ఫ్లుయెన్సర్లకు అందించడం ద్వారా కూడా డబ్బులు సంపాదించవచ్చు. ఆ బిజినెస్ సంబంధిత సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహించడం, కామెంట్లను నియంత్రించడం వంటి పనులుంటాయి.

'చేతిలో ఫోన్ ఉంటే చాలు.. వేలకు వేలు సంపాదించవచ్చు, ల్యాప్‌టాప్‌ల నుంచే పని.. లక్షల్లో జీతం! ఇంటి నుంచే వ్యాపారం, మీరే భాగస్వాములు..' రోడ్ల మీదా, బస్‌స్టాప్‌ల్లో, ఎక్కడ చూసినా ఇలాంటి ప్రకటనలే! వీటికి ఎక్కువగా ఆకర్షితులయ్యేది చదువుకునే యువత, డిగ్రీలు చేతపట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారే. మరి వీటిని ఎంచుకోవడం ఎంతవరకు సురక్షితం, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నిజమైన ఆన్‌లైన్ వర్క్స్, కచ్చితంగా పేమెంట్ చేసేవి ఏం ఉన్నాయి, వాటినెలా గుర్తించాలి? పరిశీలిద్దాం!

చాలామంది విద్యార్థులు చదువుతూ పనిచేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఉద్యోగార్థులు పూర్తిస్థాయిలో నచ్చిన ఉద్యోగం దొరికేలోపు.. కెరియర్‌లో చిన్న చిన్న గ్యాప్స్ వచ్చినవారూ ఇలా తాత్కాలిక ఉద్యోగాలవైపు చూస్తుంటారు. ఇది మంచి విషయమే, సమయాన్ని సద్వినియోగం చేసుకున్నట్టు అవుతుంది. కానీ ఈ ఉద్యోగాలను ఎంచుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తప్పనిసరి.

● ఇప్పుడు ఆన్‌లైన్ వర్క్స్ ఆఫర్ చేస్తున్న సంస్థల్లో మెజారిటీ ఫేక్ కంపెనీలున్నాయి. నమ్మశక్యం కాని జీతభత్యాలు ఇస్తామని మోసపూరిత ప్రకటనలు చేస్తుంటాయి. ఉద్యోగాల కోసం వెళ్లినవారి నుంచి డబ్బు వసూలు చేసి మొహం చాటేస్తుంటాయి. కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే వీటిని కనిపెట్టడం కొంత సులభమే. ఇలాగే మరికొన్ని కంపెనీలు ముందు కొన్నాళ్లు జీతాలు బాగానే ఇచ్చి.. తర్వాత మనం కొంత సమయం, డబ్బు వెచ్చించేలా చేసి ఆ తర్వాత మొండిచేయి చూపిస్తూ ఉంటాయి. ఏదేమైనా ఇంటర్వ్యూలు లేకుండా నేరుగా కొంత పేమెంట్ చేస్తే ఉద్యోగం ఇస్తాం అనే కంపెనీలను నమ్మడం అంత శ్రేయస్కరం కాదు.

● అలా అని వీటిలో కచ్చితమైన ఆఫర్లు లేవని కాదు. కొన్ని సంస్థలు నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు పేమెంట్లు చేస్తున్నాయి. కానీ ఇవి ఎటువంటి అర్హతలు లేకుండా ఉద్యోగులను తీసుకోవు. ముఖాముఖి ప్రక్రియ ఉంటుంది. రిజిస్ట్రేషన్ రుసుములని, డాక్యుమెంటేషన్ ఛార్జీలని వసూలు చేయవు. ఇలాంటి వాటిలో ఈ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు.

డేటా ఎంట్రీ

ఇప్పుడు కొన్ని స్టార్టప్ సంస్థలు డేటా ఎంట్రీ ఉద్యోగాలను ఆన్‌లైన్ ద్వారానే అభ్యర్థులకు అందిస్తున్నాయి. పూర్తిగా ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడం కంటే అవసరమైనప్పుడు ఆ పనులను తాత్కాలిక ఉద్యోగులకు అప్పగించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. వీటిలో ఉత్తమమైనవి ఎంచుకుని ప్రయత్నించవచ్చు.



కస్టమర్ సపోర్ట్

వినియోగదారుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, సమస్యలకు పరిష్కారం చూపడం, అవసరమైన మద్దతు అందించడం, ఈ-మెయిల్, చాట్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా సహాయసహకారాలు అందించడం ఈ రోల్ ప్రధాన ఉద్దేశం.

డిజిటల్ ప్రొడక్ట్స్ అమ్మకం

మ్యూజిక్, సాఫ్ట్‌వేర్స్, ఆన్‌లైన్ కోర్సులు, ఈ-బుక్స్, టెంప్లేట్స్, డిజిటల్ ఆర్ట్స్.. వంటివి అమ్మడాన్ని డిజిటల్ ప్రొడక్ట్ సేలింగ్ పిలుస్తున్నారు. దీన్ని నమ్మకమైన ఆదాయవనరుగా చెప్పవచ్చు. అయితే దీనికి సంబంధించి ఏదైనా కోర్సు చేయడం, సేల్స్‌లో అనుభవం సంపాదించడం తప్పనిసరి. ఈ రంగంలో నమ్మకమైన సంస్థలను ఆకర్షించవచ్చు.

కంటెంట్ రైటింగ్

ఏదైనా అంశానికి సంబంధించి కథనాలు, ఉత్పత్తి వివరాలు వంటివి చక్కని భాషలో ఆసక్తికరంగా రాయడం ద్వారా డబ్బు సంపాదించే వీలుంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్.. ఇలా ఏదైనా ఒక భాష మీద పట్టుంటే, దాన్నుంచి మిగతా భాషలకు ట్రాన్స్‌లేషన్ వర్క్స్ కూడా చేయవచ్చు. ఓటీటీలు పెరగడం, అంతా ఆన్‌లైన్ విపణి కావడం వల్ల భాష మీద పట్టు కూడా చక్కని కెరియర్ అవుతుంది.

● ఇవి మాత్రమే కాదు.. ఆన్‌లైన్ ద్వారా మరెన్నో తాత్కాలికంగా వర్క్స్ చేసే వీలుంటుంది. అయితే వీటిలో ఏవి నిజమైనవి అనేది చూసుకుని దరఖాస్తు చేసుకోవాలి. సంస్థ గత చరిత్ర పరిశీలించడం ద్వారా మన విలువైన సమయం వృథా కాకుండా ఉంటుంది.

● అలాగే ఏ రంగం ఎంచుకున్నా దానికి సంబంధించిన షార్ట్‌టర్మ్ కోర్సులు చేయడం ద్వారా కూడా నమ్మకమైన ఉద్యోగాలు పొందవచ్చు.

అఫిలియేట్ మార్కెటింగ్

ఏదైనా బ్రాండ్ ఉత్పత్తులను బ్లాగ్స్, యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రమోట్ చేయడాన్ని అఫిలియేట్ మార్కెటింగ్ అంటున్నారు. ఆన్‌లైన్ విక్రయ సంస్థలు అధికసంఖ్యలో పెరుగుతున్న ఈ తరుణంలో.. ఈ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. కొన్ని కంపెనీలు జీతాలు చెల్లిస్తుంటే, మరికొన్ని కమిషన్ ఆధారిత చెల్లింపులు చేస్తున్నాయి.

ఆన్‌లైన్ ట్యూటరింగ్

ఒకప్పుడు ఉన్నత విద్యార్థులు చుట్టుపక్కల ఉన్న పిల్లలను వరండాలోనో, డాబా మీదో కూర్చోబెట్టి ట్యూషన్లు చెప్పేవారు. ఇప్పుడు అదే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లోకి మారింది. ఇందుకోసం వివిధ సంస్థలు తమ సొంత వెబ్‌సైట్లను సైతం నడిపిస్తున్నాయి. వీటిలో టీచర్, ట్యూటర్‌గా నమోదు చేసుకుని తరగతులు చెప్పే వీలుంటుంది. అయితే అందుకు తగిన అర్హతలు ఉండటంతోపాటు, వారు విధించే నియమ నిబంధనలు పాటించాలి.

చదువు

■ e-mail: edc@eenadu.in

'ఆ కోర్సులో సీటు వస్తే చాలు.. ఇక ఆలోచించాల్సిన పనే ఉండదు. పూర్తయిన వెంటనే సులువుగా ఉద్యోగమూ సంపాదించొచ్చు. ఫలానా వర్సిటీలో సీటు సాధిస్తే వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరమే ఉండదు. క్యాంపస్ ఇంటర్వ్యూలో కొలువు గ్యారంటీ'. విద్యా సంవత్సరం ఆరంభంలో సాధారణంగా విద్యార్థుల ఆలోచనలు ఇలాగే సాగుతుంటాయి.

నచ్చిన కోర్సులో సీటు రాలేదా...

డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులు.. పేరున్న విద్యా సంస్థల్లో చేరడానికి పోటీపడే విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉంటారు. సీట్లు పరిమితంగానే ఉంటాయి. ఈ పోటీలో సీటు సాధించలేకపోతే ఒత్తిడికి గురవుతారు. ఇలాంటప్పుడు ప్లాన్-బీ సిద్ధంగా ఉంటే కంగారుపడకుండా కాస్త స్థిమితంగా ఉండగలుగుతారు.

◆ కోరుకున్న కోర్సులో సీటు రానప్పుడు ఆసక్తులకు అనుగుణంగానూ మరో కోర్సును ఎంచుకోవచ్చు. అప్పుడు కష్టపడి చదువుతున్నామన్న ఆలోచనే రాదు. ఎంతో ఇష్టంగా కోర్సును పూర్తి చేయగలుగుతారు.

◆ కోరుకున్న కోర్సు లేదా కాలేజీలో సీటు రాకపోవడాన్ని తీవ్రమైన సమస్యగా, వైఫల్యంగా భావించకూడదు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మరింత ఎక్కువగా కృషిచేయాలి. పేరున్న కాలేజీలో చదివారని ఎవరూ పిలిచి మరీ ఉద్యోగం ఇవ్వరు కదా. ఎక్కడ చదివినా అవకాశాలను ఎలా అందిపుచ్చుకుంటారనే దాని మీదే అసలైన విజయం ఆధారపడి ఉంటుంది.

◆ ఏ కాలేజీలో చదివారు అనే దాని కంటే ఏం నేర్చుకున్నారనేదే ప్రధానం. అందుకు ముందుగా కావలసింది తపన. ఇది ఉంటే కొత్త విషయాలేమైనా వాయిదాలు వేయకుండా ఆసక్తిగా నేర్చుకోగలుగుతారు.

◆ కోర్సు పూర్తయిన వెంటనే కొలువు సంపాదించాలంటే.. విద్యార్హతలు మాత్రమే సరిపోవు. అదనంగా కొన్ని నైపుణ్యాలూ అవసరం అవుతాయి. కోర్సు పూర్తిచేసిన వారందరి విద్యార్హతలు సాధారణంగా ఒకే విధంగా ఉంటాయి. అలాంటప్పుడు అదనపు నైపుణ్యాలను అలవరుచుకుంటే ఇతరుల కంటే మెరుగ్గా ఉండగలుగుతారు. కాబట్టి ఒకపక్క చదువుకుంటూనే ఆ దిశగానూ ప్రయత్నాలను ప్రారంభించాలి.

వర్క్ ఫ్రమ్ హోమ్

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: సెట్‌గో కిచెన్స్ అండ్ కన్సల్టింగ్ ప్రై.లి. నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,000-1,100
☛ https://shorturl.at/Vk32p

యూఐ డిజైనర్

సంస్థ: క్రియేటివైజ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఎక్స్‌డీ, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.12,000-40,000
☛ https://shorturl.at/0OVHk

ఇంటర్న్‌షిప్స్

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.2,000
☛ https://shorturl.at/zQdyx

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సంస్థ: వెరిలింక్ నైపుణ్యాలు: సీఎస్ఎస్, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, నోడ్.జేఎస్, రియాక్ట్
స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/uFF0P

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 8

తాజా ఉద్యోగ నోటిఫికేషన్లు, ఇంటర్న్‌షిప్పుల కోసం https://epaper.eenadu.net చూడండి.

ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ 1,010 యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. **వ్యవధి:** టెన్త్, ఇంటర్ ఫ్రెషర్స్‌కు రెండేళ్లు, ఐటీఐ పూర్తి చేసినవారికి ఏడాది.
అర్హత: ట్రేడును అనుసరించి కనీసం 50% మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ, పన్నెండో తరగతి (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ).
వయసు (11.08.2025 నాటికి): ఐటీఐ చదివితే 15- 24 ఏళ్ల మధ్య, ఐటీఐ లేకపోతే 15- 22 ఏళ్ల మధ్య ఉండాలి.
స్టైపెండ్: నెలకు రూ.6000 నుంచి రూ.7000.
దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.08.2025.
వెబ్‌సైట్: https://icf.indianrailways.gov.in/

ఫార్మా-డీతో ఏ అవకాశాలు?

ఆరేళ్ల ఫార్మా-డీ కోర్సు చేస్తే.. ప్రభుత్వ/ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - ఎ.శ్రీనివాసరావు

■ ఆరేళ్ల ఫార్మా-డీ డిగ్రీ పూర్తి చేసినవారికి విభిన్న కెరియర్ మార్గాలున్నాయి. క్లినికల్ ఫార్మసీ, రెగ్యులేటరీ, మెడికల్ రైటింగ్, ఫార్మాకోవిజిలెన్స్, హాస్పిటల్ ఫార్మసీ సేవల రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఫార్మా-డీ విద్యార్హతతో భారతీయ రైల్వే, సీజీహెచ్ఎస్, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రయత్నాలు చేయవచ్చు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్/ స్టేట్ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రజారోగ్య కేంద్రాల్లో క్లినికల్ ఫార్మసిస్టులు, జాతీయ ఔషధ భద్రతా కార్యక్రమాల్లో ఫార్మాకోవిజిలెన్స్ అధికారులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ లాంటి సంస్థల్లో రిసెర్చ్ అసోసియేట్స్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాలలు/ వైద్య విశ్వవిద్యాలయాల్లో బోధన ఉద్యోగాలు ఉంటాయి. ప్రైవేటు రంగంలో- క్లినికల్ ఫార్మసీ నుంచి కార్పొరేట్ ఫార్మాస్యూటికల్ వరకూ వివిధ ఉద్యోగాల కోసం ప్రయత్నించవచ్చు. క్లినికల్ ఫార్మసీ విభాగాలు, మెడికల్ రైటింగ్ సంస్థలు, ఫార్మాకోవిజిలెన్స్ కేంద్రాల్లో, క్లినికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్స్, ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు దొరుకుతాయి. ప్రభుత్వ ఆరోగ్య మిషన్లలో నియామకాలు జరిగే అవకాశం ఉంది. ఫార్మా ఆంత్రప్రెన్యూర్‌గా సొంత ఫార్మసీ, కౌన్సెలింగ్ సెంటర్లు మొదలుపెట్టవచ్చు. ఫార్మా-డీ పట్టభద్రులు పరిశోధన, ప్రజారోగ్య పాలసీల రూపకల్పనలో భాగస్వాములు కావచ్చు. ఈ కోర్సు పూర్తి చేసినవారికి విదేశాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువే.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

గణపతి ఆలయాల్లో పూజలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సంకష్ట హర చతుర్థి సందర్భంగా గణపతి ఆలయాల్లో విశేష పూజలు సోమవారం నిర్వహించారు. గునుపూడి విద్యా గణపతి ఆలయంలో స్వామివారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, సాయంత్రం గణపతి హోమం, రాత్రి విశేష పుష్పాలంకరణ సహస్ర నామ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి శాకంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొత్త బస్టాండ్ వెనుక ఉన్న వరసిద్ధి వినాయక ఆలయం, పశువుల ఆసుపత్రి వెనుక ఉన్న గణపతి ఆలయాల్లో స్వామివారికి విశేష పూజలు, అలంకరణలు నిర్వహించినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

భగవద్గీతపై ప్రచారం.. **భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే:** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు సోమవారం భీమవరం మండలం శివన్నారాయణపురం, బాబాయ్‌తిప్ప గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, నాగేశ్వరరావు, వాసుదేవ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుల హర్షం

ఆకివీడు, ఉండి, న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు నియమితులు కావడంపై సోమవారం రాత్రి ఆకివీడు తెదేపా కార్యాలయంలో నాయకులు సంబరాలు చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ★ గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానాన్ని కల్పించాయని ఉండి డీసీ వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు అన్నారు. ఉండిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ప్రధానోపాధ్యాయుడి మృతి బాధాకరం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్ఎల్‌డీటీ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా హాజరైన అరట్లకట్ట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.ఆర్. మూర్తిరాజు మరణించడం బాధాకరమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ అన్నారు. అనారోగ్య కారణం చూపినప్పటికీ హాజరుకావాలని ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. * నల్లజర్లలో జరుగుతున్న ఎస్ఎల్‌డీటీ తరగతుల్లో ఎస్.వి.ఆర్ మూర్తిరాజు గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. శిక్షణలు అంటూ ఉపాధ్యాయుల ప్రాణాలతో చెలగాటం తగదన్నారు.

భవనాలిలా.. సేవలెలా?

పాలకోడేరు, ఉండి, భీమవరం అర్బన్, ఆకివీడు, న్యూస్‌టుడే: రైతుల సౌకర్యార్థం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రైతు సేవా కేంద్ర భవన నిర్మాణాలు నిధుల లేమితో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో 86 చోట్ల ఆర్ఎస్‌కే భవనాలు మంజూరు చేశారు. వాటిలో 48 భవనాల నిర్మాణం పూర్తిచేయగా.. 40 చోట్ల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు మండలాల్లో సుమారు 20 భవనాలు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి. 15 చోట్ల మధ్యలోనే ఆగిపోయాయి. పాలకోడేరు మండలం మోగల్లులో పేదల కాలనీలో భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. పాలకోడేరు గ్రామ సచివాలయం-2 పరిధిలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించినా కార్యకలాపాలు మాత్రం నిర్వహించడం లేదు. ఉండి మండలంలో ఉండి, చిలుకూరు, పాములపర్రు, పాందువ్వ, కలిసిపూడి, యండగండి, ఉణుదుర్రులో నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.

ఉండి మండలం యండగండిలో సుమారు రెండేళ్ల కిందట రైతుసేవా కేంద్ర భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఇనుప ఊచలు తుప్పుపట్టి దెబ్బతింటున్నాయి. పలుచోట్ల పునాది కూడా ధ్వంసమైంది. సిబ్బంది స్థానిక గ్రామ సచివాలయం భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

పాలకోడేరు మండలం వేంద్రలో గత ప్రభుత్వ హయాంలో రూ.16 లక్షలతో చేపట్టిన రైతు సేవాకేంద్ర భవనం ఇది. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో సిబ్బంది ఒక పాత భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాకాలంలో శ్లాబు నుంచి నీరు లీకై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతుల ఇక్కట్లు.. కొత్త భవనాలు అందుబాటులో లేని చోట్ల పాతవి, గ్రామ సచివాలయ భవనాల్లో ఇరుకు గదుల్లో వ్యవసాయ సహాయకులు విధులు నిర్వహిస్తున్నారు. కుర్చోవడానికి చోటు కూడా లేకపోవడంతో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు.

సిబ్బందితో మాట్లాడుతున్న నవనీత్

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య కార్యకర్తలు చర్యలు తీసుకోవాలని కొణితివాడ పీహెచ్‌సీ వైద్యుడు యు.నవనీత్ అన్నారు. పీహెచ్‌సీలో సోమవారం ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కొల్లపర్రు (ఆకివీడు), న్యూస్‌టుడే: సిద్ధాపురం ఫీడరు విద్యుత్తు లైన్లలో చెట్టు కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొల్లపర్రు, రాజులపేట గ్రామాలు, ఆక్వా పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పెదగరువు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ ఫీడర్లకు ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదగరువు, రాజులగరువు, వెంప, శ్రీరాంపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆ ప్రాంతాల్లోని ఆక్వా చెరువులకు సరఫరా ఉండదని వివరించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం ఎస్సీ బోస్ కాలనీ విద్యుత్తు ఉప కేంద్రంలో 11 కేవీ లైన్ల ఏర్పాటు నిమిత్తం మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బోసుకాలనీ, కలవపూడి, మోడీ, మాలవానితిప్ప, గోగుతిప్ప, మేకలదిబ్బ, ఆనందపురం, ఇసుక లంక, గూట్లపాడు పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

పశుగ్రాసాల సాగుకు రాయితీ

పాలకోడేరు, న్యూస్‌టుడే: నూరు శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న బహు వార్షిక పశుగ్రాసాల సాగును పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు పశువైద్యాధికారిణి టి.హేమ సూచించారు. చిన్న, సన్నకారు రైతులు 10 సెంట్ల భూమి నుంచి 50 సెంట్లలో సాగు చేసుకోవచ్చని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు సుమారు రూ.6,600 నుంచి రూ.33 వేల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

చంద్రబాబుతోనే స్వచ్ఛమైన పాలన

ప్రజలతో మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వరరాజు

ఉండి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోనే కూటమి ప్రభుత్వం స్వచ్ఛమైన పాలన అందిస్తోందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు తెలిపారు. వెలివర్రు గ్రామ తెదేపా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి సత్యనారాయణ, ఉప సర్పంచి ముదునూరి శ్రీనివాసరాజు, మాజీ వైస్ ఎంపీపీ వర్రే సముద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బీమా పథకం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులకు పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని భీమవరం మండల వ్యవసాయాధికారి ప్రసాద్ తెలిపారు. రూ.210 చెల్లించి ఆ పథకాన్ని పొందవచ్చని వెల్లడించారు. ఆగస్టు 15 లోగా అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు.

నిందితుడి అరెస్టు

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో ఆదివారం యువతిపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటనలో పాములపర్రుకు చెందిన రాజేశ్‌ను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. నిందితుడ్ని భీమవరం కోర్టులో సోమవారం హాజరుపరిచామని వివరించారు.

జూద శిబిరంపై దాడి

యండగండి(ఉండి), న్యూస్‌టుడే: యండగండిలోని బహిరంగ ప్రదేశంలో జూదమాడుతున్నారనే సమాచారంతో ఎస్సై నసీరుల్లా ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దాడి చేశారు. అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,200 స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

'మాటలతో మోసం'

కాళ్ల, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం మాటలతో ప్రజలను మోసం చేసిందని ఉండి వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్.నరసింహరాజు అన్నారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న నిర్వహించనున్న 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యాన్ ఢీకొని పాస్టర్‌కు గాయాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు శివారు గరగపర్రు వద్ద వ్యాన్ ఢీకొని పాస్టర్‌కు గాయాలైన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం మండల కాశిపాడుకు చెందిన పాస్టర్ ఇసుకపాటి సువర్ణరాజు భీమవరంలో సువార్త ప్రకటన పూర్తిచేసుకుని ఇంటికొస్తుండగా మార్గం మధ్యలో టాటా వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సువర్ణరాజును 108 వాహనంలో భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు భార్య రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వియర్‌కు అడ్డుకట్ట వేసిన వర్షాలు..!

✧ మరోసారి ఆగిన నిర్మాణం ✧ పాత కట్టడం శిథిలంతో అన్నదాతల్లో కలవరం

ఉండి, న్యూస్‌టుడే: యండగండి సర్‌ప్లస్ వియర్ నిర్మాణానికి మరోసారి అడ్డుకట్ట పడింది. వర్షాల నేపథ్యంలో పనులకు తాత్కాలిక విరామం ఇచ్చారు. నవంబరు తర్వాతే పునఃప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. వర్షాకాలం కావడంతో వరదలొస్తే ఎలా అని ప్రజలు, అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.

ఈ చిత్రంలో కనిపిస్తుంది యండగండిలోని సర్‌ప్లస్ వియర్. పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరింది. ఆధునికీకరణ పనుల్లో పునర్నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.10 కోట్లతో అంచనాలు వేశారు. కానీ ప్రతిపాదనలోనే మిగిలిపోయాయి.

వైకాపా ప్రభుత్వం గాలికొదిలేయడమే..!

జల వనరుల శాఖ చేసిన పనులకు బిల్లులిచ్చేందుకు గత ప్రభుత్వానికి చేతులు రాలేదు. దీంతో సాగు, మురుగు కాలువల సమస్యలు నేడు పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. యనమదుర్రు డ్రెయిన్, ఉండి ప్రధాన కాలువలోకి వరద వచ్చినప్పుడు ఉండి, గణపవరం, పాలకోడేరు, కాళ్ల, భీమవరం తదితర మండలాల్లోని గ్రామాల్లో ఉన్న పంటలు, నివాసాలకు ముంపు బెడద పొంచి ఉంది. దీంతో మైప వెళ్లే మార్గంలో యండగండి సర్‌ప్లస్ వియర్ నిర్మాణానికి మూడేళ్ల కిందట పునాది వేశారు. రూ.80 లక్షల బిల్లు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు చెల్లించి నిలిచిపోయిన పనులను ప్రారంభించింది. కానీ అధిక వర్షాల కారణంగా సుమారు 70 శాతం పూర్తయిన వియర్ పనులు ఆగిపోయాయని, వచ్చే ఏడాది మార్చి కల్లా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని జల వనరుల శాఖ ఏఈ ప్రసాదరాజు తెలిపారు.

ఇది నిర్మాణంలోని సర్‌ప్లస్ వియర్. పునాదులు వేసి మూడేళ్లైంది. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు సకాలంలో పూర్తి కాలేదు.

శిక్షణ పూర్తి చేసుకున్న బీఎల్వోలు

ఓటు విలువ తెలియజేయండి

ఉండి, న్యూస్‌టుడే: అర్హులందరికీ ఓటు విలువ తెలియజేయాలని తహసీల్దార్ కె.నాగార్జున తెలిపారు. ఉండి ప్రభుత్వ ఐటీఐలో బీఎల్వోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. నాలుగు మండలాల్లో 238 మంది బీఎల్వోలకు 230 మంది శిక్షణ తరగతులకు హాజరయ్యారని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్ తెలిపారు. శిక్షణ అనంతరం వారికి పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలు అందజేశామని ఆయన వివరించారు.

ఏఎంసీ ఛైర్మన్ పదవి ఎస్టీలకు ఇవ్వాలి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భీమవరం ఏఎంసీ ఛైర్మన్ పదవిని ఎస్టీలకు కేటాయించాలని ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సంచార జాతుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పెంట్ర వీరన్న ఆధ్వర్యంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

(c) eenadu

దివ్యాంగుల కోసం 21న శిబిరం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాలు ఇచ్చేందుకు ఈ నెల 21న పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద అర్హత నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.కృష్ణమోహన్ తెలిపారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు చెందిన దివ్యాంగులు ఆధార్ కార్డు, సదరం ధ్రువపత్రం, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

విద్యుత్తు ఈఈగా ఉద్యోగోన్నతి

నరసాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు పంపిణీ సంస్థ నరసాపురం డీఈ పి.ఓంకార్ ఈఈగా ఉద్యోగోన్నతి పొందారు. విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్టు ఈఈగా ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మరో నాలుగు రోజుల్లో ఇక్కడి నుంచి రిలీవ్ అవుతారని అధికారులు తెలిపారు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

స్వమిత్వ సర్వేకు సన్నాహాలు

పోడూరు, న్యూస్‌టుడే: స్వమిత్వ సర్వే ద్వారా రైతుల భూములతో పాటు ఇంటి స్థలాలు, ఖాళీ జాగాలను గుర్తించి అసెస్‌మెంట్లు రూపొందించేందుకు పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి పన్నులను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా ఇంటిని ఎన్ని గజాల్లో నిర్మించారు, దస్తావేజు, ఇంటిపన్ను ఒకరి పేరు మీదే ఉన్నాయా, లేదా అనే వివరాలను సేకరిస్తున్నారు. పోడూరు మండలంలోని 16 గ్రామాల్లో 15,896 గృహాలున్నాయి. దాదాపు 22 వేల కుటుంబాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వమిత్వ సర్వేలో ఇంటితో పాటు ఖాళీ స్థలాలను కూడా సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తారు. దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని.. త్వరలో గ్రామ సభలు నిర్వహించి సర్వే ప్రారంభిస్తామని డిప్యూటీ ఎంపీడీవో కేఎం వైభవతి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
నరసాపురం:80085 74504
పాలకొల్లు :80085 74510
ఆచంట :91212 29087

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? గాంధీబొమ్మ కూడలి నుంచి వడయార్ పేట మీదుగా 216 జాతీయ రహదారి వరకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. - ఎన్.ముత్యాలరావు, మొగల్తూరు

✔ వెంటనే మరమ్మతులు చేయిస్తాం. - ముచ్చర్ల శ్రీను, పంచాయతీ కార్యదర్శి

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? ఫ్లోస్‌పేటవారి వీధిలో గాయత్రి గ్యాస్ ఏజెన్సీ సమీపాన చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. - కె. నారాయణరావు, నరసాపురం

✔ చెత్త తొలగిస్తాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

? ఫుకీర్లవారి వీధిలో డ్రెయిన్ వ్యర్థాలను సక్రమంగా తొలగించడం లేదు. మురుగు నిలిచిపోతోంది. - పి. సూరిబాబు, నరసాపురం

✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - వి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నరసాపురం, న్యూస్‌టుడే: ? రాయపేట ప్రాంతంలో డ్రెయిన్ ప్రక్షాళన సక్రమంగా జరగడం లేదు. సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - శ్రీమన్నారాయణ, రాయపేట

✔ పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - ఎం.అంజయ్య, కమిషనర్

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? లంకలకోడేరు పరిధి వెదుళ్ల పాలెంలో ప్రాథమిక పాఠశాల వద్ద డ్రెయిన్ వ్యర్థాలతో పూడిపోయింది. దుర్వాసన భరించలేకపోతున్నాం. - సురేశ్, స్థానికుడు

✔ పరిశీలించి వ్యర్థాలు తొలగిస్తాం. - అజయ్, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు సంతసం

పొదలు, వ్యర్థాల తొలగింపు.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రు గ్రామ సచివాలయం సమీపాన విద్యుత్తు పరివర్తకం చుట్టూ పొదలు పెరిగి ప్రమాదకరంగా మారిన తీరుపై 'కమ్మేసిన తుప్పలు.. తప్పని తిప్పలు' శీర్షికతో ఈ నెల 13న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఏఈఈ కొల్లి సుధాకర్ స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆభరణాల దుకాణాల వీధిలో చెత్త సమస్యపై ఈ నెల 13న 'ఈనాడు- మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

ఇలా వదిలేస్తే.. వైద్యమెలా!

కొలిక్కిరాని ఆయుష్మాన్ కేంద్రాల నిర్మాణాలు

మొగల్తూరు, పెనుమంట్ర, పెనుగొండ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పలు చోట్ల అసంపూర్తిగా నిలిచాయి. నిర్మాణం పూర్తయిన భవనాల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు లేకపోవడంతో సిహెచ్‌వోలు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

శేరేపాలెంలో అసంపూర్తి భవనం

ఇదీ పరిస్థితి.. నరసాపురం డివిజన్ పరిధిలోని మొగల్తూరు మండలంలోని శేరేపాలెంలో భవన నిర్మాణం చేపట్టగా.. బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. గ్రామంలో కేటాయించిన ఇరుకు భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ముత్యాలపల్లిలోనూ అదే పరిస్థితి నెలకొంది. ● పెనుమంట్ర మండలం పొలమూరులో భవన నిర్మాణం మధ్యలోనే నిలిచింది. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న పశువైద్యశాలలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. పెనుగొండ మండలం వడలిలో ఆయుష్మాన్ కేంద్రం నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఏళ్ల తరబడి వీటిని అసంపూర్తిగా వదిలేయడంతో ఇప్పటికే చేసిన నిర్మాణాలు క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సౌకర్యాల లేమి.. నిర్మాణం పూర్తయిన కేంద్రాల్లో తగిన సదుపాయాలు లేవు. గత ప్రభుత్వం ఈ కేంద్రాల్లో సింగిల్ బెడ్ సదుపాయం కల్పిస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. పలు కేంద్రాల్లో నీటి సదుపాయం, అంతర్జాల కనెక్షన్లు లేవు. ఈ-సంజీవనిలో భాగంగా ప్రజలకు టెలిమెడిసిన్ వైద్యసేవల కోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల చరవాణి నెట్ వినియోగిస్తున్నారు.

క్షీరారామంలో సప్త ప్రదక్షిణలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం అభిషేకాలు చేసి స్వామిని నాగాభరణం, పుష్పాలు, రుద్రాక్షలతో అలంకరించారు. రాత్రి స్వామికి పంచాహారతులు ఇచ్చారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మాడవీధుల్లో సప్త సోమవార ప్రదక్షిణలు చేశారు.

గణనాథునికి లక్ష గరిక పూజ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి సందర్భంగా పలు ప్రాంతాల్లో గణపతి ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. సిద్ధాంతం గ్రామంలోని పురాతన ఆలయంలో గణనాథునికి లక్ష గరిక పూజ, లక్ష్మీ గణపతి హోమాలను వైభవంగా నిర్వహించారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగలోని శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో కొలువైన వినాయక స్వామికి విశేష అభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు.

పెనుమంట్రలో..

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని వనువులమ్మ ఆలయ ప్రాంగణంలో కొలువైన బాలగణపతిని ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని సంపత్ వినాయక ఆలయంలో, కామాక్షిదేవి ఆలయ ప్రాంగణంలో కొలువైన విజయ గణపతికి అర్చనలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు.

నేత్రపర్వం.. శాకంబరి ఉత్సవం

మార్టేరు, న్యూస్‌టుడే: వెలగలేరులోని శ్రీ పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాకంబరి ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో స్వామి, అమ్మవార్లను, ఉపాలయాల్లో ఉన్న మూలవిరాట్‌లను అలంకరించారు.

పరమేశ్వరుడికి మహా రుద్రాభిషేకం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంటలో నిర్వహిస్తున్న చండీ సహిత మహారుద్ర యాగోత్సవంలో భాగంగా సోమవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. పరమేశ్వరుడికి మహారుద్రాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి శివ కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించగా.. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తిలకించారు. మరో మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

శివ కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 లక్షల విలువైన చెక్కులను ఆయన తన కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, నాయకులు పెచ్చెటి బాబు, జీవీ, మండాది అవినాశ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న మంత్రి నిమ్మల

యలమంచిలి, న్యూస్‌టుడే: పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలంతా ఏకపక్షంగా ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం ఆర్యపేటలో ఆయన సోమవారం పర్యటించారు. రూ. 86 లక్షల విలువైన జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపనలు చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో ప్రజలను కలిసి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. తెదేపా మండలాధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, ఉపాధ్యక్షుడు తమ్మినీడి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి బొప్పన హరికిశోర్, నాయకులు తాడి శశిధర్, బోనం నాని పాల్గొన్నారు.

నరసాపురం, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా జగన్నాథపురం పంచాయతీ పరిధి దారతిప్ప, కాలువమొగ, మత్స్యగడ గ్రామాల్లో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, నాయకులు సోమవారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం నార్త్‌లోని శివాలయం ప్రాంగణంలో 'తల్లి పేరిట ఓ మొక్క' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కొప్పర్తి నరేంద్ర ఆధ్వర్యంలో భాజపా నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీశ్, నాయకులు మొక్కలు నాటారు.

ఆలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న నాయకులు

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందే అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని ఆర్డీవో దాసి రాజు అధికారులకు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 57 మంది వినతులు అందించారని కార్యాలయ జూనియర్ అసిస్టెంటు బి.సురేఖ తెలిపారు. సర్వే చేయించి తన భూమికి హద్దులు నిర్ణయించాలని కవిటం గ్రామానికి చెందిన ద్వారంపూడి తారకరామకృష్ణారావు వినతిపత్రం అందించారు. ఇంటి స్థలం మంజూరు చేయించాలని మొగల్తూరుకు చెందిన బొక్కా నిర్మలదేవి, తన భర్త మరణించాక ఆయన సోదరి ఆస్తులు కాజేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని నరసాపురానికి చెందిన భాగ్యవతి ఫిర్యాదు చేశారు. తనకు చెందిన 30సెంట్ల భూమి వివరాలను అంతర్జాలంలో నమోదు చేయించాలని శివదేవుని చిక్కాలకు చెందిన పెన్మత్స నీలిమ వినతిపత్రం ఇచ్చారు. ● పట్టణంలోని ఎస్డీపీవో కార్యాలయంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యాలయంలో మూడు ఫిర్యాదులు అందాయని డీఎస్పీ జి. శ్రీవేద అరవింద తెలిపారు.

ప్రజల సమస్య తెలుసుకుంటున్న ఆర్డీవో రాజు

జడ్పీ సీఈవో పరిశీలన

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పొలమూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద స్థలాన్ని జడ్పీ సీఈవో శ్రీహరి సోమవారం పరిశీలించారు. విద్యార్థుల అవసరాల రీత్యా గతంలో స్థానిక రైతు టి.సత్యనారాయణ నుంచి కొంత భూమి తీసుకుని.. పాఠశాలకు చెందిన స్థలాన్ని ఆయనకు కేటాయించారు. కానీ దానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సదరు రైతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆయన ఉన్నతాధికారుల ఆశ్రయించారు. వారి ఆదేశాల మేరకు సీఈవో ఆ స్థలాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: నరసాపురం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సోమవారం నిర్వహించారు. డీఎస్పీ శ్రీవేద ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ పరీక్షలను వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలకొల్లు, నరసాపురం సీఐలు కె. రజనీకుమార్, జి.శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ఎస్సైలు జి.పృథ్వీ, బి. సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీవేద

వరించిన పదవులు!

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

మార్టేరు, న్యూస్‌టుడే: పలు సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆచంట నియోజకవర్గ పరిధిలో 17 సొసైటీలకు కమిటీలను నియమించడంతో కూటమి శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. సొసైటీల వారీగా ఛైర్మన్, సభ్యుల వివరాలు ఇవీ..

సంఘం	ఛైర్మన్	సభ్యులు
వడలి	కట్టా వెంకటరామకృష్ణ	వై.గోపాల మధుసూదనరావు, పిల్లి శ్రీనివాస్
ములపర్రు	గుత్తుల లోకేశ్వరరావు	యు.వెంకటేశ్వరరావు, నెక్కంటి భాస్కరరావు
నడిపూడి	మన్నెం సత్య జగదీశ్	వి.వెంకటరావు, జి.సోమశేఖర్
పెనుగొండ	నక్కా వేదవ్యాసశాస్త్రి	వేండ్ర మురళీ, కేవీ సత్యనారాయణ
మునమర్రు	వై.ఎస్ఆర్‌కేపీ పార్థసారథి	నూకల రాఘవస్వామి, పిల్లి శ్రీనివాస్
జుత్తిగ	వీరవల్లి రాంబాబు	గుత్తుల శ్రీను, పి.వెంకటరెడ్డి
మాముడూరు	బైరశెట్టి దుర్గారావు	దేవ త్రిమూర్తులు, దారపురెడ్డి కృష్ణ
ఎస్ఐ.పర్రు	ఎన్. సత్యనారాయణరాజు	వెలగల ప్రభాకర్‌రెడ్డి, వనుం వెంకట శ్రీనివాస్
పొలమూరు	కండిబోయిన శ్రీనివాస్	పసుపులేటి నాగధనలక్ష్మి, చీపురుపల్లి ఆంజనేయులు
ఆలమూరు	కె. నాగవెంకట పోతురాజు	కడలి ఏడుకొండలు, పెన్మెత్స రాఘవరాజు
సత్యవరం	ఎం. నాగవెంకట శ్రీరాములు	దిగమర్తి వేణు, కట్టా సత్యనారాయణ
కొయ్యేటిపాడు	పాలా భోగేశ్వరరావు	సత్తి భీమారెడ్డి, పమ్మి సంజీవరావు
ఆచంట	కడలి భాస్కరరావు	బి.శ్రీరామ్మూర్తి, టి.ప్రసాద్
ఎ.వేమవరం	నెక్కంటి వీవీ సత్యనారాయణ	సిర్రా అమర్‌కుమార్, జక్కంశెట్టి శ్రీనివాసు
కొడమంచిలి	సి.శ్రీను	ఎస్.వెంకటనారాయణ, పి.శ్రీనివాసు
వేడంగిపాలెం	ఎం.వీరవెంకట సత్యనారాయణ	ఎల్.రవీంద్రప్రసాద్, గుడాల శివప్రసాద్
పోడూరు	దొమ్మేటి పురుషోత్తముడు	టీవీ వెంకట నారాయణ, ఎ.శ్రీనివాసరాజు

ఆందోళన వద్దు.. న్యాయం చేస్తాం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్రలోని ప్రాథమిక (ఎల్ఈ)పాఠశాల విలీనం అంశంలో న్యాయం చేస్తామని.. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తణుకు డీవైఈవో సత్యనారాయణ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఈ పాఠశాల విలీనాన్ని నిరసిస్తూ సర్పంచి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టారు. సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో డీవైఈవో మాట్లాడారు. సర్పంచి తాడిపర్తి ప్రియాంక మాట్లాడుతూ ఎంఈవో కావాలనే నకిలీ సంతకాలతో తీర్మానం రూపొందించి ప్రభుత్వాన్ని పక్కదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని సౌకర్యాల ఉన్న ఈ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. తల్లిదండ్రుల కమిటీ ఛైర్‌పర్సన్ రేవతి పలు అంశాలను డీవైఈవో దృష్టికి తీసుకెళ్లారు.

దారి దిగబడి.. ప్రయాణం తడబడి

బ్రాహ్మణచెర్వు- చెన్నాడ చెర్వు ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. కొత్త కాలనీ సమీపాన సీసీరోడ్డు నెర్రలుతీసి దిగబడిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చెన్నాడచెర్వు వరకు ఎక్కడిక్కడే రాళ్లు తేలాయి. ఈ మార్గంలో పొలమూరు, నాగళ్లమెరక, బ్రాహ్మణచెర్వు, నేలపోగులు వాసులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. కొన్నేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో నెట్టుకొస్తుండంతో రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఏఈ యశ్వంత్ స్పందిస్తూ రహదారి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, పెనుమంట్ర

మార్గంలో ముప్పు!

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే స్టీమర్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంత పాదచారులు, వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. దీని వల్ల రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని.. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పురపాలక కమిషనర్, ఎం. అంజయ్య దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

'ఉద్యోగుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు'

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేస్తే.. ఎలాంటి చర్యలు చేపట్టకుండానే పరిష్కరించినట్లు చూపుతున్నారని యర్రంశెట్టిపాలెం మాజీ సర్పంచి కూనపరెడ్డి విజయరంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలలుగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల చుట్టూ తిరుగుతూ తన సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు, ఉద్యోగుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు.

కనికరిస్తేనే.. కష్టం తీరేది!

రుస్తుంబాద (నరసాపురం), న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సిబ్బంది తమ సమస్యల పరిష్కారంపై ఆసక్తి చూపడం లేదని.. గ్రామ, మండల స్థాయి కార్యాలయాల్లో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో డివిజన్, జిల్లా కార్యాలయాల వరకు రావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నరసాపరరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన పలువురు తమ సమస్యలను 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వివరాలు ఇవీ..

పథకాలు నిలిపేశారు..



మా ఇంటి అవసరాలకు నెలకు 100 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగిస్తాం. నా ఆధార్‌కార్డుకు మరొకరి విద్యుత్తు సర్వీసును అనుసంధానం చేశారు. దానికి రూ.వేలల్లో విద్యుత్తు బిల్లు వస్తుంది. దీంతో అమ్మఒడి, ఇతర పథకాలను నిలిపేశారు. నెల రోజులుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం లేదు.

- వంగలపూడి రవి, లిఖితపూడి

అక్రమంగా ఆక్వాసాగు

నాకు 2.70 ఎకరాల పొలం ఉంది. దానికి ఆనుకుని ఉన్న భూమిలో రైతు అనుమతి లేకుండా ఆక్వాసాగు చేస్తున్నారు. ఆ చెరువు నుంచి వచ్చే ఊటనీరు ప్రభావంతో నా పొలంలో వరి సాగుకు నష్టం వాటిల్లుతోంది. సుమారు పన్నెండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఈ సమస్యను పరిష్కరించలేదు.

- శీలబోయిన నరసింహారావు, గొంది

కుమారుడు పట్టించుకోవడం లేదు..

నేను దివ్యాంగుడిని. మూడు చక్రాల బండిపై తినుబండారాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నా. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సుమారు రూ.40 లక్షల విలువైన 30 సెంట్ల మెరక స్థలాన్ని, ఇంటిని కుమారుడు సత్యనారాయణ పేరిట గతంలో రిజిస్ట్రేషన్ చేయించాము. అతడు మా బాగోగులు చూడటం లేదు. గతంలో కొంత స్థలం విక్రయించాడు. ఇప్పుడు మేం ఉంటున్న ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

- యడ్లపల్లి మల్లేశ్వరరావు, యడ్లపల్లివారిమెరక

పడిపోయినవి

రామాని నరసింహస్వామి S/o రామచంద్రరావు అను నేను తెలియజేయునది ది. 11-07-2025న నరసాపురంలో ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ సేల్‌డీడ్ No: 2540/2008 Dt: 21-07-2008 SRO భీమవరం పడిపోయినవి. కావున దొరికినవారు తెలియజేయగలరు.

రామాని నరసింహస్వామి
S/o రామచంద్రరావు, D.No: 2-2-20/3
పొన్నపల్లి, నరసాపురం. Cell: 97040 49899

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
IA No. 1709/2024 in
O.S.No. 32/2021

Between:
పిటీషనర్లు/వాదులు:
నామన లక్ష్మి కుసుమేశ్వరి వగైరా
And
రెస్పాండెంట్లు/ప్రతివాదులు:
అధికారి అనంత దుర్గసమయ్ వగైరాలు

Proposed Party:
Adabala Mahesh Kumar, S/o. Parthasaradhi Naidu, R/o. Door No. 17-1-154/3, Gogulamma Temple Street, Narsapur, W.G.Dt.

యీ నెంబరు order/rule 10 పిటీషనులో Proposed party (R4)కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను అతను తీసుకొనక పిటీషనర్లును చిక్కులు పెట్టవలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున అతనికి నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substituted Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై Proposed party హాజరు నిమిత్తము ది. 6-8-2025 సం॥ తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదాకు సదరు Proposed party స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10 గంటలకు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

సం/- ఎన్.ఆనంద చక్రవర్తి
బి.కాం. బి.ఎల్
అడ్వకేట్, నరసాపురం,
సెల్: 98491 45267
నరసాపురం
8-7-2025

చేతిరాత సరిగా లేదని దండన

ప్రైవేటు పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: చేతిరాత సరిగా లేదనే కారణంతో ఇద్దరు చిన్నారులను ఉపాధ్యాయిని దండించారంటూ పాలకొల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో గత బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో యూకేజీ విద్యార్థులు ఇద్దరు సక్రమంగా రాయలేకపోయారంటూ దండించడంతో పాటు వారిని సూదితో గుచ్చి, అగ్గిపుల్లలతో కాల్చి గాయపరిచినట్లు ఆరోపించారు. ఈ విషయాన్ని చిన్నారులు ఇంట్లో ఆలస్యంగా చెప్పారని వెల్లడించారు. దీనిపై సోమవారం పాఠశాలకు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించగా సమాధానం చెప్పలేదంటూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పాఠశాల యాజమాన్యం సదరు ఉపాధ్యాయినిని విధుల నుంచి తొలగించడంతో పాటు బాధిత విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

వరుస చోరీలతో కలవరం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం గొందిలో ఒకే రోజు రెండు ఇళ్లు, రెండు ఆలయాల్లో చోరీలు జరిగాయి. ఈ ఘటనల్లో సుమారు రెండున్నర కాసులు బంగారు ఆభరణాలు, 25 గ్రాముల వెండి సామగ్రి, సుమారు రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన దేశింగరావు, నాగేశ్వరరావు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వీరిలో ఒకరు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉంచిన ఆభరణాలు, నగదు అపహరించారు. మరో బాధితుడు ఇంటిలోని ఓ గదిలో నిద్రించగా రాత్రివేళ దొంగలు మరో గదిలో చొరబడి బీరువాలో వెండి సామగ్రి, నగదు దోచుకువెళ్లారు. ఆలయాల తాళాలు పగులగొట్టినా దొంగలకు ఏమీ దొరకలేదు. గ్రామీణ ఎస్సై టీవీ సురేశ్ సోమవారం ఉదయం గ్రామానికి వెళ్లి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. భీమవరం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కాలువలో పడి వృద్ధురాలి మృతి

పోడూరు, న్యూస్‌టుడే: ఓ వృద్ధురాలు చించినాడ పంటకాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముమ్మిడివరం మండలం గేదెలలంక గ్రామానికి చెందిన సుంకర సూర్యవతి (72) అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమె గత మూడు నెలల నుంచి పెనుమంట్ర మండలం నెగ్గిపూడిలో రెండో కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ నెల 13న రాత్రి ఇంట్లో నిద్రించిన ఆమె ఉదయానికి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె మృతదేహాన్ని చించినాడ పంటకాలువలో పోడూరు శివారు పైడావ డ్యామ్ వద్ద సోమవారం గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట కాలువలో మృతదేహం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలోని రాపాక పంట కాలువలో మృతదేహం ఉన్నట్లు సోమవారం స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉండవచ్చని, ఒంటిపై నిక్కరు ధరించినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పాలకొల్లు గ్రామీణ పోలీసులు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ కె.రజనీకుమార్ స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేశారు. పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణ యజమానులకు జరిమానాలు విధించారు.

జూద స్థావరాలపై దాడులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమవరం మండలం తుందుర్రులో జూద శిబిరంపై దాడి చేసి తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ ఎస్సై టీవీ సురేశ్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ. 16,890 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ● వేములదీవి పడమరలో కోడి పందేల స్థావరంపై సోమవారం దాడి చేసి రెండు కోడి పుంజులు, రూ. 1000 నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ స్టేషన్ ఎస్సై టీవీ సురేశ్ తెలిపారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: కాళీపట్నంతూర్పులోని జూద శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వై.నాగలక్ష్మి సోమవారం తెలిపారు.

'మీ కోసం'లో 12 వినతులు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి 12 వినతులు అందాయని తహసీల్దారు జి.అనితాకుమారి తెలిపారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం పందిగుంట ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులకు స్థానికుడు బొండాడ భాస్కర్ సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. దాతకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఒత్తిడితో శిక్షణ సరికాదు'

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొచ్చి శిక్షణ ఇవ్వడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరట్లకట్ట జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తణుకు, న్యూస్‌టుడే: చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. కామర్స్, సివిల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ (సీఈటీ) సబ్జెక్టులు బోధించడానికి సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఈ నెల 17 తేదీలోపు దరఖాస్తులు స్వీకరించి 19న ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'ఒత్తిడితో శిక్షణ నిర్వహించడం సరికాదు'

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొచ్చి శిక్షణ ఇవ్వడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణలో పాలకొల్లు మండలం అర్థకట్ల జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఆర్ మూర్తి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. అనారోగ్యంగా ఉందని చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

రామాలయంలో విశేష పూజలు

సారె సమర్పిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక రామారావుపేటలోని కోదండ రామాలయంలో కొలువైన సీతారాముల వారికి సోమవారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సీతమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. విశేష సంఖ్యలో మహిళలు పాల్గొని సామూహిక లలితా పారాయణం నిర్వహించారు.

వీరభద్రస్వామికి ...

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తణుకు, న్యూస్‌టుడే: పైడిపర్రు భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి నక్షత్ర హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగ్గి రగిలితే ఆస్తులు ఆహుతే..

• మంటలు ఆర్పడానికి చోటు లేక భారీ నష్టాలు
• పట్టణ ప్రణాళిక విభాగం వైఫల్యమే ప్రధాన కారణం

• ఈ ఏడాది మే 11న తణుకు తంగిరాలవారివీధిలో రామకృష్ణా టవర్స్‌లోని మూడో అంతస్తులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అదుపు చేసేందుకు అపార్ట్‌మెంట్లో ఎటువంటి నియంత్రణ సామగ్రి లేదు. లోపలకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రహదారిపైనే అగ్నిమాపక వాహనాన్ని నిలిపారు.

• శనివారం తణుకు పట్టణం ఆలమూరువారి వీధిలోని అంజనా టవర్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో దుస్తులు, ఫ్యాన్సీ దుకాణాల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆరంతస్తుల భవనంలో సుమారు 30 దుకాణాలు, 30 ఫ్లాట్లు ఉన్నా ఎటువంటి ఫైర్ సేఫ్టీ లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ ఉండటంతో అగ్నిమాపక వాహనాన్ని రోడ్డుపైనే ఉంచి మంటలను నిలువరించాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, తణుకు

బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనడానికి ఈ ఘటనలు తార్కాణంగా నిలుస్తున్నాయి. భవనాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్న ఇలాంటి సందర్భాల్లో వారి వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. అగ్ని ప్రమాద నిరోధక సామగ్రి ఏర్పాటు చేయకపోవడం, అగ్నిమాపక శకటాలు వచ్చేందుకు సరిపడా మార్గం లేకపోవడంతో తీవ్ర ఆస్తి నష్టాలకు దారి తీస్తున్నాయి. భవన అనుమతులకు ముందు, తర్వాత పట్టణ ప్రణాళికాధికారుల తనిఖీలు చేయకపోవడం, ముడుపులు అందడంతో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలేవీ..?..నిత్యం రద్దీగా ఉండే ఆసుపత్రులు, దుకాణ, వాణిజ్య సముదాయాలు, పాఠశాల భవనాల్లో ఒకే మార్గం అందుబాటులో ఉంటోంది. రెండు మార్గాలు విధిగా ఉండాలనే నిబంధన ఉన్నా దానికనుగుణంగా నిర్మాణాలు లేవు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదు.

అపార్ట్‌మెంట్ లోపలకు వెళ్లేందుకు మార్గం లేక బయట ఉన్న అగ్నిమాపక వాహనం (పాత చిత్రం)

ఇవీ నిబంధనలు 15 మీటర్లు ఎత్తు దాటిన భవనాలకు ప్రత్యేకంగా నీళ్ల ట్యాంకు, ప్రతి అంతస్తుకు విధిగా నీటి సరఫరా చేసేలా పైపు లైన్లు ఉండాలి. అగ్ని నిరోధక పరికరాలు, ఫైర్ అలారం సిస్టమ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఒకవేళ ప్రమాదం జరిగితే ప్రజలను సురక్షితంగా తరలించేందుకు వీలుగా ఫైర్ ఎగ్జిట్ (ప్రత్యేక ద్వారాన్ని) నిర్మించాలి. క్షేత్రస్థాయిలో వీటిని పక్కాగా అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402

పెంటపాడు, న్యూస్‌టుడే: ? పెంటపాడు మండలం ప్రత్తిపాడు ఎస్సీకాలనీలోని పలువీధుల్లో డ్రెయిన్లు పూడికపోవడంతో మురుగు ముందుకెళ్లడం లేదు. - **సత్యనారాయణ**
✔ పూడిక తొలగిస్తాం. - **నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**
? జట్లపాలెంలోని తాగునీటి చెరువు వద్ద వ్యర్థాలు, చెత్త పారబోస్తున్నారు. అవి చెరువులోకి చేరి కలుషితమవుతోంది. - **రాజు**
✔ చెత్త తొలగించి శుభ్రం చేస్తాం. - **అప్పారావు, పంచాయతీ కార్యదర్శి**
తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ? పట్టణంలోని కడకట్ల శివారులో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు. పాదచారులు అవస్థలు పడుతున్నారు. **-దినేష్**
? స్థానిక యానాదుల కాలనీలో పైపులైన్లు లేకపోవడంతో తాగునీటికి మున్సిపల్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నాం. నీళ్ల ట్యాంకు కూడా సక్రమంగా రాకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. - **నారాయణ, స్థానికుడు**
✔ వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. - **ఏసుబాబు, కమిషనర్**
తణుకు, న్యూస్‌టుడే: ? ఇరగవరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి వెళ్లే దారిలో డ్రెయినేజీపై కల్వర్టు దెబ్బతిని స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **-రమేష్**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-మూర్తి, కార్యదర్శి**
? కంకర లారీలు పరిమితికిమించి లోడు వేసి పరదా కప్పకుండా పట్టణంలో రాకపోకలు చేస్తుండడంతో వెనుక వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
✔ పరిమితికి మించి లోడుతో ఉన్నా, పైన పరదా కప్పకపోయినా జరిమానాలు వేస్తున్నాం. **-శ్రీనివాస్, ఎంవీఐ**

ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పురపాలక కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యనిర్వాహక ఇంజినీర్ వై.వెంకటరమణ, మేనేజరు ఎం.రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఏసుబాబు

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణింపు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని సత్యసాయి సేవా మందిర యోగా మండలికి చెందిన పలువురు యోగా సాధకులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 6న అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తాడేపల్లిగూడేనికి చెందిన అడ్డగళ్ల ఉషశ్రీ మహిళల విభాగంలో, బాలుర విభాగంలో పాలూరి చిరంజీవి ప్రథమ, బాలికల విభాగంలో యర్రంశెట్టి తేజస్వి నాలుగు, పాలూరి అభినందిని ఐదో స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో వారందరూ ఆగస్టు 9, 10 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు సాధకులను అభినందించారు.

పతకాలతో యోగ సాధకులు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట : ఆరిమిల్లి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం అత్తిలి మండలం ఉరదాళ్ల పాలెం, గుమ్మంపాడు గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది నుంచి అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉరదాళ్లపాలెంలో ఏడాది కాలంలోనే రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గుమ్మంపాడులో క్షేత్రస్థాయిలో ఇబ్బందులను తీర్చే విధంగా కృషి చేస్తున్నట్లు ఆరిమిల్లి చెప్పారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించే క్రమంలో ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నామన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ దాసం బాబ్జీ, అత్తిలి మండల తెదేపా అధ్యక్షుడు పోలిశెట్టి చందు, ఆనాల ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కొనగళ్ల విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడులో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

అత్తిలిలో యాంటీ లార్వా పిచికారీ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ముందస్తు చర్యల్లో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం అత్తిలిలోని మురుగు డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాల్లో యాంటీ లార్వా పిచికారీ చేయించారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు పోలిశెట్టి చందు, ఆనాల ఆదినారాయణ, సర్పంచి గంటా విజేత, వైస్ సర్పంచి మద్దాల శ్రీనివాసు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. సోమవారం ఆయన పెంటపాడు మండలం ప్రత్తిపాడులో వీర్ల గోవిందన్న దొరబాబు, ముప్పిడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా అరాచకపాలన వల్ల గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఆకాశపు స్వామి, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, వీర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ✦ తాడేపల్లిగూడెం పట్టణం 3వ వార్డులో తెదేపా పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వలవల బాబ్జీ పాల్గొని మాట్లాడారు. కొల్లి రమావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాలు పంచుతున్న వలవల బాబ్జీ

కల్లు విక్రయాల్లో స్వచ్ఛత పాటించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కల్లు విక్రయాల్లో స్వచ్ఛత పాటించాలని ఎక్సైజ్ ఎస్సైలు ఆర్.దొరబాబు, మురళీ మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో కల్లు సహకార సంఘ సభ్యులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ కల్లు విక్రయాల్లో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సంఘటన దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మత్తు కలిగించేందుకు రసాయనాలు వాడొద్దన్నారు.

తల్లీకుమారుడికి గాయాలు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం దర్శిపర్రుకు చెందిన మాదిరెడ్డి శివ, అతడి తల్లి కనకరత్నం ద్విచక్ర వాహనంపై సొంతూరు వెళ్తున్నారు. మార్గం మధ్యలోని ఉంగుటూరు మండలం కైకరం వద్ద కొబ్బరి బొండాల లోడుతో అపసవ్య దిశలో అక్కుపల్లిగోకవరం వెళ్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న తల్లీకుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.

ఇటీవల వర్షం కురిసిన సందర్భంగా అత్తిలి నుంచి గుమ్మంపాడు వెళ్లే కాలువ గట్టు మార్గం ఇలా..

అధ్వానం.. గట్టు మార్గం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి నుంచి గుమ్మంపాడు వెళ్లే కాలువ గట్టు మార్గం గోతులతో అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షానికే నీరు చేరడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పరిశీలించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

గూడు లేక.. గోడు వినక

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పేరిట ఇష్టారాజ్యంగా అప్పులు చేశారు. గ్రామాల్లో కనీసం అంగన్‌వాడీ కేంద్రాలను సైతం నిర్మించలేకపోయారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో చాలా చోట్ల ఈ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. దీంతో ప్రతి నెలా రూ.లక్షలు వెచ్చించి అద్దె చెల్లించాల్సి వస్తోంది. నియోజకవర్గ పరిధిలో మొత్తంగా 214 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 102 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మరో 75 అద్దె ఇళ్లల్లో నిర్వహిస్తున్నారు.

రూ.3.14 లక్షల అద్దె.. అద్దె భవనాలకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో రూ.6 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోని భవనాలకు రూ.2 వేలు చొప్పున ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నారు. 75 కేంద్రాలకు ప్రతినెలా అద్దె రూపంలో రూ.3.14 లక్షలు చెల్లించాల్సి వస్తోంది.

మధ్యలోనే వదిలేశారు గత వైకాపా ప్రభుత్వం నాడు - నేడులో భాగంగా రూ.65 లక్షలు కేటాయించి పెంటపాడు, మీనవల్లూరు, ఉమామహేశ్వరం, జగన్నాథపురం గ్రామాల్లో అయిదు కేంద్రాల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. నేటికీ వాటి పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. అంతకు ముందు అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం రూ.28 లక్షల ఉపాధి హామీ నిధులతో ప్రారంభించిన నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పనులు సైతం పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి అంగన్‌వాడీలకు సొంత గూడు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎనిమిదేళ్లుగా అంతే.. తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామంలో ఎనిమిదేళ్ల కిందట రూ.7 లక్షలతో నిర్మాణం చేపట్టారు. ఆ నిధులు సరిపోకపోవడంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న భవనాన్ని స్థానికులు తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. చిన్నారులు మాత్రం అద్దె భవనాల్లో మగ్గుతున్నారు.

శ్రీరామ్ నగర్‌లో అద్దె భవనంలో..

ప్రతిపాదనలు పంపించాం

సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపించాం. అసంపూర్తిగా ఉన్న భవనాలను సైతం పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.
- **టీఎల్ సరస్వతి, సీడీపీవో**

ఫ్రీజర్ కొనుగోలుకు విరాళం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గారపాటి వైకుంఠం ఫ్రీజర్ కొనుగోలు కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు రూ.75 వేల విరాళం చెక్కు రూపంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షుడు జినపనేని రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ విరాళం నూతన ఫ్రీజర్ కొనుగోలు చేసి కొమ్ముగూడెంతో పాటు పరిసర గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. యెగ్గిన శరత్, పచ్చ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత సభ్యులకు చెక్కు అందజేస్తున్న వైకుంఠం

దుర్వాసన.. దోమల బెడద

న్యూబ్యాంక్ కాలనీలో చిట్టడవిని తలపిస్తున్న ఉద్యానవనం

వార్డు వెతలు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పరపాలక పరిధిలోని ఒకటో వార్డులో సమస్యలు తిష్టవేశాయి. సుమారు 3000కు పైగా జనాభా ఉండే ఈ వార్డులో పారిశుద్ధ్య సమస్యలు వెంటాడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక కచ్చా డ్రెయిన్స్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. దీంతో దుర్వాసన వస్తోందని.. దీనికి తోడు పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తూ వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఖాళీ స్థలాలతో వెతలు.. న్యూబ్యాంక్ కాలనీ, నాబా ఆర్ట్ గ్యాలరీ వీధి, కరుటూరివారి వీధి ప్రాంతాల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉండటంతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఖాళీ స్థలాల్లో ఏళ్ల తరబడి మురుగు నిలిచిపోయి దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విషసర్పాలకు నిలయంగా.. న్యూబ్యాంక్ కాలనీలో 2014లో మున్సిపల్ సాధరణ నిధులు వెచ్చించి రూ.20.52 లక్షలతో ఉద్యానవనం ఏర్పాటు చేశారు. అందులో చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఊయల తదితర ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ గాలికొదిలేయడంతో ఆట వస్తువులు ఇరిగిపోయాయి. తుప్పలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. విషసర్పాలు ఇళ్లలోకి ప్రవేశించకుండా... చొరబడుతున్నాయని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

సానుకూల స్పందన హర్షణీయం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కార్మికుల పెండింగు దరఖాస్తుల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సానుకూలంగా స్పందించడం హర్షణీయమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పేర్కొన్నారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక భవనంలో సోమవారం నిర్వహించిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఏఐటీయూసీ ఐదేళ్లగా పోరాటం సాగిస్తోందన్నారు. ఎట్టకేలకు ఫలితం దక్కిందన్నారు. పెండింగు క్లెయిమ్‌లను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు బోర్డు ఛైర్మన్ ప్రకటించడం అభినందనీయమన్నారు. నాయకులు పోలిరాతి ఆదినారాయణ, గంధం సత్యనారాయణ, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన

రన్నరప్‌గా తణుకు వాసి నాగేంద్ర

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని శ్రీసాయి శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి 185 మంది బాడీబిల్డర్లు పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విశాఖపట్నం చెందిన విక్రమ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా నిలువగా.. రన్నరప్‌గా తణుకుకు చెందిన నాగేంద్ర నిలిచారు. విక్రమ్‌కు రూ.40,000, నాగేంద్రకు రూ.20,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ధ్రువపత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచిన బాడీ బిల్డర్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందించారు.

విజేత, రన్నరప్‌లతో బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు

13 సంఘాలకు త్రిసభ్య కమిటీలు

తణుకు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన రెండో విడత సహకార సంఘాల త్రిసభ్య కమిటీల్లో తణుకు నియోజకవర్గంలోని 13 సంఘాలకు కమిటీలు నియమించారు. తణుకు మండలంలో పైడిపర్రు సంఘానికి ఛైర్మన్‌గా పాలకుర్తి వీర వెంకట సత్యనారాయణ, సభ్యులుగా నౌడు శ్రీనివాసు, మోపిదేవి రామలింగేశ్వరరావు, దువ్వకు ఛైర్మన్‌గా చిక్కాల వేణుగోపాల చంద్రశేఖర్, సభ్యులుగా కామన ఆంజనేయులు, గుడుపు దుర్గామల్లేశ్వరరావు, ముద్దాపురానికి ఛైర్మన్‌గా ముళ్లపూడి శ్రీనివాసరావు, సభ్యులుగా జి.త్రిమూర్తులు, చిటికిన వీర వెంకట సత్యనారాయణ, ఇరగవరం మండలానికి సంబంధించి అయినపర్రుకు ఛైర్మన్‌గా ద్వారంపూడి సుబ్బిరెడ్డి, సభ్యులు బొంతా చిట్టిబాబు, అడబాల సత్యనారాయణ, ఏలేటిపాడుకు ఛైర్మన్‌గా కర్రి విశ్వేశ్వరరెడ్డి, సభ్యులుగా పోతిరెడ్డి శ్రీనివాసరావు, చోడే సంజీవరావు, కంతేరుకు ఛైర్మన్‌గా గంటా శ్రీనివాసరావు, సభ్యులుగా ద్వారంపూడి చిన్న వెంకటరెడ్డి, దొంగా మునీశ్వరరావు, రేలంగికి ఛైర్మన్‌గా అడ్డాల మేంటారావు, సభ్యులుగా కొడేల శ్రీనివాసరావు, మంగిన శ్రీనివాసరావు, ఇరగవరానికి ఛైర్మన్‌గా వేండ్ర నాగరాజేశ్వరరావు, సభ్యులుగా శీలబోయిన శ్రీనివాసు, రఘు వెంకటేశ్వరరావు, కొత్తపాడుకు ఛైర్మన్‌గా కారెం బాబురావు, సభ్యులుగా బొక్కా కృష్ణ, ఎన్. నాగేశ్వరరావు, అత్తిలి మండలానికి సంబంధించి మంచిలికి ఛైర్మన్‌గా ఇందుకూరి వెంకట సుబ్బరాజు, సభ్యులుగా టి.చిట్టిబాబు, కొత్తపల్లి రామరాజు, వరిఘేడుకు ఛైర్మన్‌గా కడలి వెంకట నారాయణ, సభ్యులుగా సీహెచ్ చంద్రరావు, కోటిపల్లి శ్రీరామమూర్తి, పాలూరుకు ఛైర్మన్‌గా అల్లూరి ధనరాజు, సభ్యులుగా యలమంచిలి త్రిమూర్తులు, పేరికల పాండురంగా, ఉనికిలికి ఛైర్మన్‌గా చేకూరి శ్రీనివాస్, సభ్యులుగా జంగం దినకరన్, బాలం మహేష్ నియమితులయ్యారు.

'అధికారం కోసం హామీలు గుప్పించారు'

తణుకు, న్యూస్‌టుడే: అధికారం కోసం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ ఇష్టానుసారంగా హామీలు గుప్పించి ప్రజల్ని మోసం చేశారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపించారు. తేతలి, పైడిపర్రు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి మాట్లాడారు. అన్నదాత సుఖీభవ ఇస్తామని రైతుని, ఆడబిడ్డ నిధి ఇస్తామని మహిళల్ని, 50 ఏళ్లకే పింఛను ఇస్తామని బీసీ వర్గాలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందన్నారు.

అధిక లోడు.. ఆపై అతివేగం

తాడేపల్లిగూడెం రహదారిపై అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్

పరిమితికి మించి లోడుతో, ట్రక్కుపైన ఎటువంటి రక్షణ పరదాలు లేకుండా కంకర లారీలు అతివేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో వెనుక వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని పలు క్వారీల నుంచి, తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను, కొత్తూరు క్వారీల నుంచి నిత్యం వందలాది లారీలు కంకర, నల్లరాజు తదితరాలతో తాడేపల్లిగూడెం, పెంటపాడు రహదారుల మీదుగా భీమవరం, ఆకివీడు వైపు వెళ్తుంటాయి. డ్రైవర్ల అజాగ్రత్తగా, వేగంగా నడుపుతుండడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. దీనిపై తాడేపల్లిగూడెం మండలం తహసీల్దార్ సునీల్‌కుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా నిబంధనలకు విరుద్ధంగా తాడేపల్లిగూడెం మీదుగా అధిక లోడుతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

విరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

పైడిపర్రులో సహకార సంఘం సమీపంలో విద్యుత్తు స్తంభం విరిగి ప్రమాదకరంగా మారింది. స్తంభం పైఎత్తులో విరిగిపోవడంతో సిమెంటు పెచ్చులు ఊడి పడుతున్నాయని.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు చెబుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ రమణమూర్తి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, తణుకు

ఎప్పుడు కూలుతుందో.. ఏమవుతుందో?

అత్తిలి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో భారీ వృక్షం ఎండిపోయి ప్రజలను భయపెడుతోంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి జి.భాస్కర్ వద్ద దీనిపై 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం

రావిపాడులో అగ్నిప్రమాదం

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం రావిపాడులో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రావిపాడులో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చిపడేయడంతో పక్కనే ఉన్న అనంత నారాయణస్వామికి చెందిన 9 ఎకరాల గడ్డిమేటుకి నిప్పంటుకుంది. పక్కనే ఉన్న గేదెల పాకకు కూడా మంటలు అంటుకోవడంతో స్థానికులు తాడేపల్లిగూడెం ఫైర్ స్టేషన్‌కి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజిన్‌తో చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో గడ్డిమేటు అగ్నికి ఆహుతవ్వగా ఒక గేదె గాయపడింది. రూ.45 వేల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు తెలిపారు.

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప
మంగళవారం జులై 15, 2025

ఇంటి దొంగలపై వేటు

◆ అన్నమయ్య, చిత్తూరు పీడీల అవినీతి వ్యవహారం
◆ ఇప్పటికి పండిన వైకాపా హయాంలోని పాపం

ఈనాడు, కడప: 'జగనన్న కాలనీ'ల పేరిట వైకాపా నేతాగణాలే కాదు.. అప్పట్లో అధికారులు సాగించిన అక్రమాలూ అనేకం. కాలనీల కోసం రూ. కోట్లు పెట్టి ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేశారు. చాలాచోట్ల ధరలు పెంచి కమీషన్లు కొట్టేశారు. లబ్ధిదారుల దరికి చేర్చకుండానే సిమెంట్‌ను పక్కదారి పట్టించారు. ఇటువంటి కొందరి పాపం ఇప్పుడు పండుతోంది. అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం వేటు వేస్తోంది.

● **సిమెంట్, ఇసుక స్వాహా:** గృహ నిర్మాణ సంస్థ అన్నమయ్య, చిత్తూరు జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లు వి.సాంబశివయ్య, గోపాల్ నాయక్‌లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా హయాంలో అన్నమయ్య జిల్లా నారాయణరెడ్డిపల్లె జగనన్న లేఅవుట్‌లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇళ్ల నిర్మాణం చేపట్టకనే, లబ్ధిదారులకు తెలియకనే సిమెంట్, స్టీలు, ఇసుక, నిర్మాణ సామగ్రిని అప్పట్లో స్వాహా చేశారు.

● **జిల్లా వీడి వెళ్లొద్దు:** స్వాహా పర్వంలో పొరుగు సేవల కింద పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ అనంత శ్రీహరిని బాధ్యుడిగా గుర్తిస్తూ ఇప్పటికే విధుల నుంచి తొలగించారు. ఈ వ్యవహారంలో ఇంకా పలువురిపై వివిధ రకాల చర్యలు తీసుకున్నారు. అప్పట్లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పీడీ సాంబశివయ్య, అప్పట్లో రాయచోటి డీఈఈగా పని చేసిన, ప్రస్తుత చిత్తూరు జిల్లా పీడీ గోపాల్ నాయక్‌లపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సస్పెన్షన్ కాలంలో ఇద్దరు అధికారులు అనుమతి లేకుండా జిల్లా కేంద్రాన్ని వదిలి వెళ్లరాదంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇద్దరు అధికారులు ఈఈలుగా పని చేస్తూ జిల్లా ఇన్‌ఛార్జి పీడీ(జిల్లా హెడ్ హౌసింగ్)లుగా వ్యవహరిస్తున్నారు.

రైతేరాజు 8లో

యాగ క్రతువును తిలకిస్తున్న భక్తులు .. అర్చన చేస్తున్న వేద పండితులు

సౌమ్యనాథునికి విరుల సోయగం

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి పుష్పయాగ మహోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మొత్తం పన్నెండు రకాల పుష్పాలు, తులసి, మరువం, ధవనం వంటి నాలుగు రకాల ఆకులతో స్వామి, అమ్మవార్లకు యాగం చేశారు. అద్యంతం శోభాయమానంగా సాగిన ఈ క్రతువును భక్తులు తిలకించి తన్మయత్వం చెందారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడాలని స్వామివారిని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు యాగం చేపట్టినట్లు వేద పండితులు తెలిపారు.

అయ్యో దేవా.. ఇంకేం మిగిలిందయ్యా

◆ కూలీల జీవితాలతో క్రూర ఆట ◆ కన్నీటితో తడిసి ముద్దైన శెట్టిగుంట

రైల్వేకోడూరు, రాజంపేట గ్రామీణ, పుల్లంపేట, న్యూస్‌టుడే: విధి.. కూలీల జీవితాలతో క్రూరమైన ఆట ఆడింది. జీవితాలకు రెక్కాడితే డొక్కాడని బతుకుల్లో కల్లోలం నింపింది. తామే లోకంగా జీవిస్తున్న చిన్నారులకు తమ కన్నవారిని కానరాకుండా చేసింది. తమనే నమ్ముకుని బతుకులీడుస్తున్న తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. అభాగ్యులకు జీవిత కాల శిక్ష విధించింది. ఎన్నటికీ మానని గాయాన్ని చేసింది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు కట్టపై ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం రూపంలో వికటాట్టహాసం చేసింది. అప్పటి వరకు మామిడి కాయలు కోసి.. లారీకి లోడు ఎత్తి.. అదే వాహనంపై స్వగ్రామానికి తిరుగుముఖం పట్టిన తొమ్మిది మంది ప్రాణాలను డ్రైవర్ నిర్లక్ష్యం బలిగొంది.

● **మృతుల్లో రెండు జిల్లాల వాసులు:** రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట గిరిజన కాలనీ, తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన కూలీలు మామిడి కాయల కోతకు రాజంపేట మండలం ఇసుకపల్లి గ్రామ పరిసరాలకు ఆదివారం వచ్చారు. మామిడి కాయలు కోసిన తర్వాత తిరిగి అన్‌లోడ్ చేయడానికి లారీ క్యాబిన్‌తో పాటు వెనుక మొత్తం 21 మంది కూలీలు రైల్వేకోడూరుకు ప్రయాణమయ్యారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్టపై వాహనం అదుపు తప్పి పడిపోవడంతో శెట్టిగుంట యానాది కాలనీకి చెందిన గజ్జల సుబ్బరత్న(28), వెంకటేశు(40) దంపతులు, వెంకటేశు తల్లి లక్ష్మీదేవి(60), గజ్జల దుర్గయ్య(35), గంగమ్మ(33) దంపతులు చనిపోయారు. సుబ్బరత్న, వెంకటేశు దంపతులకు గౌతమ్, శ్రీను అనే పిల్లలున్నారు. వీరి మరో ఇద్దరు కుమార్తెలు వెంకటగిరిలో ఉంటున్నారు. దుర్గయ్య, గంగమ్మ దంపతులకు గంగయ్య, సునీత, రాజేశ్వరి అనే పిల్లలున్నారు. తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ బిడ్డలు అనాథలుగా మారారు.

మృతదేహాల వద్ద మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు

గజ్జల దుర్గయ్య, గంగమ్మ దంపతులు (పాత చిత్రాలు)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం కలవగుంట ఎస్టీ కాలనీకి చెందిన చిట్టెమ్మ(35), అదే మండలం చుక్కలనిడిగల్లుకు చెందిన రాధ(35),. ఆమె కుమారుడు జాని(18) మృతిచెందారు. ఇదే ప్రమాదంలో రాధ భర్త రమణయ్య గాయపడ్డారు. వెంకటగిరి మండలం వల్లివేడుకు చెందిన మునిచంద్ర(19) విగతజీవిగా మారారు.

● **తెల్లవార్లూ ఎదురుచూపులు:** ప్రమాదంలో తమవారు మృతిచెందారనే విషయం తెలుసుకున్న శెట్టిగుంట గిరిజన కాలనీ వాసులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఉదయం వరకు తమతో ఉన్నవారు ఇక ఎన్నటికీ తిరిగి రారనే విషయం తెలుసుకుని గుండెలవిసేలా రోదించారు. ప్రమాదం అనంతరం మృతదేహాలకు రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో పోలీసులు శవ పరీక్ష చేయించారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఆదివారం రాత్రి నుంచి అప్పటి వరకు విగతజీవులుగా మారిన తమవారి కోసం గ్రామస్థులు ఎదురు చూస్తూనే ఉండిపోయారు. వాహనాల నుంచి దించుతున్న మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యుల రోదనలు ఆ ఊరిలో మిన్నంటాయి

క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

● **ప్రముఖుల ఓదార్పు:** రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా మంత్రి బీసీ.జనార్దన్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. గాయపడిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్, నియోజకవర్గ తెదేపా బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి పరామర్శించారు. పిల్లలు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ సాయం కింద రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 50 వేల చొప్పున అందజేశారు. ప్రభుత్వం తరపున రావాల్సిన సహాయం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సోదరుడు గంగయ్య గుండెలపై వాలి రోదిస్తున్న సునీత, రాజేశ్వరి

ప్చ్.. మావి చెత్త జిల్లాలు

● వెనుకబడిన ఉమ్మడి కడప ● ఐవీఆర్ఎస్‌లో ప్రజల వ్యక్తీకరణ

కడప నగరపాలక, న్యూస్‌టుడే: పుర, నగరపాలక సంస్థల పరిధిలో చెత్త సేకరణ - తరలింపు దాని నిర్వహణపై ఉమ్మడి కడప జిల్లా ప్రజలు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై రాష్ట్రప్రభుత్వం ఐవీఆర్ఎస్, టెలీఫోన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని పుర, నగరపాలక సంస్థల ప్రజల అభిప్రాయాలను సేకరిస్తోంది. జులై నెలలో రూపొందించిన నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వైఎస్సార్ కడప జిల్లా 23, అన్నమయ్య జిల్లా 25వ స్థానంలో నిలిచాయి. మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతోందా అన్న ప్రశ్నకు కడప జిల్లాలో 55 శాతం మంది, అన్నమయ్య జిల్లాలో 51 శాతం మంది అవునని సమాధానం ఇచ్చారు. కనీసం వారానికి రెండు సార్లయినా ఇంటింట చెత్త సేకరకణ చేస్తున్నారా అన్న ప్రశ్నకు కడప జిల్లాలో 53 శాతం అన్నమయ్య జిల్లాలో 46 శాతం మంది మాత్రమే అవునని సమాధానం ఇచ్చారు. చెత్త నిర్వహణలో ఫర్వాలేదు(యావరేజ్) అని కడప జిల్లాలో 54 శాతం, అన్నమయ్య జిల్లాలో 49 శాతం మంది తెలిపారు. రాయలసీమ రీజియన్ పరిధిలో ఉమ్మడి కడప జిల్లా పుర, నగరపాలక సంస్థలు చెత్త నిర్వహణలో మరీ వెనుకబడిపోవడం చర్చనీయాంశమయ్యింది.

అధ్వానంగా కడపలోని ఓ వీధి

● **విఫలమైన స్థానిక పాలకులు:** ఉమ్మడి కడప జిల్లాల్లోని పుర, నగరపాలక సంస్థల నుంచి రోజుకు దాదాపు 1000 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను ఇంటింట చెత్త సేకరణ కార్యక్రమం ద్వారా కంపోస్ట్ యార్డులకు తరలించడంలో స్థానిక పాలకవర్గం విఫలమవుతోంది. కంపోస్ట్ యార్డుకు తరలించిన చెత్తను శుద్ధి చేయకుండా వదిలేయడంతో అవి చెత్తకాసారాలుగా మారాయి. వైకాపా హయాంలో కంపోస్ట్‌యార్డులపై దృష్టి పెట్టకపోవడంతో అవి చెత్త కొండల్లా మారాయి. 2024 ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడింది. కానీ ఉమ్మడి జిల్లాల్లోని అత్యధిక పుర, నగరపాలక సంస్థలు వైకాపా పాలకవర్గం చేతుల్లోనే ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఇంటింట చెత్త సేకరణ - చెత్త నిర్వహణను బలహీనపరుస్తున్నారని కూటమి నేతలు విమర్శలు చేస్తున్నారు. అదే సమయంలో పారిశుద్ధ్య నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని వైకాపా పాలకవర్గాలు విమర్శిస్తున్నాయి. రెండు పార్టీల మధ్య వివాదం చెత్త నిర్వహణలో ఉమ్మడి జిల్లాలను అధమ స్థానానికి చేర్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కండరగండులు

● సందడిగా రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

విజేతలు నాగేంద్ర, విక్రమ్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి 185 మంది పాల్గొన్నారు. విశాఖపట్నంకు చెందిన విక్రమ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా.. తణుకు పట్టణానికి చెందిన నాగేంద్ర రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బాడీ బిల్డింగ్ ఛైర్మన్ సింగయ్య, నగర ప్రముఖులు షఫీ, ఆదిత్య, నాగేంద్రలతో పాటు వివిధ జిమ్ యాజమాన్య ప్రతినిధులు, బాడీ బిల్డర్స్, బాడీ బిల్డింగ్ అభిమానులు పాల్గొన్నారు.

మార్గదర్శిగా నిలిచిన కలెక్టర్

● పీ-4లో భాగంగా చొరవ ● తెల్లపాడు గ్రామం దత్తత

ఈనాడు, కడప: పీ-4 కార్యక్రమం అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించింది. ఈ విషయాన్ని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అందిపుచ్చుకున్నారు. కలసపాడు మండలం తెల్లపాడులో 104, ఇ.తంబళ్లపల్లెలో రెండు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. తద్వారా పెద్ద సంఖ్యలో ఇప్పటి వరకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న ప్రథమ కలెక్టర్‌గా నిలిచారు.

పల్లెనిద్రలో భాగంగా తెల్లపాడులో నిద్రిస్తున్న కలెక్టర్ శ్రీధర్(పాత చిత్రం)

● **నిద్ర చేసి.. సమస్యలు పరిష్కరించి:** రాష్ట్ర ప్రభుత్వం పీ-4 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. దత్తత తీసుకునే వ్యక్తులకు మార్గదర్శకులుగా నామకరణం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మార్గదర్శకులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ ముందుకు వచ్చారు. తెల్లపాడులో ఇది వరకే ఆయన పల్లెనిద్ర చేశారు. ప్రజలతో మమేకమై.. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు, మహిళలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారి ఆదాయ మార్గాల గురించి అడిగి తెలుసుకున్నారు. దూలంవారిపల్లె చెరువును సందర్శించడంతో పాటు రైతులతో మాట్లాడి.. సాగునీటి వసతి గురించి ఆరా తీశారు. గ్రామ పరిసరాల్లో భూముల ఆక్రమణ, పోలేరమ్మ ఆలయ భూముల అన్యాక్రాంతం గురించి ప్రజలు కలెక్టరు వద్ద గ్రామస్థులు ప్రస్తావించారు. తడుకు వాగు ఎత్తిపోతల పథకం కింద మోటారు పని చేయలేదని తెలుసుకుని మరమ్మతులు చేయించారు. ఇలా వివిధ రకాల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఆ గ్రామంలోని నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు.

కొట్టారు.. కాదు కిందపడ్డాడు

● ఎర్రచందనం కేసు నిందితుడికి గాయాలు
● విమర్శలకు తావిచ్చిన అటవీ అధికారుల తీరు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: పుల్లలు ఏరుకునేందుకు అడవికి వెళ్లి.. అధికారులను చూసి పారిపోతుండగా తనను రాళ్లతో కొట్టి గాయపరిచి ఆసుపత్రిపాలు చేశారని వనిపెంటకు చెందిన బాధితుడు నాగేంద్ర ఆరోపిస్తుండగా.. లేదు అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని వెంబడించడంతో దూకి పారిపోబోతూ కిందపడి గాయాలపాలైనట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు అటవీ శాఖ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. జి.వి.సత్రం అటవీ ప్రాంతంలో వనిపెంటకు చెందిన నాగేంద్రను అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నడవలేని స్థితిలో ఉంటే ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి ఎక్స్‌రే తీయించారు. కుడి కాలు విరగడంతో వైద్యులు కట్టు కట్టారు. ఆ తర్వాత వైద్యుల సలహా మేరకు కడపలోని రిమ్స్‌కు అతన్ని తరలించారు. సమాచార సేకరణకు వెళ్లిన విలేకర్లను అధికారులు అడ్డుకున్నారు. వైద్య చికిత్సకు వెళ్తున్న నిందితుడు తాను పుల్లలు ఏరుకోవడానికెళ్తే అధికారులు రాళ్లతో కొట్టి విరిగేలా చేశారని బిగ్గరగా వాపోయారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో హేమాంజలి భిన్న వాదన వినిపిస్తున్నారు. ఎర్రచందనం దొంగను పట్టుకుని విజయవాడ తీసుకెళుతుండగా జి.వి.సత్రం సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ వాహనాన్ని గుర్తించినట్లు చెప్పారు. తనిఖీ చేయబోతుండగా తమను చూసి వాహనం నుంచి దూకి పారిపోతుండగా వెంబడించినట్లు తెలిపారు. ఒకరు పరారవ్వగా.. మరొకరు చిక్కారన్నారు. అదుపులోకి తీసుకొని విచారించగా అతను వనిపెంటకు చెందిన నాగేంద్ర అని, పారిపోయిన వ్యక్తి పవన్‌కుమార్‌రెడ్డి అని తెలిసినట్లు వివరించారు. నాగేంద్రపై ఇదివరకే ఆరు కేసులు నమోదై ఉన్నాయని, పరారయ్యే క్రమంలో అతని కాలు బెణికినట్లు చెప్పారు. తాము కొట్టామనడంలో వాస్తవం లేదన్నారు.

నాగేంద్రను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కేంద్ర కారాగారంలో చరవాణి కలకలం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప కేంద్ర కారాగారంలో ఓ చరవాణి, ఛార్జర్‌లను అధికారులు గుర్తించారు. ఇటీవల కాలంలో పలుమార్లు కేంద్ర కారాగారంలో చరవాణులు దొరుకుతున్నాయి. ఈ విషయం కలకలం రేపుతోంది. అధికారులు గత వారంలో రెండుసార్లు చరవాణులను గుర్తించారు. తాజాగా సోమవారం మరోసారి స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఖైదీలకు అందిస్తున్నారా.. లేదా బయటి నుంచి జైల్లోకి విసిరి వేస్తున్నారా..? అనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు. కడప కేంద్ర కారాగారంలో తరచూ చరవాణులు లభిస్తున్న విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. పైగా ఇటీవల దొరుకుతున్న చరవాణులు పీడీ యాక్ట్ కేసులో ఉన్న జాకీర్ వద్దనే కావడం గమనార్హం.

ఒంటిమిట్టలో తిరుమల తరహా అన్నప్రసాదం వితరణ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనం కోసం తరలివస్తున్న భక్తులకు తిరుమల తరహాలో పూర్తి స్థాయిలో అన్నప్రసాదం వితరణ చేయనున్నట్లు తితిదే కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. తిరుపతి పరిపాలనా భవనంలో జేఈవో వల్లూరు వీరబ్రహ్మం, అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒంటిమిట్టలో పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రామాలయం వద్ద తాత్కాలికంగా ప్రమాదరహిత జర్మన్ షెడ్లు వేయాలని సూచించారు. భోజనాల తయారీకి అవసరమైన సామగ్రి తెప్పించాలని, సిబ్బందిని నియమించాలన్నారు. ఆగస్టులో అన్నప్రసాదం విస్తరణ సేవలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

అధికారులతో మాట్లాడుతున్న తితిదే ఈవో శ్యామలరావు, పక్కన జేఈవో వీరబ్రహ్మం

మేము అధికారంలోకొస్తే మీకుంటది

● వైకాపా ఎమ్మెల్సీ వివాదాస్పద వ్యాఖ్యలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: 'నేను ఆ నాయకుడికి చెబుతున్నా.. గ్రామాల్లో ఎక్కడైనా అనవసరంగా ఇబ్బంది పెట్టే పరిస్థితి వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అని వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. జమ్మలమడుగులోని వైకాపా కార్యాలయంలో పెద్దముడియం మండల కార్యకర్తలు, నాయకులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూటమి నాయకులను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికలై ఓడిపోతానే మీ నాయకుడు ఉండరు. గతంలోనూ ఇలాగే జరిగింది. ఆ నాయకుడు అందుబాటులో ఉండరు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే మీరు నమ్ముకున్న నాయకులు ఎవరూ అందుబాటులో ఉండరు. అప్పుడు మీకు ఉంటుంది' అని హెచ్చరించారు. గ్రామాల్లో అనవసరంగా గొడవలు పెట్టుకుంటే భయపడేది ఉండదని, తప్పని పరిస్థితులు వస్తే వెనక్కి తగ్గమన్నారు.

మాట్లాడుతున్న వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పేరు ఉచితం.. తీరేమో అనుచితం

● ఏటా రూ.25 కోట్ల బండ బాదుడు ● ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

జిల్లా సచివాలయం, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు పట్టణంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది రెండు కిలో మీటర్ల దూరంలోపున్న వినియోగదారుల నుంచి కూడా సిలిండర్ సరఫరాకు రూ. 30 నుంచి రూ. 50 వసూలు చేస్తున్నారు. ● కడప నగరంలో ఈ మొత్తం రూ. 70 వరకు ఉంటోంది. భవనంలోని పైఅంతస్తుల్లో వారి నుంచి రూ. 100కు పైగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే మీరే తీసుకెళ్లండంటూ బుకాయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిపై జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు...

- సాధారణం: 5,05,061
- దీపం: 2,50,532
- ఉజ్వల: 19,458
- సీఎస్ఆర్: 36,962
- వాణిజ్యం: 6,652

● **ఇవీ ఉత్తర్వులు:** వినియోగదారుడి ఇల్లు గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే ఏజెన్సీకి 5 కి.మీ.లోపు ఉంటే ఉచితంగా రవాణా చేయాల్సి ఉంటుంది. కేవలం సిలిండర్ ధర మాత్రమే తీసుకోవాలి. 5 కి.మీ. మించితే అదనంగా రూ. 30 తీసుకోవచ్చంటూ ఇటీవల పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో కడప నగరం, పట్టణాలు, గ్రామాల పరిధిలో అదనంగా వసూలు చేస్తున్నారు. అడిగితే రవాణా ఛార్జీలంటుండటం గమనార్హం.

ప్రతి కుటుంబం నుంచీ వసూలు

జిల్లాలో 8,18,665 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రెండు నెలలకు ఒకటి చొప్పున ఏటా ఆరు నుంచి ఎనిమిది సిలిండర్లను సగటు కుటుంబం వినియోగిస్తోంది. సిలిండర్ ధర కంటే రూ. 50 నుంచి రూ. 100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 80 నుంచి రూ. 100 వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై ఏటా రూ. 300 అదనపు భారం పడుతోంది. అన్ని కనెక్షన్లకు చూస్తే జిల్లావ్యాప్తంగా రూ. 25 కోట్ల మేర అదనంగా వసూలు చేస్తున్నట్లు అంచనా. అదే సమయంలో గ్యాస్ బండ సరఫరా చేసే సమయంలో తప్పనిసరిగా బరువు తూచే యంత్రాన్ని తీసుకెళ్లాలి. క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. బుకింగ్ చేసుకున్న నిర్ణీత సమయంలో సిలిండర్ అందించాల్సి ఉండగా వివిధ కారణాలు చెబుతూ ఆలస్యం చేస్తున్నారు. ఈ విషయమై డీఎస్వో శిరీష మాట్లాడుతూ.. వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత డీలర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఎవరైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తే స్థానికంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

కేసీ కాలువకు నీటి విడుదల

మైదుకూరు, రాజుపాలెం, న్యూస్‌టుడే: రైతులు, నాయకులు, నీటి సంఘాల హర్షధ్వానాల మధ్య జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట వద్ద కేసీ కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఆనకట్ట నుంచి కేసీ కాలువకు నీటిని మళ్లించే తూముల వద్ద ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తొలుత ప్రత్యేక పూజలు చేశారు. పండ్లు, పూలు, కొబ్బరికాయ సమర్పించి హారతి ఇచ్చారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల ప్రతినిధులు, నాయకులతో కలిసి షట్టర్లు ఎత్తి నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డీఈఈ ఎస్.చిన్న పుల్లయ్య, జమాల్‌వలి, పవన్‌కుమార్ రెడ్డి, గురుమోహన్‌రెడ్డి, ఆశాజ్యోతి, కేసీ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ డి.గురివిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ.రవీంద్ర, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు రామచంద్రారెడ్డి, హరినాథ్, రెడ్యం రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్ట వద్ద నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో నాయకులు

కేసీ కాలువలో ప్రవహిస్తున్న జలాలు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

నాము గడ్డి బారి నుంచి కాపాడేదిలా!

చిట్కా

పశువులు పచ్చిక బైళ్లలో మేస్తూ అపరిపక్వత దశలో పెరుగుతున్న జొన్న పైరు (లేతదశ)ను మేయడం ద్వారా హైడ్రోసైనిక్ యాసిడ్ (హైడ్రో సైనిక్ యాసిడ్) అనే విష పదార్థం శరీరంలోకి ప్రవేశించి పశువులను అస్వస్థతకు గురి చేయడమే కాకుండా ఒక్కోసారి కొన్ని గంటల వ్యవధిలోనే మరణం సంభవించే అవకాశం ఉంది. దీనినే రైతుల పరిభాషలో 'నాము' ఎక్కింది అని కూడా అంటుంటారు. దీనికి విరుగుడుగా సోడియం థయోసల్ఫేట్ 10 గ్రాముల స్ఫటికాలను 50-100 ఎంఎల్ డిస్టిల్ వాటర్‌లో కరిగించి ఇంజెక్షన్ ద్వారా పశువు నరంలోకి ఎక్కించడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చు. మేసిన జొన్న కర్రల పరిమాణాన్ని బట్టి రెండు, మూడు ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. ఈ తరహా స్ఫటికాలను ముందు జాగ్రత్తగా పాడి రైతులు తమ వద్ద ఉంచుకుంటే అత్యవసర సమయాల్లో పాటించి పశువులను కాపాడుకోవచ్చు. అపరిపక్వత దశలో ఉన్న జొన్న పైరును మేపకుండా ఉండటం అన్నింటి కన్నా శ్రేయస్కరమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై వివరించారు. - న్యూస్‌టుడే, రాయచోటి

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న : జామలో పండు ఈగ సమస్య అధికంగా ఉంది. నివారణ తెలపండి?
- లోహిత్, మూరేవాండ్లపల్లె, కలికిరి

సమాధానం : కాయలు పక్వ దశలో ఉన్నపుడు పండుఈగ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఆడ రెక్కల పురుగులు కాయ చర్మం లోపల గుడ్లు పెట్టి వాటినుంచి వచ్చే లార్వాలు గుజ్జును తిని కుళ్లిపోయి, రాలిపోయేలా చేస్తాయి. నివారణగా రాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. చెట్ల మధ్యలో దున్నడం ద్వారా కోశస్థ దశలు బయటపడేలా చేసి చంపొచ్చు. మిథైల్ యూజినాల్ ఎర బుట్టలను ఎకరాకు 6-8 చొప్పున 5-6 అడుగుల ఎత్తులో ఉంచడం ద్వారా బుట్టల్లో రెక్కల దశ పురుగులు పడి చనిపోతాయి.
- పీరుసాహెబ్, సస్యరక్షణ శాస్త్రవేత్త, కలికిరి కేవీకే
- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

మధ్యవర్తిత్వంపై ప్రచారం చేయండి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే : దేశం కోసం మధ్యవర్తిత్వం అనే కార్యక్రమంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని జిల్లాలోని న్యాయమూర్తులకు సూచించారు. సోమవారం వర్చువల్ విధానం ద్వారా న్యాయమూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి దిశానిర్దేశం చేశారు. సమావేశాలు, ర్యాలీలు, 1కే వాక్ ద్వారా ప్రజలకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధమైన న్యాయ ప్రక్రియ అని పేర్కొన్నారు.

సాగులో సందేహాలా?

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తతో ఈనాడు ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్

ఫోన్-ఇన్

ఖరీఫ్‌లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, పంటల సాగులో సందేహాలు, విత్తనశుద్ధి, తెగుళ్ల నివారణ, వర్షాభావం నేపథ్యంలో సాగు చేయాల్సిన పంటలు తదితర అంశాలపై సందేహాల నివృత్తి చేసుకునేందుకు ఈనాడు మీకోసం అవకాశం కల్పిస్తోంది. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్యతో పాటు ఉద్యాన, సేద్య విభాగం పశుసంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు ఫోన్ చేసి మీ సందేహాలను పరిష్కరించుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, చింతకొమ్మదిన్నె

తేదీ : 15.07.2025 (మంగళవారం) సమయం: ఉదయం 10 నుంచి 11 వరకు
ఫోన్ నెంబరు: 99896 23826

ఖరీఫ్ కాలం.. విత్తన ఎంపికే కీలకం

నకిలీ ఉత్పత్తులతో అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు


సాగు చేసిన టమాట పంట

కలకడ, న్యూస్‌టుడే : ఖరీఫ్ పంటల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. నాణ్యమైన విత్తనం వేసి అధిక దిగుబడి సాధించాలనే తపనతో ముందుకు వెళుతున్నారు. పంట సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకం. వ్యాపారులు అన్నదాతలను మోసం చేసేందుకు కల్తీ, నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తారు. విత్తన ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పెట్టుబడి, సమయం, శ్రమ వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో విత్తనాన్ని సరి చూసుకొని కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. ● అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో ప్రధానంగా ఖరీఫ్ పంటగా వేరుశనగ, వరి, కంది, మొక్కజొన్న, శనగతో పాటు టమాట, వంగ, మిరప, కాకర, బెండ, చిక్కుడు, బీన్స్ పంటలను సాగు చేస్తారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలను ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తారు. రైతులు దుకాణాల వద్దకు వెళ్లి పంట రకం పేరు చెప్పి విత్తనాలు కొనుగోలు చేస్తారు. విత్తన నాణ్యతను, రసీదులు, విత్తన రకం సైతం పరిశీలించకుండానే కొంటారు. వ్యాపారులు రైతులను మోసం చేసేందుకు వివిధ రకాల పేర్లతో అనేక కంపెనీల విత్తనాలు విక్రయిస్తున్నారు.

రాయితీ విత్తనాలే సురక్షితం : ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న విత్తనాలను కొనుగోలు చేస్తే ఎలాంటి నష్టం ఉండదు. విత్తనం రాయితీతో పాటు పంటకు నష్టం కలిగితే పరిహారం లభిస్తుంది. ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి ఉంటే రసీదులు, సంచులు భద్రపరిచి నకిలీవని తేలిన వెంటనే ఫిర్యాదు చేసి పరిహారం పొందవచ్చు.
- శివనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి

ఈ విషయాలు పాటిద్దాం
● అన్నదాత మొదట విత్తన రకం ఎంపిక చేసుకోవాలి ● విత్తన కొనుగోలుకు వెళ్లిన దుకాణం వద్ద విత్తన రకం చెప్పి తీసుకోవాలి ● ప్రతి రైతు కచ్చితంగా రసీదుతో పాటు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ● ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. ● రసీదు సంచులను భద్రపరచుకోవాలి ● విత్తనం మొలక శాతం పరిశీలించేందుకు వంద విత్తనాలు నాటుకోవాలి/ విత్తాలి. వాటిలో 80 శాతం విత్తనాలు మొలక బాగా వస్తే ఆ విత్తనం వినియోగించుకోవచ్చు. విత్తన సంచిపై ఉన్న నంబరు, ప్యాకింగ్ చేసిన తేదీని సరి చూసుకోవాలి.

హైటెన్షన్ విద్యుత్తు లైన్లు మార్పు చేయాల్సిందే

● టవర్ల ఏర్పాటును అడ్డుకున్న రైతులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : అనంతపురం నుంచి కడప జిల్లాలోని పవర్‌గ్రిడ్ సంస్థ వరకు 400 కేవీ హైటెన్షన్ విద్యుత్తు లైన్లు మార్పు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం సీకేదిన్నె గ్రామ సమీపాన ఉన్న చెరువులో ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు టవర్లను రైతులు అడ్డుకున్నారు. గత ఏడాది కిందటే రైతులు విలువైన భూముల్లో పాటు కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారి పక్కనే హైటెన్షన్ విద్యుత్తు లైన్లు వేయవద్దని తాము విన్నవించినట్లు రైతులు అధికారులకు వివరించారు. దీంతోపాటు గత నెల రోజుల కిందట కూడా 400 కేవీ విద్యుత్తు లైన్ల డిజైన్ మార్పు చేయాలని పవర్‌గ్రిడ్ అధికారులకు ,రెవిన్యూ అధికారులకు విన్నవించడంతో ఆర్‌డీఓతోపాటు తహసీల్దారు వచ్చి విచారించి, ఎవరికీ ఇబ్బంది లేకుండా డిజైన్ మార్పు చేస్తామని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. అయితే పవర్‌గ్రిడ్ సంస్థ పట్టించుకోకుండా తమపని తాము చేసుకుంటూ పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కడప నగర సమీపంలోని విలువైన భూముల్లో కాకుండా కొండ ప్రాంతాల ద్వారా విద్యుత్తు లైన్లను తీసుకుపోవడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎన్నో విద్యుత్తు లైన్లను కొండ ప్రాంతాల నుంచే తీసుకెళ్లారని, దీనిని కూడా అలాగే తీసుకెళ్లాలని, లేదంటే ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్తు టవర్ల ఏర్పాటును అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేశారు. రైతులు విద్యుత్తు టవర్లను అడ్డుకోవడంతో చేసేదేమీలేక పవర్‌గ్రిడ్ అధికారులు పనులు నిలుపుదల చేసి వెళ్లిపోయారు. ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

సీకేదిన్నె చెరువులో హైటెన్షన్ విద్యుత్తు లైన్ల ఏర్పాటును అడ్డుకుంటున్న రైతులు

దానిమ్మ సాగు... లాభాలు బాగు

రైతేరాజు

దానిమ్మ తోటను చూపుతున్న రైతు అర్లప్ప

స్ఫూర్తి

రామసముద్రం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ తాలుకా గూకుంట గ్రామానికి చెందిన రైతు అర్లప్ప అయిదెకరాల్లో దానిమ్మ సాగు చేపట్టారు. భూమిని బాగా దుక్కి చేసి 20 ట్రాక్టర్ లోడ్ల పశువుల ఎరువును కలిపారు. నెల రోజుల పాటు మగ్గిన తరువాత 8x6 వెడల్పుతో బెడ్లను ఏర్పాటు చేసి మల్చింగ్ పేపరు, బిందుసేద్యం అమర్చారు. మొక్కల మధ్య దూరం ఆరు అడుగులు ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. అందులో 1,250 మొక్కలను నాటారు. ఏడాది కాలంగా మొక్కలు బాగా ఎదిగిన తరువాత దిగుబడికి వదిలారు. ప్రస్తుతం మొక్కకు 20 కిలోల వరకు దిగుబడి వచ్చింది. కాయల బరువుకు కొమ్మలు విరగకుండా కట్టెలను ఊతంగా ఇచ్చారు. తోటపై క్రిమి కీటకాల నివారణకు మెష్ ఏర్పాటు చేశారు. సాగుకు రూ.20 లక్షల వరకు వ్యయం చేశారు. దిగుబడి అమ్మకానికి సిద్ధంగా ఉంది. మార్కెట్‌లో కిలో దానిమ్మ ధర రూ.200 వరకు పలుతోంది. తోట వద్దకే వ్యాపారులు దిగుబడి కొనుగోలుకు వస్తున్నారు. మొదటి దిగుబడిలోనే రైతుకు రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఏటా రెండుసార్లు దిగుబడి అందనుంది. సాగులో మంచి నిర్వహణ ఉంటే అయిదేళ్ల పాటు దిగుబడులు అందనుందని రైతు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై సీఎంకు ఫిర్యాదు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ నిధులను గత వైకాపా పాలనలో దుర్వినియోగం చేసిన అప్పటి ప్రజాప్రతినిధి, ఇద్దరు కార్యదర్శులు, ప్రత్యేక అధికారిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ కమిషనరు కార్యాలయాలకు రాతపూర్వకంగా రిజిస్టరు పోస్టు ద్వారా ఫిర్యాదు చేశామని 14వ వార్డు మాజీ సభ్యుడు, సీనియరు తెదేపా నేత మార్తల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. దీంతో తన ఫిర్యాదులను స్వీకరించడంతో బాధ్యులపై సమగ్రంగా విచారణ చేపట్టాలని జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిపై ఈ నెల 11న సీఎం, పంచాయతీ రాజ్ కమిషనరు కార్యాలయాల నుంచి తనకు చరవాణిలో సందేశం పంపినట్లు తెలిపారు. కరోనా మహమ్మారి- 1, 2 విడతల్లో దొంగ బిల్లులు పెట్టుకొని బ్లీచింగ్ పౌడి కొనుగోలు సందర్భంగా నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ప్రజల నుంచి వసూళ్ల పన్ను నగదు పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా దిగమించినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన బాధ్యులను కాపాడేందుకు జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

● పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డిని బలవంతంగా ఎత్తుకెళ్తున్న పోలీసులు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : పాత కడప దళితుల భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ కడప ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్సీపీ) నాయకులు చేస్తున్న ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం ఉదయం ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి నేతృత్వంలోని కార్యకర్తలు, పాతకడప దళితులు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ఎవరినీ లోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. కార్యాలయాన్ని తెరవాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమాన్ని ఆపేదిలేదని, ఎవరినీ లోనికి పంపేది లేదని వారు స్పష్టం చేశారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా వాహనాల్లో పలు పోలీసు స్టేషన్లకు తరలించారు. ఆ సమయంలో కాసేపు ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అంతేకాకుండా శిబిరాన్ని కూడా తొలగించారు. ఈ సందర్భంగా ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన భూమిని దళితులు సాగు చేసుకుంటే కొంతమంది దౌర్జన్యంగా వారి నుంచి వాటిని లాక్కున్నారు. ఇందుకు అధికారులు కూడా వత్తాసు పలికి దళితుల భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గడిచిన 30 రోజులుగా దళితులు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తుంటే నిత్యం కార్యాలయానికి వెళ్లే ఆర్‌డీఓ, ఇతర అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇందులో డబ్బులున్న వారికి వత్తాసు పలికేందుకే అని అనుమానం ఉన్నట్లు వివరించారు. దళితులు భూ సమస్య వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన హెచ్చరికలు చేశారు.

రూ.14 లక్షల విలువైన ఎరువుల సీజ్

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో హోల్‌సేల్ ఎరువుల దుకాణాలపై సోమవారం తిరుపతి విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారైన కర్నూలు డీఎస్పీ టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ... స్థానిక మహాలక్ష్మీ హోల్‌సేల్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. మూడు గోదాంలను పరిశీలించగా, అందులో ఒక్కదానికి హోల్‌సేల్‌కు సంబంధించిన అనుమతి లేకపోవడాన్ని, నిల్వల్లో తేడాలను గుర్తించామన్నారు. రూ.14 లక్షలు విలువ చేసే ఎరువులను సీజ్ చేసి విక్రయించొద్దని దుకాణ యజమానికి సూచించామన్నారు. ఈ తనిఖీల్లో కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు ఎంఏవో వరహర కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో దస్త్రాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

IN THE COURT OF HON'BLE VII ADDL. DISTRICT JUDGE, KADAPA
A.S.No.25/2020

1. Yarrasani Prathapa Reddy, S/o Late Subba Reddy, aged about 50 years, Hindu, Agriculture.
2. Yarrasani Pulla Reddy, S/o Late Subba Reddy, aged about 46 years, Hindu, Agriculture.
Both are residents of Upparapalli Village, Chennur Mandal, Kadapa District.
- Appellants/D1, D2

Vs

9. Yerrasani Rama Devi, W/o Muralidhar Reddy, aged 52 years, Housewife, resident of Engineerkottala Village, Khajipeta Mandal, Kadapa District.
12. B.Satish Reddy, S/o Chennakrishna Reddy aged about 35 years, Hindu, D.No.3-2-79, Bramahana Veedhi, Pulivendula Mandal, Kadapa District. - Respondents No.9 & 12

NOTICE TO RESPONDENTS No. 9 & 12

పై దావాలోని Appellants Lower Court (Principal Senior Civil Judge, Kadapa) O.S.No.51/2007 జడ్జి వారు ఇచ్చిన డిక్రీ మరియు జడ్జిమెంట్‌ను రద్దు చేయమని కోరుచూ హైకోర్టులో హైబిల్ దాఖలు చేసి ఉన్నారు. సదరు అప్పీల్‌లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 31.07.2025న ఉన్నది. కావున మీరు 31.07.2025న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైన అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// By order of Court //
Sri. P.Rajendra Prasad,
Advocate for Appellants

ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య : ఓపెన్ ఇంటర్మీడియట్ 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైనట్లు కోఆర్డినేటర్ రాజారావు ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సు ఒకే ఏడాదిలో పూర్తయ్యేలా ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్‌లో చేరాలనుకునే వారు పదో తరగతి పాస్ అయి ఉండాలని, పదో తరగతి మార్కులిస్ట్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల ధ్రువీకరణ, ఒక ఫొటోతో కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద సంప్రదించాలని తెలిపారు. వివరాలకు చరవాణి నం:91820 99672కు సంప్రదించాలని కోరారు.

బాధితులకు న్యాయం చేయండి : ఎస్పీ

బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు, పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రతి ఒక్క బాధితులకు న్యాయం చేయాలని జిల్లా పోలీసు అధికారి అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల - పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులొచ్చి వారి సమస్యలను ఎస్పీకి వినతుల రూపంలో అందజేశారు. ఎస్పీ వాటిని పరిశీలించి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి కొన్ని ఫిర్యాదులను సంబంధిత ఠాణాలకు బదలాయించారు. ఎస్పీ మాట్లాడుతూ.. న్యాయబద్ధమైన ప్రతి ఒక్క ఫిర్యాదును పోలీసులు స్వీకరించాలన్నారు. ఎక్కువగా భూ సమస్యలు, కబ్జాలు, దౌర్జన్యాలు, వివాహేతర సంబంధాలు తదితర ఫిర్యాదులొస్తున్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోలీసులు న్యాయం చేస్తారనే నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది వస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయరాదని తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించాలని, విజిబుల్ పోలీసింగ్ ఉండాలని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 180 ఫిర్యాదొలొచ్చాయి.

సమస్యల పరిష్కారానికి 21న 'చలో విజయవాడ'

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలలోని ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీపీపీ ప్రధాన ద్వారం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపిచ్చామన్నారు.

నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పాఠశాలలు నిబంధనలు పాటించకపోతే చర్యలు

కడప విద్య : జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రైవేట్ పాఠశాలలు జీఓ నం: 1 (1994 జనవరి 1) మేరకు పనిదినాలు, సమయపాలనతో జరపాలని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలవు దినాల్లో ఎటువంటి ప్రైవేట్ తరగతులు, రెండో శనివారం, ఆదివారాలు, సాయంత్రం 5 గంటల తరువాత పాఠశాలలు నిర్వహించరాదన్నారు. కడప డీసీఈబీ ఇచ్చిన క్యాలెండర్ ప్రకారమే పని దినాలు జరగాలన్నారు. ఏ విధమైన పాఠశాలలు పిల్లలకు ఎలాంటి తరగతులు నిర్వహించరాదని, ఉత్తర్వులు ఉల్లంఘిస్తే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలన్నింటినీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు స్పష్టం చేశారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే ఏపీపీఎస్సీ పరీక్షలు ఉదయం 9.30, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కావాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగరాదన్నారు. లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలన్నీ సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అధికారులు అంజమ్మ, పద్మప్రియ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

పాపిరెడ్డి

మైలవరం, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక మైలవరం మండలం ధన్నవాడ గ్రామానికి చెందిన పులిచెర్ల పెద్ద పాపిరెడ్డి (49) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పురుగుల మందు తాగి జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్‌రోడ్డులోని కర్మలవారిపల్లె సమీపంలో బలవన్మరణం చెందారని ఎస్సై శ్యాంసుందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై వివరాల మేరకు... 14 ఎకరాల పొలంలో మిరప, మొక్కజొన్న పంటలు వేయగా... పురుగులు పట్టి దిగుబడి ఆశించినంతగా రాలేదు. దానికి తోడు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలు ఉండడంతో రూ.లక్షల్లో అప్పులు చేశారు. దీంతో మనోవేదనకు గురయ్యారు. సోమవారం ఉదయం పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు పేర్కొన్నారు. పాపిరెడ్డి కుమారుడు మునిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జిల్లా జట్టుకు బాలబాలికల ఎంపిక

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు జార్జిక్లబ్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జిల్లా జట్టుకు అండర్-11, 13 బాలబాలికలకు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 200 మంది చిన్నారులు పాల్గొన్నారు. సింగిల్, డబుల్స్ విభాగంలో బాలబాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అండర్ 11 రాష్ట్రస్థాయి పోటీలకు కడప జిల్లా వేదికవ్వడం శుభపరిణామమన్నారు. అండర్-11 బాలికలకు డి.ప్రణవి, సస్యరాయ్, సారా (కడప), అండర్-13 డి.ప్రణవి, ఎం.అక్షర (కడప), నిహతిరెడ్డి, తారికారెడ్డి (ప్రొద్దుటూరు). అండర్-11 బాలురు... పీబీజీ.గౌతమ్, ఎస్వీ.సాత్విక్‌రెడ్డి, హావిష్ (ప్రొద్దుటూరు), అండర్-13 ఎ.త్రిషల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పీబీజీ గౌతమ్ (ప్రొద్దుటూరు) జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వారికి ప్రశంసా పత్రాలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగం భాస్కర్‌రెడ్డి, ఛైర్మన్ జిలాన్ బాషా అందజేశారు.

నిర్వాహకులతో జిల్లా జట్టుకు ఎంపికైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

కెనరా బ్యాంక్ Canara Bank
కడప మోచంపేట బ్రాంచ్ (13215)
S R K జూనియర్ కాలేజ్, మోచంపేట, కడప, ఆంధ్రప్రదేశ్-516001.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత(లు): శ్రీమతి నంద్యాలంపేట ఇమామ్‌బీ, శ్రీ నంద్యాలంపేట గౌస్ పీర్ మరియు శ్రీ షేక్ షేక్షావలీ (ఇక మీదట ఋణగ్రహీతగా సూచిస్తారు) వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 43,13,678.23/-** (అక్షరాల నలభై మూడు లక్షల పదమూడు వేల ఆరు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మరియు ఇరవై మూడు పైసలు మాత్రమే) మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **24.04.2025** న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **11.07.2025**వ తేదీన స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీత, హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్, మోచంపేట బ్రాంచ్ వారికి తేది. 11.07.2025 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.43,97,857.67/-** (అక్షరాల నలభై మూడు లక్షల తొంభై ఏడు వేల ఎనిమిది వందల యాభై ఏడు రూపాయలు మరియు అరవై ఏడు పైసలు మాత్రమే) + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు:
కడప జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గూడూరు గ్రామ పొలాలు, అల్మాస్‌పేట ఇంటీరియర్ పరిధి, వార్డు నెం.08, స్థలం సర్వే నెం.527 & 360, ప్లాట్ నెం.41, డోర్ నెం.8/726-30-4-2 వద్ద మొత్తం స్థలం విస్తీర్ణం: మొత్తం విస్తీర్ణం 2.42 సెంట్లు లేదా 117.14 చ||గ||లు, స్థలం నికర విస్తీర్ణం: 2.27 సెంట్లు లేదా 109.86 చ||గ||ల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు ఆస్తి. హద్దులు : ఉత్తరం : షేక్ నిసార్ అహ్మద్ గారి ఇల్లు, దక్షిణం : గయాస్ భాషా, ఎస్. మున్నీర్ అహ్మద్ గార్ల ప్లాట్ నెం.41 (భాగం), ప్లాట్ నెం.42, మొత్తం 4 సెంట్లు 880 లింకులు స్థలం, తూర్పు: 1 అడుగు సొంత సందు ఆ తర్వాత షేక్ రసూల్ ప్లాట్ నెం.22 ఇల్లు, పడమర : రోడ్డు. టైటిల్ హోల్డర్: శ్రీమతి నంద్యాలంపేట ఇమామ్‌బీ.

తేది: 11.07.2025, ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

హోరాహోరీ పోరులో కర్నూలు విజయం

● తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో చిత్తూరు

వివేక్ రుత్విక్ కల్యాణ్ నేత్రానంద
యూహాస్ హితేష్ సుశాంత్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడపలోని వైఎస్‌ఆర్ఆర్ - ఏసీఏ స్టేడియంలో కర్నూలు - నెల్లూరు జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో కర్నూలు జట్టు విజయం సాధించింది. 3 వికెట్ల నష్టానికి 81 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు సోమవారం బ్యాటింగ్ ఆరంభించిన నెల్లూరు జట్టు 113 పరుగులకే ఆలౌట్ అయ్యింది. జట్టులో సిద్ధు 24 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో వివేక్ 6, యూహాస్ 4 వికెట్లు తీసుకున్నారు. తరువాత కర్నూలు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించి 29.5 ఓవర్లలో 56 పరుగులకే అంతా అవుట్ అయ్యింది. నెల్లూరు బౌలర్లలో నేత్రానంద 5, సుశాంత్ 4 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 121 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన నెల్లూరు జట్టు 43 ఓవర్లలో 94 పరుగులకే ఆలౌట్ అయ్యింది. జట్టులో గురు, యశంత్‌లు చెరో 35 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో రుత్విక్ కల్యాణ్ 5, యూహాస్ 3 వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో కర్నూలు జట్టు 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. ● కేఓఆర్ఎం మైదానంలో 3 వికెట్ల నష్టానికి 299 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్‌ను ఆరంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు సోమవారం 71.4 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో షారుక్ అక్తర్ 222 పరుగులు చేశాడు. కడప బౌలర్లలో హితేష్ 4, గైబు 3 వికెట్లు తీసుకున్నారు. తరువాత కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించి రెండోరోజు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసింది. జట్టులో ఫర్హాన్ 58, ఫర్హాఖాన్ లోడి 48 పరుగులు చేశారు. కడప బౌలర్లలో తేజేశ్, జయప్రకాశ్ చెరో రెండేసి వికెట్లు తీసుకున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఆ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కడపలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి ఆధ్వర్యంలోని పలువురు ఉద్యోగులు బాధ్య కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందించారు. ఎనిమిది నెలలుగా వేతనాలు రాలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడారు. తక్షణమే ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి కూటమి ప్రభుత్వంలో నియామకాలు పొందిన వారికి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేతనాలు విడుదల చేయాలని కోరుతున్న నాన్ టీచింగ్ స్టాఫ్

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం|| Cell: 7382114647.

JOBS

ప్రొద్దుటూరు HGN ఏజన్సీ నందు పనిచేయుటకు అవుట్‌డోర్/షాపు సేల్స్‌మెన్స్, టూల్స్ మెకానిక్స్, ఆఫీస్ బాయ్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Cell: 9100463787, 9515089758.

హాస్టల్ వార్డన్ కావలెను (లేడీ) ఆచార్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, D.అగ్రహారం, B. మఠం (మం). Cell: 8341847444, 9052208001.

పల్లా హాస్పిటల్, 7రోడ్స్ సర్కిల్, కడప నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & CARM టెక్నీషియన్స్ కావలెను. Cont: 9849040153.

FACULTY/ TEACHERS

Wanted Teachers Spoken English-1, Receptionist-1, Kadapa Contact No: 9154944970, 9154944955.

SECURITY GUARDS

కడప అరవింద నగర్ సమీపాన మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ, 13000/- జీతం + ESI, PF, చదువు 10 పాస్, వయస్సు 22 నుండి 40 ఏళ్లు. సంప్ర: 72879 17477.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ప్రొద్దుటూరు
•ప్రొద్దుటూరు •జమ్మలమడుగు •బద్వేలు •మైదుకూరు

పోలీసులు ఫుట్ పెట్రోలింగ్

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: చిలమకూరు గ్రామంలో ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై దుకాణాదారులు ఏర్పాటు చేసిన వస్తువులను తొలగించారు. దుకాణారులు వారి స్థలం పరిధిలోనే వస్తువులను ఉంచాలని సీఐ సూచించారు. కాలిబాటలు ఆక్రమించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు దుకాణాదారులకు వివరించారు.

ఉషేన్‌పీర్ ఔవులియా ఉరుసు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని దర్గా వీధిలో ఉండే హజరత్ ఉషేన్‌పీర్ ఔవులియా ఉరుసు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో హిందూ, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్గా వద్ద పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఖవ్వాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కమిషనర్‌తో 'వాక్-విత్ ఈనాడు' నేడు

మైదుకూరు పురపాలక సంఘ కమిషనర్ ఎం.శ్రీనివాసరెడ్డి పురపాలక పరిధిలోని గాంధీ నగర్, మాబునగర్ వీధుల్లో పర్యటించనున్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా కమిషనర్ దృష్టికి ప్రజలు తీసుకురావచ్చు. ఈ సమస్యలను కమిషనర్ పరిష్కరించనున్నారు. మురుగుకాలువల్లో పూడికతీత పనులు, తాగునీటి పంపిణీ, వీధిదీపాలు వెలగకపోవడం, స్వయం సహాయక సంఘాలకు చెందిన సమస్య, ఇంటింటి కసువు సేకరణ తదితర సమస్యలను కమిషనర్‌కు ఆ ప్రాంతవాసులు విన్నవించవచ్చు. -న్యూస్‌టుడే, మైదుకూరు

ఎం.శ్రీనివాసరెడ్డి, కమిషనర్

తేదీ : మంగళవారం 15-7-2025 | సమయం : ఉదయం 7.00 గంటలకు ప్రారంభం

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

స్పందనకు వందనం

ముద్దనూరు: ఎస్వీగిరికాలనీలో ఇళ్ల మధ్యలో చెత్తాచెదారం వేయడం వలన చెత్త కుళ్లి దుర్వాసన వస్తోందని ఈ సమస్య ఈనెల 5వ తేదీ 'మేమున్నాం మీకుతోడుగా'లో ప్రచురితమైంది. అధికారులు స్పందించి పనులు చేయించారు.

ముద్దనూరు: కొత్తకోటాల వీధిలో విద్యుత్తు తీగలు తగ్గుకు వేలాడుతూ చెట్టుకొమ్మలు తగులుతు ప్రమాదకరంగా ఉన్నాయని ఈనెల 5వ తేదీ 'మేమున్నా మీకు తోడుగా'లో ప్రచురితంకాగా విద్యుత్తు అధికారులు స్పందించారు. చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్తు తీగలను సరిచేశారు.

?: ప్రొద్దుటూరు పట్టణం పొట్టిపాడురోడ్డు వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న శ్రీనగర్ కాలనీలో మురుగుకాలువలు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నాం. కాలువలు లేకపోవడంతో ఏర్పాటు చేసిన గుంతలు నిండిపోయాయి. **-సుబ్బారెడ్డి, స్థానికుడు**

✓: నూతన కాలువల నిర్మాణానికి సాధారణ నిధులు రూ.4.80 లక్షలు నిధులతో పని చేపట్టడానికి పురపాలక అనుమతి ఇచ్చింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. **-దస్తగిరి, ఏఈ, పురపాలకసంఘం**

?: ప్రొద్దుటూరులోని ఇస్లాంపురం వీధిలో కాలువల్లో మురుగు నిండింది. సకాలంలో తొలగించకపోవడం వలన దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నాం. **-సుబ్బరాయుడు, స్థానికుడు**

✓: కాలువల్లో ఉన్న మురుగును సకాలంలో తొలగిస్తాం

?: ప్రొద్దుటూరు పట్టణం హోమస్‌పేట నుంచి మనోజీరావువీధికి వెళ్లే దారిలో చెత్తడబ్బా నిండింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో సకాలంలో చెత్తను తొలగించాలి. దుర్వాసన వస్తోంది. **-రఘునాథ్, స్థానికుడు**

✓: చెత్తను సకాలంలో తొలగిస్తాను. సమస్య పరిష్కరిస్తాం.

?: ప్రొద్దుటూరు పట్టణం సుబ్బిరెడ్డికొట్టాలవీధిలో ప్రైవేటు ఆసుపత్రులకు ఎదురుగా ఉన్న మడూరుకాలువలో పూడిక నిండింది. పూడికను తొలగించకపోవడం వలన దుర్వాసన వస్తోంది. **-అమర్, స్థానికుడు**

✓: పూడికను తొలగిస్తాం. దుర్వాసన లేకుండా పనులు చేయిస్తాం.

(పై సమస్యలకు పురపాలక సంఘ పారిశుద్ధ్య అధికారి సుబ్బరాయుడు సమాధానాలు చెప్పారు.) -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

?: ముద్దనూరు: పట్టణంలోని అమ్మవారిశాల ఆలయం వెనుక భాగంలో మురుగు కాలువలో పూడిక పేరుకు పోయింది. దీంతో దోమల బెడద అధికంగా ఉంది. దుర్వాసన వస్తూ చాలా ఇబ్బంది పడుతున్నామని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **-స్థానికులు**

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి అమ్మవారిశాల ఆలయం వెనుక భాగంలో ఉన్న మురుగు కాలువలో పూడిక తొలగిస్తాం.

?: ముద్దనూరు-జమ్మలమడుగు ప్రధాన రహదారిలోని రైల్వేగేట్ల సమీపంలో రోడ్డు పక్కనే చెత్తాచెదారం, వ్యర్థాలు వేయడం వలన అపరిశుభ్రత చోటు చేసుకుంది. దుర్వాసన వస్తోంది. **-బాషా, ముద్దనూరు**

✓: రోడ్డు పక్కలో వేస్తున్న చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేయిస్తాం.

(పై రెండు సమస్యలకు ముద్దనూరు పంచాయతీ కార్యదర్శి నరసింహులు సమాధానం చెప్పారు.) -న్యూస్‌టుడే, ముద్దనూరు

అప్రమత్తతే శ్రీరామరక్ష

ఈనాడు-ఈటీవీ అవగాహన సదస్సులో డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. రకరకాల పేర్లతో ఖాతాల నుంచి సొమ్ము లాగేసేందుకు ప్రయత్నం చేస్తుంటారని అప్రమత్తంగా ఉండి మోసానికి గురికావొద్దని హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జమ్మలమడుగులోని సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో 'సైబర్ నేరాలపై' అవగాహన సదస్సు జరిగింది. డీఎస్పీతో పాటు ట్రైనీ డీఎస్పీ భవానీ, పట్టణ సీఐ లింగప్ప, కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి హాజరై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారి రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తామని, బహుమతి వచ్చిందని, ఖాతా పనిచేయడంలేదని ఇలా సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఓటీపీ అడుగుతుంటారని చెప్పారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పకూడదని సూచించారు. పొరపాటున సైబర్ ఉచ్చులో పడి మోసపోయిన వారు మొదటి గంటలోనే పోలీసులకు ఫోన్ చేయాలని సూచించారు. 1930, 112 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ అవకాశం ఉంటుందన్నారు. నేరగాళ్లు బాధితుల ఖాతాల నుంచి దోచేసిన సొమ్మును నిమిషాల వ్యవధిలోనే వేర్వేరు ప్రాంతాల్లోని ఖాతాల్లోకి బదిలీ చేస్తారని, కొన్ని గంటల్లోనే వేరే ఖాతాల్లోకి పంపి ఏటీఎం ద్వారా డ్రా చేసుకుంటున్నారన్నారు. బాధితుడికి మొదటి గంట కీలకమని వివరించారు. ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగం ఇప్పిస్తామని వస్తున్న మెసేజ్‌లను పట్టించుకోవద్దన్నారు. నెలకు రూ.లక్షల్లో జీతం ఉంటుందని విద్యార్థులకు ఆశ చూపి ఖాతాల్లో నగదును క్షణాల్లో లాగేస్తారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో అమ్మాయిల ఫొటోలను పెట్టి నగదు కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తారని నిరంతరం జాగ్రత్తగా ఉండాలన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పక్కన శిక్షణ డీఎస్పీ భవానీ

హాజరైన విద్యార్థులు..

జాగ్రత్తగా ఉంటాం

సైబర్ నేరాలపై ఏవిధంగా జాగ్రత్తగా ఉండాలో అవగాహన కలిగింది. పోలీసు ఉన్నతాధికారులు తాము పరిష్కరించిన కేసులను ఉదహరిస్తూ వివరించారు. మేము కూడా అప్రమత్తంగా ఉంటాం. తెలియని ప్రజలకు వివరిస్తాం. **-అమృత, డిగ్రీ విద్యార్థిని**

స్నేహితులకు తెలియజేస్తా

సైబర్ నేరానికి గురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలిసేది కాదు. పోలీసు అధికారులు 1930, 112 నంబర్లకు ఫోన్ చేయాలని వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మా స్నేహితులకు చెబుతాను. ఓటీపీ బయటివారికి తెలియకుండా జాగ్రత్త పడతాం. **-హైమావతి, డిగ్రీ విద్యార్థిని**

ముళ్లపొద తొలగింది..దారి చూపింది

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం- పులివెందుల మార్గంలోని లావనూరు గ్రామంలో గ్రామాలు ఎంత దూరంలో ఉన్నాయో తెలిపే సూచిక బోర్డు చుట్టూ ముళ్ల పొదలు అలముకున్నాయని ఈనెల 14వ తేదీ 'ఈనాడు'లో 'సూచిక..దారి చూపక' శీర్షిక కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన ఆర్‌అండ్‌బీ ఏఈ సంజీవ్ స్పందించి ముళ్లపొదలను సోమవారం తొలగింపజేశారు. దీంతో సూచిక బోర్డులో గ్రామాల పేర్లు, వాటి దూరం, వెళ్లాల్సిన మార్గం వివరాలు తెలుస్తుండటంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొలగిన డెక్క... ఆయకట్టుకు నీరు ఎంచక్కా!

మైదుకూరు, న్యూస్‌టుడే : జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట వద్ద కేసీ కాలువకు నీటిని మళ్లించే తూముల వద్ద పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్కను సోమవారం తొలగించారు. సాగునీరు సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. 'డెక్క నిండిన కాలువ.. డొక్కలెండినా కానవా!' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు సిబ్బందిచే గుర్రపుడెక్కను తొలగించారు. తూముల వద్ద సాగు నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేశారు.

ముక్తిరామలింగేశ్వరుడి ఆలయానికి ఆదాయం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు రామేశ్వరంవీధిలో ముక్తిరామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 39 ఎకరాల 84 సెంట్ల భూమికి రూ.3,73,500ల ఆదాయం వేలంపాట ద్వారా లభించింది. సోమవారం దేవస్థానంలో సోములవారిపల్లెలో ఉన్న ఈ భూములకు 50 మంది రైతులు వేలంపాటలో పాల్గొనగా గతేడాది కన్నా రూ.2,43,000లు అధికంగా ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మార్తల రాజారెడ్డి తెలిపారు. హుండీలు లెక్కించగా రూ.1,27,657ల రాబడి వచ్చిందని ఈవో ఎ.శ్రీధర్ చెప్పారు. డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎ.కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది.

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలోని బాలాయపల్లె గ్రామంలో తాగు, సాగునీటి సమస్యపై సోమవారం ఆర్డీవో చంద్రమోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ముందస్తుగా తాగు నీటి సమస్య పరిష్కారంలో భాగంగా చెడిపోయిన బోరు, పాడైన పైపులైను సత్వరమే సరిచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఈవోఆర్డీ రహీం, మాజీ సర్పంచి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్తంభం ఒరిగి.. ప్రమాదం పొంచి ఉంది

జమ్మలమడుగు పట్టణంలోని వెంకటేశ్వరకాలనీ సమీపంలో నవాజుకట్ట వద్ద మురుగు కాలువలో ఉన్న సిమెంటు విద్యుత్తు స్తంభం ఒరిగి పోయి ప్రమాదకరంగా మారింది. కిందిభాగం పూర్తిగా దెబ్బతిని ఓ వైపు ఒరిగి విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతుండటంతో స్థానికులు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని వాపోతున్నారు. ఈ విషయమై విద్యుత్తుశాఖ డీఈఈ రాజగోపాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలగిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం (అంతర చిత్రంలో) పూర్తిగా దెబ్బతిన్న కిందిభాగం

ఆడపిల్ల భారమనే ఆలోచన తగదు

మాట్లాడుతున్న డీడీఎంహెచ్‌వో గీత, పక్కన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: సమాజంలో ఆడపిల్ల అంటే భారం అనే ఆలోచన చేయడం తగదని డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత అన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో సోమవారం 'డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నాయన్నారు. ఎవరైనా ఇలా చేస్తున్నట్లయితే కమిటీ దృష్టికి తీసురావాలని తెలిపారు. గర్భస్రావాలు జరగకుండా చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రూపానంద్, కమిటీ సభ్యులు డాక్టర్ యశస్విని, చిన్నపిల్లల వైద్యులు కిరణ్, రేడియాలజిస్ట్ గోపాల్, శ్రీదేవి, దేవదాసు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వంటావార్పుతో పురపాలక కార్మికుల సమ్మె

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగ ఒప్పంద కార్మికులు సోమవారం వంటావార్పుతో సమ్మెను కొనసాగించారు. ఈ సమ్మెకు మద్దతుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యం, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి సురేష్‌బాబు, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇనాయతుల్లా మద్దతు తెలిపారు.

వంటావార్పులో ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికులు

ప్రొద్దుటూరులో ఏబీవీపీ నాయకుల ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న వరుణ్‌కుమార్‌రెడ్డి, హరినారాయణ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో నాయకులు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఈసీ సభ్యుడు వరుణ్‌కుమార్‌రెడ్డి, భాజపా జిల్లా కార్యదర్శి అరకటవేముల హరినారాయణ ర్యాలీని ప్రారంభించారు. గాంధీరోడ్డు నుంచి విజయకుమార్ కూడలి మీదుగా శివాలయం సర్కిల్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానంద కలలను నిజం చేసేందుకు ఏబీవీపీ పనిచేస్తోందన్నారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటం చేసేందుకు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరణ్ కుమార్, పట్టణ కార్యదర్శి శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రామసుబ్బారెడ్డి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా ఎద్దుల రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం స్థానిక కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

దళితుల భూముల రక్షణకు చర్యలు అవసరం

చాపాడు, న్యూస్‌టుడే: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన భూములు, ఇళ్ల స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, రెవెన్యూ అధికారులు వాటిని కాపాడాలని మైదుకూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రామసుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తహసీల్దారు రమాకుమారికి వినతిపత్రం ఇచ్చారు. పలుకుబడి ఉన్న వ్యక్తులు, రియల్టర్స్‌కు అనుకూలంగా దస్త్రాలు సృష్టించి దళితులకు కేటాయించిన భూములు లాక్కోవడాన్ని తమ పార్టీ ఖండిస్తోందన్నారు. చాపాడుకు చెందిన జేమ్స్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పద్నాలుగు ద్విచక్ర వాహనాల జప్తు

జమ్మలమడుగు,ముద్దనూరు, ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వాహనాల తనిఖీల్లో 14 ద్విచక్ర వాహనాలను జప్తు చేసినట్లు ఎస్ఐలు రామకృష్ణ, హైమావతి తెలిపారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్‌లో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. మైనర్ డ్రైవింగ్, సైలెన్సర్ లేని వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరికి కౌన్సెలింగ్ చేసి పంపించామని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ కోరారు. పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈవోకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని చెప్పారు. ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. సీనియారిటీ ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులుగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఈవోకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రవికుమార్, సఫా, పీరయ్య, కేశవ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల ఈవోకు వినతి పత్రం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పథకాల అమలులో నిర్లక్ష్యం

ఖాజీపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం ఖాజీపేటోని ఫంక్షన్ హాల్లో జరిగిన వైకాపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో కాకుండా మోసపూరితంగా సాగిస్తున్నారని ఆరోపించారు. తల్లికివందనం అంటూ ఆంక్షలు విధించాడని, తెదేపా నాయకులకే మేలు చేస్తున్నారని విమర్శించారు. నాయకులు రాఘవ, రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి, శేఖర్ రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భీమగుండం ఎత్తిపోతలపై విచారణ కమిటీ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పెద్దముడియం మండలంలో కుందూనదిపై నిర్మించిన భీమగుండం ఎత్తిపోతల పథకం పనుల అవకతవకలపై విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీరు కిరణ్‌కుమార్‌ను విచారణ కమిటీకి అధికారిగా నియమించింది. పనుల్లో అవకతవకలతోపాటు తొమ్మిది మంది అధికారులను విచారించనున్నారు. అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు.

ప్లాస్టిక్ తయారీ, వాడకం అరికట్టాలని వినతి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణంలో ప్లాస్టిక్ తయారు, అమ్మకం, వినియోగం ఎక్కువగా ఉందని వీటిపై దృష్టి సారించి అరికట్టాలని సీపీయూఎస్‌ఐ (ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ) జిల్లా కార్యదర్శి ప్రతాప్ కోరారు. ఇవి ప్రజల, పశువుల ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయని తెలిపారు. ఈ మేరకు కమిషనరు రవిచంద్రారెడ్డి, ఆర్డీవో మనీషాకు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. ప్రొద్దుటూరులో వాటర్ ప్లాంట్లకు చెందిన ఆటోలకు పత్రాలు, వాటి డ్రైవర్లు లైసెన్సులు లేకుండా నడుపుతున్నారని వారిని గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆర్డీవోను కోరారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల చెరువు నుంచి వచ్చే కాలువలు ఆక్రమించి నిర్మించారని వీటిని తొలగించాలని వైకాపా జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. పోరుమామిళ్లలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కొంతమంది నాయకులు ఖాళీ జాగా కనిపిస్తే ఆక్రమించేస్తున్నారని అన్నారు. రాత్రికి రాత్రే రికార్డులు తారుమారు చేసి కబ్జాలు చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి అర్హత లేకున్నా 2017లో అసైన్‌మెంట్ కమిటీలో 3.22 ఎకరాలు పొందారని చెప్పారు. అనువంశిక పేరుతో 0.74 సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆరోపించారు.

పాస్‌పోర్ట్స్ పోయినవి

YSR కడప జిల్లా, ప్రొద్దుటూరు టౌన్, YMR కాలనీకి చెందిన దేవతి సంజీవ్‌కుమార్ పాస్‌పోర్ట్ నెం. V1591323, దేవతి లౌక్యశ్రీ పాస్‌పోర్ట్ నెం. V1590903, దేవతి పార్వతి పాస్‌పోర్ట్ నెం. V1590122, దేవతి గురు శ్రీకర్ పాస్‌పోర్ట్ నెం. V1591739 మరియు మా స్వీడన్ వీసా కార్డ్స్ కూడా ఇంటి వద్ద కారు దిగుతుండగా పోయినవి. దొరికిన వారు క్రింది నెంబరుకు తెలియజేయగలరు. Cell : 9395308444

చెరువు భూములు కబ్జా

★ గూడెంచెరువు గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు

గూడాదేవి చెరువుపై అక్రమార్కుల కన్ను పడింది. ప్రజాప్రతినిధి పేర్లను వాడుకుంటూ ఏకంగా చెరువు భూములనే కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ సిబ్బందికి తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రైతులకు జీవనాధారం వంటి చెరువు కబ్జాకు గురికాకుండా అధికారులు అడ్డుకోవాలని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

అక్రమార్కులకు కల్పతరువు

ప్రొద్దుటూరు చిన్న నీటి పారుదలశాఖ పరిధిలో గూడాదేవి చెరువు, కొర్లకుంట, వేమగుంటపల్లె, కొత్తగుంటపల్లె, సున్నపురాళ్లపల్లె, బొమ్మేపల్లెలో చెరువులున్నాయి. వీటిలో గండికోటకు వెళ్లే దారిలోని గూడాదేవి చెరువు అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. ఇక్కడి నీళ్లు చుట్టు పక్కల భూములకు నీరందుతుంది. బొమ్మేపల్లె, భీమరాయునికొట్టాల, సుగాలి తండా వంకల మీదుగా ఈ చెరువుకు నీరు చేరుతుంది. దీని కింద సుమారు 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ చెరువు రూపురేఖలు కోల్పోయింది. పూడిక తొలగించాలన్నా అధికారుల అనుమతులు తీసుకోవాలి. అనుమతి లేకుండా యంత్రాలతో గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ నింపేందుకు రూ.500 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. ట్రాక్టర్ యజమానులు గ్రావెల్‌ను పట్టణంలో రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. కొద్ది రోజులుగా కొంతమంది వ్యక్తులు ప్రజాప్రతినిధి పేర్లను వాడుకుంటూ సుమారు 10 ఎకరాల స్థలాన్ని చదును చేస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ సిబ్బందికి ఈ విషయం తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. చిన్ననీటి పారుదల శాఖ, రెవెన్యూశాఖ అధికారులు దృష్టిసారించి చెరువును కాపాడాలని రైతులు కోరుతున్నారు. గూడాదేవి చెరువులో మట్టి తవ్వకాలు జరిపినా, కబ్జాకు యత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని చిన్ననీటిపారుదల శాఖ జేఈ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తే ట్రాక్టర్లు, యంత్రాలను జప్తు చేస్తామన్నారు.

గూడాదేవి చెరువులో కట్ట సమీపంలో అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

కబ్జా చేసేందుకు చదును చేసిన స్థలం



(c) eenadu

కడప

•కడప •పులివెందుల •కమలాపురం

సెమిస్టర్ పరీక్షలకు అవకాశం కల్పించరూ..

కడప విద్య, న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ విద్యార్థులకు 1, 2, 3, 4 సెమిస్టర్ పరీక్షలో కనీసం సెమిస్టర్ నుంచి ఒక సబ్జెక్టుకు అవకాశం కల్పించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 1, 2, 3, 4, 5 సెమిస్టర్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అవకాశం కల్పించేవారని, ప్రస్తుతం విశ్వవిద్యాలయ అధికారులు అటువంటి అవకాశం కల్పించకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఆలోచన చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ రాజేంద్ర, నాయకులు అఖిల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

కమలాపురం, న్యూస్‌టుడే : సహకార సంఘం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని నూతనంగా ఎర్రగుడిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సభ్యులు హరినాథ్‌రెడ్డి, వై.లక్ష్మీదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎర్రగుడిపాడు సహకార సంఘం కార్యాలయంలో వారితో సీఈవో శేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రామకృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడు, సభ్యులను సన్మానిస్తున్న సీఈవో శేఖర్‌రెడ్డి, తదితరులు

రైతుబజారులో కూరగాయల ధరలు



కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతు బజారులో కూరగాయలు కిలో ధరలు (నిన్నటివి) ఇలా.. బంగాళదుంప - 35, క్యాబేజీ- 25, క్యారెట్ - 60, బీన్స్ - 80, బీటీరూట్ - 40, కీర - 50, దొస - 35, బీర - 40, కాకర - 40, దొండకాయ - 50, ముల్లంగి - 35, అల్లం - 70, కాలీఫ్లవర్ - 40, క్యాప్సికం - 70, టమాటా - 25, మిరపకాయలు - 58, వంకాయ - 25, బెండకాయ - 20, మట్టిక్కాయ - 40, చిక్కుడుకాయలు - 55, అలసందకాయలు - 40, అనపకాయలు - 55, ఉల్లిపాయలు - 25, మునగకాయలు - 50.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి పనులకు శ్రీకారం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కడప నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని దేవునికడపలో రూ.23 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 127 పనులు చేపడుతున్నామని, ఇందుకోసం రూ.10.68 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, అదనపు కమిషనర్ రాకేశ్, పలువురు తెదేపా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

● నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని గంగమ్మ గుడి వద్ద సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కడప ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల నుంచి ప్రభుత్వ పాలనపై ఆరాతీశారు. ఎమ్మెల్యేకు స్థానికులు పలు సమస్యలు వివరించారు.

తాగునీటి సరఫరాకు సహకరించండి

కడప నగరపాలక : నగరపాలక ఇంజినీరింగ్ విభాగం కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి నగరపాలక కార్మిక సంస్థ కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. నగరంలో నీటి సరఫరా ఇతర అత్యవసర సేవలకు అంతరాయం కలిగించొద్దని ఆమె కోరారు. కార్మికుల సమస్యలను పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికులకు ఉచిత బీమా కల్పిస్తామన్నారు.

క్షతగాత్రులకు ఎస్పీ పరామర్శ

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద జరిగిన లారీ ప్రమాదంలో గాయపడిన వారు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సోమవారం ఎస్పీ అశోక్‌కుమార్ పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

మారుతీనగర్, న్యూస్‌టుడే : విద్యార్థినులు, మహిళలు సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఎంతో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. అవగాహనతోనే ఆ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ప్రైవేట్ యాప్‌లు, ప్రైవేట్ వెబ్‌సైట్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. సోమవారం స్థానిక కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐతో పాటు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాగాళ్లు ముఖ్యంగా మహిళలను లక్ష్యం చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ క్రైంపై అవగాహన లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు వారి బారిన అధికంగా పడుతున్నారన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లు వాడే మహిళలు, విద్యార్థులు, అమ్మాయిలు పరిచయం లేని అపరిచితులకు, అనుమానిత వ్యక్తులకు తమ పర్సనల్ డేటాతో పాటు ఫొటోలు షేర్ చేయడం, ఫేస్‌బుక్‌ల్లో, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల్లో కుటుంబ సభ్యులతో దిగిన సెల్ఫీలు, పర్సనల్ ఫొటోలు పోస్టు చేయొద్దని సూచించారు. దీనిని సైబర్ నేరగాళ్లు అవకాశంగా తీసుకుని మార్ఫింగ్ చేసి తర్వాత కుటుంబ సభ్యులను డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తారని, ప్రస్తుతం ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాట్సాప్‌లో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్, ఫేక్ యాప్ రుణాలపై, అనవసరంగా వచ్చే లింక్‌లు, ఓటీపీలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం సిబ్బంది గురులక్ష్మి, శిరీష, రెడ్డెప్ప, శ్రీనివాసులు, అమర్‌నాథ్‌రెడ్డి, లింగేశ్వర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సుకు హాజరైన విద్యార్థులు

మాట్లాడుతున్న సైబర్ క్రైం సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, పక్కనే కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా

ఇలాంటి కార్యక్రమాలు అవసరం : వాట్సాప్‌లో ఏవేవో లింకులు వస్తున్నాయి. వాటిని క్లిక్ చేస్తే ఇంతటి పెద్ద మోసాలు, నేరాలు జరుగుతాయన్న విషయం నాకు ఇంత వరకూ తెలియదు. అదృష్టంకొద్దీ ఇప్పటి వరకూ అలాంటి లింకుల జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జరిగిన సైబర్ క్రైం సదస్సులో సీఐ చెప్పిన పలు విషయాలు నాకు విస్మయాన్ని కల్గించాయి. ఇకపై నేను జాగ్రత్తగా ఉంటూ.. నా తోటి స్నేహితులకు, బంధువులకు ఈ విషయాన్ని తెలియజేస్తాను. ఈ సదస్సు నాకు చాలా ఉపయోగంగా ఉంది. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు చాలా అవసరం. **- పూజిత, విద్యార్థిని**

చాలా ఉపయోగపడింది : ప్రైవేట్ యాప్‌ల జోలికి వెళ్లకూడదని, సెల్ నంబర్లు, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, కుటుంబ సభ్యులకు కాకుండా ఎవరికీ పంపకూడదని ఈ సదస్సు ద్వారా నాకు అర్థమైంది. చరవాణికి ఎలాంటి లింకులు వచ్చినా వారికి ఓపెన్ చేయకూడదని సదస్సులో చెప్పారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జరిగిన సైబర్ క్రైం సదస్సు మాకు చాలా ఉపయోగపడింది.

- సబీహ, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని

మేమున్నాం.. మీకు తోడుగా..

కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

వేముల, న్యూస్‌టుడే : స్పందనకు వందనం

పెద్దజూటూరులోని కుప్పగుట్టపల్లె, మీదిపెంట్లలోని రాచకుంటపల్లెలో వీధుల్లో పారుతున్న మురుగును తొలగించారు. ఈ రెండు గ్రామాల్లో రోడ్లపై మురుగు పారుతూ దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనంపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు స్పందించి మురుగు తొలగించారు.

?: కమలాపురం పాత స్టేట్ బ్యాంకు నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే మార్గంలోని చెత్త కుండీ నిండి చెత్తంతా రహదారిపైకి చేరింది. **- శివ**

✓: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తరలిస్తాం. **- బాలనరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్,**

- న్యూస్‌టుడే, కమలాపురం

పౌరోహిత్యాన్ని కుల వృత్తిగా గుర్తించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే : పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నాయకులు కోరారు. సోమవారం స్థానిక మద్రాస్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో పంచమ పురోహిత విద్వత్ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెదేపా రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి, పొలిట్‌బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్, కడప తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జనసేన జిల్లా నాయకులు రమణ, హాజరై మాట్లాడారు. పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పురోహిత సమాఖ్య పెద్దలు కపిలవాయి సిద్ధాంతులు యామిజాలా నరసింహమూర్తి, పొదిలి నారాయణమూర్తి, దుర్గాబాబు, అంజన్‌కుమార్, నరసింహభట్టర్, జగదీశ్ ఆరయుర్, కౌశిక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నాయకులు

25 నుంచి అంజన్నకు శ్రావణ మాస ఉత్సవాలు

చక్రాయపేట, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండిక్షేత్రంలోని శ్రీవీరాంజనేయస్వామి శ్రావణ మాస ఉత్సవాలు ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని గండి ఆలయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. సోమవారం గండిక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గండిక్షేత్రంలో నూతన ఆలయ నిర్మాణానికి రూ. 28 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ఆలయ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా అధికారులు, ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఏపీ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, వైఎస్ఆర్ కడప జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం జడ్పీలోని డీపీఆర్సీ భవన్‌లో జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.రంగాచార్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ఏ సమస్యలు ఉన్నా సంఘం దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ముకుందరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కేశవులు, ప్రధాన కార్యదర్శిగా వి.వి.రమణ, కోశాధికారిగా కృష్ణారెడ్డి, సలహాదారుగా డాక్టర్ సి.వెంకటేశ్, కన్వీనర్లుగా చంద్రశేఖర్ రెడ్డి, నరసింహులు, ఉమెన్ కోఆర్డినేటర్లుగా నిర్మల దేవి, తాయారమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

CHANGE OF NAME

I, KOTTAPALLI BASHA, S/o LATE KOTHAPALLI NADIPI SIDDAIAH, R/o. D/o. 36/257-15, Sree Nagar, Chinna Chowk, Kadapa City, YSR District, A.P-516002, has been changed my name as "KOTHAPALLI BASHA, S/o LATE KOTHAPALLI NADIPI SIDDAIAH" (New Name).

పాస్‌పోర్ట్ పోయినది

ఓబన్నగారి అర్చన, భర్త ఓబన్నగారి నరసింహులు, డి.నెం. 2/37, సమైక్యనగర్, పెండ్లిమర్రి, వై.ఎస్.ఆర్. కడప జిల్లా, పాస్‌పోర్ట్ నెంబరు J5082175, నేను మా ఇంటి నుండి వెల్లటూరుకు ఆటోలో వెళ్తుండగా పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

Contact : 9948064661, 7337429473

PASSPORT LOST

I, Shaik Sabiya Begum, D/o Shaik Mastan, residing at D.No. 78/371-4, Achari Colony, Kadapa City, YSR Kadapa District, A.P., have lost my Indian Passport bearing No. V9865501, issued on 29.03.2022 by the Passport Office, Vijayawada (Valid till 28.03.2032), while going to a Xerox centre near I.T.I. Circle, Kadapa on 10.05.2025. If found, kindly return it.

మహారాజశ్రీ కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.P. No. 44/2024

Cheppali Babu, S/o late C.Yerikalaiah, R/at D.No. 8/62-8B, Prakash Nagar, Yerramukkapalli Post, Kadapa City.

- Petitioner/Debtor

Vs

A.Arjun Reddy and others

- Respondent/Creditors

Respondent No. 2 : Gunnipati Naga Raju, S/o G.Venkataiah, Resident of Gurrampadu Harijanawada, Chennur Mandal, Kadapa District.

నోటీసు

పైన తెలిపిన పిటీషనర్/డెబిటార్ తనను insolvent గా డిక్లేర్ చేయమని కోరుచూ రాజశ్రీ కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐ.పి. నెంబర్ 44/2024 పైన తెలిపిన రెస్పాండెంట్స్ (క్రెడిటార్స్) పైన దాఖలు చేసినాడు. సదరు కేసు **28-07-2025** తేదీన ఉదయం 10.30 నిమిషములకు మీ హాజరు కొరకు వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు పై కనపరిచిన కోర్టులో సదరు తేదీన హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు : జి.జ్ఞానప్రసాద్, అడ్వకేట్ & నోటరీ, కడప.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : అప్పులు ఎక్కువ కావడంతో తల్లీ తన ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు.. కడప ఎన్జీవో కాలనీకి చెందిన పి.యమున (28), సురేశ్‌కుమార్‌లకు గత కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి సింధూరి (9), కుసుమాంజలి (3) పిల్లలున్నారు. జూన్ 23వ తేదీ రాత్రి భర్త, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె ఇంట్లో నిద్రపోయారు. మరుసటి రోజు 24వ తేదీ సురేశ్‌కుమార్ వేకువజామున నిద్ర లేచి చూడగా భార్య యమున, తన ఇద్దరు పిల్లలు సింధూరి, కుసుమాంజలి కనిపించలేదు. భర్త చుట్టు పక్కల గాలించారు. ఎక్కడా కనిపించలేదు. యమున తనకు తెలిసిన వారి వద్ద ఎక్కువ మొత్తంలో అప్పులు చేసినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. ఎక్కడా కనిపించకపోవడంతో సోమవారం భర్త సురేశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశామని, ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్ట్

సిద్దవటం, న్యూస్‌టుడే : గంజాయి విక్రయం కేసులో సోమవారం మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేటలో ఈ నెల 5వ తేదీన వాహనాల తనిఖీ చేపట్టగా కడప నగరానికి చెందిన రెడ్డిసురేశ్ అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించామన్నారు. అతని వద్ద గంజాయి లభ్యం కాగా విచారించి అరెస్టు చేశామన్నారు. అదే రోజు అరెస్టు చేసి రిమాండుకు పంపించామన్నారు. ఈ కేసులో ఉన్న మరో వ్యక్తి అయిన కడప ఎన్జీవో కాలనీకి చెందిన హేమవర్ధన్ అలియాస్ హేము సోమవారం మాధవరం-1లోని పార్వతీపురం వద్ద ఉన్న గుడి వద్ద కనిపించగా అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. కడప నగరంలోని ఒకటో గాంధీ విగ్రహం వద్ద 62 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో స్పృహతప్పి పడిపోయడు. వెంటనే అతన్ని 108లో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఒకటో పట్టణ ఠాణా పోలీసులను సంప్రదించాలన్నారు.

జీపు బోల్తా ; ఆరుగురికి గాయాలు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : జీపు అదుపు తప్పి బోల్తాపడటంతో ఆరుగురు తీవ్రంగా గాయపడిన ఘటన పైడిపాళెం గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... చీనీ తోటల్లో కాయలు కోసేందుకు కొండాపురం మండలం నుంచి కూలీలు జీపులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ

పులివెందుల, న్యూస్‌టుడే : వాహన చోదకుల వద్ద సరైన పత్రాలు ఉండాలని, లేనట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పులివెందుల పట్టణ సీఐ చాంద్‌బాషా హెచ్చరికలు చేశారు. సోమవారం పట్టణంలో ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రజలతో మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి

సుపరిపాలన దిశగా అడుగులు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ సుపరిపాలన దిశగా అడుగులు వేస్తోందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. సోమవారం సింహాద్రిపురం వేణుగోపాలస్వామి కాలనీలో చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత..

పులివెందుల : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ జోగిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. తెదేపా మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, నాయకులు షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు

సీకేదిన్నె పోలీస్ స్టేషన్ వద్ద ఆర్పీపీ నాయకులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న ఆందోళనను పోలీసులు భగ్నం చేయడం ఏమిటని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ప్రశ్నించారు. దళితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కడప ఆర్డీవో కార్యాలయ ముట్టడి చేపట్టిన కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుని సీకేదిన్నె పోలీస్ స్టేషన్‌కు తరలించి.. అనంతరం సొంత పూచీకత్తుపై వదలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత కడప దళితుల భూసమస్య పరిష్కరించాలని కోరుతూ 29 రోజులుగా దీక్షలు చేస్తుంటే అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కార్యాలయాలు ముట్టడి కార్యక్రమం చేపడితే పోలీసులు అరెస్టు చేశారని మండిపడ్డారు. ఉద్యమాలను అణచి వేయాలని అరెస్టులు చేసి ఇబ్బందులకు గురిచేస్తే రానున్న రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో ఉద్యమాలు చేస్తామని హెచ్చరికలు చేశారు.

పిచ్చికుక్క దాడి.. నలుగురికి గాయాలు

సిద్దవటం : సిద్దవటంలోని దిగువపేటలో సోమవారం ఉదయం పిచ్చికుక్క దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. గత మూడు రోజులుగా పిచ్చికుక్క గ్రామంలో తిరుగుతూ గేదెలను, కుక్కలను కరిచిందని స్థానికులు చెప్పారు. సోమవారం దిగువపేటలోని బేల్దారివీధికి చెందిన ఫాతిమా, గాంధీవీధికి చెందిన కోటపాటి నందకిశోర్ అనే చిన్నారులను, గాంధీవీధిలో బత్తన బాలగురవయ్య, పాలెం వసంతను పిచ్చికుక్క కరిచి గాయపరిచింది. చికిత్స కోసం బాధితులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు.

చిన్నారి ముఖంపై కుక్క చేసిన గాయాలు

తొండూరు మండలంలో పది గొర్రెల మృత్యువాత

తొండూరు : మండలంలోని గంగాదేవిపల్లె గ్రామంలో సోమవారం గొర్రెల మందపై అడవి కుక్కలు దాడి చేశాయి. 10 గొర్రెలు మృతి చెందాయి. చెల్లుబోయిన ఓబులేశు రాత్రి తన గొర్రెలను దొడ్డిలో ఉంచి బయటకు వెళ్లారు. దొడ్డి వద్ద ఎవరూ కాపలా లేకపోవడంతో అడవి కుక్కలు గొర్రెల గుంపుపై విరుచుకుపడ్డాయి. పది మృతి చెందాయి. మిగిలిన గొర్రెలు భయంతో కొండ ప్రాంతంలోకి పరుగులు తీశాయి.

బాబోయ్.. ఇసుక వాహనాలు

● జంగాలపల్లె మీదుగా రాకపోకలు
● ప్రమాదాలతో గ్రామస్థుల బెంబేలు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం మండలంలోని జంగాలపల్లె మీదుగా కొనసాగుతున్న ఇసుక రవాణా ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఇసుక తరలింపు వాహనాలు వేగంగా వెళుతుండటంతో స్థానికులు పలుమార్లు ప్రమాదాల బారిన పడ్డారు. రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇసుక తవ్వకాలు, రవాణా విషయంలో గత వైకాపా పాలనలో జరిగిన నష్టాలు ప్రస్తుతం పునరావృతం కావడంపై స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

జంగాలపల్లె మార్గంలో దెబ్బతిన్న రహదారిపై ప్రయాణిస్తున్న ట్రాక్టరు

● **పట్టించుకోని అధికారులు :** గత వైకాపా పాలనలో జంగాలపల్లె గ్రామంలోని పెన్నానదిలో నాలుగేళ్లకు పైగా ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరిపి భారీగా రవాణా చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి యంత్రాలతో భారీగా తవ్వకాలు, అధిక లోడుతో ఇసుక రవాణా చేశారు. అధిక లోడుతో వాహనాలు ప్రయాణించడం కారణంగా ఆర్అండ్‌బీ రహదారి దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నివారణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవడంతో ఇసుక సంపద భారీగా తగ్గిపోయి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదాలు నెలకొన్నాయి. ఈ పరిస్థితి ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా కొనసాగుతోంది. జంగాలపల్లెకు పక్కనే ఉన్న ఒంటిమిట్ట మండలం గొల్లపల్లె పెన్నానదిలో ఇసుక క్వారీకి అనుమతి ఇవ్వగా నిర్వాహకులు ఇష్టానుసారంగా తవ్వకాలు కొనసాగిస్తున్నారు. నిబంధనలను కాలరాస్తూ తమదే రాజ్యం అన్నట్లు అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కొన్నిసార్లు సిద్దవటం మండలం జంగాలపల్లె పెన్నాలోకి చొరబడి యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ ఇసుక సంపదను కొల్లగొడుతున్నారు.

● ఒంటిమిట్ట మండలం గొల్లపల్లె పెన్నాలో ఇసుక క్వారీ నడుస్తుండగా సిద్దవటం మండలంలోని జంగాలపల్లె మీదుగా ఇసుక వాహనాల రాకపోకలు జరపడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. గత వైకాపా పాలనలో జంగాలపల్లె పెన్నాలో ఇసుక తవ్వకాలు జరిపి వాహనాల రాకపోకలు జంగాలపల్లె మీదుగా వెళ్లాయి. ప్రస్తుతం ఒంటిమిట్ట మండలం గొల్లపల్లె పెన్నాలో నిర్వహిస్తున్న క్వారీ నుంచి ఇసుక లోడు వస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లు జంగాలపల్లె మీదుగానే రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఒంటిమిట్ట మండలం గొల్లపల్లె పెన్నాలో ఇసుక క్వారీ ఏర్పాటు చేసినప్పటికీ వాహనాల రాకపోకలు సిద్దవటం మండలం జంగాలపల్లె మీదుగా సాగాలని అధికారులు అనుమతి ఇచ్చారు. జంగాలపల్లె మీదుగా ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. రోడ్డు కూడా దెబ్బతిన్నట్లు ప్రజలు వివరించారు. ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివారణ చర్యలకు కృషి చేస్తాం. **- తిరుమలబాబు, తహసీల్దారు, సిద్దవటం మండలం**

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

కడప బ్రాంచి, కడప, ఫోన్ : 08562-247788

(నోటీస్ అండర్ రూల్ 8(6) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, SARFAESI చట్టం 2002 క్రింద జారీ జేయడమైనది)

స్థిరాస్తి అమ్మకం కొరకు ముందస్తు అమ్మకపు ప్రకటన

టు: 1) శ్రీ పెండ్లిబోయిన నరసింహులు, S/o. (లేటు) నరసయ్య, డోర్ నెం. 4/58, బి.సి. కోలనీ, పాత కడప, కడప, 2) శ్రీ పెండ్లిబోయిన హరిప్రసాద్, S/o. నరసింహులు, డోర్ నెం. 4/58, బి.సి. కోలనీ, పాత కడప, కడప.

సబ్జెక్ట్ : నోటీస్ అండర్ రూల్ 8(6) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, SARFAESI చట్టం 2002 క్రింద జారీ జేయడమైనది

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, కడప బ్రాంచి, కడప నందు లోన్ నెం. MORL/75

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002, రూల్ 3 క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తే 14-12-2020 న రూ. **3,92,164/-** (అక్షరములా మూడు లక్షల తొంభై రెండు వేల ఒక వంద అరవై నాలుగు రూపాయిలు మాత్రమే) తేది 30-11-2020 నాటికి దర్మిలా వడ్డీ మరియు ఇతర ఖర్చులతో చెల్లించవలసినదిగా వారికి నోటీసులు ఇచ్చియున్నారు మరియు సెక్షన్ 13(4) క్రింద సదరు తనఖా స్థిరాస్థిని తేది 22-02-2021 న స్వాధీన నోటీసును జారీ చేయడమైనది.

SARFAESI యాక్ట్ రూల్ 8(6) క్రింద ఈ నోటీసు ద్వారా బ్యాంకుకు చెల్లించవలసిన ఋణ బాకీ మొత్తం రూ. **3,53,434/-** (అక్షరములా మూడు లక్షల యాభై మూడు వేల నాలుగు వందల ముప్పయి నాలుగు రూపాయలు మాత్రమే) తేది 30-06-2025 నాటికి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో కలిపి ఈ నోటీసు ప్రకటించిన 30 రోజులలోగా చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలను కోరడమైనది. ఋణగ్రహీతలు బకాయి చెల్లించుటలో విఫలమైనచో తనఖా పెట్టిన బ్యాంకు వివరించిన దిగవ తెలిపిన ఆస్తిని ఈ నోటీసు అందిన 30 రోజుల తరువాత వేలం ద్వారా అమ్మకం జరుపబడును.

ఋణగ్రహీతలు ఈ నోటీసుకు స్పందించడంలో విఫలమైనచో అమ్మకపు నోటీసు / ఈ-ఆక్షన్/ టెండర్ ద్వారా వేలం, రిజర్వు ధర మొదలగు వివరములు తెలియజేయుచూ ప్రత్యేకంగా ప్రకటన ద్వారా తెలియజేయబడును.

షెడ్యూల్ స్థిరాస్థి వివరములు : కడప మున్సిపల్ కార్పొరేషన్, కడప, సర్వే నెం. 135/2లోని వార్డు నెం. 25, కడప, పాత కడపలోని డోర్ నెం. 25/58గాగల ఆర్.సి.సి. స్లాబ్ గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తులో ఎ.సి.సి. షీట్ రూఫ్‌గాగల ఇల్లు.

హద్దులు : తూర్పు : బి-షెడ్యూల్ ఆస్తి & రోడ్డుకు వెళ్లడానికి ఉమ్మడి నడక దారి, దక్షిణం : కె. వెంకట సుబ్బయ్య గారికి చెందిన ఇల్లు,
పడమర : కాలువ సుబ్బారెడ్డి గారికి చెందిన స్థలం, ఉత్తరం : పి. పద్మావతమ్మ గారు హరి ప్రసాద్ గారికి అమ్మిన స్థలం, మొత్తం విస్తీర్ణం : **96.61** చ॥ గజములు

తేది : 14-07-2025, కడప

అధీకృత అధికారి, కడప బ్రాంచి

(c) eenadu